Sri Aurobindo


Essays on the Gita

శ్రీ అరవిందుల

గీతా వ్యాసములు

అనువాదం : చెలసాని నాగేశ్వరరావు

శ్రీమాతారవింద దివ్యజీవన కేంద్రం
శ్రీఅరవిందపురం



Transform the animal into the Driver of the herds;
let all thyself be Krishna. This is thy goal.
- Sri Aurobindo

పశువును పశుపాలకునిలోనికి రూపాంతర మొందించుము;
సర్వాత్మనా కృష్ణుడ వగుము. ఇదియే నీ గమ్యము.
- శ్రీ అరవిందులు

గీతా వ్యాసములు

అనువాదము :

చెలసాని నాగేశ్వరరావు

శతజయంతి గ్రంథమాల - 3

శ్రీ మాతారవింద దివ్యజీవన కేంద్రం

శ్రీ అరవిందపురం

గీతా వ్యాసములు

అనువాదము : చెలసాని నాగేశ్వరరావు

ప్రథమ ముద్రణ : 1977

ద్వితీయ ముద్రణ : 1986

తృతీయ ముద్రణ : 2014


వెల : రూ. 400-00

ప్రకాశకులు :

శ్రీమాతారవింద దివ్యజీవన కేంద్రం,

శ్రీ అరవిందపురం.

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
గాంధీనగర్, విజయవాడ-3.
ఫోన్ : 0866-2574828



అనువాదము :

చెలసాని నాగేశ్వరరావు

శ్రీ మాత ఆశీస్సు

To

Sri Aurobindo Society Centre
Tenali

For "Essays on the Gita" translated into Telugu.

Blessings from the Mother

Nolini Kanta Gupta

Sri Aurobindo Ashram
Pondichery.

విషయసూచిక

మొదటిభాగము - కర్మ భక్తి జ్ఞాన సమన్వయము

రెండవభాగము - పరమ రహస్యము

నివేదన

మన మూహించని, ఒకవేళ ఊహించినను, అసాధ్యమనుకొనిన కార్యమును భగవంతుడు మనచేత ఒకొకప్పుడు ఎట్లు చేయించుకొనునో, దాని కీ అనువాద మొక నిదర్శనము.

శ్రీ అరవింద వాఙ్మయముతో పరిచయ మేర్పడుచుండిన ప్రథమ దినాలవి. శ్రీఅరవిందుని 'గీతావ్యాసములు' అంగ్లములో కొలదిగా చదివినంతనే, ఇది ఎంత భవ్యము, ఎంత విలక్షణము! అనిపించెను. అపుడు ఆ వ్యాఖ్యను సంపూర్ణముగా చదివి, సోదర సాధకుడు, శ్రీ మధుసూదనరావుగారికి గూడ ఆ గ్రంథరాజమును పరిచయము చేసితిని. వారును దానిని అసకృత్తుగా అధ్యయనము చేసి, ఎంతో ప్రభావితులై ప్రశంసించిరి. అయినను దీనిని అనువదించు ఊహయే మాకు బొడమలేదు. తర్వాత మిత్రులు సూచించినను, అది అసాధ్యమనుకొంటిమి.

కాని శ్రీ మధుసూదనరావు గారును, శ్రీసత్యనారాయణ గారును తమకుతామే దానిని ప్రస్తావించి, ప్రోత్సహించసాగిరి.

అది వట్టి ప్రోత్సాహమేగాదు; శ్రీ మధుసూదనరావుగారును వారి అభిమానులును ముద్రణార్థము ఉదారముగా విరాళాలను ముందే ఇచ్చివేసిరి; మఱియు శ్రీ సత్యనారాయణగారు ముందే దానికి కావలసిన కాగితమును గొనిపెట్టియుంచిరి.

ఇట్టి ప్రేమ నిర్బంధమునకు వశుడనై అనువాదమునకు ఉపక్రమించితిని. ఒకానొక అతర్కితకారణముచేత ఈ అనువాద యోజన నట్టేట మునిగిపోగల ప్రమాద మేర్పడినపుడు, శ్రీ సత్యనారాయణగారు ఎంత ఖిన్నులైరో! అది గట్టెక్కినదని మఱల తెలియజేసినపుడు వారెంత ప్రసన్నులైరో ! "నేను సంతోషములో కరగి, 'అమ్మా! నీ యిచ్ఛ నెరవేరినది!' అని అంతరాంతమున తృటికాలము అమ్మకు చెప్పుకొన్నాను" అని హర్షాతిరేకముతో వ్రాసి, తెలిపిరి.

ఈ పవిత్ర కార్యమున సహకరించిన వారందరికి శ్రీమాతారవిందుల అమోఘాశీస్సులు లభించు గాక!

మన మందరము, శ్రీమాతారవిందుల మహనీయ చరణారవిందములపై శ్రద్ధానురాగములతో నర్పించు ఈ అక్షరపుష్పము, వారి అనుగ్రహవాత్సల్యములకు బాత్రమగుగాక !

అనువాదకర్త

ప్రస్తావన

1. ద్వివిధవ్యాఖ్యానములు

గీత పై వెలసిన వ్యాఖ్యానము లన్నియు స్థూలముగా రెండు వర్గములలోనికి వచ్చివేయును – ఒకటి, సాంప్రదాయికము మఱియు కర్మసన్యాసపరము, రెండవది, ఆధునికము మఱియు కర్మనిష్ఠాపరము. వీనితో శ్రీ అరవిందుని వ్యాఖ్యానమగు 'శ్రీ గీతావ్యాసములను' బోల్చి చూచినపుడు, ఈ వ్యాఖ్యానముయొక్క అపూర్వ వైశిష్ట్యముతో మన కించుక పరిచయ మేర్పడగలదు. ఇట్టి పరిచయమే ఈ ప్రస్తావనాశయము.

2. సాంప్రదాయిక వ్యాఖ్యానములు

సాంప్రదాయి కాద్వైతమునందు అక్షరాత్మయే చరమతత్త్వము. ఇది నిష్క్రియము; ఇదియే జీవుని నిజస్వరూపము. కాని అజ్ఞానవశమున జీవుడు అహంకారముతో తాదాత్మ్యము జెంది, గుణములు చేయుకర్మలను తనపై నాపాదించుకొని, నేను చేయుచున్నా నని భ్రమించును (3–27); అట్లు కర్మబద్ధుడై నానా క్లేశము లనుభవించును. కావున అతనికి తరణోపాయము అధికాధిక కర్మసన్యాసము. కర్మసన్యాసముద్వారా అతడు తన నిష్క్రియస్వరూపమగు అక్షరాత్మను జేరుకొని నిష్క్రియశాంతి ననుభవించును. ఇదియే జీవుని ధ్యేయము, అనగా జన్మించుట జన్మ నుండి తప్పించుకొనుటకే!

ఇక నిష్క్రియశాంతియే జీవుని ధ్యేయ మను దానిని పోషించుకొనుటకు, "బ్రహ్మనిర్వాణమును బొందును" (2–72)* -- ఇత్యాది గీతావచనముల నుదాహరింతురు.

మఱియు సాంప్రదాయి కాద్వైతుల పరమతత్త్వము నిష్క్రియము, నిరపేక్షము నగు అక్షరాత్మ గావున, అది ప్రపంచమును సృజించదు, సృజింపజాలదు. పోగా గుణముల మాయయే ప్రపంచమును గల్పించును. అందుచేత నది మిథ్యా

*ఈ విధముగా కుండలీకరణమునందు రెండు సంఖ్యలుండిన, మొదటిది గీతయొక్క అధ్యాయమును, రెండవది తదధ్యాయములోని శ్లోకమును దెలుపును.

భూతము, మిథ్యాభూతము గావుననే ప్రపంచమునకు గాని, ప్రపంచ జీవనమునకు గాని ఎట్టి అర్థమును లేదు, ఎట్టి ప్రయోజనము లేదు.

శ్రీ అరవిందుడు దీనికేమి సమాధానమిచ్చును? ఈ నిర్వాణమే పరమానుభవము గాదు; ఈ నిర్వాణముయొక్క అచలశాంతిని ప్రపంచము యొక్క ప్రచలవ్యాపారమునకు ఆధారము చేసికొను సర్వోన్నత అనుభవము మఱియొకటి గలదు - అని తమ అనుభవబలముతో ప్రత్యుత్తర మొసంగును. ఇచ్చట శ్రీఅరవిందుని సాక్షాత్కారము యొక్క దివ్యాధిక్యము మనకు గన్పించును.

3. సన్యాసవాదమునకు సమాధానము

పోగా, గీతాముఖముగా కర్మసన్యాసవాదమునకు శ్రీ అరవిందుడు చెప్పు ప్రత్యుత్తర మిది; అక్షరాత్మయే పరమతత్త్వ మగుచో మీరు (సన్యాసవాదులు) చేసిన నిర్ణయము నిజమే యగును. కాని గీత అక్షరాత్మకు గూడ పైన పురుషోత్తముని ప్రతిపాదించును. ఎవడు క్షరాక్షరములు రెండిటిని తనయందు ధరించి యుండునో, ఎవనికి క్షరాక్షరములు రెండును రెండు పార్శ్వములో, ఎవడు పరస్పరపూరకములగు నీ క్షరాక్షరములద్వారా తననుండియే ప్రపంచమును, ప్రపంచమునందు తనను అభివ్యక్తము చేసికొనునో, అతడు పురుషోత్తముడు, అతడే సర్వోత్తమతత్త్వము (15-17,18).

తన క్షర ప్రకృతిరూపమున ఇతడు సక్రియుడు గూడను. నిజాని కితని నుండియే క్రియ యంతయు వెలువడును, ఇతడే క్రియను సంకల్పించి ప్రారంభించును; గుణమయప్రకృతి ఇతని సంకల్పమునకు కార్యరూప మిచ్చు కార్యనిర్వాహక శక్తి మాత్రమే. కావున నితనిని జేరుకొనుటకు కర్మసన్యాసము అవశ్యకము గాదు సరిగదా, కర్మయోగము, భక్తిజ్ఞానపరిపుష్ట కర్మయోగము అత్యంతావశ్యకము గూడ నగును.

ఈ పురుషోత్తముడు వాస్తవమగు తననుండియే ప్రపంచమును సృజించెను గావున (7-6), ప్రపంచమును వాస్తవమే, ఇచ్చట మన జీవనమును వాస్తవమే, మఱియు భగవంతుడు తన అభివ్యక్తికొఱకు ప్రపంచమును సృజించెను గావున, అభివ్యక్తి సాధనమగు కర్మకు ఒక అర్థము గలదు, అభివ్యక్తము గావించిన మేరకు దాని కొక ప్రయోజనము గలదు.

ఏది ఎచ్చట పుట్టునో. అది తిరిగి అచ్చటికే చేరుకొనును. గీత ప్రపంచమును ఒక చక్రముగా (3-16) వర్ణించుటలోని ఆంతర్య మిదియే. మఱియు కర్మ భగవంతుని నుండి ప్రభవించి, తిరిగి భగవంతునిలోనికే చేరుచున్నది గాన, నదీ ప్రవాహము నాశ్రయించి, సముద్రమును చేరుకొను నట్లు, కర్మ నాశ్రయించి భగవంతుని చేరుకొన గలము. యజ్ఞకర్మలో నిది తెల్లమగును. అందుచేత భగవంతునియందు పునర్జన్మకు కర్మ అంతరాయము కాకపోగా, సాధనము గూడ నగును. దీనినే "అవిద్యయా మృత్యుం తీర్త్వా" - అవిద్యచేత మృత్యువును తరించి - అని ఈశావాశ్యోపనిషత్తు గూడ నిగూఢముగా దెల్పును. మఱియు -

"కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయః" (3-20). అని గీత నిగూఢముగా గాక, స్పష్టముగానే ఉద్ఘాటించును.

4. జాతిపతనము

సన్యాసప్రవృత్తిని వితథము చేయుటకే గీత అవతరించినను, బౌద్ధమతముతో నారంభించిన దాని ఉద్రేకము నిన్న మొన్నటివఱకు రెండువేల సంవత్సరాలు భారతదేశములో రాజ్యమేలినదని శ్రీ అరవిందుడు పేర్కొనును. అయితే గీత క్రమముగా తన ముద్రను బౌద్ధమతము పైనను, మాయావాదముపైనను వేయుచునే వచ్చినది. కాని ఒకప్పుడు వ్యక్తులు మాత్రము గాక, జాతికిజాతియే ప్రపంచ నిరసనరూపమగు సన్యాసము వైపునకు మొగ్గగా, దేశమును, జాతియు నెటుల అథోగతిపాలైనవో, అపమానమున నెటుల మట్టిగఱచినవో మనకు దెలిసిన విషాద గాథయే. దీనికి విఱుగుడుగా వెలసినవే కర్మప్రబోధకములగు, రెండవ వర్గమునకు జెందిన ఆధునికవ్యాఖ్యానములు.

5. ఆధునిక వ్యాఖ్యానములు

ఈ వర్గమునకు మూలపురుషుడు బంకిమచంద్రమహాశయుడు. వీరు గీతా సాగరములో గనుగొనినది కర్మసిద్ధాంతము (Gospel of Works). అంతవఱకు బాగుగనే యున్నది. ఏలన గీత అగుటకు కర్మసిద్ధాంతమే. కాని వీరు గీతనుండి మానవకర్మను వెలికి దీయగా, గీత తన పరమతాత్పర్యముగా మనకు దివ్యకర్మను బోధించు నని శ్రీ అరవిందుని ప్రతిభ వివేచించి చూపును. ఎట్లు?

"కర్మణ్యే వాధికార స్తే మా ఫలేషు కదాచన" (2–47) - కర్మయందే నీ కధికారము గలదు గాని, ఫలమునం దెట్టి అధికారమును లేదు - దీనినే ఆధునికులు గీతామహావాక్యముగా నుదాహరింతురు. మంచిది, కర్మ చేయవలెను. సరే, ఎట్లు చేయవలెను? ఫలము నాశించక, నిస్స్వార్థముగా, బాగు, అయితే ఏ కర్మ చేయవలెను? "కార్యం కర్మ", అనగా కర్తవ్యకర్మ (3–19). ఈ కర్తవ్యకర్మను వీరు విధి యని అనువదింతురు. ఒక్క మాటలో, ప్రతివాడును సమాజము విధించిన కర్మను నిస్స్వార్థముగా జేయవలెను. ఈ విధి నిర్వహణమే గీతాసందేశము; ఇదిగో ఇదియే వీరి వాదము !

6. భగవంతునికి స్వస్తి !

స్పష్టముగానే ఇది గీతాసందేశము గాదని శ్రీ అరవిందుడు వక్కాణించును, భగవంతుడు, భగవత్ స్థితియు గీతకు ప్రాణము కాగా, వీరి వాదములో ఆ భావనయే లేదు. భగవంతునికి స్వస్తిచెప్పి, ఆధునికమనస్సు చేయు వ్యాఖ్యానము లివి !

మఱియు "కర్మణ్యే వాధికార స్తే" అని రెండవ అధ్యాయములో చెప్పిన గీతయే-

"అహంకారవిమూఢాత్మా కర్తాహ మితి మన్యతే" (3–27). అహంకారము చేత భ్రమకు లోనైన అంతరాత్మ నేను కర్త నని తలంచును - అని మూడవ అధ్యాయమున మఱియొక మెట్టు పై కెక్కి తెలుపును. అనగా అజ్ఞానమునందే నీకు కర్మాధికారము గలదు గాని, జ్ఞానమునందు ఫలాధికారముతో బాటు, నీకు కర్మాధికారమును అదృశ్యమగును–అని చెప్పినట్ల యినది. అనుభవమును బట్టి చూచిన, అంతరాత్మ తన సత్తాకేంద్రమును అహంకారమునుండి అక్షరాత్మలోనికి ఉద్ధరించుకొని నప్పుడు, నేను చేయుటలేదు, నా ప్రకృతిద్వారా కర్మ జరుగుచున్నది- అని తెలిసికొనును; అనగా తన కర్మను తన ప్రకృతియందు సన్యసించి, తాను అక్షరాత్మయొక్క నిర్గుణస్థితియగు నైష్కర్మ్యము ననుభవించును. ఇచ్చటను కర్మ సాగుచునే యుండును. ఇది కర్మాకర్మల సమన్వయము (4–18), ఇదియే గీతానైష్కర్మ్యము గాని. బాహ్యనైష్కర్మ్యము గాదు.

7. విముక్తకర్మ – దివ్యకర్మ

కాని ఇంకను కర్మ దివ్యము గాలేదు; సాధకుడు కర్మవిముక్తు డయ్యెనే గాని, కర్మప్రభువు గాలేదు. ఇపుడు కర్మ దివ్యము కాగల గీతాసోపానమును జూతము –

"మయి సర్వాణి కర్మాణి సన్యస్య" (3–30) – నాయందు సర్వకర్మలను సన్యసించి – అని గీత మనలను మఱియొక మెట్టెక్కించును. అనగా నిపుడు అంతరాత్మ తన కర్మలను తన ప్రకృతియందు గాక, తనకు మూలమగు, ప్రేరకమగు భగవంతునియందే సన్యసించును, మఱియు తన సత్తాకేంద్రమును అక్షరాత్మ నుండి ఉద్ధరించి, భగవంతుని యందు, అనగా పురుషోత్తముని యందు ప్రతిష్ఠించును. దీనిని శ్రీ అరవిందు డిట్లు హృద్గతము గావించును -- "సాధకుని స్వీయకర్మ ఇపుడంతరించినది; అంతయు బ్రహ్మములోనికి స్వీకరించబడి, భగవంతునిచే తనదిగా ధరించబడినది. ఈ స్థితిలో కర్మ (బాహ్యావిధిని బట్టి కాక) సహజముగా లోపలి నుండి ఉద్గమించును. దాని వెనకనున్న శక్తి, సాధకుని స్వీయేచ్ఛకంటెను మిక్కిలి భిన్నము, అతీవ ప్రబలము. ఆశక్తియే అతనికి తన కర్మ జేసి పెట్టుచు, దాని ఫలితములను గొనితెచ్చును" (1–23.14).

ఇదియే దివ్యకర్మ; ఇది అహంకారదూషితమగు మానవకర్మ గాదు, సాధకుడు అక్షరాత్మస్థితియందు కర్మవిముక్తుడు కాగా, సాధకుని ప్రకృతియే నిర్ణయించి చేయు కేవలజ్ఞాని–కర్మయు గాదు; ఇది భగవత్సంకల్పము ననుసరించి, భగవంతుని చిచ్ఛక్తి సాధకుని ప్రకృతిద్వారా చేయు దివ్యకర్మ. ఇట్లు మానవకర్మను తన అత్యున్నత మూలమగు దివ్యకర్మలోని కుద్ధరించువఱకు గీతయు, శ్రీ అరవిందుడును విరమించరు, విశ్రమించరు.

ఈ భూమికయందు నివసించు సాధకుడు గుణాతీతుడు మాత్రమే గాక, ఈశ్వరునివలెనే గుణనియామకుడును అగును.

8. ఒక అద్భుత లక్షణము

ఈ దివ్యకర్మయందు మానవుడు, నేను చేయుచునే చేయుట లేదను అద్భుతానుభవమును బొందును. ఇది దివ్యకర్మయొక్క ఒక అద్భుతలక్షణము.

పురుషోత్తముడు నిష్క్రియ సక్రియతత్త్వములను ఏకకాలమున తనయందు ధరించి యుండును గాన, అతడు చేయుచునే చేయనివాడగును "కర్తారం అకర్తారం" (4-13). దీనినే గీతయొక్క "ఉత్తమరహస్య" (4-3) మని శ్రీ అరవిందుడు ఉదాహరించును. అస్తు.

9. గుఱిదప్పుటకు కారణము

కాని సాంప్రదాయికవ్యాఖ్యానములు గాని, ఆధునికవ్యాఖ్యానములు గాని గుఱిదప్పి, గీతామర్మమును గ్రహించలేకపోవుటకు గారణము? గీత అధికారి భేదమును బట్టి తన ఉపదేశమును చేయును. కావున గీతోపదేశము ఉత్తరోత్తరము వికాస శీలమగు ప్రతిపాదనగా నుండును. అందుచేత సత్య మే దైనను, దానిని కనుగొని తీరవలె నను దృష్టితో ఆమూలాగ్రము గీతను అనుభవదృష్టితో అధ్యయనము చేసి ననే తప్ప, దాని ఉత్తమరహస్యము మనకు దర్శన మీయదు, ఇట్లు గాక, మనము పూర్వమే ఒకానొక సత్యము నభిమానించి, దానిని సమర్థించు వాక్యమునే గీతనుండి గ్రహించి, తక్కిన దాని నంతను విడిచివేయుచో, గీతాహృదయము మన కెట్లు తెల్లమగును ?

10. పరివర్తనము ఉత్తమోత్తమ రహస్యము

గీతయొక్క ఉత్తమరహస్యము పురుషోత్తముడు లేక పరప్రకృతి యగుచో, దీనిని మించిన, శ్రీ అరవిందుని గీతావ్యాఖ్యానముయొక్క ఉత్తమోత్తమరహస్యము నిమ్నప్రకృతి వరివర్తనము. దీని వివరము నించుక చూతము.

11. కర్మయోగము యొక్క ద్వివిధ రూపములు

కర్మద్వారా భగవంతునితో యోగము నందుదుము; ఇది కర్మయోగము యొక్క పూర్వరూపము. దీనివలన మానవాత్మ తిరిగి భగవంతునిలో జన్మించి, దివ్యమగును. కాని మానవు డింకను పూర్తిగా దివ్యము కాదు.

పోగా భగవంతునితో అంతరాత్మయోగము సిద్ధించిన పిమ్మట, ఆ యోగము నుండి వెలువడు కర్మ కర్మయోగముయొక్క ఉత్తరరూపము, అనగా శ్రేష్ఠతర రూపము. ఈ కర్మమూలమున, ఈ కర్మను చేయు భగవచ్ఛక్తి మానవుని నిమ్న ప్రకృతిపై పనిచేసి, దానిని దివ్యప్రకృతిలోనికి రూపాంతరము జెందించును, అనగా చివరకు అతని మనస్సును, బాహ్యచేతనయు గూడ భగవంతుని వగును-

"మన్మనా భవ" (18-65). మచ్చిత్తో భవ" (18-57).

ఇదిగో, ఇట్టి ప్రకృతిపరివర్తనతో మానవుడు పూర్తిగా, సర్వాత్మనా దివ్య మానవు డగును. అందుచేత భగవంతునియందు అంతరాత్మయొక్క పునర్జన్మ శ్రీ అరవిందుడు చెప్పునట్లు ఉత్తమరహస్యము కాగా (1-22-11)*, ఏతత్పూర్వకమగు ప్రకృతిపరివర్తనము ఉత్తమోత్తమరహస్య మని మనము శ్రీఅరవిందుని ప్రతిభాపరముగా చెప్పుకొనవచ్చును.

గీతలో అంతరాత్మయొక్క పునర్జన్మ చెప్పబడిన మాట నిజమే (4-10), కాని ఈ పునర్జన్మనుండి ఉద్గతమగు కర్మచేత ప్రకృతిపరివర్తనమును గీత ఉద్దేశించినట్లు మనకు స్పష్టమగు సూచనలు గన్పించవు. "మన్మనా భవ". "మచ్చిత్తోభవ" - వీనికి గూడ శ్రీ అరవిందుడు తన వ్యాఖ్యానమున వెలికిదీసిన అర్థము గీతాభిప్రాయమైనట్లు మన కనిపించదు, కనీసము ఎవరును అట్టి అర్థమును పసిపట్ట లేదు.

దీనిని బట్టి చూడ, మహామనీషి, శ్రీ అరవిందుడు తన దివ్యజీవన పరిణామమునకు గీతోపదేశమును ఎటుల సోపానసరణి గావించుకొనెనో, మనకు విస్మయ పూర్వకముగా తెల్లమగును.

12. గ్రంథకర్త చేతన గ్రంథమును బొదిగియుండును

మంచిది, కాని మనకు బొడకట్టని గర్భితార్థము శ్రీ అరవిందున కెట్లు గోచరించెను? వారు తమ ఈశావాస్యోపనిషత్తునకు వ్రాసిన వ్యాఖ్యానముయొక్క పీఠికలో, - ప్రతి మహాగ్రంథమును ఆ గ్రంథకర్తయొక్క చేతన ఆవరించియుండి, గ్రంథము ద్వారా వెలుగును జూడ వేచియుండును. ఆ చేతనలో మనము ప్రవేశించగలిగినచో, ఆ చేతన తన గ్రంథమునందుద్దేశించిన గర్భితచ్ఛాయలు గూడ మనకు బొడకట్టును - అని శ్రీ అరవిందుడు అర్థతః వ్రాసియున్నారు. అక్కడితో నాగక, అట్లు పొడకట్టిన దానినే నేను రచింతును, అదియే నా

*కుండలీకరణమునందు మూడు సంఖ్య లుండిన, మొదటిది శ్రీ అరవిందుని వ్యాఖ్యానముయొక్క వ్యాసపరంపరను, రెండవది ఆ పరంపరలోని వ్యాసమును, మూడవది ఆ వ్యాసమునందలి పరిచ్ఛేదమును, అనగా పేరాను దెలుపును.

2

రచనాపద్ధతియని వెల్లడించినారు ! ఇట్లు గీతావిషయమున, వేదవ్యాసుని గీతారచనకు వెనుకనున్న చేతనలోనికి దిగి, గీతయందు నిక్షిప్తముచేయబడిన అనర్ఘ, అదృశ్య రత్నములను వెలికి తీసికొనిరాగలిగిన వా రెవరున్నారు, ఎందరున్నారు ?

ఈ వ్యాఖ్యానపద్ధతిని శ్రీ అరవిందుడు తమ ప్రథమ గీతావ్యాసమునందు గూడ నిర్దేశించియున్నారు (1-1-3). ఇది ఎంత అపూర్వముగా గన్పించినను, వ్యాఖ్యాతకారునిగా శ్రీ అరవిందుని అధికారము దీనితో సైతము ఆగిపోదు, దీనికి మాత్రమే పరిమితము గాదు. గీతాకారుడగు వేదవ్యాసుని చేతనలో ప్రవేశించి, గీతారహస్యమును గ్రహించుట యటుండనిండు; అసలు గీతోపదేష్టయగు శ్రీకృష్ణుడే గీతను తిరిగి ఎవనికైనను, ఏ మహితాత్మునికైనను ఉపదేశించిన, నది ఎట్లుండును? గీతను వ్యాఖ్యానించుటయందు అట్టి మహితాత్మునికి గల అధికారము అద్వితీయము గాదా? అతని వ్యాఖ్యానమే అత్యంత ప్రామాణికము గాదా? తప్పక యగును. మఱియు నట్టి భగవదనుగ్రహమునకు పాత్రుడు కాగలిగినవాడు మన శ్రీ అరవిందుడే యని తెలిసికొనుటకు తప్పక ఆశ్చర్యచకితుల మగుదుము! ఇది నమ్మశక్యము గానంత అద్భుతముగా నున్నను, నమ్మక తప్పనంత వాస్తవ సత్యము. ఏలన-

13. "గీతను నా హస్తములం దుంచెను"

ఆలీపూరు జైలులో శ్రీ అరవిందుని దినదినము ముంచెత్తిన అపురూపమగు ఆధ్యాత్మికానుభవములలో ప్రథమానుభవమునుగుఱించి వారి మాటలలోనే విందము - దేనిని నీవు (శ్రీఅరవిందుడు) స్వయముగా నేర్చుకొనజాలకపోతివో, దానిని నేర్పుటకును, నా కార్యమునందు నీకు శిక్షణ నిచ్చుటకు నిట్లు చేసితిని (జైలులోనికి గొనివచ్చితిని)" - అని శ్రీకృష్ణుడు బలికెను ; ఇది శ్రీ అరవిందుని ప్రథమానుభవము. తదుపరి వృత్తాంతమును వినుడు-

"అతడు (శ్రీకృష్ణుడు) పిమ్మట గీతను నా హస్తములం దుంచెను; అతని బలము నాలో బ్రవేశించెను. గీతాసాధనను జేయ నది నాకు సామర్థ్య మిచ్చెను.... దీనిని సాధించి, హిందూమతముయొక్క అర్థమును నేను సాక్షాత్కరించుకొంటిని....

అతడు పిమ్మట నాకు జూపినది హిందూమతకేంద్రసత్యమును (వాసు దేవః సర్వమిద" మను సత్యమును); (సామర్థ్యము నిచ్చి, అంతర్దృష్టి నిచ్చి) తదుపలబ్ధిని నాకు ప్రసాదించెను" అని శ్రీ అరవిందుడు స్వయముగా వచించెను.

ఇట్లు గీతోపదేష్ట, దివ్యగురువు నగు శ్రీకృష్ణుడే గీతను శ్రీ అరవిందుని కరకమలములం దుంచెను. అనగా గీతార్థమును దాని గభీరహృదయమును శ్రీ అరవిందునికి కరతలామలకము గావించెను. అందుచేతనే గీతయందు అస్పష్టముగనో, బీజప్రాయముగనో నిక్షిప్తమై యున్న దివ్యజీవన అర్థచ్ఛాయలు సైతము ఆయనకు గోచరించెను. ఇట్టి అర్థస్ఫూర్తిని పురస్కరించుకొనియే, "మన్మనాభవ", "మచ్చిత్తో భవ" – ఇత్యాది గీతావచనములకు శ్రీ అరవిందుడు ప్రకృతిపరివర్తనాత్మకమగు నర్థము నిచ్చి, వానిని దివ్యజీవనపరముగా వ్యాఖ్యానించెను.

అయినను సాక్షాత్తుగా శ్రీకృష్ణుడే గీతాహృదయమును విప్పి చూప, ఆ గభీరతమ దర్శనమునుండియే శ్రీ అరవిందుడు తన గీతావ్యాఖ్యానమును జేసెను– అని చెప్పి నపుడు, అది వ్యాఖ్యానకర్తగా ఆయన అపూర్వతను దెలుపు చున్నప్పటికి, అది సైతము తదపూర్వతయొక్క చరమ సోపానమును మనకు జూపదు. ఏలన–

14. "కలమును మాత్రము పట్టుకొంటిని"

అస లీ వ్యాఖ్యానమును శ్రీ అరవిందుడు చేసెనో, శ్రీకృష్ణుడే వ్రాసెనో! – చెప్పుటకష్టము. కారణము, "నేను రచించిన దంతయు పై నుండి వచ్చెను, నా చేయి కలమును మాత్రము పట్టుకొనెను" – అని శ్రీ అరవిందుడే ఒక తూరి తన రచనాపద్ధతిలోని ఆర్ష రహస్యమును వెల్లడించెను.

ఈ విధముగా, 1. గీత నావరించి యుండు గీతాకారు డగు శ్రీ వేదవ్యాసుని చేతనలోనికి దిగియు, 2. గీతోపదేష్ట యగు శ్రీకృష్ణుడే గీతాహృదయమును దెఱచి చూప, ఆ పరమానుభవమునుండియు, 3. చివరకు పై నుండి ప్రవహించిన అలౌకిక వాణికి తా నొక కలముగా వ్యవహరించియు, శ్రీ అరవిందుడు, మన పరిభాషలో, గీతావ్యాసములను రచించెను – అని మనము చెప్పుకొనవచ్చును. ముఖ్యముగా ఇందలి మూడవ లక్షణమే ఆయన యొక మహర్షి యనియు, కావుననే ఆయన కృతి ఒక మంత్రసదృశ మనియు మనకు చాటును.

15. గీతావ్యాసముల మంత్రశక్తి

అందుచేతనే శ్రీ అరవిందుని గీతావ్యాసములు అడుగడుగున ఒకానొక మంత్రశక్తితో స్ఫురించుచుండును, మన మీ సత్యమును, ఆ వ్యాసములను చదువుచున్నపుడు, కొంతలో కొంత స్వయముగానే చవిచూడగలము. ఇట్టి మంత్రశక్తి యుండుట చేతనే, గీతావ్యాసములను చదువవలసిన రీతిగా జదివినచో, ఆ చదువు చదువుమాత్రమే గాక, సాధనయు నగును, అనగా తదర్థము మనకు తాత్కాలికముగా అనుభవములో స్ఫురించును. తర్వాత దానిని మనము స్థిరపఱచు కొందు మేని, ఆ అనుభవమే సాక్షాత్కార మగును.

16. "చదువవలసిన రీతిగా...."

పైన శ్రీ అరవిందుని రచనాపద్ధతిని ఇంచుక వివరముతో వర్ణించుకొని యున్నాము. అయితే శ్రీ అరవిందుని అపూర్వతను చాటుటకే మన మట్లు చేసి యుండ లేదు; వారి గీతావ్యాసములను మన మెట్లు చదువవలెనో, ముఖ్యముగా దానిని దెలుపుటకు మన మట్లు చేసితిమి. ఆ వివరణము మన కేమి దెలుపును?

1. శ్రీ అరవిందుడు ఉపయోగించిన పదములకు వెనుకనుండు చేతన లోనికి యథాశక్తి ప్రవేశించి, అవి సూచించు నూతన విశాలార్థమును గ్రహించుటకు ప్రయత్నింతుము గాక ! 2. "వేదవిదేవ చాహం" (15-15) – వేదములను తెలిసికొనువాడను సైతము నేనే – అని ఉద్ఘాటించిన శ్రీకృష్ణపరమాత్మకు, మనము చదివిన దానిని దెలిసికొనుటకు అవకాశ మిత్తుము గాక! – అనగా లోని కృష్ణునికి మన హృదయమును దెఱచి యుంచి, మన జ్ఞానస్థానమున ఆయన విజ్ఞానమునే మన విజ్ఞానము జేసికొందుము గాక !

మనకు సాధ్యమైనంతలో మన మట్లు చేతు మేని, అపుడు గీతావ్యాసముల హృదయమును మనమును గొంత చవిచూచినవార మగుదుము. అట్లొక సారి చవిచూచిన, ఆ లబ్ధితో బోల్చి నవుడు, అందు నిమిత్తము మనము చేసిన శ్రమ యంతయు చాల స్వల్పముగా గన్పించును !

అందుచేత శ్రీ అరవిందుడు సూచించిన (పైనదెల్పిన) రీతిగా గీతావ్యాసములను అధ్యయనము గావించి, దాని అద్వితీయార్థమును ఆకళించుకొని, చరితార్థులమై సంతసింతుము గాక! ఇవ్విషయమును, శ్రీకృష్ణుడు, శ్రీ వేదవ్యాసుడు, శ్రీ అరవిందుడు – ఈ మహామహులు ముువ్వురును మనలను అన్ని విధముల ననుగ్రహింతురు గాక!

17. "బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే"

ప్రతి అధ్యాయాంతమున గీతామకుటమునందు గన్పించు ఈ వర్ణనమే గీతా స్వరూపమును మనకు వెల్లడించును. దీనిని బట్టి, గీత బ్రహ్మవిద్య మఱియు యోగశాస్త్రము, అనగా బ్రహ్మవిద్య నది జీవనమున కన్వయించి, జీవన సమస్యను పరిష్కరించ సమకట్టిన యోగశాస్త్రము - విద్య దర్శించిన దానిని యోగ మనుష్ఠించును. గీతయొక్క పుట్టుకయు మన కా విషయమునే సూచించును: విషాదగ్రస్తుడైన అర్జునుని కర్తవ్యోన్ముఖుని జేయుటకే గీత వెలసెను గదా.

కాని అది ప్రధానముగా యోగశాస్త్రమే యైనను, యోగాభ్యాస విషయమున బుద్ధికి బొడము శంకలను బాపుటకు గీత దార్శనిక విషయములను గూడ ఎడనెడ విచారించును.

18. ద్విప్రకృతులు, త్రిపురుషులు

ఉదాహరణకు, ఇట్టి విచారణయందు వెలువడినవే గీతకు మకుటాయ మానములైన, ద్విప్రకృతులు మఱియు త్రిపురుషులకు సంబంధించిన సిద్ధాంతములు, ఇవియే గీతయొక్క ఉత్తమ రహస్యము, పరమగుహ్యము (15-20).[1] కనుక వీనిని గుఱించి ముందుదిఙ్మాత్రముగా దెలిసికొందము. వీని తత్త్వము బోధపడినచో, గీతయందలి తక్కినదంతయు తన నిజరూపమున మనకు దెల్లమగును. ఈ ఉత్తమ రహస్యము ఉపనిషత్తులయందు సైతము వికీర్ణమై, గర్భితముగా నున్నను, వానిని గుదిగూర్చి నిర్దిష్టముగా ప్రతిపాదించిన ఘనత గీతామాతకే దక్కును, మఱియు నా ప్రతిపాదనను కరతలామలకము గావించిన అపూర్వ ప్రతిభ శ్రీ అరవిందునికే చెల్లును. తక్కిన వ్యాఖ్యానములన్నియు ఈ ద్విప్రకృతులను, త్రిపురుషులను ఇంచుమించు దాటవేయగా, శ్రీ అరవిందుడు వీనిని తన యావత్ప్రతిభతో వివరించి, జీవనప్రహేళికను పరిష్కరించి, తన దివ్యజీవన-లక్ష్యమునకు వానిని సోపానములు గావించుకొనును.

---

[1] ఈ కుండలీకరణమునందలి మొదటి సంఖ్య గీతయొక్క అధ్యాయమును, రెండవది అధ్యాయము నందలి శ్లోకమును దెలుపుము.

19. జీవన ప్రహేళిక

అయితే జీవన ప్రహేళిక స్వరూపము? మనము జీవించుటకు కర్మ చేయక తప్పదు (3–8), మఱియు మనలో కర్మ నెరపునది ప్రకృతియే గాని, ఆత్మ గాదు (13–30). ఇక నీ ప్రకృతి తన త్రిగుణములచేత జీవుని భ్రమింపజేయుచు (7–13), ఏకాత్మ నెఱుంగ నీయక, భేదభూమికలోనే అతనిని బంధించి యుంచును ప్రకృతి వలయములో నున్నంత కాలము జీవున కీ భ్రమబంధనములు దప్పవు. పోతే ప్రకృతిని విడిచి, జీవుడు ప్రకృతికి పరమునందుండు ఆత్మలో నెలకొను నేని, అక్కడనతనికి భ్రమబంధనము లుండవు గాని, అచట నతడు నిష్క్రియతలో మునిగిపోవును. ఏలన ప్రకృతి కావల క్రియ గాని, క్రియా సంకల్పము గాని యుండజాలదు.

ఇట్లు ప్రకృతిలో నున్నపుడు ముక్తి యుండదు, ఆత్మలో నున్నపుడు కర్మ యుండదు. కావున విముక్త కర్మ అసంభవము, అందుచేతనే జీవన సమస్యకు పరిష్కారము లేదు : ఇదియే జీవన ప్రహేళిక.

కావుననే మాయావాదము జీవన సన్యాసమును ప్రబోధించగా, బౌద్ధమతము మఱియొక అడుగు ముందునకు వేసి, జీవన నిర్వాణమునే వక్కాణించును. మాయావాదమున నిష్క్రియాత్మస్థితి రూపమగు ఆంతరజీవనముండును గాని, బౌద్ధమున అదియు నిర్వాణము నందును (ఆఱిపోవును).

ప్రకృతితో నారంభించిన ఈ ప్రహేళికను – ఈ ముడిని – విడదీయుటకు గీత ముందు ప్రకృతిని వివేచించును.

20. అపర ప్రకృతి

మన కిపుడు పరిచితమైన ఏ యీ ప్రకృతి గలదో, అది అష్టవిధము : పంచభూతములు, మనస్సు, బుద్ధి మఱియు అహంకారము ననునవి దీని అవయవములు (7–4). పైగా నీ ప్రకృతి త్రిగుణాత్మకము, కావున దీని ప్రతి అవయవము త్రిగుణమయము. సాంఖ్యశాస్త్ర మీ ప్రకృతి దగ్గఱనే ఆగిపోవును. మఱియు నిది జడము, పురుషుడు చేతనుడు గావున, ప్రకృతిపురుష లిరువురు రెండు విభిన్న ప్రాథమిక వస్తువు లని సాంఖ్యమునకు చెప్పక తప్పలేదు.

ఇచ్చటనే ఆగిపోయినచో, గీతయు ఆత్మకును, విశ్వప్రకృతిని మధ్య ఒక పూడ్చరాని అఖాతమునే ప్రతిపాదించి యుండును. ఏలన అపుడు విశ్వప్రకృతి

గుణముల మాయాశక్తి మాత్రమే యగును (7–14), మఱియు విశ్వము గుణముల మాయాజాలమే యగును, కావున సత్యాత్మకును, మిథ్యాజగత్తునకును ఎట్టి సక్రియ సంబంధము నుండదు (2–1–5).[1] కాని గీత ఈ అష్టవిధ బాహ్య ప్రకృతితో నాగిపోదు; గీతయొక్క సమ్యగ్దర్శనమున ఇది అపర ప్రకృతి (7–5) మాత్రమే.

21. పర ప్రకృతి

గీతకు ఈ అపర ప్రకృతికంటె భిన్నమగు మఱియొక శ్రేష్ఠ వస్తువు గలదు, మఱియొక ఉచ్చతర తత్త్వము గలదు, అది ఆధ్యాత్మిక ప్రకృతి; దానినే గీత పరప్రకృతి యని పిలుచును (7–5). ఇది పరమ పురుషుని, భగవంతుని ప్రకృతి – "మే ప్రకృతిం" (7–5). ఇదియే సర్వభూతములకు ఆద్య మూలము (7–6).

అపర ప్రకృతి జీవునియొక్క బాహ్యరూపము కాగా, పరప్రకృతి అతని స్వరూపమే యగును – "పరా ప్రకృతిర్ జీవభూతా" (7–5). అజ్ఞమగు అపర ప్రకృతి సర్వజ్ఞమగు ఈ పరప్రకృతియొక్క ఒక సంతానమే (derivation), ఒక క్రీనీడయే (2–1–5) – అని శ్రీ అరవిందుడు ఉభయమునకు గల తారతమ్యమును దెలుపును.

తర్వాతి శ్లోకము (7–6)లో "ఏత ద్యోనీని భూతాని" – అని గలదు. (ఏతత్ =) ఈ యుభయ ప్రకృతులు సర్వభూతములకు యోని యని ఇతరులు వ్యాఖ్యానించగా, (ఏతత్ =) ఈ పరప్రకృతి సర్వభూతములకు యోని యని శ్రీ అరవిందుని వ్యాఖ్యానము. ఏలన అపర ప్రకృతి పరప్రకృతి యొక్క ఒక క్రీనీడ మాత్రమే.

మఱియు (7–6) శ్లోకము మొదటి పంక్తిలో, 'ఏతత్తు' = ఇదియే సర్వభూతములకు యోని యని శ్రీకృష్ణుడు చెప్పి, రెండవ పంక్తిలోనే – నేనే సర్వభూతములకు యోని – నని చెప్పికొనును. కావున ఈ ఏతత్తునకును, పరమ పురుషునికిని భేదము లేదు, అభేదమే గలదు – అను యొక నిగూఢ రహస్యమును శ్రీఅరవిందుడు వెలికి లాగును. అందుచేత సర్వభూతములకు యోనియైన ఈ

---

[1]ఇట్లు కుండలీకరణమునందు, రెండు గాక, మూడు సంఖ్య లున్నచో, మొదటిది గీతావ్యాసముల యొక్క రెండవ పరంపరను, అనగా నీ రెండవ సంపుటమును, రెండవది ఆ పరంపరలోని వ్యాససంఖ్యను, మూడవది ఆ వ్యాసములోని పేరాను సూచించును.

'ఏతత్తు' అపరప్రకృతి మిశ్రమము లేని పరప్రకృతియే గావలెను. సారాంశముగా, పరప్రకృతికిని, పరమపురుషునికిని అభేదము, మఱియు నా పరప్రకృతియే భూతముల యోని - యని మనకు శ్రీ అరవిందుని వ్యాఖ్యానము వలననే దెలియును. దీనినే శ్రీ అరవిందు డింకను ఇట్లు మనకు వివరించును.

"ఈ సర్వోన్నత క్రియాశక్తియందు పురుష ప్రకృతులు రెండును ఒకటియే. అచ్చట ప్రకృతి పురుషునియొక్క సంకల్పము మఱియు కార్యనిర్వాహక సామర్థ్యము మాత్రమే - ప్రకృతి వేఱుగా నొక వస్తువు గాదు, శక్తిలోపల నుండు పురుషుడే ప్రకృతి" (2-1-5). ఉదాహరణకు, నా శక్తి - అని నపుడు, ఆ శక్తి నానుండి వేఱుగా లేదు, తన లోపలి నేను - గానే యున్నది.

22. జీవన సమస్యా పరిష్కారము

ఇట్లు నిమ్న ప్రకృతియే సర్వప్రకృతి గాదు గావున, నిమ్న ప్రకృతి నుండి పైకెగసి, ఆత్మస్థులమైనపుడు సైతము మనము నిష్క్రియతలో మునిగిపోనవసరము లేదు. ఆత్మకు ఆధ్యాత్మిక ప్రకృతి గలదు, మఱియు నాప్రకృతియే సర్వకర్మలకు మూలసంకల్పము గాన, ఆత్మయందును మనము సర్వకర్మలు చేయగలము (4-18), అథవా మనద్వారా సర్వకర్మలు జరుగగలవు. పైగానిచ్చట అజ్ఞాన జన్యమగు భేదము, బంధము నుండవు గాన, అవి యన్నియు విముక్త కర్మలు, ప్రహృష్ట కర్మలు సైతము నగును, అనగా స్వేచ్ఛా ప్రహర్షములు ఈ కర్మల స్వరూపలక్షణములు.

ఇట్లు పరప్రకృతి యొకటి యుండుటవలన, ఆత్మయందును మనకు బాహ్య జీవనముందును మఱియు నా జీవనము విముక్తమే గాక, ప్రహర్షపులకితమును. ఇదియే తన పరప్రకృతిద్వారా గీత మనకు జూపు జీవన సమస్యకు పరిష్కార మార్గము.

ఏ సంకుచిత సన్యాస మార్గమునో గాక, గీతయొక్క సమగ్రమార్గము నవలంబించి, గుణక్లిష్ట ప్రకృతినుండి గుణాతీత ఆత్మలోనికి బయనించి నపుడే, మన కీ పరప్రకృతి పట్టువడును, మనము జీవన సమస్యను దివ్యముగా పరిష్కరించుకొనగలము. "యోగస్థః కురుకర్మాణి" (2-48) = కర్మప్రభువుతో యోగయుక్తుడవై కర్మచేయుము - ఒక్కమాటలో, నిదియే గీతమాత గీతమాత మనకు జూపిన జీవనసమస్యా పరిష్కారము.

విముక్త కర్మ ఎట్లు సంభవము? - అను శంకను బాపుట ఆవశ్యకము కాగా, గీత పరప్రకృతి యను దానిని ఆవిష్కరించి మించినది. ఇక నిపుడు, ఆత్మయే ఎట్లు ఈ రుడు కాగలుగును? - అను సందేహ నివృత్తికి పురుషోత్తమ తత్త్వమును బ్రతిపాదించి మఱింత గణుతికెక్కును.

23. ఆత్మయే ఈశ్వరుడా?

పరప్రకృతి పరమపురుషుని ప్రకృతి యనియు, ఆ పురుషుడే సృష్టికర్తయగు నీశ్వరు డనియు ఈ ప్రస్తావనయొక్క 5-వ ప్రకరణములో జెప్పుకొంటిమి. పోతే 6-వ ప్రకరణమునందు పరప్రకృతి ఆత్మ ప్రకృతి యని చెప్పి, తదాత్మకే ఇంచుమించు ఈశ్వరభావమును కట్టబెట్టియున్నాము. ఇంకను, గీత సైతము ఆరంభమున, రెండవ అధ్యాయమునందు, "అవినాశియగు నాత్మయే ఈ జగత్తు నంతను విస్తరింపజేసెను. (2-17) - అని పలికినది.

కాని ఈ అవినాశి ఆత్మ, అనగా అక్షరాత్మ నిష్క్రియము, నిర్వ్యక్తికము, సర్వసమము. అది సర్వకర్మలను సమభావమున, సాక్షిగా అవలోకించునే గాని, ఏకర్మను ప్రత్యేకించి సంకల్పించదు, శాసించదు. అట్టి ఆత్మ ఈశ్వరు డెట్లగును? కానిచో, గీతయు నట్లెందుకు వచించెను?

ఎందు కన, ఆనాడు వ్యవహారమునందున్న సాంఖ్య, యోగ, వేదాంతములను గీత చేపట్టి, వానికి తన విచారణలో క్రమారోహణ పద్ధతిని పూర్ణరూపములు గల్పించును.

కాగా, అప్పటి వేదాంతమునందు పురుషులిరువురే యుండిరి - క్షరుడు మఱియు అక్షరుడు. క్షరుడు జీవుడు, ప్రకృతిగతుడగు వైయక్తిక, వికారి, పురుషుడు; పోగా అక్షరుడు ప్రకృతి కతీతుడగు నిర్వ్యక్తిక, నిర్వికారి, నీరవ పురుషుడు. ఆ వేదాంతమున ఇతనికి పైన ఎవడును, ఏదియు లేదు. కావున నితడే పరమ పురుషుడు గావలెను. మఱియు గీతకు మాయ గాక, పరమ పురుషుడే జగత్కర్త గావున, ఈ అక్షరపురుషుడే ఈశ్వరుడు సైతము గావలెను. కావుననే గీత 2-వ అధ్యాయమున ఆత్మనే ఈశ్వరుడుగా ప్రస్తావించెను.

కాని ఇది యుక్తియుక్తము గాదు. అందుచేత గీత అక్షరపురుషుని లోపలి నుండి వ్యవహరించుచున్న తృతీయ పురుషుని, పురుషోత్తముని క్రమముగా ఆవిష్కరించి, తన త్రిపురుష సిద్ధాంతమును ప్రతిపాదించి మించును; ఇదియే గీతాధిక్యమని శ్రీ అరవిందుడు కొనియాడును.

24. పురుషోత్తముడే ఈశ్వరుడు

4-వ అధ్యాయమున ముందుగా, "నేను ఈశ్వరుడను..." (4-6) - అని శ్రీకృష్ణుడు తనను ప్రకటించుకొని, తర్వాత అదే అధ్యాయమున, "సర్వ భూతములను నీవు ముందు ఆత్మయందును, పిమ్మట నాయందును జూచెదవు." (4-35) - అని పలికి, ఆత్మకును తనకును గల అతిముఖ్యమగు అధిక్యమును సూచనామాత్రముగా దెలిపి, ఆత్మగాక, తాను, అనగా పురుషోత్తముడే ఈశ్వరుడని చెప్పకయే చెప్పినవా డగును. ఇట్లు ఉత్తరోత్తరము పురుషోత్తమ తత్త్వమునకు రూపురేఖలను దిద్దుచు, చివరకు 15-వ అధ్యాయమున మాత్రమే అతని పూర్ణరూపమును మన ముందుంచును -

"క్షరాక్షరులకంటెను అన్యుడగు ఉత్తమ పురుషుడు గలడు, అతడు పరమాత్మ యని చెప్పబడును; (పరమాత్మగా) నతడు లోకత్రయమును ఆవేశించి భరించును మఱియు నిచ్చట మాత్రమే గీతోపదేష్టయగు పరమ గురువు తన నిజస్వరూపమును స్పష్టముగా వెల్లడించును -

"నేను క్షరునికంటెను మించినవాడను, అక్షరునికంటెను గూడ నుత్తముడను. కావుననే లోకవ్యవహారము నందును, వేదవాఙ్మయమునందును పురుషోత్తముడనని ప్రసిద్ధి కెక్కితిని." (15-18)

ఇట్లు ఆత్మ ఈశ్వరుడు గాకపోయినను, ఆత్మకు బైన కర్మలను సంకల్పించు ఈశ్వరు డున్నాడు గాన, ఆత్మస్థితియందు మనకర్మలు, గీతా సమగ్రమార్గము ననుసరించినచో, ఆగిపోనవసరము లేదు, ఆగిపోవు, ఆగిపోగూడదు; ఏలన మన కర్మలు ఈశ్వర సంకల్పము.

25. పురుషోత్తముని మహిమ

కవులు సైతము ఏ విషయమున మోహవశు లగుదురో (4-16), అట్టి మహామహిమతో ఈ పురుషోత్తముడు విలసిల్లును. చూడుడు : అతడు సర్వమునకును మూలము (7-6), అతని నుండియే సర్వము వెలువడును (10-8) ఇట్లు అక్షరమును,క్షరమును అతని నుండి అభివ్యక్తమైనవే - అతనిలో అతడుగనే శాశ్వతముగా నుండియుండి, "సనాతనః" (15-7), అతని నుండి అభివ్యక్తమైనవే. అనగా నతడు ఏకకాలమున క్షరాక్షరములు రెండును అగును - మాఱుచుండు క్షరమునగును, మాఱని అక్షరము నగును; ప్రకృతియు నగును, సత్తయు నగును;

ఇదియే కవులు సైతము, అక్షరాత్మవఱకు మాత్రమే వెళ్ళిన కవులు సైతము, ఊహింపలేని అద్భుత మహిమ.

అ లే అతడు కర్త మఱియు అకర్త - రెండును "కర్తారం అకర్తారం" (4-13); ఆత్మరూపమున అకర్త మఱియు అంతరాత్మ రూపమునను, అంతరాత్మ వెనుక నున్న అంతర్యామి ఈశ్వర రూపమునను అతడు కర్త (18-61). ఇట్లు సృష్టిక్రియకు ప్రాతిపదకయైన సర్వద్వంద్వములును (13-27) అతనియందు సమన్వయమును, సామరస్యమును మాత్రమే గాక, ఏకతను గూడ ప్రాప్తించును.

26. అనంతముయొక్క తర్కము

కాని, పురుషోత్తముడు మాఱుచునే మాఱనివాడు : ఈ విషయమున పై వివరణచేత హేతుబుద్ధికి ఇంచుక ఆలంబనము లభించినను, మఱికొంత ప్రకాశము లభించిన బాగుండు నని దాని కనిపించును. అందులకే శ్రీ అరవిందుడిట్లు మరికొంత ప్రకాశము నిచ్చును -

"ఏవి విరుద్ధములుగా గన్పించునో, అట్టి ద్వంద్వముల సమకాలీనత ఎట్లు సంభవము? - అని మనము ప్రశ్నింతు మేని, దానికి సమాధాన మిదియే :సంపూర్ణ ఆధ్యాత్మిక సత్తయొక్క స్వభావమే అది యగును; అట్టి సత్త సదా అనంతము యొక్క ఈ ద్వివిధ సంతులిత స్థితిని గలిగియుండును." (2-21-6). మఱియు కరాక్షరములకును, ఉత్తమునికిని అంతస్తునందు గల వ్యత్యాసమును పురస్కరించుకొని శ్రీ అరవిందుడు విషయము నిట్లు విశదము చేయును-

"పురుషోత్తముడు క్షరాక్షరములు రెండను ఎట్లగుననిన,అతడు క్షరాక్షరముల కంటెను ఇతరుడు, మఱియు వానిని విడిగా దీసికొనినను, కలిపి తీసికొనినను, వాని కంటెను (అనంతముగా) నధికుడు." (2-24-15)

ఈ వివరణ యందలి కీలక మేమన - పురుషోత్తమతత్త్వము అనంతము. సాంతమునకు వర్తించు తర్కము, అనంతమునకు వర్తించదు. అనంతమునకు అనంతతర్కము వేఱుగా నుండును. ఈ తర్కము చెప్పునదేమన, అనంతముయొక్క స్వభావమే విరుద్ధ ధర్మముల సమకాలీనత. అనంతము అనంతము గావుననే, సాంతమగు వస్తువులచేత పరిచ్ఛిన్నము గాక, తాను తానుగనే యుండుచు, విరుద్ధ సాంతవస్తువులు కాగలుగును.

ఉదాహరణకు, ఆకు వేఱు, పూవు వేఱు; ఆకు పూవు గాలేదు, పూవును ఆకు గాలేదు. అనగా సాంత వస్తువులు ఒకటి మఱియొకటి గాజాలవు. అయితే

ఏకకాలమున చెట్టు ఆకు, పూవు - రెండును అగును. ఆకు మఱియు పూల దృష్ట్యా చెట్టు అనంతము. చెట్టు రెండింటికంటె నధికమై, రెండింటియొక్క సత్త మఱియు ప్రకృతియై, రెండును అగును, తాను తానుగను ఉండును. ఇట్లు అనంత తర్కము నాశ్రయించి, బుద్ధికి మరికొంత తృప్తిని గల్గించును.

27. గీతాద్వైతము

తన చరమ పరిణామమునందు జీవుడు - ప్రకృతిగత అంతరాత్మ పురుషోత్తముని యందు నివసించును - "నివసిష్యసి మయ్యేవ" (12-8) - అనియే గీత చెప్పును గాని, అతనిలో లయముజెందు నని చెప్పదు. అనగా జీవుడు పురుషోత్తముని యొక్క ఒక "సనాత నాంశము" (15-7). పురుషోత్తముడు కేవలమేక మాత్రుడు గాడు, అతడు అనేకుడైన ఏకుడు - The One that is Many. ఏకమైన ఆత్మ, అక్షరుడు, అతని ఏకతాపార్శ్వము కాగా, అనేకమైన అంతరాత్మ, క్షరుడు, అతని బహుతాపార్శ్వ మగును. అనేకము ఏకము యొక్క ఆధారముపై ప్రవర్తించును. ఇవి రెండును సృష్టిక్రియయందు పరస్పరపూరకములు.

ఇట్లు అద్వైతుల ఆత్మయు, విశిష్టాద్వైతుల జీవుడును - బహుసంఖ్యాకుడగు జీవుడును - తదతీతుడు, తన్మూలము నగు పురుషోత్తమునికి రెండు పార్శ్వములు గావున, శుద్ధాద్వైతమును, విశిష్టాద్వైతమును గీతయొక్క పూర్ణాద్వైతమునకు రెండు పార్శ్వము లగును.

ఇవి గీతయొక్క సిద్ధాంత భాగములోని అవగాహనకు ఆవశ్యకమగు కొన్ని అతి ముఖ్య విషయములు. ఇపుడు వీని వెలుగులో గీతయొక్క యోగభాగమును మనము సుఖముగా గ్రహించగలము.

28. యోగసంసిద్ధి స్వరూపము

ముందు గీతాలక్ష్యమగు యోగసంసిద్ధిని రేఖామాత్రముగా దర్శించి, తర్వాత ఆ సంసిద్ధికి గీత చూపిన మార్గమును దెలిసికొందము.

ప్రకృతిపురుషులకు, మనము 5-వ ప్రకరణములో జూచినట్లు, అభేదముగాన, పురుషుని ప్రతి అవస్థయందును ప్రకృతి యుండును. కాగా క్షరుని ప్రకృతి క్షరప్రకృతి యనియు, అక్షరుని ప్రకృతి అక్షర ప్రకృతి యనియు - ఇచ్చట ప్రకృతి నివృత్తిదశలో నుండును - ఉత్తముని ప్రకృతి పరప్రకృతి యనియు పిలువబడును. క్షర లేక గుణమయ, అపరప్రకృతి నుండి వెలువడి, అక్షరప్రకృతిద్వారా పరప్రకృతిలోని కారోహించుటయే యోగసాధన. అచ్చట

నెలకొని పురుషోత్తముని సత్తతో సంపూర్ణ సాయుజ్యమును (4-10), అతని ప్రకృతితో సమగ్ర సాధర్మ్యమును (14-2) బొందుటయే యోగసిద్ధికి మించిన యోగసంసిద్ధి. ఈ సంసిద్ధి స్వరూపమును మన మూహించగలమా ? అపుడు భగవంతునివలెనే మూడు స్తరములందును ఏకకాలమున వర్తించుచు, అచలస్థితియందే గాక, జీవన వ్యవహారములందును భగవంతునివలెనే మనమునూ పూర్ణుల మగుదుము - Be you perfect as God is perfect.

29. గుహ్య - సాధన

జనతా బాహుళ్యమునందు జీవుడు (అంతరాత్మ) అపరప్రకృతిలో మాత్రమే మునిగియుండును. అందుచేత అతనికి గుణపరము, గుణవిముక్తము నగు తన అక్షరాత్మ జ్ఞానముండదు; తనను గుణమయ ప్రకృతి నిర్మాణమగు అహంకారముగా భావించుకొనును. ఈ దశలో నున్న జీవునికి అక్షరాత్మ మఱుగునందుండును గావున, గీత ఈ ఆత్మను గుహ్యాము (రహస్యము) అనును. ఈ గుహ్యాసాధనయే అతని ప్రథమ మహాసోపానము. ఏలన ఆత్మస్థితియందు అతనిని వేధించిన అహంకారము నశించి, అతడు గుణవిముక్తు డగును.

అపర ప్రకృతిలో నున్నపుడు అతడు ఏది చేసినను, తన అహంకారము యొక్క కామతృప్తికే చేయును, ఫలాసక్తియే అతని ప్రథమ బంధనము. కావున నతడు ఫలాసక్తిని వీడి (2-47), ఫలమును భగవంతున కర్పించుచు, కర్మను యజ్ఞముగా జేయవలెను (3-9).

పిమ్మట, ఇపు డతనికి ఫలసంగము తగ్గినది గాన, అహంకారము పల్చబడి, దాని వెనుక నున్న తన శాశ్వత స్వభావము గోచరించ నారంభించును. కనుక అతడు అహంప్రేరిత కర్మను గాక, స్వభావ నియతమగు కర్మనే (18-47) చేయుచు, దానిని యజ్ఞముగా నర్పించును. ఫలమును గోరక, సమదృష్టితో చేయు నీ యజ్ఞకర్మవలన అతనికి అంతరంగమున శాంతి చోటుచేసికొని (12-12), క్రమముగా నతనిని శాంతి స్వరూపమగు అక్షరాత్మలోనికి గొనిపోవును. ఇట్లు నిష్కామకర్మ యజ్ఞము గీతకు యోగారంభము కాగా, ఆ యజ్ఞఫలము అహంవినాశకమగు ఆత్మప్రాప్తి యగును.

ఈ ఆత్మప్రాప్తి నేతినేతి - నిషేధక ప్రక్రియద్వారా జరుగలేదని గమనించుట చాల ముఖ్యము. ఒకవేళ అట్లే జరిగి యుండినచో, సక్రియాత్మ నిష్క్రియ మగు అక్షరాత్మలో లీనము కాగా, సాధన అంతటితో నాగిపోయి యుండును. పోగా,

గీతయొక్క యజ్ఞకర్మరూపమగు ఈ విధాయక ప్రక్రియలో కర్మయోగము మున్ముందు ప్రాధాన్యము వహించినను, జ్ఞానయోగ లక్షణమగు శాంతియు, భక్తియోగ లక్షణమగు సమర్పణయు - ఫలసమర్పణయు - నిప్పటికే అంకురించి యున్నవి.

ఇట్టి త్రివిధయోగము ద్వారా శాంతాత్మలో ప్రవేశించుటవలన, అచ్చట కర్మలు ఆగిపోవు. కర్మలు అక్షరాత్మశాంతి నుండియే వెలువడుచున్నవి, ప్రకృతియే కర్మలు చేయుచున్నది, నేను అకర్తను (13-30)-అను స్పష్టదర్శనము లభించును. అనగా క్షరప్రకృతి యందలి ఫలత్యాగముతో బాటు, ఇచ్చట నక్షరాత్మయందు ఆంతర కర్మసన్యాసము-"నైష్కర్మ్యము" (18-49) - సైతము సిద్ధించును. ఇది "కర్మ యందు అకర్మను, అకర్మయందు కర్మను" (4-18) జూచు స్థితి. అనగా కర్మ జరుగుచునే యుండును, నేను కర్మచేయుటలేదు - అను[1] జ్ఞానమును ఉండును.

ఇది జ్ఞానకర్మల ప్రత్యక్ష సమన్వయము, అయితే సమన్వయము మాత్రమే. ఏలన వీని సామరస్యమును, సమైక్యమును ఇంకను బైన సిద్ధించును. ఇప్పటికి గుహ్యమగు ఆత్మ ప్రాప్తించినది, జీవుడు బ్రహ్మభూతుడైనాడు (18-54)

30. గుహ్యతర - సాధన

ఈ ఆత్మ సర్వాత్మయు గావున, నిర్వ్యక్తికము. కనుక నిచ్చట మాత్రమే జీవుని, ఆత్మజ్ఞానము లేనపుడు పట్టి పీడించిన మిథ్యా వ్యక్తిత్వము, అహంకారము సర్వథా నశించిపోవును. అట్లు నశించిపోగా, జీవునికి తన నిజస్వరూపము దెలియవచ్చును. జీవలోకమున, అనగా అభివ్యక్తియందు తాను పురుషోత్తముని ఒక సనాతనాంశము (15-7) - అని కనుగొనును. (ఆత్మయందు జీవుని మిథ్యావ్యక్తిత్వము నశించినను, అతని సత్యశాశ్వతమగు ఆధ్యాత్మిక వ్యక్తిత్వము నశించదు. కావుననే అతడు జ్ఞానదశయందును భగవంతుని ప్రేమాదులను అభివ్యక్తము చేయు కేంద్రముగా వర్తించగలుగును). మఱియు తాను అన్వేషించుచు వచ్చిన భగవంతుడు - పరమ తత్త్వము - నిష్క్రియ శాంతాత్మ గాక, ఈ పురుషోత్తముడే యని ఇపు డతడు చూచును.

తన మూల మిట్లు దెలిసినది గనుక, తన వ్యక్తిత్వము నశించలేదు గనుక, బిడ్డకు ఎంతో కాలమునకు జూచిన తల్లిదండ్రులయందు వలె, అతనికి తన మూల మగు పురుషోత్తమునియందు ప్రేమ అకారణముగా, అనివార్యముగా

---

[1] మనకు జ్ఞానము సిద్ధించినదో, లేదో నిర్ణయించుటకు నిది గట్టి గీటుఱాయి. ఈ నికషోపలముపై జ్ఞానులుగా తేలువా రెంద రుందురు !

పెల్లుబుకును. కర్మశక్తియగు సంకల్పము, జ్ఞానశక్తియగు బుద్ధితోబాటు, ప్రేమశక్తియగు హృదయమును ఇపుడతనియందు ప్రస్ఫుటముగా, ప్రగాఢముగా పనిచేయ నారంభించును. కారణము అతని హృదయము నావరించి యుండిన కామాదులు పవిత్రమగు (4-38) శుద్ధాత్మలో నిపుడు కడిగివేయబడినవి.

ఇట్లు గీతా పూర్ణయోగమున జ్ఞానము భక్తికి సాధకమే గాని, బాధకము గాదు. భక్తి, కర్మజ్ఞానముల మహోజ్జ్వల కిరీటము (18-54).

ఈ ప్రేమ అతని బుద్ధికి పురుషోత్తముని నిగూఢ రహస్యములను అతి సన్నిహితముగా ఆవిష్కరించును - అని శ్రీ అరవిందుడు దెలుపును (2-24-32). కనుక సాధకుని అక్షరాత్మ జ్ఞానము పురుషోత్తముని పూర్ణజ్ఞానములోని కుద్ధరించబడును. ఇట్లు, కొందరు భక్తులు తలపోయునట్లు, భక్తియందు జ్ఞానము అప్రధానము కాదు సరిగదా, అది తన పూర్ణరూపము ధరించును. జ్ఞాని పరభక్తుడగును (18-54), భక్తుడు పూర్ణజ్ఞాని యగును (18-55).

అక్షరాత్మయందు కర్మమార్గము జ్ఞానమార్గముతో గలసి ద్విమార్గము కాగా, ఈ ద్విమార్గము పురుషోత్తమునియందు భక్తితో గలసి త్రిమార్గము, పూర్ణమార్గము అగును.

ఈ పురుషోత్తమునే గీత గుహ్యతర మనును. కారణము? ఈ పురుషోత్తముడు ఆత్మకంటెను ఎక్కువ మఱుగున యుండును. ఆత్మను కనుగొనిన పిమ్మటనే ఇతనిని కనుగొన నగును. నిజమే, కాని ఇందుచేత గీత అతనిని గుహ్యతర మనుటలేదు. ఇక నెందుచేత ననగ -

గుణమయ ప్రపంచము నిర్గుణ ఆత్మకంటెను వేఱుగా గన్పించగా, నిక పురుషోత్తమునియందు, అతడే తన పర ప్రకృతితో ఈ సర్వము నయ్యెనని దెలియవచ్చును, "వాసుదేవుడే ఈ సర్వము" (7-10) నని సాధకుడు జూచును. అతడే అభివ్యక్తి నిమిత్తము జీవరూపమున ప్రపంచమున వ్యవహరించుచున్నాడు. అతడే ఆ జీవుని వెనుక హృదయస్థుడగు నీశ్వరుడుగా నుండి (18-61), జీవుని, జగత్తును నడుపుచున్నాడు. అతడు జీవుని ఉద్ధరించుటకు కంకణము గట్టుకొనిన (12-7) సుహృదుడు (5-29), ప్రియతముడు (7-17), అతడే ప్రేమకు విషయమును, మూలమును. ఇట్లు పురుషోత్తమ సత్యము ఇహపరములను ఏకము చేయును గావునను, దానివల్లనే ప్రేమ సంభవమగుచున్నది గావునను, అది గుహ్యతరము - అని శ్రీ అరవిందుడు గూడ గుహ్యతర వ్యాఖ్యానము చేయును (2-22-18)

పరప్రకృతియందు సర్వమునేకమగును గాన, ఇక్కడ మాత్రమే త్రిమార్గము నందలి కర్మజ్ఞానప్రేమలు సమన్వయ, సామరస్య దశలను దాటి, సర్వథా ఏకాత్మక మగును, ఏకమగును. కర్మపైకి వెళ్ళి, జ్ఞానరూపము ధరించును (4-33), అయితే కర్మయజ్ఞము కొనసాగుచునే యుండును గాని, కర్మజ్ఞానములో అదృశ్యము మాత్రము గాదు. అటులే జ్ఞానము భక్తిలోని కుద్ధరించబడి భక్తి యగును (7-18).

31. గుహ్యతమ - సాధన

మంచిది; కాని పురుషోత్తముడే సర్వమూలము, పరమ తత్త్వము గదా. అయినపుడు అతడే గుహ్యతమము గావలెను. అగుచో, అతనిని గుహ్యతర మని మాత్రమే క్రిందటి ప్రకరణములో గీత ఎందుకు చెప్పినది? ఇది దోషము గాదు; ఏలన అచ్చట అతనియొక్క ఒక సత్యమును గుహ్యతర మని చెప్పి, ఇచ్చట అతని యొక్కయే మఱియొక సత్యమును గుహ్యతమ మని చెప్పబోవుచున్నది. చూడుడు :

పరమునందున్న పురుషోత్తముడే అవరము (ప్రపంచము) గూడ - వాసుదేవుడు గూడ - నయ్యె నను సత్యము గుహ్యతరము. పోగా, ఆ పరుడగు పురుషోత్తముడు నానావిధ ధర్మముల ననుసరించి అవరమును నడుపుచున్నను, తాను సర్వథా ఆ ధర్మములకు పరుడుగనే యుండును, సర్వధర్మములకు బైన ఏ ధర్మములు బంధించని అనంతుడుగనే యుండును. ఇది అతనియొక్క గుహ్యతమ సత్యము.

మఱియు సాధనదృష్ట్యా, ఆత్మలోనికి మన సత్తావిముక్తి గుహ్యమును, పరమాత్మలోనికి మన సత్తావిముక్తి గుహ్యతరమును కాగా, మన ప్రకృతి పరివర్తనము, మన ప్రకృతియొక్క దివ్యీకరణము గుహ్యతమ మగును. ఏలన ఈ పరివర్తనము నింతదనుక ఏ సంప్రదాయము తన లక్ష్యముగా లక్షించి యుండలేదు. ఇట్టి గుహ్యతమ ప్రకృతి పరివర్తనకు గావలసిన సాధనాబీజములు గలిగియుండుటచే - ముఖ్యముగా నిందుచేతనే - పురుషోత్తముని ధర్మాతీతత్త్వము గుహ్యతమ మగును. ఈ సాధనావాక్యమునే గీత 'సర్వగుహ్యతమం' (18-4) అని చెప్పుకొనును. ఇదియే గీతయొక్క చరమ వచనము, గీతయొక్క మహావాక్యము.

32. గీతామహావాక్యము

"సర్వధర్మములను బరిత్యజించి, న న్నొక్కనినే శరణుబొందుము. నేను నిన్ను సర్వపాపములనుండియు విడిపింతును; శోకింపకుము." (18-66).

గీతయొక్క ఈ మహావాక్యమునందు సైతము ఇతర వ్యాఖ్యానములు 'విడిపింతును' - అను మాటనుబట్టి సత్త్వావిముక్తినే చూచుచుండగా, శ్రీ అరవిందుడు దీని నిట్లు వ్యాఖ్యానించును -

"పరమపురుషుడు ఏ ధర్మములు బంధించని అనంతుడు గనుక, మనము సైతము ఈయా ధర్మములపై నాధారపడుటను సర్వథా పరిత్యజించగలిగి, ఈ సర్వస్వతంత్ర, సనాతన పురుషునికి మనను మన మర్పించుకొనగల మేని మఱియు, కేవలము అతనికే మన సర్వసత్తను సర్వథా తెఱచి యుంచుటకు మాత్రమే జాగ్రత్తపడుచు, మనలోని భగవంతుని యొక్క ప్రకాశము, శక్తి మఱియు ఆనందములయందే నమ్మక ముంచగలుగుదుమేని మఱియు నిర్భయముగాను, నిస్సంకోచముగాను అతనియొక్క మార్గదర్శనమునే అంగీకరించగలుగుదు మేని అప్పుడది మన సత్యతమ, మహత్తమ విమోచన మగును మఱియు నది మన ఆత్మ యొక్కయు, ప్రకృతియొక్కయు పరిపూర్ణ మఱియు అనివార్య సంసిద్ధిని (పరివర్తనమును) గొనివచ్చును." (2-22-19).

శ్రీ అరవిందున కీ విశిష్టార్థ మెట్లు స్ఫురించెను; ఇతరులకు విడుదల యన జీవనమునుండి విడుదల కాగా, శ్రీ అరవిందుని కది భిన్నధర్మముల సంఘర్షమునుండి జీవనముయొక్క విడుదల. ఏలన ఈ ధర్మసంకటమునుండి ఉద్ధరించబడుటకే. "నేను నీ శిష్యుడను, నీ శరణాగతుడను, నా కేది శ్రేయమో యుపదేశింపుము." - అని అర్జునుడు మొఱపెట్టుకొనెను (2-7). ఈ దృష్టితో శ్రీ అరవిందుడు ఈ మహావాక్యమును మఱియు నిట్లు వివరించును -

ఇట్లు మనస్సు ఏ ధర్మమునందు చిక్కుకొనక, ప్రతిపదమునందును మన జీవనమును, కర్మలను ఆ సజీవ అనంతుడే నిర్ణయించుట కవకాశ మీయవలెను. అపుడు "యోగేశ్వరుడగు కృష్ణుడే" (18-78) మన కర్మలను నిర్ణయించును, వానిని తానే చేపట్టును, మఱియు మనద్వారా నిర్వహించును. ఇదియే కృష్ణసారథ్యము యొక్క ఆంతర్యము. ఆ సారథ్యము అర్జుననికే గాదు, మనకును గలదు :

అట్టియెడ మనకు సమస్యలే యుండవు - సమస్యలు పరిష్కరింపబడుననుట గాదు, అసలు సమస్యలే యుండవు (2-24-36) - అని శ్రీ అరవిందుడు వివరించును. అనంతుడే మనలో కర్మ చేయునపుడు, మనకే కర్మసమస్యలుండును? అజ్ఞానోపహతమగు పృథక్కర వ్యక్తిత్వమే లేని సమస్యలను గల్పించును. ఇపుడా పృథక్కర వ్యక్తిత్వము స్థానమున అంతరాత్మ వచ్చి, తన మూలమే తనద్వారా వ్యవహరింప ద్వారము తెఱచి యుంచినది. కావున దాని కిపుడు ఏ సమస్యలు లేనేలేవు.

3

ఇదియే జీవన సమస్యకు శ్రీకృష్ణుడు మన ముందుంచిన పూర్ణపరిష్కారము. ఇది తప్ప మరియొక పరిష్కారము లేనేలేదని చివరకు నీవు కనుగొనగలవు - అని ఆ దేవదేవుడు మనలను హెచ్చరించును. ఈ పరిష్కారము గీతామహావాక్యము నందు మనకు ప్రసాదించబడినది. ఇట్లు ఈ మహావాక్యము పార్థివజీవనమును దివ్యజీవనములోనికి నడుపు మహాసేతువు.

ఇట్లు గీతా సిద్ధాంతమును గుఱించియు, గీతాయోగమును గుఱించియు మనము సూత్రప్రాయమగు నొక అభిప్రాయమును ఏర్పఱచుకొని యున్నాము. ఇపుడు గీతారహస్యములను శ్రీ అరవిందుని వ్యాఖ్యానము ఎట్లు తెల్లముచేయునో తెలుపు కొన్ని విశేషములను జూతము. ఈ పరిశీలన వలన ఇతర వ్యాఖ్యానములకును, ఈ వ్యాఖ్యానమునకును గల మహదంతరమును, ఈ వ్యాఖ్యానమునకు గల అపూర్వ వైశిష్ట్యమును మనకు బోధపడగలవు

33. అవతార ప్రయోజనము

అవతార మెందుకు వచ్చును? సాధురక్షణము, అసాధుశిక్షణము మఱియు ధర్మసంస్థాపనము (4-8) - అని గీతయే ప్రకటించుచున్నది గదా, సందేహ మెందుకు? అని ఇతర వ్యాఖ్యానము లన్నియు సారాంశముగా జెప్పును. కాని, అది గౌణము మాత్రమే, ముఖ్య ప్రయోజనము కాదు. పైపైన జదువువారికి మాత్రమే అట్లు గోచరించును. ఆ మాత్రము ఒక విభూతి సైతము సాధించగలదు - అని శ్రీ అరవిందుడు ఆక్షేపించును.

మానవతకును, దివ్యతకును మధ్యగల అడ్డుగోడను భేదించుకొని, భగవంతుడు మానవరూపము ధరించును. అనగా అవతారము మానవతనుండి దివ్యతలోనికి మార్గమేర్పఱచును. ఈ మార్గముద్వారా మానవుడు భగవంతునిలోని కారోహించును. వేఱు మాటలలో దేవుడు మానవునిలో జన్మించగా, మానవుడు దేవునిలో తిరిగి జన్మించును. మానవుని ఈ దివ్యజన్మయే అవతార ముఖ్య ప్రయోజనము. పోతే మన మనుకొను ధర్మసంస్థాపనము రాజకీయ స్వాతంత్ర్యము వలె దీనికి పూర్వాంగము మాత్రమే.

లోతుగా జదివిన, తర్వాతి రెండు శ్లోకములలోని "నన్ను బొందును" (4-9), "నా భావమును బొందును" (4-10) - అను పదములు జీవుని దివ్య పునర్జన్మనే సూచించునని శ్రీ అరవిందుడు చూపును.

అందువల్లనే అవతార పురుషులు - "I am the gate and the path = నేను కవాటమను మఱియు మార్గమను" అని వెల్లడింతురు. శ్రీమాత కండ్లలోనికి జూచిన, ఈ వాక్యముయొక్క సత్యము మన కించుక బొడకట్టగలదు.

34. అవతరణ యొక్క ఆవశ్యకత

భగవంతుడు మానవుని పరిమిత ప్రకృతిలోనికి దిగి, అచ్చట తన స్వరూప జ్ఞానమును గోల్పోవకయే సచేతనముగా వ్యవహరించగలడు - అను అతిముఖ్య సత్యమును భగవదవతరణము మనకు నిరూపించును. ఇట్లు భగవంతుడు ఏ కృష్ణశరీరములోనికో మాత్రమే అవతరించుట గాక, అతని తేజము, శక్తి మఱియు సన్నిధి మన శరీరములోనికి సైతము అవతరించగలవు. ఈ అవతరణ పరమావశ్యకము గూడను. ఏలన -

"మానవ సత్తను రూపాంతర మొందించుటకు మానవ ప్రయత్నముతో బాటు, భగవంతుని తేజము, సన్నిధి మఱియు శక్తి ఎక్కువెక్కువగా ఆ సత్తలోనికి దిగి చేయూత నీయవలెను; లేనిచో క్రింది దశ పైదశలోనికి అడుగువేయు స్థానమున అవశ్యకముగా జరుగవలసిన మార్పు సంభవము గాదు. కావుననే సాధన యొక్క చరమ ప్రక్రియగా అశేష ఆత్మసమర్పణ మనకు పరమావశ్యక మగును." (2-17-6, పాదటీక) - అని వక్కాణించి, శ్రీ అరవిందుడు తన అనుభవము నుండి గీతామహావాక్యము వెనుక నున్న ఉపపత్తిని మనకు విశద పఱచును. సమర్పణావశ్యకతను ఈ రీతిగా నిరూపించిన విశిష్టత వీరికే దక్కును.

35. "శరణం వ్రజ"

భగవంతుని శక్తి నీలోనికి దిగి నిన్ను విడిపించనిదే, నీ వెన్నటికిని పరప్రకృతి యొక్క పరమ స్వాతంత్ర్యములోని కారోహించజాలవు. కాని అట్లా శక్తి దిగుటకు నీ స్వసంకల్పములు దాని కడ్డురారాదు. కావుననే నీవు సర్వాత్మనా భగవంతునికి సమర్పించుకొనుము - "శరణం వ్రజ". దీనిని నీకు చరమ సాధనగా నుపదేశించుచున్నాను (18-66) - అని గీతామాత మనల నుద్బోధించును; ఇది గీతా చరమవాక్యానికి శ్రీ అరవిందుని వ్యాఖ్యానము.

ఇట్లుండ శ్రీ శంకరుడు - తాము ఆత్మ యను జ్ఞానము లేనివారికే ఈశ్వరాధీనత గాని, అక్షరోపాసకులకు గాదు. అక్షరోపాసకులు (12-3) స్వతంత్రముగనే కైవల్యప్రాప్తి నందగలరు; వారిని ఈశ్వరుడుద్ధరించు (12-7) ప్రసక్తియే ఉదయించదు - అని (12-12) శ్లోకము క్రింద వ్యాఖ్యానించును.

మఱియు శ్రీ శంకరుడు గీతామహావాక్యమును (18-66) గూడ దాదాపు ఇదే ధోరణిలో వ్యాఖ్యానించును. ఏలన ఆయనకు ఆత్మను - అక్షర పురుషుని - మించిన ఈశ్వరుడు లేడు, అపర ప్రకృతిని మించిన పరప్రకృతియు లేదు. ఒకవేళ ఈశ్వరుడున్నచో, అతడును భేదభూమికలోనివాడే, కనుక ఈశ్వరోపాసన చిత్తసమాధానము కొఱకు ప్రారంభ దశలో మాత్రమే.

ఎంతటి వ్యత్యాసము : పరప్రకృతిని, పురుషోత్తముని మనము చర్చించుకొని యుండనిచో, ఈ వ్యత్యాసము మన కర్థమయ్యెడిది గాదు.

36. "సుసుఖం కర్తుం"

గీతా మహావాక్యము ననుసరించి ఈశ్వరునకు మన సర్వసత్తను సమర్పించు కొనినపుడు, అతని శక్తియే, అతడే మన సాధనను చేపట్టును, అతడే మనలోని సాధకుడగును, అతడే మనలను సంసిద్ధికి గొనిపోవును, అనివార్యముగా గొనిపోవును. కావున నీ సమర్పణాయోగమున సంసిద్ధిని బొందుట కడు సులభము - "సుసుఖం కర్తుం" (9-2) - అని శ్రీఅరవిందుని వ్యాఖ్యానము.

అవ్యక్తోపాసకులకు మనస్సునకు గావలసిన ఆలంబన ముండదు, కాన వారి ఉపాసన కష్టబహుళము. కాగా ఈశ్వరోపాసకులకు దృఢమగు ఆలంబన ముండును. అందుచేత వారి సాధన సులభము (12-5) - అని చెప్పు భక్తుల మతమును గాదు శ్రీ అరవిందుని వ్యాఖ్యానము. ఈశ్వరుడే సాధకుడని భక్తులును శ్రీ అరవిందునివలె చెప్పలేదు గదా.

37. "మోక్ష యిష్యామి"

మోక్షయిష్యామి = విడిపింతును: ఇది మహావాక్యములోని మఱియొక పదము. విడుపునకు రెండు పక్షములు గలవు : దేనినుంచి విడుదల పొందుచున్నామో, అది యొకటి; దేనిలోనికి విడుదల పొందెదమో, అది మఱియొకటి. సాంప్రదాయికాద్వైతమున మనము అపర ప్రకృతినుండి అక్షరాత్మలోనికి ముక్తులమగుదుము. కాని ఇదియు పూర్ణ ముక్తి గాదు. ఏలన ఇచ్చట మనము నిష్క్రియతకు, నిర్వ్యక్తికతకు, బహుత్వ శూన్యమగు ఏకత్వమునకు బద్ధులమై యుందుము. కావుననే ఈశోపనిషత్తు దీనిని గూడ ఒక అంధకారమే యనును (మంత్రము - 12).

కాగా గీతా - మహాదర్శన మేమన, సత్త, ప్రకృతి, చైతన్యము, ఆనందము - అన్నియు క్షరము, అక్షరము, అతీతము నను భేదముచే త్రివిధము.

ఉదాహరణకు, ఒకే సత్త ఏకకాలమున ఈ మూడు అవస్థలయందును వర్తించును. కావున సత్తతో తనకు గల అభేద బలముచేత అంతరాత్మ ఈ మూడు స్తరములలోనికి ఏకకాలమున విడుదల బొందగలదు. ఇది అంతరాత్మ సత్తయొక్క పూర్ణ విముక్తి.

మఱియు ప్రకృతి విషయమునందును, అపర ప్రకృతిలోని ప్రతి అంశము యొక్క ప్రతిరూపము పైన పరప్రకృతిలో గలదు. కావున అంతరాత్మయే గాక, అపర ప్రకృతి సైతము పరప్రకృతిలోనికి విడుదల బొందగలదు. ఈ విడుదలచేత మనస్సు అతిమనస్సగును, ప్రాణము దివ్యప్రాణమగును, శరీరము దివ్యశరీరమగును.

ఇదిగో, ఇది యంతయు మోక్షయిష్యామి – పదములో నున్న అర్థమని శ్రీ అరవిందుడు మనకు దెలుపును. ఈ పూర్ణతకు గారణము, ఇచ్చట విడిపించువాడు స్వయముగా నీశ్వరుడు.

38. "మా శుచః"

మా శుచః = శోకింపకుము : ఇది మహావాక్యములోని కడపటి పదము. "నేను నిన్ను విడిపింతును గనుక శోకింపకుము." – ఇది ఇతరుల వ్యాఖ్యానము కాగా, "నేను నిన్ను ఏ మార్గమున విడిపింతునో, దానిని గుఱించి భయపడకుము, శోకింపకుము." – అని శ్రీ అరవిందుని వ్యాఖ్యానము.

పూర్వాపర సంబంధమును శ్రీ అరవిందు డెంత జాగ్రత్తగా గమనించునో, ఈ వ్యాఖ్యచేత మనకు విదితమగును. "నన్నీ ఘోర మారణకర్మయందు ఎందుకు నియోగించుచున్నావు?" అనియే గదా అర్జునుడు ఆదిలో (3–1) మొఱ పెట్టుకొనెను. తర్వాత ఇట్లు పైకి అకుశలము (18–10) గను, ఘోరము (3–1) గను గన్పించు కర్మయే గీతోపదేశమునకు మూలము.

ఘోరము, సౌమ్యము : ఈ ఉభయవిధ కర్మలద్వారాను భగవంతుడు లోక సంగ్రహమును (3–20) సాధించును. భౌతిక భూమికలో భూకంపాదులు భూస్వరూప పరివర్తనకు అవసరమైనట్లే, సాంఘిక, రాజకీయ రంగాలలోను వాని పరివర్తన కొఱకు యుద్ధాదులు ఆవశ్యక మగును. ఈ విషయమును స్పష్టముగా గుర్తించియే శ్రీ అరవిందుడు, మన మింకను రుద్రునకు చెల్లించవలసిన ఋణమున్నది – అని హెచ్చరించును. నేను లోకములను మట్టుపెట్టుటకు విజృంభించిన కాలస్వరూపుడను (11–32) – అని భగవంతుడే చెప్పుచుండ, గీతలో కేవలము అహింసనే దర్శించు వారి దర్శనము పాక్షికదర్శనమే యగును.

39. సిద్ధిస్వరూపము

బాగున్నది, అయితే "మాశుచః" - తో గూడిన, "శరణం వ్రజ" - పూర్వకమైన "మోక్షయిష్యామి" - వలన మనకు గలుగు సిద్ధిస్వరూప మేమిటి?

"నివసిష్యసి మయ్యేవ" (12-8) = నాయందే నివసించెదవు : అంతరాత్మ శాశ్వతముగా భగవంతునియందు నివసించును. ఇదియే పరమసిద్ధి స్వరూపము.

ఇంతేనా ? ఇది యింకను భేదదర్శనములోనిదే, ఇది కైవల్యముకంటెను చాల తక్కువ - అని కేవలాత్మవాదులు చులకన చేయవచ్చును. కాని ఇది గీతను లోతుగా అధ్యయనము చేయకపోవుటచేత నేర్పడిన భ్రాంతాభిప్రాయమే - అని శ్రీ అరవిందుడు సమాధానించును. ఏలన అంతరాత్మ స్వరూపతః పురుషోత్తమునితో సర్వథా, అనగా సచ్చిదానందములు మూడింటియందును, అభిన్నము, ఏకము నయ్యును, స్వభావతః అనగా అభివ్యక్తియందు, అతనియొక్క ఒక సనాతనాంశముగ నుండును - పరిమితి యున్నపుడే అభివ్యక్తి సంభవము గనుక. కావున గీత "మద్భావ మాగతాః" (4-10) - అని ఒక వైపున వక్కాణించుచునే, "నివసిష్యసి మయ్యేవ" (12-8) - అని రెండవ వైపున వివరించును.

మఱియు నిట్లు స్వరూపతః మనము పరమపురుషుడమే గాన, నాయందు నివసింతువు - అని చెప్పినపుడు నీ స్వరూపమునందు నీవు నివసింతువు - అని చెప్పనట్లగును. "స్వే మహిమ్ని ప్రతిష్ఠితః" - అని దీనినే ఛాందోగ్యోపనిషత్తు అధికారముగా నుద్ఘాటించును.

ఇచ్చట భగవంతుని సత్తతో సాయుజ్యమును ఉండును - "విశతే తదనంతరం" (18-55), భగవంతుని ప్రకృతితో "సాధర్మ్యమును" (14-2) ఉండును. తాదాత్మ్యరూపమగు కైవల్యము ఈ సంసిద్ధిలో ఒక భాగము మాత్రమే.

ఇంకను వాస్తవ జీవనమునందు ఈ సంసిద్ధిమహిమ ఎటులుండునో, మనము ఊహించనైన నూహించలేము. కనుక గీత మనకు మఱియొక సూత్రము నిచ్చును-

40. "మయి వర్తతే"

"సర్వథా వర్తమానోపి స యోగీ మయి వర్తతే" (6-31) = నాతో సమగ్ర యోగమునుబొందిన యోగి ఏయే రీతుల వర్తించినను, నాయందే వర్తించును.

ఇంకను మనకిది అస్పష్టముగనే యున్నది. 'నాయందే' - అనుటలోని బలమేమియో మనకు దెలియదు. భగవంతుడు అదృశ్యుడు, అస్పృశ్యుడు, అచింత్యుడు... అను పాట వినుటకు అలవడిన మనపై శ్రీఅరవిందుడు తన అనుభవ బాంబును విసరును. 'మయి వర్తతే' - అను పదమునకు మనలను చకితులను గావించు ఆయన వ్యాఖ్యానమును విందము -

"మాటలు మఱియు పేరులు, అటులే సంకేతాత్మక ప్రతిమలు మఱియు కల్పనలచేత దప్ప భగవంతుని ఊహించుకొనలేని భౌతిక మనస్సు మాత్రమే భగవంతుడు మఱియు భగవత్స్వరూపము (spirit) ఒక అస్పష్ట భావన యని తలంచును. కాని స్వరూపము స్వరూపమును జూచును; శారీరకచేతన స్థూలద్రవ్యము నెంత స్పష్టముగా జూచునో, అంత ప్రత్యక్షముగాను, అంతకంటె నెక్కువ ప్రత్యక్షముగాను, ఎంత ఆంతరంగికముగా జూచునో, అంత ఆంతరంగికము గాను, అంతకంటె నాంతరంగికముగాను దివ్యీకృతచేతన భగవంతుని జూచును. అది భగవంతుని చూచును, స్పృశించును, చింతించును మఱియు నింద్రియములతో గ్రహించును. ఏలన ఆధ్యాత్మిక చేతనకు అభివ్యక్త జగత్తంతయు ద్రవ్యమయ ప్రపంచముగా గాని, ప్రాణమయ ప్రపంచముగా గాని, చివరకు మనోమయ ప్రపంచముగా గాని కాక, చిన్మయ ప్రపంచముగానే గోచరించును; దాని దృష్టికీ మూడు ప్రపంచములును భగవదాలోచన, భగవచ్ఛక్తి మఱియు భగవద్రూపము మాత్రమే యగును. ఇదియే 'మయి వర్తతే' అను గీతా వచనమున కర్థము." (2-9-4) - అని శ్రీ అరవిందుడు వెల్లడించును.

ఇది అద్భుతము గాదూ: అసలు లేనే లే డనియో, ఉన్నచో మనకు నిశ్చల సమాధియందే గాని, బాహ్య - జీవనమున అందనే అందడనియో అనుకొనుచు వచ్చిన భగవంతుడు ఈ సంసిద్ధియందు ఎల్లెడల మనకు దగులును, వ్యవహార మంతయు అతనితోనే: ఇదియే మనమిపుడు ఊహించజాలని ఈ సంసిద్ధియొక్క మహామహిమ.

41. రామరాజ్యము - భగవద్రాజ్యము

ఈ పరకాష్ఠను రామరాజ్య మందమా ? ఆ పదము సరిపోదు. ఏలన, "రామో విగ్రహవాన్ ధర్మః" = రాముడు రూపము ధరించిన ధర్మము. కావున రామరాజ్యము ధర్మనిష్ఠము, ధర్మాత్మకము. కాని ఈ సాత్త్విక ధర్మమును గూడ నతిక్రమించి, "సర్వధర్మాన్ పరిత్యజ్య" (18-66), సర్వధర్మాతీతుడగు పురుషోత్తముని యందు మనము నెలకొని నపుడే (12-8), మఱియు మన

చేతనయొక్క స్థానమున అతని చేతన వ్యవహరించి నపుడే - "మచ్చిత్తః" (18-57), ప్రపంచ మంతయు పై విధముగా భగవంతుడే యగును. గుణాతీతమగు ఈ రాజ్యమునకు నడిపినవాడు కృష్ణుడు గావున, దీనిని కృష్ణరాజ్య మని పిలుతము, లేక ఇచ్చట సర్వము భగవంతుడుగనే గోచరించును గాన, దీనిని భగవద్రాజ్య మందము. రామావతార, కృష్ణావతార కార్యములను గుఱించి శ్రీ అరవిందుడు వెలిబుచ్చిన అభిప్రాయమును బట్టియే ఇక్కడ ఈ వివేచన చేయబడినది.

ఇట్టి అపూర్వ విశేషములు శ్రీ అరవిందుని వ్యాఖ్యానమునందు ఇంకను ఎన్నో ఎన్నో గలవు. కాని మన 'ప్రస్తావన' గుంటూరు చేంత్రాడు కాగూడదు. కావున ఈ విశేషములను త్రవ్వి తీయుట నిక్కడ ఆపివేతము. ఇపుడు ఉపసంహారమున గీతపట్ల శ్రీ అరవిందుని అభిప్రాయమును దెలిసికొందము.

42. గీత అద్వితీయ గ్రంథము

కర్మయోగ విషయమున, కర్మయోగముద్వారా జీవనసమస్యను పరిష్కరించు విషయమున గీతను బోలినగ్రంథరాజము ఈ ప్రపంచమున మఱియొకటి లేదు. కావుననే భగవద్గీతపై [1]రెండు సంపుటములు వ్రాయునంతటి శ్రమజేసితిని, కాలము వెచ్చించితిని - అని శ్రీ అరవిందుడు గీతామహత్త్వమును గొనియాడును. ఇట్లు జీవనసమస్యను పరిష్కరించిన గీతోపదేశమున తన వ్యాఖ్యానముద్వారా తన దివ్య జీవనలక్ష్యమునకు సోపానసరణి గావించుకొనెను శ్రీ అరవిందుడు - అని వ్యాఖ్యానమును లోతుగా జదివిన మనము పసికట్టగలము.

అయినను - గీతనే (15-15) ఉదాహరించుచు - జ్ఞానభాండారము హృదయములో నున్నది. వేదములు అక్కడినుండి వచ్చినవే గాని, ఆ భాండారములోని ఒక అంశము మాత్రమే. అటులే గీతయు సర్వసంపూర్ణ మనుకొనజాలము. అది వాని లోపము గాదు. అభివ్యక్తి ఎపుడును అసంపూర్ణమే గావున, అభివ్యక్త విశ్వము, అభివ్యక్త గ్రంథములు అపూర్ణము గాక తప్పదు - అని శ్రీ అరవిందుడు నుడుపును.

"కావున" శ్రీ అరవిందు డింకను చెప్పును, "గీతోపదేశము యొక్క నాలుగు గోడల మధ్యను సైతము మనము తలదాచుకొనవలసిన పనిలేదు. అట్లు చేసినచో, మన ఆధ్యాత్మిక జీవితమును మనము మన స్వీయ సత్త మఱియు శక్యతల నుండి కాక, గతమునకు జెందినవారి సత్త, జ్ఞానము మఱియు స్వభావమునుండియే

[1]ప్రారంభమున శ్రీ అరవిందుని 'గీతావ్యాసములు' రెండు సంపుటములుగా ప్రచురింపబడెను.

సృజించుకొనుటకు యత్నించిన వారమగుదుము. మనము గతించిన ఉషోదయములకు గాక, భావి మధ్యాహ్నములకు చెందుదుము." (1-1-9).

ఇట్టి నుడివియు, గీతయొక్క ఒక మహాసామర్థ్యమును శ్రీ అరవిందుడు మఱల నిట్లుగ్గడించును : గీతలో దేశకాల బద్ధమైనది మిక్కిలి తక్కువ. ఏ దేశము, ఏ కాలమునకు నైనను అనురూపముగా మాఱగల మహాసామర్థ్యము దానిలో నున్నది. ఉదాహరణకు, గీతలోని యజ్ఞమును దీసికొందము. అది మానవులకు, దేవతలకు మధ్య జరుగు ఆదానప్రదాన మని గీత చెప్పును. సందర్భమును బట్టి ఈ దేవతలలో సాంప్రదాయక దేవతాత్వము చాల తక్కువ. కావున యజ్ఞ మన భగవంతునికి మనకు మధ్య గాని, మనకు ప్రకృతికి మధ్యగాని, మనకు నితరులకు మధ్య గాని జరుగు ఆదానప్రదాన మని తేలును. ఈ యజ్ఞము సర్వ దేశకాలములకు వర్తించును. ఏలన ఇట్టి యజ్ఞక్రియ లేనిదే సృష్టి ఒక్క క్షణము కూడ మనుగడ సాగించలేదు.

గీతలో విడిచివేయబడిన దానిని ఒక్కొక్కప్పుడు శ్రీ అరవిందుడు తన అనుభవము నుండి ఎట్లు పూరించునో, ఒక దృష్టాంతముద్వారా చెప్పుట ఈ సందర్భమున ఉచితమగును.

43. పరప్రకృతియందు గుణస్వరూపము

అపరప్రకృతియందు ప్రకాశము, ప్రవృత్తి మఱియు జడతయను రూపములతో నుండు సత్త్వ, రజస్, తమో గుణములు వేఱువేఱుగా నుండి, పరస్పర ఆధిక్యము కొఱకు పెనగులాడుచు, సంక్షోభమును బుట్టించును. కాగా పరప్రకృతియందు వీని మూల స్వరూపములు జ్యోతి, శక్తి మఱియు శాంతి. అక్కడ నివి ఒకదాని వెలుపల నొకటి యుండవు, ఒకదానితో నొకటి కలహించుకొనవు. అవి సమతూకములో నుండు నని చెప్పుటయు సరిపోదు. అక్కడ ప్రతిగుణము తక్కిన రెంటియొక్క ఒక పార్శ్వముగా నుండును, మఱియు తమ పూర్ణత (perfection) యందు అన్నియు అవిభాజ్యముగాను, ఏకముగాను విలసిల్లును (2-17-5) - అని గుణరహస్యమును వెల్లడించి, శ్రీ అరవిందుడు దీనికి సంబంధించి పాదటీకలో నిట్లు పేర్కొనును -

"ఇది (నా) అధ్యాత్మి కానుభవమునుండి ప్రవేశపెట్టిన విషయము గాని, గీతనుంచి సేకరించినది గాదు. గీత గుణాతీతత్వమును ప్రబోధించి, దాని స్వరూపమును స్వానుభవమున దెలిసికొన సాధకునకే విడిచివేయును." ఇట్టివారు గాక, గీతావ్యాఖ్యానమును జేయ ఇతరు లెవరర్హులు?

44. ఋషి ఋణము

మానవుడు మానవతనుండి దివ్యతలోనికి ఆరోహించు మార్గమున ఒక దశగా శ్రీ వేదవ్యాసుడు గుణాతీతత్వము చెప్పగా, శ్రీ అరవిందుడు ఆ గుణాతీతత్వ స్వరూపమును వర్ణించి, ఆ ఉపదేశమును పూర్ణము చేయును. చరమ దశగా సర్వ సమర్పణను జెప్పి, ఈ దశయందు భగవంతుడే నిన్ను విడిపించును - అని వేదవ్యాసుడు ఆశ్వాస మీయగా, విడిపించుటయే గాదు, నీ యోగమును భగవంతుడే చేపట్టి నిన్ను సంపూర్ణ సంసిద్ధికి గొనిపోవును - అని శ్రీ అరవిందుడు చరమోపదేశములోని పూర్ణార్థమును దెలుపును.

ఇట్లు మానవుని దివ్యభవితవ్యమును దర్శించి, దానికి బంగారు బాటవేసి, ఆ భవితవ్య సంసిద్ధికి తమ యోగశక్తి నంతను ధారవోయుచున్న ఈ మహర్షి ద్వయముయొక్క - శ్రీవేదవ్యాస శ్రీ అరవిందుల యొక్క - ఋణమును మన మెట్లు తీర్చుకొనగలము :

దేవఋణమును దీర్చుటకు యజ్ఞము చేయవలెను, పితృఋణము దీర్చుటకు పిండప్రదానము చేయవలెను; పోగా ఋషిఋణము దీర్చుటకో - వారి గ్రంథములను అధ్యయనము చేయవలెను : లోకసంగ్రహార్థమే వచ్చిన ఆ మహనీయులు మన నుండి అపేక్షించున దంతయు నిదే :

45. ధన్యుల మనుకొందుము

కావున శ్రీవేదవ్యాసుని గీతాయోగమును, శ్రీ అరవిందుని గీతావ్యాసములను మనము శ్రద్ధగా, లోతుగా అధ్యయనము చేతము గాక ! వారి దృక్కోణము నుంచి, వారి చేతనలో ప్రవేశించి అధ్యయనము చేతము గాక ! అపుడు ఆ వ్యాఖ్యానము ఆవిష్కరించు గీతలోని భవ్య విశేషములు మన హృదయమును స్పృశింప నారంభించును. ఇక నపుడు ఎంత సమయము అధ్యయనమునకు వెచ్చించినను, అది అంతయు స్వల్పమే యనిపించును. అది వృథా అనిపించక పోగా, అంతకు మించి ఫలప్రదమగు సమయ వినియోగ ముండదని మనము భావింతుము, చదివినందుకు ధన్యుల మనుకొందుము !

ఇట్టి అధ్యయనమునకు పూర్వపీఠికగా దోడ్పడు నిమిత్తమే మన మీ ప్రస్తావనలో కొన్ని ముఖ్య విషయములను ప్రస్తావించుకొని యున్నాము. ఈ ప్రస్తావన అట్లే తోడ్పడి, పూర్ణాధ్యయనమునకు ప్రోత్సాహము నిచ్చు గాక !

భవదీయ

అనువాదకుడు

గీతా వ్యాసములు

1. గీతాధ్యయన మెందుకు?

1. మా మతమే పరమ సత్యము :

ప్రపంచమున వైదిక, లౌకిక శాస్త్రములు, శ్రుతి స్మృతులు, మతములు మఱియు దర్శనములు (philosophies), శాఖలు మఱియు సంప్రదాయములు కోకొల్లలు. అపక్వజ్ఞానులు లేక అజ్ఞానులు వీనిలో కేవలము ఒకదానియందు మాత్రమే ఆవేశముతో నాసక్తులై, ఆ గ్రంథమే సనాతన భగద్వచనము, తక్కిన వన్నియు బూటకములు, లేక అపూర్ణప్రేరితము లందురు; తమ దర్శనశాస్త్రమే హేతుబుద్ధి యొక్క చరమ వాక్యము, తక్కిన వన్నియు తప్పులతడికలు, లేక తమ దర్శన శాస్త్రము నాశ్రయించుటజేసి ఇంచుక సత్యములు- అనిచెప్పి గర్వింతురు. భౌతిక శాస్త్రపరిశోధనలకు సైతము సమున్నత మతస్థాన మిచ్చి, పూజించుచున్నారు; ఈ మతము పేరిట, ఈశ్వరమతమును, ఆధ్యాత్మిక మార్గమును, అజ్ఞానము మఱియు అంధవిశ్వాస మనియు, దర్శనశాస్త్రమును ఆడంబరము మఱియు రమ్యకల్పన యనియు నిషేధించుచున్నారు. ఈ మూర్ఖనిషేధములందును, వ్యర్థవివాదములందును విజ్ఞులు సైతము తఱచుగా పాల్గొనుచుండుట విచిత్రము; ఏదియో తమోభావము వారి నిర్మలప్రకాశములో కలిసి, బౌద్ధికాహంకరమునో, ఆధ్యాత్మికగర్వమునో బుట్టించి, వారిని దారి తప్పించి యుండవలెను. అయితే మానవజాతి యిపుడు ఇంచుక నమ్రత మఱియు విజ్ఞతవైపునకు మొగ్గుచున్నట్లు గన్పించును. మతము పేరిటగాని, వారి మనస్సుపొందిన శిక్షణవేఱు, లేక వారి మనస్తత్వము వేఱు- అనిగాని మన మిపుడు సోదర మానవులను యమపురి కంపుటలేదు. అటులే భేదాభిప్రాయముగల పొరుగు వానిపై మనము దుమ్మెత్తిపోయుట లేదు. సత్య మెల్లెడల నున్నది, అది మన సొత్తు మాత్రమే గాదని అంగీకరించుటకును సిద్ధపడుచున్నాము. ఇతర మతములు మఱియు దర్శనములలోగల సత్యమును, సాహాయ్యమును బొంద,

వానిని వీక్షింపగోరుచున్నాముగాని, అవి అసత్యమని శపించుటకు గాని, వానిలోని తప్పులనుకొను తప్పులను విమర్శించుటకుగాని కాదు. అయినను మన మిప్పటికిని, మన మత మొక్కటియే జ్ఞానశిఖరము నందుకొన్నదనియు, ఇతరమతములు లేక శాస్త్రములు మన సత్యముయొక్క నిమ్నరూపములను మాత్రమే చెప్పుచున్న వనియు, లేక మందాధి కారులను మనసత్యశిఖరమునకు సిద్ధము చేయుచున్న వనియు ప్రకటించుకొనుచున్నాము. ఇంకను మన మిప్పటికి, మన మభిమానించు గ్రంథము లేక ఉపదేశములోని ప్రత్యక్షరము భగవత్ప్రేరితమే గాన, అది శాశ్వత సత్యమని చెప్పి, దాని సంతను, తుచ తప్పకుండ మనపైనను, ఇతరులపైనను రుద్దజూచుచున్నాము.

2. కాలిక సత్యము మఱియు శాశ్వత సత్యము :

కావున వేదము, ఉపనిషత్తులు, లేక గీత వంటి ప్రాచీనగ్రంథమును చేపట్టునపుడు, ఏ ఉద్దేశ్యముతో చేపట్టుచున్నామో, మానవాళి కిప్పుడును, తర్వాతను ఉప యుక్తము కాగల దేనిని దాని నుండి పొందగోరుచున్నామో, – ఈ సంగతిని ముందుగనే కచ్చితముగా సూచించుట ప్రయోజనకరము, ప్రథమ విషయము : నిస్సంశయముగా ఏకము, నిత్యము నగు ఒక పరమ సత్యము గలదు; దానినే మన మన్వేషించుచున్నాము. దాని నుంచియే ఇతర సత్యమంతయు నుత్పన్నమగును; దాని వెలుగు చేతనే ఇతర సత్యమంతయు జ్ఞాన ప్రణాలికయందు తన యథాస్థానమును, యథావివరణమును, యథాసంబంధమును కనుగొనును. కాని సరిగా నా కారణముచేతనే ఆ పరమ సత్యము ఒకే నిశిత సూత్రమునందు నిబద్ధము కాజాలదు; తన సంపూర్ణ రూపమునందుగాని, సర్వసంబంధములందుగాని ఒకే దర్శన శాస్త్రమునందు, లేక మత గ్రంథమునందు లభించుట కష్టము, లేక ఒకే గురువుచే గాని, అవతారముచే గాని ప్రోక్తమై యుండుట అసాధ్యము, మఱియు, నితర సాంప్రదాయములకు ఆధారభూతమైన సత్యమును మనము అసహనముతో నిరాకరించవలసి వచ్చుచో, మన కీ పరమ సత్యము పూర్తిగా అవగతము గానట్లే; అంధావేశముతో ఒక సత్యమును నిరాకరింతుమేని, పూర్ణసత్యములో దాని స్థానము మనకు తెలియ లేదనియే అర్థము . అధ్యయనమునకు సంబంధించిన ద్వితీయ విషయము; ఈ పరమ సత్యము ఏకము, నిత్యమునైనప్పటికి, కాలగమనమునందును, మానవమానసముద్వారాను తనను వ్యక్తము చేసికొనును; కావున ప్రతి శాస్త్రము నందును రెండు విభాగములుండును: 1. తాత్కాలికము, నశ్వరము; ఇది తాను

వ్యక్తమైన దేశకాలములందలి భావములనుబట్టి యుండును. 2. సనాతనము, అనశ్వరము; ఇది సర్వ దేశకాలములకు వర్తించును. ఇంకను ఈ పరమసత్యా ప్రతిపాదనయందు, దాని కివ్వబడిన వాస్తవరూపము, రచనావిధానము, ఆధ్యాత్మిక మఱియు బౌద్ధికాకారము - ఇవి యన్నియు కాలపరివర్తనముల కధీనము గావున, కాలాంతరమున తమ పటుత్వమును గోల్పోవును; కారణము, కాలమును బట్టి బుద్ధియు తనను మార్చుకొనుచుండును; అట్లు తాను మాఱుచు, తన సమన్వయములను మార్చి కూర్చును; వెనుకటి శబ్దములను, సంకేతములను విడిచి, నూతనములను గ్రహించును; ఒకవేళ వెనుకటి దానినే ప్రయోగించుచో, దాని గర్భితార్థమును (connotation) మార్చివేయును, లేదా కనీసము అర్థవ్యాప్తిని, అర్థసాహచర్యము (association) ను మార్చివేయును. కావున తన కాలమునాటి వారికి గీత యిచ్చిన అర్థమును, భావమును అర్థముచేసికొనగలమను నిశ్చయము మన కెప్పటికి నుండజాలదు. బుద్ధి యిట్లు మార్చివేయును గావున, ఏది సార్వకాలిక మగుటతోబాటు, బుద్ధికి మించిన దృష్టితో చూడబడునో, దేనిని మన మనుభవించి, జీవింతుమో, దానికే శాశ్వత మూల్యముండును.

3. గీతనుండి కావలసినది సజీవ సత్యము :

కావున ఆనాటివారికి స్ఫురించిన గీతయొక్క గర్భిత తాత్త్వికార్థమును యథా తథముగా వెలికిదీయ, ఒకవేళ సాధ్యమైనను, దానికి నేను విలువ నివ్వను. పైగా నట్లు వెలికిదీయుట సాధ్యముగాదని ఈ నాటికిని వ్రాయబడుచున్న వ్యాఖ్యానముల మధ్యగల అఖాతము తెలుపుచునే యున్నది. ఆ వ్యాఖ్యానము లన్నియు పరస్పర అనంగీకారమునే అంగీకరించుచున్నవి; ప్రతి వ్యాఖ్యానము గీతయందు తన తాత్త్విక వ్యవస్థనే, తన ధార్మిక ప్రవృత్తినే కనుగొనుచున్నది. మఱియు పండితులెంత నిష్పక్షపాతముగా ప్రయత్నించినను, భారతీయ తత్త్వశాస్త్రమును గుఱించి చారిత్రక పరిశోధకు లెట్టి ప్రకాశమయ సిద్ధాంతములను ప్రతిపాదించినను, అవి గీతార్థ విషయమున అనివార్య ప్రమాదమును వారించజాలవు. కాని, వాని తార్కిక రూపములను గాక, గీతలోని వాస్తవ సజీవసత్యములను అన్వేషింతు మేని, మనకును విశాల ప్రపంచమునకును ఉపకరించగల అంశములను గీతనుండి వెలికి దీతుమేని, వానిని ఇప్పటి మనస్తత్త్వమునకును, ఆధ్యాత్మికావసరములకును అనువగు భాషలో ప్రకటింతుమేని, అదిగో, అది మనకు లాభప్రద మగును. నిజమే, ఈ ప్రయత్న

మందును మన వ్యక్తిత్వమునుండియు, ఇప్పటి భావములనుండియు ప్రభవించిన దోషము లెన్నియో కలిసిపోవచ్చును. కాని, ఈ మహాగీతాశాస్త్రముయొక్క మూల భావములో మనము మునుగుదు మేని, మఱియు విశేషించి, ఆ భావములో నివసింప బ్రయత్నించితి మేని, నిశ్చయముగా మనము స్వీకరించగలిగినంత వాస్తవసత్యమును అటులే వ్యక్తిగతముగా మన కుద్దేశించబడిన ఆధ్యాత్మిక ప్రభావమును, సక్రియ సాహాయ్యమును మనము గీతలో బొందగలము. మఱియు, చివరకు దీనిని ప్రసాదించుటకే శాస్త్రములు వ్రాయబడినవి; తక్కిన దంతయు పాండిత్యవివాదము లేక ఈశ్వరవాదము. ఏ పవిత్రగ్రంథములు, మతములు, దర్శనములను ఇట్లు సంతతము నవీకరించి జీవించగలమో, వికాసశీల మానవజాతియొక్క ఆంతరవిచారణ యందును, ఆధ్యాత్మికకానుభవమునందును వేనియందలి శాశ్వత సత్యము యొక్క ద్రవ్యమునకు సంతతము నూతనరూపమిచ్చి, పెంపొందించగలమో, అవియే మానవాళికి సజీవ ప్రాముఖ్యము గలవిగా కొనసాగును. తక్కినవి గతముయొక్క భవ్యస్మారకములుగానే నిలుచును గాని, వానియందు భావినిమిత్తము ఎట్టి వాస్తవ శక్తియు, సజీవప్రేరణయు నుండవు.

4. గీత సంకుచితమును విశాలము చేయును :

గీతయందు కేవలము స్థానికము (ఒకే స్థానమునకు వర్తించునది), లేక కాలికము (ఒకే కాలమునకు వర్తించునది) నైనది కడు స్వల్పము, మఱియు గీతా భావము ఎంతో ఉదారము, గంభీరము, సార్వత్రికము గనుక, ఆ స్వల్పమునుగూడ తేలికగా సార్వత్రికము చేయవచ్చును, గీతాబోధను తగ్గించకయే, బలాత్కరించకయే ఇట్లు చేయవచ్చును; పైగా నిట్లు చేయుటచేత గీతార్థము గాంభీర్యమునందును, సత్యతయందును, శక్తియందును మఱింత పెరుగును. స్వయముగా స్థానికము లేక పరిమితమునగు తన భావమునకు ఇవ్వగలిగిన వ్యాపకరూపమును గీతయే తఱచుగా మనకు సూచించును. ఉదాహరణకు, భారతదేశమునందే లుప్తప్రాయమైన ప్రాచీన యజ్ఞభావమును గైకొని, యజ్ఞమన దేవతలకు, మానవులకు మధ్య జరుగు ఆదాన ప్రదానమని చెప్పి, ఆ యజ్ఞభావమును అత్యంత సూక్ష్మము, ఆలంకారికము, సంకేతాత్మకము గావించివేయును; మఱియు నిచ్చటి దేవతాభావన స్థానికము లేక పౌరాణికము గాక, సార్వజనీనము మఱియు దార్శనికమునై యొప్పును. ఇట్లీ యుభయమును మనోవిజ్ఞాన శాస్త్రముయొక్క వ్యావహారిక సత్యమును, ప్రకృతియొక్క

సార్వత్రిక నియమమును వ్యక్తముచేయుటచేత, ఉభయమును తేలికగా సంగీకరించ వచ్చును; అంగీకరించి ప్రాణికిని, ప్రాణికిని మధ్య సాగు ఆదానప్రదానము, నైతిక యజ్ఞము, ఆత్మసమర్పణములకు సంబంధించిన ఆధునిక మనోభావములకు వానిని అన్వయించి, వాని ఆశయమును విశాలతరము, గంభీరతరము గావించవచ్చును. అపుడు యజ్ఞభావమునకును, దేవతాభావమునకును అధికతర ఆధ్యాత్మికరూపమును అధికతర దూరగామియగు సత్యప్రకాశమును ప్రాప్తించును. ఇటులే గీతయందు మఱికొన్ని భావములు గలవు - కార్యాకార్యములందు శాస్త్రము ప్రమాణము, చాతుర్వర్ణ్యము, చతుర్వర్ణముల ప్రతిపత్తియందు తారతమ్యము, ఆధ్యాత్మిక విషయములందు స్త్రీ శూద్రుల అనధికారము : ఈ భావములు ప్రధమదృష్టికి స్థానికములుగా, కాలికముగా గన్పించును. వీని శబ్దార్థమును ఎంత ఒత్తిచెప్పుదుమో, అంత గీతా బోధనను సంకుచితపఱచి, దాని విశ్వజనీనతను, ఆధ్యాత్మిక గంభీరతను తొలగించి, జనసామాన్యమునకు దాని ప్రయోజనమును పరిమితము చేసిన వారమగుదుము. కాని శబ్దముల వెనుకనున్న భావమును, ఆశయమును జూతుమేని, ఆశయము గంభీరము, సత్యము ననియు, భావము దార్శనికము, ఆధ్యాత్మికము, సార్వత్రికమునియు ఇచ్చటను మనము చూడగలము. చూడుడు : శాస్త్రమన అసంస్కృత ప్రాకృతమానవుని అహంకారచేష్టకు బదులుగా మానవజాతి తనపైతాను విధించు కొనిన నియమమని గీత తెలుపును, (ఈ అర్థమున శాస్త్రప్రామాణ్యము అపేక్షణీయమే గదా). అటులే స్వయముగా రూపాధీనముకాని ఒక ఆధ్యాత్మిక సత్యము యొక్క ప్రత్యక్షరూపమే చాతుర్వర్ణ్యమని మనము చూడవచ్చును; ఒక వ్యక్తి చేయవలసిన కర్మ అతని స్వభావమునుబట్టి యుండును, అనగా నది అతని స్వభావము యొక్క సహజగుణముచేత నిర్ణయించబడి (18-47), స్వభావముయొక్క స్వయంవ్యంజక క్రియచేత నిర్వహించబడును. "గుణకర్మ విభాగశః" (4-13). ఇట్లు చాతుర్వర్ణ్యము వెనుక ఈ ఆధ్యాత్మిక భావన యున్నది. మిక్కిలి స్థానికము మఱియు ప్రత్యేకమునై కన్పించు గీతయందలి ఇతర విషముల వెనుక సైతము నిట్టి గభీరతర భావము లుండుట నిక్కువము గనుక, వాని నన్వేషించుట మనకు న్యాయమగును.

5. గీతయందు సాంఖ్య యోగము లభిన్నములు :

ఆ కాలమునాటి దార్శనిక పరిభాషను, ధార్మిక సంకేతములను ఉపయోగించుట చేత గీతలో ప్రవేశించిన లేక దాని నావరించియున్న దార్శనిక సిద్ధాంతముతోగాని,

ధార్మికమతముతోగాని మఱియొక భావమున అనగా తార్కిక భావమున మనము వ్యవహరించబోవుట లేదు. గీత సాంఖ్య యోగములను ప్రస్తావించినపుడు (2-39) మన విచారణకు ఆవశ్యకమగు అవధులను మించి, గీతా సాంఖ్యమునకును, సంప్రదాయ సాంఖ్యమునకును గల సంబంధములనుగాని, గీతా యోగమునకును, పాతంజల యోగమునకును గల సంబంధములను గాని మనము చర్చించబోవుట లేదు. గీతా సాంఖ్యమున పురుషుడొకడే, ప్రకృతి అతని శక్తి; సంప్రదాయ సాంఖ్యమున ఈశ్వరు డుండడు, పురుషు లనేకులు, ప్రకృతి స్వతంత్రసత్త; మఱియు గీతా యోగము బహుముఖము, సూక్ష్మము, నమనీయము (flexible) కాగా, పాతంజల యోగము, శాస్త్రీయము, కఠోరము, సేశ్వరము నగును. గీతయందు సాంఖ్య యోగములు ఒకే వేదాంతసత్యముయొక్క ఏక కేంద్రాభిముఖమగు రెండు భాగములు లేక వేదాంత సాక్షాత్కారమునకు సాగిపోవు రెండు సహకారమార్గములు - ఒకటి, బౌద్ధికము మఱియు వివేచనాత్మకము, రెండవది, హార్దికము, ఆచరణరూపము, మఱియు సంధానాత్మకము; ఇది వివేచనద్వారా కాక, అనుభవముద్వారా జ్ఞానము పొందును. గీత సాంఖ్య యోగముల బోధనలలో ఎట్టి వాస్తవ భేదమును గుర్తించదు. గీత యొక్క మూలము లెట్టివైనను, దాని బోధన సార్వకాలికము, సార్వజనీనము గావున, ఆ మూలములను చర్చించ నవసరములేదు.

6. గీత చేర్చును గాని చీల్చదు :

గీతయందలి దార్శనిక విధానము, అనగా నది సత్యమును ప్రతిపాదించిన పద్ధతి తన బోధనయందలి అతిముఖ్యము, చిరస్థాయియునగు విభాగము గాదు; కాని ఈ విధానమునకు మూలద్రవ్యమగు ప్రధాన భావములు మాత్రము సర్వదా మూల్య వంతములు, ప్రామాణికములు; ఏలన ఇవి దార్శనిక బుద్ధియొక్క భావ చమత్కారములు లేక ఆకర్షక విచారణలు మాత్రమేగాక, ఆధ్యాత్మికానుభవముయొక్క స్థాయి సత్యములు, మన అత్యున్నత మనో భూమికలలో నిరూపించుకొనగల తథ్యములు; సృష్టి రహస్యమును భేదింపగోరు ప్రయత్న మేదియు ఈ తథ్యములను ఉపేక్షించ జాలదు. గీతయొక్క ప్రతిపాదనా పద్ధతి యేది యైనను, అది ఏ ప్రత్యేక దార్శనిక సాంప్రదాయమును సమర్థించుటకు గాని, ఏ యోగవిశేషమును పోషించుటకుగాని ఉద్దేశించబడలేదు. గీతయొక్క భాషాప్రయోగము, ఆలోచనారచన, భావముల సంయోగసంతులనములు సాంప్రదాయిక గురువుయొక్క తీవ్రప్రకృతికి

గాని, కఠోర తర్కముయొక్క అంతర్భావమునకు గాని చెందవు; కారణము ఇవి ఏదియో ఒక కోణము నవలంబించి, తక్కిన వానిని వెలివేయును. పరంతు గీతయందు విశాలము, నిమ్నోన్నతము, ఆలింగనాత్మకమునగు భావగతి గన్పించును: ఇది ఒకవ్యాపక, సమన్వయాత్మక మనస్సుయొక్కయు, సమృద్ధ, సమన్వయాత్మక అనుభవముయొక్కయు అభివ్యక్తియే యగును. ప్రగాఢము, వ్యావర్తకము (తక్కిన వానిని వెలివేయు నట్టిది) నగు జ్ఞానపద్ధతులను, భక్తిసాధనలను, భారతీయుల ఆధ్యాత్మికత ఎంత సమృద్ధముగా సృజించెనో, అంత సమృద్ధముగాను తనయందు విలసిల్లు మహాసమన్వయములలో గీత ప్రముఖస్థాన మాక్రమించును. గీత దగ్గరకు చేర్చి, ఏకము చేయునేగాని, దూరముచేసి విడదీయదు.

7. గీత ఏ ఒక్కటియు మాత్రమే గాదు :

సమస్త విశ్వము యొక్క అస్తిత్వమునకు ఆధారమును గీత ఒకే అవ్యయ, శుద్ధ, సనాతనాత్మయందు చూచును, అయినను అది శుద్ధాద్వైతము గాదు; అభివ్యక్త ప్రపంచమునందు సర్వవ్యాపియగు త్రిగుణ మాయను గుఱించి గీత భాషించును (7–14), అయినను గీత మాయావాదము గాదు; భగవంతునియందు తన సనాతన పరప్రకృతి యుండును, అది జీవరూపము ధరించి వ్యక్తమగను, మఱియు లయము గాక, భగవంతునియందు నివసించుటయే జీవుని ఆధ్యాత్మిక చేతనయొక్క పరమావస్థయని గీత వచించినను, అది విశిష్టాద్వైత్వము గాదు (7–5); ప్రకృతి పురుషుల సంయోగముచే జగత్సృష్టి జరుగునని గీత చెప్పినను (13–27), గీతామతము సాంఖ్యముగాదు; విష్ణుదేవుని అవతారమగు కృష్ణుడు, పరమపురుషుడనియు (7–7), సర్వలోక మహేశ్వరుడనియు, సర్వభూత సుహృదుడనియు (5–29), గీత చిత్రించును, మఱియు నీ కృష్ణునకును, నిర్విశేష బ్రహ్మమునకును ఎట్టి వాస్తవ భేదమును గాని, బ్రహ్మముయొక్క ఆధిక్యమును గాని గీత అనుమతించదు. అయినను గీత వైష్ణవమతము గాదు. ముందు వచ్చిన ఉపనిషత్తుల ఆధ్యాత్మిక సమన్వయము వలెనే ఆధ్యాత్మికము, బౌద్ధికముగూడ నగు గీతాసమన్వయము కూడ తన సర్వగ్రాహి సమగ్రతకు క్షతికలిగించు కఠోర పరిచ్ఛేదములను సహజముగనే పరిహరించును. అత్యున్నత వేదాంత ప్రమాణత్రయములో గీత యొకటిగాన, స్వమత మండనమునకును, పరమత ఖండనమునకును గీత నొక ఆయుధముగా మార్చుకొన ప్రయత్నించిన 'ప్రతివాదిభయంకర' వ్యాఖ్యాతల లక్ష్యమునకు గీతాలక్ష్యము శుద్ధ విరుద్ధము. గీత

తర్కయుద్ధమునకు ఒక ఆయుధము గాదు. అది ఆధ్యాత్మిక సత్యము మఱియు అనుభవ రూపమగు యావత్ప్రపంచముపైనను తెఱచుకొను ఒక కవాటము, మఱియు నది మనకు ప్రసాదించు దృశ్యములో ఆ పరమధామముయొక్క సర్వప్రాంతములు వచ్చివేయును. గీత ఆ ప్రాంతముల పటమును తయారు చేయునే గాని, వానిని విడగొట్టదు లేక గోడలు, కంచెలు నిర్మించి, మన దృష్టి కడ్డుతగులదు.

8. భారతీయుల ఇతర సమన్వయములు :

భారతీయ విజ్ఞానముయొక్క సుదీర్ఘ చరిత్రయందు ఇతర సమన్వయములు గూడ వెలసినవి. వైదిక సమన్వయముతో నారంభింతము : అది మానవుని మానసిక సత్తకును, దేవతల విశ్వవిశాలసత్తకును మధ్య సమన్వయము; మానవమనస్సు దివ్యజ్ఞానము, శక్తి మున్నగువానికి సంబంధించిన తన అత్యున్నతగతులయందు, భౌతిక సూర్యాదిసంకేతముల వెనుక, స్థూలచక్షువున కందని ఊర్ధ్వతర భూమికలలో విహరించు సూర్యాది దేవతలతో సంపర్కము నందుటచేత ఈ సత్తాసమన్వయము సిద్ధించినది. ఈ సమన్వయమునందు వర్ధమాన మానవాత్మయు, దేవతల దివ్య పూర్ణతయు కలిసికొని, పరస్పరము పూరించుకొనును; వైదిక ఋషుల అనుభవములో ఈ సమన్వయశిఖరము దివ్యము, అతీతము, ఆనందమయమునగు ఒక దివ్య వస్తువు. వైదికఋషుల ఈ అనుభవాగ్రమును గైకొని, ఆధ్యాత్మికజ్ఞానముయొక్క ఒక సమున్నత, గంభీర సమన్వయమును సాధించుటకు ఉపనిషత్తులు దానిని మూలము గావించుకొనును; అంతఃస్ఫురితులు, విముక్తవర్యులు నగు బ్రహ్మవేత్తలు ఫలప్రదమగు ఒక ఆధ్యాత్మిక మహాయుగము పొడవునని దేనిని చూచి, అనుభవించిరో దాని నంతను ఉపనిషత్తులు ఒక మహాసామరస్యములోనికి పొదుగును. ఇక గీత ఈ ఉపనిషత్సమన్వయమునుండి ఆరంభించి, దాని మూలభావముల ప్రాతిపదికపై, మహితసాధనములు మఱియు శక్తులు నగు భక్తి జ్ఞాన కర్మల మూడింటియొక్క మఱియొక సామరస్యమును నిర్మించును; ఈ సమన్వయము ద్వారా మానవాత్మ పరమపురుషుని సరాసరి సమీపించి, వానిలో నేకముకాగలదు. [1]తాంత్రిక మను మఱియొక సమన్వయము గలదు; ఇది అంత కుశాగ్రము, ఆధ్యాత్మికముగా అంత గంభీరము గాక పోయినను, గీతాసమన్వయముకంటెను ఎక్కువ సాహసికము,

[1]పౌరాణిక సంప్రదాయ మంతయు తనలోని సమృద్ధిని తంత్రమునుండియే గ్రహించునని మరువరాదు. – శ్రీ అరవిందుడు.

శక్తి శాలియు నగును; ఏలన అది ఆధ్యాత్మిక జీవితమునకు ఆటంకములను సైతము చేపట్టి, బలాత్కరించి, సంపన్నతర ఆధ్యాత్మిక విజయమునకు వానిని సాధనములను గావించి, జీవితము నంతను మన దివ్యపరిధియందు భగవల్లీలగా నాలింగనము చేసికొనుటకు బాటవేయును; మఱియు కొన్ని విషయములలో నిది ఎక్కువ త్వరగా పుష్టిని, ఫలితములను ఇచ్చును, ఏలన అది దివ్యజ్ఞానము, దివ్యకర్మ, మఱియు దివ్య ప్రేమతో బాటు హఠయోగ రాజయోగ రహస్యములను, శరీరోపయోగమును, మానసికతపస్యను గూడ వ్యవహారములోనికి దెచ్చి, అన్ని భూమికలలోను దివ్య జీవనమునకు ద్వారము తెఱచును; కాగా గీత హఠయోగాదికమును ప్రాసంగికముగా మాత్రమే ప్రస్తావించును. ఇంకను, తాంత్రిక సమన్వయము మానవునకు దివ్యపరి పూర్ణత సాధ్యమే యను రహస్యమును గ్రహించును; వైదికఋషులకును ఈ అవగాహన మున్నప్పటికి, మధ్యయుగములలో అది అడుగునకు బోయెను. అయినను ఈ రహస్యము మానవవిచారణ, అనుభవము మఱియు ఆకాంక్షలయొక్క ఎట్టి భావిసమన్వయమునం దైనను మహితస్థానము నాక్రమించక తప్పదు.

9. ఇంకను విపులతరసమన్వయ మావశ్యకము :

ఈనాడు మనము వికాసశీలమగు ఒక నూతనయుగ ప్రాంగణమున నిలిచి యున్నాము, ఈ యుగ మట్టి నూతన, విపులతరసమన్వయమునకు దారి తీసితీరును. మనము మూడు వేదాంతసంప్రదాయములలో నొక దానికి జెందిన కఠోర వేదాంతులము గా నవసరము లేదు, తాంత్రికులము గా నవసరము లేదు, గతమునకు జెందిన ఒక ఆస్తికమతమునకు అంటిపెట్టుకొని యుండబనిలేదు, అటులే గీతాబోధనయొక్క నాలుగుగోడల మధ్య తలదాచుకొనవలసిన పనిలేదు. అట్లు చేయుటవలన మన స్వీయ సత్తా, శక్యతలనుండి (potentialities) కాక, గతములోని వారి సత్తాస్వభావముల నుండియే మన ఆధ్యాత్మిక జీవితమును నిర్మించుటకు యత్నించినవార మగుదుము. మనము గతములోని ఉదయములకు గాక, భావియొక్క మధ్యాహ్నములకే చెందుదుము. నూతన సాధనసామాగ్రి మనలోనికి వచ్చిపడుచున్నది; భారతము యొక్కయు, ప్రపంచముయొక్కయు మహేశ్వరమతముల ప్రభావములను, పునఃప్రాప్తమైన బౌద్ధమత మూలాశయమును జీర్ణించుకొనుటయే కాక, ఆధునిక విజ్ఞానము మఱియు పరిశోధనల, పరిమితమైనను పటుతరమైన, ఆవిష్కరణలను పూర్తిగా పరిగణించవలసియున్నది; ఇంకను చచ్చి సమసిపోయిన దనుకొన్న గతము

నుండి ఎన్నో ప్రకాశమయ రహస్యములు మనపై నావిర్భవించుచున్నవి. ఇది యంతయు ఒక నూతన, సుసమృద్ధ, సువిశాల సమన్వయమును సూచించుచున్నది; మనకు ప్రాప్తించిన ఈసర్వవిషయముల సముదారమగు ఒక నూతన సామరస్యీకరణము మన భావిగతికి బౌద్ధికముగాను, ఆధ్యాత్మికముగాను – ఉభయరీతుల నావశ్యకమై యున్నది. కాని పూర్వసమన్వయములు పూర్వతర సమన్వయముల నుండి ప్రారంభించినట్లే, భావిసమన్వయమును గతమునందలి సంసిద్ధ ఆధ్యాత్మికానుభవముల మహాకాయముల నుండి ప్రభవించవలెను, అపుడే దానికి సుదృఢాధారము ప్రాప్తించును. వానియందు గీత మిక్కిలి ప్రముఖస్థానము వహించును.

10. మన లక్ష్యము :

కావున పండితునివలెనో, విద్యాలయమువలెనో గీతావిజ్ఞానమును పరీక్షించుట గీతాధ్యయనమునందలి మన లక్ష్యము గాదు, అటులే ఆధ్యాత్మికచింతనయొక్క చరిత్రయందు ఒక దర్శనశాస్త్రముగా గీతాస్థానమును నిర్ణయించుటయు మన ఉద్దేశ్యముగాదు; మఱియు శల్యపరీక్ష చేయు తార్కికునివలెను మనము గీతను విచారించబోవుట లేదు. సాహాయ్యముకొఱకు,ప్రకాశము కొఱకు మనము గీతనాశ్రయించుచున్నాము; మన లక్ష్యము దానియందలి సారభూత, సజీవ సందేశమును వేఱుపఱచి గ్రహించుటయే – మానవజాతి తన సంసిద్ధికిని, అత్యున్నత ఆధ్యాత్మిక శ్రేయమునకును అట్టి సందేశమునే అవలంబింపవలెను.

౨. దివ్య గురువు

1. గీత యొక్క విలక్షణత :

ప్రపంచములోని యితర మహామతగ్రంథములకు లేని ప్రత్యేకలక్షణ మొకటి గీతకు కలదు. ఇది క్రీస్తు, మహమ్మదు, లేక బుద్ధునివంటి సృజనాత్మక మహాపురుషుని ఆధ్యాత్మికజీవన ఫలమును గాదు, వేదము మఱియు నుపనిషత్తుల వలె కేవలాధ్యాత్మికాన్వేషణ సాగిన ఒక యుగఫలమును గాదు; ఇది భారతేతిహాసములో ఒక ఉపాఖ్యానముగా మన ముందుకు వచ్చును, ఇది తదితిహాసములోని ఒక ప్రముఖపాత్రయొక్క అంతరమథనమునందలి ఒక క్లిష్టక్షణమునుండి ఉద్భవించును- క్లిష్ట మేలన, ఇపు డతడు భయంకరము, దారుణమునగు తన జీవిత ప్రధానకర్మ నెదుర్కొనుచున్నాడు, అయితే దానినుండి పాఱిపోవలయును, లేదా దాని అంతము చూడవలయును. గీతను తర్వాత వ్రాసి, దానికి మహాభారతముయొక్క ప్రామాణికతను కట్టబెట్టుటకు గీతను దానియందు చొప్పించియుండు నని తలంచు ఆధునిక విమర్శకు విలువలేదు. ఏలన ఆ ఊహకు విరుద్ధముగా బలమైన కారణములు గన్పించుటయే గాక, దాని కనుకూలముగా గల లో వెలి సాక్ష్యాధారము మిక్కిలి స్వల్పమును, అపర్యాప్తమును. ఒకవేళ నిది పర్యాప్తమే యనుకొన్నను, గీతాకారుడు గీతోద్భవమునకు మూలమగు యుద్ధసందర్భమును పదేపదే జాగరూకతతో జ్ఞప్తికి తెచ్చును: దీని కేమి సమాధానము చెప్పెదరు?.... గీతాకారుడు దీనిని గీతాంతమున పేర్కొనుటయే కాక, గంభీరతమ తత్త్వనిరూపణమధ్యమందును దానిని తిరిగితిరిగి లేవనెత్తును. గీతాకారుని ఈ పట్టును పాటించి, గురుశిష్యులలో మఱలమఱల తలయెత్తు ఈ వ్యగ్రతకు మనము పూర్ణప్రాముఖ్యమీయవలెను. కావున గీతాబోధనను సర్వసాధారణమగు ఒక తత్త్వశాస్త్రముగానో, నైతిక సిద్ధాంతముగానో చూచిన చాలదు, మానవజీవనమునకు ఆ తత్త్వమును, నీతిని అన్వయించుటలో నుత్పన్నమైన ఒక వ్యావహారిక సంకటముతో ముడివడియున్న రూపమున దానిని వీక్షించవలెను. ఈ సంకటము దేనికి చిహ్నము? ఈ కురక్షేత్రసంగ్రామముయొక్క మర్మమేమిటి? అది అర్జునుని అంతఃసత్త నెట్లు ప్రభావితము గావించెను? గీతాభావములయొక్క కేంద్రగతిని మనము గ్రహింపగోరుదు మేని ఈ ప్రశ్నలను ముందు నిర్ణయించవలెను.

2. గురు, శిష్య సందర్భముల ఆవశ్యకత :

గంభీరతమమగు ఉపదేశసంఘాతము సామాన్యసంఘటనపై నిర్మింపబడ జాలదనుట సుస్పష్టమే; ఆ సంఘటన బాహ్యరూపము వెనుక గభీర సూచనలు మఱియు సందిగ్ధసంకటముల అఖాతములు దాగియుండ వేని, సామాన్యప్రమాణముల చేతనే ఆ సంఘటనతో వ్యవహరించగల మేని, అట్టి ఉపదేశము వెలువడదు. నిజానికి గీత యందు ఆధ్యాత్మికముగా అర్థవంతములగు మూడు ముఖ్యవస్తువులు గలవు; అవి ఆధ్యాత్మికజీవనము మఱియు మౌలిక మానవజీవనములయొక్క గంభీర సంబంధములకును, సమస్యలకును దాదాపు సంకేతములు, మూల రూపములు; నామతః అవి–గురువుయొక్క దివ్యవ్యక్తిత్వము, శిష్యునితో అతని విశిష్ట సంబంధములు, ఉపదేశ సందర్భము. గీతయందలి గురువు మానవభావములోని కవతరించిన భగవంతుడే; శిష్యుడు తన సమకాలికులలో నగ్రగణ్యుడు, ఇప్పటి భాషలో ప్రతినిధిమానవుడు, అవతారముయొక్క ఘనిష్ఠసఖుడు మఱియు అభీష్టసాధనము; ఒక మహాకార్యము మఱియు సంఘర్షములందు అతని కుడి భుజము; అయితే ఈ మహాకార్యము యొక్క నిగూఢప్రయోజనము అవతీర్ణభగవంతునికే తప్ప, అందలి పాత్రలకగోచరము, అతడే అంతటిని తెరవెనుకనుంచి నడిపించును; ఇక సందర్భము ఆ కర్మ మఱియు సంఘర్షారంభమున ఉత్పన్నమైన ప్రచండసంకటము; దీనివలన గలిగిన మనస్తాపము, నైతికవిషమత, మఱియు శస్త్రాస్త్రముల అంధప్రచండత ప్రతినిధి మానవుని లోపల కనువిప్పు గలిగింప, ప్రపంచమునందు భగవంతుడుండుట కర్థమేమిటి? మానవజీవనము మఱియు వర్తనముల గమ్యము, గతి, మఱియు ఆశయము లేమిటి?– అను సంపూర్ణ ప్రశ్నమే అతనిలో ఉదయించును.

3. సచేతనావతరణము శ్రేష్ఠావతారము :

అవతారసత్యతయందు, రూపములోనికి భగవదవతరణమునందు, మానవ భావమున పరతత్త్వావిష్కరణమునందు ప్రాచీనకాలమునుండియు భారతదేశమునకు ప్రబలవిశ్వాసము గలదు. అయితే పాశ్చాత్యలోకమున ఈ విశ్వాస మెప్పుడును మనస్సుపై ముద్రితము గాలేదు; కారణము, బహిరంగ క్రైస్తవ మతముచే అది ఆదేశరూపమున మాత్రమే, ప్రోక్తమగుటచే హేతువునందును, సార్వజనీన చేతన యందును అదెప్పుడును వేళ్లుతన్నుకొనలేదు. కాని భారతదేశమున వేదాంత దృష్టియొక్క సహేతుకపరిణామముగానే ఈ విశ్వాసము పెరిగి, జాతిచేతనలో

వేరూనియున్నది. ఉన్నది కేవలము భగవంతుడే గాన, సృష్టియంతయు అతని అభివ్యక్తియే గావలెను, అనగా అతని వాస్తవరూపముగానో, కల్పితరూపముగానో తప్ప, ఏదియు నుండజాలదు. కావున ప్రతి జీవియు అంశికముగానో, వేఱు విధముగానో నామరూపములయొక్క సాంతతలోనికి అనంతునియొక్క అవతరణమే యగును. అయితే ఇది ఆ ఆవృతాభివ్యక్తి-- తన ఆత్మ యొక్క అజ్ఞానము చేత జీవరూప భగవంతుడు ఆవృతుడై యుండును; కావున భగవద్భావమునకును, జీవభావమునకును మధ్య నెన్నో అంతస్తు లుండును. దేహి (జీవుడు) భగవదగ్నియొక్క ఒక విస్ఫులింగము, మఱియు నీ జీవాత్మ ఆత్మఅజ్ఞానము నుండి ఆత్మసత్తలోనికి పెరుగుకొలది, ఆత్మజ్ఞానమునకు విచ్చుకొనును. భగవంతుడు కూడ పైనుండి సృష్టిరూపములలోనికి తనను గుమ్మరించుకొనుచు, తన శక్తి, జ్ఞాన, ప్రేమ, ఆనంద విభూతిరూపములలో ప్రఫుల్లత నందును : ఇది భగవంతుని సాధారణావిర్భావము. కాని భగవంతుని చిచ్ఛక్తి మానవరూపమును, మానవక్రియను స్వీకరించు నపుడు, ఆ రూపమును వెనుకనుండి తన శక్తులచేతను, బాహ్యాకారములచేతను మాత్రమేగాక, తన సనాతన ఆత్మజ్ఞానమునుండియు సరాసరి అధిష్ఠించి, నడుపును; ఈ అజుడగు భగవంతుడు (4-6) మానసికసత్త మఱియు జన్మాభాసముయొక్క చట్రమునందు తన స్వరూపము నెఱింగియుండియే వ్యవహరించును: ఇది దేశకాలబద్ధమైన భగవదభివ్యక్తికి పరాకాష్ఠ ; ఇది పూర్ణము, సచేతనము నగు భగవదవతరణము, అవతార మన నిదియే, ఇతడే.

4. సనాతనావతారము × అభివ్యక్తావతారము :

అవతారభావనకు అత్యధికప్రాముఖ్య మిచ్చు వైష్ణవవేదాంతము మానవుని యందు గల భగవంతునికి భగవంతునియందు గల మానవునితోడి సంబంధమును నర-నారాయణుల ద్వివిధరూపమున వ్యక్తముచేయును - చారిత్రకముగా నీ నర-నారాయణులు గీతకు మిక్కిలి దగ్గరగా నుండు మఱియొక మతసంప్రదాయము యొక్క మూలపురుషులుగా దెలియవత్తురు. ఆధ్యాత్మికముగా నరుడు మానవాత్మ, భగవంతునియొక్క నిత్యసఖుడు, ఇతడీ సఖ్యమునకు కన్ను తెఱచి, గీతాభాషలో, నెపుడు భగవంతునియందు నివసింపసాగునో (12-8); అపుడు తనను దాను కనుగొనును. ఇక నారాయణుడు మానవభావమున సదా ఉపస్థితుడై యుండు

దివ్యాత్మ; ఇతడు మానవుని రహస్యగురువు, సుహృదుడు, సహాయకుడు, "ప్రాణుల హృదయములోపల నాసీనుడైయుండు ప్రభువు" (18-61). మన లోపలి ఈ నిగూఢ గర్భాలయమును వేలుచేయుచున్న తెర తొలగించబడి నపుడు, మానవుడు ముఖాముఖి భగవంతునితో భాషించును, అతని వాణిని ఆలకించును, అతని వెలుగును స్వీకరించును, అతని శక్తి యందు కర్మచేయును, మఱియు నిపుడు అజ, సనాతనుడగు భగవంతునిలోనికి దేహధారియగు మానవుని పరమోద్ధరణము సాధ్యమగును. ఇపు డతడు భగవంతునిలో నివసించు తన సర్వచేతనను అతనిలోని కర్పించి వేయ సమర్థు డగును. దీనినే గీత ఉత్తమ లేక పరమ రహస్యమని తలంచును (4-3). కొందరు తమ మానవభావమునందే నివసించుచు, తమను అనుప్రాణితము చేయుచు నడుపుచున్న దివ్యవిజ్ఞానము (Gnosis) యొక్క కొంచెము శక్తి, ప్రకాశము, లేక ప్రేమను బొంది ప్రపంచమున నాయకు లగుదురు; అటుగాక, మానవునియందలి భగవంతుడు మానవచేతనను [1]ఆంశికముగనో, పూర్ణముగనో ఆవహించి, ప్రత్యక్షరూపమున జగద్గురువు, ఆచార్యుడు, నాయకుడు నై, తన దివ్య విజ్ఞానము నుండియే ఎపుడు సరాసరి వ్యవహరించునో, అపు డతడు అభివ్యక్తావతారము (16-వ వ్యాసమున అభివ్యక్తావతారయొక్క స్థాయిని మఱియొక మెట్టు పెంచును) లోపలి భగవంతుడు నారాయణాఖ్యుడగు మానవునియందలి నిత్యావతారము; మానవ రూపమున అతని అభివ్యక్తి బాహ్యజగమున అతని సంకేతమును, వికాసమును అగును.

5. లోపలి కృష్ణుడే మనకు ముఖ్యుడు :

అవతారతత్త్వము నిట్లు అర్థముచేసికొని నపుడు, మన ప్రస్తుతవిషయమగు గీతా, మూలబోధన నిమిత్తము గాని, సామాన్యముగా ఆధ్యాత్మికజీవనము నిమిత్తము గాని, అవతారముయొక్క బాహ్యరూపమునకు గౌణప్రాముఖ్యము మాత్రమే గలదు. క్రీస్తు చారిత్రకతను గుఱించి యూరోపులో చెలరేగిన వాదవివాదము అంతర్దృష్టిగల భారతీయునికి కాలమును వృథాచేయుటయే యనిపించును; అతడు దానికి కొంత చారిత్రకమూల్యమునే యిచ్చును గాని, దాదాపు ఎట్టి మతప్రాముఖ్యమును ఇవ్వడు. ఆధ్యాత్మికానుభవముచేత అంతఃక్రీస్తు నెఱుంగగలిగి, అతని బోధనాప్రకాశమున

[1] చైతన్యప్రభు విట్లు ఆవహింపబడుచుండెను. – శ్రీఅరవిందుడు.

పైకెగసి జీవించుచు, శిలువ చిహ్నముగా గల [2]ప్రాయశ్చిత్తముచే నిమ్న ప్రకృతి బారినుండి తప్పించుకొనగలిగినచో, బాహ్యముగా జోసెపు అను వడ్రంగికి ఏసు నామమున ఒకరు పుట్టెనో, లేదో, దానితో మనకేమి ప్రయోజనము? అటులే మనకు ముఖ్యముగా కావలసిన కృష్ణుడు భగవంతుని సనాతనావతారముగా లోపల నున్న కృష్ణుడే గాని, మానవులకు చారిత్రక గురువు, నాయకుడు నైన కృష్ణుడు గాడు.

6. చారిత్రక కృష్ణుడును సత్యమే :

కావున గీతాశాస్త్రసారము నన్వేషించుటలో, కురుక్షేత్రమున పార్థసారథిగా, అర్జునుని గురువుగా మహాభారతము మన ముందుకు దెచ్చుచున్న మానవ–దివ్య కృష్ణునియొక్క చారిత్రకసత్యముతో గాక, ఆధ్యాత్మికమర్మముతోనే మనకు ప్రమేయము. అయినను చారిత్రకకృష్ణుడు నిస్సంశయముగా సత్యము, మున్ముందు కృష్ణనామము మనకు ఛాందోగ్యోపనిషత్తులో తగులును, అచ్చటతడు బ్రహ్మవేత్తగా ఆధ్యాత్మిక సంప్రదాయమున సుప్రసిద్ధుడు. అదే ఉపనిషత్తులో విచిత్రవీర్యుని పుత్రుడగు ధృతరాష్ట్రనృపతి కూడ పేర్కొనబడును. ఇక వీ రిరువురు మహాభారత వ్యవహారమున ప్రముఖ పాత్రలు గావున, వీరు సమకాలికు లనియు, మహాభారత మహాకావ్యము చారిత్రక పాత్రతోను, జాతిస్మృతిపై దృఢముగా ముద్రించుకొనిన చారిత్రక యుద్ధము తోను వ్యవహరించుచున్నదనియు మనమొక నిర్ణయమునకు రా వచ్చును. క్రీస్తుపూర్వ శతాబ్దులయందు కృష్ణార్జునులను మతపరముగా పూజించుచుండిరనియు మనకు దెలియును; ఆ మతమొక ధార్మిక, దార్శనిక సంప్రదాయ మని తలంచుటకు కారణము గలదు; ఈ సంప్రదాయమునుండియే గీత తన సూత్రములలో బెక్కింటిని, తన జ్ఞాన భక్తి కర్మసమన్వయము యొక్క మూలమును సైతము సేకరించియుండవచ్చును; మఱియు మానవకృష్ణు డీ సంప్రదాయముయొక్క స్థాపకుడు లేక పునరుద్ధారకుడు, లేక కనీసము దాని ప్రథమగురువులలో నొక రని తలంచుటకును ఆధారము గలదు. గీతయొక్క రూపము తర్వాత మాఱినను, అది భారతీయ చింతనాపరంపర యందు చారిత్రక కృష్ణోపదేశముయొక్క పరిణామమునే తెలుపును, మఱియు కృష్ణునితోను, అర్జునునితోను, కురుక్షేత్ర సంగ్రామముతోను ఆ ఉపదేశము యొక్క సంబంధము నాటకీయ కల్పనను మించిన సత్యమే యగును. మహాభారతమునందు శ్రీకృష్ణుడు

---

[2]Atonement =ప్రాయశ్చిత్తము. కాని At+one+ment = ఏకత్వస్థితి. పై కెగసి క్రీస్తుతో ఏకత్వస్థితి నందుటకు అడ్డువచ్చుదానిని శిలువవేయుటే ఆధ్యాత్మిక ప్రాయశ్చిత్తము.

ఉభయధా - చారిత్రకపాత్రగాను, భగవదవతారముగాను చిత్రించబడును; కావున భారతకావ్యము వ్రాయబడు నాటికే - స్పష్టముగా క్రీస్తుపూర్వము 5-1 శతాబ్ధము నాటికేశ్రీకృష్ణుని ఉపాసనయు, అవతారత్వమును వేరూనియుండును. మఱియు బృందావనమున కృష్ణుని బాల్యజీవనకథ లేక గాధయొక్క సూచనయు మహాభారతమున గలదు. ఈ బాల్యజీవనము శక్తి శాలియగు ఆధ్యాత్మికసంకేతముగా పురాణముల యందు పెంపొంది, భారతీయుల ధార్మిక చిత్తమున తన ప్రభావము నెంతగానో బలిపినది. హరివంశగ్రంథమునందును కృష్ణుని వృత్తాంతము గన్పించును; గాధామయముగా నున్నను, ఇదియే పురాణ కధనములకు ప్రాతిపదికగా నుండి యుండును.

7. హృదయస్థావతారమునకే ప్రాముఖ్యము :

దీని కంతకు విశేష చారిత్రకప్రాముఖ్య మున్నను, మన ప్రస్తుతకార్యమున దీనికెట్టి విలువయు లేదు. గీత మనముందుంచు దివ్యగురువు యొక్క ఆంతర రూపముతోను, జీవుని ఆధ్యాత్మిక ప్రబోధమునకు ఆ రూపము నుండి ప్రసరించు శక్తితోను మాత్రమే మనకు ప్రమేయము గలదు. మానవరూప అవతారత్వమును గీత ఆమోదించును; ఏలన "నా కెన్నియో జన్మలు గడచినవి (4-5), యుగయుగమున నేను జన్మింతును (4-8)" - అని భగవానుడు తెలుపుచున్నాడు. అతడు సనాతనుడయ్యును, అజుడయ్యును తన మాయచేత సంభూతి నియమములను - పుట్టుట, పెరుగుట, మున్నగు భావములను - స్వీకరించును; దీనినే జన్మ యందుము. ఇచ్చట మాయ యన బాహ్యముగా పరిమితరూపముల చొక్కాను ధరించగల అనంతచేతన యొక్క అద్భుతశక్తి, కాని గీత ఒత్తి చెప్పునది ఈ బాహ్య రూపము గాదు; అతీత, విశ్వగత, ఆంతరభగవంతుడు, అనగా సర్వభూతములకు మూలము, సర్వ భూతములకు నియామకుడు (5-29), గోప్యముగా మానవునిలోపల హృదయస్థుడునగు భగవంతుడు. ప్రచండ, ఆసురిక తపస్య చేయువాడు లోపలనున్న నన్ను వేధించును (17-6); మానవశరీరమునందు నివసించుచున్న నన్ను అవమానించువారు పాపులు (9-11); హృదయస్థుడైన నేను భక్తుల అజ్ఞానాంధకారమును సముజ్జ్వల జ్ఞానదీపముచే నాశముజేతును (10-11) - అని చెప్పినవాడాంతర భగవంతుడనియే అర్థము. కావున గీతయందు మానవాత్మతో, తాను ధరించిన ప్రత్యక్ష రూపముద్వారా భాషించునది మానవునిలోపలి ఈ భగవంతుడే, హృదయము

నందలి సనాతనావతారమే : ఇతడు జీవితార్థమును, దివ్యకర్మరహస్యమును తెల్లము చేయును, దివ్యజ్ఞానము మఱియు నుపదేశముల వెలుగు నిచ్చును; మఱియు మానవాత్మ ప్రపంచ గుహ్యము నెదుర్కొని, తెన్ను గానక పరితపించు నపుడు అతనికి బలవిశ్వాసములనిచ్చు పలుకు పలుకును. విగ్రహముద్వారా గాని, అవతారముల నుపాసించుట ద్వారా గాని, గురువును లోపలి గురువునకు ప్రతినిధిగా భావించి, పూజించుటచేతగాని భారతీయుల ధార్మికచేతన ఈ ఆంతర భగవంతునే సమీపింపగోరుచున్నది. వీనిద్వారా అంతర్వాణికి మేల్కొని, అరూపుని రూపమును ఆవిష్కరించుకొని, అపుడు అభివ్యక్తమగు దివ్యశక్తి, ప్రేమ, జ్ఞానములతో భక్తుడు సరాసరి వ్యవహరింప ప్రయత్నించును.

8. కృష్ణసారథ్యముయొక్క మర్మము :

రెండవ విశేష మేమన, మానవకృష్ణుడు. భారతమహాయుద్ధమునకు బాహ్యముగా నాయకత్వము వహించక, దాని వెనుక దాని రహస్యకేంద్రముగా నుండి, అజ్ఞాతరూపమున దానిని నడుపును; కృష్ణుని సారథ్యము, కత్తి పట్టని సారథ్యము ఈ సత్యమునకు లక్షణము, ప్రాయః సంకేతము కూడను. ఆ యుద్ధము వ్యక్తులు, జాతులు – అందరు పాల్గొనిన ప్రపంచమహాయుద్ధము. వారిలో కొందరు స్వీయ లాభము లేకయే ఒక ఉద్యమసహాయకులుగా పాల్గొన్నవారు, వీరికి మానవ కృష్ణుడు నేత యగును: కొందరు ఆ ఉద్యమ విరోధులుగా పాల్గొన్నవారు, వీరికి కృష్ణుడును విరోధియే; అతడు వీరి వ్యూహములను తాఱుమాఱుచేసి, వారి సంహారకుడగును; వీరికి కృష్ణుడు ప్రాచీనవ్యవస్థకు నిప్పుపెట్టు అధర్మప్రేరకుడుగా గూడ గన్పించును. మఱికొందరు ఉద్యమపూర్తికి ప్రతినిధులుగా యద్ధమున పాల్గొనిన వారు. వీరికి కృష్ణుడు సచివుడు, సహాయకుడు, మిత్రుడు. ఎచ్చట ఉద్యమకర్మ తన సహజగతి ననుసరించునో, లేక ఎచ్చట శత్రువులు పెట్టు బాధలవలన తన పక్షము వారు అగ్నిపరీక్షలకు లోనై, తద్వారా తర్వాతి ప్రభుతకు సిద్ధముకావలసి యున్నదో, అచ్చట కృష్ణుడు కన్పించడు; లేక ఇంచుక ఓదార్చుటకు మాత్రమే కన్పించును; కాని ప్రతిసంకటమునందును అతని అదృశ్యహస్తము అనుభూతమగును (ద్రౌపదికి వలువ లిచ్చిన హస్తము); అయితే అది అదృశ్య మగుటచేత సర్వులు స్వయముగా కార్యకర్తల మనియే ఊహించుకొందురు గాని, ఉపకరణమాత్రము లని కాంచరు. కృష్ణుని ప్రాణమిత్రుడు, ప్రధాన ఉపకరణము నగు అర్జునుడు సైతము దీనిని

గాంచడు, తన దివ్యసఖుని యథార్థరూపము నెఱుంగడు. అర్జునుడు కృష్ణుని జ్ఞానము నుండి హితోపదేశమును, అతని శక్తినుండి సాయమును పొందినప్పటికి, అతనిని ప్రేమించి, ప్రేమించబడి నప్పటికి, అతని దివ్యస్వరూపము తెలియకయే సాక్షాదారాధించి నప్పటికి, అర్జునుడు కృష్ణునిచేత చివరవఱకు అందరివలెనే తన అహంకారము ద్వారానే నడుపబడును. పరిస్థితులు విషమించి, సర్వము కురుక్షేత్రమున భయంకర సంగ్రామరూపము ధరించగా, తనతోబాటు యుద్ధభవితవ్యమును గూడ వహించు రథమునందు, ఇప్పటికిని యోద్ధగా గాక, సారథిగానే కృష్ణుడు పాదముపెట్టు చివరి క్షణపర్యంతము, అతడు తాను ఎన్నుకొనినవారికి గూడ తనను ప్రకటించుకొనలేదు.

9. సమస్త క్రియయు దివ్య గురుపరిధిలోనిదే :

ఇట్లు మానవజాతితో (లోపలి) భగవంతుని వ్యవహారమునకు మానవ కృష్ణుడు ప్రతీక యగుచున్న ట్లుండును; ఏలన మనలను మన అహంకారాజ్ఞానముల ద్వారా లోని భగవంతుడు నడుపునట్లే, బాహ్యకృష్ణుడు అర్జునాదులను చివరి క్షణము వఱకు తమ అహంకారాజ్ఞానములద్వారానే నడిపెను. ఇందుచేత మన కర్మలకు మనమే కర్తల మనుకొందుము, మన ఫలములకు మనమే కారణ మని గర్వింతుము; ఇక మన కర్మప్రేరణను గుఱించియు మన కేమియు తెలియనట్లే : ఏదియో ఒక వెలుగు లేక శక్తి ఆ ప్రేరణమూలమని మన కెప్పుడైనను అస్పష్టముగా తోచు చుండును, ఒకొకప్పుడు ఆ మూలము మానవమూలమే యనియు ననిపించును (కృష్ణు దర్జునునకు మానవుడే యనిపించెను). ఆ మూలస్వరూపము తెలియకయే దానిని ఆరాధింతుము గూడ. బాహ్యరూపము వెనుక నున్న స్వరూపమును–విశ్వరూపమును – గాంచి చకితుల మగువఱకు నిట్లే కొనసాగుదుము. మఱియు ఆంతర జీవనవిషయమునందే గాక, సమస్తజీవనక్రియయందును అవతార భగవంతుడు వ్యవహరించును, మనకు అంతుబట్టని ప్రపంచముయొక్క అస్పష్టగతికి సంబంధించిన సమస్యలను గూడ అతడు చేపట్టును. లౌకిక కర్మకు సంబంధించిన క్లిష్ట సమస్యను పరిష్కరించు సందర్భమునుండియే గీతోపదేశము వెలువడును, అదియే దాని వైశిష్ట్యము, కనుకనే గీత యందు కర్మసిద్ధాంతము ప్రముఖముగా, ప్రోన్నతముగా గాన వచ్చును; కర్మపై నిట్టి అవధారణ ఇతర భారతీయశాస్త్రములందు గన్పించదు. గీతయందే గాక, భారతమున ఇతరప్రకరణములందును కృష్ణుడు కర్మావశ్యకతను

గట్టిగా ప్రవచించును, కాని గీత యందు మాత్రమే అతడు కర్మరహస్యమును, మన కర్మవెనుక నున్న దివ్యమూలమును ప్రకటించును.

10. గీతాగురువు కర్మాధీశ్వరుడు :

కృష్ణార్జునులకు, అనగా దివ్యాత్మమానవాత్మలకు గల సంకేతరూప సఖ్యము ఇతర భారతీయగ్రంథములందును వర్ణింపబడినది- 1. ఇంద్రుడును, కుత్సుడును ఒకే రథమునం దాసీనులై స్వర్గమునకు పయనింతురు, 2. కఠోపనిషత్తునందు ఒకే వృక్షముపై నివసించు రెండు పక్షుల సంకేతము (symbol) గలదు, 3. జ్ఞానార్థము కలిసి తప మొనరించు నర నారాయణ ఋషుల యగళరూపములు. ఈ మూడు రూపకములందును, దేనియందు, గీత ననుసరించి (4-33), సర్వకర్మయు పరిసమాప్తి నందునో, అట్టి జ్ఞానమే లక్ష్యము; కాని గీతయందు కృష్ణార్జునుల సఖ్యమునకు లక్ష్యము జ్ఞానమునకు దారితీయు కర్మ, మఱియు దివ్యజ్ఞాతయే ఇచ్చట కర్మ క్షేత్రమున ప్రత్యక్షమగును. ఇచ్చట కృష్ణార్జునులు - దేవుడు మఱియు మానవుడు - ఒక ప్రశాంతాశ్రమమున ధ్యానముచేయుచు గాక, భీషణయుద్ధరంగమున శస్త్రాస్త్ర సంఘట్టనముల మధ్య, సంగ్రామరథమున సారథిగాను , రథిగాను కలిసి దర్శన మిత్తురు. కావున గీతగురువు జ్ఞానప్రపంచమున మాత్రమే తనను ఆవిష్కరించుకొను మానవునియందలి భగవంతుడే గాక, మన కర్మప్రపంచము నంతను నడుపు మానవునియందలి భగవంతుడును అగును; ఇతని చేతనే, ఇతని నిమిత్తమే మన మానవజాతి యంతయు మనుచున్నది, పెనగుచున్నది మఱియు శ్రమించుచున్నది; ఇతని దిశగానే మానవజీవన మంతయు పయనించుచున్నది, పురోగమించుచున్నది. ఇతడు కర్మయజ్ఞముల రహస్యప్రభువు, సర్వమానవుల నిరపేక్షసుహృదుడు.

3. మానవ శిష్యుడు

1. దివ్యగురు రేఖాచిత్రము :

కావున గీతయొక్క దివ్యగురు వట్టివాడు, సనాతానావతారము, మానవ చేతనలోని కవతరించిన భగవంతుడు, సర్వభూతముల హృదయమునం దాసీనుడైన ఈశ్వరుడు (18-61); తన సత్త యందు తాను అభివ్యక్తముచేసిన ప్రపంచ మహాక్రియను దృశ్య, స్పృశ్యములగు రూపములు, శక్తులు, మఱియు ప్రవృత్తుల తెరవెనుకనుండి అతడు నడుపును; అటులే వ్యక్తిగతముగా తెరవెనుకనుండి మన సమస్తచింతన, క్రియ మఱియు హృదయాన్వేషణలను త్రిప్పుచుండును. మన మీ తెరను చీల్చి వేసి, మన బాహ్యాత్మవెనుక నున్న (దివ్యగురురూపమగు) ఈ వాస్తవాత్మను పొంద గలిగి నపుడు, మన సత్తయొక్క ఈ సత్యప్రభువునందు మన సమస్తసత్తను చూడగలిగి నపుడు, ఏకమాత్రము, వాస్తవము నగు ఈ పురుషునికి, పురుషునిలోనికి మన వ్యక్తిత్వమునంతను సమర్పించివేయగలిగి నపుడు, సదా చెదరిపోవుచు, తిరిగి సదా కూడుకొనుచు నుండు మన మానసిక క్రియలను ఇతని పూర్ణప్రకాశములో లీనముచేయగలిగి నపుడు, చంచలము, ప్రయాసగ్రస్తము నగు మన సంకల్పమును, చేష్టలను ఇతని వ్యాపక, జ్యోతిర్మయ, అవిభక్త మహాసంకల్పమునకు నివేదించ గలిగి నపుడు, మన విక్షిప్త, బహిర్ముఖ కామనలు, మఱియు భావావేగములను ఇతని స్వయంసిద్ధానందముయొక్క పూర్ణతలో సన్యసించి,ఆ సన్యాసముచేతనే వానిని తృప్తి పఱచగలిగినపుడు-అపుడు మన ఊర్ధ్వముఖ ప్రయత్నముయొక్క క్లేశమంతయు సంతృప్త సాఫల్యము నందు ఉపశమించును. ఇతడే జగుద్గురువు; ఇతరుల అత్యున్నతోపదేశ మంతయు ఇతని సనాతన జ్ఞానము యొక్క వివిధ ప్రతిబింబములు మఱియు ఆంశికవచనము మాత్రమే; ఇతని వాణికే మన ఆత్మశ్రుతి మేల్కొనవలెను.

2. అర్జునుడు ప్రతినిధి మానవుడు :

అర్జునుడు, యుద్ధరంగమున ఉపదేశమును బొందు శిష్యుడు, ఈ భగవద్భావనకు ప్రతిరూపము; ఇతని కింకను జ్ఞాన మబ్బలేదు, కాని జ్ఞాన మబ్బుటకు అర్హత గడించిన సాధకమానవుల కితడు ప్రతినిధి (నమూనా) - మానవునియందలి ఉన్నత దివ్యాత్మతో సన్నిహిత సఖ్యము గలిగి ప్రపంచమునందు కర్మ చేయుటచే నితని కీ అర్హత అబ్బినది. గీతయు, గీతకు మాతృకయగు మహాభారతము సైతము

అంతర జీవనమును చిత్రించిన ఒక రూపకము, వీనికి బాహ్యమానవజీవనము మఱియు క్రియతో నెట్టి సంబంధము లేదు; అంతరాత్మకును, మన లోపల మనపై నధికారము కొఱకు పెనగులాడు శక్తులకును మధ్య జరుగు యుద్ధములను మాత్రమే అవి తెలుపును – అని వ్యాఖ్యానించు ఒక పద్ధతి గలదు. మహాభారతముయొక్క సామాన్య స్వభావము గాని, వాస్తవభాష గాని యీ దృష్టిని పోషించదు, మఱియు దీనికే ప్రాముఖ్యమిత్తు మేని, ఇది గీతయొక్క సరళ, దార్శనికభాషను క్లిష్టము, అయోమయము గావించును, వేదభాషయు, కొంతవఱకు పురాణభాషయు సంకేతాత్మకమై, తెరవెనుక నుండు సూక్ష్మవస్తువుల రూపకములతోను, స్థూలచిత్రణల తోను నిండియుండును; కాని గీత స్పష్టపదములలో వ్రాయబడి, మానవజీవితము లేవనెత్తు పెద్దపెద్దనైతిక, ఆధ్యాత్మిక కఠినతలను పరిష్కరింప ప్రతిజ్ఞచేయును. కావున స్పష్టమగు గీతాభాషను, భావమును విఱిచివిఱిచి, మన కల్పనను బోషించుకొనుట భావ్యముగాదు. కాని ఈ దృష్టిలో ఈమాత్రపు సత్యమున్నది : గీతాసిద్ధాంత సన్నివేశము (లోపలి విషయమును సూచించు) ఒక సంకేతము గాకపోయినను, అది (అందరికి వర్తించు) ఒక ఆదర్శము (నమూనా); అట్లుగానిచో సన్నివేశమునకు, సిద్ధాంతమునకు నెట్టి సంబంధము నుండదు. అర్జును డిచ్చట జనులు, జాతులు పాల్గొనుచున్న ఒక ప్రపంచ మహాసంగ్రామముయొక్కయు, భగవంతుడే నడుపుచున్న ఒక మహోద్యమముయొక్కయు ప్రతినిధిమానవుడు. కర్మప్రధాన మానవులు ఒకొకపుడు తమ కర్మ విషయమున అత్యుత్కట, అతిభీషణ సంకటములో బడి, జీవనసమస్య నెదుర్కొందురు, ఆధ్యాత్మికస్థితితో, లేక కేవల నైతికాదర్శముతో సైతము జీవనమునకు గల బాహ్యవిరోధమువలన భ్రాంతచిత్తు లగుదురు : అట్టి వారికి అర్జును డాదర్శము.

3. అర్జునుడు కర్మియే గాని మౌని గాడు :

దివ్యకృష్ణుడు సారథి కాగా, నదే రథమున అర్జునుడు యోధుడు, వేదము నందును మన కీ రూపకము (image) తగులును : మానవాత్మయు, దేవుడును ఒకే రథమున స్వారిచేయుచు, యుద్ధముద్వారా ఒక సమున్నతాకాంక్షాగమ్యమునకు పురోగమింతురు. కాని అచ్చ టీ పయనము ఒక శుద్ధ అలంకారము మఱియు సంకేతము. అచ్చటి దేవుడు ఇంద్రుడు, ప్రకాశము మఱియు అమృతత్వముల లోకమునకు అధిపతి; దివ్యజ్ఞానశక్తియగు ఈ ఇంద్రుడు అనృతము, అంధకారము,

పరిమితత్వము, మర్త్యత్వముల సంతానముతో యుద్ధము సలుపుచున్న మానవ సాధకుని సాహాయ్యార్థము దిగివచ్చును; ఇచ్చటి యుద్ధము మన సత్తయొక్క ఊర్ధ్వలోక మార్గమున కడ్డువచ్చు ఆధ్యాత్మికశత్రువులతో; ఇక దీని గమ్య మొక సువిశాలసత్తా భూమిక, ఇది పరమసత్యముయొక్క తేజోవిరాజమానము, ఇంద్రపాలితమును; సంసిద్ధి బొందిన అంతరాత్మ ఇచ్చట సచేతనామృతత్వ మనుభవించును. పోగా ఇచ్చటి మానవాత్మ కుత్సుడు, అనగా శబ్దార్థమును బట్టి, ఋషి-జ్ఞానము నపేక్షించు సాధకుడు; ఇతని తండ్రి అర్జునుడు-తెల్లనివాడు, తల్లి స్విత్ర - తెల్లనిది; అనగా నీ కుత్సుడు సాత్త్వికము మఱియు ప్రకాశపూర్ణమునగు అంతరాత్మ, ఇట్టి ఆత్మ దివ్యజ్ఞానముయొక్క సంతత వైభవమునకు ఉన్మీలితమై యుండును. చివరకు ఆ రథము ప్రయాణాంతమగు ఇంద్రునిస్వధానము చేరొకొని నపుడు, కుత్సుడు తన దివ్యసఖునితో సంపూర్ణసాదృశ్యములోనికి పెరిగియుండును; వీరిని, వీరు వీరని తెలిసికొన ఇంద్రుని సతియగు ఒక్క శచీదేవికే సాధ్యము, ఏలన ఆమె "ఋత-చేతన" (truth-conscious). ఈ రూపకవిషయము స్పష్టముగా మానవుని ఆంతర జీవనము; ప్రవర్ధమాన జ్ఞానప్రకాశముచేత మానవుడు సనాతన భగవంతుని సాదృశ్యములోనికి పెరుగుట నీ రూపకము తెలుపును. కాని గీత కర్మనుంచి ఆరంభించును, మఱియు నర్జునుడు కర్మి గాని, జ్ఞానికాడు; యోద్ధ గాని, ముని లేక మేధావి గాడు.

4. అర్జునుని కర్మిస్వరూపము ఆదినుండియు స్పష్టమగును :

గీతారంభమునుండియు శిష్యుని ఈ ప్రత్యేకస్వభావము సూచింపబడి. మఱల మఱల చెప్పబడును. తాను ఆచరించవలసిన ఘోరసంహారభావమునకు అతడు వేల్కొనిన రీతియందును, అతని మనస్సులో నుదయించు అనంతర ఆలోచనలందును, సర్వానర్థమునుండియు అతనిని విముఖుని గావించిన దృక్కోణము మఱియు మానసికప్రేరణలయందును అతని స్వభావము తొలుత వ్యక్తమగును. ఆ ఆలోచనలు, దృక్కోణము, ప్రేరణలు అట్టి జీవనసమస్య నెదుర్కొనిన ఒక దార్శనిక లేక గంభీర మననాత్మక లేక ఆధ్యాత్మిక స్వభావమునకు జెందవు. ఇవి వ్యావహారిక లేక ఫలపరాయణ మానవునికిని, భావిక, ఇంద్రియాధీన, నైతిక, మఱియు బౌద్ధిక పురుషునికిని జెందు నని చెప్పవచ్చును; ఇట్టి మానవుడు గంభీర, మౌలికచింతనకు గాని, లోతులను కనిపెట్టుటకు గాని అలవడియుండడు, ప్రత్యుత ఉన్నతము కాని

రూఢమగు ఆలోచనాప్రమాణములకును, మార్పులు మఱియు కష్టములను ఆత్మ విశ్వాసముతో దాటుటకును అలవడియుండును. మఱియు తన ప్రమాణములు తనకిపుడు పనికిరాలే దనియు, తనయందును, తన జీవితమునందును తనకు గల విశ్వాసాధారము ఒక దెబ్బతో కొట్టివేయబడిన దనియు అత డిపుడు కనుగొనును. ఇదియే అతనిని పైకొనిన సంకటస్వరూపము.

5. అర్జునుడును గుణాధీనుడే :

గీతభాషలో, నర్జునుడును, జనసామాన్యమువలె, గుణాధీనుడు మఱియు అలవాటుచొప్పున, యథారీతి వాని క్షేత్రమునందే చరించును. అయితే అతడు విశుద్ధుడు, సాత్త్వికుడునై, ఆ మేరకు తన పేరును సార్థకముచేసికొనును, అనగా ఉన్నత, విస్పష్ట సూత్రములు మఱియు ప్రేరణలచే పాలింపబడుచు, తా నెఱింగిన ఉదారతమ ధర్మముచే తన నిమ్నప్రకృతిని అభ్యాసవశమున నియమించుకొనును. అతనిది ఉద్దండ ఆసురప్రకృతి గాదు, అతడు తన ఆవేగముల దాసుడు గాడు; తాను బొందిన శిక్షణవలన నతడు శాంతుడు, దాంతుడు; తన విధులను తుచ తప్పకుండ ననుష్ఠించును; తన కాలము మఱియు సమాజముయొక్క ఉత్తమసిద్ధాంతములకును, తనకు ఉగ్గుబాలతో నబ్బిన మతము మఱియు నీతిసూత్రములకును దృఢ విధేయుడుగా నుండును. అతనికిని ఇతరులకువలెనే అహంకార మున్నది, కాని అది సాత్త్విక మగుటచే, కేవలముగా లేక ప్రధానముగా తన ప్రయోజనములు, కామనలు, మఱియు నా వేగములనే గాక, నైతికధర్మమును, సమాజమును, ఇతరుల అధికారములను గూడ పాటించును-నైతిక, సామాజికనియమావళిరూపమగు శాస్త్రము ననుసరించి అతడు జీవించును, వర్తించును. అతడు శిరసా వహించు ప్రమాణము 'ధర్మము' - ధర్మ మన మతపర, సామాజిక, నైతిక ప్రవర్తనా నియమమునకు సంబంధించిన భారతీయుల సామూహికభావన; విశేషించి, ధర్మ మన క్షత్రియ వర్ణముయొక్క పదవి మఱియు కర్మకు వర్తించు నియమము. క్షత్రియుడగు అర్జునుడు ధీరుడు, సంయతుడు, ఉదారుడగు రాజపుత్రుడు మఱియు యోధుడు, ఆర్య జాతినాయకుడు. ఈ క్షాత్రధర్మము ననుసరించుచు, సద్గుణసదాచారముల నెఱింగి, అత డింతవఱకు వచ్చి, అదే ధర్మ మిపుడు తన నొక మహోగ్రసంహారమునకు ప్రధానపాత్ర గావించినదని అకస్మాత్తుగా కనుగొనును - ఈ వికరాళ అంతర్యుద్ధము నందు

5

సంస్కృతిసంపన్న ఆర్యజాతులన్నియు పాల్గొనుచున్నవి. ఇది పురుషపుంగవుల నందరిని తప్పక సర్వనాశన మొనరించును, దీనివలన వారి వ్యవస్థితనాగరికతకే కల్లోలవినాశముల ముప్పు గలుగును.

6. ఇంద్రియముల ద్వారా అర్థ స్ఫూర్తి :

అర్జునుడు కర్మప్రధానమానవు డనుటకు మఱియొక లక్షణ మేమన, తన కర్మయొక్క అర్థము అతనికి ఇంద్రియ సంవేదనలద్వారా స్ఫురించును. ఎట్టి గంభీరతరాశయముతోను గాక, సగర్వముగా అధర్మపరులను తేఱిపాఱజూచి, ఆహవఖేల యందు వారిని తుదముట్టించు కోరికతోనే ఉభయసేనల మధ్యన రథము నిలుపు మని అర్జునుడు తన సారథి నభ్యర్థించును. అట్లు తేఱిచూచునపుడే, అంతర్యుద్ధము యొక్క అర్థము అతనికి ప్రత్యక్షమగును. ఎట్లు? ఒకే జాతికి మాత్రమే కాక, ఒకే కుటుంబమునకు చెందినవారు ఎదురెదురుగా నిలిచియున్నారు. సాంఘిక మానవు డెవరిని ప్రియపవిత్రులనుగా భావించునో, అతడట్టివారితో తలపడి, వారిని హంత! వధించవలెను – వారు తాను పూజించిన ధనురాచార్యుడు, తనను లాలించిన పితామహుడు, వరుసను బట్టి తాతలు, మామలు, తండ్రులు, పుత్రులు, పౌత్రులు– ఈ రక్తసంబంధము లన్నింటిని రణఖడ్గముతో ఛేదించవలెను ! ఈ విషయ మతనికి ముందు తెలియదని కాదు, కాని అది అతనికి గ్రుచ్చుకొనలేదు. నాకు హక్కులు గలవు, నా కపరాధము జరిగినది, నేను క్షత్రియుడను గనుక, న్యాయముకొఱకు పోరాడి, అన్యాయమును, అరాజకాత్యాచారమును రూపుమాపుట నా ధర్మ–మను చింతనయే ఇంతదనుక అర్జును నావహించియుండెను; అతడు సంహార పరిణామము నింతదనుక లోతుగా చింతించలేదు, తన హృదయమున, మఱియు తన ప్రాణ కేంద్రమున దాని ననుభవించలేదు. కాని ఇపుడు దివ్యసారథి సంగ్రామార్థమును అతని అంతర్నేత్రమునకు జూపి, సాంవేదనికముగా అతని బహిర్నేత్రము ముందుంచగా, అతని సాంవేదనిక (sensational), ప్రాణిక, భావికసత్తయొక్క కేంద్రమునందే కొట్టిన దెబ్బవలె, అది అతనికి తగులును.

7. అర్జునుని సంకటముయొక్క అంతస్తులు :

దీని ప్రథమఫలితము ప్రచండమగు నొక సాంవేదనిక మఱియు శారీరిక సంకటము; ఇది కర్మపట్లను, దాని స్థూలఫలితములపట్లను, చివరకు జీవితముపట్లను

జుగుప్స బుట్టించును. తర్వాత, ఆహంకారిక మానవాళి తన క్రియయందు అన్వేషించు సుఖ, భోగరూపమగు ప్రాణికలక్ష్యమును అతడు నిరాకరించును; విశేషించి క్షత్రియుని ప్రాణికలక్ష్యమగు విజయమును, శాసనమును, అధికారమును, ప్రజా పాలనమును అతడు త్యజించివేయును. ధర్మము పేరిట జరుగు నీ యుద్ధము వాస్తవముగా తనకొఱకు, తనభోగముకొఱకు, తన రాజ్యముకొఱకు గాదా? కాని ఇంత మూల్యము చెల్లించి పొందదగిన వస్తువులు గావివి. ఏలన జాతీయ, సామాజిక జీవనమును సరిగా నిర్వహించు నిమిత్తమే తప్ప, స్వతః వీని కెట్టి విలువయు నుండదు. మఱియు తనవారిని చంపి, తనవారి కొఱకు ఉద్దేశించిన ఈ లక్ష్యములనే తాను చంపిన వాడగును (1-33). దీనికి పిమ్మట అతని భావముల ఆక్రోశము వినబడును: ప్రతిపక్షమున నున్నవారు "స్వజనులు" (1-37). పృథివీనిమిత్తము గాని, త్రైలోక్యరాజ్యము నిమిత్తము గాని ఎవడు వీరిని వధింపగోరును? (1-35). ఇట్టి కృత్యమునకు బిమ్మట జీవితమునం దేమి సుఖముండగలదు, తనపట్ల తనకెట్టి తృప్తి యుండగలదు. అహో! ఇదంతయు నొక భయంకర పాపము (1-36)- అని చెప్పి, ఇపుడతని నైతికభావము మేల్కొని, అతని సంవేదనలు మఱియు భావముల తిరుగుబాటును సమర్థించును. అది పాపము, పరస్పరసంహననమునందు ధర్మము నుండదు, న్యాయము నుండదు; విశేషించి ఎవరిని చంపవలెనో, వారు పూజార్హులు, ప్రేమాస్పదులు గావున, వారిపట్ల గల పవిత్రభావముల నతిక్రమించుట ధర్మమెట్లగును; నికృష్టమగు నేరమే యగును. పరిస్థితి నీ దశకు దెచ్చిన అపచారము, ఆక్రమణము, పాపారంభము, లోభాపరాధము, స్వార్థావేశము- అన్నియు ప్రతిపక్షమునుండియే వచ్చిన వనుకొందము; అయినను ఇట్టి పరిస్థితులందు అన్యాయమును సాయుధముగా నెదిరించుట వారి పాపమును మించిన పాపమే యగును. ఏలన వారు లోభాంధులు గనుక వారికిది దోషమనియే తెలియదు; కాగా మన కిది దోషమని తెలియును గాన, తెలిసియే పాప మాచరించిన వార మగుదుము. మఱియు దేని కీ పాపాచరణము, కులధర్మమును, సంఘధర్మమును, జాతిధర్మమును రక్షించుటకా? ఈ ధర్మములే ఈ అంతర్యుద్ధ పిశాచికి ఆహారమగును; కులము, నష్టప్రాయమగును, జాతిశీలము చెడును, వర్ణసంకరమగును; సనాతన జాతిధర్మములు. కుల నైతికధర్మములు మాసిపోవును (1-43). జాతివినాశము, ఉన్నతసంప్రదాయముల అవసాదము, నైతికపతనము, అట్టి అపరాధులకు నరక

ప్రాప్తి-ఇవి మాత్రమే ఈ వికృత గృహకల్లోలమునకు సంభవమగు వాస్తవఫలితములు (1-44) "కావున", అర్జునుడు గొంతెత్తి పలుకును, "శస్త్రపాణులగు దుర్యోధనాదులు నిరాయుధుడు, నిష్ప్రతీకారుడ నగు నన్ను వధించుటయే నా కెక్కువ క్షేమకరము. చేయను నేను యుద్ధము." (1-46,47).

8. అర్జునుడు కర్మధర్మమును మాత్రమే కోరును :

కావున అ అంతఃసంకటముయొక్క స్వభావము మేధావిలో నుదయించు ప్రశ్నపరంపర గాదు; అది జీవితముయొక్క మిథ్యారూపములనుండి పరావర్తనము (recoil) గాదు; అది వస్తుతత్త్వమును, జీవితార్థమును, నిగూఢ ప్రపంచ ప్రహేళికకు పరిష్కారమును అన్వేషింపగోరి దృష్టిని లోనికి మరలించుటయు గాదు. పోగా నది ఇంతదనుక కర్మతోను, దాని ప్రచలిత ప్రమాణములతోను తృప్తిపడియున్న మానవుని సాంవేదనిక, భావిక, నైతికవిద్రోహము (తిరుగుబాటు); ఏలన ఇపుడా ప్రమాణములే అతని నొక వికృతకల్లోలములోనికి జాఱవిడిచిన వని అతనికి దెలియ వచ్చెను: అవి ఇపుడు పరస్పరము విరోధించుకొనుచు, నిలుచుటకు ఏ ఆధారమును, అవలంబించుటకు ఏ ప్రాపును- "ధర్మమును"* మిగుల్చలేదు. కర్మప్రధాన మానవున కింతకు మించిన సంకటము, వైఫల్యము, పరాభవము మఱియొకటుండదు. వస్తుతః ఈ విద్రోహము కడు సాధారణము మఱియు సహజము; సాంవేదనికముగా, నది భయము, జాలి, జుగుప్స పెనగొనిన ఒక ఉద్వేగము; ప్రాణికముగా, నది జనమాన్యము, పరిచితము నగు కర్మాశయములందును, జీవిక లక్ష్యములందును అభిరుచిని, విశ్వాసమును గోల్పోవుట; భావికముగా, నది సాంఘిక మానవుని అనురాగము, ఆదరము, కుటుంబసుఖకామన, మఱియు తృప్తిరూపమగు సాధారణ భావములు తమను చెఱబట్టు కఠోరకర్తవ్యమునుండి విముఖమగుట; నైతికముగా, నది పాపము, నరకము, రక్తసిక్తభోగముల (2-5) నిరాకరణమునకు సంబంధించిన ప్రాథమిక చిత్తవృత్తి; చివరకు వ్యావహారికముగా, నది కర్మ ప్రమాణములు కర్మ ఆశించు వ్యావహారిక ఫలితములనే నాశనముచేయు యుద్ధములోనికి దింపినవను

---

*ఒకడు దేనిని ఊతగా ధరించునో, ఏది వస్తువులను సంఘటితముగా ధరించునో, అది ధర్మము; అది స్వభావనియమము, కర్మప్రమాణము, జీవన నిబంధనము.

– శ్రీ అరవిందుడు.

చింత. కాని ఈ విద్రోహముయొక్క పూర్ణఫలిత మేమన, అర్జునుని ఆపాదమస్తకము ముంచెత్తిన ఒక ఆంతరశూన్యత: అతని చేతనసత్త యంతయు - బుద్ధి, హృదయము, ప్రాణమేగాక, సర్వసత్తయు - భ్రమకు వశమై ఎచ్చటను, పనికి వచ్చు నొక కర్మప్రమాణమును. అనగా ధర్మమును గనజాలకున్నది (2-7). ఈ కారణముచేతనే అతడు శిష్యుడుగా శ్రీకృష్ణు నాశ్రయించును; ఆచరణ దృష్ట్యా అతడిట్లు అభ్యర్థించును; నేను పోగొట్టుకొనిన దానిని నా కిమ్ము, ఒక యథార్థ ధర్మమును, ఒక నిర్దిష్ట కర్మనియమమును, నేను తిరిగి నమ్మకముగా నడువగల ఒక మార్గమును జూపుము. అతడు జీవనరహస్యమును గాని, జగద్రహస్యమును గాని, దీని కంతటికి అర్థమును గాని, ప్రయోజనము గాని కోరడు, అతడు కోరునది ధ-ర్మ-ము.

9. కృష్ణుడు మాత్రము ధర్మాతీతతకు నడువును :

అయినను సరిగా నీ రహస్యమునకు తన శిష్యుని నడుపుటయే పరమగురుని ఉద్దేశ్యము; ఏలన భగవంతునియందు సచేతనముగా నివసించుచు, ఆ చేతన నుండియే కర్మచేయుట యను ఏకైక, విశాల, వ్యాపక నియమమును తప్ప, తక్కిన ధర్మములన్నియు విడిచివేయవలెననియే ఉపదేశఫలితము (18-66). కావున కర్మను నిర్ణయించు సాధారణ ప్రమాణములపై అతని తిరుగుబాటునకు తిరుగు లేదని తెలిసికొని, దివ్యగురువు ఆత్మస్థితికి సంబంధించియే ఎక్కువ చెప్ప నారంభించును గాని, కర్మకు సంబంధించిన బాహ్యనియమమును గుఱించి కాదు. అర్జునుడు ఆత్మ యందు సముడై యుండవలెను (2-15); కర్మఫలమును త్యజించవలెను (2-47), పుణ్యపాపములకు సంబంధించిన బౌద్ధికభావముల నతిక్రమించవలెను (2-50); మనస్సును సమాధిస్థము గావించి, అనగా భగవంతునియందే స్థిరముగా నిలిపి, అట్టి యోగమునందు నివసించవలెను. కర్మచేయవలెను (2-53). అర్జునుడీ ఉపదేశముతో తృప్తిజెందడు; ఈ యోగస్థితి మానవుని బాహ్యక్రియ నెట్లు మార్చునో, అతని మాటపై, నడతపై దాని ఫలిత మెట్లుండునో - అర్జునుడు తెలిసికొన గోరును. కాని కృష్ణుడు కర్మ వెనుక నున్న ఆత్మస్థితిని గుఱించియే ఇంకను చెప్పును గాని, కర్మను గుఱించి కాదు. నిష్కామసమతయందు బుద్ధిని స్థిరముగా స్థాపించుటయే ఏకమాత్రావశ్యకత (2-56, ...). కాని ఇచ్చట తాను గోరిన కర్మనియమము లేకపోగా, కర్మనిషేధమే గన్పించును గాన, అర్జును దసహనముతో బైటపడి

అడుగును– "బుద్ధి కర్మకంటెను శ్రేష్ఠ మని నీ మత మగుచో, స్వభావము చేతనే ఘోరమగు ఈ కర్మయందెందుకు నన్ను నియోగించుచున్నావు? మిశ్ర వాక్యముచేత నా బుద్ధిని మోహింపజేయుచున్నట్లున్నావు; దేనివలన శ్రేయమును బొందగలనో, నిశ్చితముగా నట్టిదానిని చెప్పుము" (3–1, 2), ఇట్లు కర్మప్రధాన మానవుని దృష్టిలో తాత్త్వికచింతనకు గాని, అంతరజీవనమునకు గాని, స్వతః ఎట్టి విలువ యుండదు; ప్రపంచ జీవనమునకు గాని, ఆవశ్యకమగుచో, దాని పరిత్యాగమునకు గాని ఒక ప్రమాణము నివ్వగలిగిన మేరకే వానికి విలువ; ఏలన పరిత్యాగము కూడ ఒక స్పష్టమైన క్రియయే. కాని ప్రపంచమున జీవించుచునే, కర్మచేయుచునే, దానికి పైగా నుండుట – ఇది "మిశ్రము", విమోహకము నగు వచనము, దీని మర్మమును గ్రహించు సహస మతనికి లేదు.

10. స్వధర్మమా? పాపము మా టేమిటి?

అర్జునుని తక్కిన ప్రశ్నలును, పలుకులును అదే స్వభావము, మఱియు శీలము నుండి ఉద్భవించును. ఒకసారి ఆత్మస్థితి కుదురుకొని నపుడు, కర్మలో నెట్టి పైమార్పు నుండ నవసరము లేదు. అనగా పరధర్మముకంటె స్వధర్మము దోషయుక్తమైనను, స్వధర్మమును బట్టియే చేయవలెను – అని చెప్పినపుడు అర్జునుడు కలతచెందును. స్వభావధర్మమా! తనను వేధించుచున్న పాపము మాటేమిటి : బలాత్కరించినట్లు బలాత్కరించి, మానవుని సత్సంకల్పమును కొట్టి వేసి పాపములోనికి మెడబట్టి త్రోయున దీ స్వభావము గాదా? (3–35, 36) ఇంకను, నేనీ యోగము పూర్వము సూర్యున కుపదేశించితిని. కాని అది ఈ లోపున నశించపోగా, నీకు మఱల ప్రవచించున్నాను అని కృష్ణుడు చెప్పినపుడు, అర్జునుని వ్యావహారిక బుద్ధి కది అంతుబట్టలేదు (4–3); ఇది ఎట్లు సంభవము?– అని అతడు ప్రశ్నించగా, తఱచుగా ఉదాహృతము, సుప్రసిద్ధమునగు వచనమును భగవానుడు ప్రవచించును; ఇది అవతారతత్త్వమును, ప్రయోజనమును మనకు దెలుపును (4–6,8). కర్మయోగమును, కర్మసన్యాసమును సమన్వయపఱచుచు, కృష్ణు డింకను పలుకుచున్న వచనములచేత మఱల అర్జునుడు తికమకపడి, ఇట్టి "మిశ్ర" వాక్యమును గాక, పరమశ్రేయమునకు బాటయగు ఒకేమాటను చెప్పుమని అర్థించును (5–1). తాను సాధించవలసిన యోగ మెంత దుస్సాధ్యమో గ్రహించి నపుడు, మానసిక సంకల్పము, అభిరుచి,

కామములనుండి కర్మచేయుట కలవడిన అతని వ్యావహారిక ప్రకృతి దాని కఠినతకు భయపడి, మఱల నిట్లడుగును– యోగమును సాధింప ప్రయత్నించి, పరాజయము బొందిన ఆత్మగతి ఏమగును? తాను విడిచివేసిన ఇహజీవనమును, తాను అకాక్షించిన బ్రహ్మచేతనను – రెంటిని గోల్పోయి కరిగిపోవు మేఘమువలె నశించిపోదా ? (6–37, 38).

11. నేను నీ విశ్వరూపమును చూడవచ్చునా?

అర్జునుని సంశయములు, వ్యాకులములు పరిష్కరింపబడి, భగవంతుడే తన 'ధర్మము' గావలయు నని అత డెఱింగి నపుడు, మఱల నెప్పటివలెనే ఆ భగవన్మూలమునకు తనను నడిపించగల విస్పష్ట, వినిశ్చిత జ్ఞానము నపేక్షించును. మన సాధారణానుభవమును సమకూర్చు వివిధభావముల మధ్య భగవంతు నెట్లు వేఱు పఱచి తెలిసికొనవలెను? (10–17). వేనియందు భగవంతుని గుర్తించి, పిమ్మట ధ్యానముచేత అతని సాక్షాత్కారము పొందువచ్చునో, అట్టి భగవంతుని మహా విభూతు లెవ్వి యగును? మానవ మనః శరీరముల ముసుగుద్వారా తనతో నిపుడు వాస్తవముగా భాషించుచున్న భగవంతునియొక్క విశ్వరూపము నిపుడే తాను చూడ గూడదా ? (11–4). అతని చివరి ప్రశ్నలు కర్మసన్యాసమునకును, తాను వరించవలసిన సూక్ష్మతర ఆంతర సన్యాసమునకును స్పష్టవిభేదమును దెలియ గోరును. అటులే పురుషప్రకృతుల వాస్తవ అంతరమును దెలియగోరును, ఏలన భగవదిచ్ఛా ప్రేరితుడై నిష్కామకర్మ నాచరింప నీ జ్ఞాన మతిముఖ్యము; కడకు తా నతిక్రమించవలసిన ప్రకృతిగుణముల స్పష్టక్రియలను, ఫలితములను స్పష్టముగా నెఱుంగ గోరెను.

12. కర్మస్థానమున దివ్యకర్మ :

అట్టి శిష్యునకు గీతాగురువు తన ఉపదేశము నిచ్చును. అహంకారిక కర్మచేత మానసికాభివృద్ధి నందుచున్న అర్జునుడు, అహంకారికజీవనమునకు సంబంధించిన మానసిక, నైతిక, భావికమూల్యము లన్నియు వ్యర్థములై దివాళాతీయగా, దారి తెన్ను గానకపోవును; అట్టి తఱి గురు వతనిని పట్టివేయును; గురు విపు డతనిని ఈ నిమ్న జీవనమునుండి ఊర్ధ్వచేతనలోనికి లేవనెత్తవలెను; కర్మయందలి అజ్ఞాన మాయాసక్తినుండి, ఏది కర్మకు పైనున్నను దానిని ప్రారంభించినదుపునో, దానిలోని

కుద్ధరించవలెను; మనఃప్రాణ శరీరముల జీవనమునుండి మనస్సున కతీతముగా నున్న, భగవంతుని ధామమగు దివ్యప్రకృతిలోని కుద్ధరించవలెను; అహంకారము నుండి ఆత్మలోనికి పంపవలెను. అదే సమయమున అర్జునుడు దేని నర్థించుచున్నాడో, తన లోపలి స్ఫూర్తి ననుసరించి దేని నన్వేషించుచున్నాడో, తన జీవన కర్మలను నిర్ణయించు అట్టి ఒక నవ్యధర్మమును గూడ గురు వతనికి ప్రసాదించవలెను; అనంత సంఘర్షములు, ప్రతిఘటనలు, సంభ్రమ వ్యాకులములు, మిథ్యా నిశ్చితత్వములతో గూడిన సాధారణ మానవ జీవనముయొక్క అపర్యాప్తనియమమునకు ఈ ధర్మ మెంతో పైనుండును; ఈ ఉచ్చతరధర్మము కర్మబంధనమునుండి విముక్తమయ్యును, తన దివ్యసత్తయొక్క విశాలస్వేచ్ఛయందు కర్మ చేయను గలుగును, నిమ్నప్రకృతిని జయించను గలుగును. ఇట్టి ధర్మ మావశ్యకము; ఏలన కర్మ చేయబడవలెను, ప్రపంచము తన గతివలయములను పూర్తిచేయవలెను. మఱియు మానవాత్మ తా నిక్కడ చేయవలసిన కర్మనుండి అజ్ఞానవశమున మఱలి పోరాదు. గీతోపదేశము యొక్క ప్రవాహగతి యంతయు. ఎంతో, ఎన్నో మెలికలు తిరుగును, ఈ మూడు లక్ష్యములనే లక్షించుచు, ఆ వైపునకే నడుచును.

4. గీతా హృదయము

1. పాక్షికవాదానికి గీతలో అవకాశము :

దివ్య ఏరువును గుఱించి, మానవశిష్యుని గుఱించి తెలిసికొనియున్నాము; ఇప్పు డిక గీతాసిద్ధాంతమును గుఱించి యొక స్పష్టభావన నేర్పఱచుకొనుటయే మిగిలియున్నది. గీతాబోధనయొక్క కేంద్ర హృదయముమీద నాధారపడిన యొక స్పష్టభావన గీతయందు మఱింత అవసరము; ఏలన గీతావిచారణ సుసమృద్ధము, బహుముఖము; ఆధ్యాత్మిక జీవనముయొక్క విభిన్నపార్శ్వముల గీతాగ్రహణము సమన్వయాత్మకము; దాని తర్కగతి సవేగము, భ్రమణశీలము; కావున ఇతర గ్రంథములందుకంటెను గీతయందు పక్షపాత బుద్ధితో స్వపక్షమును నిరూపించు కొనుటకు అవకాశ మెక్కువ గలదు. మఱియు తను అభిమానించిన ఒక సిద్ధాంతమునకు పోషకముగా ఒక వాస్తవమును, పదమును మఱియు భావమును తెలిసియో, సగము తెలిసియో, విఱిచి వ్యాఖ్యానించుట భ్రాంతనిర్ణయమునకు ఒక సులభమార్గమని భారతీయ తార్కికులు అంగీకరించియే యున్నారు; మఱియు నిట్టి తప్పును తప్పించుకొనుట సత్యపారాయణుడగు మనీషికి సైతము మిక్కిలి కష్టము. ఏలన ఈ విషయమున మానవబుద్ధి తనపై తానే గూఢచారి పని చేయలేదు; ఒక పాక్షికసూత్రము నభిమానించి, దానినే సర్వసత్యమునకు కీలకముగా స్వీకరించుట దాని స్వభావమే యగును; మఱియు తన స్వభావగతమగు ఈ ప్రియదోషమును తన తర్కక్రియయందు తన దృష్టిబడకుండ చేసికొనుట కీ బుద్ధికెంత సామర్థ్యము గలదో ! ఇట్టి దోషమునకు గీత ఇట్టే అవకాశమిచ్చును; ఏలన గీతలోని ఒక సిద్ధాంతమునో, ఒక ప్రముఖవాక్యమునో ఎత్తిచూపి, తక్కిన పదునెనిమిది అధ్యాయాలను వెనుకకు నెట్టి, లేక వానికి గౌణస్థాన మిచ్చి, మన స్వీయద్ధాంతము లేక వాదముయొక్క పక్షపాతిగా గీతను మార్చి వేయవచ్చును.

2. గీత కర్మసన్యాసమును బోధించును :

ఇట్లు గీతచేత కర్మయోగము నే మాత్రము గాక, కర్మసన్యాసమునకు సన్నాహసాధనను మాత్రమే బోధింపజేయువారున్నారు: విహితకర్మలనో, చేతికి వచ్చిన కర్మలనో ఉదాసీనముగా చేయుటయే ఈ సాధన; జీవన కర్మల చరమ సన్యాసమే దీని ఏకైక, వాస్తవలక్ష్యము. గీత నుండి ఉదాహరణ లిచ్చుటచేతను, దాని

ప్రతిపాదనాపద్ధతిని ఒక విధముగా సాగలాగుటచేతను, విశేషించి 'సన్యాసము' వంటి పదమునకు గీత యిచ్చు విలక్షణార్థమును పాటించకపోవుటచేతను ఇట్టి అభిప్రాయమును సమర్థించుట తేలికే. కాని నిష్పక్షపాతముగా గీతను చదివినపుడు ఈ అభిప్రాయమున కొనసాగుట అసంభవమగును; ఏలన అకర్మకంటెను కర్మమేలనియు (3-8), సమత్వముద్వారా కామముయొక్క యథార్థ ఆంతర సన్యాసము నందును, పరమపురుషునికి కర్మలను సమర్పించుటయందును ఆధిక్యము గలదనియు (3-30) చివరివరకు గీత నిరంతరము వక్కాణించును.

3. గీత కేవల భక్తియోగమును గాదు :

ఇంకను కొందరు గీతా బోధన యంతయు భక్తి సిద్ధాంతమే యని చెప్పి, గీతలోని అద్వైతాంశములను, ఏకాత్మయందు ప్రశాంతమునకు గీత యిచ్చు ఉచ్చ స్థానమును వెనుకకు నెట్టివేతురు. నిజమే, గీత భక్తిని ఒత్తి చెప్పును; అటులే భగవంతుని ప్రభువు మఱియు పురుషరూపములను పట్టుతో ప్రతిపాదించును; ఇంకను పురుషోత్తమ సిద్ధాంతమును వివరించి, ఇతడు క్షరపురుషునికంటె నతీతు డనియు, అక్షరాత్మకంటెను శ్రేష్ఠుడనియు (15-18) వక్కాణించును - ప్రపంచమునకు సంబంధించినంతవఱకు ఇతనినే మనము భగవంతునిగా నెఱుంగుదుము: ఇవి నిజమే. గీతయొక్క అతి ప్రముఖ మఱియు ప్రాణప్రదమైన తత్త్వములలోనివే. అయినను గీతా పురుషోత్తముడు, ఎవనియందు భక్తిహృదయము ప్రవేశించునో, అట్టి భక్తి ప్రభు వైనట్లే (18-55), ఎవనియందు సర్వజ్ఞానము పర్యవసించునో (13-30). అట్టి ఏకాత్మయు నగును, మఱియు సర్వకర్మయు ఎవనికి దారితీయునో, అట్టి యజ్ఞప్రభువు నగును (5-29); మఱియు అప్పటప్పటి విచారణాప్రవణతను బట్టి గీత ఒకసారి జ్ఞానమును, ఒకసారి కర్మను, ఒకసారి భక్తిని వక్కాణించినప్పటికి, ఈ మూడింటి మధ్య పరిపూర్ణ సామ్యమును నిలబెట్టును; ఏ యొక్క దాని యందును గీతకు అత్యంత ప్రత్యేకాభిరుచి లేదు. ఎవనియందు అ మూడును కలిసి ఏకమగునో, అతడు గీతా పురుషోత్తముడు.

4. గీతాకర్మ దివ్యకర్మగాని, మానవకర్మ గాదు.

కాని ప్రస్తుతకాలమున, నిజానికి ఆధునికమనస్సు గీతను గుర్తించి, ఉపయోగించ నారంభించి నప్పటినుండియు, గీతయందలి భక్తిజ్ఞానములకు గౌణస్థానమిచ్చి,

కర్మపట్ల గీతకు గల పట్టునుండి లాభముగొని, గీతయందు కర్మశాస్త్రమునే కర్మపథమునందు మనలను నడిపించు వెలుగునే, కర్మ సిద్ధాంతమునే చూచుటయందు ఇప్పటివారి మొగ్గు కన్పించుచున్నది. నిశ్చయముగా గీత ఒక కర్మసిద్ధాంతమే, కాని గీతకర్మలు జ్ఞానమునందు (4-33), అనగా ఆత్మసాక్షాత్కారమునందును, శమము నందును పర్యవసించు కర్మలు; మఱియు నవి భక్తిప్రేరితకర్మలు, అనగా ముందు పరమపురుషుని చేతులందును, తర్వాత అతని సత్తయందును తన సర్వాత్మ యొక్క సచేతనసమర్పణచేత ప్రేరితమైన కర్మలు; అవి ఆధునికమనస్సునకు దెలిసిన కర్మలు గావు, అహంకార, పరోపకారభావము లాదేశించిన కర్మ లెంత మాత్రము గావు: సామాజిక, భూతదయాపరహేతువులచేతను, సూత్రములచేతను, ఆదర్శములచేతను చోదితకర్మలు కానేకావు. కాని నేటి వ్యాఖ్యానములు ఈ కర్మలే గీతాహృదయమని చెప్పజూచుచున్నవి. సాధికారపురుషులు మన కిట్లు నిరంతరము ఘోషించి చెప్పుచున్నారు: భారతీయుల ఆధ్యాత్మికతయందు గన్పడు తాపస ప్రవృత్తిని, శమప్రవణతను గీత కర్మవిషయమున విరోధించుచున్నది; గీత మానవ కర్మను, సామాజికవిధులను నిస్స్వార్థముగా నాచరించుట యను ఆదర్శమును, ఇంతే కాదు, మిక్కిలి ఆధునికమగు సాంఘికసేవాదర్శమును సైతము గొంతెత్తి చాటుచున్నది. ఇది ఇప్పటివారి వాదము కాగా, దీనికంతకు నేను చెప్పు ఏకమాత్ర సమాధాన మేమన, ఈ వాదముయొక్క ముఖము చూచినను, గీత ఇట్లు చెప్పుట లేదని స్పష్టముగా దెలిసిపోవును; ఇది ఆధునికులు చేసికొను అపార్థము - ఇది ఇప్పటి ఐరోపీయుల లేక వారి మానసపుత్రులగు భారతీయుల మనస్సు సర్వదా పురాతనము, ప్రాచ్యము, విశేషించి భారతీయమునగు ఒక బోధనలోనికి చొప్పించు స్వీయార్థము. గీత బోధించునది మానవకర్మ గాదు, దివ్యకర్మ; అది సామాజిక విధుల నిర్వహణ గాదు, మన ప్రకృతిద్వారా పనిచేయు భగవదిచ్ఛను నిరహంకారముగా నిర్వహించు నిమిత్తము విధిలేక సదాచారమునకు సంబంధించిన తక్కిన సర్వధర్మముల పరిత్యాగము (18-66); అది సాంఘికసేవ కాదు, శ్రేష్ఠులు (3-21), భగవదాయత్తులు (18-57) నగు మహాపురుషులు లోకసంగ్రహార్థము (3-25) నిరహంకారముగా, మానవునికిని, ప్రకృతికిని వెనుక నిలబడి, వానిని నడుపు కర్మప్రభువునకు ఒక యజ్ఞముగా చేయు కర్మ.

5. భగవంతుని మాట ఆదివారమునాడే !

తాత్పర్యముగా, గీత అధ్యాత్మిక జీవనగ్రంథము గాని వ్యావహారిక నీతి శాస్త్రము గాదు. అధునిక మనస్సు ఇపుడు ఐరోపీయ మనస్సు – అందునను తనకు మూలమగు అత్యుత్తమ గ్రీకు–రోమను సంస్కృతియొక్క దార్శనిక ఆదర్శ వాదమునే గాక, మధ్యయుగముల నాటి క్రైస్తవ భక్తివాదమును గూడ త్యజించి వేసి, మఱియొక రూపమున వెలసిన ఐరోపీయ మనస్సు; అది దార్శనికాదర్శమును వ్యావహారికా దర్శములోనికి, భగవద్భక్తిని మానవభక్తిలోనికి మార్చివేసినది. అధునికమనస్సు భగవంతునికి స్వస్తిచెప్పినది, లేక ఆదివారమునాడు ఉపయోగించుకొనుటకు మాత్రమే మిగిల్చినది ! అది భగవంతునికి బదులు మానవునే దేవత గాను, సంఘము నా దేవతావిగ్రహముగాను నిల్పినది. తన ఉత్తమరూపమున అధునికమనస్సు వ్యావహారికము, నైతికము, సామాజికము మఱియు క్రియాత్మకము, పరోపకారము, దయాప్రయుక్తము, కాగా ఇవి యన్నియు మంచివే, విశేషించి నేడు ఆవశ్యకములు; ఇవి భగవదిచ్ఛలో భాగమే, లేనిచో మానవజాతి యందవి అంతప్రాబల్యము వహించవు. మఱియు దివ్యమానవుడు, అనగా బ్రహ్మచేతనయందును, భగవత్సత్త యందును నివసించు మానవుడు తన వ్యవహారమునందు ఇవి యన్నియు గాకపోవుటకు గారణము గన్పించదు; ఇవి యుగ ధర్మమగుచో వీనికి మించి స్థాపించ వలసిన ఆదర్శము గాని, సాధించవలసిన పరివర్తనము గాని లేనిచో, అతడివి యన్నియు నగును. ఏలన దివ్యగురువు నిర్దేశించు నట్లు, అతడు ఇతరులకు తమ యుగధర్మమున ప్రమాణము నెలకొల్పవలసిన శ్రేష్ఠ మానవుడు; నిజానికి కృష్ణు డర్జును నిట్లు ఉద్బోధించును గూడ; నీ యగము యొక్కయు, ప్రచలిత సంస్కృతి యొక్కయు ఉత్తమాదర్శముల ననుసరించి జీవించుము, అయితే సాధారణమానవుల వలె బాహ్యధర్మమును, నియమమును కేవలము అనుష్ఠించుచునే గాక, బాహ్యా దర్శముల వెనుకనున్న భగవత్సంకల్పము నెఱింగి వాని ననుష్ఠించుచు జీవించుము (4–15).

6. భగవత్‌స్థితి గీతయొక్క సర్వోత్కృష్ట భావన :

ఇంతకు సారాంశ మేమన, భగవంతుడు లేక బ్రహ్మ మఱియు ఆధ్యాత్మికత లేక భగవత్‌స్థితి : ఇవి గీతయొక్క సర్వోత్కృష్ట భావనలు; ఈ రెండు సారవస్తువులనే అధునికమనస్సు తన వ్యావహారిక ప్రేరకశక్తినుండి వెలివేసినది. అధునిక మనస్సు

మానవభావమునందే నివసించుచుండగా, భగవంతునియందలి ప్రపంచము కొఱకే యైనను, గీత మనలను భగవంతునియందు నివసింపగోరును; అది తన ప్రాణము, హృదయము, మఱియు బుద్ధియందే నివసించుచుండగా, గీత మనలను ఆత్మయందు నివసింపగోరును; అది సర్వభూతరూపమగు క్షరపురుషునియందే నివసించుచుండగా, గీత మనలను అక్షరునియందును, పురుషోత్తమునియందును గూడ నివసింపగోరును (15-16-17); అది మారుచుండు కాలప్రవాహములో నివసించుచుండగా, గీత మనలను కాలాతీతమునందు నివసింపగోరును. అథవా ఆధునికమనస్సు ఈ ఉత్కృష్ట వస్తువుల నిపుడు అస్పష్టముగా చూడ నారంభించినచో, అది వానిచేత మానవునికి, మానవసమాజమునకు సేవచేయించుటకే! కాని భగవంతుడును, ఆధ్యాత్మికతయు స్వాధికారముచేతనే వర్తించును గాని, పరాశ్రితవస్తువులుగా గాదు. మఱియు నాచరణయందు మనయందలి నిమ్నము, మనయందలి ఉన్నతముకొఱకు జీవించ నేర్చుకొనవలెను; అపుడు ఆ ఉన్నతము సైతము సచేతనముగా నిమ్నము కొఱకు వర్తించుచు, దానిని తన ఉన్నతభూమికల దగ్గరకు ఆకర్షించ నవకాశము గల్గును.

7. భగవంతుని పిలుపు అనివార్యము :

కావున, నిస్స్వార్థముగా నీ విధిని నిర్వహింపుము, అదియే సర్వోత్తమ, సర్వపర్యాప్త ధర్మము – అని గీతచేత బలాత్కారముగా చెప్పించుట గొప్ప తప్పే యగును. గీత పరిష్కరింప చేపట్టిన స్థితిని ఇంచుక పరిశీలింతు మేని, గీతార్థ మిది కాదని తేలిపోవును. బహువిధులు, అన్యోన్యసంబద్ధములు నైన కర్తవ్యభావనలు అర్జునుని మనస్సులో విడదీయరాని విధముగా ఢీకొనును; అట్టి స్థితిలో మానవ మనస్సుచేత నిర్మించబడిన బౌద్ధిక, నైతికభవన మంతయు పనికిరాక కుప్పగూలి పోవును; ఈ స్థితియే గీతాబోధనకు మూలము, ఇదియే అర్జునుని భగవంతు నాశ్రయింపజేయును. మానవజీవమున ఇట్టి సంఘర్షస్థితి తఱచుగా నుదయించును; ఉదాహరణకు, గృహధర్మమునకును, దేశధర్మమునకును సంఘర్షము, అటులే దేశాధికారమునకును, మానవాళి హితమునకును, లేక అంతకు మించిన ధార్మిక లేక నైతికసూత్రమునకును సంఘర్షము. ఇంకను బుద్ధునియందువలె, భగవంతుని పిలుపు ననుసరించుటకు బాహ్యవిధు లన్నింటిని త్రోసివేయవలసిన అంతరవస్థ ఏర్పడవచ్చును. అట్టియెడ బుద్ధుని తిరిగి తన భార్యదగ్గరకు పంపించివేసి, గీత అట్టి అంతరవస్థను పరిష్కరించు నని నే నూహించజాలను; అటులే బడిపంతులవై నిస్స్వార్థముగా పిల్లలకు పాఠములు

చెప్పుకొనుమని రామకృష్ణునివంటి వానిని గీత త్రిప్పిపంపదు; ఇంకను కుటుంబపోషణార్థము న్యాయవృత్తినో, వైద్యవృత్తినో, పత్రికావృత్తినో చేపట్టు మని వివేకానందునివంటి వాని నిర్బంధించదు. గీత నిస్వార్థ విధి నిర్వహణమును బోధించదు, పరంతు దివ్యజీవనసాధనమును, సర్వ ధర్మపరిత్యాగమును, ఏకమాత్ర పరమపురుషుని ఆశ్రయమును బోధించును (18-66) మఱియు బుద్ధుని, రామకృష్ణుని, వివేకానందుని దివ్యప్రవృత్తి ఈ బోధనతో సర్వదా మేళవించును. ఇంతే కాదు, గీతకు అకర్మకంటెను కర్మయే ఎక్కువ ప్రియమైనను (3-8), అది కర్మసన్యాసమును సర్వదా వర్జించక, దానిని గూడ భగవంతునికి ఒక మార్గముగా నామోదించును (5-2). సన్యాసముచేతనే భగవత్ప్రాప్తి సంభవమగుచో, సన్యాసమునకు లోపలినుండి పిలుపు బలముగా వచ్చుచో, సన్యాసాగ్నిలో దుముకవలసినదే, గత్యంతరము లేదు. భగవంతుని పిలుపు అప్రతిహతము, దాని ముందు ఇతర ఆలోచనలు పనిచేయజాలవు.

8. పాపము విధి ఎట్లగును?

కాని అర్జునుని విషయమున మఱియొక సంకటము గలదు- అతని కర్తవ్యమెట్టి దనిన, దానినుండి అతని నైతిక బుద్ధి పరాఙ్ముఖమగును. యుద్ధ మతని విధి యందువా? కాని ఆ విధి అతని బుద్ధి కిపుడు ఘోరపాప మయినది. అట్టి పాపమును నిష్కామముగా, నిర్వికారముగా చేయు మని నీవు చెప్పినచో, అది వాని నెట్లు తృప్తిపఱచును? ఏది నా విధి ? కులమును, జాతిని, దేశమును వధించి, రక్తము పాఱించుట నా విధి యెట్ల గును? - అని అతడు తెలియగోరును. అతని పక్షమున న్యాయ మున్నదని నీ వందువా? అది అతనిని తృప్తిపఱచదు, పఱచజాలదు; కారణము, అట్టి న్యాయము జాతి భవిష్యత్తునకే ముప్పుతెచ్చు దారుణ రక్తపాతమునకు దారితీయజాల దనియే అతని వాదన యంతయు. అయినను తాను యోధుడుగా తన విధిని నిర్వర్తించుచున్నంత కాలము దాని పాపస్వరూపమును గాని, పరిణామములను గాని పట్టించుకొన బనిలే దను అర్థమున అతడు నిర్వికారముగా యుద్ధము చేయవలె నందువా? అది రాజ్యముయొక్క, రాజకీయ వాదుల యొక్క నీతివాదులయొక్క, న్యాయవాదులయొక్క బోధన గావచ్చునేమో గాని, జీవన కర్మల సమస్యను మూలమునందే పరిష్కరింప సమకట్టు నొక మహాధార్మిక, దార్శనికశాస్త్రము యొక్క ఉపదేశ మెన్నటికిని గాజాలదు. ఒకవేళ మర్మభేదియగు నొక నైతిక,

ఆధ్యాత్మికసమస్యను గుఱించి గీత చెప్పవలసిన దంతయు నదియే యగుచో, ప్రపంచ మహాశాస్త్రముల పట్టికనుంచి దానిని తొలగించి, రాజకీయవిజ్ఞానము, నైతిక మీమాంసముల పుస్తకాగారములోనికి దానిని త్రోసి వేయవలెను.

9. పాపపుణ్యములు లేవని గీత చెప్పదు :

నిజమే, ఉపనిషత్తులవలె గీతయు పుణ్యపాపములకు పైనను, శుభాశుభముల కావలను భాసించు సమతను బోధించును, కాని బ్రహ్మచేతనలో నొక భాగముగానే దానిని బోధించును, మఱియు సాధనాపథమున ఆ పరమనియమమును పాటించ గలిగి నంత పురోగమించినవానికే బోధించును. కాని సామాన్య మానవజీవమునకు శుభాశుభముల పట్ల ఉదాసీనత నుపదేశించదు; దాని పరిణామము విషతుల్యము కాగలదు. పైగా దుష్కృత్యము నొనరించువారు భగవంతుని బొందరని గీత వక్కాణించును (7-15) కావున అది భటుడుగా తన విధియే యైనను, నరకవస్తువగు పాపము నాచరింప జూచుట అర్జునునకు సాయపడదు. వేయి విధులు ముక్కచెక్క లైనను, తన నైతికబుద్ధి ఏవగించుకొనుదానిని అర్జునుడు చేయరాదు, చేయజాలడు.

10. విధి బాహ్యము, నీతి ఆంతరము :

ఆచరణయందు, సామాజికభావనలమీద నాధారపడు ఒక భావమే విధి యని మనము జ్ఞాపకము చేసికొనవలెను. ఇట్లు గాక, దీనికి అతివ్యాప్తి గల్పించి మనపట్ల మనకు గల విధిని గుఱించి ప్రసంగించవచ్చు, లేక ఒక అతీతార్థమున సర్వమును త్యజించుట బుద్ధుని విధియని, లేక గుహయందు నిశ్చలముగా నాసనబద్ధుడై యుండుట యతి విధి యని చెప్పవచ్చును : కాని స్పష్టముగా నిది మాటలతో నాడుకొనుటయే యగును. విధి ఒక సాపేక్షపదము, అది ఇతరులతో మనకు గల సంబంధము నపేక్షించును. ఉదాహరణకు, బిడ్డలను పెంచుట తండ్రి విధి; తన కక్షిదారుడు దోషి యని తెలిసినను, అతనిని గెలిపించుట న్యాయవాది విధి; తన బంధువులనే చంపవలసివచ్చినను, పై వారి ఆదేశమును బట్టి వారిని కాల్చి చంపుట సైనికుని విధి; హంతకుని ఉరిదీయించుట న్యాయమూర్తి విధి. ఈ సంబంధముల నామోదించినంత దనుక, విధిస్వరూపము స్పష్టమే; గౌరవభాజనము, అనురాగాస్పదము గాకపోయినను, అది ఒక వ్యావహారిక విషయము. కాని అంతర్దృష్టి మాఱి, అనృతము అత్యంత పాపమని న్యాయవాదికి కనువిప్పు గలిగినచో, మరణదండన మానవ

తత్త్వమునకు జేయు మహాపరాధమని న్యాయమూర్తికి లోతుగా నచ్చినచో, మానవమాంసమును భక్షించుటవలె మానవప్రాణమును హరించుటయు ఎట్టి పరిస్థితిలోను క్షంతవ్యము గాదని నేటి సమరవిరోధికివలెనో, టాల్‌స్టాయికి వలెనో యుద్ధముచేయవలసిన సైనికునికి లోపల తట్టినచో, అపుడేమి చేయవలెను? ఇట్టియెడ సాపేక్షవిధులకు పైనుండు నైతికధర్మమే ప్రాబల్యము వహించవలెననుట స్పష్టమే. ఇక నీ ధర్మము సామాజిక సంబంధముపై నాధారపడక, ప్రబుద్ధమైన మానవుని నైతికసత్త యొక్క ఆంతరబోధముపైననే ఆధారపడును.

11. బాహ్యవిధికి బదులు భగవన్నిర్ణయము :

ప్రపంచమున, నిజానికి, తనతన భూమికయందు ప్రామాణికములే యైన రెండు ప్రవర్తన ధర్మములు గలవు- 1. ముఖ్యముగా బాహ్యసంబంధముపై నాధారపడు నియమము, 2. బాహ్యసంబంధము నపేక్షించక, కేవలము లోపలి చింతన మఱియు వివేచనలపై నాధారపడు నియమము. గీత ఉచ్చతరభూమికను నిమ్న తర భూమికకు అధీనము చెయ్యమని బోధించదు; అది ప్రబుద్ధ నైతిక చేతనను సామాజిక సంబంధమును బట్టి ఏర్పడిన విధివేదికపై బలిగమ్మని ప్రోత్సహించదు. అది పైకి బిల్చును గాని, క్రిందికి గాదు; రెండు భూమికలకును విరోధ మేర్పడినపుడు, ముఖ్యముగా వ్యావహారికము, కేవలముగా నైతికము నగు భూమికలకు పైన వర్తించు పరమస్థితికి, బ్రాహ్మచేతనకు (2-72) ఆరోహించు మని గీత మనల నాదేశించును. అది సమాజ విధిభావనకు బదులుగా భగవంతునిపట్ల మనకు గల కర్తవ్యతాభావనను ప్రవేశపెట్టును. బాహ్యనియమమునకు గల అధీనత కర్మ యొక్క ఒక ఆంతర స్వయం నిర్ణయ సూత్రమునకు తావిచ్చును - జటిలమగు గుణ కర్మనియమమునుండి అంతరాత్మ విముక్తి నందినపు డీ స్వయంనిర్ణయము సాధ్యమగును. బ్రాహ్మచేతన, కర్మనుండి అంతరాత్మ విముక్తి, మన లోపలను, పైనను ఉన్న ఈశ్వరునిచే ప్రకృతి యందు కర్మ నిర్ణయము - కర్మయోగమునకు సంబంధించి ఇదియే గీతాబోధనయొక్క సారతత్త్వమని తర్వాత మనము చూడ గలము.

12. బంకిమచంద్రుడు - గీత :

తనవంటి ఇతర ఉద్గ్రంథములవలెనే, గీతయు సాకల్యముగా చదివినపుడే దాని వికాసశీల ప్రతిపాదనను గుర్తించినపుడే, మనకు అర్థము కాగలదు. గీతకు

మున్ముందు, అది విధిశాస్త్రమను నూతనార్థమును కట్టబెట్టినవాడు మహారచయిత, బంకిమచంద్ర చటర్జీ; అతని పరంపరలోని అధునికవ్యాఖ్యాత లందరు మొదటి మూడు, నాలుగు అధ్యాయములనే విశేషించి ఒత్తి చూపుదురు; అందునను వారి అభిమానవిషయాలు– 1. సమతాభావము, 2. వారు విధి యని అనువదించు "కర్తవ్యకర్మ" (3–19). 3. "కర్మయందే నీ కధికారము గాని, కర్మఫలమునందెట్టి అధికారమును లేదు" (2–47)– అను వాక్యము; ఇపుడు దీనినే జనసామాన్యము ముందు గీతామహావాక్యముగా ఎత్తి చూపుచున్నారు. పదునొకండవ అధ్యాయమును మినహాయించి, సమున్నత తత్త్వవిద్యతో నొప్పారు తక్కిన అధ్యాయములకు వీరు గౌణస్థానమునే యిత్తురు. ఆధునిక మనస్సున కిది మిక్కిలి సహజమే; ఏలన నిశిత తాత్త్వికవిషయాలు మఱియు సుదూర ఆధ్యాత్మికలక్ష్యాల పట్ల దానికి సహనము తక్కువ, అది ఆత్రముగా కర్మలోనికి దిగజారును, మఱియు అర్జునునివలెనే అది కోరునది ఆచరణయోగ్యమగు ఒక కర్మప్రమాణము, ఒక "ధర్మము". కాని యీ గ్రంథమును విచారించుట కిది అపమార్గమే యగును.

13. గీతాసమత ఉదాసీనత గాదు :

గీత ఉపదేశించు సమత ఉదాసీనత గాదు. చూడుడు: పునాది వేసి, గీతా భవనము యొక్క ప్రధాననిర్మాణము ఏర్పఱచిన పిమ్మట, అర్జునున కిచ్చిన మహాదేశ మిది– "లెమ్ము, శత్రువులను సంహరించుము, సమృద్ధరాజ్యము ననుభవింపుము" (11–33); ఈ ఆదేశమునందు నిరపేక్ష పరోపకారవాదముయొక్క గాని, విశుద్ధ నిర్వికార వైరాగ్యముయొక్క గాని ఛాయలుగూడ గన్పించవు; అది అంతః సమత మఱియు విశాలతలతో గూడిన ఒక స్థితి, ఈ స్థితియే ఆధ్యాత్మిక విముక్తికాధారము. ఆ సమతతోను, ఆ విముక్తియందును మనము "కర్తవ్యకర్మను" చేయవలెను. గీతను బట్టి ఈ కర్తవ్యకర్మయందు అన్ని కర్మలు – "సర్వకర్మాణి" (3–30) వచ్చివేయును; ఇది సామాజికవిధులను లేక నైతికధర్మములను తనలో నొక భాగముగా నిముడ్చుకొనును. ఇంకను, ఈ కర్తవ్యకర్మను నిర్ణయించవలసినది వ్యక్తియు గాదు; అటులే కర్మయందధికారము, కర్మఫలమునం దధికారనిరాకరణము (2–47)– ఇది గీతామహావాక్యమును గాదు, ఇది యోగపర్వతము నారోహించ నారంభించిన శిష్యునియొక్క ప్రథమదశకు ఉద్దేశించిన ప్రాథమికవాక్యము మాత్రమే. తర్వాతి దశలో గీత దీనిని కొట్టివేసి, మానవుడు కర్తగాదని గట్టిగా వక్కాణించును; ప్రకృతియే

క్రియాత్మకమగు తన త్రిగుణములతో అతనిద్వారా కర్మ చేయును (3–27), కావున కర్మ చేయునది తాను గాదు అని అతడు చూడ నేర్వవలెను. అందుచేత కర్తృత్వ భ్రాంతిలో మన మున్నంత కాలమే 'కర్మయందే నీ కధికార' మను భావము మనపట్ల జెల్లును కాగా నేను కర్తనుగాను అను సత్యము ఏ క్షణమున మన చేతయనయందు స్ఫురించునో, ఆ క్షణము నుండి ఫలాధికారముతో బాటు మన కర్మాధికారమును మనస్సునుండి అదృశ్యమగును. అపుడు ఫలవిషయక లేక కర్మవిషయక అహంకారమంతయు అంత మొందును.

14. కర్మను నిర్ణయించువాడు భగవంతుడు :

కాని ప్రకృతి కర్మను నిర్ణయించు ననుటయు గీతయొక్క చరమవాక్యము గాదు. (దీని ఫలితములగు) సంకల్పసమతయు, ఫలనిరాకరణమును, మనో బుద్ధి హృదయములతో భగవచ్చేతనలో ప్రవేశించి, అచ్చట నివసించుటకు సాధనములు మాత్రమే; అట్లు నివసించజాలనంతవఱకు దానిని సాధనములుగా నుపయోగించు కొనవలెను, లేక వానిని అభ్యసించుచు, ఉన్నతస్థితియొక్క క్రమవికాసమును బొందగోరవలెను (12–9)– అని గీత చెప్పును గూడ. మఱియు నేను భగవంతుడను – అని కృష్ణుడు ప్రకటించుకొను ఆ భగవంతు డెవరు? పురుషోత్తముడు (15–18), నిష్క్రియమగు ఆత్మకు అతీతుడు, సక్రియమగు ప్రకృతి కతీతుడు, ఆత్మకు ఆధారము, ప్రకృతికి ప్రభువు; సృష్టి యంతయు ఈ ప్రభువు యొక్క అభివ్యక్తియే; మన ఇప్పటి మాయాధీనావస్థయందు సైతము అతడు తన సృష్టియగు జీవుల హృదయమున ఉపవిష్టుడై ప్రకృతికర్మలను నియమించుచుండును; కురుక్షేత్ర సైన్యములు మరణాత్పూర్వమే నిహతములైనవి వీనిచేతనే, ఇత డర్జునుని ఈ మహా సంహారమునకు ఒక ఉపకరణముగా లేక కేవలనిమిత్తముగా నుపయోగించుకొనును (11–33). ప్రకృతి అతని కార్యనిర్వాహకశక్తి మాత్రమే (కర్మ నిర్ణేత్రిగాదు). శిష్యుడు ఈ శక్తిని, దీని త్రిగుణములను దాటి పై కెగయవలెను; అతడు త్రిగుణాతీతుడు కావలెను (2–45). తన యే కర్మలపై తన కిక స్వత్వము గాని, అధికారము గాని లేదో, ఆ కర్మల నిపు డతడు ప్రకృతికి గాక, పరమపురుషుని సత్తలోనికి సమర్పింపవలెను. తన మనోబుద్ధులను, హృత్సంకల్పములను అతని యందే విశ్రమింపజేసి, ఆత్మజ్ఞానముతోను, భగవజ్జ్ఞానముతోను, ప్రపంచజ్ఞానముతోను, ఇంకను, పరిపూర్ణ సమత, పరిపూర్ణభక్తి, నిశ్శేషాత్మసమర్పణములతోను తపోయజ్ఞముల అధీశ్వరునికి

(5–29) ఒక యజ్ఞముగా అతడు కర్మలను జేయవలెను. అతని సంకల్పముతో మన సంకల్పము నేకముగావించి, అతని చేతనతో మనము చేతనులము కాగా, అతడే కర్మను నిర్ణయించి ప్రారంభించును. ఇదియే దివ్యగురువు తన శిష్యునికి జూపిన పరిష్కారము.

15. గీతా మహావాక్యము :

గీతయొక్క మహా పరమవచనమును, మహావాక్యమును వెదకి వెలికి దీయవలసిన పనిలేదు; గీతయే తన అంతిమోక్తియందు, తన గీతముయొక్క పరమ స్వరమునందు దానిని ఉద్ఘోషించును; "సర్వాత్మనా నీ హృదయములోని ఈశ్వరుని శరణుబొందుము; వాని ప్రసాదముచేత నీవు పరమశాంతిని, శాశ్వతపదమును ప్రాపింతువు (18–62). ఇట్లు గుహ్యముకంటెను గుహ్యతరమగు దానిని నీకు వ్యాఖ్యానించితిని (18–63). ఇంకను అత్యంతరహస్యమగు, నీకు ప్రవచింపబోవు పరమవచనమును వినుము (18–64). నాయందు మనస్సుగల వాడవు (లేక నామనస్సే నీ మనస్సయిన వాడవు). నాకు భక్తుడవు గమ్ము. నాకు యజ్ఞము చేయుము. నన్ను పూజింపుము; తప్పక నన్నే చేరెదవు, నీవు నాకు ప్రియుడవు గదా (18–55). వ్యవహార ధర్మము లన్నింటిని పరిత్యజించి, నాయందే శరణు బొందుము. నేను సర్వపాపమునుండియు నిన్ను విడిపింతును; శోకింపకుము (18–66)".

16. బద్ధకర్మనుంచి ముక్తకర్మకు మూడు మెట్లు :

గీత ప్రతిపాదన మూడు మహాసోపానములలోనికి విభక్తమగును; వీని వలన కర్మ; ఉచ్చతరధర్మముయొక్క విముక్తినిమిత్తము నిమ్నతరనియమము యొక్క బంధనమును విడిచిపుచ్చును, మానవభూమికనుండి దివ్యభూమికలోని కెగయును. మొదటి మెట్టున, మానవుడు తాను కర్తగా, కామమును సన్యసించి, పూర్ణసమతతో, కర్మ నొక యజ్ఞముగా చేయవలెను; యజ్ఞ మెవరికి? తన సత్తయందింకను ఉపలబ్ధము గానప్పటికి, సర్వోన్నతము, ఏకమాత్రము నగు ఆత్మరూప దేవతకు. రెండవ మెట్టున, సాధకు డా పరమాత్మను సమము, నిష్క్రియము నగు అక్షరాత్మగా సాక్షాత్కరించుకొని, మఱియు సర్వకర్మయు విశ్వశక్తియొక్క, ప్రకృతియొక్క, అసమము, సక్రియము నగు క్షరశక్తియొక్క వ్యాపారమాత్రమని దర్శించి, కర్మఫలమునే గాక, కర్మాధికారమును సైతము అతడు సన్యసించవలెను. చివరి మెట్టునందు సాధకు డా పరమాత్మను

పరమపురుషునిగా దర్శించవలెను. ఈ పరమపురుషుడు ప్రకృతి నియామకుడు, ప్రకృతిగతజీవుడు ఇతని అంశమే (15-7), ఇతడు ప్రకృతికి సర్వధా అతీతముగా నుండి, ప్రకృతిద్వారా సర్వకర్మలను నడుపును. ప్రేమను, ఆరాధనను, యజ్ఞకర్మను అతనికే అర్పింపవలెను; అతనికే సర్వసత్తను సమర్పింపవలెను, అతని దివ్యచేతనలోనికే సర్వచేతనను ఉద్ధరించవలెను; దానివలన మానవాత్మ, ప్రకృతికిని, కర్మలకును పైన భాసించు అతని దివ్య అతీతత్వమున భాగము పంచుకొని, అతని రీతిగ ఒక పరిపూర్ణ ఆధ్యాత్మికస్వేచ్ఛయందు కర్మచేయగలుగును.

17. కర్మ జ్ఞాన భక్తి సమన్వయము :

ప్రథమసోపానము కర్మయోగము, నిస్స్వార్థకర్మయజ్ఞము; ఇచ్చట గీత యొక్క పట్టు కర్మపై నుండును. ద్వితీయసోపానము జ్ఞానయోగము, అనగా ఆత్మసాక్షాత్కారము మఱియు ఆత్మప్రపంచముల యథార్థస్వరూప జ్ఞానము; ఇచ్చట పట్టు జ్ఞానముపై నుండును; కాని ఇచ్చటను కర్మయజ్ఞము కొనసాగును మఱియు కర్మమార్గము జ్ఞానమార్గముతో ఏకమగునే కాని, దానిలో అదృశ్యముగాదు. కాగా, చరమసోపానము భక్తియోగము. అనగా పరమాత్మను పరమపురుషునిగా ఆరాధించుటయు. అన్వేషించుటయు; ఇచ్చట పట్టు భక్తిపై నుండును; అయినను జ్ఞానము అప్రధానము చేయబడదు, కేవలము అది ఉద్ధరించబడును, సజీవముచేయబడును, పూర్ణము చేయబడును, మఱియు కర్మయజ్ఞమింకను కొనసాగును. ఇట్లు కర్మ జ్ఞానముల ద్వివిధమార్గము కర్మజ్ఞాన భక్తుల త్రివిధమార్గ మగును. మఱియు (నీ సమగ్ర మార్గముచేత) యజ్ఞఫలము, ఇంకను సాధకునిముం దుంచబడిన ఏక మాత్రఫల మిపుడు ప్రాప్తించును - భగవంతునితో సాయుజ్యము, భగవంతుని పరప్రకృతితో సమైక్యము.

5. కురుక్షేత్రము

1. గీతోపదేశ సందర్భము :

త్రివిధ మార్గమునకు గుర్తులువెట్టుచు, పెద్దపెద్ద అడుగులతో ముందునకు సాగు గీతాగురువు ననుసరించుటకు ముందు, గీతోపదేశమునకు మూలమగు సందర్భమును మఱియొకసారి మనము విచారించదగును -- ఈ సారి ఆ సందర్భమును మానవజీవితమునకును, ప్రపంచగతికిని సైతము ఒక నమూనాగా గ్రహించి, దాని వ్యాపకరూపమును విచారింతము. పోగా త్రివిధమార్గ మన, కర్మప్రేమజ్ఞానముల పరమలక్ష్యమగు పరమపురుషునిలోని కారోహించు (మానవుని) మనో హృదయ బుద్ధుల మార్గము. సందర్భము మూలతః అర్జునుని అంతః సంఘర్షమునకు సంబంధించినదే యైనను, అతడు వేసిన విశిష్టప్రశ్నయు, దాని రీతియు మానవజీవనకర్మల సంపూర్ణప్రశ్నమును లేవనెత్తును- ప్రపంచస్వరూప మేమిటి? దాని లక్ష్య మేమిటి? ఇప్పటి ప్రపంచ జీవనమునకు, ఆధ్యాత్మిక జీవనమునకు పొత్తు ఎట్లు సంభవము? అని ఆ ప్రశ్న నిగ్గదీయును. ఈ గంభీర, కఠిన ప్రశ్నము నంతను గురువు పట్టుదలతో పరిష్కరించును; ఏలన ఈ పరిష్కారము తానాదేశించిన నూతనకర్మకు పునాది యగును. ఈ నూతనకర్మ నూతన సత్తాస్థితి నుండియు విమోచకమగు జ్ఞాన ప్రకాశముచేతను ప్రవర్తించును.

2. జీవనమే సంగ్రామమైనపుడు...

కాని ఇప్పటి యీ ప్రపంచమునందు కర్మచేయుచునే, లోపల ఆధ్యాత్మిక జీవితమును జీవింపగోరు మానవునికి ఎదురగు కఠినత ఏమిటి? అతని ప్రబుద్ధ మానసమునకు భీతిగొల్పి, అతనిలో విషాదమును బుట్టించు ప్రపంచపార్శ్వమేమిటి?- గీతయొక్క ప్రథమాధ్యాయము పేరు 'విషాదయోగ' మగుట అర్థవంతము. ఒకని కింకను తన ఉచ్చతరసత్తతో సమన్వయము కుదురలేదు, అట్టితఱి నాది న్యాయము- అను అతని కంటిపొర చిఱిగిపోగా, విశ్వముయొక్క నగ్నరూపమును చూడక తప్పనపుడు, అతని కనుభూతమగునదే ఆ విషాదమును, నిరుత్సాహమును. ఈ విషాదహేతువగు ప్రపంచపార్శ్వము బాహ్యముగా కురుక్షేత్ర హింసా సంహారాలు, ఆధ్యాత్మికముగా వికరాళమగు ఈశ్వరుని విశ్వరూపదర్శనము; ఇచ్చట కాలస్వరూపము ధరించిన ఈశ్వరుడు తన సంతానమునే మ్రింగివేయుచున్న భయంకరదృశ్యము

గన్పించును. "బ్రాహ్మణులును, క్షత్రియులును అతని ఆహారము, మృత్యువతనికి ఊరగాయ" (కఠ. ఉప.)-అనునదియు అతనిని వర్ణించు నిష్ఠుర రూపకమే. అతడు విశ్వస్రష్టయే గాక, సంహారకర్తయు నగును. సంఘర్షము చేతను, వధచేతను సాగుచుండు విశ్వజీవనమును, మానవజీవమును ప్రపంచ బాహ్యారూపమగును; మహాసృష్టి, మహావినాశములందు తననుదాను పూర్ణమొనరించుకొను విశ్వపురుషుడు (అర్జుననకు భీతిగొల్పు) అంతరరూప మగును. జీవన మొక సంగ్రామము, ఒక కదనరంగము - ఇది కురుక్షేత్రస్వరూపము; భగవంతుడు భయంకరుడు- ఇది అర్జునుడు గాంచిన భగవత్స్వరూపము.

3. వినాశము సృష్టిమూలము :

యుద్ధము సర్వవస్తువుల పిత- యని గ్రీకు తత్త్వవేత్త హెరాక్లిటస్ చెప్పెను. యుద్ధ మన్నింటికి రాజు; అతని ఇతర సూత్రములవలె నిదియు ఒక గంభీర సత్యమును సూచించును. స్థూల లేక సూక్ష్మశక్తుల సంఘట్టనముచేతనే ప్రపంచమున సర్వము, ప్రపంచము సైతము పుట్టుచున్నట్లు గన్పించును; పుట్టి, శక్తులు, ప్రవృత్తులు మఱియు ప్రాణుల సంఘర్షముచే సదా నూతనవస్తువుల సృజించుచు, సదా పురాణవస్తువుల బలిగొనుచు ముందుకు సాగుచున్నట్లు గన్పించును. కాని ఎక్కడకు సాగుచున్నదో ఎవరికిని దెలియదు -- చరమ ఆత్మవినాశనమున కని కొంద రందురు, ఇది అనంతముగా సాగు వ్యర్థ చక్రభ్రమణమని కొంద రందురు. ఈ భ్రమణమున ప్రగతి గలదని ఆశావాది నిర్ణయము; కష్టకల్లోలముల ద్వారా సాగవలసివచ్చినను, ఇది యొక దివ్యావిష్కృతియొక్క అధికాధిక సాదృశ్యమునకు గొనిపోవు నని అతడు చెప్పును. అది ఎట్లున్నను ఒకటి మాత్రము నిశ్చితము: ఇచ్చట వినాశము వినా నిర్మాణము లేదు; విరోధిశక్తుల తుల్యస్థితిచేతనే తప్ప సామరస్యము లేదు; అంతే కాదు, ఆత్మాశనముచేతను (self-feeding), పరభక్షణము చేతను తప్ప జీవనము నిరంతరముగా నిలిచి యుండజాలదు. అసలు మన శరీర జీవనమే ఒక సంతతమరణము మఱియు జననము; కాగా శరీరము స్వయముగా శత్రువులు చుట్టుముట్టిన ఒక నగరము, దాని నాక్రమణశక్తులు ఆక్రమించుచుండగా, రక్షణశక్తులు రక్షించుచుండును -- ఒకదాని నొకటి కబళించుటయే ఈ యుభయ శక్తుల వ్యాపారము, మఱియు నిది మన సంపూర్ణజీవనమున కొక ప్రతిరూపము (నమూనా) మాత్రమే. ఆదిలోనే ఈ ఆదేశము వెలువడినట్లు గన్పించును; "నీ

సహచరులతోను, పరిస్థితులతోను యుద్ధముచేసిననే తప్ప నీకు విజయ ముండదు; యుద్ధముచేతను, సంఘర్షముచేతను, ఇతరప్రాణులను పొట్టబెట్టుకొనుటచేతను తప్ప నీవు జీవించను గూడ జీవించవు. నేను చేసిన ప్రపంచముయొక్క ప్రథమ నియమ మిది: వినాశముచేతనే సృష్టియు, స్థితియు".

4. భక్షించుచు భక్షించబడును :

జగత్తును సూక్ష్మముగా పరిశీలించి, చూడగలిగినంతవఱకు ప్రాచీనవిజ్ఞాన మీ ప్రారంభ ప్రతిపాదన నామోదించును. ప్రాచీనోపనిషత్తులు దానిని స్పష్టముగా దర్శించి, రాజీకి తావులేని స్పష్టశబ్దములలో వచించును; పై పూతలను, సత్యాచ్ఛాదనలను సహించవు. అవి ఇట్లు వక్కాణించును: "అశనాయా హి మృత్యుః" మృత్యురూపమే యగు ఆకలి ఈ ప్రపంచముయొక్క స్రష్టయు, నియామకుడును; మఱియు ప్రాణిక జీవనము నవి 'యజ్ఞాశ్వ' రూపమున చిత్రించును. ఇంకను ఉపనిషత్తులు ద్రవ్యమును 'అన్న' మని వర్ణించుచు, దానికి కారణ మిట్లు నుడువును: "అత్తి, అద్యతేచ అన్నం" ద్రవ్యము భూతములను తినును, తినబడును గనుక, దాని నామ మన్నము. భక్షకుడు భక్షించుచు భక్షించబడును- ఇదియే జడప్రపంచమును శాసించు సూత్రము. దీనినే డార్విను సంప్రదాయమువారు తిరిగి కనుగొని ఇట్లు ప్రతిపాదించిరి: జీవన సంఘర్షము పరిణామశీల ప్రపంచధర్మము. హెరాక్లిటస్ సూత్రములును, ఉపనిషత్తుల రూపకములను ప్రబలతర, విశాలతర, యథార్థతర సూత్రములందు మున్నే ఏ ప్రాచీనసత్యములను వచించియున్నవో, వానినే ఆధునిక విజ్ఞానము క్రొత్త పదములలో కూర్చినది.

5. సమస్యను గుర్తించినపుడే పరిష్కారము :

యుద్ధము జీవితముయొక్క ఒక పార్శ్వము, ఆదర్శమానవు డొక యోధుడు- అని నీతసే మహాశయుడు పట్టుదలతో ప్రతిపాదించును - మానవు డారంభమున ఒంటె-మానవుడు గావచ్చును, తర్వాత శిశు-మానవుడు గావచ్చును, కాని పిమ్మట సింహ-మానవు డైననే తప్ప పరిపూర్ణత నందుకొనజాలడు. ఈ సిద్ధాంతములెంతో ఆక్షేపణకు గుఱియైనవి: వీనినుండి నీతసేగారు వెలికిదీసిన నైతిక, వ్యావహారిక నిర్ణయములనుండి మన మెంతగా భేదించినను, వీనిలో కాదనలేని గుణము గలదు, మఱియు నివి మనము చూడ నిచ్చగించని సత్యమును స్మరింపజేయును. అట్లు

స్మరింపజేయుట మంచిది గూడను; ఏలన 1. బలవదాత్మకు దానివలన ప్రోత్సాహము గలుగును; దార్శనిక, ధార్మిక లేక నైతిక భావుకత (sentimentalism) పుట్టించు అలసటనుండి అది మనలను కాపాడును– ఈ భావుకత ప్రకృతియొక్క ప్రాణ రూపమును, ప్రేమను, అందమును, మంచినే చూడగోరుచు, దాని వికరాళ మృత్యు వేషమునుండి మొగము త్రిప్పుకొనును; భగవంతుని శివునిగానే ఆరాధించుచు, రుద్రునిగా ఆరాధించ నిరాకరించును; 2. సృష్టితత్త్వములోనికి సూటిగా చూడగల సత్యతాసాహసములు మన కున్న నే గాని, దాని అపశ్రుతులు మఱియు విరోధముల శక్తిశాలిపరిష్కారమును మన మెన్నటికి జేరుకొనజాలము. జీవనము మఱియు ప్రపంచములయొక్క ఉన్న రూపును ముందు మనము చూచినచో, పిమ్మట ఉండవలసిన రూపునకు వానిని మార్చగల సమీచీనోపాయమును కనుగొనుట మనకు తెలికయగును. సృష్టియొక్క అప్రియరూపమునందే దాని చరమ సామరస్య రహస్య మిమిడియున్నచో, ఆ రూపము నుపేక్షించుటచేత లేక తృణీకరించుటచేత, ఆ రహస్యము మనకు చిక్కదు గాన, మన పరిష్కారప్రయత్నములన్నియు విఫలమయి పోవును. అట్లుగాక, తదప్రియరూపము చావగొట్టి, రూపు మాపవలసిన శత్రువే యగుచో, అప్పుడును దాని శక్తిని, జీవితముపై దానికి గల పట్టును తక్కువ అంచనా వేయుటచేత గాని, గతముయొక్క సక్రియభాగము నందును, సృష్టియొక్క కార్యసాధక తత్త్వములందును అది ఎంత లోతుగా వేరూని యున్నదో చూడ నిరాకరించుటచేత గాని మన కేమి లాభము?

6. అంతరజీవితమునందును యుద్ధతత్త్వము :

మన శుద్ధ భౌతికజీవనమునందే గాక, మన మానసిక, నైతిక జీవనము నందును యుద్ధము మఱియు వినాశము నొక సార్వత్రికతత్త్వమై యున్నవి. ఇది స్వయంస్పష్టము: బౌద్ధిక, సామాజిక, రాజకీయ, నైతికరంగములందు వాస్తవ మానవ జీవనమున సంఘర్షము లేక మనము ఒక్క ముందడుగు వేయలేము– ఇపు డేది జీవించుచున్నదో, దాని స్థానమున ఇక ముందేది జీవింపజూచుచున్నదో, వీనికిని, వీని వుపబలకముగా నున్న వానికిని మధ్య సంతతయుద్ధము సాగుచున్నది. కనీసము మానవులు, ప్రపంచము ఇప్పటివలె నున్నంతవఱకు, పురోగమించుచునే అహింసాధర్మమును అక్షరాల పాటించుటసంభవము; అయినను ఇదియే సర్వ శ్రేష్ఠ అచారనియమముగా మనముందుంచబడుచున్నది ! ఆత్మశక్తినే ఉపయోగించెదము,

రక్షణార్థము సైతము బలప్రయోగము చేయము అందువా? మంచిది, కాని ఆత్మశక్తి కార్యసమర్థ మగువఱకు, మానవుల మఱియు జాతులయందలి అసురశక్తి మఱింత విశృంఖలముగా రక్తము చిందించుచు, ప్రపంచము నపవిత్రము చేయును; దీనిని మన కళ్ళెద ౦ చూచుచునే యున్నాము. ఇట్లు ఇతరుల బల ప్రయోగము కంటెను నీ అస్త్రసన్యాసమే బహుశః ఎక్కువ వినాశమునకు కారణమగును. అయినను నీవు చూపిన ఆదర్శము క్రమముగా మంచి స్థితికి దారితీయ వచ్చును, కనీసము దారి తీయవలయును. కాని ఆత్మశక్తి సైతము, కార్యసమర్థమైనపుడు, ధ్వంసముచేయును. అది ఖడ్గముకంటెను, ఫిరంగికంటెను ఎంత ఎక్కువ భయంకరమో, వినాశకరమో, కండ్లు తెఱచి దానిని ప్రయోగించిన వారికి మాత్రమే తెలియును; మఱియు నా ప్రయోగకర్మకును, దాని తత్క్షణఫలితములకును తమ దృష్టిని పరిమితము చేయని వారికి మాత్రమే దాని పశ్చాత్ఫలితము లెంత దారుణమో, విధ్వంసకరమో కన్పట్టును. తనపై నుపజీవించున దంతయు నష్టము గాకుండ, అధర్మము తాను నశించజాలదు. కావున హింసాదృశ్యమువలన గలుగు బాధ మనకు తప్పినను, ఆత్మశక్తి ప్రయోగము వలన గలుగు విధ్వంసము తక్కువేమియు గాదు.

7. అప్రతీకారమువలన మఱింత ప్రతీకారము :

ఇంకను, ఆత్మబలము నుపయోగించినపు డెల్ల, మన ప్రత్యర్థిపై నొక మహాకర్మశక్తిని రేపినవార మగుదుము, కాని దీనియొక్క తర్వాతి క్రియ మన అదుపులో నుండదు. ఉదాహరణకు, వశిష్ఠుడు విశ్వామిత్రుని సైనికబలముపై తన ఆత్మబలమును ప్రయోగించి, పైకి మిన్నకుండును; ఫలితము-- హూణ, శక, పల్లవసేనలు విశ్వామిత్రునిపై విఱుచుకొనిపడును. బలప్రయోగము, ఆక్రమణ జరిగినపుడు, ఆధ్యాత్మికమానవునియొక్క శమ నిష్క్రియతలే ప్రపంచముయొక్క ప్రచండశక్తులను ప్రతీకారచర్యకు పురికొల్పును. కావున కత్తితోనైనను అధర్మ ప్రతినిధుల నాపుట వారిపట్ల అధికతరదయ చూపినట్లే యగును; అట్లాపనిచేయనిచో, వారి దుండగములు మితిమీఱును, అపుడు ప్రతీకారశక్తులు వారి నెంతో ఎక్కువగా మట్టుబెట్టును. సంఘర్ష, వినాశధర్మము రూపుమాసి పోవలె నన్న, మన చేతులు శుచిగాను, మన ఆత్మలు నిష్కళంకముగాను నున్న చాలదు; అధర్మముయొక్క పాదు ముందంతరించవలెను. నిష్క్రియతాజడత లసలే ఈ నియమమును కదల్చలేవు. నిజానికి రజస్సుకంటె తమస్సే ఎక్కువ అపకారము చేయును, ఏలన రజస్సు తాను

సంహరించినదానికంటె నెక్కువ సృజించును. కనుక వ్యక్తి స్థూల సంగ్రామము నుండియు, దాని అనుషంగికఫలమగు వినాశము నుండియు నివృత్తు డగునేని, అది అతని నైతికభావమునకు సాయపడవచ్చునేమో గాని, భూతముల సంహారశక్తిని యాథాపూర్వముగానే విడిచివేయును.

8. ప్రేమధర్మము లేకపోలేదు గాని ...

ఒక్క మాటలో, మానవచరిత్ర యంతయు ప్రపంచమున ఈ సంహార తత్త్వము యొక్క అవిచాల్యశక్తికిని, నిరంతరస్థితికిని సాక్ష్య మిచ్చుచున్నది. కాని సహజముగానే, దీని తీవ్రతను తగ్గించి, దీని వ్యతిరేకరూపములను నొక్కి చెప్పుదుము. ఎట్లన సంఘర్ష వినాశములే సర్వము గావు; అపయోగమును, పరస్పర సంఘర్షమును గలిగించు సంహారశక్తి యన్నటులే, సంయోగమును, పరస్పర సాహాయ్యమును ఘటించు సంరక్షకశక్తియు నిక్కడ గలదు; నేను-అని భుజము చఱచు అహంకారికశక్తి యున్నటులే ప్రేమశక్తియు గలదు; మనకొఱకు నితరుల నాహుతి జేసికొను ప్రేరణ వలెనే ఇతరులకు మన నాహుతిజేసికొను ప్రేరణయు గలదు. కాని ఈ సాధుశక్తులు వాస్తవముగా నెట్లు ప్రవర్తించునో చూచినపుడు, వాని ప్రతిరూపముల శక్తిని తగ్గించుటకు గాని, ఉపేక్షించుటకు గాని మన ముబలాటపడము. చూడుడు: పరస్పరసాహ్యామునకే గాక, ఆత్మరక్షణ, దురాక్రమణలకు గూడ సంయోగమును రుపొందించుట జరిగినది. ఈ సంయోగము స్వయముగా యుద్ధమునకు, అహంకారమునకు, స్వాధికారస్థాపనకు నొక సేవకుడుగా నుపయోగపడినది. ఇక ప్రేమ సదా ఒక మృత్యుశక్తిగానే వ్యవహరించినది. విశేషించి అహంకారము వాని నాలింగనము చేసికొనిన రూపమున, శుభ ప్రేమయు, భగవత్ప్రేమయు ఎంతో సంహార వినాశములకు గారణములైనవి. పోగా, ఆత్మాహుతి ఒక మహిత, సముదార వస్తువు, నిజమే, కాని తన అత్యున్నతరూపమున మరణముచేత జీవన మను ధర్మముయొక్క అంగీకారమే యగును; ఏ శక్తిదేవతకు బలిపెట్టిన గాని మన కార్యము సిద్ధించదో, మన ఆత్మాహుతి ఆ దేవతావేదికపై నర్పించిన బలియగును. తన బిడ్డలను రక్షించుకొనుటకు తల్లి పక్షి ఘాతకమృగమునకు ఆహుతియగును. దేశభక్తుడు దేశవిముక్తికి ప్రాణము లర్పించును, ధార్మికుడు ధర్మముకొఱకు, భావుకుడు భావముకొఱకు బలి యగుదురు- ఇవి జంతుజీవనముయొక్క పరావరశ్రేణులయందు

గన్పించు, ఆత్మాహుతియొక్క అత్యున్నత దృష్టాంతములు, మఱియు నివి దేనికి నిదర్శనమో, అది మనకు స్పష్టమే.

9. క్రైస్తవము వ్యాసించెను గాని క్రీస్తు గాదు !

తర్వాతి ఫలితముల కేసి చూతు మేని ఆశాభావము మఱింత సన్నగిల్లును. దేశభక్తుడు దేశవిముక్తి కొఱకు మరణించుటను జూడుము, మఱియు కర్మప్రభు వట్లు అతని రక్తమును, దుఃఖమును మూల్యముగా జెల్లించివేసిన కొన్ని దశాబ్దుల తర్వాత అదే దేశమును పరికించుము; ఆశ్చర్యము! అదే మఱల ఉపనివేశ దేశములను, పరతంత్రదేశములను పీడించును, కొల్లగొట్టును, జయించును; తన కండలను పెంచుకొనుటకు ఇతరుల నాక్రమించి మ్రింగివేయును. క్రీస్తు జయించుట కొఱకు, క్రైస్తవమతము వ్యాపించు నిమిత్తము సామ్రాజ్యశక్తిని ఆత్మ శక్తితో ఢీకొనుచు, క్రైస్తవవీరులు వేల సంఖ్యలో ప్రాణము లర్పింతురు. ఫలితముగా ఆత్మశక్తి నిక్కముగా జయించును. క్రైస్తవము నిక్కముగా వ్యాపించును - కాని క్రీస్తు కాదు; ఆ విజయోపేతమతము యుద్ధశీలము, అధిపత్యపరమునగు చర్చిగా మాఱి, తాను తొలగించిన మతము మఱియు సామ్రాజ్యముకంటెను ఎక్కువ మతోన్మాదముతో పీడించు శక్తియగుచున్నది. చివరకు మతములే పరస్పరసంఘర్షశక్తులుగా సంఘటితములై, జీవించి, పెరిగి, ప్రపంచము నంతను ఆక్రమింప నుగ్రముగా పోరాడుచున్నవి.

10. కరాళకాళియు భగవంతుడే :

ఇదంతయు దేనిని చూపును? జగజ్జీవనమున ఒక (సంఘర్ష) తత్త్వము గలదు, బహుశః అది యొక ప్రాథమిక తత్త్వము; అయితే దానిని జయించుటెటులో మనకు దెలియదు; కారణము, అసలది అజేయము, లేక దానిని ప్రశాంతముగా గుర్తించి, దాని స్వరూపము నెఱుంగుటకు ప్రబల, నిష్పక్షపాత నిరీక్షణముతో దానిని మనము వీక్షించియుండలేదు. పరిష్కార మెట్టిది యైనను, సమీచీన పరిష్కారము బొందుటే మన లక్ష్యమగుచో, సృష్టిముఖములోనికి మనము సూటిగా చూడవలెను. మఱియు సృష్టిముఖములోనికి జూచుట యన భగవంతుని ముఖములోనికి జూచుటయే; వానిని రెండింటిని వేఱుచేయలేము, మఱియు సృష్టి నియమముల బాధ్యతను ఆ నియమములను సృజించిన భగవంతునిపై నుండియు, వానినిగూర్చిన బ్రహ్మము

పై నుండియు తొలిగించలేము. ఇచ్చటను మనము సత్యమునకు తేనె బూసి, అటునిటు ఊగులాడ నిచ్చగింతుము. మన మొక ప్రేమ భగవంతుని నిలబెట్టి, న్యాయ, శీల ధర్మములకు సంబంధించిన మన నైతికభావనల ననుసరించి, అతడు న్యాయనిష్ఠుడు, శీలవంతుడు, ధర్మాత్ముడు నని అనుకొందుము, మఱియు తక్కిన దంతయు నతడు గాదు లేక అతనిది గాదు అని చెప్పుదుము; తక్కిన దంతయు నొక సైతాను సృష్టి, అత డేలనో దానిని తన దుష్టసంకల్పము సాధించుకొననిచ్చెను; లేక తక్కిన దంతయు స్వార్థపరుడు, పాపాత్ముడు నగు మానవుని దుష్కృతిరూపము, భగవంతుడు మూలమున నిర్దుష్టముగా జేసిన సృష్టి నతడే భ్రష్టము గావించెను- అని చెప్పుదుము. కాని మానవునికి పూర్వము జంతులోకములోని మరణము మఱియు భక్షణనియమము మాటేమిటి? లేక ఏ ప్రచండప్రక్రియచేత ప్రకృతి నిక్కముగా సృజించుచు, పోషించుచు, అదే అడుగులో అదే చేతులతో చంపుచు, నాశముచేయుచు నుండునో, దాని మాటేమిటి? కొన్ని మతములు మాత్రమే, ఉదాహరణకు, భారతీయుల మతము, ఈ నిగూఢ ప్రపంచశక్తి త్రిమూర్తియగు నొకే దేవతయని నిస్సంకోచముగా చెప్ప సాహసించును; జగద్వ్యాపారము నిర్వహించు మహాశక్తి కల్యాణకారిణియగు దుర్గారూపముననే గాక, సంహార నృత్యకారిణియగు కరాళకాళీరూపముననను ఉండును గాన, ఇంకను సాహసముతో నిట్లు పలుకును, "ఈమెయు తల్లియే; ఈమెను గూడ తల్లిగా నెఱుంగుము; నీకు బలమున్నచో, ఈమెను గూడ నారాధింపుము". మఱియు నిట్టి ధీరసత్యతయు, ప్రచండ సాహసమును గల మతము తదితరమత మేదియు చేయలేని రీతిని ప్రగాఢము, పరివ్యాప్తము నగు ఆధ్యాత్మికతను సృజించగలిగె ననుట చాల అర్థవంతము. ఏలన యథార్థ ఆధ్యాత్మికతకు సత్యము పునాదియు, సాహస మాత్మయు నగును- "తస్యై సత్యం ఆయతనం" (కేన. ఉప)

11. మర్త్యజీవనముద్వారా అమరజీవనము :

సంఘర్షవినాశములు జీవనముయొక్క అద్యంతములు, సామరస్యము యుద్ధముకంటెను శ్రేష్ఠము గాదు, మృత్యవుకంటెను ప్రేమ ఎక్కువగా అభివ్యక్తమైన భగవద్రూపము గాదు- అని మనము చెప్పుటలేదు; అటులే పశుబలమునకు బదులు ఆత్మబలమును, యుద్ధమునకు బదులు శాంతిని, సంఘర్షమునకు బదులు

సంఘీభావమును, అహంభావమునకు బదులు విశ్వభావమును ప్రవేశపెట్టు దిశగా మనము పురోగమించరా దని పై చర్చయొక్క తాత్పర్యము గాదు. భగవంతుడు వినాశకర్తయే గాడు, భూత సుహృదుడు గూడను (5-29); విశ్వాధికృత త్రిమూర్తియే గాడు, తదతీతుడును, కరాళకాళి ప్రేమమయి, హితకరి యగు తల్లిగూడను; అటులే కురుక్షేత్రాధినేత దివ్యసఖుడు మఱియు సారధి, భూతమోహనుడు, అవతార కృష్ణుడు. అతడీ సంగ్రామాదుల ద్వారా మనలను సరిగా నెక్కడకు నడుపుచున్నాడో తెలియదు గాని, మనము నొక్కి చూపుచున్న ఈ సంగ్రామాదుల కతీతముగా మాత్రము నడుపుచున్నాడు, సందియము లేదు. కాని ఆ అతీతత్త్వ మెట్టిదో, దాని నిబంధన లేవియో మనము కనుగొనవలసియున్నది; మఱియు నట్లు కొనుగొనుటకు ప్రపంచమును యథాతథముగా పరికించి, దానియందు స్వయముగా నభివ్యక్త మగుచున్న అతని క్రియకు సరిగా మదింపు వేయవలెను; అపుడుగాని మార్గమును, గమ్యమును ఎక్కువగా వెలుగులోనికి రావు, అనగా కురుక్షేత్రమును (సంగ్రామమును) మన మంగీకరించవలెను; అమరజీవనమునకు మార్గమును కనుగొనక పూర్వము, మరణముచేత జీవనమను నియమమునకు తలయొగ్గవలెను; కండ్లు తెఱచి, అర్జునుని దృష్టికంటె తక్కువ భీతదృష్టితో ఈశ్వరుని మృత్యురూపమును దర్శించి, అది లేదనుటను, దానిని ద్వేషించుటను, లేక దానినుండి పాఱిపోవుటను మానుకొనవలెను.

6. మానవుడు, జీవన సంగ్రామము

1. భగవంతు దున్నచో, పరిష్కారము :

క్రిందటి వ్యాసము ననుసరించి, సముదారరూపమున గీతాబోధనను గ్రహించవలె ననిన, దాని దృక్కోణమును, అభివ్యక్తప్రకృతిని, ప్రపంచప్రక్రియను సూటిగా చూచు దాని ధైర్యమును మన మంగీకరించవలెను. కురుక్షేత్ర దివ్యసారథి ఒక ప్రక్క సర్వలోకమహేశ్వరునిగాను, సర్వభూతసుహృదునిగాను, సర్వజ్ఞగురువును గాను రెండవ ప్రక్క, "జనసమూహవినాశమునిమిత్తము విజృంభించిన" (11-32) సంహారరూప కాలపురుషునిగాను తనను ప్రకటించుకొనును. గీత ఇప్పట్టున హిందూమతముయొక్క విశాలభావము ననుసరించి, ఇదియు భగవంతుడేనని వక్కాణించును; సందుదారినుంచి తప్పించుకొని, ప్రపంచ ప్రహేళికను (సమస్యను) దాటవేయ బ్రయత్నించదు. నిజానికి, ప్రపంచము నొక వివేకశూన్యమగు జడశక్తి యొక్క యాంత్రికక్రియగా మాత్రమే మనము భావించనిచో, లేక, అనాదిశూన్యము నుండి ఆవిర్భవించిన భావములయొక్క అలతగాను యాంత్రికమగు ఖేలనముగా దలంచనిచో, అటులే దేనిని అంటని బ్రహ్మాధారముపై పెంపొందిన ఒక స్వప్న పరిణామముగా నూహించనిచో, అట్లూహించక, ప్రపంచమును భగవదభివ్యక్తియే యని గీతవలె మనమును అంగీకరించుచో, అపుడు మానవుడు కఠినమగు నొక మహాశ్రద్ధమీద నాధారపడి తన యాత్ర నారంభించవలెను. ఏలన గీతాభగవంతుడు సర్వగతుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తుడు; అయినను సదా సర్వాతీతుడు; అతడే ప్రపంచమును ప్రపంచమునందలి తనను అభివ్యక్తము చేసికొనును; అతడు సేవకుడు గాక, తన సృజనాత్మక చేతనకు (మాయకు), తన ప్రకృతికి, తన శక్తికి స్వామి యగును; అతడు తన ప్రపంచభావనయందు గాని, రూపకల్పనయందుగాని తాను సృజించిన మానవుడు లేక దానవుని చేత అప్రతిభుడు లేక పరాభూతుడు గాడు; తన సృష్టియొక్క ఎట్టి భాగమున కైనను సంబంధించిన బాధ్యత తాను సృజించిన వానిపై నెట్టివేయవలసిన అగత్య మతని కుండదు. ఈ ప్రపంచము పరస్పరము పోరుసల్పుచుండు అంధకారశక్తులచేత సృజింపబడిన యొక కల్లోలముగా బాహ్యానికి గన్పించును, సంతతపరివర్తనము మఱియు మరణముచేతనే ఇచ్చట ప్రాణము నిల్చును; తాను నివసించు నిట్టి ప్రపంచమునం దంతటను మానవుడు భగవంతుని

గాంచవలెను; కాంచి, ఇచ్చటి ప్రహేళిక కొక పరిష్కార ముండవలెను. ఇచ్చటి అజ్ఞానమున కావల సమన్వయాత్మకమగు నొక జ్ఞానము భాసించవలెను- అని యెఱింగి, "ప్రభూ! నీవు నన్ను కబళించినను, నీయందే నమ్మక ముంతును"- అను మహాశ్రద్ధయం దతడు ప్రతిష్ఠితుడు గావలెను. మానవవిచారణ లేక విశ్వాస మంతయు, అది ఆస్తికమైనను, విశ్వదేవతాక (Pantheistic) మైనను, నాస్తికమైనను, అది సక్రియము, సద్భావాత్మకము (affirmative) నగుచో, దానియందు న్యూనాధికముగా అట్టి వైఖరి యిమిడియే యుండును. ఆ వైఖరి అంగీకరించును మఱియు విశ్వసించును: ప్రపంచము యొక్క అపశ్రుతుల నంగీకరించును, మఱియు భగవంతుడు, విరాట్పురుషుడు, లేక ప్రకృతియొక్క ఒకానొక పరమతత్త్వమునందు విశ్వాస ముంచును- ఆ పరమతత్త్వము ఈ అపశ్రుతులను తరించుటకు, జయించుటకు లేక సమరసము గావించుటకు, బహుశః మూడింటిని కలిపి సాధించుటకు, అనగా జయించి, తరించుట ద్వారా సమరసము గావించుటకు మనకు శక్తి నిచ్చునను విశ్వాస ముంచును.

2. సంగ్రామము మానవజీవితమున కొక పార్శ్వము :

కాగా వాస్తవమానవజీవితమును గుఱించి, దాని సంఘర్షము మఱియు సంగ్రామపార్శ్వమును మన మంగీకరించవలెను- ఈ సంగ్రామము ఒకొకసారి కురుక్షేత్రమువంటి మహాసంకటమున గూడ పర్యవసించగలదు. గీత తన సన్నివేశముగా, మానవజాతి మధ్యమధ్య కుదిపివేయు అట్టి సంకట మఱియు సంధి సమయమును ఉపయోగించుకొనును; అట్టి సంకటమున బౌద్ధిక నైతికము, సామాజికరాజకీయము, మతరూపము నగు అత్యంతవినాశము, పునర్నిర్మాణము సంభవించును, మఱియు నివి ఇప్పటి మానవపరిణామదశలో యుద్ధ సంక్షోభము ద్వారానే తమ చరమస్థాయి నందుకొనును. గీత అట్టి ప్రచండసంకటముల నామోదించి, అచటినుండియే ముందుకు సాగును; మఱియు నది సంగ్రామనైతికపార్శ్వమునే గాక, అనగా ధర్మాధర్మములకు, శుభాశుభములకు మధ్య రేగు సంఘర్షమునే గాక, దాని భౌతికరూపమును గూడ, అనగా ధర్మాధర్మములకు ప్రాతినిధ్యము వహించు మానవుల మధ్య సాయధయుద్ధమును గూడ నామోదించును. గీతకాలమున యుద్ధము మానవనాగరికతలో ఇప్పటికంటెను ఎక్కువ ఆవశ్యకముగా నుండె నని మనము విస్మరించరాదు, అట్టియెడ జీవన ప్రణాళికనుండి దానిని

ఎత్తివేయగోరు తలంపు గగనపుష్పమే యగును. విశ్వశాంతి మఱియు సద్భావముల సిద్ధాంతము మన ప్రగతికి సంబంధించిన చారిత్రకయుగమునం దెప్పుడును మానవ జీవనమున ఏలింప సమర్థముగాలేదు; కారణము, నైతికముగా, సామాజికముగా, ఆధ్యాత్మికముగా మానవజాతి అట్టి అతీతజీవనమునకు సిద్ధపడలేదు, క్రమ పరిణామము నందుచున్న ప్రకృతిదశయు అట్టి తక్షణ పరివర్తన కవకాశ మివ్వలేదు. ఇప్పుడు సైతము విరుద్ధ ప్రయోజనముల సమాధానము - సామరస్యము గాదు - కేవలము సంభవము కాగల స్థితిని దాటి మనము పురోగమించలేదు, ఈ స్థితి భయంకర సంఘర్షరూపముల పునరావృత్తిని ఒక కనిష్ఠస్థాయికి తగ్గించవచ్చును మాత్రము. ఈమాత్రఫలమును సాధించుటకు మానవజాతి తన ప్రకృతికి వశమై, అవలంబించవలసివచ్చిన ఉపాయము? చరిత్రలో కనివిని యెఱుంగని ఘోర పరస్పరసంహారము! కటుతాద్వేషములతో నిండిన ప్రపంచయుద్ధము: ఇదియే విశ్వశాంతికి ఆధునికమానవుడు కనుగొనిన సూటి మార్గము, జైత్రసాధనము! ఈ పరిణామమునకు మూలమును మానవప్రకృతిలో సంభవించిన ఎట్టి ప్రాథమికపరివర్తనమునుగాక, భౌద్ధికాభిప్రాయములు, ఆర్థికసదుపాయములు, రాజకీయసమాధానములు, రక్తపాతముపట్ల భావికకంపము, యుద్ధభీతియు మాత్రమే యగును; కావున యుద్ధము చేత సాధించిన శాంతి నాలుగుకాలాలు నిలబడు నను ఆశయు లేదు. విశ్వశాంతి రాజ్యమేలుటకు మానవజాతి ఆధ్యాత్మముగా, నైతికముగా, సామాజికముగా సంసిద్ధమగు ఒక శుభదినము రావచ్చును. వచ్చి తీరు ననియే మన అభిప్రాయము; ఈ లోపున యుద్ధము జీవనముయొక్క ఒక పార్శ్వమనియు, మానవుడు యోధుడనియు వ్యావహారిక తత్త్వశాస్త్రము, ధర్మశాస్త్రము గుర్తించి, దానికి తగిన ఏర్పాటు చేయవలెను. ఉండవలసిన రూపమును గాక, ఇపు డున్న రూపమున గీత మానవ జీవితమును చేపట్టి, ఈ సంఘర్షజీవనమునకును, ఆత్మస్థితికిని ఎట్లు పొత్తు కుదుర్చ గలము?- అను ప్రశ్నను లేవదీయును,

3. స్వభావమును బట్టి వృత్తి :

కావుననే గీతోపదేశము ఒక యోధునికి, కర్మనిష్ఠునికి చేయబడును. యుద్ధము, రక్షణము జీవితమున నీ యోధుని కర్తవ్యము. యుద్ధ మెందుకు? 1. యుద్ధకర్తవ్యము నుండి ఎవరు మినహాయించబడిరో, మఱియు నాత్మరక్షణయందెవరికి అధికారము లేదో, అట్టి వారిని బలవంతుల, దుష్టుల బారినుండి రక్షించుటకు యుద్ధము;

2. ఈ భావముయొక్క నైతిక విస్తారముగా, దుర్బలుల, పీడితుల రక్షణమునకును, ప్రపంచమున ధర్మన్యాయముల పాలనమునకును యుద్ధము, ఏలన వ్యావహారిక, సామాజికములు, నైతిక, వీరోచితములు నగు ఈ భావము లన్నియు క్షత్రియుని గుఱించిన భారతీయ భావనలో నంతర్గతముగా నుండును-ఈ క్షత్రియుడు వృత్తిచేత యోధుడును, శాసకుడును, స్వభావముచేత వీరుడును, రాజును; క్షత్రియ భావము కంటె విశాలతరమగు గీతభావములే మన కతిముఖ్యము లైనను, ఏ విశిష్ట భారతీయ సంస్కృతినుండి, సాంఘికవ్యవస్థనుండి అవి ఉద్భవించినవో, వానినుండి అవి గొను బాహ్యావర్ణమును, క్రియాప్రవృత్తిని మనము పూర్తిగా విడిచి వేయరాదు. ఏలన అప్పటి వ్యవస్థ తన భావనయందే ఇప్పటివ్యవస్థనుండి భేదించును. ఆధునిక దృష్టికి ఒకే మానవుడు మేధావియు, యోధుడును, ఉత్పాదకుడు లేక కార్మికుడును - అన్నియు నగును. కావున ఇప్పటి సమాజము ప్రతివ్యక్తి నుండియు, అతని స్వీయప్రకృతిని, స్వభావమును పాటించకయే, సమాజముయొక్క బౌద్ధిక, సైనిక, ఆర్థిక జీవనమునకును, అవసరములకును అతని వంతును లాగ గోరును. కాని ప్రాచీన భారతీయనాగరికత వైయక్తిక ప్రకృతికి, ప్రవృత్తికి, స్వభావమునకు విశిష్టప్రాముఖ్య మిచ్చి, దానిని బట్టియే సమాజమున వ్యక్తియొక్క నైతికరూపమును, వృత్తిని, స్థానమును నిర్ణయింపజూచెను. మఱియు మానవుడు ప్రధానముగా సాంఘికజీవు డని అది భావించక, వికాసమానఆధ్యాత్మిక జీవునిగానే భావించెను; కాగా అతని సాంఘికజీవనము, నైతికధర్మము, స్వభావఖేలనము, కర్మాచరణము అతని ఆధ్యాత్మికవికాసమునకు సాధనములు, అవస్థలు మాత్రమే యగును. విచారణ మఱియు జ్ఞానము, యుద్ధము మఱియు రాజ్యపాలనము, ఉత్పత్తి మఱియు పంపకము, శ్రమ మఱియు సేవ- వీనిని జాగ్రత్తగా విభజించి, ఎవరికి ఏ కర్మపట్ల స్వాభావిక ప్రవణత యుండునో, వారి కా కర్మయే అప్పగించబడెను; అట్లు వారు వైయక్తికముగా తమ ఆధ్యాత్మికవికాసము మఱియు స్వీయ సంసిద్ధి దిశగా పురోగమించగలరు.

4. ఇప్పటి సంఘవ్యవస్థలోని గుణదోషములు :

మానవ కర్మకలాపముయొక్క ముఖ్యవిభాగము లన్నింటి యందును ప్రతి మానవుడు పాల్గొనవలసినదే యను ఆధునికభావనయందు కొన్ని లాభములు గలవు; సమాజజీవనమునందు అధికతర సంఘటనకు, సమైక్యమునకు, పూర్ణతకును,

సంపూర్ణమానవుని అధికతర సమగ్రవికాసమునకును అది దోహదము చేయును; దీనికి ప్రతిగా, చివరకు భారతీయవ్యవస్థ తెచ్చిపెట్టిన అనంత విభజనలు, మితిమీఱిన విశేషీకరణమును (specialisation), మఱియు వ్యక్తిజీవనమును కుంచించి, కృత్రిమముగా బంధించుటయు మనకు గన్పించును. కాని ఆధునిక భావనయందు నష్టములు సైతము గలవు; తుచ తప్పకుండ అమలుచేయుటచేత కొన్ని మార్గములలో నది పరిహాసాస్పదము, విపత్కరము నగు వైపరీత్యములకు దారితీసినది. ఆధునిక యుద్ధస్వరూపమును జూచిన మన కిది బాగుగా స్పష్టపడును. దేశరక్షణ ఆధునిక భావము ననుసరించి అందరి కర్తవ్యమును; కావున మనీషులు, కళాకారులు, తత్త్వవేత్తలు, పురోహితులు, వర్తకులు, కర్మకారులు– వారు, వీ రనక దేశ మందరిని యుద్ధములోనికి త్రోసివేయును; చంపవలెను, చావవలెను– ఇదియే అక్కడ వారు చేయవలసిన కర్మ! దీనివలన సమాజజీవన మస్తవ్యస్త మగును, హేతువివేక ములు త్రొక్కివేయబడును. జీత మిచ్చి శాంతిని ఉపదేశింప నియుక్తుడైన పురోహితుడు సైతము తన అంతరాత్మను చంపుకొని, విధిలేక యుద్ధములో ప్రవేశించి, తన సోదరమానవులను చంపవలెను! ఇట్లు సైనికరాజ్యముయొక్క యథేచ్ఛ ఆదేశముచేత అంతరాత్మ, స్వభావములు అతిక్రమించబడుటయే గాక, ఉన్మాదస్థితి వఱకు లాగబడిన జాతీయరక్షణ జాతీయ ఆత్మహత్య యగుటకు తాను చేయ వలసిన దంతయు చేయును.

5. గీతాయుద్ధము ఆదర్శయుద్ధము :

దీనికి ప్రతిగా, యుద్ధసంభవతను, వినాశమును సాధ్యమైనంత తగ్గించుటే భారతీయసంస్కృతికి లక్ష్యముగా నుండెను. ఇందునిమిత్తము సమాజములోని ఒక చిన్న వర్గమునకు మాత్రమే అది క్షాత్రధర్మమును పరిమితము గావించెను; జన్మచేతను, స్వభావముచేతను, సంప్రదాయముచేతను వీరీవృత్తికి తగినవారు; కావున ధైర్యము, నియతశ క్తిప్రయోగము, ప్రబలపరోపకారిత, సముదారవీరత, మున్నగు గుణము లందు అంతరాత్మవికాసముద్వారా తమ అభివృద్ధికి వృత్తి సహజసాధన మగును. తక్కిన సమాజము వీరిచేత హత్యావమానములనుండి సర్వదా రక్షింపబడుచుండెను; తక్కినవారి జీవన, జీవికలపై యుద్ధప్రభావ మతిస్వల్పము. మఱియు మానవ స్వభావము యొక్క రణప్రియ, వినాశకర ప్రవృత్తికి లభించు రంగము కుదించబడెను. కాగా అదే సమయమున యుద్ధచర్య సమున్నత నైతికాదర్శముల కఠినము

చేయబడుటచేత, యోధులను ఉదారులను, ఉన్నతులను చేయుటకే అది తోడ్పడు చుండెను. గీత లక్షించిన దిట్టి యుద్ధమునే, ఇతర మానవ కార్యకలాపమువలనే అది వారి నైతిక, ఆధ్యాత్మిక వికాసమున కుపకరించులాగున పరిమితము, నియమితము నగు యుద్ధము, మఱియు నపు డిట్టి వికాసమునే సమస్త వాస్తవ మానవలక్ష్యముగా పరిగణించుచుండిరి. అట్టి యుద్ధము జాగ్రత్తగా నిర్ణయించబడిన అవధులలో మానవవ్యక్తుల శారీరిక జీవనమునకు వినాశము కల్గించినను. వారి ఆంతరజీవనమునకును, జాతియొక్క నైతిక జీవన సమున్నతికిని అది దోహదము చేయుచుండెను. ఆదర్శ నిష్ఠమైన గతమునందలి ఇట్టి యుద్ధము ఇట్టి సమున్నతిని సాధించుచు, భారతీయుల క్షత్రియాదర్శమునకును, జాపానీయుల 'సమురాయి' ఆదర్శమునకును మెట్లుగట్టుచుండెను; దీనిని స్వపక్షాంధులగు శాంతివాదులు మాత్రమే కాదనగలరు. యుద్ధము తన కార్యము నెరవేర్చినపుడు, అదృశ్యము తప్పక కావచ్చును; ఏలన అది తన ఉపయోగితను మించి, ఒకవేళ నిలిచియున్నచో, అపు డది కేవల నిష్ఠురహింసారూపమే యగును. వికాసశీల మానవజాతి వివేకము దానిని త్రోసివేయును; కాని మన పరిణామమును గుఱించిన ఎట్టి సముచిత దృష్టియం దైనను, అది గతమునందు జాతికి చేసిన సేవను అంగీకరించక తప్పదు.

6. గీతా లక్ష్యము: యుద్ధము, శాంతి కలియు చోటు :

అట్టి భౌతికయుద్ధము సర్వజీవనమునందును గన్పించు ఒక సాధారణ తత్త్వముయొక్క ఒక ప్రత్యేక బాహ్యాభివ్యక్తి మాత్రమే, మఱియు క్షత్రియుడు మానవ సంసిద్ధియొక్క సంపూర్ణతకు ఆవశ్యకమగు ఒక సాధారణస్వభావముయొక్క బాహ్యాభి వ్యక్తియు, ప్రతిరూపమును మాత్రమే, మన బాహ్యాభ్యంతర జీవనము నందంతటను గానవచ్చు సంగ్రామసూత్రముయొక్క మూర్తరూపమే బాహ్యయుద్ధము; ఈ ప్రపంచమున శక్తులు పరస్పరము తారసిల్లుచు , పోరాడుచు, సంతతము మాఱు చుండునొక సర్దుబాటు దిశగా పురోగమించును; ఇక నీ సర్దుబాటు ఒక ప్రగతిశీల సామరస్యమును ప్రకటించుచు, ఇంకను పట్టువడని ఒకానొక ఏకతాబీజముపై నాధారపడిన పరిపూర్ణసామరస్యము నాశించును. పోగా, క్షత్రియుడు మానవుని లోపలగల యోధునియొక్క భౌతికరూపమగును; ఇతడు యుద్ధతత్త్వము నంగీకరించి, యోధునివలె దాని నెదుర్కొని, ఆధిపత్యము నందజూచునే గాని, శరీరముల వినాశమునకు భయపడి, వెనుదీయడు; పైగా దానిద్వారా సంగ్రామధ్యేయమగు

సామరస్యమునకు పునాది కాగల ధర్మసంస్థాపనను లక్షించును. ప్రపంచశక్తియొక్క ఈ సంగ్రామపార్శ్వమును, దాని మూర్తీభావమగు యుద్ధమును గీత ఆమోదించి, తన ఉపదేశమును కర్మపరుడు, యోధుడు నగు క్షత్రియునకు జేయును– ఈ యుద్ధము లోపల శాంతిని, వెలుపల అహింసను లక్షించు అంతరాత్మ ఉన్నతాకాంక్షకు శుద్ధవిరుద్ధముగా తోచును, మఱియు నీ యోధునికి ఆవశ్యకమగు సంఘర్ష కర్మల కల్లోలము ప్రశాంత స్వామ్యమును, పరమనిరాకులత్వమును లక్షించు అంతరాత్మ ఉన్నతాదర్శమునకు శుద్ధవిరుద్ధముగా గన్పట్టును. కావున గీత ఈ విరోధము నుండి వెలికి మార్గము నన్వేషించుచు, ఈవిరుద్ధరూ పములు కలియు నొక స్థానమును, సామరస్య, పరమగతులకు మూలాధారము కాగల నొక సామ్యావస్థను ఆ మార్గముద్వారా చేరుకొనగోరును.

7. గుణప్రాబల్యమును బట్టి జీవనసంగ్రామము :

తన ప్రకృతియందు మిక్కిలి ప్రబలముగా నుండు మూలగుణమున కను రూపముగానే మానవుడు జీవన సంగ్రామమునకు ఆయత్తమగును. సాంఖ్యశాస్త్రము ననుసరించి, ప్రపంచశక్తియందును, కావుననే మానవప్రకృతియందును మూడు ప్రధానగుణములు గలవు– 1. సత్త్వము , ఇది సమతాజ్ఞాన సంతోషాత్మకగుణము, 2. రజస్సు, ఇది ఆవేగము, కర్మ, ప్రచండభావముల గుణము, 3. తమస్సు. ఇది జడతాజ్ఞానముల గుణము. కాగా, తమోగుణము తనలో ప్రవేశించుచుండు ప్రపంచ శక్తుల నెదుర్కొను నని చెప్పజాలము; అతడు కేవలము వానికి తలవంచి, పరాభూతుడు, శోకాకులుడు, అధీనుడు నగును; లేక, ఎక్కువ, ఇతర గుణముల సాయమును బొంది, ఎటులో జీవితము వీలైనంతగా పొడిగింపజూచును, మఱియు పరిపాటి చింతనయందును, క్రియయందును తలదాచుకొని, తన ఉచ్చతర ప్రకృతి తననుండి అపేక్షించు అధికతర సంఘర్షమును, వర్ధమానప్రయత్న మును శ్రేష్ఠతరస్వామ్యమును దాటవేయును. ఇక రజోగుణము ప్రాబల్యము వహించినపుడు, మానవుడు సహసా యుద్ధరంగములోనికి దూకి, తన స్వప్రయోజనము కా యుద్ధము నుపయోగించుకొన ప్రయత్నించును; పరులను వధించి, జయించి, అధిష్ఠించి, భోగింపజూచును; అథవా ఇంచుక సత్త్వసాహాయ్యమును బొంది, అధికాధిక ఆంతర స్వామ్యము, ఆనందము, శక్తి, సంపత్తుల నిమిత్తము ఆ సంగ్రామము నొక సాధనము గావించుకొనును; అతనికి సంగ్రామ మొక హర్షము, వ్యసనము నగును, దానికి

కొంత కారణము, కర్మయందే అతడు సుఖ మును, శక్తిని అనుభవించును; మఱికొంత కారణము, దానివలన అతనికి స్వాభావిక ఆత్మవికాసము ప్రాప్తించును. చివరకు, సత్త్వగుణము ప్రాబల్యము వహించి నపుడు, మానవుడు సంఘర్షమధ్యమున ధర్మము, న్యాయము, తుల్యత, సామరస్యము, శాంతి, సంతోషముల యొక సూత్రము నన్వేషించును; బాహ్యసంగ్రామము నుండి ఆంతరముగా విడివడి, లేక దానిని బాహ్యముగా సన్యసించి, అతడు తన లోపలనే ఈ శాంతిసూత్రము ననుసంధించును -- తనకొఱకే లేక తాను పొందినపుడు ఇతరులకు అందించు సంకల్పముతోను అత డిట్లు చేయును; కాని సాత్త్విక మానవుడు కొంత రాజసిక ప్రవృత్తిని స్వీకరించుచో, అపు డతడు సంఘర్ష సంక్షోభములపై సమతాసామరస్యముల విధింపజూచును. ఇట్లు జీవన సమస్యపట్ల మానవమనస్సు అవలంబించు వైఖరు లన్నియు ఏదియో యొక గుణప్రాబల్యమునుండి గాని, వాని నడుపు తుల్యతాసామరస్యముల స్థాపించు యత్నమునుండి గాని ఉద్భవించును.

8. నిర్గుణపరిష్కారము - గుణాతీతపరిష్కారము :

కాని ఇట్లు త్రైగుణ్యము చూపు త్రివిధ పరిష్కారముచేత తృప్తిజెందక, విరక్తి జెంది, మానవమనస్సు త్రైగుణ్యమునకు వెలుపలనో, పైననో ఒక ఉచ్చతరపరిష్కారము నన్వేషించు దశయు ప్రాప్తించును. అపుడు గుణబాహ్యము మఱియు గుణశూన్యము, కావుననే సర్వక్రియాశూన్యము నగు ఒకానొక తత్త్వము లోనికి మనస్సు పాఱిపో గోరును; అథవా గుణపరము (superior) మఱియు గుణ శాసకము, కావుననే కర్మసమర్థ మయ్యును కర్మచేత అలిప్తము, అప్రభావితము నగు నొకానొక తత్త్వములోని కది ఆరోహించగోరును- మొదటిది నిర్గుణము, రెండవది త్రిగుణాతీతము, అది అయితే నిరపేక్షశాంతిని , నిరుపాధిక స్థితిని అపేక్షించును. లేదా ప్రబల శాంతిని, పరతర జీవనమును ఆకాంక్షిచును. ప్రథమవైఖరి యొక్క సహజగతి సన్యాసాభిముఖము కాగా, ద్వితీయ వైఖరియొక్క సహజగతి ఆధిక్యాభిముఖ మగును - ఈ ఆధిక్యము నిమ్నప్రకృతి మఱియు దాని క్రియాప్రతిక్రియల బోధనలపై ఆధిక్యము, మఱియు నీ వైఖరియొక్క సారతత్త్వము సమతయు, ఆవేగము మఱియు కామనల ఆంతరసన్యాసము నగును. ఈ ప్రథమ వైఖరియే అర్జునునియందు పెల్లుబికిన ప్రథమావేగము, కావుననే అతడు తన క్షాత్ర ధర్మపర్యవసానమగు కురుక్షేత్ర సంక్షోభమునుండి విముఖుడయ్యెను; తన క్రియా తత్త్వమును గోల్పోయిన అర్జునునికి

అకర్మయు, జీవనము మఱియు దాని అభ్యర్థనల నిరాకరణమును ఏకమాత్ర ఉపాయము లయ్యెను. కాని, నీవు చేయవలసినది జీవనకర్మల బాహ్యసన్యాసము గాదు, వానిపై నాధిక్యము సాధించుము - అని దివ్యగురు వతనిని ప్రబోధించును.

9. తమో గుణప్రాబల్యమువలన సన్యాసప్రవృత్తి :

అర్జునుడు రాజసికమానవుడగు క్షత్రియుడు, అతడు తన రాజసిక కర్మను ఉన్నత సాత్త్వికాదర్శముచేత సరిదిద్దుకొనును. కురుక్షేత్ర మహాసంగ్రామమున యుద్ధానందము నపేక్షించి, అతడు ముందుకు నడిచినప్పటికి, తన పక్షము న్యాయ సమ్మత మను ఉద్ధతవిశ్వాసమును అతనికి గలదు. అతడు తనకు విరుద్ధముగా అధర్మపక్షమున కండదండగా, జీవననియమముగా ధర్మసత్యన్యాయముల నుపేక్షించి వాని స్థానమున స్వార్థము, ఉద్దండము నగు అహంకారశాసనము ప్రవేశపెట్ట నుంకించు రాజన్యుల నిరీక్షింపగోరి, తన శంఖనినాదముచే వారి గుండెలను చీల్చుచు, వారి దిశగా పురోగమించును. ఇప్పు డకస్మాత్తుగా నతనిలోని విశ్వాసము పెద్ద దెబ్బతిని, ముక్కలుచెక్కలగును, జీవితముయొక్క మానసికాధారమే కూలిపోవును. దీనికి కారణ మీ రాజసికమానవునిలో తమోగుణము పొంగివచ్చుటయే; ఇది విస్మయ భీతి విషాదముల వైముఖ్యము నతనిలో బుట్టించెను; దీనివలన బుద్ధి యొక్క ఒక హేతువు మఱియొక హేతువుతో విరోధించెను, ఇంకను జడతాజ్ఞానములలోని కతడు పడిపోయెను. ఈ జడతావేశముచేత అతడు సన్యాసమునకు మఱలును. బిచ్చ మెత్తుకొని సన్యాసిగా జీవించుట మేలని అతని కనిపించెను; దేనికంటె మేలు? క్షత్రియధర్మము కంటెను, సంకులసంహారమున పర్యవసించు యుద్ధము కంటెను, వినాశరక్తపాతములచేత మాత్రమే ప్రాప్తించు ఆధిపత్యప్రాభవముల కంటెను, రక్తసిక్తభోగసాధన కంటెను, ధర్మవిఘాతమును గల్గించు సాధనముద్వారా ధర్మ సంస్థాపన కంటెను, సంఘతత్త్వమునే నష్టపఱచు యుద్ధము ద్వారా సాంఘిక న్యాయమును స్థాపించుటకంటెను భైక్ష్యవృత్తియే మేలని అర్జునున కనిపించెను.

10. బాహ్యతపస్య గాదు, ఆంతరతపస్య :

సన్యాస మన జీవనకర్మలయు, ప్రకృతిగుణములయు సన్యాసము, కాని ఏదియో యొక గుణముద్వారానే దానిని సమీపించవలెను. దాని ప్రేరణ తామసికము గావచ్చును - నిర్వీర్యత , వైముఖ్యము, జుగుప్స, జీవన భయము గావచ్చును; లేక

సన్యాసప్రేరణ తమస్సువైపునకు మొగ్గు రజోగుణాత్మకము గావచ్చును - అనగా సంఘర్షాయాసము, దుఃఖము, ఆశాభంగము, బాధలతోను, శాశ్వతాసంతృప్తితోను గూడిన నిరర్థక కర్మకల్లోలముపట్ల వైముఖ్యమును గావచ్చును. అథవా సన్యాసప్రేరణ సత్త్వమువైపునకు మొగ్గు రజోగుణావేగము గావచ్చును. అనగా జీవితమిచ్చగల సర్వముకంటెను పైనుండు నొక తత్త్వమును చేరుకొనుటకును, ఒక ఉచ్చతరస్థితిని జయించుటకును, ఆంతరబలముతో అసలు జీవితమునే మట్టగించి, సర్వబంధములను త్రెంచుకొని, సర్వావధులను అతిక్రమించుటకును ప్రేరేపించు ఆవేగము గావచ్చును, చివరి కది సాత్త్వికావేగము గావచ్చును- అనగా జీవితము నిస్సారము, దీని కెట్టి గమ్యమును లేదు, పునఃపునః ఆవర్తమాన మగు ప్రపంచగతియందెట్టి ఔచిత్యమును లేదు, అను బౌద్ధిక బోధము గావచ్చును; లేక కాలాతీతము, అనంతము, నిశ్చలనీరవము, నామరూపాతీతము నగు పరమ శాంతియొక్క ఆధ్యాత్మిక బోధము గావచ్చును. అర్జునుని విరక్తి సాత్త్విక- రాజసికమానవునికి కర్మయందు గలుగు తామసికవిరక్తి. సన్యాసజీవితముయొక్క శుద్ధత శాంతులలోనికి అర్జునుని ప్రవేశమునిమిత్తము ఒక చీకటి ద్వారముగా నుపయోగించుచు, దివ్యగురువీ విరక్తిని ధ్రువపఱచవచ్చును; లేక తామసిక విరక్తిని వెంటనే శుద్ధమొనరించి, సాత్త్విక సన్యాసము యొక్క ఉన్నతులకు దానిని లేవనెత్తవచ్చును, కాని నిజానికతడు వీనిలో నేదియు చేయడు. అతడు తామసికవిరక్తిని, సన్యాస ప్రవృత్తిని - రెండింటిని నిరుత్సాహ పఱచి, నిరంతర కర్మాచరణమును విధించును, ఉగ్రభయంకర యుద్ధమును సైతము విధించును; కాని దానితోబాటు అతడు ఆంతర సన్యాసమునకు దారి చూపును, ఈ సన్యాసమే సంకటమునుండి గట్టెక్కించు వాస్తవమార్గము. ఇదియే ప్రపంచప్రకృతికి అంతరాత్మను అతీతము గావించుచునే ప్రశాంత, ఆత్మస్థకర్మను సాధ్యము చేయు మార్గము, బాహ్యతపస్సు గాక, ఆంతర తపస్యయే గీతాబోధన యగును.

7. ఆర్య క్షత్రియ ధర్మము*

1. గట్టి మందలింపు :

అర్జును డావేగముతో శరపరంపరగా తనకు దానే వేసికొనిన ప్రశ్నపరంపర కును, సంహారమునుండి అతని సంకోచమునకును, పాపశోకముల అతని చింతన కును, శూన్యనిరానందజీవనమును గుఱించిన అతని దుఃఖమునకును, పాపకర్మకు పాపఫలితమే యను అతని అరిష్టసూచనకును దివ్యగురుసమాధాన మొక గట్టి మందలింపు. ఇది యంతయు నొక మనోవ్యాకులము, హృదయ దౌర్బల్యము, పౌరుష రాహిత్యము, యోధవీరుల వీర్యోత్సాహమునుండి పతనము- అని గురువు చీవాట్లు పెట్టును (2-2,3). ఇది కుంతీపుత్రునకు తగదు, అతడు ఒక ధర్మకార్య సాధకుడు, ఆశాజ్యోతి, కావున నట్టేట దానిని విడిచివేయరాదు; లేక తనను భంగపుచ్చి, తనచేత దివ్యాస్త్రములను పాఱవేయించి, దివ్యకార్యమునకు తిలోదకములిప్పించిన హృదయవిస్మయమునకు, బుద్ధిమాలిన్యమునకు, సంకల్పభ్రంశమునకు అతడు తావిచ్చి యుండరాదు. ఆర్యపురుషుడు (2-2) అభిమానించి, అనుసరించు మార్గమిది గాదు; ఈ మనోభావము స్వర్గమునుండి రానులేదు, స్వర్గమునకు గొనిపోవను లేదు (2-2). ఇక భువియం దిది బలము, వీర్యము, ఉదాత్త కర్మలను ఆశ్రయించి యుండు యశోహానియే యగును. కావున నతడు తనయందే ఏర్పడిన దుర్బల కృపను దూరముచేసి, నడుముకట్టి , శత్రువులను చెండాడవలెను!

2. కృపవేఱు, దయ వేఱు :

ఇది వీరుడు వీరుని కిచ్చు సమాధానము గాని, దివ్యగురువునుండి మన మాశించు సమాధానము గాదని అందమా? ఏలన దివ్యగురువు సర్వదా మృదుతను, సాధుతను, ఆత్మత్యాగమును, లౌకికలక్ష్యములయందు విరక్తిని, లౌకికమార్గముల నుండి నివృత్తిని ప్రోత్సహించు నని మన మాశింతుము. కాని అర్జునుడు వీరోచితముగాని దుర్బలతలోనికి జాఱిపోయె నని గీత స్పష్టముగా చెప్పును- "అతని కండ్లు అశ్రుపూర్ణములు, వ్యథితములు; అతని హృదయము విషాదగ్రస్తము" (2-1). కాగా, అది దుర్బలతయే యగుచో దివ్యదుర్బలత గాదా? పరుషవచనముతో దానిని నిఱుత్సాహపఱచ దగునా? అథవా గీత యంతయు యుద్ధము మఱియు వీరకర్మకు సంబధించిన ఉపదేశమేనా? శక్తిని, గర్విత బలమును బోధించు

---

*గీత : ద్వితీయాధ్యాయము, శ్లోకములు 1-38

నీతసేమహాశయుని మత మేనా? కృపను దుర్బలతగా భావించు ట్ర్యాటనుల కఠోరతయేనా? కాదు. ఏలన గీత భారతీయ సంస్కృతినుండి ఉద్భవించినది, మఱియు భారతీయునికి దయాగుణము దివ్యప్రకృతి యొక్క ఒక ఉదారతమాంశము. తర్వాతి అ ్యయ మున దైవప్రకృతి గుణములను జూపుచు, భగవానుడే వానిమధ్యను భూతదయ, మార్దవము, అహింస, అక్రోధములను గూడ, అభయము, సాహసము, బలములను జెప్పినట్లే, చెప్పును. పారుష్యము, కాఠిన్యము, ఉగ్రత్వము, శత్రువధ యందు సంతృప్తి, ధనసంచయము, అక్రమ భోగములు – ఇవి ఆసుర సంపత్తి; ప్రపంచము నందుగాని, మానవునియందు గాని భగవంతుడు లేడని ఖండించి, కామదేవత నొక్క దానినే ఉపాసించునట్టి ప్రచండ అసురప్రకృతినుండి ఇవి ఉద్భవించును. కావున అర్జునుని దౌర్బల్యము నిందార్హమగుట ఎట్టి ఆసురదృక్కోణము నుంచియు గాదు.

3. దయ మృదువును, కఠినము నగును :

"ఈ విషమసమయమున నీ కీ విషాదము, ఆత్మకళంకము, తిమిరము నెట నుండి దాపురించినది?" – అని కృష్ణు డర్జును నడుగును. అర్జునునియందు పెల్లుబికిన కృప దైవసంపత్తిలోనిది గాదని ఈ ప్రశ్నయే తెలుపును. అస్తు. దైవ సంపత్తి అంశమగు నొక దైవదయ గలదు, అది పైనుండి దిగును. ఎవని స్వభావము దానిని బొందియుండలేదో, లేక దాని కనురూపముగా నుండదో , అట్టి వాడు విశిష్టమానవుడ నని, శ్రేష్ఠమానవుడనని, అతిమానవుడ నని నటించుట అవివేకము, అటోపమే యగును; ఏలన మానవభావమునందలి దైవభావముయొక్క అత్యున్నతప్రకృతిని అత్యధికముగా అభివ్యక్తముచేయువాడు మాత్రమే అతిమానవుడు. ఈ దయ ప్రేమ, వివేక, శాంతబలముల నేత్రముతో సంగ్రామసంఘర్షములను, మానవుని బలదుర్బలతలను, అతని పుణ్యాపాపములను, సుఖదుఃఖములను, జ్ఞానాజ్ఞానములను, విజ్ఞతామూర్ఖతలను, ఆకాంక్షను, అపజయమును, ప్రశాంతముగా నిరీక్షించును; నిరీక్షించి, సాయపడి సముద్ధరించుటకు దానియందంతటను ప్రవేశించును. సాధువు నందును, లోకహితైషియందును, అది పూర్ణ ప్రేమ లేక పూర్ణోదారతా రూపము ధరించును. మనీషి యందును, వీరునియందును అది సహాయభూతమగు విజ్ఞానము మఱియు బలముల విశాలత మఱియు తీవ్రతారూపములను ధరించును. అర్యయోధునియందలి ఈ దయావిశేషమే అతని వీరధర్మమునకు ప్రాణమగుచు,

నలిగిన గడ్డిపోచను గూడ బాధింపనొల్లదు, ప్రత్యుత దుర్బలులకు, పీడితులకు ప్రణితులకు, దీనులకు తోడ్పడుచు రక్షించును, కాని అదే దైవదయ ప్రబలుడగు క్రూరశాసకుని, సాహిసికుడగు ప్రజాపీడకుని చావుదెబ్బ కొట్టును, అయితే క్రోధము నందును, ద్వేషముతోనుగాదు. ఏలన క్రోధద్వేషములు దైవ గుణములు గావు. పాపిపై భగవంతుని క్రోధము, దుష్టునిపట్ల భగవంతుని ద్వేషము తెలిసియు తెలియని మతములు అల్లిన కాకమ్మకథలు- అవి కల్పించిన శాశ్వత నరకయాతనలవలెనే ఇవియు వట్టి కల్పనలు. కాగా భారతీయుల ప్రాచీన ఆధ్యాత్మికవిజ్ఞానము స్పష్టముగా దర్శించినట్లు. దైవదయ పీడితు నెంత ప్రేమతో రక్షించునో, పీడకుని సైతము అంత ప్రేమతోను వధించును.

4. బలము నుంచి అధికతర బలమునకు :

కాని తన కర్మను, కార్యమును నిరాకరింప అర్జునుని ప్రేరేపించినది ఇట్టి దయ గాదు. అది దుర్బల ఆత్మ-కృపచేత నిండిన నిర్వీర్యత, తన కృత్యము తనపై తప్పక విధించనున్న మానసిక దుఃఖమునుండి పరావర్తనము - "ఇంద్రియములను దహించుచున్న ఈ శోకమును నెట్టివేయగల దేదియు నాకు గోచరించుటలేదు" (2-8), మఱియు అత్యంతనీచము, అనార్యము నగు భావములతో ఆత్మ కృప యొకటి యగును. ఇంకను, ఇతరులపట్ల దాని జాలియు ఆత్మలాలన యొక్క ఒక రూపమే; చూడుడు: అది హత్యాకృత్యమునుండి నరముల భౌతిక సంకోచము, ధార్తరాష్ట్రుల వినాశమునుండి హృదయముయొక్క భావికసంకోచము; కారణము, వారు "స్వజనులు" (2-28), వారు లేనపుడు జీవితము శూన్యప్రాయ మగును: ఇది ఆత్మలాలనయే గదా! వికాసముయొక్క నిమ్నస్తరమునం దున్న వారి కిది తప్పక హితకరముగావచ్చును; ఏలన వారి కీ దుర్బలకృప లేనిచో, వారు కఠిన, క్రూరాత్మ లగుదురు; వారు ఇంద్రియాహంకారముయొక్క పరుషతర రూప ములకు మృదుతర రూపములచే చికిత్స చేయించవలసియుండును; తమ రాజసిక తీవ్రతల నడంచుటకు ప్రయత్నించు సత్త్వగుణమునకు సాయముగా రజస్సును బలహీనపఱచు తమస్సును పిలువవలసియుందురు. కాని వికాసము సాధించియున్న ఆర్యమానవున కీ పద్ధతి పనికిరాదు; అతడు బలమునుంచి బలమున కారోహించు వాడే గాని, దుర్బలతచేత వృద్ధినందువాడు కాడు. అర్జునుడు అభివృద్ధిదశలో నున్న దివ్యమానవుడు, మానవ శ్రేష్ఠుడు, కావుననే అతడు దేవతలచేత నెన్నుకొన బడెను. అతని కప్పగించబడిన

ఒక కర్మగలదు, తన రథములో తన దండను భగవంతుడుగలడు, అతని హస్తమున దివ్యధనువు, గాండీవము గలదు, మఱియు భగవన్నాయకత్వమును ప్రతిఘటించుచు అధర్మతావీరులు తన కెదురుగా గలరు. ఇట్టి యెడ భావావేశములను బట్టియు, ఇంద్రియా..గములను బట్టియు ఏది చేయవలెనో, చేయరాదో, నిర్ణయించు అధికారము అతని అహంప్రేరిత హృదయమునకును, బుద్ధికిని లేదు, తన కర్మ శోకశూన్యతలకు కారణమగు నని చెప్పి, దానిని నిరాకరించు నధికారమును అతనికి లేదు. అదంతయు తన ఉచ్చతర ప్రకృతినుండి జరుగు భ్రంశమే యగును. అతడు తన "కర్తవ్యకర్మనే" లక్షించవలయును, తన క్షాత్రస్వభావము ద్వారా తనలోని కూదబడిన దివ్యాదేశమునే అత డాలకించవలయును, మఱియు మానవ జాతి భవితవ్యము తనను పిలుచుచున్నదనియు, భగవత్ప్రేషిత మానవుడుగా తాను దాని ప్రగతికి తోడ్పడుచు, తామస సైన్యములనుండి దాని మార్గమును నిష్కంటకము చేయవలె ననియు మాత్రమే అతనికి తట్టవలెను.

5. గురువులను చంపుట పాపము కాదా?

అర్జునుడు కృష్ణుని మందలింపునకు మూలమగు తన దౌర్బల్యము నంగీకరించుచునే, అతని ఆదేశములోని దోషములను చూపుచు, దానిని పాలింప నిరాకరించును. ధర్మాధర్మవిషయమున తన చేతనయంతయు వికలము కాగా, అర్జునుడు దివ్యసఖుని తన గురువుగా నంగీకరించును; నాది ధర్మయుద్ధము అనుతన భావమునకు ఆధారముగా నుండిన, భావికము, బౌద్ధికమునగు ప్రావు లన్నింటిని ఇపుడతడు త్రోసివేసెను గావునను, తన కర్మ కెట్టి నూతనప్రాతిపదికను జూపకయే, భగవదాదేశము తన పూర్వదృక్కోణమునే ప్రమాణీకరించుచున్నదని అతని కనిపించినది గావునను, అతడా ఆదేశమును అమోదింపజాలకున్నాడు. పైగా కర్మసన్యాసమును అతడింకను సమర్థింపజూచును. అట్లు సమర్థించుటకు హత్యాకాండకు భీతిల్లు ఇంద్రియవాదమును ప్రస్తావించును; యుద్ధమునకు ఫలితము గాబోవు శోకశూన్యతలనుండి వెనుదీయు హృదయవాదమును ప్రస్తావించును; పూజ్యులగు భీష్మద్రోణులను వధించవలసిన ఆవశ్యకతకు భీతిల్లిన పరిపాటి నైతికభావముల వాదమును ప్రస్తావించును; ప్రచండయుద్ధమునుండి రాగల కేవలదుష్ఫలితములనే దర్శించు బుద్ధివాదమును ప్రస్తావించును (2-5,6). చింతన మఱియు ప్రేరణలకు సంబంధించిన పూర్వప్రాతిపదికపై నేను యుద్ధము చేయను,

చేయను... అని నిశ్చయించుకొని, తనకు తిరుగులేనివిగా దోచుచున్న తన ఆక్షేపణలకు గురువెట్టి సమాధానమిచ్చునో యని మౌనముగా అర్జునుడు ప్రతీక్షించును. అర్జునుని యందలి అహంకారికజీవుని ఈ వాదములను ముందు ఖండించి, కర్మవిషయమగు సర్వ అహంకారిక ప్రేరణలను అతిక్రమించగల ఉచ్చతర కర్మధర్మమునకు స్థానము కల్పింప కృష్ణుడుపక్రమించును.

6. ధీరుడు మరణమునకు భీతిల్లడు :

వీనికి గురువిచ్చు సమాధానము రెండు విభిన్నమార్గములలో ముందుకు సాగును. -1.అర్జునునికి విద్యాబుద్ధులు గఱపిన సామాన్య ఆర్యసంస్కృతియొక్క అత్యున్నతభావములపై నాధారపడిన సంగ్రహసమాధానము, 2. అంతకంటెను అధికతర ఆంతరంగికజ్ఞానముపై నాధారపడిన విశాలతరసమాధానము. ఈ జ్ఞానము మనసత్తయొక్క గభీరతర సత్యములలోనికి ద్వారము తెఱచును, ఇదియే గీతా బోధనయొక్క వాస్తవప్రారంభము. వేదాంతశాస్త్రముయొక్క దార్శనిక మఱియు నైతికభావనలపైనను, కర్తవ్యము మఱియు ఆత్మగౌరవములకు సంబంధించిన ఆర్యుల సామాజికభావముపైనను ప్రథమసమాధాన మాధారపడి ప్రవర్తించును. ఎటులన, అర్జునుడు తన కర్మనిరాకరణమును నైతిక, తార్కికకారణములను జూపి, సమర్థించుకొన జూచెను, కాని నిజానికి తన తర్కాభాసముచే తన అశిక్షితభావముల తిరుగుబాటు నతడు కేవలము కప్పిపుచ్చుకొనెను. శరీరముయొక్క జీవనమరణములే మూలసత్యములైనట్లు అతడు ప్రసంగించెను; కాని జ్ఞాని మఱియు మనీషుల దృష్టిలో వాని కట్టి విలువలేదు. జ్ఞానవిజ్ఞానములు బంధుబాంధవుల శారీరికమరణమును గుఱించిన శోకమునకు తావివ్వవు. జీవించియున్న లేక మరణించిన వారినిగుఱించి పండితుడు శోకించడు (2-11); ఏలన దుఃఖకారణములు అంతరాత్మ చరిత్రయందు కేవల బాహ్యఘటనలు. శరీరము గాక, ఆత్మయే సద్వస్తువు. ఎవరి ఆసన్న మరణములను జింతించి అతడు శోకించుచున్నాడో, అట్టి రాజు లందరు శరీరమున వెనుక జీవించియుండిరి, ముందు జీవించగలరు. ఒకే శరీరమున ఆత్మకెటుల బాల్యయౌవనవార్ధక్యములు ప్రాప్తించునో, అటులే దేహాంతర ప్రాప్తియు గలుగును (2-13). స్థిరుడు, ప్రాజ్ఞుడునగువాడు ధీరుడు; తన సంవేదనలు మఱియు భావావేగములచేత విచలితుడును, అంధుడును గానివాడు ధీరుడు, ఇట్టి ధీరుని బాహ్యరూపములు మోసగించజాలవు; తన నిర్ణయమును మఱుగుపఱచుటకుగాని,

తన జ్ఞానమును నిరాకరించుటకుగాని అతడు తన హృదయము మఱియు నాడుల ఆక్రోశమున కవకాశమివ్వడు. అతడు శరీరేంద్రియముల బాహ్యాసత్యముల కావలనున్న తనసత్తయొక్క వాస్తవసత్యమును వీక్షించును, మఱియు అజ్ఞాన ప్రకృతి యొక్క భావిక, భౌతికకామనల కావల నుండు, మానవజీవితము యొక్క ఏకమాత్ర యథార్థలక్ష్యమున కెగయును.

7. జననమరణములు అమృతత్వసాధనము :

ఆ వాస్తవసత్య మేమిటి? అత్యున్నతలక్ష్య మేమిటి? మానవుని జీవన మరణములు ప్రపంచమహాయుగములందు తిరిగితిరిగి సంభవించుచు, సుదీర్ఘప్రగతికి సాధనమగును, ఇదియే జీవనమరణముల వెనుక నున్న వాస్తవసత్యము; ఈ ప్రగతి ద్వారా మానవజీవుడు అమృతత్వమున కర్హత సంపాదించును. ఈ అమృతత్వమే లక్ష్యము (2–15). మఱియు నత డెట్లు అర్హత సంపాదించును? తానొక ప్రాణము, శరీరము నను భావన నెవడతిక్రమిందునో, బాహ్యస్పర్శల బాహ్యామూల్యమును కేవల భౌతికప్రాణులుగాక, ఆత్మలనియే వారితో వ్యవహరించునో, ఆతడర్హుడు. ఏలన అమృతత్వమున కర్థము మరణము తర్వాత జీవించుటగాదు – అది మనస్సుతో జన్మించిన ప్రతిప్రాణికి ఉండనే యున్నది – జీవనమరణముల అతిక్రమణమే అమృతత్వము, ఏ ఆరోహణముచేత నరుడు మనోనుగత శరీరముగా నివసించుట చాలించి, తుదకు వ్యష్ట్యాత్మగా సమష్ట్యాత్మయందు నివసించునో, అదియే అమృతత్వమున కర్థము. ఎవడెవడు శోకసంతాపముల కధీనుడో, సంవేదనల, భావావేశములకు దాసుడో, క్షణికస్పర్శలలో మునిగితేలుచుండునో, అతడమృతత్వమున కర్హుడుకాజాలడు. ఈస్పర్శలు జయించబడు నంతవఱకు, విముక్తమానవున కవి ఎట్టి వ్యథను గల్గించజాలనంతవఱకు. లోపల నిగూఢముగానున్న ప్రశాంత సనాతనాత్మ స్వీకరించు విధముగానే, అతడు స్థిర, ధీర సమతతో సమస్త భౌతిక సంఘటనలను స్వీకరించగలుగు నంతవఱకు వానిని సహించవలెను (2–14). అర్జునునివలె శోకభయములచే క్షుబ్ధుడగుట, వానివలన గంతవ్యపథము నుండి విచలితుడగుట, ఆత్మ–కృపచేత పరాభూతుడగుట, శోకమును సహించలేకపోవుట, శరీరమరణరూపమగు అనివార్య, సామాన్యఘటనకు జడిసి పాఱిపోవుట – ఇది ఆర్యుల కుచితముగాని అజ్ఞానము (1–2). ఇది సుస్థిరబలముతో అమరజీవితమున కారోహించుచున్న ఆర్యుల మార్గముగాదు.

8. సత్తా, సంభూతి విరుద్ధధర్మములు :

అసలు మరణ మనునది లేనేలేదు; కారణము, మరణించునది శరీరము, మఱియు శరీరము మానవుడుగాదు. ఏది లేదో, అట్టి అసత్తు లేక సంభూతి ఉనికిని బొందజాలదు; అటులే ఏది నిజముగా నున్నదో, అట్టి సత్తుతనను వ్యక్తము చేయు తన రూపములను మార్చవచ్చును గాని, తాను మాత్రము లేమిని బొందజాలదు (2-16). ఆత్మ ఉన్నది మఱియు ముందెప్పుడును ఉండకపోదు. ఇది ఉండుటకును, లేకపోవుటకును గల వ్యతిరేకము; సత్తకును, సంభూతికిని(అసత్తునకును) గల విరోధము, ఇది సృష్టియందు మనస్సునకు గన్పించు విరోధము; ఈ విరోధము లోనికి పయనించి, అంతరాత్మను మాఱని అక్షరాత్మగాను, మాఱుచుండు క్షరవిశ్వమును దాని విస్తారముగాను దర్శించుటయందు పర్యవసించును (2-17). సాంతశరీరము అంతమొందును, కాని ఏది శరీరమును ధరించి, ఉపయోగించునో, అది అనంతము, అప్రమేయము, నిత్యము, అవినాశియు నగును(2-18). మానవుడు జీర్ణవస్త్రములను విడిచి, నూతన వస్త్రములను ధరించునట్లే, ఆత్మయు జీర్ణశరీరములను విడిచి, నూతనశరీరములను చేకొనును (2-22); దీనిలో విచారించవలసిన దేమున్నది? చూచి సంకోచించవలసిన దేమున్నది? ఇది జన్మించునదియు గాదు, మరణించునదియు గాదు; ఒకసారి జన్మించి, గతించి, మఱల నెప్పుడును జన్మించ కుండునదియుగాదు; అది అజము, పురాణము, శాశ్వతము. అమృతాత్మను ఎవరు చంపగలరు? (2-20) దీనిని శస్త్రములు ఛేదించవు, అగ్ని దహించదు, నీరు తడుపదు, వాయువు ఎండించదు(2-23). స్థాణువు, ఆచలము, సర్వగతము నగు నిది సదా ఉండును, ఉండును (2-24). శరీరమువలె సభివ్యక్తము కాదు గాని, సర్వాభివ్యక్తి కంటెను అధికము; చింతనచేత విశ్లేషించ శక్యము కాదు గాని, చిత్తమంతటి కంటెను అధికము; ప్రాణము, దాని ఇంద్రియములు, వాని విషయముల వలె ఆత్మ మాఱి, వికారముచెంద జాలదుగాని, మనఃప్రాణశరీరముల వికారముల కావల నుండును; అయినను ఈ ఆవల నున్న సద్వస్తువునే ఇవి యన్నియు రూపింప యత్నించుచున్నవి.

9. జాతస్య హి ధ్రువో మృత్యుః

మన ఆత్మసత్యమింత సముదాత్తము, అతివిశాలము, జననమరణములచేత ఇంత అస్పృశ్యము గాకపోయినను, ఆత్మ సర్వదా జననమరణాధీనమేయైనను, జీవుల మరణము శోకహేతువు కారాదు. ఏలన ఆత్మయొక్క స్వీయాభివ్యక్తి కిదియొక

అనివార్యఘటన మగును (2-27). ఉన్నను, ఎచ్చట అవ్యక్తముగా నుండునో, అట్టి అవ్యక్తావస్థనుండి ఆవిర్భావమే ఆత్మజననము: ఇక దాని మరణము ఆ అవ్యక్తప్రపంచమునకు లేక అవస్థకు ప్రత్యావర్తనమే యగును, మఱియు నటనుండి అది మఱల జన్మించును, ఇట్లుండ మరణమును గుఱించి భౌతికమనస్సును, ఇంద్రియములును లేవదీయు దుమారము నాడీసంక్షోభముయొక్క అత్యంత అజ్ఞానరూపమగును (2-28). చనిపోయిన వారినిగుఱించి శోకించుటకు అజ్ఞానమే తప్ప మఱియొక కారణము గన్పించదు; ఏలన మరణించినవారు అసలే లేనివారుగారు, మఱియు వారెట్టి భయంకర అవస్థాపరివర్తనమునకు గుఱికారు. మరణమున కావలవారు జీవనమునందుకంటె అస్తిత్వమునందు తక్కువయు గారు, పరిస్థితులయందు ఎక్కువ సుఖహీనులునుగారు. ఆత్మ మరణాధీన మను సత్యముగాక, దాని ఉచ్చతరసత్యమే నిజానికి వాస్తవ సత్యము. దేనిని మన మేధ కందని ఆశ్చర్యముగా మనము చూతుమో, పలుకుతుమో, విందుమో, ఆ ఆత్మయే, ఆ ఏకమే, ఆ భగవంతుడే అన్నియును; ఆశ్చర్య మేల యన, మన మెంత అన్వేషించినను, తెలిసిన వారెంత ప్రవచించనను, ఏమానవ మనస్సును ఈ కేవలము (Absolute) నింతదనుక తెలిసికొనలేదు. శరీరస్వామి యగు నిది ఇచ్చట ప్రపంచరూపముచేత మఱుగుపడి యుండును; జీవన మంతయు దీని ఛాయామాత్రము; ఇది భౌతిక అభివ్యక్తిలో ప్రవేశించుటయు, దానినుంచి మరణముద్వారా నిర్గమించుటయు దీని గౌణక్రియలలో నొకటి మాత్రమే. ఇదియే మన మని ఎఱింగినపుడు, నేను హంతను లేక హతుడను అని తలంచుట అసంగతవిషయమే యగును. ఒకే నిత్యవస్తువు గలదు, అదియే సత్యము, మనము నివసించవలసినది దానియందే, అది తన యాత్రా మహాచక్రమునందు తనను మానవాత్మగా అభివ్యక్తముచేసికొనును, జనన మరణములు ఆ యాత్రయందు మైలు రాళ్లు: పరలోకములు విశ్రాంతిస్థానములు; సుఖాసుఖములగు జీవనఘటనలన్నియు మన ప్రగతికిని, సంగ్రామవిజయములకును సాధనముగా, అంతరాత్మయొక్క ఈ యాత్రా గమ్యము అమరత్వగృహము.

10. స్వధర్మమును యుద్ధమునే చూపును :

కావున, గురువుద్బోధించును, ఈ వృథాశోకమును, సంకోచమును దులిపివేసి, ఓ భరతపుత్రా: లెమ్ము, పోరాడుము(2-18). కాని ఈ ఉద్బోధమున కాధారము? జ్ఞానమే. ఈ సమున్నత మహోజ్ఞానము, మనఆత్మలయొక్క ఈ కష్టమయ

అనుశాసనము, ఆత్మజ్ఞానభూమికకు మనల నుద్ధరించి, శోకమోహముల నుండి మనలను ముక్తులను చేయగలదు; మన మరణభయమును. మృతులకొఱకు శోకమును నివారించగలదు; మృతులు మృతులు గారు, వారు ఇహమునుండి పరమునుకు మాత్రమే వెళ్ళిరి - అని అది మనకు చూపగలదు; అత్యంతభీషణమగు జీవన ప్రహారములను చలించకయు, శరీరమరణమును తృణప్రాయముగాను, చూడగలబోధ నది చేయగలదు; సమస్త జీవనసంఘటనలు ఏకమూలముయొక్క ఒక అభివ్యక్తియను భావనాస్తరమునకిది మనలను లేవనెత్తగలదు, మఱియు నపుడు మన అంతరాత్మలు ఊర్ధ్వపరిణామముద్వారా తమను తాముద్ధరించుకొనుట కీ సంఘటనలన్నియు సాధనములని తెలియును. ఇంకను అమృతాత్మగా మనలను మన మెఱుంగుటకు నీ పరిణామము సాగును. కాని అర్జునుని యుద్ధకర్మను కురుక్షేత్ర హత్యాకాండను ఈ మహాజ్ఞాన మెట్లు సమర్థించును? దీనికి సమాధానమేమన, తాను పయనించవలసిన మార్గమున అతడు చేయవలసిన కర్మయిది; తన స్వధర్మము చేత (2-31), అనగా తన సాంఘికవిధిచేత, తన జీవనధర్మముచేత, తన సత్తాధర్మము చేత నియతమైన వృత్తినిర్వహణలో నొక అంశముగా, అనివార్యముగా వచ్చిపడిన కర్మయిది. భౌతికవిశ్వమునందు ఆత్మాభివ్యక్తిరూపమగు ఈ ప్రపంచము ఆంతర వికాసముయొక్క ఒక చక్రగతి మాత్రమే గాదు, పరంతు అదియొక క్షేత్రము, ఈ క్షేత్రమునందు జీవనముయొక్క బాహ్యఘటనలను ఆంతరవికాసమునకు ఒక పరిసరముగా, ఒక అవకాశముగా ఆమోదించవలసియున్నది. అది పరస్పర సాహాయ్యము మఱియు సంఘర్షములతో గూడిన ప్రపంచము, ఇచ్చట పూలబాటలో శాంతిమయ పురోగమనము సాధ్యము కాదు, ప్రతి అడుగును సాహస ప్రయత్నముతో, విరుద్ధశక్తుల సంఘర్షముద్వారా సాధించవలెను. ఈ బాహ్యాభ్యంతర సంఘర్షమును దాని అత్యంత భౌతికరూపమగు యుద్ధపర్యంతము గొనిపోవు పరాక్రమవంతులే క్షత్రియులు; యుద్ధము, పరాక్రమము, ఉదాత్తత, ధైర్యము వారి స్వభావము కాగా, ధర్మరక్షణము, సంగ్రామాహ్వానమును సోత్సాహముగా నంగీకరించుట వారి సుగుణమును, కర్తవ్యమునగును. ధర్మాధర్మములకు, న్యాయాన్యాయములకు, రక్షణశక్తి పీడనశక్తులకు సంతత సంఘర్షము సాగుచుండును. ఇతనీ సంఘర్షము భౌతిక సంగ్రామ రూపము ధరించినపుడు, ధర్మధ్వజమును ముందుకు గొనిపోవు వీరుడు తన కర్తవ్యముయొక్క హింసామయస్వరూపమును దలంచి చలించి, కంపించగూడదు,

హింసాక్రూరతలపట్ల తనలో ఉప్పతిల్లిన దుర్బల కృపచేతను, విస్తృతమగు నియత వినాశము పట్ల తనకు గలిగిన భౌతికభీతిచేతను, అతడు తన అనుయాయులను గాని, సహయోధులను గాని, పరిత్యజించగూడదు; తన పక్షమును భంగపుచ్చగూడదు; ధర్మన్యాయముల ధ్వజమును పాఱవేసి పాఱిపోగూడదు, అపుడా పవిత్రధ్వజమును ధూళిలో నీడ్చుకొనిపోవుచు, ఆతతాయి దానిని తన రక్తసిక్తపాదములతో మట్టగించి వేయును; అతని కర్తవ్యశీలములు రెండును రణమునందే గలవు, రణనివృత్తియందు గాదు. ఇచ్చట చంపుట గాక, చంపకపోవుటయే పాపమగును (2-33).

11. క్షత్రియునకు యుద్ధము స్వర్గద్వారము :

స్వజనుల మరణము గలిగించు శోకమును గుఱించిన అర్జునుని ఆక్రోశమునకు మఱియొక సమాధానము నివ్వ గురువించుక ప్రక్కకు దిరుగును. క్షత్రియ జీవనమునకు వాస్తవధ్యేయమేమిటి? అతని సత్యసుఖ మేమిటి? ఆ ధ్యేయము స్వప్రీతికరమగు గృహసౌఖ్యము గాదు, బంధుబాంధవులతో సుఖజీవనమును, శాంత సంతోషమును గాదు; ధర్మము నిమిత్తము పోరాటము సల్పుటయే అతని యథార్థ జీవనలక్ష్యము, మఱియు నొక సత్కార్యమును కనుగొని, దానికి తన జీవితము నాహుతిచేయుటయో లేక విజయము బొంది, వీరజీవనముయొక్క యశః కిరీటములను సాధించుటయో అతని ఉత్తమసౌఖ్యమగును. "క్షత్రియునకు ధర్మ్యయుద్ధమును మించిన శ్రేయము లేదు (2-31). మఱియు నట్టి యుద్ధము తెఱచిన స్వర్గ ద్వారమువలె స్వయముగా ప్రాప్తించినపుడు, క్షత్రియు లెంతో సంతసింతురు (2-32). కాగా ఈ ధర్మ్యయుద్ధమును నీవు చేయవేని, అపుడు స్వధర్మమును, కీర్తిని త్యజించిన వాడవై, పాపమును మూటకట్టుకొందువు (2-33)." అట్టి యుద్ధనిరాకరణముచేత అర్జునుడు అకీర్తికిని, దుర్బలతాభయముల అపవాదమునకును గుఱియగును; క్షత్రియ సమ్మానమునకు దూరుడగును. అది తన సమ్మానమునకు, యశమునకు, బలవంతుల మధ్య తనకు గల స్థానమునకు భంగమే యగును; ఇక నది అతనికి మరణముకంటెను మిక్కిలి నికృష్టము (2-36). యుద్ధము, ధైర్యము, శక్తి, శాసనము, సమ్మానము, వీరమరణముచేత లభించు స్వర్గము - ఇదియే క్షత్రియాదర్శము, ఈ ఆదర్శమును దిగలాగుటయు, ఈ సమ్మానముపై మచ్చపడనిచ్చుటయు, భీరుతాదుర్బలతలకు గుఱియైన

వీరాధివీరుడుగా మానవజాతి నైతికప్రమాణమును తగ్గించుటయు - ఇది తనకు ద్రోహము చేసికొనుటయు, ప్రపంచము తనపై నుంచిన ఆశకు ద్రోహము చేయుటయునగును. "హతుడవై స్వర్గమును బొందెదవు, విజయోపేతుడవై భూమిని భోగింతువు; కావున ఓ కుంతీపుత్రా: యుద్ధమునకు కృతనిశ్చయుడవై లెమ్ము, నడుము కట్టుము." (2-37).

12. సమత్వమును పాప మంటదు :

ఈ వీరోచితోపదేశము (2-37) ఇతఃపూర్వము ఉపదేశించిన తితీక్షాత్మక ఆధ్యాత్మికత కంటెను (2-14). ఇపుడుపదేశింప నున్న గభీరతర ఆధ్యాత్మికత కంటెను (2-38) నిమ్నస్థాయిలో నున్నట్లు గన్పించవచ్చును; ఏలన తర్వాతి శ్లోకమున (2-38) గురువు సుఖదుఃఖములను, లాభాలాభములను, జయాపజయములను ఆత్మకు సమము గావించి, పిమ్మట యుద్ధమునకు దిగుమని అర్జునుని ఆదేశించును - ఇదియే గీతా ముఖ్యోపదేశము. కాని భారతీయ నీతిశాస్త్రము మానవుని వికాసమాన నైతిక, ఆధ్యాత్మికజీవితమునకు సోపానగత ఆదర్శముల వ్యావహారికాదర్శమును సదా గుర్తించియేయున్నది. ఇచ్చట క్షత్రియాదర్శము, ఇక ముందు వచ్చు తన ఆధ్యాత్మికార్ధమున గాక, తన సామాజికరూపముననే ప్రస్తావించబడినది. సుఖదుః ఖముల విచారణ, కర్మఫలముచే కర్మహేతువు గావలయు నని నీవు పట్టుబట్టుచో, ఈ సామాజిక క్షత్రియాదర్శమే నీకు నా సమాధాన మని శ్రీకృష్ణుడు సారాంశముగా వచించును, ఆత్మ మఱియు ప్రపంచముల ఉచ్చతరజ్ఞానము నీ కేది నిర్దేశించునో, చూపియున్నాను(2-18); నీ సామాజిక కర్తవ్యమును, నీ క్షత్రియ వర్ణముయొక్క నైతికప్రమాణమును నీకేది నిర్దేశించునో, చూపియున్నాను - "స్వధర్మమపి చావేక్ష్య" (2-31). ఎటు చూచినను, ఫలితమొకటే - యుద్ధము. కాని నీవు నీ స్వధర్మముతో తృప్తిపడవేని, అది శోకములోను, పాపములోను దింపు నని నీవు తలంతు వేని, అపుడొక నిమ్నతరాదర్శములోనికి దిగజాఱక, ఒక ఉచ్చతరాదర్శములోని కారోహించు మని నిన్నాదేశించుచున్నాను. (తదార్శమేదియన) సర్వాహంకారమును విసర్జించుము, సుఖదుఃఖములను లక్ష్యపెట్టకుము, లాభాలాభములను, ఎట్టి ప్రాపంచిక ఫలితములను లక్షింపకుము, నీవు సేవించవలసిన ఆశయమును, నీవు నిర్వహించ వలసిన కర్మమును మాత్రమే గుఱించిన అర్జునుని నెపమునకు, రక్తపాతమునుండి

నివృత్తిని గుఱించిన నెపమునకు, పాపవేదనను గుఱించిన నెపమునకు, తన కర్మయొక్క అశుభఫలితములను గుఱించిన నెపము నకును తన జాతి మఱియు కాలము అందుకొనిన అత్యున్నత జ్ఞానము మఱియు నైతికాదర్శముల ననుసరించి సమాధానము లీయబడినవి.

13. ఆర్యధర్మము ధర్మరక్షణము :

ఇదియే ఆర్యక్షత్రియుని ధర్మము. "భగవంతుని తెలిసికొనుము," అని బోధించును, "నిన్ను నీవు తెలిసికొనుము, మానవునికి సాయపడుము; భయముగాని, దౌర్బల్యము గాని, సంకోచముగాని లేక, ప్రపంచమున యుద్ధకర్మను నిర్వహింపుము. నీవు సనాతన అక్షరాత్మవు, నీ అంతరాత్మ యిచ్చట అమరత్వమువరకు బోవు ఊర్ధ్వమార్గమునం దున్నది; కావున జననమరణములను పాటించబనిలేదు, శోక క్లేశ దుఃఖములను పాటించబని లేదు. ఇవి జయించి, అతిక్రమించవలసిన విషయాలు మాత్రమే. నీ సుఖమును, పెంపును, లాభమునే చూచుకొనకుము, పరంతు పైకిని, చుట్టును జూడుము - పైకి నీ వారోహించుచున్న తేజోమయ శిఖరముల కేసి చూడుము: చుట్టును యుద్ధమునకు, పరీక్షకు రంగమైన ప్రపంచమును జూడుము - ఈ ప్రపంచమున శుభాశుభములు, పురోగమన తిరోగమనములు కఠోర సంఘర్షమున లగ్నమై యున్నవి. బలశాలివి, వీరుడవునగు నిన్ను ప్రజలు సాహాయ్యార్థము పిలుచుచున్నారు; కావున సాయపడుము, యుద్ధము చేయుము. వినాశముచేత ప్రపంచము పురోగమించవలసి వచ్చినపుడు, వినాశమునకే బూనుకొనుము, పరంతు నీవు నాశనముచేయు దానిని ద్వేషింపకుము, అటులే మరణించు వారికొఱకు శోకింపకుము. సర్వత్ర ఏకాత్మను జూడుము, అందరిని అమరమగు జీవాత్మలనుగాను, శరీరమును ఇంత మట్టిగాను దెలిసికొనుము. స్థిరము.దృఢమునగు సమభావముతో నీకర్మ నొనరింపుము: యుద్ధముచేసి వీర మరణము బొందుము, లేక ప్రబల విజయమును సాధింపుము. ఏలన ఇది భగవంతుడును, నీ స్వభావమును నీ కప్పగించిన కార్యము.

8. సాంఖ్యము - యోగము

1. సాంఖ్య యోగ విభేదము :

ఇతఃపూర్వము అర్జునుని సమస్యలకు సంక్షిప్తసమాధాన మిచ్చి, ఇపుడు ఆధ్యాత్మిక పరిష్కారమునకు సూత్రప్రాయమగు ఒక అతి ముఖ్యవిభేదమును - సాంఖ్య యోగ విభేదమును - దివ్యగురువు ప్రస్తావించుచున్నాడు. "సాంఖ్య విషయకమగు ఇట్టి బుద్ధిని (బౌద్ధిక జ్ఞానమును) నీకు ప్రవచించితిని. ఇపుడు యోగ బుద్ధిని గుఱించి వినుము? ఏలన ఈ బుద్ధియుక్తుడవై, ఓ పార్థ, నీవు కర్మబంధమును విదళించివేతువు (2-39)." ఇది గీత ఉద్దేశించిన విభేదముయొక్క శాబ్దికానువాదము.

2. గీతకు ప్రాతిపదిక సాంఖ్యయోగములు :

గీత వస్తుతఃఒక వేదాంతశాస్త్రము. కావుననే అది ప్రస్థానత్రయములో నొకటిగా గణుతికెక్కెను. ఇది శ్రుతివలె అవిష్కృతవచనము గాకపోయినను, అధికాంశము తన ప్రతిపాదనప్రకారమునందు బౌద్ధికము, తార్కికము, దార్శనికమయినను, పదుమూడవ ఉపనిషత్తను గురుతరగౌరవమును బొందియున్నది. అయినను గీతయొక్క వేదాంతభావములు ఆదినుంచి అంతమువరకు సాంఖ్య యోగ భావముల వర్ణములో మనకు దర్శనమిచ్చును. ఈ ప్రక్రియనుండి ఉద్భవించినదే గీతాశాస్త్రము యొక్క విలక్షణ సమన్వయ స్వభావము. గీత ముఖ్యముగా ఆచరణాత్మక యోగ విధానమునే బోధించును కాగా, ఈ విధానమును వివరించుటకే అది దార్శనిక భావములను బ్రవేశపెట్టును. మఱియు గీత వేదాంత జ్ఞానమును కేవలము ప్రవచించి సరిపెట్టక, కర్మపర్యవసానమగు జ్ఞానములోనికి కర్మల నెట్లు ఉద్ధరించునో, మఱియు కర్మలకు భక్తి నెట్లు వాస్తవహృదయము, మూలబీజము గావించునో, అట్లే భక్తి జ్ఞానములకు సైతము కర్మలను పునాదిగావించును. మఱియు గీతా యోగము సాంఖ్యమునందు నిలిచి, దానినే ప్రారంభ బిందువు గావించుకొని, దానిని తన పద్ధతియందును, సిద్ధాంతమునందును ఒక బృహదంశముగా నిలుపు కొనును. అయినను అది సాంఖ్యమును దాటిపోయి, దాని విలక్షణ ప్రవృత్తులను సైతము కొన్నింటిని నిషేధించి, నిమ్నతర విశ్లేషణాత్మక సాంఖ్యజ్ఞానమునకును, ఉచ్చతర సమన్వయాత్మక వేదాంతజ్ఞానమునకును పొందుగుదుర్ప నొక మార్గమును గనుగొనును.

3. గీతా సాంఖ్యము :

అయితే గీత వచించు సాంఖ్య యోగము లేవియగును? అవి నిశ్చయముగా ఈశ్వర కృష్ణుని 'సాంఖ్యకారిక'యు పతంజలి 'యోగసూత్రములు'ను గావు. గీతాసాంఖ్యము, కనీసము సామాన్యులకు స్ఫురించు అర్థమును బట్టి, కారికా సాంఖ్యము గాదు. ఏలన గీత ఎక్కడను సత్తయొక్క మూలసత్యముగా పురుషుల బహుత్వము నంగీకరించదు. పైగా సాంఖ్యము దేనిని ప్రయాసపడి నిషేధించునో, గీత ఆ ఏకమే (బ్రహ్మమే)ఆత్మ మఱియు పురుషుడనియు, ఆ ఏకమే మఱల ఈశ్వరుడు లేక పురుషోత్తముడనియు, ఈశ్వరుడే జగత్కారణ మనియు వక్కాణించును. సాంప్రదాయిక సాంఖ్యము నిరీశ్వరము కాగా, గీత సేశ్వరవాదమును, విశ్వదేవతా వాదమును (Pantheism), అద్వైతవాదమును, ఆమోదించి వానిని సూక్ష్మరీతిని సంగతముగావించును.

4. గీతాయోగము :

మఱియు గీతాయోగము పతంజలి మహర్షియొక్క యోగదర్శనము గాదు. ఏలన అది కేవలమానసికమగు రాజయోగ విధానము; ఒక ఆంతరిక సాధన; పరిమితము, నిర్దిష్టమునగు ఒక సోపానసరణి. దీనివలన మనస్సు ప్రశమించి, సమాధి గతము కాగా, అంతరాత్మయొక్క శక్తిజ్ఞానములు విస్తరించును, భగవత్సాయుజ్యమును ప్రాప్తించును. అయితే గీతాయోగము ఉదారము, నమ్యము (flexible); అనేకాంశములతో గూడిన బహుముఖ విధానము. ఈ అంశము లన్నియు ఒక విధమగు సహజ, సజీవ సదృశీకరణముచేత (assimilation); విజయవంతముగా అన్యోన్యము గావించబడును; వీనిలో రాజయోగము ఒక అంశము - ముఖ్యము, మార్మికము గాని ఒక అంశము. ఈ యోగము కఠోరమగు శాస్త్రీయసోపానము లను నిర్దేశించదు, సహజమగు ఆత్మవికాస ప్రక్రియ నవలంబించును. అది అంతః సమతకు, బాహ్యకర్మకు సంబంధించిన కొద్దిసూత్రముల నవలంబించి, ఆత్మ పరివర్తనమును, అవరప్రకృతి నుంచి దివ్యప్రకృతిలోనికి దాని నూతనజన్మను సాధింప జూచును. దీనిని బట్టి గీతాసమాధి రాజయోగలయముకంటెను మిక్కిలి భిన్నమగును. పాతంజలి దృష్టిలో చిత్తశుద్ధికొఱకు, మన ఏకాగ్రతనిమిత్తము ఆదిలో మాత్రమే కర్మలు తోడ్పడును; కాగా గీతాదృష్టిలో కర్మలు యోగముయొక్క విశిష్టలక్షణమే

యగును. పాతంజలికి కర్మలు పూర్వాంగము మాత్రమే కాగా, గీతాయోగమున కవి సుస్థిరాధారము. లక్ష్యము సిద్ధించిన పిమ్మట రాజయోగము కర్మల నావల బెట్టును. అయితే గీత కవి అత్యున్నతారోహణాసాధనములై, అంతరాత్మ సంపూర్ణ విముక్తి పిమ్మట సైతము కొనసాగుచుండును.

5. సాంఖ్య యోగము లొక్కటియే :

ఈమాత్రవివేచన చేయనిచో, పరిచిత శబ్దములను, వాని సాంకేతికార్థమును మించిన విశాలార్థములో గీత ప్రయోగించును గాన, తికమక ఏర్పడును. పరస్పరము విరోధించుకొను శాఖలవలె గీత సాంఖ్య యోగముల పరిధిలో కట్టువడక పోయినను, వానిలోని సారతత్త్వము నంతను, సార్వత్రిక సత్యము నంతను అంగీకరించును. గీతాసాంఖ్యము ఉదారమగు వేదాంతసాంఖ్యము; దీని ప్రథమ తత్త్వములును, అంశములును ఉపనిషత్తుల విశాల వేదాంతసమన్వయమునందు మనకు గాన వచ్చును. ఇక గీతాయోగము ఆత్మను గనుగొనుటకు గాని, భగవంతుని గలియుటకు గాని ఆవశ్యకమగు అభ్యంతరసాధనయు. అంతరపరివర్తనము నగును. కాగా రాజయోగము ఈ విశాలభావముయొక్క ఒక ప్రత్యేక ప్రయోగము మాత్రమే. సాంఖ్య యోగములు రెండు విభిన్న, విసంగత, విరుద్ధ విధానములు గావు; పైగా తమ తత్త్వమునందును, లక్ష్యమునందును ఒకటియే యని గీత పట్టుదలతో వక్కాణించును (5-4,5). అవి తమ పద్ధతియందును, ప్రారంభబిందువు నందు మాత్రమే భేదించును. సాంఖ్యమును ఒక యోగమేగాని, అదిజ్ఞానముద్వారా ముందుకు సాగును; అనగా అది బౌద్ధికవివేచన మఱియు మన సత్తయొక్క తత్త్వముల విశ్లేషణ ద్వారా ముందుకు సాగి, సత్యదర్శనము, సత్యప్రాప్తిద్వారా తన లక్ష్యమును సాధించును. దీనికి ప్రతిగా యోగము కర్మద్వారా ముందుకు సాగును. గీతా యోగము తన ప్రథమ తత్త్వమునందు కర్మయోగ మగును(2-47). కాని తర్వాతి నిర్వచనము లను బట్టి (3-30. 4-18), కర్మశబ్దము గీతయందు మిక్కిలి వ్యాపకార్థమున ప్రయోగించబడినదని మనకు స్పష్టమగును; మఱియు కర్మప్రభువునకు ఒక యజ్ఞముగా సమస్త బహిరంతరకార్యకలాపముల నిస్స్వార్థ నివేదనము (9-27, 18-65) గీతాయోగమున కర్థమనియు దెలియును. జ్ఞానము ఏ సత్యదర్శనము నిచ్చునో, తదనుష్ఠానమే యోగము; మఱియు దీప్తమగు భక్తిభావము, శాంతము లేక తీవ్రమగు సమర్పణాభావము ఇట్టి అనుష్ఠానమునకు చాలకశక్తి (Motive force) యగును.

6. సాంఖ్య సత్యములు :

కాని సాంఖ్యసత్యము లేవి? ముందు, దాని విశ్లేషణ ప్రక్రియను బట్టి దాని కా పేరు వచ్చెను. సాంఖ్యము ఒక విశ్లేషణము, ఒక పరిగణనము; మన సత్తయొక్క తత్త్వములను వేఱుచేసి, వివేచించి ముందుంచుటయే సాంఖ్యము. సాధారణమనస్సు ఈతత్త్వముల సంఘాతఫలితములను మాత్రమే చూచును. సాంఖ్యము సమన్వయమును లక్షించలేదు. నిజానికి దాని మూలదృక్కోణము ద్వైతము. ఈ ద్వైతము ఆ పేరుతో నుండు వేదాంతమతముల సాపేక్షద్వైతము గాక, నిరపేక్ష, ఖండిత ద్వైతము. ఏలన సాంఖ్యము ఒకటి గాక, రెండు మూలతత్త్వముల నాశ్రయించి, వాని సంయోగమే (13-27) సృష్టికారణమని వివరించును - నిష్క్రియ పురుషతత్త్వము, సక్రియ ప్రకృతితత్త్వము పురుషుడన ఆత్మ- అయితే సామాన్య లేక ప్రసిద్ధార్థమున గాదు; ఈ ఆత్మ నిశ్చలము, అక్షరము, స్వయందీప్తము నగు విశుద్ధ సచేతనసత్త యగును. ప్రకృతియన శక్తి మఱియు దాని ప్రక్రియ, పురుషుడేమియు చేయడు. శక్తి క్రియను, దాని ప్రక్రియలను ప్రతిబింబించును. తన క్రియలయందు చేతనారూపము ధరించును. ఇట్లు సృష్టిస్థితి లయములు, జనన జీవన మరణములు, జ్ఞానాజ్ఞానములు, కర్మాకర్మలు, సుఖదుఃఖములు సృజింపబడును. పురుషుడు ప్రకృతిప్రభావమునకు వశుడై వీనిని తనకే ఆపాదించుకొనును. అయితే అవి తన కెంతమాత్రము గాక, ప్రకృతిక్రియ లేక గతికే చెందును.

7. పురుషుడు సాక్షి, అనుమంత మాత్రమే :

ఏల చెందుననగా ప్రకృతి త్రిగుణాత్మిక - గుణములన శక్తి పనిచేయు మూలప్రకారములు. సత్త్వగుణము, జ్ఞానబీజము, శక్తిక్రియలను పాలించును; రజోగుణము, బలము మఱియు కర్మల బీజమును, శక్తిక్రియలను సృజించును; కాగా తమోగుణము జడత్వాజ్ఞానముల బీజమును, రజఃసత్త్వముల నిషేధమును సృజించును; వాని సృజన పాలనములను లయము గావించును. ఈ గుణములు సామ్యావస్థలో నున్నపుడు, అంతయు నిశ్చలతయం దుండును, గతి గాని, క్రియ గాని, సృష్టి గాని యుండదు. కావున పురుషునియందు ప్రతిఫలించవలసిన దేమియు మిగులదు. కాని ఈ సమత చెదిరి నపుడు, గుణములు విషమతలో బడి, ప్రాబల్యమునకు బ్రయత్నించును, ఒండొరులపై పనిజేయును. దీనినుంచియే

నిర్వ్రామ సృష్టి స్థితి లయముల దుస్తరవ్యాపారమంతయు ప్రారంభమగును. తన స్వభావమును మఱుగుపఱుచు ఈ విషమతను ప్రతిఫలింప పురుషుడు సమ్మతించినంత కాలము ఈ వ్యాపారము సాగుచుండును; కాని పురుషుడు తన సమ్మతిని ఉపసంహరించి నపుడు, గుణములు సామ్యావస్థలో మునుగుటయు, పురుషుడు తన సనాతన నిశ్చలత్వమునకు తిరిగివచ్చుటయు జరుగును; ఇది ప్రకృతినుండి పురుషుని విముక్తి. ఈ ప్రతిఫలము మఱియు సమ్మతి నిచ్చుట లేక ఉపసంహరించుట–ఇవి మాత్రమే పురుషునియొక్క శక్తులుగా గోచరించును. అనగా అతడు సాక్షియు, అనుమంతయే గాని సక్రియముగా ఈశ్వరుడు గాడు. అతడు సమ్మతించుటయు, నిరాకరించుటయు సైతము నిష్క్రియతయొక్క రెండు రూపములే. బాహ్యాభ్యంతరక్రియ సర్వము పురుషునికి విజాతీయమే; అతనికి సక్రియసంకల్పము గాని సక్రియబుద్ధి గాని యుండదు. కావున అత డొక్కడే సృష్టికారణము గాజాలడు గాన, రెండవ తత్త్వమును స్థాపించవలసివచ్చెను. ఇట్లు నిష్క్రియచేతనయు. సక్రియశక్తియు గలిసి విశ్వహేతు వయ్యెనని సాంఖ్యము వివరించును.

8. బుద్ధియు జడమే :

కాని మనము సహజముగా ప్రకృతికి గాక పురుషుని కాపాదించు ఈ సచేతన బుద్ధియు, సచేతన సంకల్పమును ఎటనుండి వచ్చును? సాంఖ్యము ననుసరించి ఈ బుద్ధి సంకల్పములు పూర్తిగా ప్రకృతియొక్క జడశక్తి అంగములే గాని పురుషుని ఆత్మధర్మములు గావు; అవి ఇరువదినాలుగు విశ్వతత్త్వములలో నొకటి యగు బుద్ధి తత్త్వము. పరిణామసమయమున ప్రకృతి తన గుణములతో బాటు అవ్యక్త మనబడు తన మూల, అచేతన పదార్థమునందు కాలూనియుండును. ఈ అవ్యక్త పదార్థము నుండియే ప్రాచీనవిజ్ఞానము పేర్కొను ఆకాశము, వాయువు, అగ్ని, జలమునను పంచభూతములు వెలువడును. కాని ఆధునిక శాస్త్రీయార్థమున ఇవి ఇనుము, మున్నగు ధాతవులు గావు; కాని జడశక్తియొక్క సూక్ష్మావస్థలు. అందుచేత స్థూలజగత్తు నందు తమ శుద్ధరూపమున గానరావు. సాంఖ్యశాస్త్రమున శక్తి, ద్రవ్యము లొక్కటియే గావున, ఇవి ద్రవ్యముయొక్క అవస్థ లనియు చెప్పవచ్చును. వస్తువు లన్నియు ఈ పంచభూతముల సంయోగముచేతనే సృజింపబడును. మఱియు ప్రతి భూతము ఒకొక ద్రవ్యగుణమున కాస్పదమై యుండును – ఆ గుణములు శబ్ద స్పర్శ రూప రస గంధములు. వీని మూలముననే ఇంద్రియ సహితమగు మనస్సు విషయములను

గ్రహించును. ఇట్టి పంచభూతములచేతను, వానిని గ్రహించుటకు సాధనలైన పంచ గుణములచేతను ప్రపంచముయొక్క బాహ్య పార్శ్వము ఉత్పన్నమగును.

9. ఆంతరతత్త్వములు :

ప్రపంచముయొక్క ఆంతరపార్శ్వమును నిర్మించునట్టి ఇంకను పదుమూడు తత్త్వములు గలవు – బుద్ధి లేక మహత్తు, అహంకారము, మనస్సు, ఈ మనస్సు యొక్క అయిదు జ్ఞానేంద్రియవృత్తులు, అయిదు కర్మేంద్రియవృత్తులు. మనస్సు మూలభూతమగు ఇంద్రియము; ఇది సమస్త విషయములను గ్రహించి, వానిపై తిరిగి ప్రతిక్రియ నెరపును. ఏలన దీనియందు అంతర్ముఖ, బహిర్ముఖ క్రియలు రెండును సరసను వర్తించును. మనస్సు విషయములను సర్వసామాన్యముగా గ్రహించుటయే గాక, జ్ఞానేంద్రియముల సాహాయ్యమున వానిని విశేషరూపమునను గ్రహించును. అటులే కర్మేంద్రియముల సాహాయ్యమున, మనస్సు ప్రతిక్రియాత్మకమగు కొన్ని ఆవశ్యక ప్రాణవృత్తులను విశేషరూపమున నిర్వర్తించును. పోగా బుద్ధి వివేచనాత్మకతత్త్వము; అది ఒకే సమయమున ప్రజ్ఞాసంకల్పములు రెండును అగును; అది వస్తువులను వివేచించి, వర్గీకరించు ప్రకృతిశక్తి, చివరకు, అహంకారము నే-నను భావము; అది బుద్ధియందుండు అంతర తత్త్వము; దీనిచేతనే పురుషుడు ప్రకృతితోను, ఆమె క్రియలతోను, తాదాత్మ్యము జెంద నిర్బంధించబడును. కాని ఈ అంతరతత్త్వములు సైతము ప్రకృతి బాహ్యక్రియలను నిర్వర్తించు తత్త్వములవలె జడములే, నిశ్చేతనశక్తియొక్క అంగములే. ప్రజ్ఞయు, సంకల్పమును ఎట్లు జడనిశ్చేతనముయొక్క ధర్మములు గాగలవో గ్రహించుట మనకు కష్టమే యైనను, ఆధునిక విజ్ఞానము సైతము అదే నిర్ణయమునకు రాక తప్పలేదని మాత్రము మనము గుర్తుంచుకొనవలయును. అణువునందు సైతము నిశ్చేతన సంకల్పమని మాత్రమే పిలువదగు ఒక శక్తి యున్నది; సమస్త ప్రకృతికర్మల యందును ఈ వ్యాపకసంకల్పమే అచేతనముగానే ప్రజ్ఞామయ కర్మలను జేయును. మానసికప్రజ్ఞ యని మనము దేని నందుమో, వస్తుతః అదియు, అణువునందలి ప్రజ్ఞయు నొక్కటే. సచేతనమనస్సు నిశ్చేతనమునందలి జడక్రియయొక్క ఒక పరిణామమే, ఒక లిపి భేదమే (Transcript) నని భౌతికవిజ్ఞానము గూడ నిరూపింప యత్నించినది. కాని ఆధునికవిజ్ఞానము దేనిని తెలయదని విడిచివేసెనో, సాంఖ్యము దానిని వివరించును – జడ నిశ్చేతనము చేతనారూప మెట్లు ధరించునో వివరించును. పురుషునియందు ప్రకృతి ప్రతిఫలనము

చేత నిది సంభవించును; ఎట్లు? పురుషుని చేతనాప్రకాశము ప్రకృతిక్రియలకు సంక్రమించగా, ఆ క్రియలు చేతనారూపమున భాసించగా, సాక్షిమాత్రుడగు పురుషుడు తనను విస్మరించి, తానే ఆ చేతనారూపమున ఆలోచనాది క్రియలను చేయుచున్నట్లు భ్రమించును. ఈ భ్రమను వదిలించు కొనుటయే ప్రకృతినుండియు, ఆమె క్రియలనుండియు పురుషవిముక్తికి ప్రథమ సోపాన మగును.

10. పురుష బహుత్వము :

మన వ్యవహారమున సాంఖ్యము వివరించని విషయము లనేకములు గలవు. కాని మనకు కావలసినది విశ్వప్రకృతి పీడాజాలమునుండి ఆత్మవిముక్తియే యగుచో, దాని కాధారముగా విశ్వప్రక్రియలను తత్త్వతః సాంఖ్యము వివరించు విధానము ఏ శాస్త్రవిధానమునకు దీసిపోదు; అది ప్రశస్తము, అమోఘము. కాని దానియందు ముందుగా మన కర్థముగాని విషయ మేమన, తన ప్రకృతి పురుషద్వైతములోనికి సాంఖ్యము పురుషుల అనేకత్వము నెందుకు గొనివచ్చును? ప్రపంచసృష్టిని, పరిణామమును వివరించుటకు ఒక పురుషుడు, ఒక ప్రకృతి యున్న చాలు ననిపించును. కాని సాంఖ్యము వస్తుతత్త్వములను నిశితముగా విడగొట్టి పరిశీలించును గాన, అది అనేకత్వమును లేవనెత్తక తప్పలేదు. ఎట్లన, మొదట మనకు వాస్తవముగా గన్పించున దేమి? సచేతనజీవు లనేకు లున్నారు; ప్రతి జీవికి బాహ్యాభ్యంతర వస్తువుల స్వీయ స్వతంత్రానుభవము గలదు; ప్రతిజీవి ఒకే గ్రహణాత్మక (Perceptive), ప్రతిక్రియాత్మక (Reactive) ప్రక్రియలతో పృథగ్ వ్యవహారము గలిగియుండును. పురుష డొకడే యగుచో, కేంద్రమునందే ఇట్టి స్వాతంత్ర్యము గాని పృథగ్భావము గాని యుండవు; అందరు ప్రపంచమును ఒకే రీతిగా జూతురు. బాహ్యాభ్యంతరములను సమముగా ననుభవింతురు. ప్రకృతి యొకటియే గనుక, అందరు జూచు ప్రపంచ మొకటే; ప్రకృతితత్త్వము లెల్లెడల ఒకటియే గావున, బాహ్యాభ్యంతర అనుభవమును సమకూర్చు సామాన్యతత్త్వము లందరికి నొకటియే. దృష్టి, భావము, వైఖరులయందును, కర్మ అనుభవము, అనుభవమునుండి పలాయనము – వీని యందును గానవచ్చు అనంతభేదము ప్రకృతిక్రియలనుండి వచ్చునది గాక, సాక్షిచేతననుండి వచ్చునదే; ఏలన ప్రకృతిక్రియలు అందరియందు నొకటియే. అందుచేతనే సాక్షిపురుషు లనేకు లనుకొనక తప్పని స్థితి వచ్చును. వేఱు చేయు అహంకారమువలన ఈ భేదము సిద్ధించగలదని చెప్పిన, అది సరికాదు.

అహంకారము అందరకు సామాన్యమగు ప్రకృతితత్త్వమే గాన, అది వివిధముగాదు. కావున అహంమయచేతనచే ఏర్పడిన ఏకపురుషుని అనేకజీవరూపములును ఒకటియే యగును; ఈ జీవుల ప్రాకృత (ప్రకృతివలన గలిగిన) భాగముల యొక్క రూపములు వివరముల ము ఎంత భేదించినను, ఆత్మదృష్టియందు గాని, ఆత్మానుభవమునందు గాని భేద ముండరాదు; కాని ఉన్నది. కావున, వేదాంతజ్ఞానము నుండియే ఉద్భవించినను, క్రమముగా వేదాంత తత్త్వములనుండి విడాకులుపుచ్చుకొన్న విశుద్ధ సాంఖ్యమునకు ఆత్మల బహుత్వము తార్కికముగా అనివార్యమగును. కానిచో, జీవుల బహుత్వము సిద్ధించదు.

11. ముక్తి - పురుష బహుత్వము :

అంతగాను ప్రచండమగు మఱియొక కఠినతావిశేషము గలదు. ఇతర దర్శనములకు వలెనే సాంఖ్యమును ముక్తినే లక్షించును. తన వినోదము నిమిత్తము ప్రకృతి నిర్వర్తించు కార్యకలాపమునకు పురుషుడు తన సమ్మతి నెపుడు ఉపసంహరించునో, అపు డీ విముక్తి సిద్ధించు నని నుడివియున్నాము. కాని ఇట్లు వచించుట ఒక వచోప్రకారము మాత్రమే. ఏలన, పురుషుడు నిష్క్రియు డగుటచే, ఈ ఉపసంహరణమును ప్రకృతియందలి ఒక వృత్తియే గావలయును. విచారింతుమేని, ఈ ఉపసంహరణ మొక క్రియ అయినంతలో, అది బుద్ధితత్త్వము నందలి ఒక పరావర్తన క్రియయే యని మనకు దెలియగలదు. ఇంతదనుక మన ఇంద్రియముల విషయవ్యాసంగమునకు బుద్ధి తోడ్పడుచు వచ్చినది; విశ్వశక్తి వ్యాపారములను బుద్ధి వివేచించి, అన్వయించుచు, సాక్షిపురుషుని ఆ వ్యాపారములతో తాదాత్మ్యము నొందించుచు వచ్చినది. ఇపు డదే బుద్ధి వస్తువిశ్లేషణప్రక్రియ నవలంబించి, ఆ తాదాత్మ్య మొక భ్రాంతిమాత్రమని చూపు విఘటనాత్మకజ్ఞానమునకు జేరుకొనును. చివరకు బుద్ధి ప్రకృతినుండి పురుషుని విశ్లేషించగా, పురుషుడు గతబంధనుడై, విశ్వలీలయందు రమించు మనస్సుతో నిక చేతులు గలుపడు. దీని అంత్యఫలిత మేమన, ప్రకృతి పురుషునియందు తనను ప్రతిబింబించుకొను శక్తిని గోల్పోవును. కారణము, అహంకారప్రభావము నశించుటచే, బుద్ధి సంకల్పము ఉదాసీనమై, పురుషుని అనుమతిని సంపాదింప ప్రకృతికి సాధనమగుట చాలించును. అపుడాధారము లేక ప్రకృతి గుణము లవశ్యముగా సమతావస్థలోనికి జాఱిపోవును, విశ్వలీల నిలిచిపోవును, పురుషుడు తన నిశ్చలశాంతికి తిరిగివచ్చును. అందుచేత

పురుష డొక్కడే యగుచో, వివేచనతత్త్వమగు బుద్ధి తన భ్రాంతినుండి తిరిగి పోయినచో, జగద్వ్యాపార మంతయు నిలిచిపోవును. వాస్తవముగా నిట్లు జరుగుట లేదని మనకు దెలియును. జరుగుచున్న దేమన, అసంఖ్యేయ మానవులలో ఎక్కడో ఒకడు ముక్తి నందుకొనును లేక అందుకు ప్రయత్నించును. దీనివలన తక్కినవారిలో మార్పేమియు వచ్చుట లేదు; వానితో విశ్వప్రకృతి జరుపు లీల యందు ఆవంత గూడ అసౌకర్యము తలెత్తలేదు. పురుష లనేకు లను సిద్ధాంతము చేతనే దీనిని వివరింప సాధ్యమగును. ఇది గాక, మఱియొక సహేతుక వివరణమసలున్నచో, అది మాయావాదము. ఇచ్చట బంధమోక్షములు రెండును అవాస్తవము, మాయామాత్రము గనుక, ముక్తివలన మాయాజాలమగు జగద్వ్యాపారమున కెట్టి క్షతియు సంభవించదు. కాని సాంఖ్య మీ సమాధానము నామోదింప జాలదు. ఏలన సాంఖ్యమతమున జగత్తు దృష్టిభ్రమ గాక, అధికతరసత్యమగును. కనుక ముక్తి విషయము నందు సైతము, సాంఖ్యవిశ్లేషణమువలన ప్రాప్తించు సత్యముల నంగీకరింతు మేని, ఆత్మబహుత్వము ఒక అనివార్య సిద్ధాంత మగును.

12. వేదాంత సాంఖ్యము :

ఈ సాంఖ్య విశ్లేషణము నుండియే గీత ఆరంభించి, తన యోగప్రతిపాదనము నందు సైతము దీనినే దాదాపు పూర్తిగా ఆమోదించుచున్నట్లు మొదటగా అనిపించును. ఎట్లన, గీత ప్రకృతిని, ప్రకృతిగుణములను, చతుర్వింశతి తత్త్వములను ఆమోదించును (14-5, 13-6); సర్వకర్మలు చేయునది ప్రకృతియే యనియు, పురుషుడు ఉదాసీను డనియు గీత ఆమోదించును (3-27, 14-23); విశ్వమునందు చేతనప్రాణుల బహుత్వమును ఆమోదించును (4-10). తాదాత్మ్యకారకమగు అహంకారవిలయము, వివేచనాపరమగు బుద్ధిక్రియ, మఱియు గుణాతీతత్వము (14-19,20)- ఇవి ముక్తిసాధనము లనియు గీత ఆమోదించును. ఆది నుండియు అర్జునునికి అనుష్ఠానపరముగా బోధింపబడిన దీ బుద్ధియోగమే. కాని ఒక మౌళిక భేదము గలదు - గీత పురుషుని ఏకముగానే చూచును. అనేకముగా గాదు. ఏలన ఒక స్వల్ప విషయమునందు తప్ప, గీతాప్రోక్తమగు విముక్త, అభౌతిక, అచల, సనాతన, అక్షర ఆత్మ సాంఖ్యపురుషుడే యగును. కాగా మౌళిక భేద మేమన ఆత్మ ఏకమే గాని అనేకము గాదు. సాంఖ్య బహుత్వ మే చిక్కును తప్పుకొనిపోవునో, దానినే ఈ

ఏకత్వము తెచ్చిపెట్టును. ఈ చిక్కును పరిష్కరింప, వేదాంతయోగముయొక్క భావములను, తత్త్వమును గీత వేదాంతసాంఖ్యము* లోనికి ప్రవేశపెట్టును.

13. వేదాంత యోగమున పురుష డీశ్వరుడు :

పురుషుని గుఱించిన భావనలోనే ముఖ్యమగు ప్రథమ నూతనాంశము గన్పించును. నిజమే పురుషుని ప్రీతికొఱకు ప్రకృతి తన కార్యము సాగించును; కాని ఆ ప్రీతి ఎట్లు నిర్ణయించబడును? మూలసాంఖ్యమును బట్టి చూచిన, శాంతసాక్షియొక్క నిష్క్రియానుమతి చేతనే. నిష్క్రియముగానే అతని అనుమతియు తదుపసంహరణమును సాగును. పురుషుడు సాక్షియు, అనుమంతయు, ప్రకృతి కర్మప్రతిఫలనముచేత దాని భర్తయు (13-23) నగును గాని, మఱేమియు గాడు. కాని గీతా పురుషుడు ప్రకృతి ప్రభువు (13-23) గూడను, బుద్ధిసంకల్పము యొక్క క్రియ ప్రకృతికి జెందినను, ఆ సంకల్పము యొక్క ఉత్పత్తియు, శక్తియు చేతనాత్మనుండి ప్రభవించును. అటులే ఆ సంకల్పమునకు గల తెలివి చేయు కర్మ ప్రకృతిదే యైనను, ఆ తెలివియొక్క మూలమును, ప్రకాశమును పురుషుడే సక్రియముగా సమకూర్చును. ఇట్లు పురుషుడు సాక్షిమాత్రుడే గాక, జ్ఞాతయు, ఈశ్వరుడు (13-23) నగును. అతడు ప్రకృతి క్రియయొక్క పరమకారణము, క్రియ నుండి ప్రకృత్యుపసంహరణముయొక్కయు పరమకారణము. శుద్ధసాంఖ్యమున పురుష ప్రకృతిద్వైతము కారణము కాగా, సమన్వయ సాంఖ్యమున పురుషుడు తన ప్రకృతిచేత జగత్కారణమగును. సంప్రదాయ సాంఖ్యము యొక్క కఠోరశుద్ధత నుండి ఎంత దూరము జరిగినామో, ఇపుడు మనకు తెలిసిపోవును.

14. గీతాప్రోక్తమగు వేదాంతాత్మ :

కాని గీతారంభమైన అచలము, నిత్యముక్తము ఏకము నగు అక్షరాత్మ మాటేమిటి? అది అవికార్యము, అజము, అవ్యక్తము (2-25), అది బ్రహ్మము. అయినను "దానిచేతనే ఇది యంతయు విస్తారితము" (2-17). కావున ఈ ఆత్మ సత్తలోనే ఈశ్వరత్వ మున్నట్లు గన్పించును; ఇది అచల మైనను, సర్వక్రియకు, చలనమునకు కారణము, ప్రభువు నగును. కాన ఎట్లు? మఱియు విశ్వము నందలి చేతనప్రాణుల

* సాంఖ్యపురుషుని స్థానమున వేదాంతాత్మను ప్రవేశపెట్టి, గీత సాంఖ్యమును వేదాంత సాంఖ్యము చేయును.

బహుత్వము మా టేమిటి? అవి ఈశుడుగా గాక, అనీశుడుగానే గన్పించును; ఏలన అవి గుణక్రియకు, అహంకారవిమోహమునకు అధీనములు, మఱియు గీతాసూచనను బట్టి ఇవి యన్నియు ఒకే ఆత్మయగుచో (2-18), ఈ లీనత, అధీనత, భ్రాంతి ఎట్లు సంభవించెను? లేక పురుషునియొక్క శుద్ధ నిష్క్రియతచేత తప్ప, దాని నెట్లు వివరించగలము. మఱియు ఈ బహుత్వ మెక్కడినుండి? లేక ఒకే ఆత్మ ఒక శరీరమునందు ముక్తి బొంది, ఇతర శరీరములం దెట్లు బంధన భ్రాంతిలో కొనసాగును; ఈ శంకలను సమాధానించక ముందుకు సాగజాలము.

15. ద్విపురుషులు :

గీత వీనికి తర్వాత అధ్యాయములలో సమాధాన మిచ్చును. ఇందు నిమిత్తము గీత చేయు పురుషునియొక్కయు, ప్రకృతియొక్కయు వివేచన సాంప్రదాయిక సాంఖ్యమునకు పరకీయము, వేదాంతయోగమునకు సముచితము నగు నూతన తత్త్వములను ప్రవేశపెట్టును. సాంఖ్యవిషయమున ఉపనిషత్తులు ఒకొక్కప్పుడు ఇరువురి పురుషులనే చెప్పును – "....అజులగు పురుషులిరువురు; అందులో నొకడు సక్తుడై ప్రకృతి ననుభవించును, రెండవవాడు ఆమెను పూర్తిగా అనుభవించెను గనుక త్యజించివేయును." (శ్వే. ఉ. 4-5). మఱియొక శ్లోకమున ఒకే చెట్టుపై నివసించు, శాశ్వతసఖులగు రెండు పక్షులుగా వారు వర్ణింపబడుదురు; ఒకటి ఆ వృక్షఫలమును భుజించుచుండగా, రెండవది భుజించక, తన సఖుని కేవలము చూచుచుండును మొదటి పక్షి ప్రకృతి ననుభవించు ప్రకృతిగతుడగు పురుషుడు, రెండవది ప్రకృతివర్జితుడగు సాక్షిపురుషుడు. మొదటివాడు రెండవవానిని దర్శించి అంతయు అతని మహిమ అని ఎఱింగినపుడు, శోకముక్తుడగును (శ్వే.ఉ. 4-6). ఈ రెండు శ్లోకముల ఆశయ మొకటియే యైనను, వాని దృక్కోణము భిన్నము. ప్రథమ శ్లోకములోని పురుషులిద్దరు ఒకే విధమగు చేతనపురుషులు. ఏలన ద్వితీయ పురుషుడును ఇంతకు ముందు ప్రకృతి ననుభవించిన వాడే. ద్వితీయశ్లోకము చెప్పున దేమన, ఒకడు సాక్షిపురుషుడు, అతనికి ప్రకృత్యనుభవ ముండదు. అంతయు అతని మహిమయే, అనగా అతడే తన నిమ్నసత్త యందు ప్రాకృతజీవుల బహుత్వములోనికి దిగి, ఏయొక జీవి యందైనను ప్రకృతిని విడిచి, తన ఊర్ధ్వస్థితిలోనికి ఉపసంహరించు కొనును. ఒకే చేతనాత్మయొక్క రెండు స్థాయిల ఈ సిద్ధాంతము పరిష్కారద్వారమును దెఱచినప్పటికి, ఏకము అనేకమగు ప్రకారము ఇంకను అస్పష్టముగానే యున్నది.

16. త్రిపురుషులు :

ఉపనిషత్తులలోని ఇతరవచనముల* భావమును బెంపొందించుచు, గీత ఈ పురుషులిరువురికి మఱియొక పరమపురుషుని, పురుషోత్తముని గలుపును. ఇతని మహిమయే సృష్టి యంతయు. ఇట్లు క్షరుడు, అక్షరుడు, ఉత్తముడు నను ముప్పురున్నారు (15-16,17). క్షరుడు చలము, క్షరమునగు ప్రకృతి, 'స్వభావము' (8-3), అనగా ఆత్మయొక్క నానావిధసంభూతి (పరిణామము); ఈ పురుషుడు దివ్యసత్తయొక్క బహుత్వరూపము; ఈ బహుపురుషుడు ప్రకృతి వియుక్తుడు గాక, ప్రకృతిగతుడు. కాగా అక్షరుడు అచలము, అక్షరము, ఇతడు శాంత నిష్క్రియ ఆత్మ; ఇది దివ్యసత్తయొక్క ఏక్వత్వరూపము; ఇతడు ప్రకృతి వృత్తియందు సంలగ్నుడు గాక, దాని సాక్షిగా నుండును. పోగా, ఉత్తముడు ఈశ్వరుడు, పరబ్రహ్మ, పరమాత్మ (15-17); ఇతడు అక్షరుని ఏకత్వమును, క్షరుని బహుత్వమును ధరించియుండును. తన ప్రకృతి, తనశక్తి, తన సంకల్పసామర్థ్యముల విశాలమగు క్రియా, చలత్వముల చేతనే అతడు ప్రపంచమునందు తననభివ్యక్తము గావించుకొనును; మఱియు తన సత్తయొక్క తతోధిక నీరవతానిశ్చలత చేత ప్రపంచమునుండి విడివడియుండును; అయినను పురుషోత్తముడుగా నతడు ప్రకృతిసంగమునకు, అసంగమునకు గూడ పైనుండును. ఉపనిషత్తులలో అంతర్గతముగా నున్న ఈ పురుషోత్తమభావమును వెలికి దీసి, తీర్చిదిద్దిన ప్రతిభ గీతకే చెందును. ఇతడే అద్వైతమును దాటిపోవు, సర్వోన్నతభ క్తియోగమునకు పరమప్రతిష్ఠ.

17. పరప్రకృతి - జీవుడు :

పురుషుని విషయమునందే గాక, ప్రకృతివిషయమునందును గీత సాంఖ్య విశ్లేషణతో తృప్తిపడదు. ఏలన ఈ విశ్లేషణయందు అహంకారమునకే తప్ప, బహు రూపుడగు పురుషునికి (ప్రకృతిలో) తావు లేదు. కాని గీత వక్కాణించున దేమన, ఈశ్వరుడే తన ప్రకృతిచేత జీవుడగును (7-5). కాని ఇ దెట్లు సంభవము? ఇరువది నాలుగు ప్రకృతితత్త్వములలో జీవుడు కాగల తత్త్వము లేదే? సాంఖ్యప్రకృతిలో లేని మాట నిజమే. కాని ఈ ప్రకృతి గుణాత్మికము, నిశ్చేతనము, బాహ్యమునగు

---

*పురుషః.... అక్షరాత్.....పరతః పరతః" (ముం. ఉ. 2-1-2)- అక్షరుడే పరుడైనను, వానికంటెను పరుడగు పురుషు డున్నాడు.

నిమ్నప్రకృతి మాత్రమే (7-5)ఉన్నతము, చేతనము, దివ్యమునగు పరప్రకృతి (7-5) మఱియొకటి గలదు. వైయక్తికాత్మ లేక జీవుడు అయిన దీ పరప్రకృతియే. ప్రతిప్రాణియు నిమ్నప్రకృతియందు అహంకారముగాను, పరప్రకృతియందు వైయక్తికపురుషుడుగాను రూపొందును. ఈ వైయుక్తికాత్మ నేనే, సృష్టియందది నాయొక్క ఆంశికాభివ్యక్తి- 'మమైవాంశః' (15-7). దానికి నా శక్తులన్నియు గలవు. అది ఉపద్రష్ట, అనుమంత, భర్త, జ్ఞాత, మహేశ్వరుడు (13-23). అది అపరప్రకృతిలోనికి దిగి, అపరసత్తననుభవించునిమిత్తము తనను క్రియాబద్ధముగా భావించుకొనును. అది వెనుకకు తగ్గి సర్వకర్మ విముక్తమగు నిష్క్రియ పురుషునిగా తనను తెలిసికొన గలదు. ఇంకను, అది గుణములపైకెగసి, కర్మ బంధమునుండి విముక్తమయ్యును, నా వలెనే కర్మవంతము కాగలదు; చివరకు పురుషోత్తముని ఆరాధనచేతను, అతనితో సాయుజ్యముచేతను అది సర్వథా అతని దివ్యప్రకృతి నుపభోగించగలదు.

18. యోగవిజయము :

ఈ గీతావిశ్లేణము విశ్వముయొక్క బాహ్యప్రక్రియకు మాత్రమే పరిమితము గాక, 'ఉత్తమరహస్య' మగు అతిచేతనప్రకృతియొక్క నిగూఢరహస్యములలోనికి చొచ్చుకొనిపోవును. ఈ పరప్రకృతి రహస్యముపైననే గీత తన వేదాంత సాంఖ్య, యోగసమన్వయమును, తన భక్తి జ్ఞాన కర్మసమన్వయమును స్థాపించును. శుద్ధసాంఖ్యముచేత మాత్రము ముక్తి మఱియు కర్మల సంయోగము విరుద్ధము, అసంభవము నగును. అటులే శుద్ధ అద్వైతముచేత మాత్రము యోగాంగముగా కర్మలను సదా కొనసాగించుటయు, అటులే పరిపూర్ణజ్ఞానము, మోక్షసాయుజ్యములు ప్రాప్తించిన పిమ్మట భక్తి విలాసమును అసంభవమగును, కనీసము హేతువిరుద్ధము, అనవసరమునగును. కాగా, గీతాసాంఖ్యముయొక్క జ్ఞానము ఈ అవరోధముల నన్నింటిని కొట్టి వేయగా గీతా యోగము యొక్క విధానము వీనిపై విజయము సాధించును (4-41).

9. సాంఖ్యము - యోగము - వేదాంతము

1. సాంఖ్య, యోగముల భేదము :

సాధారణముగా సాంఖ్యవిధానము, యోగవిధానము భిన్నము, విరుద్ధము గూడను అని తలంచబడును; విశాలమగు వేదాంతచక్రమున వీనిని సమన్వయ పఱచుటయే గీతయొక్క ప్రథమ షడధ్యాయముల సంపూర్ణ లక్ష్యము. సాంఖ్యము ప్రారంభ బిందువు మఱియు ప్రాతిపదికగా స్వీకరించబడును; కాని ఆదినుండియు అధికాధికముగా అది యోగ భావములచేతను, పద్ధతులచేతను నింపబడి, యోగాత్మ రూపమున తిరిగి పోతపోయబడును. అయితే ఆనాటివారికి గన్పించిన విధముగా వీని వ్యావహారిక భేద మేమి? సాంఖ్యము జ్ఞానముచేతను, బుద్ధియోగముద్వారాను (2-49) ప్రవర్తించును; కాగా యోగము కర్మలచేతను, సక్రియ చేతనాపరివర్తనము చేతను ప్రవర్తించును. ఈ ప్రథమ భేదమునుండి పుట్టిన రెండవ భేదము - సాంఖ్యము నిశ్శేష నిష్క్రియతకు, కర్మసన్యాసమునకు దారి తీయగా, కామన యొక్క అంతః సన్యాసము చాలును; ఆది కర్మలను భగవంతుని వైపునకు త్రిప్పి, విముక్తిని, భాగవత జీవనమును సాధించు (2-51) నని యోగము తలంచును. అయినను రెండింటి లక్ష్యము నొక్కటియే - జననమరణములను, పార్థివ జీవనమును అతిక్రమించి మానవాత్మ పరమాత్మతో ఏకమగుట, కనీస మీ భేదము గీతయందు మనకు గన్పించును.

2. వేదాంత సాంఖ్యము యొక్క భావములు :

సమన్వయము పట్ల అర్జునునకు గల కలవరమును (3-1) జూడ, ఆనాడు ఈ విధానముల మధ్య ఎంత అంతర ముండెనో మనకు సూచనగా దెలియును. ఆరంభముననే భగవానుడు కర్మలను బుద్ధియోగముతో సంగతముగావింప దొడంగును; బుద్ధియోగము కర్మలకంటె ఎంతో సమున్నతమని అతడనును; సామాన్య మానవ మనస్సును, దాని కామములను సర్వకామవివర్జితమైన బ్రాహ్మీస్థితియొక్క సమతాశుద్ధతలలోనికి జ్ఞాన ముద్ధరించగా, అపుడు కర్మలు ఆమోదయోగ్యము గావించబడును. కర్మలు హీనమైనను, జ్ఞానపరిపూతములైన ఇట్టి కర్మలు మోక్ష సాధనములే (ఇదియేసమన్వయము). ఇంద్రియ జయము, ఆత్మలోనికి మన ఉపసంహరణ, బ్రాహ్మీస్థితిలోని కారోహణము. నైర్వ్యక్తిక బ్రహ్మయందు అహంకార నిర్వాణము-వేదాంతసాంఖ్యమునకు అనురూపమగు ఈ భావములను దివ్య గురువు

ఒత్తిచెప్పుటను జూచిన అర్జునుడు, ఇంకను యోగమునకు అనురూప మగు భావములను వినియుండమిచే, కలవరపడి ఇట్లడుగును – "కర్మకంటె బుద్ధియే శ్రేష్ఠమని నీ మతమగుచో, నన్నెందుకు ఈ ఘోరకర్మయందు నియోగించుచున్నావు? (3–1). కలగలుపుమాట జెప్పి నా బుద్ధిని మోహింపజేయుచున్నట్లున్నావు; కావున దేనిచేత నేను శ్రేయమును బడయగలనో, దానిని తెగవేసి చెప్పుము," (3–2).

3. 'యోగసన్యస్తకర్మాణం' :

దీనికి సమాధానముగా, జ్ఞాన సన్యాసములచేత సాంఖ్యనిష్ఠయు, కర్మలచేత యోగనిష్ఠయు ప్రవర్తించు నని కృష్ణుడు వక్కాణించును (3–3). కాని, భగవంతుని కొక యజ్ఞముగా (3–9), సమతతో (2–48), కర్మఫలాపేక్ష లేక (2–51), ఆత్మ గాక ప్రకృతియే కర్మచేయుచున్న దను జ్ఞానముతో కర్మసలుపు కర్మయోగమువినా, వాస్తవసన్యాస మసంభవమని పలుకును. కాని మఱల వెంటనే, జ్ఞాన యజ్ఞము సర్వోత్తమము, జ్ఞానమునందే సమస్తకర్మయు తన పరాకాష్ఠ నందును (4–33), జ్ఞానాగ్నిచేత సర్వకర్మలు దహించివేయబడును (4–37); కావున ఆత్మవంతుడు 'యోగముచేత కర్మలను సన్యసించి' వాని బంధమును అధిగమించును (4–41) అని ప్రవచించును. ఇది విని అర్జునుడు మఱల కలత జెందును; యోగ తత్త్వము నిష్కామకర్మలు గదా? సాంఖ్యతత్త్వమగు కర్మసన్యాసము యోగము నందెందుకు చెప్పబడెను? దీనికి సమాధానమేమి? గురువు సమాధానము పలికియే యున్నాడు; బాహ్య అకర్మయందు ఇంకను సాగుచున్న కర్మను చూడవలయును; తాను కర్తనను భ్రాంతిని త్యజించి, యజ్ఞప్రభువుయొక్క చేతుల లోనికి కర్మలను సమర్పించిన ఆత్మ బాహ్యకర్మయందు వాస్తవాకర్మను జూడవలయును (4–18). కాని ఈ సమాధానము అర్జునుని వ్యావహారిక మనస్సునకు అతి స్వల్పము, అతిసూక్ష్మము; పైగా విరుద్ధశబ్దకథితము గాన, అర్జునుడా శబ్దభావమును గ్రహించలేదు, కనీసము వాని మార్మికసత్యతలోనికి ప్రవేశించలేదు. కావున అతడు మఱల అడుగును – "నీవు కర్మసన్యాసమును, ఓ కృష్ణ! తిరిగి యోగమును జెప్పుచున్నావు. ఈ రెండింటిలో నేది శ్రేష్ఠమార్గమో సునిశ్చితముగా వచింపుము"(5–10).

4. జ్ఞానకర్మసమన్వయము :

దీని కిచ్చిన సమాధానము చాల ముఖ్యము; ఏలన అది రెండింటి భేదమును స్పష్టముగా చూపి, వాని సమాధాన (reconciliation) మార్గమును సూచించును.

కర్మసన్యాస, కర్మయోగములు రెండును ఆత్మశ్రేయము సాధించునవే. కాని వీనిలో సన్యాసముకంటెను యోగమే శ్రేష్ఠతరము (5-2). ఎవడు దేనిని ద్వేషించడో, కామించడో, వాడు (కర్మ చేయుచున్నను) సన్యాసియే యని తెలియుము; ఏలన ద్వంద్వవిముక్తుడగువాడు సుఖముగా బంధవిముక్తుడగును(5-3). పిల్లలు మాత్రమే సాంఖ్యయోగములు వేఱని పలుకుదురు, పండితులు గాదు. ఒక దానిని సమగ్రముగా నాశ్రయించినప్పటికి, సాధకుడు రెండింటి ఫలము బొందును," (5-4). ఏలన తమ సమగ్రరూపమున అవి ఒకదానియందొకటి యుండును. సాంఖ్యసాధకులే స్థానమును బ్రాపింతురో, యోగులును దానినే బ్రాపింతురు."సాంఖ్యయోగముల నొకటిగా చూచువాడే నిజముగా చూచువాడు (5-5). కాని యోగము వినా సన్యాసము దుస్సాధ్యము, యోగము నాచరించు ముని శీఘ్రముగా బ్రహ్మమును బొందును (5-6). అతని ఆత్మ సర్వభూతాత్మ యగును గాన, కర్మలు అతనివి గాక ప్రకృతివని అతనికి దెలియును; ఇక నా జ్ఞానముచేతనే అతడు కర్మముక్తుడు; అతడు కర్మలను సన్యసించి యున్నాడు, <u>అతనిద్వారా క్రియలు జరుగుచున్నను, అతడే క్రియలను జేయడు;</u> అతడాత్మ యగును. అతడు బ్రహ్మయగును 'బ్రహ్మభూతః' (18-54). అతడు సర్వభూతములను ఆస్వయంభూ బ్రహ్మసత్తయొక్క సంభవములను (becomings) గానే చూచును. మఱియు వాని క్రియలను తమ వైయుక్తిక ప్రకృతిద్వారా పనిచేయుచున్న విశ్వప్రకృతియొక్క విజృంభణముగానే గాంచును. ఇదియే గీతాబోధన యంతయు గాదు; ఏలన ఇంతదనుక అక్షరాత్మలేక పురుషుని భావమేగాని, ఈశ్వరుడు లేక పురుషోత్తముని భావము స్పష్టముచేయబడలేదు; కర్మ జ్ఞానసమన్వయమే గాని, భక్తిరూపమగు పరమతత్త్వము ప్రతిపాదింపబడలేదు; ఒక నిష్క్రియపురుషుడు, నిమ్నప్రకృతియే గాని, ఇంకను త్రివిధపురుషుడు, ద్వివిధప్రకృతియొక్క వివేచన చేయబడలేదు. ఈశ్వరప్రసక్తి వచ్చియున్న మాట నిజమే; కాని ఆత్మతోను, ప్రపంచముతోను అతని సంబంధ మింకను నిర్దేశింపబడలేదు. ఈ అతిప్రధాన సత్యముల స్పష్టీకరణము వినా, ఎంతవఱకు సాధ్యమో, అంతవఱకే ప్రథమషట్కమున సమన్వయము నిర్వహింపబడినది.

5. జ్ఞానమార్గమునందు మార్పులు :

బ్రాహ్మీస్థితిలో బ్రవేశించుటకు ఆత్మకు ద్వివిధనిష్ఠ గలదని కృష్ణుడు చెప్పును- "సాంఖ్యుల విషయములో జ్ఞానయోగనిష్ఠ, యోగుల విషయములో కర్మయోగనిష్ఠ"

(3-3). ఇట్లు సాంఖ్యమును జ్ఞానయోగముగాను, యోగమును కర్మ యోగముగాను భావించుచుండుట ఆసక్తిని గలిగించును. ఏలన ఈనాటి జ్ఞానయోగ భావములు వేదాంతభావములు గాని సాంఖ్యభావములు గావు. ఈ వేదాంత జ్ఞానయోగము ప్రాబల్యము వహించిన పిమ్మట తక్కిన వైదిక జ్ఞానములు మఱుగునకు బోయినవి. గీతాభాషను బట్టి, ఆనాటి జ్ఞానయోగులు సామాన్యముగా సాంఖ్యపద్ధతినే అవలంబించిరని మన మనుకొనవలయును తర్వాత బౌద్ధమతము వ్యాపించి, సాంఖ్యమును చీకటిలోనికి నెట్టెను. సాంఖ్యమువలె బౌద్ధమును విశ్వశక్తి పరిణామములు అనిత్యమని వక్కాణించును; అయితే ఈ విశ్వశక్తిని ప్రకృతియనిగాక, కర్మయని ప్రతిపాదించును. కారణము, బౌద్ధము వేదాంత బ్రహ్మమును గాని సాంఖ్య పురుషుని గాని అంగీకరించదు. ప్రపంచానిత్యము నొక్కి చెప్పు బౌద్ధము తదనిత్యతా వేదననే మోక్షసాధన గావించును. పిమ్మట బౌద్ధమతముపై ప్రతిక్రియ ప్రభవించి నపుడు, జ్ఞానయోగము పురాణ సాంఖ్య సంస్కారమును గాక, శంకరాచార్య ప్రచారిత వేదాంతరూపమును స్వీకరించెను. శంకరుడు బౌద్ధుల అనిత్యస్థానమున సజాతీయ మగు, వేదాంతుల మాయాభావమును బ్రవేశపెట్టెను; అనిర్వచనీయమగు వారి అసత్ - స్థానమున అదే కోవకు చెందిన అనిర్వచనీయమగు సత్-ను బ్రవేశపెట్టెను. అసత్తు నిషేధాత్మక కేవల మైతే, సత్తు సద్భావాత్మకమైనను అవర్ణనీయ కేవలము. ఈసద్రూప బ్రహ్మమునందు రూపము, క్రియ, శక్తి అంతరించిపోవును; ఏలన అక్కడవి వాస్తవముగా నెప్పుడును ఉండలేదు, అవి మనోభ్రమలు మాత్రమే. ఇప్పటి జ్ఞానయోగము శంకరుని ఈ భావనల మీద ఆధారపడిన జ్ఞానయోగము. దీనిని స్మరించునపుడు, దీనితో ముడిపడియుండు జీవనసన్న్యాసము గుర్తుకువచ్చును. ఏలన జీవనమొక భ్రాంతి. కాని శంకర వేదాంతమునకు పూర్వము వెలసిన గీతాకాలము నందింకనుమాయ స్పష్టముగానే వేదాంతదర్శనముయొక్క ప్రధానపదము గాలేదు; మఱియు శంకరుడు తన ప్రదీప్తశక్తితో విశిష్టరీతిని దానినుంచి వెలికి లాగిన ప్రత్యేకార్థము గూడ దాని కప్పటికి లేదు. ఏలన గీతలో అసలు మాయప్రసక్తియే తక్కువ, మఱియు అచ్చటను, మాయ ప్రకృతియొక్క నిమ్నభావముగానే గన్పించును గాని, మిథ్యాభావముగా గాదు, అది త్రిగుణముల నిమ్నప్రకృతి- "త్రైగుణ్యమయీ మాయా" (7-13,14). గీతోపదేశమునందు భ్రాంతికారకమగు మాయగాక, ప్రకృతియే సృష్టికార్యమును సాధించు కారణము.

6. గీతాసమన్వయ సంగ్రహము :

సాంఖ్యయోగముల తాత్త్వికతారతమ్య మెటులున్నను, గీత ననుసరించి, వీని వ్యావహారిక భేదము మాత్రము ఇప్పటి వేదాంతజ్ఞానయోగమునకు, వేదాంతకర్మ యోగమునకు ఉన్న భేదమేయగును, మఱియు ఈ భేదముయొక్క వాస్తవ ఫలితములును సమమే. సాంఖ్యము విచార, వివేకములద్వారా పురుషుని నిష్క్రియ నిజస్వరూపమును, సంగమువలన ఆ స్వరూపముపై ప్రకృతికర్మల ఆరోపణ విషయమును దెలిసికొనును. అటులే వేదాంతము అదే విచారవివేకముల ద్వారా ఏకాత్మయొక్క నిజస్వరూపమును, దానిపై, మనోభ్రాంతిచేత గలుగు సంగమువలన మిథ్యాజగత్తుయొక్క ఆరోహణ విషయమును గ్రహించును. వేదాంత మార్గమున, ఏకాత్మరూపమగు తన సత్య సనాతనపదమునకు అంతరాత్మ తిరిగివచ్చినపుడు, మాయ నశించును. జగత్క్రియ అదృశ్యమగును. కాగా సాంఖ్యమార్గమున, నిష్క్రియ పురుష రూపమగు తన సత్యసనాతనపదమునకు ఆంతరాత్మ తిరిగి వచ్చినపుడు, గుణక్రియ ప్రశమించగా విశ్వవ్యాపారము అంతమొందును, సాంఖ్యపురుషునివలెనే మాయావాదులబ్రహ్మము శాంతము, అక్షరము, నిష్క్రియము; కావున ఉభయులకు జీవనకర్మల కఠోరసన్యాసము అవశ్యక విముక్తిసాధనమగును. ఇక వేదాంత కర్మయోగమునకు వలెనే, గీతా యోగమునకును కర్మలు పూర్వాంగము మాత్రమే గాక, స్వయముగా విముక్తిసాధన మగును. ఈ దృష్టియొక్క సామంజస్యమునే గీత ఆసాంతము బలముగా పట్టుదలతో నిరూపింపయత్నించును. కాని దురదృష్టము, ఈ పట్టుదల బౌద్ధమతము* యొక్క ప్రచండ లహరిని తట్టుకొనలేక పోయెను; అటు పిమ్మట మాయావాదము యొక్క సన్యాసతీవ్రతకు, ప్రపంచవిముఖమగు భక్తివాద ప్రచండతకు తలవంచెను. కాగా ఇప్పుడిపుడే గీతాకర్మయోగము భారతీయాంతరంగముపై తన సత్యహితకర ప్రభావమును బఱుపనారంభించినది. సన్యాసము ఆవశ్యకమే, కాని కామనాహంకారముల ఆంతరపరిత్యాగమే యథార్థ సన్యాసము, అది లేనపుడు, బాహ్య భౌతిక సన్యాసము అవాస్తవము, నిష్ఫలమునగును. అది యున్నపుడు ఇది నిషిద్ధము గాక పోయినను, దీని ఆవశ్యకత గూడనంతరించును. అటులే జ్ఞానము

---

*అయినను మహాయన బౌద్ధముపై గీత తన సమధిక ప్రభావమును బఱపినట్లు గన్పించును; గీతాశ్లోకములు యథాతథముగా ఆ మతగ్రంథములందు గన్పించును. ఆ మతమునకు భక్తి గీత పెట్టిన భిక్షయే. – శ్రీఅరవిందులు

ప్రధానము, జ్ఞానమును మించిన విమోచనశక్తి లేదు (4-38). కాని జ్ఞానసహిత కర్మలు గూడ అవసరమే. ఏలన జ్ఞానకర్మల సంయోగముచే అంతరాత్మ నిష్క్రియ ప్రశాంతి యందే గాక, ప్రచండ కర్మయందును పూర్తిగా బ్రాహ్మీస్థితిలో నివసింప గల్గును. అటులే భక్తి సర్వథా ముఖ్యము. అయితే భక్తి సహిత కర్మలును ముఖ్యమే, భక్తి జ్ఞాన కర్మల సంయోగముచేత అంతరాత్మ ఈశ్వరుని సర్వోన్నతపదములోని కుద్ధరింపబడి, అచ్చట పురుషోత్తముని యందు నివసించును; ఇతడు ఏకకాలమున సనాతన ఆధ్యాత్మిక శాంతికిని, సనాతన విశ్వవ్యాపారమునకు అధీశుడు, ఇదే గీతాసమన్వయము.

7. కర్మకాండము - జ్ఞానకాండము :

సాంఖ్యము మఱియు యోగముల నడుమ నున్న ప్రభేదము మాట నటుంచి, వేదాంత శాస్త్రమునందే అట్టి విరోధము మఱియొక టుండెను. అర్యుల ఆధ్యాత్మిక సంస్కృతి సమగ్రరూపమును జూపుటకు గీత దీనిని గూడ పరిష్కరించవలసియున్నది. ఇది పూర్వమీమాంసకు, ఉత్తర* మీమాంసకు, అటులే వేదవాదము నకు (2-42), బ్రహ్మవాదమునకు (2-72) మధ్య నున్న విభేదము. వేదవాదుల ఫలప్రధానదృష్టిలో, వేదమంత్రసహితముగా వైదికయజ్ఞములను యథావిధిగా నాచరించి, ఇహమునందు లౌకికభోగములు, పరమునందు స్వర్గభోగములను బొందుటయే ఆర్షమతము. కాని బ్రహ్మవాదుల ఆదర్శ దృష్టిలో ఇది ఒక పూర్వాంగము మాత్రమే; మానవుడు బ్రహ్మజ్ఞాన పథమును బట్టి నపుడే అతని వాస్తవపురుషార్థము ప్రారంభించును, దానిచేతనే అతనికి ఇహపరసుఖముల కతీతమగు ఆత్మానందరూపమగు అమృతత్వము ప్రాప్తించును. వేదముయొక్క వాస్తవ, మూలభావ మేమియైనను, చిరకాలముగా నుండిన ఈ విభేదమును గీత విచారించి, పరిష్కరించవలయును.

8. వేదవాదనిరసనము :

జ్ఞానకర్మసమన్వయ ప్రథమవచనముగా, గీత వేదవాదమును ప్రబలముగా, కాదు దారుణముగా నిరసించి- "వివేకహీనులు, స్వర్గమును మించి ఏమియు లేదను

---

*సనాతన బ్రహ్మలోకమున బ్రహ్మజ్ఞాని దివ్యశరీరముతో దివ్యభోగముల ననుభవించును: ఇదియే మోక్షమని జైమిని భావము. కాని గీతా దృష్టిలో బ్రహ్మ లోకవాసమే ముక్తి గాదు, ఆత్మ విశ్వాతీతస్థితిని జేరుకొనవలయును. - శ్రీ అరవిందులు

స్వర్గపరులు, కామాత్ములు నగు వేదవాదులు ఏ తియ్యని మాటను చెప్పుచున్నారో, అది జన్మకర్మల ఫలమునొసంగును, యజ్ఞక్రియలతో జటిలముగా నుండును; దాని గమ్యము భోగము, ఐశ్వర్యము."(2-42,43), ఇట్లు వేదవాదులపైననే గాక, భారతీయుల కిప్పటికిని పవిత్రము, పరమప్రమాణమగు వేదముపైననే గీత దాడి చేయుచున్నట్లు గన్పించును-"త్రిగుణసృష్టియే వేదవిషయము. కావున ఓ అర్జునా! నీ వా త్రిగుణవిముక్తడవు గమ్ము"(2-45). ఈ వేద స్థానమున తర్వాత 'శ్రుతి'పదము (2-53) వచ్చుచున్నది గాన, వేదపదము ఉపనిషత్తులను గూడ ఆకళించుకొనును. ఇవి యన్నియు, తెలిసిన వానికి అనావశ్యకము లని గీత మఱియు నిరసించును- "నలువైపుల నీరు పాఱుచున్నపుడు బావి జలముతో నెంత అవసరముండునో, జ్ఞానవిలసితుడగు బ్రాహ్మణునికి వేదము లన్నింటితోను అంతే అవసరముండును." (2-46) తమయందలి పరస్పరవ్యాఘాతములచే వేదములు బుద్ధిని తికమకపఱచును గూడ- "ఎపుడు నీ బుద్ధిమోహావర్తమునుండి బైటబడునో, అపుడు శ్రుతిపట్ల నీవు ఉదాసీనుడవగుదువు. శ్రుతి వ్యామోహితమైన నీ బుద్ధి సమాధియం దెపుడు నిశ్చలముగా నిలచునో, అపుడు యోగశిఖరము నందుకొందువు" (2-52-53), సంప్రదాయ భావన ఈ నిందను సహించజాలదు; కావున మూలమును విఱిచి, అర్థాంతరము చెప్పగల మానవచిత్తము చాల ప్రయత్నించినది. కాని ఆమూలాగ్రము, ఈ శ్లోకముల స్పష్టార్థము సుసంబద్ధముగానే యున్నది. జిజ్ఞాసువు సైతము 'శబ్దబ్రహ్మను (వేదమును) దాటిపోవును' (6-44)- అని చెప్పిన మాటయు ఈ అర్థమునే పోషించును.

9. ఎన్ని విరోధములు !

కాని ఈ వేదనిరసనము వెనుక నున్నభావము? ఆలోచనీయము; ఏలన గీతవంటి సమన్వయసాధకము, సముదారము నైన శాస్త్రము ఆర్యసంస్కృతికి ప్రాణభూతమైన అట్టి వేదమును కేవలము నిషేధించి, నిరాకరించుటకే చేపట్ట దని మనము నమ్మవచ్చును. కర్మద్వారా, జ్ఞానముద్వారా మోక్షమునకు నడుపు యోగమును, సాంఖ్యమును గీత సమన్వయపఱచి, కర్మజ్ఞానములను కరిగి ఏకముచేయ వలసియున్నది. అదే సమయమున సాంఖ్య యోగములకు సామాన్యమైన పురుషప్రకృతిభావమును గీత ఇప్పటి వేదాంతముయొక్క బ్రహ్మభావముతో సమన్వయపఱచవలయును. మహాసాగరమగు ఈ బ్రహ్మభావనయందు

ఉపనిషత్తులయొక్క పురుషుడు, దేవుడు, ఈశ్వరుడు – అందరు మునిగిఉందురు. ఈ భావమును కాదనకయే, దీనినుండి గీత యోగభావమగు ఈశ్వరుని వెలికి తీయవలసి యుండును. వీనికి తోడు, గీత తన సమన్వయ విధానమునకు మకుటాయమానమగు పురుషోత్తమ సిద్ధాంతమును, త్రిపురుషమతమును ప్రతిపాదించవలసియున్నది; ఈ సిద్ధాంత బీజములు ఉపనిషత్తులలోనివే అయినను, దీని నిర్వివాద ప్రమాణము అక్కడ మనకు లభించదు, ఇంకను, కర్మజ్ఞానముల సమన్వయీకరణమునందు గీత వేదాంత గృహములోనే వీనికి గల విరోధమును గూడ దృష్టియందుంచుకొనవలయును; వేదాంతమున ఈ శబ్దముల లక్షణార్థము వేఱు గనుక, వాని విరోధమును వేఱేయగును. ఇట్లు ఒకే శ్రుతివాక్యములందు ప్రతిష్ఠితములైన ఇన్ని దార్శనికమతముల విరోధముతో బుద్ధి కలవరపడుచో– శ్రుతి విప్రతిపన్నమగుచో (2–53)– ఆశ్చర్యము లేదు. ఇప్పటికిని ఈ ప్రాచీనవేదవాక్యముల అర్థమును గుఱించి పండితులు, తాత్త్వికులు ఎట్టి యుద్ధములు సలుపుచున్నారు, ఎట్టి సిద్ధాంతములకు వచ్చుచున్నారు! దీని అంతటితోను బుద్ధి విసిగివేసారి, ఇక నెట్టి శ్రుతివాక్యమును విననొల్లక, గంభీరము, ఆంతరము, అపరోక్షమునగు తనలోని అనుభవప్రకాశమునందే సత్యమును దర్శించ దలంచుట కడుంగడు సహజమే. (ఈ ఆంతరనుభవమునకే వేదనిరసనము).

10. సర్వకర్మలు యజ్ఞమే :

తన కర్మజ్ఞానముల సమన్వయమునకును, తన సాంఖ్యయోగ వేదాంత సమన్వయమునకును గీత ప్రథమషట్కమునందు ఒక విశాలాధారమును స్థాపించును. కాని వేదాంతుల పరిభాషలో కర్మశబ్దమునకు ఒక ప్రత్యేకార్థము గలదని గుర్తించును; కర్మయన వైదికయజ్ఞములు, విధులు; లేక అత్యధికము, వానితో బాటు గృహ్యా సూత్రముల ననుసరించి జీవితము గడుపుట– విధినిర్వహణమే జీవితమునకు ధార్మిక ప్రాణమని ఈ సూత్రములు చెప్పును. ఇట్లు వేదాంతులకు కర్మ యన ధార్మిక కర్మలే, విధిపూర్ణము, క్రియాబహుళము నగు యజ్ఞవిధానమే. కాని యోగమునందు కర్మలకు విశాల తాత్పర్యము గలదు, దీనినే గీత వక్కాణించును; ఆధ్యాత్మికకర్మను గుఱించిన మన భావనయందు సర్వకర్మలు– 'సర్వకర్మాణి' (3–30)– వచ్చి వేయవలయును. అయినను గీత, బౌద్ధమతమువలె యజ్ఞభావమును నిరాకరించదు; ప్రత్యుత ఆభావమును ఉద్ధరించి, విస్తృతపఱుపగోరును. గీత చెప్పున దేమన,

యజ్ఞము జీవనము యొక్క అతిముఖ్య భాగమే గాక, సమస్త జీవనము,సర్వకర్మ యజ్ఞమే; అటులే వానిని దర్శించవలయును. ఈ ఉన్నతజ్ఞానము లేకయే అజ్ఞులు కర్మల నాచరించగా, మిక్కిలి అజ్ఞులు క్రమము గూడ లేకయే- 'అవిధిపూర్వకం' (9-23)- 'నిని జేతురు. యజ్ఞము జీవననియమమే యగును; యజ్ఞమును తమ సనాతనసఖుని గావించియే ప్రజాపతి ప్రాణుల సృజించెను (3-10) అయితే వేదవాదుల యజ్ఞములు కామ్యయజ్ఞములు. కాని గీతావిధానము దీని నామోదించ జాలదు; ఏలన అది కామసన్యాసముతోనే ప్రారంభించి, కామశత్రువును ఖండించు మని ప్రబోధించును (3-43). అయినను వైదికయజ్ఞముయొక్క ప్రామాణికతను గీత కాదనదు. ఇట్టి యజ్ఞములద్వారా ఇహమునందు భోగము; పరమునందు స్వర్గము సాధించవచ్చు నని గీత ఒప్పుకొనును; దివ్యగురు విట్లు చెప్పును- వాని ఫలము లిచ్చువాడను నేనే (7-22); అయితే మానవుడు దేవతా రూపమున నన్నరాధించగోరుదురు గనుక, వారి కా రూపముల ద్వారానే ఫలము నిత్తును. కాని ఇది యోగ్యమార్గము గాదు; మానవుడు గోరవలసిన ముక్తియు, పూర్ణత్వము స్వర్గభోగమును గాదు. దేవతల నుపాసించు అజ్ఞులకు ఆ రూపముల దాము ప్రభువగు ఏకమాత్రదేవునే ఉపాసించుచున్నామనియు, అతడే తమ హవిష్యమును అంగీకరించుచున్నాడనియు దెలియదు (9-24). ఆ ప్రభువునకే యజ్ఞమర్పింపబడ వలయును, జీవనముయొక్క సమస్తశక్తులు, క్రియల రూపమగు సత్య యజ్ఞము భక్తిసహితముగా, కామనారహితముగా ఆ ప్రభువు ప్రయోజనమునకును, లోక సంగ్రహార్థమును అర్పింపబడవలయును. వేదవాద మీ సత్యమును మఱుగు పఱచును గావునను, తన కర్మకాండ పాశముచే మానవుని త్రిగుణవ్యాపారమునకు బంధించివేయును గావునను, గీత దానిని తీవ్రముగా నిరసించి, దురుసుగా నెట్టి వేయవలసివచ్చెను. కాని గీత దాని కేంద్రభావమగు యజ్ఞముపై దెబ్బతీయలేదు; ఆ యజ్ఞరూపమును మార్చి, ఉద్ధరించి, యథార్థ ఆధ్యాత్మికానుభవము యొక్కయు, విముక్తి విధానము యొక్కయు ఒక అతిముఖ్యాంగముగా దానిని తీర్చిదిద్దును.

11. ఈశ్వరుడు లేక పురుషోత్తముడు పరబ్రహ్మము :

జ్ఞానమును గుఱించిన వేదాంతభావము అన్ని సమస్యలను లేవనెత్తదు. తొలుదొల్తనే గీత వేదాంతజ్ఞానము నామోదించి, వేదాంతుల ఏకమాత్రమగు అక్షర బ్రహ్మమును సాంఖ్యుల బహుసంఖ్యాకమగు అక్షరపురుషుని స్థానమున ప్రవేశ

పెట్టును. నిష్కామకర్మలు జ్ఞానముయొక్క సారభాగమని నొక్కి చెప్పుచునే, ప్రథమ షట్కమునం దంతటను, బ్రహ్మజ్ఞానము మఱియు అనుభవము అతి ముఖ్యము, అపరిహార్యము నగు విముక్తిసాధన మని గీత అంగీకరించును; నైర్వ్యక్తిక బ్రహ్మము యొక్క అనంతసమతయందు అహంకారనిర్వాణమును విముక్తికి అంతగాను ఆవశ్యక మని గీత ఆమోదించును. ఈ అహంకారనిర్వాణమును, ప్రకృతికర్మలనుండి బైటపడి, సాంఖ్యపురుషుడు స్వస్థితికి వచ్చివేయుటయు ఫలతః ఒకటియే యని గీత యనును. శ్వేతాశ్వతర ఉపనిషత్తు మున్నగు వానిలో అతః పూర్వమే చేయబడినట్లు, గీత వేదాంతభాషను, సాంఖ్యభాషను కలిపి, ఒకటిగా చేయును. అయినను గీతాకాలము నాటి వేదాంతస్థితియందు ఒక లోపమున్నది; ఉపనిషత్తులయందు ఒక అంశము గాను, తర్వాతి వేదాంతుల వైష్ణవదర్శనములందు అతిప్రధానముగాను గానవచ్చు భక్తిప్రవృత్తి దానిలో గానరాదు. కనీసము దాని ప్రధానప్రవృత్తులయందు, అప్పటి వేదాంతము అడుగున విశ్వదేవతావాదియైనను, శిఖరమున* అద్వైతవాది యని మన మనుకొనవచ్చును. ఏకము, అద్వితీయము నగు బ్రహ్మము నది ఎఱుంగును; చివరకు బ్రహ్మలో గలిసిపోవు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను, తదితరదేవతలను అది ఎఱుంగును. అయినను పరబ్రహ్మ ఏకేశ్వరుడు, ఏకపురుషుడు, ఏకదేవుడు నను ఉపనిషద్భావము అప్పటి వేదాంతము నందు తన ఉన్నత** స్థానమునుండి పడిపోయెను. కఠోర వేదాంతమునందు ఈశ్వరాదులు బ్రహ్మముయొక్క గౌణ లేక అవరపార్శ్వములు మాత్రమే కాగలరు. ఇట్లుండ ఈ పదముల మూలసమత్వమును, కనుకునే అవి సూచించు భావనాసమత్వమును గీత కేవలము పునరుద్ధరించ దలంచుటయే గాక, ఒక అడుగు ముందునకు గూడ పోగోరును ఇందునిమిత్తము, తన అవర పార్శ్వమునందు గాక, పరభావము నందే*** బ్రహ్మను పురుషునిగాను, అవరప్రకృతిని బ్రహ్మమాయగాను గీత చూపవలసియున్నది; అపుడు సాంఖ్య

---

* విశ్వదేవతావాద మన విశ్వము, దేవుడు ఒక్కటియే. కాగా అద్వైతమున బ్రహ్మ సత్యము, జగత్తు మిథ్య, అథవా జగత్తు బ్రహ్మయొక్క అంశికాభివ్యక్తి. – అరవిందుడు

** అప్పటి వేదాంతమున కనీసము అట్టి ప్రవృత్తియుండెను. ఈ ప్రవృత్తి శంకర వేదాంతమున పరాకాష్ఠ నందుకొనెను. – శ్రీ అరవిందుడు

*** ఇచ్చట పరభావ మనగా అక్షర భావము. ఏలన సంప్రదాయ వేదాంతమున ఈశ్వరుడు అక్షరబ్రహ్మకంటెను తక్కువ.

వేదాంతముల పూర్ణసమన్వయము సిద్ధించును. పిమ్మట ఈ రెండింటిని యోగముతో పూర్ణముగా సమన్వయించుటకు ఆ బ్రహ్మను మఱల ఈశ్వరునిగా చూపవలసి యున్నది. కాని ఇచ్చట ఆగక, గీత ఈశ్వరుని అనగా పురుషోత్తముని అచల, అక్షర బ్రహ్మకంటెను ఉన్నతతరునిగా చూపును; మఱియు గీతాదృష్టిలో, ఈ అక్షర నైర్వ్యక్తిక తత్త్వమున అహంకారనిర్వాణము పురుషోత్తమునితో సాయుజ్యమునకు ఒక ప్రధాన. ప్రాథమిక, ఆవశ్యక సోపానము మాత్రమే. ఏలన పురుషోత్తముడు పరబ్రహ్మము (అక్షరబ్రహ్మము గాదు). ఇట్లు ఉత్తమ, సాధికార వ్యాఖ్యాతల బోధలను బట్టి చూతు మేని, గీత వేదోపనిషత్తులను దాటిపోయి, తన స్వకీయ బోధ నొక దానిని ఉద్ఘాటించును. దీనికి బీజములు* వానియందే యున్నను, ఇది, వేదాంతులను బట్టి, వానియం దిముడదు. వేదవాక్యములను ఇట్లు స్వేచ్ఛగా, సమన్వయాత్మకముగా గీత విచారించక, ఇప్పటి వేదవ్యాఖ్యానపద్ధతులకే అంటిపెట్టుకొనియుండు నేని, అప్పటి బహుమతముల సంఘర్షణసంకులమునందు ఒక ఉదార సమన్వయ గ్రంథము అసంభవమై యుండును.

12. వేదస్థానము హృదయము :

తర్వాతి అధ్యాయములందు గీత వేదోపనిషత్తులను ఎంతో ప్రశంసించును, అవి ఈశ్వరవాణియగు దివ్య శాస్త్రములు, భగవంతుడే వేదవిదుడును, వేదాంత కర్తయు (15–15). సర్వవేదవేద్యుడును ఈశ్వరుడే. దీనిని బట్టి జ్ఞానగ్రంథమను నామము వేదమునకు సార్థక మగును, క్షరాక్షరముల కతీతమగు తన పరమావస్థ నుండి పురుషోత్తముడే తననుదాను ప్రపంచమునందును, వేదమునందును ప్రసరింప జేసికొనెను. అయినను శాస్త్రశబ్దము–భావము గాదు–బంధనకరము, భ్రమకారకము;

---

* గీతయందు వలె గాక, చెదిరిపోయి యున్నను, ఉపనిషత్తులయందు పురుషోత్తమభావము వస్తుతః ప్రకటించబడియే యున్నది. మఱియు గీతయందు వలెనే, పరబ్రహ్మ లేక పరమపురుషుడు సగుణ, నిర్గుణ బ్రహ్మల విరోధమును తనయందే ఇముడ్చుకొనియుండు నని వర్ణించబడినది– 'నిర్గుణోగుణీ' (శ్వే.ఉ. 6–11, 6–2). అతడు వీనిలో ఒక దానిని విడిచి, ఒకటి గాడు. అయితే ఇది మన బుద్ధికి విరుద్ధముగా గన్పించును.

మఱియు నొక అవధి కావల శాస్త్రోపయోగ మంతమగును. వాస్తవ జ్ఞానమూలము హృదయములోని ఈశ్వరుడు– "ప్రతివాని హృదయములో నే నాసీనుడనై యున్నాను. నా నుంచియే జ్ఞానము (15-15). ఈ ఆంతరవేదము యొక్క, స్వయంప్రకాశ సత్యత యొక్క వాగ్రూపమే శాస్త్రము– 'శబ్దబ్రహ్మము' (6-44), హృదయమునుండి, సత్యధామమగు గుహ్యస్థానమునుండి మంత్రము ఉద్గమించె నని ఋగ్వేదము చెప్పును– "సదనాద్ ఋతత్య, గుహాయాం" (1-164-47). ఈ మూలమే వేద ప్రామాణ్యము; కాని అనంతసత్యము అభివ్యక్త శబ్దమును మించియుండును. కనుక వేదవాదులవలె "దీనిని మించి మఱేదియు లేదు (2-42) అని ఏ శాస్త్రమును గుఱించియు చెప్పజాలము. వేదము, కొరాను, బైబులు, మున్నగు సమస్తశాస్త్రముల సమాహారమునకును ఇదియే వర్తించును. మఱియు ఏదేని శాస్త్రమున నీ బుద్ధి కనుగొనజాలని సత్య మచ్చట లేదనియు నీవు చెప్పజాలవు; సత్యపరాయణమగు విముక్త మనస్సును, భగవదనుభూతిగల అంతరాత్మయు అట్లెప్పుడును జెప్పవు. ఇతఃపూర్వము శ్రుతమైనను, గాకపోయినను ఏది మానవహృదయముచేత తన ప్రదీప్తతలము లందు చూడబడునో, లేక సనాతన వేదవిదుడగు జ్ఞానప్రభువునుండి లోలోపల వినబడునో అదియే సర్వదా సత్యము.

10. బుద్ధి యోగము

1. గీతాబోధనాపద్ధతి :

గీత ఒక విలక్షణపద్ధతి ననుసరించి తన బోధనయందు ముందుకు సాగును: ముందొక ఆంశిక సత్యమును వివరించుచు, అచ్చట దాని గభీరార్థముయొక్క సూచనలను మాత్రమే చేయును; పిమ్మట ఆ సూచనలను మఱల చేపట్టి, వాని మర్మమును ఆవిష్కరించును. ఇట్లు చేయుచు, చివరకు పరమ గుహ్యామగు తన చరమ మహాసూచన వఱకు వచ్చి, దానిని వివరించక, దాని పూర్ణానుభవమును ఇతరులకు వదిలివేయును. ఈ పద్ధతి మనసునకు బట్టవలయు ననియే, గీతాపథము నుంచి క్షణకాలము తొలగి, తాత్త్విక సిద్ధాంతము యొక్క శుష్కప్రదేశములలోనికి పాఠకుని క్రిందటి రెండు వ్యాసములలోను ఈడ్చుకొనిపోక తప్పలేదు. తన మహా సూచన వివరణపై గాక, గీతాదృష్టి సదా తన సమన్వయసాధనపైననే యుండును. మఱియు తన పూర్వ సూచనలన్నియు తన చరమసూచనకు మనస్సును క్రమముగా ఆయత్తపఱచునవే యగును.

2. అర్జునుని కిచ్చిన అభయము :

సాంఖ్యమునందలి ఆత్మవిమోచక బుద్ధినిష్ఠను* నీకు ప్రవచించితిని, ఇపుడు యోగమునందలి మఱియొక బుద్ధినిష్ఠను వినుమని దివ్యగురు వర్జునునికి చెప్పును (2-39). నీ స్వీయకర్మల ఫలితములకు భయపడి, ఇతరఫలితముల నాశించి, నీ యోగ్యమార్గమునకు విముఖుడవగుచున్నావు. కాని కర్మ, కర్మ ఫలితములను గుఱించిన ఈ భావము, కర్మహేతువుగా ఫలకామన, కామనాతృప్తిసాధనముగా కర్మ - ఇవియే అజ్ఞుల బంధనము. వీరికి కర్మస్వరూపముగాని, కర్మమూలముగాని, కర్మవాస్తవవిధానము గాని, దాని సమున్నత ప్రయోజనముగాని తెలియదు. నా యోగము నిన్ను కర్మబంధమునుండి విడిపించును (2-39). నీ కెన్నింటి పట్లనో భయము గలదు - పాపముపట్ల భయము (1-36), దుఃఖముపట్ల భయము, నరకముపట్ల భయము (1-44), భగవంతుని పట్ల భయము (11-25), ఈ

---

* ఒకే సమానమును దెల్పు గుర్తు. మధ్యవ్యవధానమును రద్దు చేయును. ఉదాహరణకు, బుద్ధినిష్ఠను = బుద్ధినిష్ఠను

ప్రపంచముపట్ల భయము, పరలోకముపట్ల భయము, నీ పట్ల నీకే భయము. ఆర్యజాతి యోధుడవు, ప్రపంచప్రధానవీరుడవు నగు నీ విపుడు భయపడని దేమున్నది? ఈ భయము మానవజాతి నంతను ఆక్రమించి యున్నది. ప్రపంచ యథార్థ స్వరూపము దెలియదు గనుక, ప్రపంచమున భయము, భగవంతుని యథార్థసత్తయు, విశ్వ ప్రయోజనము అర్థముగాదు గనుక, భగవంతునిపట్ల భయము, నా యోగము, స్వల్పమైనను, నిన్నీ మహాభయమునుండి సముద్ధరించును. ఈ మార్గమున వేయు ఒక్క అడుగేనియు వృథాపోదు. ఏ అవరోధము నీ ప్రగతిని తప్పింపజాలదు. ఇది ఎంత సాహస పరిపూర్ణ ప్రతిజ్ఞ: భయభ్రాంతమగు మనస్సు దీనిని తేలికగా నమ్మజాలదు, మఱియు నీ ప్రథమ సందేశముతో బాటు చరమ సందేశమును గూడ చదివిననే తప్ప, దీని పూర్ణవిశాలార్థము మనకు బోధపడదు – "సర్వధర్మములను బరిత్యజించి నాయందే శరణుబొందుము; నిన్ను నేను సర్వపాపము నుండియు, అశుభమునుండియు ఉద్ధరింతును; శోకింపకుము". (18-66).

3. బుద్ధియోగము :

అంతరాత్మకు ఉద్దేశించబడి, హృదయమును కదిలించివేయు నీ వచనములతో గాక, బుద్ధికి ఉద్దేశించబడి, మార్గమును ప్రకాశింపజేయు ప్రథమ ఆవశ్యక కిరణములతోనే భగవంతుడిచ్చట తన ఉపదేశము నారంభించును. ఇతడు ప్రేమికుడుగా గాక, గురువుగానే ముందు భాషించి, యథార్థ ఆత్మ, ప్రపంచ స్వరూపము, కర్మప్రభవస్థానము గుఱించిన అర్జునుని అజ్ఞానమును దొలగించవలసి యున్నది. మానవుడు అజ్ఞానవశమున, ఈ విషయములందు భ్రాంతబుద్ధితోను, కనుకనే భ్రాంత సంకల్పముతోను వ్యవహరించును గావుననే, అతడు బద్ధుడగును లేక అయినట్లు గన్పించును; లేనిచో విముక్తాత్మకు కర్మలు బంధనమే గావు; ఆశాభయములు, క్రోధసంతాపములు, క్షణికసుఖములు అతని కుండవు; పరిపూర్ణ నిరాకులతా స్వాతంత్ర్యములతో అతనికి కర్మలు సాధ్యమగును. కనుకనే అర్జునునకు ముందు బుద్ధి యోగము విధించబడినది. 'ఏకము'నందు నెలకొని, ఏకాత్మ నెఱింగి, దీని సమశాంతస్థితి నుండి వ్యవహరించుచు, బాహ్య మనోమయపురుషుని శతసహస్ర విక్షేపములకు లోనుగాక, యోగ్యబుద్ధితోను, తత్ఫలమగు యోగ్యసంకల్పముతోను కర్మ చేయుటయే బుద్ధియోగము.

4. బుద్ధి ద్వివిధము :

మానవ బుద్ధికి రెండు రూపములు గలవని గీత చెప్పును, ప్రథమ రూపము ఏకాగ్రము, సంతులితము (poised), ఏకము, సమరసము, అనన్యముగా సత్యాభిముఖము. ఏకత దాని లక్షణము, ఏకాగ్రస్థిరత దాని స్వరూపము (2-41). కాగా రెండవదానిలో ఏకమాత్రసంకల్పము, ఏకీకృతధీయు (intelligence) నుండదు; ప్రత్యుత కామములను వేటాడుచుండునట్టి, బహుశాఖలు గల అనంత భావములు ఉండును. ఇచ్చట వాడబడిన పదము, బుద్ధికి, అర్థము చేసికొను మానససామర్థ్యమే రూఢార్థమైనను, గీత దీనిని విశాల తాత్త్వికార్థమున ప్రయోగించును -- వివేచనాత్మక, మఱియు నిశ్చయాత్మక సమస్త క్రియయు బుద్ధియే యగును. ఈ బుద్ధి మన ఆలోచనల దిశను, ఉపయోగమును, మఱియు మన కర్మల దిశను, ఉపయోగమును - రెండింటిని నిర్ణయించును. ఆలోచన, ప్రజ్ఞ, నిర్ణయము, సంవరణము, లక్ష్యము, అన్నియు దీని వృత్తులే; ఏలన ఏకీకృత బుద్ధియొక్క లక్షణము తెలిసికొను మనస్సు యొక్క ఏకాగ్రతయే గాక, విశేషముగా నిశ్చయించి, ఆ నిశ్చయమునందు నిలబడు మనస్సుయొక్క ఏకాగ్రత యగును -- 'వ్యవసాయాత్మికా' (2-41). కాగా విక్షిప్తబుద్ధి యొక్క లక్షణము భావపరిభ్రమణముకంటెను ఎక్కువగా లక్ష్యపరిభ్రమణము, కనుకనే సంకల్పపరిభ్రమణము నగును. ఇట్లు సంకల్పజ్ఞానములు రెండును బుద్ధివృత్తులే యగును. ఏకీకృత ధీసంకల్పము ప్రబుద్ధాత్మయందు ప్రతిష్ఠితము, లోని ఆత్మజ్ఞానము నందు ఏకాగ్రముకాగా, విక్షిప్త ధీసంకల్పము బాహ్యజీవన కర్మలందును, వాని ఫలములందును వికీర్ణమగును. "బుద్ధియోగముకంటె", దివ్యగురువు బోధించును, "కర్మలు కడుంగడు హీనము; బుద్ధియందే శరణుబొందుము; ఫలప్రేరితులు దరిద్రులును, దీనులును." (2-49).

5. సాంఖ్యతత్త్వ క్రమము :

గీత అంగీకరించిన మనోవైజ్ఞానిక (psychological) సాంఖ్యక్రమమును మనము గుర్తుపెట్టుకొనవలయును. ఇందు ఒక వైపున, శాంతము, నిష్క్రియము, అక్షరము, ఏకము, అవికార్యమునగు ఆత్మ లేక పురుషు డుండును; రెండవ వైపున ప్రకృతి లేక స్వభావశక్తి యుండును; ఇది చేతనాత్మ వినా జడము, చేతనా సన్నిధి యందు మాత్రమే సక్రియము, ఆదియందు అనిర్ణీతము (indeterminate) గుణతః

త్రివిధము, వికాస సంకోచసమర్థము, పురుషప్రకృతి సంయోగము నుండియే అంతరంగ, బహిరంగ రూపమున సత్తానుభవమును గలిగించు క్రీడ జనించును. మన కేది అంతరంగమో అది మొదట పరిణమించును; కారణము, ఆత్మచేతన పరిణామమునకు ప్రథమహేతువు కాగా, నిశ్చేతన ప్రకృతిశక్తి ద్వితీయ, పరాధీన హేతువే యగును. అయినను మన అంతరంగ ఉపకరణములను సమకూర్చునది ప్రకృతియే గాని, పురుషుడు గాడు. ప్రకృతి పరిణామక్రమమున, ముందు వివేచనాత్మక లేక నిర్ణయాత్మక బుద్ధియు, తదధీనశక్తియగు అహంకారమును జనించును. దీని వృత్తి స్వపరవిభేదనము. ఇక ద్వితీయపరిణామముగా, విషయములను వివేచించి గ్రహించు సామాన్యేంద్రియమగు మనస్సు జనించును. తృతీయపరిణామముగా ఈ మనస్సు నుండి విశిష్టేంద్రియములు పదియు ఉత్పన్నమగును - అయిదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు. పిమ్మట జ్ఞానేంద్రియశక్తు* లగు శబ్ద స్పర్శ రూప రస గంధములు వెలువడును, ఇవియే వస్తువులకు తమతమ విలువల నిచ్చును, ఈ శబ్దాదిగుణములను బట్టియే మనస్సు ఆయా వస్తువులను ఆయా వస్తువులనుగా గ్రహించును. చివరకు ఈ గుణముల కాధారభూతమగు పంచ భూతములు, అథవా ప్రకృతియొక్క పంచభూతావస్థలు ఏర్పడును; ఇవియే తమ వివిధసంయోగములచేత వివిధ వస్తువులను నిర్మించును.

6. విషయి విషయ విభజన :

పురుషునియొక్క శుద్ధచేతనలో ప్రతిబింబించి, ప్రకృతిశక్తి యొక్క ఈ పదములు (స్థాయిలు), శక్తులు మన మలినాంతరంగముయొక్క ద్రవ్యమగును - మలినమే లయన, దాని క్రియ బాహ్యతమ విషయప్రపంచముయొక్క బోధముల (perceptions) మీదను, విషయిపురుషునియొక్క ప్రతిక్రియలమీదను ఆధారపడియుండును. బుద్ధి యన కేవలము నిర్ణయాత్మకశక్తి; ఇది అవ్యాకృత నిశ్చేతన మూలశక్తి నుండి సర్వమును అచేతనముగా నిర్ణయించును. ఇది మన దృష్టికి ధీ (intelligence) మఱియు సంకల్పరూపము ధరించును. ఇక మనస్సు బుద్ధి చేసిన వివేచనలను గ్రహించు నిశ్చేతన శక్తి; తాను గ్రహించిన వస్తువులచేత ఆకృష్టమై, ఇంద్రియబోధము, కామము నగును. ఇవి ధీ, సంకల్పములయొక్క మలిన లేక నిమ్నరూపములు, ఇట్లు మనస్సు ఇంద్రియ మనస్సగును; సంవేదన (sensation) రసభావము, అభిలాష, ఆశ, లాలస,

*ఆత్మనుండి వెలువడిన ప్రపంచము ఆత్మశక్తి అయినట్లే.

ప్రాణికప్రేరణ, మున్నగు ఏ సంకల్పవికారములు గలవో, అవి అన్నియు ఇంద్రియ మనస్సు వృత్తులే. కాగా ఇంద్రియములు ఇంద్రియ మనస్సు యొక్క ఉపకరణములై, విషయి విషయ ప్రపంచముల మధ్య మధ్యవర్తిగా పనిచేయును. తక్కిన వన్నియు మన చేతనావిషయములు, ఇంద్రియ విషయములు.

7. అనులోమ, విలోమ పరిణామములు :

ఈపై పరిణామక్రమము మనకు దెలిసిన భౌతికపరిణామక్రమమునకు విరుద్ధముగా నున్నట్లు తోచును. కాని బుద్ధి సైతము తనలోదాను నిశ్చేతనప్రకృతి యొక్క జడక్రియయే యని మనము స్మరించినపుడు, ఈ బుద్ధియొక్క నిశ్చేతన ధీ, సంకల్పములు (జడ) పరమాణువు నందును గలవని మనకు దెలియును. అటులే మానవుని అంతరంగమునందు సూక్ష్మరూపమున గల సంవేదనాదులు వృక్షము నందును స్థూలరూపమున ఉండనే యున్నవని మనము చూడగలము. ఇట్లు జడము నందు బుద్ధ్యాదులు ఉండనే యున్నవని మనము చూడగలము. ఇట్లు జడమునందు బుద్ధాథ్యదులు ఉండనే యున్నవి గాన, సాంఖ్యముయొక్క అనులోమ (పైనుంచి క్రిందికి) పరిణామము ఆధునిక పరిశోధనతో సుసంగతమే యగును. ప్రకృతి నుండి తిరిగి పురుషుని వైపునకు జరుగు అంతరాత్మ పరిణామమున విలోమ క్రమము అవలంబనీయము. ఉపనిషత్తుల నుదాహరించుచు, ఈ విలోమ పరిణామమును గీత ఇట్లు చెప్పును – "విషయముల పైన ఇంద్రియము లుండును. ఇంద్రియముల పైన మనస్సు, మనస్సు పైన బుద్ధి, బుద్ధి పైన ఉండునది అతడు." (3-42) – అత డన చేతనాత్మ, పురుషుడు. కనుకనే ఈ పురుషుని, మన అంతరంగ జీవనము యొక్క పరమ కారణమును బుద్ధిచేత గ్రహించి, ఎఱుంగవలయు నని గీత ప్రతిపాదించును; ఈ పురుషునియందే మన సంకల్పమును స్థాపించ వలయును. ఇట్లు అధికతర వాస్తవచేతనాత్మచేత నిమ్నతర అహంకారాత్మను గట్టిగా నిలిపి, నిశ్చలపఱిచి, చంచలము, వ్యగ్రము, స్వవశిత్వశత్రువు నగు మనఃకామమును మనము మట్టుపెట్టగలము.

8. అధోముఖబుద్ధి, ఊర్ధ్వముఖబుద్ధి :

ఏలన, స్పష్టముగానే, బుద్ధిసంకల్పము రెండు రీతులుగా పనిచేయుట కవకాశ మున్నది. అది క్రిందికి, వెలుపలికి తిరిగి, త్రిగుణఖేలనమునందలి అస్థిర బోధములను

(perceptions) అభిలాషలను అనుసరించవచ్చును, లేదా పైకి, లోపలికి తిరిగి, పూర్వమువలె త్రిగుణఖేలనములో చిక్కువడని చిదాత్మయొక్క స్థిరమగు శాంతి సమతలలో ప్రవేశించవచ్చును. ప్రథమ రీతిలో జీవుడు ఇంద్రియ విషయముల దాసుడుగా నుండి, బాహ్యస్పర్శలయందు జీవించును. అది కామోపహతజీవనము. ఏలన ఇందు ఇంద్రియములు విషయప్రేరితములు, సహసా విషయముల వైపునకు దూకును, 'సముద్రమున నావను ప్రబలవాయువు హరించుకొని పోవునట్లు' (2-67) ఇంద్రియమనస్సును లాగికొనిపోవును; తర్వాత ఇంద్రియముల ఈ బహిర్ముఖధావనము చేత మేల్కొనిన భావావేశములు, ఆవేగములు, లాలసలు, ప్రేరణలకు ఆధీనము గావింపబడిన మనస్సు అటులే, బుద్ధిని ఈడ్చుకొని పోవును. కాగా ఈ బుద్ధి తన ప్రశాంతవివేచనా, ప్రభుతల శక్తిని గోల్పోవును. దీని ఫలిత మేమన, అంతరాత్మ జీవితము మిథ్యాభూతము, ఇంద్రియపరాయణము నగును, సంగ సంతాప క్రోధములు జీవుని వశముచేసికొనును. ఇదియే సామాన్య అప్రబుద్ధ అశిక్షిత మానవుని క్లిష్టజీవనము. ఇంద్రియభోగమునే కర్మలక్ష్యముగా బోధించు వేదవాదులవంటి వారు మిథ్యాగురువులు. విషయనిరపేక్షమగు స్వతఃసిద్ధ అంతరానందమే మన యథార్థ లక్ష్యము; అదియే మన శాంతి మోక్షముల సమున్నత సువిశాల పదము.

9. కామనిర్మూలన క్రమము :

కనుక బుద్ధియొక్క ఊర్ధ్వముఖ, అంతర్ముఖ ప్రవృత్తినే మనము సుస్థిర ఏకాగ్రభావముతో పట్టుబట్టి, నిశ్చయముగా వరించవలయును; పురుషుని ప్రశాంత ఆత్మజ్ఞానమున దానిని దృఢముగా స్థాపించవలయును. ఇందు నిమిత్తము సర్వానర్థకరమగు కామముల ముందుగా వదిలించుకొనవలయును. ఏతదర్థము విషయ భోగముకొఱకు ఇంద్రియముల బహిర్ముఖధావనము నరికట్టి, తాబేలు తన అవయవములను వలె, వానిని వెనుకకు లాగి, తమ మూలమగు మనస్సులోను, ఆ మనస్సును బుద్ధిలోను, ఆ బుద్ధిని ఆత్మ మఱియు ఆత్మజ్ఞానములందును స్తిమితపఱచి, ప్రకృతిక్రియను మనము సాక్షిగా చూచుచు, దాని కధీనముగాక, బాహ్యజీవనమివ్వగల దేనిని కామించక స్వస్థులమై యుండవలయును.

10. వాస్తవ సన్యాసము కామనాసన్యాసము :

అపోహను తొలగించుటకు, నేనిక్కడ బాహ్యవైరాగ్యమును, భౌతిక సన్యాసమును బోధించుట లేదని కృష్ణుడు వెనువెంటనే సూచించును. ఇది సాంఖ్యుల సన్యాసమును

గాదు, ఆహారమును గూడ చివరకు మానివేయ బ్రయత్నించు ఉగ్రతపస్వియొక్క శరీరహింసనమును గాదు. నేనిక్కడ వచించునది అంతరుపసంహరణము, కామనాసన్యాసము. దేహధారియగు ఆత్మ ఆ దేహమును అన్నముతో నిలిపిన గాని, దాని క్రియ సాగదు. ఉపవాసముచేత ఆహారముతో భౌతిక సంపర్కమే బోవును గాని, ఆ సంపర్కము ననర్ధకరము గావించు అంతఃసంబంధము తొలగదు, విషయమునందలి ఇష్టానిష్టములు మనస్సున కుండనే యుండును. దీనికి ప్రతిగా, అంతరమున ఇంద్రియ ప్రతిక్రియకు లోనుగాకయే, మనస్సు భౌతిక సంపర్కమును సహించగలిగియుండలెను. లేనిచో విషయనివృత్తి (2-59) యుండును గాని, విషయము నుండి మనోనివృత్తి యుండదు. కాని ఇంద్రియములు మనస్సులోనివే గావున, మనోనివృత్తియే సంయమనకు యథార్థ చిహ్నము. కాని కామనారహితమగు ఈ విషయస్పర్శ, విషయలిప్తము గాని ఈ ఇంద్రియోపయోగ మెట్లు సాధ్యము? పరమపురుషుని దర్శనము చేత -- 'పరం దృష్ట్వా' (2-59)? బుద్ధియోగముద్వారా అతనితో సమగ్రాంతరంగము యొక్క సంయోగము లేక సమైక్యము లభించినపుడు, అది సాధ్యము. ఏలన ఈ పరమపురుషుడు లేక పరమాత్మ శాంతము, స్వీయానందతృప్తము, ద్వంద్వముక్తమగు ఈ ఆనందమునందొకసారి మన బుద్ధి, సంకల్పములను స్థాపింతు మేని, అది వైషయిక సుఖదుఃఖముల, రాగద్వేషముల స్థానము నాక్రమించగలదు. ఇదియే విముక్తికి సత్యమార్గము.

11. పతనవినాశముల సోపానపరంపర :

నిశ్చయముగా, ఆత్మానుశాసనము, ఆత్మసంయమము ఎప్పుడును సులభము గాదు. వివేకముగల మానవు లందరకు, కొంత ఆత్మసంయమము అభ్యసింపక తప్ప దని తెలియును; మఱియు ఇంద్రియసంయమమును గుఱించి చేయబడునంత సర్వసాధారణోపదేశము మఱియొకటి లేదు. కాని సాధారణముగా ఈ ఉపదేశమెట్లు అపూర్ణమో, తదభ్యాసమును అట్లే అపూర్ణముగా గన్పించును. పైగా సంపూర్ణ వశిత్వమునకు నిజముగా పాటుపడు ప్రాజ్ఞుడు, వివేకియు నగు మౌని సైతము తనను ఇంద్రియములు తొందరపెట్టి, ఈడ్చుకొనిపోవుటను గనుగొనును (2-60). కారణము, ఇంద్రియముల ననుసరించు గుణము మనస్సునకు సహజము; అది ఇంద్రియ విషయములను అంతరభిరుచితో నిరీక్షించుచు, వానిపైన కుదురుకొని, వానిని బుద్ధికి తత్పర ఆలోచనావిషయముగాను, సంకల్పమునకు ప్రబల

అభిరుచివిషయముగాను చేయును. దానివలన సంగమును, సంగమువలన కామమును జనించును (2-62). ఇక నీ కామము పూరింపబడ దేని ఖేదము, విఫలమగు నేని ఆవేశము, ప్రతిఘటింపబడు నేని క్రోధము సంభవించును. ఈ క్రోధమువలన మోహము జనించి, ఆత్మను మఱుగుపఱచగా, బుద్ధి ఆత్మను చూడ విస్మరించును, దానియందు నెలకొన విస్మరించును. ఈ విస్మృతివలన బుద్ధియు నావృతమగును, నశించిపోవును గూడ. ఏలన ఆ సమయమున బుద్ధి ఆవేశ మేఘములో అదృశ్యమగును. ఫలితముగా, మనము ఆవేశము, క్రోధము, సంతాపము నైపోయి, ఆత్మ, బుద్ధి, సంకల్పముగా నుండ విరమింతుము. కనుక బుద్ధి స్వస్థానములో స్థిరపడవలయు ననిన, సర్వేంద్రియముల సంపూర్ణ సంయమ మత్యావశ్యకము.

12. సంయమసాధనారహస్యము :

అయితే బుద్ధియొక్క స్వప్రయత్నముచేతనే, మనస్సుయొక్క స్వయంశిక్షణ చేతనే సిద్ధించునది గా దీ సంయమము. దేనియందు శాంతియు, స్వప్రభుత్వయు సహజ సిద్ధములో, అట్టి ఉచ్చతరమగు ఒకానొక వస్తువులో బుద్ధిసంయోగముచేతనే అది సిద్ధించును. మఱియు భగవంతునికి, 'నాకు', సర్వాత్మను వినియోగించుట చేతను, నివేదించుటచేతను, సమర్పించుటచేతనే ఈ యోగము పూర్తిగా సఫలము కాగలదని శ్రీకృష్ణుడు తెలుపును. ఏలన లోపలి భగవంతుడే మన విమోచకుడు, ఉపకరణములగు మనోబుద్ధులు గావు. ఈ ప్రభువునందే సర్వథా శరణుబొందుమని గీత చివరకు ఉద్బోధించును గూడ. దీనికొఱకు ముందు అతనినే మన సమస్తసత్తయొక్క లక్ష్యము గావించుకొని, అతనితో అంతరాత్మసంపర్కమును నిలుపుకొనవలయును. 'నాకే సర్వసమర్పితుడవై, యోగమునందు దృఢముగా ఆసీనుడవు కమ్ము' (2-61) - అను వచనముయొక్క భావ మిదియే. ఇది ఇంకను అత్యల్ప అగంతుక సూచన మాత్రమే; గీతారీతియే యిది. 'యుక్త అసీత మత్పరః' (2-61) - ఈ మూడు పదముల యందు పరమరహస్యము బీజప్రాయముగా నున్నది. గీత ఈ బీజమును క్రమముగా పెంపొందించును.

13. గీతాసమాధి :

ఈ బుద్ధియోగము సిద్ధించినచో, విషయముల నంటి వానిపై పనిచేయుచునే, ఇంద్రియములను అంతరాత్మకు అధీనముగాను, అంతరాత్మను పరమాత్మకు

విధేయముగాను ఉంచుకొనగలము - అపుడు ఇంద్రియములు విషయ ప్రతిక్రియల నుండి విముక్తములై, రాగద్వేషముల బారినుండి బైటపడును; వానిపై శాంతి స్వచ్ఛతా సంతోషరూపమగు ప్రసన్నతకుదురుకొనును (2-64). ఈ ప్రసన్నతయే అంతరాత్మ నిర్మలసుఖమునకు మూలము; దుఃఖము ప్రసన్నాత్మను స్పృశించగల శక్తిని గోల్పోవును; ఆత్మ శాంతియందు బుద్ధి సత్వరమే స్థిరపడును. ఆత్మసమతయందును, ఆత్మ జ్ఞానము నందును బుద్ధియొక్క ప్రశాంత, నిష్కామ, నిష్ఖేద స్థిరతనే గీత సమాధియని పిలుచును.

14. సమాధి మానసిక లక్షణము :

సమాధి నందిన మానవుడు కాల్చినను బాహ్యస్పృహ నందడు - ఇది సాధారణమానవుని భావన మాత్రమే. ఇట్టి లయావస్థ ఒక ప్రత్యేక ప్రగాఢతయే గాని, సమాధికి స్వరూపలక్షణము గాదు. కామబహిష్కారము, మనస్సును స్పృశింప వాని అశక్తత - ఇదియే గీటురాయి. కామవిముక్తి దేనినుండి ఉద్భవించునో అట్టి అంతఃస్థితి సమాధి, తనయందే సమాహితమైన ఆత్మానందమే సమాధి; ఇచ్చట మనస్సు బాహ్యజీవనముయొక్క రాగద్వేషాలకు, శుభాశుభాలకు, పైన సమముగా, శాంతముగా భాసిల్లును. ఈ మనస్సు బాహ్యకర్మయందును లోని కాకృష్టమై యుండును; బాహ్యవస్తువులను నిరీక్షించుచున్నపుడు సైతము, అది ఆత్మయం దేకాగ్రమై యుండును; ఇతరుల దృష్టిలో నది లౌకికకర్మయందు వ్యావృతమై యున్నపుడు గూడ, లోపల సర్వథా భగవదభిముఖముగానే యుండును. ఈ విశిష్ట సమాధియొక్క బాహ్యచిహ్నముకొరకు అర్జునుడడుగును. కాని అట్టి చిహ్నా మేమియు నుండదు; గురువును అట్టి చిహ్నములను జూప బ్రయత్నించడు; ఏలన ఈ సమాధికి గల ఒకే ఒక మానదండము ఆంతరము. సమత విముక్త మానవుని ప్రధాన లక్షణము; అయితే దీనిని గుర్తించుటకు గల అతిస్పష్ట చిహ్నములు సైతము ఆంతరములే. చూడుడు: "దుఃఖములందు ఆందోళన జెందని మనస్సు గలవాడును. సుఖములపట్ల స్పృహలేని వాడును, రాగము, భయము, క్రోధము గతించినవాడు నగు మునియే స్థిత ప్రజ్ఞుడు." (2-56) అతడు "ప్రకృతి గుణముల త్రివిధక్రియా రహితుడు, ద్వంద్వరహితుడు, తన యథార్థసత్తయందు నిత్యస్థితుడు, యోగక్షేమదృష్టి లేనివాడు, ఆత్మవంతుడు" (2-45) ఏలన విముక్త మానవునికి యోగక్షేమము లేమి యుండును? ఒకసారి ఆత్మ ప్రాప్తించు నేని, అన్ని వస్తువులు మనవియే యగును గదా.

15. గీత అపూర్వత :

కాని అట్టి ఆత్మవంతుడు సైతము కర్మనుంచి విరమించడు; విరమించక పోవుటను గీత సమర్థించుటయే గాక, విధించును గూడ-ఆత్మయొక్క అచలత్వమును, ప్రకృతిపరత్వమును, విముక్తాత్మకు ప్రకృతినిస్సారతను వక్కాణించియు, గీత కర్మను విధించి, కేవలశాంతిపరమగు తత్త్వశాస్త్రముల మహాదోషమును పరిహరించును. ఇది గీతయొక్క అపూర్వతయు, శక్తియు. "కర్మయందు, కర్మయందే నీ కధికారము గలదు గాని, ఫలములందెప్పుడును లేదు. కావున కర్మఫలము నీకు ప్రేరణ గారాదు; అట్లని, అకర్మయందును నీకు సంగ ముండరాదు" (2-47). కావున గీతాకర్మలు వేదవాదుల కర్మలు గావు. మఱియు చంచల మనస్సును తృప్తిపఱచుటకు చేయు కర్మలును గావు. చూడుడు: "యోగమునందు నిలిచి, సంగము త్యజించి, జయాపజయములందు సముడవై కర్మ చేయుము; ఏలన సమత్వమే యోగము" (2-48). సాపేక్ష శుభాశుభముల మధ్య చేయవలసిన ఎన్నికచేతను, పాపభయము చేతను, పుణ్యసాధనయందు గల ప్రయాసచేతను కర్మపరిక్లిష్ట మగుట లేదా? లేదు; ఏలన తన బుద్ధిని భగవంతునితో యుక్తము గావించిన ముక్తాత్ముడు ఇక్కడ నీ ద్వంద్వ ప్రపంచమునందే సుకృత, దుష్కృత చింతను పాఱదోలును. కారణము, అతడు ఆత్మజ్ఞానముయొక్క స్వేచ్ఛయందు నిలిచి, శుభాశుభములకు పరమగు ఒక ఉచ్చతరధర్మమున కెగయును. మఱియు నిట్టి నిష్కామకర్మకు కార్యకారి ప్రభావము గాని, సృజనాత్మకవీర్యము గాని యుండ దందువా? అది సరిగాదు; యోగము నందుండి చేయు కర్మ సర్వోత్తమమే గాక, ప్రపంచవిషయములందును అది అత్యంత ప్రాజ్ఞము, ప్రబలము, నిపుణము నగును; ఏలన కర్మాధీశ్వరుని జ్ఞాన, సంకల్పము లందు నిండియుండును : "యోగ మన కర్మకౌశలము" (2-50). కాని, మానవజన్మ దుఃఖమయము; దాని నుండి తప్పించుకొనిపోవుటే యోగులందరి ధ్యేయమైనపుడు, జీవనపరమైన కర్మ తిరిగి ఆ బంధములోనికే లాగదా? ఈ సంశయమును సరిగాదు; ఏలన ఫలమాసించక, భగవంతునితో యోగయుక్తులై, కర్మచేయు ప్రాజ్ఞులు జన్మబంధము నుండి వినిర్ముక్తులై, మానవజాతిజీవనమును వేధించు ఏ ఆధివ్యాధులు లేని పరిపూర్ణపదమును బొందుదురు (2-51).

16. బ్రాహ్మీస్థితి :

ఈ బుద్ధియోగి ప్రాపించిన పదము బ్రాహ్మీస్థితి – బ్రహ్మయందు సుస్థిరస్థితి. ఇచ్చట ప్రకృతిబద్ధజీవుల దృష్టి, జ్ఞానము, అనుభవము, విలువ లన్నియు విపరీతముగా మాఱిపోవును. ద్వంద్వమయజీవనము వీరికి పగలు, జాగ్రదవస్థ. కర్మజ్ఞానములు ప్రవర్తించుటకు భాసురస్థితియు కాగా, యోగి కదియే రాత్రి, దుః స్వప్నము, ఆత్మాంధకారము నగును. అటులే ఏ బ్రహ్మభావము వీరికి రాత్రి, జ్ఞాన సంకల్పములు ఉపశమించు నిద్రయు నగునో, అదియే మునికి జాగ్రదవస్థయు, సత్యమగు సత్తా, జ్ఞాన, శక్తుల రూపము ధరించిన సముజ్జ్వల దినము నగును. కామ మించుక ప్రవేశించిన కలగి, కలుషిత మగు జలములవంటి వారు అజ్ఞులు; కాగా మహాసాగరమువలె నుండు యోగివర్యునిలో ఎన్ని కామములు వచ్చిపడినను వాని కే కామము, కలతయు నుండదు. ఏలన వారియందు తమను వేధించు అహంమమతలు నిండియుండగా, అందరియందలి ఆత్మతో ఒకటియైన యోగికి ఎట్టి అహంమమతలు నుండవు. అతడు ఇతరులవలె వ్యవహరించును గాని, కామములను, వాని లాలసలను త్యజించిన వా డతడు. అతడు మహాశాంతిని బొంది, వస్తువుల బాహ్యరూపములచే మోహితుడు గాడు. అతడు ఏకమునందు తన ప్రత్యేకాహంకారమును అర్పివేసినవాడై, తదేకతయందు నివసించుచు, అంత్య క్షణమునందును అచ్చటనే నిలిచి, బ్రహ్మయందు నిర్వాణమును, బ్రహ్మనిర్వాణమును బొందగలడు – ఈ నిర్వాణము బౌద్ధుల అభావాత్మక ఆత్మవిధ్వంసనము గాదు ప్రత్యుత ఏకము, అనంతము, నైర్వ్యక్తికము నగు బ్రహ్మమహాసత్తయందు పృథగ్భూత స్వీయాత్మనిమజ్జనము.

17. గీతాబోధనకు పునాది :

సాంఖ్యయోగ వేదాంతములను సూక్ష్మరీతిని ఏకముచేయు గీతాబోధనకు ప్రథమపునాది యిట్టిది. ఇదియే సర్వస్వ మెంతమాత్రము కాదు కాని, తొలుత నావశ్యకమగు, జ్ఞానకర్మల వ్యావహారిక సమన్వయము; దీనియందు ఆత్మకు సంపూర్ణతను ఘటించు, మకుటాయమాన, ప్రగాఢతను తృతీయాంశ మగు దివ్యప్రేమ భక్తులు కేవలము సూచించబడినవి.

11. కర్మ మఱియు యజ్ఞము

1. జ్ఞాన మెక్కడ, యుద్ధ మెక్కడ ?

రెండవ అధ్యాయము చివర వచ్చిన బుద్ధియోగము, దాని పర్యవసానమగు బ్రాహ్మీస్థితి – దీనియందే అధికాంశ గీతాబోధనయొక్క బీజము లున్నవి: నిష్కామకర్మ సిద్ధాంతము, సమతాసిద్ధాంతము, బాహ్యసన్యాసనిరాకరణము, భక్తిసిద్ధాంతము; అయినను ఇదంతయు ఇంకను స్వల్పము, అస్పష్టము. ఇంతవఱకు స్పష్టము చేయబడిన దేమన, సామాన్యముగా కర్మలను ప్రేరేపించు కామమునుండియు, ఇంద్రియముల ననుగమించు బుద్ధినుండియు, బహుశాఖలుగా విస్తరించు అభిలాష నుండియు ఇచ్ఛనుఉపసంహరించి, బ్రాహ్మీస్థితియొక్క నిష్కామ ఏకతయందును నిర్మల ప్రసన్నతయందును దానిని నిలుపవలయును. ఆ కాలమునాటి ఈ జ్ఞాన మార్గము అర్జునునకు పరిచితమే; ఇది సిద్ధిసాధనగా జీవనకర్మల సన్యాసమును ప్రతిపాదించును. ఇంద్రియకామములనుండియు, మానవకర్మనుండియు ఉపసంహరించుకొని, నిష్క్రియ నిర్విశేష బ్రహ్మమువైపునకు తిరిగిన బుద్ధియే నిశ్చయముగా సనాతనజ్ఞానబీజము, కర్మలు అజ్ఞానావస్థకు జెందినవి గనుక, ఈ జ్ఞానమున వానికి తావు లేదు. ఏలన కర్మబీజము కామము, కర్మఫలము బంధము. ఇదియే సంప్రదాయ తాత్త్వికసిద్ధాంతము; మఱియు బుద్ధియోగముకంటె కర్మకడుంగడు హీనము (2–49) – అని చెప్పిన కృష్ణుడు ఈ సిద్ధాంతము నంగీకరించి నట్లే గన్పించును. అయినను యోగాంగముగా కర్మలు వక్కాణించబడును (2–48). ఇట్లే బోధమూలమునందే విరోధ మున్నట్లు గన్పించును. ఇంతే గాదు; అత్యల్పము, నిరపాయము నగు కర్మ (జ్ఞానానంతరము) కొంతకాలము నిలిచి యుండవచ్చును; కాని రక్తము నేఱులుగట్టించు ఈ రాక్షసయుద్ధ మెక్కడ, ఆత్మానందమయమగు ఆ ప్రశాంత జ్ఞాన మెక్కడ? అయినను ఈ యుద్ధమునే గురువు విధించును; అంతఃశాంతిని, నిష్కామసమతను, బ్రాహ్మీస్థితిని బోధించుట ద్వారా దీనినే సమర్థింపజూచును; ఇట్లిక్కడ ఒక అసంగత వ్యాఘాతము తేఱిచూచును. ఈ పరస్పరవ్యాఖాతముచేతనే అర్జునుడు తికమకపడి, మానవబుద్ధి నిశ్చింతగా అనుసరించదగు ఒక నిర్దిష్టమార్గము నిమిత్తము అర్థించును. ఈ తికమకను దొలగించుటకే గీత వెనువెంటనే వాస్తవికము, విధాయకము (3–8) నగు తన కర్మసిద్ధాంతమును పెంపొందించును.

2. నైష్కర్మ్యార్థము :

మానవులు విడివిడిగా అవలంబింప గల రెండు మోక్షమార్గములను గురువు ముందు వేఱుచేసి చెప్పును - జ్ఞానమార్గము, కర్మమార్గము. సాధారణాభిప్రాయము ననుసరించి చూడ, కర్మలు మోక్షమున కవరోధ మని తలంచి, జ్ఞాన మార్గము కర్మసన్యాసము నపేక్షించగా, కర్మమార్గము వానిని మోక్షసాధనముగా నంగీకరించును. గురు వింకను వీని 'ఏకీకరణమునకు బూనుకొనక, సాంఖ్యుల బాహ్యసన్యాస మొక్కటే మార్గము గాదనియు, అది శ్రేష్టతర మార్గమసలే గాదనియు తన బోధను ప్రారంభించును. నైష్కర్మ్యము, అనగా ప్రశాంత కర్మశూన్యత నిస్సంశయముగా పురుషుడు అందుకొనవలసిన స్థితియే. ఏలన కర్మ చేయునది ప్రకృతియే గాన, పురుషుడు ఆమె కర్మలలో చిక్కువడక, పై కెగసి, శాంతిసమతాస్థితి నందుకొని, అచ్చటి నుండి ప్రకృతిక్రియల నవిచలితముగా తిలకించవలయును. 'నైష్కర్మ్యమున' (3-4) కర్థము అదియే గాని, ప్రకృతికర్మల నివృత్తి గాదు. కావున ఏ పనిని ఆరంభించకపోవుటచేత నైష్కర్మ్యమును బొంది, అనుభవించగల మను ఆలోచన భ్రాంతిమాత్రమే. కేవలసన్యాసమే చాలదు. మఱియు నది సముచిత మోక్షసాధనమును గాదు - "కర్మలను చేపట్టక పోవుటచేత పురుషుడు నైష్కర్మ్య సుఖమును బొందదు; మఱియు కేవల (కర్మ) సన్యాసముచేతనే అతడు సిద్ధి నందుకొనడు." (3-4).

3. కర్మసన్యాసము సాధ్యమే గాదు :

కాని కర్మసన్యాసము కనీసము ఒక ఆవశ్యక, అనివార్యసాధనమైనను గావలయును గదా? ఏలన ప్రకృతికర్మలు కొనసాగుచున్నచో, పురుషుడు వానిలో తగుల్కొనక ఎట్లు తప్పించుకొనగలడు? ఉదాహరణకు, వ్యక్తిగా యుద్ధము చేయుచునే, చేయుట లేదని లోపల నెట్లనుభవింపగలడు? సాంఖ్యమత మేమన, ప్రకృతికర్మలోనికి దిగిన బుద్ధి అహంకారము, అజ్ఞానము, మఱియు కామములో తగుల్కొనును గావున, కర్మవైపునకే లాగబడును. దీనికి ప్రతిగా, బుద్ధి వెనుకకు తగ్గిన, కామనివృత్తితో బాటు కర్మనివృత్తిగూడ ఘటించును (ఇట్లు కర్మలు లేనపుడు, కర్మవిముక్తి గలుగును). కనుక విముక్తిమార్గమున కర్మసన్యాసము ఆవశ్యక, అనివార్య సాధనము. అర్జునుని మనస్సులోనున్న, ఆనాటి ఈ తర్కము యొక్క ఆక్షేపమును గురువు పసికట్టి, వెంటనే

సమాధానించును. లేదు, అట్టి సన్యాసము అపరిహార్య మెంతమాత్రము గాదు సరిగదా, అసలు సాధ్యము గూడ గాదు - అని కృష్ణుడు పలుకును. "ఏలన ఎవ్వడును ఒక్క క్షణము గూడ కర్మచేయక యుండుట లేదు: ప్రకృతినుండి పుట్టిన గుణములు, అతనిచేత వివశముగా కర్మచేయించును" (3-5). విశ్వమహాక్రియయొక్కము, ప్రకృతిశక్తి సనాతన వ్యాపారముయొక్కయు ఈ ప్రబలజ్ఞానము గీతకు ఒక అత్యంత విశిష్ట లక్షణము. తర్వాత ఈ విషయమును తాంత్రికశాక్తేయులు చాల ఒత్తి చెప్పిరి. ప్రకృతి విషయము గీతయందింకను మంద్రస్వరముగానే వచ్చినప్పటికి, ఇది తనయందలి ఈశ్వరభక్తితత్త్వములతో చేతులు గలిపి, శక్తిని పుంజుకొని, తన యోగప్రణాలిక ద్వారా సాంప్రదాయికవేదాంతముయొక్క ఉపశమ ప్రవృత్తిని సవరించగలిగి యున్నది. ఈ ప్రకృతిమయ ప్రపంచమున దేహధారియగు మానవుడు ఒక నిముష మేనియు, ఒక క్షణ మేనియు కర్మనుంచి విరమించుకొనలేడు; అసలు అతని జీవనమే ఒక క్రియ; సమస్త విశ్వము భగవంతునియొక్క ఒక కృత్యమే. ఉచ్ఛ్వాసనిశ్వాసలు సైతము అతని చలనమే.

4. మిథ్యాచారము :

మన భౌతికజీవనము, దాని నిర్వహణము, దాని సాతత్యము (కొనసాగింపు) ఒక ప్రయాణము, ఒక 'శరీరయాత్ర' (3-8). ఒకవేళ మానవుడు శరీరమును పోషించకుండ, చెట్టు లేక గుట్టవలె నిశ్చలముగా నిలువగలిగినప్పటికిని, అట్టి అచలత్వ మతనిని ప్రకృతిబారినుండి రక్షించదు; ప్రకృతిక్రియ నుండి అతడు ముక్తుడు గాడు. ఏలన కర్మ యన మన భౌతికచలనములు, క్రియలు మాత్రమే గావు: మన మానసిక జీవనమును ఒక మహాసంకీర్ణక్రియయే - నిజానికి శరీర క్రియను ప్రేరేపించి, నిర్ణయించున దిదియే, బాహ్యకర్మను మాత్రము అడచివేసి, దానికి కారణమగు ఆంతరక్రియను సాగించుచో, మనమేమి సాధించినట్లు; ఇంద్రియ విషయములు మన బంధనమునకు బాహ్యనిమిత్తము మాత్రమే; వానియందు మనస్సునకు గల దృఢనిర్బంధము ఉపకరణాత్మక కారణము. ఒకడు కర్మేంద్రియములను నిగ్రహించి, వాని సహజగతిని సాగన్వికపోవచ్చును; కాని అతని మనస్సు విషయములను స్మరించి, చింతించుచునే యున్నచో, అత డేమియు పొందనట్లే. ఆత్మసంయమమును గుతించిన విథ్యాభావములచే స్వయం విమూఢుడతడు (3-6); కనుక అతని

ఆత్మసంయమము భ్రమాత్మకము, నిష్ప్రయోజనము* (3-6). శరీరక్రియలు, మనః క్రియలు సైతము స్వయముగా బంధమును గావు, బంధప్రథమ కారణమును గావు. అసలు విషయము ప్రకృతి మహాశక్తి; అది మనఃప్రాణశరీరముల మహాక్షేత్రమున నిరాఘాటవ గా ముందుకు సాగి తన క్రీడ నెరపితీరును; కాగా ప్రకృతియందలి ప్రమాదకరవిషయ మేమన, బుద్ధిని కలతపెట్టి, ఆత్మను మూసివేయు త్రిగుణ ప్రభావము. కర్మ మఱియు మోక్షమునకు సంబంధించిన గీతాగుహ్య మంతయు నిదియే నని ముందు మనకు తెలియగలదు. గుణకృతమగు ఈ కలత నుండియు, మూసివేతనుండియు విముక్తుడవు గమ్ము; అపుడు జరిగితీరవలసిన కర్మ - యుద్ధ కర్మయైనను -- జరుగను గలదు పురుషుడు దానినంటక నైష్కర్మ్యము ననుభవించను గలడు.

5. కర్మయోగమున బుద్ధియోగ పరిపూర్తి :

కాని ప్రస్తుతము గీత ఈ బృహత్తర నైష్కర్మ్యాంశమును వివరించదు. మనసు ఉపకరణకారణము గావునను, అకర్మ అసంభవము గావునను, బాహ్యాంతరములను నియమించి చేయు కర్మయే ముక్తిసంగత మగును. బుద్ధియొక్క ఉపకరణముగా మనస్సు ఇంద్రియజాతమును తన వశముగావించుకొని, కర్మేంద్రియములను తమ స్వీయవృత్తియందు కర్మయోగార్థము వినియోగించవలయును. కాని కర్మయోగ మన నేమి? అనాసక్తి, విషయములందు, కర్మఫలములందు మనస్సు సక్తముగాకుండ కర్మచేయుట. సంసిద్ధికి ప్రథమరహస్యము సంపూర్ణ అకర్మగాదు. పరంతు ఇంద్రియములకు, ఆవేశములకు వశముగాక, నిష్కామముగా, నిఃసంగముగా చేయు సమృద్ధ, స్వతంత్రకర్మ; అకర్మ ఒక భ్రమ, ఆత్మవంచన, అసంభవత మాత్రమే, "ఇట్లు నియతకర్మ చేయు" (3-8) మని భగవానుడు బోధించును : జ్ఞానము కర్మకంటె అధిక (3-1) మని చెప్పినపుడు, అకర్మ కర్మకంటె అధిక మని నా అభిప్రాయము గాదు; యథార్థము దీనికి విరుద్ధము - "కర్మ అకర్మకంటె నధికము"

---

*మిథ్యా చారు (3-6) డన దాంభికు డని నే ననుకొనజాలను. అంతటి కఠోర, సంపూర్ణక్లేశమును విధించు కొనువాడు విథ్యా చారుడెట్లగును? అతడు భ్రాంతాత్ముడు మాత్రమే; అతని ఆచారము - సాధనా విధానము - భ్రాంతము, నిరర్థకము: నిశ్చయముగా గీతార్థ మంతయు నిదియే - శ్రీ అరవిందుడు.

(3-8). ఏలన జ్ఞానమున కర్థము కర్మసన్యాసము గాదు; దాని కర్థము సమత మఱియు కామమునందును, విషయములందును అనాసక్తి; మఱియు దాని కర్థము ఆత్మయందు బుద్ధియొక్క సమస్థితి; అచ్చ టా బుద్ధి విముక్తమై, ప్రకృతి నిమ్నక్రియకు పైన నిలిచి, ఆత్మజ్ఞానము మఱియు విశుద్ధ నిర్విషయానందముయొక్క ప్రభావముచేత మన ఇంద్రియశరీరకర్మలను నియమించగలుగును. ఇట్టి కర్మ 'నియతం* కర్మ' (3-8). కర్మయోగమున బుద్ధియోగము పరిపూర్తినందును; అనగా తన విముక్తి స్వయముగా సాధించుకొన బుద్ధి యోగము నిష్కామకర్మయోగమునందు తన పూర్ణార్థమును కనుగొనును. ఇట్లు గీత నిష్కామకర్మల ఆవశ్యకతకు పునాది వేసి, సాంఖ్యుల బాహ్యసన్యాసమును నిరాకరించి వారి జ్ఞానసాధనను యోగుల కర్మసాధనతో ఏకము చేయును.

6. నియత కర్మ × నిత్యకర్మ :

కాని ఇంకను ఒక ముఖ్యసమస్య మిగిలియున్నది. సమస్త మానవకర్మల సాధారణహేతవు కామము గావున, ఆత్మ కామవిముక్త మగుచో, అప్పుడిక కర్మకు హేతువే యుండదు. శరీరనిర్వహణార్థము కొన్ని కర్మల చేయుట తప్పక పోవచ్చును; కాని అదియు శరీరకామమునకు ఆధీనతయే గాన, సంసిద్ధి నిమిత్తము దానిని గూడ వదిలించుకొనదగును. కాని ఇది సాధ్యముగాదని అంగీకరించినపుడు, మన స్వభావముతో సంబంధము లేని బాహ్యనియమము విధించు శరీరకర్మయే శరణ్యమగును – అనగా వేదము విధించు నిత్యకర్మ, పరిపాటి యజ్ఞము, దైనికాచారము, సాంఘికకర్తవ్యము. ఇవి అంతరముగా స్వభావ నియతములగుటచే గాక,

*మఱల, 'నియతం కర్మ' యొక్క ఇప్పటి వ్యాఖ్యానమును నే నామోదించజాలను; వేదోక్తమగు నియమిత యజ్ఞకర్మలు, నిత్యనైమిత్తిక కర్మలే నియత కర్మయని ఈ వ్యాఖ్యానము చెప్పును. నిశ్చయముగా 'నియత' పదము పై శ్లోకమునందలి 'నియమ్య' (3-7) పదమును అనుసరించును. "ఇంద్రియములను మనస్సుచేత నియమంచి ఎవడు కర్మేంద్రియములచేత కర్మయోగము నారంభించునో, అతడు శ్రేష్ఠుడు." (3-7) అని చెప్పి, శ్రీ కృష్ణుడు వెను వెంటనే ఆ వాక్యార్థము నుండి ఒక నియమమును రూపొందించుచున్నాడు – "నియతం కురు కర్మ త్వం (3-8) – నీవు నియత కర్మను జేయుము."–అని ఆదేశించును. కావున 'నియతం కర్మ' విముక్త బుద్ధిచేత నియతమైన నిష్కామ కర్మనే తెలుపును గాని. బాహ్య నియమముచేత విహితమైన వేదవిహిత కర్మలను గాదు; గీతార్థ మిదియే. –శ్రీ అరవిందుడు.

బాహ్యముగా శాస్త్రవిహితములగుటచేతనే ముముక్షు మానవుడు వీనిని అత్యంత ఉదాసీనముగా వైయక్తిక ప్రయోజనము నపేక్షింపక చేయవలయును. కాని ఇట్లు కర్మనియమము స్వభావబాహ్యము గాక, స్వభావానుగుణమే కావలసియున్నచో, అపుడా ఆంతర కర్మనియమము కామము మాత్రమే గాక తప్పదు – ఆ కామము శరీరాభిలాష గావచ్చును, హృదయోద్వేగము గావచ్చును, నీచ లేక ఉదార మనోలక్ష్యము గావచ్చును; ఏది యైనను అది గుణాధీనమే : అయినప్పుడు గీత బోధించు 'నియత కర్మ' వేదము విధించు 'నిత్యకర్మ' యనియు, గీతయొక్క 'కర్తవ్యకర్మ' (3–19) ఆర్యుల సామాజిక విధి యనియు, గీతా కర్మ యజ్ఞము వైదిక యజ్ఞజాత మనియు మనము వ్యాఖ్యానించవలసి యుండును. గీత యొక్క నిష్కామకర్మ సిద్ధాంతమును తఱచుగా వ్యాఖ్యానించు విధాన మిదియే. కాని నా కనిపించున దేమన, గీతాబోధన ఇంత స్థూలము, సరళము గాదు లేక ఇంత స్థానికము, తాత్కాలికము, సంకుచితము గాదు. అది ఉదారము, స్వతంత్రము, సూక్ష్మము, గంభీరము, సర్వ కాలములకు, సర్వమానవులకు వర్తించును గాని, ఒకే కాలమునకు, ఒకే దేశమునకు గాదు. విశేషించి, అది బాహ్యరూపములను, దురాగ్రహభావములను భేదించుకొని, లోనికి బోయి మన సత్తా స్వరూపముల మూలసూత్రములను, మహా వాస్తవములను ఆశ్రయించును. గీత వ్యాపక దార్శనిక సత్యమును, ఆధ్యాత్మికానుష్ఠానమును బోధించు గ్రంథము గాని, సంకుచితమగు మత సిద్ధాంతములను, తాత్త్విక సూత్రములను, చిట్టెముగట్టిన వాదములను ప్రతిపాదించు గ్రంథము గాదు.

7. యజ్ఞ కర్మద్వారా సంసిద్ధి :

అసలు సమస్య యిది : మన స్వభావము స్వభావముగా నుండగా, దాని సామాన్య క్రియా సూత్రముకామము కాగా, నిజముగా నిష్కామకర్మను ప్రారంభించుట ఎట్లు సాధ్యము? ఏలన మనము సాధారణముగా నిస్స్వార్థకర్మ యనునది నిజముగా నిష్కామకర్మ గాదు; చిన్న చిన్న స్వార్థముల స్థానమున పుణ్యము, దేశభక్తి, మానవసేవా రూపమున నిస్స్వార్థముగా గన్పించు పెద్ద పెద్ద కోరికలను ప్రవేశ పెట్టుదుము, అంతే. మఱియు కృష్ణుడు ఒత్తి చెప్పునట్లు, మన స్వభావరూపమున ప్రకృతిగుణముల చేతనే సమస్తకర్మయు చేయబడును; శాస్త్రము ననుసరించి చేయునపుడు సైతము మన స్వభావము ననుసరించియే చేయుచున్నాము. మన స్వభావము శాస్త్రవిధికి విరుద్ధమై, దాని గుణములు మన బుద్ధిసంకల్పములపై ప్రతికూలసంయోగమున

పనిచేసినచో, మనము శాస్త్రము నామోదించక, మన సుఖమును బట్టియో, మన బౌద్ధిక భావములను బట్టియో నివసింతుము; అథవా సాంఘిక నియమములను భంగించి, ఒకాకిగానో, సన్యాసిగానో జీవింతుము. మనకు బాహ్యమైన దేనినో పాటించుటచేత, మనము నైర్వ్యక్తికులము గాజాలము; కారణము, ఆ రీతిగా మన బైటికి మనము పోజాలము. మనలోని సర్వోచ్ఛతత్త్వమగు విముక్తపురుషుడు మఱియు ఆత్మ అందరియందును అనన్యము, ఏకము గాన, దాని కే వైయక్తిక స్వార్థములు నుండవు. కనుక దానిలోని కెగయుటచేతనే మనము నైర్వ్యక్తికులము కాగలము; అటులే తన విశ్వాతీతతయందు భగవంతుడు నెలకొని యుండు గాన, అతనిని తన విశ్వకర్మలు గాని, తన వ్యష్టికర్మలు గాని బంధించవు. అదియే గీతాబోధన; కాగా నిష్కామత దీనికొక సాధన మాత్రమే గాని, స్వయముగా లక్ష్యము గాదు. మంచిది, కాని ఈ పరిణామము నెట్లు సాధించవలయును? యజ్ఞము నిమిత్తమే సర్వకర్మలు చేయుటచేత -- నని భగవానుని సమాధానము. "యజ్ఞము కొఱకు గాక చేయు కర్మ లన్నియు మానవుని బంధించు గాన, ఓ కౌంతేయ, యజ్ఞార్థము సంగము లేక కర్మ నాచరింపుము." (3-9). యజ్ఞము, సామాజికవిధులే గాక సమస్తకర్మలు యజ్ఞభావముతో చేయబడగలవనుట స్పష్టమే. కర్మ యెట్టి దైన, దానిని సంకుచిత లేక విస్తృతాహంకారముతోను జేయవచ్చును. లేక భగవదర్థమును జేయవచ్చును గదా. ప్రకృతియొక్క సమస్తసత్తయు, సమస్తక్రియయు భగవదర్థమే వర్తించును, అతనినుండియే ప్రవర్తించును, అతనియందే నిలుచును, అతనివైపుకే సాగును. కాని అహంభావము ప్రాబల్యము వహించి యున్నంత కాలము, మన మీ సత్యమును గుర్తించలేము, గుర్తించినను తదనుసారముగా వ్యవహరించలేము; యజ్ఞార్థము గాక, అహంకారార్థమే, అహంభావమునందే వ్యవహరింతుము. అహంకారమే బంధనగ్రంథి. అహంకారమును గణించక, భగవదర్థము కర్మ చేతు మేని, ఈ గ్రంథిని శిథిలపఱచుచు చివరకు విముక్తిని ప్రాపింతుము.

8. వేదవాదము × వేదాంతవాదము :

అయినను గీత మున్ముందు వేదవాదము విధించు యజ్ఞమునే చేపట్టి, తన యజ్ఞధర్మమును దాని పదములలోనే ప్రతిపాదించును. గీత ఒక నిర్దిష్టలక్ష్యముతో నిట్లు చేయును. కర్మసన్యాసమునకు, కర్మయోగమునకు మధ్య గల వివాదమునకు రెండు రూపములు గలవని మనము చూచియున్నాము : 1. సూత్రప్రాయముగా

ఇప్పటికే పరిష్కరింపబడిన సాంఖ్య, యోగముల విరోధము; 2. గురు వింకను పరిష్కరించవలసియున్న వేదవాద, వేదాంతవాదముల విరోధము, ప్రథమవిరోధమున కర్మపదము సర్వకర్మలకు వర్తించును. ప్రతిజీవుడును నిజాని కే అక్షర, నిష్క్రియపురుషుడో, అతడే భగవత్పదము (divine status) అను భావముతో సాంఖ్య మారంభించి, ఈ పురుషుని నిష్క్రియతకు, ప్రకృతిక్రియాకలాపమునకు విరోధమును చూపును; కావున దాని సహేతుకపర్యవసానము కర్మోపశమము. కాగా, భగవంతుడీశ్వరుడు, ప్రకృతిక్రియల నియామకుడు, కావున వాటి కతీతుడు అను భావముతో యోగ మారంభించును; కాన దాని సహేతుకపర్యవసానము కర్మోపశమము గాక, కర్మలకు ఆత్మాతీతత్వమును, కర్మ చేయుచున్నను ఆత్మ విముక్తియు నగును. ఇక ద్వితీయవిరోధములో కర్మపదము వైదికకర్మలకు, ఒకొకప్పుడు కేవలము వైదికయజ్ఞమునకు మాత్రమే పరిమితము; తక్కిన కర్మలన్నియు శ్రేయోలాభమునకు పనికిరాని వని బహిష్కరింపబడును. మీమాంసకుల వేదవాదము వీనిని సాధనముగా ఒత్తిచెప్పగా, ఉపనిషత్తుల ననుసరించు వేదాంత వాదము వానిని అజ్ఞానావస్థకు జెందిన పూర్వాంగముగానే దర్శించి, చివరకు మోక్ష ప్రతిబంధకముగా వానిని విడిచివేయవలయు నని చెప్పును. మన శ్రేయోలాభమునకు చేయూతనిచ్చు శక్తులనుగా దేవతలను భావించి, వేదవాదము వారిని యజ్ఞముతో ఆరాధించును; ఇక వేదాంతవాదము మానసిక, భౌతిక ప్రపంచమునకు జెందిన దేవతలు మన మోక్షమునకు ప్రతికూలు రని తలంచును (మానవులు దేవతల పశుగణము గావున, వారు జ్ఞానము బొంది, విముక్తులగుట దేవతల కిష్టముండదని బృహ, ఉపనిషత్తు చెప్పును). వేదాంత దృష్టికి పరతత్త్వము అక్షర బ్రహ్మము గాన, అది కర్మలచేత గాక, జ్ఞానముచేత ప్రాప్తమగును. కర్మలు స్థూల ఫలితములకు, అవరస్వర్గమునకు మాత్రమే దారితీయును గాన, వానిని సన్యసించవలసి యుండును.

9. వేదవాద, వేదాంతవాద సమన్వయము :

దేవతలు దేవదేవుని వివిధరూపములే యన వక్కాణించి గీత ఈ విరోధమును విడదీయును; ఈ దేవదేవుడే యోగము, భక్తి, యజ్ఞము, తపస్యలకు అధీశ్వరుడు. కావున దేవతల కర్పించిన యజ్ఞము స్వర్గమునకు మాత్రమే చేర్చుచో, ఈశ్వరున కర్పించిన యజ్ఞయు స్వర్గాతీతమగు పరమవిముక్తిలోనికి తీసికొనిపోగలదు, ఏలన

ఈశ్వరుడును, అక్షరబ్రహ్మయు విభిన్నసత్తలు గాక, ఒకే అనన్యమహాసత్త; కావున దేనికొఱకు ఉద్యమించినను, ఒకే దివ్యపదమున కుద్యమించిన వాడగును. సర్వకర్మయు అశేషముగా భగవంతుని జ్ఞానమునందే పర్యవసించి, పరిపూర్ణమగును – "సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే" (4–33) కర్మ అవరోధము గాకపోగా, పరమజ్ఞానమునకు బాటయే యగును. ఇట్లు యజ్ఞార్థమున కిచ్చిన విశాలవివరణచేత ఈ విరోధమును పరిష్కరింపబడినది. నిజానికి ఈ సంఘర్షము సాంఖ్య, యోగముల బృహత్తరవిరోధముయొక్క ఒక పరిమిత రూపము మాత్రమే. వేదవాదము యోగముయొక్క ఒక ప్రత్యేక, సంకుచిత రూపముకాగా, వేదాంతుల సన్యాసము సాంఖ్యుల సన్యాసమును బోలియుండును. తన మనస్సునం దీ సమన్వయమును ఉద్దేశించియే, దివ్యగురువు ముందుగా యజ్ఞసిద్ధాంత ప్రతిపాదన కుపక్రమించును. ఆదినుంచి అంతమువఱకు ఆయన సంకుచిత యజ్ఞకర్మలయందు గాక, వాని విశాల, సార్వత్రికరూపమునందే – తదనుష్ఠానమునందే తన దృష్టి నుంచును. సంకుచితభావములను విస్తృతపఱచి, సదా మహాసత్యములకు చోటుచేయుటయే గీతా సముదారవిధానము.

12. యజ్ఞ మర్మము

1. సంప్రదాయ యజ్ఞ రూపము :

గీత యొక్క యజ్ఞసిద్ధాంతము రెండు చోట్ల ప్రతిపాదింపబడినది - మూడవ అధ్యాయమునందు, నాల్గవ అధ్యాయమునందు, దానిని మాత్రమే చూతు మేని, ప్రథమవర్ణన వైదిక యజ్ఞమునే చెప్పుచున్న దనిపించును; ద్వితీయ వర్ణన ప్రథమమునందలి యజ్ఞపదమును ఒక విశాల సంకేతముగా గ్రహించి, దానికి మార్మికార్థ మిచ్చి, సమున్నత మానసిక మఱియు ఆధ్యాత్మికసత్యముయొక్క భవ్యభూమికలోనికి యజ్ఞమును లేవనెత్తును. ప్రథమవర్ణన జూడుడు: "పూర్వము ప్రజాపతి యజ్ఞసహితముగా ప్రజలను సృష్టించి, ఇట్లుపదేశించెను - 'దీనిచేత (ఫలములను లేక సంతానమును) పుట్టించుకొనుడు, ఇది మీకు కామధేను వగుగాక! దీనిచేత దేవతలను బోషించుడు మఱియు వారు మిమ్ములను బోషించుగాక! యజ్ఞతర్పితులైన దేవతలు మీ కభీష్టభోగములను ఇవ్వగలరు. వారు ఇచ్చిన వానిని వారికి నివేదించక భుజించువాడు చోరుడు. యజ్ఞశేషమును స్వీకరించు సజ్జనులు మాత్రము సర్వపాపవిముక్తు లగుదురు. పోగా, తమ నిమిత్తమే వండుకొని తిను పాపులు పాపమునే భుజింతురు (3-10,11,12,13). అన్నమునుండి ప్రాణులును, మేఘమునుండి అన్నమును, యజ్ఞమునుండి మేఘమును, కర్మనుండి యజ్ఞమును బుట్టును (3-14). మఱియు బ్రహ్మమునుండి కర్మయు, అక్షరమునుంచి బ్రహ్మమును ఉద్భవించును. కావున సర్వవ్యాపి బ్రహ్మము యజ్ఞమునందు ప్రతిష్ఠితమై యుండును (3-15). ఇట్టి సృష్టి చక్రము నెవడు అనువర్తించడో, వాడు పాపజీవనుడు, సుఖాసక్తుడు, వృథా బ్రతుకువాడు" (3-16). సాంప్రదాయిక వైదిక యజ్ఞమునే ప్రతిపాదించుచున్నట్లు పైకి గన్పించు ఈ శ్లోకముల నెట్లు అర్థముచేసి కొనవలయునో తర్వాత చూతము. ఇట్లు కృష్ణుడు యజ్ఞావశ్యకతను నిరూపించి, జ్ఞాని కర్మల కతీతుడని చెప్ప నారంభించును - "కాని ఎవడు ఆత్మయందు రమించుచు, ఆత్మయందే తృప్తి, తుష్టి ననుభవించునో, అతనికి చేయదగిన కర్మయేదియు నుండదు" (3-17). చేసిన కర్మచేత గాని, చేయని కర్మచేత గాని, అతడు పొందదగిన దేదియు నుండదు. అతడు దేనికొఱకును దేనిని ఆశ్రయించడు" (3-18).

2. అకర్మవలనను వచ్చునది లేదు :

ఇక్కడ తమ తీక్ష్ణ మూలవిరోధముతో తలపడుచున్నట్లున్న వేదవాది. వేదాంతవాది ఆదర్శములు రెండును గన్పించును - 1. యజ్ఞముచేత ఇహమున భోగములను, పరమున పరమశ్రేయమును బొందుట మఱియు మానవుల, దేవతల పరస్పరాశ్రయత్వముననను ఆదర్శము; 2. దీనికి ప్రతిగా విముక్తమానవుని ఆదర్శము; ఇతడు ఆత్మస్వతంత్రుడు; కర్మ, భోగములతో గాని, ఇహపరములతో గాని ప్రమేయము పెట్టుకొనడు; ఆత్మశాంతియందు బ్రహ్మానందమున రమించుచుండును. ఈ ఆత్యంతిక విరోధమును సమాధానపఱచుటకు తర్వాతి శ్లోకములు భూమిని సిద్ధపఱచును. ఊర్ధ్వసత్యమున కున్ముఖమైనంతనే ఆశ్రయించవలసిన కీలకము అకర్మ గాక, ఆ సత్యప్రాప్తికి ముందును, వెనుకను గూడ నిష్కామకర్మయే యగును. విముక్తమానవుడు కర్మవల్ల పొందు ప్రయోజనము లేదు సరే, అకర్మ వల్ల పొందు ప్రయోజనమును లేదు; మఱియు అతడు వీనిలో ఒక దానిని ఎన్నిక చేయవలసినది స్వీయ ప్రయోజన దృష్ట్యా కాదు. "కావున అసక్తుడవై సదా చేయదగిన కర్మను చేయుము (అనంతర శ్లోకము స్పష్టపఱచునట్లు లోకసంగ్రహనిమిత్తము చేయుము); అట్లు చేసిన యెడల మానవుడు పరమపదము నందును" (3-19). కర్మ, యజ్ఞములు పరమశ్రేయస్సునకు సాధనములను మాట నిజమే-శ్రేయఃపరం అవాప్స్యథ" (3-11). కాని కర్మ త్రివిధము - 1. యజ్ఞార్థము గాక, స్వీయభోగార్థము చేయు స్వార్థపూర్ణ, ఆహంకారిక కర్మ: ఇది జీవితముయొక్క వాస్తవధర్మమును, లక్ష్యమును, ప్రయోజనమును గోల్పోవును- "మోఘం పార్థ సజీవతి" (3-16). 2. కామముతో నైనను యజ్ఞరూపముగా జేయు కర్మ; ఇచ్చటి భోగముయజ్ఞఫలమే గావున, ఆ మేర కీ కర్మ సమర్పితము, పవిత్రము, 3. ఎవ్విధమగు కామము గాని, సంగము గాని వినా చేయు కర్మ. ఈ చివరి కర్మయే మానవాత్మను పరమోన్నతి కెత్తును - "పరమాప్నోతి పూరుషః" (3-19).

3. యజ్ఞ మన వైదిక యజ్ఞ మేనా?

'యజ్ఞము', 'కర్మము', 'బ్రహ్మము' - ఈ మూడు ముఖ్యపదముల పైననే ఈ బోధనయొక్క సమస్తార్థము, ఆశయము ఆధారపడియుండును. యజ్ఞ మన కేవల వైదిక యజ్ఞమే యగుచో, యజ్ఞమునకు మూలమగు కర్మయన, వైదిక విధి నుండి పుట్టిన కర్మయే యగుచో, కర్మమూలమగు బ్రహ్మ మన వేదభావము గాక, వేదశబ్దము

అనగా శబ్దబ్రహ్మమే యగుచో, అపుడు వేదవాదముయొక్క పట్టులన్నింటిని అంగీకరించి నట్లే గాన, చెప్పవలసినదేమియు మిగులదు. వైదిక యజ్ఞమే సంతాన, సంపత్తి, భోగములకు సమ్యక్సాధన మగును; వైదికయజ్ఞము చేతనే ఆకసము నుండి వర్షము దిగును. జాతి పరంపరాభివృద్ధి నందును; జీవనము దేవతలకు, మానవులకు మధ్య నడచు ఒక అవిచ్ఛిన్న వ్యాపారము. మానవులు యజ్ఞాహుతులను దేవతలకు సమర్పింపగా, వీరు మానవులకు తిరిగి సంపత్తిని, సంరక్షణను, సంపుష్టిని ప్రసాదింతురు. కావున కర్మల నన్నింటిని వైదిక యజ్ఞము మఱియు వైదిక పూజతో పాటుగనే చేయవలయును. అట్లు నివేదింపబడని కర్మ శాపగ్రస్తము; యజ్ఞరహితమగు భోగము కేవలపాపము. పరమశ్రేయమునకు సైతము యజ్ఞమే సాధనము. దాని నెప్పుడు విడువరాదు. సంగరహితముగానే యగు గాక – ముముక్షు వైనను వైదిక యజ్ఞమును సాగించవలసినదే. నిస్సంగముగా చేసిన వైదిక యజ్ఞము మఱియు కర్మకాండముచేతనే జనకాదులు సంసిద్ధి నొందిరి.

4. నిజానికి ప్రకృతి ఒక యజ్ఞమే :

స్పష్టముగానే గీతార్థ మిది గాజాలదు; ఏలన తక్కిన గ్రంథ మంతటికి అది విరుద్ధము. చతుర్థాధ్యాయములోని ప్రకాశమయవివరణము నటుంచి, ఇచ్చటనే విశాలతరార్థముయొక్క సూచన మనకు గన్పించును. చూడుడు; యజ్ఞము కర్మ నుంచియు, కర్మ బ్రహ్మనుంచియు, బ్రహ్మ అక్షరమునుండియు పుట్టును; కావున సర్వగతమగు బ్రహ్మ యజ్ఞమునందు ప్రతిష్ఠితమై యుండును (3–15). ఇచ్చటి 'కావున' కు సంబంధించిన తర్కమును, 'బ్రహ్మ' పదముయొక్క పునరుక్తియు అర్థవంతములు. ఏలన, ఈ బ్రహ్మ సర్వగతము గావున, సర్వభూతములందు (6–29), సృష్టియొక్క సర్వక్రియలయందు ఉపస్థితమై యుండు ఏకాత్మగావలయును; శబ్దమునకు, అర్థమునకు అభేదమును వచించు సాంకేతికార్థమునందు మాత్రమే, వేదమునకు అర్థమగు ఈ బ్రహ్మను వేదమని చెప్పవలయును గాని వాచ్యార్థమునందు గాదు, వేద మన భగవంతుని దెలుపు జ్ఞానము – "సర్వవేదములచేత తెలియదగిన వాడను నేనే" (15–15) – అని కృష్ణుడు తర్వాత పలుకును; కాని ఈ వేదజ్ఞానము ప్రకృతికి పరమునందుండుకృష్ణునియొక్క గాక, త్రిగుణక్రియలయం దుండు కృష్ణునియొక్క జ్ఞానము – "త్రైగుణ్య విషయా వేదాః" (2–45). ఈ బ్రహ్మము లేక భగవంతుడు అక్షరపురుషునుండి, అనగా త్రిగుణ క్రియల కతీతముగా నిలిచియుండు

అక్షరాత్మనుండి పుట్టు నని చెప్పుకొనవచ్చును - "నిస్త్రైగుణ్యః" (2-45). బ్రహ్మము ఏకమే గాని, రెండు రూపములలో స్వయంవ్యక్త మగును - అక్షరభావరూపుడగు అక్షరపురుషుడు, క్షరభావమునందలి కర్మల స్రష్టయు, ప్రవర్తకుడు నగు క్షరపురుషుడు (15-16); ప్రథమరూపము అచలము, సర్వగతము నగు వస్తువుల ఆత్మ, ద్వితీయ రూపము వస్తువుల సుచల క్రియయొక్క ఆధ్యాత్మిక తత్త్వము; తనయందు నిలిచియున్న అక్షరపురుషుడు, ప్రకృతియందు పనిచేయుచున్న క్షరపురుషుడు. భగవంతుడు, పురుషోత్తముడు ఈ రెండు రూపములలోను తనను అభివ్యక్తము గావించుకొనును. గుణాతీతుడగు, 'సమం బ్రహ్మ' (5-19) యనబడు అక్షర పురుషునుండి గుణగతుడగు, 'మహేశ్వరు' (5-29) డనబడు క్షరపురుషు డుద్భవించును; సగుణ బ్రహ్మయగు ఇతనినుండి విశ్వశక్తియొక్క కర్మ*లన్నియు ప్రవర్తించును. ఈ కర్మనుండి యజ్ఞతత్త్వ ముత్పన్నమగును. దేవతల, మానవుల నడుమ ద్రవ్యముల ఆదాన ప్రదానము సైతము ఈ యజ్ఞతత్త్వముమీదనే నడుచును. ఉదాహరణకు, వర్షమున కిదియే ఆధారము. ఏలన (సైన్సు వర్షకారణముగా చెప్పు) ప్రకృతి క్రియయంతయు తన నిజరూపమున ఒక 'యజ్ఞమే' యగును. ఇట్టి యజ్ఞము మఱియు తపస్యల భోక్తయు, సర్వభూతమహేశ్వరుడును ప్రకృతిగత భగవంతుడే (5-29). ఇక సర్వగతుడు, యజ్ఞప్రతిష్ఠితుడు నగు ఈ భగవంతు నెఱుంగుటయే యథార్థ వైదిక జ్ఞానము.

5. యజ్ఞము పరప్రాప్తికి మార్గము :

ఈ భగవంతుని, తన శక్తులే యగు దేవతలద్వారా జరుగు నిమ్నక్రియయందును కొంత తెలిసికొనవచ్చును; దేవతలకు, మానవాత్మకు నడుమ నడుచు పరస్పర

*అష్టమాధ్యాయము యొక్క అరంభమునందు గూడ ఈ అర్థమును బోధించు తత్త్వముల క్రమము గలదు- అక్షరము, స్వభావము, కర్మ, క్షరభావము, పురుషుడు. అధియజ్ఞుడు (8-3,4) 'అక్షర' మన అవ్యయబ్రహ్మ లేక ఆత్మ 'స్వభావము' = స్వ+భావము, తన పరిణామ విధానము; ఇది ప్రాణియొక్క మూలస్వభావముగా పనిచేయును; 'అధ్యాత్మ' మనబడు ఇది అక్షరము నుండి ఉద్భవించును. దీనినుంచి కర్మ ప్రసరించి, అన్ని భూతములకు తమతమ రూపములను గలిగించును. ఇట్లు ఈ కర్మయే స్వభావము నుండి 'క్షరభావము' నేర్పఱచును. క్షరభావములోని దివ్యాంశమగు 'పురుషుడు' అధిదైవతము; ఇతనిచేతనే కర్మ యజ్ఞముగా మాఱును. ఈ యజ్ఞమును లోనుంచి స్వీకరించు నిగూఢ భగవంతుడే అధియజ్ఞుడు. - శ్రీరఅవిందుడు

క్రియయందును కొంత తెలిసికొనవచ్చును; పరస్పర పోషకమగు ఈ ఆదాన ప్రదానముచేత పరమశ్రేయస్సునకు అధికాధిక అధికారమును బడయును. ఎట్లు? ప్రకృతియందు జరుగు ఈ దివ్యక్రియయందు తన జీవన మొక భాగమే ననియు; అది తనకు మాత్రమే సంబంధించిన పృథగ్వస్తువు గాదనియు మానవుడు గుర్తించును. తన భోగములును, తన కామతృప్తియు యజ్ఞఫల మనియు, విశ్వవ్యాపారము నడుపు దేవతల ప్రదాన (gift) మనియు నతడు గాంచును; కనుక 'నేనే వీనిని సాధించుకొను చున్నాను, తిరిగి దేవతల కెందు కీయవలయును'-అను అహం మయ పాపభావమున వాని వెంట దగులుట మానుకొనును. ఈ భావమతనిలో పెంపొందుకొలది తన కోరికలకు గౌణస్థాన మిచ్చి, జీవనధర్మముగా యజ్ఞముతో తృప్తిజెంది, తన జీవనమునకు, విశ్వజీవనమునకు మధ్య నడుచు వినిమయమున మిగిలిన దానితో తుష్టినందును. ఎవ డీ యజ్ఞధర్మమునకు ఎదురు నడిచి, తన ప్రత్యేక స్వార్థము నిమిత్తమే భోగములవెంట బడునో, అతని జీవనము నిరర్థకము. అతడు జీవనము యొక్క వాస్తవికార్థమునుండియు, లక్ష్యమునుండియు ప్రయోజనము నుండియు వంచితుడై, ఆత్మయొక్క ఊర్ధ్వపరిణామమును గోల్పోవును; అతని మార్గము పరమశ్రేయోమార్గము గాదు. కాని ఎప్పు డత డిక దేవతలకు గాక, యజ్ఞప్రతిష్ఠితుడైన (3-15) భగవంతునికే యజ్ఞము చేయునో, ఎప్పుడు కామభోగముల పుట్టయగు తన అవరాత్మను విడిచివేసి, తన కర్తృత్వభావమును సర్వకర్మల వాస్తవకర్త్రియగు ప్రకృతియందు సన్యసించునో, తన భోక్తృత్వ భావమును ప్రకృతికర్మల వాస్తవభోక్త యగు దివ్యపురుషుడు, ఉచ్చతర విశ్వాత్మకు సమర్పించునో, అదిగో, అప్పు డతనికి పరమశ్రేయము ప్రాప్తించును. ఇప్పుడతడు ఎట్టి స్వీయభోగమునందు గాక, ఆ విశ్వాత్మయందే తన కేవల తృప్తిని, సంపూర్ణ తుష్టిని, విశుద్ధానందమును బొందును; కర్మ లేక అకర్మచేత అతని కెట్టి ప్రయోజనము లేదు (3-18); దేనికొఱకును దేవతామానవులం దెవ్వరిమీదను ఆధారపడడు; ఇపు డతడు ఆత్మానందముచేతనే పరమతృప్తుడు గాన, దేనినుండియు ఎట్టి లాభమును ఆపేక్షింపడు. కాని అతడు భగవదర్థమే, కామము గాని, సంగము గాని లేక, విశుద్ధయజ్ఞముగా కర్మలను చేయును. ఇట్లతడు సమతను బొంది, త్రిగుణవిముక్తుడు - 'నిస్త్రైగుణ్య' డగును (2-45); ప్రకృతి ప్రవాహమున తన కర్మలు సాగుచున్నను, అతని ఆత్మ మాత్రము

అస్థిర ప్రకృతి విక్షోభమునందు గాక, అక్షర బ్రహ్మప్రశాంతి యందు తన స్థితిని బొందును. ఇట్లతని పరమశ్రేయఃప్రాప్తికి యజ్ఞము* మార్గమగును.

6. మానసిక యజ్ఞము, దార్శనిక యజ్ఞము :

ఈ ప్రకరణార్థ మిదియే నని తర్వాతి వచనములు గూడ స్పష్టపఱచును. చూడుడు; లోకసంగ్రహమే కర్మధ్యేయ మని వక్కాణించబడును (3–20); కర్మకర్త్రి కేవలప్రకృతియే యనియు, వానిని సమముగా ధరించువాడు దివ్యపురుషుడే యనియు, కర్మల అనుష్ఠానమునుగూడ అతనికే అర్పించవలయు (3–36) ననియు ఉద్బోధింపబడును. కర్మల ఆంతరసన్యాసమునందు సైతము వాని బాహ్యాచరణము – ఇదియే యజ్ఞపరాకాష్ఠ. మఱియు నిట్టి యజ్ఞఫలము కర్మబంధమునుండి విముక్తి యనియు గట్టిగా చెప్పబడును – "లభించిన దానితో సంతుష్టుడును సాఫల్యా వైఫల్యముల యందు సముడును నగువాడు చేయుచున్నను కర్మబద్ధుడు గాడు (4–22). ముక్తమానవుడు గతసంగుడై యజ్ఞార్థము కర్మచేయు నపుడు, అతని కర్మ యంతయు కరిగిపోవును" (4–23). అనగా, అది అతని విశుద్ధాత్మపై ఎట్టి బంధన ఫలితమును, పశ్చాత్సంస్కారమును విడువదు. ఇంకను, వీనికి పిమ్మట గీతాభాషయందలి యజ్ఞార్థము యొక్క విస్పష్ట, సవివరవ్యాఖ్యానము మనకు లభించును; అది యజ్ఞపదముయొక్క రూపక (symbolic) ప్రయోగమును గుఱించియు, మానసిక స్వభావము గుఱించియు ఎట్టి సంశయమునకు తావివ్వదు. ప్రాచీన వైదికవిధానమునందు సర్వదా ద్వివిధార్థ ముండెను – భౌతికము మఱియు మానసికము, బాహ్యము మఱియు సంకేతాత్మకము(symbolic), యజ్ఞము యొక్క బాహ్యరూపము మఱియు ఆరూపముయొక్క ఆంతర్యము. కాని అప్పటి వైదిక ఋషుల నిగూఢ సంకేతవిధానము ఇప్పటికి విస్మృతిసాగరమున అస్తమించగా, దాని స్థానమున, వేదాంతము మఱియు ఇప్పటి యోగభావము ననుసరించు మఱియొక విశాల దార్శనిక సంకేతవిధానము వచ్చినది. చూడుడు: యజ్ఞాగ్ని యనగా

*కేవల ఆత్మరతి గుణరాహిత్యము మాత్రమే ఈ గుణరాహిత్య పదమునుండి యజ్ఞ మార్గమున గుణాతీత పదమును ప్రాప్తించినపుడే. నిజమగు గుణవిముక్తి నిస్త్రైగుణ్యభావము ప్రాప్తించును. అనగా గుణరాహిత్యము కర్మచేయుచునే కర్మకు పైనుండు గుణాతీత భావము నందు పరిపూర్తి నందును.

భౌతికాగ్ని కాదు బ్రహ్మరూపమగు అగ్ని (4-24), లేక బ్రహ్మాభిముఖమగు శక్తి, అంతరాగ్ని; దీనియందే ఆహుతి చేయవలయును (4-25). లేక అగ్నియన సంయమ రూపాగ్ని, లేక విశుద్ధ ఇంద్రియవృత్తి (4-26). లేక అది ఆత్మజ్ఞానరూపమగు అగ్ని (4-28), ఇదియే పరమయజ్ఞాగ్ని. మఱియు యజ్ఞశేషముగా ప్రాప్తించిన ఆహారము 'అమృతము' (4-31). వేదకాలమున సోమరసమునే అమృత మనెడివారు; అనగా అమృతత్త్వమున కదియే భౌతికసంకేతము. ఇట్లు ఈ మాత్రపు వైదికసంకేతము ఇక్కడను గ్రహించబడినది. కాగా ఈ సాంకేతిక యజ్ఞమునందలి ఆహుతి భౌతిక లేక మానసిక శక్తియొక్క ఎట్టి క్రియయైనను గావచ్చును; అది దేవతలకు గాని, భగవంతునికి గాని, అక్షరాత్మకుగాని, మానవుని ఉన్నతాత్మకు గాని, మానవజాతి మఱియు సర్వభూతముల ఆత్మకు గాని అర్పింపబడవచ్చును.

7. జ్ఞాన యజ్ఞము స్వరూపము :

యజ్ఞము యొక్క ఈ విస్తృత వివరణము బ్రహ్మయే యజ్ఞాంగములన్నియును సమగ్ర నిర్వచనముతో ఉపక్రమించును – "బ్రహ్మయే అర్పణక్రియ, బ్రహ్మయే హవిస్సు, బ్రహ్మచేతనే బ్రహ్మరూపాగ్నిలో వేల్చబడును, కర్మరూపమగు బ్రహ్మయందలి సమాధిచేత ప్రాప్యమును బ్రహ్మయే. ఇదిగో, ఈ జ్ఞానమునందే విముక్తమానవుడు యజ్ఞకర్మల నాచరించవలయును. వేదాంత మహావాక్యములచేత పూర్వము ప్రోక్తమైన జ్ఞానమే ఇది – 'సోఽహం' (బృ,ఉ), 'సర్వం ఖల్విదం బ్రహ్మ' (ఛాం.ఉ). 'అయ మాత్మా బ్రహ్మ' (మాం.ఉ). ఇది సంపూర్ణ ఏకత్వజ్ఞానము. ఆ ఏకమే కర్తృ క్రియా కర్మరూపములుగాను, జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయరూపములుగాను అభివ్యక్తమైనది. ఏ విశ్వశక్తి లోనికి కర్మను వేల్తుమో అది భగవంతుడు; వేల్చునట్టి సంస్కృతశక్తి భగవంతుడు; దేనిని దేనిని వేల్తుమో అదియు భగవంతునియొక్క ఒక రూపము; వేల్చు యజమానుడు స్వయముగా మానవునిలోని భగవంతుడు; యజ్ఞకర్మ క్రియాగతుడును భగవంతుడే, యజ్ఞగమ్యమును భగవంతుడే. ఈ జ్ఞానము గలిగి, దీనియందు నివసించు వానికి బంధించు కర్మయే ఉండదు. స్వార్థపరాయణ వైయక్తిక క్రియయే ఉండదు. తన దివ్య ప్రకృతిచేత, తన సత్తయందు వ్యవహరించుచు, సర్వమును తన స్వయంజ్ఞాత విశ్వశక్తియందు వేల్చుచుండు దివ్యపురుషుడు మాత్రమే ఉన్నాడు; కాగా అతనితో ఏకీభూతమైన అంతరాత్మ అతని దివ్య సత్తాచేతనలను తెలిసికొని, తనవి

గావించుకొనుటయే భగవంతుడు నడుపుచున్న ఈ సమస్తవ్యాపారమునకు ఏకమాత్రలక్ష్యము. ఇట్లెటింగి, ఏకతాసాధకమగు ఈ చేతనయందు నివసించుట, కర్మచేయుటయే విముక్తత యగును.

8. వివిధ యజ్ఞములు :

యోగులలో సైతము అందరు ఈ జ్ఞానము నందుకొనలేదు. "కొందరు యోగులు దేవతాయజ్ఞము ననుష్ఠింతురు; ఇతరులు యజ్ఞమును, యజ్ఞముచేతనే బ్రహ్మాగ్ని యందు వేల్తురు" (4–25). ఇందు పూర్వులు భగవంతుని వివిధ దేవతా రూపములలో భావించి, వివిధ మార్గములచే, ధర్మములచే, అనగా నిశ్చిత క్రియలచే అతనిని బొందజూతురు. ఇక భగవంతు నిప్పటికే ఎటింగియున్న రెండవవారికి ఎట్టి కర్మ నైనను అతని కర్పించుటయే, అతని ఏకీకృతచేతనలోనికి ధారవోయుటయే ఏకమాత్ర సాధనము, 'ధర్మము'. యజ్ఞసాధనములు వివిధములు, యజ్ఞహవ్యములు నానావిధములు. ఆత్మసంయమము మటియు ఆత్మశిక్షణరూపమగు మానసికయజ్ఞము గలదు, ఇది ఉచ్చతర ఆత్మప్రాప్తి మటియు ఆత్మజ్ఞానముకు మార్గము. "కొందరు ఇంద్రియములను సంయమాగ్నులయందు ఆహుతిచేయగా, కొందరు విషయములను ఇంద్రియాగ్నులయందు ఆహుతిచేయుదురు (4–26). ఇతరులు ఇంద్రియకర్మ లన్నింటిని, ప్రాణకర్మ లన్నింటిని జ్ఞానముచే వెలిగించబడిన ఆత్మసంయమయోగ రూపమగు అగ్నియందు వేల్తురు" (4–27). ఇంద్రియాగ్నుల యందు ఆహుతి యనగా, మనస్సు చలించని విధముగా విషయములను ఇంద్రియములలోనికి స్వీకరించు సాధన; ఇంద్రియములను వేల్చుట యనగా, ఇంద్రియములను ఉపశమింపజేసి, మనఃక్రియ యను తెరవెనుక నుండు ఆత్మను తన ప్రశాంత నిశ్చలరూపమున జూపు సాధన. ఇట్లు ఆత్మ దృష్టమైనపుడు ప్రాణేంద్రియ కర్మల నన్నింటిని ఆ ప్రశాంతాత్మలోనికి స్వీకరించు సాధన ఆత్మసంయమయోగము. ఇట్లే ద్రవ్యయజ్ఞము, తపోయజ్ఞము, మున్నుగా గల యజ్ఞము లన్నియు సత్త్వవిశుద్ధికి మార్గములు; కనుక సర్వయజ్ఞము పరమప్రాప్తికి సాధనమే.

9. యజ్ఞతత్త్వము, యజ్ఞఫలము :

ఈ యజ్ఞభేదము లన్నింటియందును గల సముద్ధారకతత్త్వ మేమన, నిమ్న క్రియలను స్వాధీనము చేసికొందుము; కామప్రాబల్యమును తగ్గించి, దానిస్థానమున

ఉచ్చతరశక్తిని ప్రవేశపెట్టుదుము; దివ్యతరానందముకొఱకు అహంకారికభోగమును వదులుకొందుము - ఈ దివ్యతరానందము యజ్ఞముచేతను, ఆత్మసమర్పణము చేతను, ఆత్మవశిత్వముచేతను, ఉచ్చతరలక్ష్యముచేతను మనకు లభించును - "యజ్ఞ శేషరూపమ ు అమృతమును భుజించువారు సనాతన బ్రహ్మమును బొందుదురు" (4-31). యజ్ఞమే సృష్టిధర్మము, యజ్ఞము వినా ఏదియు లభించదు - "యజ్ఞ రహితునికి ఇహమే లేనపుడు పర మెక్కడిది?" (4-31). ఇట్లు బహువిధ యజ్ఞములు "బ్రహ్మముఖమునందు విస్తృతములైనవి" (4-32). బ్రహ్మముఖమనగా (ముఖము వలె) మన అహుతులను స్వీకరించు దివ్యాగ్ని; ఈ యజ్ఞములన్నియు క్రియాప్రవిష్టమైన ఒకే మహాసత్తయొక్క రూపములు, దానికి సాధనములు. మానవుని బాహ్యసత్త ఈ మహాసత్తలో భాగము, అతని ఆత్మ దీనితో ఏకము; అతని క్రియ నంతను దీని కర్పించుటకు యజ్ఞములు సాధనములు. ఈ యజ్ఞములు 'కర్మజాతములు' (4-32); అనగా అవి దైవశక్తినుండి ప్రభవించి, దానిచేతనే నడుపబడును; ఆ దైవశక్తి విశ్వకర్మ యందు అభివ్యక్తమై, ఆ కర్మను అధికాధికముగా ఏకమాత్రాత్మకు, ఈశ్వరునకు యజ్ఞాహుతి గావించును; దీని చరమదశగా మానవునకు ఆత్మజ్ఞానము, దైవచేతనా ప్రాప్తియు ఘటించును. "ఇట్లు తెలిసికొని నీవు విముక్తుడవగుదువు" (4-32).

10. జ్ఞానయజ్ఞము :

అయితే ఈ వివిధ యజ్ఞశ్రేణిలో పెక్కు అంతస్తులు గలవు - ద్రవ్యయజ్ఞము నిమ్నతమము, జ్ఞానయజ్ఞము ఉచ్చతమము. ఏది సర్వకర్మకు పర్యవసానమో (సర్వకర్మయు దేనియందు అంతమై, చివరకు దేని రూపము ధరించునో) అదియే జ్ఞానము (4-33). ఇది ఎట్టి నిమ్నజ్ఞానము గాదు. పరంతు అత్యున్నత ఆత్మజ్ఞానము మఱియు భగవత్జ్ఞానము. సృష్టితత్త్వములను వాస్తవముగా దర్శించిన గురూత్తముల నుండియే దీనిని మనము పొందగలము (4-34); ఇది లభించినపుడు మనస్సు కల్పించు విమోహములోగాని, ఇంద్రియజ్ఞానము, కామవ్యాపారము కల్పించు బంధనములో గాని మన మిక పడిపోము. ఏ జ్ఞానమునందు సమస్తము పర్యవసించునో, అట్టి మహోన్నతజ్ఞానముచేత "సర్వభూతములను అశేషముగా నీవు ఆత్మయందును, పిమ్మట నాయందును జూడగలవు" (4-34). కారణము, ఈ ఆత్మ ఏకము, అక్షరము, సర్వగతము, సర్వగర్భము, స్వయంసిద్ధమునగు మూలసత్త లేక బ్రహ్మము;

మనోమయసత్త మఱుగున నుండు ఈ ఆత్మలోనికి అహం విముక్తమై నపుడు, మన చేతన విస్తరించును; అపుడు అన్ని భూతములను ఈ ఏకసత్తలోపల భావము లనుగా (as becomings) చూడగలము.

11. "ఆత్మయందు, పిమ్మట నాయందు :

కాని ఈ ఆత్మ లేక అక్షరబ్రహ్మము గూడ మన వాస్తవిక (essential) అంతశ్చేతనకు ఒక పరమపురుషుని (భగవంతుని) యొక్క స్వీయప్రకటనముగా గన్పించును; ఇతడే మన సత్తామూలము, జీవనమూలమును; క్షరాక్షరములు రెండును ఇతని అభివ్యక్తియే, ఇతడే దేవుడు, భగవంతుడు, పురుషోత్తముడు. అతనికే సమస్తమును మనము యజ్ఞముగా నర్పింతుము; అతని హస్తములలోనికే మనము మన కర్మలను సన్యసింతుము; అతని భావమునందే మనము నివసింతుము, చరింతుము; మన ప్రకృతియందు, అతనితోను, అతనియందలి సమస్తవిశ్వముతోను ఏకమై, అతనితోను, సర్వభూతములతోను ఏకాత్మకుల మగుదుము, ఏకశక్తికులము నగుదుము. అతని పరమసత్తతో మన స్వీయసత్తను అభిన్నముగా నెఱింగి, ఏకము చేతుము. కామమునకు స్వస్తిచెప్పి చేసిన యజ్ఞకర్మలద్వారా మన ఆత్మ నెఱింగి, ఆత్మవంతుల మగుదుము; తర్వాత ఆత్మజ్ఞానమునందును, ఈశ్వరజ్ఞానమునందును చేసిన కర్మలద్వారా దివ్యసత్తయొక్క ఏకతాశాంతి సమ్మోదములలోనికి మనము విముక్తుల మగుదుము.

13. యజ్ఞేశ్వరుడు

1. వేదాంత సత్య సంగ్రహము :

ఇంకను ముందుకు పోకపూర్వము, ఇంతదనుక చెప్పినదాని సారమును సమీక్షించుకొనుటమంచిది. గీతయొక్క కర్మసిద్ధాంత మంతయు దాని యజ్ఞభావముపై నాధారపడి యుండును; భగవంతుని, ప్రపంచమును, కర్మను కలుపు సత్యము ఈ యజ్ఞమునందే యున్నది. మానవమనస్సు సాధారణముగా ఒక బహుముఖ సనాతన సృష్టిసత్యముయొక్క ఆంశికభావములను చేపట్టి, వానిమీదనే జీవనము, సదాచారము, మతములకు సంబంధించిన తన వివిధ సిద్ధాంతములను నిర్మించును; వాని ఈ చిహ్నమునో, ఆ రూపమునో వత్తిచెప్పును. కాని అట్టి మనస్సే ఒక ప్రకాశమయ యుగము ప్రారంభించినపుడు, ఈశ్వరజ్ఞానముతోను, ఆత్మజ్ఞానముతోను ప్రపంచ జ్ఞానమునకు గల సమగ్ర సంబంధమునకు మేల్కొనక తప్పదు. గీతా సిద్ధాంత మీ మౌలిక వేదాంతసత్యముపై విశ్రమించియుండును – సత్తాయంతయు ఏకమాత్ర బ్రహ్మమే (13–31), సృష్టి యంతయు బ్రహ్మచక్రమే (3–16), భగవంతుని నుండి ప్రభవించి, భగవంతునిలోనికి తిరిగివచ్చు దివ్యగతియే. ఈచక్రమంతయు సత్యమును ప్రకటించు ప్రకృతివ్యాపారము; భగవచ్ఛక్తియగు ఈ ప్రకృతి తన కర్మల నియామకుడును, తన రూపములందలి నివాసియు నగు దివ్యపురుషుని చేతనకు, సంకల్పమునకు కార్యరూపమును గల్పించును. అతని నిమిత్తమే ఆమె వస్తువుల నామరూపములలోని కవతరించి, మునిగిపోయి, తిరిగి మనస్సు మఱియు ఆత్మజ్ఞానముద్వారా ఈ పురుషుని సచేతనముగా బొందును. ముందు ఆత్మయు, ఆత్మతత్త్వము, ఆత్మాశయము–అంతయు బాహ్యవస్తువుల నామరూప పరిణామములో మునిగిపోయి, పిమ్మట ఆత్మాదిక మంతయు తిరిగి పరిణామ మార్గమున ప్రకట మగును. దివ్యపురుషు డేకకాలమున మూడు శాశ్వతావస్థలను ధరించి, నిర్వహించనిచో, ఈ ప్రకృతిచక్ర మిట్లు ప్రవర్తించజాలదు; కారణము, ఇందలి ప్రతి అవస్థయు ప్రకృతిక్రియాసమగ్రతకు ఆవశ్యకము. 1. పురుషుడు క్షరభావమున తనను ప్రకటించు కొనక తప్పదు; ఇచ్చ టతనిని పరిచ్ఛిన్నముగా, అనేకముగా, సర్వభూతములుగా జూతుము (15–16). అత డిచ్చట అనంతవైవిధ్యములతో, నానాసంబంధములతో గూడిన అసంఖ్యాకజీవులుగా గోచరించును; మఱియు ఈ వైవిధ్యముల మఱుగునుండి

విశ్వవ్యాపారమును నడుపు దేవతల ఆత్మగాను, శక్తిగాను అతడు పొడకట్టును -- మన దృష్టి కీ దేవతలు ఒకే పరమసత్తయొక్క విభిన్న విశ్వవ్యాపిరూపము లగుదురు; అథవా ఒకే పరమపురుషుని వ్యక్తిత్వముయొక్క వివిధ ఆవిర్భావము లగుదురు. 2. పిమ్మట సర్వరూపములు మఱియు భావముల వెనుకను, లోపలను గూఢముగా నున్న అక్షరభావమునుగూడ మనము కనుగొందుము; అది అనంతము, కాలాతీతము, అవైయక్తికము (impersonal); అది సర్వసృష్టియొక్క ఏకమాత్ర అవ్యయతత్త్వము; అది ఉన్న సర్వము యొక్క అవిభాజ్య ఆత్మ; చరాచరము లన్నియు ఈ ఆత్మయందు తాము ఏక మని దర్శించును. కనుక తిరిగి ఈ ఆత్మను చేరుకొనినపుడు, వ్యష్టిజీవుని యొక్క సక్రియ పరిచ్ఛిన్నవ్యక్తిత్వము విశ్వవ్యాపకతయొక్క ప్రశాంతవిశాలత లోనికి తనను విముక్తము చేసికొనగల నని గాంచును; అటులే సర్వముతోను ఈ ఆత్మకు గల నిర్లిప్త ఏకత్వమునందలి శాంతిసమతలలోనికి తనను విముక్తము చేసికొనగలదు. అథవా వ్యక్తి ఈ ఆత్మయందు తన వ్యష్టిభావమునే రద్దుగావించుకొనవచ్చును. 3. కాని ఉత్తమరహస్యము పురుషోత్తముడు. ఇతడు పరబ్రహ్మ, పరమేశ్వరుడు; ఇతడు అనంతాత్మను, సాంతజీవుని - ఉభయమును ధరించును; ఇతనియందు సగుణ నిర్గుణములును, ఏకాత్మ బహుభూతములును, సత్తాసంభూతులును, విశ్వక్రియయు, విశ్వాతీతశాంతియు, అనగా ప్రవృత్తి నివృత్తులును - అన్నియు కలిసికొనును. ఏకమగును; ఒకదాని సరసను ఒకటియు, ఒకదానిలో నొకటియు ధరించబడును. ఈ భగవంతునియందు సర్వవస్తువులు తమ రహస్య సత్యమును, తమ పరిపూర్ణ సమాధానమును బొందును.

2. సక్రియసత్తాస్వరూపమే యజ్ఞము :

కర్మ యంతయు సత్తాసత్యమును బట్టియే యుండవలయును. ఇక సక్రియ సత్త యంతయు లోలోపల ప్రకృతి పురుషుని కర్పించు కర్మయజ్ఞమే - ప్రకృతి అనంత పరమాత్మకు తనయందలి అనేకమగు సాంత జీవాత్మయొక్క కోరిక నర్పించు చుండును (అనగా కోరిక ననుసరించి కర్మ నర్పించుచుండును). జీవనమొక యజ్ఞవేదిక, దానియందు ప్రకృతి తన కర్మలను, కర్మఫలములను నివేదించును. ఎవరికి? తనలోని చేతన ఇంతదనుక చేరుకొనిన భగవద్రూపమునకు; దేనికొఱకు? తనయందలి జీవాత్మ తన తాత్కాలికశ్రేయముగానో, పరమశ్రేయముగానో గ్రహించిన

ఫలితమునకు. అనగా, జీవాత్మ అందుకొనిన చేతనాస్తరమును బట్టియే తాను ఆరాధించు దేవుడును, అన్వేషించు సుఖమును, ఆశించు యజ్ఞఫలితమునుండును. మఱియు క్షరపురుషుని వ్యాపార మంతయు ఆంతరాదానప్రదానముగానే యుండును. ఉండవలయును; ఏలన ఏకమేయగు సత్తావిభాగములన్నియు పరస్పరాశ్రయ సూత్రము ననుసరించి జీవించక తప్పదు; అటులే అవి పెంపొందును. ఎచ్చట యజ్ఞము ఐచ్ఛికముగా సమర్పించబడదో, అక్కడ ప్రకృతి దానిని బలాత్కారముగా గుంజుకొని, తన జీవనధర్మమును పాలించును. పరస్పర ఆదానప్రదానమే ఈ జీవన ధర్మము; ఇది లేనిదే జీవన మొక్క క్షణముమనజాలదు; యజ్ఞమును తమ శాశ్వతసహచరుని గావించి, ప్రజాపతి ప్రజలను సృజించె ననుట కిదియే నిదర్శనము. ప్రపంచము భగవంతునినుండి వెలువడెను. భగవంతునికి జెందును; జీవనము భగవంతుని రాజ్యము, మఱియు ఆరాధనాగృహమే గాని, అహంకార స్వీయ తృప్తికి క్షేత్రము కాదనుటకు ఈ సార్వత్రికయజ్ఞధర్మమే స్పష్టసంకేతము. అహంకార పూరణము ప్రారంభమునందలి ప్రాకృత అజ్ఞానావస్థ మాత్రమే; కాగా జీవనానుభవము యొక్క చరమ ఉద్దేశ్యము భగవద్దర్శనము, దర్శించిన అనంతభగవంతునియొక్క ఉపాసనా పూర్వకమగు అన్వేషణ; దీనికి సాధన పరిపూర్ణ ఆత్మజ్ఞానముమీద ప్రతిష్ఠితమై, పరిపూర్ణ ఆత్మనివేదన యందు పర్యవసించు యజ్ఞము, నిరంతరము వర్ధమానయజ్ఞము.

3. అజ్ఞానచర్య :

వైయక్తికజీవనము అజ్ఞానముతో ఆరంభించి, చిరకాల మజ్ఞానమునందే కొనసాగును. తన జ్ఞానము మాత్రమే తీక్ష్ణముగా నుండుటచేత, అతడు భగవంతుడు గాక, అహంకారమే జీవనకారణము మఱియు సర్వార్థ మని భావించును. అతడు తానే కర్మకర్త యని తలంచును గాని, స్వీయ బహిరంతర కర్మలతో సైతము జీవన క్రియలన్నియు విశ్వప్రకృతి క్రియాకలాపమే యని కాంచడు. అతడు తననే కర్మభోక్తగా జూచుకొనుచు, తన నిమిత్తమే సర్వము వర్తించుచున్న దని తలపోయును; కావున ప్రకృతి తన తృప్తిని సాధించుటకు తన ఇచ్ఛకు విధేయమై యుండవలయును. కాని తన ఇచ్ఛను గణించనే గణించక, విశ్వేచ్ఛకు విధేయమై, ప్రకృతి తనకు, తన కర్మకు, తన సృష్టికి అధీశ్వరుడగు భగవంతునే తృప్తి పఱుప జూచు నని అతడు చూడడు. నిజానికి అతని సత్తాసంకల్పములు, అతని కామనాపరితృప్తులు సైతము

అతనివి గాక, ప్రకృతివే; వీని నన్నింటిని ఆమె తాను సాధించవలసిన భగవంతుని లక్ష్యమునకు, పైకి గన్పించని సాధనావ్యాపారము గావించుకొనును. అహంకార ముద్రితమైన ఇట్టి అజ్ఞానకారణమున, జీవుడు యజ్ఞధర్మమును లక్ష్యపెట్టక, వీలైనంత తనకొఱకే లాగికొన జూచుచు, ప్రకృతి బలాత్కరించిన మేరకే ఇతరులకు విడుచును; నిజానికి ప్రకృతి తన భాగముగా అనుమతించిన దానిని తప్ప, ఆమెయందలి ఈశ్వరశక్తులు తన వాంఛకు వదిలిన దానిని తప్ప, అత డేమియు తీసికొనజాలడు. అహంకారిక జీవుడు ఈ యజ్ఞమయప్రపంచమున దొంగవంటి వాడు; ఏలన ఈశ్వరశక్తులు అనుగ్రహించినదానిని అపహరించుటయే గాని, తిరిగి సమర్పింప నొల్లడు. అతడు జీవిత వాస్తవపురుషార్థమునుండి వంచితుడగును; తన జీవన, కర్మలను యజ్ఞముద్వారా తన సత్తా విస్తరణకును, సముద్ధరణకును ఉపయోగించు కొనడు గాన, వ్యర్థజీవను డగును.

4. నైతిక, ధార్మికములు అవాంతర సోపానములు :

వైయక్తికజీవుడు తనవంటివారే ఇతరులనియు, తన అవసరములవంటివే ఇతరుల అవసరము లనియు నెపుడు జూడ నారంభించునో, అటులే తన క్రియాకలాపముల వెనుక విశ్వప్రకృతిహస్తము నెపుడు పసికట్టునో, మఱియు అధికారిక దేవతలద్వారా (వారి మూలమగు) ఏకేశ్వరుని ఎపు డించుక దర్శించునో, అపుడు మాత్రమే అతడు తన అహంకారమును దాటి, ఆత్మను కనుగొను మార్గమున అడుగిడును. అతడు కామేతరమగు వేఱొక సూత్రమును కనుగొని, కామమును దాని కథీనముజేయ నారంభించును; అనగా తన అహంమయసత్తాస్థానమున అతడు నైతికసత్తను వికసింపజేయును; తన కోర్కెలకంటె ఇతరుల కోర్కెలకే ఎక్కువ విలువ నిచ్చును; అట్లు పరార్థచింతనకు ప్రాధాన్య మిచ్చి, తన సత్తాచేతనల విస్తరణకు దారిచేయును. పిమ్మట ప్రకృతిని, ప్రకృతిగత దైవశక్తులను అతడు గ్రహించ నారంభించును; ఈ శక్తులకే అతడు యజ్ఞము నర్పించవలయును; ఏలన ఇవియే తమ ధర్మము ననుసరించి బాహ్యాభ్యంతర జగుత్తును నియమించును. మఱియు తన బుద్ధిసంకల్పములందును, జీవనచర్యయందును దైవశక్తిరూపమగు ఈ దేవతల సన్నిధిని, మహిమను వృద్ధిగావించుకొనుటద్వారానే, తనశక్తి జ్ఞానములను, సముచిత కర్మను వృద్ధిగావించుకొనగలనని అతడు – వైయక్తికజీవుడు–నేర్చుకొనును. అట్లతడు

తన భౌతిక, అహంమయ జీవనదృష్టికి భౌతికాతీత, మతవిషయక జీవనదృష్టిని జోడించి, సాంతమునుండి అనంతమునకెగయ ఆయత్తుడగును.

5. ఆత్మజ్ఞానమునందే సర్వశ్రేష్ఠయోగము :

కాని ఇది యంతయు అవాంతరసోపానము మాత్రమే. ఏలన ఈ స్థితి ఇంకను కామచోదనకు, అహంకారావసరములకు, ప్రకృతి క్రియలకు లోబడియే యున్నది - ఈ కామము నియమితము, ఈ అహంకారము శోధితము, ఈ ప్రకృతి ఉత్తమ గుణమగు సత్త్వదీప్తము గావచ్చును. అది వేఱు విషయము. క్షేత్రము మిక్కిలి విస్తరించినదే యైనను, ఇది యంతయు ఇంకను క్షర, సాంత, వైయక్తిక క్షేత్రములోనిదే. వాస్తవ ఆత్మజ్ఞానము, కనుకనే సమీచీన కర్మమార్గము ఆవలనే యున్నది; ఏలన జ్ఞానసహితయజ్ఞమే ఉత్తమయజ్ఞము, అదియే శ్రేష్ఠ కర్మమార్గమును జూపును. తనయందలి ఆత్మయు, ఇతరులయందలి ఆత్మయు, ఒకే సత్తయనియు, ఈ ఆత్మ అహంకారమును మించిన అనంత, నైర్వ్యక్తిక విశ్వభావమనియు, ఈ భావమునందే సమస్తభూతములు చరించుచు, తమ ఉనికిని గలిగియున్న వనియు ఎఱింగి నపుడు, శ్రేష్ఠ కర్మసిద్ధించును; ఇందు నిమిత్త మింకను అతడు, తాను యజ్ఞము నర్పించు వైశ్వదేవత లందరు ఒకే అనంతదేవుని విభిన్నరూపము లనియు, ఈ దేవుడే, పరిమిత భావనలను పరిత్యజించినపుడు, వర్ణింప నలవికాని పరమపురుష డనియు అతడు తెలియవలయును. ఈ పరమపురుష డేకకాలమున సాంతము, అనంతము నగును; ఏకాత్మయు, అనేకజీవులు నగును; ఇతడు ప్రకృతిద్వారా అభివ్యక్తు డగుచున్నను, ప్రకృతి కతీతడు; అనంతగుణములద్వారా తన సత్తాశక్తికి రూపము దిద్దుచున్నను, గుణములు విధించు పరిమితి కతీతుడు. ఇతడే పురుషోత్తముడు (15-18). యజ్ఞము నర్పించవలసినది చివరి కితనికే - అయితే ఎట్టి నశ్వర, స్వకీయ కర్మఫలమునకు గాక, భగవంతుని బొంది, జీవాత్మ పరమపురుషునితో సామరస్య సాయుజ్యములందు నివసించునిమిత్తమే.

6. నైర్వ్యక్తికత పరిపూర్ణతామార్గము :

తాత్పర్యము, విముక్తి మఱియు పరిపూర్ణతకు మానవుని మార్గము. అధికాధిక నైర్వ్యక్తితద్వారా సాగును. విశుద్ధము, సమున్నతము, ఏకము, సర్వసమము నగు ఏ నైర్వ్యక్తికము, అనంతము గలదో, దాని కెంతెంత మానవుడు ఉన్మీలితు డగునో,

అంతంత తన బంధములు సడలునని అతని సంతతానుభవము; అంతంత విశాలతను, ప్రశాంతిని, విశుద్ధసుఖమును చవిచూడవచ్చు నని అతని అనుభవము చెప్పును. సొంతము స్వయముగా నివ్వగలిగిన, లేక అహంకారము తన సత్తచేతనే పొందగల సుఖము, సంతోషము, తృప్తి అనిత్యము, క్షుద్రము, అభద్రము. అహంభావములోను, దాని పరిమిత భావనలు, శక్తులు, పరితృప్తులలోను నివసించుట యన ఈ ప్రపంచము సదా "అనిత్యం అసుఖం" (9-33) అని అనుభవము బొందుటయే యగును. సొంతజీవనమును నిస్సారతాభావము సదా వేధించుచునే యుండును; కారణము, సొంతము జీవనముయొక్క సమగ్ర సత్యమును గాదు. సర్వోచ్చసత్యమును గాదు; అనంతతా భావములోనికి ప్రవేశించువఱకు జీవనము పూర్ణముగా సత్య మనిపించుకొనదు. ఈ కారణముచేతనే, బ్రాహ్మీచేతనను, నైర్వ్యక్తిక జీవనమును ఒత్తిచెప్పుటతోనే గీత తన కర్మసందేశమును ప్రారంభించును. ఏలన తనకు పై నున్న అక్షరబ్రహ్మమునందే ప్రపంచముయొక్క బహువిధ క్షరవ్యాపార మంతయు తన సుస్థిర, సుభద్ర, సుశాంత ప్రతిష్ఠను బొందును. ఈ ప్రపంచ సత్యమును గాంతు మేని, మన సత్తయొక్క చేతనను, స్థితిని సొంతవ్యక్తిత్వమునుండి అనంత, నైర్వ్యక్తిక బ్రహ్మములోనికి సముద్ధరించుటయే ఆధ్యాత్మికముగా ప్రథమావశ్యకత యని కాంచగలము. ఇట్టి బ్రహ్మ లేక అక్షరాత్మయందు సర్వభూతము లను జూచు జ్ఞానము అహంమయమగు అజ్ఞానము, దాని కర్మలు, కర్మఫలముల నుండి అంతరాత్మను ఉద్ధరించు జ్ఞానమగును; కాగా తదాత్మయందు నివసింపసాగుదు మేని శాంతిని, సుస్థిర ఆధ్యాత్మిక ప్రతిష్ఠను బొందినవార మగుదుము.

7. కర్మప్రవాహమునందు గూడ కర్మ సన్యాసము :

ఈ మహాపరివర్తనమును సాధించు విధానము ద్వివిధమార్గము ననుసరించును; విడివిడిగా గల జ్ఞానయోగ కర్మయోగములను గీత దృఢముగా అనుసంధించును. జ్ఞానయోగ మన బుద్ధిని ఇంద్రియమనోవ్యాపారములందు మునిగిపోవు అధోగతి నుండి మఱలించి, ఊర్ధ్వముగా ఆత్మ అనగా పురుషుడు లేక బ్రహ్మమునకు త్రిప్పుట యగును; ఇచ్చట బుద్ధి బహుశాఖలుగా చీలు మనఃసంకల్పములందు గాక, సదా ఏకాత్మభావనయందే నివసించును. కేవల మీ మార్గము కర్మల సంపూర్ణ సన్యాసమునకు, అచలనిష్క్రియతకు, ప్రకృతినుండి పురుషవిచ్ఛేదమునకు దారి తీయుచున్నట్లు

గన్పించును. కాని వస్తుతః అట్టి పరిపూర్ణసన్యాసము, నిష్క్రియత విచ్ఛేదము సంభవమే గావు. ప్రకృతిపురుషులు సత్తయొక్క విడదీయరాని యుగళతత్త్వములు. దేహధారులమై యున్నంతకాలము (18-11), ప్రకృతియందు మనకుకర్మలు తప్పవు; అయితే అవి అప్రబుద్ధాత్మయొక్క కర్మలనుండి ఒక విభిన్నరూపమును, అధవా విభిన్నార్థమును సంతరించుకొనవచ్చును. సన్యాసముండితీరవలసినదే, కాని వాస్తవసన్యాసముకర్మ నుంచి పలాయనము గాదు, అహంకార, కామముల హననము. దీనికి మార్గము, కర్మ సేయుచునే కర్మఫల సంగమును విడనావలయును; పిమ్మట ప్రకృతినే కర్మకర్త్రిగా గుర్తించి, ఆమె కర్మలకడ్డురాగూడదు; తర్వాత ఆత్మయందు సాక్షిగా, భర్తగా నివసించుచు, ఆమె కర్మలు, లేక కర్మఫలములందు సక్తుడు గాక, ఆమెను కేవలము చూచుచు, ధరించుచు, నుండవలయును. ఇప్పుడు పరిచ్ఛిన్న, పరిక్లిష్ట అహంపురుషుడు ఏకమాత్ర నైర్వ్యక్తికాత్మ చేతనయందు ప్రశమించి, సంలీనమగును; కాగా ప్రకృతి కర్మలు మన దృష్టికి సర్వభూతములద్వారా సాగుచుండును, మఱియు నీ సర్వభూతములు పూర్తిగా ఆమె ప్రేరణక్రింద ఆత్మయొక్క అనంతసత్తయందు నివసించుచు,చేష్టించుచు, చరించుచున్నట్లు గన్పించును. మన వ్యష్టిభావము సైతము ఈ భూతములలో నొకటిగానే కన్పించును; దాని కర్మలు మన వాస్తవాత్మయొక్క గాక, ప్రకృతి కర్మలుగానే కన్పించును. అహంకారము వానిని తనకు ఆపాదించుకొనెను గాన, ఇంతదనుక కర్మలను మనవిగా భావించితిమి. అహంకారమును వధించి, మన సత్తాచేతనల యందు నైర్వ్యక్తికతను సాధించి యున్నాము; కామమును సన్యసించి, ప్రకృతికర్మల యందు నైర్వ్యక్తికతను సాధించి యున్నాము. ఇపుడు అకర్మయందు గాక, కర్మయందును విముక్తులము (4-21); ఇప్పుడు మన స్వేచ్ఛ దైహికనిశ్చలత యందును, మానసిక శూన్యతయందును ఆధారపడియుండదు; కర్మను స్పృశించిన వెంటనే విముక్తి నుండి పడిపోవుటయు జరుగదు. ప్రకృతి ప్రవాహమునందు సైతము మనయందలి నైర్వ్యక్తికాత్మ నిశ్చల విముక్తముగానే యుండును.

8. యజ్ఞ మెవరికి, ఎందుకు?

ఈ పరిపూర్ణ నైర్వ్యక్తికత ప్రసాదించు విముక్తి వాస్తవము, సంపూర్ణము, ఆవశ్యకము; కాని ఇదియే చివరి మాటయా; బోధనాపర్యవసానమా? సమస్త జీవనము, సమగ్రసృష్టివ్యాపారము ప్రకృతి పురుషుని కర్పించు యజ్ఞమని మనము సూత్రీకరించియున్నాము - ఈ పురుషుడు ప్రకృతియందు నిగూఢముగా నుండు

ఏకాత్మ, ఇతనియందే ప్రకృతిక్రియ లన్నియు జరుగును; కాని ఈ వాస్తవార్థము అహంకారకామములచేత ఆచ్ఛన్నమగుచున్నది. నైర్వ్యక్తికత నాశ్రయించి, మనము అహంకార, కామ, పరిమితవ్యక్తిత్వముల బారినుండి బైటబడినాము; నైర్వ్యక్తిక బ్రహ్మభావమును బొందినాము; దేనియందు సమస్తము వర్తించునో, అట్టి అక్షరాత్మతో మన సత్తను ఏకముగావించినాము. ఇప్పుడిక మనచేత గాక, ప్రకృతిచేతనే పరిచాలిత మగు కర్మయజ్ఞము సాగుచునేయున్నది. అయితే ఎవని కీ యజ్ఞము ఏ లక్ష్యముతో చేయబడుచ్నుది? ఏల ఈ ప్రశ్న ఉదయించు ననిన, అక్షరాత్మకు ఏ క్రియయు లేదు, ఏ కామము లేదు, ఏ ప్రాప్యవస్తువు లేదు; అది దేనికిని దేనిని ఆశ్రయించదు (3-18); అది తనకొఱకే, తన ఆత్మానందమునందే తన అక్షర సనాతనసత్తయందే వర్తించును. ఈ నైర్వ్యక్తిక ఆత్మభావమును, ఆత్మసుఖమును ప్రాపించు నిమిత్తము ఆదిలో మనము ఫల మాశించక కర్మచేయవలసిన ఆవశ్యకత యుండవచ్చును; కాని ఒకసారి ప్రాపించిన పిమ్మట కర్మ ప్రయోజనమంతమగును; యజ్ఞ మిక అవసరము లేదు, ప్రకృతిక్రియ కొనసాగును గనుక, అప్పుడును మన కర్మ కొనసాగవచ్చును; కాని ఆ కర్మ కిక ఎట్టి అధిక ప్రయోజనము నుండదు; ప్రకృతి నిర్బంధమే దానికి ఏకమాత్రకారణము. సత్యమిదియే యగుచో, నిర్బంధము విధించు మేరకు మాత్రమే శరీరకర్మలను తగ్గించి వేసికొనవచ్చును. ఇక రెండవ విషయ మేమన, అకర్మ సైతము లక్ష్యము గాదు (3-18) గావున, కర్మను కనీస పరిమాణమునకు తగ్గించకపోయినను, కర్మగుణ దోషములను పాటించ బనిలేదు. ఉదాహరణకు, అర్జునుడు జ్ఞానముబొందిన పిమ్మట, తన పూర్వ సంస్కారమును బట్టి కురుక్షేత్ర యుద్ధమును సాధించవచ్చును. అథవా తన నూతన నివృత్తి ప్రేరణ ననుసరించి సన్యాసిజీవనమును గడుపవచ్చును. అతని కేది యైనను ఒకటే; లేక రెండవదియే ఇంచుక మంచిది. ఏలన అది తన పూర్వ సంస్కారముల బలమును త్వరగా తగ్గించివేయగా, అతడు అనంతనైర్వ్యక్తికములోనికి పదిలముగా ప్రయాణము కట్టును: అతని కిక అనిత్యము, అసుఖము నగు ఈ ఉన్మత్తలోకములో తిరిగి జన్మించవలసిన అగత్యముండదు.

9. యజ్ఞము పురుషోత్తమునికి :

కర్మగుణదోషములను బాటించబనిలే దని ఒకవేళ గీత చెప్పుచో, దాని ప్రధాన లక్ష్యమే భగ్నమగును. కాని కర్మగుణదోషములను బాటించవలసియేయుండు నని

గీత వక్కాణించును; మఱియు జ్ఞానము పిమ్మట, కర్మ కొనసాగించుటకు ఏ లక్ష్యము లేని ప్రకృతినిర్బంధము మాత్రమే గాక, లక్ష్యముతో గూడిన ఒక ఆదేశము సైతము గలదని ఒత్తిచెప్పును. అహంకారము నిర్జితమైన పిమ్మటను, దివ్యుడగు యజ్ఞేశ్వరుడు, యజ్ఞభోక్తయు నుండును. "భోక్తారం యజ్ఞ తపసాం" (5-29), మఱియు యజ్ఞమున కొక లక్ష్యమును ఉండును. నిర్గుణ బ్రహ్మము మాత్రమే మన సత్తయొక్క పరమ రహస్యము గాదు; ఏలన సగుణ నిర్గుణములు, సాంతానంతములు ఒక దివ్యపురుషుని యొక్క రెండు విరోధిపార్శ్వములు, అయినను సహవర్తిపార్శ్వములని చివరకు తేలగలదు; ఈ దివ్యపురుషుడు ఈ విభేదములచే పరిమితుడు గాక, ఒకేసారి రెండును అగును. భగవంతడు సదా అనభివ్యక్తమగు అనంతము, కాని సాంతమున సదా అభివ్యక్తముచేసికొన స్వయంప్రేరితుడు. అతడు మహా నైర్వ్యక్తిక మూలపురుషుడు, అయినను వ్యక్తిత్వము లన్నియు అతని ఆంశికరూపములే; మానవుని హృదయనిష్ఠుడై, మానవసత్తయందు తనను ప్రకటించుకొను దేవు డతడు (18-61). ఏకమాత్ర నైర్వ్యక్తికాత్మయందు సర్వభూతములను జూడు డని జ్ఞానము మనకు బోధించును; కారణము, అట్లు పృథక్కర అహంభావము నుండి విముక్తుల మగుదుము. పిమ్మట ఈ విమోచక నైర్వ్యక్తికత ద్వారా సర్వభూతములను ఈ భగవంతునియందు జూడు డని చెప్పును – "ఆత్మని అథో మయి" (4-35), "ఆత్మయందు పిమ్మట నాయందు." మన అహంకారము లేక పరిచ్ఛేదక వ్యక్తిత్వము, అన్నింటిని తన యందు గలిగి, అన్నిటియందు నుండు భగవంతుని గుర్తించనీయదు. నిమ్న వ్యక్తిత్వముద్వారాకాక, మన సత్తయొక్క అనంత నైర్వ్యక్తిక భాగముద్వారానే భగవంతుని చేరుకొనవలయును; మఱియు సర్వసమమగు ఏకాత్మ యైనపుడే, మన మీ నైర్వ్యక్తికమును గనుగొనగలము. ఆత్మరూపమగు ఈ అనంతము సమస్త సాంతరూపములను తనలో ధరించును గాని, బహిష్కరించదు; ఈ నైర్వ్యక్తికము సకల వ్యష్టిత్వములను, వ్యక్తిత్వములను స్వీకరించును గాని, పరిత్యజించదు; ఈ నిశ్చలము సర్వప్రకృతిచలనములను భరించును, వ్యాపించును, ధరించును గాని, వానినుండి దూరముగా నుండదు; కనుకనే ఈ ఆత్మ, భగవంతుడు తన సత్తను ప్రకటించుకొనుటకు నిర్మలదర్పణ మగును. కావున మనము ముందుగా అందుకొనవలసిన దీ నైర్వ్యక్తికమునే; వైశ్వ దేవతలద్వారా, సాంతములోని రూపములద్వారా భగవంతుని పరిపూర్ణజ్ఞానము మనకు సమగ్రముగా ప్రాప్తించదు. కాని ఈ నైర్వ్యక్తికాత్మయు భగవంతునియొక్క

సర్వప్రకాశక, సర్వసంతృప్తికర సమగ్రసత్యము గాదు. ఆ సత్యమును గాంచుటకు నైర్వ్యక్తికాత్మ శాంతిలో నుంచి పురుషోత్తముని దిశగా దృష్టిసారించవలయును. ఇతడు తన మహిమ యందు క్షరాక్షరముల రెంటిని ధరించును; అక్షరముయొక్క నిశ్చలతయందు ఆసీనుడై, విశ్వప్రకృతియొక్క సమస్త చలన, క్రియలలో తనను అభివ్యక్తము చేసి కొనును; విముక్త్యనంతరము సైతము ఇతనికి ప్రకృతియందు కర్మయజ్ఞము అర్పింపబడుచునే యుండును.

10. యజ్ఞలక్ష్యము పురుషోత్తమ ప్రాప్తి :

కావున గీతాయోగమునకు వాస్తవలక్ష్యము దివ్యపురుషోత్తమునితో ఆత్మ పరిపూరక సజీవసాయుజ్యము గాని, నిర్గుణబ్రహ్మమునందు ఆత్మవినాశక కేవల లయము గాదు. సమస్తజీవనమును పురుషోత్తముని దివ్యసత్తలోనికి లేవనెత్తుట; అతనిలో నివసించుట – "మయ్యేవ నివసిష్యసి" (12–8); అతనితో ఏకముగా నుండుట, అతని చేతనతో మన చేతన నేకముచేయుట, మన ఖండప్రకృతిని అతని పూర్ణప్రకృతి కనురూపముగావించుట; మన ఆలోచనయందును, భావమునందును పూర్తిగా అతని జ్ఞానముచేతనే ప్రేరితుల మగుట; ఇచ్ఛయందును, క్రియయందును, సర్వథా, నిర్దుష్టముగా అతని ఇచ్ఛచేతనే నడుపబడుట; అతని ప్రేమానందములలో మన కామమును గోల్పోవుట – ఇదియే మానవుని సంసిద్ధి. దీనినే గీత ఉత్తమ రహస్యముగా వర్ణించును (15–20). ఇదియే మానవజీవనమునకు వాస్తవగమ్యము పరమార్థము, మఱియు మన ప్రగతిశీల కర్మయజ్ఞముయొక్క పరమసోపానము. ఏలన ఆ పురుషోత్తముడే చివరివఱకు కర్మప్రభువుగాను, యజ్ఞభోక్తగాను నిలుచును (5–29).

14. దివ్యకర్మ తత్త్వము

1. ఆధ్యాత్మికప్రభుతకు కీలకము పురుషోత్తముడు :

గీతా కర్మసిద్ధాంతమునకు సంబంధించిన భావ మిదియే. దీని పూర్ణతత్త్వము పురుషోత్తమభావనపై నాధారపడియుండును. ఇక నీ పురుషోత్తమ ప్రతిపాదన గీత చివరి అధ్యాయములలోనే స్పష్టముగా వచ్చును గాన, గీతాక్రమమును అతిక్రమించి, దాని నిక్కడ ముందే ప్రసంగించక తప్పలేదు మనకు. ఇక్కడ గురువు పురుషోత్తమ సన్నిధిని, అక్షరాత్మతో అతనికిగల సంబంధమును మాత్రమే సూచించును. ఇక్కడింకను పురుషోత్తముని పేరెత్తక, ఆ పదమునకు బదులు 'నేను' (కృష్ణుడు) - అను పదమునే బ్రయోగించును - "ఆత్మయందు, పిమ్మట 'నా యందు' (4-35). ఇది కురుక్షేత్రసారథిగా మానవరూపమున అవతరించిన కృష్ణుడు మనకిచ్చిన సూత్రము. ఈ సూత్రముయొక్క ఆశయ మేమన, మన పరిమిత వ్యక్తిత్వమును ముందు నైర్వ్యక్తికాత్మయందు ఒక భాగముగా మాత్రమే చూచి, ఆత్మయందు దాని నతిక్రమించి, ఈ అతీతస్థితిని సాధనముగా జేసికొని, ఆత్మలోపల నిగూఢముగా నున్న మహా నైర్వ్యక్తిక వ్యక్తిత్వమును (పురుషోత్తముని) బొందదగును, ఈ నైర్వ్యక్తిక వ్యక్తిత్వము నైర్వ్యక్తికాత్మయందు శాంతము, నిర్మలము, ప్రకృతి కతీతమై యుండుచునే, ప్రకృతిలోని అసంఖ్యాక జీవులయందు సక్రియమై యుండును. మన నిమ్న పరిచ్ఛిన్న వ్యక్తిత్వమును నైర్వ్యక్తికములో అంతరింపజేసి, చివరకు పురుషోత్తముని పరమ వ్యక్తిత్వముతో సాయుజ్యమును బ్రాపింతుము. ఈ పరమ వ్యక్తిత్వము పృథగ్భూతము, వైయక్తికము గాకపోయినను, సర్వవ్యక్తిత్వములను తానే ధరించును. అంతరాత్మను అక్షరాత్మలో ప్రతిష్ఠించి, గుణముల నిమ్నప్రకృతి నతిక్రమించి, పిమ్మట అనంత పరమేశ్వరుని పరప్రకృతిని చేరుకొనగలము. ఈ పరప్రకృతి నిమ్నప్రకృతి ద్వారా వ్యవహరించుచున్నప్పటికి, నిమ్నప్రకృతి గుణబద్ధము గాదు. శాంతాత్మయందలి నైష్కర్మ్యము నందుకొని, తన కర్మల నొనరింప ప్రకృతి కవకాశ మిచ్చుచు, ఇంకను పైకెగసి, చివరకు దివ్యప్రభుతాప్రతిపత్తి నందుకొనగలము; ఈ ప్రభుత దేనిచేతను బద్ధముగాకనే సర్వకర్మలను జేయగలదు. ఇట్లు ఇచ్చట కృష్ణావతారముగా చూడబడుచున్న పురుషోత్తమభావనయే ఈ దివ్యప్రభుతకు కీలకము. శాంత బ్రహ్మమునే గమ్యముగా జూడుము; ఆగమ్యమును జేరినపుడు, తన సర్వకార్య

కలాపముతో బాటు ప్రపంచమును విడిచివేయక తప్పదు. ఇక అతీత పురుషోత్తమునే గమ్యముగా జూడుము; ఆ గమ్యమును జేరినపుడు, తన సర్వకార్యకలాపముతో బాటు ప్రపంచము, జయించబడి, ప్రపంచాతీతావస్థ యందు దివ్యముగా ధరించబడును. ఏలన పురుషోత్తముడు కర్మాతీతుడయ్యును, దాని ఆధ్యాత్మిక కారణము, లక్ష్యము, మఱియు మూలసంకల్పము. ఇపుడు ప్రపంచము కారాగారమగుటకు బదులు, "సమృద్ధరాజ్యము" (11-3) కాగలదు. ఏలన క్రూరశాసనుడగు అహంకారుని నిర్జించి, కామబంధనమును కత్తిరించి, వైయక్తిక సంపత్తి మఱియు భోగమునను కారాగారమును భంగించి, అసురహస్తమునుండి ప్రపంచమును జయించి యున్నాము. ఇపుడు విముక్తము, విశ్వమయము నైన అంతరాత్మ "స్వరాట్టు" (ఛాం.ఉ) "సమ్రాట్టు" (సృ.ఉ) - ఉభయము నగును.

2. యజ్ఞ కర్మ సామర్థ్యము :

ఇట్లు యజ్ఞకర్మ విముక్తి సాధనమనియు, ఆధ్యాత్మికసంసిద్ధిసాధన మనియు నిరూపించబడినది. ఇటులే ప్రాచీన మహాయోగము ననుసరించి జనకుడు తదితర మహాయోగులు అణుమాత్రము అహంకారిక లక్ష్యము గాని, సంగము గాని లేక, యజ్ఞముగా సమ నిష్కామకర్మ నాచరించి సంసిద్ధిని బొందిరి - "కర్మణైవహిసంసిద్ధి మాస్థితా జనకాదయః" (3-20). మఱియు నిటులే విముక్తిని, సంసిద్ధిని బొందిన పిమ్మట సైతము, ఒక సముదార దివ్యభావమున, ఆధ్యాత్మికరాజాధికారమున కర్మలను కొనసాగించగలము, కొనసాగించవలయును. "లోకసంగ్రహార్థ"మైనను నీవు కర్మ చేయవలయును (3-20). శ్రేష్ఠుడు చేసిన దానినే సామాన్యులనుష్ఠింతురు; అతని ప్రమాణమునే ప్రజలు పాటింతురు (3-21). ఓ పార్థ, ముల్లోకములందును నేను చేయవలసిన దేదియు లేదు, పొందవలసిన దేదియు లేదు; అయినను కర్మమార్గమున వర్తించుచునే యుందును" (3-22) - 'వర్తించుచునే', యొక్క భావమేమనిన, కర్మను సన్యసించకతప్ప దని తలంచు సన్యాసివలె, కర్మను విడిచివేయక, దానియందు వర్తించుచునే యుందును. "ఏలన నేను నిర్నిద్రముగా కర్మపథమున వర్తించ నేని, మనుష్యులును సర్వథా అట్లే చేయుదురు (3-23). కర్మ చేయక జనులు వినాశమున కూలిపోవుదురు మఱియు నేను సంకరకర్తనై, ప్రజానాశమునకు పాల్పడినవాడ నగుదును (3-24). అజ్ఞానులు కర్మసక్తులై ఎటు లాచరింతురో, అటులే జ్ఞాని అసక్తుడై లోకసంగ్రహమును గోరి, కర్మ నాచరింపవలయును (3-25). అతడు

కర్మసంగము గల అజ్ఞానుల బుద్ధిని తికమకపెట్టక, స్వయముగా నాచరించుచు, సర్వకర్మలు చేయ వారిని ప్రోత్సహించవలయును" (3-26). ఈ ఏడు ప్రముఖ శ్లోకములను మించిన వచనములు గీతలోనే అరుదు.

3. గీతాభూమిక మనోభూమికపైన :

అయితే ఆధునిక కర్మవాదము ననుసరించి, ఈ శ్లోకములను వ్యాఖ్యానించరాదు; ఈ కర్మవాదము ఇప్పటి ప్రపంచపరిస్థితులతోనే గాని, సుదూర ఆధ్యాత్మిక సంభవతతో ప్రమేయము పెట్టుకొనదు; ఆధునికచిత్తము నాకర్షించు సమాజసేవ, మున్నగువానికి తాత్త్విక, ధార్మిక ఆధారముగానే ఈ శ్లోకములను వివరింపజూచును. కాని ఈ శ్లోకములు ప్రకటించునది ఉదారమగు నైతిక మఱియు బౌద్ధిక పరోపకార నిష్ఠయొక్క నియమము గాక, భగవంతునితోను, సర్వభూతములతోను ఏకతా సూత్రము. వ్యక్తిని సంఘమునకును, జాతికిని ఆధీనముచేయవలయును, లేక మానవసమష్టికి అహంకారమును బలిపెట్టవలయును-అని ఆ శ్లోకములలోని అదేశము గాదు; కాక, వ్యక్తిని భగవంతునిలో పూరముచేయుము. అహంకారమును సర్వగ్రాహి భగవంతునికి, యజ్ఞము చేయుము- అనియే తదాదేశము. ఆధునిక మనస్సునకు పై నుండు భావములు మఱియు అనుభవముల భూమికలో గీత విహరించును. ఇక నీ మనస్సు అహంకారబంధనములను విదళించివేసికొని పెనుగులాడు దశకు వచ్చినప్పటికి, దాని దృష్టి ఇంకను లౌకికమే, దాని స్వభావ మింకను బౌద్ధికము మఱియు నైతికమే గాని, ఆధ్యాత్మికము గాదు. దేశప్రేమ, విశ్వ బంధుత, సమాజసేవ, సమష్టిభావము, మానవసేవ, మానవతాదర్శనము; ఇవి యన్నియు చక్కని సాధనలే-వ్యక్తి, కుటుంబము, సాంఘిక జాతీయ అహంకారములకు సంబంధించిన మన ప్రాథమికావస్థనుండి తప్పించుకొని ద్వితీయావస్థలో ప్రవేశించుటకు చక్కని సాధనలే. ఈ ద్వితీయావస్థ యందు, బౌద్ధిక, నైతిక, భావికభూమికలో సాధ్యమైన మేరకు, వ్యక్తి తన జీవనమునకు ఇతర జీవుల జీవనముతో గల ఏకతను అనుభవించును. కాని గీతావిచారణ దీనిని మించి, మన వర్ధమాన ఆత్మజ్ఞానమునకు సంబంధించిన ఒక తృతీయావస్థను చేరుకొనును; ద్వితీయావస్థ దీనికి దారితీయు ఆంశికపురోగమన దశ మాత్రమే.

4. అతిమానవుడే గీతాదర్శము :

వ్యక్తిని సమాజాధికారమునకు అధీనముచేయుటే భారతీయ సామాజిక ప్రవృత్తిగా నుండెను; కాని భారతీయుల ధార్మికవిచారణయు, ఆధ్యాత్మికాన్వేషణయు

సదా ఉదార రూపమున వైయక్తికముగానే నిలిచెను. కావున గీతవంటి ఆధ్యాత్మిక శాస్త్రము వ్యక్తివికాసమునకు ప్రథమస్థాన మివ్వక ఎట్లుండగలదు? అది వ్యక్తి యొక్క అత్యున్నతావశ్యకతకు ప్రథమస్థాన మిచ్చును; వ్యక్తి తన ఆధ్యాత్మిక స్వాతంత్ర్యమును, ప్రభుతను కనుగొని ప్రయోగించగలుగుటకు ప్రథమస్థాన మిచ్చును; వ్యక్తి ఆధ్యాత్మిక ద్రష్టగాను, రాజుగాను వికసింపజూచు లక్ష్యమునకు ప్రథమస్థాన మిచ్చును-ఇదియే ప్రాచీన వైదిక ఋషులు ఆదర్శమానవజాతిపరముగా ప్రకటించిన ప్రథమ మహా అధికార ప్రణాళిక (charter). తనను తాను అతిక్ర మించుటయే వారు వ్యక్తికి నిర్ధరించిన గమ్యము; అయితే ఈ అతిక్రమణమును సంఘటితసమాజలక్ష్యములలో తన లక్ష్యములను గోల్పోవుటచేత గాక, ఈశ్వర చేతనలోనికి తనను విస్తరింపజేసికొని, పైకి పెంచుకొనుటచేతనే సాధించవలయును. ఇచ్చటి నియమము (3-25) గీత అతిమానవునకిచ్చిన నియమము. ఈ అతిమానవుడు ప్రభు-మానవుడు (3-43), శ్రేష్టమానవుడు (3-21), దివ్యీకృత మానవుడు (4-10); అయితే నీతసేమహాశయుని అర్థమున గాదు. ఇతడు ఏకాంగీనుడు (one-sided) గాడు; దేవతలవంటి అతి మానవుడును గాడు, రాక్షసుల వంటియు గాడు. కాని ఎవడు తన సమస్తవ్యక్తిత్వమును అతీతము, విశ్వమయమునగు ఏకేశ్వరుని సత్తా చేతన ప్రకృతులలోనికి అర్పించి వేసెనో, మఱియు తన అల్పతరాత్మను గోల్పోయి అధికతరాత్మను బొందెనో, అనగా దివ్యీకృతుడయ్యెనో: అతనికే వర్తించు నీ అతిమానవనామము.

5. లోకసంగ్రహార్థమే అతిమానవుని కర్మ :

అపూర్ణ నిమ్నప్రకృతినుండి - "త్రైగుణ్యమయీ మాయా" (7-13,14)- భగవంతుని సత్తా, చేతనా, ప్రకృతు*ల లోనికి తనను ఉద్ధరించుకొనుటయే- "మద్భావ మాగతాః" (4-10)- యోగలక్ష్యము. ఈ లక్ష్యము సిద్ధించి, మానవుడు తనను ప్రపంచమును అహంకారమూలమగు మిథ్యాదృష్టితో జూడక, అన్ని భూతములను ఆత్మయందును, భగవంతునియందును (4-35) జూచునపుడు, దాని ఫలితముగా అత డెట్టి కర్మ చేయును ? మఱియు అతని కర్మకు విశ్వగత లేక వ్యక్తిగత హేతు వేమై యుండును? "స్థిత ప్రజ్ఞు డెట్లు మాటాడును, ఏ రీతి నుండును, ఏ రీతి

*భగవంతుని సత్తతో ఏకత 'సాయుజ్యము', చేతనతో ఏకత 'సాలోక్యము', ప్రకృతిలో ఏకత 'సాధర్మ్యము', అనగా భగవంతుని సత్త మఱియు కర్మనియమమే మన సత్త మఱియు కర్మనియమ మగుట. - శ్రీ అరవిందుడు

జరించును?" (2-54)- అని అర్జును డడిగిన ప్రశ్న యిదియే; కాని మఱియొక దృక్కోణమునుంచి గురువు దానికి సమాధానము చెప్పును, అట్టివాని కర్మ హేతువు బౌద్ధిక, నైతిక, భావిక భూమికలోని వైయక్తిక కామము గాజాలదు; ఏలన అది పరిత్యజింప ెసినది - పుణ్యపాపములకు పైన వెలుంగుచుండు ప్రశస్త పవిత్రతలో విముక్తమానవుడు ప్రతిష్ఠితుడు గాన, నైతికహేతువును సైతము అతడు పరిత్యజించును. నిస్స్వార్థకర్మచే పరిపూర్ణ అత్మవికాసమును సాధించుకొనుము- అని వచ్చిన ఆధ్యాత్మిక ఆవాహనమును కర్మ హేతువు గాజాలదు; కారణము అట్టి పిలుపు నందుకొని, ఇతఃపూర్వమే ఆ వికాసము సాధించబడినది. కావున అతని కర్మహేతువు లోకసంగ్రహము మాత్రమే కాగలదు- "చికీర్షుర్ లోక సంగ్రహం" (3-25). సుదూర ఆధ్యాత్మికాదర్శము దిశగా సాగుచున్న ప్రయాణములో జనులను ఒక త్రాటిపై నడుపవలయును; వారి బుద్ధిభేదమును (3-26) పరస్పరవిరోధమును బాపవలయును. లేనిచో ఈ బుద్ధిభేదము మసకవెలుగులో పయనించుచున్న ప్రపంచము ఇట్టే వినాశగర్తములోనికి దించును. తమ జ్ఞానము మఱియు బలముచేతను, ఆదేశము మఱియు దృష్టాంతముచేతను, దృశ్యప్రమాణము మఱియు అదృశ్యప్రభావముచేతను శ్రేష్ఠమానవు లీ మహాప్రయాణమును దారితప్పనీయక నడిపింతురు. అయితే ఎవరు శ్రేష్ఠులు? జనసామాన్యమునకు ప్రగతియందు ముందును, అంతస్తునందు పైనను ఉన్న వ్యక్తులే శ్రేష్ఠులు; వీరే జాతి అనుసరించదగు మార్గమును, పాటించదగు ప్రమాణమును, లేక అందుకొనదగు ఆదర్శమును నిర్దేశించగలరు. కాని దివ్యీకృత మానవుడు శ్రేష్ఠుడు- అనుట ఈ సాధారణార్థమున గాదు; అతని ప్రభావమునకు, దృష్టాంతమునకు గల శక్తివిశేషము సాధారణ శ్రేష్ఠుల కందని విషయము. అయితే అత డే దృష్టాంత మిచ్చును? ఏ నియమము లేక ప్రమాణమును నెలకొల్పును ?

6. అవతార దృష్టాంతము :

తన అర్థమును ఎక్కువ చక్కగా సూచించు నిమిత్తము అవతారగురువు తన దృష్టాంతమునే, ప్రమాణమునే అర్జునున కిచ్చును. అత డిట్లు అర్థతః బోధించును- "నేను కర్మమార్గమున వర్తింతును (3-22), దానినే మానవులు అనుసరింతురు. నీవును కర్మచేయుచునే యండవలయును. నావలెనే నీవును కర్మ చేయవలయును. నేను కర్మావశ్యకతకు పై నుందును, కారణము, కర్మవలన పొందదగిన దేదియు లేదు నాకు, అయినను నేను కర్మ చేతును. నీవు నావలె కర్మ చేయుటయే గాక,

ఇట్లు నా రీతిని, నా భావమున కర్మ చేయవలయును. భగవంతుడనగు నేను నియమము ప్రమాణము గూడ; మానవులకు మార్గమును నిర్మించిన వాడను నేనే; మార్గమును, గమ్యమును నేనే. కాని దీనినంతను నేను వ్యాపకరూపమున ఇంచుక మాత్రమే ప్రత్యక్షముగాను, ఎంతో ఎక్కువ పరోక్షముగాను జేతును. నా యీ కర్మవిధానమును నిజముగా మనుజులెఱుంగరు. అయితే నీ వెఱింగి నపుడు దర్శించి నపుడు, దివ్యీకృతమానవుడ వైనపుడు, నేను నా అవతారములందైనట్లే, భగవంతుని వైయక్తికశక్తివి గావలయును, మానవరూపముననే దివ్యదృష్టాంతము గావలయును. బహుజనులు అజ్ఞానమున వసించుచుండగా, ఈశ్వరద్రష్ట జ్ఞానమున నివసించును, నిజమే; కాని తన అతీతభావమున ప్రపంచకర్మలను బరిత్యజించి, ఆ విపత్కర దృష్టాంతము ద్వారా మానవుల బుద్ధిని కలవరపఱచరాదు(3-26); అతడు కర్మసూత్రమును మధ్యలోనే త్రెంచివేయరాదు; నేను నిర్మించిన మార్గముల దశలను, అంతస్తులను తికమకపఱచి, వృథాచేయరాదు. మానవుల కర్మశ్రేణి నంతను నేనే ఏర్పఱచితిని; ఉద్దేశ్యము, అంచెలంచెలుగా వారు నిమ్నమునుండి పరప్రకృతిలోనికి, బాహ్యమగు అదివ్యమునుండి సచేతనమగు దివ్యములోనికి ఆరోహించవలయును. క్రిందినుంచి పైవఱకు మానవకర్మల నన్నింటిని దివ్యమానవుడు చేయును; అయితే తనకొఱకు గాదు, ప్రపంచమునందలి భగవంతునికొఱకు, సర్వభూతములందలి భగవంతునికొఱకు. తనను జూచి, తనవలెనే సర్వభూతములు తమ యందలి భగవంతుని దర్శించగలవు. పైకి తన కర్మలకు ఇతరుల కర్మలకు రూపభేదము గన్పించకపోవచ్చు; అతడు యుద్ధాదులను జేయవచ్చును. కాని అతడు కర్మ చేయు భావము మిక్కిలి భిన్నముగా నుండవలయును; ఈ భావమే తన ప్రభావముచేత మానవులను పైకి, తన స్థాయి కాకర్షించుకొనును, జనసామాన్యమును మఱింత లేవనెత్తు కీలకయంత్ర మగును".

7. అవతారపురుషుడు చేయుచునే చేయడు :

విముక్తమానవునికి భగవంతుడు తన దృష్టాంతము నిచ్చుటలో గభీరమర్మ మున్నది; ఏలన దివ్యకర్మకు గల తాత్త్వికాధారము నంతను అది ఆవిష్కరించును, విముక్తమానవుడన దివ్యప్రకృతిలోనికి తనను ఉద్ధరించుకొనినవాడు గనుక, అతని కర్మ లన్నియు తదగుగుణముగా నుండవలయును. కాని ఏది దివ్యప్రకృతి? అది పూర్తిగా అచల అక్షరాత్మ ప్రకృతి గాదు; ఏలన కేవల మది విముక్తమానవుని నిష్క్రియ

నిశ్చలతలోనకి దింపును. ఇక నది వైయక్తిక, ప్రకృతిబద్ధ క్షర పురుషప్రకృతియు గాదు; ఏలన కేవల మది పురుషుని తిరిగి తన వ్యక్తిత్వమునకు, నిమ్నప్రకృతికి, దాని గుణములకు అధీనముచేయును. పోగా దివ్యప్రకృతి యన పురుషోత్తముని ప్రకృతి. ఇ ు క్షరాక్షరప్రకృతులను సరసను ధరించి, తన పరమదివ్యతయందు వానిని దివ్యముగా సమన్వయపఱచును; ఈ సమన్వయమే తన సత్తయొక్క ఉత్తమరహస్యము- "రహస్యం హ్యేత దుత్తమం" (4-3). ప్రకృతినిమగ్నమగు మన కర్మకు సంబంధించిన వైయక్తికార్థమున అతడు కర్మ కర్త గాడు; ఏలన అతడు తన ప్రకృతిద్వారా కర్మ చేయుచున్నను, ఆ ప్రకృతిలో మునుగక, దాని కధీనము గాక, దానిపై నుండును; మనః ప్రాణ శరీరకర్మలనుండి మనవలె తనను వివేచించుకొనలేని వాడు గాడు. కావుననే అతడు చేయకయే చేయువాడు- "కర్తారం అకర్తారం" (4-13). "చాతుర్వర్ణ్యముయొక్క కర్తను నేనే అయినప్పటికి, నేను అవ్యయ అకర్త ననియే ఎఱుంగుము. కర్మలు నన్నంటవు, నాకు కర్మఫల స్పృహయును లేదు" (4-13,14)- అని కృష్ణుడు వివరించును. అట్లని, పురుషోత్తముడు నిష్క్రియ, నిశ్చల సాక్షిమాత్రు డనియు చెప్పదగదు; ఏలన తన శక్తియొక్క అన్ని అంతస్తులలోను, పరిమాణములలోను పనిచేయున దతడే; ఆశక్తి ప్రతిచలనము, ఆ శక్తి సృజించిన ప్రపంచముయొక్క ప్రతి అణువు అతని సన్నిధిచేత అంతఃప్రేరితము, అతని చేతన చేత పూర్ణము, అతని సంకల్పచోదితము, అతని జ్ఞానరూపితము నగును.

8. నిర్గుణుడును, గుణియును :

పురుషోత్తముడు అకర్తయు, కర్తయునే కాక, నిర్గుణుడును, గుణియును గూడ- "నిర్గుణో గుణీ" (శ్వే. ఉ), అనగా గుణరహితు డైనను సర్వగుణ సంపన్నుడు. అతడు గుణ లేక కర్మబద్ధుడు గాడు. మఱియు మన వ్యక్తిత్వమువలె, గుణకర్మల రాశి గాక, వాని ఉద్గమస్థాన మతడు; ఏ గుణకర్మల నైనను, తన ఇచ్ఛ ననుసరించి ఎంతవఱకైనను పెంపొందింప సమర్థుడు. అతడు అనంత సత్త అవి ఆసత్తయొక్క భావవిశేషములు; అతడు అపరిమేయరాశి, అవి అతిని పరిమేయరూపములు, సంఖ్యలు నై అతనిని రూపాలంకృతము, సంఖ్యాలంకృతము గావించును. అయినను అతడు కేవలము నైర్వ్యక్తిక అనిర్దిష్టమును గాడు; సర్వనిర్దేశములకు మూలద్రవ్యమగు సచేతనపదార్థమాత్రమును గాడు; ప్రత్యుత అతడు ఒక పరమపురుషుడు, ఏకమాత్ర, మూలభూత చిన్మయపురుషుడు, అత్యంత మానవసహజ, ప్రగాఢ సంబంధములను

సైతము వహించగల పూర్ణపురుషుడు. ఉదాహరణకు, అతడు సుహృదుడు, సఖుడు, అనురక్తుడు, లీలాసహచరుడు, పథప్రదర్శకుడు, నియామకుడు, జ్ఞానదాత, లేక ఆనందదాత కాగలడు. అయినను సమస్తసంబంధములందును అతడు అబద్ధుడు, స్వేచ్ఛాయుక్తుడు, కేవలుడు. దివ్యీకృతమానవుడు తన సిద్ధిమేర కిది యంతయు కాగలడు- తన వ్యక్తిత్వమునందే నైర్వ్యక్తికుడు కాగలడు; మానవులతో ఘనిష్ఠ సంబంధములను నెఱపుచున్నపుడు సైతము గుణ లేక కర్మబద్ధుడు గాక యుండగలడు. రాజసమానవుని క్రియా పరత్వము గాని, శమపరాయణుని నిష్క్రియప్రకాశము గాని, అటులే కర్మపరుని ఉద్ధృతవ్యక్తిత్వము గాని, తాత్త్వికమానవుని ఉదాసీన నైర్వ్యక్తికత గాని సంపూర్ణ దివ్యాదర్శము గాదు. ఒక వైపున క్షరతత్త్వముయొక్క కర్మయందు మునిగిన లౌకికమానవుడు, రెండవ వైపున కేవలము అక్షరతత్త్వ శాంతి మాత్రమున నివసింప యత్నించు సన్యాసి - వీరి విరుద్ధప్రమాణము లివి. కాని సంపూర్ణదివ్యా దర్శము పురుషోత్తమప్రకృతినుండి ప్రభవించును; ఈ ప్రకృతి పై పరస్పర విరోధము నతిక్రమించి, సమస్త దివ్య సంభావ్యతలను (possibilities) సమన్వయ పఱచును.

9. శమనిష్ఠమైన కర్మ దివ్యకర్మ :

క్రియాప్రధాన మానవుడు తన మనఃప్రాణశరీరముల కార్యకలాపముయొక్క పరిపూర్తిమీద ఆధారపడని ఎట్టి ఆదర్శముతోను తృప్తి జెందడు. ఆ కార్యకలాపము యొక్క పరమపరిపూర్తియే మానవునియందు సంభవము కాగల దివ్యతకును సంబంధించిన నా అభిప్రాయమని అత డన వచ్చును. క్రియా పరమైన మానవప్రకృతికి సంబంధించిన ఆదర్శము మాత్రమే మానవజీవుని తృప్తి పఱచగలదు; తన మనః ప్రాణశరీరముల క్రియాకలాపమునందు అన్వేషించదగు ఆదర్శ మతనికి గావలయును. ఏలన ఆ క్రియాకలాప మతని స్వభావము, అతని 'ధర్మము'; కాగా తన స్వభావబాహ్యమగు దేనియం దైనను అతనికి పరిపూర్తి ఎట్లు ప్రాప్తించగలదు? ఏలన ప్రతిజీవియు తన స్వభావబద్ధము గాన, దాని లోపలనే తన సిద్ధిని చూచుకొన వలయును. మన మానవస్వభావమునకు అనురూపముగనే మానవసిద్ధి యుండ వలెను; మఱియు ప్రతి మానవుడు సిద్ధినిమిత్తము తన స్వధర్మమార్గముననే యత్నించ వలెను; అయితే జీవన, కర్మలకు వెలుపల గాక, జీవనమునందును, కర్మయందుననే యత్నించవలెను. అవును, క్రియాప్రధాన మానవుని ఈ వాదము నందు కొంత

సత్యము గల దని గీత అంగీకరించును; ఏలన మానవునియందు భగవంతుని పరిపూర్తి, మానవజీవనమున భగవల్లీల, ఆదర్శ ప్రాయసిద్ధియందు ఒక భాగమే. కాని బాహ్యమునందే, జీవనమునందే, క్రియా తత్త్వమునందే వెదకు నేని, ఆ పరిపూర్తిని మానవు డెప్పటికి గనుగొనలేడు. కారణము, అత డపుడు తన స్వభావము ననుసరించి వర్తించును మఱియు నది ఒక సిద్ధి నియమమే యైనను, అది నిమ్నప్రకృతి గనుక, అతడు శాశ్వతముగా దాని గుణములకు, రాగద్వేషములు, సుఖదుఃఖములు మున్నగు ద్వంద్వములకు కట్టు పడియుండును; విశేషించి కామజనకమగు రజోగుణ మతనిని బంధించును కనుక నది సిద్ధి విరుద్ధ నియమము గూడను. ఈ కామము సర్వమును గ్రసించివేయు తత్త్వము, తృప్తిపఱుపరాని తీవ్రానలము (3-39); అనలమును ధూమ మావరించునట్లు, మానవప్రకృతియం దిది జ్ఞానము నావరించి, దాని శాశ్వతశత్రువుగా వర్తించును. నిర్మలము, స్వచ్ఛము, శుభ్రము నగు ఆత్మసత్యమునందు నివసించగలుగుటకు దీనిని వధించివేయవలెను (3-41). ఇట్టి కామఖేలనముతో దూషితమగు నిమ్నప్రకృతిలో మాత్రమే నీవు సిద్ధిని వెదకెదవా ! ఆ ప్రయత్నము నిష్ఫలము. కనుక ముందు నీ ప్రకృతియొక్క కర్మపార్శ్వము తనను శమపార్శ్వముతో జోడించుకొనజూడవలెను; నిమ్నప్రకృతి గుణములకు పరమున భాసించు ఆత్మశాంతి లోనికి నిన్ను నీ వుద్ధరించుకొనవలెను. ఆత్మశాంతిని అధిగమించినపుడు మాత్రమే విముక్త, దివ్యకర్మ చేయ సమర్థుడ వగుదువు.

10. శమవాదము మఱింత విపత్కరము :

రెండవ వైపున శమవాది, సన్యాసికి జీవన, కర్మలతో గూడిన సిద్ధి సంభవమే గాదని కన్పించును. జీవనము మఱియు కర్మ అపూర్ణతకును, బంధనమునకును ఆలవాలము గావా? పొగలేని నిప్పు ఉండనట్లు, సమస్తకర్మయు స్వభావముచేతనే సదోషము గాదా? కర్మతత్త్వము కామపితయగు రజోగుణము గాదా ? ఈ కామము జ్ఞానము నావరించివేయదా? దీని ఫలితముగా జయాపజయములు, సుఖదుః ఖములు, పాపపుణ్యములు మనలను వేధించవా? భగవంతుడు ప్రపంచములో నుండవచ్చును గాని, దానిలో భాగము గాడు; అతడు సన్యాసభగవంతుడేగాని, కర్మప్రభువు లేక కర్మకారణము గాడు. మన కర్మప్రభువు కామము, కర్మ కారణము అజ్ఞానము, ఒక విధముగా క్షర ప్రపంచము భగవంతుని అభివ్యక్తి లేక లీలయే

అయినను, అది అజ్ఞానముతో నెఱపు అపూర్ణలీల. కావున అది భగవంతుని అభివ్యక్తి గాక, ఆవరణమే యగును. ప్రపంచగతిని పరికించినంతనే ఇది తెలిసిపోవును- క్షరప్రపంచ మొక అజ్ఞానచక్రము గాదా? కామకృతమగు జననమరణచక్రమునకు అది ఆత్మను కట్టివేయదా? కామకర్మలు క్షయించుదనుక ఇది సాగుచునే యుండదా? కామమునే గాదు, కర్మనుగూడ త్రోసివేయవలయును; అపుడే అంతరాత్మ శాంతాత్మయందు నెలకొని, నిశ్చల, నిష్క్రియ, కేవల బ్రహ్మములోనికి గతించిపోవును. ఇది నైర్వ్యక్తికబ్రహ్మ సాధకుడగు సన్యాసి లేవదీయు పూర్వపక్షము. దీనిని పరిష్కరింప గీత ఎంతో ఎక్కువ శ్రమజేయును; కేవలకర్మవాదికి సమాధానము చెప్ప ఇంత శ్రమ ఆవశ్యకము గాదు. ఏలన ఈ సన్యాసవాదములోని సత్యము సమగ్రము లేక ఉచ్చతమము గాకపోయినను, ఉచ్చతరము, శక్తిమత్తరము. కావున ఇదియే మానవజీవితమునకు ఉచ్చతమాదర్శమని ఉద్ఘోషించు సన్యాసవాదము కేవల కర్మవాదముకంటె మానవజాతిపురోగతికి ఎక్కువ భ్రాంతిజనకము, విపత్కరము గావచ్చును. ఒక పటిష్ఠ పాక్షికసత్యము పూర్ణసత్యముగా ప్రతిపాదించబడి నప్పుడు, పటిష్ఠప్రకాశముగానే గాక, పటిష్ఠభ్రాంతిని గూడ బుట్టించును. కర్మవాదమునందలి భ్రాంతి నిమ్నప్రకృతిలో సిద్ధిని వెదకించుచు, అజ్ఞానమును పొడగించి, మానవ పురోగతిని కేవలము కుంఠితము గావించ గలదు; కాని సన్యాసవాదము నందలి భ్రాంతిలో ప్రపంచవినాశతత్త్వమే గర్భితముగా నుండును. దీనిని నే ననువర్తించుచో, సంకరకర్తనై, ప్రజావినాశనమును గావించినవాడ నగుదును (3-24) - అని కృష్ణుడు ప్రవచించును. ఇక శ్రేష్ఠ మానవుని తప్పు జాతి నంతను విధ్వంసము గావించిలేక పోయినను, విస్తృతసంకరమును బుట్టించి స్వభావతః మానవజీవన సూత్రమునకు వినాశకరమును, నిశ్చిత పురోగమనమార్గమునకు విక్షోభకరమును గావచ్చును.

11. శమవాద కర్మవాద సమన్వయము :

కావున మానవునిలోని శమప్రవృత్తి తన అసంపూర్తిని గుర్తించునట్లును, కర్మప్రవృత్తి వెనుక నున్న సత్యమును తనతో సమానస్థాయిలో అంగీకరించునట్లును జేయవలెను - కర్మప్రవృత్తివెనుక నున్న సత్య మన మానవునియందు భగవంతుని పరిపూర్తి మఱియు మానవజాతి సమస్తక్రియలోను భగవంతుని సన్నిధి. భగవంతుడు శమములోనే గాక, కర్మయందును గలడు. ఒక వైపున ప్రకృతిప్రభావితము గాని

ఉదాసీనాత్మ యొక్క శమభావము; రెండవ వైపున పురుషయజ్ఞ (చూడుడు, పురుషసూక్తము) మనబడు ప్రపంచమహాయజ్ఞము సిద్ధించుటకు ప్రకృతికి తనను స్వయముగా సమర్పించుకొనుచున్న ప్రకృతిగతాత్మయొక్క క్రియా భావము- ఇవి సంతతము సంఘర్షించుకొను సత్యమును, అనృతమును గావు; అటులే అన్యోన్య విఘాతకమగు ఉత్కృష్ట, నికృష్ట విరుద్ధసత్యములును గావు. పోగా, అవి భగవదభి వ్యక్తికి ఆవశ్యకమగు ద్వివిధసత్యము, తమ పరిపూర్తికి అక్షర మొక్కటే యావత్కాలకము, పరమరహస్యము గాదు. తదుభయ పరి పూర్తిని, సమాధానమును పురుషోత్తమునిలో వెదకనగును. దివ్యీకృతమానవుడు ఆ పురుషోత్తముని ప్రకృతిలో ప్రవేశించి నపుడు, అతని వలెనే కర్మ చేయునే గాని, అకర్మకు తన సంకితము జేసికొనడు. భగవంతుడు అజ్ఞానదశయందును, జ్ఞాన దశయందును మానవునిలో పనిచేయుచున్నాడు. (తన కల్యాణమునకు పనిచేయు) అట్టి భగవంతు నెఱుంగుటయే ఆత్మయొక్క పరమ కల్యాణము, సంసిద్ధినియమము. ఆ భగవంతుని అతీతశాంతి, శమరూపమున నెఱుంగుటయే సమస్తమును గాదు, గ్రహించవలసిన రహస్యము ఏకకాలమున ద్వివిధము- అజ, సనాతన భగవంతుని రహస్యము (4-6); దివ్యజన్మ మఱియు కర్మ రహస్యము (4-9). ఏత దుభయ విధ జ్ఞానమునుండి ప్రభవించు కర్మ సర్వబంధవిముక్త మగును (4-14), జన్మ చక్రమునుండి తప్పించుకొనుటకు సైతము ఈ ద్వివిధజ్ఞానము వాస్తవ విశాల మార్గము- "నా జన్మకర్మల, వాని నిజతత్త్వమున ఎవ డెఱుంగునో, అతడు దేహము విడిచినపుడు, ఓ అర్జున ! తిరిగి జన్మించడు" (4-9), దివ్యజన్మయొక్క జ్ఞానముద్వారాను, స్వామ్యము (possession) ద్వారాను సర్వభూతాత్మరూపమున నుండు అజ, అవ్యయ భగవంతుని సాధకుడు చేరుకొనును; ఒక దివ్యకర్మయొక్క జ్ఞానముద్వారాను, నిర్వహణద్వారాను సాధకుడు కర్మనియామకుడు, భూతమహేశ్వరుడు (4-6) నగు భగవంతుని చేరుకొనును.

15. అవతార సంభవత, ప్రయోజనములు

1. సమగ్ర సంపూర్ణ యోగము

గీతాయోగము జ్ఞానసహిత యజ్ఞకర్మయోగము; దీనియందు కర్మ జ్ఞానము లేక మగును; కర్మ జ్ఞానమునందు పూర్ణత నందును; జ్ఞానము కర్మను ధరించి, మార్చి, ప్రదీప్తము గావించును; మఱియు నుభయము పురుషోత్తమునికి నివేదించ బడును; ఇతడు శాశ్వతముగా మన హృదయాంతరాళమున రహస్యరూపమున ఆసీనుడై, మన సత్తను, కర్మను శాసించు ప్రభువు (18-61) ఇట్లు లోపల నభివ్యక్తమగు నితడు నారాయణు డనబడును. ఇతడు మానవాకారమున గూడ అవతారనామముతో అభివ్యక్తుడై, తన దివ్యజన్మచే మానవభావమును వశముచేసికొనును. అస్తు' ఇట్టి యోగమును ఉపదేశించుచు, కృష్ణుడు తానే ఈ ప్రాచీన మూలయోగమును సూర్యునకు ప్రవచించితి నని ప్రసంగవశమున పలుకును. కాగా సూర్యుడు మానవ జాతిపితయగు మనువునకు, మనువు ఇక్ష్వాకునకు ఉపదేశించెను (4-1) ఇట్లు రాజర్షి పరంపరలో దిగివచ్చిన ఈ యోగము చిరకాలమునకు నశించిపోగా (4-2), భగవానుడు అర్జునునకు తిరిగి బోధించెను; ఏలన అర్జునుడు అనురక్తుడు మఱియు భక్తుడు, బంధువు మఱియు సఖుడు (4-3), ఈ యోగము ఉత్తమరహస్య (4-3) మని పలికి, కృష్ణుడు సర్వయోగములపై దీని ఆధిక్యమును వక్కాణించును; ఏలన అవి అవ్యక్తిక (impersonal) బ్రహ్మమునకో, సవ్యక్తిక (personal) దేవతకో దారితీయగా, అచ్చట నిష్క్రియజ్ఞానములోనో, అంతర్లీన ఆనందములోనో ముక్తిమాత్రము లభించును. కాని ఈ యోగము ఉత్తమరహస్యమును, సంపూర్ణరహస్యమును ప్రసాదించును; దివ్యశాంతితో గూడిన దివ్యకర్మలకు లేవనెత్తును; ఒక పరిపూర్ణ స్వేచ్ఛలో ఏకీభూతమైన దివ్యజ్ఞానము, క్రియ, సుఖములలోని కుద్ధరించును; భగవంతుని పరమసత్త, భగవంతుని అభివ్యక్తసత్త యొక్క విభిన్న మఱియు విరుద్ధ శక్తులను, తత్త్వములను తనలోనే ఎట్లు సంగతము గావించి, ఏకముచేసికొనునో, అట్లే ఈ యోగము తక్కిన యోగమార్గము లన్నింటిని తనలోనికి గ్రహించి, ఏకము చేసికొనును. కావున కొందరు వాదించు నట్లు, గీతాయోగము యోగత్రయములోని నిమ్నతమమగు కర్మయోగము మాత్రమే గాదు; ప్రత్యుత మన సత్తయొక్క సర్వశక్తులను భగవదున్ముఖము గావించు అత్యున్నతమగు సమగ్ర, సంపూర్ణయోగము.

2. కృష్ణుడు తన అవతారభావమును ప్రకటించును

సూర్యదేవుడు, సూర్యవంశమూలపురుషుడు ఎప్పుడో పుట్టగా, ఇప్పుడుపుట్టిన నీవు అతని కుపదేశించియుండుట ఎట్లు సంభవము?– అని అర్జునుడు, ఆ మాటను మిక్కిలి స్థూలార్థమున స్వీకరించి, కృష్ణుని ప్రశ్నించును. సూర్యు డన జ్ఞానరూపుడు, బహిరంతః ప్రకాశప్రదాత యగు దేవుడు– "భర్గోసవితుర్ దేవస్య యో నో ధియః ప్రచోదయాత్" (గాయత్రి); అట్టి సూర్యునకు ఈ వచనము సర్వ జ్ఞానమూలమగు భగవంతుడుగా నే నుపదేశించితి నని, మన మాశించు నట్లు, కృష్ణుడు సమాధానము చెప్పలేదు; దానికి బదులు అర్జును డిచ్చిన అవకాశమును, "నేను దేహము ధరించిన భగవంతుడను, అవతారమును" – అని ప్రకటించుటకు వినియోగించుకొనుచు.

3. అవతార వర్ణనము

రెండవ వ్యాసమున దివ్యగురుప్రసక్తియందు అవతారసిద్ధాంతమును, వేదాంత దృష్టి ననుసరించి, మనము సంక్షేమముగా ప్రతిపాదించియే యున్నాము; వేదాంత దృష్టియే గీతాదృష్టియును, ఇపుడు మన మీ అవతారతత్త్వమును, దివ్యజన్మమర్మమును మఱింత లోతుగా పరిశీలించ వలయును – దివ్యజన్మ బాహ్యరూపమే అవతారము; ఏలన గీతాసమగ్ర బోధనయందు ఇది యొక ముఖ్యతర అనుసంధానము (link, లింకు), ఇపుడు గీతాపదములలో అవతార స్వరూప ప్రయోజనములను జూతము : "ఓ అర్జునా ! నాకును, నీకును అనేకజన్మలు గతించినవి; వాని నన్నింటిని ఓ పరంతపా ! నే నెఱుంగుదును, నీ వెఱుంగవు (4–5), నే నజుడ నయ్యును, సర్వభూతములకు ఈశ్వరుడనయ్యును, నా ప్రకృతిని ఆధీనమునం దుంచుకొని, ఆత్మమాయచేత సంభవింతును (4–6). కారణము, ఎపు డెపుడు ధర్మము కృశించి, అధర్మము పైకి లేచునో, అపుడపుడు నన్ను నేను సృజించుకొందును (4–7), సాధువులను పరిరక్షించుటకు, దుష్టులను ధ్వంసమొనరించుటకు, ధర్మమునకు పట్టముగట్టుటకు యుగయుగమున నేను జన్మింతును (4–8), ఎవడిట్లు నా దివ్యజన్మను, దివ్యకర్మను తమ నిజతత్త్వములందు తెలిసికొనునో, అతడు శరీరము విడిచినపుడు తిరిగి జన్మకు రాక, అర్జునా, నా కడకే వచ్చును (4–9). రాగము, భయము, క్రోధములనుండి విడివడి, మన్మయులై, నన్నే ఆశ్రయించి, జ్ఞానతపస్సుచేత పరిపూతులై ఎందరో మద్భావమును బొందిరి, అనగా నా ప్రకృతిని – పురుషోత్తమ ప్రకృతిని – బొందిరి (4–10), మనుజులే మార్గమున నన్ను చేరుదురో, ఆ

మార్గముననే వారిని నా ప్రేమలోనికి స్వీకరింతును– "భజామి." అయా మార్గము లన్నియు ఓ పార్థ, నేను వేసిన మార్గములే గదా !" (4–11).

4. జ్ఞానసహితయజ్ఞము దుష్కరము

గీతయింకను ఇట్లు చెప్పుకొనిపోవును; తమ కర్మసిద్ధిని కాంక్షించుచు, పెక్కుమంది ఏకేశ్వరునియొక్క వివిధరూపములు, వ్యక్తిత్వములు నగు దేవతలకు యజ్ఞము చేతురు; ఏలన జ్ఞానరహిత కర్మవలన గలుగు సిద్ధి మానవలోకమున శీఘ్రముగా సులభముగా లభించును (4–12); నిజానికి ఆ సిద్ధి మానవలోకమున మాత్రమే లభించును. కాగా మానవునియందు భగవంతుని స్వయంపరిపూర్తియను రెండవ సిద్ధి ఎంతో ఎక్కువ దుష్కరము; ఏలన అది ఏకేశ్వరుని జ్ఞానము గలిగి, అతనికి జేయు జ్ఞానసహితయజ్ఞముచేత బ్రాప్తించును. ఈ యజ్ఞఫలితములు ఉచ్చతర భూమికకు జెందును గాన, అవి అంత తేలికగా చిక్కునవి గావు. కావుననే ద్వితీయసిద్ధి నిమిత్తము మానవులు తమ గుణ, కర్మల చతుర్విధ ధర్మము నవ లంబించవలసి యుండును, మఱియు నీ పార్థివకర్మభూమిక యందు వారు భగవంతుని తన విభూతులద్వారా అన్వేషింతురు (10–16–17). కాని నేను చతుర్విధకర్మకర్త నైనను, చతుర్విధధర్మ స్రష్ట నైనను, అకర్తను, అవ్యయాత్మ ననియు తెలిసికొనుమని కృష్ణుడు బోధించును (4–13). "కర్మలు నన్నంటవు. మఱియు నాకు కర్మ ఫలస్పృహయు లేదు" (4–14). కారణము, ఈ ఆహంకారిక వ్యక్తిత్వ మునకును, ఈ ప్రకృతిగుణ సంఘర్షణమునకును పైన భాసించు అవ్యక్తికాత్మ భగవంతుడు; మఱియు అవ్యక్తిక వ్యక్తిత్వమగు తన పురుషోత్తమరూపమున గూడ భగవంతుడు కర్మయందు సైతము ఈ పరమ విముక్తిని గలిగియుండును, కావున దివ్యకర్మల జేయువాడు చతుర్విధ ధర్మము ననుష్ఠించుచున్నపుడు సైతము, పైన భాసించు అవ్యక్తికాత్మను తెలిసికొని అందును, తద్ద్వారా పురుషోత్తమునియందును నివసింపవలయును. "ఎవ డిట్లు నన్నెఱుంగునో, అతడు కర్మబద్ధుడు గాడు (4–14). పూర్వముముక్షువులు గూడ ఇట్లెఱింగి కర్మ గావించిరి. కావున పార్థ, నీవును పూర్వులు చేసిన పూర్వతరకర్మను చేయుము" (4–15).

5. అవతారమునకు రెండు పార్శ్వములు

4–వపేరాలో ఇవ్వబడిన (4–12, 13, 14, 15) శ్లోకాల తాత్పర్యము 'దివ్యకర్మ' స్వభావమును వివరించును– క్రిందటి వ్యాసమున ఈ దివ్యకర్మతత్వమును మనము

చర్చించితిమి. కాగా 3-వ పేరాలో పూర్తిగా అనువదింపబడిన (4-5....11) శ్లోకాలు 'దివ్యజన్మ' ప్రకారమును వివరించును. కాని ధర్మ సంస్థాపన మొక్కటే అవతార ప్రయోజనము గాదని మన మిక్కడ జాగ్రత్తగా స్పష్టముచేయ దగును. ఏలన అది ఒక క్రీస్తు, ఒక కృష్ణుడు, ఒక బుద్ధుడు అభివ్యక్తమై సాధించగల పరమలక్ష్యము గాజాలదు, సర్వపర్యాప్తప్రయోజనము గానేరాదు; అది ఒక ఉచ్చతర లక్ష్యమునకును, దివ్యతర ప్రయోజనమునకును ఆవశ్యకమగు సామాన్యనియమము మాత్రమే. ఏలన దివ్యజన్మకు రెండు పార్శ్వములు గలవు; ఒకటి అవతరణము. మానవభావమునందు భగవంతుని జననము. మానవ ఆకృతియందును, ప్రకృతియందును భగవంతుని స్వయమావిష్కరణము, యుగ యుగమున సంభవించు అవతారము; రెండవది ఆరోహణము, భగవద్భావములోనికి మానవుని జననము, దివ్యప్రకృతి మఱియు చేతనలోనికి మానవుని ఉద్గమనము- "మద్భావమాగతాః" (4-10); ఇది ద్వితీయజన్మలో అంతరాత్మయొక్క నూతన జననము. ఈ నూతనజన్మను సాధించు నిమిత్తమే భగవజ్జననము మఱియు ధర్మ సంస్థాపనము, పైపైన చదువుకొనిపోవు సామాన్యపాఠకునకు గాని, సంప్రదాయ భావాలతో చిట్టెముగట్టిన వైదిక (formal) వ్యాఖ్యాతకు గాని అవతారద్వితీయ పార్శ్వము స్ఫురించదు. అయినను అవతార సిద్ధాంతము యొక్క సమగ్రార్థమునకు ఇది నిశ్చయముగా ఆవశ్యకము. కానిచో. అవతారభావ మొక వాదమాత్రమో, అంధవిశ్వాసమో యగును; లేదా చరిత్రాత్మక లేక పౌరాణిక మహాపురుషునియొక్క భగవదీకరణమే (deification) యగును; అంతే గాని గీత ఉద్దేశించి నట్లు, అది ఒక గంభీరతాత్త్విక మఱియు ధార్మికసత్యము గాదు, 'ఉత్తమరహస్యమునకు' ఒక సోపానము గాదు.

6. నేనే మార్గమును, కవాటమును

భగవద్భాములోనికి మానవుని ఆరోహణమునకు మానవభావములోనికి దిగు భగవంతుని అవరోహణము సాయపడనిచో, కేవలము ధర్మమునిమిత్తము దివ్య జన్మ నిరర్థకసంఘటనమే యగును. ఏలన ఎట్టి సాక్షాదవతరణము లేకయే, భగవంతుని సర్వశక్తిమత్త్వము తన సాధారణసాధనములగు మహాపురుషులు లేక మహోద్యమములద్వారాను, ఋషులు, రాజులు, ఆచార్యుల జీవనకార్యములద్వారాను కేవల ధర్మమును, కేవలన్యాయమును లేక సదాచార ప్రమాణములను స్థాపించుకొన గలదు. మానవప్రకృతియందు దివ్యప్రకృతియొక్క అభివ్యక్తిగా అవతారము వచ్చును.

అది తన క్రీస్తుభావము, కృష్ణభావము లేక బుద్ధభావముయొక్క ఆవిష్కరణము; ఇట్టి ఆవిష్కరణముచేత మానవ ప్రకృతి తన తత్త్వమును, ఆలోచనాదికమును కృష్ణుని రూపురేఖలలోనికి మలచుకొని, దివ్యప్రకృతిలోనికి తనను రూపాంతరము చెందించుకొనగలుగును. ఇట్టి రూపాంతరము నుద్దేశించియే కృష్ణుడు ముఖ్యముగా ధర్మమును స్థాపించును. ఆ ధర్మమధ్యమున కృష్ణుడు తానే కవాటముగా నిలబడి తనలోనుంచియే మనుష్యులకు మార్గమేర్పఱచును కావుననే ప్రతి అవతారమును మానవులముందు తననే దృష్టాంతముగా నిల్పుకొని, తానే మార్గ మనియు, కవాట మనియు ఘోషించును. దివ్యసత్తతో తన మానవభావముయొక్క ఏకతను గూడ అతడు ప్రవచించును. ఉదాహరణకు, మానవ తనువునందలి కృష్ణుడును- "మానుషీం తను మాశ్రితం" (9-11)- సర్వభూతముల మహేశ్వరుడును, సుహృదుడును (5-29) ఒకే దివ్యపురుషోత్తమునియొక్క రెండు ఆవిష్కారములు- 1. మానవాకృతియందలి ఆవిష్కారము. 2. స్వీయసత్తయందలి ఆవిష్కారము.

7. జీవాత్మ ద్వితీయజన్మమే గీతాసారము

అవతారముయొక్క ఈ రెండవ వాస్తవ ప్రయోజనమే (జీవాత్మ ద్వితీయ జన్మమే) గీతాసార మని ప్రస్తుత ప్రకరణమును సరిగా విచారించి నపుడే మనకు స్పష్టపడును; కాని దీనిని వేఱుచేసి కాక, ఇతరప్రకరణములతో దీనికి గల యథార్థ సన్నిహితసంబంధమును బట్టి చూచిన ఈ సత్యము మఱింత స్పష్టపడును- వేఱు చేసి విచారించుట గీతావిషయమున అపమార్గమే యగును. అన్నింటియందును ఒకే ఆత్మగల దను గీతాసిద్ధాంతమును, ప్రతిప్రాణిహృదయములోను ఈశ్వరుడాసీనుడై యున్నా (18-61) డను ప్రతిపాదనను, సృష్టికర్తకును, సృష్టికిని గల సంబంధమును గుఱించిన గీతాబోధన, గీత వక్కాణించి చెప్పిన 'విభూతి' భావము - గీతాతాత్పర్యము కొఱకు వీని నన్నింటిని సరసను విచారించవలెను. దివ్యగురువు తననే నిస్స్వార్థకర్మలకు దృష్టాంతముగా ప్రవచించిన భాషను గూడ గమనించవలెను- ఈ భాష మానవకృష్ణునికి, ప్రపంచముల నేలు పరమప్రభువునకు సమముగా వర్తించును. మఱియు, "మూఢమానవులు మానవదేహమునందున్న నన్ను అవమానింతురు. కారణము, సర్వభూతములను శాసించు నా పరమ ప్రకృతిని వా రెఱుంగరు." (9-11)- ఇట్టి వచనములకు గూడ తగిన ప్రాధాన్యమీయవలెను. ఈ భావములు బఱపు ప్రకాశములో మన ప్రస్తుత శ్లోకములను (4-9, 10)

జదువవలెను. భగవంతుని దివ్యజన్మ మఱియు దివ్యకర్మ జ్ఞానముచే మానవుడు భగవంతుని జేరును (4-9); మఱియు భగవన్మయులు, భగవత్ర్పాయులు నై, అతనియందే ఆశ్రయము గొని, మానవులు భగవంతుని ప్రకృతిని, ప్రతిపత్తిని ప్రాపింతురు. (4-10)- అని ఈ శ్లోకములు ప్రకటించును. ఈ ప్రకటనమును జదివి నపుడు, దివ్యజన్మ మఱియు దాని ధ్యేయము ఏ సంబంధము లేని ఒక మహిమాప్రదర్శనము గాదనియు, ప్రపంచ ప్రణాళికలో దానికి తన సముచిత స్థానము గలదనియు బోధపడును, లేనిచో, దివ్యజన్మరహస్యములోనికి దిగజాలక, అయితే హాస్యాస్పద మని దానిని నిరాకరింతుము, లేదా గ్రుడ్డిగా ఆమోదింతుము, లేదా దానిని గుఱించి అధునికమనస్సునకు గల బాహ్యభావములలోనికి జాఱిపోదుము; దీనివలన మనకు సాయపడగల, దివ్యజన్మయొక్క ఆంతరికార్థమును గోల్పోదుము.

8. అవతార మసంభవమా?

హేతువాదము నాశ్రయించిన ఆధునిక మనస్సునకు ప్రాచ్యప్రపంచమునుండి వచ్చిపడుచున్న భావము లన్నింటిలోను అవతారభావము నామోదించుట అతికష్టము. విశిష్టముగా అభివ్యక్తమైన మానవశక్తి లేక ప్రతిభనే ఆలంకారికభాషలో అవతారమందురు- అని అధునిక మనస్సు ఉత్తమపక్షమున దలంచును; ఇక నధమ పక్షమున అవతారభావమును అంధవిశ్వాసముగా పరిగణించును- పాషండుల కది ఒక మూర్ఖత, గ్రీకుల కది ఒక పచ్చివెలగకాయ. భౌతికవాది దానిని లక్ష్యపెట్టనే పెట్టడు; అతనికి భగవంతునియందే విశ్వాసము లేదు గదా ! హేతువాది కది యొక అవివేకము, తార్కికేశ్వరవాది కది హాస్యాస్పదము; కఠోరద్వైతవాది కది యొక అపచారము. ఒకవేళ భగవంతు డుండిన, అతడు ప్రపంచబాహ్యుడు లేక అతీతుడు; కావున దాని వ్యవహారములో కల్పించుకొనడు- అని హేతువాది అభ్యంతరము దెల్పును. ఇతని దృష్టిలో, సుస్థిర నియమమే ప్రపంచమును నడుపుచుండ, భగవంతు డొక నామమాత్ర రాజుగానో, జడభరతప్రాయుడుగానో ఉండును; ఉత్తమపక్షమున ప్రకృతి క్రియవెనుక సాక్షిమాత్రుడుగా నుండు సాంఖ్యపురుషుని వంటివాడు భగవంతుడు. అతడు శుద్ధచేతన గాన జడశరీరము ధరించజాలడు; అతడు అనంతుడు గాన సాంతమానవుడు గాజాలడు; అతడు అజుడగు సృష్టికర్త గాన, సృజింపబడిన ప్రాణిమాత్రుడు గాజాలడు- అతని పరిపూర్ణ

సర్వశక్తిమత్త్వమునకు సైతము ఇవి అసాధ్యవిషయములు. పోగా, వీనికి కఠోరద్వైతి తన ఆక్షేపములను గూడ జోడించును; భగవంతుడు తన వ్యక్తిత్వమునందును, పాత్ర యందును, ప్రకృతియందును మానవునికంటె భిన్నుడును. పృథగ్భూతుడును; పరిపూర్ణభగవంతుడు మానవాపూర్ణతను ధరించజాలడు; అజుడగు సవ్యక్తిక భగవంతుడు మానవవ్యక్తిత్వముతో పుట్టజాలడు; లోకములను శాసించు ఈశ్వరుడు ప్రకృతిబద్ధ మానవకర్మయందును, నాశశీల మానవతనువునందును ఇముడజాలడు, భీకరముగా గన్పించు ఈ ఆక్షేపములు దివ్యగురువు మనస్సులో మెదలుచునే యుండెను. కావుననే అత డిట్లు వక్కాణించును; భగవంతుడు అజుడు, తన ఆత్మభావమున అవ్యయుడు, భూతముల కీశ్వరుడు నైనప్పటికి, తన ప్రకృతిక్రియ నాశ్రయించి, తన ఆత్మమాయాబలముచే జన్మధరించును. (4-6); అతడు తన దివ్యచేతనాక్రియయందు చాతుర్వర్ణ్య స్రష్టయు, ప్రపంచకర్మకర్తయు నగుచునే, తన దివ్యచేతనాశాంతియందు తన స్వీయ ప్రకృతి చేయు కర్మల నిష్పాక్షికసాక్షియు నగును (4-13). ఏలన అతడు సర్వదా ఈ క్రియకు, శాంతికి పైన పరమపురుషోత్తముడుగా నుండును. గీత ఈ పరస్పరవిరోధములను సమన్వయించగలుగుటకు కారణము, జీవనము, భగవంతుడు, విశ్వములకు సంబంధించిన వేదాంత దృష్టినుంచి అది ఉపక్రమించును.

9. ప్రతిప్రాణియు ప్రచ్ఛన్ననారాయణుడే

వేదాంత దృష్టికి, ప్రబలముగా దోచు ఈ ఆక్షేపములన్నియు కేవలనిస్సారములు. వేదాంత ప్రణాళికకు అవతారభావ మావశ్యకము గాదు; కాని అది సర్వథా హేతుయుక్తము, తర్కసిద్ధమునగు భావనగా దానిలో ప్రవేశించును. ఏలన వేదాంతమునందు సర్వము భగవంతుడే, ఏకాత్మసత్తయే, అద్వితీయ బ్రహ్మమే- "ఏకమే వాద్వితీయం" (ఛాం.ఉ.), ఇతర మేదియు లేదు, ఉండజాలదు; ప్రకృతి దివ్యచేతన యొక్క ఒక శక్తి, అది తదితర మేమియు గాజాలదు. సర్వభూతములు ఒకే దివ్యసత్తయొక్క ఆంతర, బాహిర ఆత్మరూపములు, దేహ రూపములే గాని, మఱేమియు గావు; అవి దాని చేతనాశక్తియందు లీనమై యుండును లేక ఉత్పన్న మగును. అనంతసత్త సాంతత్వమును స్వీకరించలేదను మాట నటుంచి, ఈ విశ్వ మంతయు ఆ సత్త తప్ప మఱేమియు గాదు. నిరాకారాత్మ ఆకారసమర్థము గాదు; కనీసము అది అన్నమయ, మనోమయాకారముతో సంబంధము నేవగించుకొనును;

అటులే పరిమిత ప్రకృతిని లేక శరీరమును స్వీకరించ విముఖమగును- అను మాట నటుంచి, ప్రపంచ మా సంబంధము చేతనే, స్వీకారముచేతనే మనుచున్నది. ప్రపంచ మొక యంత్రవ్యాపారము, దాని శక్తుల గతియందు గాని, దాని మనః శరీరముల క్రియయందు గాని ప్రమేయము పెట్టుకొను ఎట్టి ఆత్మ లేక పురుషుడు లే డను మాట అటుంచి, సమస్త ప్రపంచమును, దాని ప్రతి అణువు క్రియాగతమైన భగవచ్ఛక్తియే గాని మఱేమియు గాదు: మఱియు ఆశక్తి దాని ప్రతిక్రియను నిర్ణయించి పాలించును; దాని ప్రతి రూపమునందు నివసించును; దానియందలి ప్రతి ఆత్మను, మనస్సును తనదిగా ధరించును. సర్వము భగవంతుని యందున్నది, అతనియందు చరించుచున్నది, తన సత్తను గలిగియున్నది; మఱియు సర్వము నందును భగవంతు డున్నాడు, తన సత్తను ప్రదర్శించుచున్నాడు; ఒక్క మాటలో ప్రతి ప్రాణియు ప్రచ్ఛన్న నారాయణుడే.

10. భేదనిష్ఠమైన తర్కము నిలువజాలదు

అజత్త్వము జన్మ స్వీకరించలే దను మాట నటుంచి, జన్మించిన సర్వ భూతములు, తమ వ్యక్తిత్వమునందు సైతము, అజ ఆత్మలే, ఆద్యంతరహిత సనాతనాత్మలే, పోగా తమ మూలసత్తయందును,విశ్వసత్తయందును సర్వభూతములు ఏకము, అజము నగు సర్వాత్మయే. ఈ సర్వాత్మకు జననమరణములను రూపగ్రహణ, రూపపరివర్తన సంఘటనలు మాత్రమే, పూర్ణము అపూర్ణతను గ్రహించుటయే విశ్వముయొక్క నిఖిలనిగూఢ వ్యాపారము; అయితే ఈ అపూర్ణత పూర్ణము స్వీకరించిన మనఃశరీరముల రూపక్రియలయందే గన్పించును గాని, పూర్ణమునందేఅపూర్ణతయు లేదు, ఉదాహరణకు, సర్వమును ప్రకాశింపజేయు సూర్యుని తేజమునందు గాని, దృష్టియందు గాని ఏ లోపము నుండదు, వైయక్తిక దర్శనేంద్రియ సామర్థ్యములందే అది గన్పించును. మఱియు ఈశ్వరుడు ప్రపంచమును సుదూరస్వర్గమునుండి కాక, తన ఘనిష్ఠసర్వవ్యాపిత్వముచేతనే పాలించును. ఎట్లన, శక్తియొక్క ప్రతి పరిమిత క్రియయు అనంతశక్తియొక్క ఒక చేష్టయే గాని, స్వయంసిద్ధమగు ఒక పరిచ్ఛిన్నశక్తి శ్రమపడి స్వయముగా జేయు క్రియ గాదు; అటులే జ్ఞానసంకల్పముల ప్రతి పరిమిత క్రియయందు అనంతమగు సర్వజ్ఞాన, సర్వసంకల్పముల ఒక కర్మనే మనము కనుగొనగలము. భగవంతుని పాలనము అనుపస్థిత, పరకీయ, బాహ్య పాలనము గాదు; అతడు సర్వమును అతిశయించును గాన, సర్వమును బాలించును; మఱియు

సర్వక్రియలయందును అతడు వసించును గావునను, సర్వక్రియల ప్రాణము మఱియు ఆత్మ గావునను గూడ అతడు పాలించును. కావున హేతువాదము అవతార సంభవతకు అడ్డుగా చూపు ఆక్షేపము లేవియు నిలువజాలవు. ఆ ఆక్షేపముల తత్త్వమే విభజన, వ్యర్థవిభజన; ఇక నీ విభజనతత్త్వమును ప్రపంచవ్యాపారము, సత్యత ప్రతిక్షణము ప్రతి షేధించుచున్నవి.

11. సంభవమే గాని వాస్తవమా?

ఇట్లు అవతారము సంభవము గావచ్చును గాని. దాని వాస్తవికత మాటేమిటి?- అనగా సాంతమునందు, మానసికభౌతికమునందు, పరిమితమునందు, అపూర్ణము నందు ప్రత్యక్షముగా వ్యవహరించుటకు దివ్యచేతన ముందుకు వచ్చి, వాస్తవముగా గన్పించునా? ఇంతకు సాంత మన నేమి? ఆధ్యాత్మికభూమికయందు అనంతుని అనంతమగు స్వీయాభివ్యక్తియొక్క ఒక నిర్దిష్టరూపమే, బాహ్య మూల్యమే (face-value) సాంతము. తన బాహ్యప్రకృతిక్రియ యందు, అనగా తన కాలగతాభివ్యక్తి యందు సాంతరూపముయొక్క మూల్యమేమైనను, తన ఆత్మభావమునందు సాంతరూపముయొక్క వాస్తవమూల్య మొక అనంతము. ఉదాహరణకు, లోతుకు దిగి చూచినపుడు, మానవుడు, వేఱుపడి తనకుదానే మనుచున్న ఒక వ్యక్తి గాడు, పరంతు తనదేయగు ఒక మనస్సునందును, శరీరమునందును నివసించుచున్న మానవజాతియే మానవుడు; మఱియు మానవజాతియు తనకుదానే వేఱుగా మనుచున్న ఒక జాతి గాదు, మానవజాతిరూపమున మనుచున్న విరాట్ పురుషుడే మానవజాతి; అతడు మానవజాతిరూపమున తన అభివ్యక్తిశక్తుల కొన్నింటిని వికసింపజేయుచున్నాడు. మఱియు అతడు దేనిని వికసింపజేయునో, అది స్వయముగా బ్రహ్మమే.

12. అవతార ప్రయోజనము

మనకు బ్రహ్మ మన అనంత చేతనాశక్తితో, తనలోపల నిరుపాధికానందముతో విలసిల్లు స్వయంభూసత్త. బ్రహ్మ మిదియే యగును, కానిచో నేదియు గాదు; కనీసము మానవునికి, ప్రపంచమునకు సంబంధించిన దేదియు గాదు. సచేతన సత్తకు గల శక్తియొక్క పుంజీభూత చలనమే ద్రవ్యము (Matter); మఱియు ద్రవ్య మెచ్చటను చేతనాశూన్యము గాదు. ఏలన పరమాణువునందు, జీవకణము నందు సైతము ఒక సంకల్పశక్తి, ఒక బుద్ధిశక్తి పనిచేయుచుండుటను ఆధునిక విజ్ఞానము, తన

క్లిష్టముగాకపోయినను, ఎంతో స్పష్టపఱచుచున్నది. అయితే ఆ సంకల్పమును, బుద్ధియు పరమాణువులోపలనుండు ఆత్మ, బ్రహ్మము, లేక భగవంతుని శక్తులు; అవి పరమాణువునుండియే స్వయముగా పుట్టిన, పృథగ్భూత శక్తులు గావు, అన్నింటి యందును ంతర్లీనముగా నుండు ఈ బుద్ధిసంకల్పములు నిమ్నరూపములందు క్రమముగా వికసించుచు, పృథివిపై కనీసము మానవునియందు భగవంతునికి సర్వాధికముగా దగ్గరకు జరిగి, రూపగతమగు బాహ్యబుద్ధియందు సైతము తమ దివ్యతను అస్పష్టముగా పసికట్టును. కాని మానవునియందు సైతము, నిమ్నరూపము లందు భగవంతునితో తాదాత్మ్యమునకు అడ్డువచ్చు అపూర్ణత మిగిలియే యుండును. ఏలన ప్రతి పరిమిత జీవియందును పరిమిత బాహ్య క్రియతో బాటు పరిమిత బాహ్యచేతనయు నుండును; ఇక నీ పరిమితచేతన జీవి ప్రకృతిని వేఱుగా నిర్దేశించి, జీవికి, జీవికి భేదము కల్పించును. ఇట్లు తన ప్రత్యేకాభివ్యక్తియగు మానవునియందును గల అతని బాహ్య మఱియు అపూర్ణ చేతనా సంకల్పముల ద్వారా భగవంతు డతనిని వెనుకనుండి నడిపించును, తాను మాత్రము వేదము చెప్పునట్లు, అతని "గుహయందు" దాగి యుండును. ఈ "గుహను" గీత ఇట్లు విశదపఱచును– "సర్వభూతములను యంత్రారూఢమైన వానినివలె తన మాయచేత త్రిప్పుచు, ఈశ్వరుడు సర్వభూతహృదయమునందును ఆసీనుడై యుండును" (18–61). ఈ రహస్యపాలనమే జీవులపట్ల ఈశ్వరు డవలంబించు సార్వత్రికవిధానము. అయినప్పుడు, ఎక్కువ ప్రత్యక్షము, ఎక్కువ నచేతనముగా దివ్యము నగు కర్మ చేయుటకు, ఈశ్వరుడు ఏయొక రూపమునం దైనను బాహ్య చేతనలోనికి వచ్చునని మన మెందుకనుకొనవలెను? అసలట్లు వచ్చుచో, స్పష్టముగా తనకును, మానవ జాతికిని మధ్య గల తెరను చీల్చివేయుటకే; తన ప్రకృతి చేత పరిమితుడైన మానవు డీ పని స్వయముగా చేయలేడు గదా!

13. మాయాప్రకృతులు పరస్పరపూరకములు

జీవుడు ప్రకృతియొక్క యాంత్రికక్రియ కధీనుడు, మాయానిర్మితమైన స్వభావముచేత పరిమితుడు; కావున అతని క్రియ సాధారణముగా అపూర్ణ మని గీత వివరించును. మాయాప్రకృతులు రెండును దివ్యచేతనయొక్క ఒకే కార్యశక్తియొక్క పరస్పరపూరక పార్శ్వములు. మాయ వస్తుతః భ్రాంతి గాదు. ఈ భ్రాంతి భావము అవరప్రకృతి అజ్ఞానమందుమాత్రమే కలుగును, ఈ భ్రాంతి గుణమాయగాని,

వాస్తవమాయ గాదు. వాస్తవమాయ దివ్యచేతనాశక్తి, అది సత్తయొక్క వివిధ స్వభావములను నిర్మించును. కాగా ప్రకృతి అదే చేతనయొక్క కార్యశక్తి; ఇది 'స్వభావమునకు' దాని 'స్వధర్మము' ననుసరించి, దాని గుణకర్మల లోపలనే బాహ్యా రూపము గల్పించును. అస్తు. జీవుని అధీనతను గీత ఇట్లు వచించును- "నేను నా ప్రకృతి నదిమిపట్టి, ప్రకృతికి వివశముగా అధీనమగు భూతసముదాయమునంతను సృజింతును"(9-8). ప్రకృతి కధీనమగు ఇట్టి జీవులు అసురప్రకృతియందు నివసింతురు- "మోహినీం ప్రకృతిం శ్రితాః" (9-12); అది వారి బుద్ధిని సంకల్పమును కామముతో వంచించును. అహంకారముతో భ్రమపెట్టును. కావుననే వారు మానవదేహములోపలి భగవంతుని గనజాలరు. ఈ లోని పురుషోత్తముడు సులభదర్శనుడు గాకపోవుటకు కారణము. నల్లని అంధకారమేఘముగనో, తెల్లని తేజోమేఘముగనో ఉండు తన యోగమాయచేత అతడు సంపూర్ణముగా నావరింపబడి యుండును- "నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః" (7-25) ఈ యోగమాయకంటె భిన్నమగు గుణమాయను గీత ఇట్లు వర్ణించును- "గుణకల్పితమైన సాత్త్విక రాజస తామసావస్థలచేత మోహితమైన ఈ ప్రపంచము నన్ను గుర్తింపలేకున్నది (7-13); ఏలన గుణమయమైన ఈ నా దేవమాయ మిక్కిలి దుస్తరమైనది; నన్ను ఆశ్రయించినవారే దీనిని దాటుదురు (7-14) ఇట్లు ఆశ్రయించక, ఆసురప్రకృతియందు నివసించువారి జ్ఞానమును ఈ మాయ అపహరించివేయును (7-15) వేఱు వచనములలో, భగవచ్చేతన అన్నిటియందును అంతర్వర్తిగా నున్నది; ఏలన అన్నింటియందును భగవంతుడు నివసించును; కాని తన (దివ్య) మాయచేత నావరింపబడి నివసించును; కాగా గుణక్రియారూపమైన (గుణ) మాయ అందరి ముఖ్యాత్మజ్ఞానమును హరించి, దానిని అహంకారకృతమైన మిథ్యాత్మజ్ఞానములోనికి మార్చును, అయినను ప్రకృతి-యాంత్రికక్రియనుండి, లోపల గుప్తముగా నుండు క్రియాప్రభువులోని కుపసంహరించుకొని, మానవుడు అంతః స్థిత భగవంతు నెఱుంగగలడు.

14. ఆత్మమాయచేత దివ్యజన్మ గుణమాయచేత ప్రాకృతజన్మ

ఇంచుక భాషాభేదముతో సాధరణజన్మకును, దివ్యజన్మకును గల భేదమును గీత ఎట్లు చూపునో గమనించదగును : "నా ప్రకృతి <u>నదిమిపట్టి</u>, ప్రకృతినియంత్రణచేత <u>వివశముగా</u> అధీనమైయున్న భూతజాలమునునేను <u>వివిధముగా</u> సృజింతును-

'విసృజామి' (9-8)". ఇది సాధారణభూత జన్మ, కాగా "నా ప్రకృతిపై నిలబడి, ఆత్మమాయచేత నన్ను నేను సృజించుకొందును- 'సృజామి' (4-6)." ఇది అవతార దివ్యజన్మ. 'అదిమిపట్టి' యన, సృజింపబడు భూతములు నిర్జితములు, నిపీడితములు నై, తమ గ`యందు నిరుద్ధములు, తమ క్రియయందు పరిమితములు నై ప్రకృతి నియంత్రణాశక్తికి వశమై పోవును- "అవశంవశాత్" (9-8). దీనికి ప్రతిగా దివ్యజన్మయందు 'ప్రకృతిపై నిలబడి' యన, ప్రకృతి పై నుండుట యగును; అనగా ప్రకృతిలో నివసించు భగవంతుడు - "అధిష్ఠాత్రీ దేవతా"- ప్రకృతిపై సచేతన నియంత్రణ గలిగి, దానిని బాలించును. ఇచ్చట పరమపురుషుడు అజ్ఞానవశమున ప్రకృతిచేత వివశముగా తోలబడడు; పైగా, ప్రకృతియే ఆ పురుషుని ప్రకాశ, సంకల్పముల చేత ప్రపూర్ణమగును. కావున సాధారణజన్మలో సృజింపబడునవి భూతములు; దివ్యజన్మలో సృజించబడునది. కాదు స్వయంసృష్టమగునది, స్వాత్మజ్ఞము, స్వయంభువు నగు ఆత్మ; ఏలన వేదాంతార్థమున ఆత్మకును, భూతములకును గల భేదము, పాశ్చాత్యదర్శనశాస్త్రమున సత్త (Being) కును, సంభూతి (Becoming) కిని మధ్య గల భేదమే (సంభూతి = పరిణామ క్రమమున అగునది). ఉభయ సందర్భములందును మాయయే సృష్టి లేక అభివ్యక్తిసాధనము. అయితే దివ్య జన్మ ఆత్మమాయచేత గలుగును; అనగా స్వయంభూభగవంతుడు అజ్ఞానరూపమగు నిమ్నమాయలో మునిగిపోక, తన జన్మప్రక్రియను, ఉద్దేశ్యమును బాగుగా నెఱింగియే సచేతనక్రియచేత తనను బాహ్యప్రకృతియందు సృజించుకొనును - దీనినే గీత అన్యత్ర యోగమాయ యనును (7-25). కాని సాధారణ భూతజన్మలో, నిమ్న చేతననుండి తననుదాను మఱుగుపఱచుకొనుటకు భగవంతు డీ యోగమాయనే ఆవరణగా ఉపయోగించుకొనును; కనుక మనపట్ల అది అవిద్యామాయ యగును. అయితే మన చేతన భగవంతుని వైపునకు మఱలిన దాదిగ, ఈ యోగమాయయే ఆత్మజ్ఞానమును అభివ్యక్తముచేయును గాన, అది విద్యామాయయు నగును; మఱియు దివ్యజన్మయందు ఇది విద్యామాయగనే వ్యవహరించును - అనగా సాధారణముగా అజ్ఞానమునందు జేయబడు కర్మలను నియమించి, వానిని సచేతనము చేయు జ్ఞానముగా వ్యవహరించును.

15. అవతారము మన ఆరోహణనిమిత్తము

సాధారణజన్మయు, దివ్యజన్మయు వస్తుతః వ్యతిరేకము లని గీతాభాష పై విధముగా మనకు జూపును : సాధారణజన్మ అజ్ఞానములోనికి జన్మించు జన్మ,

భౌతిక జన్మ; కాగా దివ్యజన్మ జ్ఞానజన్మ, ఆత్మజన్మ. ఇది ఆత్మ స్వయంభూ పురుషుడుగా మానవజన్మలోనికి వచ్చుట యగును; ఈ పురుషుడు అజ్ఞానమేఘమున ఆత్మజ్ఞానమును గోల్పోక, తన సంభూతిని నియమించుకొనును. ఇచ్చట ఆత్మ ప్రకృతిప్రభువుగా శరీరములో జనించి, స్వేచ్ఛగా వ్యవహరించును గాని, ప్రకృతి యంత్రమున వివశముగా త్రిప్పివేయబడడు. ఏలన ఈ ఆత్మ, పెక్కుమందివలె అజ్ఞానములో గాక, జ్ఞానములో వ్యవహరించును. ఇది అందరిలోపల నిగూఢముగా నుండు సర్వాత్మ; ఇది సామాన్యముగా తెర వెనుకనుంచి ఈశ్వరరూపమున (18-61) జీవజన్మను శాసించును; కాగా తెరవెలుపల నుండు జీవుడు తన జన్మను శాసించుటకు బదులు దానిచేతనే శాసింపబడును; కారణము, అతడు సాక్షికచేతనుడు మాత్రమే గనుక, ఆత్మజ్ఞానహీనుడై తన బాహ్యాభావమున కర్మ బద్ధు డగును. పోగా, అదే సర్వాత్మ అవతార జన్మయందు తెరను చీల్చుకొని ముందుకు వచ్చి, భగవంతుడుగా దానిని సర్వథా ధరించి శాసించును. కావున అవతార* మన మానవభావమునందు దివ్యాత్మయగు కృష్ణుడు తన దివ్యభావమును ప్రత్యక్షముగా ప్రకటించుటయే యగును. ఎందు కీ ప్రకటనము ? శ్రేష్ఠమానవుడు, విభూతియు నగు నర్జునునకు దివ్యభావమున కెగయ నది యొక పిలుపు; మఱియు తన సాధారణ మానవభావముయొక్క అజ్ఞానమునుండియు, అవధుల నుండియు బైటబడిననే తప్ప అర్జును డట్లెగయజాలడు. తాత్పర్యము, ఏదివ్య భావమును మనము క్రిందినుంచి వికసింపజేయవలెనో, పై నుంచి దాని అభివ్యక్తియే అవతారము; మర్త్యజీవులమగు మనము దేనిలోనికి మఱల జన్మించవలెనో, మానవరూపమున అట్టి దివ్యజన్మలోనికి భగవదవతరణమే అవతారము; మానవా కారముననే, మానవప్రకారముననే, సంసిద్ధమానవ ప్రతిరూపము (Model) ననే భగవంతుడు మానవున కిచ్చిన రమ్యదృష్టాంతము అవతారము.

*అవతారపదమున కర్థము అవరోహణము (దిగుట); మానవప్రపంచమును లేక ప్రతిపత్తిని భాగవతప్రతిపత్తి నుండి వేఱుచేయు రేఖకు దిగువగా భగవంతుడు దిగుటయే అవతారము.

–శ్రీఅరవిందుడు

16. అవతరణ ప్రక్రియ

1. పరిమితసత్త గాని, పరిచ్ఛిన్నసత్త గాదు

గీతాదృష్టిలో మానవజన్మ స్వయముగా నొక చిరంతన మహారహస్యము; ఈ రహస్యముయొక్క ఆవలిపార్శ్వమే మానవునియందు భగవంతుని జన్మరహస్యము; ఏలన మానవుడును తన మూలమునందు అజుడు, అవ్యయుడే. ఎట్లన, ప్రతి మానవజీవుని సనాతనాత్మయు, విశ్వాత్మయు సాక్షాత్తుగా భగవంతుడే; ఇక తన వైయక్తికాత్మయందు సైతము మానవుడు భగవంతుని ఒక అంశము– "మమైవాంశః" (15–7). కాని నిశ్చయముగా అంశ మన ఒక భాగము గావి, ఖండము గాని కాదు; ఏలన భగవంతుడు ముక్కచెక్కలగుటను మన మూహించజాలము. కావున అంశ మన ఏకచేతనయొక్క ఒక పాక్షికచేతన, ఏకశక్తియొక్క ఒక పాక్షికశక్తి, ఏకానందముచే ప్రపంచముయొక్క పాక్షికభోగము. కావున అంశమన అనంతము, అపరిమేయము నగు ఏకసత్తయొక్క సాంతము, పరిమితమునగు ఏకదేశ.మని తేలును. ఈ 'పరిమితి' లక్షణ మజ్ఞానము; ఈ అజ్ఞానము వలన జీవుడు తనకు మూలమగు భగవత్తత్త్వమునే గాక, తన రహస్యహృదయమున, లోపల వెలుంగు భగవత్తత్త్వమును గూడ విస్మరించును.

2. రాగి పూసిన బంగారు నాణెము

జీవుని అజ్ఞానమునకు గారణము, అతని ఆత్మ మఱియు దాని సర్వావయవముల నేత్రములపై మాయ తన ముద్రను ముద్రించి, అతనిని భగవంతుని సనాతన సత్తనుండి వెలికి లాగి, అభివ్యక్తిలోనికి బంపినది; అతనిని రాగి పూసిన బంగారు నాణెము జేసివేసినది, అతని భాగవతసత్త పై మాయ తన బాహ్యగుణముల ముద్ర వేసినది. ఈ ముద్రాముఖమున భగవత్సత్తయొక్క రహస్యచిహ్న మున్నను దానిని గ్రహించుట కష్టము; అధోముఖమానవుని భగవదభిముఖ మానవు నుండి వివేచించ గల దీక్ష బొందినవాడే దానిని గ్రహించగలడు. అవతారమునందు, అనగా దివ్యముగా జన్మించిన మానవునియందు వాస్తవతత్త్వము పైపూతలోనుంచి ప్రకాశించును; ఇచ్చట సైతము మాయాముద్ర ఉన్నను, ఈ ముద్ర అవతారమునకు రూపముగా మాత్రమే ఉపయోగపడగా, అతని దృష్టి లోపలి రహస్యభగవంతుని దృష్టిగనే కొనసాగును, అది అవతార మానవుడు ధరించిన మానవప్రకృతిరూపమగు ముద్రలను భేదించుకొని వెలికి ప్రసరించును. అవతారచిహ్నము లోపలి ఆత్మకు సంబంధించిన చిహ్నమే

యైనను, చూడదలంచిన లేక చూడగలవారికి అవతార ముఖమున స్పష్టముగానే గన్పించును. దీనిని చూచుటకు ఆసురప్రకృతికి కండ్లుండవు; అది ఆత్మను గాక దేహమునే జూచును, పురుషుని గాక, వేషమునే జూచును. ఇక సాధారణ మానవజన్మ యందు మానవరూపము ధరించు విశ్వాత్మక భగవంతుని ప్రకృతిరూపమే ప్రాబల్యము వహించును; కాగా అవతారమునందు అదే భగవంతుని భగవద్భావము ప్రాబల్యము వహించును. ఒకదానియందు తన అంశమేయగు జీవుని శాసింప మానవప్రకృతి కవకాశమిచ్చును; రెండవదానియందు భగవంతుడు తానే మానవ ప్రకృతిని వశము చేసికొని నడుపును– మానవునివలె క్రమ వికాసమున పైకి వెళ్ళి కాక, భగవంతుడు అవతరించినపుడు, సరాసరి మానవ రూపములోనికి దిగి, మానవప్రకృతి నిట్లు నడుపును.

3. బాహ్యావతారము – అంతరావతారము

కాని ఇట్లు జరుగు భగవదవతరణము మానవారోహణము లేక పరిణామమునకు చేయూత నిచ్చుటకే; గీత దీనిని స్పష్టముగా చెప్పును (4–10), మానవ సత్తలో భగవదభివ్యక్తి సంభవ మనుటకు అవతారము దృష్టాంతముగా పని చేయును; దానిని జూచి, దానిలోనికి పెరుగుటకు మానవుడు ధైర్యము పుంజుకొనును. మఱియు తన అభివ్యక్తి ప్రభావము పృథివీప్రకృతిలో స్పందించుచునుండుటకును, తదభివ్యక్తి-ఆత్మ పృథివియొక్క ఊర్ధ్వముఖప్రయత్నముపై అధ్యక్షత వహించుచు నుండుటకును అవతారము వచ్చును. దివ్యమానవతకు ఒక ఆధ్యాత్మికరూపమిచ్చుటకును అవతారము వచ్చును; ఆ రూపములోనికి మానవాత్మ తనను పోతపోసికొనగలుగును. ఇంకను అవతారము బుద్ధిమతమును గాక, బాహ్యాభ్యంతర జీవనధర్మము నిచ్చుటకు వచ్చును; ఈ ధర్మము భగవంతుని దిశగా పెరుగుటకు దోడ్పడును. మఱియు నీ పెరుగుదల ఒక వైయక్తిక ఘటన గాదు; ప్రత్యుత తక్కిన దివ్యక్రియలవలెనే ఇదియు నొక సామూహిక వ్యాపారము. కావున జాతికి జాతి పురోగమించుటకే దోహద మిచ్చుటకును; జాతిమహాసంకటము లందు దానిని సంఘటితముగా నిలుపుటకును. క్రిందికి లాగు శక్తులు విజృంభించినపుడు వాని వెన్ను విఱుగగొట్టుటకును, మానవ ప్రకృతియందు భగవదున్ముఖ మహాధర్మమును స్థాపించుటకును అవతారము వచ్చును. ఇంకను భగవద్రాజ్యమునకు మెట్లు గట్టుటకును, సాధువిజయమునకు, దుష్టవినాశనమునకు దారివేయుటకును అవతారము వచ్చును (4–8), ఇవి యన్నియు గుర్తించబడిన అవతారలక్ష్యములు. సాధారణముగా అవతారకార్యము

చేతనే జనబాహుళ్య మతనిని విశిష్టముగా నెఱింగి, పూజింప నుంకించును. కాని ఆధ్యాత్మికమానవులు మాత్రమే ఈ బాహ్యావతారము, మానవులందరిలోపల శాశ్వతముగా నవతరించి యున్న శాశ్వతావతారముయొక్క ఒక మానవరూప చిహ్న మని గాంతురు. ఈ అంతరావతారము మానవుల మనః శరీరక్షేత్రమునందు తనను ప్రకటించుకొనును; ఈ ప్రకటనముద్వారా మానవులు దానితో ఏకతలోనికి పెరుగుచు, దాని అధికారములోనికి రాగలుగుదురు. ఈ అంతరావతారము కృష్ణుని బాహ్యావతారముయొక్క ఆంతరసత్యము. కావున బాహ్యావతారమువలన బాహ్యపృథివీ జీవనమున ఏది చేయబడినదో, అది సమస్తమానవుల ఆంతరజీవనమునందును తిరిగి చేయబడగలదు.

4. మానవవిభూతి, దైవవిభూతి

సరే, ఇది అవతారప్రయోజనము, అయితే అవతారపద్ధతి? మున్ముందు, హేతువమూలక అభిప్రాయమును చూతము : ఇది అవతారమునందు దివ్యతరగుణముల అభివ్యక్తినిమాత్రమే చూచును, అనగా నైతిక, బౌద్ధిక, శక్త్యాత్మక గుణములచేత సాధారణమానవ స్తరమును అతిక్రమించినవాడే అవతారము. ఈ భావమునందు కొంత సత్యము గలదు. ఏలన అవతారము అదే సమయమున (గుణాభివ్యక్తిరూపమగు) విభూతియు నగును. ఉదాహరణకు, కృష్ణుడు తన ఆంతరదివ్యసత్తయందు మానవరూపమున నున్న భగవంతు డగుచునే, తన బాహ్యా మానవసత్తయందు తన యుగనాయకు డగును, వృష్ణివంశమహాపురుషు డగును. విభూతియు నవతార మనుట ప్రకృతిదృష్టినుంచి, ఆత్మదృష్టినుంచి గాదు. ఈ దృష్టియందు భగవంతుడు తన ప్రకృతియొక్క అనంతగుణములద్వారా అభివ్యక్తుడగును. కావున దైవవిభూతి యన, అవ్యక్తికముగా, భగవంతుని గుణము యొక్క అభివ్యక్తశక్తి; జ్ఞానము, ప్రేమ, మున్నగు రూపమున అతని బహిఃప్రవాహము; సవ్యక్తికముగా విభూతి యన, అతని మనోరూపమును, ప్రాణసత్తయు నగును, ఈ మనఃప్రాణము అతని శక్తికి ఆటపట్టులు. ఈ శక్తివిలసనమే దైవ విభూతిలక్షణము. పోగా, మానవవిభూతి యన భగవన్మార్గమున జాతిని నడుపు వీరుడు, కార్లైల్ మహాశయుని అర్థమున ఈ వీరుడు మానవునియందలి ఒక భగవచ్ఛక్తి. దీనినే భగవాను డిట్లు తెలుపును : నేను వృష్ణికులమున కృష్ణుడను, పాండవులలో అర్జునుడను, మునులలో వ్యాసుడను, కవులలో శుక్రుడను." (10–37). అనగా ప్రతిజాతిలోని ప్రధముడును భగవంతుడు, అనగా ఆ ప్రధమునిలో పనిచేయు

భగవచ్ఛక్తి, ఈశక్తియే ఆ జాత్యాత్మ వ్యక్తముచేయు గుణములకు పరమ విశిష్టప్రతినిధి. దివ్యాభివ్యక్తిమార్గమున సత్తకు గల శక్తుల ఇట్టి ఉత్కర్షణము మిక్కిలి ఆవశ్యకము. ఏలన సాధారణభూమికను మించి పైకిబోవు ప్రతిమహాపురుషుడును ఆక్రియచేతనే జాతినిగూడ లేవనెత్తును. ఇట్టి మానవ విభూతి మన దివ్యసంభావ్యతలకు సజీవ నిదర్శనము, విశ్వాసకారణము నగును, భగవత్ప్రాప్తికి ఆశాకిరణమగును, దివ్యతేజము యొక్క ఒక దీప్తి యగును, దివ్య శక్తియొక్క ఒక శ్వాస మగును.

5. విభూతి అవతారము గాదు

బుద్ధిశాలురను, వీర పురుషులను భగవంతునిగా ఆరాధించు సహజ మానవ ప్రవృత్తి వెనుక నున్న దీ విభూతి సత్యమే. అభ్యాసవశమున భారతీయమనస్సు సాధువులు, ఆచార్యులు, ప్రవర్తకులయందు అంశావతారమును సులభముగా చూచును; లేక దక్షిణభారతము నందలి వైష్ణవులు, తమ గురువులు విష్ణుదేవుని సజీవాయుధముల అవతారములని నమ్ముదురు. ఇది ఎంతయు అర్థవంతము; నిజానికి మహాత్ము లందరు ఊర్ధ్వయాత్ర మఱియు ఊర్ధ్వయుద్ధమందు భగవంతుని సజీవ శక్తులు మఱియు ఆయుధములే గదా!– ఈ నమ్మకము నందు వ్యక్తమగునది విభూతిసత్యమే. భగవంతుని సత్తాప్రకృతులకు, మానవుని సత్తాప్రకృతులకు మధ్య దాటరాని గీతను గీయని ఎట్టి ఆధ్యాత్మికదృష్టియం దైనను ఇట్టి భావన స్వాభావికము, అనివార్యము నగును. మానవభావమున దివ్యభావమును జూచుమతి యిది. అయినను విభూతి అవతారము గాదు; అగుచో, అర్జునుడు, వ్యాసుడును కృష్ణునివంటి అవతారములే అగుదురు. దివ్యగుణమే చాలదు; అవతారమనుటకు, మానవప్రకృతిని తన దివ్యసన్నిధిచేత పాలించుచున్న ప్రభువును నేనను అంతశ్చేతనయు నుండ వలయును. గుణముల శక్తిని పెంపొందించుట సంభూతి (పరిణామము) యందలి ఒక భాగము, సాధారణాభివ్యక్తియందలి ఒక ఆరోహణము. కాగా అవతారమునందలి అభివ్యక్తి విశేషాభివ్యక్తి; అది పైనుంచి సంభవించిన దివ్యజన్మ; ఇట్లు మానవరూపము లోనికి దిగిన భగవంతుడు తెరవెనుకనే గాక, బాహ్యప్రకృతి యందును తన నిజరూపము నెఱింగియుండును.

6. దివ్యీకృతజీవుడును ఈశ్వరుడు గాదు

విభూతికి, అవతారమునకు మధ్య విభూతికంటెను గూఢతరమగు మఱియొక అవతారభావన గలదు : మానవాత్మ తనలోనికి భగవదవతరణమును ఆహ్వానించి.

భగవచ్చేతనచేత ఆవేశింపబడును, లేక దాని వాహిని యగు నని ఈ భావన దలంచును. ఈ దృష్టి కొన్ని ఆధ్యాత్మికానుభవములమీద నాధారపడును. భగవంతుని యందు మానవుడు జన్మించుట, అనగా ఆరోహణము స్వయముగా దివ్యచేతనలోనికి మానవచేతన పెరుగుటయే మఱియు తన అత్యంతపర్యవసానమందు ఈ పెరుగుట జీవుడు తన పృథగ్భావమును భగవచ్చేతనలో కోల్పోవుటయే యగును; అనగా అపుడు జీవాత్మ బ్రహ్మముతో ఏక మగును, ఒకసారి బ్రహ్మమేయగు నని మఱింత కేవలముగా వక్కాణించుటయు గలదు. గీత స్వయముగా ఇట్లు వక్కాణించును- "బ్రహ్మభూతః" (18-54), అయితే, జీవుడు స్వయముగా ఈశ్వరుడే, ఈశ్వరునియొక్క అంశికసత్త- "మమైవాంశః" (15-7)- అని గీత ప్రవచించినను, బ్రహ్మభూతు డగుటద్వారా జీవుడు ఈశ్వరునియందు- కృష్ణునియందు - నివసించునే (12-8) గాని, ఈశ్వరునితో ఏకమగు నని చెప్పదు. ఈ విభేదమును గమనించ దగును. ఏలన అభిన్నముగా ఈశ్వరునియందు నివసించుటయను ఈ మహాసాయుజ్యము, అత్యున్నతపరిణామము సైతము ఆరోహణలో భాగమే. ఇది భగవంతునియొక్క అవరోహణము గాదు, అవతారము గాదు; అత్యధికము, ఇది బౌద్ధుల ననుసరించి బుద్ధత్వము మాత్రమే యగును; తన పార్థివవ్యక్తిత్వమునుంచి ఒక అనంత అతిచేతన లోనికి జీవాత్మ మేల్కొనుటయే యగును. ఈ స్థితియందును అవతారముయొక్క అంతరచేతన గాని, విశిష్టకర్మ గాని జీవునికి అవశ్యముగా నుండు నని చెప్పలేము.

7. దివ్యమానవుడు ఈశ్వరుడు గాడు

ఒకొకప్పుడు దివ్యచేతనలో జీవుని ప్రవేశఫలితముగా, మానవుని ప్రకృతి లోనికి, క్రియలోనికి, మనఃశరీరములలోనికి భగవంతుడు తన్నుదాను గుమ్మరించు కొనవచ్చును; దీనిని కనీసము అంశావతార మనుకొనవచ్చును (దివ్యమానవుడును దీనికి దగ్గరవాడే గాన, అతని విషయము జూతము). భగవంతుడు హృదయములో నుండు (18-61) నని గీత చెప్పును; అవశ్య మిది సూక్ష్మశరీరములోని హృదయము, భావములు, సంవేదనలు (sensations) మనశ్చేతనయొక్క కేంద్రము; వైయక్తిక పురుషస్థానమును ఇదియే-కాని ఈశ్వరు డిచ్చట మఱుగున తన మాయాసమావృతుడై యండును. కాని మనలోనే పైన, మన ఇప్పటి చేతన కందని ఒక భూమిక గలదు, ప్రాచీనయోగులు దానినే స్వర్గ మనిరి; ఇచ్చట జీవేశ్వరు లిరువురు ఒకే మూలసత్త గలవారుగా ప్రకటితమగుదురు. కొన్ని సంకేత విధానములలో వీరు దివ్యపితయు

దివ్యపుత్రుడును. ఒకరు దివ్యపురుషుడు, రెండవవారు అతడు పితకాగా, అతని దివ్య ప్రకృతి* తల్లికాగా పుట్టి, నిమ్న, మానవప్రకృతిలోనికి వచ్చినవారు. ఈ దివ్యప్రకృతి "పరా ప్రకృతి" (7-5), "పరామాయా." క్రైస్తవుల అవతారమునకు ఇదియే రహస్యసిద్ధాంతముగా గన్పించును. ఈ సిద్ధాంతముయొక్క త్రిమూర్తియందు, పిత ఈ అంతరస్వర్గమున పైన ఉండును; పుత్రుడు, గీతనుబట్టి జీవరూపము ధరించిన పరప్రకృతి.(7-5), దివ్య మానవుడుగా భూమిపైకి దిగును; పరిశుద్ధాత్మ (the Holy Spirit) బ్రహ్మచేతన; ఇది వా రిరువురిని ఏకముచేసి, అన్యోన్యవ్యవహారమునకు సాధనమగు తత్త్వము; ఏలన ఈ పరిశుద్ధాత్మ ఏసుపై దిగినట్లు వినుచున్నాము మఱియు దీని అవతరణమే సామాన్యకోటికి జెందిన ఏసుశిష్యులలోనికి ఉచ్చతరచేతన యొక్క శక్తులను గొనివచ్చెను.

8. బ్రహ్మచేతన - పురుషోత్తమచేతన

ఇట్లు బ్రహ్మచేతన గాక, దానిని మించిన పురుషోత్తమచేతనయే మానవ భావములోని కవతరించను వచ్చు, జీవచేతన దానిలో అంతరించను వచ్చు, ఉదాహరణకు శ్రీ చైతన్యునివిషయములో ఇది అపుడపుడు సంభవించె నని ఆయన సమకాలికులు చెప్పుదురు. నేను ఈశ్వరభక్తుడను, అనురక్తుడను మాత్రమే అని చెప్పుచుండిన చైతన్యుడు అసాధారణక్షణాలలో ఈశ్వరు డయ్యెను, ఈశ్వరుడుగా భాషించెను, వ్యవహరించెను. అపుడు దివ్యసన్నిధి కుండు తేజము, ప్రేమ, శక్తి వెల్లువలై పాఱెను. ఇదియే సామాన్యస్థితి యనుకొందు మేని, మాధ్యమిక భావము ననుసరించి, ఇది అవతారము గావలయును. ఏలన ఇచ్చట మానవ వ్యక్తిత్వము ఆరోహణద్వారా దివ్యసత్తలో నంతరించిపోగా, తత్ఫలితముగా దివ్యసత్తా సంకల్పములు, శక్తిప్రేమలు, తేజశ్చేతనలు జీవవ్యక్తిత్వము నంతను అక్రమించి వ్యవహరించుట అసంభవము గాదు. ఇక నిది కేవలము దివ్యజన్మలోనికి, దివ్యప్రకృతి లోనికి మన మానవభావముయొక్క ఆరోహణమే గాక, మానవభావములోనికి దివ్య పురుషుని అవరోహణము నగును, అనగా ఒక అవతారము నగును.

*బౌద్ధ కథలను బట్టి బుద్ధుని తల్లి పేరు మాయ : ఈ పదము ఈ సంకేతమును స్పష్టపఱచును; ఇక క్రైస్తవసంకేతమున, క్రీస్తు మానవమాతనే కన్యయని చెప్పి, క్రీస్తు పర ప్రకృతినుండి పుట్టినవాడని సూచించబడినది. - శ్రీ అరవిందులు

9. సాక్షాదవతార ప్రక్రియ

కాని గీత ఇంకను ముందుకు బోవును. ప్రభువు స్వయముగా జన్మించుట నది వచించును. కృష్ణుడు గతించిన తన అనేకజన్మలను ప్రస్తావించి, అవి ప్రభువును స్వీకరించగలిగిన జీవుని జన్మలు గాక, సరాసరి ప్రభువు జన్మలే నని తాను వాడిన భాషచేత స్పష్టపరచును – "నే నజుడను, భూతముల కీశ్వరుడనైనను, నేను నా ఆత్మను నా మాయచేత సృజించుకొందును" (4–6). ఈ ప్రక్రియయందు నా ప్రకృతిక్రియల కధ్యక్షత వహింతును. ఇచ్చట ఈశ్వరుడు ఆరోహణద్వారా తనతో ఏకమైన సామాన్యమానవుడు లేక దివ్యమానవునిద్వారా కాక, తన ప్రకృతి ద్వారానే అవతరించును – మానవాకారము, ప్రకారము గల జన్మలోని కవతరించును; దానిలోనికి తన చేతనను, శక్తిని గొనివచ్చును; అయితే ఆశక్తిని మానవాకారము, ప్రకారము, మూలరూపముల కనుగుణముగానే ప్రయోగించుటకు సమ్మతించును మఱియు తన మానవశరీరమునందలి క్రియలను తాను లోపలను, పైనను అధివసించు ఆత్మగా పాలించును – "ప్రకృతిం స్వాం అధిష్ఠాయ" (4–6) ఇట్లు తన ప్రకృతినే గాక, నిజాని కతడు మానవప్రకృతిని, సమస్తప్రకృతిని సదా పై నుంచియే శాసించును; మఱియు గుప్తముగా లోపలినుంచియు శాసించును. కాగా భేద మేమి యన, అతడు తన మానవరూపమునందు వ్యక్తముగా నుండును; తన మానవరూప మతని సన్నిధిని ప్రభువుగా, అంతర్యామిగా నెఱుంగును; మఱియు పై నుండి తన గుప్తసంకల్పముచేత గాక – "స్వర్గమునందలి పితృసంకల్పముచేత" గాక – తన ప్రకృతి నతడు తన ప్రత్యక్ష, అభివ్యక్తసంకల్పముచేతనే నడుపును. ఇక్కడ మానవమధ్యవర్తి కవకాశమే లేదు; ఏలన ఇచ్చట జీవుని ప్రత్యేకప్రకృతిని గాక, అవతారభగవంతుడు తన స్వీయప్రకృతినే – "ప్రకృతిం స్వాం (4–6) –" అధిష్ఠించి మానవజన్మను స్వీకరించును.

10. అవతారము దివ్యతామానవతల సంపుటి

మానవబుద్ధికి అవతారసిద్ధాంతము నామోదించుట కడుంగడు కష్టము; అవతారమునందు గన్పించు మానవతయే దీనికి గారణము. అవతారము సదా దివ్యతామానవతల ద్వివిధరూపము; భగవంతుడు మానవప్రకృతిని దాని సమస్త బాహ్యపరిమితులతోను స్వీకరించి, వానినే తన దివ్యచేతనాశక్తుల ఉపకరణములు మఱియు సాధనలు జేసికొనును, తన దివ్యజన్మ, దివ్యకర్మలకు పాత్రము గావించు

కొనును. నిశ్చయముగా అట్లే గావలయును, లేనిచో అవతారలక్ష్యమే సిద్ధించదు; ఏలన ఎన్ని పరిమితులున్నను, మానవజన్మ దివ్యజన్మకు ఉపకరణము, ఉపాయము చేయబడగల దని నిరూపించుటయే సరిగా అవతార లక్ష్యము; ఇంకను మానవచేతనారూపము అభివ్యక్తముచేయబడిన దివ్యచేతనాసారముతో సంగతము కాగల దనియు, దానికి పాత్రముగా మాఱగల దనియు, మఱియు తన రూప పరివర్తనముచేతను, తన తేజఃప్రేమాదిశక్తుల పెంపుదలచేతను దాని కెక్కువ అను రూపము కాగల దనియు నిరూపించుటయే అవతార లక్ష్యము; చివరకు ఇదంతయు నెట్లు సాధించబడగలదో చూపుటయు అవతారలక్ష్యమే. అసాధారణశక్తుల ప్రయోగము మానవస్వభావమునకు సంభవమే; ఉదాహరణకు, రోగనివారణ మహిమలనబడు మహిమలు క్రీస్తువిషయమున గన్పించును. కాని మహిమల చమత్కారమే అవతార మగుచో, అది అర్థములేని ఒక వైపరీత్యమే యగును; ఏలన పైన చెప్పిన దాని లక్ష్య మపుడు సిద్ధించదు. అవతారము చమత్కారములను ప్రదర్శించు గారడీవానివలె రాదు; కాని మానవజాతికి దివ్యనేతవలె వచ్చును, దివ్యమానవతకు దృష్టాంతముగా వచ్చును. మానవశోకమును, భౌతికదుఃఖమును సైతము అతడు స్వీకరించి, దానిని మానవనిష్కృతి (redemption) సాధనగా నెట్లు ఉపయోగించవచ్చునో ముందు చూపవలయును – క్రీస్తు ఇట్లే చూపెను; తర్వాత మానవప్రకృతియందు దివ్యాత్మ స్వీకరించిన ఈ దుఃఖము మానవప్రకృతియందే ఎట్లు అతిక్రమించబడగలదో అవతారము చూపవలయును – బుద్ధు డిట్లే చూపెను. "నీవు భగవంతుని పుత్రుడవే యగుచో, శిలువనుండి దిగిరమ్ము" అని హేతువాది క్రీస్తుకు సవాలు విసరును, లేక "అవతారము మరణించెను మఱియు కుక్కవలె నికృష్టరోగముతో చచ్చెను. కావున అవతారము భగవంతుడు గాడు" అని పండితవచనములు పలుకు హేతువాదికి తానేమి అనుచున్నది తనకే తెలియదు ! ఏలన అవతారతత్త్వమునే అతడు పాపము, స్పృశింపలేదు. ఇంకను ఆనంధావ తారము రాగలుగుటకు ముందు దుఃఖావతారము రాకతప్పదు. ఏలన మానవపరిమితిని స్వీకరించిననే తప్ప, దాని నెట్లు అతిక్రమించగలమో చూపుట సాధ్యము కాదు; మఱియు ఈ అతిక్రమణ మెట్లో, ఎంతవరకో కేవల మాంతరమో లేకబాహ్యము కూడనో – ఇది మానవప్రగతిదశమీద నాధారపడియుండును; అంతేకాని ఈ అతిక్రమణమును అమానవచమత్కారముచేత సాధించగూడదు.

11. అవతార మనఃశరీరము లెట్లు సృజింపడును?

అవతారము మానవశరీరమును, మనస్సును ఎట్లు స్వీకరించును?– ఈ ప్రశ్నకు సమాధానము బుద్ధిపరిధిలోనిది గాదు గావున, అది తన ఎల్లను దాటి తొట్రుపడును. ఈ ప్రశ్నకు గారణ మేమన, ఈ మనఃశరీరములు అకస్మాత్తుగాను, ఒకే అచ్చులోను గాక, ఒక విధమగు పరిణామముచేత – భౌతిక లేక ఆధ్యాత్మిక లేక ఉభయవిధ పరిణామముచేత–సృజింపబడును. సందేహము లేదు, జీవుని ద్వితీయ దివ్యజన్మవలె, అవతారజన్మయు ఒక ఆధ్యాత్మికఘటనయే– "ఆత్మానం సృజామి" (4–6) అది ఆత్మజననము. కాని దీనితోబాటు శరీర జన్మయు నుండును. అయినపుడు అవతారముయొక్క ఈ మానవ మనఃశరీరము లెట్లు సృజించబడును; శరీరము సదా ఆనువంశికపరిణామముద్వారా అచేతన ప్రకృతిచేతను, తదంతర్గత ప్రాణశక్తి చేతను సృజింపబడును, దీనిలో వైయక్తికాత్మ ప్రమేయ మేమియు లేదని మన మనుకొనుచో, విషయము సరళమగును. కాని పునర్జన్మయందు జీవాత్మ తన శరీరము సిద్ధము చేసికొనును, ఆత్మాపేక్ష లేక శరీరము సిద్ధము గాదు. మఱియు "యుగయుగము నందును సంభవింతును" (4–8)– అని గీత అవతారమునకు గూడ పునర్జన్మను సాహసోపేతముగా జెప్పుచున్నది. కావున జీవాత్మవలెనే అవతారమును శాశ్వతము లేక సంతత మనియు, అది స్వయముగానే తనకు తగిన శరీరమును రూపొందించుకొను ననియు తలంపవలెనా? ఈ విధమగు భావముతోనే విష్ణుదేవుని దశావతారముల రూపపరంపరా వికాసమును వ్యాఖ్యానించు వారున్నారు : ఆదిలో మత్స్యకూర్మవరాహావతారముల పశు రూపములు; తదుపరి నారసింహుని పశు–మానవ రూపము; పిమ్మట వామనుని వామనమగు మానవాత్మ రూపము; తర్వాత పరుశురాముని ఉద్దండ అసుర రూపము; తర్వాత దివ్యప్రకృతితో వచ్చిన మహత్తర దశరథరామ రూపము; తర్వాత ఉద్బుద్ధ ఆధ్యాత్మికమానవుడు, బుద్ధ రూపము; మఱియు బుద్ధునికంటె కాలమున ముందు వచ్చినను, స్థానమున సర్వోత్కృష్టమగు సంపూర్ణదివ్యమానవతారూపము, కృష్ణ రూపము, ఇదియే చరమావతారమును; ఏలన దశమావతారమగు కల్కి కృష్ణుడు ప్రారంభించిన కార్యమునే సమాప్తమొనర్చును – పూర్వావతారములు ఏ మహా సంగ్రామమును అంకుర రూపమున సిద్ధపఱచిరో, దాని నతడు వృక్షరూపమున పూర్ణ మొనర్చును. ఇప్పటి మన మనస్తత్త్వమునకు ఈ వ్యాఖ్య నంగీకరించుట కష్టమే, కాని గీతాభాష తదంగీకారమునే అపేక్షించుచున్నట్లు గన్పట్టును. లేక గీత ఈ సమస్యను తెగవేసి

పరిష్కరించదు గనుక, మన స్వీయవిధానమున దానిని బరిష్కరించుకొనవచ్చును : జీవుడే శరీరమును సిద్ధపఱచగా, జన్మ తదాదిగా భగవంతుడు దాని నధిష్ఠించును (స్వీకరించును). లేక ప్రతిమానవ మనస్సుకు, శరీరమునకు ఆధ్యాత్మికపిత లగు నలుగురి మనువులలో (10-6) నొకరు దానిని సిద్ధపఱచును. కాని ఇది యంతయు గుహ్యభూమికలో లోతునకు దిగుటయే యగును. ఈ దిగుట అధునికహేతువునకు గిట్టని విషయము. కాని అవతారభావము నంగీకరించినపుడే అట్లు దిగుట జరిగెను గనుక, ఆ క్షేత్రమున పట్టుగానే ఎందుకు ముందుకు సాగరాదు?

12. భౌతికావతారము - ఆత్మికావతారము

ఇదిగో, ఇదియే గీతయొక్క అవతారసిద్ధాంతము. క్రిందటి వ్యాసమున అవతారసంభవతపైనను, ఇచ్చట అవతారప్రకియపైనను విశేషముగా దృష్టి సారించుటకు గారణము, అవతారముపట్ల హేతుబుద్ధికి గన్పించు కఠినతలను ఎదుర్కొని పరిష్కరించవలయు ననియే. భౌతికావతారము, అవతారముయొక్క భౌతిక పార్శ్వము, గీతయందు ఎక్కువ స్థల మాక్రమించని మాట నిజమే; అయినను దాని కొక నిశ్చితస్థానము గలదు మఱియు నది సర్వత్ర అనుస్యూతముగా నుండును. గీతాబోధనకు చక్రమే 'విభూతిని' నడిపించు అవతారము-విభూతి యన మానవ భావముయొక్క చరమస్థితి నందుకొన్న మానవుడు; అతనిని అవతారము దివ్యజన్మకును, దివ్యకర్మకును నడిపించును. సందేహము లేదు, తనలోనికి మానవాత్మను ఉద్ధరించు నిమిత్తము స్వరూపతః భగవంతుని అంతరవతరణమే ముఖ్యము - ఆంతర క్రీస్తు, కృష్ణుడు, లేక బుద్ధుడే ముఖ్యము. కాని ఆంతరవికాసమునకు బాహ్యజీవన మెంతో ఆవశ్యక మైనట్లే, అంతరాత్మయొక్క సమధికాభివ్యక్తికి బాహ్యావతారముయొక్క మూల్యమును తక్కు వేమియు గాదు. మనఃశరీరములు అంతరాత్మకు ప్రతీకలు; కావున ప్రతీకయందలి పూర్ణత ఆంతరసత్యముయొక్క అభివృద్ధికి తోడ్పడును. తర్వాత ఆంతరసత్యము పూర్ణతరప్రతీకద్వారా ఎక్కువ శక్తితో బాహ్యజీవమున తనను ప్రకటించుకొనును. ఇట్లు లోపల సత్యాను భూతియు, వెలుపల దాని ప్రకటనమును అన్యోన్యసాధకములు. మానవభావము నందు భగవదభివ్యక్తి గోపనము మఱియు ప్రకటనము నను ఈ పై చక్రముద్వారా ముందుకు సాగును.

17. దివ్యజన్మ, దివ్యకర్మ

1. దివ్యకర్మకును రెండు పార్శ్వములు

అవతార మే కర్మ నిమిత్తము వచ్చునో, ఆ కర్మకును, అతని జన్మకు వలెనే, ద్వివిధార్థము, ద్వివిధరూపము నుండును. భగవచ్ఛక్తి బాహ్య ప్రపంచముపై చేయు కర్మ దాని బాహ్యరూపము; ఇది మానవజాతియొక్క భగవదున్ముఖ ప్రయత్నమును పాలించు దివ్యధర్మమును నిలబెట్టి, దానికి నూతనరూప మిచ్చును. ఈ ధర్మము కృశించుచో, పతనము తప్పదు. ఏలన అపుడు లేచుచు, పడుచును, పురోగమించుచు, తిరోగమించుచును ముందుకు సాగు ప్రకృతిధర్మమే జాతిగతిని శాసించును. పోగా, భగవదున్ముఖచేతనయొక్క భగవచ్ఛక్తి వ్యక్తి-ఆత్మపైనను, జాతి-ఆత్మపైనను జేయు కర్మ దాని ఆంతర రూపము; దీనివలన ఆత్మ మానవుని యందు భగవదావిష్కరణము యొక్క నవ్యరూపములను స్వీకరించగలుగును మఱియు నీ ఆంతరకర్మ, తన ఊర్ధ్వ ముఖ స్వీయవికసనమునందు ఆత్మను ధరించి నవీకరించి, సమృద్ధము గావించును. మానవుల వ్యావహారికబుద్ధి తలపోయునట్లు, అవతార మొక మహాబాహ్యాకార్యము నిమిత్తమే రాదు. బ్రాహ్మకర్మకును, ఘటనకును అవి సంకేతరూపమున సూచించు భావమును బట్టియే విలువ యేర్పడును.

2. ఘటనాసంకటము-చేతనాసంకటము

ఏ సంకటమునందు అవతార మావిర్భవించునో, అది స్థూలప్రపంచమునందలి ఘటనలు మఱియు మార్పుల సంకటముగానే బాహ్యనేత్రమునకు గన్పించును. కాని అది తన మూలమునందును, పరమార్థమునందును మానవజాతిచేతనలోనే ఉద్భవించిన సంకటము; దీనివలన చేతన పెద్ద మార్పునకు లోనై, నూతన వికాసమును బొందును. ఈ మార్పును సాధించుటకు ఒక దివ్యశక్తి ఆవశ్యకము. కాని శక్తి సదా తన గర్భములో నుండు చేతనను బట్టియే యుండును గాన, దివ్యశక్తి అవశ్యక మన, మానవుల మనఆత్మలయందు దివ్యచేతన అభివ్యక్తమగుట ఆవశ్యకమనియే అర్థము. ఇక నెక్కడ, రావలసిన మార్పు ప్రధానముగా బౌద్ధికము, వ్యావహారికమో, దానికి అవతారము కల్పించుకొనవలసిన పనిలేదు. అట్టియెడ స్వయముగానే మానవుల చేతనయు, శక్తియు ఉత్కర్షను బొందును; ఈ ఉత్కర్ష విభూతి మానవులలో పరాకాష్ఠను ప్రాపించును, ఈ విభూతులే మార్పును

సాధించుటకు నాయకత్వము వహించగలరు. యూరోపులో సంభవించిన మత విప్లవమును, ఫ్రాన్సులో సంభవించిన రాజకీయవిప్లవమును ఇట్టి సంకటములే. అవి మహత్తర ఆధ్యాత్మికసంఘటనలు గావు, ప్రత్యుత భౌద్ధిక, వ్యావహారిక పరివర్తనములే - ఒకటి మతపరమైన, రెండవది రాజకీయమైన భావములు, రూపములు మఱియు ప్రేరణలలో వచ్చిన పరివర్తనము. మఱియు జనుల సామాన్యచేతనలో వచ్చిన మార్పు మానసికము, క్రియాత్మకమే గాని, ఆధ్యాత్మికము గాదు. కాని సంకటముయొక్క మూలము గాని, ఉద్దేశ్యము గాని, ఆధ్యాత్మికమై నపుడు, ఒక మానవరూప మనస్సు నందును, ఆత్మయందును భాగవతచేతన పూర్ణముగానో, ఆంశికముగానో అభివ్యక్తమై, అసంకటమునకు ప్రవర్తకుడుగానో, నేతగానో వ్యవహరించును. అవతార మన నిదియే.

3. నైతికధర్మము ఒక ధర్మము మాత్రమే

అవతారముయొక్క బాహ్యకర్మ గీతయందు ధర్మసంస్థాపనగా (4-8) వర్ణించబడినది. ఎపుడెపుడు ధర్మము వెలవెలబోయి కృశించునో, అధర్మము బలముగా పీడాకరముగా పైకి లేచునో, అపుడు అవతారము వచ్చి ధర్మమును పునరుద్ధరించును (4-7); మఱియు ధర్మాధర్మములకు వానిచేత ప్రేరితులైన మానవులే బాహ్యరూపములు గావున, ధర్మపరాయణులను దుష్టుల బారినుండి రక్షించుటయు, అధర్మమును స్థాపింపగోరు దుష్టులను హతమార్చుటయు అవతారకార్యముయొక్క మిక్కిలి మానవ మఱియు బాహ్యరూప మగును. కాని ఈ బాహ్యరూపమే వాస్తవరూప మని చెప్పి, గీతాభాషకు పేలవము, అపర్యాప్తము నగు లక్షణార్థము (connotation) నిచ్చుట తేలికే యైనను, అది అవతారమునకుగల ఆధ్యాత్మికార్థ గాంభీర్యమును నష్టపఱుచును. ధర్మశబ్దమునకు అనేకార్థములు గలవు- నైతికము మఱియు వ్యావహారికము, ప్రాకృతము మఱియు తాత్త్వికము, మతపరము మఱియు ఆధ్యాత్మికము, ఇతరార్థము లను విడిచివేసి, వీనిలో ఏ భావమునం దైనను ధర్మశబ్దమును ప్రయోగించవచ్చును. నైతికముగా ధర్మమున కర్థము సదాచార నియమమగును, లేక ఇంకను బాహ్య తాత్పర్యమున సాంఘిక, రాజకీయ న్యాయమగును, లేక కేవలము సాంఘికనియమ పాలనమే యగును. ఈ అర్థమునందే ధర్మశబ్దము ప్రయుక్తమగుచో, దురాచారము, అన్యాయము, అత్యాచారము ప్రబలి నపుడు, అవతారము వచ్చి సాధువులను రక్షించి, దుష్టులను దునుమాడి, అన్యాయ అత్యాచారములను భగ్నముగావించి, నైతికసమతను పునరుద్ధరించు నని మనము గ్రహించవలయును.

సాధించుటకు నాయకత్వము వహించగలరు. యూరోపులో సంభవించిన మత విప్లవమును, ఫ్రాన్సులో సంభవించిన రాజకీయవిప్లవమును ఇట్టి సంకటములే. అవి మహత్తర ఆధ్యాత్మికసంఘటనలు గావు, ప్రత్యుత భౌద్ధిక, వ్యావహారిక పరివర్తనములే - ఒకటి మతపరమైన, రెండవది రాజకీయమైన భావములు, రూపములు మఱియు ప్రేరణలలో వచ్చిన పరివర్తనము. మఱియు జనుల సామాన్యచేతనలో వచ్చిన మార్పు మానసికము, క్రియాత్మకమే గాని, ఆధ్యాత్మికము గాదు. కాని సంకటముయొక్క మూలము గాని, ఉద్దేశ్యము గాని, ఆధ్యాత్మికమై నపుడు, ఒక మానవరూప మనస్సు నందును, ఆత్మయందును భాగవతచేతన పూర్ణముగానో, ఆంశికముగానో అభివ్యక్తమై, అసంకటమునకు ప్రవర్తకుడుగానో, నేతగానో వ్యవహరించును. అవతార మన నిదియే.

3. నైతికధర్మము ఒక ధర్మము మాత్రమే

అవతారముయొక్క బాహ్యాకర్మ గీతయందు ధర్మసంస్థాపనగా (4-8) వర్ణించబడినది. ఎపుడెపుడు ధర్మము వెలవెలబోయి కృశించునో, అధర్మము బలముగా పీడాకరముగా పైకి లేచునో, అపుడు అవతారము వచ్చి ధర్మమును పునరుద్ధరించును (4-7); మఱియు ధర్మాధర్మములకు వానిచేత ప్రేరితులైన మానవులే బాహ్యారూపములు గావున, ధర్మపరాయణులను దుష్టుల బారినుండి రక్షించుటయు, అధర్మమును స్థాపింపగోరు దుష్టులను హతమార్చుటయు అవతారకార్యముయొక్క మిక్కిలి మానవ మఱియు బాహ్యారూప మగును. కాని ఈ బాహ్యరూపమే వాస్తవరూప మని చెప్పి, గీతాభాషకు పేలవము, అపర్యాప్తము నగు లక్షణార్థము (connotation) నిచ్చుట తేలికే యైనను, అది అవతారమునకుగల ఆధ్యాత్మికార్థ గాంభీర్యమును నష్టపఱుచును. ధర్మశబ్దమునకు అనేకార్థములు గలవు- నైతికము మఱియు వ్యావహారికము, ప్రాకృతము మఱియు తాత్త్వికము, మతపరము మఱియు ఆధ్యాత్మికము, ఇతరార్థము లను విడిచివేసి, వీనిలో ఏ భావమునం దైనను ధర్మశబ్దమును ప్రయోగించవచ్చును. నైతికముగా ధర్మమున కర్థము సదాచార నియమమగును, లేక ఇంకను బాహ్యా తాత్పర్యమున సాంఘిక, రాజకీయ న్యాయమగును, లేక కేవలము సాంఘికనియమ పాలనమే యగును. ఈ అర్థమునందే ధర్మశబ్దము ప్రయుక్తమగుచో, దురాచారము, అన్యాయము, అత్యాచారము ప్రబలి నపుడు, అవతారము వచ్చి సాధువులను రక్షించి, దుష్టులను దునుమాడి, అన్యాయ అత్యాచారములను భగ్నముగావించి, నైతికసమతను పునరుద్ధరించు నని మనము గ్రహించవలయును.

తరణము జాత్యాత్మలో ఆంతరజీవనమునకును, ఆధ్యాత్మిక పునర్జన్మకును ఒక శాశ్వత శక్తి యగును. ఇది విచిత్రము : ఆధ్యాత్మిక సందేశముతో వచ్చిన బౌద్ధ, క్రైస్తవ మతముల శాశ్వతఫలితము వాని నైతిక, సాంఘి కాదర్శముల శక్తియయ్యెను; వాని ఆధ్యాత్మికవిశ్వాసములను నిరాకరించినవారిపైన సైతము ఆ నైతికప్రభావము పడెను. ఉదాహరణకు, బుద్ధుని నిరాకరించిన, తర్వాతి హిందూమతము బౌద్ధ మతముయొక్క సాంఘిక, నైతిక ప్రభావము యొక్కయు, జాతి భావములు మఱియు జీవనముపై దాని పరిణామముయొక్కయు చెఱుపరాని ముద్రను ధరించి యున్నది. అటులే పేరునకు మాత్రమే క్రైస్తవమైన ఆధునిక యూరోపుఖండము నందు క్రైస్తవమతము యొక్క ఆధ్యాత్మికసత్యములు నైతికసాంఘికరంగములలో మానవదయాళుత్వము గాను, రాజకీయరంగములో స్వేచ్ఛా, సమతా, భ్రాతృత్వముల ఆకాంక్షగాను రూపాంతరము బొందినవి; విశేష మేమన ఉద్దండముగా క్రైస్తవమతమును నిరాకరించిన మానవులే ముఖ్యముగా ఈ రెండవ రూపాంతరమును సాధించిరి. పోగా రెండవ వైపున చరిత్రకందని కాలమునకు జెందు రామకృష్ణుల జీవన విషయము మనకు కవిత్వము మఱియు కథలద్వారానే ప్రాప్తించినది. కావున వారిని కల్పన యని అనుకొనినను మనమనుకొనవచ్చును. అందువలన పోవునది లేదు; ఏలన వారు జాతియొక్క ఆంతరచేతనయందును, మానవాత్మ జీవనము నందును ఒక ఆధ్యాత్మికరూపముగా, సన్నిధిగా, ప్రభావముగా నిలిచి యున్నారు; ఇందే వారి శాశ్వతసత్యమును, మూల్యమును గలవు, అవతారతత్వము ముఖ్యముగా దివ్యజీవనమునకును, చేతనకును జెందిన వాస్తవము; అయితే అది బాహ్యక్రియ యందు రూపొందవచ్చును; కాని ఆ బాహ్యక్రియ ముగిసి నప్పుడును ఒక ఆధ్యాత్మిక ప్రభావమున అది నిలిచియుండవలెను; లేక అవతారతత్త్వము ఒక నూతన మతరూపమును ధరించను వచ్చును, కాని ఆ మతము క్షీణించినపుడును జాతియొక్క మేధలోను, స్వభావములోను, బాహ్యజీవనములోను నిలిచియుండవలెను.

6. ధర్మము త్రివిధము

కావున అవతారకార్యముయొక్క గీతావర్ణనను గ్రహించుటకు ధర్మభావమును అత్యంతపూర్ణము, గంభీరము, విపులము నగు రూపమున మనము స్వీకరించవలెను; భగవంతుని సంకల్పవిజ్ఞానములు ఏ బాహ్యాభ్యంతర నియమము ననుసరించి మానవజాతి ఆధ్యాత్మికవికాసమును, జాతిజీవనమున దాని ఫలితములను

సాధించునో, ఆ నియమమే పూర్ణధర్మము. భారతీయభావనయందు ధర్మము కేవలము శుభసమంజసములు, నీతిన్యాయములే గాదు; అది మానవునకు ఇతరులతోను, ప్రకృతితోను, భగవంతునితోను గల సర్వసంబంధములను పాలించు సంపూర్ణ నియమము, ఇక నీ సంబంధములు దివ్యతత్త్వ మొకటి సర్వరూపములందును, క్రియల యందును, వ్యవస్థలయందును తననుదాను రూపొందించుకొనుచుండుట వలన ఏర్పడిన సంబంధములు. దేనిని మనము ధరింతుమో, ఏది మన బహిరంతర వ్యాపారములను సంఘటితపఱచి ధరించునో, అదియే ధర్మము.* ప్రాథమికార్థమున, ధర్మ మన' మన కార్యకలాపము లన్నింటిని నియమించు మన ప్రకృతి గతమగు మూలనియమము; ఏతదర్థమున ప్రతిజీవియు, జాతియు, వ్యక్తియు, సముదాయమును తన స్వీయధర్మమును గలిగియుండును. ద్వితీయరూప మేమన, మనలో వికసించి, అభివ్యక్తముగావలసిన దివ్యప్రకృతి గలదు. దీనికి సంబంధించిన అర్థమున, ధర్మ మన, మన సత్తయందు దివ్యప్రకృతి వికాసమునకు దోహదముచేయు ఆంతరక్రియా నియమము, తృతీయరూపమున, దేనిచేత మనము మన బహిర్ముఖచింతను, క్రియను, మన పరస్పరసంబంధములను నియమించుకొందుమో, అదియే ధర్మము. ఈ ధర్మము దివ్యాదర్శము దిశగా వ్యక్తుల అభివృద్ధికి, జాతి అభివృద్ధికి దోహదకారి యగును.

7. ధర్మాధర్మసంఘర్షము

ధర్మ మొక సనాతన, అవికార్యవస్తు వని సామాన్యముగా చెప్పబడును, మఱియు తన మూలతత్త్వమునందును, ఆదర్శమునందును అది నిజాని కట్టిదే, కాని తన రూపములందు అది మాఱుచు, పరిణతి చెందుచుండును, కారణము, మానవు డింకను ధర్మాదర్శమును బొందలేదు, తద్దిశగా పెరుగుచున్నాడు మాత్రము. ఇట్టి దశలో దివ్యవిశుద్ధత, ఉదారత మఱియు ప్రకాశము, స్వాతంత్ర్యము, శక్తి మఱియు బలము, ఆనందము మఱియు ప్రేమ, శివము, సుందరము మఱియు ఏకతలలోనికి ఏది మన పెరుగుదలకు దోహదమిచ్చునో, అదంతయు ధర్మము. దీనికి ప్రతిగా దీని ఛాయ మఱియు నిషేధరూపమగు అధర్మము వర్తించును. ధర్మగతిని నిరోధించుచు, దాని శాసనము క్రిందికి రాని దంతయు అధర్మము; తనలో రహస్యముగా నున్న దివ్యమూల్యములను వెలువరించక, దురాగ్రహము మఱియు విరోధము, అశుచి,

---

*ధృ–ధాతువునుబట్టి, ధర్మమన ధరించుట యగును.

సంకుచితత్వము మఱియు దాస్యము, అంధకారము, దుర్బలత మఱియు నీచత, అనైక్యము. దుఃఖము మఱియు భేదబుద్ధిరూపమగు బాహ్యాముఖమునే ఏది ప్రదర్శించునో, అదంతయు అధర్మము; మానవుడు తన ప్రగతిమార్గమున విడిచివేయ దగు వికృత, మలిన, మంతయు అధర్మము. ఈ ధర్మాధర్మముల మధ్య నిత్యసంఘర్షము రేగుచుండును; జయాపజయములు అటునిటు ఊగుచుండును. దీనినే వేదములు దేవాసుర సంగ్రామరూపకముగా వర్ణించును- ఇచ్చట నిజానికి దేవు లన ప్రకాశ, అభేదముల పుత్రులు; అసురు లన అంధకార, భేదముల పుత్రులు. మానవజీవనము మఱియు మానవాత్మపై అధికారము పొందుటకే ధర్మాధర్మము లీ పోరుసల్పును.

8. భాగవతము, భక్తుడు భగవంతుడు

ఈ ధర్మాధర్మముల దశను బట్టియే అవతారకార్యము నిర్ణయించబడును. తన ముక్తికి అడ్డుతగులు సమస్తమునుండియు విమోచనకొఱకు బౌద్ధ సూత్రము నందు శిష్యుడు మూడు శక్తులయందు శరణుబొందును- 'ధర్మము'. 'సంఘము', 'బుద్ధుడు.' అటులే క్రైస్తవమతమునందును ఈ మూడును గలవు- క్రైస్తవజీవన ధర్మము, చర్చి, క్రీస్తు. ఈ మూడును అవతారకర్మయందలి ఆవశ్యకాంశములు. నిమ్నజీవనము నుండి ఉన్నతజీవనములోని కారోహించునిమిత్తము అవతారము ఆత్మానుశాసనరూప మగు ఒక ధర్మమును ప్రతిపాదించును; కర్మనియమమును, ఇతరులతో నుండదగు సంబంధనియమమును దీనిలో నొక భాగముగా నుండును. ఈ ధర్మము బౌద్ధమున అష్టాంగమార్గము, క్రైస్తవమున విశ్వాస ప్రేమ విశుద్ధతా మార్గము; ఇట్టి ధర్మములు జీవనమునందు భాగవతప్రకృతియొక్క ప్రకాశనములు. పిమ్మట, ఒకే మార్గము నవలంబించువారు సహజముగా ఒక సాహచర్యములోనికి ఆకర్షింపబడుదురు గాన, అవతార మొక సంఘమును స్థాపించును. ఈ సంఘస్థులను అతని వ్యక్తిత్వ, బోధనలు ఏకముచేయును. వైష్ణవమతమునందు ఇదే త్రయము గలదు- భాగవతము, భక్తుడు, భగవంతుడు. భాగవత మన ఆరాధనా ప్రేమల విధానము; భక్తు డన ఈ విధానము నవలంబించువారి సంఘమునకు ప్రతి నిధి; భగవంతు డన దివ్యప్రేమికుడును, ప్రియుడును-ఇతని సత్తాప్రకృతులయందు దివ్య ప్రేమధర్మము నెలకొని స్వయంపూర్తిని సాధించుకొనును. అవతార మీ భగవంతుని ప్రతినిధియే; ఈ భగవంతుడు ధర్మ, సంఘములకు ఆత్మ; వానిని తనతో పూరించి, సజీవముగా నిలిపి, మానవులను ఆనంద, విమోచనగమ్యమున కాకర్షించును.

9. గీతాధర్మము సర్వసమగ్రము

విశేషవిషయకమగు ఇతరబోధనలు మఱియు సాధనలకంటె ఎక్కువ ఉదారము, సంకీర్ణము నగు గీతాబోధనయందు ఈ ధర్మాదులు మూడును ఒక విశాలతరార్థమును స్వీకరించును. ఏలన ఇచ్చటి ఏకత సర్వసమగ్రమగు వేదాంత ఏకత. ఈ ఏకత చేత ఆత్మ అన్నింటిని తనయందును, తనను అన్నింటియందును చూచుచు, సర్వభూతములతోను ఏకమగును. కావున సర్వ, మానవసంబంధములను ఒక ఉచ్చతర దివ్యభావములోనికి లేవనెత్తుటయే గీతాధర్మ మగును; వేరూనియున్న నైతిక, సామాజిక, మత నియమముతో నారంభించి, దానిని బ్రాహ్మచేతనతో అనుప్రాణితము గావించి లేవనెత్తును. గీత మన కిచ్చు ధర్మము ఏకతా, సమతాధర్మము; విముక్త, నిష్కామ, భగవదధిష్ఠితమగు కర్మధర్మము; సమస్తప్రకృతిని, క్రియను భాగవతసత్తా చేతనలలోని కాకర్షించు ఈశ్వరజ్ఞాన, ఆత్మజ్ఞానధర్మము; మఱియు జ్ఞానకర్మల పరమశక్తిగను, చరమరూపముగను వెలయు భగవత్ప్రేమధర్మము. భగవత్ప్రేమ యందును, అన్వేషణయందును భక్తుల కే సఖ్యభావము గలదో (10–9), అదియే సంఘ భావమునకు మూలము. కాని గీతాబోధనయొక్క వాస్తవ సంఘము భక్త సంఘమే గాదు, సర్వమానవసమాజము. సమస్తజగత్తును, అందలి ప్రతిమానవుడును తన శక్తి ననుసరించి, ఈ ధర్మము దిశగా పయనించుచున్నది గదా:– "మానవులు సర్వథా నన్ను జేర్చు మార్గమునే అనుసరింతురు" (4–11). విశేషించి, భగవ దన్వేషకుడు అందరితోను తన నేకముగావించుకొనును. వారి సుఖ దుఃఖములను, వారి జీవితమునే తనది గావించుకొనును; పోగా, ఇప్పటికే సర్వ భూతములతోను ఏకాత్మభూతుడైన (5–7) విముక్తమానవుడు మానవజాతిజీవనమున జీవించును, మానవజాతియందలి ఏకాత్మనిమిత్తము జీవించును. చరాచరముల యందలి భగవంతునికొఱకు జీవించును. "లోకసంగ్రహార్థము" (3–25) ప్రవర్తించును. ఏలన "నాకొఱకు" (12–10) అని కృష్ణుడు పలికి నప్పటికి, భగవంతుని కొఱ కనియే అర్థము. సర్వావతారములు ఎవని మానవరూపములో అట్టి పురుషోత్తమ పరముగానే కృష్ణుడు పలుకును. అతని ప్రతినిధియే కృష్ణుడు. "నా మతము నెవ రనుష్ఠింతురో" (3–31) వారు వాస్తవజ్ఞానమును. వాస్తవముక్తిని బొందుదురని కృష్ణుడు ప్రకటించిన మాట నిజమే. కాని ఈ మతము (మార్గము) ప్రత్యేక మతము గాక, సర్వమతములను భుక్తముచేసికొనిన మతము. ఏలన భగవంతుడు తన విశ్వభావముతో సర్వావతారము లను, సమస్తబోధనలను, సకలధర్మములను ఆకళించుకొనును.

10. అంతఃసంఘర్షము, బహిఃసంగ్రామము

అంతఃసంఘర్షము, బహిఃసంగ్రామమునను ఏ ద్వివిధసంఘర్షమునకు ప్రపంచము రంగస్థలియో, దానిని గీత ఒత్తి చెప్పును. అంతఃసంఘర్షమునందు శత్రువులు వ్యక్తిలోపల నుందురు, మఱియు కామ, అజ్ఞాన, అహంకారములను వధించుటయే ఇచ్చటి విజయము. కాని ధర్మాధర్మశక్తుల మధ్య మానవసమష్టియందు రేగుచుండు బాహ్యాయుద్ధమును ఒకటి గలదు. ఇందు ధర్మమునకు భగవంతుడును, మానవునియందలి భాగవతప్రకృతియు, ఆ ప్రకృతికి ప్రాతినిధ్యము వహించు లేక దానిని మానవజీవనమున సాధింపజూచువారును అండగా నిలుతురు; పోగా అధర్మమునకు ఆసుర-రాక్షసప్రకృతియు, దానిని నడుపు ప్రచండాహంకారమును, దానికి ప్రాతినిధ్యము వహించుచు, దానిని తృప్తిపఱుపజూచువారును అండగా నుందురు. ఇది వస్తుతః దేవాసుర యుద్ధము. మహాభారతయుద్ధము దీని రూపకము. ఈ రూపకమున కృష్ణుడు సూత్రధారుడుగా చిత్రింపబడును; పాండవులు దేవతల పుత్రులు, మానవరూపమున వారిశక్తులు, వీరు ధర్మరాజ్యసంస్థాపనకొఱకు పోరాడుదురు; పోగా వారి ప్రతిపక్షులు దేహముధరించిన ఆసురశక్తులు, అసురులు. అవతారము ప్రత్యక్షముగానో, పరోక్షముగానో ఈ బాహ్యాయుద్ధమును ప్రోత్సహించుటకును వచ్చును; అతడు అసురరాజ్యము నంత మొందించి, పదాహతమైన ధర్మా దర్శములను పునరుద్ధరించును. అతడు లోపల వైయక్తికాత్మ యందు స్వర్గరాజ్యమును నిర్మించుటకే గాక, పృథివియందు సమష్టిరూపమున స్వర్గరాజ్యమును దగ్గరకు తెచ్చుటకును వచ్చును.

11. అవతారమువలన గలుగు ఆంతరఫలము

అవతార మరుదెంచి నపుడు, అతని దివ్యజన్మ మఱియు దివ్యకర్మయొక్క యథార్థ మర్మ మెవ రెఱుంగుదురో, ఎవరు తమ చేతనయందు తన్మయులై, సర్వాత్మనా అతనినే ఆశ్రయింతురో, వారు తమ జ్ఞానముయొక్క సాక్షాత్కారశక్తిచేత పునీతులై, అట్లు అవరప్రకృతినుండి విముక్తులై, భగవంతుని దివ్యసత్త మఱియు దివ్యప్రకృతిని ప్రాపింతురు (4-9,10). మనకు పరిచితమైన నిమ్నప్రకృతిపై మానవునియందు గల దివ్యప్రకృతి నావిష్కరించుటకును, దివ్యకర్మస్వరూపమును చూపుటకును అవతారము వచ్చును-బంధరహితము, నిరంహకారము, నిఃస్వార్థము, నిర్వ్యక్తికము,

విశ్వవిషయకము నగునవి దివ్యకర్మలు; దివ్యతేజోమయము, దివ్యశక్తిమయము, దివ్యప్రేమమయము నగునవి దివ్యకర్మలు. అవతారము దివ్య వ్యక్తిత్వముగా వచ్చి, మానవవునియందలి ఆహంకారికవ్యక్తిత్వము నాక్రమించగా, నది అనంతతలోనికి, విశ్వవిశాలతలోనికి విముక్తమగును. అతడు దివ్యశక్తి మఱియు దివ్యప్రేమగా వచ్చును, ఈ శక్తిప్రేమలు మానవులను తమలోనికి బిలుచును; వారు వానియందే ఆశ్రయము గొని, కోపతాపసంకులమగు తమ మనఃసంక్షోభమునుండి బైటపడి, భగవంతుని శాంత్యానందములలో నివసించగలుగుదురు. మఱియు అవతార మే నామరూపములతో వచ్చునో, ఏ భాగవతగుణము నభి వ్యక్తము చేయునో, అదియు ముఖ్యము గాదు; ఏలన మానవులు తమ స్వభావము ననుసరించి, ఏ మార్గము నవలంబించినను, అది తనను జేరు నిమిత్తము ఏర్పఱచిన మార్గమే గాన, చివరకు వారి నది అతని కడకే గొనిపోవును, "మానవు లేయే రీతిగా భగవంతుని స్వీకరించి, ప్రేమించి, భగవంతునియందు రమింతురో, ఆయా రీతిగానే అతడు వారిని స్వీకరించి, ప్రేమించి, వారియందు రమించును"- "భజామి" (4-11),

18. దివ్య కర్త

1. కర్మయోగ స్వరూపము

దివ్యజన్మను - ఉచ్చతరచేతనలోనికి దివ్యతాసాధకమగు ఆత్మయొక్క నవ్య జన్మను-బొందుటయు, అట్లు పొందకపూర్వము దానికి సాధనగా, పొందిన పిమ్మట దాని ప్రకటనముగా దివ్యకర్మ చేయుటయు - గీతాకర్మయోగ మంతయు నిదియే. ఎట్టి బాహ్యలక్షణములచేతను గీత దివ్యకర్మను నిర్వచింపబూనుకొనదు గాన, బాహ్యదృష్టికి దానిని గుర్తింప శక్యముగాదు; పైగా సాధారణ నైతికవిభేదములను సైతము పేర్కొనక, వానిని గీత బుద్ధిపూర్వకముగా విడిచి వేయును గాన, మానవ బుద్ధితో కర్తవ్యమును నిర్ణయింప గీతలో నెట్టి వెలుగు లభించదు. ఏ లక్షణముల చేత గీత దివ్యకర్మలను వివేచించునో, అవి యన్నియు మిక్కిలి ప్రగాఢములు, ఆభ్యంతరములు; ఆ కర్మలను గుర్తించదగు ముద్ర అదృశ్యము, ఆధ్యాత్మికము మఱియు అతినైతికము

2. కర్మతత్త్వము మిక్కిలి గహనము

ఆత్మనుంచి వెలువడు దివ్యకర్మలను ఆత్మప్రకాశముచేతనే తెలియనగును. ఏలన "ఏది కర్మ ? ఏది అకర్మ ? అను విషయమున మునులు సైతము విమోహితు లగుదురు" (4-16); దీనికి కారణము, వీరును ఆగంతుక, వ్యావహారిక ప్రమాణములను బట్టియే కర్మను వివేచింతురు గాని, దాని మూలమునకు బోరు. "ఏ కర్మ జ్ఞానముచేత నీవు సర్వానర్థములనుండి విముక్తిని బొందెదవో, అట్టి కర్మ నిపుడు ప్రవచింతును. కర్మను గుఱించియు,వికర్మను గుఱించియు నెఱుంగవలసియున్నది; కర్మమార్గము కడు జటిలము" (4-16, 17), ప్రపంచమునందలి కర్మ గహనారణ్యము వంటిది, దానిలోనుంచి మానవు డెటులో తూలుచు పయనించును; తన కాలమునందలి భావములు, తన వ్యక్తిత్వము నిర్దేశించు ప్రమాణములే అతని కీ మార్గమున వెలుగు; అథవా అనేకకాలములు, అనేక వ్యక్తిత్వములు, అనేకసాంఘికావస్థలకు జెందిన ఆలోచనలు, ఆచారములు విడదీయరానివిధముగా కలిసిపోయి అతనిని తికమక పెట్టును. పైగా ఇవి యన్నియు తాత్కాలిక, సాంప్రదాయిక సత్యములే యైనను శాశ్వత, స్వరూపసత్యములుగా తమను చెప్పుకొనును. సామాన్యమానవుని అవస్థ యిటులుండ, ఈ సంకర మంతటియందును ఒక ఉత్తమాధారమును, మూల సత్యమును అన్వేషించుచు, కర్మయే ఒక భ్రమ గాదా? జీవనమే ఒక పాశము

గాదా? మేల్కొనిన మానవునికి కర్మనివృత్తియే, "అకర్మ"యే అంతిమ ఆశ్రయము గాదా? యని ముని ప్రశ్నించుకొనును. కాని ఇదియు భ్రమయే నని కృష్ణుడు పలుకును; ఏలన అకర్మ చేత గాక, కర్మ చేతనే జ్ఞానమును, విముక్తియు ప్రాప్తించును.

3. నిరహంకారత ప్రథమలక్షణము

అకర్మచేత గానిచో, ఎట్టి కర్మచేత జీవితానర్థములనుండి ముక్తి ప్రాప్తించును? సదుద్దేశముతో చేసిన కర్మలనుండి సైతము ఉప్పతిల్లు అనూహ్యఫలితము నుండియు, అశుభదుఃఖముల శతసహస్రరూపములనుండియు ముక్తి ప్రాప్తించును ? ఎట్టి కర్మ? అని ప్రశ్న వచ్చి నపుడు, కర్మయం దే బాహ్యవిభేదములను బాటింప బనిలే దని సమాధానము. ప్రపంచగతి కావశ్యకమగు ఏ కర్మనైనను పరిహరింపబని లేదు. పైగా సర్వకర్మలు చేయబడవలెను, అయితే భగవంతునితో యోగమునం దున్న ఆత్మస్థితినుండి చేయబడవలెను– "యుక్తః కృత్స్న కర్మకృత్" (4–18). అకర్మ, అనగా కర్మనివృత్తి తరణోపాయము గాదు; అంతర్దృష్టికి అట్టి అకర్మ స్వయముగా ఒక సంతతకర్మయే యనియు, అది ప్రకృతిగుణకర్మల అధీనావస్థ యనియు గాంచును. భౌతికనిష్క్రియత నాశ్రయించిన మనస్సు ఇంకను, ప్రకృతి గాక, తానే కర్మకర్త యను భ్రాంతిలో నుండును; భ్రమవశమున అది జడతనే ముక్తి యనుకొనును; పాషాణముకంటె స్తబ్ధముగా నున్న శరీరమునందు సైతము, ప్రకృతి పనిచేయుచునే యున్న దనియు, జీవిపై తన పట్టును అక్షతముగా నుంచుకొను ననియు ఆ మనస్సు చూడదు. మనఃస్థితి యిటు లుండ, సంపూర్ణ కర్మప్రవాహమునందు సైతము ఆత్మ తన కర్మలనుండి విముక్తముగా నుండును - అది కర్త గాదు, చేయబడు కర్మచేత బద్ధము గాదు; మఱియు ప్రకృతిగుణముల బంధనమునందు గాక, ఎవడు ఈ ఆత్మవిముక్తియందు నివసించునో, అతనికి మాత్రమే కర్మవిముక్తి గలదు, "కర్మయం దకర్మను, అకర్మయందు కర్మను ఎవడు గాంచునో, అతడే మనుష్యులలో బుద్ధిమంతుడు, వివేకవంతుడు" (4–18) అని గీత వచించిన దాని అభిప్రాయము స్పష్టముగా నిదియే, ఈ వాక్యమున కాధారము పురుష ప్రకృతుల నడుమ గల సాంఖ్యవిభేదమే - పురుషుడు విముక్త నిష్క్రియాత్మ, సదాశాంతుడు, విశుద్ధుడు, కర్మల నడుమనుగూడ అవిచలితుడు; కాగా ప్రకృతి సదాసక్రియము; తన దృశ్యకర్మకోలాహల మునందువలెనే, పాషాణముయొక్క జడతయందును, సన్యాసియొక్క స్తబ్ధత యందును కర్మరతమై యుండును. వివేచనాత్మక బుద్ధి తన శ్రేష్ఠప్రయత్నముచేతమనకు ప్రసాదించు జ్ఞాన మిది; కనుక ఎవని కీ జ్ఞానము

గలదో "అతడు మనుష్యులలో బుద్ధిమంతుడు" (4-18) - అంతే గాని నిమ్నతర యుక్తి కల్పించు బాహ్య, అనిశ్చిత, అస్థాయి విభేదములను బట్టి జీవన, కర్మలను నిర్ణయించబూనుకొను భ్రాంతచేతస్కుడు గాడు. కావున విముక్తమానవుడు కర్మకు భయపడడు, పైగా సమగ్ర మహాకర్త యగును- "కృత్స్నకర్మకృత్" (4-18). అయితే ఇతరులవలె ప్రకృతిపరాధీనుడై కాక, ఆత్మయొక్క ప్రశాంతసమతయందును, భగవంతునితో నిర్మలయోగమునందును ప్రతిష్ఠితుడై కర్మ సేయును. భగవంతు డతని కర్మలకు ప్రభువు; తన వైయక్తిక ప్రకృతియొక్క ఉపకరణత్వముద్వారా, అతడా కర్మలకు ఒక వాహిని (channel, కాలువ) మాత్రము, మఱియు నీ ప్రకృతి తన ప్రభువు నెఱింగి విధేయమై యుండును. ఈ జ్ఞానముయొక్క సముజ్జ్వల తీవ్రత మఱియు విశుద్ధిచేత అగ్నిలోవలె అతని కర్మ లన్నియు కాల్చివేయబడును(4-37), అవి అతని మనస్సుపై ఎట్టి కళంకమును, వికృతచిహ్నమును విడువవు. నేను చేయుచున్నా ననే వైయక్తికాహంకారము లేక, ఈ విమోచకజ్ఞానమునందు సర్వ కర్మలను చేయుట - ఇదియే దివ్యకర్తయొక్క ప్రథమలక్షణము.

4. కామవిముక్తి ద్వితీయలక్షణము

రెండవ లక్షణము కామమునుంచి విముక్తి; ఏలన ఎచ్చట కర్తృత్వబుద్ధి యుండదో, అచ్చట కామ ముండుట అసంభవము; ఆహారము లేక, ఆధారము లేక, శూన్యమై, పడి చనిపోవును. బైటికి ఇతరుల వలెనే విముక్తమానవుడును సర్వ కర్మలను చేయుచున్నట్లు గన్పించును; బహుశః ఇతరులకంటె పెద్ద యెత్తునను, ఎక్కువ శక్తిశాలిసంకల్పముతోను, ప్రబలతరచోదకశక్తితోను అతడు చేయును; ఏలన భగవత్సంకల్ప బలము అతని సక్రియప్రకృతిలో పనిచేయును. కాని అతని సర్వారంభములనుండియు కామమున కుండు అవరసంకల్పము వెలివేయబడును- "సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః" (4-19). అతడు తన కర్మఫలముల యం దాసక్తిని త్యజించివేసి, కర్మప్రభువు చేతిలో ఒక నిర్వ్యక్తిక ఉపకరణముగానే పనిచేయును; కావున అతనిలో కామమునకు తావు లేదు- కర్మఫలము సిద్ధించునట్లు సేవించవలెనను కామమునకు సైతము; ఏలన కర్మఫలమును భగవదిచ్ఛ నిర్ణయించును గాని, తన యిచ్ఛ గాదు. సంకల్పకర్తయే గాక, వాస్తవకర్మకర్తయు భగవంతుడే. విముక్తమానవుని మానవమనస్సు గాని, ఆత్మ గాని ఏమియు చేయదు- "న కించిత్ కరోతి" (4-20). మానవుడు తన స్వీయప్రకృతిద్వారా కర్మయందు ప్రవృత్తుడగు

చున్నప్పటికి, వాస్తవముగా కర్మచేయునది విశ్వప్రకృతి, అనగా భగవంతుని కార్యనిర్వాహకశక్తి, హృదయనివాసియగు ఈశ్వరపాలితయైన చిన్మయదేవత.

5. యోగము కర్మకౌశలము

కర్మ శ్రేష్ఠముగా, విజయవంతంగా, సాధ్యసాధనలను సరిపుచ్చి చేయబడరాదని దీని తాత్పర్యము గాదు; పైగా శ్రేష్ఠకర్మాచరణము యోగస్థుడైన వానికే ఎక్కువ సులభము; ఆశాభయములచేత అంధుడు, కుంటి బుద్ధి చేయు నిర్ణయములచేత కుంఠితుడు, సంక్షుబ్ధమానవసంకల్పమునకు ఆధీనుడు నగు వాని కది సులభము గాదు. గీత స్థానాంతరమునందు నిర్వచించునట్లు "యోగము కర్మల యందు కౌశలము" (2-50). కాని యోగస్థుని కర్మ యంతయు వ్యక్తిగతప్రకృతి ద్వారా పనిచేయు ఒక విశ్వమహాప్రకాశము మఱియు శక్తిచేత నిర్వ్యక్తికముగా చేయబడును. తాను సాధించవలసిన ఫలితమునకు అనురూపశక్తియే తన కివ్వబడు ననియు, తాను చేయవలసిన కర్మ కనురూపమగు దివ్యభావమే దాని వెనక నుండు ననియు, తన యందలి సంకల్పముయొక్క క్రియాశక్తిని, గమ్యదిశను భాగవతవిజ్ఞానము సూక్ష్మరీతిని నడుపు ననియు కర్మయోగికి దెలియును. ఇక కర్మఫలితము సాధారణ మానవ దృష్టికి జయము గావచ్చును, లేదా అపజయముగా గన్పించవచ్చును; కాని కర్మయోగికి మాత్ర మది సదా విజయమే - తాను గాక, కర్మను, ఫలమును మలచుచుండు సర్వజ్ఞప్రభువు ఉద్దేశించిన విజయము; ఈ ప్రభువుయొక్క సంకల్పమును, విజ్ఞానమును బాహ్యావిజయముద్వారాకంటెను బాహ్యాపరాజయము ద్వారానే తఱచుగాను, ఎక్కువశక్తితోను తన ఉద్దేశ్యములను సాధించుకొనును. నిశ్చయముగా విజయము నీదే యగును, యుద్ధము చేయుము (11-34) - అని అర్జును డాదేశింపబడెను; కాని నిశ్చితపరాజయమే ఎదురుగానున్నను, అతడు యుద్ధము చేయవలసినదే; అది తన భాగముగా వచ్చిన తక్షణ కర్తవ్యము, ఇట్టి కర్తవ్యముల సముదాయముచే భగవదిచ్ఛ నిశ్చయముగా నిర్వర్తించబడును.

6. ఆధ్యాత్మిక నిర్వ్యక్తికత తృతీయలక్షణము

విముక్త మానవున కే ఆశలు నుండవు. తన స్వీయసంపత్తిగా అతడు అందిన వస్తువులను దాచుకొనడు; భగవదిచ్ఛ తన కిచ్చినదానిని స్వీకరించును, అతనికి దేనియందును లోభముండదు, ఎవనియందును అసూయపడడు; తనవంతుగా వచ్చినదానిని విరక్తియు, అనురక్తియు లేక స్వీకరించును; తన నుండి పోవుదానిని

సంతాపము, విచారము లేక పోనిచ్చును; అతని చిత్తమును, ఆత్మయు పరిపూర్ణ వశమునందుండును (4-21); కావున బాహ్యస్పర్శలకు వానియందు ప్రతిక్రియా కల్లోలము జనించదు. అతని కర్మ "కేవలము శారీరకర్మ" (4-21); ఏలన తక్కిన దంతయు పై నుంచి వచ్చునే గాని, మానవభూమికయం దుత్పన్నము గాదు; అదిపురుషోత్తముని సంకల్ప జ్ఞానానందముల ఒక ప్రతిబింబము మాత్రము, కనుక నతడు కర్మాచరణము మఱియు కర్మఫలితములందు పట్టుబట్టి, తన మనో హృదయములందు తాపపాపములను ప్రతిక్రియలను బుట్టించుకొనడు. ఏలన పాపస్వరూపము బాహ్యక్రియ గాదు; ఆ క్రియ ననుగమించు లేక దానికి కారణమగు ఏ సవ్యక్తిక సంకల్పము, మనస్సు, హృదయము గలవో, వానినుండి జనించు మలిన ప్రతిక్రియయే పాపము. దీనికి ప్రతిగా ఏది నిర్వ్యక్తికమో, అది సదా విశుద్ధము - "అపాపవిద్ధం" (ఈ.ఉ.) ఈ నిర్వ్యక్తిక మేది చేసినను, దాని కంతకు తన సహజ విశుద్ధిని ప్రసాదించును. ఈ ఆధ్యాత్మిక నిర్వ్యక్తికత దివ్యకర్తయొక్క తృతీయలక్షణము ఒక విధముగా మహత్తను, విశాలతను అందుకొనిన మానవాత్మ లన్నియు తమద్వారా పనిచేయుచున్న ఒక నిర్వ్యక్తిక శక్తిని లేక ప్రేమను లేక సంకల్పజ్ఞానములను గుర్తించి యుందురు; కాని వారు తమ మానవవ్యక్తిత్వము నుండి జనించు ప్రచండ ప్రతిక్రియల నుంచి ఇంకను ముక్తులు గారు. కాని విముక్తాత్మ ఈ విముక్తి నందుకొని యున్నది; ఏలన అతడు తన వ్యక్తిత్వమును నిర్వ్యక్తికాత్మలో విసర్జించెను; ఇక నచ్చట ఆ వ్యక్తిత్వము తనది గాదు, పురుషోత్తమునిది; ఈ పురుషోత్తముడు సమస్త సాంతగుణములను అనంతముగాను, స్వేచ్ఛగాను ఉపయోగించుకొనును, కాని దేనిచేతను బద్ధుడు గాడు. ఇప్పు డతడు ఆత్మ అయ్యెను, ప్రాకృతగుణరాశిగా లేడు; మఱియు ప్రకృతిక్రియ నిమిత్తము అతనిలో మిగిలియున్న వ్యక్తిత్వాభాసము ఇపుడొక బంధముక్తము, విశాలము, నమనీయము (flexible), విశ్వవ్యాపకము నగు వస్తువు; ఇపుడా వ్యక్తిత్వము అనంతము ధరించు ఒక విముక్తాకృతి, పురుషోత్తముడు వేసికొను ఒక సజీవవేషము.

7. సమత చతుర్ధ లక్షణము

పూర్వ లక్షణత్రయమగు జ్ఞానము, నిష్కామత, నిర్వ్యక్తికతలయొక్క ఫలము ఆత్మయందును, ప్రకృతియందును ఒక పరిపూర్ణ సమత యగును. ఈ సమతయే దివ్యకర్తయొక్క చతుర్ధలక్షణము. అతడిపుడు ద్వంద్వములను దాటిపోయెను- "ద్వంద్వాతీతుడు" (4-22). ఈ దివ్యకర్త భావవికారము లేక, సిధ్యసిద్ధులను

సమముగా జూచు (2–38) నని మనము గాంచియున్నాము; ఇవియే గాక, సర్వ ద్వంద్వములు అతనియందు అతిక్రమించబడును మఱియు సమన్వయమును బొందును. అతడును శుభాశుభములను ఉపేక్షించడు, కాని వానికి పైన ఉండును. అతని నిష్కామ దివ్యాత్మకు శుభాశుభములు రెండును సమముగానే వాంఛనీయములు, ఏలన ఈ రెండింటియొక్క సంమిశ్రముచేతనే శాశ్వత శుభముయొక్క వికాసశీల రూపములు క్రమముగా నిర్మించబడును. ఇక దివ్యకర్తకు ఓటమియే యుండదు; ఏలన అతడు ప్రకృతికురుక్షేత్రమున ఒక యోధుడు, మఱియు నీ కురుక్షేత్ర గతి అవశ్యము దివ్యవిజయము వైపునకే జనుచున్నది. కారణము, ఈ సంగ్రామముయొక్క ప్రతిపరిణామమును భవిష్యద్దర్శియగు పార్థసారథి ముందుగనే నిర్ణయించి, నడుపుచున్నాడు. తర్వాత, మానవుల మానావమానములు గాని, నిందాస్తుతులు గాని ఈ దివ్యకర్తను చలింపజేయలేవు; ఏలన అతనికి ఎక్కువ స్పష్టదృష్టిగల మఱియొక నిర్ణాయకుడు (judge) గలడు, అతని కర్మకు మఱియొక ప్రమాణము గలదు, మఱియు అతని కర్మహేతువు లౌకికఫలము గాదు. అర్జునుడు క్షత్రియుడు. అతనికి కీర్తిసమ్మానములపట్ల అదర ముండుట సహజము; పిరికివాడను అకీర్తిని, అవమానమును మరణముకంటెను నికృష్టముగా భావించుట అతనికి యుక్తమే. ఏలన తన గౌరవపదమును, ధైర్యప్రమాణమును కాపాడుకొనుట తన ధర్మములో ఒక భాగము. క్షత్రియుడుగా అర్జును డట్లు చేయవచ్చును గాని, ముక్తాత్మగా అర్జునుడు వానిలో దేనిని పాటించ బనిలేదు. కర్తవ్యకర్మను (3–19), అనగా పరమాత్మ తన నుంచి అపేక్షించు కర్మను తెలిసికొని, అనుష్ఠించి, ఫలితము కర్మప్రభువునకు వదిలి వేయుటమే అతని వంతు. అతడు పాపపుణ్యముల విభేదమును సైతము అతిక్రమించి యున్నాడు. ఈ విభేదము అహంకారపు పట్టును తగ్గించుకొనుటకు ప్రయాసపడు మానవాత్మకు ఎంతయు ముఖ్యమే యైనను, విముక్తమానవుడు ఈ ప్రయాసకు పైన ప్రబుద్ధాత్మయొక్క పరిశుద్ధియందు నెలకొనియుండును గాన, అతనికి ముఖ్యము గాదు. ఆధారము లేక పాప మిపుడు అతనియందుండి పడిపోయినది; ఇక సత్కర్మచేత వృద్ధిని దుష్కర్మచేత క్షయమును బొందు పుణ్యమును గాక, ఇపు డతడు దివ్యప్రకృతి యొక్క సహజ, అక్షయ విశుద్ధి యను శిఖర మారోహించి, అచ్చటనే ప్రతిష్ఠితుడై యున్నాడు.

8. దివ్యధర్మము నిమిత్తము యుద్ధము

ఇంకను అజ్ఞానమునం దున్న అర్జునుడు తన హృదయమున ధర్మన్యాయముల పిలుపును బొంది, తన మనస్సులో నిట్లు తలంచవచ్చును : నేను యుద్ధము నుండి

విరమించుట పాపమగును. కారణము, అపుడు అధర్మము విజయము బొంద, దాని సంతానమగు అన్యాయ, అత్యాచార, అశుభకర్మలు ప్రజలను, జాతులను పీడించును; ఆ పీడకు బాధ్యత నాదే యగును. అథవా అతని హృదయము నందు హింసాహత్యలపట్ల జుగుప్స జనించగా, రక్తపాత మెట్టి సందర్భములో నైనను పాపమే యగు నని వాదించుకొనవచ్చును. ఈ రెండు వైఖరులును నీతికిని, హేతువునకును సమముగా నచ్చవచ్చును. కాగా వీనిలో నేది అతని మనస్సు నందు లేక ప్రపంచ సమ్ముఖమున ప్రాబల్యము వహించునో, అది వ్యక్తిపైన, పరిస్థితులపైన, కాలముపైన ఆధారపడును. అథవా తన శత్రువులకు ప్రతిగా తన మిత్రుల పక్షము వహింప తన హృదయమును, ప్రతిష్ఠయు అతనిని నిర్బంధించ వచ్చును. విముక్తమానవుడు ఈ పరస్పరవిరుద్ధ ప్రమాణములను దాటి వెళ్ళి, పరమాత్మ తననుండి దేని నపేక్షించునో, కేవలము దానినే లక్షించును – అది ప్రగతిశీలధర్మముయొక్క నిర్వహణ లేక ఆవిష్కరణ నిమిత్తము ఆవశ్యకము. అతని కెట్టి స్వీయప్రయోజనములు, రాగద్వేషములు నుండువు; మానవప్రగతినిగాని, అనంతుని పిలుపునుగాని పాటించక, తిరుగబడే ఎట్టి కఠోరకర్మప్రమాణమునుండదు. అతనికి జయించదగిన లేక చంప దగిన ఎట్టి శత్రువులు ఉండరు; భవితవ్యసిద్ధినిమిత్తము పరిస్థితులు తన కెదురుగా నిలబెట్టిన మానవులనే, వారిలో నతడు చూచును. వారి పట్ల అతని కెట్టి క్రోధము లేక ద్వేషము నుండజాలదు; ఏలన క్రోధద్వేషములు దివ్యప్రకృతికి పరకీయములు. తన నెదిరించిన వానిని హతమార్చు కామము అసురుని కుండును; అకారణముగానే రాక్షసునికి వధించుట యందు దారుణలాలసయుండును; ముక్తపురుషుని శాంతి, సానుభూతుల కివి అసంభవములు, అతని కెవరిని హింసించు నభిలాష యుండదు, పైగా అందరియందును మైత్రీకరుణలు పొంగులువారును– "మైత్రః కరుణ ఏవచ" (12–13) ; కాని ఇది పై నుంచి అందరిని ఆర్ద్రముగా అవేక్షించుచు, సర్వాత్మలను ఆలింగనము గావించుకొను దివ్యాత్మ కరుణ గాని, హరిహరి ! యని కండ్లు మూసికొను, దుర్బల హృదయస్నాయువులు గల మానవుల కుండు జాలి గాదు. మఱియు నతడు శరీర జీవనమున కధికప్రాముఖ్య మివ్వక, ఆవలనుండు ఆత్మజీవనమును సాధించుటకు దాని నొక ఉపకరణముగా మాత్రమే ఎంచును. అతడు త్వరపడి సంగ్రామ, సంహారములలో దూకడు; ఒక ధర్మతరంగముగా యుద్ధమే తనపైకి వచ్చుచో, దాని నతడు ఒక విశాలసమతతో నంగీకరించును; అచ్చటను తన ప్రతిపక్షులపట్ల అతనికి పరిపూర్ణ అవగాహనయు, సానుభూతియు నుండును.

9. సర్వసమదృష్టి

ఏలన అతడన్నింటియందు రెండు సత్యములను గాంచును- 1. ప్రతి భూతమునందును సమముగా నివసించుభగవంతుడు; 2. కాలగత పరిస్థితులయందు మాత్రమే అసమమగు ఆ భగవంతుని వివిధాభివ్యక్తి. పశుమానవుల యందును, శునకచండాలుర యందును, విద్యావినయసంపన్న బ్రాహ్మణునియందును (5-18), సాధుపాపులయందును, శత్రుమిత్రులయందును, ప్రేమించి హితము చేయువారి యందును, ద్వేషించి పీడించువారియందును (6-9) అతడు తననే చూచును, భగవంతునే చూచును, అందరిపట్ల ఒకే సమసౌహార్దము, ఒకే దివ్యాను రాగము గలిగియుండును. పరిస్థితులు బాహ్యాలింగమునో, బాహ్యసంఘర్షమునో గలిగించ వచ్చు. కాని అతని సమదృష్టిని, ప్రసన్న హృదయమును, అంతరాలింగనమును మార్చజాలవు. మఱియు అతని సర్వక్రియలయందును ఒకే ఆత్మతత్త్వముండును- పరిపూర్ణసమత్వము, అటులే ఒకే కర్మతత్త్వము పనిసేయును-తన యందలి భగవదిచ్ఛ; ఈ భగవదిచ్ఛ భగవద్దిశగా సాగుచున్న జాతిఅవశ్యకతను బట్టి యుండును.

10. అంతరానందము పంచమలక్షణము

ఇంకను, దివ్యకర్తకు దివ్యచేతనకే కేంద్రభూతమగు మఱియొక లక్షణము గలదు - అంతరానందమును, శాంతియు; దాని ఉత్పత్తి గాని, స్థితి గాని దేనిపైనను ఆధారపడదు; ఆత్మచేతనయొక్క పదార్థమే ఈ అంతరానందము, దివ్య సత్తయొక్క స్వరూపమే ఇది. సాధారణమానవుడు తన సౌఖ్యమునకు బాహ్య వస్తువులపై నాధారపడును గాన, అతనికి కామ ముండును, కోపతాపము లుండును, హర్షశోకము లుండును; కావుననే అన్నింటిని అదృష్ట దురదృష్టముల త్రాసులో తూచును. వీనిలో నేదియు దివ్యాత్మను కదల్చలేదు; ఈ దివ్యాత్మ దేనిని ఆశ్రయించకయే నిత్యతృప్తముగా నుండును - “నిత్యతృప్తో నిరాశ్రయః” (4-20). ఏలన అది లోపలనే రమించును - “ఆత్మరతిః” (3-17). దానికి లోపలనే ఆరామము, సుఖము, సుప్రసన్నజ్యోతియు లభించును - “అంతఃసుఖోఽ౽ంతరారామస్తథా౽ంతర్జ్యోతి రేవచ” (5-24). అయితే ఈ దివ్యాత్మ బాహ్యవస్తువుల నెందు కాదరించును? వానిలో వెదికియు ఏ విషయములను బొందక పోవచ్చునో, ఆ విషయములకొఱకు గాదు; వానిలోని ఆత్మనిమిత్తము, వానివలన జరుగు భగవదభివ్యక్తి నిమిత్తము, మఱియు వెదికి నపు డవశ్యము బొందగల, వానిలోని శాశ్వతాంశము నిమిత్తము. ఈ దివ్యాత్మ తనలోని ఆనందమునే అన్నింటియందును గనుగొనును. కారణము, సర్వభూతాత్మలో

అది ఏకాత్మక మయినది – "సర్వభూతాత్మ భూతాత్మా" (5–7). బాహ్యావిభేదములను చీల్చుకొని, వానిలోని ఏక మఱియు సమబ్రహ్మముతో ఏకమయినది – "బ్రహ్మయోగ యుక్తాత్మా" (5–21). ప్రియ స్పర్శలయందు ప్రహర్షమును, అప్రియస్పర్శలయందు సంతాపమును అది పొందదు (5–20). వస్తువులు లేక మిత్రులు లేక శత్రువులవలన గలుగు దెబ్బలు వెలుపలికి జూచు అతని మనస్సుయొక్క స్థిరతను కదల్చలేవు. లోపలికి స్వీకరించు అతని హృదయమును భ్రమింపజేయలేవు (5–20). ఈ ఆత్మస్వభావతః 'అవ్రణము' (ఈ. ఉ.) దెబ్బగాని, మచ్చగాని లేనిది. అన్నింటియందును అది అక్షయానందమును ఆస్వాదించును – "సుఖ మక్షయ మశ్నుతే" (5–21).

11. త్యాగము, సన్యాసము

విముక్తాత్మయొక్క సమత, నిర్వ్యక్తికత, శాంతి, ఆనందము, విముక్తి -- కర్మచేయుట, చేయకపోవుట యను నంతటి బాహ్యావిషయముపై నాధారపడి యుండవు. అంతర్ బహిః సన్యాసములకు గల–త్యాగమునకు, సన్యాసమునకు గల– అంతరమును గీత మఱిమఱి ఒత్తి చెప్పును. త్యాగము లేనపుడు, సన్యాసము వ్యర్థము, దాదాపు అసాధ్యము గూడను; మఱియు అంతర్ముక్తి యున్నపుడు అనావశ్యకము, నిజానికి త్యాగమే యథార్థ, పర్యాప్త సన్యాసము. "ఎవడు ద్వేషించడో మఱియు కామించడో, అతడే నిత్యసన్యాసి యని తెలియవలెను; ఇట్టి ద్వంద్వముక్తుడు అనాయాసముగా బంధముక్తు డగును" (5–3). బాహ్యసన్యాస ప్రక్రియ దుష్కరము (5–6). పైగా అనావశ్యకము. నిజమే, ఫలముతో బాటు సర్వకర్మలను త్యజించవలసినదే, సన్యసించవలసినదే; కాని బాహ్యముగాగాదు, ఆంతరముగా; ప్రకృతిజడతలోనికి గాదు, యజ్ఞమునందలి ఈశ్వరునకు(5–29); దివ్యకర్త శాంతికి భంగము లేకుండ, దేనినుంచి సర్వకర్మయు ప్రభవించునో, అట్టి నిర్వ్యక్తిక బ్రహ్మముయొక్క శాంతిసంతోషములలోనికి. యథార్థసన్యాసము కర్మలను బ్రహ్మ యందు నిక్షేపించుటయే – "సంగము త్యజించి, ఎవడు బ్రహ్మయందు నిలిపి తన కర్మలను జేయునో, తామరాకును జల మంట నట్లు, అతనిని పాప మంటదు" (5–10). ఇందునిమిత్తము పూర్వాంగముగా "యోగులు ఆత్మశుద్ధిని సాధింప, సంగము త్యజించి, శరీరముతోను, మనస్సుతోను, బుద్ధితోను, లేక కేవల కర్మేంద్రియములతోను కర్మ చేతురు" (5–11) "కర్మఫలత్యాగముచే, బ్రహ్మతో యుక్తమైన ఆత్మ నిశ్చల బ్రహ్మనిష్ఠాశాంతిని అందుకొనును; అట్లు యుక్తముగాని

ఆత్మ ఫలాసక్తమై, కామవ్యాపారములో చిక్కుకొనును" (5-12) బ్రహ్మయందలి ఈ ఆధారము, పవిత్రత, శాంతి ఒకసారి ప్రాప్తించినపుడు, దేహధారి ఆత్మ తన ప్రకృతిని పూర్తిగా నదుపులో నుంచుకొని, దాని కర్మల నన్నింటిని మానసికముగా - బాహ్యముగ గాదు, అంతరముగా- సన్యసించి, "స్వయముగా చేయక, చేయించక, తన నవద్వారపురమునందు సుఖముగా కూర్చొనును" (5-13). ఏలన ఇపుడీ ఆత్మ అన్నింటియందున గల ఒకే నిర్వ్యక్తికాత్మ, సర్వవ్యాప్తి ప్రభువు- "విభు" (సర్వవ్యాపి). "ప్రభు" (5-15,14). ఈ ప్రభువు తన నిర్వ్యక్తిక రూపమున ప్రపంచకర్మలను గాని, మనస్సుయొక్క కర్తృత్వభావమును గాని సృజించదు, మఱియు కర్మల, ఫలముల సంయోగమును - కార్యకారణసంబంధమును - సృజించదు. "స్వభావమే" (5-14) దీని నంతను జేయును : స్వ+భావ మన స్వీయపరిణామ తత్త్వము. ఈ సర్వవ్యాపి నిర్వ్యక్తికాత్మ ఎవరి పుణ్య పాపములను స్వీకరించదు. జీవియందలి అవిద్యచేతను, కర్తనను అహంకారము చేతను, తన ముఖ్యాత్మ గుఱించిన అజ్ఞానముచేతను పుణ్యపాపాదులు సృజింపబడును (5 -15). ఇక నెపుడీ ఆత్మజ్ఞానము ఏతదంధకారావరణమునుండి విముక్త మగునో, ఆ జ్ఞానము లోపలి ఆత్మను ప్రభాకరునివలె ప్రకాశింపజేయును (5-16). అపుడు అతడు మనఆది ప్రకృతికరణములకు పైనున్న ఆత్మగా తనను దెలిసికొనును; ఇపు డతడు విశుద్ధుడు, అనంతుడు, అలంఘ్యుడు, అక్షరుడు; దేనికిని చలించదు; ప్రకృతి క్రియలచే వికారము నొందువానినిగా తన నిక ఊహించుకొనడు. మఱియు నిర్వ్యక్తికముతో సంపూర్ణ తాదాత్మ్యముద్వారా ప్రకృతి చక్రములోనికి తిరిగి జన్మించవలసిన ఆవశ్యకతనుండియు తనను విడిపించుకొనగలడు (5-17).

12. త్రిగుణాతీతత్వము షష్ఠలక్షణము

అయినను అతని ప్రకృతివిముక్తి తన కర్మాచరణమునకు అడ్డురాదు. తన కర్మాచరణమునందును సక్రియతత్త్వము ప్రకృతిగుణములే గాని, తాను గాదని మాత్రము అతనికి దెలియును. "(నిష్క్రియ నిర్వ్యక్తికముతో) యోగమునందున్న మనస్సు గలిగి, వస్తుతత్త్వముల నెఱింగిన వ్యక్తి 'నేనేమియు జేయుట లే'దని తలంచును. చూచుట, వినుట; ఆస్వాదించుట, అఘ్రాణించుట; తినుట, తిరుగుట; నిద్రించుట, శ్వసించుట, భాషించుట; గ్రహించుట, త్యజించుట; కండ్లు తెఱచుట లేక మూయటను చేయునపుడు, ఇంద్రియములు ఇంద్రియార్థములందు వర్తించు చున్నవనియే అత డనుకొనును" (5-8,9). అతడు స్వయముగా అక్షర అవికార్య

ఆత్మయందు పదిలముగా నుండును గాన, త్రిగుణముల పట్టున కావల విలసిల్లును – "త్రిగుణాతీత". అతడు స్వాత్త్వికుడును గాడు, రాజసికుడునుగాడు, తామసికుడును గాడు; కాని ఈ త్రిగుణముల పర్యాయఖేలనమును స్వచ్ఛ, శాంత అంతరంగముతో నతడు పరికించును. తన కర్మలో మునుగక, దానిని పై నుండి చూచు శాంతాత్మ యొక్క ఈ ఉపరిస్థితియు – త్రైగుణ్యాతీతత్వమును – దివ్యకర్తయొక్క ఒక ఉత్కృష్ట లక్షణము. ఈ త్రైగుణ్యాతీతత్వ భావము తన మట్టుకు తాను, ప్రకృతియే సర్వమును యంత్రవత్తుగా నిర్ణయించును, దానిలో, విడివడియుండు ఆత్మ కే బాధ్యతయు లేదు – అను సిద్ధాంతమునకు దారితీయవచ్చును. కాని గీత ఈ అపూర్ణభావమువలన గలుగు దోషమును నిర్వివాదముగా నివారించును. ఎట్లు? అక్షరాత్మపైన పరమేశ్వర రూపమున పురుషోత్తముడు గల డను ప్రకాశ మయభావమును ప్రతిపాదించి చివరి నిర్ణయము ప్రకృతి నిర్ణయము గాదని గీత స్పష్టముచేయును; ప్రకృతిని ప్రేరేపించునది పరమేశ్వర సంకల్పము; ఎవడు దుర్యోధనాదులను పూర్వమే చంపియుంచెనో, అర్జును డెవనికి ఒక మానవరూప ఉపకరణమో, అట్టి ఒక విశ్వాత్మ, ఒక అతీతభగవంతుడు ప్రకృతిపరిశ్రమను నియమించును. నిర్వ్యక్తికబ్రహ్మమునందు కర్మలను స్థాపించుట కర్తయొక్క వైయక్తికాహంకారమును బాపుకొనుటకు సాధన మాత్రమే; కాగా, లక్ష్యము సర్వకర్మలను పరమేశ్వరుని కర్పించుటయే – "సర్వభూత మహేశ్వర" (5–29) "సర్వాత్మతో తాదాత్మ్యముజెందిన చేతనతో నీ సర్వకర్మలను నాయందు సన్యసించి, ఆశాకామములనుండియు, అహంకారమమకారముల నుండియు, ఆత్మజ్వరమునుండియు ముక్తుడవై యుద్ధము చేయుము" (3–30), అనగా కర్మచేయుము, జగత్తునందలి నా సంకల్పమును నిర్వహింపుము. భగవంతుడే కర్మ నంతను ఆరంభించి, ప్రోత్సహించి, దాని గతిని నిర్ణయించును; బ్రహ్మయందు నిర్వ్యక్తిముగా నిలిచిన మానవాత్మ అతని శక్తికి విశుద్ధ ప్రశాంత వాహిని యగును; కాగా ప్రకృతిగతశక్తి అతని ఆరంభమును నిర్వహించును. ముక్త పురుషుని కర్మలు సరిగా నిటులే యుండును; ఏలన ఎచ్చటను ముక్తాత్మ స్వయముగా కర్మను ప్రారంభించదు. సిద్ధ కర్మయోగి కర్మలిట్టివి. అవి విముక్తాత్మ నుండి ఉద్గమించి, దాని కే వికారము గలిగించకయే అంతరించును–సచేతన, అక్షరఅగాధసాగరము యొక్క ఉపరితలమున తరంగములు లేచి, అంతరించు రీతిగా, "సంగరహితుడు, ముక్తాత్ముడు, జ్ఞానప్రతిష్ఠితుడు, యజ్ఞార్థము కర్మచేయువాని కర్మయంతయు లీనమగును" (4–23).

19. సమత

1. ఆత్మసమతయే సమత

జ్ఞాన ము, నిష్కామత, నిర్వ్యక్తికత, సమత, ఆంతర స్వయంభూ శాంత్యానందములు, త్రిగుణముల సంఘర్షమునుండి విముక్తి, కనీసము దానికి పై నుండుట- ఇవి విముక్తాత్మలక్షణములు గావున, దాని కార్యకలాపము లన్నింటి యందును అవి దాని ననుగమించవలయును. తనను చుట్టియుండు ప్రపంచ సంఘర్షమున ఆత్మ యొక్క అవికార్యశాంతికి ఆ లక్షణపుంజము ఆవశ్యకనిబంధనము. ఈ శాంతి మార్పుల గందరగోళమున మాఱని బ్రాహ్మభావమును ప్రతిబింబించును, మఱియు నీ శాంతి సమస్త బహుత్వమునందును అంతర్వర్తిగా నుండు అవిభాజ్య ఏకత్వమునకు జెందును. ఏలన శతసహస్రవిభేదములు మఱియు విషమతల మధ్యనుండు సమ, సమతాసాధక ఆత్మయే ఈ ఏకత్వము; మఱియు ఆత్మసమతయే ఏకైక వాస్తవసమత. ఏలన ఆత్మేతరమునందు సాదృశ్యము, సమీకరణము (adjustment), సంతోలనము (balance) మాత్రమే యుండగలవు; ఇక నిట్టి అత్యధిక సాదృశ్యమునందు సైతము విషమత లుండును. మఱియు ఎటులో సమకూర్చిన సంతులనమును సమముగాని బరువులతో సమకూర్చిన సమతూకమే.

2. సమతావశ్యకత వ్యవహారములో

కావుననే గీత తన కర్మయోగాంశములందు సమతకు అపారప్రాముఖ్య మిచ్చును; అది ప్రపంచముతో విముక్తాత్మయొక్క విముక్తసంబంధములకు కేంద్రము. ఆత్మజ్ఞానము, నిష్కామత, నిర్వ్యక్తికత, ఆనందము, గుణవిముక్తి – ఇవి యన్నియు వెనుకకు దిరిగి తమలోనే లీనమై, నిష్క్రియమైనపుడు, వీనికి సమతతో పని యుండదు; ఏలన అపు డవి సమతావిషమతల విరోధ ముదయించు వస్తువులనే గుర్తించవు. కాని ఎపుడు ఆత్మ ప్రకృతివ్యాపారముయొక్క బహుత్వములను, వ్యక్తిత్వములను, విభేదములను, విషమతలను గుర్తించి, వానితో వ్యవహరింపసాగునో, అపు డది సమత్వలక్షణముచేతనే విముక్తస్థితియొక్క తక్కిన లక్షణములను వ్యక్తము చేయవలసి యుండును. చూడుడు : ఏకముతో ఏకతాచేతనయే జ్ఞానము; మఱియు నిట్టి ఏకతాజ్ఞానము వ్యవహారమున తన ఏకతను అన్నింటితోను సమమగు ఏకతా రూపమున వ్యక్తముచేసికొనవలెను. తర్వాత ప్రపంచమున గల బహురూపవ్యక్తిత్వము

యొక్క వైవిధ్యములలో తగుల్కొనక, పై నుండు అక్షరాత్మయొక్క ఆధిక్యమే నిర్వ్యక్తికత; మఱియు నిట్టి నిర్వ్యక్తికత బహువ్యక్తిత్వములతో తన వ్యవహారమున సమ, పక్షపాతరహితభావమున తనను వ్యక్తము చేసికొనవలెను, ఈ వ్యవహారము అనేకులతో అనేకరీతులుగా నున్నను, దాని భావము సమముగా నుండవలెను. నా కెవడును ప్రియుడును గాడు, అప్రియుడును గాడు, భావమున అందరిపట్ల సముడను (9-29)- అని కృష్ణుడు చెప్పును. అయినను భక్తు డతని విశేషానుగ్రహమునకు పాత్రమగును. ఏలన భక్తుడు విశిష్టసంబంధమును బెట్టుకొనును గాన, భగవంతుడు ఆ సంబంధమును బట్టి వ్యవహరించినను, లోపల పక్షపాతరహితుడే, కామ్య విషయముల పరిమితికారక ఆకర్షణకు అతీతముగానుండు ఆపరిమేయాత్మయొక్క ఆధిక్యమే నిష్కామత; ఇక నా విషయములతో సంబంధము పెట్టుకొనవలసి వచ్చినపుడు, అయితే ఈ నిష్కామత వానియందు సమ, నిష్పాక్షిక ఉదాసీనతచే తనను వ్యక్తముచేసికొనవలెను, లేదా అన్నింటియందును సమ, నిష్పాక్షిక, నిస్సంగ ప్రేమానందముల రూపమున తనను ప్రకటించుకొనవలెను; ఈ ఆనందము స్వతః సిద్ధము గాన, విషయవస్తువుల లాభనష్టములపై ఆధారపడదు, అది తత్త్వతః అక్షరము, అక్షుబ్ధము. అది తనను ప్రకటించుకొనవలసి వచ్చినపుడు తన ఆధ్యాత్మికవిముక్తతను సమ ఉదాసీనత లేక సమసంతోషరూపమున మాత్రము ప్రకటించుకొనగలదు. ఇక త్రైగుణ్యాతీతత్వము గలదు : గుణక్రియాప్రవాహమునకు పైనుండు అక్షుబ్ధాత్మ యొక్క అధిక్యమే ఈ త్రైగుణ్యాతీతత్వము. ఇది పరస్పరవిరుద్ధ మఱియు విషమమగు ప్రకృతిక్రియాకలాపములోనికి దిగవలె ననిన, విముక్తాత్మ అస లెట్టి కర్మనైన చేయ తన స్వభావమున కవకాశ మివ్వవలె ననిన, ఇది తన ఆధిక్యమును సర్వక్రియలు, ఫలితములు, ఘటనపట్ల ఒక నిష్పాక్షికసమతారూపమున జూపవలెను.

3. సమత గీటుఱాయి కూడను

సమత ముక్తుని లక్షణమే గాక, ముముక్షువునకు నికషము గూడను. ఎక్కడ ఆత్మయందు విషమత యుండునో, అక్కడ దానికి నిదర్శనముగా గుణముల అసమఖేలన ముండును; కామవ్యాపార ముండును; ఆధ్యాత్మికానందస్థానమున మానసిక తృప్తి యుండును; ఇక నీ తృప్తిని వెన్నంటియే అతృప్తి లేక విరక్తి యుండును మఱియు నెక్కడ ఆత్మయొక్క విషమత యుండునో, అక్కడ జ్ఞానమునుండి విచలన ముండును; సర్వసమాహారకము, సర్వసమన్వయకరము నగు బ్రహ్మ-

ఏకత్వమునందును, జగద్వస్తువుల అద్వైతమునందును సుస్థిరనిష్ఠ యుండదు. కర్మప్రవాహమధ్యమున కర్మయోగి తానుముక్తుడ నని తన సమతచేతనే యెఱుంగును.

4. తితిక్ష, ఉదాసీనత, నతి, సమత

సమున్నతము, సార్వత్రికము నగు, గీత విధించు సమతయొక్క ఆధ్యాత్మిక స్వభావమే గీతాబోధనయొక్క విశిష్టత. సామాన్యసమతాబోధన గీతకు ప్రత్యేకము గాదు; సమత మనస్సు, హృదయము, స్వభావముల అత్యంతవాంఛనీయ స్థితి, దానియందు మనము మానవదౌర్బల్యమునకు లోను కాము - అని అందరు బోధింతురు. మునిపుంగవుల దార్శనికాదర్శముగాను, విశిష్టస్వభావముగాను సమత కొనియాడబడుచునే యున్నది. గీత ఈ ఆదర్శమును చేపట్టి, దానిని ఇంకెంతో పైకి గొనిపోవును; అచ్చటి వాతావరణము విశాలతరము, విశుద్ధతరమునని కనుగొందుము. 'స్థాయిక'* స్థితి, దార్శనిక స్థితి గీతాసమతకు ప్రథమ, ద్వితీయ సోపానములు మాత్రమే; ఈ సమత దేవతల సమతయు గాదు, పరమ ఆత్మవశిత్వముతో విలసిల్లు పరమేశ్వరుని సమత. సదాచారమునే తన జీవనకేంద్రము గావించుకొను స్టాయిక సమత కఠోరసహిష్ణుతచేత ప్రాప్తించు ఆత్మవశిత్వమున ప్రతిష్ఠితమగును; ఇంతకంటెను ఎక్కువ సుఖశాంతమైన దార్శనికసమత జ్ఞానముచేత, అసంగముచేత, సమున్నత భౌద్ధిక ఉదాసీనతచేతను ఆత్మవశిత్వము నభిలషించును- 'ఉదాసీనవద్ ఆసీనః" (14-23); ఇవి గాక, ధార్మిక లేక క్రైస్తవసమత గలదు, దీని స్వరూపము సంతత నతి లేక ఈశ్వరేచ్ఛాధీనత. తితిక్ష (సహిష్ణుత), ఉదాసీనత, నతి: ఇవి దివ్యశాంతికి మూడు మెట్లు మఱియు సాధనలు. తన సముదార సమన్వయ రీతిలో గీత వీనిని గ్రహించి, తన ఆత్మోద్ధరణవిధానములోనికి వానిని అల్లి వేయును; అల్లి వేయుచునే ప్రతిదానికి ఒక గంభీరతరమూలమును, విశాలతరదృక్కోణమును, ఎక్కువ వ్యాపకము, అతీతము నగు పరమార్థమును కట్టబెట్టును. ఎట్లు? ఈ త్రయము నందలి ప్రతిదానికి ఆత్మసంపర్కము గలిగించి, ఆత్మసత్తకుండు శక్తిని ప్రసాదించును; ఈ పరశక్తియందు సదాచారముయొక్క ఆయాస ముండదు, బుద్ధిసమతయొక్క కఠినత యుండదు, భావావేగములయొక్క భార ముండదు.

---

* హఠముచేత సమతను సాధించు గ్రీకుల ఒక సంప్రదాయము

5. పురుషుని అనుమతిని బట్టియే ప్రకృతి వ్యాపారము

సాధారణ మానవాత్మ తన ప్రాకృతజీవనముయొక్క మామూలు కలతల యందు ఒక విధమగు సుఖము నాస్వాదించును; దాని కీ సుఖ మున్నది గావునను, అందు నిమిత్తము నిమ్నప్రకృతి సంక్షుబ్ధఖేలనమునకు అనుమతి నిచ్చును గావునను, ఆ ఖేలన మనంతముగా సాగును. కారణము, తన ప్రేమికుడు, భోక్తయు నగు పురుషుని సుఖముకొఱకును, అనుమతితోను తప్ప, ప్రకృతి ఏమియు చేయదు. ఈ అనుమతి సత్యమును మనము గ్రహించలేకపోవుటకు గారణము మనస్సుయొక్క కలతయే - దుఃఖ, పరాజయాదులయందువలెనే, సంతోషవిజయాదులయందును మనసు కలతకు గుఱియగును. ఈ కలతవలన మనము గుర్తించలేకపోయినను, ఆత్మకు జీవనసంక్షోభములందు సుఖము గల దను సంతతసత్యము మాఱదు. నిజమే, యోధునకు తన గాయములందు భౌతికసుఖము గాని, తన ఓటమియందు మానసిక తృప్తి గాని యుండదు; కాని యుద్ధతత్త్వమునందు మాత్రము అతనికి సంపూర్ణ సమ్మోదము గలదు. కావున విజయహర్షముతో బాటు పరాజయవిషాదమునకును అతడు సిద్ధపడును. తన గాయములను స్మరించినపుడు అతని కొక సంతోషము, గర్వము గూడ స్ఫురించును - గాయముల బాధ గతించినపుడు, ఈ సంతోషము సంపూర్ణమగును, ఒకొకప్పుడు బాధయే సంతోషమునకు పుష్టి నిచ్చుటయుకద్దు. తనను మించిన శత్రువును జంకులేక ఎదిరించినాననే సంతోషగర్వములను పరాజయ మతనికి భద్రపఱచును; లేక, అతడు నీచకోటికి చెందిన యోధుడగుచో, పగతీర్చుకొనుటకు పోరాడినా ననే భావమువలన గలుగు రాక్షససుఖమునతనికి పరాజయము కల్పించును. సామాన్యజీవనఖేలనమునందు గల ఆత్మసుఖమునకు ఇది వర్తించును.

6. అంతరాత్మకు ఆపదయందును ఆనందము

జీవనము కల్పించు ప్రతికూలాఘాతములనుండి మనస్సు బాధవలన, ద్వేషమువలన వెనుకకు తగ్గును; ఆత్మరక్షణ - "జుగుప్సా" - నిమిత్తము ప్రకృతి ప్రయోగించు ఉపాయ మిది; దీనివలన మన స్నాయుశరీరముల పేలభాగములు సహసా ఆత్మవినాశాగ్నిలో దూకక వెనుదగ్గును. మఱియు మనస్సు అనుకూల స్పర్శలతో హర్షమును గ్రోలును; ప్రకృతియొక్క రాజసికసుఖము కల్పించు ప్రలోభ మిది; దీనివలన జీవశక్తి తన తామసప్రవృత్తులను జయించి, కర్మ, కామము,

సంఘర్షము, విజయముల దిశగా ప్రేరితమగును. ఇట్లు వీనియందు జీవునికి సంగము గల్పించి, ప్రకృతి తన కార్యమును సాధించుకొనును. మన గూఢమగు అంతరాత్మ ఈ సంఘర్ష ప్రయత్నములందు, చివరకు విపత్తిదుఃఖములందు సైతము ఒకానొక సుఖము నాస్వాదించును; ఈ సుఖము తఱచుగా వ్యథితమనస్సులోని కుబికి, దాని దుఃఖా వేగమునకు ఆధారము గల్పించును. కాని అంతరాత్మను వాస్తవముగా నాకర్షించునది కేవలదుఃఖము గాదు; సుఖదుఃఖములు, ఆకర్షణ వికర్షణలు ఓతప్రోతముగా నుండు కల్లోలిత జీవనసాకల్యము. చూడుడు : మన యందలి రాజసికమగు కామాత్మకు ఏకరూప సుఖము, సంఘర్షరహిత సాఫల్యము, ఛాయారహిత సంతోషము ఇంచుక పిమ్మట మొగముగొట్టి, అరుచిని బుట్టించును; ప్రకాశమును పూర్ణముగా భోగించుటకు దానివెనుక కామాత్మకు అంధకార ముండవలెను. ఏలన అది అన్వేషించి, అనుభవించు సుఖస్వభావమే అట్టిది; తన తత్త్వమునందే ఈ సుఖము సాపేక్షము, దాని ప్రతిరూపమగు అసుఖముయొక్క బోధానుభవములపై నాధారపడును. ద్వంద్వములయందు ఆత్మకు గల ఆనందమే జీవనమునందు మనస్సునకు గల సుఖము వెనుకనున్న రహస్యము.

7. రాజసికభోగము మధ్యమావస్థ మాత్రము

ఈ కామాత్మను జీవనకల్లోలమునుండి, పై నున్న విశుద్ధ ఆనందాత్మయొక్క అమిశ్రితసుఖములోనికి ఆరోహించు మని పిలువుము; అది వెంటనే ఆ పిలుపు నుండి విముఖ మగును - నిజానికి ఆ అమిశ్రిత సుఖమే దీని సంఘర్షమునకు బలమిచ్చి, దీని సంతతాస్తిత్వమును సంభవ మొనర్చును. అట్లు విముఖమగుటకు కారణము, ఈ కామాత్మ అట్టి అమిశ్రసుఖ మున్న దనియే నమ్మదు; లేక అది జీవనమే గాదని నమ్మును; ఆ జీవనము రుచి హీనము రసహీనము ననుకొనును. లేక అది ఆపేక్షించు ప్రయత్నము అతికఠిన మనుకొని, ఆరోహణ ప్రయాసమునుండి వెనుకంజవేయును; నిజానికి కామాత్మ వెంటాడు కామ్యప్రాప్తి కంటె ఆధ్యాత్మికపరివర్తన మెంతమాత్రము కఠినతరము గాదు; నశ్వరవస్తువుల ప్రాప్తినిమిత్త మది ఎన్ని పాట్లు పడునో, అంతకు మించిన ప్రయాసను ఆరోహణమపేక్షించదు. దాని వైముఖ్యమునకు వాస్తవకారణ మేమన, అది తన స్వీయ వాతావరణము నుండి పైకిబోయి, విరళతరము, విశుద్ధతరము నగు ఒక జీవనవాయువును బీల్చ దానికి పిలుపు వచ్చినది; కాని అచ్చటి ఆనందశక్తులను అది చవిచూడ లేదు, మఱియు అవి

సత్యమని ఊహించను గూడ లేదు. కాగా తన నిమ్నమలిన ప్రకృతియొక్క సుఖ మొక్కటే దానికి పరిచితము, అనుభవగమ్యము. అయితే ఈ నిమ్నతృప్తియు స్వయముగా అశుభ, నిరర్థక వస్తు వేమియు గాదు; పైగా భౌతికసత్తను ఎక్కువగా తన గుప్పిలియం దుంచుకొను తామసికాజ్ఞాన, జడతల నుండి మానవప్రకృతియొక్క ఊర్ధ్వవికాస మపేక్షించు నిబంధన మీ నిమ్నతృప్తి; మానవుని క్రమారోహణమునందు ఇది రాజసికదశ యగును. కాని ఈ భూమికయందే – “మధ్యమా గతిః” (14-18) – మనము శాశ్వతముగా నిలిచిపోదు మేని, మన ఆరోహణ మసమాప్తముగాను, ఆత్మపరిణామము అసంపూర్ణముగాను ఉండిపోవును. ఆత్మకు గుణాతీత సంసిద్ధి మార్గము సాత్త్విక సత్తా ప్రకృతులద్వారా పైకి సాగును.

8. త్రివిధసమత

నిమ్నప్రకృతిక్షోభమునుండి మనలను బైటికి నడుపు మార్గము మనస్సు, చిత్తము, అంతరాత్మయదలి సమతాదిశగా నడుచు మార్గమే గావలయును. ఈ మార్గము చివరకు మనలను త్రిగుణముల పైకి తీసికొనిపోవలసియున్నప్పటికి, ఆరంభమున ఏదియో యొక గుణము నాశ్రయించియే అది అట్లు చేయును. ప్రారంభమున సమత సాత్త్వికము, రాజసికము లేక తామసికము గావచ్చును. ఏలన మానవ స్వభావమునందు తామసికసమతయు సంభవమే, దీని రూపము ప్రాణస్వభావము యొక్క భారభూతమగు సామ్యభావము, దీని జడత జీవనాఘాతములకు ప్రతి చలించదు. కారణము, జీవనసుఖము నపేక్షించని ఒకవిధమగు దీని నిస్పృహతా మాంద్యము. అథవా భావావేగములు మఱియు కామవృత్తుల ఆయాసమునుండి జనించు రాజసికసమతయు సంభవమే; ఈ ఆయాసమునకు కారణము అతిభోగము గావచ్చును, లేక తద్విరుద్ధమగు భోగవిషయక ఆశాభంగము, జుగుప్స, ప్రపంచముపట్ల భీతియు గావచ్చును; ఈ రెండవ ప్రత్యామ్నాయమున నిది తమః ప్రాబల్యముగల రాజసిక–తామసిక మిశ్రిత వృత్తిరూపమగు సమత యగును. లేక సత్త్వగుణమును సమీపించినపు డీ సమత సాత్త్వికము గావచ్చును. కామముల నెప్పటికి తృప్తిపఱుపజాలము; ఆత్మ జీవనమును శాసించలేనంత దుర్బలము; జీవన మంతయు శోకము, క్షణికప్రయత్నమే గాని వేఱేమియు గాదు; దానియం దెచ్చటను యథార్థమగు సత్యముగాని, స్వాస్థ్యము (sanity) గాని, ప్రకాశముగాని, సుఖము గాని లేదు – అను బౌద్ధిక వివేకము ఈ సమతకు తోడ్పడును. వాస్తవ మారయ,

నిది సాత్త్విక-తామసికమగు సమతాతత్త్వము. దీనియందు ఉదాసీనభావము లేక సమనిరాకరణమే అధికము; వాస్తవసమత కిది దారితీయ వచ్చును గాని, వాస్తసమత మాత్ర మిచ్చుట స్వల్పము. ఈ తామసికసమత వస్తుతః ప్రకృతియం దున్న ఆత్మరక్షణ సూత్రముయొక్క - జుగుప్సాసూత్రము యొక్క - సామాన్యీకరణమే యగును; ఇది విశేషించి బాధామయ కార్యములనే గాక, సమస్త ప్రకృతి జీవనమును త్యజించి వేయును. కారణము, దాని దృష్టిలో జీవన మంతయు ఆత్మహింసకే దారితీయును గాని, ఆత్మ అపేక్షించు పరమహర్షమునకు గాదు.

9. సన్యాసమునకును గీతలో స్థానము

తామసికసమత యందు మాత్రమే వాస్తవవిముక్తి లేదు; కాని దానిని శక్తి సమన్వితమగు ప్రారంభసాధన గావించుకొనవచ్చును భారతీయసన్యాసతత్త్వ మటులే చేయును : ప్రకృతి కతీతమగు అక్షరాత్మయొక్క అధికతరసత్తను, యథార్థశక్తిని ఉచ్చతరానందమును గుర్తించుటద్వారా సన్యాసము తామసికసమతను సాత్త్వికము లోనికి మార్చును. కాని ఈ సాత్త్వికసమత స్వాభావికముగా జీవన, కర్మల సన్యాసము వైపునకు మొగ్గునే గాని, కామనయొక్క ఆంతరసన్యాసముతో ప్రపంచ క్రియను కొనసాగించుట వైపునకు మొగ్గదు; కాని గీత ఈకొనసాగించుటనే ప్రబోధించును. అయినను గీత అదే సమయమున సన్యాసమునకు గూడ స్థానమిచ్చును; ప్రాపంచిక జీవనమున "జన్మ, మరణము, వార్ధక్యము, వ్యాధి, శోకములను దోషములను" (13-9) దర్శించి, ఆ జీవనమునుండి విరమించుకొనుటకు ప్రారంభసాధనగా గీత అంగీకరించును - చారిత్రకమగు బుద్ధుని ప్రారంభసాధనయు నిదే; మఱియు ఈ దోషదర్శనముచేతనే ప్రేరితులై, జరామరణవిముక్తిని వాంఛించువారి సాధనను గూడ గీత ఆమోదించును - "జరామరణమోక్షాయ మా మాశ్రిత్య యతంతియే" (7-29). కాని ఈ విముక్తిసాధనవలన ఎట్టి లాభమైనను గలుగవలె నన్నచో, దానియందు ఒక ఉచ్చతరావస్థయొక్క సాత్త్వికదర్శన ముండ వలయును; భగవంతుని ఆశ్రయించి, అతని సత్తయందు ఆనందము నాస్వాదించవలయును - "మా మాశ్రిత్య" (7-29). అప్పుడు మాత్రమే ఆత్మ గుణాతీత భావములోని కుద్ధరించబడి, అమృతత్వము ననుభవించును - "విముక్తోమృతమశ్నుతే" (14-20). జీవనము యొక్క బాధను, ప్రయాసను ఆమోదించని తామసికవైముఖ్యము స్వతః దౌర్బల్యమును, అధోగతిని గల్గించును. అందరికి ఒకే రీతిని సన్యాససిద్ధాంతమును బోధించుట

ఇందుచేతనే ప్రమాదకరము. అది అయోగ్య ఆత్మలపై దుర్బలతా, విరాగముద్రను వేయును, వానికి బుద్ధిభేదము గల్గించును (3-26); అవిరతాకాంక్షను, జీవన విశ్వాసమును, తగ్గించును; పరిసరమును జయించుటకు వలయు, ఆరోగ్యకరమగు రాజసికసంఘర్షమును క్షీణింపజేయును. క్షీణింపజేయునే గాని, ఉచ్చతరగమ్యము, అధికతరప్రయత్నము, ప్రబలతరవిజయములయొక్క ద్వారము తెఱవదు; కారణము, అట్టి యోగ్యత ఇంకను తదాత్మలకు రాలేదు. కాని యోగ్యతగల ఆత్మలకు, ఈ విరక్తి (recoil) ఒక ఆధ్యాత్మికప్రయోజనమును సాధించవచ్చును; వాని భోగాసక్తిని, నిమ్నజీవనము నందు వాని తత్పరతను తుదముట్టించి, ఉచ్ఛతరస్థితిలోనికి వాని యందు సాత్త్విక ప్రబోధమును బుట్టించవచ్చును. విరక్తివలన వారు సృష్టించుకొనిన శూన్యము నందు ఆశ్రయము నన్వేషించుచు, భగవదాహ్వానమును అలకించగల్గుదురు - "అనిత్యము, అసుఖము నగు ఈ లోకమునకు వచ్చిన ఓ ఆత్మా! నా వైపుకు తిరిగి, నాయందానందమును గొనుము" (9-33).

10. తామసిక పరావర్తనము - రాజసిక ప్రభుత

అయినను, ప్రపంచమునకు సంబంధించినంతవఱకు, ఈ సమతాక్రియ సర్వమునుండియు సమపరావర్తనమే (వెనుకకు తగ్గుట) యగును; దీని పర్యవసానము ఉదాసీనత మఱియు ఏకాకిత; దీనియందు ప్రియాప్రియమగు ప్రపంచస్పర్శలన్నింటిని సంగము గాని, కలత గాని, లేక సమముగాస్వీకరించు శక్తి యుండదు. అయితే ఈ సమస్వీకరణము గీతాసాధనయం దొక ఆవశ్యకాంశము (2-38). కావున మనము తామసికపరావర్తనముతో ప్రారంభించి నప్పటికి - ఇది తప్పక ఆవశ్యకము గాదు - అధికతరప్రయత్నానికి ప్రథమ ప్రేరణగానే దానిని ప్రారంభింతుముగాని, శాశ్వతనిరాశాభావముతో గాదు. ఏ ప్రపంచదోషములనుండి ముందు మనము పాఱిపోగోరుచుంటియో, వానిపై ప్రభుతను సాధించు ప్రయత్నముతోనే వాస్తవసాధన ప్రారంభమగును. ఇచ్చట మన కొక విధమగు రాజసికసమత గన్పించును, సమప్రభుతనుసాధించవలె నను రాజసికగర్వము గన్పించును. కాని స్థాయికాదర్శము ఈ ప్రవృత్తి నధిష్ఠించి, తన నిమ్నప్రకృతియొక్క సమస్త దౌర్బల్యమునుండి ఆత్మయొక్క అశేషవిముక్తిని సాధించుటకు దానిని కీలకము చేసికొనును. ప్రకృతిగతమగు ఆత్మరక్షణసూత్రముయొక్క సామాన్యీకరణమే అంతర్ముఖ తామసికపరావర్తనము (నివృత్తి); అటులే ప్రభుతావిజయముల నిమిత్తము సంఘర్షప్రయత్నముల

నామోదించు ప్రకృతిసూత్రముయొక్క సామాన్యీకరణమే ఊర్ధ్వముఖ రాజసికప్రవృత్తి; కాని ఈ ప్రవృత్తి, ఎచ్చట సంపూర్ణవిజయము సాధ్యమో, అచ్చటకే యుద్ధరంగమును మార్చును. ఇది కొన్ని బాహ్యలక్ష్యములు మఱియు క్షణికవిజయముల నిమిత్తము పోరాడుటకు బదులు, సంపూర్ణ ప్రకృతి జయము నిమిత్తమే ఆధ్యాత్మికయుద్ధము సలుప సంకల్పించును. తామసికనివృత్తి సుఖదుఃఖముల రెండింటినుండియు పాఱిపోవును; కాగా రాజసికప్రవృత్తి వానిని సహించి, వశముగావించుకొని, వానికంటె పైకి లేచుటకు వానిమీదకు దూకును. ధృతరాష్ట్రుడు భీముని లోహపత్రిమను తన కౌగిలిలో నలిపివేసినట్లు, స్టాయికసాధన కామావేశముల రెండింటిని తన ప్రచండాలింగనమున చూర్ణముచేయును. అది వస్తువుల ప్రియాప్రియ అఘాతములను, ప్రకృతివలన గలుగు భౌతిక, మానసిక వికారకారణములను సహించి, వాని ఫలితములను ముక్కలుచేయును; బాధకు లేక అనురక్తికి లోనుగాక, ఆత్మ ఎపుడు సమస్తస్పర్శలను సహించగలుగునో, అపుడీ స్టాయిక సాధన పూర్ణ మగును. ఇది మానవుని ప్రకృతివిజేతను, ప్రభువును గావింపజూచును.

11. సమతాసాధన

అర్జునుని క్షాత్రస్వభావమును ప్రబోధించి, గీత ఈ వీరోచితసాధనతోనే ప్రారంభించును; మహాశత్రువగు కామముపైబడి, దానిని చెండాడు మని ప్రబోధించును. గీత చేయు ప్రథమసమతావర్ణన స్టాయికదార్శనికుని సమతావర్ణనను బోలి యుండును. "దుఃఖముల మధ్య నెవని మనస్సు కలతజెందదో, సుఖముల మధ్య ఎవనికి కామస్పృహ యుండదో, రాగ భయ క్రోధము లెవనిని విడిచి పోయినవో, అతడు స్థితప్రజ్ఞుడు (2-56). ఎవనికి దేనియందును అనురాగ ముండదో, ఆయా ప్రియాప్రియములు ప్రాప్తించినపుడు ఎవనికి హర్షద్వేషములు ఉత్పన్నముగావో, అతని బుద్ధి జ్ఞానప్రతిష్ఠితము (2-57)." ఒక భౌతిక దృష్టాంత మిచ్చును. గీత చెప్పున దేమన, ఆహారము వర్జించినపుడు, విషయము స్పృశింపదు గాని, విషయమునందు ఇంద్రియస్పృహ మిగిలియే యుండును (2-59). విషయ వ్యవహారమునందు సైతము ఎపుడు బుద్ధి ఇంద్రియసుఖము నపేక్షింపక విడివడి యుండునో, అపు డది అత్మపరమోన్నతి నందును. ఆత్మవశ్యములు, రాగద్వేష రహితములు నైన ఇంద్రియములతో "విషయములపై చరించి నపుడే" (2-64), ఆత్మ మఱియు స్వభావముల విశాల, మధుర స్వచ్ఛతను బొందగలము (2-64).

దీనియందు దుఃఖావేగములకు తా వుండదు. (సమతాపరిపాకదశలో) సముద్రము లోనికి జలములు వచ్చిపడునట్లు, ఆత్మలోనికి సర్వకామములు వచ్చిపడుచున్నను, అది చలించక, అచలముగా నుండవలయును : ఇది సర్వకామములను త్యజించగల చరమదశ. ముక్తావస్థకు ఆవశ్యకనియమముగా భయక్రోధములు మఱియు రాగావేశములనుండి విముక్తిని గీత పునఃపునః వక్కాణించును. అయితే వాని ఆఘాతములను సహింప నేర్చినపుడే ఈ విముక్తి కలుగును; ఇక ఆఘాతకారణములగు భయాదులతో తలపడినపుడే ఈ శిక్షణ సాధ్యము. "శరీరముండగనే ఎవడు కామక్రోధవేగమును తట్టుకొనునో, వాడే యోగియు, సుఖియు" (5-23), తితిక్ష అనగా సహనసంకల్పమును, శక్తియు ఈ శిక్షణయందు సాధనమగును. "శీతోష్ణములను, సుఖదుఃఖములను గలిగించు బాహ్యస్పర్శలు వచ్చిపోవునే గాని స్థిరము గావు; వానిని ఓర్వనేర్చుకొనుము (2-14). ఎవని కివి వ్యథగలిగించవో, ఎవడు సుఖ దుఃఖముల యందు సముడో, అట్టి ధీరపురుషుడు అమృతత్వమున కర్హు డగును (2-15)." సమత్వమును బొందిన ఆత్మ దుఃఖమును సహించవలయును గాని, ద్వేషించరాదు; సుఖమును స్వీకరించవలయును గాని హర్షించరాదు. ఓర్పుద్వారా భౌతికస్పర్శలను గూడ వశము చేసికొనవలెను : ఇదియు స్టొయికసాధనలో ఒక భాగము. జరామరణములు, బాధాదుఃఖములనుండి పాఱిపోక, ఉన్నత ఉదాసీనత* ద్వారా వానిని జయించవలెను. తన నిమ్న వేషములలోని ప్రకృతిని జూచి భీతిల్లి పాఱిపోక, ఆమె నెదిరించి జయించుటే పురుష సింహుని- "పురుషర్షభ" (2-15) - ప్రబల స్వభావముయొక్క సత్యమగు సహజప్రవృత్తి. ఇట్లు నిర్బంధింపబడి, ఆమె తన ముసుగును తీసివేసి, విముక్తాత్మగా అతనికి గల సత్యస్వరూపమును జూపును; ఇచ్చు టతడు ఆమెకు దాసుడు గాడు, ఆమెకు రాజు మఱియు ప్రభువు - "స్వరాట్, సమ్రాట్" (నృ. ఉ.)

12. జ్ఞానముచేతనే తితిక్షకు సార్థకత

కాని గీత ఏ షరతుమీద తామసికనివృత్తిని ఆమోదించునో, ఆ షరతుమీదనే స్టొయికుల వీరధర్మమును గూడ నామోదించును - ఈ వీరధర్మము తనపైన సాత్త్విక

* "ధీర స్తత్రన ముహ్యతి" (2-13); ప్రబలము, ప్రాజ్ఞము నగు ఆత్మ వానిచేత విమోహితము లేక విచలితము గాదు. అయినను జయించుటకొఱకు వాని నాహ్వానించును - "జరామరణమోక్షాయ యతంతి" (7-29).

జ్ఞానదృష్టిని, తన మూలమున ఆత్మసాక్షాత్కార లక్ష్యమును, తన గతి యందు దివ్యప్రకృతి కారోహణమును గలిగియుండవలెను. మానవప్రకృతియొక్క సామాన్యాను రాగములను కేవలము నలిపివేయుటతో తృప్తిపడు వీరధర్మము అమిశ్ర శుభము గాజాలదు; కారణము, అది హృదయమును శుష్కింపజేసి, మానవతలేని వేఱుపాటుకు దారితీయవచ్చును, తన సాధనయందు గీత స్టాయికసమతను ఒక అంశముగా ఎందుకు సమర్థించు ననిన, క్షర మానవప్రకృతియందు అక్షరాత్మసాక్షాత్కారమునకు అది తోడ్పడగలదు - "పరం దృష్ట్వా" (2-59). మఱియు నీ ఆత్మచేతనయందు అవస్థితికిని సాయపడగలదు - "బ్రాహ్మీ స్థితిః" (2-72). "బుద్ధికంటెను పైనగల పరమునకు బుద్ధిచేతనే మేల్కొని, ఆత్మశక్తిచేతనే ఆత్మను స్థిరనిశ్చలము గావించి, సమీపించుటకే కష్టమగు ఈ కామశత్రువును ఖండించుము (3-43)." తప్పించుకొన జూచు తామసికనివృత్తి, పోరాడి జయించ జూచు రాజసికప్రవృత్తి - రెండును సాత్త్వికతత్త్వముద్వారా తమ కావలనున్న ఆత్మజ్ఞానమును లక్షించినపుడే, వానికి సమర్థన, సార్థకత ప్రాప్తించును.

13. సాత్త్విక సమతాసాధన, వర్ణన

పటిష్ఠమనీషి, జన్మతఃప్రాజ్ఞుడు నగు శుద్ధదార్శనికుడు తన చరమయోగ్యతగా తనయందలి సాత్త్వికాంశమును ఆశ్రయించుటయే గాక, ఆదినుండియు దానిని ఆత్మప్రభుతకు ఉపకరణముగా నుపయోగించుకొనును. అతడు సాత్త్వికసమత నుండి ప్రారంభించును. అతడును బాహ్యప్రపంచముయొక్క అనిత్యతను గుర్తించును; మఱియు తన కామములను తీర్చుటకు గాని, వాస్తవానందము నిచ్చుటకు గాని దానికి శక్తి లేదని గ్రహించును; అయితే అతని కిది ఎట్టి దుఃఖమును, భయమును, ఆశాభంగమును గలిగించదు. అతడు ప్రశాంత వివేచనాదృష్టితో సర్వవస్తువులను నిరీక్షించి, విరక్తిగాని, కలవరము గాని లేక ఒక నిర్ణయమునకు వచ్చును. "విషయస్పర్శవలన గలిగిన భోగములు నిజానికి దుఃఖమూలములు; వానికి ఆద్యంతములు గలవు; కావున మేల్కొనిన బుద్ధిగల బుధుడు వానియందు రమించడు (5-22)". "అతనియందలి ఆత్మ బాహ్యవస్తువుల స్పర్శయందు సక్తముగాక యుండును; కావున తన సుఖము నతడు తనయందే కనుగొనును (5-21)". గీత చెప్పునట్లుగా, తానే తన శత్రు వని మఱియు తానే తన మిత్రుడని అతడు - శుద్ధ దార్శనికుడు - గాంచును; కావున అతడు తన సత్తను కామక్రోధముల చేతిలోనికి

బోనిచ్చి, సింహాసనమునుండి తననుదాను త్రోసివేసికొనడు - "నాత్మాన మవసాదయేత్" (6-5); ప్రత్యుత తన అంతఃశక్తిచేతనే కామ కారాగారమునుండి తనను విడిపించుకొనును-"ఉద్ధరే దాత్మ నాత్మానం" (6-5); ఏలన ఎవడెవడు తన నిమ్నతరాత్మను జయించునో, అతడు తన ఉచ్ఛతరాత్మ యందు తన ఉత్తమ సుహృధుని, సఖుని కనుగొనును (6-5); అతడు జ్ఞానతృప్తుడును, విజితేంద్రియుడును, సాత్త్వికసమతచేత యోగియు నగును (6-8) - సమత్వము యోగమే గదా (2-48); అతని దృష్టిలో గడ్డ, రాయి, బంగారము నొకటియే; శీతోష్ణములు, సుఖ దుఃఖములు, మానావమానములయందు ప్రశాంతుడు, ఆత్మస్థుడునై యుండును. అతడు మిత్రుడు, శత్రువు, మధ్యస్థులపట్ల తన ఆత్మయందు సముడు (6-9); ఏలన ఇవి పరిస్థితులను బట్టి ఏర్పడు క్షణికసంబంధములని అతడు చూచును. వీనిపై నాధారపడియుండు విద్యా, శుచిత్వము, సదాచారము, కులాధిక్యముల బాహ్యరూపములను గాంచియు అతడు భ్రమించడు - విద్యా వినయసంపన్నుడగు బ్రాహ్మణుడు, పతితచండాలుడు అతని ఆత్మదృష్టికి సములే. ఇవి యన్నియు సాత్త్విక సమతయొక్క గీతావర్ణనలు మఱియు ప్రశాంత బౌద్ధిక సమతగా ప్రపంచమునకు పరిచితమైన దాని నంతను ఈ వర్ణనలు చక్కగా క్రోడీకరించును.

14. సాత్త్వికసమతయు గుణపరిధిలోనిదే

అయితే ఈ సాత్త్వికసమతకును, విశాలతరమగు గీతాసమతకును భేదమేమిటి; సాత్త్వికసమతకు బౌద్ధిక మఱియు దార్శనికవిచేచన ఆధారము కాగా, గీతాసమతకు ఆధ్యాత్మిక మఱియు వైదాంతికమగు ఏకతాజ్ఞాన మాధారము. దార్శనికుని (philosopher's) బౌద్ధికాధారము సైతము స్వతః సందేహాస్పదమే. ఏలన సంతతజాగరూకతచేత, లేక సాధించిన మనోభ్యాసము చేత అతడు మొత్తము మీద జితాత్ముడైనను, వాస్తవానికి తన నిమ్నప్రకృతినుంచి విముక్తుడు గాడు; అది ఏ క్షణమం దైనను నే నున్నానని లేచి, తనను నిరాకరించి నందుకు దారుణముగా పగతీర్చుకొనవచ్చును. ఏలన నిమ్నప్రకృతిఖేలన మెప్పుడును త్రివిధ ఖేలనమే గనుక, రాజసిక, తామసిక గుణములు సాత్త్వికమానవుని మీద బడుటకు పొంచియుండును : "సిద్ధికొఱకు శ్రమించు ప్రాజ్ఞుని మనస్సును సైతము ఇంద్రియముల దురాగ్రహము హరించుకొని పోవును (2-60)." సత్త్వగుణమును, వివేచనాత్మకబుద్ధిని మించిన దేనినో, అనగా ఏకాత్మను ఆశ్రయించి నపుడే, పరిపూర్ణ భద్రత సాధ్యము - ఈ

ఆత్మ దార్శనికుని బౌద్ధికాత్మ గాదు, త్రిగుణముల కావలనుండు, దివ్యజ్ఞానియొక్క ఆధ్యాత్మికాత్మ. ఉత్కృష్ట ఆధ్యాత్మికప్రకృతిలోనికి దివ్యజన్మనందుటద్వారా సమస్తము పరిపూర్ణము గావలయును,

15. దివ్యసమత వేఱువడియుండదు

కామముతో పోరాడు వీరుని సమతవలెను, ప్రపంచమునుండి పాఱిపోవు సన్యాసి సమతవలెను వివేచనపై నాధారపడు దార్శనికుని సమతయు లోపల, మనుష్యులకు దూరముగా, వేఱుగా నుండు ఒంటరి విముక్తయే; కాని దివ్యజన్మను బొందిన మానవుడు భగవంతుని తనలోనే గాక, సర్వభూతములందును గనుగొనును. అతడు అందరితోను తన ఏకతను దర్శించియున్నాడు గాన, అతని సమత ఏకతా, సానుభూతులతో నిండియుండును. అత డందరిని తానుగానే చూచును గాన, తన శ్రేయమునందు మాత్రమే నిరతుడైయుండడు; అతడు వారి సుఖదుఃఖముల భారమును సైతము తనపై వైచుకొనును; అయితే దానిచేత స్వయముగా నెట్టి కలతకు లోనుగాడు, "సర్వభూతహితే రతాః" (5-25, 12-4) - అని గీత పై విషయమును పదేపదే పరిపూర్ణప్రాజ్ఞుని స్వభావముగా వర్ణించును. పరిపూర్ణయోగి ఏ పాలరాతి గోపురము యొక్క ఏకాంతమునందో ఏకాకిగా ఆత్మానుసంధానము చేయుచు కూర్చొనడు; అతడు ప్రపంచశ్రేయమునిమిత్తము బహుముఖ, సర్వకర్మకర్తగా నుండును - "యుక్తః కృత్స్నకర్మకృత్" (4-18). ఏలన అతడు జ్ఞానియు, యోగియునైనట్లే, భగవత్ప్రియుడు, భక్తుడును అగును; అతడు ప్రపంచమునం దంతటను భగవంతుని గనుగొని, అంతటను అతనిని ప్రేమించును; ఇక నెవని నతడు ప్రేమించునో, అతనికి సేవచేయుట అవమాన మనుకొనడు; మఱియు అతడు చేయు కర్మ భగవంతునితో సాయుజ్యానందమునుండి అతనిని దూరము చేయదు; ఏలన అతనియందలి భగవంతునుండి తన సర్వకర్మలు ప్రభవించి, సర్వులయందలి భగవంతుని సేవగా అవి సాగును. ఇట్లు గీతాసమత ఒక సువిశాల, సమన్వయాత్మక సమత కాగా, ఆ సమతలో జరుగు సమస్తము భగవంతుని సత్తాప్రకృతుల పూర్ణతలోని కుద్ధరించబడును.

౨౦. సమత, జ్ఞానము

1. కర్మజ్ఞానములు రెండు రెక్కలు

గీతాబోధనయొక్క ఈ పూర్వభాగమునందు కర్మజ్ఞానములు రెండును ఆత్మారోహణమునకు వలయు రెండు రెక్కలు. ఫలాపేక్ష లేక, అన్నింటిపట్ల ఆత్మ సమభావముతో, పరమేశ్వరునికి యజ్ఞముగా చేయబడు కర్మలద్వారా పరమేశ్వరునితో సంయోగమే కర్మయోగము; కాగా ఈ నిష్కామత, సమత, యజ్ఞశక్తి దేని యందు ప్రతిష్ఠితమై యుండునో, అదే జ్ఞానము, నిశ్చయముగా ఈ రెండు రెక్కలు ఎగురుటలో ఒకదానికొకటి తోడ్పడును; మానవునియందలి నేత్రములు (విశ్రాంతి నిమిత్తము) ఒకదానిపిమ్మట నొకటిగా చూచును, కలిసి పనిచేయును గాన, అవి కలిసి చూచు నని చెప్పబడును; అటులే యోగజ్ఞానములును ఒకదాని కొకటి సాయపడుచు కలిసి పనిచేయును. ఎట్లన కర్మ ఎంతెంత నిష్కామము, సమబుద్ధికము యజ్ఞపరాయణము నగునో, జ్ఞాన మంతంత పొదలును; మఱియు జ్ఞానము పొదలిన కొలది, ఆత్మ తను యజ్ఞార్థముచేయు కర్మయొక్క నిష్కామతయందు ఎక్కువ దృఢపడును. కావుననే ద్రవ్యయజ్ఞముకంటె జ్ఞానయజ్ఞము శ్రేష్ఠ మని గీత వచించును : "పాపు లందరికంటెను నీ వెక్కువ పాపము చేయువాడవే యైనను, జ్ఞాన నౌకచేత ఆ కుటిలమునంతను నీవు తరించగలవు (4-36)....... పవిత్రతయందు జ్ఞానముతో సమమగున దేదియు ఈ ప్రపంచమున లేదు (4-38)." జ్ఞానముచేత కామము, దాని ప్రథమసంతానము, పాపము ధ్వంసమగును. విముక్తమానవుడు యజ్ఞముగా కర్మచేయగలుగుటకు కారణ మేమన, అతనికి సంగ ముండదు; దీనికి కారణము అతని మనస్సు, హృదయము, అంతరాత్మ ఆత్మజ్ఞానమున సుప్రతిష్ఠితములు - "గతసంగస్య జ్ఞానావస్థితచేతసః" (4-23). చేసిన వెంటనే అతని కర్మ యంతయు అదృశ్యమగును, బ్రహ్మసత్తయందు లయించును - "ప్రవిలీయతే" (4-23). కర్తగా గన్పించు బాహ్యకర్తయొక్క ఆత్మపైన దానివలన ఎట్టి ప్రతిక్రియాసంస్కారము నేర్పడదు. ఈశ్వరునిచేత బాహ్యకర్తప్రకృతి ద్వారా కర్మచేయబడును గాన, అది మానవోపకరణముయొక్క స్వీయకర్మ గాదు. అపుడు కర్మ స్వయముగా బ్రహ్మసత్తయొక్క ప్రకృతి, ద్రవ్యముల ఒక శక్తిమాత్రమగును.

2. జ్ఞానశక్తియే కర్మయగును

ఈ అర్థముననే "సర్వకర్మయు నిశ్శేషముగా జ్ఞానమునందు పరిసమాప్తమగును (4-33)" - అను వచనమును గీత చెప్పును; అనగా కర్మ పై కెగసి జ్ఞానరూపము

ధరించగా, జ్ఞానశక్తియే కర్మయగును. కావున "మండుతున్న అగ్ని కట్టెలను వలెనే, జ్ఞానాగ్ని సర్వకర్మలను భస్మము చేసివేయును (4-37)"-అను వాక్యమునకు, జ్ఞానము పూర్ణమైనపుడు కర్మలు ఆగిపోవును-అని అర్థము కాదు. దాని అర్థమును గీత ఇట్లు స్పష్టముచే◌ ◌ను - "ఎవడు సర్వసంశయములను జ్ఞానముచేత విచ్ఛిన్న మొనర్చునో, మఱియు యోగముచేత సర్వకర్మలను సన్యసించునో, మఱియు ఆత్మస్థుడై యుండునో, అతనిని కర్మలు బంధించవు (4-41)" (సాగుచునేయుండును గాని బంధించవు). ఇంకను, ఎవని ఆత్మ సర్వభూతముల ఆత్మ అయ్యెనో, అతడు కర్మ చేయును; అయినను తన కర్మచేత ప్రభావితుడు గాడు, దానిలో తగుల్కొనడు, దానినుండి ఆత్మను బంధించు ఎట్టి ప్రతిక్రియను స్వీకరించదు- "కుర్వన్నపి న లిప్యతే" (5-7). కావున గీత చెప్పును, కర్మ యోగము కర్మల బాహ్యసన్యాసముకంటెను శ్రేష్ఠము (5-2). ఏలన దేహధారులు దేహమున్నంతవఱకు కర్మ చేయవలసియే యుండును గాన, వారికి సన్యాసము దుష్కరము; కాగా యోగము శీఘ్రముగా, సరళముగా ఆత్మను బ్రహ్మతో జేర్చుటకు సర్వసమర్థమై యుండును (5-6). ఈ కర్మయోగస్వరూపము సర్వకర్మను ఈశ్వరునకు నివేదించుటయే యగును; ఈ నివేదన సర్వకర్మలను బ్రహ్మలోనికి ఈశ్వరసత్తలోనికి సమర్పించుట యను పర్యవసానమును సాధించు - "బ్రహ్మణ్యాధాయ కర్మాణి" (5-10), "మయి సన్యస్య" (3-30) - ఈ సమర్పణ ఆంతరము గాని బాహ్యము గాదు; ఆధ్యాత్మికముగాని భౌతికము గాదు. ఇట్లు కర్మలు "బ్రహ్మయందు విశ్రమించు" నపుడు, బాహ్యకర్తయొక్క వ్యక్తిత్వము ఉపశమించును; అతనిద్వారా కర్మ జరుగుచున్నను, అత డేమియు చేయడు; ఏలన అతడు కర్మఫలమునే గాక, కర్మలను, తదాచరణమును గూడ ప్రభువున కర్పించి యున్నాడు. అపుడు కర్మభారమును భగవంతుడే స్వీకరించును; పరమపురుషుడే కర్త, కర్మ, ఫలమును అగును.

3. గీతాజ్ఞాన మొక ప్రకాశము

ఇచ్చట గీత ప్రస్తావించు జ్ఞాన మొక బౌద్ధికక్రియ గాదు; అది సత్తయొక్క అత్యున్నతస్థితిలోనికి ప్రకాశమయసంవర్ధనము; ఇది సత్యసూర్యుడు అజ్ఞానావరణమును చీల్చుకొని బైటికి ప్రకాశించుటచేత సంభవించును - "తత్ సత్యం సూర్యం తమసి క్షియంతం" (ఋగ్వేదము, 3-39-5), గీతాజ్ఞానవిషయకమగు అక్షరబ్రహ్మ ద్వంద్వ మయమగు విక్షుబ్ధనిమ్నప్రకృతిపైన ఆత్మాకాశమున భాసించుచుండును; అది నిమ్న ప్రకృతి పుణ్యపాపముల నంటదు; మన విజయహర్షమును, పరాజయ దుఃఖమును

పట్టించుకొనదు; అది సర్వప్రభువు, సర్వవ్యాపకము - "ప్రభు విభు" (5-14,15); అది స్థిరము, దృఢము, శుద్ధము, సమము, ప్రకృతి ప్రభవము (source), కాని ప్రకృతి మఱియు నామె కర్మలకు సాక్షిమాత్రము; అది మనపై కర్తృత్వభ్రాంతిని విధించునది కాదు; ఈ భ్రాంతి నిమ్న ప్రకృతి అజ్ఞానఫలితము. కాని బ్రహ్మయొక్క ఈ విముక్తి, ప్రభుత, శుద్ధత మనకు గోచరము గాదు; ఏలన మన సనాతన బ్రహ్మాత్మజ్ఞానమును కప్పియుండు ప్రాకృతాజ్ఞానము మనలను కల్లోల పఱచును. కాన దీక్షగల సాధకునకు ఈ జ్ఞానముదయించి, ఆత్మాజ్ఞానము పొఱదోలును; అది చిరకాలము దాగియుండిన సూర్యునివలె పైకి ప్రకాశించి, ద్వంద్వా తీతమగు మన ఆత్మసత్తను మన కంటియెదుట ప్రకాశింపజేయును - "అదిత్యవత్ ప్రకాశయతి తత్పరం" (5-16). సర్వాత్మనా చిరకాలము ప్రయత్నించుటచేతను చేతనసత్తనంతను తదభిముఖము గావించుట చేతను, దానినే మన బుద్ధివిషయము గావించుకొని, సర్వత్ర దానినే చూచుటచేతను దానితో ఏకబుద్ధికులము, ఏకాత్మకులము అగుదుము- "తద్బుద్ధయః తదాత్మానః' (5-17); అపుడు జ్ఞానజలములు* మననుండి నిమ్నమానవుని అంధకార దుఃఖము నంతను కడిగివేయును - "జ్ఞాన నిర్ధూతకల్మషాః" (5-17).

4. జ్ఞానఫలము సమత

అన్ని వస్తువులపట్ల, అందరి వ్యక్తులపట్ల ఈ జ్ఞానఫల మొక పరిపూర్ణ సమత యగునని గీత చెప్పును; అపుడే కర్మలను సంపూర్ణముగా బ్రహ్మయందు విడువ గలము. బ్రహ్మ సమము (5-19). కావున మనకు పరిపూర్ణసమత ప్రాప్తించినపుడే - "సామ్యేస్థితం మనః" (5-19), బ్రహ్మయొక్క ఏకత్వమునందు నెలకొని, బ్రహ్మవలెనే కర్మలన్నియు ప్రకృతినుండియే నిర్నిరోధముగా ప్రవర్తించుచున్న వని చూడగలము; అపుడు సంగభయము గాని, పాపభయము గాని, బంధన.భయము గాని యుండదు. అపుడు పాపకళంకముల ప్రసక్తియే యుండదు; ఏలన కామము, దాని కర్మలు మఱియు ప్రతిక్రియలతో నిండియుండు అజ్ఞానప్రపంచమునకపుడు అవల నుందుము - "తైర్ జితః సర్గ" (5-19). మఱియు నపుడు సర్వోత్తముని దివ్యప్రకృతిలో నివసింతుము గాన, మన కర్మలయందే దోషము లేక లోపము నుండదు. సమబ్రహ్మము దోషరహితము - "నిర్దోషం హిసమం బ్రహ్మ" (5-19); అచ్చట

---

*ఋగ్వేదము సత్యవస్తుప్రవాహములను వర్ణించును; ఇవి పరిపూర్ణజ్ఞానము గల జలములు, దివ్యసూర్యప్రకాశము నిండియుండు జలములు - 'ఋతస్య ధారాః ఆపో విచేతసః, స్వర్వతీ రాపః" ఇచ్చట ఇవి అలంకారములు, అచ్చట విస్పష్ట సత్యసంకేతములు.

నెలకొని, సర్వభూతకల్యాణమును సమముగా సాధించు ఏకమాత్రలక్ష్యముతో కర్మచేతుము – "సర్వభూతహితే రతాః" (5–25) మన హృదయస్థితుడైన ఈశ్వరుడు అజ్ఞానమునందును మన కర్మలను నడుపును, కాని మాయద్వారా, మన నిమ్నప్రకృతి యొక్క అహంకారముద్వారా. కాగా జ్ఞానముచేత మనము విముక్తుల మైనపుడు, ఈశ్వరుడు మన హృదయములందిక గూఢముగా నుండక, సమ పరమాత్మగా అభివ్యక్తమై, మన కర్మలను తానే చేపట్టును, మనలను దోషరహితమగు ఉపకరణముగా నుపయోగించుకొనును–"నిమిత్తమాత్రం" (11–33). జ్ఞాన సమతల మధ్య నిట్టి ఘనిష్ఠసంయోగము గలదు. ఇచ్చట బుద్ధియందలి జ్ఞానము స్వభావము నందు సమతగా ప్రతిఫలించును; కాగా పైన, ఉచ్చతరచేతనాభూమిక యందు జ్ఞానము పరమసత్తయొక్క ప్రకాశ రూపము ధరించగా, సమత ప్రకృతి సారతత్త్వమే యగును.

5. సత్తాజ్ఞానము – సంభూతిజ్ఞానము

భారతీయ తత్త్వశాస్త్రము మఱియు యోగశాస్త్రములందు సదా అత్యున్నత ఆత్మజ్ఞాన మను అర్థముననే 'జ్ఞాన' శబ్దము ప్రయుక్తమగును; ఏ ప్రకాశముచేత మనము మన వాస్తవసత్తలోనికి పెరుగుదుమో, అదియే జ్ఞానము గాని, మన సమాచారరాశిని, బౌద్ధికసంపదను వృద్ధిచేయు జ్ఞానము కాదు. అది జడవైజ్ఞానిక లేక మనోవైజ్ఞానిక జ్ఞానము కాదు; దార్శనిక లేక నైతికజ్ఞానము గాదు; సౌందర్యవిషయక లేక ప్రపంచవిషయక జ్ఞానము గాదు. సందేహము లేదు, ఇవియు మన పెరుగుదలకు తోడ్పడును– అయితే సంభూతియందే గాని సత్తయందు గాదు. ఆత్మను, భగవంతుని తెలిసికొనుటకు వాని నెపుడు ఉపకారకములుగా నుపయోగింతుమో, అపుడే అవి యౌగికజ్ఞానపరిధిలో ప్రవేశించును. ఎట్లన ప్రక్రియలు మఱియు ఘటనల తెరను భేదించుకొని, వాని వెనుక నున్నట్టియు, వానిని వివరించునట్టియు ఏకమాత్రసత్యవస్తువును దర్శించుటకు జడవిజ్ఞానము నుపయోగించుకొనవలయును; స్వవిషయము నెఱుంగుటకు, నిమ్నమును ఉన్నతము నుండి వివేచించి, నిమ్నమును త్యజించి, ఉన్నతములోనికి పెరుగుటకును మనో విజ్ఞానము నుపయోగించుకొనవలయును; దార్శనికజ్ఞానదీప్తిని సృష్టిసారతత్త్వములపై త్రిప్పి, సృష్టియందలి సనాతనాంశమును కనుగొని, దానియందు నివసించుటకది ఉపయోగపడవలయును; పాపపుణ్యములను వివేచించి, పాపమును విడిచివేసి, పుణ్యములపైకెగసి, దివ్యప్రకృతియొక్క శుద్ధ అమాయకతయందు నివసించుటకు నైతికజ్ఞాన ముపయోగపడలవలయును; భగవంతుని సౌందర్యమును దర్శించుటకు

సౌందర్యవిజ్ఞాన ముపయోగపడవలయును; జీవులలో భగవంతుడు వ్యవహరించు విధానము తెలుసుకొనుటకును, తెలిసికొని, మానవునియందలి భగవంతుని సేవించుటకును ప్రపంచజ్ఞానముపయోగపడదగును. ఇట్లు ఉపయోగపడినపుడు సైతము ఈ జ్ఞానము లన్నియు ఉపకారకములు మాత్రమే; ఏది మనస్సున కొక రహస్యమో, దేని ఛాయలను మాత్రమే మనస్సు పొందునో, దేని స్థానమాత్మయో, అదియే వాస్తవజ్ఞానము.

6. జ్ఞానసాధన

అయితే ఈ జ్ఞాన మెట్లు లభించును? దాని సారసత్యములను చూచిన వారినుండి-బుద్ధిచేత కేవలము తెలిసికొనిన వారినుండి కాదు- దానిలోనికి ప్రథమ దీక్షను బొందుదుము (4-34); కాని వస్తుతః అది మనలోపలనే ఉద్భవించును- "యోగమునందు సిద్ధిబొందిన మానవుడు దానిని స్వయముగా నాత్మయందే కాలక్రమమున కనుగొనును" (4-33), అనగా అతడు నిష్కామతయందును, సమత యందును, భక్తియందును ఎంతెంత వృద్ధినందునో, అంతంత తనలో జ్ఞానము పెరుగును, జ్ఞానములోని కతడు పెరుగును. 'తనలో' అనుమాట పరమజ్ఞానమునకే పూర్తిగా వర్తించగలదు; ఏలన మానవబుద్ధి ప్రోగుచేయు జ్ఞానరాశి ఇంద్రియముల ద్వారా బాహ్యమునుండియే కష్టపడి సేకరించబడును. స్వయమనుభూతము, స్వప్రకాశకము నగు నీ శ్రేష్ఠజ్ఞానమును బొందుటకు మన ఇంద్రియములను జయించి యుండవలెను.... "సంయతేంద్రియః" (4-39); అపుడు అవి కల్పించు భ్రమలకు మనము లోనుగాము, పైగా అవియే విశుద్ధ జ్ఞానదర్పణ మగును. అటులే దేనియందు సమస్తము వర్తించునో, ఆ పరతత్త్వముయొక్క సత్యమునందు మన చేతనసత్తనంతను స్థాపించి యుండవలెను- "తత్పరః" అపుడది తన స్వీయాస్తిత్వమును మనలో ప్రదర్శింపగలుగును.

7. సంశయస్థానమున శ్రద్ధ

చివరకు, జ్ఞానప్రాప్తికి శ్రద్ధ కావలయును, దీనిని సంశయింప బుద్ధికవకాశమివ్వ రాదు- "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" (4-39). "శ్రద్ధ లేని, సంశయాత్ముడగు అజ్ఞుడు వినాశము బొందును; సంశయాత్మునికి ఈ లోకము గాని, పరలోకము గాని, సుఖము గాని యుండదు"(4-40). నిజానికి, శ్రద్ధ (విశ్వాసము) వంటి నిశ్చితాధారము, వాస్తవికాలంబనము లభించినపుడే మానవుడెంతోకొంత లౌకిక

లేక పారలౌకిక సాఫల్యమును, తృప్తిని, సుఖమును బడయగలడు, కేవలము సంశయించు మనస్సు శూన్యమున నష్టమగును. కాని నిమ్నజ్ఞానమునందు సందేహ విశ్వాసములకు తాత్కాలికోపయోగము గలదు, అయితే ఊర్ధ్వజ్ఞానమున అవి మార్గావరోధములు. ఏలన అచ్చటి యావద్రహస్యము ఆవిష్కృతసత్యముయొక్క అధికాధికసాక్షాత్కరమే గాని, బుద్ధిభూమికలోవలె సత్యానృతముల సంతులనము (balancing) గాదు. బౌద్ధిక జ్ఞానమున సంశయ పూర్వకముగా తొలగించవలసిన అనృత ముండును గాని, ఉచ్చతరజ్ఞానమున దానికి తావు లేదు. ఇక నీయా అభిప్రాయమున కంటిపెట్టుకొని, బుద్ధి ఆ ఊర్ధ్వజ్ఞానమున కేది జోడించునో, దానిని ప్రశ్నపరంపరచేత వదిలించుకొనలేము; ఆ జ్ఞానమున నిలిచియుండుటచేత అది స్వయముగానే పడిపోవును. మఱియు పొందిన జ్ఞానములోని అపూర్ణతను దాని మూలమునే పశ్నించుటచేత తొలగించుకొనజాలము; అధికతర, పూర్ణతరసాక్షాత్కారము ద్వారానే పూరించుకొనగలము. ఇక నేజ్ఞాన మింతవఱకు సిద్ధించలేదో, దానిని చేరుటకు శ్రద్ధయే మార్గము గాని, శంకాతర్కములు గావు; ఏలన ఇది బుద్ధి మనక్విగల సత్యము గాదు; పైగా తఱచుగా నిది తార్కికబుద్ధిభావములకు వ్యతిరేకముగా నుండును- ఇది తర్కముచేత నిరూపించవలసిన సత్యము గాదు, ఆంతరముగా జీవించవలసిన సత్యము; దేనిలోనికి మనము పెరుగవలెనో అట్టి మహత్తర సద్వస్తు వది. చివరకు, ఈ సత్య మెట్లు స్వయంసిద్ధమో, అటులే స్వయంవ్యక్తమును. కాని మన అజ్ఞానముయొక్క ఇంద్రజాలము దీనిని మూసివేయును; అజ్ఞానమునుండియు, ఇంద్రియవిమోహితము, అభిప్రాయవ్యాకులితము నైన మనోహృదయములనుండియు ఉత్పన్నమగు సంశయ వ్యాకులములే ఇంద్రజాలమును ఘటించును- "అజ్ఞాన సంభూతం హృత్స్థం సంశయం"(4-42). ఈ సంశయమును జ్ఞానఖడ్గముచే, అనుభవజ్ఞానముచే ఛేదించివేయవలె నని గీత ఉద్బోధించును. సంతతయోగము నాశ్రయించి, అనగా ఎవని సత్యమును దెలిపికొనిన, సర్వము తెలిసిపోవునో, అట్టి పరమాత్మసంయోగమునుండి జీవించుచు సంశయమును దూరముచేయవలెను- "యస్మిన్ విజ్ఞాతే సర్వం విజ్ఞాతం" (మూ.ఉ.)

8. గీతాజ్ఞానము సక్రియము

అచ్చట పైన మనకు ప్రాప్తించు జ్ఞానము బ్రహ్మనిష్ఠునకు బ్రహ్మజ్ఞానము గాను, సంతత వస్తుదర్శనముగాను ఉండును. అది బ్రహ్మేతరమును వర్జించిన, కేవల బ్రహ్మదర్శనము లేక జ్ఞానము లేక చేతస్సు మాత్రము గాదు; అది సమస్తమును

బ్రహ్మమునందును, స్వీయాత్మగాను చూచుట యగును. "ఏ జ్ఞానముచేత నీవు సర్వభూతములను అశేషముగా ఆత్మయందును, పిమ్మట నాయందును చూచెదవో" (4-35), అ.. లభించినపుడే, మానసికప్రకృతియొక్క భ్రాంతిలోనికిక పతనముండదు. దీనినే గీత స్థానాంతరమున విస్తరించి చెప్పును- "సర్వత్రసమదర్శనుడగువాడు సర్వభూతములయందును ఆత్మను, సర్వభూతములను ఆత్మయందును దర్శించును (6-29). ఎవడు నన్ను సర్వత్ర దర్శించునో, నాయందు సర్వమును దర్శించునో, అతడు నాకు దూరము గాడు, నే నతనికి దూరము గాను (6-30). ఏకత్వము నందుకొని, ఎవడు సర్వభూతములయం దున్న నన్ను ప్రేమించునో, అత డెట్లు నివసించినను, వర్తించినను, నాయందే నివసించుచుండును, వర్తించుచుండును(6-31). సుఖమునందు గాని, దుఃఖమునందు గాని, సర్వత్ర ఎవడు అందరిని తనవలెనే సమముగా చూచుకొనునో, ఓ అర్జునా, అతడు పరమయోగి యని నా మతము (6-32)." ఇది ఉపనిషత్తుల ప్రాచీన అద్వైతజ్ఞానము, దీనిని గీత సదా ఎత్తి చూపును. కాని గీతాధిక్య మేమి యన, పట్టుదలతో గీత ఈ అద్వైతజ్ఞామును దివ్యజీవనసాధక మగు మహావ్యావహారికదర్శనములోనికి మార్చును. ఈ అద్వైతజ్ఞానమునకును, కర్మకును గల సంబంధము నది సదా ఒత్తిచెప్పును; ప్రపంచమున విముక్తకర్మకీ అద్వైతజ్ఞానము నాధారముచేయును. ఎపుడెపుడు గీత జ్ఞానమును ప్రస్తావించునో, అపుడు వెంటనే తిరిగి, దాని ఫలితమగు సమత వర్ణించును; ఎపుడెపుడు సమతను ప్రస్తావించునో, అపుడెల్ల దాని కాధారమగు జ్ఞానమును వర్ణించ మఱలును. గీత విధించు సమతను, విముక్తికి మాత్రమే ఉపయుక్తమగు ఆత్మయొక్క నిష్క్రియస్థితియందే ప్రారంభించి, అంతమొందదు; గీతాసమత సదా కర్మ కాధారభూమి యగును. విముక్తాత్మయందుండు బ్రహ్మశాంతి కర్మకు మూలము కాగా, ఆ మూలమునుండి ఉద్గమించు శక్తినే విముక్తప్రకృతిద్వారా పనిచేయు విశాలమగు ఈశ్వరకర్మ బైటికి ప్రసరింపజేయును; ఇట్లు ఏకముచేయబడిన శాంతియు, శక్తియు దివ్యజ్ఞానమును సమన్వయపఱచును.

9. స్థాయికప్రభుత సహజము గాదు

ఇతర జీవనవిధానములలో గల భావములకు గీత ఎట్టి విశిష్టవ్యాప్తిని సమకూర్చునో, మనకిపుడు వెంటనే స్పష్టపడును. సహిష్ణుత, దార్శనిక ఉదాసీనత, నతి (resignation) – ఇవి త్రివిధసమతకు ఆధారములని మనము క్రిందటి వ్యాసమున చూచియున్నాము; గీతాజ్ఞానము వీని నన్నింటిని పరస్పరము

గాదా? మేల్కొనిన మానవునికి కర్మనివృత్తియే, "అకర్మ"యే అంతిమ ఆశ్రయము గాదా? యని ముని ప్రశ్నించుకొనును. కాని ఇదియు భ్రమయే నని కృష్ణుడు పలుకును; ఏలన అకర్మ చేత గాక, కర్మ చేతనే జ్ఞానమును, విముక్తియు ప్రాప్తించును.

3. నిరహంకారత ప్రథమలక్షణము

అకర్మచేత గానిచో, ఎట్టి కర్మచేత జీవితానర్థములనుండి ముక్తి ప్రాప్తించును? సదుద్దేశముతో చేసిన కర్మలనుండి సైతము ఉప్పతిల్లు అనూహ్యఫలితము నుండియు, అశుభదుఃఖముల శతసహస్రరూపములనుండియు ముక్తి ప్రాప్తించును ? ఎట్టి కర్మ? అని ప్రశ్న వచ్చి నపుడు, కర్మయం దే బాహ్యవిభేదములను బాటింప బనిలే దని సమాధానము. ప్రపంచగతి కావశ్యకమగు ఏ కర్మనైనను పరిహరింపబని లేదు. పైగా సర్వకర్మలు చేయబడవలెను, అయితే భగవంతునితో యోగమునం దున్న ఆత్మస్థితినుండి చేయబడవలెను– "యుక్తః కృత్స్న కర్మకృత్" (4–18). అకర్మ, అనగా కర్మనివృత్తి తరణోపాయము గాదు; అంతర్దృష్టికి అట్టి అకర్మ స్వయముగా ఒక సంతతకర్మయే యనియు, అది ప్రకృతిగుణకర్మల అధీనావస్థ యనియు గాంచును. భౌతికనిష్క్రియత నాశ్రయించిన మనస్సు ఇంకను, ప్రకృతి గాక, తానే కర్మకర్త యను భ్రాంతిలో నుండును; భ్రమవశమున అది జడతనే ముక్తి యనుకొనును; పాషాణముకంటె స్తబ్ధముగా నున్న శరీరమునందు సైతము, ప్రకృతి పనిచేయుచునే యున్న దనియు, జీవిపై తన పట్టును అక్షతముగా నుంచుకొను ననియు ఆ మనస్సు చూడదు. మనఃస్థితి యిటు లుండ, సంపూర్ణ కర్మప్రవాహమునందు సైతము ఆత్మ తన కర్మలనుండి విముక్తముగా నుండును - అది కర్త గాదు, చేయబడు కర్మచేత బద్ధము గాదు; మఱియు ప్రకృతిగుణముల బంధనమునందు గాక, ఎవడు ఈ ఆత్మవిముక్తియందు నివసించునో, అతనికి మాత్రమే కర్మవిముక్తి గలదు, "కర్మయం దకర్మను, అకర్మయందు కర్మను ఎవడు గాంచునో, అతడే మనుష్యులలో బుద్ధిమంతుడు, వివేకవంతుడు" (4–18) అని గీత వచించిన దాని అభిప్రాయము స్పష్టముగా నిదియే, ఈ వాక్యమున కాధారము పురుష ప్రకృతుల నడుమ గల సాంఖ్యవిభేదమే - పురుషుడు విముక్త నిష్క్రియాత్మ, సదాశాంతుడు, విశుద్ధుడు, కర్మల నడుమనుగూడ అవిచలితుడు; కాగా ప్రకృతి సదాసక్రియము; తన దృశ్యకర్మకోలాహల మునందువలెనే, పాషాణముయొక్క జడతయందును, సన్యాసియొక్క స్తబ్ధత యందును కర్మరతమై యుండును. వివేచనాత్మక బుద్ధి తన శ్రేష్ఠప్రయత్నముచేతమనకు ప్రసాదించు జ్ఞాన మిది; కనుక ఎవని కీ జ్ఞానము

గలదో "అతడు మనుష్యులలో బుద్ధిమంతుడు" (4-18) - అంతే గాని నిమ్నతర యుక్తి కల్పించు బాహ్య, అనిశ్చిత, అస్థాయి విభేదములను బట్టి జీవన, కర్మలను నిర్ణయించబూనుకొను భ్రాంతచేతస్కుడు గాడు. కావున విముక్తమానవుడు కర్మకు భయపడడు, పైగా సమగ్ర మహాకర్త యగును- "కృత్స్నకర్మకృత్" (4-18). అయితే ఇతరులవలె ప్రకృతిపరాధీనుడై కాక, ఆత్మయొక్క ప్రశాంతసమతయందును, భగవంతునితో నిర్మలయోగమునందును ప్రతిష్ఠితుడై కర్మ సేయును. భగవంతు డతని కర్మలకు ప్రభువు; తన వైయక్తిక ప్రకృతియొక్క ఉపకరణత్వముద్వారా, అతడా కర్మలకు ఒక వాహిని (channel, కాలువ) మాత్రము, మఱియు నీ ప్రకృతి తన ప్రభువు నెఱింగి విధేయమై యుండును. ఈ జ్ఞానముయొక్క సముజ్జ్వల తీవ్రత మఱియు విశుద్ధిచేత అగ్నిలోవలె అతని కర్మ లన్నియు కాల్చివేయబడును(4-37), అవి అతని మనస్సుపై ఎట్టి కళంకమును, వికృతచిహ్నమును విడువవు. నేను చేయుచున్నా ననే వైయక్తికాహంకారము లేక, ఈ విమోచకజ్ఞానమునందు సర్వ కర్మలను చేయుట - ఇదియే దివ్యకర్తయొక్క ప్రథమలక్షణము.

4. కామవిముక్తి ద్వితీయలక్షణము

రెండవ లక్షణము కామమునుంచి విముక్తి; ఏలన ఎచ్చట కర్తృత్వబుద్ధి యుండదో, అచ్చట కామ ముండుట అసంభవము; ఆహారము లేక, ఆధారము లేక, శూన్యమై, పడి చనిపోవును. బైటికి ఇతరుల వలెనే విముక్తమానవుడును సర్వ కర్మలను చేయుచున్నట్లు గన్పించును; బహుశః ఇతరులకంటె పెద్ద యెత్తునను, ఎక్కువ శక్తిశాలిసంకల్పముతోను, ప్రబలతరచోదకశక్తితోను అతడు చేయును; ఏలన భగవత్సంకల్ప బలము అతని సక్రియప్రకృతిలో పనిచేయును. కాని అతని సర్వారంభములనుండియు కామమున కుండు అవరసంకల్పము వెలివేయబడును- "సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః" (4-19). అతడు తన కర్మఫలముల యం దాసక్తిని త్యజించివేసి, కర్మప్రభువు చేతిలో ఒక నిర్వ్యక్తిక ఉపకరణముగానే పనిచేయును; కావున అతనిలో కామమునకు తావు లేదు- కర్మఫలము సిద్ధించునట్లు సేవించవలెనను కామమునకు సైతము; ఏలన కర్మఫలమును భగవదిచ్ఛ నిర్ణయించును గాని, తన యిచ్ఛ గాదు. సంకల్పకర్తయే గాక, వాస్తవకర్మకర్తయు భగవంతుడే. విముక్తమానవుని మానవమనస్సు గాని, ఆత్మ గాని ఏమియు చేయదు- "న కించిత్ కరోతి" (4-20). మానవుడు తన స్వీయప్రకృతిద్వారా కర్మయందు ప్రవృత్తుడగు

చున్నప్పటికి, వాస్తవముగా కర్మచేయునది విశ్వప్రకృతి, అనగా భగవంతుని కార్యనిర్వాహకశక్తి, హృదయనివాసియగు ఈశ్వరపాలితయైన చిన్మయదేవత.

5. యోగము కర్మకౌశలము

కర్మ శ్రేష్ఠముగా, విజయవంతంగా, సాధ్యసాధనలను సరిపుచ్చి చేయబడరాదని దీని తాత్పర్యము గాదు; పైగా శ్రేష్ఠకర్మాచరణము యోగస్థుడైన వానికే ఎక్కువ సులభము; ఆశాభయములచేత అంధుడు, కుంటి బుద్ధి చేయు నిర్ణయములచేత కుంఠితుడు, సంక్షుబ్ధమానవసంకల్పమునకు అధీనుడు నగు వాని కది సులభము గాదు. గీత స్థానాంతరమునందు నిర్వచించునట్లు "యోగము కర్మల యందు కౌశలము" (2-50). కాని యోగస్థుని కర్మ యంతయు వ్యక్తిగతప్రకృతి ద్వారా పనిచేయు ఒక విశ్వమహాప్రకాశము మఱియు శక్తిచేత నిర్వ్యక్తికముగా చేయబడును. తాను సాధించవలసిన ఫలితమునకు అనురూపశక్తియే తన కివ్వబడు ననియు, తాను చేయవలసిన కర్మ కనురూపమగు దివ్యభావమే దాని వెనక నుండు ననియు, తన యందలి సంకల్పముయొక్క క్రియాశక్తిని, గమ్యదిశను భాగవతవిజ్ఞానము సూక్ష్మరీతిని నడుపు ననియు కర్మయోగికి దెలియును. ఇక కర్మఫలితము సాధారణ మానవ దృష్టికి జయము గావచ్చును, లేదా అపజయముగా గన్పించవచ్చును; కాని కర్మయోగికి మాత్ర మది సదా విజయమే - తాను గాక, కర్మను, ఫలమును మలచుచుండు సర్వజ్ఞప్రభువు ఉద్దేశించిన విజయము; ఈ ప్రభువుయొక్క సంకల్పమును, విజ్ఞానమును బాహ్యవిజయముద్వారాకంటెను బాహ్యపరాజయము ద్వారానే తఱచుగాను, ఎక్కువశక్తితోను తన ఉద్దేశ్యములను సాధించుకొనును. నిశ్చయముగా విజయము నీదే యగును, యుద్ధము చేయుము (11-34) - అని అర్జును డాదేశింపబడెను; కాని నిశ్చితపరాజయమే ఎదురుగానున్నను, అతడు యుద్ధము చేయవలసినదే; అది తన భాగముగా వచ్చిన తక్షణ కర్తవ్యము, ఇట్టి కర్తవ్యముల సముదాయముచే భగవదిచ్ఛ నిశ్చయముగా నిర్వర్తించబడును.

6. ఆధ్యాత్మిక నిర్వ్యక్తికత తృతీయలక్షణము

విముక్త మానవున కే ఆశలు నుండవు. తన స్వీయసంపత్తిగా అతడు అందిన వస్తువులను దాచుకొనడు; భగవదిచ్ఛ తన కిచ్చినదానిని స్వీకరించును, అతనికి దేనియందును లోభముండదు, ఎవనియందును అసూయపడడు; తనవంతుగా వచ్చినదానిని విరక్తియు, అనురక్తియు లేక స్వీకరించును; తన నుండి పోవుదానిని

సంతాపము, విచారము లేక పోనిచ్చును; అతని చిత్తమును, ఆత్మయు పరిపూర్ణ వశమునందుండును (4-21); కావున బాహ్యస్పర్శలకు వానియందు ప్రతిక్రియా కల్లోలము జనించదు. అతని కర్మ "కేవలము శారీరకర్మ" (4-21); ఏలన తక్కిన దంతయు పై నుంచి వచ్చునే గాని, మానవభూమికయం దుత్పన్నము గాదు; అదిపురుషోత్తముని సంకల్ప జ్ఞానానందముల ఒక ప్రతిబింబము మాత్రము, కనుక నతడు కర్మాచరణము మఱియు కర్మఫలితములందు పట్టుబట్టి, తన మనో హృదయములందు తాపపాపములను ప్రతిక్రియలను బుట్టించుకొనడు. ఏలన పాపస్వరూపము బాహ్యక్రియ గాదు; ఆ క్రియ ననుగమించు లేక దానికి కారణమగు ఏ సవ్యక్తిక సంకల్పము, మనస్సు, హృదయము గలవో, వానినుండి జనించు మలిన ప్రతిక్రియయే పాపము. దీనికి ప్రతిగా ఏది నిర్వ్యక్తికమో, అది సదా విశుద్ధము - "అపాపవిద్ధం" (ఈ.ఉ.) ఈ నిర్వ్యక్తిక మేది చేసినను, దాని కంతకు తన సహజ విశుద్ధిని ప్రసాదించును. ఈ ఆధ్యాత్మిక నిర్వ్యక్తికత దివ్యకర్తయొక్క తృతీయలక్షణము ఒక విధముగా మహత్తను, విశాలతను అందుకొనిన మానవాత్మ లన్నియు తమద్వారా పనిచేయుచున్న ఒక నిర్వ్యక్తిక శక్తిని లేక ప్రేమను లేక సంకల్పజ్ఞానములను గుర్తించి యుందురు; కాని వారు తమ మానవవ్యక్తిత్వము నుండి జనించు ప్రచండ ప్రతిక్రియల నుంచి ఇంకను ముక్తులు గారు. కాని విముక్తాత్మ ఈ విముక్తి నందుకొని యున్నది; ఏలన అతడు తన వ్యక్తిత్వమును నిర్వ్యక్తికాత్మలో విసర్జించెను; ఇక నచ్చట ఆ వ్యక్తిత్వము తనది గాదు, పురుషోత్తమునిది; ఈ పురుషోత్తముడు సమస్త సాంతగుణములను అనంతముగాను, స్వేచ్ఛగాను ఉపయోగించుకొనును, కాని దేనిచేతను బద్ధుడు గాడు. ఇప్పు డతడు ఆత్మ అయ్యెను, ప్రాకృతగుణరాశిగా లేడు; మఱియు ప్రకృతిక్రియ నిమిత్తము అతనిలో మిగిలియున్న వ్యక్తిత్వాభాసము ఇపుడొక బంధముక్తము, విశాలము, నమనీయము (flexible), విశ్వవ్యాపకము నగు వస్తువు; ఇపుడా వ్యక్తిత్వము అనంతము ధరించు ఒక విముక్తాకృతి, పురుషోత్తముడు వేసికొను ఒక సజీవవేషము.

7. సమత చతుర్థ లక్షణము

పూర్వ లక్షణత్రయమగు జ్ఞానము, నిష్కామత, నిర్వ్యక్తికతలయొక్క ఫలము ఆత్మయందును, ప్రకృతియందును ఒక పరిపూర్ణ సమత యగును. ఈ సమతయే దివ్యకర్తయొక్క చతుర్థలక్షణము. అతడిపుడు ద్వంద్వములను దాటిపోయెను- "ద్వంద్వాతీతుడు" (4-22). ఈ దివ్యకర్త భావవికారము లేక, సిధ్యసిద్ధులను

జోడించుటయే గాక, వానికి అనంతగంభీరము, మహావిశాలమునగు అర్థవిశేషమును గల్పించును. సహిష్ణుతచేత స్వవశిత్వమును సాధింప ఆత్మకు శక్తి ప్రాప్తించును: దీనిని వివరించునదే స్టాయికజ్ఞానము; ఇచ్చట ఆత్మ తన ప్రకృతితో పోరాటము సల్పి, సమతను బొందును; సంతతజాగరూకతతో దాని తిరుగుబాటులను అడచి వేయును, ఆ సమతను నిలుపుకొనును. దీనివలన ఉదాత్తశాంతియు, పరమానందము లభించదు. ఏలన ఈ పరమానందము ఆత్మ తన దివ్యసత్తయొక్క సహజపరిపూర్ణత యందు నివసించుటచేతనే లభించును గాని, నియమము ననుసరించి జీవించుటచేత గాదు. ఏలన అపుడు "ఆత్మ ఎట్లు నివసించినను, వర్తించినను భగవంతునియందే నివసించును, వర్తించును" (6-31); అపుడు ఆనందము ఆత్మ సత్తయొక్క ప్రకృతియే యగును గాన, దాని నిలుప ప్రయత్నిమిక అనవసరము. నిమ్నప్రకృతితో మనము సలుపు సంఘర్షమును ధైర్యముతో సహించుటను గీత ఒక ప్రాథమికసాధనగా నంగీకరించును; స్వీయశక్తివలన ఒకమేరకు ప్రభుత ప్రాప్తించినను, ఆ ప్రభుతయందు విముక్తిమాత్రము భగవంతునితో సాయుజ్యము చేతనే సిద్ధించును; అతడు ప్రకృతిలోపల నివసించుచున్నను, ప్రకృతికి పైన ఆమెను, ఆమె కర్మలను నడుపు ఒక దివ్యప్రభువు. కావున అతనితో సాయుజ్యము చేత మనమొక పరమవిముక్తి యందును, పరమప్రభుతయందును ప్రవేశింతుము. తనను శాసించుకొనుటచేత బాహ్యపరిస్థితులకు గూడ శాసకుడగు రాజు స్టాయికసాంప్రదాయమునకు ఆదర్శ పురుషుడు; అతడు ఒక నిమ్నతర భూమిక యందు వేదాంతము చెప్పు స్వరాట్టు మఱియు సమ్రాట్టుతో పైపైన మాత్రమే పోలియుండును. స్టాయికుని రాజత్వము తనపైనను, పరిసరములపైనను చేయు బల ప్రయోగముచేత నిలబెట్టబడును; కాని యోగియొక్క సర్వథా విముక్తమగు రాజత్వము సహజసిద్ధము; ఏలన దివ్యప్రకృతి యందు రాజత్వము సనాతనముగా ఉండనేయున్నది, మఱియు అతనికి దాని విముక్తవిశాలతతో సాయుజ్యముండును; ఇంకను ఉపకరణభూతమగు నిమ్నప్రకృతికి పైనుండు దివ్యప్రకృతియొక్క అతీతభావమున అతడు సహజముగానే నివసించును. అతడు అన్నింటితోను ఏకాత్మకు డయ్యెను గావుననే, అతని కన్నింటిపైన ప్రభుత గలదు. 'రోమన' సమాజవ్యవస్థనుండి ఒక దృష్టాంతము: ఆ కాలమున ఊడిగము నిమిత్తము ఒకనిని సంతలో కొని, ఆ బానిసీడు సరిగా ప్రవర్తించినచో, కొంతకాలము పిమ్మట యజమాను డతనికి విముక్తినొసగును. స్టాయికుని ముక్తియు అటులే ప్రకృతి కనికరించి యిచ్చినదే. కాగా గీతముక్తి జన్మతః ముక్తమానవుని ముక్తి, దివ్యప్రకృతి

లోనికి జన్మించుట యొక్క సత్యముక్తి, తన దివ్యతయందు సహజసిద్ధమగుముక్తి. తా నేమి చేసినను; ఎట్లు నివసించినను, విముక్తాత్మ భగవంతునియందే నివసించును; అతడు ఇంటిలోని ముద్దుబిడ్డ – "బాలవత్". అతడు తప్పు చేయనే లేడు, పడిపోవనే లేడు; ఏలన అతని స్వరూపమును, కర్మయు, పరిపూర్ణుడు, సర్వానందమయుడు. సర్వప్రేమమయుడు, సర్వసౌందర్యమయుడు నగు భగువంతునిచేత నిండియుండును. అతడనుభవించునది మధుర, సుఖమయ రాజ్యము "రాజ్యం సమృద్ధం" (11-33). "శిశువునకే చెందును రాజ్యము" అని గ్రీకు మేధావి ఈ రాజ్యమును గుఱించియే అర్థవంతముగా పలికెను.

10. దార్శనిక సమత సానుభూతి-శూన్యము

బాహ్యవస్తువులు క్షణభంగురములు; వాని తారతమ్యములు నిరర్థకములు; ఆంతర శాంతి, ప్రకాశము, స్వావలంబనమే శ్రేష్ఠము- అను వాస్తవ ప్రపంచజ్ఞానమే దార్శనిక జ్ఞానము. ఇది దార్శనిక ఉదాసీనతనుండి జనించు సమతకు మూలము. ఈ సమత ఉన్నతశాంతి నిచ్చును గాని, అధికతర ఆధ్యాత్మికానందమును గాదు, ఇది యొక ఏకాకివిముక్తి- తాను తప్పించుకొని, పర్వతశిఖరమునుజేరుకొని, ఇంకను సాగరకల్లోలమున కొట్టుకొనుచున్నవారిని హీనముగా జూచు ఏకాకిమౌనిముక్తి - ఇది చివరకు పృథగ్భూతము, నిరర్థకమునగు ముక్తి యని తెలును. గీత దార్శనికమగు ఉదాసీనతాప్రేరణను ప్రాథమిక సాధనగా నంగీకరించును. కాని గీతాగమ్యమగు ఉదాసీనతలో దార్శనిక ఏకాకిత ఏమాత్రము నుండదు- అస లా మాటయే గీతాగమ్యమునకు సరిపడదు. ఏలన గీతయందు ఉదాసీనత కర్థము నిస్పృహత గాదు; ఉత్ = పైన, ఆసీనుడు = కూర్చొన్నవాడు, ఉదాసీనుడు. గీతయొక్క ఉదాసీనుడు భగవంతునివలె, నిమ్నప్రకృతికి పైన స్థితుడై, ప్రపంచమునం దే ఆవశ్యకతయు లేకయే, సర్వదాకర్మ సేయును; సర్వమునందునుఉండి, ప్రాణికోటి పరిశ్రమకు ఆధారముగా, సహాయకుడుగా, పరిచాలకుడుగా, వర్తించును. ఈ సమత సర్వభూతములతో గల ఏకతయందు ప్రతిష్ఠితము. దార్శనికసమతలోని లోపమును గీతాసమత పూరించును; ఏలన గీతాసమతకు శాంతియే గాక, ప్రేమయు నాత్మగా నుండును. ఏలన ఆది సర్వభూతములను అశేషముగా భగవంతునియందు గావించును, సర్వప్రాణుల ఆత్మతోను ఏకాత్మకమగును, కావున అందరిపట్ల దానికి పరమసానుభూతి వర్తించును, అశేషముగా వర్తించును - "అశేషేణ" (4-35). శివము, సుందరము, ప్రియము నగునదియే గాక, ఎంతటి నీచము, పతితము,

దుష్టము, వికృతము నగునది యైనను ఈ సార్వత్రిక, పూర్ణాత్మక స్వానుభూతిలోనికి, ఆధ్యాత్మిక ఏకతలోనికిని వచ్చివేయును. ద్వేషము, క్రోధము లేక అనుదారతకే గాక, ఇచ్చట ఏకాకిత, తిరస్కారము, లేక ఆధిక్యగర్వమునకు గూడ తావు లేదు. ఇచ్చట అజ్ఞానమున పెనగులాడు మనస్సుపట్ల దివ్యకరుణ వెలయును; దానిపై సర్వప్రకాశమును, శక్తిని, సుఖమును వర్షించు దివ్యసంకల్పము వర్తించును. ఇది బాహ్యమానవునికి కాగా, అతనిలోపలి దివ్యాత్మకు తదోధికముగా ఆరాధనయు, ప్రేమయు నర్పించబడును. ఏలన అందరినుండియు - సాధువులు మఱియు బుధులలోనుండి ఎటులో, అటులే చోరులు, వేశ్యలు, చండాలురలోనుండి సైతము- ప్రియతమభగవంతుడు వెలికి చూచి, "ఇది నేనే" యని మనకు చాటును. "అన్ని భూతములయందు నన్ను ప్రేమించువాడు" (6-31) - ఈ వాక్యమును మించి, దివ్య సార్వత్రికప్రేమయొక్క ప్రగాఢతను, గభీరతను ఎక్కువ శక్తితో ఉద్ఘాటించు వాక్యము మనకే దర్శనశాస్త్రమున లేక ఏ మతగ్రంథమున లభించును?

11. గీతయందు నతి సమర్పణ యగును

నతి ఒకవిధమగు ధార్మికసమతకు మూలము (1-19-4); నతి యన భగవదిచ్ఛకు అధీనమగుటకు, కష్టమును ధైర్యముతో సహించుట. గీతయందీ అంశము, సమస్తసత్తను భగవంతునికి సమర్పించుటయను విశాలతరరూపము ధరించును. అది నిష్క్రియ అధీనతయే గాక, సక్రియ ఆత్మప్రదాన మగును; భగవదిచ్ఛను ఆమోదించుటయే గాక, కర్మప్రభువునకు తన యిచ్ఛను ఉపకరణముగా నిచ్చివేయుటయగును. దీని ఫలితముగా, కనీసము చివరకు, మనసత్త భగవంతుని సత్తతో ఏకమగును, నిర్వ్యక్తికముచేయబడిన మన ప్రకృతి అతనికి ఉపకరణ మాత్ర మగును. ఇంకను శుభాశుభ, ప్రియాప్రియ ఫలమంతయు కర్మప్రభువునకే చెందునను దృష్టితో దాని నామోదింతుము; దీనివలన శోకకష్టములు సహించబడుటయే గాక, చివరకు నెట్టివేయబడును; ఇపుడు పరిపూర్ణ చిత్తసమత ప్రతిష్ఠితమగును. ఉపకరణ మెట్టి స్వీయసంకల్పమునకు ఎడ మీయదు; విశ్వమయభగవంతునియొక్క సర్వజ్ఞ పూర్వదృష్టియందును, సర్వసమర్థ సఫలశక్తియందును సర్వము పూర్వమే నిర్ణీతమై యున్న దనియు, మానవుల అహంకారము భగవదిచ్ఛావ్యాపారమును మార్చజాల దనియు భక్తుడు కనుగొనును. కావున తర్వాతి అధ్యాయమున అర్జునునిపై విధింప బడినదే చరమవైఖరి యగును- "నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్" (11-33); నా దివ్యసంకల్పమునందును పూర్వదృష్టియందును అంతయు నాచే పూర్వమే

చేయబడినది; కావున అర్జున ! నిమిత్తమాత్రుడ వగుము. ఈ వైఖరి చివరకు భగవదిచ్ఛతో వైయక్తికేచ్ఛయొక్క సంపూర్ణసంయోగమునకు తప్పక దారి తీయును, మఱియు జ్ఞానము వృద్ధినందిన కొలది భగవంతుని శక్తిజ్ఞానములకు ఉపకరణయొక్క నిర్దుష్ట సమాధానమును సాధించును. పరాత్పరపురుషుడు, విశ్వమయపురుషుడు, వైయక్తికపురుషుడు- ఈ ముఠ్వురియొక్క ఈ పరమ సంయోగావస్థయందు ఆత్మ సమర్పణవలన ప్రాపించు పరిపూర్ణ, నిరపేక్షసమత యుండును, భగవంతుని శక్తి జ్ఞానములకు మనస్తత్త్వ మొక నిష్క్రియవాహినిగా నుండును; కాగా సక్రియసత్త ప్రపంచమున తనద్వారా జరుగవలసిన పనికి ఒక ప్రబలామోఘయంత్రముగా నుండును.

12. సమత యుద్ధమునకడ్డు గాదు

మనపై ఇతరుల కర్మపట్ల గూడ సమత యుండును. అందరియందును ఏకాత్మను దర్శించుటవలన గలుగు ఆంతర ఏకతను, ప్రేమను, సానుభూతిని ఇతరులు చేయున దేదియు మార్చజాలదు. అయితే ఇతరు లేది చేసినను, ఎదిరించక, తలవంచి సహించుట యోగి చేయు కర్మలో ఆవశ్యకభాగముగా నుండదు, ఉండజాలదు. ఏలన యోగి యిచ్ఛ భగవదిచ్ఛకు సంతతోపకరణమై విధేయముగా నుండును. కావున ప్రాయః స్వీయాహంకారపరితృప్తినే అనుసంధిచు వైయక్తి కేచ్ఛలను అది ప్రతిఘటించవలసివచ్చును. ఎదిరించి, పోరాడి, జయించుమని అందుచేతనే అర్జునుడాదేశింపబడెను; అయితే అతడు ద్వేషముగాని, స్వార్థముగాని, వైరము గాని లేక పోరాడవలయును; ఏలన ముక్తాత్మ కీ మనోవికారములు సంభవములు గావు. లోకులను దివ్యగమ్యమునకు నడుపు నిమిత్తము- "లోక సంగ్రహార్థము" (3-20) - నిర్వ్యక్తికముగా కర్మసేయుము - అనునది విశ్వమయభగవంతునితో ఆత్మయొక్క ఏకతనుండి అవశ్యముగా జనించు నియమము; ఏలన విశ్వవ్యాపారము యొక్క సమస్తాభిప్రాయము, ఉద్దేశ్యము గూడ నిదియే, మఱియు ప్రాణులన్నింటితోను, విరోధులుగాను, శత్రువులుగాను ఎదిరించువారితో సైతము మనకు గల ఏకత్వమునకు లోకసంగ్రహకర్మవలన క్షతి సంభవించదు. ఏలన లోకసంగ్రహలక్ష్య మగు దివ్యగమ్యమే వారి గమ్యమును. ఈ దృష్ట్యా వారి నెదిరించి, ఓడించుటయే వారికి చేయగల ఉత్తమ బాహ్యసేవ యగును. ఈ దృష్టితోనే, సమతయందు భిన్నభిన్న సంబంధములు సాధ్యముగావనియు, ప్రేమ యుద్ధము చేయజాల దనియు,

జగద్వ్యాపారజ్ఞానము లేమిచే చెప్పు సంకుచితసిద్ధాంతమును గీత నిరాకరించును; అయితే సారతత్త్వమును మాత్రము అక్షతముగా నుంచును. ఈ సారతత్త్వ మేమన, ఆత్మకు అన్నింటితోను ఏకత, హృదయమునకు ప్రశాంత విశ్వప్రేమ, సానుభూతి, కరుణ, కనికరములకు జగత్కల్యాణమును నిర్వ్యక్తికముగా సాధించు స్వేచ్ఛ; ఈ కల్యాణము దివ్యప్రణాలికను గుర్తించని ఈ యా వ్యక్తియొక్క కల్యాణము గాదు, మానవుల ప్రగతిశీల శ్రేయఃప్రేయములు, సర్వభూతముల సంపూర్ణహితమును.

13. దివ్యజీవన ధర్మము

భగవంతునితో ఏకత, సర్వభూతములతో ఏకత, సర్వత్ర సనాతన దివ్య సమైక్యసాక్షాత్కారము, మఱియు మానవుల నా ఏకతవైపున కాకర్షించుట – ఇవి గీతాబోధనలనుండి ఉత్పన్నమగు జీవనధర్మ మగును. ఇంతకు మించిన మహత్తర విశాలతర, గంభీరతర జీవనధర్మ ముండజాలదు. ఇక కర్మనియమమును జూతుమేని, స్వయముగా ముక్తుడగుట, ఈ ఏకతయందు నివసించుట, ఈ ఏకతామార్గమున మానవజాతికి సాయపడుట, గమ్యప్రాప్తికి ముందు భగవంతునికొఱకు సర్వకర్మలను జేయుట – "కృత్స్నకర్మకృత్" (4–18) – మఱియు సర్వకర్మలను హర్షామోదములతో జేయు మానవుని ప్రోత్సహించుట–"జోషయేత్ సర్వకర్మాణి" (3–26)– దీనికంటెను మహత్తరము లేక ఉదారతరము నగు దివ్యకర్మ నియమము నెవ్వరును చూపజాలరు. ఈ విముక్తియు, ఈ ఏకతయు మన మానవప్రకృతి యొక్క రహస్యగమ్యము మఱియు జాతిజీవనమునందలి చరమసంకల్పము. ఈ గమ్యమునకు తిరిగి నపుడే, మానవజాతి ఇపుడు తాను వృథాగా అన్వేషించు సుఖమును బడయగలదు. కాని ఇట్లు తిరుగుటకు పూర్వము, మానవులు తమ నేత్రములను, హృదయములను తెఱచి, తమలోను, చుట్టును, సర్వమునందును భగవంతుని చూడవలెను, అతని యందే తాము నివసించుచున్నామని గ్రహించవలెను. కాగా భేదమయమగు ఈ నిమ్నప్రకృతి కారాగార ప్రాకారము మాత్రమే; కాన దానిని మట్టముచేయవలెను; అథవా ఉత్తమపక్షమున, దాని నొక శిశుపాఠశాలాగా భావించి, దానిని మించి పైకి పెరుగవలెను; అపుడు వారు తమ ప్రకృతియందు ప్రౌఢులు, ఆత్మయందు ముక్తులు కాగలరు. పరమునందలి భగవంతునితో, మానవునియందలి భగవంతునితో, ప్రపంచమునందలి భగవంతునితో ఏకాత్మకతను సాధించుటయే విమోచనాశయమును, సంసిద్ధి రహస్యమును అగును.

21. ప్రకృతి నిర్ణాయకత్వము

1. ఆత్మస్థితియందు స్వతంత్రులము

కర్మ మఱియు ఆత్మజ్ఞానముల ఏకత సిద్ధించిన మీదట. మనము ఉన్నతాత్మ యందు నివసించగలిగినపుడు, ప్రకృతిక్రియావిధానమునకు పై నుందుము; ఆమె గుణముల కిక దాసులము గాక, మన ప్రకృతిప్రభువగు ఈశ్వరునితో ఏకమై, కర్మఫలబద్ధులము గాకయే, మనమందలి భగవత్‌సంకల్పమును సాధించుటకు ఆమెను ఉపయోగించగలుగుదుము. మనయందలి ఆధికతరఆత్మయే అట్టిది గదా; అతడు ఆమె కర్మలకు ప్రభువు. ఆమె ప్రతిక్రియల విక్షోభమునకు పై నుండును; చలించడు దీనికి వ్యతిరేకముగా ప్రకృతిలోపల నుండు అంతరాత్మ తన అజ్ఞానము చేతనే గుణ బద్ధమై యుండును; కారణము అక్కడది తన సత్యాత్మలోను, పై నుండు భగవంతునితోను గాక, మూర్ఖముగా, సుఖరహితముగా అహం బుద్ధితో తాదాత్మ్యము చెందును; ఈ అహంబుద్ధి ఒక మానసిక గ్రంథి మాత్రము, ప్రకృతిక్రియల ఆటకు ఒక నిర్దేశకేంద్రము. ఈ గ్రంథిని భేదించి, అహంకారము నిక మన కర్మలకు కేంద్రమును, భోక్తను చేయక, సర్వాదేశమును పై నుండు దివ్యాత్మనుండియే పొంది సర్వమును తదాత్మకు నివేదించుటయే ప్రకృతికర్మల సంక్షుబ్ధ క్లేశమునుండి పైకిబోవుటకు మార్గము. ఏలన ఆట్టి నివేదనచేత పరమచేతనయొక్క నిమ్నరూపమగు అహంబుద్ధియందు గాక, పరమచేతనయందే నివసించుచు, అవరమాయయందు గాక, ఏకీకృతములగు భగవంతుని సంకల్పశక్తులయందే వ్యవహరింతుము.

2. ప్రకృతి నిర్ణాయకత పాక్షికసత్యము

ప్రకృతికి అహంకారాత్మయొక్క అధీనతను ఒత్తిచెప్పు శ్లోకములు గీతలో కొన్ని గలవు; వీనిని జూచి, విశ్వజీవనమున స్వాతంత్ర్యమున కెట్టి అవకాశము నివ్వని నిరపేక్ష, యాంత్రిక నిర్ణాయకతనే గీత ప్రతిపాదించునని కొందరు చెప్పుదురు. నిశ్చయముగా, ఆ శ్లోకాల భాష బలముగా నుండును, నిరపేక్షముగా గన్పించును. కాని ఇతర విషయముల యందువలె నిచ్చటను గీతావిచారణను సమగ్రముగా తీసికొనవలయునే గాని, ఏదో ఒక వాక్యముయొక్క ప్రత్యేకార్థమునే పట్టుబట్టి చెప్పరాదు. ఏలన ప్రతిసత్యము, నది స్వయంగా నెంత సత్యమైనను, తనకు పరిమితిని, పరిపూర్తిని కల్పించు ఇతరసత్యములనుండి, వేఱు చేసినపుడు, బుద్ధిని బంధించు

ఒక పాశమును, పెడదారి బట్టించు ఒక వాదమునగును. ఏలన వాస్తవానికి ప్రతిసత్యము సంకీర్ణవస్త్రములోని ఒక పోగు మాత్రమే. గీతయందలి ప్రతివిషయమును ఇటులే అల్లబడియుండును గాన, సర్వముతో సంబంధపఱచియే దానిని చూడవలయును. కృత్స్నము (సర్వము) యొక్క జ్ఞానము లేక దారి తప్పిన వారికిని –"అకృత్స్నవిదః", కృత్స్నవిదుడగు (3-29) యోగికిని మధ్య గీతయే భేదమును చూపును. సర్వసృష్టిని నిశ్చలముగా, సమగ్రముగా జూచుచు, దాని విరుద్ధసత్యములను బట్టి దారితప్పరాదు. యోగి అందుకొనవలసిన ప్రశాంత, సంపూర్ణవిజ్ఞానమున కిది ప్రథమావశ్యకత యగును. మన సంమిశ్రసత్తయొక్క ఒక కొనయందు ప్రకృతితో ఆత్మకు గల సంబంధముయొక్క ఒక పార్శ్వము ఒక విధమగు సంపూర్ణ స్వాతంత్ర్యముగా నుండును; రెండవ కొనయందు ఈ సంబంధముయొక్క రెండవపార్శ్వము ప్రకృతికృత మగు ఒక విధమగు సంపూర్ణనిర్ణాయకతగా నుండును. ఈ విరుద్ధసత్యములు వికాసశీల మానసమునందు వక్రించి, ప్రతి ఫలించుటచేత ఆత్మకు ఒక అవాస్తవికమగు స్వేచ్ఛాభాసము స్ఫురించును. దీనినే మనము సాధారణముగా స్వతంత్రేచ్ఛయని పిలుతుము, కాని అది ఎక్కువ తక్కువ తప్పే యగును. గీతాదృష్టిలో సంపూర్ణ విముక్తియు, ప్రభుతయు గాని దేదియు స్వతంత్రత గాదు.

3. మన స్వాతంత్ర్యము యోగిదృష్టికి పారతంత్ర్యము

పురుషప్రకృతులకు సంబంధించి, గీతాబోధనల కాధారముగా నున్న రెండు మహాసిద్ధాంతములను మనము మఱువరాదు – పురుషప్రకృతులను గుఱించి చెప్పు సాంఖ్యసత్యము; దానిని సవరించి, పూర్ణముచేయు వేదాంతసత్యము. దీనియందు త్రివిధపురుషులు, ద్వివిధప్రకృతులు ప్రతిపాదింపబడును; కాగా వీనిలోని నిమ్న రూపమే త్రిగుణముల మాయ. ఉచ్చరూపమే దివ్యప్రకృతి మఱియు సత్యమగు ఆత్మప్రకృతియు నగును. ఆత్మ స్వాతంత్ర్య పారతంత్ర్యములను సమన్వయపఱచి, వివరించగల కీలక మిదియే; లేనిచో అవి పరస్పరవిరోధములు, విసంగతములుగానే మిగిలిపోవును. వాస్తవానికి అనేక చేతనాభూమికలు గలవు. మఱియు ఒక భూమికయందలి వ్యావహారికసత్యము, పై భూమికలోని కారోహించిన వెంటనే, అట్లు గాక, మఱియొక భిన్నరూపమున గన్పించును; కారణము అక్కడ దృష్టి విశాలతరమగును నేటి వైజ్ఞానికపరిశోధన ప్రకటించిన దేమన, మానవుడు, పశువు, వృక్షము, చివరకు లోహము సైతము వస్తుతః ఒకే విధమగు ప్రాణికప్రతిక్రియలు

గలిగియుండును. అయినను వీనిలోని ప్రతిదియు తన అనుభవమును వివరించ గలుగుచో, భిన్నర్థము, మూల్యము వచ్చును, భిన్నదృక్కోణమునుంచి విచారించ బడును. మానవాత్మస్తరములకు గూడ నిదియే వర్తించును. మన సాధారణ మనశ్చేతనలో దేనిని మనము, కొంతవఱకు సత్యముగానే, స్వతంత్ర ఇచ్ఛయని పిలుచుచున్నామో, మన కంటెను పై కెక్కిన యోగి కది ఏ మాత్రము స్వతంత్రేచ్ఛ కాకపోగా, గుణములకు పరతంత్రతగానే, కన్పించును – మనకు రాత్రి యోగికి పగలు, మనకు పగలు యోగికి రాత్రి (2–69). ఒకే వాస్తవములను యోగి కృత్స్నవిదుని ఉచ్చతర దృక్కోణమునుండి చూడగా, మనము అకృత్స్నవిదుని పాక్షికజ్ఞానము, అనగా అజ్ఞానమునుండి మాత్రమే వానిని చూతుము. మనము సగర్వముగా చెప్పుకొను స్వాతంత్ర్యము అతని దృష్టికి బంధనము.

4. రెండు చేతనాస్తరములు

నిమ్నప్రకృతియొక్క జాలమునందు నిర్విరామముగా చిక్కుకొనియున్న సమయమునందే, నేను స్వతంత్రుడ ననుకొను వాని అజ్ఞానమును దర్శించు దృక్కోణమునకు జేరుకొని, గీత, గుణభూమికయందు అహంకారాత్మ సర్వథా గుణాధీను డని వక్కాణించును. చూడుడు; "ప్రకృతిగుణములచేతనే సర్వథాకర్మలు చేయబడుచుండగా, అహంకారముచే విమూఢాత్ముడు కర్తను నేనని తల పోయును (3–27). ఈ గుణము లీ కర్మలను జేయును–అని వాని విభజనతత్త్వముల నెఱింగిన యోగి, గుణములే పరస్పరము క్రియాప్రతిక్రియలను నెఱపుకొనునని తలంచి, వానియందు సక్తుడై చిక్కుకొనడు(3–28). గుణసంమూఢులు, అకృత్స్నవిదులు నగు వారి మనోభావమును కృత్స్నవిదుడు కలంచకుండు గాక! (3–29). నీ కర్మల నన్నింటిని నాకు సమర్పించి, ఆశామమకారములను వీడి, ఆత్మసంక్షోభమునుండి విముక్తుడవై యుద్ధము చేయుము (3–30)". అహంకారిక ప్రకృతియందు తగుల్కొనిన ఆత్మ ఒక ప్రక్కన గన్పించును; ప్రకృతిప్రేరణకు లోనై చేయుచునే, ఇది నేను స్వతంత్రముగా చేయుచున్నానని భ్రమించును; రెండవ ప్రక్కన ప్రకృతికర్మలను ఆమెకు పై నుండి నిరీక్షించుచు, అనుమతించుచు, పాలించుచు నుండు అహంవిముక్తమైన ఆత్మ గన్పించును.

5. రెండు ఆత్మలు, ఇద్దరు పురుషులు

ప్రకృతిపరతంత్రుడైన పురుషుని గుఱించి ప్రసంగింతుము; కాని గీత ప్రకృతిపురుషుల ధర్మములను వివేచించుచు, ప్రకృతి కార్యకర్త్రి కాగా, పురుషుడు సదా "ఈశ్వరుడే" నని వక్కాణించును (13-23). అయితే ఇక్కడ (3-27) గీత అహంకారవిమూఢమైన ఆత్మను ప్రస్తావించును. వేదాంతుల సదాత్మ సదా బ్రహ్మము, నిత్యముక్తము, శుద్ధబుద్ధము గదా ! అయినపుడు ఈ అహంకార విమూఢమైన, ప్రకృత్యధీనమైన ఆత్మ ఏది యగును? దీనికి సమాధాన మేమన, గీత ఇక్కడ సాధారణదృష్టి ననుసరించి, సదాత్మ లేక సత్యపురుషుని గుఱించికాక, బాహ్యాత్మ లేక బాహ్యపురుషుని గుఱించియే భాషించుచున్నది. నిజానికి ప్రకృతి కధీనమైనది అహంకారము, అది ప్రకృతిలో భాగమే గనుక, అధీనముగాక తప్పదు. కాని మనశ్చేతనలోని ఆత్మభోధము (self-awareness) అహంకారముతో తాదాత్మ్యము జెందినపుడు, అది ఒక నిమ్నాత్మ, ఒక అహమాత్మయొక్క ఆభాసమును పుట్టించును. అటులే మనము దేనిని అంతరాత్మ యని తలంతుమో, అది నిజానికి ప్రాకృతవ్యక్తిత్వమే గాని, యథార్థవ్యక్తి, పురుషుడు గాడు. అది మనయందలి కామాత్మ, ప్రకృతిక్రియల యందు ప్రతిఫలించిన పురుషచేతన. ఈ కామాత్మ స్వయముగా గుణముల క్రియయే గాన, ప్రకృతిలోని భాగమే. ఇట్లు మనముందు ఇద్దరు పురుషులున్నారని చెప్పవచ్చును - గుణముల మార్పులతో మాఱుచుండు బాహ్య లేక కామమయపురుషుడు; గుణపరిమితుడు గాని విముక్త, సనాతనపురుషుడు, ఇద్దరు పురుషులవలెనే, మనయందు రెండు ఆత్మలును గలవు; ఒకటి అహంకారమాత్రమగు బాహ్యాత్మ, ప్రకృతి కర్మలను స్వీకరించు మానసిక కేంద్రము, వికారవ్యక్తిత్వము; ఇది, నేనీ కర్మలను జేయుచున్న ప్రాకృతపురుషుడననుకొనును - కాని ఈ ప్రాకృతపురుషుడు కేవలము ప్రకృతియే, ఒక గుణసంఘాతమే, రెండు, సత్యాత్మ; ఇది వాస్తవానికి ప్రకృతి భర్త, అధిష్ఠాత (possessor), అధీశ్వరుడు; ఇది ప్రకృతిరూపములో నున్నప్పటికి, స్వయముగా వికారములకు లోనగు ప్రకృతి నిర్మిత వ్యక్తిత్వము గాదు. కావున కామపురుషుని కామములను అహమాత్మయొక్క మిథ్యాత్మదృష్టిని వదిలించుకొనుటయే విముక్తిమార్గ మగును. "కామాహంకారముల నుండి ముక్తుడవై", గురువు ఘోషించును, "ఆత్మజ్వరము నుండి బైటబడి, యుద్ధము చేయుము" (3-30).

6. ప్రకృతి పురుషవివేచనము

బాహ్యాత్మ ఎట్లు ఏర్పడెను? మన స్వరూపమునందు గల ద్వివిధతత్త్వములగు ప్రకృతిపురుషుల సాంఖ్యవివేచనచేత ఇది స్పష్టపడును. పురుషుడు అకర్త, ప్రకృతికర్త్రి; పురుషుడు చైతన్యప్రకాశపూర్ణుడు, ప్రకృతి జడశక్తి, తనకర్మలన్నింటిని చిన్మయ పురుషునియందు ప్రతిఫలింపజేయును - పురుషుడు సాక్షిమాత్రుడు. ప్రకృతి పరస్పరము పెనగులాడు గుణవిషమతచేత పనిచేయును, మఱియు తనయందలి అహంకారవృత్తిచేత తన క్రియాకలాపముతో పురుషుని తాదాత్మ్యము చెందించి, అతనియందు - ప్రశాంత సనాతనాత్మయందు - బాహ్యాత్మను, అనగా సక్రియ, వికార్య, క్షణిక వ్యక్తిత్వమును బుట్టించును. ఈ వ్యక్తిత్వము యొక్క మలిన ప్రాకృతచేతన శుద్ధ ఆత్మచేతనను ఆవరించివేయగా, అహంకారము మఱియు వ్యక్తిత్వముల లోపల నుండు పురుషుని మనస్సు మఱచిపోవును. ఈ మఱపు వలన ఇంద్రియ-మనస్సు, ప్రాణకామములు వివేచనాత్మకబుద్ధిని ఈడ్చుకొని పోవుచుండ, మనము దాని ననుమతింతుము. పురుషుడీక్రియను అనుమతించు వఱకు, అహంకార, కామ, అజ్ఞానములు బాహ్యపురుషుని శాసించితీరును.

7. బుద్ధి భేదప్రమాదము

బోధన యంతయు నిదియే యగుచో, అనుమతిని పూర్తిగా నుపసంహరించి తదుపసంహరణమూలమున త్రిగుణముల సామ్యావస్థలోనికి ప్రకృతి పడిపోవ ననుమతించి, లేక నిర్బంధించి, సర్వకర్మవిరతుల మగుట యొక్కటే విమోచనోపాయ మగును. కాని ఇది రోగముతోబాటు రోగిని గూడ చంపివేయు నుపాయము; దీనిని గీత సదా నిరుత్సాహపరుచును. ఈ కర్మవిరామ ఆదర్శమును అజ్ఞులపై విధింతు మేని, వారేమి చేయుదురు? కేవలము తామసిక ఆకర్మ నాశ్రయింతురు; వారి బుద్ధియందు మిథ్యాభేదము, మిథ్యావిరోధము నేర్పడును - "బుద్ధిభేదం" (3-26). వారి క్రియాశక్తియు, ధీశక్తియు ఒకదానితో నొకటి పోరాడుచు, వృథాగా కల్లోలమును, సంకరములను గలిగించును - ఇదియే మిథ్యాచారము (3-6); అథవా తామసికజడతను, కర్మనివృత్తిని, జీవనకర్మలపట్ల సంకల్పశక్తిక్షయమును బుట్టించును; కనుక ఇది విముక్తికాకపోగా, అజ్ఞానజడతల తత్త్వమగు అధమాధమ తమోగుణమునకు ఆధీనతయే యగును. మఱియొక ప్రమాద మేమన, వారీ ఉన్నతబోధ నేమాత్రము అర్థముచేసికొనలేరు, పైగా అది తప్పని తలంచి, తమ

ప్రస్తుత మానసికానుభవమునే, స్వతంత్రేచ్ఛ గలదను మిథ్యాభావమునే వక్కాణింతురు; తమ తర్కాభాసమునందు మఱింత దృఢపడి, అజ్ఞానమునందు మఱింత కూరుకొని, విమోచనావకాశమునే కోల్పోదురు.

8. అహంకారమునకు బాధ్యత తప్పదు

నిజానికీ ఉన్నతసత్యములు సత్తాచేతనల ఉన్నత, విశాలభూమికలయందే ఉపకరించగలవు; ఏలన అచ్చటమాత్రమే అవి అనుభవసత్యములు, కావున జీవన యోగ్యములు ఈ సత్యములను క్రిందినుంచి చూచుట తప్పుగా చూచుట, తప్పుగా గ్రహించుట, బహుశః తప్పుగా ప్రయోగించుటయే యగును. పశువునకు, భగవంతునకు మధ్యమదశ ఆహంకారిక మానవజీవనము; ఇట్టి జీవనమున పుణ్యాపాప వివేచన ఒక వ్యావహారిక తథ్యమును, ప్రామాణికధర్మము నగును. కాని భాగవత భూమిక యందు భగవంతునికివలెనే, మనమును పుణ్యాపాపముల పై కెగయుదుము; ఇది ఉచ్చతరసత్యము. ఇది ఆహంకారికభూమికయందు వ్యవహారమున ప్రామాణికము గాకపోయినను, అపక్వమానసము దీనిని సాకు చేసికొని, తన ఆసురప్రవృత్తుల కవకాశమిచ్చును; అట్లు భోగలాలసుడై వినాశపంకమున మఱింత కూరుకొనిపోవును – "సర్వజ్ఞాన విమూఢాన్ స్తాన్ అచేతసః" (3–32). ఈ మాట ప్రకృతినిర్ణాయకతకును వర్తించును; ఈ సత్యమును తప్పుగా దర్శించి, తప్పుగా నుపయోగించుట జరుగును. ఉదాహరణకు, మానవుడు తన స్వభావనిర్మితుడే గాన, స్వభావము బలాత్కారముగా చేయించునదే తప్ప, అతడు మఱేమియు చేయజాలడని కొందరు వాదింతురు. ఇది ఒక అర్థమున సత్యమే గాని, వారు దాని కిచ్చు అర్థమున గాదు, అనగా నా కర్మలకు నేను బాధ్యుడను, దండనీయుడను గాను – అని అహంకారాత్మ వాదించు అర్థమున గాదు. ఏలన అహమాత్మకు కామము గలదు, సంకల్పము గలదు; ఇవి దాని స్వభావమే యైనను, వీని ననుసరించి అది కర్మచేసినంత కాలము, ఆ కర్మఫలముల ననుభవించక తప్పదు. ఈ తప్పకపోవుట తన ప్రస్తుతానుభవమునకును, పరిమితాత్మజ్ఞానమునకును భయంకరాన్యాయముగా దోచవచ్చును, కాని అది స్వయంకృతమే నని తాను మఱువరాదు – ఈ బంధనజాలము తాను అల్లుకొన్నదే!

9. పాపకృత్యము స్వధర్మము గాజాలదు

నిజమే, గీతయు ఇట్లు వచించును; "సర్వభూతములు తమ ప్రకృతినే అనుసరించును, కాగా నిగ్రహమువలన నేమి ప్రయోజనము?"(3–33). ఈ

వాక్యము నొక్కదానినే తీసికొన్నచో, ఆత్మపై ప్రకృతియొక్క పరిపూర్ణాధిపత్యము గీత ప్రతిపాదించుచున్నట్లు తోచును; "జ్ఞానవంతుడు సైతము తన ప్రకృతిని బట్టియే వ్యవహరించును" (3-33). ఈ సత్యముపైననే గీత, నీ కర్మయందు నీ ప్రకృతి ధర్మమునే నిష్టతో ననుసరించు, మను తన ఆదేశమును ప్రతిష్ఠించును. "బాగుగా నాచరింపబడిన పరధర్మముకంటెను గుణములేని దైనను స్వధర్మమే శ్రేష్ఠము; స్వధర్మమునందు చనిపోయినను మేలే, పరధర్మము విపత్కరము" (3-35). ఇచ్చటి 'స్వధర్మ' మన సరిగా నేమియో, పురుషప్రకృతులను విపులముగా చర్చించు చివరి అధ్యాయములలో గాని మనకు దెలియదు. కాని నిశ్చయముగా స్వధర్మమున కర్థము, ప్రకృతియనబడుదానివలన గలుగు పాపప్రేరణ నైనను మన మనుష్ఠించవలయు, సనిమాత్రము గాదు. ఏలన పై (3-33). (3-35) శ్లోకాలకు మధ్య మనకీగీతాదేశము లభించును - "ఇంద్రియమునకు తన విషయమునందు రాగ ద్వేషములు పొంచి యుండును, వానికి వశుడవు గాకుము, అవియే ఆత్మమార్గమున నిన్ను దోచుకొను దొంగలు"(3-34). ఇంకను దానికి పిమ్మటనే అర్జునుడిట్లు ప్రశ్నించును - స్వభావము ననుసరించుటలో దోషము లేనిచో, మనలో నేదియో బలాత్కరించి పాపము చేయించునే: దాని మా టేమిటి? అట్లు చేయించునది కామము, దాని సఖుడు క్రోధము నని గురువు సమాధానమిచ్చును (3-37); ఈ కామక్రోధములు రాగాత్మక మగు (14-7) రజోగుణసంతానము. ఆత్మకు మహాశత్రువైన ఈ కామమును రూపుమాపవలయును (3-41). పాపాచరణమునుండి నివృత్తి విముక్తికి ప్రథమ నియమమని గీత ఘోషించును, ఆత్మప్రభుతను, ఆత్మసంయమమును (4-27), మన ఇంద్రియశరీరనియంత్రణను సదా విధించును.

10. శాశ్వతప్రకృతి × ఆగంతుకప్రకృతి

ప్రకృతియందలి శాశ్వతాంశము వేఱు, ఆగంతుకాంశము వేఱు - అని దీని అర్థము. శాశ్వతాంశము ప్రకృతియందలి సారాంశము, సహజ అనివార్యక్రియ; దీనిని నిగ్రహింపజూచుట వ్యర్థము. పోగా ఆగంతుకాంశము ప్రకృతియందలి విభ్రమములు, విక్షోభములు, వికారములు; వీనిపై నిశ్చయముగా మన మదుపును సాధించవలయును. మఱియు నిగ్రహ సంయమముల మధ్య గూడ గీత గర్భితముగా భేదమును పాటించును: నిగ్రహ మన బలాత్కారము, దమనము; సంయమ మన ఉచితముగా నుపయోగించుచు, మార్గము చూపుచు సాధించునియమనము (=

సం+యమము). నిగ్రహమువలన పురుషుని ప్రకృతిశక్తులు అడుగంటును - "ఆత్మానం అవసాదయేత్" (6-5). సంయమము నిమ్నాత్మపై ఉన్నతాత్మ యొక్క సంయమము గాన, అది ఆ శక్తులకు ఉచితక్రియను, గరిష్ఠసామర్థ్యము నొసంగును - "యోగః కర్మసు కౌశలం" (2-50). ఈ సంయమస్వరూపములను ఆఱవ అధ్యాయారంభమున గీత స్పష్టము చేయును - "నీ వాత్మచేత నాత్మ నుద్ధరించవలెను, (భోగమూలమున గాని, నిగ్రహకారణమున గాని) ఆత్మకు పతనము గల్గించరాదు; ఏలన ఆత్మయే ఆత్మకు మిత్రము, ఆత్మయే ఆత్మకు శత్రువు (6-5). ఎవనియందు నిమ్నాత్మ ఉన్నతాత్మచేత జయింపబడునో, అతనికి నిమ్నాత్మ బంధువు; కాని ఉన్నతాత్మయందు ప్రతిష్ఠితుడు గానివానికి నిమ్నాత్మ శత్రువువలె అహితము గావించును" (6-6). ఆత్మను జయించి, పరిపూర్ణాత్మవశిత్వముయొక్క శాంతిని, ఉన్నతాత్మ ప్రతిష్ఠను బొందినపుడు, మానవునియందలి పరమాత్మ బహిర్ముఖమానవ సత్తయందు సైతము స్థిరప్రతిష్ఠుడు, అనగా 'సమాహితు'డగును (6-7). శబ్దాంతరమున నిమ్నాత్మను ఉన్నతాత్మచేత , ప్రాకృతాత్మను అధ్యాత్మికాత్మచేత వశము గావించుకొనుట మానవుని విముక్తికి, సంసిద్ధికిమార్గమగును.

11. అవశిత్వము నుండి వశిత్వమునకు సోపానములు

ఇట్లు, ప్రకృతి నిర్ణాయకత్వము సాపేక్ష మనియు, దాని అర్థమునకు, వ్యాప్తికి కచ్చితమైన అవధులు గల వనియు తెలియును. అధీనతనుండి ప్రభుతకుగల మార్గము, క్రిందినుంచి పైకి ప్రకృతిశ్రేణియందలి గుణవ్యాపారమును పరిశీలించినచో స్పష్టమగును. అట్టడుగున తమోగుణము రాజ్యమేలు భూతములు గన్పించును; వీనియందు నే-నను ప్రత్యయమే లేదు, ప్రకృతియే వీనిని నడుపును. పరమాణవు నందును ఇచ్ఛ గలదు, కాని అది జడము గాన స్వతంత్రేచ్ఛ గాదు. పరమాణు వశములో ఇచ్ఛయుండదు, కాని ఇచ్ఛావశములోనే పరమాణు వుండును. ఇచ్ఛట సాంఖ్యము చెప్పునట్లు బుద్ధి జడము; దీనియందు చేతనాత్మప్రకాశ మింకను ప్రయాసపూర్వకముగా పైకి రాలేదు, అనగా పరమాణువింకను తన సంకల్పమును గుర్తించలేదు. ఏలన తమోగుణ మిచ్చట రజోగుణమును బంధించి, సత్త్వగుణము నావరించి యుండును, తన ప్రభుతయందు చెలరేగుచుండును. "యంత్రారూఢం మాయయా" (18-61) - ప్రకృతి ఈ తమోరూపముచేత, జడయంత్రము చేతవలె ప్రచండకర్మ చేయించును. తర్వాతి సోపానమగు వృక్షమునందు, తన జీవనశక్తితోను,

నాడుల ప్రతిక్రియాసామర్థ్యముతోను రజోగుణము ప్రయాసపడి పైకి వచ్చును; ఈ ప్రతిక్రియలు మనయందు సుఖదుఃఖములుగా గుర్తించబడును. కాని వృక్షమునందు సైతము సత్త్వగుణము సంవృత్తమై యుండునే గాని, పైకి వచ్చి సచేతససంకల్ప ప్రకాశమును మేల్పొల్పదు; ఇంకను సర్వము యాంత్రికము, అవచేతనము లేక నిశ్చేతనముగనే యుండును. ఇంకను తమస్సుదే పైచేయి, ఇంకను రజస్తమస్సులు సత్త్వగుణమును బంధించియుంచును.

12. పశువును తన చర్యలకు బాధ్యము గాదు

పశువునందింకను తమస్సుబలముగా నున్నప్పటికి దాని నింకను తామస సర్గమే నని మనము చెప్పగలిగినప్పటికి రజస్సు వృక్షమునందు కంటె నెంతో ఎక్కువ తమస్సుపై ప్రాబల్యము వహించి, తనతోబాటు వికసించిన ప్రాణశక్తిని, కామశక్తిని, భావావేగముల శక్తిని, సుఖదుఃఖముల శక్తిని గొనివచ్చును; కాగా సత్త్వమిచ్చట ప్రకటముకా సాగినను, ఇంకను రజస్తమస్సుల క్రియనే ఆశ్రయించియుండి, వానికి నచేతనమనస్సుయొక్కయు, యాంత్రిక అహంభావము యొక్క మఱియు ఈ ప్రకాశమువలన పశువునందు విశేషించి సహజప్రేరణ మఱియు సహజస్ఫూర్తియొక్క అద్భుతములు సంభవించును. కాని బుద్ధియింకను చేతన యొక్క పూర్ణప్రకాశము వికసింపజేసికొనలేదు, కావున పశువుపై తన క్రియలకు బాధ్యత నాపాదించలేము. తన అంధచలనములకు పరమాణువును దహించినందుకు అగ్నిని, నాశము చేసినందుకు తుఫానును ఎట్లు నిందించమో, అటులే చంపినందుకు పులిని నిందించజాలము. పులి మన ప్రశ్నకు జవాబివ్వజాలినచో, నాకు స్వేచ్ఛగలదని అది మనుష్యునివలెనే చెప్పును; కర్తృత్వాహంకారము నుంచుకొనగోరుచు, “నేను చంపుచున్నాను, నేను తినుచున్నాను” అని పలుకును; కాని పులి గాక, పులియందలి ప్రకృతియే తినుచున్నదనియు మనము కడు స్పష్టముగా చూడగలము; ఒకవేళ పులి చంపుటనుండి విరమించినచో, పొట్ట నిండుటచేతనో, భయముచేతనో, అలసత చేతనో మాత్రమే అట్లు చేసియుండును; ఇక నిది పులియందలి మఱియొకటియగు తమోగుణచర్యయే గాని, తన స్వేచ్ఛాచర్య గాదు. చంపునదియు పులియందలి ప్రకృతియే, చంపకుండు నదియు పులియందలి ప్రకృతియే. ఇక నా పులిలోనున్న అత్మను జూడ, అది ప్రకృతిక్రియను అవునుకా దనకుండ అనుమతించును, ప్రకృతి-అకర్మనువలె ప్రకృతికర్మను గూడ అది నిష్క్రియముగానే అనుమతించును.

పరమాణువువలె పశువును తన యాంత్రికప్రకృతి ననుసరించియే, యంత్రారూఢమై యున్నట్లు వ్యవహరించును (3-33. 18-61).

13. మానవునియందలి సత్త్వాధిక్య ఫలితము

మంచిది, కనీసము మానవునియందు విముక్తాత్మ, స్వతంత్రసంకల్పము, బాధ్యతాబోధము, ప్రకృతికంటె భిన్నమగు వాస్తవకర్త ఉన్నాడు గదా? అటులే అనిపించును; ఏలన మానవునియందు సచేతనబుద్ధి గలదు, సాక్షిపురుషుని ప్రకాశము చేత బుద్ధి పూర్ణమై యుండును; పురుషుడిట్టి బుద్ధిద్వారా ప్రకృతిక్రియను నిరీక్షించుచు, గ్రహించుచు, దాని కనుమతి నిచ్చును లేక ఉపసంహరించును; ఇట్లు తుదకు ప్రకృతి ప్రభువగుట కారంభించినట్లు తోచును. మానవుడు వ్యాఘ్రము, అగ్ని లేక తుఫానువంటివాడు గాడు; ఒకనిని చంపి, 'నాదేమున్నది? నా ప్రకృతి ననుసరించి చేసితి' నని మానవుడు తన చర్యను సమర్థించుకొనజాలడు. కారణము అతని ప్రకృతి గాని, దానినుంచి ఏర్పడు స్వధర్మము గాని, వ్యాఘ్రప్రకృతి, వ్యాఘ్రస్వధర్మము గాదు. అతనికి సచేతనబుద్ధి గలదు గాన, దాని కతడు తన కర్మలనన్నింటిని నివేదించవలయును. అట్లు చేయక నతడు గ్రుడ్డిగా తన నిమ్నప్రవృత్తులను, ఆవేగములను అనుసరించియే వర్తించు నేని, అతని స్వధర్మము బాగుగా అనుష్ఠితము గాదు - "స్వనుష్ఠితః", అతడు తనకు ప్రాప్తించిన మేరకు తన మానవత్వము ననుసరించి కాక, పశువువలెనే వ్యవహరించిన వాడగును. అవును, రజస్తమస్సులు బుద్ధిని మొట్టి, తమ కర్మను లేక అకర్మను సమర్థింప దానిని నిర్బంధించు ననుమాట నిజమే; అయినను అట్టి సమర్థన నైనను అతడు పొందవలయును; లేక తన కృత్యమును, చేయుటకు పూర్వమో, తర్వాతో కనీసము బుద్ధికి నివేదించవలయును. మఱియు, మానవునియందు కనువిప్పిన సత్త్వగుణము తెలివి మఱియు సంకల్పరూపముననే కాక, ప్రకాశము, సత్యజ్ఞానము, ఆ జ్ఞానము ననుసరించు కర్మలకొఱకును సలుపు అన్వేషణగా గూడ పనిసేయును; అటులే ఇతరుల జీవనము మఱియు అధికారములను సానుభూతితో దర్శించుటకు అది ప్రయత్నించును; ఇంకను అది తనవలన మానవునియందు సంభవమైన ఉచ్చతర స్వధర్మమును తెలిసికొనుటకును యత్నించును; చివరకు, సదాచారము, జ్ఞానము, సానుభూతుల వలన గలుగు అధికతర శాంతిసుఖముల భావనగా గూడ నది పనిసేయును. సత్త్వగుణ విశిష్టుడైన మానవుడు, తన తామసిక, రాజసిక ప్రకృతిని తన సాత్త్విక

ప్రకృతిచే పాలించవలయు ననియు, తన సాధారణమానవత్వ సంసిద్ధికి మార్గమదియే ననియు గ్రహించును.

14. మానవుని ఇచ్ఛ స్వతంత్రమా ?

కాని సత్త్వగుణప్రాధాన్యమునందు విముక్తి ఉదయించునా, మానవుని యందలి ఇచ్ఛ స్వతంత్రమా? దేనియందు మాత్రమే యథార్థవిముక్తి గలదో, అట్టి ఉచ్చతర చేతనాదృష్టితో గీత స్వతంత్రము కాదనును. ఎంత సాత్త్వికమైనను, మానవుని బుద్ధి సైతము ప్రకృత్యుపకరణమే గాన, మానవసోపానమునందును ప్రకృతియే కర్మచేయుచు, ఆత్మను మాయాయంత్రముపై త్రిప్పును. ఎట్లు చూచినను, మన ఇచ్ఛాస్వతంత్రతలో కనీసము పదింట తొమ్మిదివంతులు కల్పనయే. ఎప్పటి కప్పుడీ ఇచ్ఛ తన స్వయంసిద్ధక్రియనుండియే పుట్టి, దాని చేతనే నిర్ణయింపబడును; దానికి కారణము మన గతము, మన వంశపారంపర్యము, మన శిక్షణ, మన పరిసరము, మనము కర్మయని చెప్పు సమస్తదారుణ సంకీర్ణ వస్తువు. ఈ కర్మ స్వరూపము? మన పైనను, మనలో కేంద్రీకరించుకొను ప్రపంచముపైనను ప్రకృతి గతములో చేసిన క్రియయే ఈ'కర్మ'. ఈ కర్మయే ఎప్పటికప్పుడు మన స్వరూపమును, ఇచ్ఛను, చివరకు కర్మనుగూడ నిర్ణయించిపెట్టును. ఇట్లుండ, అహంకారము సదా తన కర్మతో గూడుకొని "నేను చేసితిని", "సంకల్పము నాది", "దుఃఖము నాది" యని చెప్పుకొనును. కాని నేను–వాచ్యమగు ఈ అహంకారము తనలోనికి చూచి, తన నిర్మాణమును గమనించు నేని, పశువు విషయములోను "నాయందు ప్రకృతి దీనిని చేసెను, నాయందు ఇచ్ఛించునది ప్రకృతి" అని చెప్పక తప్పదు; ఇక దీనికి 'నా' ప్రకృతి యని అహంకారము 'నా'ను చేర్చుచో, ఈ నేను–స్వరూపమును గట్టిగా దర్శించిన బౌద్ధుల కిట్లు చెప్పవలసివచ్చెను; అంతయు కర్మయే, జీవనమునందు ఆత్మ యనునది లేనేలేదు, ఆత్మభావము అహంబుద్ధియొక్క ఒక భ్రాంతిమాత్రము, దుష్కర్మను గాదని, ప్రకృతి సత్కర్మ నెన్నుకొని, సత్త్వగుణముచేత దానిని చేయించును. కాగా సత్త్వతరంగముతో తాదాత్మ్యము చెందిన అహంకారము "నే నీ కర్మను ఎన్నుకొని చేయుచున్నాను" అని పాపము తలపోయును – ఉదాహరణకు తిరుగుచున్న చక్రముపై వాలిన ఈగ ఆ తిరుగుటను తానే ఎన్నుకొన్నట్లు తలంచును. సాంఖ్యులు చెప్పున దేమన, నిష్క్రియ సాక్షి పురుషుని వినోదము నిమిత్తము ప్రకృతి మనయందు స్వయంఘటితమై, తానే యిచ్ఛించును.

15. మన స్వతంత్రత కడు స్వల్పము

కాని పై ఆత్యంతిక (extreme) వచనమును సవరించవలసి వచ్చినను, మన వైయక్తికసంకల్పమునకు గల స్వతంత్రత అణువుకంటె నల్పమని చెప్పక తప్పదు; ఏలన అంతగా నది ఇచ్ఛను నిర్ణయించు ఇతర తత్త్వములతో కలిసిపోయి ఉండును. దాని ప్రబలతమశక్తియు ప్రభుతకు సరిపోదు. ఘటనాధికముల తీవ్రవేగము నా శక్తి ప్రతిఘటించగలదని నమ్మియుండజాలము, తఱచుగా నవియే దానిని త్రొక్కివేయును, లేక మార్చివేయును, లేక దానితో కలిసిపోవును, లేక ఉత్తమపక్షమున దానిని వంచించును. ఇట్లు రజస్తమోగుణములు దానితో కలిసిపోవును గాన, అత్యంతసాత్త్వికసంకల్పమునందు సైతము సాత్త్వికత ఆంశికము గానే యుండును; కావున తెలియకయే సాత్త్వికసంకల్పమునందు ఆత్మవంచన తలయెత్తును; మనోవైజ్ఞానికుని నిర్దాక్షిణ్య నేత్రము మాత్రమే ఈ ఆత్మవంచనను పసికట్టి పట్టుకొనగలదు. సర్వతంత్రస్వతంత్రముగా చేయుచున్నామని మనము తలంచునపుడు సైతము, మన కర్మవెనుక, అత్యంతసావధానమగు మన అంతరవలోకనమునకును అందని శక్తులు దాగియుండును. అహంవిముక్తుడనని తలపోయు సాధువునందును పాపునియందువలె, అహంకార ముండనే యుండును. మన జ్ఞాననేత్రము నిజముగా వికసించి, మన కర్మయొక్క స్రోతోమూలమును గాంచ గలిగి నపుడు గీతతోబాటు మనకును ఇట్లు చెప్పవలసివచ్చును; "ప్రకృతి గుణములే ఒండొరులయందు వర్తించును" (3-28).

16. ఏకాత్మయందే అశేషవిముక్తి

ఈ కారణముచేత సత్త్వగుణముయొక్క సమధికప్రాబల్యము సైతము విముక్తిని సమకూర్చదు. ఏలన ఇతరగుణములంతగాను సత్త్వము బంధించునని గీత నిర్దేశించును (14-5). మఱియు నితరగుణములవలెనే కామముచేతను, అహంకారము చేతను అది బంధించును - ఉదాత్తకామముచేతను, విశుద్ధాహంకారము చేతను. కాని ఏ రూపమునందైనను ఇవి ప్రాణిని పట్టియున్నంతవఱకు, విముక్తియుండదు. శీలవంతునికి నేను శీలవంతుడ నను అహంకారము, జ్ఞానికి నేను జ్ఞాని నను అహంకారము నుండును; అత డా సాత్త్వికాహంకారమునే తృప్తిపఱుప జూచును; తనకొఱకే శీలమును, జ్ఞానమును వెదకును. మనయందలి పరిచ్ఛిన్న నేను-రూపముననుండు అహంకారములను తృప్తిపఱచుటయు; అహంకారమునుండి

ఆలోచించి, సంకల్పించుటయు మానుకొన్నపుడే వాస్తవవిముక్తి పొడమును, వేఱు శబ్దాలలో, ప్రాకృతాత్మపై నుండు పరమాత్మను దర్శించి, ధరించినపుడే, విముక్తియు, పరమ ఆత్మ ‿శిత్వమును ప్రారంభమగును. పోగా పరమాత్మను దర్శించగలుగుటకు, మన లోపలనే ప్రకృతికి పైన ఆసీనమైయున్న ఏకాత్మను దర్శించవలయును, మన వైయక్తికభావమును సత్తాచేతనలయందు దానితో నేకము చేయవలయును, మన వైయక్తిక క్రియాశక్తిని పరమసంకల్పమునకు ఉపకరణము గావించవలయును - ఈ ఈశ్వరసంకల్పమే నిజముగా స్వతంత్రమైన ఏకమాత్ర సంకల్పము పోగా ఏకాత్మను దర్శించగలుగుటకు క్రమముగా గుణములపై కెగసి గుణాతీతులము (14-19) గావలయును; ఏలన ఈ ఏకాత్మ సాత్త్వికగుణమునకు గూడ పై నుండును. సత్త్వముద్వారానే దాని కారోహించవలసియున్నప్పటికి, సత్త్వమును దాటినప్పుడే దాని నందుకొనగలము; అహంకారము దగ్గర ప్రయాణము నారంభించి నప్పటికి, అహంకారమును విడిచినపుడే, దానిని చేరగలము. కాలములలో అత్యున్నతము, అతిప్రగాఢము, అతిప్రబలము మఱియు ఆనంద పూర్ణమునైన కామముచేత దాని మార్గమున కాకర్షింపబడుదుము; కాని సకల కామము రాలిపోయినపుడే, ఆ ఏకాత్మయందు పదిలముగా నివసించగలము. ఒక దశయందు మోక్షకామమునుండి సైతము ముక్తులము గావలయును.

22. గుణములకు పైన

1. అహంకారమునకుముక్తి అసంభవము

ఇట్లు ప్రకృతినిర్ణాయకత సాత్త్వికాహంకారమువఱకును వ్యాపించును. ఏ అహంకారమూలమునుండి కర్మ చేయుచున్నామో, అది ప్రకృతిక్రియకు స్వయముగా నొక ఉపకరణమే గావున, ప్రకృతివశమునుండి ముక్తము గాజాలదు; అహంకారేచ్ఛ ప్రకృతినిర్ణీతమగు యిచ్ఛయే, ప్రకృతిక్రియలో నొక భాగమే – తన పూర్వకర్మచేతను, తన స్వీయపరివర్తనముచేతను మాఱుచుండు ప్రకృతిక్రియలో నొక భాగమే; ఇట్లు రూపుదాల్చు ఇచ్ఛచేత మన ప్రస్తుత కర్మయు నిర్ణీతమగును. క్రియానుబంధము ఎంతగా ప్రకృతినిర్ణీత మైనను, క్రియాప్రారంభము మన చేతిలోనే యుండు ననియు, కావున ఆ క్రియాశక్తికిని, క్రియాఫలితమునకును బాధ్యత మనదే యని కొందరందురు. కాని అసలు క్రియకు ప్రారంభ మెచ్చటుండును? ఒకప్పటి క్రియను దాని పూర్వక్రియ నిర్ణయించును గదా; అటులే మన ప్రస్తుత ప్రకృతిరూపము రాశియందును, వివరములందును మన పూర్వప్రకృతిక్రియాఫలితమే గదా. స్వతంత్రమగు ప్రారంభకర్మ గలదను ఆపోహకు గారణము, మనము వర్తమానము నుంచి భవిష్యత్తులోనికి బోయి నివసింతుముగాని, గతములోనికి బోయి నివసింపము. కావున మన వర్తమానము మన గత పరిణామమేనను స్పష్టగ్రహణము మన కుండదు; గతము మృతము, దానితో నేమి పని? – యని మన అభిప్రాయము. ప్రతిక్షణము విశుద్ధము, పూర్వాస్పృష్టము; కావున పరిపూర్ణమగు అంతరస్వాతంత్ర్యము ననుసరించి, ఇచ్ఛ వచ్చినట్లు మనలను మనము తీర్చిదిద్దుకొనగలమను రీతిని భాషింతుము. కాని అట్టి సంపూర్ణస్వేచ్ఛయు లేదు, సంవరణస్వాతంత్ర్యమును లేదు.

2. భ్రాంతివలన గూడ ఉపయోగము !

నిశ్చయముగా, మనయందలి ఇచ్ఛ కొన్ని సంభవతల మధ్యనుంచి ఒకదాని నెన్నుకొవలసియుండును; ఏలన ప్రకృతి మనయందు పనిచేయు విధానమే అది. మనము దేనిని ఇచ్ఛించకుండుటయు మనయందలి ప్రకృతి చేయు ఒక ఎన్నికయే, ప్రకృతీచ్ఛయొక్క ఒక కృత్యమే; అణువునందు గూడ ప్రకృతీచ్ఛ సదా పనిచేయు చుండును. కాగా మనకు, అణువునకు గల భేద మంతయు ప్రకృతీచ్ఛతో మన అహంభావము నెక్కువగా జోడించుటయే, అట్లు జోడించి, ప్రకృతీచ్ఛ మన యిచ్ఛ యనుకొని, అది మన స్వతంత్రేచ్ఛ యనియు, చేయుచున్నది మనమే ననియు

భ్రమింతుము. అది భ్రమో, కాదో గాని, నిష్ఫలము, నిరుపయుక్తము మాత్రము కాదు; ప్రకృతియందు ప్రతిఘటనకు ఒక ఫలము, ఒక ఉపయోగము నుండును. మన సచేతన సత్తయొక్క ఈ భ్రమప్రక్రియద్వారా ప్రకృతి తనయందలి నిగూఢ పురుషుని జ్ఞాన మధికాధికముగా బొందును, అధికతరజ్ఞానముచేత సంభవమగు అధికతరక్రియకు తెఱచుకొనును. మన అహంభావముయొక్క ఆలంబనముతో ప్రకృతి తన ఉచ్ఛతరసంభవతల నందుకొనును; ఎట్లన తన తామసికభావముయొక్క కేవల లేక అధికాంశనిశ్చేష్టతనుండి తన రాజసికభావముయొక్క ఆవేగసంఘర్షములలోని కెగయును; పిమ్మట ఈ ఆవేగసంఘర్షములనుండి బైటబడి, తన సాత్త్వికభావము యొక్క అధికతర ప్రకాశము, సుఖము, శుద్ధతల నందు కొనును. నిమ్నతరగుణముపై ప్రాబల్యము సాధించుటకు దానిపై ఉచ్ఛతరగుణము సలుపు పోరాటముతో మన అహంభావము తాదాత్మ్యము జెందినపుడు, ప్రకృతి కాప్రాబల్యమును సాధించుట సుకరమగును. స్వాధీనేచ్ఛాభావము భ్రమయైనను, కాకపోయినను, ప్రకృతిక్రియా యంత్రాంగమున కది ఆవశ్యకము, పురోగతిపథమున మానవుని కావశ్యకము; కాన ఉచ్ఛతరసత్యమునకు సిద్ధముగాక పూర్వమే అహంభావమును పోగొట్టుకొనుట భ్రమకు లోనుగావించును, మఱియు అతనికి గల్పించిన నాకు స్వతంత్రేచ్ఛ గలదను భావము సమస్తభ్రమలను మించిన భ్రమ యని కొందరు చెప్పియున్నచో, దానికి సమాధాన మిది; ఆ భ్రమ మానవునికి మంచిదే; అది లేనిచో, అతడు తన పూర్ణసంభవతల శిఖరమున కెగయ జాలడు.

3. కేవలభ్రమ గాదు, దృక్కోణ భ్రమ మాత్రము

కాని అది కేవలభ్రమ గాదు, దృక్కోణదోషమును స్థాన (placement) దోషమును మాత్రమే; అనగా తానే వాస్తవాత్మ యని అహంకారము దలంచును, మఱియు తానే యథార్థ క్రియాకేంద్రమై నట్లును, తనకొఱకే అంతయు మనుచున్నట్లును వర్తించును. మనలోపల, అనగా మన ప్రకృతిక్రియలోపల ఒకడున్నా డనియు, అతడు ప్రకృతిక్రియకు యథార్థకేంద్ర మనియు, అతనికొఱకే అంతయు మనుచున్న దనుకొనుటలో అహంకారము చేయు తప్పు లేదు. అయితే ఈ లోపల నున్నవాడు తాను (అహంకారము) కాదు, మన హృదయాలలో నిగూఢముగా నున్న ఈశ్వరుడు (18-61), మఱియు అతని సత్తయొక్క అంశమగు జీవుడు (15-7). మన అహంభావము, మన మనస్సులందు మనలోని వాస్తవాత్మయొక్క ఒక భగ్న,

వికృతచ్ఛాయ మాత్రమే - ఈ వాస్తవాత్మయే అన్నింటికి ప్రభువు, దానికొఱకే, దాని ఆదేశముచేతనే ప్రకృతి కార్యపరమై యుండును. అటులే నాకు స్వతంత్రేచ్ఛ గలదను అహంకారభావమును మనలోపలి స్వతంత్రాత్మయొక్క వికృత, స్థానచ్యుతబోధమే; ప్రకృతియందలి ఇచ్ఛ ఈ ఆత్మేచ్ఛయొక్క ఒక పరివర్తిత, ఆంశిక ప్రతిబింబమే - పరివర్తితము, ఆంశికము నేలన, అది కాలముయొక్క క్షణపరంపరలో నివసించును, మఱియు ప్రకృతియొక్క సంతత పరివర్తనాపరంపరచేత పనిసేయును; ఇక నీ పరివర్తనలు తమ పరంపరలోని పూర్వపరివర్తనల చాలవఱకు మఱచిపోవును. తమ అనంతరపరివర్తనలను, లక్ష్యములను మసకగా మాత్రమే గుర్తించును. కాని కాలక్షణముల కతీతమైన లోపలి ఆత్మేచ్ఛ వీని నన్నింటిని ఎఱుంగును. కాగా మనయందలి ప్రకృతిక్రియ ఈ ఆత్మేచ్ఛను సాధించుటకు చేయు ఒక ప్రయత్న మని చెప్పవచ్చును - దేనిని ఆత్మేచ్ఛాజ్ఞానములు పూర్ణ అతిమానసప్రకాశమున పూర్వమే దర్శించునో, దానిని అహంకారికాజ్ఞానముయొక్క కఠోరపరిస్థితులను ప్రకృతి సాధించవలెను.

4. అహంకారము పోయినను కర్మ ఆగిపోదు

కాని మన పురోగతిలో నొక సమయము వచ్చితీరును, అపుడు కనువిప్పు గలిగి, మన సత్తయొక్క వాస్తవసత్యమును గుర్తించగా, స్వతంత్రమగు అహంకారేచ్ఛకు సంబంధించిన భ్రమ పడిపోవును. కాని దీని కర్థము కర్మవిరమణము కాదు. ఏలన కర్మచేయునది ప్రకృతి; తన పరిణామక్రమమున అహంకారము ఆవిర్భవించక పూర్వము చేసినట్లే, అంతరించిన పిమ్మట సైతము ఆమె తన కార్యమును నిర్వర్తించును. అహంకారమునకు స్వస్తిచెప్పిన మానవునియందు ఆమె అధికతర కర్మను సైతము పెంపొందించుకొనవచ్చును. ఏలన అతని మనస్సు అతని ప్రకృతియొక్క గతకర్మఫలితమగు ప్రస్తుతపరిస్థితి నెక్కువగా నెఱుంగగలదు; అటులే తన ప్రకృతివికాసమునకు అనుకూలముగానో, ప్రతికూలముగానో పనిసేయు పరిసరశక్తుల నెక్కువగా నెఱుంగగలదు; ఇంకను, అతని ప్రకృతియం దింకను నిద్రాణమై యున్న అధికతరసంభవతల నది ఎక్కువగా నెఱుంగగలదు. మఱియు అతని ఈ అహంవిముక్తమానసము తాను దర్శించిన అధికతరసంభవతల సాధనకు అవసరమగు పురుషుని అనుమతిని జేరవేయుట విముక్తతరవాహినిగాను, ప్రకృతి కర్మకు విముక్తతర ఉపకరణము గాను ఉండగలదు. కాని స్వతంత్రేచ్ఛానిరాకరణము

మనయందలి వాస్తవాత్మదర్శనమును గలిగించకుండ, విధి, లేక ప్రకృతియే సర్వము నిర్ణయించు నను ఆలోచనయందు పర్యవసించరాదు. ఏలన అపు డింకను అహంకారమే ఆత్మయను భావము నిలిచియుండును, మఱియు అహంకార మెపుడును ప్రకృత్యుపరణమే గాన, అహంకారరూపమున ప్రకృతిపనియే చేయు చుండును. కావున విధివాదము లేక ప్రకృతివాదము నవలంబించినను, అది బుద్ధి వైఖరియందే గాని, వాస్తవక్రియయం దెట్టి మార్పును గొనిరాదు. స్వతంత్రేచ్ఛా నిరాకరణమాత్రమున మన ప్రకృత్యధీనతను అంగీకరించిన వారమే యగుదుము గాని, అజము, గుణాతీతము నగు మనయందలి ఆత్మను కనుగొనినవారము గాము; మన విముక్తికవాట మెక్కడున్నదో దర్శించినవారము గాము, ప్రకృతియు, అహంకారమును మాత్రమే మన సర్వస్వము గాదు, మనలో విముక్తపురుషుడు గలడు.

5. సాంఖ్యపురుషుడు × గీతాపురుషుడు

కాని పురుషుని ఈ విముక్తిస్వరూప మేమిటి? ఇప్పటి సాంఖ్యదర్శనమును బట్టి పురుషుడు తన సత్తామూలమునందు ముక్తుడు, కాని అచ్చట అకర్త గావుననే ముక్తుడు; మఱియు పురుషుడే మేరకు తన స్వరూపముపై ప్రకృతి తన క్రియాచ్ఛాయ నాపాదింప ననుమతించునో, ఆ మేర కతడు తన బాహ్యసత్తయందు గుణముల క్రియాబద్ధుడు; మఱియు ప్రకృతితో అతడు తన సంబంధమును త్రెంచుకొనుటచేత ఆమె కర్మలు ఆగిపోయినపుడే, తన కర్మవిముక్తిని తిరిగి పొందగలడు. సాంఖ్య మిట్లుండ, గీత ననుసరించి, నేను నిష్క్రియ అకర్తను – "ఆత్మానం అకర్తారం" (13-30)–కర్మయనునది నాది గాదు, ప్రకృతిదే – యను దృష్టియందు ప్రతిష్ఠితుడగు నేని, అట్టి ఫలితమే ప్రాప్తించదా? సాంఖ్యపురుషుడు అనుమంత, కాని అది నిష్క్రియానుమతి మాత్రము, కర్మ పూర్తిగా ప్రకృతిదే; అతడు వస్తుతః సాక్షియు, భర్తయే గాని, విశ్వరూప భగవంతునియొక్క నియామక, సక్రియచైతన్యము గాడు, ప్రేక్షకుడు తాను చూచుచున్న నాటకము ననుమతించు నట్లు, అతడు చూచుచు, అనుమతించు పురుషుడే గాని, తనచేతనే రూపకల్పన చేయబడి, తన సత్తయందే ఆడబడుచున్న నాటకమును చూచుచు, మఱియు నడుపుచు నుండు పురుషుడు గాడు. అట్టి సాంఖ్యపురుషుని ప్రీతినిమిత్తమే, ప్రకృతితన ఆటాడును కావున, అతడనుమతి నిరాకరించినపుడు, ప్రకృతికర్మలాగిపోవును. కావున పురుషప్రకృతుల

సంబంధములను గుఱించిన గీతాభావన వేఱు, సాంఖ్యభావన వేఱు - అని స్పష్టమగును; ఒకదానియందు ముక్తిఫలము కర్మనివృత్తి కాగా, రెండవదానియందు అధికతర, నిస్స్వార్థ, నిష్కామ, దివ్యకర్మయగును. సాంఖ్యమునందు పురుషప్రకృతులు రెండు విభిన్నసత్తలు; గీతయందవి ఒకే స్వయంభూ సత్తయొక్క రెండు పార్శ్వములు లేక శక్తులు. ఇచ్చట పురుషుడనుమంతయే గాక, ప్రకృతిప్రభువును, ఈశ్వరుడును. ప్రకృతిద్వారా జగల్లీల ననుభవించును; ప్రకృతిద్వారా దివ్యసంకల్పమును, జ్ఞానమును నిర్వర్తించును; దీనికి వలయు జగత్ప్రణాలిక అతని అనుమతిచేత ధరింపబడును. అతను అంతఃసన్నిధిచేత అతని సత్తయందే ప్రవర్తించును, అతని సత్తాధర్మముచేతను, ఆ సత్తయందలి సచేతనసంకల్పముచేతను నియమితమగును. ఇట్టి పురుషుని దివ్యసత్తను, దివ్యప్రకృతిని తెలిసికొని, అనుసరించి, వానియందు నివసించుటయే అహంకారమునుండియు, దాని క్రియనుండియు ఉపసంహరించుకొనుటకు లక్ష్యము. అపుడు గుణముల నిమ్నప్రకృతినుండి ఉన్నత దివ్యప్రకృతికి సాధకు డారోహించును.

6. క్షరపురుషుడు క్షరమునందు పురుషుడు

త్రివిధపురుషుల గీతాభావనను బట్టి ఈ ఆరోహణక్రియ నిర్ణయించబడును; మఱియు ప్రకృతికి, పురుషునకు గల సంబంధమును బట్టి త్రివిధపురుషు లేర్పడుదురు. ప్రకృతిక్రియను, పరివర్తనలను, సంతతసంభవనతములను (becomings) చేతనీకరించు పురుషుడు క్షరపురుషుడు; ఇతడు ఆమె మార్పులతో మాఱుచున్నట్లును, ఆమె కదలికతో కదలుచున్నట్లును గన్పించును, అనగా ప్రకృతిగతమై, ప్రకృతిక్రియచేత మాఱుచుండు తన వ్యక్తిత్వమును భావమునందు అనుసరించు చుండు పురుషుడితడు. ఈ దశయందు ప్రకృతి క్షరము, అనగా కాలాధీనమైన ఒక సంతతచలనము మఱియు పరివర్తనము, ఒక సంతతసంభవనము (సంభూతి). కాని ఈ క్షరప్రకృతి పురుషుని కార్యనిర్వాహకశక్తి మాత్రము; ఏలన అతని స్వరూపమును బట్టియే ఆమె సంభూతి నందగలదు, అతని సంభూతిసంభవతలను బట్టియే ఆమె పనిచేయగలదు; ఆమె అతని సత్తయొక్క సంభూతిని సాధించును. ఆమె కర్మ, పురుషుని స్వభావముచేత నిర్ణయించబడును - స్వభావ మనగా, స్వీయభావము (= సంభూతి), స్వసంభూతి నియమము; కాని ఆమె కర్మ స్వభావమును రూపొందించును గావున, తఱచుగా స్వభావమునే ఆ కర్మ నిర్ణయించుచున్నట్లు గన్పించును. మనస్వభావమును బట్టియే

కర్మచేయుచు, ఆ కర్మ చేత స్వభావమును వికసింపజేసి కొందుము. ప్రకృతి కార్యనిర్వాహకశక్తి కాగా, పురుషుడాశక్తికి జన్మస్థానమగు సచేతనసత్త; అతని తేజోమయ చేతనావస్తువునుండియే ప్రకృతి పరివర్తనశీల సంకల్పమును బొందును, అది ఆమె క్రియలయందు తన పరివర్తనలను ప్రకటించుకొనును. మఱియు నీ పురుషుడు ఏకము మఱియు అనేకము. ఎట్లన ఏకమాత్రమగు ప్రాణిసత్తయు నతడే, కావున దానినుండి వెలువడు ప్రాణులన్నియు నతడే; అతడు ఏకమాత్ర విశ్వపురుషుడును, తానే అయిన విశ్వమునందలి సర్వభూతములును. అనేకులగు పురుషులందరు తమ మూలసత్తయందు అద్వితీయుడగు ఏకైకపురుషుడే. కాని ప్రకృతిక్రియలో నొక భాగమేయగు అహంభావ యంత్రాంగముయొక్క ఒత్తిడిచేత మనస్సు క్షణిక, పరిమితసంభూతితో ఆత్మచేతనను తాదాత్మ్యమొందించును. ఒక విధముగా ప్రకృతియందే సర్వభూతముల ఏకతను దర్శించను వచ్చును, విశ్వప్రకృతి యొక్క సమస్తక్రియయందు అభివ్యక్తమగుచున్న ఒక విశ్వాత్మను గుర్తించను వచ్చును – ప్రకృతి పురుషుని అభివ్యక్తముచేయును, పురుషుడు ప్రకృతికి సత్త నిచ్చును. కాని ఇట్లెఱుంగుట మహావిశ్వసంభూతినెఱుంగుట మాత్రమే యగును. ఈ విశ్వ సంభూతి మిధ్యామాత్రము గాకపోయినను, దీని జ్ఞానము మాత్రమే మన ఏకాత్మయొక్క యధార్థజ్ఞానమునీయజాలదు; ఏలన మన ఆత్మఈ విశ్వక్షర పురుషుని కంటెను సర్వదా అధికము, అతీతమునగును.

7. అక్షరుడు అచలపురుషుడు

ఏలన, ప్రకృతియం దభివ్యక్తము, దాని కర్మబద్ధము నగు క్షరపురుషుని కావల పురుషునియొక్క మఱియొక రూపము గలదు, ఆ రూపము కేవలము స్థితియే, అందు గతిక్రియ లేమియు నుండవు; అది శాంతము, అక్షరము, సర్వగతము, స్వయంభువు, ఆచలమునగు ఆత్మ – "సర్వగతం అచలం" (12–3); అది అక్షర సత్తగాని, క్షరసంభూతి గాదు, కావున అత డక్షరపురుషుడు. క్షరభావమున ఆత్మ ప్రకృతియందు తగుల్కొని, ప్రకృతిప్రవాహము ననుగమించుటచేత కాలక్షణములలో, సంభూతితరంగములలో తనను గోల్పోయినట్లు గన్పించును; కాగా అక్షరభావమున ప్రకృతి శాంతివిశ్రాంతులలోనికి దిగునుగాన, అది తన అక్షరసత్త నెఱుంగును. ప్రకృతిగుణముల వివిధక్రియలను తనయందు ప్రతిబింబించుచు, తనను సగుణము గాను, సవ్యక్తికముగాను తెలిసికొనునపుడు, సాంఖ్యపురుషుడు గీతాక్షర

పురుషుడగును; ఈ గుణములు సామ్యావస్థ నందగా, తనను నిర్గుణము గాను నిర్వ్యక్తికముగాను తెలిసికొను నప్పుడు సాంఖ్యపురుషుడు గీతా అక్షరపురుషుడగును. కావున ప్రకృతికర్మలతో గూడుకొని క్షరుడు కర్తగా గన్పించుచుండగా, ఆ కర్మలనుండి విడివడిన అక్షరుడు, సాక్షియు నగును. మానవాత్మ క్షరావస్థను స్వీకరించి నపుడు, వ్యక్తిత్వఖేలనముతో తాదాత్మ్యము చెంది, ప్రకృతి యందలి అహంభావముతో తన ఆత్మజ్ఞానమును మఱుగుపఱచుకొని, తన్మూలమున నేను కర్తనను తలంపును మానవునకు గలిగించును; ఇక మానవాత్మ అక్షరావస్థను స్వీకరించి నపుడు, నిర్గుణముతో తాదాత్మ్యముచెంది, ప్రకృతియే కర్త్రి, నేను నిష్క్రియసాక్షియగు ఆత్మను – అని ఎఱుంగును – "అకర్తారం"(13–39). మానవమనస్సు ఈ రెండింటిలో నేదియోయొక అవస్థవైపునకు మొగ్గవలయును; పర్యాయక్రమమున వానిని స్వీకరించును; గుణ. వ్యక్తిత్వముల మార్పులందు అది ప్రకృతికర్మ బద్ధమగును, మాఱని నిర్వ్యక్తికతయందు ప్రకృతికర్మవిముక్తమగును.

8. పురుషోత్తమునియందు క్షరాక్షరసహజీవనము

కాని ఇవి రెండును నిజానికి సహజీవనము నెరపును – అక్షరాత్మయొక్క నిష్క్రియతయు, అవికార్యతయు, మఱియు క్షరప్రకృతియందు అదే ఆత్మయొక్క క్రియయు, వికార్యతయు, ఇది నియమవిరుద్ధము గాదా? ఈ విరోధమును పరిష్కరించుటకు, మాయావాదము క్షరములను మాయ యనును; సాంఖ్యము క్షరము కూడ స్వతఃసత్త యని చెప్పి ద్వైతమును ప్రతిపాదించును; గీత పురుషోత్తముని చూపును. పురుషోత్తముడు పరమాత్మ (15–17), ఆత్మయొక్క తృతీయ వరమస్థితి. క్షరాక్షరాత్మలు ఈ పరమాత్మయొక్క రెండు ప్రతీపపార్శ్వములు; పరమాత్మ ఈ రెండింటిలో నేయొక్కటిమాత్రమే కాక, రెండును అగును. ఈ పరమాత్మ భగవంతుడు, ఈశ్వరుడు – "సర్వభూతమహేశ్వరం"(5–29). అతడు తన స్వీయప్రకృతిని – జీవరూపమున సృజించును; మఱియు నా ప్రకృతి జీవునకు గల ప్రత్యేక స్వభావము (=స్వీయసంభూతి) ననుసరించి రూపొందించబడును; ఈ దివ్య ప్రకృతివికాసము ఆహంకారిక ప్రకృతియందు సైతము భ్రాంతికారకమగు గుణఖేలనముచేత సాధించబడును – "గుణాగుణేషు వర్తంతే" (3–28). ఇదియే "త్రైగుణ్యమయీ మాయా" (7–14), దీనిని దాటుట మిక్కిలి కష్టము – "దురత్యయా"(7–14); అయినను త్రిగుణములను దాటుచూ దీనిని దాటగలము. ఏలన క్షరమునందలి తన ప్రకృతిశక్తి ద్వారా ఈశ్వరుడిది అంతయు చేయుచున్నను, అక్షరమునందతడు

నిర్లిప్తుడు, ఉదాసీనుడు, సమదర్శనుడు, అన్నింటిలోపల అతీతుడై యున్నను, అన్నింటికి పైనుండును. తన మూడు పదములందును అత డీశ్వరుడే : ఉత్తమపదము నందు పరమేశ్వరుడు (15–17); అక్షరపదమునందు నిర్గుణబ్రహ్మ రూపమున అధ్యక్షత వహించు ప్రభువు (15–17), అంతట వ్యాపించియుండు విభువు (5–15) : క్షరపదమునందు అంతర్వర్తి భగవత్సంకల్పము, అంతట నుండు సక్రియ ఈశ్వరుడు (6–31), క్షరమున తన వ్యక్తిత్వలీల నెరపుచునే. తన అక్షర రూపమున అతడు విముక్తుడు; అతడు కేవలము నిర్వ్యక్తికుడు లేక సవ్యక్తికుడు గాడు, ప్రత్యుత రెండు రూపములలోనున్న ఏకమాత్ర మూలపురుషుడు, నిర్గుణ–సగుణుడు– “నిర్గుణో గుణీ” (శ్వే.ఉ.) సర్వము అతనిచేత ముందే సంకల్పించబడును. దానికి తర్వాత ప్రకృతి కార్యరూపమిచ్చును - ఉదాహరణకు, ఇంకను నివసించియేయున్న దుర్యోధనాదులను గుఱించి భగవంతుడిట్లు పలుకును–“నాచేత వీరు నిహతులయియే యున్నారు” (11–33); అయినను వెనుకనుండు తన నిర్వ్యక్తికతా ప్రభావముచేత అతడు తన కర్మబద్ధుడు గాడు - “ కర్తారం అకర్తారం” (4–13).

9. అజ్ఞానమే బంధమూలము

కాని వైయక్తిక మానవాత్మ కర్మతోను, సంభూతితోను అజ్ఞానవశమున తాదాత్మ్యము జెంది, ఆ సంభూతి తననుండి ప్రభవించు ఒక శక్తియని కాక, అదియే తన పూర్ణస్వరూపమనుకొని, అహంకారవిమూఢమగును (3–27), కర్మచేయునది తాను, ఇతరులేనని అది తలంచును; ప్రకృతియే సర్వము చేయుచున్న దని చూడక, అజ్ఞాన, సంగములచేత ప్రకృతిపాత్రను తప్పుగా చిత్రించుచు, ఆమె కర్మలను వికృతపఱచును. గుణములతనిని తమ దాసునిగావించుకొనును– తమస్సు జడ సుఖముతో అతని గతిని కుంఠితము చేయును; రజస్సు కామవాయువులతో అతనిని విసరివేయును; సత్త్వము ఆంశిక ప్రకాశములతో అతనికి పరిమితి గల్పించును; ఇట్లు గుణవికృతమగునది ప్రాకృతమానసమే గాని, తాను గాదని అతడు చూడడు. కావున సుఖదుఃఖములు, హర్షశోకములు, కామకోపములు, రాగవిరాగములు అతనిని ఆక్రమించును: అతనికి ముక్తి మృగ్యము.

10. అక్షరాత్మజ్ఞానము ముక్తిమూలము

ముక్తుడగుటకు, జీవుడు ప్రకృతిక్రియనుండి తిరిగి అక్షరనిశ్చల స్థితిలోని కుపసంహరించుకొనవలెను : అపుడతడు త్రిగుణాతీతుడగును. తనను అక్షర

బ్రహ్మనుగా, అవికార్యపురుషునిగా తెలిసికొని, పిమ్మట అక్షర, నిర్గుణాత్మనుగా తన నెఱుంగును. ఈ ఆత్మక్షరక్రియను ప్రశాంతముగా నిరీక్షించును, సమముగా ధరించును; స్వయముగా నది శాంతము, ఉదాసీనము, అస్పృష్టము, అచలము మఱియు శ స్థము; అది సర్వభూతములతోను ఆత్మయందేకము, ప్రకృతి మఱియు నామె క్రియలందుగాదు. ఈ ఆత్మ తన సన్నిధిచేత కర్మచేయ ప్రకృతి కధికార మిచ్చును; తన సర్వగతభావముచేత ఆ కర్మలను ధరించి, అనుమతించును- "ప్రభు, విభు" (5-14,15): అయినను కర్మలనుగాని, కర్తృత్వమునుగాని, కర్మకు , ఫలమునకు సంయోగమును గాని స్వయముగా సృజించదు: కాని క్షరమునందు వీనినన్నింటిని సాధించు ప్రకృతిని కేవలము గమనించును - " స్వభావస్తు ప్రవర్తతే" (5-14). ఈ జన్మను తమదిగా నభిమానించు ప్రాణికోటి పుణ్యమును గాని పాపమునుగాని అది స్వీకరించదు; అది తన ఆధ్యాత్మికవిశుద్ధతను కాపాడు కొనును. అహంకారము నిజానికి ఒక అధికతరశక్తి యొక్క ఉపకరణమాత్రము: ఈ రూపమున గాక, అది కర్తృత్వబాధ్యతను వహించి; కర్తగా గన్పించగోరును. ఇట్లు అజ్ఞాన విమూఢమైన (3-27) అహంకారము పాపాదులను తనకే ఆపాదించు కొనును- "అజ్ఞానే నావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః" (5-15), జీవుడీ అహంకారము నుండి విడివడి, దానిచే నతడు ప్రకృతికర్మలనుండియు, పుణ్యపాపాభాసముల నుండియు విముక్తుడగును. అయినను బహిఃపురుషుడును, మనఃప్రాణ శరీరములును నిలిచియే యుండును. ప్రకృతి పనిచేయుచునే యుండును; కాని అంతఃపురుషుడు వీనితో తాదాత్మ్యము చెందడు, మఱియు బహిఃపురుషునియందు గుణములు క్రీడించు చుండగా, అతడు పొంగడు, క్రుంగడు, అతడన్నింటిని కేవలము చూచుచుండు ప్రశాంత అక్షరాత్మ.

11. పురుషోత్తమజ్ఞానము దివ్యజీవనమూలము

ఇదియే చరమస్థితియా, పరమసంభవతయా, ఉత్తమరహస్యమా? కాజాలదు, ఏలన ఇది మిశ్రిత లేక విభక్తస్థితియే గాని, పూర్ణ సామరస్యవిలసితపదము గాదు; ద్వివిధసత్తగాని , ఏకీకృతసత్తగాదు; ఇది ఆత్మయందు ముక్తి, ప్రకృతి యందు అపూర్ణతయు నగును. ఇది ఒక దశ మాత్రమే కాగలదు. అయితే దీనికి పరమునందే మున్నది? పరముమాట అటుంచి, సన్యాసి చెప్పునదేమన, అసలు ప్రకృతియే మిధ్య, కావున ఆత్మయందలి ముక్తి మిశ్రితము, విభక్తముగాదు. ఈ ముక్తికి గీతయు

తావిచ్చును గాని దీనిని ఉత్తమమని తలంచదు. గీతయు కర్మసన్యాసమును ఒత్తి చెప్పును- "స్వర కర్మాణిమయి సంన్న్యస్య" (18-57); కాని ఆంతరముగా బ్రహ్మకు చేయు సన్యాసమది. (5-10) క్షరమునందలి బ్రహ్మ ప్రకృతి క్రియను సర్వాత్మ నాధరించును; కాగా అక్షరమునందలి బ్రహ్మ ఆక్రియను ధరించుచునే , దానినుండి విడివడియుండి, తన విముక్తిని భద్రపఱచు కొనును. అక్షరమునందలి బ్రహ్మతో ఏకీభూతుడైన వ్యష్టిపురుషుడు విముక్తుడు; వియుక్తుడు నయ్యును, (అదేసమయమున) క్షరమునందలి బ్రహ్మతో ఏకీభూతుడై ప్రకృతిక్రియను ధరించును గాని, దానిచేత ప్రభావితుడు గాడు. క్షరాక్షరబ్రహ్మలిరువురు పురుషోత్తముని రెండు పార్శ్వములని చూచినపుడతడీపని బాగుగా చేయగలడు. పురుషోత్తముడు సర్వభూతములయందు నిగూఢేశ్వరుడుగా నివసించుచు, ప్రకృతిని తన యిచ్ఛ చేత నియమించగా, ప్రకృతి జీవ స్వభావము ననుసరించి తన కర్మల నిర్వహించును; వ్యష్టిపురుషుడు దివ్యీకృత బాహ్యపురుషుని భగవదిచ్ఛకు ఒక ఉపకరణము గావించును- "నిమిత్తమాత్రం" (11-33), అతడు క్రియయందు సైతము త్రిగుణాతీతుడుగా నిలిచి, గుణవిముక్తుడగును-"నిస్త్రైగుణ్యః"(2-45); ఇప్పటి కతడు గీతయొక్క పూర్వాదేశమును- "నిస్త్రైగుణ్యో భవార్జున"(2-45)-పూర్తి చేయును. బ్రహ్మమువలె అతడింకను గుణముల నుపభోగించును-" నిర్గుణ గుణభోక్తృచ" (13-15): మఱియు బ్రహ్మమువలెనే అసక్తుడై సర్వమును ధరించును- "అసక్తం సర్వభృత్ (13-15). కాని అతనియందలి గుణక్రియ సర్వథా మాఱిపోవును, అది గుణముల అహంకార స్వభావమును వీడి, పైకుద్ధరించబడి, ప్రతిక్రియల కందకయుండును. ఏలన అతడు తన సమస్త సత్తను పురుషోత్తముని లోపల ఏకీభూతము గావించి, అతని దివ్యసత్తను, అతని ఉచ్చతర దివ్య ప్రకృతిభావమును స్వీకరించినాడు- "మద్భావం"(14-19). తన మనస్సును ప్రాకృతచేతనను (చిత్తము) గూడ భగవంతునితో ఏకీభూతము గావించినాడు-" మన్మనా మచ్చిత్తః"(18-65). ఈ పరివర్తనము ప్రకృతియొక్క చరమపరిణామము, మఱియు దివ్యజన్మయొక్క పూర్ణపరిసమాప్తి- "రహస్యం ఉత్తమం"(4-3). ఈ పరివ ర్తనము సిద్ధించినపుడు, పురుషుడు తనను తన ప్రకృతికి ప్రభువుగా నెఱుంగును; దివ్యజ్యోతి యొక్క ఒక జ్యోతిగాను, దివ్యేచ్ఛ యొక్క ఒక యిచ్ఛగా పెంపెసగి, తన ప్రాకృత క్రియలను దివ్య కర్మలోనికి మార్చివేయగలుగును.

౨౩. నిర్వాణము, ప్రపంచ కర్మలు

1. అభేదమునందు భేదము

సమస్త సత్తయొక్క యోగముద్వారా పురుషోత్తమునితో జీవాత్మసాయుజ్యమే గీతయొక్క సంపూర్ణ ఉపదేశము గాని, అక్షరాత్మతో సాయుజ్యము మాత్రమే గాదు: ఈ సంకుచితతర సాయుజ్యము కేవలజ్ఞానమార్గలక్ష్య మగును. కావుననే కర్మజ్ఞానముల సమన్వయమును సాధించిన పిమ్మట, కర్మజ్ఞానాలతో అభిన్నమగు భక్తి ప్రేమల భావనను గీత పెంపొందించగలుగును. మఱియు పరమ రహస్యమునకు దారితీయు మార్గముయొక్క పరమోన్నతిగా దానిని చూపగలుగును, అక్షరాత్మతో సాయుజ్యమే కేవల లేక పరమరహస్యమగుచో, గీత భక్తి అట్లు భావనను పెంపొందించి యుండ జాలదు; ఏలన అపుడు మార్గమున ఒక దశ యందు కర్మల అంతరాధారము వలెనే భ క్తిప్రేమల అంతరాధారమును ముక్కచెక్కలై కూలిపోవును. అక్షరాత్మతో అనన్య, సంపూర్ణసాయుజ్యమున కర్థము క్షరసత్తయొక్క దృక్కోణము నంతను రద్దుచేయుటయే యగును- దాని నిమ్న రూపమునే గాక, మూలరూపమునే, దాని అజ్ఞానకర్మలనేగాక, జ్ఞానకర్మలను సైతము నిరాకరించుటయే యగును. ఇంకను, సచేతన స్థితియందును, గతియందును మానవాత్మకును, భగవంతునికిని గల భేదమును తుడిచివేయుటయే దాని అర్థ మగును- ఈ భేదము లేనిచో క్షరలీలసాధ్యము గాదు; ఏలన అపుడు క్షరమునందు దివ్యసత్యత యొక్క ఎట్టి మూలము, లేక ఆధారము నుండదు గాన, క్షరక్రియ అజ్ఞానఖేలనమే యగును. దీనికి ప్రతిగా, పురుషో త్తమునితో యోగముద్వారా సాయుజ్యమున కర్థము, మన స్వయంభూసత్తయందు అతనితో ఏకతను, మన సక్రియ సత్తయందు అతనితో ఒక విధమగు భేధాభేదమును తెలిసికొని అనుభవించుటయే యగును. దివ్యప్రేమ ప్రేరితము, దివ్యీకృతప్రకృతి నిర్వర్తితము నగు దివ్యకర్మల ఖేలనమునందు ఈ భేదాభేదము నిలిచి యుండుట, మఱియు ఆత్మయందలి భగవత్సాక్షాత్కారముతో అన్యోన్యముచేయ బడిన ప్రపంచమందలి భగవద్దర్శనము - ఇవియే విముక్త మానవునకు కర్మను, భక్తిని సాధ్యము గావించును, మఱియు అతని పరిపూర్ణ జీవనమున వానిని సాధ్యమే గాక, అనివార్యము గావించును.

2. అక్షరాత్మసాక్షాత్కారము ఒక సోపానము

కాని పురుషోత్తమునితో సాయుజ్యమునకు సూటి మార్గము అక్షరాత్మ. సాక్షాత్కారముద్వారా సాగును; దీనికి పిమ్మటనే కర్మయు, భక్తియు తమ సంపూర్ణ దివ్యార్థమును సంతరించుకొనును. అందుచేత ఒక ప్రధమావశ్యకతగా గీత దీనిని ఒ త్తి చెప్పినను, కాని ఒ త్తిచెప్పుటచేత ఇదియే గీతాతాత్పర్య మనే అపోహ గల్గును. ఏలన ఈ ఆవశ్యకతను వక్కాణించు శ్లోకములనే తీసికొని, పూర్వాపర విచారణాధారమును గమనించమేని, జీవాత్మయొక్క అంతిమావస్థగా గీత నిష్క్రియలయమునే బోధించు చున్నదనే నిర్ణయమునకు సులభముగా రాగలము. అపుడు అచలస్థితికి కర్మ ఒక ప్రాథమిక సాధన మాత్రమే యగును. ఇట్లు ఒ త్తిచెప్పుట పంచమాధ్యాయమునందు చివరను, షష్ఠాధ్యాయమునం దంతటను మిక్కిలి బలముగాను, వ్యాపకముగాను గానవచ్చును. అచ్చట యోగిప్రాప్యపదమును వర్ణించుటకు నిర్వాణశబ్దము పునః పునః ప్రయోగించబడును. కావున యోగమునకు కర్మతో పొత్తు కుదుర దనిపించును.

3. నిర్వాణశాంతి నిష్క్రియశాంతియా?

ఈ పదము (Status) యొక్క లక్షణము నిశ్చల ఆత్మనిర్వాణముయొక్క పరమశాంతి యగును - "శాంతిం నిర్వాణపరమాం" (6-15) మఱియు నిది శూన్యమునందు బౌద్ధుల నిర్వాణము గాదు, పూర్ణసత్తయందు అంశికసత్తయొక్క లయరూపమగు వైదాంతికనిర్వాణ మని తెలుపుటకో యన, గీత సదా బ్రహ్మనిర్వాణ పదము నుపయోగించును (5-24); మఱియు నిచ్చట బ్రహ్మ కర్థము అవశ్యముగా అక్షరబ్రహ్మయే యనియు, బాహ్యప్రకృతిలో అంతర్గతముగా నున్నను, దాని క్రియలో పాల్గొనని ఆంతర కాలాతీత ఆత్మనే అది తెలుపు ననియు మన కనిపించును, ఇచ్చట గీతాభిప్రాయ మేమిటి? విశేషించి, ఈ శాంతి కేవల నైష్కర్మ్య శాంతియా? అక్షరమునందు నిర్వాణమునకు, క్షరప్రపంచమున జీవనకర్మలకు నెట్టి పొత్తు కుదుర దని అనుకొనుటకు మన మలవడియున్నాము; మఱియు నిర్వాణ శబ్దమే ఈ విషయమును నిర్ణయించునని వాదింప ప్రయత్నింతుము. కాని బౌద్ధమతమును లోతుగా పరిశీలించినచో, బౌద్ధులయందైనను ఈ ఆత్యంతిక విరోధము నిజముగా నుండెనా? యని సందేహము గలుగును; ఇక గీతను లోతుగా జూచినచో దాని పరమ వేదాంతబోధనలో నిది భాగము గాదని తేలిపోవును.

4. నిర్వాణమన అహంకార నిర్వాణము

బ్రహ్మచేతనలోని కారోహించిన –"బ్రహ్మవిద్ బ్రహ్మణి స్థితః" (5–20) బ్రహ్మవిదుని పరిపూర్ణసమతను వర్ణించిన పిమ్మట, తర్వాతి తొమ్మిది శ్లోకములలో గీత బ్రహ్మయోగము మఱియు బ్రహ్మయందు నిర్వాణమును గుఱించిన తన భావనను వివరించును. "బాహ్యస్పర్శలయం దంతరాత్మ స క్తము గానపుడు, యోగి ఆత్మయందు గల సుఖమును బొందును; అతని ఆత్మ బ్రహ్మయోగముతో యుక్తమై యున్నది గాన, అతడు అక్షయసుఖమును అనుభవించును (5–21)" కామము, క్రోధము, ఆవేగముల దాడులనుండి ము క్తి పొందుటకు అసంగ మావశ్యక మని ఇచ్చట గీత చెప్పును; ఏలన ఈ విము క్తి లేనిచో సత్యసుఖానుభవము సంభవము గాదు. మానవు డా విముక్తిని సమతను శరీరముండగనే పూర్తిగా బొందవలెను; శరీర పతనానంతరము పరిపూర్ణవిముక్తి ప్రాప్తించును లే యని, విక్షుబ్ధ నిమ్నప్రకృతికి అణుమాత్రమేని అధీనమై యుండుటను సహించరాదు. " ప్రాక్ శరీర విమోక్షణాత్" (5–23)– మానవజీవనమునందు సైతము పరిపూర్ణ ఆధ్యాత్మికవిము క్తిని సాధించి, అధిష్ఠించి, అనుభవించవలెను. ఇంకను ఇట్లు గీత వివరించును. "ఎవనికి సుఖమును, ఆరామమును, జ్యోతియు లోపలనే గలవో, అట్టి యోగి బ్రహ్మయై బ్రహ్మయందు ఆత్మ–నిర్యాణము నందును– బ్రహ్మనిర్వాణం (5–24)" (ఇచ్చట యోగికి సుఖాద్యనుభవము గలదు గాన) నిర్వాణ మన, ఉచ్చ తరాత్మ యందు అహంకారనిర్వాణమే గాని, సర్వనాశనము గాదని స్పష్టపడును. ఇప్పు డిక యోగి అహంకారముగా నుండడు– మనఃశరీరపరిచ్ఛిన్నమైన క్షుద్రపురు షుడుగా నుండడు. అతడు బ్రహ్మ మగును; అతడు తన ప్రాకృత సత్తయందు అంతర్వ ర్తిగా నుండు సనాతనాత్మయొక్క అక్షరదివ్యతతో తన చేతనయం దేక మగును.

5. నిర్యాణము సమాధిలయమా?

కాని ఈ బ్రహ్మనిర్వాణము ప్రపంచస్పర్శ లేని ఒకానొక సమాధిసుష ప్తిలో కూరుకునిపోవుటయా, "లయమా"? అథవా సర్వథా ప్రకృతికి, ప్రకృతికర్మలకు పరమునం దుండు ఒకానొక కేవలాత్మలో ప్రాకృతపురుషుడును, వై య క్తికాత్మయు లయముజెంది, "మోక్ష" మందుటకు అది పూర్వాంగమా? నిర్వాణములో ప్రవేశించుటకు అట్టి ఉపసంహరణ మావశ్యకమా, లేక సందర్భము సూచించునట్లు, నిర్వాణము ప్రపంచచేతనతో సమకాలమున వర్తించగల, మఱియు తనలో దాని

నొకవిధముగా ఇముడ్చుకొనను గల ఒక అవస్థయా? స్పష్టముగా రెండవదియే; ఏలన గీత తర్వాతిశ్లోకమున ఇంకను ఇట్లు చెప్పును, "పాపకళంకము క్షీణించిన వారు, సందేహగ్రంధి వీడినవారు, ఆత్మవశ్యులు, సర్వభూతహితమునందు నిరతులైన వారు నగు ఋషులు బ్రహ్మనిర్వాణమును ప్రాపింతురు" (5-25). ఇట్లుండుట (నిర్వాణమునకు సాధనయే గాక) నిర్వాణమనం దుండుటయే యని దాదాపు దీని కర్ధముగా దోచును. కాని తర్వాతి శ్లోకము ఇదే అర్ధ మని స్పష్టముగా తేల్చివేయును, "కామక్రోధములనుండి విముక్తులు, ఆత్మవశిత్వమును సాధించినవారు నగు యతి వర్యులకు బ్రహ్మనిర్వాణము నలువైపుల వారిని చుట్టి విలసిల్లును; వారి కాత్మజ్ఞానము గలదు గాన, వారు దానియందు నివసించుచునే యున్నారు" (5-26). అనగా, ఆత్మజ్ఞానము, ఆత్మప్రా ప్తి గలిగియుండుట నిర్వాణమునం దుండటయే యగును. ఇది స్పష్టముగా నిర్వాణభావనయొక్క విపులవిస్తారమే యగును. ఏలన నిర్వాణ ప్రాప్తికి విధించబడిన నియమములే నిర్వాణమును గూర్చుచు, దాని ఆధ్యాత్మిక ద్రవ్య మగుచున్నవి. ఆ ద్రవ్యమిది; ఆవేగకళంకమునుండి విముక్తి, విముక్తి కాధారమగు ఆత్మవశిత్వము, సర్వభూతసమత్వము, అందరిపట్ల హితసాధకమగు ప్రేమ, సందేహాంధకారములకు తల్లి యగు అజ్ఞానముయొక్క చరమవిధ్వంసనము, మఱియు మనయందు, అన్నింటియందు నున్న ఏకాత్మజ్ఞానము - ఇవి నిర్వాణ సాధనలే గాక, నిర్వాణహృదయముగా పర్యవసించును.

6. నిర్వాణము కర్మావిరుద్ధము

ఇట్లు స్పష్టముగానే నిర్వాణము ప్రపంచచేతనతోను, ప్రపంచమునందలి కర్మతోను సంగతమే. ఏలన నిర్వాణవంతులగు ఋషులు క్షర ప్రపంచమునందలి భగవంతుని దర్శించుచు, అతనితో కర్మలద్వారా ఘనిష్ఠసంబంధము గలిగియుందురు; వారు సర్వభూతముల కల్యాణము నాచరింతురు- "సర్వభూతహితే రతాః" (5-25) వారు క్షరానుభవములను నన్యసించలేదు, వానిని దివ్యము గావించినారు; ఏలన క్షర మన సర్వభూతములు (15-16), ఇక సర్వభూతముల హితాచరణ మన క్షర ప్రకృతి యందలి దివ్యకర్మ యగును, ప్రపంచమునందలి ఈ కర్మ బ్రహ్మ యందలి స్థితిలో విసంగతము కాకపోగా, దాని అనివార్యనియమమును, బాహ్య ఫలితము నగును; ఏలన మన మే బ్రహ్మయందు నిర్యాణమును బొందుచున్నామో, ఏ ఆధ్యాత్మికచేతన యందు పృధక్కర అహంకారచేతనను గోల్పోవుచున్నామో, అది

ఈ సర్వసంఘ టనలకు పైన, దూరముగా నుండక, వానిని వ్యాపించియు, భరించియు, వాని యందు విస్తరించియుండును (2-17). కావున బ్రహ్మనిర్వాణ మన వేఱు చేయు అహంచేతనా నాశ మని అర్థము, మఱియు నిర్వాణప్రవేశ మన, ఏకముచేయు ఈ సత్యచేతనలోనికి ప్రయాణ మగును; ఈ సత్యచేతన సృష్టికి హృదయము, దాని లోపలి వస్తువు, దాని వెలుపల నుండి, దానిని ధరించు వస్తువు, దాని సంపూర్ణ మూలసత్యము, సనాతన పరమ సత్యము. నిర్వాణమును చేరుకొని, దానిలో ప్రవేశించినపుడు, అది మనలోపలనే కాక, చుట్టును వ ర్తించును -"అభితో వర్తతే" (5-26); కారణము, అది మనలోపల నిగూఢముగా నుండు బ్రహ్మచేతనయే గాక, మనము దేనిలోపల నివసింతుమో, ఆ బ్రహ్మచేతనయు నగును. అది మన అంతః స్వరూపమగు ఆత్మ, మన వైయ క్తికసత్తయొక్క పరమ-ఆత్మ, మఱియు నది బాహ్యమునందు మన స్వరూపమగు ఆత్మ, విశ్వముయొక్క పరమ-ఆత్మ, సర్వభూతముల ఆత్మ. తదాత్మయందు నివసించుటచేత, మనము మన అహంకారిక సత్తయందే గాక, అన్నింటియందును నివసింతుము, తదాత్మతో ఏకతచేత విశ్వము నందతటితో నొక స్థిరమగు ఏకత మన సత్తయొక్క స్వభావమే అగును. మన సక్రియచేతనయొక్క మూల స్థితి యగును, మన సర్వకర్మయొక్క మూలప్రేరణ యగును.

7. రాజయోగసమాధి ఒక ద్వారము మాత్రమే

కాని తర్వాతి రెండు శ్లోకములు ఈ నిర్ణయమును కాదనుచున్నట్లు గన్పించును, "బాహ్యస్పర్శలను బహిష్కరించి, దృష్టిని భ్రూమధ్యమున నిలిపి, ప్రాణాపానములను సమముగావించి, ఇంద్రియ మనో బుద్ధులను నియమించి, కామ క్రోధ భయములకు స్వస్తిచెప్పి, మోక్షపారాయణుడైన మునికి ముక్తి కరతలామలకము" (5-27,28), ఇచ్చటి యోగప్రక్రియ కర్మయోగముకంటె మిక్కిలి భిన్నముగాను, వివేచనా, ధ్యానములచే సాగు శుద్ధజ్ఞానయోగముకంటెను భిన్నముగాను గన్పించును. దీని ప్రత్యేకలక్షణము లన్నియు మానసిక-కాయిక తపోరూపమగు రాజయోగలక్షణములు. చూడుడు: ఇచ్చట చిత్తవృత్తి నిరోధము గలదు, ప్రాణాయామముగలదు, దృష్టి ప్రత్యాహారము గలదు. ఇవి యన్నియు ఆంతరసమాధికి దారితీయు ప్రక్రియలు, వాని ధ్యేయము మోక్షము, మఱియు సామాన్యభాషలో మోక్ష మన, వేఱు చేయు అహంచేతనాసన్యాసమే గాక, సంపూర్ణసక్రియచేతనాసన్యాసమే యగును, పరబ్రహ్మము నందు మన సత్తయొక్క విలయ మగును. ఇదే అర్థమున, విలయము

ద్వారా మోక్షమునకు ఒక చరమక్రియగా గీత ఈ రాజయోగ ప్రక్రియను చూపుచున్నదా, లేక బహిర్ముఖమానసమును జయించుటకు ఒక ప్రత్యేక సాధనగాను, ప్రబలదోహదముగాను అందించుచున్నదా? ఇదియే పర్యవసానమా, పరాకాష్ఠయా, చరమవచనమా? ఈ రాజయోగ ప్రక్రియ పరమగతికి ఒక ప్రత్యేక సాధన యనియు, మఱియు ఒకానొక ద్వార మనియు అనుకొనుటకు ఆధారము గన్పించును; ఇది లయముద్వారా కాక, విశ్వాతీతస్థితిలోనికి సముద్ధరణద్వారా సిద్ధించు పరమ గతి, ఈ అధార మేదియన, ఈ ప్రకరణమునందు సైతము రాజయోగప్రక్రియ చరమ వచనము గాదు; చరమవచనము, పరాకాష్ఠ తర్వాతి, చివరిశ్లోకములో నున్నది- "మానవు డెపుడు నన్ను యజ్ఞముయొక్కయు, తపస్యయొక్కయు భోక్తనుగాను, సర్వలోక మహేశ్వరునిగాను, సర్వభూతసుహృదునిగాను ఎఱుంగునో , అపుడు శాంతిని బొందును" (5-29), ఇచ్చట కర్మయోగప్రభావము మఱల ప్రవేశించును; సక్రియబ్రహ్మ, అనగా విశ్వేశ్వరునియొక్క జ్ఞానము నిర్వాణశాంతికి వలయు నియ మములలో నొకటిగా ఒత్తిచెప్పబడును.

8. పురుషోత్తముడు శాంతిప్రభువును, శక్తిప్రభువును

ఇచ్చట గీతయొక్క పరమభావనకు - పురుషోత్తమభావనకు - తిరిగి వచ్చి నాము- పేరు పెట్టకపోయినను, కృష్ణుడునేను, నన్ను -అన్నపుడు వాని అర్థమా పురుషోత్తముడే. అతడు మనకాలాతీత అక్షరసత్తయందు ఏకాత్మగాను, సర్వభూతముల యందును, సర్వక్రియలయందును ఏక ప్రభువుగా నుండును; అతడు మౌన, శాంతులకు ప్రభువు, అటులే శక్తి, క్రియలకు ప్రభువు; అత డిపుడు కురు క్షేత్రమహాయుద్ధమునకు దివ్యసారథిగా నవతరించియున్నాడు; అతడు ఉత్తముడు, అక్షరుడు మఱియు క్షరుడు, ప్రతిజీవియొక్క నియామకుడు. అతడు సర్వయజ్ఞముల, సర్వతపస్యల భోక్త; కావున ముముక్షుమానవుడు యజ్ఞముగా, తపస్యగా కర్మలను జేయవలెను; సర్వలోకమహేశ్వరుడగు నతడు ప్రకృతియందును, ఈ భూతములందును అభివ్యక్తుడై యున్నాడు గాన, మానవుడు విముక్తు డయ్యును లోకసంగ్రహార్థము (3-20) కర్మ చేయవలెను; అతడు సర్వభూతసుహృదుడు (5-29) గావున, తన లోపలను, వెలుపలను నిర్వాణము ననుభవించుచున్న ఋషి (5-26) సర్వభూత హితమునం దింకను రతుడై యుండును- మహాయాన బౌద్ధముగూడ సర్వ కరుణాప్రేరిత కర్మలనే నిర్వాణమునకు పరమలక్షణముగా గ్రహించును, క్షరలీలా

సంబంధములను గూడ తన బాహువులయందిముడ్చుకొనును గావున, మానవునిపట్ల దివ్యప్రేమయు, భగవంతునిపట్ల దివ్యభక్తియు అతని సామర్థ్యము లోనివే యగును.

9. ఆంతరసన్యాసము ముక్తికారణము

ఇదియే గీతాతాత్పర్య మని ఆఱవ అధ్యాయముయొక్క ఆశయములోనికి మునిగినపుడు మనకు స్పష్టమగును. కావున వీలైనంత త్వరగా తదధ్యాయము యొక్క సారమును గ్రహింతుము. మున్ముందు గురువు-ఇది అత్యంత ముఖ్యము-సన్యాసమాంతరము గాని, బాహ్యము గాదని, ఆంతర సన్యాసమే సన్యాససారమని మఱియొకసారి ఉద్ఘాటించును - "కర్మఫలము నాశ్రయించక, ఎవడు చేయదగిన కర్మను జేయునో, అతడే సన్యాసియు, యోగియుగాని, నిరగ్నియు, నిష్క్రియుడునుగాడు (6-1). దేనిని సన్యాస మని పిలుతురో, అది నిజానికి యోగమని తెలియుము; మనస్సునందు కామ- సంకల్పమును సన్యసించనివాడెవడును యోగి గాడు గదా (6-2)". కావున కర్మ చేయవలెను, కాని ఏ ఉద్దేశ్యముతో, ఏ క్రమమున? ముందు, యోగపర్వతము నారోహించుచున్నపుడు కర్మ చేయవలెను; ఏలన కర్మ 'కారణ' మగును (6-3). అయితే దేనికి కారణము? ఆత్మోద్ధరణమునకు, విముక్తికి, బ్రహ్మనిర్వాణమునకు గారణము; ఏలన ఆంతరసన్యాసమును గట్టిగా నభ్యసించుచు, కర్మ చేయుచో, కామమనస్సు, అహమాత్మ, నిమ్నప్రకృతుల జయము సుకర మగును, ఆత్మోద్ధరణము, ఆత్మవిముక్తియు తేలికగా సిద్ధించును.

10. శమము దివ్యకర్మకారణము

కాని సాధకుడు యోగశిఖరమును చేరుకొనినపుడు? అప్పు డిక కర్మ కారణము గాదు, మఱి? శమము కారణ మగును- కర్మద్వారా ప్రాప్తించిన ఆత్మ వశిత్వము మఱియు ఆత్మవత్త్వముయొక్క శమము. మఱల, దేనికి గారణము? ఆత్మనిష్ఠతకును మఱియు దేనియందు విముక్తమానవుని దివ్యకర్మలు చేయబడునో, అట్టి పరిపూర్ణ సమతకును గారణ మగును - "ఏలన ఇంద్రియార్థములందు గాని, కర్మలయందు గాని సాధకు డెపుడు సక్తుడు గాడో , మఱియు సర్వ కామసంకల్ప ములను సన్యసించియున్నాడో, అపు డతడు యోగారూఢు డని చెప్పబడును" (6-4) (గమనిక: యోగారూఢునికిని కర్మలు,అసక్త కర్మలు గలవు. ఈ అంతః స్థితియందే మానవుడు కర్మచేయు నని మనకు పూర్వమే తెలియును (4-23). అతడు తన నిమ్నాత్మను జయించి, పరిపూర్ణశమమును బ్రాపించియున్నాడు, అతని కాశమమున తన

ఉన్నతాత్మ వ్య క్తమగును, ఈ ఉన్నతాత్మ సదా తన సత్తయందే కేంద్రితమై - "సమాహితః" (6-7)- యుండును; అనగా నివృత్తిచేతనయొక్క లయావస్థయందే గాక, జాగ్రదవస్థలోని శీతోష్ణసుఖదుఃఖములందును, మానావమాన ములందును సమాహిత మై యుండును (6-7). ఈ ఉన్నతాత్మ అక్షరపురుషుడు "కూటస్థుడు" (15-16), ఇతడు ప్రాకృతపురుషుని పరివర్తనలకు, వ్యాకులములకు పై నుండును;యోగి యెపుడు కూటస్థునివలె సర్వాభాసములకు, పరివర్తనలకు అతీతముగా నుండునో , ఆత్మజ్ఞాన తృప్తు డగునో, వస్తువులు, ఘటనలు మఱియు వ్యక్తుల పట్ల సమచిత్తుడై యుండునో, అపుడతనిని కూటస్థయోగి యందురు.

11. మనశ్చాంచల్యమునకు రాజయోగము

ఇంతకు నీ కూటస్థయోగము సులభసాధ్యము గాదు, అర్జున డించుక పిమ్మట దీనినే ప్రస్తావించును. కారణము, చంచలమానసము దాడిచేయు బాహ్య వస్తువులచే ఇట్టే క్రిందికి లాగబడి, తిరిగి దుఃఖము, ఆవేశము, విషమతల వశము లోనికి పడిపోవును. కావున తన జ్ఞానకర్మల ప్రధానపద్ధతితో బాటు, గీత రాజయోగ ధ్యాన ప్రక్రియను గూడ నిచ్చుచున్నట్లు గన్పించును, ఇది ఒక అభ్యాస పద్ధతి (6-34), ఇది మనస్సు మఱియు దాని వృత్తుల పూర్ణనిరోధమునకు ప్రబల సాధనము. ఇచ్చట యోగి సదా ఆత్మతో యోగము నభ్యసింపవలెను. దానివలన ఆత్మచేతన అతనికి సహజమగును. సర్వకామమును, పరిగ్రహభావమును తన మనస్సునుండి పాఱదోలి, తన సంపూర్ణ సత్తాచేతనలయందు స్వయంనియతుడై అతడు ఏకాంతమున ఆసీనుడు గావలెను (6-10) "శుచియగు స్థానమున అంత ఎత్తు, అంత పల్లము గాని స్థిరాసనము నేర్పఱుచుకకొని, దానిని దర్భలతో, కృష్ణాజినముతో, వస్త్రముతో కప్పి, దానియం దాసీనుడై, మనస్సు నేకాగ్రపఱచి, చి త్తేంద్రియక్రియ లను అదుపులోనికి దెచ్చుకుని, ఆత్మ విశుద్ధి కొఱకు యోగము నభ్యసింపవలెను" (6-11,12). రాజయోగాభ్యాసమున కనువుగా, అతని శరీరము స్థిరముగా, నిశ్చలముగా నుండ వలెను; అటు నిటు చూడక, దృష్టిని లాగి భ్రూమధ్యమున నిలుపవలెను (6-13). మనస్సును ప్రశాంతముగా, నిర్భయముగా, నిలిపి, బ్రహ్మచర్యవ్రతమవలంబించగా, చేతనయొక్క నిమ్నతరక్రియ ఉచ్చతరశాంతిలో లీనమగును. ఏలన ఇచ్చట సాధ్యవస్తువు నిశ్చల నిర్వాణశాంతి. "ఇట్లు మనసును నియమించి, తనను యోగయుక్తుని గావించుకొనుచు, యోగి నాయందు ప్రతిష్ఠితమైయుండు పరమ నిర్వాణశాంతిని బొందును" (6-15)- "మత్సంస్థాం".

12. ఆత్మయందే, ఆత్మచేతనే ఆత్మదర్శనము

పూర్తిగా సంయతమైన మానసికచేతన యంతయు, వాయురహిత ప్రదేశ మున దీపమువలె, ఎపుడు ఆత్మయందు నిశ్చలముగా నిలిచి, తన చంచలక్రియ నుండి విరమించుకొనునో , అపుడు నిర్వాణశాంతి ప్రాప్తించును (6–19). మఱియు మనస్సుయొక్క శమ నిశ్చలతలచేత, ఆత్మ, మనస్సునందువలె వికృతముగాక, లోపల ఆత్మయందే చూడబడును; మఱియు అయథార్థముగా మనస్సు కల్పించురూపమున గాక, అహంకారముద్వారా ప్రాప్తించు రూపమున గాక, ఆత్మ స్వయందృష్ట మగును - "స్వప్రకాశ" (6–20). అపు డంతరాత్మ తనదేయగు సత్య, సమధిక సుఖము నాస్వాదించుచు పరితృప్తమగును. ఇది ఇంద్రియమనస్సులకు తెలిసిన అశాంత సుఖము గాదు, ప్రశాంత అంతరానందము; దీనియందు అంతరాత్మ మనఃక్షోభమునకు పై నుండును గాన, తన ఆధ్యాత్మికతత్త్వమునుండి పడి పోజాలదు (6–21). ఎంతటి దారుణమానసికదుఃఖమును ఆ సుఖమును కదిలించలేదు. ఏలన బాహ్య స్పర్శలకు ప్రతి క్రియారూపమే మానసిక దుఃఖముకాగా ఇది స్వయంభూ అంతరానందము (6–22). ఇది దుఃఖముతో గల మనోవివాహసంబంధమునకు విచ్ఛేదనము - "దుఃఖసంయోగవియోగం" (6–23). ఈ సహజ ఆధ్యాత్మికానందము యొక్క సుదృఢ ప్రాప్తికే యోగమని పేరు , ఇది దివ్యసంయోగము. ఇది సర్వోత్తమ విత్తము, దీని ముందు తక్కిన వన్నియు వెలవెలబోవును. కావున కఠినత లేక పరాజయము వలన గలుగు నిరుత్సాహమునకు లొంగక, ముక్తియు, నిర్వాణసుఖము ఒక శాశ్వత సంపత్తిగా పదిలపడువఱకు దృఢనిశ్చయముతో నీ యోగ మభ్యసింపవలయును.

13. మనఃప్రశమనము రాజయోగసారము

భావికమనస్సును, కామపరమనస్సును, ఇంద్రియములను నిశ్చలము చేయుటయే ఇచ్చట ముఖ్యము - ఇంద్రియముల నేలయన, అవి బాహ్యస్పర్శలను స్వీక రించి వానికి మన సాధారణ భావిక ప్రతిక్రియలతో ప్రత్యుత్తర మిచ్చును; కాని మానసిక చింతన సైతము ఆత్మమౌనమునందు ఆగిపోవలయును. ముందు సంకల్ప జాతములగు కామము లన్నింటిని అశేషముగా, సమూలముగా త్యజించివేసి, నలువైపులకు అభ్యాసవశమున అస్తవ్యస్తముగా పరుగులువెట్టు ఇంద్రియములను లాగి, మనస్సుచేత నియమించవలెను; కాని పిమ్మట ఆ మనస్సునే బుద్ధి పట్టిలోనికి లాగవలెను. అపుడు బుద్ధిని స్థిరపఱచి, మనఃక్రియనుండి నివృత్తుడైన యోగి,

మనస్సును ఉన్నతాత్మయందు స్థాపించి, ఏమియు చింతింపరాదు (6-24,25) ఎపుడెపుడు మనస్సు బైటకి పోవునో, అపుడపుడు దానిని నియమించి, ఆత్మయందే వశములోనికి దేవలెను (6-26). "ఇట్లు రజః కల్మషవిముక్తుడై, యోగి సదా యోగము నభ్యసించుచు, అక్షయానందరూపమగు బ్రహ్మసంస్పర్శను అనాయాసముగా ననుభవించును"(6-28).

14. నిర్వాణమునందు 'యు క్త' కర్మలు

అయినను ఈ యోగఫలము, యోగిజీవించి యున్నంతవఱకు కర్మను, ఇతరులతో సంబంధములను అసంభవము గావించు నిర్వాణము గాదు, కాని అదియే కావలయునని ప్రథమదృష్టి కనిపించును. కారణము, కామము, ఆవేగ ములు, ప్రశమించినపుడు, మనోవ్యాపారమునకనుమతియే లేనపుడు, ఈ ఏకాంత యోగమే నియమమైనపుడు, తదితరక్రియ , ప్రపంచసంబంధము ఎట్టులిక సంభవ మగును? సందేహము లేదు, కొంతకాల మింకను యోగి శరీరమునం దుండును; కాని గుహ, అరణ్యము, పర్వతశిఖరము మాత్రమే అతని కిపుడు అర్హతమ నివాస స్థానముగా గన్పించును, మఱియు సమాధితలయమే అతని ఏకమాత్రసుఖము గాను, వృత్తిగాను దోచును. కాని ముందు గుర్తించవలసిన దేమన, ఈ ఏకాంత యోగము నభ్యసించునపుడు, గీత తదితరకర్మసన్యాసమును బోధించదు. నిద్రాహారములు, కర్మవిహారము ఎక్కువ సేవించువారికివలెనే, తక్కువ సేవించు వారికిని ఈ యోగము పనిచేయదు; నిద్ర, మెలకువ, ఆహారము, విహారము, కర్మ ప్రయత్నము - అన్నియు 'యుక్తముగా' (6-17) నుండవలయును. సాధారణముగా 'యుక్త మున' కర్థము మితము, నియతము నని చెప్పుదురు, మఱియు నిచ్చట అదియే దాని భావమును గావచ్చును, కాని ఏది ఏమైనను, యోగము సిద్ధించి నపుడు మాత్రము ఆహారము లన్నియు మఱియొక అర్థమున 'యుక్తముగా' నుండవలెను; ఈ అర్థమే ఇతరత్ర సర్వత్రను గీతార్థము, ఈ అర్థ మేమి యన, ఆహారవిహారములందును, కర్మలయందును- సర్వావస్థల యందును - యోగి భగవంతునితో యుక్తుడై యుండును; భగవంతుడే ఆత్మ, సర్వప్రపంచము, స్వీయజీవనమును, భగవంతుడే, కర్మను ధరించి, లోపల భరించువాడు భగవంతుడే యను చేతనయందు యోగిచేత సర్వము చేయబడును, కామాహంకారములు, వైయక్తిక బుద్ధి సంకల్పములు నిమ్నప్రకృతియందు మాత్రమే కర్మహేతువు లగును. అహంకారము పోయి, యోగి బ్రహ్మ మైనపుడు, అతడు విశ్వగత, విశ్వాతీతచై

తన్యమున నివసించుచు, తద్రూపమున సైతము నుండు నపుడు, కర్మ సహజముగా దానినుంచి వెలువడును, మన శ్చింతనకు పై నుండు జ్యోతిర్మయజ్ఞానము దానినుంచి వెలువడును,వ్యక్తిగతేచ్ఛ కంటెను ప్రబలతర శక్తి దాని నుంచి వెలువడును. ఆశక్తియే యోగికితన కర్మలను జేసి పెట్టుచు,ఫలములను సమకూర్చును; వ్యక్తి గత కర్మ అంతమొందినది, సర్వము బ్రహ్మములోనికి స్వీకరింపబడి, భగవంతునిచేత ధరించబడినది- "మయి సన్యస్య కర్మాణి" (3-30).

15. దివ్యకర్మయే పరిపూర్ణ నిర్వాణఫలము

దీనిని గీతయే చెప్పును; ఆత్మసాక్షాత్కారస్వరూపమును, యోగఫలిత మును- "యోగక్షేమం వహామ్యహం" (9-22) - వర్ణించునపుడు, గీత ఆ సాక్షాత్కారమున విశ్వభావమును ఇముడ్చును, అయితే ఇది నూతన జ్ఞానభూమికకు ఉద్ధరించబడిన విశ్వభావము; "తన ఆత్మ యోగమునం దున్నపుడు, మానవుడు ఆత్మను సర్వభూతము లందును, ఆత్మయందు సర్వభూతములను గాంచును, అతడు అన్నింటిని సమదృష్టితో జూచును." (6-29). తాను జూచున దంతయు అతనికి ఏకాత్మయు, తన యాత్మయు నగును, అంతయు భగవంతు డగును. కానీ క్షరముయొక్క వికారములం దతడు ఏమాత్రము వసించినను,ఈ కఠినయోగము యొక్క ఫలితము లన్నింటిని పోగొట్టుకొను ప్రమాద ముండదా? అతడు ఆత్మను గోల్పోయి, తిరిగి మనస్సులోనికి పడిపోడా? భగవంతు డతనిని గోల్పోగా, ప్రపంచ మతనిని పొందదా, అతడు భగవంతుని గోల్పోగా, భగవంతుని స్థానమున అహంకారమును, నిమ్నప్రకృతి అతనియందు ప్రవేశింపవా? లేదు- అని గీత చెప్పును; " ఎవడు నన్ను సర్వత్ర చూచునో, నాయందు సర్వమును జూచునో, న న్నతడు గోల్పోడు, నే నతనిని గోల్పోను." (6-30). ఏలన ఈ నిర్వాణశాంతి అక్షరముద్వారా ప్రాప్తమైనను , అది పురుషోత్తముని సత్త యందు ప్రతిష్ఠితము - "మత్సంస్థాం" (6-15) మఱియు నా శాంతియు భగవంతునివలె, బ్రహ్మమువలె, ప్రాణిప్రపంచమునందును విస్తరించి యుండును; ప్రపంచాతీత మయ్యును, తన అతీతత యందే బద్ధము గాదు. యోగి సర్వ వస్తువులను భగవంతునిగానే చూచుచు, ఆ చూపునందే నివసించవలెను, కర్మ చేయవలెను; ఇదియే యోగముయొక్క పరిపూర్ణఫలము.

16. భగవత్ప్రేమయే యోగిధర్మము

కాని ఎందుకు కర్మ చేయవలెను? ఏకాంతనిష్ఠుడై , ఇచ్ఛపొడమిన, దూరము నుండి ప్రపంచమును బ్రహ్మయందు, భగవంతునియందు జూచుచు, దానిలో

పాల్గొనక, చరించక, నివసించక, దానిలో కర్మచేయుచు నుండక, అంతఃసమాధి యందే నివసించుట క్షేమతరము గాదా? అదియే అత్యున్నత ఆధ్యాత్మికస్థితియొక్క నియమము, విధి, ధర్మము గావలదా? మఱల కాదు; ఏలన భగవంతునియందు నివసించుట, భగవంతుని ప్రేమించుట, సర్వప్రాణులతో ఏకముగా నుండుట - ఇది గాక, విముక్త యోగికి మఱే ధర్మమును లేదు. అతని విముక్తి నిరపేక్షము, సాపేక్షముగాదు; అది స్వయంసిద్ధము, ఇక నది ఏ ఆచారనియమము, ఏ జీవన ధర్మము, లేక ఎట్టి పరిమితిపైనను ఆధారపడదు. ఇపు డతడు శాశ్వతముగా యోగమునం దున్నాడు గాన, ఏ ప్రక్రియయు అతనికి అవశ్యకము గాదు. "ఏకత్వము నవలంబించి, సర్వభూతములందును నన్ను ప్రేమించు యోగి, ఏ ప్రకారమున నివసించుచున్నను, కర్మచేయుచున్నను, నాయందే నివసించును, కర్మచేయును" (6-31). ఆధ్యాత్మికము గావించబడి, ఇంద్రియానుభవమునండి ఆత్మానుభవము లోనికి మాఱిన ప్రపంచప్రేమ భగవత్ప్రేమపై ప్రతిష్ఠితమగును, మఱియు నీ ప్రేమ యందు ఎట్టి అపాయము గాని, లోపము గాని యుండదు. ప్రపంచముపట్ల భయము, మఱియు జుగుప్స నిమ్నప్రకృతినుండి విముఖమగుటకు తఱచుగా ఆవశ్యకము గావచ్చును; ఏలన నిజాని కవి, ప్రపంచమునందు ప్రతిబింబించుకొనుచున్న మన అహంకారము పట్ల ఉత్పన్నమగు భయము మఱియు జుగుప్సయే. ప్రపం చమునందు భగవంతుని చూచుట యన దేనికి భయపడక, భగవత్సత్త యందు సర్వమును ఆలింగనముచేసికొనుటయే యగును; ఇక సర్వమును భగవంతునిగా జూచుట యన, దేనిని ద్వేషించక, ఏవగించుకొనక, ప్రపంచమునందు భగవంతుని, భగవంతునియందు ప్రపంచమును ప్రేమించుటయే యగును.

17. నిమ్న ప్రకృతియు యోగికౌగిలిలోనిదే

కాని కనీసము నిమ్నప్రకృతివిషయముల నైనను యోగి విడిచివేయును? వానిని ఉత్తరించుటకు అతడెంతో శ్రమించెను గదా? ఇదియును గాదు; ఆత్మ దృష్టిసమత యందు సర్వము సమాలింగితమగును, "ఎవడు, ఓ అర్జునా, సుఖ మైనను దుఃఖ మైనను సమదృష్టితో ఆత్మరూపమున జూచునో, అతడు పరమయోగి యని నా మతము" (6-32). దుఃఖరహిత ఆధ్యాత్మికానందమునుండి పడిపోయి, ఇతరుల శోకమునందు సైతము అతడు అసుఖము ననుభవించు నని ఈ శ్లోకార్థము గాదు; తాను అతిక్రమించిన ద్వంద్వక్రీడ నితరులయందు జూచుచు, అతడింకను సర్వమును తానుగనే , తన ఆత్మయందే చూచును, కాని వాని బాహ్యాభాసముచేత చలించడు,

భ్రమించడు; సర్వభూతహితము నాచరించుటకే వానిచేత ప్రేరితుడుగును; ఇట్లు భగవన్ముఖముగా ప్రపంచ ప్రగతినిమిత్తము కర్మచేయుచు, తనకు భువిపై రోజులున్నంతవఱకు అతడు దివ్యజీవనమును గడుపును. ఇట్లు స్వస్థితినుండి చ్యుతుడు గాకయే, మాయా ప్రపంచములోని జీవులలో భగవంతుని గాంచుచు, వాని నుద్ధరింప ప్రవర్తించు భగవత్ప్రియుడు పరమయోగి యని ప్రకటించిన, నది ఉచితమే యగును.

18. భక్తి యోగమునకు పరాకాష్ఠ

ఎప్పటివలె ఇచ్చటను గీత భక్తిని యోగపరాకాష్ఠగా చూపును– "సర్వ భూతస్థితం యో మాం భజతి ఏకత్వ మాస్థితః" (6–31); ఇదియే గీతాబోధన యొక్క సారసంగ్రహ మని చెప్పవచ్చును - తన ఆత్మ దివ్యఏకతపై ప్రతిష్ఠితము కాగా, ఎవడు అందరియందును భగవంతుని ప్రేమించునో, అత డెట్లు జీవించినను, వ ర్తించినను, భగవంతుని యందే జీవించును. ఈ అర్థమునే మఱింత ఒత్తి చెప్పుటకు, అర్జునుని అవాంతర ప్రశ్నలకు సమాధానము చెప్పిన పిమ్మట, అధ్యాయముయొక్క చరమశ్లోకమును దీనికే వెచ్చించును, "యోగి తపస్వుల కంటె నధికుడు , జ్ఞానులకంటె నధికుడు, కర్ములకంటె నధికుడు; కావున, ఓ అర్జునా, యోగివి గమ్ము" (6–46). ఈ యోగి కర్మ ద్వారా, జ్ఞానముద్వారా, తపస్యద్వారా లేక తదితర మార్గమున ఆధ్యాత్మిక జ్ఞానమును, శ క్తిని, లేక తదితర మును కేవలము భగవంతునితో సాయుజ్యము నిమిత్తమే అన్వేషించునుగాని, వానికొఱకు మాత్రమే వానినన్వేషించడు. ఏలన ఆ సాయుజ్యమునందు తదితరము సర్వము నిమిడియుండును. మఱియు సర్వము తనకు పైన ఒక దివ్యతమ పరమార్థమున కుద్ధరించబడును. కాని యోగులయందు సైతము సర్వోత్తముడు భక్తుడు: " యోగు లందరియందును ఎవడు నాకు సమర్పించబడిన తన సర్వాంతరాత్మతో నాయందు ప్రేమయు, శ్రద్ధయు గల్గి యుండునో, అతడు నాతో యోగమున యుక్తతము దని తలంతును" (6–47). ఇదియే మొదటి ఆఱు అధ్యాయముల సమాపక వచనము; మఱియు దీనియందే తక్కినదాని బీజ మున్నది, ఏది ఇంత దనుక చెప్పబడలేదో, కనీసము పూర్తిగా చెప్పబడలేదో, దాని బీజ మున్నది, ఏలన అది ఎప్పుడును ఒక గుహ్యాము మఱియు రహస్యమే యగును, అటులే మిగిలిపోవును– అత్యున్నత ఆధ్యాత్మిక గుహ్యాము (15–20) మఱియు దివ్యరహస్యము.

24. కర్మయోగ సారము

1. కర్మయోగ మొక విభాగము

మొదటి ఆరుఅధ్యాయములు గీతాభోధనయొక్క ఒక ప్రాధమిక విభాగ మగును, ఇచ్చట సూచనామాత్రముగా వచ్చిన కొన్ని ప్రధానాంశముల విపులీకరణమే తక్కిన పండ్రెండు అధ్యాయములును; ఆ అంశము లంత ప్రధానము గను కనే, తక్కిన రెండు విభాగములలో అవి ప్రత్యేకముగా చర్చించబడును. గీత లిఖితమగు ఒక మహాశాస్త్రము, కావుననే దానిని చివరివఱకు సాగించవలెను. కాక అది ఒక సజీవగురువు వాస్తవముగా శిష్యునికి చేసిన ఉపదేశమే యగుచో, ఆఱవ అధ్యాయాంతరమున దాని నాపి, గురు విట్లు శిష్యునికి చెప్పియుండునని మన మూహించుకొనవచ్చును : "దీని నాచరించుము, దీనిని సాధించుటకే నీ వెంతో చేయవలసియున్నది. నీకు లభించిన ఆధారము సాధ్యమైనంత విశాలమైనది; చిక్కులు తల యెత్తుచు, స్వయముగనే విడిపోవును. లేదా నేను విడదీసెదను. కాని ప్రస్తుతానికి నా ఉపదేశమును జీవింపుము; ఈ దృష్టితో ప్రవృత్తుడవు గమ్ము". నిజమే, ఇచ్చటి కొన్ని విషయములు తర్వాతి ప్రసంగముయొక్క ప్రకాశము తమపై పడి ననేగాని, సరిగా విశదముగావు. ప్రథమషట్కమునందలి కొన్ని కఠినతలను, అపోహలను దొలగించుటకు తర్వాతి షట్కములలోని అనేక విషయములను, ఉదాహరణకు, పురుషోత్తమభావనను, నాకే ముందుగా ప్రస్తావించవలసి వచ్చెను. మఱల మఱల పరామర్శించవలసి వచ్చెను. అట్లు చేయనిచో, ఆత్మ, కర్మ, మఱియు కర్మప్రభువును గుఱించిన కొన్ని అస్పష్టతలను స్పష్టముచేయలేక యుండెడివాడను. కాని ఈ అస్పష్టతలను బుద్ధిపూర్వకముగానే గీత ఉండిపోనిచ్చుటకు గారణము, అర్హత లేని శిష్యునకు పురుషోత్తమాది విషయములను ముందుగనే వివరించినచో, అతని ప్రాథమికసాధన దృఢపడు నవకాశ ముండదు.

2. అర్జునుని సంభావ్య ప్రశ్నములు

దివ్యగురువు తన ప్రసంగము నిచట నిలిపివేయుచో, అర్జునుడే ఇట్లాక్షేపించును: "కామ, సంగముల వినాశమును గుఱించియు, సమతను గుఱించియు, ప్రశాంత నిరహంకార కర్మను గుఱించియు, కర్మయజ్ఞమును గుఱించియు, బాహ్యముకంటే అపేక్షణీయ మగు ఆంతర సన్యాసమును గుఱించియు, కృష్ణా, నీవు ప్రసంగించి

యున్నావు, మఱియు అవి ఆచరణయం దెంత కష్టముగా గన్పించినను, బౌద్ధికముగా వాని నర్థము చేసికొన్నాను. కాని కర్మచేయుచునే గుణములపై కెగయుటను గుఱించియు భాషించితివి (2-45); అయితే గుణములు పనిచేయు వివరములను వెల్లడించ లేదు, అవి తెలిసిననే గాని, వానిని గుర్తించి, అతిక్రమించుట సాధ్యము గాదు, ఇంకను భక్తియే యోగమునందలి ఉత్తమాంశ మని పలికియు, జ్ఞానకర్మలనే విస్తారముగా వర్ణించితివి గాని, భక్తిని గుఱించి పలికినది స్వల్పములేక శూన్యము. మఱియు నీ మహత్తర భక్తిని ఎవరి కర్పించవలెను? నిశ్చయముగా నిశ్చల, నిర్వ్యక్తిక ఆత్మకు గాక, పరమేశ్వరుడవగు నీకే యగును. కావున నీ వెవరివో తెలుపుము- భక్తి ఈ ఆత్మజ్ఞానముకంటె నధికమై నట్లే, నీవు అక్షరాత్మకంటే నధికుడవు; మఱియు జ్ఞానము కర్మకంటె నధికమైనట్లే, ఈ అక్షరాత్మ క్షర ప్రకృతి మఱియు క్రియా ప్రపంచము కంటే నధికము. కర్మ, జ్ఞానము మఱియు దివ్యప్రేమల సంబంధమేమిటి? ప్రకృతియందలి క్షరాత్మకు, అక్షరాత్మకు, ఈ రెండును ఏకకాలమున అగు పరమేశ్వరునకు సంబంధమేమిటి? ఈ మహాసంగ్రామమున నాకు సారథిగా పనిచేయుచున్న ఈ పరమేశ్వరు డెవరు?" ఈ ప్రశ్నల సమాధానమునకే గీతాశేష మంతయు వ్రాయబడినది మఱియు సంపూర్ణ బౌద్ధిక పరిష్కారము నిమిత్తము , వానిని వెంటనే చర్చించి, పరిష్కరించవలెను. పోగా వాస్తవమునందు దశలవారీగా పురోగమించుచు, అనేక ముఖ్యవిషయములనే విడిచివేతుము;అవి తర్వాత మనము సాధించిన ఆధ్యాత్మికానుభవ ప్రకాశమున తలయెత్తి, స్వయముగానే పరిష్కరింప బడును. గీత కొంతవఱకు అ అనుభవ మార్గమునే అనుసరించును. గీత ముందు కర్మజ్ఞానముల విశాలప్రాతిపదిక నేర్పఱచగా, అందులోని ఒక అంశము భక్తి దిశగా సాధకుని నడుపును. ప్రథమ షట్కము ఈ ప్రాతిపదికనే మనముందుంచును.

3. మానసిక పరిష్కారము తాత్కాలికము

ఈ ప్రథమ షట్కము గీతయొక్క మూలసమస్య నెంతవఱకు పరిష్కరించినదో, ఇచ్చట నించు కాగి సమీక్షించదగును. సృష్టిస్వరూపమునే విచారించవలసి నట్టియు, సామాన్యజీవనస్థానమున ఆధ్యాత్మికజీవనమును స్థాపించవలసినట్టియు సంపూర్ణ ప్రశ్నమునకు గీతాసమస్య స్వయముగా దారితీయ నవసరములేదు- అని గుర్తు చేసుకొనుటకు ఉపయుక్తమగును. వ్యావహారిక లేక నైతిక ప్రాతిపదికమీద గాని,

బౌద్ధిక లేక ఆదర్శాత్మక దృక్కోణమునుంచి గాని, ఆ సమస్యను పరిష్కరించి యుండవచ్చును; మన ఆధునికపద్ధతి అటులే చేసియుండును. ఆ సమస్య స్వయముగా మున్ముందు లేవనెత్తు ప్రశ్నమిదియే: చంపుట వైయక్తికపాపమను నైతికభావన, మఱియు చంపుట తన సార్వజనిక, సామాజిక విధియను భావన–ఇదియు నైతికమే: వీనిలో నే భావన అర్జునునిపై ప్రాబల్యము వహించ వలెను? ఉదాత్తహృదయులందరు అత్యాచారమునకు తలపడు సాయుధశక్తులను సంగ్రామమున ఎదిరించవలసినదే యని క్షాత్రవృత్తిని బలపఱతురు. ఈ ప్రశ్న మన కాలమునందే తలె యెత్తినది, మఱియు మన మిపుడు దానిని పరిష్కరించుచున్నటులే, అనేకపరిష్కారములలో నేదియో యొకదాని చేత నది పరిష్కరించబడగలదు. కాని ఆ పరిష్కారము లన్నియు సాధారణ మానవమానసముయొక్క దృక్కోణమునుండి వెలువడునవే :ఉదాహరణకు, వైయకిక్త వివేకబుద్ధికిని, సామాజిక విధికిని మధ్య పొడసూపు ప్రశ్నగాను, లేక ఆదర్శనీతికిని, వ్యవహారనీతికిని నడుమలేచు ప్రశ్నగాను వీనిని పరిష్కరించవచ్చును. కాని ఇవి యన్నియు బౌద్ధిక,భావిక, స్వభావాను రూప పరిష్కారములే; అవి వైయక్తికదృక్కోణము నాశ్రయించియుండును. కావున అవి మనకు మన వికాశదశను బట్టి అనురూపమైన పరిష్కారములు. వీనిలో నేదియు చరమపరిష్కారమునకు దారితీయదు. కారణము, అది సాధారణమానసము నుండి ప్రభవించును, మఱియు నీ మానసము సదా మన సత్తయందలి నానాప్రవృత్తులయొక్క సంకులము (చిక్కు) గా నుండును. కావున మానసికపరిష్కారము వీనిలో నొకదాని నెన్నుకొనును లేక వానిమధ్య నొక రాజీ కుదుర్చును– మన బుద్ధి, మన నైతికసత్త, మన సక్రియప్రకృతి, మన సహజప్రవృత్తులు, మన భావికసత్త, మఱియు మనము అంతరాత్మస్ఫురణలు – అని పిలుచు విరళ వృత్తులు : వీనిలో నొక ప్రవృత్తి నెన్నుకొనును లేక వానికి రాజీ కుదుర్చును. మానసిక దృక్కోణమునుంచి తాత్కాలిక, వ్యావహారిక పరిష్కారమే గాని , శాశ్వత పరిష్కార ముండజాలదని గీత గుర్తించును; మఱియు అర్జునునకు వ్యావహారిక పరిష్కారముగా అతని యుగములోని ఉత్తమ ధర్మమగు స్వధర్మమును బోధించును (2-31). కాని దానిని స్వీకరించు మనస్తత్వములో అర్జునుడు లేడు. స్వీకరించవలెనని స్పష్టముగానే గీతా ఉద్దేశ్యమునుగాదు. అపుడు గీత మిక్కిలి భిన్నమగు మఱియొక దృక్కోణమునుండి, ఎంతో వేఱగు మఱియొక సమాధానము నివ్వసాగును.

4. గీతాపరిష్కారము ఆధ్యాత్మిక పరిష్కారము

మన ప్రాకృతసత్తకును, సాధారణమనస్సునకును పైన, మన బౌద్ధిక మఱియు నైతికభ్రమజాలమునకు పైన వర్తించు మఱియొక చేతనలోని కారోహించుటయే గీతాపరిష్కా ము– ఈ చేతనయొక్క సత్తాధర్మము వేఱు, కావున, కర్మ దృక్కోణమును వేఱు. ఈ చేతననిక వైయక్తిక కామములు, భావావేగములుశాసించవు; దీనినుండి ద్వంద్వములు పడిపోవును; ఇచ్చటిక కర్మ మనది గాదు గావున, వైయక్తిక పుణ్యపాపభావము అతిక్రమించబడును; ఇచ్చట విశ్వగత, నిర్వ్యక్తిక దివ్యసత్త మనద్వారా ప్రపంచమునందలి తన ప్రయోజనమును సాధించుకొనును; ఇచ్చట మనము స్వయముగా ఆ సత్త యొక్క సత్తలోనికి, ఆ చేతన యొక్క చేతనలోనికి, ఆ శక్తియొక్క శక్తిలోనికి, ఆ ఆనందముయొక్క ఆనందములోనికి ఒక నవ్య, దివ్యజన్మద్వారా మాఱిపోదుము, మఱియు నిక మన నిమ్న ప్రకృతిలో నివసించము గాన మన కిచట చేయదగిన స్వీయకర్మ లుండవు, అనుసంధింపదగు స్వీయలక్ష్య ముండదు, కాని ఒకవేళ మనము కర్మచేతు మేని – ఇదియే తేల్చలసిన వాస్తవసమస్యయు, కఠినతయు – దివ్యకర్మలను మాత్రమే చేతుము; ఈ కర్మలకు మన బాహ్యప్రకృతి ఒక తటస్థకరణము మాత్రమే యగునుగాని, వానికి కారణమును గాదు, ప్రేరణమును సమకూర్చదు; ఏలన ప్రేరణశక్తి పైన కర్మాధీశ్వరుని ఇచ్ఛ యందుండును, మఱియు గీత దీనినే సత్యపరిష్కారముగా మనముందుంచును; ఏలన అది మన సత్తయొక్కవాస్తవ సత్యము నాశ్రయించిన పరష్కారము, మరియు మనసత్తయొక్క వాస్తవసత్యము ననుసరించి జీవించుటయే మన జీవనసమస్యలకు ఉత్తమపరిష్కారము, సర్వథా సత్యమగు ఏకైక పరిష్కారము నగును. మన మానసిక, ప్రాణిక వ్యక్తిత్వము మన ప్రాకృత జీవనముయొక్క సత్యమే గాని, అజ్ఞానసత్యము ; కావున దాని నాశ్రయించిన దంతయు నదే కోవకు జెందిన సత్యమగును; అది అజ్ఞానకర్మల పట్ల వ్యావహారికముగా పనికివచ్చును గాని, మన సత్త యొక్క వాస్తవ సత్యమును తిరిగి చేరి నపుడది పనికిరాదు. కాని ఇదియే సత్య మని నిశ్చయమెట్లు కలుగును? మన సాధారణమానసికానుభవముతో తృప్తిపడి యున్నంతదనుక కలుగదు, ఈ మహత్తరసత్యమును జీవించుటచేతనే యెఱుంగగలము, అనగా మానసికమును దాటి ఆధ్యాత్మికానుభవములో ప్రవేశించుటచేతనే–యోగముచేతనే–ఎఱుంగగలము. కారణము, యోగ మన ఫలితార్థము, మనస్సుగా నుండుట చాలించి ఆత్మయగు వఱకు ఆధ్యాత్మికానుభవమును బాహ్యజీవనమున జీవించుటయే.

5. కర్మద్వారా దివ్యజన్మ కర్మయోగము

మన సత్తాకేంద్రమును క్రిందినుంచి పై కెత్తుదుము, దానివలన మన సంపూర్ణ జీవనము, చేతన, రూపాంతరము నందును, దీని ఫలితముగా, కర్మ బాహ్యరూపమున యధాపూర్వకముగనే యున్నను, దాని సమస్తభావమునందును, ప్రేరణయందును మార్పువచ్చును: ఇదియే గీతాకర్మయోగ సారము, నీ సత్తను మార్చుము, ఆత్మలోనికి తిరిగి జన్మించుము, ఆ నూతనజన్మచేత నీ యందలి పరమాత్మ నీకు నియోగించిన కర్మల నాచరింపుము; ఇదియే గీతాసందేశహృదయము. లేక మఱల, ఎక్కువ గంభీరము ఆధ్మాత్మికమునగు ఆశయముతో నిట్లు చెప్పవచ్చును – నీవు చేయవలసిన కర్మను అంతర ఆధ్యాత్మికజన్మకు, నీ సాధనము గావించు కొనుము, మరియునట్లు దివ్యజన్మనంది, లోక సంగ్రహార్ధము భగవదుపకరణముగా దివ్య కర్మల నింకను చేయుచునే యుండుము. దీనినుండి రెండు విషయములను మనము గ్రహించవలెను. – 1 ఊర్ధ్వగమనమునకు, దివ్యజన్మకు మార్గము, 2. కర్మస్వరూపము, అధవా కర్మభావము, ఏలన కర్మ బాహ్యరూప మే మాత్రము మాఱనవసరములేదు. కాని ఈ రెండును కార్యతః ఒకటియే, ఏలన ఒకదానిలో వచ్చిన మార్పు రెండవ దానిలో గన్పించును. ఎట్లన, మన కర్మభావము మన సత్తాస్వరూపమును బట్టియు, దాని అంతరాధారమును బట్టియు నేర్పడును; అటులే మనసత్తా స్వరూపమును మన కర్మగతిచేతను, దాని ఆధ్యాత్మికప్రభావముచేతను మాఱును; మన కర్మభావములో పెద్దమార్పు వచ్చునేని, అది మన సత్తాస్వరూపమును, తాను ఆశ్రయించిన ఆధారమును మార్చివేయును; అది మన మే చేతనశక్తి కేంద్రము నుండి కర్మచేతుమో, ఆ కేంద్రమును స్థానాంతరమునకు మార్చును. కొందరు వాదించునట్లు కర్మ మిధ్యామాత్ర మగుచో, ఆత్మకు కర్మతో గాని, జీవనముతో గాని ఎట్టి సంబంధము లేనిచో, ఇది ఇట్లు గాజాలదు; కాని మనలోని అంతరాత్మ జీవనకర్మలచేత తనను వికసింపజేసి కొనును, మఱియు కేవలకర్మకంటె, ఆ కర్మవెనుక నున్న అంతరాత్మ భావము ఏకాత్మతో దాని సంబంధముల నెక్కువగా నిర్ణయించును. నిజానికిదియే ఉచ్చతర ఆత్మసాక్షా త్కారానికి ఒక ఆచరణాత్మకసాధనముగా కర్మయెగమునకు గల యోగ్యత.

6. ఇప్పటి జీవనమే మానవుని సర్వాస్తిత్వము గాదు

ఇప్పటి మానవ జీవనము దాదాపు అతని ప్రాణిక, భౌతిక ప్రకృతిపై నాధార పడియున్నది, పరిమితమగు మనఃశక్తివ్యాపారముచేత ఇంచుక దానిపై కెత్తబడును;

కనుక నది అతని సంభవా స్తిత్వముయొక్క సర్వమునుగాదు ఇప్పటికి వాస్తవాస్తిత్వము యొక్క సర్వము సైతముగాదు - ఈ ఆధారమునుండియే మన చర్చ ప్రారంభించును. మానవుని లోపల నిగూఢాత్మ గలదు, అతని ప్రస్తుతప్రకృతి దాని బాహ్యాభాసము లేక దాని ఆంశిక సక్రియపరిణామము, గీత దాని సక్రియ వాస్తవికత నామోదించును, లేనిచో కర్మల వేరును నఱికివేసి నట్లగును, తన దార్శనిక విచారణయందలి ఈ తత్త్వమును ప్రతిపాదించుటకు గీత పురుషప్రకృతులకు గల సాంఖ్య విభేదము నంగీకరించును. ఏ శక్తి తెలిసికొనునో, ధరించునో, చేతనీకరించునో, ఆ జ్ఞానశక్తి పురుషుడు; కాగా నే శక్తికర్మ చేయునో, లీల నెరుపునో, బహువిధ ఉపకరణములను, సాధనములను ప్రక్రియలను సమకూర్చునో, ఆ కర్మ శక్తి ప్రకృతి, కాగా గీతా, సాంఖ్యములకు గల భేద మంతయు నిదే: సాంఖ్యుల విముక్త , అక్షర పురుషుని తీసికొని, గీత అతనిని వేదాంతుల ఏకమాత్ర, సర్వగత అక్షరాత్మ లేక బ్రహ్మ మని పిలుచును, మఱియు నీ అక్షరాత్మ వేఱు, ప్రకృతి యందు లగ్నమై యుండు క్షరాత్మ వేఱు - అని చెప్పును(15-16); ఈ క్షరాత్మ మన వికార్య, సక్రియసత్త, వస్తువుల అనేకాత్మ, నానాత్వవ్యక్తిత్వములకు ప్రాతిపదికయు నగును. కాని దేనిచే ఈ ప్రకృతి క్రియ ఘటితమగును?

7. ప్రకృతి వికాసము ద్వారా ఆత్మదర్శనము

ప్రకృతి క్రియకు మూడు ప్రాథమికవిధములు లేక గుణములు గలవు, వీని సంకులఖేలనముచేత ప్రకృతిక్రియ (=ప్రక్రియ) ఘటిత మగును. ఇక నీ క్రియకు సాధనము? ప్రకృత్యుపకరణముల క్రమగతపరిణామముచేత సృజింపబడిన సంకీర్ణజీవన యంత్రాంగమే ఈ సాధనము. క్రమముగా ఈ ఉపకరణము లివి: బుద్ధి, అహంకారము, మనస్సు, ఇంద్రియములు, మఱియు పంచభూతములు; ఈ భూతములే ప్రకృతిరూపములకు ప్రాతిపదిక. ఇవి యన్నియు యాంత్రికములు, ఒక సంకీర్ణ ప్రకృతియంత్రము. ఆధునిక దృక్కోణము నుంచి, ఇవి యన్నియు జడశక్తియందు విలీనమైయుండి, ప్రకృతియందలి పురుషుడు ఆత్మజ్ఞానము నందు కొలది, క్రమముగా వికసించును. అయితే పైన పేర్కొనిన క్రమమునకు వ్యతిరేక క్రమమున - ముందు జడద్రవ్యము, పిమ్మట ఇంద్రియములు మనసు,బుద్ధి, చివరకు ఆధ్యాత్మిక చేతన.ముందు ప్రకృతిక్రియ యందే మునిగియుండు బుద్ధి తర్వాత క్రమముగా ప్రకృతిక్రియనుండి పురుషుని వేఱుచేసి చూపును. అపుడు ప్రకృతినుండి

విడిపించుకొనుటకు తన కవకాశము లభించగా, పురుషుడు తన మూల విముక్తిని, అక్షరాస్తిత్వమును తిరిగి చేరుకొనును. వేదాంతపరిభాషలో, జీవాత్మ ఆత్మను– సత్తను– చూచును; అపుడు ప్రకృతియొక్క ఉపకరణములతోను, క్రియలతోను, అనగా సత్తయొక్క సంభూతితో తాదాత్మ్యము జెంద విరమించును; అది సత్యాత్మతోను, సత్యసత్తతోను తాదాత్మ్యము జెంది, తన అక్షర, ఆధ్యాత్మిక స్వతఃసిద్ధాస్తిత్వమును తిరిగి పొందును. ఈ ఆధ్యాత్మిక స్వతఃసిద్ధాస్తిత్వము నుండియే అది స్వేచ్ఛగా తన సత్తయొక్క అధీశ్వరుడుగా తన సంభూతిక్రియను ధరించు నని గీత చెప్పును.

8. ప్రాకృతజీవనము × ఆధ్యాత్మిక జీవనము

ఈ దార్శనికవివేచనలకు ఆధారముగా నున్న మనో వైజ్ఞానిక సత్యములను వీక్షింతు మేని, మనము జీవించగల రెండు జీవనములున్నవని చెప్పవచ్చును– మనోవైజ్ఞానిక మఱియు జడవైజ్ఞానిక సత్యములను తర్కబద్ధముగా వ్యాఖ్యానించు నది మాత్రమే దర్శనశాస్త్రము. ప్రథమజీవనము తన సక్రియప్రకృతియొక్క క్రియాకలాపములో మునిగియుండు అంతరాత్మజీవనము, ఇచ్చట అంతరాత్మ తన మానసిక, భౌతిక ఉపకరణములతో తాదాత్మ్యము జెంది, వానికి పరిమితమై, తన వ్యక్తిత్వబద్ధమై, ప్రకృతి కధీనమై యుండును; ద్వితీయజీవనము ఆత్మజీవనము, ఈ ఆత్మ ఉపకరణాదులకంటె పరము (superior), విశాలము, విశ్వగతము, నిర్వ్యక్తికము, విముక్తము, అపరిమితము, అతీతము నై, తన ప్రాకృతసత్తను, క్రియను తన అనంత సమతచేత ధరించుచునే, తన విముక్తిచేతను, అనంతతచేతను వాని నతిక్రమించ వచ్చును, లేక మన అధికతర ఆధ్యాత్మికసత్తయందును జీవించవచ్చును. గీతాకర్మ యోగమునకు ప్రతిష్ఠయగు ప్రథమ మహాప్రభేద మిది.

9. అహంకారము వలన ప్రాకృతజీవనము

కావున ప్రశ్నయంతయు, పద్ధతి యంతయు మన ప్రస్తుత ప్రాకృతసత్త యొక్క పరిమితులనుండి అంతరాత్మను విడిపించుటను గుఱించియే, మన ప్రాకృతజీవనము నందలి ప్రథమ, ప్రధానసత్యము– వస్తువుల బాహ్యస్పర్శలకు మన మధీనులము. ఈ స్పర్శలు ఇంద్రియముల ద్వారా లోని మన ప్రాణమునకు ప్రత్యక్షమగును. అపుడు ప్రాణము తిరిగి తక్షణమే ఈ విషయములపైకి వచ్చి, వానిని పట్టుకొని, వానితో వ్యవహరించును– వానిని కామించి, వానియందు సక్తమై, ఫలములకు ప్రయత్నించును. ప్రాణము మాట ఇటులుండ, మనస్సును, తన ఆంతర సంవేదనలు,

ప్రతిక్రియలు, మున్నగు సమస్త వృత్తులయందును ఈ యింద్రియ క్రియనే అనుగమించును. చివరకు బుద్ధియు మనస్సుచేత లాగబడి, ఇంద్రియజీవనమునకే అంకితమగును, క్షణమాత్ర మేని ఆ జీవనమునుండి పైకిబోలేదు, దాని వలన మనలోపల జనించు మానసిక ఫలితములు మఱియు ప్రతిక్రియల పరిధిని దాటి వెలుపలికిని బోలేదు. దీనికి కారణము మనలోపలి అహంతత్త్వము: అహంతత్త్వము చేత మనపై ప్రకృతి నెరపు క్రియారాశిని బుద్ధి యితరులపై ప్రకృతి నెరపు క్రియారాశి నుండి వేఱుచేయగా, మనదని తలంచి దాని వెలుపలకు బోలేకయున్నాము. ప్రకృతి నహంకారము నెట్లు ప్రభావితముచేయునో, అహంకారము ప్రకృతిస్పర్శల కెట్లు సమాధాన మిచ్చునో – ఇదియే మనజీవనమున కర్థము. ఇంతకు మించి మనకేవియు తెలియదు, ఇంతకు మించి మన మేమియు గానట్లు కన్పించును. ఈ దశలో, మనస్సు, యిచ్ఛ, మఱియు భావిక, స్నాయవీయ (nervous) ప్రతిగ్రహ, ప్రతిక్రియల ఒక పృథగ్భూతరాశిగానే అంతరాత్మయు గన్పించును. మనము అహంకారమును విస్తృతపఱచి, కుటుంబముతో, దేశముతో, మానవాళితోసైతము తాదాత్మ్యము చెందవచ్చును, కాని యింకను అహంకారము ఈ వేషము లన్నింటిలోను మన క్రియామూలముగా నిలిచియుండును, కేవలము, బాహ్యావస్తువులతో ఈ విశాలతర వ్యవహారముచేత తన పృథక్సత్తనుండి అది విపులతరతృప్తిని బొందును.

10. ఆహంకారిక వ్యక్తిత్వము ప్రకృతిసృష్టియే

ఈ దశయందును మనయందు పనిచేయునది ప్రాకృతసత్తయొక్క ఇచ్ఛయే, ఈ సత్తతన వ్యక్తిత్వముయొక్క భిన్నరూపములను తృప్తిపఱచుటకు బాహ్య స్పర్శలను సహసా గ్రహించును; ఇట్టి విషయగ్రహణమునందలి యిచ్ఛ సదా కామావేగముల యిచ్ఛ యగును. కర్మ మఱియు కర్మఫలమునందలి ఆసక్తి రూపమగు యిచ్ఛ యగును. మనయందలి ప్రకృతీచ్ఛ యగును. అది మన స్వీయేచ్ఛ యని అందుము గాని, కాదు. ఏలన మన అహంకార వ్యక్తిత్వము ఒక ప్రకృతినిర్మాణము, కావున అది మన విముక్తాత్మ, మన స్వతంత్రసత్త కాదు. కాజాలదు. అంతయు ప్రకృతి గుణముల క్రియయే, అది తామసక్రియ గావచ్చును. అపుడు మనకు జడప్రాయ వ్యక్తిత్వ ముండును. అది పరిపాటిజీవనమునకు అధీనమై దానితోనే తృప్తిజెందును. విముక్తతర క్రియ మఱియు ప్రభుతల నిమిత్తమది యెట్టి ప్రబలప్రయత్నము చేయజాలదు, లేక ప్రకృతిక్రియ రాజసికక్రియ గావచ్చును. అపుడు మనకు అస్థిర సక్రియవ్యక్తిత్వ ముండును. అది ప్రకృతిపై బడి ఆమెను, తన అవసరములకు,

కామములకు, దాసిని జేసికొన ప్రయత్నించును; కాని పైకి కన్పించు తన ప్రభుత నిజానికి తన దాసత్వమే; ఏలన దాని కామములు ప్రకృతి కామములే, కావున ఆ కామాధీనులమై యున్నంతదనుక, మనకు విముక్తి యుండదు, లేక ప్రకృతిక్రియ సాత్త్వికక్రియ గావచ్చును. అపుడు మనకు ప్రబుద్ధ వ్యక్తిత్వ ముండును, అది హేతుయుక్తముగా జీవింప బ్రయత్నించును, లేక సత్య,శివ, సుందరముల ఒక అభీష్టాదర్శమును సాధింపజూచును, కాని యా హేతువింకను ప్రకృతి బాహ్య రూపముల కధీనము, మఱియు నీ ఆదర్శములు మన వ్యక్తిత్వము యొక్క మాఱుచునుండు రూపములే గాన, వానియందు మనకే శాశ్వత నియమము గాని, తృప్తిగాని లభించదు, ఈ దశయం దింకను అహంకారముద్వారా పరివర్తన చక్రముపై పరిభ్రమించుచు, మనలోపలను, సర్వములోపలను ఉన్న ఒక శ క్తికి విధేయులమే గాని, మన మా శక్తిమి గాము, కనీసము దానితో ఐక్యము మఱియు సంయోగము మనకులేవు, ఇంకను ముక్తిలేదు, వాస్తవ ప్రభుత లేదు.

11. విముక్తి సాధ్యమే

అయినను విముక్తి సాధ్యమే. దాని కొఱకు, ఇంద్రియములపై బాహ్య ప్రపంచముయొక్క క్రియనుండి వెనుకకు తగ్గి, మనము మనలోనికి బోవలయును, అనగా మనము లోపల నివసించుచు,ఇంద్రియములకు కళ్ళెము వేయవలెను, దేనినిమిత్తము ఇంద్రియములు తపించునో, అది లేకయే జీవించగల్గుటయు - ఇదియే యధార్థ ఆత్మజీవనముయొక్క ప్రధమనియమము, అపుడు మాత్రమే మనోవికారములకంటె భిన్నమగు ఒక ఆత్మగలదని గమనించ గలుగుదుము; ఈ ఆత్మ తన లోతులలో ఒకానొక స్వయంసిద్ధవస్తువు - స్వయం సిద్ధము, అక్షరము, ప్రశాంతము, ఆత్మవంతము, స్వరాట్టును అగును, బాహ్య ప్రకృతియొక్క వ్యగ్రధావనము దానిని స్పృశించదు, కాని కామ మున్నంత కాలము ఇట్లు చేయ జాలము. ఏలన కామము మన బాహ్యజీవనసారతత్త్వము, అది యింద్రియజీవనము నందు తృప్తి నందుచు, ఆవేగముల ఖేలనములో వినోదించును, కావున మన మీ కామమును వదిలించుకొనవలెను; అది వదిలినపుడు, దాని భావిక ఫలితములగు ఆవేగములును అడుగంటును. అపుడు నిశ్చలసమత ప్రాప్తించును, అపుడును మన మీ ప్రపంచమున నివసించుచు, కర్మ చేయవలెను గాన, మఱియు మన కర్మప్రకృతికి ఫలాపేక్ష యుండును గాన, ఆ ప్రకృతిని మార్చి, ఫలాపేక్ష లేక , మనము కర్మ చేయవలెను; లేనిచో, కామము, దాని ఫలితమగు ఆవేగములు నిలిచియే యుండును.

కాని మనలోని కర్మకర్తయొక్క ఈ స్వభావము నెట్లు మార్చగలము? అహంకారము నుండియు, వ్యక్తిత్వమునుండియు కర్మలను వేఱుచేసి, బుద్ధిద్వారా కర్మలు గుణఖేలనము మాత్రమే యని పసికట్టి, ఈ ఖేలనమునుండి మన అంతరాత్మను వేఱుచేసి, ఆ కర్మలను తమ వెనుక నిజముగా నున్న మహా శక్తికి వదిలివేయుటచేత కర్మకర్తయొక్క స్వభావమును మార్చగలము. ఈ మహాశక్తిమన వ్యక్తిత్వము గాదు, మనకంటెను అధికము, అది జగత్ప్రభుశక్తి, కాని మనస్సు ఈ వివేచన కవకాశ మివ్వదు; ఇంద్రియములవెంట పరుగువెట్టుచు, బుద్ధిని తనతో నీడ్చుకొని పోవుటయే మనః స్వభావము. కావున మనఃశమమును సాధింప నేర్చుకొనవలెను; ఏ పరిపూర్ణ శాంతిశమములందు మనలోని ప్రశాంత, నిశ్చల, ఆనందమయ ఆత్మ మనకు వ్యక్తమగునో, ఆ శాంతిశమములను సాధించవలెను; ఈ శాంతాత్మ వస్తుస్పర్శలచే సదా అక్షతము , అస్పృష్టము, స్వయంపర్యాప్తము, మఱియు తనయందే నిత్యతృప్తము.

12. విముక్తియందు మన కర్మలు మనవి గావు

ఈ ఆత్మ మన స్వయంభూసత్త, ఇది మన వైయక్తికభావమునకు పరిమితము గాదు, సర్వభూతభావములందును సమానముగా నుండును (13-17). ఇది వ్యాపకము, అన్నింటిపట్ల సమము; ఇది తన అనంతతచేత విశ్వక్రియ నంతను ధరించును; ఇది సాంతవస్తువులచేత పరిమితముగానిది, ప్రకృతి మఱియు వ్యక్తిత్వములయొక్క మార్పుచేత మాఱనిది. ఈ ఆత్మమనలోపల పొడసూపి నపుడు, దాని శాంతిసమతలను మనమనుభవించినపుడు, మనము దానిలోనికి పెరుగుదుము. నిమ్న ప్రకృతియందలి లీనావస్థలోని అంతరాత్మస్థానమును కదిలించి, దానిని తిరిగి ఆత్మలోనికి ఉపసంహరించగలము. మనకు ప్రాపించిన శమము, సమత, నిస్తరంగ నిర్వ్యక్తికతల ప్రభావముచేత మన మిట్లు చేయగలము, ఏలన ఎంతెంత మనము వీనిలో వృద్ధినందుదుమో, వీనిని పూర్ణము గావింతుమో, మన సర్వప్రకృతిని వీని అధీనము చేతుమో, అంతంత శాంత, సమ, నిరావేగ, నిర్వ్యక్తిక , సర్వగత ఆత్మలోనికి పెరుగుదుము. అపుడు మన ఇంద్రియములు ఆత్మశమములోనికి పడిపోయి, ప్రపంచ స్పర్శలను పరమప్రశాంతితో స్వీకరించును; మన అహంకారము ఆత్మ నిర్వ్యక్తిక భావములో అంతరించిపోవును. మనయందే ఏ ఆత్మ మనమైనామో, ఆ ఆత్మయందే అన్ని వస్తువులను మనము చూతుము; మఱియు నీ ఆత్మను అన్నింటియందును జూతుము; మూలసత్తయగు నీ యాత్మయందు మన సత్త అన్నింటి సత్తతోను ఏకమగును. ఈ నిస్స్వార్థ ప్రశాంతియందును, నిర్వ్యక్తి కతయందును కర్మలను

చేయుటచేత, మన కర్మలు మనవి యగుట చాలించును. తమ ప్రతిక్రియలచేత మనల నిక బంధించవు. ప్రకృతియు, ఆమె గుణములును ఆమె కర్మజాలము నల్లును గాని, మన దుఃఖరహిత, స్వయంసిద్ధ ప్రశాంతిని స్పృశించజాలవు. అంతయును ఆ ఏక, సమ, సార్వత్రిక బ్రహ్మము లోనికి సమర్పించబడినది.

13. బ్రాహ్మిస్థితి × కర్మ

కాని ఇచ్చట రెండు శంక లుదయించును. 1. ప్రశాంత అక్షరాత్మకును, ప్రకృతి క్రియకును మధ్య విరోధమున్నట్లు గన్పించును. ఒకసారి అక్షరమగు ఆత్మభావమున మనము ప్రవేశించినపుడు, అసలు కర్మ ఎట్లు నిలుచును లేక ఎట్లు కొనసాగును, మన ప్రకృతిక్రియను సంభవము గావించు కర్మసంకల్పము దానిలో నెచ్చటున్నది? సాంఖ్యము ననుసరించి, సంకల్పము ఆత్మలోగాదు ప్రకృతిలో నున్నదని మనము చెప్పినచో, ఆ ప్రకృతి సంకల్పము వెనుక ఒక హేతువుండవలెను గదా, పురుషుని ప్రీతికొఱకు ప్రకృతి కర్మను సంకల్పించును , కాగా పురుషుడు ప్రకృతిలీలకు విముఖు డగు నేని, ప్రకృతి సంకల్పించుట కిక హేతువే మిగలదు, కాని గీత ఈ సిద్ధాంతము నామోదించదు; ఏలన నిది పురుషబహుత్వము నపేక్షించును. పురుషు లందరు ఏకమే యగుచో ఒకడు ముక్తి బొందిన అందరుముక్తి బొందవలసిన యగత్యమేర్పడును. అయితే గీత బహుత్వమునంగీకరించకయే, ఈ అగత్యము నిట్లు వారించును; సాంఖ్యము చెప్పునట్లు, ప్రకృతి ఒక పృథక్తత్త్వము గాదు. అది సృష్టిరూపములోనికి దిగునట్టి పరమపురుషుని శక్తియే , కాని ఈ పరమ పురుషుడు అక్షరాత్మ మాత్రమే యగుచో, మఱియు వ్యష్టిపురుషుడు అతనినుండి శక్తితోబాటు సృష్టిలోనికి దిగిన ఒక వస్తువే యగుచో, వ్యష్టిపురుషుడు తిరిగివచ్చి, ఆత్మయందు స్థితుడైన తక్షణమే, పరమఏకతయు, పరమశమమును తప్ప, కర్మాదిక మంతయు ఆగిపోవలెను. 2. ఏ అచింత్యరూపముననో ఒకవేళ కర్మఇంకను కొనసాగి నప్పటికి, ఆత్మ అన్నింటి పట్ల సమము గాన, ఏ కర్మ? – అనునది దానికి పట్టదు, అయినప్పుడు అత్యంత దారుణము, విపత్కరము నగు కర్మరూపముపై నింత పట్టెందుకు, ఈ రథము, ఈ యుద్ధము, ఈ యోధుడు, ఈ దివ్యసారథి ఎందుకు?

14. కర్మయోగము: మనద్వారా ఈశ్వరుని కర్మ

దీనికి గీతాసమాధాన మేమి యన, పరమపురుషుడు అక్షరాత్మకంటెను అధికుడు, సమగ్రతరుడు, ఏకకాలమున అక్షరాత్మయు, క్షరప్రకృతియందలి కర్మ

ప్రభువునగును. కాని అక్షరాత్మకు జెందునట్టి సనాతన శమసమతలతోను, కర్మ మఱియు వ్యక్తిత్వముల కందని అతీతస్థితినుండియు అతడు ప్రకృతికర్మలను నడుపును. ఈ స్థితి అతని సత్తాస్థితి – ప్రకృతి యందలి స్థితి గాదు– అని చెప్పవచ్చును; మఱియు ఈ స్థితిలోనికి పెరుగుటచేత మన మతని సత్తలోనికిని, దివ్య కర్మల సమస్థితిలోనికి పెరుగుదుము. అత డీ స్థితినుండియే ప్రకృతియందలి తన సత్తయొక్క సంకల్పము మఱియు శక్తిరూపమున ముందుకు వచ్చును. సర్వభూతములయందును తనను వ్యక్తముచేసుకొనును, ప్రపంచమున మానవరూపమున జన్మించును, సర్వమానవహృదయములోనికి దిగి నిలుచును, అవతారముగా– మానవునియందు దివ్యజన్మగా– తన నావిష్కరించుకొనును; మఱియు మానవుడతని సత్తలోనికి పెరిగినకొలది, ఈ దివ్యజన్మలోనికే పెరుగును, ఈ కర్మప్రభువునకు యజ్ఞముగానే కర్మ చేయబడవలెను, మఱియ ఆత్మలోనికి పెరుగుచు, మన సత్తయందతనితో మన ఏకతను గాంచవలెను. మఱియు మన వ్యక్తిత్వము ప్రకృతియందతని ఆంశిక అభివ్యక్తియే యని చూడవలెను. సత్తయం దతనితో ఏకమై, ప్రపంచమునందలి సర్వభూతములతోను క్రమముగా నేక మగుదుము, మఱియు దివ్యకర్మల జేతుము– మన కర్మయని కాక, లోకరక్షణము మఱియు లోకప్రగతి నిమిత్తము అతడు మనద్వారా చేయు కర్మయని దానిని చేతుము.

15. యోగస్థకర్మయే సమస్యామూలపరిష్కారము

ఇదియే చేయవలసిన ముఖ్యవిషయము. ఇక నిది యొకసారి చేయబడు నేని, అర్జునుని ఎదుర్కొనిన సమస్యలన్నియు అంతరిచును. ప్రశ్న ఇక మన వైయక్తిక క్రియకు సంబంధించిన ప్రశ్నగాదు; ఏలన మన వ్యక్తిత్వము కాలగతము, గౌణమునగు ప్రకృతినిర్మిత సత్యమే గాని, మన పరమసత్యము గాదు; కావున ప్రశ్న ప్రపంచము నందు మనద్వారా భగవదిచ్ఛ నిర్వహించు కార్యమునకు సంబంధించినదే యగును (– 'మనద్వారా' అనుటయే మన పరమసత్యమును దెలుపును). ఈ ప్రశ్న అర్థమగుటకు, పరమపురుషుడు స్వతః ఎట్టివాడో, ప్రకృతిస్థిత రూపమున నెట్టివాడో, ప్రకృతివ్యాపార మెట్టిదో, ఆ వ్యాపార గమ్య మేదియో మన మెఱుంగవలెను; మఱియు జ్ఞానసహిత భక్తి ఏ సంబంధమునకు పునాదియో, ప్రకృతియందలి క్షరాత్మకు, పరమాత్మకును గల ఆ ఘనిష్ఠ సంబంధమును దెలియవలెను. ఈ ప్రశ్నల విశదీకరణమే తక్కిన గీతాధ్యాయముల విషయమగును.

గీతా వ్యాసములు ప్రథమ భాగము సమాప్తము.

గీతా వ్యాసములు

రెండవ భాగము

1. కర్మ భక్తి జ్ఞాన సమన్వయము
2. పరమ రహస్యము

గీతా వ్యాసములు

1. [1]రెండు ప్రకృతులు

1. గీతయొక్క మొదటి ఆఱు అధ్యాయములు గీతాబోధనల ఒక ఘనిష్ఠ విభాగముగా వివరింపబడినవి; అవి గీతాసాధనకును, జ్ఞానమునకును ప్రాథమికాధార మగును. అటులే మిగిలిన పండ్రెండు అధ్యాయములను సన్నిహిత సంబంధము గల రెండు విభాగములుగా వివరించవచ్చును. ఇవి రెండును ఈ ప్రాథమికాధారముపై తక్కిన గీతాసిద్ధాంతమును బెంపొందించును. గీతయొక్క ప్రథమ [2]షట్క మెటుల కర్మజ్ఞానములకు సంబంధము కలిపి, వానిని సమన్వయపఱచెనో, అటులనే ద్వితీయ షట్కము దివ్యపురుషుని స్వరూపమును విశాల రూపమున తాత్త్వికముగా ప్రతిపాదించి, తదాధారముపై భక్తి జ్ఞానములకు సంబంధము కలిపి, వానిని సమన్వయపఱచును. వీని మధ్యను, 11-వ అధ్యాయమున విశ్వరూప దర్శనము వచ్చి, ఈ భక్తిజ్ఞాన సమన్వయమునకు ఒక సక్రియ రూప మిచ్చి, దానికి జీవనకర్మలతో సంబంధము గలుపును. ఇట్లు మఱల నంతయు అర్జునుని మూల ప్రశ్నమునకే వచ్చును (11-34), విచారణ యంతయు నీ ప్రశ్నమునే చుట్టి, ప్రదక్షిణమును బూర్తిసేయును. పిమ్మట తృతీయ షట్కమున గీత పురుష ప్రకృతులను వివేచించి చూపి, జ్ఞానసహితమగు నిష్కామకర్మ ఏ భక్తియందు పర్యవసించగా, జ్ఞానకర్మ ప్రేమలు మూడును ఏకమగునో, ఆ భక్తిని నిరూపించును (18-54): అటనుండి గీత తన పరమ చరమ వచనమున కెగసి, జీవితేశ్వరునకు ఆత్మ సమర్పణయే పరమ రహస్యమని ప్రతిపాదించును (18-66).

---

[1] గీత : అధ్యాయము 7, శ్లోకములు 1-14.

[2] షట్కము = ఆఱు అధ్యాయముల సమూహము.

2. ఈ ద్వితీయ భాగమునందు గీతాప్రతిపాదనము ఎక్కువ సంక్షిప్తము గాను, సుగమముగాను నుండును. ప్రథమ షట్కమునందు ఆధారసత్యమునకు కీలక మనదగు నిర్వచనము లింకనుచేయబడలేదు; కఠినతలు తలయెత్తినపుడు, అవి తాత్కాలికముగా పరిష్కరించబడును; ఇచ్చట ప్రగతి సూటిగా గాక, మఱుగుపడుచు, మెలికలు దిరుగుచు, క్లిష్టముగా సాగును; ఎంతయో, ఇంచుక సూచిత మగును గాని, దాని అభిప్రాయము స్పష్టముగాదు. అయితే ఈ ద్వితీయ భాగమున నిరూపణ ఎక్కువ సంక్షిప్తముగాను, నిర్దిష్టముగాను నుండును. కాని నిరూపణ సంక్షిప్తము గావుననే, మనము సావధానముగా సాగవలెను, లేనిచో దారి తప్పి, వాస్తవార్థమును తప్పిపోదుము. ఏలన మన మిచ్చట ఆధ్యాత్మికానుభవము యొక్క సురక్షిత క్షేత్రమున చరించక, ఆధ్యాత్మికము, మఱియు తఱచు విశ్వాతీతము నగు సత్యముయొక్క బౌద్ధిక ప్రతిపాదనలను విచారించవలసియుండును. దార్శనిక ప్రతిపాదన మనస్సు నిమిత్తము, ఏది నిజముగా అనంతమో, దానిని సాంతముగా నిర్వచించు ఒక ప్రయత్నము, కావుననే దానియం దెప్పుడును ప్రమాద ముండును; అట్టి ప్రతిపాదన చేయక తప్పదు గాని, అదెప్పటికిని మిక్కిలి తృప్తికరము, మిక్కిలి నిశ్చితము గాజాలదు, దాని కంతిమరూప మనునది యుండదు. సర్వోన్నత సత్యమును జీవించగలము, దర్శించగలము, కాని పాక్షికముగా మాత్రమే భాషించగలము. అయినను ఇవ్విషయమున ఉపనిషత్తుల పద్ధతియు, భాషయు మాత్రమే ఎక్కువ తగియుండును; ఏలన వాని పద్ధతి రూపకమును, సంకేతమును ధారాళముగా నుపయోగించును, మఱియు వాని భాషారూపము అంతర్జ్ఞాన స్ఫోరకము గాన, అది బౌద్ధిక పరిభాష యొక్క కఠోర పరిమితత్వమును భగ్నముచేయగా, పదములయొక్క గర్భితభావములు తరంగ పరంపరగా వెలికి ప్రవహించును. కాని గీత ఈ భాషారూపము నాశ్రయించజాలదు; ఏలన ఒక బౌద్ధిక క్లిష్టతను విడదీయ దాని రూపకల్పన చేయబడినది; ప్రాణ ప్రేరణలు, భావావేగములవలన సంఘర్ష మేర్పడినపుడు, దానిని పరిష్కరించవలసిన హేతుబుద్ధి ఎటును తెగజెప్పలేక నిర్వీర్యము కాగా, అట్టి బుద్ధికి దారిజూప గీత రచింపబడినది. గీత హేతువును హేతుమార్గముననే హేత్వతీత సత్యమునకు దీసికొని పోవలెను. బుద్ధికి ఆధ్యాత్మికతత్త్వముల అనుభవముండదు; కావున ఆ తత్త్వములపై నాధారపడి, చూపిన పరిష్కారము ప్రామాణిక మని బుద్ధికి నిశ్చయము గలుగవలె ననిన, ఆ తత్త్వముల బౌద్ధిక ప్రతిపాదన దాని హేతువును తృప్తి పఱచవలెను.

3. ఇంతవఱకు బుద్ధిముందుంచబడిన ఆ తత్త్వసత్యములు బుద్ధికి పూర్వమే పరిచితములు మఱియు పరిష్కార ప్రారంభమునకు మాత్రమే పర్యాప్తములగును. వానిలో ప్రథమ సత్యము సర్వాత్మకును ప్రకృతిగతమగు వ్యష్ట్యాత్మకును గల విభేదము. అహంకార క్రియలోపల బద్ధుడై నివసించునంతవఱకు, వ్యష్టిపురుషుడు త్రిగుణ కర్మలకు అవశ్యముగా బద్ధుడగునని ఈ విభేదమూలమున తెలుపబడినది – ఈ గుణకర్మలే శరీరస్థమగు బుద్ధి, మనస్సు, ప్రాణము, ఇంద్రియముల కర్మ పరిధిని, పద్ధతినిగూడ నిర్ణయించును. కాగా, ఈ పరిధిలోపల పరిష్కారమేలేదు. కావున నీ పరిధికి వెలుపల, గుణ ప్రకృతికి పైన విరాజమానమగు ఏకమాత్ర అక్షరాత్మ యందు, నీరవ పురుషునియందు పరిష్కారమును వెదకవలెను, ఏలన అపుడు అనర్థమూలమగు కామాహంకారముల కర్మను గడచి గట్టెక్కుదుము. కాని అక్షరాత్మలోనికి చేయు ఆరోహణ మాత్రమే పరిష్కారము గాదనిపించును, అది సూటిగా అకర్మకు దారితీయు ననిపించును; ఏలన ప్రకృతి కావల కర్మకరణము నుండదు, కర్మకారణము, అనగా కర్మ నిర్ణాయకము నుండదు – ఎందుచేతనన అక్షరాత్మ నిష్క్రియము, సర్వసమము నగుటచే దేనిని నిర్ణయించదు. కావున కర్మ యజ్ఞముల అధీశ్వర రూపమున గీత భగవద్భావమును ప్రవేశపెట్టును (5–29), మఱియు నీ భగవంతుడు అక్షరాత్మకంటెను అధికుడు, అతనియందే విశ్వజీవన కీలక మున్నది – అని స్పష్టముగా వచింపక, కేవలము సూచించును. కావున అక్షరాత్మద్వారా ఈశ్వరస్థితి కెగసి, ప్రకృతి కర్మలయందు కొనసాగుచునే, కర్మలనుండి ఆధ్యాత్మిక విముక్తి ననుభవించుట సాధ్యమే. కాని యిచ్చట దివ్య గురువు మఱియు కర్మసారథి రూపమున అవతరించిన ఈ పరమపురుషు డెవరో, ఆత్మతోను, జీవునితోను అతనికిగల సంబంధము లేవియో ఇంకను వచింపబడలేదు. మఱియు నీశ్వర మూలకమగు కర్మసంకల్పము త్రిగుణాత్మిక ప్రకృతి యందలి కర్మసంకల్పము కంటెను ఎట్లు భిన్నము కాగలదో తెలియదు. మఱియు నది యిదియే యగుచో, దాని ననుసరించు అంతరాత్మ తన స్వరూపమునందు గాక పోయినను, తన కర్మయందు గుణాధీనము గాక ఎట్లు తప్పించుకొనగలదు ? ఇక నధీనమే యగుచో, ప్రతిజ్ఞాతమైన ముక్తి భ్రాంతిమయము లేక అసంపూర్ణము నగును. సంకల్పము ప్రకృతియొక్క సామర్థ్య విశేషముగాను, క్రియాశక్తిగాను గన్పట్టును. అయినప్పుడు త్రిగుణాత్మిక ప్రకృతికంటెను ఉచ్చతర ప్రకృతియొకటి గలదా ? అహంకారము,

కామము, మనస్సు, ఇంద్రియ సమూహము, ప్రాణావేగముల శక్తికంటెను భిన్నమగు వ్యావహారిక సృష్టి, సంకల్ప, క్రియలను సాధించు మఱియొక శక్తి గలదా ?

4. కావున ఈ సందేహావస్థయందు, దివ్యకర్మకు ఆధారము కాగల జ్ఞానమును పూర్ణతరముగా ప్రతిపాదించుటయే కర్తవ్యమగును. మఱియు ఆ జ్ఞానము భగవంతుని యొక్క సంపూర్ణ, సమగ్ర జ్ఞానము గావలయును ; ఏలన దానిచేతనే కర్మమూలము, కర్మవిముక్తుడు నగు భగవంతుని దెలిసికొని, కర్మి అతని విముక్తిలో పాల్గొనగలుగును. ఇంకను, గీతా ప్రథమ షట్కము ఏ ప్రతిజ్ఞతో సమాప్తమగునో, దానిని పోషించగల ప్రకాశము నీ జ్ఞానము గొనిరావలయును (6-47); అనగా ఆధ్యాత్మిక చేతన మఱియు కర్మలకు గల ఇతర ప్రేరణలు మఱియు శక్తులకు పైన భక్తి శ్రేష్ఠత నది స్థాపించవలెను. అందులకు, భక్తి ప్రేమల పరమశిఖరమగు పరిపూర్ణ ఆత్మసమర్పణయందు ఎవరికి మాత్రమే అంతరాత్మ తనను నివేదించుకొనగలదో, అట్టి సర్వభూతమహేశ్వరుని జ్ఞానమే అది గావలెను. దీనినే గురువు ఏడవ అధ్యాయముయొక్క ప్రారంభ శ్లోకము లందు ఉపక్రమించగా, గీతాశేషమంతయు దీని పరిణతినే సాధించును. అతడిట్లు ప్రారంభించును - "నాయందు నీ మనస్సును గీలించి, నన్ను ఆశ్రయముగా గొని (సచేతన సత్తాక్రియలకు సర్వాధారము, నివాసము, శరణ్య స్థానముగా గొని) యోగసాధన చేయుచు, నెట్లు సంశయ రహితముగా, సమగ్రముగా నన్ను తెలిసి కొనగలవో, వినుము (7-1). నీ కిపుడు విజ్ఞాన సహితమగు జ్ఞానమును లోప రహితముగా, అశేషముగా వివరింతును ; దీని నెఱింగిన, నిక నెఱుంగవలసిన దేదియు నిచ్చట మిగిలియుండదు (7-2). "దీని అభిప్రాయ మేమన, భగవంతుడే సర్వము - "వాసుదేవః సర్వం" (7-19), కావున తన సమస్త శక్తులు, మఱియు తత్త్వములందు నతడు సమగ్రముగా జ్ఞాతమగుచో, సర్వము జ్ఞాతమగును - శుద్ధాత్మయే గాదు, ప్రపంచమును, క్రియయు, ప్రకృతియు జ్ఞాతమగును. అపు డిక జ్ఞాతవ్య మేమియు మిగులదు. ఇట్లిచ్చట మన దృష్టి సమగ్రముకాదు గనుకనే, అది విభజనకరమగు 'మనో బుద్ధులు' మఱియు అహంకారముయొక్క పృథక్కర భావములమీద నిష్ఠితము గనుకనే, వస్తు విషయకమగు మన మనోబోధము ఒక విధమగు అజ్ఞానమగును. ఈ అహంకారిక దృష్టినుండి తప్పుకొని, మన మేకీకర జ్ఞానము నాశ్రయించవలెను. ఇది జ్ఞాన, విజ్ఞానభేదముచేత ద్వివిధము - జ్ఞాన

మన స్వరూప జ్ఞానము, విజ్ఞాన మన సమగ్రవిషయ జ్ఞానము; ఒకటి పరమాత్మయొక్క అపరోక్షమగు ఆధ్యాత్మిక బోధము (awareness), రెండవది అతని అభివ్యక్తిలోని ప్రకృతి పురుషాది తత్త్వముల యథార్థ, ఘనిష్ఠ జ్ఞానము. సర్వము తన దివ్య మూలమునందు జ్ఞానము చేతను, తన ప్రకృతి సత్యమునందు విజ్ఞానము చేతను తెలియబడగలదు. ఈ పూర్ణ జ్ఞానము అపరూపము, అతి కఠినము నని గీత తెలుపును – "వేలకొలది మానవులలో ఒకానొకడు సిద్ధినిమిత్తము ప్రయత్నించును, ప్రయత్నించి, సిద్ధి నందుకొనినవారియందు (సైతము) ఒకానొకడు నన్ను నా సర్వ తత్త్వములందును – తత్త్వతః – తెలిసికొనును (7–3)."

5. ఇపు డీ పూర్ణజ్ఞానమును ప్రారంభించి, ప్రతిష్ఠించుటకు గీత రెండు ప్రకృతుల మధ్య, బాహ్య, ఆధ్యాత్మిక ప్రకృతుల మధ్య, ఒక గంభీర, గురుతర వివేచన జేయును; ఈ వివేచనమే గీతాయోగముయొక్క వ్యావహారిక ప్రాతిపదిక. "పంచ భూతములు, మనస్సు, బుద్ధి, అహంకారము – ఇది నా అష్టవిధ విభక్త ప్రకృతి (7–4). కాని ఇది నా అపర ప్రకృతి, దీనికంటెను భిన్నమగు నా పర ప్రకృతి నెఱుంగుము. ఇదియే జీవుడగును, దీనిచేతనే ప్రపంచము ధరించబడును (7–5). "ఇచ్చట మనకు గీతయొక్క ప్రథమ, నూతన తాత్త్వికభావము గన్పించును, దీని సాహాయ్యమున గీత సాంఖ్యభావములతో ప్రారంభించి, వాని నతిక్రమించి, సాంఖ్యపదములకు వేదాంతార్థము నీయగలుగును. భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము నను పంచభూతములు – ఇవి లోహాదులవలె వివిధ వస్తువులు గావు, జడసత్తయొక్క వివిధావస్థలు –, ఇంద్రియ సహిత మనస్సు, సంకల్పసహిత బుద్ధి, అహంకారము: ఇవి ఎనిమిదియు సాంఖ్య ప్రకృతియొక్క అంగములగును. సాంఖ్య మింతటితో ఆగిపోవును, అందుచేతనే అది పురుష ప్రకృతుల మధ్య పూడ్చరాని అఖాతమును చెప్పక తప్పలేదు; అవి రెండు మిక్కిలి విభిన్న ప్రాథమిక సత్తలని చెప్పవలసివచ్చినది. గీతయు, నిచ్చటనే ఆగిపోవుచో, ఆత్మకును, విశ్వప్రకృతికిని మధ్య అదే అసాధ్య విరోధమును ప్రతిపాదించవలసి వచ్చును; అపు డీ విశ్వ ప్రకృతి త్రిగుణముల మాయామాత్ర మగును, మఱియు విశ్వజీవనము కేవలము మాయాఫలిత మగును; మఱేమియు గాజాలదు. కాని ఉన్నదీ సాంఖ్య ప్రకృతియే గాదు, మఱియొక ఉ చ్ఛతర తత్త్వము, భాగవత ప్రకృతియు గలదు – "పరా ప్రకృతిర్ మే" (7–5).

భగవంతుని ఈ పర ప్రకృతియే సృష్టికిని, సృష్టి శక్తికిని మూలము ; అజ్ఞానమయ నిమ్న ప్రకృతి దీని జన్యమే, దీని నల్లని నీడయే. ఈ సర్వోత్తమ శక్తితత్త్వము (dynamis) నందు ప్రకృతి పురుషులిరువురు నొకటిగా నుందురు. అచ్చట ప్రకృతి పురుషుని యొక్క సంకల్పము మఱియు క్రియాశక్తి మాత్రమే; అతని సత్తా వ్యాపారము మాత్రమే గాని, అది పృథగ్భూత సత్త గాదు, అది శక్తి రూపమున నున్న పురుషుడే.

6. ఈ పరప్రకృతి విశ్వ వ్యాపారమునందు అంతఃస్థితమగు ఆధ్యాత్మిక సత్తయొక్క శక్తిసన్నిధిమాత్రమే గాదు. అగుచో, అప్పుడది విశ్వవ్యాపి ఆత్మ యొక్క నిష్క్రియ సన్నిధియే యగును. ఏలన ఈ ఆత్మయు అన్నిటియందును అంతస్థముగా నుండి, తాను నిష్క్రియ మయ్యును, తన సన్నిధిచేత ఒక విధముగా విశ్వకర్మ కారణమగును. మఱియు నీ పరప్రకృతి అష్టవిధ ప్రకృతికి బీజావస్థ యగు సాంఖ్యుల "అవ్యక్తమును" గాదు, (ఇది పురుషునికంటెను భిన్నముగదా). ఇక నీ అవ్యక్తమునకు వేదాంతార్థ మిచ్చినను, అది పరప్రకృతి గాజాలదు. ఏలన వేదాంతావ్యక్తము బ్రహ్మ లేక ఆత్మయందు [1]వ్యావృత్తముగా నుండుశక్తి; దీని నుండియే విశ్వము వెలువడి, దీనిలోనికే తిరిగి వచ్చును. ఈ వ్యావృత్తశక్తి పర ప్రకృతియొక్క ఆధ్యాత్మిక స్థితులలో నొకటి మాత్రమే. కాగా పరప్రకృతి పరమ పురుషునియొక్క పూర్ణ చిచ్ఛక్తి యగును, ఇది జీవ జగత్తులకు మూలము. అక్షరాత్మయందది వ్యావృత్తమై యుండును, అనగా నిష్క్రియముగా నివృత్తియం దుండును; క్షరాత్మయందును, జగత్తునందును అది ప్రవృత్తిలోనికి వచ్చును. అక్కడది తన సక్రియ సన్నిధిచే బ్రహ్మలోపల సర్వభూత పరిణామమును సాధించును, మఱియు వానిలోపల వానిమూలభూత ఆధ్యాత్మిక ప్రకృతిగా నిలచును, ఇదియే వాని అంతరంగ బహిరంగ వ్యాపారము వెనుక నిలచి యుండు స్థాయి సత్యము. ఇది భూతముల "స్వభావము" (8-3), అనగా వాని మూలభూత గుణము మఱియు శక్తి; ఇది వాని సంభూతిని నిర్ణయించు వానిలోపలి స్వతత్త్వము, వాని జీవనము వెనుక నుండు దివ్యశక్తి. గుణఖేలనము ఈ పరమతత్త్వము నుండి ప్రభవించి, పరిణమించిన ఒక పరిమిత వ్యాపారము మాత్రమే. నిమ్న ప్రకృతియొక్క ఈ నామరూప కర్మ మంతయు, ఇంద్రియగత, మానసిక, బౌద్ధిక ప్రయాస మంతయు ఒక బాహ్యఘటన మాత్రమే, ఇది లోపలి స్వభావ రూపమగు

---

[1] వ్యావృత్తము = Involved, సంకుచితము, నిలీనము, నిమగ్నము

ఆధ్యాత్మిక శక్తి చేతనే సంభవము; దానినుండియే వచ్చును, దానియందే, దానిచేతనే వర్తించును. దృశ్య ప్రకృతియందే నివసించుచు, అది మనకు గలిగించు అభిప్రాయములను బట్టియే వస్తువులను నిర్ణయింతుమేని, మన సక్రియసత్తయొక్క వాస్తవసత్యము నెప్పుడును మన మందుకొనజాలము. వాస్తవసత్య మీ ఆధ్యాత్మిక శక్తియే, దివ్యస్వభావమే, వస్తువుల యందలి ఈ ఆత్మగుణమే; దీనినుండియే వస్తువులు తమ శక్తులను, ప్రవృత్తి బీజములను గ్రహించును. ఆ సత్యమును, శక్తిని, గుణమును ప్రాపించినపుడు, మనము మన [1]సంభూతి వాస్తవ ధర్మమును, మన జీవన దివ్యతత్త్వమును ప్రాపించినవార మగుదుము – అజ్ఞానమునందు జీవన ప్రక్రియనే కాక, జ్ఞానమునందు దాని మూలమును, నియమమును గూడ ప్రాపించినవార మగుదుము.

7. ఇట్లు చెప్పుట ఆధునిక చింతనా విధానమున కనురూపమగు భాషలో గీతాభావమును ప్రస్తావించుటయే యగును. పర ప్రకృతిని గుఱించి గీత చెప్పు నదియు వస్తుతః ఇదియే నని ఘనము చూడగలము. ఏలన "ప్రకృతిం మే పరాం" (7–5) – ఇది నా పర ప్రకృతియని కృష్ణుడు ముందుగనే చెప్పును. మఱియు నిచ్చటి 'నా' పురుషోత్తముని (15–18), దివ్యపురుషుని, పరమాత్మను, విశ్వాతీత, విశ్వవ్యాపి తత్త్వమును బరామర్శించును. మఱియు నిచ్చటి పర ప్రకృతి కర్థము పురుషోత్తమునియొక్క మూలప్రకృతికి, సృజనశక్తికి మాత్రమే వర్తించును, ఏలన "ఇదియే భూతయోని" యని కృష్ణుడు వక్కాణించును (7–6), మఱియు నదే శ్లోకముయొక్క రెండవపంక్తిలో, "నేను సర్వజగత్తునకు ఆదియు, నంతము" నని తెలుపును (7–6). ఇంకను "నాపైన మఱేదియు లే"దని వక్కాణించును (7–7). ఇట్లు పురుషోత్తముడును, పరప్రకృతియు నేకము చేయబడిరి : ఒకే తత్త్వమును చూచు రెండు విధములుగా వారు ముందుంచబడిరి. ఏలన ప్రపంచమున కాద్యంతములు నేనే నని కృష్ణుడు ప్రకటించినపుడు, తన సత్తయొక్క పర ప్రకృతియే ఆ ఆద్యంతము లని మనకు స్పష్టమే. ఒకే పరతత్త్వము తన అనంత చేతనయందు పరమపురుషుడును, తన అనంత శక్తియందు పరప్రకృతియు నగును – అనగా అనంతచేతనయే తన అంతర్వర్తి దివ్యశక్తియందును, తన అలౌకిక దివ్యక్రియ

[1] సంభూతి = Becoming, అగుట, సత్తయొక్క పరిణామము.

యందును పర(ప్రకృతి యగును. చేతనయందుండి ఈ సచేతన శక్తియొక్క పరిణామగతియే (ప్రపంచ (ప్రభవము (7-6) - "పరా (ప్రకృతిర్ జీవభూతా" (7-5), క్షరవిశ్వము... ందు దాని వ్యాపారము, పోగా పరమాత్మయొక్క అక్షర భావములోనికిని, స్వాత్మలీన వ్యాపారములోనికి వ్యావర్తనము ద్వారా ఆ సచేతనశక్తి యొక్క ఉపసంహరణమే (ప్రపంచ (ప్రళయ మగును. కావున (ప్రారంభమున గీత పర (ప్రకృతికిచ్చిన అర్థమిదియే.

8. కావున పర(ప్రకృతి స్వయంభూపురుషునియొక్క దేశకాల రహితమగు చేతనశక్తి యగును; దీనియందుండియే సర్వభూతములు అభివ్యక్తములగుచు, కాలాతీత భావమునుండి కాలములోనికి వచ్చును. కాని కాలగతియందు ఈ బహువిధ విశ్వసంభూతి కొక ఆధ్యాత్మిక (ప్రాతిపదికను గల్పించుటకు పర(ప్రకృతి జీవరూపము ధరించును. వేఱు శబ్దములలో, పురుషోత్తమునియొక్క సనాతన [1] అనేకాత్మ విశ్వముయొక్క సర్వరూపములందును వ్యష్టిపురుషరూపమున (ప్రకటిత మగును. సర్వభూతములు ఏకాత్మచే అను(ప్రాణితములు, సర్వభూతములు తమ వ్యక్తిత్వము, (క్రియలు, మఱియు రూపములందు ఏకపురుషునియొక్క అనేకాత్మచే ధరింపబడియుండును. పర(ప్రకృతి సంభూతి(ప్రకృతియేగాని, మఱేమియు గాదని తలపోయుట తప్పే యగును. అట్టిది పరమ పురుషుని యొక్క పర(ప్రకృతి కాజాలదు. కాలమునందు సైతము అది జీవునికంటె కొంతఅధికము; ఏలన అట్లు గానిచో, జగత్తునందు దాని ఏకమాత్ర సత్యము అనేకత్వ (ప్రకృతియే కాగా, జగత్తునందు ఏకత్వ(ప్రకృతి యనున దుండదు. గీత చెప్పున దిది కాదు; పర(ప్రకృతి తన మూలమునందు జీవుడే - "జీవాత్మికాం" అని కాక, అది జీవు డయ్యెను - "జీవభూతాం" (7-5) - అనియే చెప్పును; ఈ పదముయొక్క భావ మేమన, ఇచ్చట జీవరూపమున తన అభివ్యక్తి వెనుక నది తన మూలమునందు జీవునికంటెను అన్యము మఱియు అధికము; అది ఏకమాత్ర పరమాత్మయొక్క (ప్రకృతి, గీత తర్వాత వచించునట్లు జీవుడు ఈశ్వరుడే (13-23) గాని, ఈశ్వరుని అంశికాభివ్యక్తిగా మాత్రమే అతడీశ్వరుడు - "మమైవాంశః" (15-7). విశ్వము నందలి, లేక అసంఖ్యాక విశ్వములందలి జీవులందరు కలిసియు తమ సంభూతి యందు పూర్ణభగవంతుడు

[1] అక్షరము పురుషోత్తముని ఏకాత్మ, క్షరము అనేకాత్మ.

గాజాలరు, ఆ ఏకునియొక్క అంశికాభివ్యక్తియే యగుదురు. వానియందు అవిభాజ్యసత్తారూపమగు బ్రహ్మము విభక్తమైనట్లు వసించును – "అవిభక్తంచ భూతేషు విభక్త మివ చ స్థితం" (13–17). రెండును సత్యమే యైనను, ఏదియు భ్రాంతి గాకున్నను, ఏకత్వము అధికతరసత్యము కాగా, బహుత్వము అల్పతర సత్యమగును.

9. జీవేశ్వర సంబంధము :

పరప్రకృతినుండియే ప్రపంచము తన సర్వ భావములతో ప్రభవించుచున్నది, మఱియు నదియే ప్రళయకాలమున సర్వభావ సహిత ప్రపంచమును తనలోని కుపసంహరించుకొనుచున్నది (7–6); అటులే ఈ ఆధ్యాత్మిక ప్రకృతియొక్క ఏకత్వము చేతనే ప్రపంచము ధరించబడి యున్నది. కాని పరమాత్మలోపల ప్రపంచముయొక్క అభివ్యక్తియందును, స్థితికాలమున దాని ధారణమునందును, ప్రళయకాలమున దాని ఉపసంహరణము నందును జీవుడే బహువిధ ప్రపంచభావమున కాధారము; జీవుడు అనేకాత్మ యని మనము చెప్పుకొనవచ్చును. అథవా మన మనుభవించు అనేకత్వముయొక్క ఆత్మయనియు చెప్పుకొనవచ్చును. జీవుడు తన సత్తయందు సదా భగవంతునితో ఏకమే, తన సత్తయొక్క శక్తియందు మాత్రమే అతనికంటె భిన్నము–ఇచ్చటను, ఉభయుల శక్తులు వేఱువేఱను అర్థమున గాక, జీవుడు భగవంతుని యొక్క వ్యష్టీకృత అంశికశక్తికి మాత్రమే ఆధార మను అర్థమున భిన్నము. కావున సర్వవస్తువులు ఆద్యంతములందే గాక, తమ జీవన తత్త్వమునందును పరమ పురుషుడే యగును. అన్నింటియొక్క ప్రాథమికప్రకృతి భగవత్ప్రకృతియే; తమ నిమ్న విభేదక వ్యాపారమునందు మాత్రమే అవి భిన్నముగా గన్పించును, శరీరప్రాణ మనో బుద్ధి ఇంద్రియాహంకారముల ప్రకృతిగాగన్పట్టును. కాని ఈ శరీరాదులు పాంచభౌతిక వికృతులు (derivatives), అవి మన స్వభావస్వరూపముల మూలసత్యము గావు.

10. మద్భావము, స్వభావము, భావములు :

ఇట్లు భగవంతుని పర ప్రకృతిని విశ్వాతీతముగా నున్న, మూలభూతమగు విశ్వసత్యము, శక్తియు ననియు, విశ్వమునందలి అభివ్యక్తికి ఆధ్యాత్మిక సత్యరూపమగు ప్రథమాధార మనియు దెలియవచ్చును. కాని ఈ పరప్రకృతికిని, నిమ్నదృశ్యప్రకృతికిని అనుసంధాన (link) మేది ? నాయందు, కృష్ణుడు వచించును, ఇది యంతయు, ఇక్కడున్నదంతయు, సూత్రమునందు మణులవలె, కూర్చబడినది (7–7). కాని

ఇది యొక ప్రతిమానము మాత్రమే గాన, దీనిని ఎక్కువ సాగలాగరాదు; ఏలన మణులు దారముచేత ఒకదానితో నొకటి కలిసియుండును, ఇవ్విషయమున అవి దారముపై నాధారపడును – ఇదియే వానికిని, దారమునకును గల ఏకత్వము లేక సంబంధము. కావున మన మిపుడు ప్రతిమానమును విడిచి, ప్రతిమేయమును జూతము. అది పురుషోత్తముని పరప్రకృతి, అతని సత్తయొక్క అనంత చిచ్ఛక్తి ; అది స్వసంవిదము, సర్వసంవిదము,సర్వజ్ఞము; అది బాహ్యాభూతముల నన్నింటిని అన్యోన్యసంబద్ధముగా నడుపును; వానిలో ప్రవేశించును, వానిలో నిలిచి, వానిని ధరించును; వానిని తన అభివ్యక్తిక్రమమున అల్లును. ఈ ఏకమాత్ర పరమశక్తి అన్నింటియందును ఏకాత్మగనే గాక, ప్రతిదాని యందును జీవుడుగా, అనగా వైయక్తిక ఆధ్యాత్మికసన్నిధిగా అభివ్యక్తమగును; ఇది సర్వప్రకృతిగుణముల సారముగా గూడ నభివ్యక్త మగును, (ఉదాహరణకు, జలమునందు రసముగా (7-8)). కావున ఈ సారగుణములు వస్తువుల వెనుకనుండు ఆధ్యాత్మికశక్తులు. ఈ సర్వోన్నతగుణము త్రిగుణక్రియ గాదు; ఏలన ఈ గుణక్రియ గుణముయొక్క బాహ్యరూపము గాని, దాని ఆధ్యాత్మికసారము గాదు. ఈ సారగుణము ఏకమయ్యును, బాహ్యాపరివర్తనల యొక్క పరివర్తనీయ అంతః శక్తి యనవచ్చును. ఈ స్వభావగుణము సంభూతియొక్క మూలసత్యము, ఈ సత్యము సంభూతి రూపములను ధరించుచు, వానికి ఒక ఆధ్యాత్మిక దివ్య ఆంతర్యము నిచ్చును. త్రిగుణక్రియలు బుద్ధ్యాదులయొక్క బాహ్యమగు అస్థిర సంభూతులు – "సాత్త్వికా భావా, రాజసాః, తామసాః చ" (7-12), కాని జీవతత్త్వము గుణ బావము గాక, "స్వభావ" మగును, ఇది సారము, స్థిరము, ఆద్యము, ఘనిష్ఠము నగు సంభూతిశక్తి. గుణసంభూతియొక్కయు, జీవసంభూతి యొక్కయు మూల ధర్మమును నిర్ణయించున దీ స్వభావమే. ప్రతి జీవియందు నుండు నీ తత్త్వము ఈశ్వరునియొక్క అతీత దివ్యసంభూతినుండి – "మద్భావము నుండి" (14-19) – జనించి, దానితో సరాసరి సంబంధము గలిగి యుండును. ఇట్లు మద్భావమునకు స్వభావముతోను, స్వభావమునకు బాహ్యగుణ భావముతోను సంబంధ ముండును, అనగా దివ్యప్రకృతికి అంతరాత్మప్రకృతితోను, అంతరాత్మ ప్రకృతికి బాహ్య సంకరప్రకృతితోను సంబంధ ముండును, ఈ సంబంధమే దివ్య ప్రకృతికిని, నిమ్న ప్రకృతికిని మధ్యగల అనుసంధానము. నిమ్నప్రకృతియొక్క హీనశక్తులు మఱియు విలువలు పరమశక్తి యొక్క పూర్ణశక్తులు మఱియు

విలువలనుండి ఉత్పన్నములు గావున, తమ మూలమును, సత్యమును మఱియు తమ స్థితిగతుల ప్రధానధర్మమును గనుగొనుటకు వానినే తిరిగి చేరుకొనవలెను. అటులే అంతరాత్మ లేక జీవుడును, బాహ్యగుణముల నికృష్ట ఖేలనములో చిక్కుకొని యున్న జీవుడును, తన విశుద్ధ స్వభావక్రియ నాశ్రయించి, తన స్వీయసత్త యొక్క ఉచ్ఛతర ధర్మమునకు తిరిగిరావలెను; అక్కడతడు తన దివ్యప్రకృతియొక్క సంకల్పమును, శక్తిని, సక్రియతత్త్వమును, అత్యున్నత కర్మ విధానమును కనుగొనగలడు.

11. తర్వాతి శ్లోకములలోనే ఈ సంగతి స్పష్టమగును; గీత యిచ్చట అనేక ఉదాహరణలిచ్చి, భగవంతుడు తన పరప్రకృతిశక్తిరూపమున చరా చరభూతములం దెట్లు వ్యక్తమగునో, కర్మచేయునో చూపును. ఛందస్సు ననుసరించి, క్రమముమాఱి వచ్చిన ఈ దృష్టాంతములను యథోచితమగు దార్శనికక్రమములో పెట్టవచ్చును. ప్రథమతః, దివ్యశక్తియు, సన్నిధియు ద్రవ్యముయొక్క పంచ ప్రాథమికావస్థలలోపల – పంచభూతములలోపల–పనిచేయును–"నేను జలములలో రసము, ఆకాశము నందు శబ్దము, భూమియందు గంధము, అగ్నియందు తేజము." (7–8, 9), మఱియు నీ పరంపరను పూర్ణముజేయుటకు, వాయువునందు స్పర్శము – అని మనము కలుపవచ్చును. అనగా, తన పరప్రకృతిరూపమున భగవంతుడే వివిధ ఇంద్రియ సంబంధములకు ఆధారభూతమగు శక్తియగును. పంచభూతములు నిమ్నప్రకృతియందలి పరిమాణాత్మక లేక ద్రవ్యాత్మ కాంశము. కాగా పంచతన్మాత్రలు – శబ్దస్పర్శరూపరస గంధములు – గుణాత్మకాంశము. ఈ తన్మాత్రలు శక్తియొక్క సూక్ష్మరూపములు, ఇవి ద్రవ్యముయొక్క స్థూలరూపములతో ఇంద్రియచేతనకు సంబంధము కలుపును – ఇవియే మన బాహ్యప్రపంచజ్ఞానమున కాధారము. భౌతికదృష్టిని బట్టి, ద్రవ్యము మూలవస్తువు, ఇంద్రియసంబంధములు తజ్జన్యములు; కాని ఆధ్యాత్మికదృష్టి ననుసరించి, సత్యము దీనికి వ్యతిరేకము. ఇచ్చట ప్రకృతిశక్తియే, అనగా సత్తకు గల సామర్థ్యము మఱియు గుణములే, ఏకమాత్ర, ఆద్య, సనాతన తథ్యము; ఈ ప్రకృతిశక్తి యే ఇంద్రియములద్వారా తనను దాను పంచభూతములుగా, అనగా ద్రవ్యముగా అంతరాత్మకు వ్యక్తముచేసికొనును. మఱియు నింద్రియములందు సారభూతము, మిక్కిలి ఆధ్యాత్మికము, మిక్కిలి సూక్ష్మము నగు నే అంశము గలదో, అది స్వయముగా ఆ సనాతనగుణము మఱియు శక్తి యొక్క పదార్థమే. కాని ప్రకృతిగతశక్తి ప్రకృతిరూపమున నున్న సాక్షాత్తు భగవంతుడే; కావున తన శుద్ధ

రూపమున ప్రతి ఇంద్రియమును తన సక్రియ చిచ్ఛక్తి రూపమున నున్న భగవంతుడే యగును.

12. ఈ సత్యము ఈ పరంపరయొక్క ఇతరపదములనుండి ఎక్కువ ప్రకటమగును – 'నేను చంద్రసూర్యుల ప్రకాశమును, నరులయందు నరత్వమును (7–8), బుద్ధిమంతుల బుద్ధిని, తేజోవంతుల తేజమును (7–10), బలవంతుల బలమును, తాపసుల తపస్సును అయియున్నాను (7–9)". "నేను సర్వభూతములందు – జీవనమను (7–9)." ఇట్లు ప్రతివస్తువునందు దాని మూలగుణము యొక్క ఏ శక్తిగలదో, ఈ యేశక్తి మీద దాని సంభూతి ఆధారపడియుండునో ఆ శక్తియే ఆ వస్తుస్వభావమునందు భగవచ్ఛక్తియొక్క ఉపస్థితిని సూచించు విశిష్టలక్షణముగా నీయబడినది. ఇంకను "నేను వేదములందు ప్రణవమను (7–8)". ప్రణవ మనగా మూలాక్షరమగు ఓం-కారము, ఇదియే అపౌరుషేయవేదము యొక్క శక్తిశాలి, సృజనాత్మకశబ్దము లన్నింటికి మూలము; ఇది వాక్, శబ్దముల శక్తి యొక్క ఏకమాత్ర వ్యాపకసూత్రీకరణము, కావున నిది వాక్శబ్దముల ఆధ్యాత్మిక శక్తి నంతటిని, బీజసత్త నంతటిని ధరించును, సంగ్రహించును, సమన్వయించును, మఱియు వెలికిబంపును; ప్రణవద్రవ్యమునుండియే భాషాశబ్దము లల్లబడును, ఈ శబ్దముయొక్క వికసిత పరిణామములే ఇతరశబ్దము లని తలంచబడును. ఈ వివరణవలన మన కిది స్పష్టము : ఇంద్రియములు లేక జీవనము లేక ప్రకాశము, బుద్ధి, మున్నగు వాని బాహ్యపరిణామములు పరప్రకృతిని తెలియజేయు రూపములు గావు, ఆధ్యాత్మికశక్తియుక్తమగు వాని మూలగుణమే వాని "స్వభావమే" (8–3). పరప్రకృతిని దెలుపును. ఇంద్రియాదిరూపమున అభివ్యక్తమగుచున్న మూలసత్త యొక్క బలము, దాని చేతనయొక్క ప్రకాశము, దాని శక్తి యొక్క సామర్థ్యము –ఇవియొక విశుద్ధ, ప్రాథమిక చిహ్నమున ప్రకటమై నపుడు స్వభావమగును. ఈ బలము, ప్రకాశము, సామర్థ్యము; ఇదియే తక్కిన వస్తువు లన్నింటికి బీజము. కావున ఈ పరంపరయందలి మిక్కిలి వ్యాపక పదము నిట్లు గీత వచించును – "నన్ను, ఓ పార్థ, సర్వభూతముల సనాతన బీజముగా నెఱుంగుము (7–10)." ఈ సనాతన బీజము ఆధ్యాత్మికసత్త యొక్క మూలశక్తి, సత్తయందలి సచేతన సంకల్పము; గీత ఇతరత్ర చెప్పునట్లు (14–3), భగవంతు డీ బీజమనే మహద్బ్రహ్మయందు, అతిమానస విశాలతయందు, స్థాపించును; దానినుండియే సర్వ భూతములు బాహ్యప్రపంచమున జన్మించును.

ఏ భగవత్సత్తాబీజము సర్వభావము లందును వాని మూలగుణముగా నభివ్యక్తమగుచు, వాని స్వభావముగా నుండునో ఈ సనాతనబీజ మదియే.

13. మూలగుణముయొక్క మూలశక్తికి, నిమ్న ప్రకృతియొక్క బాహ్యా జన్యములకు (derivations), అనగా విశుద్ధ వస్తుతత్త్వమునకు, నిమ్న వస్తు రూపములకు గల వ్యావహారికభేదము ఈ పరంపరాంతమునందు స్పష్టముగా సూచింపబడినది – "నేను కామ, రాగ వివర్జితమైన బలవంతుల బలమను, నేను భూతములందలి తమధర్మమునకు విరుద్ధముగాని కామమను (7-11)." పోగా మనో-వస్థలు, కామవికారములు, ఆవేగక్రియలు, ఇంద్రియప్రతిక్రియలు, బుద్ధియొక్క పరిమిత, ద్వంద్వమయఖేలనము, వేదన మఱియు నైతికభావముయొక్క వృత్తులు – ఇవి ప్రకృతియొక్క గౌణములగు ఆంతరికభావములు – "భావాః" (7-12), ఈ సాత్త్విక రాజసిక, తామసిక భావములు త్రిగుణవ్యాపారములు : ఇవి స్వయముగా పరమ ఆధ్యాత్మికప్రకృతియొక్క విశుద్ధకర్మ గావు, దానినుండి ఉత్పన్నమైన జన్యములని గీత మనకు దెలుపును – "అవి నానుండియే," "మత్తఏవ", వానికి మఱియొక మూలము లేదు, "కాని నేను వానియందు లేను, అవి నాయం దున్నవి (7-12)." ఇచ్చట సూక్ష్మమైనప్పటికి, బలమైన విభేదము గన్పించును. భగవాను డిట్లు చెప్పి నట్లగును –"నేను మూలప్రకాశమును, బలమును, కామమును, శక్తిని, బుద్ధిని, కాని వీని జన్యములగు సాత్త్వికాదిభావములు నా మూలతత్త్వము గావు, నా మూలమున నేనవిగాను, మఱియు నేను వానియందు లేను; అయినను అవి నానుండి వచ్చినవే, మఱియు నా సత్తయం దుండునవే." కావున మన మీ వచనముల ఆధారము పైననే పరప్రకృతినుండి నిమ్నప్రకృతిని, నిమ్నమునుండి తిరిగి పరమునకు వస్తుసంక్రమణమును వీక్షింపదగును.

14. "నేను బలవంతుల బలమను" – అను ప్రథమవచనము దుర్బోధము గాదు. తనలో బలరూపమగు దివ్యప్రకృతి యున్నప్పటికి, బలవంతుడును కామరాగములలోనికి పడిపోవును, పాపములోనికి జాఱిపడును, శ్రమపడి పుణ్యమును సాధించును. కాని దీనికి కారణము, అతడు తన బాహ్యా కర్మయందు గుణముల పట్టులోనికి దిగజారునే గాని, ఆ కర్మను తన శుద్ధదివ్య ప్రకృతినుండి శాసించుటలేదు. అయితే నిమ్నక్రియలచేత ఆ దివ్యబల మేమాత్రము వికృతము గాదు, ఎట్టి మలినీకరణము, ఎట్టి పతనము ప్రాప్తించినను, అది తన మూలమునందు

యథాతథముగనే యుండును. కాగా భగవంతు డతని బలము నందుండి, ఆ బలముచేతనే తన నిమ్నజీవనముయొక్క కలతలయం దుండి అతనిని వెలికి నడుపుచుండును; దీని ఫలితముగా నతడు వెలుగును తిరిగి పొంది, ఆ వెలుగు చేత తన జీవనమును సమగ్రముగా ప్రదీప్త మొనరించి, తన ఉచ్ఛతరప్రకృతి యందలి దివ్యేచ్ఛయొక్క శుద్ధశక్తిచేత తన యిచ్ఛను, దాని కర్మలను శాసించ గలుగును - అస్తు, కాని భగవంతుడెట్లు కామము కాగలడు ; (7-11). నిర్జించవలసిన మహాశత్రువుగా నీ కామము నిరూపించబడినది గదా ; (3-41) కాని ఈ కామము గుణముల నిమ్నప్రకృతికి జెందిన కామము, దీని మూలమురజోగుణము - "రజోగుణ సముద్భవః" (3-37). కాగా శ్లోకము (7-11) ప్రస్తావించిన కామము ఆధ్యాత్మికము, ధర్మమునకు విరుద్ధముగాని యిచ్ఛ.

15. కాని ఆధ్యాత్మికకామమున కర్థము నైతికస్వభావము గల సాధుకామ మగునా, సాత్త్వికకామ మగునా ? - ఏలన సాధుత సదా తన మూలమునందును ప్రేరకశక్తి యందును సాత్త్వికమే యగును. అపుడిచట పరస్పరవ్యాఘాతము స్పష్టముగానే తలయెత్తును - ఏలన అనంతర పంక్తియందే సర్వ సాత్త్వికవికారములు దివ్యములు గావనియు, నిమ్న విక్రియలు మాత్రమే యనియు ప్రకటింపబడినది (7-12). నిశ్చయముగా, భగవంతుని సమీపింప దలచినచో, పాపమును పరిత్యజించ వలసినదే; కాని భగవత్తత్త్వములో ప్రవేశింప దలచినచో, పుణ్యమును (సాధుతను) గూడ అతిక్రమించవలసినదే, సాత్త్వికస్వభావము నందుకొనవలెను. కాని పిమ్మట దాని నతిక్రమించవలెను. దివ్యప్రకృతి కెగయుటకు వలయు విశుద్ధికి నైతికకర్మ ఒక సాధన మాత్రమే, కాని ఆ ప్రకృతి స్వతః ద్వంద్వములకు బైనుండును. నిజాని కట్లు గానిచో బలవంతుడును రాజసికావేగములకు అధీను డగును గాన, అతని యందును విశుద్ధమగు నెట్టి దివ్యసన్నిధి గాని, దివ్యబలము గాని యుండజాలదు. ధర్మము, ఆధ్యాత్మికార్థమున, సదాచారము గాని, నీతిమత్త్వము గాని కాదు. అన్యత్ర (18-47) గీత నిర్దేశించునట్లు, ధర్మ మన స్వభావనియతమగు కర్మ, వ్యక్తి నిజప్రకృతి యొక్క మూలనియమముచే నియతమగు కర్మ. మఱియు స్వభావ మన భగవత్ప్రకృతి యొక్క విశుద్ధగుణము, ఈ గుణమునందు ఆ ప్రకృతియొక్క సచేతన ఇచ్ఛాబలమును, విశిష్టకర్మశక్తియు నిండియుండును. కావున ఇచ్చట కామ మన మనయందు పని

చేయు భగవదిచ్ఛ యగును, ఇది నిమ్నప్రకృతి సుఖమును గాక, తన స్వీయఖేలనము, మఱియు స్వీయపరిపూర్తికి సహజమగు ఆనందము నన్వేషించును. కావున ఇచ్ఛటి కామము స్వభావనియమము ననుసరించి తన సచేతన క్రియాశక్తిని ప్రసరింపజేయు దివ్యమగు జీవనానందమును కామించు కామము.

16. సర్వ భావములు తన సత్తయం దున్నను, భగవంతుడు ఆ భావము లందు, సాత్త్విక బావములందు సైతము, లే దని చెప్పుటకు (7–12) మఱల నర్థ మేమి ? ఒక అర్థమున అతడు వానియం దుండుట అనివార్యము, లేనిచో వానికి మనుగడయే లేదు. కాగా ఉద్దేశించిన అర్థమేమన, భగవంతుని పరమ ఆధ్యాత్మిక ప్రకృతి వానియందు బంధించబడదు; అవి భగవంతుని సత్తయందుండు వికారములు, అహంకారాజ్ఞానముల క్రియ వానిని ఆ సత్తనుండియే సృజించును. అజ్ఞానము సర్వమును తలక్రిందుగాజూపును, మఱియు కనీసము అంశికముగా మిథ్యానుభవమును గలిగించును. ఎట్లన, ఆత్మ శరీరమునం దున్న దనియు, అది ప్రాయః శరీరజన్య మనియు మనము దలంతుము ; మన అనుభవము సైతము నదియే; కాని నిజానికి శరీరమే ఆత్మయం దున్నది, మఱియు ఆత్మజన్యమై యున్నది. భౌతిక మఱియు మానసికఘటనల మహారాశియందు, పురుషుని మనలోని ఒక స్వల్పభాగముగా మనము దలపోతుము–"అంగుష్ఠమాత్ర పురుషుడు" (కఠ ఉప.): వస్తుతః ఈ మహారాశి, ఎంత సాటోపముగా గన్పించినను, పురుషుని అనంతసత్త యందు కడుచిన్న వస్తువు. ఇటుల నిచ్చటను భగవంతుడు భావములం దున్నా డనుటకంటెను, అవియే అతనియం దున్న వని చెప్పుటొప్పును. వస్తువులను తలక్రిందుగా జూపించి, వానికి హీనతత్త్వము నాపాదించు త్రిగుణముల ఈ నిమ్నస్వభావమే భ్రమకారకశక్తియగు మాయ యనబడును. మాయ సర్వథా లేనే లే దనియు, లేక అది మిథ్యావస్తువులతోనే వ్యవహరించు ననియు దీని అర్థము గాదు; పరంతు అది మన జ్ఞానమును తికమక చేయును, మిథ్యామూల్యములను సృజించును, మనలను అహంకారమున మఱుగు పఱచును, మఱియు నట్లు మన జీవనముయొక్క పరమసత్యమును దాచివేయును - అనియే దీనికర్థము. భ్రాంతికరమగు నీ మాయ మనమేయగు భగవంతుని, అనంతాక్షరతత్త్వమును, మనదృష్టినుండి మాయముచేయును – "గుణమయములగు ఈ త్రివిధభావములచేత

ఈజగమంతయు మోహితమై, వీనికంటెను పరుడను, అక్షరుడను అగు నన్ను గుర్తించదు (7-13)". మన అస్తిత్వముయొక్క పరమసత్యము భగవంతుడే నని మనము చూడగలుగుదు మేని, అపుడు మన దృష్టికి తక్కినదంతయు గూడ మాఱిపోయి, తన వాస్తవరూపమును ధరించును, మఱియు మన జీవనకర్మలు దివ్యమూల్యములను బొంది, దివ్యప్రకృతి ధర్మము ననుసరించి వర్తించును.

17. కాని ఇంతకు భగవంతుడే సర్వత్ర యున్నప్పటికి, మఱియు దివ్యప్రకృతియే సమ్మోహకమగు గుణభావముల మూలమునందు సైతము ఉన్నప్పటికి, ఇంకను మనము జీవుడము మఱియు పరప్రకృతియే స్వయముగా జీవుడయినప్పటికి, ఈ మాయను దాట నెందుకింత కష్టమగుచున్నది ? ఇది భగవంతుని మాయయే గనుక, "దైవీహ్యేషా గుణమయీ మమ మాయా" (7-14) - "ఇది గుణమయమగు నా దివ్యమాయ." ఈ మాయ స్వయముగా దివ్యమే, మఱియు భగవంతుని ప్రకృతియొక్క ఒక పరిణామమే, అయితే ఈ భగవంతుడు దేవతల ప్రకృతిని గలిగియున్న భగవంతుడు. ఈ మాయ దివ్యము - "దైవీ", అనగా దేవతల మాయ, లేక, అట్లు చెప్పదలంచినచో, దేవాధిదేవుని మాయ, అయితే ఈ దేవాధిదేవుడు విభక్తమగు తన ఆంతరిక (Subjective) మఱియు నిమ్న విశ్వభావములందు - సాత్త్విక, రాజసిక, తామసిక భావములందున్న - భగవంతుడు. ఇట్లు విశ్వావరణ రూపమున నున్న మాయను భగవంతుడు మన బుద్ధిచుట్టును అల్లియున్నాడు: బ్రహ్మ, విష్ణు, మఱియు రుద్రుడు దాని దారములను జటిలముగా నేసియున్నారు: పరమశక్తి, పరప్రకృతి ప్రతిదారమునందును గుప్తముగా నున్నది, ఈ జాలము పనిని మనయందు సమాప్తముగావించి, దానిద్వారానే ముందుకు నడిచి, దాని ప్రయోజనము తీరిన పిమ్మట, దానిని వెనుక విడిచివేయవలెను : దేవతలను విడిచి, మూలభూతుడగు దేవాధిదేవునికి మఱలవలెను. అతనియందు దేవతలు మఱియు వారికర్మల పరమార్థమును, మన స్వీయ అక్షరాస్తిత్వముయొక్క గూఢతమ ఆధ్యాత్మిక సత్యములను ఏకకాలమున కనుగొనగలము. "నా వైపుకు తిరిగి నన్ను ఆశ్రయించిన వారు మాత్రమే ఈ మాయను తరించగలరు (7-14)."

౨. [1]భక్తిజ్ఞానముల సమన్వయము

1. గీతలో ప్రసంగవశమున తాత్త్వికభావములు రాశులుగా తలయెత్తినను, గీత ఆధ్యాత్మికతత్త్వశాస్త్రము గాదు; కారణము, గీత ఎట్టి ఆధ్యాత్మికసత్యమును తాత్త్వికదృష్టితో లేవనెత్తదు. అది అత్యున్నత వ్యావహారికోపయోగము నిమిత్తమే అన్వేషించును గాని, బౌద్ధిక లేక ఆధ్యాత్మికతృప్తికొఱకు సైతము గాదు; మనలను ప్రమాదమునుండి కాపాడి, మర్త్యమగు అపూర్ణతనుండి అమరమగు పూర్ణతకు గల మార్గమును తెలుచు శక్తినిగానే అది సత్యము నన్వేషించును. కనుక ఈ అధ్యాయము యొక్క మొదటి పదునాలుగు శ్లోకములందు మన కావశ్యక మగు నొక ప్రముఖ దార్శనికసత్యమును ప్రతిపాదించి, వెంటనే తర్వాతి పదునాఱు శ్లోకములందును దాని వ్యావహారికోపయోగమును దెలుపును. ఆ సత్యమును కర్మ జ్ఞాన భక్తుల సమన్వయమునకు మూలము గావించును - ఏలన కర్మజ్ఞానముల ప్రాథమిక సమన్వయము ఇతఃపూర్వమే సాధించబడినది (4-41....).

2. ఇపుడు మనముందు మూడు శక్తులు గలవు - జీవుని పరమసత్యమగు పురుషోత్తముడు, సర్వాత్మ మఱియు జీవుడు. లేక నిట్లు చెప్పవచ్చును - పరమ పురుషుడు, అక్షరబ్రహ్మము, అనేకాత్మ; ఈ అనేకాత్మయే మన ఆధ్యాత్మిక వ్యక్తిత్వమునకు కాలాతీత ఆధారము, సత్య సనాతన వ్యష్టిపురుషుడు - "మమైవాంశః సనాతనః" (15-7). ఈ ముప్పురును భగవదాత్మకులే, ఈ ముప్పురును భగవంతుడే. సత్తయొక్క పరమ ఆధ్యాత్మిక ప్రకృతి, పరప్రకృతి పురుషోత్తమ ప్రకృతి యగును; ఇది అవచ్ఛేదక అజ్ఞానమునకు అధీనము గాదు. అదే దివ్య ప్రకృతి నిర్గుణాత్మయందును గలదు, కాని ఇచ్చటది తన సనాతన విశ్రాంతి, తుల్యత, (equilibrium), నిష్క్రియతావస్థయం దుండును. చివరకు, అదే పర ప్రకృతి కర్మచేయు నిమిత్తము బహురూప వ్యష్టిపురుషుడు, జీవుడగును. కాని ఈ పరప్రకృతియొక్క అంతరక్రియ సదా ఆధ్యాత్మిక దివ్య కర్మగా నుండును. పరమ పురుషుని సత్తయొక్క చిన్మయసంకల్పమే జీవుని మూలగుణముయొక్క వివిధమగు నాధ్యాత్మికశక్తిరూపమున తనను దాను ప్రకటించుకొనును; మూల భూతమగు నీ ఆధ్యాత్మికశక్తియే జీవుని

[1] గీత : అధ్యాయము 7, శ్లోకములు 15-28.

స్వభావ మగును. ఈ స్వభావమునుండి సరాసరి ప్రభవించు సమస్తకర్మయు, సంభూతియు ఆధ్యాత్మిక కర్మయు, దివ్య సంభూతియు నగును. కావున తేలిన దేమన, మానవుడు తన ఆధ్యాత్మికవ్యక్తిత్వమును తిరిగి చేరుకొన యత్నించవలెను; తన కర్మల నన్నింటిని ఆ వ్యక్తిత్వము యొక్క దివ్యశక్తినుండియే ప్రవహింపజేయవలెను; మనోభావము మఱియు ప్రాణకామనలద్వారా కాక, క్రియ నంతను అంతరాత్మ మఱియు దాని స్వభావముల ద్వారానే వికసింపజేయవలెను; మఱియు తన కృత్యముల నన్నింటిని భగవత్సంకల్పముయొక్క ఒక విశుద్ధ స్రోతస్సులోనికి, తన జీవనము నంతను దివ్యప్రకృతి యొక్క ఒక సక్రియ సంకేతములోనికి మార్చివేయవలెను.

3. ప్రాకృతజీవుడు – దివ్యజీవుడు :

కాని గుణమయ నిమ్న ప్రకృతియు గలదు, దీని స్వభావము అజ్ఞానస్వభావము, దీని క్రియ అజ్ఞానక్రియ, ఈ క్రియ సంకీర్ణము, వ్యత్యస్తము, విపరీతముగా నుండును; ఇది అహంకారరూపమగు ప్రాకృతవ్యక్తి క్రియగాని ఆధ్యాత్మికవ్యక్తి క్రియ గాదు. అహంకారము యొక్క ఈ మిథ్యావ్యక్తిత్వమునుండి బైటబడుటకే మనము నిర్వ్యక్తికాత్మ నాశ్రయించి, దానితో నేకముగావలెను. అపుడు అహంకారవ్యక్తిత్వమునుండి విడివడి, పురుషోత్తమునితో సత్యవ్యక్తికి గల సంబంధమును గనుగొనగలము. ఈ సత్యవ్యక్తి, వైయక్తికుడు గనుక, క్రియయందును, కాలాధీన అభివ్యక్తియందును పురుషోత్తముని యొక్క ఆంశికశక్తి మఱియు రూపవిశేషమే యైనను, సత్తయందతనితో సాక్షాదేకము. అటులే నిమ్నప్రకృతి నుండియు విముక్తులమై, పర, దివ్య ఆధ్యాత్మికప్రకృతిని బొందగలము. కావున కామాత్మనుండి వ్యవహరించుట అంతరాత్మనుండి వ్యవహరించుట గాజాలదు; ఏలన కామాత్మ ఉన్నత అంతరసత్త గాక, నిమ్న బాహ్యరూపము మాత్రమే. అనగా, అంతఃప్రకృతి లేక స్వభావము ననుసరించి వర్తించుట యన అహంకారముయొక్క ఆవేగములనుండి వర్తించుట గాజాలదు, అటులే గుణముల అస్థిర ఖేలనమునుండి పుణ్యపాపములను ఉదాసీనముగానో, సకామముగానో ఆచరించుటయు గాజాలదు. ఆవేగమునకు లోబడిన ఎట్టి పాపానువర్తనమున అత్యున్నత నిర్వ్యక్తికాత్మయొక్క ఆధ్యాత్మికశమమునకు గాని, దివ్యవ్యష్టి – పురుషునియొక్క ఆధ్యాత్మికకర్మకు గాని మార్గ మెంతమాత్రము గాదు, పోగా ఈ వ్యష్టిపురుషుడు పరమపురుషుని సంకల్పము యొక్క ఒక వాహినియు, పురుషోత్తమునియొక్క ఒక ప్రత్యక్ష సంభూతియు నగును.

4. ముందు సత్త్వగుణాధిపత్యము :

దివ్యజన్మకు, అనగా ఉచ్చతర జీవనమునకు ప్రప్రథమనియమము రాజసిక కామమును దాని సంతానమును వధించుటయని గీత ఆదియందే విధించియున్నది (3-41), మఱియు దాని కర్థము పాపబహిష్కరణము. పాప మన నిమ్నప్రకృతియొక్క కర్మవిధానము; ఇది ప్రకృతిపై పురుషునియొక్క నియంత్రణమును, ఆధిపత్యమును ధిక్కరించి, మూఢ లేక ఘోర, తామసిక లేక రాజసిక ప్రవృత్తుల నీచపరితృప్తికొఱకు ప్రయత్నించును. నిమ్నప్రకృతి చేయు నీ బలాత్కారమును బాపుకొనుటకు, ఆ ప్రకృతియొక్క ఉత్తమమగు సత్త్వగుణమును మన మాశ్రయించవలెను; ఏలన ఇది సదా సామరస్య పూర్ణమగు జ్ఞానప్రకాశమును, ధర్మయుక్తమగు కర్మనియమమును వెదకుచుండును. ప్రకృతియందు నివసించుచు, గుణముల వివిధవృత్తులను అనుమతించుచుండు పురుషుడు, మన సత్తయందు అట్టి కర్మనియమము నన్వేషించు సాత్త్వికవృత్తికిని, సాత్త్వికసంకల్పమునకును అనుమతి నీయవలెను. మన ప్రకృతియందలి సాత్త్విక సంకల్పము మనను శాసించ వలెను గాని, రాజసిక, తామసికసంకల్పము గాదు. ఇదియే యథార్థ నైతిక సంస్కృతియొక్క అర్థము, ఇదియే సమున్నత కర్మవివేచన యొక్క అభిప్రాయము. ఈ సత్త్వధర్మము మనయందలి ప్రకృతియొక్క నిమ్నము, అస్తవ్యస్తమునగు కర్మనుండి ఉన్నతము, వ్యవస్థితమునగు కర్మపరిణామమునకు బ్రయత్నించును; ఇది దుఃఖమును, అశాంతిని గొనితెచ్చు అజ్ఞానావేగములందు గాక, అంతఃసుఖమును, సమతను, శాంతిని బుట్టించు జ్ఞానము మఱియు ప్రబుద్ధ సంకల్పములందు బనిజేయజూచును. ఉత్తమగుణమగు సత్త్వ శాసనమును ముందు మనలో వికసింపజేయ మేని, గుణములను దాటి పోజాలము.

5. సత్త్వగుణమును దాటుట సులభతరము :

"మూఢులు, నరాధములు నగు పాపకర్ములు నన్ను బొందరు ; కారణము, మాయ తమ జ్ఞానము నపహరించగా, వారు అసురప్రకృతి నాశ్రయింతురు" (7-14)-అని పురుషోత్తముడు హెచ్చరించును. వంచనశిల్పియగు నహంకారము అంతరాత్మను వంచించుటయే ఈ విమూఢత కర్థము. పాపకర్ముడు మానవప్రకృతి యొక్క నిమ్నతమస్తరమున తన ప్రియతమాహంకారమును సర్వదా తృప్తిపఱుప జూచును, అహంకారమే అతని వాస్తవభగవంతుడు ; కావుననే అతడు భగవంతు నందుకొనజాలడు. త్రిగుణముల మాయావ్యాపారములోనికి లాగివేయబడిన అతని

మనోబుద్ధులు అంతరాత్మకు సాధనములుగా గాక, అతని కామములకు స్వయంవంచిత కరణములుగా పనిచేయును. అతడు నిమ్నప్రకృతినే జూచును గాని, తన శ్రేష్ఠాత్మను, ఉత్తమసత్తను, అనగా తనలోపలి, ప్రపంచములోపలి భగవంతుని జూడడు. అతడు కామాహంకారముల పరముగానే ప్రపంచలక్ష్యమును తన బుద్ధికి వివరించి చెప్పును; కామాహంకారములనే సేవించును. ఎట్టి ఉచ్చతర ప్రకృతిని, ధర్మమును ఆకాంక్షించక, కామాహంకారములనే సేవించుట అసురుని మనఃస్వభావములను గలిగి యుండుటయే యగును. ఆవశ్యకమగు ప్రథమసోపానముగా, ఉచ్చతరప్రకృతిని, ధర్మమును ఆకాంక్షించ వలెను; కామనియమముకంటె శ్రేష్ఠమగు నియమమును పాలించవలెను; అహంకారముకంటె నుదాత్తమగు భగవద్రూపమును గుర్తించి, పూజించవలెను; ఒక యోగ్యచింతకుడును, యోగ్యకర్తయు గావలెను. ఇదియు స్వయముగా సరిపోదు; ఏలన సాత్త్వికమానవుడు సైతము గుణవిమోహమునకు వశుడే; కారణము, అతడింకను ఇచ్ఛాద్వేషములచేత నియంత్రితుడే – "ఇచ్ఛాద్వేష...' (7-27), అతడింకను ప్రకృతిరూపముల పరిధిలో చరించువాడే, అతని కింకను సర్వోన్నత, అతీత, సమగ్రజ్ఞాన మబ్బలేదు. అయినను తన నైతికలక్ష్యమునందు సంతత ఊర్ధ్వముఖాకాంక్షచేత నతడు తుదకు పాపగ్రహణమునుండి, అనగా రాజసిక కామావేశముల గ్రహణమునుండి ముక్తుడగును, మఱియు త్రివిధమగు మాయా శాసనమునుండి విమోచనసమర్థమగు విశుద్ధప్రకృతిని బొందును. పుణ్యముచేతనే మానవుడు పరమును బొందజాలడు, కాని [1]పుణ్యముచేత పరమును బొందు అధికారమును బొందగలడు. ఏలన ప్రచండరాజసికాహంకారమును లేక విమూఢతామసికా హంకారమును వదిలించుకొని, క్రిందికి నెట్టివేయుట కష్టతరము; కాని సాత్త్వికాహంకార మంత కష్టముగాదు, పైగా నది అభ్యాసముచేత తగినంత సూక్ష్మము, ప్రసన్నము నైనపుడు, దానిని అతిక్రమించి, రూపాంతరమొందించుట లేక రూపుమాపుట సులభముసైతము నగును.

---

[1] స్పష్టముగానే ఇది ఆంతరపుణ్యము, అనగా విచారము, భావము, స్వభావము, ప్రేరణ, ప్రవర్తనలయందు సాత్త్విక స్వచ్ఛత గాని, సాంప్రదాయిక లేక సామాజిక సుగుణము గాదు. – శ్రీ అ.

6. భక్తి ప్రవేశము :

కావున మానవుడు మున్ముందుగా నైతికుడు - "సుకృతీ" - గావలయును; పిమ్మట కే౯ ౹నైతికమగు జీవనవిధానమునకు బైనుండు ఉన్నతులకు, అనగా ఆధ్యాత్మికప్రకృతియొక్క ప్రకాశము, విశాలత, శక్తిస్థానముల కెగయవలెను; అచ్చటతడు "ద్వంద్వమోహమున" (7-27) కావల వర్తించును. అచ్చటిక నతడు తన వైయక్తికహితమును లేక సుఖమును అన్వేషించడు, అటులే తన వైయక్తిక దుఃఖమును లేక వేదనను జూచి భయపడడు, ఏలన అత డిపుడు వీనిచే ప్రభావితుడు గాడు; మఱియు "నేను పుణ్యాత్ముడను," "నేను పాపాత్ముడను" అనియు ననడు, పరంతు తన సమున్నత దివ్యప్రకృతియందు భగవదిచ్ఛ ననుసరించి లోకసంగ్రహార్థము కర్మ సేయును. ఇందునిమిత్తము ఆత్మజ్ఞానము (4-23), సమత (2-48), నిర్వ్యక్తికత (2-45) ప్రథమావశ్యకములని మనము చూచియే యున్నాము, మఱియు నివియే కర్మజ్ఞానముల సమన్వయమునకు, మఱియు ఆధ్యాత్మికతకును, ప్రపంచమునందు ప్రవృత్తికిని మధ్య సమన్వయమునకును మార్గమని తెలిసికొనియే యున్నాము. కాని గీత యిపుడు తన కర్మయోగమును జ్ఞానయోగముతో నేకము గావించిన కర్మయోగికి మఱియొక అధికతర ఆవశ్యక వస్తువును విధించుచున్నది. కర్మజ్ఞానములే కాక, ఇపు డతనినుండి భక్తియు నపేక్షంపబడుచున్నది - పరమ పురుషునియందు ప్రేమ, అతని ఆరాధన, అతని విషయకమగు అంతరాత్మకామన. ఇంతదనుక నీ భక్తి ప్రకటముగా విధించబడ నప్పటికి, దానికి మార్గము వేయబడినది, చూడుడు: దివ్యగురువు తన యోగము యొక్క ఒక మలుపుగా, ఈశ్వరునికి జేయు యజ్ఞములోనికి సర్వకర్మల పరివర్తనమును విధించును (3-9, 4-23), మఱియు దాని పర్యవసానముగా సర్వకర్మలను నిర్గుణాత్మలోనికి గాక, ఎవనినుండి సమస్తసంకల్పమును, శక్తియు ప్రభవించునో, అట్టి పరమపురుషునిలోని కర్పింపవలె నని చెప్పును (3-30). అక్కడ నేది గర్భితముగా నుండెనో, ఇచ్చటది ప్రకటింపబడగా, గీతాధ్యేయమును మన మెక్కువగా నిపుడు గాంచ నారంభించినాము.

7. గతిత్రయము :

సామాన్యప్రకృతినుండి విడిపించి, దివ్యము, ఆధ్యాత్మికము నగు సత్తలోనికి మన పెంపును సాధించగల మూడు పరస్పరాశ్రిత గతులిపుడు మన ముందు

గలవు. "ఇచ్ఛాద్వేషములనుండి జనించు ద్వంద్వమోహము చేత సృష్టియందలి సర్వజీవులు సమ్మోహములోనికి నడుపబడుచున్నవి". (7-27) - అని గీత వచించును. ఇదియే అజ్ఞానము, అహంకారము; ఇది సర్వత్ర భగవంతుని గాంచి, పట్టుకొనజాలదు; కారణము, ఇది సదా ప్రకృతిద్వంద్వములను మాత్రమే చూచుచు, తన పృథగ్వ్యక్తిత్వముతోను, తన అనురక్తివిరక్తులతోను నిండియుండును. ఈ వలయమునుండి బైటపడుటకు, ప్రాణికాహంకారముయొక్క పాపమునుండియు, ఆవేశాగ్నినుండియు, రాజసికప్రకృతియొక్క కామకల్లోలము నుండియు దూరముగా తప్పుకొనవలెను, మఱియు నిది నైతిక సత్తయొక్క స్థిరీకరణ శీల సాత్త్వికవృత్తిచే సాధింపబడవలెను. (ఇది ప్రథమ గతి). ఇది జరిగినపుడు - "యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణాం" (7-28) - ద్వంద్వములపై కెగయుటయు, నిర్వ్యక్తికులము, సములము, అక్షరాత్మతో ఏకాత్మకులము, సర్వభూతములతో నేకాత్మకులము నగుటయు ఆవశ్యకము. అక్షరాత్మలోనికి పెరుగుటకు సంబంధించిన ఈ ప్రక్రియ మన శుద్ధిక్రియను పూర్ణముచేయును. (ఇది ద్వితీయగతి). కాని ఈ శుద్ధి సమయమున, అంతరాత్మ ఆత్మజ్ఞానములోనికి విస్తరించుకొనుచుండగా, అది భక్తియందును వృద్ధిబొందవలయును. కారణము, అది విశాలమగు సమతా భావము నందు కర్మ చేయుటయే గాక, సర్వభూతస్థితుడగు భగవంతునికి యజ్ఞము సైతము చేయవలెను ; ఆ భగవంతు నింకను అది పూర్ణముగా దెలియనప్పటికి, సర్వత్రను సర్వమునందునుఏకాత్మ దర్శనమును దృఢముగా బొందినపుడు, సమగ్రముగా దెలియగులుగును (7-1). సమతయు, ఏకతాదర్శనమును ఒకసారి పూర్ణముగా సిద్ధించి నపుడు, ద్వంద్వ మోహవిముక్తి (7-28) ప్రాప్తించగా, ఒక పరభక్తి, భగవంతుని సర్వాంగీన భక్తి సత్తయొక్క సంపూర్ణ, ఏకమాత్రధర్మ మగును. (ఇది తృతీయ గతి). తక్కిన వ్యవహారధర్మము లన్నియు ఆ సమర్పణ యందు లీనమగును - "సర్వధర్మాన్ పరిత్యజ్య" (18-66). అపు డంతరాత్మ (జీవుడు) ఈ భక్తియందును, తన సమస్త సత్తాజ్ఞానకర్మల ఆత్మనివేదన వ్రతము నందును ప్రతిష్ఠితమగును ; ఏలన సర్వమూలమగు భగవంతుని పరిపూర్ణ, సమగ్ర, ఏకతాసాధకజ్ఞానము ఇపుడంతరాత్మకు నిశ్చితప్రతిష్ఠయు, తన సత్తాకర్మల సుదృఢ ఆధారము నగును - "తే భజంతే మాం దృఢవ్రతాః" (7-28).

8. భక్తికి ఆధారము వ్యక్తిత్వము :

జ్ఞానము, నిర్వ్యక్తికత్వము ప్రాప్తించిన పిమ్మట, హృదయవృత్తియగు భక్తికి తిరిగివచ్చుట సాధారణదృష్టికి పునః పతనముగా గన్పించవచ్చును. ఏలన భక్తియందు సదా వ్యక్తిత్వముయొక్క అంశము, ఆధారము నుండును; కారణము భక్తియొక్క చాలనశక్తి వైయక్తికాత్మయగు జీవుని ప్రేమయు, నారాధనయు నగును. కాని గీతాదృష్టినుంచి చూచిన, ఈ ఆక్షేపణకు తావులేదు; ఏలన గీతాలక్ష్యము సర్వభావము ద్వారా పురుషోత్తమునితో సాయుజ్యమే గాని, అకర్మయు, అక్షరాత్మయందు లయమును గాదు. నిజమే, ఈ యోగమునందు నిర్వ్యక్తికము, అక్షరము నగు తన ఆత్మసత్తయొక్క బోధముచేత అంతరాత్మ నిమ్నవ్యక్తిత్వమునుండి బైటబడును, కాని అది యింకను కర్మచేయును, మఱియు ప్రకృతిగతమగు బహురూప అంతరాత్మకే సర్వక్రియయు జెందును. మితిమీఱిన నివృత్తిభావమునకు విఱుగుడుగా మనము పురుషోత్తమ విషయకమగు యజ్ఞభావమును బ్రవేశపెట్ట మేని, అపు డీ కర్మతత్త్వము మన తత్త్వ మెంతమాత్రము గాజాలదు, అది తన వెనుక నెట్టి దివ్యసత్యతయు లేని గుణఖేలనముయొక్క ఒక అవశేషమే యగును, కరిగిపోవుచున్న అహంకారముయొక్క ఒక చరమరూపమే యగును, నిమ్నప్రకృతియొక్క అవశిష్టశక్తియే యగును ; అయితే మన సాంప్రదాయిక జ్ఞానము నిమ్న ప్రకృతిని నిరాకరించును గనుక, దాని లక్ష్యము శుద్ధనిష్క్రియత లోనికి పలాయనమే గనుక, మన మీ అవశిష్టకర్మకు బాధ్యులము గాము. ఇట్లు గాక ఏకాత్మయొక్క ప్రశాంతనిర్వ్యక్తికతను ఈశ్వరునికి యజ్ఞముగా జేయబడిన ప్రకృతికర్మల శక్తితో జోడింతు మేని, ఈ ద్వివిధకీలకముచేత నిమ్నమగు అహంకారిక వ్యక్తిత్వమునుండి ముక్తులమై, సత్యమగు మన ఆధ్యాత్మిక పురుష రూపముయొక్క విశుద్ధతలోనికి బెరుగుదుము. అప్పుడిక నిమ్నప్రకృతియందు బద్ధము, అజ్ఞము నగు అహంకారముగా నుండక, పరప్రకృతియందు విముక్తజీవుడుగా నుందుము. అప్పుడిక మనము క్షరాక్షరములు విరుద్ధసత్త్వములను జ్ఞానమున నివసింపక, మన సత్తయొక్క ఈ యుభయశక్తులద్వారాను ఏకకాలమున కనుగొనబడిన పురుషోత్తముని సాక్షాదాలింగనమున కెగయుదుము. ఈ ముప్వురును పురుషతత్త్వమే, మఱియు వీరిలో వ్యతిరేకులుగా గన్పించు నిరువురు ఉత్తముడగు మూడవ వానియొక్క పరస్పరాభిముఖమగు రెండు పార్శ్వములు మాత్రమే యని తెలియవచ్చును. కృష్ణు డిట్లు తెలుపును – “అక్షర, నిర్వ్యక్తిక పురుషుడు (అనగా

ఆధ్యాత్మిక సత్త) గలడు, మఱియు క్షర, సవ్యక్తికపురుషుడు గలడు (15–16). ఇంకను మఱియొక ఉత్తమపురుషుడు గలడు; పరమాత్మ యనబడు నితడు లోకత్రయమ నావేశించి భరించును, ఇత డీశ్వరుడు, అవ్యయుడు (15–17). క్షరమున కతీతముగాను, అక్షరమునకు పరమునందును నున్న ఈ పురుషోత్తముడనే నేను (15–18). న న్నిట్లు పురుషోత్తమునిగా నెఱింగినవాడు తన సర్వ - జ్ఞానముతోను, సర్వభావము తోను నన్ను భజించును (నాయందు భక్తిపూర్ణుడై యుండును) (15–19)." సమగ్ర జ్ఞానముతోను, సమగ్ర ఆత్మసమర్పణముతోను గూడిన ఈ భక్తికే ఇపుడు గీత పూర్ణరూప మివ్వనున్నది.

9. జ్ఞానసహిత భక్తి ఉత్తమము :

[1]ఏలన గీత శిష్యునినుండి అపేక్షించునది జ్ఞానసహిత భక్తియని గమనించ వలెను; గీతాదృష్టిలో తదితర భక్తిరూపములు స్వయముగా మంచివేగాని, అవి హీనరూపములు; అవి అవాంతరభక్తి గావచ్చును గాని, ఆత్మయొక్క పరమోత్కర్షమును సాధించు పరభక్తి గాజాలవు. రాజసికాహంకారముయొక్క పాపమునకు స్వస్తిచెప్పి, భగవదభిముఖముగా పయనించు వారిలో గీత చతుర్విధభక్తులను జూచును (7–16) – 1. ఆర్తుడు : శోకసంతాపములనుండి రక్షణ స్థానముగా భగవదభిముఖమగు వాడు, 2. అర్థార్థి: లౌకిక ప్రయోజనము నిమిత్తము అతని నన్వేషించువాడు, 3. జిజ్ఞాసువు : జ్ఞానము నపేక్షించి అతని నాశ్రయించు వాడు, 4. జ్ఞాని : జ్ఞానముతో నతని భజించువాడు. ఈ భక్తులందరిని గీత ఆమోదించును గాని, చివరివాని పైననే తన సంపూర్ణసమ్మతిని ముద్రించును. ఈ భక్తి విధము లన్నియు ఉదారములే – "ఉదారాః సర్వ ఏవైతే" (7–18), కాని జ్ఞాన సంపన్న భక్తి అన్నింటిని మించును – "విశిష్యతే" (7–17). ఇచ్చట మన మిట్లు పరిగణంచవచ్చు : ప్రథమభక్తి ప్రాణిక – భావి [2]ప్రకృతికి సహజమగు భక్తి ; ద్వితీయభక్తి వ్యావహారిక, సక్రియప్రకృతికి జెందును; తృతీయభక్తి తర్కమయ బౌద్ధికప్రకృతికి జెందును; చతుర్థభక్తి అత్యున్నతమగు

---

[1] ఈ 'ఏలన'కు 8–వ పేరా అంతముతో సంబంధము.

[2] భక్తిచరిత్రయందు ఉత్తరకాలీనభక్తి తన మూలమునందు అంతరాత్మభక్తి యగును; అది తన హీనరూపములందు, లేక మిక్కిలి బాహ్యాభివ్యక్తియందు మాత్రమే ప్రాణిక–భావికము. – శ్రీ అ.

అంతర్జ్ఞానమయ సత్తకు జెందును, ఈ భక్తి తక్కిన ప్రకృతినంతను ఉద్ధరించి, భగవంతునితో ఏకము చేయును. అయినను, వ్యావహారికముగా తక్కిన భక్తి రూపములు పూర్వాంగము లనుకొన వచ్చును. ఏలన గీతయే ఇట్లు నుడువును : సమగ్రజ్ఞానమును బొంది, జన్మజన్మమున దాని ననుష్ఠించిన పిమ్మటనే, అనేకజన్మల అంతమునందే జ్ఞానభక్తుడు పరాత్పరుని ప్రాపించగలడు (7-19). కారణము, వాసుదేవుడే సర్వ-మను జ్ఞాన ప్రాప్తి మిక్కిలి దుష్కరము, మఱియు నట్టి జ్ఞానమును బొందగలిగి, తన సంపూర్ణ సత్తతోను, తన ప్రకృతియొక్క సర్వప్రకారములందును, సర్వతోముఖమగు తన జ్ఞానముయొక్క విస్తృతశక్తి చేతను పరాత్పరునిలో ప్రవేశింపగలిగిన "మహాత్ముడు" ఈ పృథివియందు కడు దుర్లభుడు (7-19) - "సర్వవిత్, సర్వభావేన" (15-19).

10. సకామభక్తి గుణదోషములు :

ఇపు డీ శంక బొడమును - భగవంతుని కొఱకు భగవంతుని గాక, లౌకికలాభములకొఱకో, శోకనివృత్తికొఱకో భగవంతు నన్వేషించు భక్తి యెట్లు ఉదారమగును? ఇట్టి భక్తియందు అహంభావము, దౌర్బల్యము, కామము ప్రాబల్యము వహించవా? మఱియు నిది నిమ్న ప్రకృతి వ్యాపారము గాదా ? ఇంకను, ఎచ్చట "వాసుదేవః సర్వ మితి" (7-19) - యను సమగ్రజ్ఞానము లేదో, అచ్చట భక్తుడు తన స్వీయావసరము, స్వభావము, ప్రకృతులకు అనురూపమగు భగవంతుని భిన్నభిన్న నామరూపములను గల్పించుకొని, సాహాయ్యార్థము లేక తన లాలసల పూరణార్థము వానినే పూజించును. భగవంతుని స్థానమున అతడు ఇంద్రునో, అగ్నినో, విష్ణువునో, శివునో కల్పించును; లేక దివ్యీకృత క్రీస్తునో, బుద్ధునో కల్పించును; అథవా ప్రాకృతగుణముల ఒక సముచ్చయమును గల్పించును. అనగా, దయాప్రేమల సౌమ్యభగవంతునో, ధర్మన్యాయముల తీక్ష్ణభగవంతునో, క్రోధదండముల భీషణభగవంతునో, కల్పించును; లేక వీనిలో కొన్నింటియొక్క మిశ్రరూపమునో కల్పించును; కల్పించి ఆ దేవత ముందు సాగిలబడి, లౌకిక శుభమునో, దుఃఖ నివారణమునో, భ్రాంతిమయము, స్వమతాంధము, బౌద్ధికము, అసహిష్ణువు నగు జ్ఞానమునకు సాంప్రదాయిక సమ్మతినో ఆదేవతనుండి కోరుకొనును. ఒక దశవఱకు నిది యంతయు మంచిదే. కాని సర్వ వ్యాపి వాసుదేవుడే ఇది యంతయు (7-19)

నని యెఱింగినవాడు సుదుర్లభుడు. నానావిధ బాహ్యకామనలు మానవులను పెడదారి బట్టించి, అంతర్జ్ఞానము యొక్క కార్యపద్ధతిని హరించి వేయును – "కామైః స్తైః స్తైః ర్హృతజ్ఞానాః" (7–20). ఇట్లు పరదేవతాజ్ఞానమును గోల్పోయి, తమ కామముల కనురూపముగా నుండి ఇతరదేవతల నాశ్రయింతురు – "ప్రపద్యంతే అన్యదేవతాః" (7–20). మఱియు నిట్లు తమను సంకుచితపఱచుకొని, తమ ప్రకృత్యవసరము దీర్చు ఈ యా నియమమునో, ఆచారమునో స్థాపింతురు. మఱియు దీనియందంతటను వారు ఒక అదమ్య వైయక్తికనిర్ణయమునే, తమ ప్రకృతియొక్క ఈ సంకుచితావసరమునే అవలంబించి, దానినే పరమసత్యముగా గొందురు – అనంతమును, దాని విశాలతను అవలంబింప వా రింకను అసమర్థులు. ఈ దేవతారూపములం దున్న భగవంతుడే, వారి శ్రద్ధ పూర్ణమగు నేని, వారికి కామ్యముల నిచ్చును ; కాని ఈ కామ్యఫలము లును, భోగములును తాత్కాలికములు, మఱియు క్షుద్రబుద్ధియు, అపక్వహేతువును మాత్రమే వీని అన్వేషణమును తమ మతము మఱియు జీవనముల సూత్రము గావించుకొనును. మఱియు నీ మార్గమున ఏ మేరకు ఆధ్యాత్మికప్రాప్తి గలుగునో, ఆమేర కది దేవతల ప్రాప్తియే యగును. ఇక నీ దేవతలు క్షరప్రకృతిరూపములం దున్న భగవంతుడు మాత్రమే గాని, స్వస్వరూపమునం దున్న పూర్ణభగవంతుడు గాడు. కాని ఎవరు అతీత, పూర్ణభగవంతు నారాధింతురో, వారు దీని నంతను ఆలింగనముగావించుకొని, రూపాంతర మొందింతురు, అనగా దేవతలను తమ ఉత్తమసత్యమునకును, ప్రకృతిని తన ఉత్తమ శిఖరములకును లేవనెత్తుదురు, మఱియు స్వయముగా దేవతలను దాటి వెళ్ళి, పూర్ణభగవంతునే చేరుకొందురు – "దేవాన్ దేవయజో యాంతి, మద్భక్తా యాంతి మామపి" (7–23).

11. నిమ్నభక్తి పరభక్తికి మార్గము :

అయినను, ఈ భక్తుల దృష్టి అపూర్ణ మనిచెప్పి, భగవంతుడు వీరిని నిరాకరించడు. కారణము, భగవంతుడు తన అతీతసత్తయందు అజుడు, అవ్యయుడు, ఈ ఆంశికరూపముల కన్నింటికి పరుడును గావున, ఏ ప్రాణికిని సులభముగా తెలియబడడు. అతడు తన అమేయమాయా పటలమునందు స్వయమావృతుడై యుండును (7–25). ఇది అతని యోగమాయ – 'యోగ' మనగా, దీనిచేత అతడు ప్రపంచముతో నొకటిగా నుండియు, దాని కావల నుండును; హృదయము

లందుండియు, ప్రతిప్రాణికిని ప్రకటము గాడు. ప్రకృతియందలి అభివ్యక్తులన్నియు అతని కర్మలు, శక్తులు, ముసుగులే యైనను, ప్రకృతిగతుడగు మానవుడు వానిని భగవంతుడే యని భావించును (7–24). భగవంతుడు గత, వర్తమాన, భావిభూతము లన్నింటిని ఎఱుంగును గాని, అతని నెవ్వరు నెఱుంగరు (7–26). ఇట్లు తన క్రియాకలాపముతో భూతములను మోహమున ముంచిన పిమ్మట, ఆ క్రియలయం దతడు వాని నేమాత్రము కలిసికొనడేని, అపుడిక మానవునికి భగవత్ప్రాప్తిని గుఱించిన ఎట్టి ఆశయు నుండదు. కావుననే తమ ప్రకృతి ననుసరించి, వా రే మార్గమున భగవంతుని సమీపింతురో, అట్టి భక్తినే భగవంతు డంగీకరించి, దానికి తన దివ్యప్రేమతో సమాధాన మిచ్చును (4–11), ఇంతకు దేవతాదిరూపములు భగవంతునియొక్క ఒక అభివ్యక్తియే, దానిద్వారా అపూర్ణ మానవబుద్ధి భగవంతుని స్పృశించగలుగును, అటులే మన అంతరాత్మ అతనివైపుకు తిరుగుటకు ఈ కోరికలును ఒక ప్రథమసాధనమే; మఱియు భక్తి ఎంత సంకుచితమైనను, అది కేవలము వ్యర్థము, విఫలము గాదు. ఏలన ప్రతి భక్తికిని విశ్వాసము పరమావశ్యకము – "ఏయే భక్తుడు నా ఏయే రూపమును విశ్వాసముతో నర్చింపగోరునో, అతని ఆ విశ్వాసమును నేను దృఢము, అచలము గావింతును" (7–21). తన అర్చనా విధానమునందలి ఆ విశ్వాసబలముచేత నతడు తన కామమును బొందుటయే గాక, అప్పటికి తనకు తగిన ఆధ్యాత్మికోపలబ్ధిని గూడ బొందును. భగవంతు నుండి, తన సర్వకల్యాణమును బొందజూచుచు, చివరకు భగవంతుని యందే తన సర్వకల్యాణమును బొందజూచు స్థితికి వచ్చును. అటులే భగవంతునిపైననే తన సర్వసుఖములకు నాధారపడుచు, చివరకు భగవంతుని యందే తన సర్వసుఖమును నెలకొల్ప నేర్చుకొనును. అటులేగుణరూపములందు భగవంతుని దెలిసికొనుచు, చివర కతనిని సర్వముగాను, సర్వవస్తువుల ప్రభవమగు సర్వాతీతముగాను [1] తెలిసికొనును.

[1] పరాత్పరప్రాప్తికి పిమ్మట సైతము, అల్పతరమగు మూడు భక్తిభావములకును ఒక తావుండును, అయితే అప్పుడవి సంకుచిత వైయక్తికరూపమున గాక, పరివర్తితరూపము నందుండును. ఏలన అపుడును ప్రపంచమునందలి దుఃఖమును, అశుభమును, అజ్ఞానమును దొలగించి, పరమకల్యాణమును స్థాపింప నుత్కటేచ్ఛ యుండవచ్చును.

– శ్రీ అ.

2

12. భక్తిజ్ఞానము లేకము :

ఇట్లు ఆధ్యాత్మికవికాసముచేత భక్తి జ్ఞానముతో నేకమగును. జీవుడు ఒకే భగవంతునియందు రమించ నారంభించును – ఈ భగవంతునే అతడిపుడు సమస్త సత్తగను, చేతనగను, ఆనందముగను, మఱియు సర్వవస్తువులు, ప్రాణులు, ఘటనలుగను దెలిసికొనియున్నాడు ; మఱియు నీ భగవంతునే ఆత్మయందును, ప్రకృతియందును, తదతీతమగు పరముగను దర్శించి యున్నాడు. అత డతనితో సదా "నిత్యయుక్తుడు" (12–2). అతని సమస్త జీవనమును, సత్తయు స్వయముగా నిపు డొక <u>సనాతనయోగము</u> – ఎవనికంటెను పరతరము లేదో (7–7), అట్టి పరమపురుషునితో యోగము; ఎవనికంటెను అన్యము లేదో, అట్టి విశ్వపురుషునితో యోగము. ఎట్టి ఆంశికదేవతయందు, విధియందు, లేక సంప్రదాయమునందు గాక, అతని భక్తి యంతయు ఒక్క భగవంతునియందే కేంద్రీకృతమై యున్నది – "ఏకభక్తిః" (7–17). ఈ అనన్యభక్తియే అతని సంపూర్ణ జీవనధర్మము, ఇపు డతడు సమస్త మతవిశ్వాసములను, ప్రవర్తనా నియమములను, వైయక్తికలక్ష్యములను అతిశయించియున్నాడు. సర్వానందమయుని బొందియున్నాడు గాన, ఇపుడతనికి దూరముచేయవలసిన దుఃఖ మేదియు లేదు. సర్వపరిపూర్తిని క్షణములో సాధించు సర్వశక్తి యొడిలో నున్నాడు గాన, అతనికి వేటాడవలసిన కామము లేవియు లేవు. తా, నే జ్యోతిలో నివసించుచున్నాడో, దానినుంచి సర్వజ్ఞానము నతనిపైకి ప్రవహించును గాన, అతని కిపు డే సందేహములును లేవు. అతడు భగవంతుని పరిపూర్ణముగా ప్రేమించును, మఱియు నతనికి ప్రియుడు; అతడు భగవంతునియందు రమించు నట్లే, భగవంతుడును అతనియందు రమించును (7–17). ఇతడు జ్ఞానవిలసితుడగు భగవద్భక్తుడు – "జ్ఞానీ భక్తః" మఱియు నీ జ్ఞాని, నా ఆత్మయే యని భగవంతుడు పలుకును (7–18); ఇతరులు భగవంతుని యొక్క ప్రకృతిగతమగు రూపములనే బొందుచుండగా (7–23), ఇతడు సరాసరి పురుషోత్తముని ఆత్మసత్తను, విశ్వసత్తనే బొందును; కారణము అత డతనితో నిత్యయుక్తుడు. అతనికి పరప్రకృతిలో తిరిగి దివ్యజన్మ ఘటిల్లినది – ఈ దివ్యజన్మ సత్తయందు సమగ్రము, సంకల్పమునందు సంపూర్ణము, ప్రేమయందు అనన్యము, జ్ఞానమునందు సంసిద్ధము. ఈ దివ్యజన్మ మిక్కిలి యుక్తమే, కారణము, దీనివలన జీవుడు తననుదా నతిశయించి, తనయొక్క సంపూర్ణము, అత్యున్నతము నగు సత్యమును గనుగొనగలిగెను.

3. [1] పరమపురుషుడు

1. రెండు ప్రధానభావములు :

ఇప్పటికే ఏడవ అధ్యాయమున జరిగిన చర్చ పూర్ణతరము, సునిర్దిష్టము నగు నొక నూతన ప్రాతిపదికను మనకు సమకూర్చును. ఆ చర్చాసారాంశమిది : మన మంతర్ముఖులమై, ఒక మహత్తరచేతనకును, ఒక పరమ అస్తిత్వమునకును అభిముఖముగా నడువవలెను; అయితే ఈ గమనము నందు మన విశ్వప్రకృతిని సర్వథా త్యజించరాదు, దాని సారతత్త్వమును పైకి గొనిపోయి, ఆధ్యాత్మికముగా పూర్ణముగావించదగును. మర్త్యమగు మన అపూర్ణత నుండి దివ్యపూర్ణతలోనికి మార్పు మాత్రమే జరగవలెను. దీని సంభవతకు ఆధారముగా నున్న ప్రథమ భావ మిది: మానవునియందలి వైయక్తికాత్మ తన సనాతన స్వరూపమునందును, మూలశక్తి యందును పరమాత్మయొక్క ఒక తేజఃకిరణము, అతని సత్తయొక్క ఒక సత్త, అతని చేతనయొక్క ఒక చేతన, అతని ప్రకృతి యొక్క ఒక ప్రకృతి; కాని ఈ మనోమయ, అన్నమయ జీవితముయొక్క అంధకారమునందు అది తన ప్రభవమును (source), సత్యతను, స్వభావమును స్వయముగా మఱచి పోవును. ఇక ద్వితీయభావ మేమన, అభివ్యక్తియందు అంతరాత్మ ప్రకృతి ద్వివిధము – 1. మూలప్రకృతి, దీనియందది తన స్వీయ, సత్య, ఆధ్యాత్మిక సత్తతో నేకమై యుండును, 2. గౌణప్రకృతి, దీనియందది అహంకారా జ్ఞానములు గల్పించు కల్లోలమున కధీనమై యుండును. ఈ రెండవ దానిని త్రోసిపుచ్చి, ఆధ్యాత్మిక ప్రకృతిని తిరిగి పొంది, దానిని పూర్ణము, సశక్తికము, సక్రియము చేయవలెను. ఆంతర స్వయంపరిపూర్తిద్వారా, ఒక నూతన ధామమును తెఱచి, ఒక నూతన శక్తియందు తిరిగి జన్మించి, భాగవతప్రకృతిని తిరిగి చేరుకొని, ఎవని నుండి మన మీ మర్త్య రూపములోనికి దిగివచ్చినామో, తిరిగి మన మట్టి భగవంతుని అంశ మగుదుము.

2. భక్తి సర్వోత్తమసాధనము :

గీతాసమకాలీనమగు సాధారణ భారతీయ మనోవృత్తి నిషేధాత్మకము కాఁగా, ఇచ్చట తక్కువ నిషేధకము (negative), ఎక్కువ విధాయకము (affirmative) నగు గీతాప్రవృత్తి గన్పించును. సిద్ధియందు మానవుని ప్రకృతియొక్క ఆత్మవినాశనమునకు

[1] గీత : అధ్యాయము 7, శ్లోకములు 29, 30; మఱియు అధ్యాయము 8.

బదులు పరప్రకృతియందు దాని పరిపూర్తి రూపమగు విశాలతర పరిష్కార మిచ్చుట దర్శన మిచ్చును. భక్తి సంప్రదాయముల నిన్న మొన్నటి వికాసముయొక్క ఛాయలు సైతము ఆనాటి గీతయందు బొడకట్టును. అయినను గీతాదృష్టిలో, అహంకారము మఱుగున గుప్తముగా నుండి మనకు ముందు దర్శనమిచ్చు తత్త్వము ప్రశాంతము, విశాలము, నిర్వ్యక్తికము నగు అక్షరాత్మ; దీనియొక్క సమతయందును, ఏకత యందును క్షుద్రమగు మన అహంకారిక వ్యక్తిత్వము రూపుమాసిపోవును, దీని ప్రశాంతశుద్ధతయందు కామప్రేరణఱు కరిగిపోవును. మన ప్రథమానుభవ మిట్లున్నను, సమగ్రతరమగు మన ద్వితీయదర్శన మొక సజీవానంతుని, అపరిమేయ దివ్యపురుషుని ఆవిష్కరించును ; అతనినుండియే మన సర్వస్వము ప్రభవించును, అతనికే మన సర్వస్వము జెందును - పురుష ప్రకృతులును, బ్రహ్మజగత్తులును, ఆత్మభావమునందును, పురుషభావమునందును మన మతనితో నేకమైనపుడు, మనము మనలను గోల్పోవుటకు బదులు, అతని సర్వాధిక్యమునందు నెలకొని మన యథార్థ స్వరూపమును దిరిగి పొందుదుము. మఱియు నిది ఏకకాలమున మూడు సమకాలీన వృత్తులచే సాధించబడును - 1. అతని మఱియు మన ఆధ్యాత్మిక ప్రకృతియందు నెలకొని, ప్రవర్తించు కర్మలద్వారా ఒక సమగ్ర ఆత్మదర్శనము, 2. ఎవనియం దంతయు నుండునో, ఎవ దంతయునో, అట్టి దివ్యపురుషుని జ్ఞానముద్వారా ఒక సమగ్ర ఆత్మవికాసము, మఱియు - 3. ఇది సర్వశ్రేష్ఠము, నిశ్చాయకము నగు వృత్తి - మన సంపూర్ణ సత్తయొక్క భక్తిప్రేమలద్వారా ఈ విశ్వాత్మునికి, పరమాత్మునికి ఒక సంపూర్ణ ఆత్మసమర్పణము; మన కర్మాధీశ్వరునికి, మన హృదయనివాసికి, మన జీవనాధారమునకు ఆకర్షింపబడి, ఇట్లు సమర్పించు కొందుము. మన సర్వస్వమునకు మూలమైన వానికి మన సర్వస్వము నర్పించు కొందుము. సంతతసమర్పణముచే మన జ్ఞానశక్తి అతని జ్ఞానముగాను, మన సమస్త క్రియ అతని శక్తిప్రకాశముగాను మాఱును. మన ఆత్మసమర్పణయందలి ప్రేమవేగము మననుపైకి అతనిదగ్గరకు గొనిపోయి, అతని గభీరతమహృదయ రహస్యమును మనకు తెఱచిచూపును. ఇట్లు ప్రేమ, యజ్ఞముయొక్క త్రిసూత్రమును పూర్తిచేసి, ఉత్తమరహస్యము (4-3) యొక్క త్రయాత్మక కీలకమును సిద్ధపఱచును.

3. అంత్యజ్ఞాన మెట్లు గలుగును ?

మన ఆత్మసమర్పణయందు, సమగ్ర జ్ఞానము దాని కార్యసాధక శక్తికి ప్రథమనియమము. కావున ముందు మన మీ దివ్య పురుషుని తన దివ్యసత్తయొక్క

సమస్తశక్తులు మఱియు తత్త్వములందు - "తత్త్వతః" (7-3) - తెలిసికొనవలెను. కాని ప్రాచీనుల దృష్టికి, తత్త్వజ్ఞానముయొక్క మూల్యమంతయు మనలను జరామరణములనుండి ఒక పరమభావముయొక్క అమృతత్త్వము లోనికి విడిపించు సామర్థ్యమునందే యుండెను. కావున తన శ్రేష్ఠరూపమునం దీ విముక్తియు ఆధ్యాత్మిక ఆత్మపరిపూర్తినిమిత్తము తాను వివరించిన ప్రక్రియయొక్క ఒక చరమఫలమెటు లగునో, గీత మన కిపుడు చూపును. ఫలదృష్ట్యా పురుషోత్తమ జ్ఞానము, పరిపూర్ణ బ్రహ్మజ్ఞానము ఒకటే యని గీత వచించును. ఎవరు తమ ఆశ్రయముగా, తమ దివ్యజ్యోతిగా, తమ ఉద్ధారకర్తగా, తమ ఆత్మలను గ్రహించి, ధరించువానిగా నన్ను ఆశ్రయింతురో, కృష్ణుడు చెప్పును, జరామరణమోక్షము నిమిత్తము తమ మర్త్యభావము నుండి నావైపుకు మఱలుదురో, వారు బ్రహ్మను, సమగ్ర ఆధ్యాత్మిక ప్రకృతిని, సమస్తకర్మను దెలియగలరు, (7-29). మఱియు వారు న న్నెఱుంగుదురు గావునను, మఱియు నదే కాలమున జడప్రకృతిని, దైవ ప్రకృతిని, యజ్ఞేశ్వరసత్యము నెఱుంగుదురు గావునను, ప్రయాణకాలముయొక్క విషమక్షణమునందు సైతము నా జ్ఞానమును గలిగియుండి, తమ సంపూర్ణచేతన యందును నాతో నేకమైయుందురు (7-30). కనుక వారు నన్ను బొందుదురు. నిర్వ్యక్తిక బ్రహ్మమున తమ వ్యక్తిత్వమును గోల్పోవువారియంత నిశ్చయముగాను, నా భక్తులు సాక్షాత్తు నా పరమపదమును బొందుదురు. ఇట్లు గీత మహత్త్వపూర్ణము, నిశ్చయకరము నగు సప్తమాధ్యాయమును సమాప్తము గావించును.

4. విశ్వతత్త్వములు :

ఇచ్చటి ఈ పారిభాషికపదములు ప్రపంచము నందు భగవదభివ్యక్తియొక్క ప్రధాన, మూలభూత సత్యములను సంక్షేపముగా మనకు దెలుపును. ప్రపంచము యొక్క ప్రవర్తకము (originative) మఱియు నిర్వాహకము (effective) నగు తత్త్వము లన్నియు, సమగ్ర ఆత్మజ్ఞానముయొక్క పునఃప్రాప్తికి అంతరాత్మకు గావలసిన దంతయు నిచ్చట గలవు. 1. "తద్బ్రహ్మ," ఆ బ్రహ్మ; 2. "అధ్యాత్మం", ప్రకృతిగతమగు ఆత్మతత్త్వము; 3. "అదిభూతం" మఱియు "అధిదైవం", సత్తయొక్క విషయగత రూపము మఱియు విషయిగత రూపము ; 4. చివరకు "అధియజ్ఞః", కర్మయజ్ఞ రూపమగు విశ్వతత్త్వరహస్యము. నేను, కృష్ణుడు పలుకును, వీని యన్నింటికి బై నుండు పురుషోత్తముడును, అయినను ఏకకాలమున వీని యన్నింటిద్వారాను, క్రమముగా వీనిద్వారాను నన్ను దెలిసికొనవలెను - తిరిగి నన్ను బొందగోరు

మానవచేతన కిది యొక్కటే సంపూర్ణమార్గము. కాని ఈ పదముల అర్థము స్వయముగా స్పష్టము గాదు, కనీస మవి విభిన్నవ్యాఖ్యల కవకాశ మిచ్చును; కావున వెంటనే వాని వివక్షితార్థమును స్పష్టీకరింపు మని అర్జునుడు గోరగా, కృష్ణుడు సంక్షిప్తసమాధాన మిచ్చును – గీత ఎచ్చటను శుద్ధ తాత్త్వికవివరణ కెక్కువ కాలము వెచ్చించదు; అంతరాత్మ సత్యమును గ్రహించి, తదనుభవపథమున సాగుటకు వలసినంతయే, వలసినరీతిగనే గీత తత్త్వముల వివరించును. అస్తు. 'తద్బ్రహ్మ' పదమును ఉపనిషత్తులు ప్రాకృతపురుషునికి ప్రతి రూపుడగు స్వయంభూపురుషుని పరముగానే అసకృత్తుగా ప్రయోగించియుండగా, గీత దీనిని అక్షరమగు ఆత్మభావపరముగా నుద్దేశించినట్లు గన్పించును; ఇది భగవంతునియొక్క పరమ ఆత్మప్రకటనము, దీని అవికార్యనిత్యత్వముపైననే పరిణామ శీలియగు సవికార జగమంతయు నాధారపడియుండును – "అక్షరం పరమం" (8–3). ఆధ్యాత్మ మన, <u>పరప్రకృతి</u>గతమగు (7–5) అంతరాత్మసత్తయొక్క ఆధ్యాత్మికసంభూతియు, ధర్మమును, కర్మయన, సృష్టి ప్రవృత్తి మఱియు శక్తియు నగు 'విసర్గమునకు' (8–3) పేరు ; ఈ విసర్గము స్వభావమునుండి, అనగా మొదటిదియగు ఆత్మసంభూతినుండి సర్వవస్తువులను సృజించును, మఱియు దాని ప్రభావము క్రింద ప్రకృతియందు వాని బాహ్యసంభూతిని సాధించును. పోగా అధిభూత మన, బాహ్య లేక క్షరసంభూతి ఫలితమగు బాహ్యజగత్తు–"క్షరభావః" (8–4). అధిదైవత మన, పురుషుడు (8–4), ఇతడు నిమ్నప్రకృతిగతమగు అంతరాత్మ లేక విషయి (subjective) పురుషుడు; ఇతడు తన మూలస్వభావమునుండి కర్మచేత ప్రకృతియందు సాధించబడిన క్షరసంభూతినంతను విషయముగా వీక్షించుచు, నుపభోగించును. చివరకు అధియజ్ఞుడు సదేహములగు సర్వభూతముల దేహములందు గుప్తముగా నుండు పురుషోత్తముడు (8–4). కావున ఉన్నదంతయు నీ తత్త్వముల సూత్రములోనికి వచ్చివేయును.

5. తత్త్వముల సంబంధములు :

ఈ సంక్షిప్త వివరణకు వెనువెంటనే గీత జ్ఞానముచేత చరమముక్తికి సంబంధించిన భావమును వివరింపదొడంగును – ఈ జ్ఞానమును సప్తమాధ్యాయ చరమశ్లోకమున గీత సూచించియే యున్నది. తర్వాత ఈ విషయమును గీత మఱల (8–9, 10) చేపట్టి, అభ్యాసమునకు, అంతఃసాక్షాత్కారమునకు అధికతర ప్రకాశమిచ్చును గాన, అప్పటివఱకు వేచియుందము. కాని ఇంకను ముందుకు సాగకపూర్వము,

ఈ బ్రహ్మాది తత్త్వముల మధ్యగల సంబంధములను అర్థముచేసికొను టావశ్యకము. ఏలన ఇచ్చట విశ్వక్రమమునకు సంబంధించిన గీతాభావము సూచితమైనది. మున్ముందు బ్రహ్మము గలదు. ఇది అత్యున్నతము స్వతఃసిద్ధము నగు అక్షరభావము; దేశ - కాల - నిమిత్తములకు లోబడి సాగు విశ్వప్రకృతిఖేలనము వెనుక, సర్వభూతములును ఈ అక్షరబ్రహ్మమే యైయున్నవి. ఏలన దాని స్వతఃసిద్ధ సత్తచేతనే దేశకాలనిమిత్తములు వర్తించ గలుగును; సర్వగతమైనను, అవిభాజ్యమగు దాని అవికార్య ఆధారము వినా, అవి తమ విభజనలు, ఫలితములు, మఱియు మానముల యందు ప్రవర్తింపజాలవు. అయినను ఈ అక్షరబ్రహ్మ స్వయముగా నేదియు చేయదు, దేనిని చేయించదు, దేనిని నిర్ణయించదు; అది అపక్షపాతి, సమము, సర్వధరము, కాని అది వరించదు, ప్రారంభించదు. అయితే ప్రారంభించున దేది? నిర్ణయించున దేది? పరుని దివ్య సంకల్పమున కేది సాధనము? కర్మను నియమించుచు, సనాతనసత్తనుండి కాలములోపల విశ్వసంభూతిని విస్తరింపజేయున దేది ? స్వభావరూపమున నున్న పరప్రకృతి. ఈ ప్రకృతిక్రియకు తన అవిచల అక్షరాత్మను పురుషోత్తము డాధారము చేయును. ఇట్లతడు తన దివ్యసత్తను, చేతనను, సంకల్పము లేక శక్తిని ప్రకటించును: ఏతత్త్రయమే పరప్రకృతి – "యయేదం ధార్యతే జగత్" (7–5). పరప్రకృతియం దుండు పరమపురుషుడు తన సత్తయందు జీవుని ఆధ్యాత్మిక స్వభావమునకు సంబంధించిన సత్యమును వేఱుచేసి, తన ఆత్మజ్ఞాన ప్రకాశమున దాని సక్రియ భావమును కనుగొనును. ప్రతి జీవుని జీవాత్మయొక్క ఏ అంతఃస్థిత సత్యము మఱియు తత్త్వము గలవో, ఏది తన క్రియచేత తన అభివ్యక్తిని సాధించుకొనునో, అన్నింటి యందును ఏ మూలభూత దివ్యప్రకృతి వాని సమస్త పరివర్తనలు, భ్రష్టాచారములు, పునఃపతనముల వెనుక స్థిరముగా నుండునో, అదియే <u>స్వభావము</u>. స్వభావగతమైన దంతయు విశ్వప్రకృతిలోనికి విడువబడును. అపుడా ప్రకృతి పురుషోత్తముని అంతశ్చక్షువు క్రింద దాని బాహ్యరూపమును సాధించును. మాఱని స్వభావమునుండి, అనగా ప్రతిసంభూతికిని మూలమగు సత్తనుండి, ఆ స్వభావమును ప్రకటించు వివిధ భావములను ప్రకృతి సృజించును, నామరూపము లందును, దిక్కాలము లందును, కార్యకారణ నియమము ననుసరించి సర్వ పరివర్తనలను బహిర్గతము చేయును.

6. ప్రకృతిగత ఆత్మ క్షరపురుషుడు :

ఇట్లు ఒక స్థితినుండి మఱియొక స్థితిలోనికి పరివర్తనను సాధించుచు, తత్త్వమును బహిర్గతము చేయునది కర్మ యనబడును; ఈ కర్మ ప్రకృతిశక్తి, ప్రక్రియాదేవత. దీని ప్రథమరూపము స్వభావమును తన సృజనాత్మకక్రియలోనికి విడిపించుట - "విసర్గః" (8-3) యగును. ఇచ్చట సృజన మన భూతసృష్టి - "భూతకరః", మఱియు వాని అంతరంగ రూపమగు భావసృష్టి - "భావకరః". కర్మయొక్క సృజనాత్మశక్తియే ఈ సృష్టి కంతటికి కారణము. ఈ క్షరభావము, "అధిభూతము" (8-4) అంతయు ప్రకృతి శక్తుల సంఘాతమునుండి వెడలుచున్నది. ఈ అధిభూతమే జగత్తు మఱియు పురుషచేతనకు విషయము. ప్రకృతిస్థుడగు నీ పురుషుడే (13-22) భోక్తయు, ద్రష్టయు నగు దేవత; మనస్సు, సంకల్పము, ఇంద్రియము, మున్నగునవి పురుషుని చేతన సత్తయొక్క శక్తులు, వీనిద్వారానే అతడు ప్రకృతిక్రియ తనయందు ప్రతిబింబించు కొనును, వీనినే "అధిదైవ" మందురు. కావున ప్రకృతిస్థుడగు నీ పురుషుడే "క్షరపురుషుడు", భగవంతుని సనాతన కర్మరూపము. ప్రకృతినుండి బ్రహ్మములోనికి ఉపసంహరించు కొనిన ఈ పురుషుడే "అక్షర పురుషుడు", భగవంతుని సనాతన మౌనరూపము. కాని క్షరపురుషుని రూపమునందు, శరీరమునందు పరమ పురుషుడు నివసించును, ఇతడు ఏకకాలమున అక్షరసత్తయొక్క శాంతిని, క్షరక్రియ యొక్క భోగమును గలిగియుండు పురుషోత్తముడు. ఇతడు ఎక్కడో పరమున పరమపదమునందుండుటయే గాక, మానవుని హృదయమునందును ప్రకృతియందును గలడు. అచ్చట అతడు ప్రకృతికర్మల నొక యజ్ఞముగా స్వీకరించును, మఱియు మానవుని బుద్ధిపూర్వకమగు నాత్మసమర్పణకు వేచియుండును; కాని మానవుని అహంకారావస్థ యందు సైతము అతడు అతని స్వభావముయొక్క అధీశ్వరుడుగాను, కర్మలయొక్క నియామకుడుగాను నుండును, అతని కంటిక్రిందే ప్రకృతి మఱియు కర్మనియమము పనిచేయును. అంతరాత్మ అతనినుండియే వెలువడి, ప్రకృతి పరివర్తనల ఖేలనమున ప్రవేశించెను; అక్షరాత్మ ద్వారా తిరిగి అతని దగ్గరకే, అతని పరమధామము (15-6) నకే వచ్చి చేరును.

7. అంత్యస్మృతి ప్రాధాన్యము :

ఈ లోకములోనికి దిగిన మానవుడు ప్రకృతి కర్మల కధీనుడై ఇహపరముల మధ్య తిరుగుచుండును. ప్రకృతిమయుడగు పురుషుడు - ఇది యితనిని దెలుపు

సూత్రము, అనగా నితనియందలి ఆత్మ దేనిని చింతించునో, ధ్యానించునో, చేయునో, సదా అదియే యగును. అతడేదిగా నుండెనో అది యంతయు నతని యిప్పటి జన్మను నిర్ణయించెను; ఇక నత డీ జీవితమున ఏదిగా నున్నాడో, దేనిని చింతించునో, చేయునో, ఎయంతయు పరలోకములలోను, భావిజన్మలలోను అత డేమి యగునో దానిని నిర్ణయించును. జన్మ యొక సంభూతి (becoming) యగుచో, మరణము గూడ నొక సంభూతియే గాని, వినాశ మెంత మాత్రము గాదు. "త్యక్త్వా కలేబరం" (8-5) - శరీరమును విడిచి, ఆత్మ తన మార్గమున బోవును. సంధిక్షణమగు నంతిమక్షణమునందలి భావముపై భావి ఎంతగనో ఆధారపడును. ఏలన అంతిమక్షణమున ఆత్మచేతన ఏ సంభూతిరూపమున నిలిచియుండునో, మఱియు నే రూపముతో దాని మనోబుద్ధులు జీవితము పొడవునను నిండియుండెనో (8-6), ఆ రూపమునే అది పొంది తీరును ; కారణము, ప్రకృతి కర్మద్వారా ఆత్మయొక్క ఆలోచనలకును, ఊర్జములకును (energies) కార్యరూప మిచ్చును; నిజాని కదియే ప్రకృతి సంపూర్ణవృత్తి. కావున మానవాత్మ పురుషోత్తమపదము నందగోరుచో, రెండు ఆవశ్యకతలు, రెండు నిబంధనలు గలవు. ఒకటి, తన పార్థివజీవనమున మానవుడు తన ఆంతరజీవితము నంతను తన ఆదర్శమున కనుగుణముగా మలచవలెను ; రెండవది, తన ప్రయాణసమయమున తన ఆకాంక్షాసంకల్పములను నిలబెట్టుకొనవలెను. "అంత్యకాలమున నెవడు నన్నే స్మరించుచు", కృష్ణుడు చెప్పును, "తన దేహమును విడిచి, పయనించునో, అతడు నా భావమును బొందును." (8-5). అనగా పురుషోత్తమభావమును బొందును. అతడు భగవంతుని మూలసత్తతో నేకమగును, అదియే జీవుని పరమసంభూతి - "పరో భావః", అదియే తన స్వరూపములోనికిని, తన మూలములోనికిని తిరిగివచ్చు కర్మయొక్క చరమఫలము. తన మూలభూత ఆధ్యాత్మికప్రకృతియగు స్వభావమును మఱుగుపఱచు విశ్వపరిణామఖేలనము ననుసరించి, అనుసరించి అంతరాత్మ తన చేతనయొక్క ఆయా బాహ్యభావములద్వారా పయనము సాగించి, తన స్వభావమునకు దిరిగి వచ్చి, తద్వారా తన యదార్థమగు ఆత్మను, సత్తను కనుగొని, తన మూలభావమును బొందును, ఈ మూలభావమే ఆరోహణదృష్ట్యా దాని పరభావము, ఈ పరభావమే భగవంతుని 'మద్భావము'. ఒకానొ కార్థమున అంతరాత్మ భగవంతు డగు నని మనము చెప్పవచ్చును; ఏలన తన నిమ్నప్రకృతి మఱియు సత్తల చరమ పరివర్తన ద్వారా, అది తనను భగవంతుని ప్రకృతితో సంయుక్తముగావించుకొనును.

8. స్మృతి ప్రభావము :

మరణకాలమునందలి మనఃస్థితికి గీత పెద్ద ప్రాధాన్య మిచ్చును - చేతనకు గల స్వయంసృజనాత్మకశక్తిని మనము గుర్తించనిచో, ఈ ప్రాధాన్యము మనకు విశదము గాదు. ఆలోచన, అంతర్దృష్టి, శ్రద్ధ దేనియందు గట్టి పట్టుతో సంపూర్ణముగా కుదురుకొనునో, దానిలోనికే మన అంతఃసత్త రూపాంతరము జెందుటకు ప్రవృత్తమగును. ఉచ్చతరమగు ఆధ్యాత్మిక మఱియు స్వయం పరిణత అనుభవముల లోనికి వెళ్లినపుడు, ఈ ప్రవృత్తి మనచేతులలో నొక నిర్ణాయక శక్తి యగును. ఏలన ఈ అనుభవములు బాహ్యవస్తువులపై చాల తక్కువ ఆధారపడును. దేనియందు మనము మనస్సును గీలించి, దేనిని సదా ఆకాంక్షింతుమో, మన మదియే అవితరముగా నగుచుండుట నచ్చట గాంచగలము. కావున అచ్చట ఆలోచన తెగిపోయినను, స్మృతి వ్యభిచరించినను, అది జరుగుచున్న మార్పును ఆపివేయుటయే యగును, లేక దానివలన మనము పూర్వస్థితికి జాఱిపోవచ్చునుగూడ - కనీసము మన మీ నూతనభావమును దృఢముగా స్థాపించుకొనువఱకును ఈ ప్రమాద ముండును. అట్లు స్థాపించుకొని, దానిని మన అనుభవమునకు సామాన్యము (normal) గావించుకొని నపుడు, దాని స్మృతి స్వయముగానే నిలిచియుండును; ఏలన ఇపు డది మన చేతనకు సామాన్యరూపమైనది. మర్త్యలోకమును వీడి వెడలు సంధిసమయమునందలి చేతనావస్థయొక్క ప్రాముఖ్య మిపుడు మనకు స్పష్టము. కాని యిది మన పూర్వజీవనప్రవాహముతోను, పూర్వమనఃస్థితితోను ఎట్టి సంబంధములేని, లేక వానిచేత తగినంతగా సిద్ధము చేయబడని కేవల మరణ శయ్యాస్మృతి గాదు ; పూర్వసన్నాహపూర్వకమైన స్మృతికే ఉద్ధరించు శక్తి యుండును. ఇచ్చటి గీతాభావమునకును, జనతామతము అనుమతించు అనుకూల విషయాసక్తికిని ఎట్టి పొంతనయు లేదు. పూర్వజీవితము నెంత అపవిత్రముగా గడిపినను, మరణకాలమున పురోహితుడు వచ్చి, జలము ప్రోక్షించి, క్షమాపణమంత్రము చదివినచో, అది భవ్య 'క్రైస్తవ' మరణమగును, లేక పవిత్ర కాశీనగరమున గాని, పావనగంగానదియందు గాని మరణించుటయే స్వర్గవిమాన మగును - అని తలంచు జనతామతముతో గీత కెట్టి సామ్యమును లేదు. అంత్యక్షణమున మనస్సు నే దివ్యభావముపై స్థిరముగా నిలుపదగునో, భౌతిక జీవనమున ప్రతిక్షణము నా

భావములోనికి అంతరాత్మ పెరుగుచు, వచ్చి యుండవలెను – "తద్ భావ భావితః" (8-6). "కావుననే," దివ్యగురువు పలుకును, "సర్వకాలములందు నన్ను స్మరించుము, యుద్ధము సేయుము; ఏలన నీ మనోబుద్ధులు సదా నాయందే నిలుపబడి, నా కర్పితము లగునేని, నన్నే నిశ్చయముగా చేరెదవు (8-7). చలించని అభ్యాసయోగము నందు పరమపురుషునితో సంయుక్తమైన చేతనతో నతనిని సర్వదా చింతించుచు, సాధకుడా దివ్య, పరమపురుషుని ప్రాపించును (8-8)."

9. పరమపురుషవర్ణన :

ఇపు డా పరమపురుషుని ప్రథమవర్ణన మనకు లభించును – ఈ పురుషుడు అక్షరపురుషుని కంటె పరుడును, అధికుడును; ఇతనినే గీత పిమ్మట పురుషోత్తము డని పిలుచును (15-8). తన కాలాతీత నిత్యత్వము నందితడును అక్షరుడు మఱియు నభివ్యక్తి కతీతుడు – "అవ్యక్తో-క్షరః" (8-21), మఱియు నిచ్చట కాలమునందు వివిధ సంకేతములు మఱియు ప్రచ్ఛన్నవేషముల ద్వారా అతని అస్పష్టచ్ఛాయలు మాత్రమే మనకు గోచరించును. అయినను అతడు కేవలము నిర్విశేషము మఱియు "అనిర్దేశ్యము" (12-3) నగు సత్త గాడు; అథవా అతడు అనిర్దేశ్య మనుటకు గారణము, మనస్సు తెలియగల సూక్ష్మముకంటెను అతడు సూక్ష్మతరము, మఱియు నతని రూపము చింతనకు అతీతము – "అణోరణీయాం, అచింత్యరూపం" (8-9). ఈ పరమపురుషుడు సర్వద్రష్ట, కాలమునకు పితామహుడు, మఱియు తన ఆత్మదృష్టియందును, సర్వవిజ్ఞానము నందును అధీశ్వరుడు, అనుశాసకుడు; ఇతడే సర్వవస్తువులను తన సత్తయందు యథాస్థానమున నిలుపును – "కవిం, పురాణం, అనుశాసితారం, సర్వస్య ధాతారం" (8-9). ఈ పరమపురుషుడు వేదవిదులు వర్ణించు స్వయంభూ అక్షరబ్రహ్మము; యతిపుంగవులు వీతరాగులై ప్రవేశించున దితనియందే, మఱియు నితని నిచ్ఛించియే వీరు బ్రహ్మచర్యము [1] నభ్యసింతురు (8-11). ఈ సనాతన సత్యమే సత్తయొక్క సర్వోచ్ఛపదము (8-11); కావున నిది కాలగతమగు అంతరాత్మ ప్రయాణముయొక్క పరమగమ్యము, అయితే యిది స్వయముగా నొక గతి గాదు, స్థితి, ఆద్యము, పరమము నగు స్థితి లేక స్థానము – "పరం స్థానం ఆద్యం" (8-28).

[1] ఇచ్చటి భాష యథాతథముగా నుపనిషత్తులనుండి గ్రహింపబడినది – శ్రీ అ.

10. ఉత్క్రమణ ప్రక్రియ :

మరణముద్వారా జీవనమునుండి నిర్గమించి, యోగి యే స్థితియందు పరమ దివ్యగతిని బొందునో, గీత యిపు డా చరమ మనఃస్థితిని వర్ణించును. దాని అంగములు : అచల మానసము, యోగబలయుక్తమైన అంతరాత్మ, భక్తియందు భగవంతునితో సంయోగము – ఈ ప్రేమసంయోగము జ్ఞానముద్వారా సంభవించు నిరాకార ఏకీకరణముచే నెట్టివేయబడదు, పరమ యోగశక్తిలో సంగముగా అది చివరివరకు నిలిచియుండును – మఱియు పూర్తిగా పైకి నాకర్షింపబడి, అంతర్దృష్టి స్థానమగు భ్రూమధ్యమున స్థాపింపబడిన ప్రాణశక్తి (8–10). ఈ స్థితియందు ఇంద్రియద్వారము లన్నియు మూయబడును, మనస్సు హృదయమున నిరుద్ధమగును, తన విక్షిప్తగతినుండి ప్రాణశక్తి మస్తకములోనికి లాగబడును (8–12); బుద్ధి ఓంకారోచ్చారణయందును, దాని భావనాత్మకచింతన పరమపురుషుని స్మృతి యందును కేంద్రీకృతమగును (8–13) – "మా మను స్మరన్". ఇది సుప్రసిద్ధమగు యోగి ప్రయాణపద్ధతి, సనాతన పరమపురుషునికి యోగి చేయు చరమ, సంపూర్ణ సత్తాసమర్పణము. కాని ఇంతకు నిది యొక ప్రక్రియ మాత్రమే; పరమగతికి ముఖ్యనియమమేమన, భగవంతునియొక్క సంతత, అనన్యస్మరణము, యుద్ధమునందు సైతము స్మరణము –"మా మనుస్మర యుధ్యచ" (8–7), మఱియు సమస్త జీవనకర్మను నిత్యయోగములోనికి మార్చుట–"నిత్యయోగ" (8–14). ఎవ డిట్లు చేయునో, అతనికి నేను సులభుడను–అని భగవానుడు చెప్పును. అతడు పరమసిద్ధిని ప్రాపించు మహాత్ముడు.

11. పూర్ణయోగమునందు సైతము అపునరావృత్తి :

ఇట్లు నిష్క్రమించి అంతరాత్మ పొందు స్థితి విశ్వాతీతము. విశ్వమునందలి ఉచ్చతమలోకములు సైతము పునర్జన్మ కధీనములే, కాని పురుషోత్తముని బొందిన ఆత్మపై నెట్టి పునర్జన్మ విధించబడదు (8–16). కావున కేవల జ్ఞానముద్వారా ప్రాప్తించు నిర్విశేష బ్రహ్మము నందే ఫలము లభించునో, భక్తిజ్ఞానకర్మల సమగ్రసాధనద్వారా ప్రాప్తించు, కర్మప్రభువు, సర్వభూతసుహృదుడు నగు స్వయంభూభగవంతునియందును అదే ఫలము లభించును. అత డట్టి వాడని తెలిసికొని, ఆ రూపముననే బొందినచో, పునర్జన్మకును, కర్మ నియమమునకును బద్ధుడు గాడు; అనిత్యము, అసుఖము నగు మర్త్యజీవనము నుండి (9–33) శాశ్వతముగా తప్పించుకొనగోరు ఆత్మ తన కోరిక నిట్లు పూరించు కొనగలదు. జన్మచక్రమును, దానినుండి విమోచనమును

మఱింత కచ్చితముగా మనస్సుముం దుంచు నిమిత్తము గీత యిచ్చట ప్రపంచ యుగముల ప్రాచీన సిద్ధాంతము నవలంబించును. ఈ సిద్ధాంతము ననుసరించి, బ్రహ్మదేవుడు విశ్వమును సృజించుచు, లయముచేయుచుండును. కల్ప మనబడు సృష్టికాలము అతని కొక పగలు, అంతే పరిమాణము గల లయకాలము అతని కొక రాత్రి. ప్రతికల్పము నందును వేయి మహాయుగము లుండును(8–17). పగలు ప్రారంభించగనే, భూతములన్నియు అవ్యక్తమునుండి నిర్గమించి, వ్యక్తమగును; రాత్రి రాగానే, అన్నియు నందులో నదృశ్యము లేక లీనమగును. ఇట్లీ భూతములన్నియు సృష్టిలయచక్రమున వివశముగా దిరుగుచుండును. మఱల మఱల నవి పుట్టుకలోనికి వచ్చి – "భూత్వా భూత్వా" (8–19), మఱలమఱల అవ్యక్తములోనికి బోవుచుండును. కాని ఈ అవ్యక్తము భగవంతునియొక్క ఆద్య దివ్యభావము గాదు; అతని సత్తయొక్క మఱియొక అవ్యక్తభావము గలదు (8–20), అది ఈ అవ్యక్తమునకు బరము, విశ్వాతీతము, సదా ఆత్మస్థితము; అది ప్రపంచాభివ్యక్తికి వ్యతిరేకము గాక, దాని కెంతో పైన, మాఱకయుండు సనాతనభావము ; సర్వభూతములు నశించుచుండగా, నశింప నగత్యములేని భావ మది (8–20). "అవ్యక్తుడు, అక్షరుడు ననబడు నతనినే పరమగతి యందురు; అతనిని బొందినవారు తిరిగి రారు; అది నా పరమధామము" (8–21). ఏలన ఆ ధామమును బొందిన అంతరాత్మ ప్రపంచముయొక్క అభివ్యక్తి ప్రళయముల చక్రమునుండి తప్పించుకొనియున్నది.

12. పరుడును సంబంధరహితుడు గాడు :

గీత ప్రస్తావించిన ఈ సృష్టి సిద్ధాంతమును మనము స్వీకరించినను, కొట్టివేసినను – "అహోరాత్ర విధుల" (8–17) జ్ఞానమునకు మన మిచ్చు విలువపై నిది ఆధారపడియుండును – గీత తన బోధనపరముగా దీని కిచ్చు మలుపు ముఖ్యము. ఈ పరమావ్యక్తమునకు ప్రపంచము యొక్క వ్యక్తావ్యక్తములతో నెట్టి సంబంధ మున్నట్లు గన్పించదు గాన, ఇది అనిరుక్తము, అనిర్వచనీచము నగు కేవలబ్రహ్మము గావలయును – అను ఆలోచన మనకు అనాయాసముగానే బొడవచ్చును; అపుడు పరమపురుషుని బొందుటకు అనురూపమార్గము ఆ అభివ్యక్తియందు ప్రాప్తించిన పరిణామమునంతను వదిలించుకొనుటయే యగును గాని, బుద్ధిజ్ఞానము, హృదయ ప్రేమ, ఇచ్ఛాసంకల్పము, ప్రాణశక్తులయొక్క సంయుక్త ఏకాగ్రతయందు సమస్త చేతనను పైకి గొనిపోవుట గాజాలదు. సంబంధశూన్యమగు – "అవ్యవహారమగు"

(మాం.ఉ.) కేవల బ్రహ్మముపట్ల, ముఖ్యముగా భక్తికి తావులేదు. అయినను గీత ఇట్లు వక్కాణించును, – పరమపురుషుని పదము విశ్వాతీతము, సదా అవ్యక్తమే – "కాని ఎవని యందు సర్వభూతములు నుండునో, ఎవనిచేత నీ ప్రపంచము విస్తరింప జేయబడినదో, ఆ పరమపురుషుడు అనన్యభక్తిచేతనే లభ్యమగును." (8–22) అనగా నా పరమపురుషుడు మన భ్రమలకు దూరముగా, సర్వసంబంధ రహితముగా నుండు కేవల బ్రహ్మము గాదు, పరంతు అతడు ద్రష్ట, స్రష్ట మఱియు నీశ్వరుడు – "కవిం అనుశాసితారం, ధాతారం" (8–), మఱియు నతని ఏకముగాను, సర్వముగాను –"వాసుదేవః సర్వ మితి" (7–19) ఎఱింగి, ప్రేమించుటచేత, సర్వవస్తువులందును, శక్తులందును, క్రియలందును గల అతనితో మన సమస్తచేతనయొక్క యోగమున సాధించుటద్వారా పరమసమగ్రతను, పరిపూర్ణసిద్ధిని, అత్యంతికముక్తిని బొంద జూడదగును.

13. మానసిక, బాహ్యముల సంబంధము :

పిమ్మట మఱింత విచిత్ర విషయము గన్పించును – ప్రాచీన వేదాంతయోగుల నుండి గీత దీనిని స్వీకరించినది. పునర్జన్మను బొందగోరినపుడు, లేక తప్పించుకొన జూచినపుడు, యోగి తన శరీరమును విడువవలసిన పరస్పరభిన్న కాలముల నిది నిర్దేశించును. అగ్ని, ప్రకాశము, దినము, శుక్లపక్షము, ఉత్తరాయణము – ఈ కాలములందు దేహము విడిచిన బ్రహ్మవిదులు బ్రహ్మను బొందుదురు (8–24). పోగా ధూమము లేక మంచు, రాత్రి, కృష్ణపక్షము, దక్షిణాయనము – ఈ కాలము లందు దేహము విడిచిన యోగి చంద్రజ్యోతిని బొందును. ఇవి శుక్ల, కృష్ణ మార్గములు; ఉపనిషత్తులలో వీనిని దేవమార్గ, పితృమార్గములందురు. వీని నెఱింగిన యోగి మోహము నందదు, దారి తప్పదు. శుక్ల కృష్ణమార్గములకు జెందిన ఈ [1] భావనవెనుక నెట్టి మానసిక – భౌతిక సత్యము లేక సంకేతపద్ధతి యున్నను, ఏ మలుపుతో గీత ఈ ప్రకరణమును ముగించుచున్నదో, దాని మాత్రమే మనము గమనించవలెను; "కావున సర్వకాలము లందు యోగమునందుండుము" (8–27). ఒక్క విషయము:

---

[1] యోగానుభూతి నిజానికి మనకు జూపునదేమన, ఈ భావము అన్నియెడల సర్వథా వర్తించకపోయినను, దీని వెనుక నొక మానసిక – భౌతిక సత్యమున్నది, ఉదాహరణకు, ప్రకాశశక్తులకు, అంధకారశక్తులకు మధ్య జరుగు అంతరసంఘర్షమున ముందరి దినము లేక సంవత్సరముయొక్క తేజోమయసమయ మందు సహజప్రాబల్యము గలిగియుండగా, తర్వాతివి చీకటి సమయమందు ప్రబలి యుండును. – శ్రీ అ.

పై భావన మనకు రహస్యవాదుల (mystics) యుగమునుండి సంక్రమించినది. వీరు ప్రతి భౌతికవస్తువు నందు ఒక మానసికవస్తువుయొక్క సశక్తిక సంకేతమును జూచుచుండిరి. ఉదాహరణకు, వెలుగునందు జ్ఞానసంకేతమును, అగ్నియందు ఆధ్యాత్మిక శక్తి సంకేతమును వారు గాంచిరి.

14. స్మృతి నియమములు :

ఇంతకు యోగమునం దుండుటయే, సమస్త సత్తను భగవంతునితో నేకముచేయుటయే ముఖ్యము - చింతనాధ్యానములనే గాక, సమస్తజీవనమును, అనగా క్రియను, శ్రమను, యుద్ధమును సైతము భగవంతుని యొక్క ఒక స్మృతినే చేయునంత సంపూర్ణముగను, సర్వప్రకారము గను భగవంతునితో సమస్తత్తను ఏకముచేయుటయే ముఖ్యము. "నన్ను స్మరించుము, యుద్ధముచేయుము" (8-7) - దీని అర్థమేమి? సామాన్యముగా మన మనస్సునంతను ఆక్రమించివేయు లౌకిక సంఘర్షమునందు ఒక్క క్షణము గూడ ఈశ్వరస్మరణమును గోల్పోవరాదు, మఱియు నిది ఎంతో కష్టమగును, ప్రాయః అసంభవముగను గన్పించును. దీనికి వలయు నితరనియమములు సిద్ధించినపుడే, ఇది సర్వథా సాధ్యమగును. అవి యేవి యన, 1. ఏ యేకాత్మ మన బుద్ధికి భగవంతుడుగా నుండునో, అన్నింటియందలి ఆ యేకాత్మతో చేతనయందు మన మేకముకావలెను, 2. మన చక్షువులు, ఇతర ఇంద్రియములు సైతము సర్వత్ర దివ్యపురుషునే దర్శించవలెను, అపుడు అప్రబుద్ధమగు ఇంద్రియము దర్శించునట్లు దేనిని మనము దర్శింపజాలము, పరంతు దాని రూపమున గుప్తము, వ్యక్తకము గూడనైయుండు భగవంతునిగనే దానిని దర్శింపగలము, మఱియు 3. మన సంకల్పము చేతనయందు పరమసంకల్పముతో నేకముగావలెను. మఱియు సంకల్పముయొక్క, మనస్సుయొక్క, శరీరముయొక్క ప్రతిక్రియ దానినుండి వచ్చినది గనే, దాని చలనముగనే, దానితో పూర్ణము లేక అనన్యముగనే అనుభూతము గావలెను; అదిగో అప్పుడు గీతావిధిని సమగ్రముగా సాధించగలము. అప్పు డిక భగవంతుని స్మృతి తెగిపోవుచుండు మనఃక్రియ గాక, మన కార్యకలాపముయొక్క సహజస్థితియు, ఒక విధముగా మన చేతనయొక్క సారతత్త్వమును అగును. అపుడు జీవుడు పురుషోత్తమునితో స్వాభావికము, ఆధ్యాత్మికము నగు తన సముచిత సంబంధమును గలిగియుండును. మఱియు మన జీవనమంతయు నొక యోగముగా నుండును; సిద్ధమైయున్నను, సదా స్వయంసాధకమగు నొక ఏకతగా నుండును.

4. రాజగుహ్యము

1. భగవంతునియందే తన అస్తిత్వము :

సత్య మింతవఱకు మెట్టు మెట్టుగా నారోహించి, ప్రతిమెట్టునందు సమగ్రజ్ఞానముయొక్క ఒక నవ్యపార్శ్వము నావిష్కరించి, దానిపై ఆధ్యాత్మికస్థితి మఱియు కర్మలయొక్క ఒక నూతనఫలితమును స్థాపించుచువచ్చినది - ఇపుడా సత్య మంతయు మిక్కిలి ప్రాముఖ్యముగల యొక మలుపు తిరుగనున్నది. కావున అర్జునుడు మెలకువతో వినగలందులకు, గురువతని దృష్టిని నిర్ణాయకమగు ఆ మలుపువైపున కాకర్షింప జాగ్రత్తవహించుచున్నాడు. గురు విపుడు సమగ్ర భగవంతుని జ్ఞానమునకును, దర్శనమునకును అతని మనస్సును ఆయత్తపఱచి, ఏకాదశాధ్యాయము యొక్క విశ్వరూప దర్శనమునకు గొని పోవనున్నాడు; ఆ దర్శనము వలన ఈ కురుక్షేత్రవీరుడు తన సత్తా, కర్మ, కార్యముల ప్రవర్తకుడును, భర్తయు తనయందలి, ప్రపంచమునందలి భగవంతుడే యని ఎఱింగినవాడగును. అయినను తనయందు, ప్రపంచమునందు గల దేదియు అతనిని బంధించదు; కారణము, సర్వము నతని నుండియే ప్రభవించి, అతని అనంత సత్తయందే కొనసాగుచు, అతని ఇచ్ఛచేతనే ధరించబడును, అతని దివ్య ఆత్మ జ్ఞానమునందే తన అర్థమును గనును. అతడే తన ఆది మధ్యాంతముగా నుండును. నేను భగవంతునియందే ఉన్నాను, అతనియందలి శక్తిచేతనే కర్మచేయుచున్నానని అర్జునునికి బోధము గలుగవలెను; అర్జునిని కర్మకలాపము దైవక్రియ కొక నిమిత్తము మాత్రమే. అతని అహంకారికచేతన పురుషోత్తముని అమర విస్ఫులింగము గాను, అంశముగాను తనయందున్న వాస్తవపురుషుని మఱుగుపఱచు ఆవరణము మాత్రమే

2. అంతర్దర్శనముచేత సర్వసంశయ నివృత్తి :

అర్జునిని మనస్సులో మిగిలి యుండగల సంశయమును బాపి, తనకు బల మిచ్చి, తాను వెనుదగ్గిన కర్మను జేయించుటకే విశ్వరూపదర్శనము. ఏలన మార్చరాని విధముగా నివ్వబడిన ఆ కర్మాదేశమునుండి అతడు వెనుదగ్గజాలడు; ఏల మార్చరాదనిన, అది తనయందలి భగవంతు డిచ్చిన ఆదేశము, మ ఱియు నిపుడు ప్రపంచమునందలి భగవంతుడుగూడ అదే ఆదేశము నివ్వనున్నాడు. (11-33). ఈ భగవంతుడు విశ్వరూపము ధరించిన కాలపురుషుడుగా (11-32)

మహాభయానక స్వనముతో అతనికి యుద్ధాదేశము నిచ్చును. ఆత్మవిముక్తిని సాధించుకొనుము, విశ్వ రహస్యప్రణాలికయందు నీ కర్మను నిర్వహింపుము - విముక్తకర్మలు రెండును ఒకే వ్యాపారము గావలెను - అని కాలపురుషుడు బోధించును. ఆత్మజ్ఞానము మఱియు నీశ్వరప్రకృతుల జ్ఞానముయొక్క అధికతర ప్రకాశ మర్జుననికి వివరింపబడుచుండగా, నతని బౌద్ధిక సంశయములు విడిపోవుచున్నవి. కాని బౌద్ధికసమాధానమే చాలదు; అంధప్రాయమగు తన బాహ్యా మానవదృష్టిని ప్రదీప్తముగావించు నంతర్దృష్టిచే నతడు చూడవలెను; అప్పు డతడు తన సమస్తసత్తయొక్క సమ్మతితోను, తన సర్వావయవములందు పరిపూర్ణ శ్రద్ధతోను కర్మచేయగలుగును; తన ఆత్మకు నాత్మయు, తన సత్తకు స్వామియు, అటులే ప్రపంచాత్మకు నాత్మయు, సర్వసత్తకు స్వామియు నగు వానియందు పరిపూర్ణభక్తితో కర్మచేయగలుగును.

3. రెండు సంభవ మార్గములు :

ఇంతదనుక జ్ఞానసౌధమునకు పునాది వేయబడినది, లేక దాని కావశ్యకమగు ప్రథమసామగ్రి లేక పరంజా మాత్రము సమకూర్చబడినది, కాని యిపుడు దాని ఆకృతి యంతయు నతని ఉన్మీలితనేత్రముముం దుంచబడును. ఈ అధ్యాయము తర్వాత రాబోవున దంతయు ఈ ఆకృతివిభాగములను విశ్లేషించి, వాని తత్త్వమును జూపును గాన, ఆ మేరకు దానికి ప్రాముఖ్య ముండును. కాని యే దివ్యపురుషు డతనితో భాషించుచున్నాడో, అతని సమగ్రజ్ఞానము సారతః ఇపు డతని కంటిముం దుంచబడును, ఫలితముగా నతడు తన కర్తవ్యమును చూచుటకు మాత్రమే అవకాశ ముండును గాని, ఎన్నుకొనుటకు గాదు. అజ్ఞానము మఱియు అహంకారిక కర్మగ్రంథికి అర్జునుడవశ్యముగా బద్ధుడు గాడని ఇంతవఱకు చేయబడిన ఉపదేశ మతనికి చూపెను. అంతకు పూర్వ మర్జును డా స్థితితోనే సంతుష్టుడై యుండెను; కాని యుద్ధారంభమున ఘోరవిషాదము పైకొనినపుడు, ఆ స్థితికి సహజములగు పరిష్కారము లేవియు నతనిని తృప్తిపఱచలేకపోగా, జీవనకర్మల సన్యాస మొక్కటే అతనికి పలాయనద్వారముగా గన్పట్టెను. అప్పు డతనికి కర్మచేయుటకును, జీవించుటకును రెండు పరస్పర వ్యతిరేక మార్గములు గలవని చూపబడెను - 1. అహంకారికాజ్ఞానమునందలి మార్గము, 2. దివ్యమగు తన అంతరాత్మయొక్క విమలజ్ఞానమునందలి మార్గము, ఇట్టియెడ అతడు కామముతో, ఆవేశముతో, అహంకారరూపమున గుణప్రేరితుడై పుణ్యాపాది

ద్వంద్వసంకులమున కధీనుడై కర్మచేయవచ్చును; అపుడతడు తన కర్మల శుభాశు భఫలితములతో వ్యాకులుడై యుండును, ప్రపంచయంత్రాంగమునకు బద్ధుడై యుండును, కర్మాకర్మ వికర్మల మహాజంజాలమున చిక్కుకొనగా, పరివర్తనశీలమగు వాని విపరీత వేషములు మఱియు ఆభాసములు తన హృదయమును, మనస్సును, అంతరాత్మను కలచివేయుచుండును. కాని అత డజ్ఞానకర్మలకు సర్వథా బద్ధుడు గాడు, ఇష్ట మయితే, అతడు జ్ఞానకర్మలను జేయవచ్చును. అత డిచ్చట ముందు ఉచ్చతరమేధావిగను, జ్ఞాతగను, యోగిగను, ముముక్షువుగను, తర్వాత ముక్తపురుషునిగను, కర్మచేయవచ్చును. ఈ మహాసంభవతను గుర్తించి, దీనిని సాధించునట్టి జ్ఞానము మఱియు నాత్మదర్శనము లందు మనోబుద్ధులను నిల్పదగును : శోకమోహములనుండి తప్పించుకొనుటకు, మానవప్రహేళికనుండి బైటబడుట కిదియే మార్గము.

4. ఆత్మ ముక్తిస్థానము :

మనలోపల నొక ఆత్మ గలదు; అది శాంతము, సమము, కర్మలకంటెను పరము (superior). అది బాహ్యజాలమున బద్ధముగాక, తదాధారరూపమున దానిని నిరీక్షించును, అది కర్మమూలము, అంతర్వర్తి సాక్షి యైనను, దానియందు చిక్కుకొనదు. అనంతము సర్వభృత్తు, అన్నింటియందు నేకాత్మయగు నది ప్రకృతిక్రియ నంతను నిష్పక్షపాతముగా నిరీక్షించుచు, అది ప్రకృతి క్రియయే గాని, తన క్రియ గాదని గాంచును. అహంకారమును, దాని సంకల్పమును, దాని తెలివియు – అన్నియు ప్రకృతియొక్క ఒక యంత్రాంగమే యనియు, వాని కర్మ లన్నియు జటిలమగు ఆమె త్రిగుణవ్యాపారముచేతనే నిర్ణయింపబడు ననియు ఆత్మ గాంచును. సనాతనాత్మ స్వయముగా వీనినుండి సదా విముక్తము; కారణము దానికి జ్ఞానము గలదు ; ప్రకృతియు, నహంకారమును, ప్రాణుల వైయక్తికసత్తయునే సర్వాస్తిత్వము గావని ఆత్మకు దెలియును. ఏలన అస్తిత్వము దివ్యము లేక తుచ్ఛము, అద్భుతము లేక శోకమయము నగు నొక బాహ్యదృశ్యము, క్షరభావదృశ్యము మాత్రమే గాదు. సనాతనము, అక్షరము, అవ్యయము, కాలాతీతము నగు నొకానొక ఆత్మభావమును గలదు; ప్రకృతి పరివర్తనలచేత నది ప్రభావితము గాదు. అది వాని నిష్పాక్షిక సాక్షి; ప్రభావితము చేయదు, ప్రభావితము గాదు : కర్మ చేయదు, కర్మవిషయము గాదు; పుణ్యశీలియు గాదు, పాపశీలియు గాదు; పరంతు అది నిత్యశుద్ధము, సంపూర్ణము, విశాలము, అక్షతము. అది అహంకారజీవుని వేధించు దుఃఖమును గాదు, ఆకర్షించు

సుఖమును గాదు; ఎవనికిని మిత్రము గాదు, శత్రువును గాదు; పరంతు సర్వుల ఏకమాత్ర, సమ ఆత్మ. మానవున కీ ఆత్మబోధము లేదు; కారణము, అతడు తన బహిర్ముఖ మనస్సులో మునిగియున్నాడు; లోపల నివసింప నేర్చుకొనగోరడు, లేక నేర్చుకొనలేదు; అతడు సంగము వీడి, తన కర్మనుండి వెనుకకు తగ్గి, దానిని ప్రకృతికర్మగా నిరీక్షించడు. అహంకారమే అవరోధము, తనను భ్రాంతి చక్రమునకు బంధించు అక్రమవిధానము; కావున అక్షరాత్మలో అహంకారవినాశమే ముక్తికి ప్రథమ నియమము. ఒక మనస్సు మఱియు అహంకారమాత్రముగా నుండక, సర్వాత్మ వగుము : ఇది ముక్తిసందేశముయొక్క మొదటి మాట.

5. కామత్యాగము ప్రథమసోపానము :

కావున అర్జునున కివ్వబడిన ప్రథమోపదేశ మిది - కర్మఫలాపేక్షను సర్వథా విసర్జించుము (2-47); కర్తవ్య కర్మను (2-19) నిష్కామముగా జేయు కేవలకర్తవు గమ్ము; కర్మఫలమును విశ్వకర్మల నియామకుడగు వానికి (5-29) విడిచివేయుము. ఎందుచేత విడువవలెను ? స్పష్టముగానే అర్జును డా నియామకుడు గాడు గనుక. అతని స్వీయాహంకార తృప్తి నిమిత్తము ప్రకృతి తన కర్మయందు నియుక్తము గాలేదు; అతని అభిరుచుల పూరణార్థము విశ్వజీవనము సాగుటలేదు; అతని బౌద్ధిక అభిప్రాయములు, నిర్ణయములు, ప్రమాణములను సమర్థించుటకు విశ్వమానసము పనిచేయుటలేదు, మఱియు నీ క్షుద్రబుద్ధిరూప న్యాయాధీశునికి అది తన బ్రహ్మాండ లక్ష్యములను, పార్థివపద్ధతులను నివేదింప నవసరము లేదు. తమ వ్యక్తిత్వమునందు నివసించుచు, దాని స్వల్ప, సంకుచిత దృక్కోణమునుండియే సర్వమును జూచు అజ్ఞజీవులు మాత్రమే యిట్టి హక్కులను ప్రతిపాదింతురు. ప్రపంచముపై తనకు గలదనుకొను ఈ హక్కునుండి ముందు వెనుకకు తగ్గి, కోట్ల ప్రాణులలో నొకడుగా కర్మ చేయుచు, తనచే గాక, విశ్వకర్మచేతను, ప్రయోజనము చేతను నిర్ణయించబడిన ఒక లక్ష్యమునకు తనవంతు ప్రయత్నమును సమకూర్చ వలెను. కాని అత డింకను ముందుకు బోవలెను; కర్తృత్వభావమును పరిత్యజించి, సమస్తవ్యక్తిత్వమునుండి విముక్తుడై, తన యందును, ఇతరులయందును పనిచేయునది విశ్వబుద్ధి, సంకల్పము, మనస్సు, ప్రాణము నని అతడు దర్శించవలెను. ప్రకృతియే వైశ్వ (universal) కర్త్రి; తనయందు ప్రకృతి చేయు కర్మఫలములు తనకు జెందనట్లే, తన కర్మలును ఆమె కర్మలే యగును. అత డాధ్యాత్మికముగా నీ రెండు పనులు చేయగలిగినచో,

తన కర్మబంధనజాలము దూరముగా తొలగిపోవును; ఏలన బంధనగ్రంథి యంతయు అహంకారికకామము మఱియు కర్తృత్వములందే నిలిచియుండును. ఆవేగము, పాపము, వైయక్తిక సుఖదుఃఖములు అతని ఆత్మనుండి అంతరించును; ఇపుడు లోపల నివసించు నా ఆత్మ శుద్ధము, విశాలము, శాంతము, అందరు మఱియు నన్నింటిపట్ల సమము. కర్మ అతని అంతరంగమున నెట్టి ప్రతిక్రియ పుట్టించదు, అతని ఆత్మయొక్క శుద్ధత మఱియు శాంతిపై నెట్టి మచ్చను గాని, గుర్తును గాని దిగవిడువదు. అతడిపుడు విముక్తము, అస్పృష్టము నగు ఆత్మసత్తయొక్క అంతః సుఖమును, విశ్రాంతిని, ఆరామమును (5-24), అవిచ్ఛేద్య ఆనందమును అనుభవించును. లోపల గాని, వెలుపల గాని అతని కిపుడు వెనుకటి క్షుద్రవ్యక్తిత్వ ముండదు; ఏలన లోపల, నందరితోను ఏకాత్మత ననుభవించును, అటులే వెలుపల, తన బాహ్యప్రకృతి వైశ్వమనస్సు, ప్రాణము, సంకల్పములయొక్క అవియోజ్య అంశమైనట్లు తన చేతనకు బొడమును. పృథక్కారియగు నతని అహంకారిక వ్యక్తిత్వము ఆధ్యాత్మికసత్తయొక్క నిర్వ్యక్తికత్వములోనికి గ్రహించబడి, స్వాహాయగును, అటులే పృథక్కారియగు నతని అహంకారికప్రకృతి విశ్వప్రకృతి క్రియతో నేకమైపోవును.

6. దివ్యనివృత్తి దివ్యప్రవృత్తి కాధారము :

కాని ఈ విముక్తి సమకాలీనములు, అయినను ఇంకను సమన్వయము సాధించబడని రెండు దర్శనములపై నాధారపడి యుండును - స్పష్టమగు ఆత్మదర్శనము, స్పష్టమగు ప్రకృతిదర్శనము, ఈ విముక్తి వైజ్ఞానికము, ధీయుతము నగు నిస్సంగత గాదు; ఆత్మజ్ఞానము లేకయే ప్రకృతిని మాత్రము కొంత స్పష్టముగా దర్శించిన జడవాది దార్శనికునికి సైతము ఈ నిస్సంగత నిక్కముగా సంభవమే. మఱియు నీ విముక్తి, తన బుద్ధి చేయు చతురవివేచనచే అహంకారముయొక్క స్థూలతరరూపములనుండి తప్పించుకొను మిథ్యావాది పండితుని యొక్క బౌద్ధికనిస్సంగతయు గాదు. ఇది విశాలతరము, సజీవతరము, పరిపూర్ణతరము నగు ఆధ్యాత్మిక నిస్సంగత, ఇది ప్రకృతికంటెను పరము, మనోబుద్ధులకంటె నధికము నగు ఆత్మదర్శనముచేత లభించును. కాని ఈ నిస్సంగత సైతము విముక్తి మఱియు నాత్మజ్ఞానమునకు సంబంధించిన ప్రారంభికరహస్యము మాత్రమే, అది దివ్యగుహ్యాము యొక్క సంపూర్ణసూత్రము గాదు; ఏలన దీనిచేతనే ప్రకృతిరహస్యము మనకు బోధపడదు, మఱియు నిది మన ప్రాకృత, సక్రియ సత్తను మన ఆధ్యాత్మిక

స్వయంభూసత్తనుండి వేఱుచేసి మాత్రమే విడుచును. అట్లుగాక, దివ్యనివృత్తి వెనుకటి అహంకారిక ప్రవృత్తిని తొలగించి వచ్చు, దివ్యప్రవృత్తికి ఆధారము గావలెను, అటులే దివ్యశమము దివ్యకర్మకును, దివ్యగతికిని ఆధారము గావలెను. ఈ సత్యము పొడవున (all along) దివ్యగురువు దృష్టియం దుండనే యున్నది; కావుననే అతడు కర్మయజ్ఞమును (4-23), మన కర్మనియామకునిగా ఈశ్వరుని గుర్తించుటను (5-29), అవతార, దివ్యజన్మల సిద్ధాంతమును నొక్కి చెప్పుచువచ్చెను; అయినను ఈ సత్యమును గౌణముగానే యుంచి, శమాత్మకవిముక్తియొక్క ప్రథమావశ్యకతకే ప్రాధాన్య మిచ్చెను. ఆధ్యాత్మికశమము, అసంగము, సమత మఱియు నేకతలకు, ఒక్క మాటలో, అక్షరాత్మను దర్శించి, తద్భావమును బొందుటకు దారితీయు సత్యములు మాత్రమే పూర్తిగా వివరింపబడినవి, వాని సామర్థ్యమునకు, ఆశయమునకు మాత్రమే పూర్తిగా వివరింపబడినవి, వాని సామర్థ్యమునకు, ఆశయమునకు మాత్రమే పూర్ణవ్యాప్తి కల్పించబడినది. ఈ సత్యపూరకము, ఆవశ్యకము నగు తదితర మహాసత్యము ఇంతదనుక కొంత మఱుగున నుంచబడినది; అది పొడవున (all along) సూచించబడినను, వివరింపబడలేదు. ఇప్పు డది అనంత రాధ్యాయములలో త్వరత్వరగా బహిర్గతము చేయబడును.

7. ఆత్మ భగవంతునికి దారి :

భగవదవతారము, దివ్యగురువు, ప్రపంచ కర్మయందు మానవాత్మయొక్క సారథియు నైన కృష్ణుడు ఆదినుండియు తన రహస్యమును - ఇదియే ప్రకృతి గంభీరతమ రహస్యము - ప్రకటించుటకు భూమికను సిద్ధముచేయుచునే వచ్చెను. ఈ సన్నాహసంగీతమునందు ఒక స్వరము సదా పలుకుచు, అతని సమగ్రసత్యము యొక్క పరమసామరస్యమునకు సూచనగా, ప్రస్తావనగా పనిచేసినది. ఆ స్వరము పరమపురుషునికి సంబంధించిన భావము - ఈ పరమపురుషుడు మానవుని యందును, ప్రకృతియందును నివసించుచున్నను, మానవునికంటెను, ప్రకృతికంటెను అధికుడు; ఇతడు అక్షరాత్మయొక్క నిర్వ్యక్తికత ద్వారా ప్రాప్తించినను, అక్షరాత్మ ఇతని పూర్ణమర్మము గాదు. తిరిగి తిరిగి వినిపించిన ఆ స్వరముయొక్క అర్థమిపుడు తెల్లమగును. రథస్థుడగు దివ్యగురువు వాణిద్వారా ఆ ఏకమాత్రభగవంతుడు దాని అర్థము నిటుల దెలుపును - తానే జ్ఞానకర్మల సమన్వయ రహస్యమని యిటుల దెలుపును : "నీయం దున్న నేను, ఈ (తన) మానవశరీరమందున్న నేను, ఎవనికొఱకు

అంతయు మనుచు, శ్రమించుచున్నదో, అట్టి నేను ఏకకాలమున స్వయంభూ ఆత్మయొక్కయు, విశ్వకర్మయొక్కయు రహస్యమను. ఈ 'నేను' పరమ - నేను, విశాలతమ మానవ వ్యక్తిత్వము సైతము దీనియొక్క ఆంశిక, ఖండమాత్ర అభివ్యక్తియే, ప్రకృతి యంతయు దీని హీనతర క్రియాకలాపమే. అంతరాత్మ స్వామిని, ప్రకృతికర్మల ప్రభువును అగు నేను ఏకమాత్ర జ్యోతిని, సంపూర్ణశక్తిని, అద్వితీయ సత్తను. నీయందలి ఈ భగవంతుడు మహాజ్ఞాన సూర్యుడు, ఇతని తేజమున కావల దాని మూలమును వీక్షింపుము, అపుడు దేనియందు వ్యక్తిత్వము మఱియు ప్రకృతి - వీని ఆధ్యాత్మిక సత్యము తిరిగి పొందబడునో, అట్టి పరమాత్మను దెలిసికొందువు. కావున సర్వ భూతములలోను నన్ను చూడగలందులకు, (ముందు) సర్వభూతముల లోను ఆత్మను జూడుము (4-35); సర్వభూతములను ఏకమాత్ర ఆధ్యాత్మిక ఆత్మయందును, సద్వస్తువునందును గాంచుము, ఏలన అదియే సర్వభూతములను నాయందు గాంచుటకు మార్గము. పరబ్రహ్మమగు భగవంతుని జూడగలందులకు అన్నింటియందు నున్న బ్రహ్మమును దెలిసికొనుము. నిన్ను స్వయముగా దెలిసికొనుము, నీవుగా నుండుము, అపుడు నీవు నాతో ఏకముకాగలవు - కాలాతీత ఆత్మ ఎవని నిర్మలప్రకాశమో, లేక పారదర్శకజవనికయో (తెర) అట్టి నాతో ఏకము కాగలవు. భగవంతుడనగు నేను ఆత్మయొక్కయు, పురుషునియొక్కయు పరమసత్యమను.

8. అతీతభగవంతుడు - అంతర్వర్తి భగవంతుడు :

ఒకే భగవంతుడు ఆత్మ యొక్కయే కాక, ప్రకృతియొక్కయు, తన స్వీయ వ్యక్తిత్వముయొక్కయు ఉచ్చతరసత్య మని అర్జునుడు గాంచవలెను - ఏకకాలమున వ్యష్టిసమష్టుల నిగూఢ రహస్యము. భగవంతుడు ప్రకృతియందు సమష్టిసంకల్ప రూపమున నుండును; తననుండి ప్రభవించు కర్మలకంటె తా నధికుడు, ప్రకృతికర్మలు, మానవుని కర్మలు, వాని ఫలితములు అతనికే చెందును. కావున మానవుడు కర్మలను యజ్ఞముగా జేయవలెను, అదియే అతని కర్మసత్య మగును. అహంకారము గాక, ప్రకృతియే కర్మకర్త్రి; కాని ప్రకృతి ఆ పరమపురుషుని ఒక శక్తిమాత్రమే, అతడే ఆమె కర్మలు, తపస్సుల యొక్కయు, యుగాలు సాగు ఆమె విశ్వయజ్ఞము యొక్కయు నధీశ్వరుడు. ఇట్లు తన కర్మలు భగవంతుని కర్మలే గనుక, మానవుడు తన కర్మల

నన్నింటిని తనయందలి, ప్రపంచమునందలి ఆ భగవంతునికే అర్పింపవలెను. ఇచ్చట, మానవాత్మ తిరిగి భగవంతునియందు దివ్యజన్మ (4–10) నందుటకు రెండు నిబంధనలు గన్పించును – 1. ముందు కాలాతీత అక్షరాత్మయొక్క జ్ఞానము, మఱియు తద్వారా కాలాతీత భగవంతునితో సాయుజ్యము, 2. విశ్వప్రహేళిక వెనుక నివసించు నట్టి, అనగా సర్వభూతములందును, వాని క్రియాకలాపములందును ఉండునట్టి భగవంతునియొక్క జ్ఞానము. ఇట్లు మాత్రమే మన ప్రకృతిని మఱియు సత్తనంతను సమర్పించుటద్వారా దిక్కాలములయందు సర్వము నైన ఏకునితో సజీవసాయుజ్యము నందగలము. పూర్ణ ఆత్మవిముక్తి – యోగముయొక్క ప్రణాళిక యందు భక్తిస్థానము మన కిక్కడ గన్పించును. భక్తి యన అక్షరాత్మ లేక క్షరప్రకృతికంటె మహత్తరమగు వానిని గుఱించిన ఉపాసన మఱియు ఆకాంక్ష. అపుడు జ్ఞాన మంతయు నొక ఉపాసన మఱియు నాకాంక్ష యగును, అటులే కర్మ యంతయు నొక ఉపాసన మఱియు నాకాంక్ష యగును. ఈ భక్త్యుపాసనయందు ప్రకృతికర్మయు అంతరాత్మవిముక్తియు నొకటియై, పరమాత్మ కెగయు ఏకమాత్ర ఉద్గమన మగును. చరమముక్తి, అనగా నిమ్నతర ప్రకృతినుండి ఉచ్చతర ఆధ్యాత్మిక భావములోనికి చేయు ప్రస్థానము అంతరాత్మ నిర్వాణము (వినాశము) గాదు – దాని అహంకార రూపము మాత్రమే నిర్వాణము జెందును – పరంతు భక్తిజ్ఞానకర్మలతో గూడిన మన ఆత్మ యంతయు భగవంతుని విశ్వభావమునుండి వెడలి, అతని విశ్వాతీత భావమునకు పయనించుటయే యగును, వినాశము గాక, పరిపూర్తియే యగును.

9. నిర్వ్యక్తిక సవ్యక్తికసమన్వయము :

పైన ప్రస్తావించబడిన జ్ఞానమును స్పష్టపఱచునిమిత్తము, ఇంకను మిగిలియున్న రెండు శంకలను తీర్చుటకు దివ్యగురు వుపక్రమించును – 1. నిర్వ్యక్తికాత్మకును, మానవవ్యక్తిత్వమునకును మధ్యగల విరోధము, 2. పురుషునకును, ప్రకృతికిని మధ్యగల విరోధము. ఈ విరోధములు రెండును కొనసాగు నంతవఱకు, ప్రకృతియందును, మానవునియందును గల భగవంతుడు అస్పష్టముగను, అహేతుకముగను, అవిశ్వసనీయముగను నిలిచి పోవును. గుణకృతమగు యాంత్రికబంధనమే ప్రకృతి యనియు, ఆ బంధనాధీనమగు అహంకారికసత్తయే ఆత్మయనియు చెప్పబడును. కాని అదే వాని పూర్ణసత్యమగుచో, అవి దివ్యము

కావు, కాజాలవు. ప్రకృతి – అజ్ఞము, యాంత్రికమునగు ప్రకృతి – భగవంతుని శక్తి కాజాలదు; కారణము, దివ్యశక్తి తన కర్మయందు విముక్తము, తన మూలమునందు ఆధ్యాత్మికము, తన మహత్త్వమునందు ఆధ్యాత్మికము గావలెను. అటులే ప్రకృతియందు బద్ధము, అహంకారికము, కేవలము మనోమయము, ప్రాణమయము, అన్నమయము నగు అంతరాత్మ భగవంతుని అంశము, స్వయముగా భాగవతసత్త గాజాలదు; కారణము, భాగవతసత్త తాను భగవంతుని ప్రకృతినే కలిగియుండి, విముక్తము, ఆధ్యాత్మికము, స్వయంవికాసశీలము, స్వయంసిద్ధము, మనః ప్రాణశరీరములకంటెను పరము గావలెను. పైరెండు శంకలును, అవి గొనివచ్చు అస్పష్టతలును తేజోమయమగు నొక సత్యకిరణముచేత నపాస్తమగును. ఎట్లు ? యాంత్రికప్రకృతి ఒక అపరసత్యము మాత్రమే; అది హీనతర బాహ్యక్రియ యొక్క ఒక పద్ధతి మాత్రమే. ఆధ్యాత్మికమగు నొక పరసత్యమును గలదు, అది మన ఆధ్యాత్మికవ్యక్తిత్వముయొక్క, మనయందలి యథార్థపురుషునియొక్క ఆధ్యాత్మికప్రకృతి. భగవంతు డేకకాలమున నిర్వ్యక్తికము, సవ్యక్తికము. అతని నిర్వ్యక్తికత మన మానసికానుభూతికి కాలాతీతమగు సత్తాచేతనానందముల ఒక అనంతమగును; పోగా నతని వ్యక్తిత్వము సత్తయొక్క ఒక చేతనశక్తిగను, జ్ఞానము, సంకల్పము, మఱియు బహురూపస్వీయాభివ్యక్తిచేత ప్రాప్తించు ఆనందము – వీని యొక్క చేతనకేంద్రముగను తన నిచ్చట జూపుకొనును. మన సత్తయొక్క స్థితిశీల (static) తత్త్వమున మన మా ఏకమాత్ర నిర్వ్యక్తికత యగుదుము (నిర్వ్యక్తిక ఆత్మ యగుదుము); కాగా మన ఆధ్యాత్మిక పురుషరూపమున మనయందలి ప్రతియొకడును ఆ మూల చేతనశక్తియొక్క బహుత్వ మగుదుము, (అనగా నతని వ్యక్తిత్వ మగుదుము). కాని ఈ విభేదము భగవంతునియొక్క స్వయమభివ్యక్తి నిమిత్తమే; వెనుకకు వెళ్లి చూచినచో, దివ్యనిర్వ్యక్తికత అదే సమయమున అనంత 'అతడు'గా, పరమాత్మగా, పరమపురుషుడుగా గన్పట్టును. ఈ 'అతడు' నేను అతడను – "సోహం" (బృ.ఉ.) – అను మహావాక్యములోని మహా – నేను; ఈ నేను – నుండియే సర్వవ్యక్తిత్వమును, సర్వప్రకృతియు ప్రసరించి, నిర్వ్యక్తిక ప్రపంచరూపమున లీల నెరపును. "సర్వం ఖ ల్విదం బ్రహ్మ" (ఛాం.ఉ.), "ఈ ఉన్న దంతయు (సత్త యంతయు) బ్రహ్మ" – అని ఉపనిషత్తు చెప్పును; ఏలన తననుదాను నాలుగు క్రమగత చేతనాస్థితులయందు

చూచుకొను ఆత్మయే బ్రహ్మ. ఇట్లుండ, "వాసుదేవుడే సర్వము" (7-19) నని గీత చెప్పును. ఈ వాసుదేవుడు సత్తావంతుడైన సనాతన పురుషుడు. (కనుక సత్తారీత్యా నిర్వ్యక్తికబ్రహ్మము సవ్యక్తికవాసుదేవుడే). ఇతడు బ్రహ్మము (10-20), ఇతడు తన ఉచ్చతర ఆధ్యాత్మికప్రకృతినుండి సర్వమును ధరించుచు, సర్వమును బుట్టించును, మఱియు నిమ్నప్రకృతియందు బుద్ధి, మనస్సు, ప్రాణము, ఇంద్రియము మఱియు దృశ్యజగద్రూపమగు సర్వవస్తువులు సచేతనముగా నగును. కాగా సనాతనపురుషుని ఆధ్యాత్మిక ప్రకృతియందు జీవు డతడే యగును, అతని సనాతన బహుత్వ మగును, తన చేతనశక్తియొక్క బహుకేంద్రములనుండి తనను దర్శించుకొను దర్శనరూపు డగును. భగవంతుడు, ప్రకృతి, జీవుడు : ఇవి సృష్టియొక్క మూడు అవయవములు, మఱియు నీ మూడును ఒకే సత్త యగును. (వాసుదేవుడు, ఆత్మ, ప్రకృతి, జీవుడు - బ్రహ్మసత్త ఈ నాలుగు రూపములను ధరించును).

10. అభివ్యక్తిక్రమము :

ఈ సనాతనపురుషుడు విశ్వమునందు తన నెట్లు అభివ్యక్తము గావించుకొనును? మున్ముందు కాలాతీతము, సర్వగతము, సర్వధరము నగు అక్షరాత్మరూపమున, ఇది తన కాలాతీతతయందు సత్తయే గాని, సంభూతి గాదు. అటు పిమ్మట, ఈ సత్తా గర్భమున "స్వభావ"మనబడు స్వసంభూతియొక్క ఒక మూలశక్తి లేక ఆధ్యాత్మిక తత్త్వము ఉండును; దీనిద్వారా ఆత్మ స్వవిషయకదృష్టిచేత తన సత్తయందు గలదాని నంతను నిర్ణయించి ప్రకటించును, వెలికిదెచ్చి సృజించును. ఆ స్వభావశక్తి సత్తయం దిట్లు నిర్ణీతమైన దాని నంతను "కర్మ" (8-3) యనబడు విశ్వక్రియలోనికి విడిచిపెట్టును. సృష్టి యంతయు ఈ స్వభావవ్యాపారమే, కర్మయే. కాని యిచ్చ టిది బుద్ధి, మనస్సు, ప్రాణము, ఇంద్రియము, ఇంద్రియవిషయమగు జడప్రపంచరూపమగు క్షరప్రకృతియందు పెంపొందింపబడును, మఱియు నిట్టి ప్రకృతి మూలప్రకాశమునుండి ఖండింపబడి, అహంకారముచే పరిమితమై యుండును. అయినను ఈ ప్రకృతికర్మ లన్నియు ఆమెయందలి అంతరాత్మ ఆమె యందు గుప్తముగా నున్న పరమాత్మకు సమర్పించు యజ్ఞమగును, మఱియు కావున నీ పరమాత్మ అందరియందును వారి యజ్ఞప్రభువుగా నివసించును, అతని సన్నిధియు, శక్తియు దానిని నియమించును, అతని ఆత్మజ్ఞానమును, సత్తానందమును దానిని

స్వీకరించును. దీని నెఱుంగుట సమీచీనమగు విశ్వజ్ఞానమును, విశ్వమునందలి భగవద్దర్శనమును గలిగియుండుట యగును, మఱియు అజ్ఞానవిముక్తికి ద్వారము కనుగొనుట యగును. ఏలన తన కర్మలను, తన చేతన నంతను సర్వమునందును గల భగవంతుని కర్పించుటచేత మానవుని కీ జ్ఞానము కార్యసాధకమై, తన ఆధ్యాత్మిక భావమునకును, దానిద్వారా క్షరప్రకృతికి పరమున వెలుగొందు సనాతన, విశ్వాతీత సద్వస్తువునకు తిరిగిరా శక్తి నిచ్చును.

11. రాజగుహ్యము :

ఈ సద్వస్తువే సత్తారహస్యము, దీనినే గీత యిపుడు ప్రచురఫలితము నిచ్చునట్లుగా మన అంతరజీవనమునకును, బాహ్య కర్మలకును అనువర్తింపజేయ నున్నది. గీత యిపుడు ప్రవచింపబోవునది రహస్యాతి రహస్యము (9–1). అర్జునునకు తన సత్తాప్రభువు వాగ్దానము చేసిన జ్ఞానము సమగ్ర భగవంతుని జ్ఞానము –"సమగ్రం మాం" (7–1), అతని వివిధతత్త్వముల విజ్ఞానముతో గూడిన అతని మూలసత్తాజ్ఞానము (9–1), ఈ జ్ఞానము లభించిన, నిక తెలియవలసిన దేదియు మిగులదు. అర్జునుని మానవమనస్సును విమూఢము గావించి, తన దైవనియుక్త కార్యమునుండి అతని సంకల్పమును విముఖముచేసిన అజ్ఞానగ్రంథి యంతయు పూర్తిగా విచ్ఛిన్నమగును. ఇది రాజవిద్య, రాజగుహ్యము - విద్యలకు విద్య, రహస్యములకు రహస్యము (9–2). ఇది యొక విశుద్ధ, పరమప్రకాశము, దీనిని ప్రత్యక్ష, ఆధ్యాత్మికానుభవముచే ఋజువుచేసికొనవచ్చును, లోపలనే సత్యముగా దర్శింపవచ్చును. ఇది ధర్మసమ్మతమైన జ్ఞానము, సాక్షాత్తు సత్తాధర్మము (law), గ్రహించి, దర్శించి, దీనిలో నివసింప శ్రద్ధగా ప్రయత్నించి నపుడు, దీనిని సాధింప సులభము (9–2).

12. కాని విశ్వాస మావశ్యకము :

విశ్వాసము లేనిచో, సాధకుడు విమర్శనాత్మక బుద్ధినే నమ్ముకొనియున్నచో, ఆ మహత్తరజ్ఞానమును జీవించి, అనుభవింప సంభవము గాదు. ఏలన తార్కికబుద్ధి బాహ్యసత్యములపైననే ఆధారపడి, అంతర్దృష్ట జ్ఞానమును అసహనముతో సందేహించును. కారణము, ఈ అంతర్జ్ఞానము బాహ్యప్రకృతియొక్క విభజనలు, మఱియు అపూర్ణతలతో మేళవించదు, మఱియు దానిని దాటి వెళ్లి, మన ఇప్పటి

జీవనముయొక్క ప్రథమ, వాస్తవసత్యములగు దుఃఖమును, బాధను, పాపమును, లోపమును, ప్రమాదమును, ఒక్క మాటలో, "అశుభమును" (9-1) దాటించి, మనల నావలకు గొనిపోవు సత్యమును ప్రతిపాదించుచున్నట్లు గన్పించును. ఈ ఉచ్ఛతరసత్యము మఱియు ధర్మమునందు విశ్వసించలేని అంతరాత్మ మృత్యువు, భ్రమప్రమాదము, అశుభములకు అధీనమగు సాధారణ మర్త్యజీవన మార్గమునకు తిరిగిరాక తప్పదు (9-3) - తాను సందేహించు భగవంతునిలోనికి తాను పెరుగలేదు గదా ! ఏలన ఇది నివసించవలసిన, అంతరాత్మ యొక్క వర్ధమానప్రకాశమున నివసించవలసిన సత్యము గాని, సాధకుడు దానిలోనికి పెరుగవలెను, అది కావలెను - దాని ప్రామాణ్యమును పరీక్షించుట కదియే మార్గము. నిమ్నతరాత్మను అతిక్రమించుటచేతనే ఎవడైనను వాస్తవ దివ్యాత్మ కాగలడు, మఱియు తన ఆధ్యాత్మికభావముయొక్క సత్యమును జీవించగలడు. ఎవ దేని దీనికి ప్రతిగా నిలబెట్టగలిగిన ఆభాస (apparent) సత్యము లన్నియు నిమ్నప్రకృతి యొక్క ఆభాసములే. నిమ్నప్రకృతియొక్క అశుభమునుండి విముక్తి ఉచ్చతర జ్ఞానము నాశ్రయించుటచేతనే ప్రాప్తించగలదు, అచ్చట బాహ్యాశుభ మంతయు మన అంధకార సృష్టి మాత్రమే యని నిరూపించబడును, అప్పుడు దానికి తన చరమ మిథ్యాత్వముపట్ల నమ్మకము కుదురును. కాని దివ్యప్రకృతియొక్క విముక్తిలోని కిట్లు పెరుగవలె ననిన, మన ప్రస్తుత పరిచ్ఛిన్నప్రకృతిలోపల గుప్తముగా నున్న ఈశ్వరు నంగీకరించి, విశ్వసించవలెను. అపుడే ఈ యోగసాధన సంభవము, సులభము కాగలదు; ఏలన మన సంపూర్ణప్రకృతివ్యాపారము నంతను ఈ అంతర దివ్యపురుషుని హస్తములలోని కర్పించివేతుము. ఈ దివ్యపురుషుడు మన సత్తను తన సత్తలోనికి గ్రహించి, దానిని తన శక్తిజ్ఞానములతో పూరించి - "జ్ఞానదీపేన భాస్వతా" (10-11) - మనయందు దివ్యజన్మను క్రమేణ సరళముగను, అమోఘముగను సాధించును; మన మలిన, అజ్ఞానమయ ప్రకృతిని చేపట్టి, దానిని తన తేజో విశాలతలలోనికి రూపాంతర మొందించును. సంపూర్ణవిశ్వాసముతోను, నిరహంకారము గాను దేనిని మనము నమ్ముదుమో, ఈశ్వరప్రేరితులమై దేనిని బొందసంకల్పింతుమో, లోపలి భగవంతుడు దానిని నిశ్చయముగా బొందించును. కాని యిపుడు బాహ్యానికి మనముగానే కన్పించుచున్న అహంకారిక మనఃప్రాణములు లోపలి భగవంతుని హస్తములలోనికి పరివర్తననిమిత్తము తమనుదాము ముందు సమర్పించుకొనవలెను.

5. దివ్యసత్యము, దివ్యమార్గము

1. భక్తియే దివ్యమార్గము :

గీత పిమ్మట పరమ, సమగ్రరహస్యము నావిష్కరింప దొడంగును ; ఇదియే సాధకు డన్వేషించు ఏకమాత్రధ్యేయము మఱియు సత్యము, ఇదియే అతని ఆధ్యాత్మికాంగములు మఱియు వాని సమస్తవృత్తుల ఏకమాత్ర సంసిద్ధి ధర్మము, దీనియందే అతడు నివసింప నేర్చుకొనవలెను. ఈ పరమరహస్యము సర్వాతీత భగవంతుని గహనతత్త్వము; ఇతడు సర్వము, సర్వగతుడు నైనప్పటికి, విశ్వము మఱియు దాని సర్వరూపములకంటెను ఎంతో అధికుడు మఱియు నన్యుడు; దేనియందు నత డిముడడు, ఏదియు నతనిని వాస్తవముగా బ్రకటింపదు, బాహ్యరూపములతో ముడివడియున్న నేభాషయు అతని అచింత్యస్వరూపముయొక్క సత్యమును సూచింపజాలదు. కావున మన సంసిద్ధి ధర్మము మన ప్రకృతి యంతయు తన దివ్యమూలము, భర్తయు నగు నతనిని ఆరాధించుచు, అతనికి ఆత్మసమర్పణ జేసికొనుటయే యగును. ప్రపంచము నందలి మన జీవితము నంతను – దానియొక్క ఈ యా అంశమును మాత్రమే గాదు – భగవదభిముఖమగు ఏకమాత్ర గతిగా మార్చుటయే మన ఏకైక చరమమార్గ మగును. ఒక దివ్యయోగముయొక్క శక్తిచేతను, గుహ్యవిధానముచేతను అతని అనిర్వచనీయ రహస్యస్థితినుండి వెలువడి, మనము బాహ్యవస్తువుల ఈ పరిచ్ఛిన్న ప్రకృతిలోనికి వచ్చియున్నాము. అదే యోగముయొక్క ఒక విలోమ (reverse) గతిచేత మన బాహ్యప్రకృతియొక్క అవధులను దాటి, దేనిచేత మనము భగవంతునియందు నివసింపగలమో, అట్టి యొక మహత్తరచేతనను తిరిగి పొందవలెను.

2. భగవంతుడు సత్త, ప్రపంచము సంభూతి :

భగవంతుని పరమసత్త అభివ్యక్త ప్రపంచమున కతీతము; అతని సనాతనమూర్తి ద్రవ్యమునందు వ్యక్తము గాదు, ప్రాణము చేత గృహీతమునుగాదు, మనస్సుచేత చింత్యమును గాదు – “అవ్యక్తమూర్తి” (9–4), “అచింత్య రూప” (8–9). మనము చూచునది అతడు రచించుకొనిన <u>రూపము</u> గాని, అతని <u>స్వరూపము</u> గాదు. ప్రపంచముకంటెను అన్యమగు ఒకడు, లేక ఒకటి గలదు, అది అకథ్యము, అచింత్యము, అది అవర్ణనీయముగా అనంతమగు భగవత్తత్త్వము; అనంతతను

గుఱించిన మన అతివ్యాపక లేక అతిసూక్ష్మభావనలకు సైతము అది అందక యుండును. విశ్వమనబడు నిది యంతయు నొక మహాజాలము, ఇది అవధులు గన్పించని ఒక మహాగతి, దీనియం దెంత వెదకినను గతియేగాన స్థితి గన్పించదు, దీనిని నడుపుటకు వలయు ధ్రువకేంద్రము గానరాదు; ఇట్టి విశ్వము భగవంతు డనబడు అత్యున్నత అనంతము చేత తననుండియే విస్తరింజేయబడినది (9-4), ఈ విశ్వాతీత నిగూఢతత్త్వమునందే ప్రతిష్ఠితమై యున్నది; స్వయముగా అవ్యక్తము, అచింత్యము నగు భగవంతుని యొక ఆత్మనిర్మాణము మీద ప్రతిష్ఠితమై యున్నది. సర్వదా మాఱుచు, గతిశీలమైయుండు చరాచర భూతములు వ్యష్టిరూపమున గాని, సమిష్టిరూపమున గాని అతనిని తమలో నిముడ్చుకొన జాలవు. అతడు వానిలో లేడు? వానిలో గాని వానిచేత గాని అతడు జీవించడు, చరించడు, తన అస్తిత్వమును గలిగియుండడు - భగవంతుడు సంభూతి గాడు. అవియే అతనిలో నున్నవి, అతనిలో చరించుచు, నివసించును, అతనినుండియే తమ అస్తిత్వమును బొందును; అవి అతని సంభూతులు, అతడు వాని సత్త - "మత్థ్సాని సర్వభూతాని, న చాహం తే ష్వవస్థితః" (9-4). అచింత్యము, దిక్కా లాలీతము నగు తన సత్తయొక్క అనంతతయందు అవధులు గన్పించ నప్పటికి స్వల్పమగు నీ విశ్వదృశ్యమును అనంతదేశకాలములందు అతడు విస్తరింజేసెను.

3. ఆత్మలోకము - భౌతికలోకము :

సర్వము నతనియం దుండును - అని చెప్పుటయు సంపూర్ణసత్యము గాదు, సంపూర్ణముగా వాస్తవసంబంధము గాదు. ఏలన ఇట్లు చెప్పుట అతనికి దేశభావము నాపాదించుటయే యగును, కాని అతడు దేశాతీతుడును, కాలాతీతుడును, దేశకాలములు, వీనితో ముడివడిన అంతస్థత, వ్యాప్తి, అతిక్రమణము - అన్నియు అతని చేతనయొక్క పదములు (అవయవములు) మఱియు ప్రతిమలు. ఈశ్వరశక్తియోగ మొకటి గలదు - "మే యోగమైశ్వరం" (9-5); దీనిచే పరముడు తన కాలాతీతానంతమును ఆధ్యాత్మికానంతము గావించి, దానియందు తన స్వీయరూపములతో గూడిన ఆత్మలోకమును సృజించును - భౌతిక విస్తారము ఈ ఆధ్యాత్మికవిస్తారముయొక్క ఒక ప్రతిమ మాత్రమే; ఈ ఆత్మ లోకముతో నొకటిగా అతడు తననుదాను జూచుకొనును, దానితోను, దానియం దున్న భౌతికలోకముతోను తాదాత్మ్యము జెందును, అయితే ఈ 'చూచుకొనుటయే' అతని సంపూర్ణదర్శనము

గాదు, సంపూర్ణదర్శనమున అతడు ఏకకాలమున సర్వముతో నేక మయ్యును, సర్వము నతిక్రమించును. అనగా, అత డీ ఆత్మలోకముకంటెను గూడ అన్యుడు. అంతయు ...చ్చట అతని విశ్వవిద (world-conscious) అనంతమునం దుండగా, ఈ అనంతము తిరిగి భగవంతుని విశ్వాతీత సత్యతయొక్క ఒక స్వీయ భావనగా ధరించబడును, ఇట్లు ఇదియే భగవంతుని పరమగుహ్యము: అతడు విశ్వాతీతు డయ్యును విశ్వబాహ్యుడు గాడు, ఏలన అతడు తన ఆత్మరూపమున దానిని వ్యాపించియుండును. ప్రకాశమయము, నిర్లిప్తము నగు భగవంతుని ఆత్మ అంతట నుండును - "మమ ఆత్మా" (9-5); ఈ ఆత్మ ప్రపంచసంభూతితో సంతతసంబంధము గలిగియుండి, సర్వభూతములను తన కేవల (simple) సన్నిధిచే అభివ్యక్తిలోనికి దెచ్చును - "భూతభృన్ నచ భూతస్థో మమాత్మా భూతభావనః" (9-5). కనుకనే ఈ పదముల ప్రయోగము: సత్తయు సంభూతియు - అనగా ఆత్మ యనబడు స్వతఃసిద్ధమగు సత్త, భూతము లనబడు ఆత్మపై నాధారపడు సత్తలు, అనగా అక్షరసత్త, క్షరసత్తలు. కాని ఈ రెండు భావములయొక్క పరమసత్యమును, వాని ద్వంద్వవిరోధపరిష్కారమును వానికి పరమగు దానియందు కనుగొనవలెను. ఈ పరమే పరమపురుషుడు, ఇతడే తన "యోగమాయచేత" (7-25), అనగా తన ఆధ్యాత్మికచేతనయొక్క శక్తిచేత రెండింటిని అభివ్యక్తముచేయుచు, ఆత్మను, ఆత్మలోని దృశ్యవస్తువులను తనయందు గలిగియుండును. మన ఆధ్యాత్మికచేతన యందు అతనితో సంయోగము నందినపుడే, అతని సత్తతో మనకు గల వాస్తవ సంబంధములను చేరుకొనగలము.

4. ద్వైతము :

దార్శనికముగా చెప్పినపుడు, ఈ గీతాశ్లోకముల (9-4, 5) అభిప్రాయ మిది; కాని వీని కాధారము ఆధ్యాతికానుభూతియే గాని, బౌద్ధికవిచారణ గాదు. ఈ శ్లోకములకు విశాలమూలము కొన్ని ఆధ్యాత్మికసత్యములు గాన, అవి సమన్వయ సాధకములు, ప్రపంచమున గుప్తముగానో, వ్యక్తముగానో ఉండగల పరమ లేక విశ్వపురుషునితో మనముసచేతనసంబంధములను ఏర్పఱచుకొన దలంచి నపుడు, మనకు నానావిధ అనుభవము ప్రాప్తించును, మఱియు నీ అనుభవమునందలి ఒకొక అంశమును దీసికొని, బుద్ధి సృష్టికి సంబంధించిన ఒకొక మూలభావము నేర్పఱచును. మున్ముందు మనకీ స్థూలానుభవము తగులును; భగవంతుడు

మనకంటెను, ప్రపంచముకంటెను మిక్కిలి భిన్నము, అధికము నగు నొకానొక వస్తువు; మనము మన బాహ్యాత్మలలో నివసించుచు, ప్రపంపముయొక్క బాహ్యా ముఖమునే చూచుచున్నంత కాలము ఇట్టి అనుభవమే కలుగును. కారణము, భగవంతుని పరమసత్యము విశ్వాతీతము గావున, దృశ్య మంతయు (ద్రష్టయగు) స్వసంవిద సత్తకంటె నితరముగా గన్పించును, ఒక హీనసత్యముయొక్క మూర్తిగానో, చివరకు మిథ్యగానో కన్పించును. మన మీ భేదమునందు మాత్రమే నివసించునపుడు, భగవంతుడు విశ్వబాహ్యుడైనట్లు గాంతుము. భగవంతుడు విశ్వాతీతుడు గనుక విశ్వములో మాత్రమే లే డను అర్థమున ఇది సత్యము గాని, విశ్వము భగవత్సత్తకు వెలుపల నున్న దను అర్థమున గాదు. ఏలన ఏకమాత్ర సనాతన భగవత్సత్తకు వెలుపల నేదియు లేదు. భగవంతునియందే మనము నివసించు చున్నాము, చరించుచున్నాము, మన సత్తను గలిగియున్నాము - అను అనుభవము ప్రాప్తించి నపుడే, మన కీ పై సత్యము ఆధ్యాత్మికముగా విదితమగును - మన మతనికంటె నెంత భిన్నముగా నున్నను, మన ఉనికియే అతనిపై నాధారపడును, మఱియు విశ్వ మంతయు అతని సత్తయందలి ఒక దృశ్యమును, గతియు మాత్రమే.

5. జగత్తు తక్కువ సత్యము గాని, మిథ్య గాదు :

కాని మన ఆత్మ సత్తయు, భగవంతుని ఆత్మసత్తయు ఒకటియే యను మఱికొంత పరతర అనుభవమును మనకు గలుగును. మన మందరియొక్క ఏకాత్మను గుర్తించి, దాని బోధమును, దర్శనమును గలిగియుందుము. ఇపుడు మన మతనినుండి సర్వథా భిన్నుల మని చెప్పజాలము; స్వయంభు వగు నతని కాత్మయు గలదు, దృశ్యరూపమును గలదు, ఈ ఆత్మయం దందరు నొకటియే, కాని దృశ్యమునం దందరు భిన్నము. ఆత్మైక్యము నందు అనన్యనిమజ్జనముచే, దృశ్యము స్వప్నసదృశము, మిథ్యాభూతము నను అనుభవమునకు సైతము రావచ్చును. అట్లు గాక, ఆత్మదృశ్యములపై సమముగా దృష్టిని కేంద్రీకరింతుమేని, మన కీ ద్వివిధానుభవము సైతము గలుగగలదు : 1. సత్తయం దతనితో మనకు స్వతఃసిద్ధ ఏకత్వము గలదు, కాగా 2. ప్రకృతియం దతనితో సంబంధములను గలిగి యుండి, అతనినుండియే పుట్టిన ఒక స్థాయి రూపమున నివసింతుము. విశ్వమును, విశ్వమునందు మన అస్తిత్వమును భగవంతుని స్వసంవిదసత్తయొక్క ఒక స్థిర, వాస్తవరూపముగా మనకు గన్పించును. ఈ అల్పతర సత్యమునందు మన మతనితోను, అతని శక్తులేయగు

చరాచరములతోను భిన్న సంబంధములను గలిగియుండి, విశ్వప్రకృతిగతమగు విశ్వాత్మతో వ్యవహరింతుము. ఈ సంబంధములు విశ్వాతీతసత్యమగు ఏకత కంటెను అన్యములు, సత్తాశక్తినుండి పుట్టిన జన్యములు, మఱియు ని ట్లవి అన్యములు, జన్యములు గావున, విశ్వాతీత కేవలబ్రహ్మ నుపాసించు కేవలసాధకులు వానిపై సాపేక్ష లేక సంపూర్ణమిథ్యాత్వము నారోపింతురు. కాని అవి అతని సత్తనుండియే పుట్టిన సద్రూపములు గాని, శూన్యము నుండి సృజింపబడిన మిథ్యారూపములు గావు. ఏలన పరమాత్మ సర్వత్ర దర్శించునది సదా తనను, తన రూపములనే కాని, తన కంటె నత్యంతభిన్నమగు వస్తువులను గాదు. మఱియు నీ సంబంధములకు మూలమగున దేదియు విశ్వాతీతము నందు లేనేలేదని చెప్పజాలము. ఒకవేళ ఇవి మూలమునుండియే వచ్చినను, అచ్చట వీని కాధారము, సమర్థనరూపము నగున దేదియు, వీని సనాతన సత్యమగున దేదియు లేదని పలుకజాలము.

6. మాయావాద మొక అతిశయోక్తి :

మఱల, ఆత్మకును ఆత్మ రూపములకును గల భేదమును మనము మఱియొక విధముగా సాగదీసినచో, ఆత్మ సర్వగర్భము, అంతర్వర్తియు నని చూడవచ్చును, సర్వగతాత్మయొక్క సత్యమును మన మంగీకరించవచ్చును; అయినను ఆత్మరూపములు ఆత్మభిన్నములు మఱియు క్షణికములుగా మాత్రమే కాక, మిథ్యాచ్ఛాయలుగా గూడ మనకు బొడమవచ్చును. జగత్తుయొక్క క్షరభావములను తనలోపల ధరించుచు, స్వయముగా నక్షరమగు ఆత్మానుభవము - జగత్సత్తానుభవము - మనము బొందవచ్చు; అటులే దీనికంటె వేఱుగనో, సమకాలముననో, ఒకదానిపై నొకటిగనో భగవదనుభవమును, మన యందు సర్వభూతములందు అంతర్వర్తియగు భగవదనుభవమును బొందవచ్చును. అయినను విశ్వము సత్తయొక్క ఒక ప్రతిమగానో, ప్రతీకగానో మనకు గన్పించవచ్చును, ఈ ప్రతీకను బట్టి మన మతనితో అర్థవంతమగు సంబంధముల నేర్పఱచుకొని, క్రమముగా నతని జ్ఞానములోనికి పెరుగవలసియుండును. కాని దీనికి రెండవ వైపున, మనము మఱియొక ఆవిష్కరణాత్మక ఆధ్యాత్మికానుభవమును బొందవచ్చును : దీని యందు సాక్షాత్తు భగవంతుడే సర్వవస్తువులు – సర్వము నందును అక్షరభావమున నివసించు ఆత్మయే గాక, బాహ్యాభ్యంతర సంభూతి యంతయు భగవంతుడే – యని చూచుట తప్పనిసరి యగును. అపు డంతయు మనయందును, విశ్వమునందును అభివ్యక్త మగుచున్న

దివ్య సద్వస్తువే యగును. ఈ అనుభవము వ్యావర్తక (exclusive) మగుచో, విశ్వదేవతావాది (panthiestic) తాదాత్మ్యము ప్రాప్తించును : విశ్వమే భగవంతుడు. కాని విశ్వదేవతావాది దర్శనము ఆంశికదర్శనము మాత్రమే. ఈ విశ్వవిస్తారమే సర్వసత్త గాదు; దీనికంటెను అధికతర మగు నొక సనాతనము గలదు, దానిచేతనే దీని అస్తిత్వము సంభవమగుచున్నది. విశ్వ మతని సంపూర్ణ సత్తయందు భగవంతుడు గాదు, పరంతు అతని సత్తయొక్క ఒక ఆత్మ ప్రకటనము; సత్యము, స్వల్పమునగు గతివిశేషము. ఈ ఆధ్యాత్మికానుభవము లన్నింటికి, అవి ప్రథమదృష్టికి ఎంత విభిన్నములు, విరుద్ధములుగా నున్నను, సమన్వయము సాధ్యమే; ఇందు నిమిత్తము, ఏయొక అనుభవమును మాత్రమే నొక్కి చెప్పుటను మానుకొని, ప్రపంచభావము కంటెను భగవత్సత్త అధికతర మనియు, అయినను సమస్త వ్యష్టి సమష్టిరూపము లా భగవంతుడే గాని, మఱేమియు గాదనియు –మన మీ సరళసత్యమును గాంచవలెను. ఈ రూపములు భగవంతుడే యైనను, తమ సముచ్చయమునందు సైతము సంపూర్ణభగవంతుడు గావు; అవి అతని ద్యోతకములు, కాని అవి అతని సత్తయొక్క అవయవము, పదార్థము గానిచో, ద్యోతకములును గాజాలవు. భగవంతుడు పరమసత్యము, అవి అతని ద్యోతక [1] సత్యములు.

7. భగవద్భావముయొక్క స్థాయిలు :

"వాసుదేవః సర్వం ఇతి" (7–19) – అను వాక్యముయొక్క తాత్పర్య మిదియే; ఏది విశ్వమో, ఏది విశ్వమునం దున్నదో, ఏది విశ్వాతీతమో, అది యంతయు భగవంతుడే. గీత ముందు అతని విశ్వాతీత భావమును నొక్కి చెప్పును. అట్లు చెప్పనిచో, మనస్సు తన సర్వోత్తమ లక్ష్యమును గోల్పోయి, విశ్వలీల వైపునకు

---

[1] పరమసత్యము ముందు అవి తక్కువ సత్యములుగా గోచరించినను, అవి అగుటకు సత్యములే. శంకరుని మాయావాదము ధరించు తర్కవిధానము వెనుక నున్న ఆధ్యాత్మికానుభవమునే జూతుమేని, రూపముల సాపేక్షసత్యముయొక్క అత్యుక్తి మాత్రమే అది యని తెలియును. మనస్సునకు పైన నీ సమస్యయే అంతరించును, కారణము, అది అక్కడ ఎప్పుడును ఉండనే లేదు. అచ్చట విభిన్న సాంప్రదాయముల వెనుక నున్న పృథగనుభవములు తమ విభిన్న బౌద్ధికసిద్ధాంతము లను విడిచివేసి సామరస్యము నొందును, ఇంకనుపైకి, అతిమానస అనంతములోనికి వాని నుద్ధరింతుమేని, అక్కడవి సామరస్యమునే గాక ఏకీభావమును గూడ నందును. – శ్రీ అ.

దిరుగును, లేదా విశ్వమునందలి భగవంతునియొక్క ఒక అంశికానుభవమునందు ఆసక్తమగును. తర్వాత గీత దేనియందు సర్వము వర్తించుచు, కర్మచేయునో, భగవంతుని అట్టి విశ్వభావమును వక్కాణించును. ఏలన ఈ భావమే విశ్వకృషిని అర్థవంతము చేయును, మఱియు నీ భావమునందే కాలపురుషుని రూపమున స్వయందృష్టమైన భగవంతుడు (11-32) విశ్వకర్మ నొనర్చును. పిమ్మట, మానవదేహమునందు దివ్యనివాసిగా భగవంతుని ఆశ్రయింపు మని (18-62) గీత గట్టి పట్టు పట్టును. ఏలన అతడు సర్వభూతముల యందు గల అంతర్యామి; అతనిని గుర్తించనిచో, మనము వైయక్తిక జీవనము యొక్క అర్థమునే కోల్పోదుము, మన పరమ ఆధ్యాత్మిక సంభవతల వెనుకనున్న ప్రేరణ తన అత్యధికశక్తినుండి వంచితమగును, అంతేగాదు, మానవాత్మల మధ్య సంబంధములు తుచ్ఛము, పరిమితము, అహంబద్ధము నగును. చివరకు, ప్రపంచము నందలి సర్వవస్తువు లందును భగవదభివ్యక్తిని గీత విస్తరశః ఒత్తిచెప్పును, అటులే ఏకమాత్ర భగవంతుని యొక్క ప్రకృతి, శక్తి, మఱియు తేజములనుండి సర్వము యొక్క ఉత్పత్తిని వక్కాణించును (10-39). ఏలన భూతోత్పత్తి నిట్లు చూచుటయు భగవంతుని జ్ఞానము బొందుటకు మిక్కిలి ఆవశ్యకము. ఏలన దీనిపై నాధారపడియే సమస్త సత్తయు, సమస్తప్రకృతియు సమగ్రముగా భగవదభిముఖ మగును; ప్రపంచమునందు దివ్యశక్తియొక్క కర్మలను మానవు డామోదించును; అతని మనోబుద్ధులను భగవత్కర్మయొక్క ఆదర్శరూపములోనికి తిరిగి పోతపోయ సంభవమగును - ఈ భగవత్కర్మ ఆరంభమునందు విశ్వాతీతము, హేతువునందు విశ్వగతము నయి, జీవుని వ్యక్తిత్వముద్వారా ప్రసారితమగును.

8. ప్రతిస్థాయికి భిన్నధర్మములు :

పరమపురుషుడు, విశ్వచేతన వెనుక నుండు అక్షరాత్మ, మానవునియందలి వైయక్తికేశ్వరుడు, మఱియు విశ్వప్రకృతి యందును, ఆమె కర్మలు మఱియు ప్రాణులయందును, గుప్తముగా బుద్ధము లేక అంశికముగా అభివ్యక్తము నగు భగవంతుడు - ఈ నలుగురును ఒకే సత్యము, ఒకే భగవంతుడు. కాని ఈ ఒకే భగవంతునియొక్క ఒక స్థితిధర్మములని మనము గట్టిగా చెప్పగలిగిన సత్యములను అతని యితర స్థితులకు అన్వయించుటకు ప్రయత్నించినపుడు, అవి వ్యతిరేకమగును,

లేదా తమ అర్థమును మార్చుకొనును. ఉదాహరణకు, భగవంతుడు సదా ఈశ్వరుడే; కాని మన మందుచేత అతని మూల ఈశ్వరత్వమును ఒకేవిధముగా, నే మార్పును జేయక, అతని అన్ని స్థితులకు పచ్చిగా వర్తిపంజేయలేము. విశ్వప్రకృతి యందు అభివ్యక్తమైన భగవంతుడుగా నతడు ప్రకృతితో ఘనిష్ఠతాదాత్మ్యము నొంది కర్మచేయును. అప్పు డతడు స్వయముగా ప్రకృతియే యని చెప్పవచ్చును, అయినను ప్రకృతికర్మలలోపల నతని భావము (spirit) పనిచేయుచు, సర్వమును ముందే చూచి, ముందే సంకల్పించి, ప్రకృతిచేత వివశముగా కర్మచేయించును, ఫల విషయమున అధిశాసించును. పోగా, అన్నింటియొక్క ఏకమాత్ర శాంతాత్మగా, నదే భగవంతుడు అకర్త; ఇచ్చట ప్రకృతి మాత్రమే కర్త్రి. అతడు కర్మల నన్నిటిని ప్రకృతికే ౧డిచివేయగా, ఆమె మన స్వభావమును బట్టి వానిని నిర్వర్తించును – "స్వభావస్తు ప్రవర్తతే (5–14)," అయినను అత డిచ్చటను ప్రభువు మఱియు విభువు; కారణము, అతడు మన కర్మను నిరీక్షించుచు, ధరించును, మఱియు తన మౌన అనుమతిచే ప్రకృతికి కర్మచేయు అధికారమిచ్చును. ఇచ్చటి భగవంతుడు తన వ్యాపక, అచల సన్నిధిద్వారా పురుషోత్తముని శక్తిని ప్రకృతిలోనికి ప్రసరింప జేయుచు, తన సాక్ష్యాత్మయొక్క సమదృష్టిచేత ఆమె క్రియలను ధరించియుండును. ఇక, విశ్వాతీత పురుషోత్తముడుగా నదే భగవంతుడు సర్వమును ప్రారంభించును; అతడు సర్వాతీతుడు, సర్వమును అభివ్యక్తము కా బలాత్కరించును, అయినను తాను సృజించినదానిలో మునిగిపోడు, ప్రకృతికర్మలలో చిక్కుకొనడు. అతడు సర్వోపరిసంకల్పము, ఇది ప్రకృతి కర్మకర్మల సర్వావశ్యకతలకు పూర్వమే సిద్ధమగు సంకల్పము. పోగా, వ్యక్తియందతడు అజ్ఞానసమయమున రహస్య ఈశ్వరుడుగా నుండి, సర్వమును ప్రకృతి యంత్రమున బలాత్కారముగా త్రిప్పును; ఏకకాలమున సాధకమును, బాధకమును అగు అహంకారము గూడ ఈ యంత్రాంగములోని ఒక అవయవమే! కాని ప్రతి వ్యక్తిలోను పూర్ణభగవంతు డున్నాడు గావున, అజ్ఞానమును దాటుటద్వారా ఈ భ్రామ్య భ్రామక సంబంధమును మన మధిగమించ గలము. ఏలన సర్వభృత్తగు ఏకాత్మతో తాదాత్మ్యము జెంది, మనము సాక్షియు, అకర్తయు కాగలము. అథవా మన వైయక్తిక పురుషునికి మనలోని పరమేశ్వరునితో సమీచీన (right) సంబంధ మును గల్పించి, తన ప్రకృతిభాగమునం దా పురుషుని ఈశ్వరునియొక్క నిమిత్త కారణము మఱియు నుపకరణము గావించవచ్చును; అటులే

తన పురుష భావమునం దా పురుషుని లోని ఈశ్వరుని విముక్తప్రభుతలో భాగస్వామి గావించవచ్చును. గీతయం దీ చతుర్విధవివేచనను మనము స్పష్టముగా గ్రహించ వలెను. ఒకే సత్యము యొక్క అర్థము దాని కితరముతో గల సంబంధమును బట్టి మాఱుచుండుటను మనము గుర్తించి, దాని కవకాశ మీయవలెను. లేనిచో, ఏ విరోధము లేని చోట, మనకు విరోధము గన్పించును, అసంగతి గన్పించును, లేక అర్జునుని వలె విపరీతముగా గన్పించు వాక్యమును (4-18) విని మనమును దిగ్భ్రాంతి జెందుదుము.

9. నిజానికి పరస్పరవిరోధము లేదు :

"అన్నియు నాయందు నిలిచి యున్నవి, నేను వానియందు నిలిచి లేను" (9-4). - అని పురుషోత్తమపరముగా గీత వక్కాణించి, వెనువెంటనే మఱల నిట్లు చెప్ప నారంభించును, "మఱియు నన్నియు నాయందు నిలిచియు లేవు; నా ఆత్మ సర్వభూతములను తనయందు ధరించును, నది వానియందు నిలిచి లేదు," (9-5). మఱియు పరస్పర విరోధము గన్పించు రీతి నిట్లు చెప్పును-భగవంతుడు మానవదేహమున తన నివాసము నేర్పఱచుకొనెను, "మానుషీం తనుం ఆశ్రితం" (9-11), మఱియు భక్తి జ్ఞాన కర్మల పూర్ణయోగము ద్వారా అంతరాత్మవిముక్తికి ఈ సత్యమును గుర్తించు టావశ్యకము (18-62). ఈ వాక్యములు పైకి మాత్రమే పరస్పర - అసంగతములు. విశ్వాతీత భగవంతుడుగా, అతడు భూతములయందు లేడు, మఱియు నవి గూడ వానియందు లేవు; ఏలన సత్తాసంభూతుల నడుమ మనమే విభేదమును జూతుమో, అది దృశ్యజగత్తున అభివ్యక్తికి మాత్రమే వర్తించును. విశ్వాతీతావస్థయందు అంతయు కాలాతీత సత్తయే మఱియు నన్నియు, అక్కడ కూడ బహుత్వమున్నచో, కాలాతీత సత్తలే, మఱియు నచ్చట అంతర్నివాస మపేక్షించు దిక్సంబంధి (spatial) భావమునకు ప్రవేశము లేదు; ఏలన దృశ్యజగత్తున భగవంతుని యోగ మాయ సృజించు దిక్కాలకల్పనలు (concepts) విశ్వాతీత నిరపేక్ష సత్తను అవిచ్ఛిన్నము గావించవు. అచ్చట దేశకాలము లందు సహవర్తనము (co-existence) గాక, ఆధ్యాత్మికతాదాత్మ్యము, ఆధ్యాత్మిక సమవర్తనము (coincidence) పునాదిగా నుండవలెను. కాని, దీనికి ప్రతిగా, దిక్కాలములందు విశ్వవిస్తారమును సాధించిన అవ్యక్త, విశ్వాతీత పురుషోత్తముడు ఆ విస్తారమునందు తనలో సర్వభూతములను ధరించు సర్వాత్మగా వ్యక్తమగును - "భూతభృత్" (9-5). మఱియు నీ సర్వవ్యాపియగు

నాత్మద్వారా, పరమాత్మ గూడ విశ్వమును భరించుచున్నాడని చెప్పవచ్చును; అతడు దాని అదృశ్యాధ్యాత్మికాధారము, మఱియు సర్వభూతముల సంభూతికి ప్రచ్ఛన్నాధ్యాత్మిక కారణము. మనలోని రహస్యపురుషుడు మనయొక్క తలపులు, కర్మలు, గమనములను ధరించునట్లే, అతడు విశ్వమును ధరించును. అతడు మనఃప్రాణశరీరములను వ్యాపించి, వానిని తనలో ధరించునట్లును, తన సన్నిధిచేత వానికి ఆధారముగా నున్నట్లును గన్పించును; కాని ఈ వ్యాప్తి వస్తుతః ఒక చేతనాక్రియయే గాని, భౌతికవ్యాప్తి గాదు; శరీరము సైతము సత్తాచేతనయొక్క ఒక సంతతక్రియ మాత్రమే.

10. అక్షరానంతము – క్షరానంతము :

పరమాత్మ సర్వభూతములను భరించును (contains); అన్నియు నతనియందు అవస్థితములై యున్నవి, అయితే భౌతికాకాశమునందు గాదు, స్వయంభూసత్తయొక్క ఆధ్యాత్మిక విస్తారమునందు; భౌతిక మఱియు ఆకాశాత్మక దేశము (space) ను గుఱించి మనకు గల అతికఠిన అభిప్రాయము భౌతికమనస్సు మఱియు నింద్రియముల భాషలో ఆధ్యాత్మికవిస్తారము యొక్క అనువాదమే యగును. వాస్తవాని కిక్కడ సైతము సర్వము ఆధ్యాత్మిక సహవర్తనము, తాదాత్మ్యము, సమవర్తనమే. కాని పరమచేతనను మనము తిరిగి ప్రాపించువఱకు ఈ మౌలికసత్యముతో వ్యవహరించజాలము. అంతదనుక అది ఒక బౌద్ధికభావనగనే యుండును, వ్యవహారమున దానికి ప్రతిరూపము గోచరించదు. కావున దేశకాలపరిభాషలోనే గురువు అర్జునున కిట్లు చెప్పును, "సర్వగతమగు మహా వాయు వెట్లు ఆకాశమున వసించునో, అటులే సర్వభూతములు నాయందు వసించు నని నీవుభావించదగును." (9–6). దీనినిబట్టి విశ్వసత్త సర్వగతము మఱియు అనంతము, మఱియు స్వయంభూ పరమాత్మసత్తయు సర్వగతము మఱియు అనంతము; కాని స్వయంభూ అనంత్యము స్థిరము, అచలము, అక్షరము కాగా, వైశ్వ (universal) అనంత్యము ఒక సర్వవ్యాపి చలనము – "సర్వగతః" (9–6). ఆత్మఏకము; అనేకము గాదు; కాని విశ్వము సర్వభూతములుగా ప్రకటమగుచు, సర్వభూతసముచ్చయముగ గన్పించును. ఒకటి సత్త; రెండవది సత్తాశక్తి, ఈ శక్తి ఆధారభూతమగు అక్షరాత్మ యొక్క ఆ సత్తయందు చరించుచు, సృజించుచు, చేష్టించును. ఆత్మ ఈ భూతము లన్నింటియందు గాని కొన్నింటియందుగాని వసించదు, అనగా దేనియందు నిముడదు – సర్వరూపములు

మూలమున ఆకాశమునుండియే ఉత్పన్నమైనను, ఆకాశము ఏరూపములోను ఇముడనట్లు. అటులే సర్వభూతములు కలిసి ఆత్మ నేర్పఱచవు – తన రూపములు లేక శక్తులయొక్క రాశి ఆకాశము నేర్పఱచని యట్లే. కాని చలనమునందు సైతము భగవంతుడు గలడు; ప్రతిప్రాణిలో నివసించు ఈశ్వరుడుగా నతడు అనేకమునందు వసించును. ఒకే కాలమున అతని కీ రెండు సంబంధములును వర్తించును. ఒకటి విశ్వచలనముతో ఆత్మసత్తకు గల సంబంధము; రెండవది, అంతర్వర్తిత్వము, విశ్వసత్తకు తన స్వీయరూపములతో గల సంబంధము. ఒకటి సర్వమును తనయం దిముడ్చుకొను తన అక్షరత్వరూపమున స్వయంసిద్ధమగు సత్తాసత్యము; రెండవది అదే సత్తయొక్క శక్తిసత్యము, ఈ శక్తి తనను మఱుగుపఱచునట్టియు ప్రకటించు నట్టియు తన చలనముల పాలనమునందును, చేతనీకరణము నందును వ్యక్తమగును.

11. అనుగమించుచునే అధ్యక్షుడు :

విశ్వావస్థకు పైనుండి పరమ పురుషుడు తన ప్రకృతి నదిమి, దానిలో లీనమై యున్నదానినంతను సనాతన పునరావృత్తి చక్రమున వెలికి బంపును (9–8). విశ్వమునందలి సర్వభూతములు ఈ ఒత్తిడికిని, అభివ్యక్తసత్తయొక్క ధర్మములకును లోబడి ప్రవర్తించును, ఈ ప్రవృత్తివలన భగవంతుని విశ్వరూపము విశ్వసామరస్యములతో విలసిల్లుచు వ్యక్తమగును. ఈ దివ్యప్రకృతి క్రియయందు – "ప్రకృతిం మామికాం", "ప్రకృతిం స్వాం" (9–7,8) – జీవుడు తన సంభూతిచక్రము ననుగమించును. ఆమె యాత్ర మలుపుల ననుసరించి, జీవు డీయా వ్యక్తిత్వ మగును; ప్రకృతియొక్క ఉచ్ఛతర మఱియు ప్రథమగతియందు గానిండు, లేక నిమ్నతర మఱియు ద్వితీయగతియందు గానిండు, అజ్ఞానము లేక జ్ఞానమునందు గానిండు, దివ్యప్రకృతియొక్క ఒక అభివ్యక్తిగా జీవుడు సదా తన సత్తాధర్మము ననుసరించియే ప్రవర్తించును. కల్పక్షయమునందు (9–7), జీవుడు ప్రకృతి క్రియనుండి వెలువడి, ప్రకృతి నిష్క్రియతామౌనములలోనికి తిరిగివచ్చును. అజ్ఞానదశయందు జీవుడు ప్రకృతి భ్రమణమున కధీనుడై, స్వరాట్టు గాక, ఆమె శాసనమునం దుండును– "అవశంప్రకృతేర్ వశాత్" (9–8). దివ్యచేతనకు తిరిగి వచ్చుటచేతనే జీవుడు ప్రభుతను, స్వేచ్ఛను బొందగలడు. భగవంతుడు సృష్టిచక్రము ననుగమించును, అయితే దాని కధీనుడై కాక, దానిని చైతన్యవంతము గావించు

పురుషుడు మఱియు మార్గదర్శిగా, ఇచ్చట అతని సమస్తసత్త దానిలో మునుగదు, అతని సత్తాశక్తి మాత్రమే దాని ననుగమించుచు, తీర్చిదిద్దును. అతడు తన స్వీయప్రకృతిక్రియ "కధ్యక్షుడు" (9-10) - అతడు (జీవునివలె) ప్రకృతిలో జనించిన పురుషుడు గాడు, అభివ్యక్తియందు గన్పించు దాని నంతను ప్రకృతి తననుండి పుట్టింప, ప్రకృతిని ప్రేరేపించు సృజనాత్మకపురుషుడు. అతడు తన శక్తిరూపమున ప్రకృతితో నుండి, ఆమె కర్మలను చేయించుచున్నను, ఆ కర్మలకు వెలుపల గూడ నుండును, విశ్వాతీతప్రభుతయందు విశ్వకర్మకు పైన విరాజిల్లు చున్నట్లుండును; ప్రకృతియందు లగ్నముగావించు నెట్టి దుర్దమకామముచేతను ఆమెయం దాసక్తుడు గాడు, కావుననే ఆమె కర్మలచేత బంధింపబడడు (9-9), కారణము, అత డా కర్మలకు అనంతముగా పైనను, పూర్వమునను నుండువాడు, కాలచక్రములందు ఆ కర్మల సర్వప్రవృత్తికి ముందు, నడుమ, తర్వాతను ఏకరీతిగా నుండువాడు. వాని మార్పులు అతని అక్షరసత్త కెట్టి మార్పును గల్గించవు. విశ్వము నంతటిని వ్యాపించి, ధరించు నీరవ అక్షరాత్మ దాని వికారములచే ప్రభావితము గాదు; కారణము, అది వానిని ధరించుచున్నను, వానిలో పాల్గొనదు. కాగా ఈ అధికతర, విశ్వాతీత పరమాత్మయు ప్రభావితము గాదు; కారణము, అది వానికి పరమునను, శాశ్వతముగా పూర్వమునను ఉండును.

12. సమగ్ర పరిపూర్ణమార్గము :

కాని, మఱియు, ఈ క్రియ దివ్య ప్రకృతిక్రియ గావునను - "స్వా ప్రకృతిః" (9-8) - దివ్యప్రకృతి దేవునినుండి విడివడి యుండదు గావునను, ఆమె సృజించు ప్రతిదానియందును భగవానుడంతర్వర్తిగా నుండితీరును. ఈ సంబంధము అతని సత్తయొక్క సంపూర్ణ సత్యము గాదు, అయినను మన మీ సత్యము నేమాత్రము నుపేక్షింపజాలము. అతడు మానవదేహమున నివసించుచున్నాడు. ఎవరతని ఈ సన్నిధి నుపేక్షింతురో, ఈ సన్నిధి ధరించిన ముసుగు కారణముగా, దాని నెవరు అవమానింతురో, వారు ప్రకృతిరూపములకు విమూఢు లగుదురు (9-11), లోపల గుప్తముగా భగవంతు డున్నా డని వారు కనుగొనజాలరు - ఈ భగవంతుడు తక్కిన దేహములందు యోగమాయసమావృతుడై నప్పటికి, అవతారదేహమున బాహ్యచేతనయందు గూడ తెలియబడును. ఎవరు మహాత్ములో - తమ

అహంభావమున ఆవృతులు గారో - ఎవరు అంతర్నివాసి భగవంతుని కున్మీలితు లగుదురో, వారు పరిమిత - మానవ ప్రకృతిచేత నిచ్చట పరిచ్ఛిన్నుడై నట్లు గన్పించు ఈ రహస్యభగవంతుడును, మనము వెలుపల పరమభగవంతునిగా నుపాసించు పరంజ్యోతియు నొకటే యని తెలిసికొందురు (9-13). ఈ గుప్త భగవంతుడే తన ఉత్తమ స్థితియందు సర్వ భూతనియామకుడు, అధీశ్వరుడు ననియు, మఱియు ప్రతిప్రాణియందును గూడ నతడు పరదేవతగానే యున్నా డనియు నెఱుంగుదురు. ఇతడు గాక, తక్కిన దంతయు అభివ్యక్తినిమిత్తము విశ్వమునం దతడు ధరించిన పరిమితత్వమే. ఇంకను, అతని ప్రకృతియే విశ్వమునం దంతయు నయ్యెను గావున, ప్రతివస్తువు తన స్వరూపమున భగవంతుడే గాని, మఱేదియు గాదని, అంతయు వాసుదేవుడే యని వారు గాంతురు; మఱియు నతని విశ్వాతీత భగవంతునిగనే కాక, ఇచ్చట నతని ఏకత్వరూపమునను, ప్రతి ప్రాణియందును గూడ నుపాసింతురు. (9-15). వారీ సత్యమును దర్శించుటయే గాక, దానియందు నివసింతురు, కర్మ చేతురు; అతనినే వారు విశ్వాతీతభగవంతుని గను, విశ్వమయభగవంతునిగను, ప్రతివస్తువునందు గల అంతస్థభగవంతునిగను ఆరాధింతురు, అనుజీవింతురు, సేవింతురు (9-14) - కర్మయజ్ఞముచేత సేవింతురు, జ్ఞానముచేత నన్వేషింతురు, సర్వత్ర అతనిని తప్ప అన్యము నేమియు జూడరు (9-15), మఱియు తమ సంపూర్ణసత్తను - దాని ఆత్మయందును, బాహ్యాభ్యంతర ప్రకృతియందును - అతనిలోనికే లేవనెత్తు కొందురు. ఇదియే సమగ్ర, పరిపూర్ణమార్గ మని వారికి దెలియును (9-34); ఏలన ఇది విశ్వాతీతము, విశ్వగతము, వైయక్తికము నగు ఏకమాత్ర భగవంతుని సంపూర్ణ సత్యముతో గూడిన మార్గము.

6. కర్మ, భక్తి, జ్ఞానము

1. సమగ్రజ్ఞాన సంగ్రహము :

కావు నిదియే సంపూర్ణసత్యము, అత్యున్నత, అతివిశాలజ్ఞానము. 1. భగవంతుడు విశ్వాతీత, సనాతన పరబ్రహ్మము; ఇతడు (ఇది) తన దేశకాలాతీత అస్తిత్వముచే దేశకాలములందు తన సత్తాప్రకృతుల విశ్వాభివ్యక్తి నంతను ధరించును. 2. భగవంతుడు పరమాత్మ; ఇతడు విశ్వముయొక్క రూపములను, గతులను ఆత్మవంతము గావించును. 3. భగవంతుడు పురుషోత్తముడు; ఈ విశ్వమునందు గాని, ఏ విశ్వమునందు గాని సమస్తాత్మ మఱియు ప్రకృతి, అనగా సమస్తసత్త మఱియు సంభూతి ఇతనియొక్క స్వభావనయే, స్వతపస్యయే. 4. భగవంతుడు అవర్ణనీయ పరమేశ్వరుడు; ఇతడు ప్రకృతియం దభివ్యక్తమైన తన శక్తిని తన ఆధ్యాత్మిక నియంత్రణచే నియమించి, ప్రపంచ యుగములను, ఆ యుగములందు ప్రాణుల ప్రాకృతవికాసమును బయల్పఱచును. ఈ యీశ్వరునుండియే నిర్గమించి, జీవుడు, అనగా వ్యష్టిపురుషుడు, ప్రకృతిగత అంతరాత్మ ఇచ్చట విశ్వచక్రములలోనికి వచ్చును – ఈ జీవుడు అతని సత్తచేత సత్తావంతుడు, అతని చిత్ప్రకాశముచేత సచేతనుడు; అతని సంకల్ప, శక్తులచేత ఈ జీవునికి జ్ఞాన, సంకల్ప, క్రియలయం దధికారము; అతని విశ్వభోగముచేత నితని జీవనభోగము.

2. మిక్కిలి దగ్గరి మార్గము :

మానవునియందలి అంతరాత్మ ఇచ్చట భగవంతుని యొక్క ఆంశికాభివ్యక్తి, ప్రకృతికర్మల నిమిత్తము అత డట్లు స్వయం పరిమితు డగును – "ప్రకృతిర్ జీవభూతా" (7–5). ఆధ్యాత్మికమూలమునందు అతడు భగవంతునితో నేకమే. దివ్యప్రకృతి కర్మలయం దింకను అత డతనితో నేకమే యైనను, ఇచ్చట వ్యావహారికభేదము గన్పించును, ప్రకృతిగతభగవంతునితోను, ప్రకృతికి పరుడగు భగవంతునితోను అనేక, గంభీరసంబంధము లేర్పడును. కాని నిమ్నప్రకృతికర్మలయందు, అజ్ఞానము చేతను, అహంకారిక పృథగ్భావముచేతను అతడు ఏకమాత్రభగవంతునికంటె మిక్కిలి అన్యుడుగా గన్పించును; మఱియు నీ పృథక్కరచేతనయందు తన అహంకారిక సుఖము మఱియు ప్రయోజనము నిమిత్తమే ఆలోచించుచు, సంకల్పించుచు, కర్మచేయుచు, భోగించుచు నున్నట్లు తోచును. కాని నిజానికి అతనిసత్త, ఆలోచన, సంకల్పము, క్రియ, భోగమంతయు భగవంతుని సత్త, ఆలోచన, సంకల్పము,

క్రియ, ప్రకృతిభోగముయొక్క ఒక ప్రతిబింబము మాత్రమే-అయితే అత డజ్ఞానమునం దున్నంత కాలము ఈ ప్రతిబింబము అహంమయము, వికృతము నగును. తన యీ సత్యమును తిరిగి ప్రాపించుట అతని విముక్తికి ప్రత్యక్ష సాధనము, అజ్ఞానాధీనతనుండి తప్పించుకొనుటకు విశాలతమ, నికటతమద్వారము నగును. జీవు డొక పురుషుడు, అనగా మనస్సు మఱియు బుద్ధి, సంకల్పము మఱియు సశక్తిక్రియ, భావము మఱియు సంవేదనము (sensation), జీవనానందముకొఱకు ప్రాణమయకామన – వీనిరూపమగు ప్రకృతితో గూడిన ఒక అంతరాత్మ; కావున జీవుని ఈ శక్తుల నన్నింటిని భగవదున్ముఖము చేయుటచేతనే తన అత్యున్నత సత్యమునకు జీవుని ప్రత్యావర్తనము సంపూర్ణముగా సంభవమగును. అతడు పరమాత్మ మఱియు బ్రహ్మజ్ఞానముతో (దేనినైన) దెలిసికొనవలెను; అతడు తన ప్రేమ మఱియు ఆరాధనలను పరమపురుషునికి మఱల్చవలెను; అతడు తన సంకల్పము మఱియు కర్మలను జగదీశ్వరునికి అధీనముచేయవలెను. అప్పుడతడు నిమ్నప్రకృతినుండి ఉన్నతప్రకృతిలోనికి జరుగును: అజ్ఞాన చింతన, సంకల్పము, మఱియు కర్మలను త్రోసివేసి, తన దివ్యతాదాత్మ్యమునందు పరమాత్మ యొక్క ఒక ఆత్మగా, పరమచైతన్యము యొక్క ఒక శక్తి మఱియు వెలుగుగా చింతించును, సంకల్పించును, మఱియు కర్మచేయును. ఇప్పుడతడు బాహ్యస్పర్శలను, వేషములను, రూపములనే గాక, భగవంతుని ఆంతర అనంతమునంతను అనుభవించును. ఇట్లు దివ్యభావముతో నివసించుచు, తన సంపూర్ణాత్మను, అంతరాత్మను (జీవభావమును), ప్రకృతిని భగవదభిముఖముగా నడుపుచు, అతడు పరబ్రహ్మరూపమగు సత్యతమ సత్యములోనికి స్వీకరించబడును.

3. హృదయపురుషుడు పరమపురుషుడే :

సర్వము వాసుదేవుడే యని తెలిసికొని, ఆ జ్ఞానమున నివసించుటయే రహస్యము. మొదట జీవు డతనిని, సర్వమును దనయందు గలిగి, సర్వమునందు నుండు అక్షరాత్మగా నెఱుంగును. అపు డతడు నిమ్నప్రకృతియొక్క సంక్షోభమునుండి వెనుకకు తగ్గి, ఈ స్వయంభూ ఆత్మయొక్క సహజనిశ్చల శాంతిలో నివసింపసాగును. నివసించుచు, భగవంతుని యొక్క ఈ ఆత్మతో సంతత ఏకతను సాధించును. పిమ్మట నతడు క్షరప్రపంచము యొక్క ఈ సనాతన, ఆధ్యాత్మిక అక్షరాధారమునుండి తన దృష్టిని తతోధిక, సనాతన, విశ్వాతీత సత్పురుషుని వైపునకు ద్రిప్పును. ఇక

జీవు డతనిని సర్వవస్తువులయందలి దివ్యనివాసిగా, మానవహృదయమునందలి స్వామిగా, రహస్య ఈశ్వరునిగా నెఱింగి, తన ప్రాకృతసత్తకును, తన సత్తయొక్క ఈ అంతర స్వామికిని మధ్య నున్న తెరను దొలగించుకొనును. అపుడు అంతర్నివాసి భగవంతుని ంతతానుభవమునకు అనురూపముగావించబడిన తన సంకల్పమును, చింతనను, కర్మను జ్ఞానపూర్వకముగా ఈశ్వరసంకల్పము, చింతన, మఱియు కర్మలతో నేకము గావించును, అతనినే అన్నింటియందును దర్శించి, ఆరాధించును, మఱియు సర్వ మానవకర్మను దైవప్రకృతి పరమాశయమునకు అనుగుణముగా మార్చును. తన చుట్టును గల సర్వముయొక్క మూలము, సారతత్త్వము ఈశ్వరుడే యని అత డెఱుంగును. ఉన్న వస్తువు లన్నియు తమ బాహ్యరూపమున ఆ ఏకమాత్ర, అచింత్య సద్వస్తువుయొక్క ముసుగు లనియు, తమ అంతఃప్రవృత్తియందు దాని సాధనములు మఱియు సంకేతము లనియు అతడు దర్శించును; అతడు సర్వత్ర ఆ ఏకతను, బ్రహ్మమును, పరమపురుషుని, సర్వాత్మను, వాసుదేవుని, సర్వము నైన మూలసత్తనే కనుగొనును. ఇందుచేతను గూడ సాధకుని అంతరజీవన మంతయు తన చుట్టును గల చరాచరమునం దంతటను ఇపుడు స్వయంప్రకటితమైన అనంతముతో సమస్వరము, సామరస్యపూర్ణమునై చెలంగును; కాగా నతని బాహ్యజీవన మంతయు విశ్వకార్యముయొక్క ఒక యధార్థ ఉపకరణక్రియ యగును. అతడు సర్వాత్మద్వారా పైకిజూచుచు, ఇహపరములందు ఏకమాత్ర సత్తయగు పరబ్రహ్మమును గాంచును. అతడు అన్నింటియందును గల అంతర్నివాసి ద్వారా పైకిజూచుచు, తన పరమావస్థ యందు సర్వనివాసమున కావల నుండు అతీతపురుషుని జూచును. విశ్వము నందభివ్యక్తమైన ఈశ్వరునిద్వారా పైకి జూచుచు, అభివ్యక్తికి పరమునం దుండి, దానిని శాసించు పరమేశ్వరుని గనుగొనును. ఇట్లు అనంతమగు జ్ఞానోత్ఫుల్లనము ద్వారా, ఊర్ధ్వదృష్టి మఱియు నాకాంక్షద్వారా అతడు దేని వైపునకు 'సర్వభావముతో' (15-19) అనివార్యముగా దిరిగెనో, దాని కెగయును.

4. సమన్వయ వివరణము :

ఇట్లు సర్వభావముతో అంతరాత్మ భగవదభిముఖ మగుటయే జ్ఞాన భక్తి కర్మల గీతాసమన్వయముయొక్క ఆధారరాజము. అతని నిట్లు సమగ్రముగా నెఱుంగుట యన, ఆత్మయందును, సమస్తాభివ్యక్తియందును, అభివ్యక్తి కావలను అతని నేకమాత్రునిగా నెఱుంగుటయే - ఇది యంతయు ఏకకాలమున సంయుక్తముగా నెఱుంగుట. అయినను ఇట్టి శుష్కజ్ఞానము సైతము చాలదు; దానితో బాటు

భగవదభిముఖగా హృదయము మఱియు నంతరాత్మలయొక్క ప్రగాఢ ఉద్గమన ముండవలెను, దానిచేత సర్వాలింగకమగు ప్రేమ, ఆరాధన, ఆకాంక్ష ప్రదీప్తము గావలెను. నిశ్చయముగా, ఆకాంక్షచేత అనుగతము, ఉద్గమనముచేత ఉజ్జీవితము గాని జ్ఞానము సత్యజ్ఞానము గాదు; ఏలన అది ఒక బౌద్ధికదర్శనము, నిష్ఫల విచారణాప్రయాసము మాత్రమే కాగలదు. భగవద్దర్శనము తప్పక భగవదారాధనను, సోత్సాహాన్వేషణను గొనివచ్చును - ఈ ఉత్సాహము స్వయంభూ భగవంతుని పరమే కాక, మనయందలి, ప్రపంచమునందలి భగవత్పరము గూడను. బుద్ధితో నెఱుంగుట అర్థముచేసికొనుట మాత్రమే, అది ఉపయుక్త ప్రారంభము గావచ్చును, కాకపోవచ్చును - జ్ఞానమునందు ఎట్టి చిత్తశుద్ధి, సంకల్పమునం దెట్టి సాక్షాత్కార ప్రేరణ, అంతరాత్మపై నెట్టి శక్తి ప్రభావము, అంతఃపురుషునిలో నెట్టి పిలుపు లేనిచో, కాదుగూడ. కారణము, మేధ బాహ్యముగా నర్థముచేసికొనెనే గాని, అంతరాత్మ ఏమియు దర్శించ లేదనియే దాని కర్థమగును. అంతఃసత్తతో దెలిసి కొనుటయే యదార్థ జ్ఞానము, మఱియు అంతఃసత్తను ప్రకాశము స్పృశించినపుడు, ఆ ప్రకాశమున దృష్టమగు దాని నది ఆలింగనముచేసికొన రెపరెపలాడును, దానిని బొంద నభిలషించుచు, దానిని తనలో రూపొందించుకొని, తద్రూపము నందుటకు ప్రయాస పడును. ఈ అర్థమున, జ్ఞాన మన (పూర్వమే యున్న) తాదాత్మ్యమునకు కనువిప్పుట యగును, మఱియు నీ తాదాత్మ్యమును అంతఃపురుషుడు చేతనానందముల చేతను, ప్రేమచేతను, ప్రాప్తిచేతను సాధించుకొనును గాన, ప్రబుద్ధమైన జ్ఞానము - సత్యమును ఏకమాత్రపరిపూర్ణము నగు నిట్టి సిద్ధిని సాధించు అప్రతిహత సంవేగమును బుట్టింపవలెను. ఇచ్చట జ్ఞానవిషయము బాహ్యవస్తువు గాదు, పరంతు మన సర్వసత్తయొక్క ఆత్మయు, నధీశుడు నగు దివ్యపురుషుడు. అతనియం దొక ప్రబలానందము, అతనిపట్ల ప్రగాఢము, సజీవము నగు ప్రేమారాధనలు ఈ జ్ఞానముయొక్క అనివార్యఫలితము, జ్ఞానముయొక్క సాక్షాదాత్మయు గావలెను. మఱియు నీ ఆరాధన హృదయాన్వేషణ మాత్రమే గాదు, పరంతు సర్వభావ సమర్పణము. కావున ఈ ఆరాధన యజ్ఞరూపము గూడ ధరించవలెను; మన కర్మలన్నియు నీశ్వరునికి సమర్పింపబడును, సక్రియమగు మన బాహ్యాభ్యంతర ప్రకృతియంతయు తన ప్రతివృత్తియందును ఆరాధ్యదైవమునకు నివేదించబడును. మన ఆంతరవృత్తు లన్నియు అతనియందే వర్తించుచు, తమ శక్తిమూలముగను, తన ప్రయత్నగమ్యముగను ఆత్మయు, నధీశుడు నగు నతనినే అన్వేషించును. పోగా

మన బాహ్యవృత్తులు ప్రపంచమునందు గల భగవంతుని వైపుగా వర్తించుచు, అతని సేవ నారంభించును, ఈ సేవను ఎవనియందు మనము విశ్వముతోను, విశ్వప్రాణులతోను ఏకాత్మకులముగా నుందుమో, అట్టి అంతఃస్థ భగవంతుడు నడుపును. ఏలన పురుషోత్తముడే యగు నీ అంతఃస్థభగవంతునికి ప్రకృతియు, ప్రకృతిగత ఆత్మయు బాహ్యాంతరశరీరము లగును. ఇట్లు ఏకమాత్ర ఆత్మ మఱియు పురుషుని యందు మనస్సు, హృదయము, మఱియు సంకల్పముల యొక్క సమన్వయము సిద్ధించును; దీనితో బాటు ఈ పూర్ణ సాయుజ్యమునందు, ఈ విశ్వతోముఖ భగవత్సాక్షాత్కారము నందు, ఈ దివ్యయోగమునందు జ్ఞానభక్తి కర్మల సమన్వయమును సిద్ధించును.

5. దివ్యయోగము కష్టమగుటకు గారణము :

ఈ యోగమున పాదము పెట్టుట సైతము అహంబద్ధ ప్రకృతికి మిక్కిలి కష్టము; కాగా మార్గమున చివరిసారిగా, శాశ్వతముగా పాదముపెట్టిన పిమ్మట సైతము విజయోపేత సామరస్యపూర్ణ పూర్ణయోగము సులభము గాదు. మర్త్యమానసము ఆవరణలను (veils), ఆభాసములను (appearances) అజ్ఞముగా నమ్మి, భ్రాంతమగును; అది మానవ శరీరమును, మానవమానసమును, మానవజీవన విధానమునే చూచును గాని, ప్రతి ప్రాణిలోపల నివసించు భగవంతుని విమోచక దర్శనమును ఒక మెఱపుగా గూడ బొందదు. తనయందున్న భగవంతు నది చూడదు, ఇతరులయం దున్న భగవంతుని జూడజాలదు; మానవజాతియందు అవతారముగను, విభూతిగను భగవంతుడు తన నభివ్యక్తము చేసికొనుచున్నప్పటికి, దానికి చూడ కండ్లు లేవు, అది అతనిని ఉపేక్షించును లేక అవమానించును – “అవజానంతి మాం మూఢా మానుషీం తను మాశ్రితం” (9–11). మఱియు నది సజీవప్రాణుల యందే అతని నుపేక్షించి నపుడు, జడప్రపంచమున అసలు చూడనే లేదు; కారణము, అది బాహ్యప్రపంచమును పృథక్కరమగు అహంకారాగారమునుండి పరిమితమగు మనోగవాక్షముద్వారా చూచును. అది ప్రపంచమునందలి భగవంతుని జూడదు, ఇక సర్వభూత మహేశ్వరుడును, వానిలోపల నివసించువాడును అగు పరమపురుషుని గుఱించి దాని కేమియు తెలియదు. ఏ దర్శనముచేత ప్రపంచమునందలి సర్వము భగవంతుడుగా గన్పించసాగునో, మఱియు అంతరాత్మ స్వయముగా తన అంతర్గత దివ్యతకు మేల్కొని భగవదంశము, భగవత్సదృశము నగునో, అట్టి దర్శనమునకు మర్త్యమానస మంధము. విషయములను విషయములకొఱకును, బుద్ధీంద్రియ

శరీరముల పార్థివ తృష్ణాతృప్తికిని వేటాడు అహంకారజీవనమును మాత్రమే అది అనాయాసముగా జూచును, దాని యందే ప్రబలముగా సక్తమగును. ఎవరు మనోవృత్తి యొక్క ఈ బహిర్ధావనమునకు సర్వథా అంకితమగుదురో, వారు నిమ్నప్రకృతిలో చిక్కుకొని, దానియందే సంసక్తులై, దానినే తమ ఆధారభూమి గావించుకొందురు. వారు మానవునియందలి రాక్షసప్రకృతికి గుఱియగుదురు - మానవునియందలి ఏ రాక్షసుడు తన ప్రాణికాహంకారముయొక్క ప్రచండ తృప్తి నిమిత్తము సర్వమును ఆహుతిచేసి, దానినే తన యిచ్ఛ, చింతన, క్రియ, భోగముల యొక్క తమోమయ దేవతను గావించుకొనునో అట్టి రాక్షసప్రకృతికి గుఱియగుదురు. (9-12). అథవా వారు తమలోని అసురప్రకృతికి గుఱియై, దురహంకారపూర్ణమగు స్వీయేచ్ఛచేతను, స్వయంపర్యాప్తచింతనచేతను, స్వవిషయక కర్మచేతను, సదా మేయుచునే సదా అతృప్తముగా నుండి అసురప్రకృతియొక్క భోగలాలసచేతను వ్యర్థచక్రమున ముందుకు నెట్టబడుచు, భ్రమించుచుందురు. కాని వేఱుచేయునట్టి ఈ అహంచేతన యందే చెడ్డపట్టుతో నివసించుచు, దానినే మన సర్వ కార్యకలాపములకు కేంద్రము చేయుట యన, సత్యమగు ఆత్మబోధమునకు సర్వథా దూరమగుటయే యగును. ఈ అహంచేతన దారితప్పిన ఆత్మోపకరణములపై బఱపు సమ్మోహనము ఒక మాయయై జీవితమును ఒక నిరర్థక చక్రభ్రమణమునకు బంధించును. దివ్యసనాతన ప్రమాణమును బట్టి చూచిన, అట్టి జీవితముయొక్క సమస్తాశయు, కర్మయు, జ్ఞానమును వ్యర్థములు (9-12); ఏలన అది మహత్తర ఆశను బహిష్కరించును, విమోచకకర్మను వెలివేయును, జ్యోతిర్మయజ్ఞానముకు స్వస్తిచెప్పును. మఱియు దృశ్యమును జూచి, దృశ్యసత్యమును జూడజాలని జ్ఞానము మిథ్యాజ్ఞానము; క్షణికము వెంటబడి, సనాతనమునకు దూరమగు ఆశ గ్రుడ్డి ఆశ; దేనివలన గలిగిన లాభము దానివలన గలిగిన నష్టముచేత సున్నయగునో, అట్టి కర్మ నిష్ఫలకర్మ, 'సిసిఫస్' చేసిన నిరంతర పరిశ్రమ మాత్రమే యగును.

6. జీవన మంతయు నిత్యయోగము :

అయితే యథాశక్తి దివ్యతర ప్రకృతియొక్క తేజోవిశాలతలకు ఉన్మీలితులగు మహాత్ములు మాత్రమే ముందు సంకుచితము, క్రమముగా చెప్పరానంత విశాలమునై, విముక్తి, సంసిద్ధులకు గొనిపోవు మార్గము నాశ్రయించినవారు (9-13). మానవునియందలి దేవుని వృద్ధియే మానవుని సముచితకార్యము; నిమ్నతరమగు

నీ ఆసుర, రాక్షసప్రకృతిని దృఢభావమున దివ్యప్రకృతిలోనికి త్రిప్పుటయే మానవజీవితముయొక్క ప్రచ్ఛన్నమర్మము. ఈ వృద్ధి వృద్ధి జెందినకొలది ఆవరణము తొలగి, కర్మయొక్క అధికతరాశయమును, జీవనముయొక్క వాస్తవసత్యమును అంతరాత్మ చూడగలుగును. మానవుని లోపలి భగవంతునికి, ప్రపంచమునందలి భగవంతునికి కన్ను తెఱచుకొనును. లోపలిగా జూచుచు, వెలుపలిగా అనంతసత్తను జూడసాగును – ఈ అవ్యయ సత్తయే (9–13) సర్వభూతములకు జన్మస్థానము, ఇదియే (ఇతడే) అన్నింటియందు నుండును, ఇతని చేతనే, యితనియందే అన్నియు సదా యుండును. కావున నీ అంతర్దర్శనము, జ్ఞానము నంతరాత్మను పట్టివేసినపుడు, అంతరాత్మయొక్క సమస్తాకాంక్షయు భగవంతుని యందు ఒక అత్యుత్కటప్రేమ మఱియు అగాధభక్తిరూపము ధరించును. పోగా మనస్సు ఆ సమగ్రభగవంతుని యందు అనన్యముగా ఆసక్తమగును; అతని నిమిత్తము గాక, అది దేనికిని ఎట్టి విలువ నివ్వదు, ఆ సర్వానందమయ పురుషుని యందే అది రమించును. అపుడు భక్తుని సమస్తవాక్కును, చింతనయు ఒక అఖండకీర్తన (9–14) మగును – తన మహిమాతిశయమునం దిపుడు స్వయముగా నావిష్కరించుకొనిన విశ్వవ్యాపక మహత్త, తేజము, సౌందర్యము మఱియు సత్యములయొక్క కీర్తన మగును, మఱియు పరమాత్మ, మఱియు అనంతపురుషునియొక్క పూజన మగును. భేదించుకొని వెలికి వచ్చుటకు అంతరాత్మ పడిన సుదీర్ఘ ప్రయాస మంతయు నిపుడు తనలోని భగవంతుని దర్శించుటకును, ప్రకృతిలోని భగవంతుని దర్శించుటకును వలయు నొక ఆధ్యాత్మిక ప్రయత్నరూపము ధరించును. జీవన మంతయు నొక నిత్యయోగ (9–14) మగును, మఱియు దైవమానవభావముల ఏకీకరణ మగును. సంపూర్ణభక్తియొక్క రీతి యిది; సనాతన పురుషోత్తమునికి అంకితమైన హృదయము సమర్పించు యజ్ఞముద్వారా మన సమస్తసత్త మఱియు ప్రకృతియొక్క సమగ్రసముద్ధరణము నీ భక్తి సాధించును.

7. జ్ఞానము భక్తిని బుట్టించును :

జ్ఞానమున కధికప్రాధాన్య మిచ్చువారు సైతము భగవద్దర్శనమువలన అంతరాత్మపైనను, ప్రకృతిపైనను ప్రసరించు నిత్యవర్ధమానము, తత్పరతాజనకము, కార్యసాధకము నగు శక్తిచేత అదే స్థానమును బ్రాపింతురు. వారిది జ్ఞానయజ్ఞము, జ్ఞానగర్భమగు అవర్ణనీయ ఆనందాతిరేకముచేత వారు పురుషోత్తముని ఉపాసింపసాగుదురు – "జ్ఞానయజ్ఞేన యజంతో మాం ఉపాసతే" (9–15). ఈ

సమ్యగ్ జ్ఞానము భక్తిపూర్ణము, ఏలన అది తన కరణము లందు సమగ్రము, తన లక్ష్యమునందు సమగ్రము. అది పరమతత్త్వము నొక నిర్విశేష ఏకత్వముగనో, అపరిచ్ఛేద్య ేవలముగనో భావించి అనుసంధించు జ్ఞానము గాదు. అది పరముని మఱియు విశ్వాత్మకునియొక్క హృదయంగమ అన్వేషణము మఱియు ఆలింగనము; అది అనంతుని తన అనంతతయందును, అనంతుని సమస్తసాంతము నందును అనుసంధించుట యగును; అటులే ఆ జ్ఞానము ఏకుని తన ఏకత యందును, ఏకుని తన వివిధ తత్త్వములు, అసంఖ్యాకముఖములు, శక్తులు, రూపములందును దర్శించుటయు, కౌగిలించుటయు నగును; ఇచ్చటను, అచ్చటను, సర్వత్రను, కాలాతీతముగను, కాలమునందును, ప్రపంచమున మనకు తారసిల్లు కోటి కోటి ప్రాణులయందును ఆ ఏకమాత్రునే దర్శించుట యగును – "ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖం" (9–15). ఈ జ్ఞాన మనాయాసముగా నొక ఆరాధనయు, నొక విశాల భక్తియు, నొక వ్యాపక ఆత్మసమర్పణయు, నొక సమగ్ర ఆత్మ నివేదనము నగును, కారణము, అది యొక పరమాత్మజ్ఞానము, ఒక పరమసత్తతో సంపర్కము, విశ్వాతీతుడు, విశ్వమయుడు నగు నొక పరమపురుషుని ఆలింగనము – ఈ పరమపురుషుడు తనను సమీపించినపుడు మనపై తన అనంతానందముయొక్క నిధుల నెట్లు కుమ్మరించునో, అటులే మన సర్వస్వమును తా నపహరించును.

8. కర్మయు భక్తిగా మాఱును :

కర్మయోగము సైతము ఆత్మనివేదన రూపమగు నొక ఉపాసన మఱియు భక్తిలోనికి మాఱును; ఏలన అది ఏకమాత్ర పురుషోత్తమునికి జేయు మన సమస్త సంకల్పము మఱియు దాని కార్యకలాపముల యొక్క సంపూర్ణ యజ్ఞము. బాహ్య వైదికయజ్ఞ మొక శక్తిశాలిసంకేతము; దాని ఫలము స్వల్ప మైనను, అదియును స్వర్గోన్ముఖము. కాని దేనియందు సర్వమయ భగవంతుడే యజ్ఞక్రియ, యజ్ఞము, యజ్ఞసంబంధి ప్రతివిభాగము నగునో, అదియే వాస్తవయజ్ఞము (9–16). ఈ అంతరయజ్ఞముయొక్క సమస్తక్రియలు మఱియు రూపములు మనయందలి అతని శక్తియొక్క స్వయంనియమనము, స్వయంప్రకటనము నగును, మన ఆకాంక్షద్వారా ఇట్టి శక్తి తన మూలమున కారోహించును. మనయందలి దివ్య నివాసియే స్వయముగా నగ్నియు, ఆహుతియు; ఎట్లన ఈ అగ్ని భగవదభిముఖ సంకల్పము, ఇక నిట్టి సంకల్పము మనయందలి భగవంతుడే. అటులే ఆహుతియు మన సత్తాప్రకృతులయందలి భగవద్భావముయొక్క ఒక రూపమును, శక్తియు మాత్రమే,

అతనినుండి స్వీకరించబడిన దంతయు తిరిగి దాని మూలసత్యమునకే సేవారాధనల రూపమున అర్పించబడును. దివ్యమనీషి (Thinker) స్వయముగా మంత్రమగును; ఎట్లన భగవదభిముఖమగు చింతనయందు అతని ప్రకాశము తనను ప్రకటించు కొనును, మఱియు నీ చింతనకు శరీరమగు మంత్రశబ్దమునందు – ఆ నిష్కరణాత్మక మంత్రశబ్దమునందు – ఆ ప్రకాశము కార్యకారి యగును, అనగా మంత్రము అతని ప్రకాశముయొక్క మూర్తీభావము. ఇంకను, ప్రకాశనశీల భగవంతుడే వేదమును, వేద్యమును (9–17), అతడు జ్ఞానమును, జ్ఞానవిషయమును – రెండును. ఋగ్వేదము, అనగా జ్ఞానకిరణములతో బుద్ధిని దీపింపజేయు ప్రకాశమయమంత్రము; యజుర్వేదము, అనగా కర్మను సరిగా నియమించునట్టి శక్తిమయమంత్రము; సామరస్యమయ సాధనమంత్రము – ఇవి స్వయముగా బ్రహ్మమే, భగవత్సత్తయే. దివ్యచేతనామంత్రము తన ఆవిష్కరణప్రకాశమును గొనివచ్చును; దివ్యశక్తిమంత్రము తన కార్యసాధనసంకల్పమును గొనివచ్చును; దివ్యానందమంత్రము జీవనమునందలి ఆధ్యాత్మికానందముయొక్క సమసాఫల్యమును గొనివచ్చును. పోగా ఓంకారము గలదు, ఇది సనాతన, మూలశబ్దము. ఇది తన ఆంశికరూపమున ఇంద్రియగ్రాహ్య రూపములందు వ్యక్తమగును; ఈ రూపములు దేనికి ప్రతీకములో, అట్టి స్వయంభావన రూపమగు ఆంతరజగత్తునందును వ్యక్తమగును; ఈ ఉభయజగత్తుల వెనుక తనలోదానుండు, అనంతునియొక్క ఇంద్రియాతీతశక్తి యందును వ్యక్తమగును: ఈ తృతీయ రూపమున, ఓంకారము శబ్దార్థములకు, నామరూపములకు, సర్వమునకు మూలము, బీజము, గర్భము నగును. ఇక తన సమగ్రరూపమున ఓంకారము పరమ అగ్రాహ్యము, ఆద్య ఏకత్వము, కాలాతీతగుహ్యమునగు స్వయంసిద్ధ, [1] దివ్యసత్త యగును. ఇట్లీ ఆంతరయజ్ఞము ఏకకాలమున కర్మ భక్తిజ్ఞానములు–మూడు నగును.

9. మృత్యు వతని ముసుగు :

ఏ అంతరాత్మ ఇట్లు సనాతనపురుషు నెఱుంగునో, ఆరాధించునో, తన కర్మల నన్నింటిని అతనికే అర్పించునో, ఆ ఆత్మకు భగవంతుడే అంతయు, అంతయును

[1] ఓం = అ + ఉ + మ. అ – కారము స్థూల, బాహ్యజగత్తుయొక్క ఆత్మ – విరాట్టు, ఉ – కారము సూక్ష్మ, అంతరజగత్తుయొక్క ఆత్మ – తైజసుడు. మ – కారము గుప్త, అతీంద్రియ సర్వశక్తిమత్తయొక్క ఆత్మ – ప్రాజ్ఞుడు. ఓం – కారము కేవలతురీయము. (మాం.ఉ.) – శ్రీ అ.

5

భగవత్సత్తయే. అది భగవంతుని తన బిడ్డలను పోషించుచు, కాచి రక్షించు తండ్రిగా నెఱుంగును. మనలను తన యొడిలో ధరించుచు, మనపై తన ప్రేమమాధుర్యమును గుమ్మరించుచు, ప్రపంచమును తన సౌందర్యరూపములతో నింపుచు నుండు దివ్యమాతగా నది భగవంతు నెఱుంగును. దేశకాల సంబంధముల యందు సర్వమును బుట్టించువారిని బుట్టించు ప్రథమసృష్టికర్తగా – "పితామహః" (9–17) – అది అతని నెఱుంగును. అది అతనిని విశ్వభాగ్యవిధాతగాను, ప్రతివ్యక్తి భాగ్యవిధాతగాను దెలియును. కనుక నెవడు తనను సనాతనునికి సమర్పించుకొనెనో, అతనిని విధియు, అనిశ్చితపర్యవసానమును భయపెట్టజాలవు; అశుభ, దుఃఖముల సమస్యయు నతని వ్యాకుల పఱచదు. జ్ఞానముగల ఆత్మకు భగవంతుడే మార్గము, భగవంతుడే ప్రయాణ గమ్యము – ఈ మార్గమున ఆత్మవినాశముండదు, మఱియు నీ గమ్యమును నిపుణముగా నడుపబడు అతని పదములు ప్రతిక్షణము నిశ్చయముగా చేరుకొనుచున్నవి. తన సత్తయొక్కయు, సమస్తసత్తయొక్కయు ప్రభువుగను, తన ప్రకృతియొక్క ధర్తగను, అంతరాత్మయొక్క భర్త, అనురక్తుడు, పాలకుడుగను, తన సమస్తభావములు మఱియు కర్మల సాక్షిగను అతడు భగవంతు నెఱుంగును (9–18). భగవంతుడతని గృహమును, దేశమును, తన అభిలాషలకు, కామనలకు ఆశ్రయ స్థానము, మఱియు సర్వభూతములకు ప్రాజ్ఞసుహృదుడు (9–18). అతని దృష్టి మఱియు అనుభవమునకు బాహ్యభూతముల సృష్టిస్థితిలయము లన్నియు నా ఏకమాత్రుడే, ఇతడే తన కాలగతమగు స్వీయాభివ్యక్తిని సంతతపునరావృత్తి చక్రమున వ్యక్తముచేయుచు, పాలించుచు, ఉపసంహరించుచుండును. అతడే పుట్టి, గిట్టుచున్నట్లు గన్పించు సర్వమునకు అవ్యయబీజము, మూలము, మఱియు లయావస్థయందు దాని విశ్రాంతిస్థానము (9–18). సూర్యుడు మఱియు నగ్నియొక్క వేడిలో తపించున దతడే (9–19); వర్షమును వదలువాడును, బిగబట్టువాడును అతడే; ఒక్కమాటలో అతడే ఈ సమస్తభౌతిక ప్రకృతియు, దాని వ్యాపారమును. మృత్యువు అతని ముసుగు, అమృతత్వ మతని స్వీయావిష్కరణము, మనము 'ఉన్న' దని చెప్పున దంతయు – సత్తు – అతడే, మఱియు మనము 'లే' దనుకొనున దంతయు అనంతమున గుప్తముగను, అవర్ణనీయుని నిగూఢసత్తయొక్క ఒక భాగముగను ఉండనేయున్నది.

10. బాహ్యమతము, బాహ్యఫలము :

అత్యున్నత జ్ఞానము మఱియు భక్తి తప్ప అన్యవస్తు వేదియు, సంపూర్ణ ఆత్మనివేదనము, మఱియు సమర్పణము తప్ప అన్యమార్గ మేదియు సర్వము తానే

యగు పరమపురుషుని దగ్గరకు దీసికొని పోజాలదు. అన్యమతము, అన్యపూజ, అన్యజ్ఞానము, అన్యప్రయత్నము - వీనికిని సదా ఫలము లుండును గాని, అవి తాత్కాలికములు, మఱియు దైవసంకేతముల, దైవరూపముల భోగమునకు మాత్రమే పరిమితములు. మన మనస్తత్త్వము యొక్క ప్రవణతను బట్టి, మన మనుసరించుటకు సదా రెండు మార్గములు తెఱచుకొని యుండును : బాహ్యతరజ్ఞానము మఱియు నాంతరతమ జ్ఞానము, బాహ్యతర ప్రయత్నము మఱియు నాంతరతమప్రయత్నము. బాహ్యమత మొక బాహ్యపూజనము మఱియు నొక బాహ్యభోగముయొక్క అన్వేషణము నగును. ఈ మతావలంబులు తమ నడతనుండి పాపమును గడిగివేసి, అట్లు బాహ్యవిధానరూపమగు శాస్త్రము విధించిన అర్హతను సంపాదించి, బాహ్యదేవతతో బాహ్యసంయోగమునిమిత్తము వైదికయజ్ఞము నాచరింతురు. కాని వారి లక్ష్యము పార్థివజీవనముయొక్క అనిత్య సుఖదుఃఖములకు బిమ్మట స్వర్గలోకముల భోగానుభవము; ఈ భోగము భూలోక భోగముకంటెను విశాలతరమే, కాని అది యింకను వైయక్తికము మఱియు ప్రాపంచికమే యగును. మఱియు దేనిని వారు ఆకాంక్షింతురో, దానిని శ్రద్ధచేతను, తదుచిత ప్రయత్నముచేతను బొందుదురు; ఏలన స్థూలజీవనము, పార్థివక్రియయే మన వైయక్తిక సంభూతియొక్క సకలవిషయము గాదు, లేక విశ్వప్రక్రియయొక్క సమస్తప్రకారము గాదు. విశాలతర భోగము నివ్వగల లోకాంతరములును గలవు - "స్వర్గలోకం విశాలం" (9-21). ఇట్లు ప్రాచీనకర్మవాది వేదత్రయముయొక్క బాహ్యార్థము నెఱింగి, తనను పూతపాపుని గావించుకొని, దేవతాసంయోగసాధనమగు సోమపానము గావించి, యజ్ఞముచేతను, సత్కర్మలచేతను స్వర్గఫలమును గోరుచుండెను. ఇహమున కావల పరము గలదను గట్టి నమ్మకము, దానినిమిత్తము చేయు ప్రయత్నము జీవునికి తన గతియందు స్వర్గసుఖముల ప్రాప్తికి వలయు బలమును సమకూర్చును. కాని మర్త్యజీవనముయొక్క యథార్థలక్ష్యము నింకను గుర్తించి, సాధించలేదు గనుక, జీవు డీ జీవనమునకు తిరిగిరాక తప్పదు. (9-21). జీవు డిచ్చటనే-ఎచ్చటనో కాదు-పరమదైవమును కనుగొనవలెను; అపరిపూర్ణము, భౌతికము నగు మానవప్రకృతినుండి అంతరాత్మ దివ్యప్రకృతిని పెంపొందించవలెను; భగవంతుడు, మానవజాతి, మఱియు విశ్వములతో నేకతద్వారా సత్తయొక్క సంపూర్ణ విశాలసత్యమును కనుగొని, జీవించుచు, దాని అద్భుతరూపమును వ్యక్తము చేయవలెను. ఇది సుదీర్ఘమగు మన పరిణామచక్రమును సమాప్తముగావించి, పరమ ఫలితములోనికి ద్వారము

తెలచును. అది మానవజన్మచేత అంతరాత్మ కివ్వబడిన అవకాశము, మఱియు దీని ప్రయోజనము సిద్ధించనంతవఱకు, జన్మచక్రమాగదు. మన జన్మయొక్క ఈ చరమావశ్యకతదిశగా భగవత్ప్రేమికుడు అనన్య ప్రేమారాధనల ద్వారా పురోగమించును; పరమ మఱియు విశ్వాత్మకభగవంతునే తన జీవన సంపూర్ణలక్ష్యము గావించుకొనును - ఈ లక్ష్యము అహంకారిక తృప్తియును గాదు, స్వర్గలోకమును గాదు - మఱియు తన విచారణా, దర్శనముల సమస్తధ్యేయము చేసికొనును. భగవంతుని తప్ప దేనిని చూడకుండుట, ప్రతిక్షణము అతనితో యోగమునం దుండుట, సర్వభూతములయందలి అతనిని ప్రేమించుట, సర్వవస్తువుల యందలి అతని రసమునే గ్రోలుట - ఇది అతని ఆధ్యాత్మికజీవనముయొక్క సంపూర్ణస్థితి. (9-22). తన భగవద్దర్శన మతని జీవితము నుండి వేఱుచేయదు, అటులే దానివలన జీవనసమృద్ధి కే లోపము నుండదు; ఏలన ప్రతిశుభమును, అతని బాహ్యాంతర యోగక్షేమములను భగవంతుడే స్వయముగా, ఆయాచితముగా నతనికి సమకూర్చును - "యోగక్షేమ వహామ్యహం" (9-22). స్వర్గలోక, భూలోకసుఖము లిపు డతని సంపత్తియొక్క ఒక స్వల్పచ్ఛాయామాత్రము; ఏలన అత డెటుల భగవంతునిలోనికి పెరుగునో, అటులే భగవంతుడును తన ప్రకాశ శక్త్యానందములతో వెలువడి, అతనిపై ప్రవహించును.

11. అవిధిపూర్వకయజనము :

సాధారణమతము పూర్ణదైవము కంటె నితరమగు ఆంశికదేవతలకు జేయు యజన మగును. గీతాకాలమునాటి ప్రాచీన వైదికమతముయొక్క బాహ్యాపార్శ్వము నుండి గీత సరాసరి తన దృష్టాంతములను గొనును; ఉదాహరణకు, పైన చెప్పబడిన బాహ్యాపూజనమును "అన్యదేవతలకు" (9-23) జేయు యజ్ఞముగా గీత వర్ణించును - అన్యదేవత లనగా వివిధదేవులు, దివ్యీకృతపితరులు, పంచభూతాధిదేవతలు - "దేవాన్, పితౄన్, భూతాని" (9-25). మానవులు సాధారణముగా తమ జీవితమును, కర్మలను, తాము దర్శించు లేక భావించు రూపమున భగవంతునియొక్క ఆంశికశక్తులకు లేక పార్శ్వములకు నివేదింతురు - వీనిలో నధికభాగము వారి దృష్టికి ప్రకృతియందలి ప్రముఖవస్తువులను చేతనీకరించు అధిదేవతలు లేక తమ మానవతనే ప్రతిబింబించు దివ్యసంకేతములు. ఈ నివేదనను వారు విశ్వాసముతో జేతురేని, రూపము లేక భావన భక్తునియం దున్నను, దాని నామోదించి, దానిద్వారా

అతనిని కలిసికొనును - "యాం యాం తనుం శ్రద్ధయా అర్చతి" (7-21). శుద్ధమగు సమస్త మతవిశ్వాసము మఱియు అనుష్ఠానము నిజానికి ఏకమాత్ర పరమభగవంతుని అనుసంధానమే యగును; కారణము అత డొకడే మానవుని తపోయజ్ఞముల ప్రభువును, అతని ఆకాంక్ష ప్రయత్నముల అనంతభోక్తయునై యున్నాడు (9-24). అర్చనా రూప మెంత స్వల్పము లేక నీచ మైనను, దేవతాభావ మెంత పరిమిత మైనను, నివేదనయు, శ్రద్ధయు నెంత సంకుచితమైనను, అహంకారార్చన యను తెరవెనుకకు బోదలంచు కృషి యెంత ప్రతిబద్ధమైనను, అది మానవాత్మ విశ్వాత్మల నడుమ సంబంధసూత్ర మగును, దానిద్వారా సమాధానము వచ్చును. అయినను ఈ సమాధానము, యజ్ఞఫలము భక్తుని జ్ఞానము, విశ్వాసము, కర్మలను బట్టియే యుండును గాని, వాని పరిమితత్వములను అతిక్రమించజాలదు. కావున సత్తా సంభూతులయొక్క సంపూర్ణ సత్యము నివ్వజాలు అధికతర భగవద్ - జ్ఞానము దృష్ట్యా, ఈ నిమ్నతర నివేదనము అత్యున్నత యజ్ఞధర్మము ననుసరించి చేయబడలే దని తేలును. ఈ నిమ్నయజ్ఞము పరమేశ్వరుని సమగ్ర జ్ఞానము మఱియు నతని స్వీయాభివ్యక్తి యొక్క యథార్థతత్త్వము పైనను ఆధారపడక, బాహ్య మఱియు నాంశికరూపములయందే సంసక్తమగును - "న మాం అభిజానంతి తత్త్వేన" (9-24). కావున నీ యజ్ఞము లక్ష్యమునందు పరిమితము, ప్రేరణయందు ప్రాయః అహంకారికము, కర్మయందు ఆంశికము మఱియు భ్రాంతము నగును - "యజంతి అవిధిపూర్వకం" (9-23). భగవంతుని సంపూర్ణదర్శనము సంపూర్ణ, సచేతన ఆత్మసమర్పణయొక్క నిబంధన మగును. ఇది లేని యజ్ఞము అసంపూర్ణము, ఆంశికము నగు వస్తువులను బొంది మఱల వానినుండి పడిపోయి, అధికతర ప్రయత్నమున, విశాలతరభగవదనుభవమున తనను వృద్ధిగావించుకొనుటకు భువికి తిరిగి రావలసియుండును. కాని విశ్వాతీత, విశ్వమయభగవంతుని మాత్రమే సర్వథా భజించువారు (9-25) తక్కిన దేవతాభక్తులార్జించు సమస్త జ్ఞానమును, సకలఫలమును బొందుదురు; అయితే వారు సర్వరూపములందు భగవంతుని సత్యమును గాంచినను, ఏ దేవతా రూపముతోను ఆగిపోరు. ఈ సాధన పురుషోత్తమ ప్రాప్తిమార్గమున దివ్యసత్త యొక్క సర్వరూపములను ఆలింగనముజేసికొనును.

12. "నాయందు వారు, వారియందు నేను" :

ఈ పరిపూర్ణ ఆత్మనివేదన. ఈ అనన్యసమర్పణ గీత తన సమన్వయమునకు మకుటము గావించు పరభక్తి యగును. ఈ భక్తిచేత సమస్తక్రియయు, కృషియు విశ్వాతీత, విశ్వమయ భగవంతునికి జేయు ఒక నివేదనలోనికి మార్చబడును. "నీవేది చేతువో, ఏది భుజింతువో, ఏది యజ్ఞమున ఆహుతి జేతువో, ఏది యిత్తువో, ఏ తపఃశక్తిని లేక సంకల్పశక్తిని ప్రయోగింతువో, దానిని నా కర్పింపుము" (9-27). ఇచ్చట అత్యల్ప జీవన ఘటనయు, తననుంచి లేక తనకున్నదానినుంచి చేసిన అతి సామాన్యదానమును, లఘుతమక్రియయు నొక దివ్యార్థమును సంతరించుకొని, భగవంతునికి స్వీకారయోగ్య నైవేద్య మగును (9-26); దీనిద్వారా భగవంతుడు భక్తుని అంతరాత్మను, జీవనమును తనవి చేసికొనును. ఈ నైవేద్యవిషయమున కామాహంకారములు చేయు విభేదములు అదృశ్యమగును. కర్మలయొక్క శుభఫలము నిమిత్తము ప్రయాసయు, అశుభఫలమునుండి పలాయనము నిచ్చట యుండవు; ఏ పురుషోత్తమునికి సమస్తకర్మయు, ఫలమును శాశ్వతముగా జెందునో, అతనికే సమస్తక్రియయు, ఫలితమును సమర్పించబడును; కావున నిక బంధనముండదు. ఏలన పరిపూర్ణ ఆత్మసమర్పణచేత హృదయమునుండి అహంకారికకామ మంతయు నంతరించును, మఱియు అంతరాత్మ పృథగ్జీవనముయొక్క అంతఃసన్యాసముద్వారా భగవంతునికి, అంతరాత్మకు పూర్ణసంయోగము సిద్ధించును. సమస్తసంకల్పము, క్రియ, ఫలితము భగవంతునివే అయి, అవి పరిపూతము, ప్రదీప్తమునకు ప్రకృతిద్వారా దివ్యరూపమున పనిచేయును; అవి యిక పరిమిత, వైయక్తికాహంకారమునకు జెందవు. సాంతప్రకృతి యిట్లు సమర్పితమై, అనంతముయొక్క ఒక విముక్తవాహిని యగును; అంతరాత్మ తన ఆధ్యాత్మికసత్తయందు, అజ్ఞాన, పరిమితత్వములనుండి ఉద్ధరించబడి, సనాతనునితో తనకు గల ఏకతకు తిరిగి వచ్చును. దివ్యసనాతనుడు సర్వభూతములయందును అంతర్నివాసిగ (18-61) నుండును; ఇతడు అందరియందును సముడు, మఱియు నందరికి సమసుహృదుడు, పిత, మాత, పితామహుడు (9-17), ప్రియుడు, సర్వప్రాణుల భర్త. అతడు ఎవనికిని శత్రువు గాడు, ఎవనికిని పక్షపాతి ప్రియుడు గాడు; ఎవనిని అతడు త్రోసిపుచ్చలేదు, ఎవనిని శాశ్వతముగా శిక్షించలేదు, ఎవనిని స్వైరకామాచారముచే అనుగ్రహించలేదు;

అజ్ఞానమునందు తిరిగి తిరిగి, చివరి కందరును సమముగా నతనినే చేరుకొందురు. కాని పరిపూర్ణభక్తి మాత్రమే మానవునియందు భగవంతుని, భగవంతునియందు మానవుని అంతర్నివాసమును ఒక సచేతన వస్తువుగా జేయగలదు, తత్పర పరిపూర్ణసంయోగముగా మార్చగలదు (9-23). పరమునియందు ప్రేమ, సంపూర్ణ ఆత్మసమర్పణ - ఇవియే దివ్య ఏకతకు సూచి మఱియు క్షిప్రమార్గము.

13. పాపులకు సైతము ప్రవేశము :

శ్రద్ధ మఱియు చిత్తశుద్ధి పూర్వకముగాను, ఒక ప్రాథమిక సంపూర్ణతతోను ఒకసారి మన మీ సమగ్ర ఆత్మసమర్పణ గావింతు మేని, మన అందరియందును సమముగా గల భగవత్సన్నిధి తదితర పూర్వ నియమమును దేనిని అపేక్షించదు. అందరును ఈ ద్వారమునకు రావచ్చును. అందరును ఈ ఆలయమున ప్రవేశించవచ్చును. సర్వ-ప్రేమికుని భవనమున మన లౌకికభేదము లంతరించిపోవును. అచ్చట పుణ్యాత్మునికి అధికాదరము గాని, పాపాత్మునికి కేవలతిరస్కారము గాని యుండదు. శాస్త్రవిధిని తు.చ తప్పకుండ పాలించుచు, శుద్ధజీవనుడగు బ్రాహ్మణుడును, పాపముమఱియు దుఃఖమయయోని యందు జన్మించి, ప్రజలచేత తిరస్కృతుడగు చండాలుడును ఈ మార్గమున కలిసి పయనించి, పరమముక్తి మఱియు సనాతనునియందు సమున్నతనివాసములకు సమము, వివృతము నగు ద్వారమును గనుగొనగలరు. స్త్రీపురుషు లుభయులు భగవత్సమ్ముఖమున తమ సమానాధికారమును బొందుదురు (9-32); ఏలన భగవదాత్మ శరీరభేదమును గాని, సాంఘికవ్యత్యాసములు మఱియు ప్రతిబంధములను గాని పాటించదు : మధ్యవర్తి గాని, బాధక నియమము గాని లేకయే అందరు సరాసరి అతనిదగ్గరకు వెళ్లగలరు. "మిక్కిలి దురాచారుడగు," గురువు చెప్పును, "మానవుడు సైతము అనన్య సంపూర్ణప్రేమతో నావైపునకు దిరుగు నేని, అతడు సాధు వనియే తలంచవలెను, ఏలన అతని స్థిరమగు ప్రయత్నసంకల్పము సమీచీన, సంపూర్ణసంకల్పము (9-30). శీఘ్రముగా నతడు ధర్మాత్ముడై, శాశ్వతశాంతిని బొందును" (9-31). వేఱు మాటలలో, సంపూర్ణ ఆత్మసమర్పణ సేయు సంకల్పము దివ్యాత్మద్వారములను పూర్తిగా తెఱచి, తనకు సమాధానముగా మానవునిలోనికి భగవంతునియొక్క సంపూర్ణావతరణమును, ఆత్మసమర్పణమును గొనివచ్చును,

మఱియు నిది ఆధ్యాత్మిక ప్రకృతిలోనికి నిమ్నప్రకృతియొక్క క్షిప్రపరివర్తన ద్వారా మనలోని సర్వమును దివ్యజీవనధర్మమునకు అనురూపముగా రూపొందించి, తద్రూపము గావించును. ఆత్మార్పణ సంకల్పము తన బలముతో భగవంతునికి, మానవునికి మధ్యనున్న తెరను తీసివేయును; అది ప్రతితప్పును బాపును, ప్రతివిఘ్నమును రూపుమాపును. ఎవరు తమ మానవబలమునే ఆశ్రయించి, జ్ఞానసాధనచే గాని, సదాచారప్రయత్నముచే గాని, కఠోరతపముచే గాని బ్రహ్మాను బొంద నాకాంక్షింతురో, వారు ఎంతో కష్టవ్యాకులముతో గాని పైకి పెరుగరు; పరంతు అంతరాత్మ తన అహంకారమును, కర్మను భగవంతునికే అర్పించినపుడు, అతడే దిగివచ్చి, మన భారమును వహించును. అజ్ఞుల కతడు దివ్యజ్ఞానముయొక్క వెలుగును దెచ్చును, దుర్బలులకు భగవదిచ్ఛయొక్క బలమును దెచ్చును, పాపికి దివ్యశుద్ధతయొక్క విముక్తిని దెచ్చును, దుఃఖితులకు అనంతమగు ఆధ్యాత్మిక హర్షానందములను దెచ్చును. వారి దుర్బలత గాని, వారి మానవబలముయొక్క పతనములు గాని ఈ విషయమున అడ్డురావు. "ఇది నా ప్రతిజ్ఞ; నన్ను ప్రేమించు వాడు నశించడు" (9–31) – అని భగవంతు డర్జునునికి ఘోషించును. పూర్వ ప్రయత్నసన్నాహములు, బ్రాహ్మణుని శుద్ధతాపవిత్రతలు, కర్మ జ్ఞానములందు ప్రముఖులగు రాజర్షుల ప్రకాశమయ బలము – వీనికి స్వమూల్య మున్నది, ఏలన ఇవి అపూర్ణ మానవజీవుడు ఈ విశాలదర్శనమును, ఆత్మసమర్పణమును చేరుకొనుటను సులభతరము గావించును (9–33). కాని ఇట్టి పూర్వసన్నాహము లేకపోయినను, దివ్యప్రేమికునియందు శరణు బొందువా రందరు తత్క్షణమే తమముందు భగవంతుని ద్వారములు తెఱచుకొనుటను గనుగొనగలరు – ధనార్జనకు సహజమగు సంకుచితత్త్వము తోను, వస్తూత్పాదనశ్రమతోను ఒకప్పుడు వ్యాకులుడై యుండిన వైశ్యుడు, వేయి కఠోర ప్రతిబంధములచే బాధితుడైన శూద్రుడు, సామాజిక దురన్యాయములకు గుఱియై, తన వికాసమునందు ప్రతిహతయైన స్త్రీ, ఇంకను తమ గతకర్మ విధించిన పాపజన్మ గల (9–32) జాతిబాహ్యులు, అస్పృశ్యులు, చండాలురు: వీరి నందరను భగవంతు డాహ్వానించును. బాహ్యవిభేదములు బహిర్ముఖ మనస్సునకు బాధాకరముగా గ్రుచ్చికొనును గావున, మానవులు వాని కంత ప్రాముఖ్య మిత్తురు; కాని ఆధ్యాత్మిక జీవనమునందు, దివ్యతేజముయొక్క సమతాసమ్ముఖమున మఱియు నిష్పక్షపాత దివ్యశక్తియొక్క విశాలతాసమ్ముఖమున అవి లుప్తమగును.

14. దివ్యప్రేమ సమన్వయశిఖరము :

ఈ పార్థివప్రపంచము ద్వంద్వ సంకులము, అప్పటప్పటి క్షణిక సంబంధములకు బద్ధము; మానవుడు వీనియందు సక్తుడై, అవి విధించు ధర్మమే తన జీవనధర్మముగా నిచ్చట జీవించునంత కాలము, ఇది సంఘర్షము, దుఃఖము, శోకములతో గూడిన ప్రపంచమే యగును. (9-33). విముక్తికి మార్గము బాహ్యమునుండి ఆంతరమునకు, భౌతికజీవనము సృజించు ఆభాసమునుండి దివ్యసత్యతకు మఱలుటయే యగును - భౌతికజీవనము మనస్సుపై తన భారమును మోపి, దానిని ప్రాణశరీరముల గాడులలో బంధించుచుండగా, దివ్య సత్యత ఆధ్యాత్మిక స్వాతంత్ర్యముద్వారా అభివ్యక్తమై మనను విడిపింప వేచి యున్నది. ఆవరణరూపమగు ప్రపంచప్రేమ సత్యరూపమగు భగవత్ప్రేమలోనికి మాఱవలెను. ఈ రహస్య మెఱింగి, ఒకసారి అంతఃస్థితభగవంతుని కౌగిలించు కొందుమేని, మన సమస్తసత్తయు, సమస్త జీవనమును దివ్యసముద్ధరణమునకు, అద్భుత పరివర్తనమునకు లోనగును. తన బాహ్యకర్మలలోను, రూపములలోను లీనమైయుండు నిమ్న ప్రకృతియొక్క అజ్ఞానస్థానమున జ్ఞానచక్షువు సర్వత్ర భగవద్దర్శనమునకు, మూలసత్తయొక్క ఏకతా విశ్వమయతలకు ఉన్మీలిత మగును. ప్రపంచముయొక్క బాధాశోకములు సర్వానందమయుని ఆనందమున అంతరించును; మన దుర్బలత, భ్రాంతి మఱియు పాపము సర్వాలింగకము, సర్వపరివర్తకము నగు సనాతనునియొక్క బలము, సత్యము మఱియు శుద్ధతలోనికి మార్చివేయబడును. మనస్సును దివ్యచేతనతో నేకముచేయుట, భావమయప్రకృతి (హృదయము) నంతను సర్వభూతస్థితుడగు (6-31) భగవంతుని యొక్క అఖండప్రేమవృత్తిగా జేయుట, మన కర్మల నన్నింటిని (సంకల్పశక్తిని) సర్వలోకమహేశ్వరునికి (5-29) అఖండయజ్ఞము చేయుట, మఱియు మన పూజాకాంక్షలు అతని అఖండారాధనగను, ఆత్మ సమర్పణగను జేయుట, సర్వాత్మను సంపూర్ణయోగమున భగవదభిముఖముగా నడిపించుట - ఇదిగో, ఇదియే మర్త్యజీవనమునుండి దివ్యజీవనములోని కెగయు మార్గరాజము (9-34). ఇదియే దివ్యప్రేమ మఱియు భక్తిని గుఱించిన గీతోపదేశము; దీనియందు జ్ఞానము, కర్మ మఱియు హృదయలాలస ఒక పరమ ఏకీకరణమున ఏకమగును, వాని విభేదములు విలీనమగును, వాని ప్రత్యేకతంతువులు పెనవేసి కొనును; ఇది యొక సమున్నత సంయోగము, సువిశాల తాదాత్మ్యసాధకగమనము.

7. గీతా మహావాక్యము

1. "అహం", "మాం" పదముల పరమార్థము :

ఇపుడు మనము గీతాయోగము యొక్క హృదయమునకు వచ్చి వేసితిమి, ఇదియే గీతోపదేశముయొక్క సంపూర్ణ సజీవకేంద్రము. అహంకారమునుండియు, నిమ్నప్రకృతినుండియు ఉపసంహరించుకొని, అంతరాత్మ అక్షరాత్మలోని కారోహించుట ప్రథమసోపానము, ప్రావేశిక పరివర్తనము మాత్రమే యని ఇపుడు మనకు స్పష్టముగా దెలియును. మఱియు "అహం" (7-6), "మాం" (7-14) - అని పలుకుచు వచ్చిన, మానవ రూపము ధరించిన భగవంతునికి ఆదినుండియు గీత అంత ప్రాముఖ్య మెందు కిచ్చెనో - దీనినిగూడ మన మిప్పుడు చూడగలము. ఎందు కన, ఇతడు నిగూఢుడు, సర్వవ్యాపియు నగు నొక మహాపురుషుడు; ఇతడు లోకమహేశ్వరుడు (5-29). మానవాత్మ నియామకుడు (9-11); ఏ అక్షరాత్మ సదా శాంతము, అచలమో, మఱియు నేది ప్రాకృతవిశ్వముయొక్క బాహ్యాంతర దృశ్యములచేత సదా అస్పృష్టముగా నుండునో, దానికంటెను ఈ భగవంతు డధికుడు.

2. ఒక ముఖముద్వారా మూలమునకు :

సమస్తయోగము ఒక భగవదన్వేషణము, సనాతనపురుషునితో సంయోగము దిశగా ఒక పరివర్తనము (turn). భగవంతుని మఱియు సనాతనుని మన మే మేర కెఱుంగుదుమో, దానిని బట్టియే అన్వేషణా మార్గమును, సంయోగప్రగాఢతయు, సాక్షాత్కారసమగ్రతయు నేర్పడును. మనః ప్రధానుడగు మానవుడు తన సొంతమనస్సు యొక్క ఒక సమీపద్వారమును దెఱచి అనంతమును సమీపించును. అతడు తన మనస్సు గ్రహించగల ఒక భావనను వెదకును, తదుచితమగు తన ప్రకృతియొక్క ఒక శక్తి నెన్నుకొనును, అది స్వోన్నతిని సాధించుకొని, అట్లు లభించిన బలముచే పయనించి, అనంతసత్యము యొక్క ఒక ముఖమును స్పృశించును - అనంత సత్యమునకు అనేకముఖములు, వాచకశబ్దములు, స్వసంకేతములు గలవు. ఇట్లు స్పృశించిన ముఖమును మానవుడుసాకల్యముగా జూడ ప్రయత్నించును, అపుడు ప్రత్యక్షానుభవముద్వారా ఆ రూపము వెనుకనున్న అపరిమేయ సత్యము నతడు చేరుకొనగలుగును. ద్వార మెంత స్వల్పమైనను, అది తన నాకర్షించు విశాలతలోని కొక ముందుచూపు నిచ్చుచో, తన ఆత్మను పిలుచుచున్న అనంతముయొక్క

అగాధగంభీరతకు, అగమ్య ఉన్నతికి అది యొక మార్గద్వార మగుచో, దానితో నతడు తృప్తిపడును. మఱియు ననంతమతనిని ఆ మార్గముననే స్వీకరించును – "యే యథా మాం ప్రపద్యంతే" (4–11).

3. "నేతి నేతి" ఫలితము :

దార్శనికబుద్ధి నిషేధాత్మకజ్ఞానముద్వారా సనాతనతత్త్వమును బొందజూచును. జ్ఞానము చేయు పని సమ్యగ్గ్రహణము, మఱియు పరిమిత బుద్ధివిషయమున దీనికర్థము, నిర్వచించి, నిర్ణయించుటే యగును. కాని అనిర్ణేయమగు దానిని నిర్ణయించుటకు ఏకైకమార్గము ఒకవిధమగు సార్వత్రిక నిషేధమే యగును – "నేతి నేతి". కావున ఇంద్రియములు, హృదయము మఱియు బుద్ధిచేత దేని దేనిని పరిమితముచేయ వీలగునో, దానినంతను సనాతనముయొక్క భావననుండి కొట్టివేయ మనస్సు పూనుకొనును. ఇట్లు ఆత్మ అనాత్మలకు, అనగా సనాతన సత్తకు మఱియు దాని రూపములకు నడుమ పూర్ణవ్యతిరేకము కల్పించ బడును – బ్రహ్మ మాయలకు, అనగా అవర్ణనీయ సత్తకు, దానిని ప్రకటింప బూనియు, ప్రకటింపజాలని సర్వమునకు నడుమ ఒక అఖాతము సృష్టించబడును – అటులే కర్మ నిర్వాణములకు, అనగా విశ్వశక్తియొక్క సంతతానిత్యక్రియకు, మఱియు జీవనవృత్తి, మనోవ్యాపారము, శక్తిభావము లేని ఒక అనిర్వచనీయ పరమ అభావమునకు నడుమ గోడ కట్టబడును. సనాతనాభిముఖముగా సాగు ప్రబలమగు ఈ జ్ఞానప్రవృత్తి క్షణికమగు సర్వము నుండియు వేఱుచేయును. అది జీవన మూలమునకు జేరుటకు జీవనమును నిషేధించును; మన సత్తయొక్క నామరూప రహిత వాస్తవికతను జేరుకొనుటకు మనకు గన్పించు మన సత్తారూపమును చెక్కివేయును. అనగా హృదయకామనలు, సంకల్పకర్మలు, మనోభావనలు నిరాకరించ బడును; చివరకు జ్ఞానము సైతము నిషేధింపబడి సమము, అజ్ఞేయము నగుదానిలో అంతమొందింప బడును. ఆత్యంతిక నిష్క్రియతలో పర్యవసించు అధికాధిక నివృత్తిమార్గముద్వారా మాయాకల్పిత అంతరాత్మ, లేక మనము మన–మని పిలుచుకొను సంస్కారముల మూట వ్యక్తిత్వ భావముయొక్క వినాశములో ప్రవేశించును, జీవనరూపమగు అనృతము నంతమొందించును, స్వయముగా నిర్వాణములో రూపుమాసిపోవును.

4. భక్తికర్మల సార్థకత :

కాని స్వ–నిషేధాత్మకమగు ఈ కఠిన వివేచనా పద్ధతి, కొన్ని విశిష్టప్రకృతుల నది ఎంతగా ఆకర్షించినను, దేహము ధరించిన మానవాత్మ నది సామాన్యముగా

తృప్తిపఱచదు; కారణము, అది వివిధప్రకారమగు నతని ప్రకృతి పరిపూర్ణసనాతనుని చేరుకొనచేయు ప్రయత్నమునకు అవకాశమివ్వదు. నిషేధపరము, మననశీలము నగు అతని బుద్ధియే గాక, అతని ఆకాంక్షామయ హృదయము, కర్మప్రవణసంకల్పము, ఇంద్రియాత్మకమనస్సు గూడ సనాతనుడు మఱియు అనంతుని మార్గమున సప్రయాసముగా ముందుకు సాగుచు, అతనియందు తమ దివ్యమూలము, తమ సత్తాప్రకృతుల సార్థకతను అన్వేషించును. ఈ ఆవశ్యకత నుండియే ప్రేమమతమును, కర్మమతమును ఉద్భవించును; ఈ మతములు మిక్కిలి క్రియాశీలము, వికసితము నగు మానవశక్తులను తృప్తిపఱచి, భగవన్మార్గమున నడుపును – ఇదియే ఈ మతముల సామర్థ్యము; వీనినుండి ప్రారంభించి నపుడే జ్ఞానము గమ్యము చేరుకొన గలదు. లోపలి ఆత్మను, బైటి వస్తువులను గూడ తీవ్రముగా, ధృఢముగా నిషేధించు బౌద్ధమతము గూడ ఒక దివ్య కర్మానుష్ఠానముపై ఆరంభమున ఆధారపడవలసి వచ్చెను. మఱియు భక్తికి బదులు సర్వభూతములందు ప్రేమకరుణలను ప్రవేశపెట్ట వలసివచ్చెను; ఏలన ఆ విధముగనే అది మానవజాతి కొక అవ్యర్థ మార్గమును, విమోచకమతమును కాగలిగెను. కర్మను, మనఃసృష్టులను మిథ్య యని అత్యంత తార్కికాసహనముతో కొట్టివేయు మాయావాదము సైతము మానవునికి, ప్రపంచమునకు, ప్రపంచమునందలి దేవునికి వ్యావహారిక సత్యతను తాత్కాలికముగా నంగీకరించెను; లేనిచో అది ఎక్కడ నిలబడును, ఎట్లు తన ప్రయాణమున కుపక్రమించును ? దేనిని మాయావాదము నిరాకరించెనో, మానవుని బంధనమునకును, అతని విమోచనప్రయత్నమునకును కొంత సత్యత నివ్వ దానినే ప్రతిపాదింపవలసివచ్చెను!

5. వివిధమార్గముల లోపములు :

కాని కర్మప్రధాన, భావప్రధానమతములకును ఒక దుర్బలత గలదు – అవి ఒక దివ్య (సాంత) వ్యక్తిత్వమునందును, సాంతముయొక్క దివ్యగుణములందును మితిమీఱి సంలగ్నమగును, మఱియు, ఆ మతములకు అనంత భగవత్సత్తను గుఱించి ఒక భావన యున్నను, అవి సంపూర్ణమగు జ్ఞానతృప్తి నీయవు; ఏలన ఆ జ్ఞానముయొక్క చరమ, విశ్వాతీతప్రవృత్తుల యందు చివరంట వారు దారి ననుగమించరు. ఈ మతములు సనాతనునియందు సంపూర్ణలయమును, తాదాత్మ్యముచేత పరిపూర్ణసంయోగమును అందుకొనజాలవు – కాన మానవాత్మ జ్ఞానమార్గమున గాకపోయిన, మార్గాంతరముచేనైనను ఆ తాదాత్మ్యము నొకరోజున చేరితీరవలెను. అదియే గదా ఏకత్వమున కాధారము. పోగా, మననశీల, నివృత్తిపర

ఆధ్యాత్మికతకును ఒక దుర్బలత గలదు - అది మితిమీఱిన నిషేధ ప్రక్రియచే నీ తాదాత్మ్యస్థానమును చేరుకొనును, మఱియు నే మానవాత్మయొక్క ఆకాంక్ష ఈ తాదాత్మ్యసాధనకు సంపూర్ణార్థముగా నుండెనో, దానినే చివరకు ఒక శూన్యములోనికో, ఒక మిథ్యాకల్పనలోనికో మార్చివేయును; ఏలన మానవాత్మయు, దాని ఆకాంక్షయు వినా, విముక్తికిని, సంయోగమునకును ఎట్టి అర్థము నుండదు. మఱియు నీ విచారమార్గము జీవసత్తయొక్క ఇతరశక్తులను ఇంచుక గుర్తించినను, వాని క్రియను సాధనాప్రారంభమునకు మాత్రమే పరిమితము చేయును; కావున నీ క్రియ సనాతనానంతమునందు ఎట్టి పూర్ణ, లేక తృప్తికర పరిణామమునకు ఎప్పుడును చేరుకొనదు. అయినను, జ్ఞానమార్గము అనుచితముగా ప్రతిబంధించు నీ వస్తువులును - శక్తిశాలిసంకల్పము, ప్రబలమగు ప్రేమాకాంక్ష, ప్రత్యక్షప్రకాశము మఱియు సచేతన మానసికసత్తయొక్క సర్వాలింగనసమర్థ అంతర్జ్ఞానము - ఇవి యన్నియు భగవంతుని నుండియే వచ్చినవి, భగవంతుని మూలశక్తులనే తెలుపుచున్నవి, మఱియు వీని సృష్టికి ఔచిత్యము ఆ మూలమునందే యుండవలెను, అటులే భగవంతునియందు వీని పరిపూర్తికి ఒక సశక్తికమార్గ ముండవలెను. ఈ శక్తులయొక్క స్వతఃసిద్ధ ఆంకాంక్షను సఫలముచేయక విడిచివేయు నెట్టి భగవద్-జ్ఞాన మైనను సమగ్రము, పరిపూర్ణము, సర్వథా తృప్తికరము కాజాలదు; అటులే భగవంతునియొక్క ఈ యితరమార్గముల వెనుకగల ఆధ్యాత్మికసత్యమును ఏది తన తపోమయ అన్వేషణ యందు అసహనముతో త్రోసివేయునో, లేక శుద్ధజ్ఞానముయొక్క స్వాతిశయమున తృణీకరించునో, అది పూర్తిగా విజ్ఞమగు విజ్ఞత కాజాలదు.

6. గీతామహత్త్వము దాని సమన్వయాత్మకభావనయందు గలదు :

ఈ భావన విశ్వమునందు వర్తించు మానవాత్మయొక్క సంపూర్ణప్రకృతిని గుర్తించి, భగవంతుని సత్యమును, శక్తిని, ప్రేమను, సత్తను బొందవలసిన బహుముఖ ఆవశ్యకత మానవాత్మకు గలదని చూపును; ఈ సత్యాదుల వైపునకే మానవజాతి తిరుగుచున్నది - సంసిద్ధి మఱియు నమరత్వము, మఱియు ఒకానొక అత్యున్నత శాంతి, శక్తి, ఆనందముల నిమిత్తము తిరుగుచున్నది. భగవంతుడు, మానవుడు మఱియు విశ్వములను గుఱించిన ఒక సమగ్ర, ఆధ్యాత్మిక దృష్టి దిశగా గీతయం దొక ప్రబల, విశాలప్రయత్నము గన్పించును. అయితే ఈ పదునెనిమిది ఆధ్యాయాలలో గీత ప్రతివిషయమును, మినహాయింపు లేకుండ, చేపట్టిన దనియు, ఏ ఆధ్యాత్మికసమస్యను అపరిష్కృతముగా విడువలే దనియు చెప్పజాలము. కాని

గీత ఒక విశాలపథకమును సిద్ధముచేసిపెట్టిన దని చెప్పకతప్పదు; కాగా మనము చేయవలసినది వివరములను పూరించుటయే, అందలి అంశములను అనుసరించి ముందుకు వెళ్లుటయే, సూచనలకు పూర్ణరూప మిచ్చుటయే, అస్పష్టవిషయములను విశదముచేయుటయే; ఇట్లు చేసిన, మన బుద్ధి లేవదీయు అధికతర సమస్యలకు, మన అంతరాత్మ కుండు అధికతర ఆవశ్యకతలకు అనుసంధానసూత్రము లభించును – తన ప్రశ్నపరంపరనుంచి గీత స్వయముగా నెట్టి వినూత్న పరిష్కారమును వెలికి దీయదు. తాను లక్షించిన సమగ్రతను చేరుకొనుటకు షడ్దర్శనములకు వెనుకనున్న ఉపనిషత్తుల మూల వేదాంతమునకు వెళ్లును; ఏలన అచ్చట మనకు ఆత్మ, మానవుడు మఱియు విశ్వములను గుఱించి అత్యంతవిశాలము, గంభీరమునగు సజీవ సమన్వయ దర్శనము గన్పించును. కాని అంతర్దర్శనము మఱియు సంకేతమయ భాషయొక్క ప్రకాశమయ ఆవరణములోపల ఆచ్ఛన్నమై యుండుటచే ఉపనిషత్తు యం దేది బుద్ధికి స్పష్టముగాదో, దానినే గీత తర్వాత ప్రచలితమైన బౌద్ధిక చింతన మఱియు వివిక్తానుభవముయొక్క వెలుగునందు వెలుగులోనికి దెచ్చును.

7. భగవంతుడు సంబంధరహితుడు గాడు :

తన సమన్వయగృహమున "అనిర్దేశ్యమును, అక్షరమును, అవ్యక్తమును" (12–3) ఉపాసించు నేతినేతి – చింతకులకు గూడ గీత స్థానమిచ్చును. ఈ నిర్గుణోపాసకులును పరమాత్మయు, పరమేశ్వరుడు నగు పురుషోత్తమునే – "మాం" (12–4)–పొందుదురు. ఏలన పురుషోత్తముని స్వయంభూసత్త ఒక "అచింత్యరూపం" (8–9), ఒక ఊహాతీత సద్వస్తువు (Positive), నిర్ద్వంద్వము లన్నింటికి మూల నిర్ద్వంద్వము, బుద్ధివృత్తికి మిక్కిలి పరము. నిషేధాత్మకనిష్క్రియత, ఉపశమము, అటులే జీవనకర్మల సన్యాసముతో గూడిన ఏ మార్గముచేత మానవులు అస్పృశ్య బ్రహ్మమును స్పృశింప గడంగుదురో, దానిని గూడ గీత అనుమతించును గాని, ప్రోత్సహించదు. ఈ నిషేధాత్మక జ్ఞానము సత్యముయొక్క ఒక పార్శ్వము నాశ్రయించి, సనాతనుని సమీపించును, మఱియు దేహధారియగు నాత్మకు ఈ పార్శ్వమును చేరుకొనుట మిక్కిలి కష్టము – "దుఃఖం దేహవద్భిర్ అవాప్యతే" (12–5). ఈ జ్ఞానము సునిపుణము, అనవసరముగా కష్టతమమునగు మార్గమున ముందుకు సాగును – "మంగలికత్తి వాయివలె సన్నము, నడచుటకు కష్టము (కఠ ఉప.) సర్వసంబంధములను నిరాకరించుటచే గాక, సర్వసంబంధములద్వారానే మానవు డనంతభగ వంతుని సహజముగా సమీపించగలడు, మఱియు మిక్కిలి సులభముగా,

విశాలముగా, సన్నిహితముగా బొందగలడు. ఇంతకు, మానవుని మానసిక, ప్రాణిక, భౌతికసత్తతో పరముని కెట్టి సంబంధములు లేవను దర్శనము విపులతమము లేక సత్యతమము నగు సత్యము గాదు, అనగా నతడు "అవ్యవహార్యము" (మాం. ఉ.) గాడు; అటులే వస్తువుల వ్యావహారిక సత్యము, సంబంధనిష్ఠ సత్యము – "వ్యవహార" – అత్యున్నత ఆధ్యాత్మికసత్యమునకు – "పరమార్థ" – సర్వథా వ్యతిరేకము గాదు. పైగా, పరమసనాతనుడు వేయి సంబంధములద్వారా మన మానవజీవనముతో రహస్య సంపర్కము, సంయోగము గలిగియున్నాడు, మఱియు మన ప్రకృతియొక్కయు, విశ్వప్రకృతియొక్కయు సమస్త, ముఖ్య ప్రకారములద్వారా – "సర్వభావేన" (18–62) – ఆ సంపర్కము ఇంద్రియగమ్యము చేయబడగలదు, అటులే ఆ సంయోగము మన అంతరాత్మకు, హృదయమునకు, సంకల్పమునకు, బుద్ధికి, సత్తకు వాస్తవము చేయబడ గలదు. కావున నీ రెండవ మార్గము మానవునికి సహజమును, సరళమును – "సుఖం ఆప్తుం" (5–6). భగవంతుడు తనను జేరరానివానిగా జేసికొనడు; మన కొక్కటి మాత్రమే కావలెను, ఒక్క నియమమును మాత్రమే అతడు పెట్టును – మన అజ్ఞానావరణమును భేదించుటకు అనన్య, అదమ్య సంకల్పము, మఱియు మనఃప్రాణ హృదయముల సంపూర్ణ నిరంతర అన్వేషణము, ఎల్లపుడు తనకు దగ్గరగా, తనలోనే, తన అంతరాత్మగా, తన ఆధ్యాత్మిక సారముగా, తన సగుణ నిర్గుణరూప రహస్యముగా, తన పురుష ప్రకృతులుగా నున్న వానికొఱకు అన్వేషణము. ఇదియే మన కెదురగు కఠినత; తక్కిన దంతయు మన జీవన ప్రభువే స్వయముగా చూచుకొని, సాధించును– "అహం త్వా మోక్షయిష్యామి మా శుచః" (18–66).

8. అక్షరాత్మయు సంబంధరహితము గాదు :

గీతోపదేశముయొక్క ఏ భాగము నందు గీతాసమన్వయము శుద్ధజ్ఞానము వైపునకు మిక్కిలి వంగునో, అచ్చట సైతము గీత మనల నీపూర్ణతరసత్యమునకును, గర్భిత అనుభవమునకు సిద్ధపఱచును. నిజానికి, గీత అక్షరాత్మ సాక్షాత్కారాని కిచ్చు రూపమునందే ఈ భావ మిమిడి యున్నది. చూడుడు : ఈ అక్షరాత్మ ప్రకృతికర్మలలో సక్రియముగా ప్రవేశింప కున్నను (5–15), అది సర్వథా సంబంధరహితము, సంయోగదూరము గాదు. అది మన సాక్షియు, భర్తయు (9–18), అది మౌన అనుమతి నిచ్చును – "ప్రభుః" (5–14); దానికి ఆకర్షణీయమగు ఆనందమును గలదు (5–24). అంతరాత్మ ప్రశాంతాత్మయందు నెలకొనినపుడు సైతము బహుముఖ ప్రకృతిక్రియ సంభవమే. ఏలన ఈ శాంత, సాక్ష్యాత్మ అక్షరపురుషుడు

(15–16), మఱియు పురుషునికెపుడును ప్రకృతితో సంబంధ ముండును. కాని ఇపు డీ ద్వితీయషట్కము నందు నిష్క్రియ, సక్రియరూపమగు నీ ద్వంద్వముయొక్క హేతువు ఈ పూర్ణార్ధ మున ప్రకటింపబడినది – ఈ సర్వగత, శాంతాత్మ దివ్యపురుషునియొక్క ఒక పార్శ్వము మాత్రమే యని ప్రకటింపబడినది (12–4). అన్ని మార్పులకు నాధారముగా నుండి, ఎట్టి మార్పు జెందని ఏకాత్మరూపమున ఎవడు ప్రపంచమును వ్యాపించునో, అతడు మానవుని యందలి భగవంతుడుగాను, సర్వప్రాణిహృదయము నందలి ఈశ్వరుడుగాను గూడ నుండును, అటులే మన సమస్త అంతరంగ సంభూతి యొక్కయు, మఱియు నంతర్ముఖ, బహిర్ముఖ క్రియయొక్కయు సచేతన కారణమును, చాలకుడును అగును. అనగా యోగుల ఈశ్వరుడును, జ్ఞానుల బ్రహ్మమును ఒకటి యే యగుదురు; ఆ ఒకటి పరమాత్మయు మఱియు విశ్వాత్మయు, పరమపురుషుడును మఱియు విశ్వపురుషుడును.

9. ఇష్టదేవత వేఱు :

ఈ పరమపురుషుడు అనేక బాహ్యామతములు చెప్పు పరిమిత, వైయక్తిక భగవంతుడు గాడు. ఏలన అట్టి భగవంతు లందరు తదితరము, సృజనచాలనాత్మకము నగు పరిపూర్ణ వైయక్తికసత్యముయొక్క ఆంశిక, బాహ్యానిర్మాణములు. ఇదియే పరమపురుషుడు, పరమాత్మ; సర్వదేవతలు ఇతని యొక్క ముఖములు, అటులే సర్వ వ్యష్టివ్యక్తిత్వము విశ్వప్రకృతియందు ఇతని పరిమితప్రాదుర్భావము. ఇతడు మూల దైవముయొక్క ప్రత్యేకనామరూపాత్మక మగు 'ఇష్టదేవత" గాడు, ఒకానొక భక్తుని విశిష్టాకాంక్షల మూర్తీభావము గాడు. అట్టి నామరూపములన్నియు సమస్త భక్తుల, సర్వమతముల మహేశ్వరుడగు ఏకమాత్ర దేవునియొక్క శక్తులు మఱియు ముఖములు మాత్రమే. ఇతడు దేవదేవుడు. ఈ యీశ్వరుడు భ్రాంతిజనకమగు మాయయందు నిర్గుణబ్రహ్మముయొక్కఒక ప్రతిబింబము గాదు. ఏలన విశ్వములో నుండియే గాక, సమస్తవిశ్వముయొక్క వెలుపలనుండియు దానిని బాలించు ప్రభువుగ నున్నాడు. అతడు పరమేశ్వరుడగు పరబ్రహ్మము, ఏలన అతడు పరమాత్మ మఱియు పరమపురుషుడు, మఱియు తన అత్యున్నత మూలభావమునుండి విశ్వమును బుట్టించి, పాలించును – స్వయంవంచితుడు గాక, తన సర్వజ్ఞ సర్వశక్తిమత్త్వముతో బాలించును. మఱియు విశ్వమునందతని దివ్యప్రకృతియొక్క వ్యాపారము మన లేక అతని చేతన కల్పించు ఒక మాయా జాలము గాదు. ఉన్న మాయయంతయు నిమ్నప్రకృతియొక్క అజ్ఞానముమాత్రమే; ఈ మాయయు అస్పృశ్యమగు

బ్రహ్మాధారమున, లేని వస్తువులను సృజించదు, పరంతు తన అంధ, భారాక్రాంత, పరిమితక్రియ కారణముగా అహంకారరూపకము (figure) చేతను, తదితరమగు మనఃప్రాణశరీరముల అపర్యాప్తరూపకములచేతను సృష్టియొక్క గంభీరతర సత్యతలను కేవలము వికృతము గావించును. ఒక పరమ, ఒక దివ్య ప్రకృతి గలదు, ఆమెయే విశ్వముయొక్క యథార్థ సృష్టికర్త్రి. సర్వప్రాణులు, సకల వస్తువులు ఒకే దివ్యసత్తయొక్క సంభూతులు; సమస్తజీవనము ఒకే ఈశ్వరశక్తి యొక్క ఒక క్రియాప్రకారము; సర్వప్రకృతి ఒకే అనంతునియొక్క ఒక అభివ్యక్తి. అతడు మానవునిలోని భగవంతుడు; జీవుడు అతని పూర్ణాత్మనుండి వెలువడిన ఆంశికాత్మ; అతడు విశ్వమునందలి భగవంతుడు; దేశకాలగతమగు నీ ప్రపంచము దృశ్యమగు అతని స్వీయవిస్తారము.

10. నిష్క్రియతాదాత్మ్యము - సక్రియ ఏకత :

సత్తయొక్కయు, అతిసత్త యొక్కయు ఈ విశాలదర్శనమును చేయించుటయందే గీతాయోగము తన సమన్వయ గాంభీర్యమును, అనుపమవైపుల్యమును అందుకొనును. ఈ పరమపురుషుడే సర్వము నందు గల అవిక్రియ, అవ్యయ ఏకాత్మ; కావున ఈ ఏకాత్మయొక్క ఆధ్యాత్మిక భావమునకు మేల్కొని, దానితో తన అంతర నిర్వ్యక్తికసత్తను ఏకముచేయదగును. అటులే ఈ పరమపురుషుడు మానవుని సర్వకర్మలను ప్రారంభించి, నడుపు అతని లోపలి ఈశ్వరుడు; కావున మానవు డీ ఈశ్వరునికి మేల్కొని, తన గర్భాలయము లోనే యున్న అతనిని దర్శించి, అతని నావరించి మఱుగుపఱచుదాని యంతటినుండి బైటబడి, తన ఆత్మయొక్క అంతరతమాత్మయు, తన చేతనయొక్క అధికతరచేతనయు, తన ఇచ్ఛాకర్మ లన్నింటియొక్క గుప్తస్వామియు, తన బహువిధ సంభూతియొక్క మూలము మఱియు గమ్యరూపమున తనలోపలి సత్తయు నగు ఈశ్వరునితో నేకీ భూతుడు గాదగును. మన సర్వస్వముయొక్క మూలమగు నితని దివ్యప్రకృతి నిమ్నతర ప్రాకృతవికారముల చేత దట్టముగా నావరింపబడి యుండును; కావున మానవుడు సదోషము, మర్త్యము నగు తన నిమ్న, బాహ్యప్రకృతినుండి నిర్గమించి, అమరత్వ సంసిద్ధులకు ఆలవాలమగు తన మూల, దివ్యప్రకృతిని జేరుకొనవలెను. ఈ భగవంతు డన్నింటియందును ఆత్మరూపమున ఏకము - ఈ ఆత్మ అన్నింటియందును నివసించును, అన్నియు నీ ఆత్మయందు నివసించును, చరించును; కావున మానవుడు

సర్వప్రాణులతోను తన ఆధ్యాత్మిక ఏకతను గనుగొని, అన్నింటిని ఆత్మయందును, ఆత్మను అన్ని భూతములందును చూడవలెను, అంతేకాదు, సర్వవస్తువులను, ప్రాణులను తానుగానే చూడవలెను – "ఆత్మౌపమ్యేన సర్వత్ర" (6–32)–మఱియు నా చూపు ననుసరించి చింతించవలెను, భావించవలెను, చేష్టించ వలెను. ఇక్కడ లేక ఎక్కడైనను గలదాని కంతకు ఈ భగవంతుడు మూలము, మఱియు తన ప్రకృతిచేత ఈ అసంఖ్యాక భూతములన్నియు నయ్యెను–"అభూత్ సర్వభూతాని" (ఈశ. ఉప.); కావున చరాచరవస్తువు లన్నింటియందును మానవు డా ఏకమాత్రునే చూచి, ఆరాధించవలెను; సూర్యునియందు నక్షత్రమునందు, పుష్పమునందును, మానవుని యందు, ప్రతిప్రాణి యందును, రూపములందు, శక్తులందును, ప్రకృతిగుణములందు, సత్త్వములందును అతని అభివ్యక్తినే పూజించవలెను – "వాసుదేవః సర్వమితి" (7–19). దివ్య దర్శనముచేతను, దివ్యసానుభూతిచేతను, చివరకు ఒక పటిష్ఠ ఆంతరతాదాత్మ్యము చేతను అతడు విశ్వముతో నేకీభూతుడై విశ్వమయుడు గావలెను. ఒక నిష్క్రియ, నిస్సంబంధతాదాత్మ్యము ప్రేమను, క్రియను వెలివేయును; కాని ఈ పృథుతర, సంపన్నతర ఏకత కర్మలచేతను, ఒక విశుద్ధ ప్రేమభావముచేతను తననుదాను పూర్ణముగావించుకొనును : ఈ ఏకత మన సమస్తకర్మలు మఱియు భావముల ప్రభవము (source), గృహము, సారము, ప్రేరణ మఱియు దివ్యప్రయోజనము నగును. "కస్మై దేవాయ హవిషా విధేమ" – ఏ దేవునికి మనము మన సమస్త జీవనమును, కర్మను ఒక నివేదనగా సమర్పించవలెను; ఈ (విశ్వమయ) భగవంతుడే, ఈ ప్రభువే మన యజ్ఞాధికారి. నిష్క్రియ, నిస్సంబంధ తాదాత్మ్యము ఆరాధన మఱియు భక్తి యొక్క ఆనందమును బహిష్కరించును; కాని భక్తి ఈ సంపన్నతర, సంపూర్ణతర, ఘనిష్ఠతరసంయోగమునకు ఆత్మయే, హృదయమే, శిఖరమే యగును. ఈ భగవంతుడే సర్వసంబంధముల పరిపూర్తిరూపము – ప్రతిప్రాణియొక్క అంతరాత్మకు పిత, మాత, ప్రేమికుడు, సుహృదుడు, మఱియు శరణ్యము. ఈ భగవంతుడే రహస్యజ్ఞానము చెప్పు ఏకమాత్ర పరమ మఱియు విశ్వమయ దేవుడు ఆత్మ, పురుషుడు బ్రహ్మము, మఱియు నీశ్వరుడు. అతడు తనయందే తన దివ్య యోగముచేత ఈ సర్వప్రకారములందును ప్రపంచము నభివ్యక్తముచేసెను. భూత సముదాయము లతనిలో ఏకముగా నుండును. మఱియు నతడు వాని నానారూపములలో నేకముగా నుండును. ఈ సర్వరూపములందును బొడముచున్న అతని అభివ్యక్తికి మేల్కొనుట అదే దివ్యయోగము యొక్క మానవపార్శ్వ మగును.

11. మహావాక్యస్వరూపము :

ఇదియే తన బోధనయొక్క ఉత్తమ, సంపూర్ణ సత్యము, ఇదియే తాను ప్రకటింతునని మాట యిచ్చిన సమగ్రజ్ఞానము (7–2) – అది పూర్ణముగా, నిర్ద్వంద్వముగా స్పష్టపఱచుటకు, గీతోపదేశముయొక్క ఫలితార్థమును తిరిగి వక్కాణించి, భగవదవతారము తన పరమవచనము – "పరమం వచః" (10–1) – ఇదియే గాని, మఱేదియు గాదని ప్రకటించును. ఏది సనాతనునియొక్క ఉత్తమజ్ఞానము, ఉత్తమ పూజనము? అతడు అభివ్యక్తమైనదాని కంతకు పరమ, దివ్యమూలము (10–2), మఱియు నీ జగత్తు మఱియు దానియందలి ప్రాణులయొక్క మహేశ్వరుడు (10–3), వస్తువు లన్నియు అతని సత్తయొక్క సంభూతులే – అని అతని నెఱింగి, పూజించుటయే అతని ఉత్తమజ్ఞానము మఱియు పూజనము : ఈ విస్పష్టప్రకటన పరమవచనము యొక్క ప్రథమభాగము. ఏకీకృత భక్తి జ్ఞానములే పరమయోగ– మనునది దాని ద్వితీయభాగము (10–8); సనాతన భగవంతునితో సంయోగమును బొందుటకు ఈ యోగము సహజ, విహితమార్గము (10–7). ఈ మార్గనిర్వచనమును మఱింత అర్థవంతము చేయుటకు, దీనియందలి భక్తి మహత్త్వమును మఱింత దీప్తిమంతము చేయుటకు, శిష్యుని మనోహృదయములచే దాని అంగీకారమును గురువు తన తర్వాతి ఉపదేశమున కొక నిబంధన గావించును – "నీ ఆత్మహితమును గోరి," గురువు పలుకును, "నే నీ పరమ వచనమును నీకు ప్రకటించెదను; కారణము, నాయందు నీ హృదయమున కిపుడు ప్రీతి గలుగుచున్నది," – "తే ప్రీయమాణాయ వక్ష్యామి" (10–1). భగవంతుని యందు హృదయమునకు గలుగు ప్రీతియే యథార్థభక్తియొక్క సంపూర్ణద్రవ్యము మఱియు సారము – "భజతాం ప్రీతిపూర్వకం" (10–10). పరమవచనము ప్రోక్తమైన వెంటనే దానికి తన అంగీకారము ప్రకటించునట్లును (10–14). సర్వ వస్తువు లందును భగవంతుని జూడగల వాస్తవవిధానమును గుఱించి ప్రశ్నించునట్లును (10–17) అర్జునుడు అంతఃప్రేరితుడగును; ఈ ప్రశ్నము వెంటనే సహజముగా విశ్వపురుషరూప భగవద్దర్శనమునకు సమయము వచ్చును, చివరకు దాని నుండి ప్రపంచకర్మ చేయు ప్రచండాదేశము ఉద్భవించును (11–33).

12. భగవంతుడు అజుడు, అనాది :

భగవంతుని గుఱించిన ఏ భావమును గీత సర్వ జీవనగుహ్యముయొక్క రహస్యముగాను, విముక్తికి దారితీయు జ్ఞానము గాను నొక్కిచెప్పునో, అది కాలగత

విశ్వప్రక్రియకును, కాలాతీత నిత్యవస్తువునకును మధ్య సేతువును బంధించును, అంతేకాని, అది ఈ రెండింటిలో దేనిని తీసివేయదు, దేని సత్యతను తగ్గించదు. మన ఆధ్యాత్మికభావనయొక్కయు, ఆధ్యాత్మికానుభవము యొక్కయు వివిధభూమికలను – విశ్వదేవైక్యవాద, ఈశ్వరవాద, అతీతతత్త్వవాద భూమికలను – అది సమరసము గావించును. ఆ భావమేమన, భగవంతుడు ఆది లేనట్టి అజసనాతనుడు; అతనికి మూలమగు పూర్వవర్తి ఏదియులేదు, ఉండజాలదు; కారణము, అతడు అద్వితీయుడు, కాలరహితుడు, మఱియు నిరపేక్షుడు (absolute). "దేవతలుగాని మహర్షులుగాని నా పుట్టుకనెఱుంగరు... (10–2), ఆది లేనట్టి అజునిగా నన్నెఱింగిన వాడు... (10–3)" – ఇవి యిక్కడి మహావాక్యముయొక్క ప్రారంభవచనములు. ఈ జ్ఞానము పరిమితికరము గాని, బౌద్ధికము గాని కాదు, పరంతు శుద్ధము, ఆధ్యాత్మికము; ఏలన ఈ అతీతపురుషుని స్వరూపము మనశ్చింతన కందని రూపము – "అచింత్యరూపము" (8–9); కావున ఈ జ్ఞానము మర్త్యమానవుని సమస్త అజ్ఞానవిమోహము నుండియు, పాప, దుఃఖ, అశుభముల సమస్త బంధనము నుండియు విడిపించునని ఈ మహావాక్యము సమున్నతవాగ్దానము చేయును (10–3). ఈ పరమ ఆధ్యాత్మికజ్ఞానప్రకాశమున నివసించగల మానవాత్మ విశ్వము యొక్క భావాత్మక లేక ఇంద్రియగోచరమగు దృశ్యజాలమునుండి ఉద్ధరించబడును. అది ఒక అనిర్వచనీయశక్తిలోనికెగయును–ఈ శక్తి ఇహపరములందు ఏకరూపముగా నుండి, సర్వమును అతిక్రమించుచునే, సర్వమునకు పూరకమగు అద్వైతశక్తి. అతీతానంతముయొక్క ఈ ఆధ్యాత్మికానుభవము విశ్వమే భగవంతు డను భావన యొక్క పరిధులను భంగించును. ఈ భావన భగవంతుని ప్రపంచాభివ్యక్తి యందు బంధింపప్రయత్నించును, మఱియు నతని నెఱుంగుటకు తదభివ్యక్తినే ఏకమాత్ర సాధనముగా మనముందుంచును; కాని అతీతానుభవము దిక్కాలరహితగు సనాతనునిలోనికి మనకు విడుదల గల్పించును. "దేవతలు గాని, దానవులు గాని నీ అభివ్యక్తి నెఱుంగరు (10–14)" – అని అర్జునుడు తన సమాధానమును గట్టిగా బలుకును. అనగా, సంపూర్ణవిశ్వము లేక అసంఖ్యాకవిశ్వములు సైతము అతని నభివ్యక్తము చేయలేవు, అతని అవర్ణ్యతేజమును, అతని అనంతమహత్త్వమును తమలో నిముడ్చుకొనజాలవు. ఇంతకంటెను తక్కువ కోవకు జెందిన భగవద్ – జ్ఞానమంతయు సదా అనభివ్యక్తము, అవర్ణనీయము నగు అతీతభగవంతుని సత్యతపై నాధారపడుటచే మాత్రమే సత్యమగును.

13. "సర్వవిధముల నేనే ఆదిని" :

కాని ఈ దివ్య పరతత్త్వము ఒక నిషేధమును గాదు, అటులే విశ్వముతో సర్వసంబంధశూన్యమగు ఒక కేవలమును (absolute) గాదు. అది ఒక పరమ సద్భావము (positive), అది కేవలములకు కేవలము. విశ్వముయొక్క (మాతాపిత్రాది) సర్వసంబంధములు ఈ పరము నుండియే వెలువడును; సర్వభూతములు దీనికే తిరిగి వచ్చి, దీనియందే తమ అపరిమేయ అస్తిత్వమును గనుగొనును. "ఏలన నేను దేవతలు మఱియు మహర్షుల యొక్క సర్వథా మూలమను" (10–2). దేవతలు మహత్తరమగు అమరశక్తులు మఱియు అమృతవ్యక్తిత్వములు, వీరు విశ్వబలములను (forces) సచేతనముగా అనుప్రాణితము గావించుచు, తన్మయముగా నుండుచు, వానిని నడుపుదురు. దేవతలు సనాతన, ఆద్యదేవతయొక్క ఆధ్యాత్మికరూపములు, అతనినుండి బహువిధ ప్రపంచ ప్రక్రియల లోనికి దిగుదురు. అసంఖ్యాకులు, సార్వత్రికులునగు దేవతలు సత్త యొక్క ప్రాథమిక తత్త్వముల నుండియు, వాని సంమిశ్రరూపముల నుండియు ఏకమాత్రుని అనేకరూపమగు సృష్టిజాలము నల్లుదురు. వారి సమస్త స్వీయసత్తయు, స్వీయప్రకృతియు ప్రతిప్రకారముననను, ప్రతితత్త్వముననను, ప్రతి పేటయందును అతీత అనిర్వచనీయము నుండియే ప్రభవించును. ఇచ్చట ఏదియు ఈ దైవప్రతినిధుల చేత స్వయముగా నిర్మించబడదు, స్వయంపర్యాప్తముగా చేయబడదు. ప్రతివస్తువు తన మూలమును, కారణమును, సృజింపబడుటకు మూలహేతువును, కొనసాగుటకు సంకల్పమును స్వతఃసిద్ధ పరమపురుషునియందే కనుగొనును – "అహం ఆదిః సర్వశః" (10–2). విశ్వములోని దేనికిని తన వాస్తవకారణము విశ్వములో లేదు. అంతయు నీ అతిలోక అస్తిత్వమునుండియే ప్రవర్తించును.

14. మహర్షులు, మనువులు :

వేదములో వలె నిచ్చటను సప్తమూల ఋషులు – "మహర్షయః సప్త పూర్వే" (1–6) – అని పిలువబడు మహర్షులు ఒక భాగవత ప్రజ్ఞయొక్క – "ప్రజ్ఞా పురాణీ" – ధీశక్తులు, ఈ ప్రజ్ఞయే తన స్వసంప్రజ్ఞ (self-conscious) అనంతతనుండి సర్వవస్తువుల పరిణామమును సాధించినది, తన సారతత్త్వముయొక్క సప్తతత్త్వముల ద్వారా వాని ప్రకటరూపమును సాధించినది. వేదములందలి సర్వధారక, సర్వప్రకాశక, సర్వవ్యంజకమగు సప్తధీవృత్తుల – "సప్త ధియః" మూర్తీభావమే సప్త

ఋషులు – సర్వవస్తువులు ఏడేడు చొప్పున ఏర్పడి యుండుటను ఉపనిషత్తు చెప్పును – "సప్త సప్త". ఈ ఋషులతో గూడి, మానవుని పితలగు నలుగురు సనాతన మనువులును వత్తురు – నలుగురేలన, భగవంతుని సక్రియ స్వభావము చతుర్విధము, మఱియు మానవజాతి దీనిని తన చతుర్విధ శీలమున (చాతుర్వర్ణ్యమున) వ్యక్తము చేయును. ఈ మనువులును, వారి పేరే సూచించునట్లు, మనఃప్రధానపురుషులు. తన క్రియనిమిత్తము వ్యక్తము లేక లీనమగు మనస్సుపై నాధారపడు సమస్త ప్రాణమునకు వీరు సృష్టి కర్తలు (10–6), లోకమునందలి ప్రాణులందరు వారి సంతతియే – "ఏషాం లోక ఇమాః ప్రజాః" (10–6). మఱియు నీ మహర్షులును, మనువులును స్వయముగా పరమపురుషుని యొక్క శాశ్వత మానసికసంభూతులు, అతని ఆధ్యాత్మిక పరభావము నుండి విశ్వప్రకృతిలోనికి జనించినవారు – విశ్వమున సర్వమునకు మూలమగు వీరికి అతడు మూలము. సర్వసత్తలకు సత్త, సర్వాత్మకు ఆత్మ, సర్వమనస్సునకు మనస్సు, సర్వప్రాణమునకు ప్రాణము, సర్వరూపమునకు సర్వథా వ్యతిరేకము గాదు; పరంతు మన యొక్కయు, విశ్వముయొక్కయు సత్తాప్రకృతుల సమస్త తత్త్వములు మఱియు శక్తులయొక్క ఉత్పాదకము, ప్రకాశకము నగు స్వతఃసిద్ధ కేవలము.

15. అతీతము గావుననే సర్వము :

మన అస్తిత్వముయొక్క ఈ అతీత మూలము మననుంచి దాటరాని ఒక అఖాతముచే వేఱువడి లేదు, మఱియు నతడు తననుండి పుట్టిన ప్రాణులను తన సంతతి గాదని నిరాకరించడు, లేక వానిని భ్రమ రూపము లని గర్హించడు. అతడు సత్త, అందరు అతని సంభూతులు. అతడు ఒక రిక్తము (void) నుంచి గాని, ఒక శూన్యమునుంచి గాని, అవాస్తవికమగు స్వప్న గర్భమునుండి గాని సృజించడు. తనయందుండియే అతడు సృజించును, తనలోనే అతడు సంభవించును (రూపము లగును). అన్నియు అతని సత్తయందే యున్నవి, అన్నింటి సత్తయు అతని సత్తయే. విశ్వము భగవంతుడు – అను చూపున కీ సత్యమునం దవకాశము గలదు గాని, యిది దానిని మించును. వాసుదేవుడు సర్వము – "వాసుదేవః సర్వం" (7–19). నిజమే, కాని ఏది విశ్వమునందు గన్పించుట లేదో, ఏది ఎప్పుడును వ్యక్తము గాదో, అది యంతయు గూడ వాసుదేవుడు గావుననే, కన్పించున దంతయు వాసుదేవుడు. అతని సత్త ఎవ్విధముగను అతని సంభూతిచేత పరిచ్ఛిన్నము గాదు; అత డేమాత్రము ప్రపంచసంబంధముచే బద్ధుడు గాడు. అంతయు నగుచునే,

అతడు తదతీతముగా నుండును; సొంత రూపములను ధరించు చునే, అతడనంతుడుగా నుండును. ప్రకృతి తన మూలమున అతని ఆధ్యాత్మిక శక్తి, ఆత్మశక్తి; ఈ ఆధ్యాత్మిక శక్తి సంభూతియొక్క అనంత, ప్రధాన గుణములను వస్తువుల అంతర్భాగముగా పెంపొందించి, పిమ్మట రూప, క్రియాత్మక మగు వాని బాహ్యరూపముగా ఆ గుణములను మార్చును. ఏలన ఆమె అనుసరించు మౌలిక, రహస్య క్రమమున వ్యష్టియొక్కయు, సమష్టియొక్కయు ఆధ్యాత్మిక సత్యము ముందు వచ్చును, ఈ సత్యము గభీరతాదాత్మ్యములకు సంబంధించినది. పోగా గుణ, స్వభావములకు సంబంధించిన వాని మానసికసత్యము తన సమస్త అకల్పితాంశము నందు ఆధ్యాత్మికసత్యముపై నాధారపడును, అది ఆత్మనుంచి ఉత్పన్నమగును. చివరకు, ఆవశ్యకతయందు కనిష్ఠము, క్రమమునందు అంత్యము నగు రూపక్రియాత్మక దృశ్యసత్యము ఆంతర గుణస్వభావములనుండి ఉత్పన్నమై, తన బాహ్య నిర్మాణముల యందు వానిపైననే ఆధారపడును. లేక యిట్లు చెప్పవచ్చును : దృశ్యసత్యము అంతరాత్మ గుణముల ఒక వ్యక్తీకరణము కాగా, ఈ గుణముల ప్రాదుర్భావమునకు గారణ మొక ఆధ్యాత్మిక సత్యము.

16. "భూతములు, భావములు, సంభవము" :

సొంతమగు ఈ బాహ్య సంభూతి దివ్య అనంతుని వ్యక్తముచేయు ఒక వ్యాపారము. ప్రకృతి తన గౌణ రూపమున నిమ్నప్రకృతి యగును, ఇది అనంతునియొక్క అసంఖ్య - సంభవతల యందు కొన్ని సమూహముల నెన్నుకొని వానికి కార్యరూపముగల్పించు గౌణక్రియ. రూపము మఱియు ఊర్జము (energy), క్రియ, మఱియు గతి - వీనితో గూడిన ఈ సమూహములు విశ్వైక్యములో నొక అంశముగా పరిమిత సంబంధమును, పరస్పరానుభవమును గల్గించును. అయితే తన నిమ్నవ్యవస్థయందు ప్రకృతి, భగవంతుని ఒక వ్యంజకశక్తిగా, తమోమయ విశ్వ-అజ్ఞానము గల్పించు విపర్యయములచే వికృత మగును, మఱియు ఆమె దివ్యాశయములు మన మానసిక మఱియు ప్రాణికానుభవము యొక్క అహంకారిక యాంత్రికక్రియయందు అదృశ్యమగును. కాని యిచ్చట ఈ స్థితియందును సర్వము పరమపురుషునియం దుండియే ఘటించు ఒక జన్మ, ఒక సంభూతి, ఒక పరిణామము - "ప్రభవము, భావము, ప్రవృత్తి" (10-8), అనగా సర్వము అతీతునియందుండి ప్రకృతిక్రియద్వారా జరుగు ఒక పరిణామప్రక్రియ. "అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే", "నేను సర్వమునకు జన్మస్థాన మను, నానుండియే సర్వము కర్మ,

గతిరూప వికాసములోనికి ప్రవృత్తమగును." (10-8). "బుద్ధి, జ్ఞానము, అజ్ఞానసమ్మోహము నుండి విముక్తి, క్షమ, సత్యము, దమము, శమము, అహింస మఱియు సమత, తుష్టి, తపము, మఱియు దానము" (10-4,5) - ఇట్టి ప్రశస్తసృష్టి మాత్రమే భగవంతునుండి వచ్చుట లేదు; మర్త్యమానసమును కలవరపెట్టి, దానిని అజ్ఞాన సమ్మోహములకు గుఱిచేయు ద్వంద్వములును అతనినుండియే వచ్చుచున్నవి - "సుఖము మఱియు దుఃఖము, ఉత్పత్తి మఱియు లయము, భయము మఱియు అభయము, యశము మఱియు అయశము" (10-4) - ఇదియు, నిట్టిదియే యగు ప్రకాశాంధకారముల పరస్పర క్రీడనము, స్నాయవీయ (nervous) మనస్సును వేధించు సహస్ర తంతు సంమిశ్రము గూడ అతనినుండియే వచ్చును. తమ పృథగ్భూత వైవిధ్యములతో నిచ్చట గానవచ్చు సమస్త ఆంతరికసంభూతులు భగవంతునియొక్క ఒకే మహాసంభూతి యందు అంతర్భాగములు, అవి తమకు పరమునందుండు అతనినుండియే తమ జన్మను, సత్తను బొందును. ఈ పరుడు (Transcendent) వీనిని తెలిసియే పుట్టించును. వీని నానాభూత జ్ఞానమునందు తగుల్కొనడు, తన సృష్టిచేత పరాజితుడు గాడు. అగుట - అర్థముగల భూ-ధాతువు నుండి ఏర్పడిన "భవంతి, భావాః, భూతానాం" (10-5) - అను శబ్దములు గట్టిబలముతో ఒకే చోట వచ్చుటను మనము గమనించదగును. చరాచరము లన్నియు భగవంతుని సంభూతులు - "భూతాని"; అతనివే యగు ఈ భూతముల అంతరికావస్థలు మఱియు వృత్తులు వీని మానసిక సంభూతులు - "భావాః" : అత్యున్నత ఆధ్యాత్మిక స్థితులే గాక, మన యీ న్యూనతర మానసిక భావములును [1] పరమపురుషునినుండి సంభవించు సంభూతులో - "భవంతి మత్త ఏవ" (10-5). ఇట్లు గీత సత్తాసంభూతులకు గల విభేదమును గుర్తించి, వక్కాణించును, అయినను ఆ విభేదము నొక విరోధములోనికి మార్చదు. ఏలన అది సమగ్ర ఏకత్వమునకు స్వస్తిచెప్పుటయే యగును. భగవంతుడు తన అతీతభావమున ఏకము, సర్వధరమగు, వస్తువుల ఏకాత్మరూపమున ఏకము, తన విశ్వప్రకృతియొక్క ఏకతారూపమున ఏకము. ఈ ముగ్గురును ఒకే భగవంతుడు; అంతయు అతనినుండియే ఉత్పన్న మగును, అంతయు అతని సత్తనుండియే సంభూతి నందును, అంతయు నతని

---

[1] ఇచ్చట ఈశ ఉపనిషత్తును జూడుడు : "ఆత్మా అభూత్ సర్వభూతాని" - ఆత్మ సర్వభూతములయ్యెను. ఆత్మ యన స్వయంభూతత్త్వము అని ఇచ్చట విశిష్టార్థము మనకు స్ఫురించును. - శ్రీ అ.

సనాతనాంశమే లేక కాలాతీతునియొక్క కాలగతవిస్తారమే. గీతాగతిని మన మనుసరింతు మేని, పరము (Transcendence) నందును, స్వతఃసిద్ధము (Absolute) నందును సర్వవస్తువుల పరమనిషేధముకొఱకు మనము జూడగూడదు, ప్రత్యుత వా , గుహ్యార్థముయొక్క నిశ్చితకీలకమునకును, వాని జీవనము యొక్క సమన్వయసాధకరహస్యము నిమిత్తమును జూడవలెను.

17. సాక్షి గాదు, మహేశ్వరుడు :

కాని అనంతుని మఱియొక పరమ సత్యత గలదు, విమోచక జ్ఞానముయొక్క ఒక అపరిహార్యాంశముగా దానిని గూడ గుర్తించితీరవలెను. ఈ సత్యత ఏమన, భగవంతు డెటుల విశ్వమును దానిలోపల నుండి సన్నిహితముగా బాలించునో, అటులే దానిపై నుండియు దాని నపేక్షించును. తానే సర్వసృష్టి అయ్యును, దానిని అనంతముగా అతిశయించియుండు పరమ పురుషుడు తన సృష్టికి దూరముగా నుండు, దాని సంకల్పరహితకారణము గాడు. అతడు అనిచ్ఛాపూర్వక ఉత్పాదకుడు గాడు; అందుచేతనే తన విశ్వశక్తియొక్క ఈ ఫలితముల బాధ్యత నంతను నిరాకరించడు, లేక తన చేతనకంటె మిక్కిలి భిన్నమగు ఒక మాయికచేతనపై ఆ ఫలితముల నారోపించడు, లేక వానిని ఒక యాంత్రిక నియమమునకో, ఒక విశ్వకర్మకో, తత్త్వముల ఒక ఆసురికసంఘర్షమునకో వదిలివేయడు, అతడు ఒక ఉదాసీన, పృథగ్భూత సాక్షి గాడు, కావున సర్వము స్వయముగా రూపుమాయువఱకు, లేక తన అచల, మూలతత్త్వమునకు తిఱిగివచ్చు వఱకు పట్టనట్లు వేచియుండడు. అతడు లోకములు మఱియు లోకులయొక్క మహేశ్వరుడు - "లోక-మహేశ్వరః" (5-29), మఱియు సర్వమును లోపలనుండియే గాక, పైనుండియు, అనగా తన పరమ పరిస్థితినుండియు బాలించును. విశ్వమును అతిశయించని శక్తి విశ్వమును బాలింపజాలదు. దివ్యపరిపాలన ఒక సర్వశక్తశాసకుని స్వేచ్ఛామయ ప్రభుతను సూచించును గాని, విశ్వముయొక్క బాహ్యప్రకృతిచేత పరిమితమై, సంభూతిని సాధించు ఒక స్వయంబాలకశక్తిని గాని, యాంత్రిక విధానమును గాని సూచించదు. ఇది ఈశ్వరవాది కంటితో విశ్వమును జూచుట యగును; అయితే యిది ప్రపంచమునందలి పరస్పరవిరోధములకు జడిసి, ముడుచుకొను ఈశ్వరవాదము గాదు. దీని దృష్టిలో భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వశక్తుడు నగు అద్వితీయ అద్యపురుషుడు; ఇతడే సర్వమును తనయం దభివ్యక్తము చేయును - శుభాశుభములు, సుఖదుఃఖములు, తేజస్తిమిరములు - సర్వమును తన స్వీయసత్త యొక్క

ద్రవ్యముగనే అభివ్యక్తము చేసి, అట్లు తనయందే అభివ్యక్తము చేసిన దానిని తానే పాలించును. తన సృష్టిచేత అబద్ధుడు, దాని ద్వంద్వములచే అప్రభావితుడు, ఈ ప్రకృతి నతిక్రమించియు, దానితో సన్నిహితసంబంధము గలవాడు మఱియు ప్రకృతిగత జీవులతో ఘనిష్ఠముగా అభిన్నుడు, వాని సత్త, ఆత్మ, పరమాత్మ, ప్రభువు, ప్రేమికుడు, సుహృదుడు, ఆశ్రయము నగు అతడు వాని లోపలనుండియు, పైనుండియు, వాని అజ్ఞానదుఃఖములు, శుభాశుభములద్వారా వానిని సర్వదా నడుపును; ప్రతివానిని తన ప్రకృతిద్వారాను, అందరిని విశ్వప్రకృతి ద్వారాను ఒక పరమతేజమునకు, ఆనందమునకు, అమరత్వమునకు, అతీతత్వమునకు నడుపును. ఇదియే పరిపూర్ణ విమోచనజ్ఞానము. మనయందలి మఱియు ప్రపంచము నందలి భగవంతుడు ఏకకాలమున అతీతానంతుడు గూడ నని తెలుపునదియే ఈ జ్ఞానము. తన దివ్యప్రకృతిచేత, తన సత్తయొక్క కార్యసాధకశక్తిచేత అంతయు నయిన ఒక ఆదిపురుషుడగు నతడు అంతను తన అతీతభావమునుండి పాలించును. అతని ఘనిష్ఠసన్నిధి ప్రతిప్రాణియందును గలదు, మఱియు నతడు సమస్తవిశ్వ ఘటనలకు కారణము, అధీశుడు, చాలకుడు; అయినను అతడు తన సృష్టిచే పరిమితుడు గాకపోవుటకు గారణము, అతడు దానికంటె ఎంతో అధికుడు, ప్రబలుడు, అనంతుడు.

18. ఆధ్యాత్మికవిమోచన స్వభావము :

ఈ జ్ఞానలక్షణము మూడు ప్రతిజ్ఞాశ్లోకములలో స్పష్టముచేయబడును. "ఎవడెవడు," భగవానుడు ప్రవచించును, "నన్ను ఆదిలేని అజునిగను, లోకమహేశ్వరునిగను ఎఱుంగునో, వాడు వాడు మర్త్యులలో అసంమూఢుడై నివసించుచు సర్వ పాపాశుభములనుండియు విముక్తుడగును (10–3). నా యీ విభూతిని – సర్వవ్యాపక ఈశ్వరత్వమును – మఱియు నా యీ యోగమును (ఐశ్వరయోగమును – ఈ యోగముచే అతీతుడు సర్వభూతములకంటె నధికుడయ్యు, వానితో ఒకటిగా నుండును, వానిలో నివసించును, తన ప్రకృతియొక్క సంభూతులుగా వానిని తనలోపల ధరించును) ఎవ డెఱుంగునో, వాడు అవికంపమగు యోగముచే నాతో యుక్తుడగును (10–7). వ్యష్టిసమష్టుకు నేనే మూల మని, వ్యష్టిసమష్టులు నానుండియే తమ క్రియను, గతిని సాధించుకొను ననియు బుధు లెఱింగి, నన్ను ప్రేమింతురు, పూజింతురు (10–8)....మఱియు నేను వారికి బుద్ధియోగమును ప్రసాదింతును, వారు దానిచేత నాదగ్గరకు వత్తురు (7–10), ఇంకను వారి నిమిత్తము వారి అజ్ఞానాంధకారమును నాశముచేతును (7–11)." ఈ ఫలితము లవశ్యముగా

ఈ జ్ఞానస్వభావమునుండియే మఱియు ఈ జ్ఞానమును ఆధ్యాత్మికాభివృద్ధిలోనికి, ఆధ్యాత్మిక అనుభవములోనికి మలచు యోగమునుండియే ఉద్భవించును. ఏలన మానవమనస్సుయొక్క కలవరమున కంతకు, అతని మనోవ్యథ కంతకు ఇంద్రియాః ఛదితమైన మర్త్యమానసమునకు సహజమగు భ్రాంతజ్ఞానము మఱియు భ్రాంతసంకల్పమే మూలమని జాడ తీసిన మనకు దెలియును - ఈ భ్రాంతజ్ఞాన సంకల్పములే "సంమోహము". కాని మానవు డెపుడు సర్వవస్తువుల దివ్యమూలమును దర్శించునో, విశ్వదృశ్యము నుండి దాని అతీతసత్యతను మఱియు నా సత్యతనుండి దాని దృశ్యరూపమును వీక్షించునో, అపు డతడు బుద్ధిసంకల్పములు మఱియు హృదయేంద్రియముల విమోహమునుండి విముక్తుడగును, ప్రబుద్ధుడు, స్వేచ్ఛామయుడు నయి చరించును - "అసంమూఢః మర్త్యేషు" (10-3). ప్రతివస్తువున కిక దాని ఇప్పటి బాహ్య మూల్యమును గాక, దాని అలౌకిక, వాస్తవమూల్యమును గల్పించుచు, అతడు ఇహపరముల అనుసంధానములను (links), సంబంధములను గనుగొనును; అతడు సమస్త జీవనకర్మలను తమ సమున్నత, వాస్తవలక్ష్యమునకు మఱల్చుచు, తనలోపలి భగవంతునుండి ప్రవహించు తేజశ్శక్తులచే వానిని బాలించును. ఇ ట్లతడు పాపమును, ప్రమాదమును, దుఃఖమును బుట్టించు మిథ్యాబౌద్ధికజ్ఞానము నుండియు, మిథ్యాసంకల్పజన్య ప్రతిక్రియ నుండియు, ఇంద్రియావేశమునుండియు తప్పించుకొనును - "సర్వపాపైః ప్రముచ్యతే" (10-3). ఏలన ఇ ట్లతడు విశ్వాతీతము నందును, విశ్వాత్మకమునందును నివసించుచు, తన స్వీయవ్యక్తిత్వమును, ఇతరుల వ్యక్తిత్వమును తమ అధికతర మూల్యములందు దర్శించుచు, పృథక్కరము, అహంకారికము నగు ఇచ్ఛాజ్ఞానముల అనృతావిద్యలనుండి విముక్తుడగును.

19. అవికంపయోగము :

కావున గీతాదృష్టిలో విముక్తమానవుని జ్ఞానము నిషేధప్రాప్తము, సంబంధ రహితము నగు నిర్వ్యక్తికతయొక్క ఒక చేతన గాదు, కార్యశూన్యమగు ఒక మౌనస్వరూపము గాదు. ఏలన విముక్తమానవుని మనోఆత్మలు, విశ్వమహేశ్వరుని ప్రవర్తక, పరిచాలక సన్నిధి విశ్వమునం దతటను వ్యాపించి - "విభూతిం" (10-7) యున్న దను సంతతభావము మఱియు సమగ్రానుభవము నందు గట్టిగా కుదురుకొని యుండును. విశ్వవ్యవస్థకు తన సత్తయొక్క అతీతత నత డెఱుంగును, కాని దానితో దివ్యయోగముద్వారా తన ఏకతను గూడ నత డెఱుంగును - "యోగంచ మమ' (10-7). మఱియు నతడు అతీతము, వైశ్వము (universal), వైయక్తికము నగు

అస్తిత్వముయొక్క ప్రతిపార్శ్వమును పరమ సత్యముతో దానికి గల యథాసంబంధమున చూచి, దివ్యయోగముయొక్క ఏకత యందు తన యథాస్థానమున దాని నుంచును. అత డిక దేనిని దాని పృథగ్భావమున జూడడు – ఈ పృథగ్దర్శనము సమష్టిమర్మము నసలు వివరించదు, లేక ఏకపక్ష ముగా వివరించును. మఱియు నతడు సర్వమును కలగాపులగముగాను జూడడు – ఈ సంకరదర్శనము మిథ్యాప్రకాశమును, అస్తవ్యస్త క్రియను బుట్టించును. అతీత భావమున పదిలపడి, అతడు విశ్వభారముచేతను, కాలము మఱియు ఘటనల కల్లోలముచేతను ప్రభావితుడు గాడు. వస్తువుల ఉత్పత్తివినాశముల సంరంభము నడుమ అక్షుబ్ధమగు అతని అంతరాత్మ అవిచలితము, అవికంపము, సుస్థిరమునగు యోగముద్వారా విశ్వమునందేది ఆధ్యాత్మికమో, దానితో యుక్తమైయుండును. ఈ సంరంభ మంతటిద్వారా అతడు యోగేశ్వరుని నిత్యత్వమును దర్శించుచు, ఒక ప్రశాంత సార్వత్రికత మఱియు సర్వభూతములతో నేకతనుండి కర్మచేయును. అయితే ఈ ఘనిష్ఠసంపర్కము పృథక్కర నిమ్నప్రకృతి యందు మనోఆత్మల సంలగ్నతను సూచించదు; కారణము, అతని ఆధ్యాత్మికానుభవమున కాధారము హీనతర దృశ్యరూపము మఱియు గతియు గాక, అంతర విశ్వాత్మయు, అతీత పరమాత్మయు నగును. అతడు భగవంతునితో సదృశప్రకృతి, సదృశధర్మము గలవాడగును – "సాధర్మ్య మాగతాః" (14–2); కావున అతడు తన విశ్వ భావము నందుసైతము విశ్వాతీతుడుగను, మనఃశరీర ప్రాణముల వ్యష్టిభావమునందు సైతము విశ్వాత్ముడుగను వర్తించును. ఒకసారి సిద్ధించి, అవిచలము, ప్రతినివిష్టము నగు నీ యోగముచేత – "అవికమ్పేన యోగేన" (10–7) – అతడు దివ్యాత్మతో తన ఏకతనుండియు, జగదీశ్వరునితో తన సంతత సంయోగమునుండియు ఎట్టి పతనము లేకయే, ఎట్టి ప్రకృతిస్థితి నైన అవలంబించగలడు, ఎట్టి మానవదశ నైన స్వీకరించగలడు, ఎట్టి ప్రపంచక్రియ నైన చేయగలడు – "సర్వథా వర్త మానోపి స యోగీ మయివర్తతే" (6–31).

20. పరస్పరపరిపూర్తి :

ఈ బౌద్ధిక జ్ఞానము భావిక హార్దిక, ప్రాణిక భూమికలోనికి మార్చబడినపుడు అది అక్షుబ్ధప్రేమయు, ప్రగాఢభక్తియునగును – మన పై నున్న ఆద్య, అతీత భగవంతునియందును, మానవునియందు ప్రకృతియందు సదా ఉపస్థితుడైయున్న ఈశ్వరునియందును ప్రేమభక్తి యగును. అది మున్ముందు ఒక బుద్ధిజ్ఞానము; తర్వాత అది భావిప్రకృతియొక్క ఒక ఆధ్యాత్మికీకృత "భావము" (10–8) చేత

సమన్వితమగును. మనోహృదయముల ఈ పరివర్తనము సర్వ ప్రకృతియొక్క ఒక సంపూర్ణ పరివర్తనమునకు నాందీప్రస్తావన. నూతనమగు ఒక ఆంతరజన్మము మఱియు సంభూతి (పరిణామము) మన భక్తిప్రేమల పరమ లక్ష్యముతో ఏకీభావమునకు మనల సిద్ధపఱచును - "మద్భావాయ" (13-19). ఇపుడు ప్రపంచమునం దంతటను, దాని పైనను జూడబడిన దివ్యపురుషునియందు ప్రేమవలన గలుగు ఒక ప్రగాఢప్రీతి (10-10) ఉదయించును. ఈ ప్రగాఢానందము మనస్సుయొక్క విక్షిప్తము, బాహ్యము నగు సుఖస్థానమును తానే అక్రమించును, అథవా తక్కిన సుఖము నంతను తనలోని కాకర్షించుకొని, మనోహృదయభావములను, ఇంద్రియవృత్తులను ఒక అద్భుత రసక్రియ (alchemy) ద్వారా రూపాంతర మొందించును. చేతన యంతయు భగవన్మయము కాగా, భగవంతుని సమాధానచేతన దానిని నింపివేయును (10-9); జీవనప్రవాహ మంతయు ఆనందానుభవరూప అఖండసాగరమున గలిసిపోవును (10-9); అట్టి భగవద్భక్తుల సమస్తవాక్కును, బుద్ధియు భగవంతుని గుఱించి పరస్పర కథనము, బోధనము నగును (10-9); ఆ ఏకమాత్ర హర్షమునందే సత్తయొక్క సమస్తతృప్తియు, ప్రకృతియొక్క సర్వక్రీడయు కేంద్రిత మగును (10-9). చింతనయందును, స్మృతియందును క్షణక్షణము సంయోగ ముదయించుచుండగా, ఆత్మయందు ఏకతానుభవము సదా నిలిచియుండును (10-10); ఈ అంతఃస్థితి ప్రారంభించిన క్షణమునుండియు - దాని అపూర్ణదశ యందు సైతము - భగవంతుడు పూర్ణబుద్ధి యోగముతో దానిని ధ్రువీకరించును (10-10). భగవంతుడు మనలోని భాసుర జ్ఞానదీపమును పైకెత్తి, దానిచే పృథక్కర బుద్ధి సంకల్పముల అజ్ఞానాంధకారమును రూపుమాపును; రూపుమాపి, మానవచేతన యందు తన నావిష్కరించుకొనును. కర్మజ్ఞానముల ప్రకాశమయసమన్వయముపై నాధారపడిన బుద్ధియోగముచేత నిమ్నము, క్లిష్టమునగు మనఃశ్రేణులనుండి సక్రియ ప్రకృతిపైన భాసించు సాక్ష్యాత్మయొక్క అక్షరశాంతిలోనికి సంక్రమణము ముందు సాధించబడెను, కాని యిప్పుడు, సమగ్రజ్ఞానముతో భక్తిప్రేమల ప్రదీప్త సమన్వయముపై నాధార పడిన ఈ అధికతర బుద్ధియోగముచేత అంతరాత్మ ఒక వ్యాపక ఆనందావేశమునందు స్వయంసిద్ధము, సర్వోత్పాదకము నగు భగవంతుని సంపూర్ణ, అతీతసత్యమున కెగయును. పర్యవసాన మేమన, సనాతను డిట్లు వైయక్తిక సత్తయందును, ప్రకృతియందును పరిపూర్తి నందగా, వైయక్తికపురుషుడు కాలగతమగు జన్మనుండి సనాతనునియొక్క అనంతములోనికి ఉద్ధరించబడి పూర్ణుడగును.

8. విభూతిరూప భగవంతుడు

1. దార్శనిక, మానసిక సమన్వయము :

ఇప్పుడొక ముఖ్యసోపానము నకు వచ్చియున్నాము - ఆధ్యాత్మికవిముక్తి మఱియు దివ్యకర్మకు సంబంధించిన గీతా సిద్ధాంత ప్రతిపాదనమునకు దార్శనిక మఱియు మానసికసమన్వయము సమకూర్చబడినది. అర్జునుని బుద్ధికి భగవత్ స్వరూపము ప్రకటింపబడినది. ఎట్లు; పరమ మఱియు విశ్వసత్తారూపముననను, దివ్య మఱియు వైశ్వపురుష రూపముననను, అంతర్నివాసియగు మన జీవనస్వామి రూపముననను భగవత్స్వరూపము బుద్ధిజిజ్ఞాసకును, హృదయవీక్షణమునకును జూపబడినది - ఇట్టి భగవంతునే మానవుని భక్తి జ్ఞానసంకల్పములు అజ్ఞానము కల్పించిన పొగమంచులో నన్వేషించుచుండెను. ఇప్పుడిక విశ్వతోముఖ విరాట్పురుష దర్శనము మిగిలి యున్నది, దీనితో మఱియొక పార్శ్వమున భగవద్దర్శనము సంపూర్ణమగును.

2. సమన్వయ సంగ్రహము :

దార్శనిక సమన్వయము సంపూర్ణమైనది. నిమ్నతర ప్రకృతి నుండి పురుషుని వేఱుచేయుటకు సాంఖ్యము స్వీకరించబడినది - బుద్ధివివేచనద్వారా ప్రాప్తించు ఆత్మజ్ఞానముచేతను, ప్రకృతిగుణముల అధీనతనుండి పైకెగయుటచేతను ప్రకృతి పురుషులను వేఱుపర్చవలెను. కాగా 'పరపురుషుడు' మఱియు 'పరప్రకృతి' యొక్క (7-5) ఏకతను విశాలముగా ప్రకటించి, గీత సాంఖ్యమును పూరించి, దాని పరిమితులను అతిక్రమించును. అహంకారము చుట్టును నిర్మించబడిన ప్రాకృత, పృథక్కర వ్యక్తిత్వమును తుడిచివేయుటకు దార్శనికుల వేదాంతము స్వీకరించబడినది. క్షుద్ర సవ్యక్తికసత్తను విశాల నిర్వ్యక్తికసత్తయందు లయముచేయుటకును, పృథక్కర భ్రాంతిని బ్రహ్మ-ఏకత్వమునందు రూపుమాపి, అహంకారముయొక్క భ్రాంతదర్శన స్థానమున అన్ని వస్తువులను ఏకాత్మయందును, ఏకాత్మను అన్నివస్తువులయందును చూచు సత్యదర్శనమును స్థాపించుటకును వేదాంతపద్ధతి ప్రయోగింపబడినది. చలము మఱియు అచలము, క్షరము మఱియు అక్షరము, క్రియ మఱియు నైష్కర్మ్యము దేనినుండి ఉత్పన్నమగునో, అట్టి పరబ్రహ్మమును యథాతథముగా ప్రకటించి, గీత వేదాంతసత్యమును పూర్ణము చేయును (10-12). ఎవ డిచ్చట సర్వప్రకృతియందును రూపము ధరించునో, సర్వవ్యక్తిత్వమునందును స్వయముగా వ్యక్తమగునో, సర్వక్రియ

యందును తన ప్రకృతిశక్తిని ప్రయోగించునో, అట్టి పరమాత్మను, పరమేశ్వరుని సన్నిహితముగా ప్రకటించి, గీత వేదాంతముయొక్క సంభవనీయ పరిమితులను అధిగమించును. ఈశ్వరునికి, ప్రకృతియొక్క దివ్యప్రభువునకు సంకల్ప, బుద్ధి, హృదయముల, సమస్త అంతరసత్తయొక్క ఆత్మసమర్పణము నిమిత్తము యోగము స్వీకరింప బడినది. ప్రకృతిగత జీవుడు ఎవని అంశమో, అట్టి ఆదిదేవుడే ఈ యీశ్వరు డని ప్రకటించి, గీత యోగమును పూర్ణముచేయును (10–3). ఒక పరిపూర్ణ ఆధ్యాత్మిక ఏకతయొక్క ప్రకాశమునందు అన్ని వస్తువులును ఆ యీశ్వరుడే యని అంతరాత్మకు చూపించి, గీత పరిపూర్ణితయోగము యొక్క సంభవనీయ పరిమితులను అధిగమించును.

3. మానసికసమన్వయము :

ఈ దార్శనికసమన్వయమునుండి ఒక సమగ్ర దృష్టి – మానసికసమన్వయము – సిద్ధించును. ఒకే దివ్యపురుషుడు ఏకకాలమున అతీత సద్వస్తువు, విశ్వమునకు విశ్వాతీత మూలము; అటులే సర్వవస్తువుల నిర్వ్యక్తికాత్మ, విశ్వమునకు ప్రశాంత గృహము; మఱియు సర్వసత్తలు, వ్యక్తిత్వములు, శక్తులయందలి అంతర్వర్తిభగవంతుడు – సత్తారూప ఆత్మయు, కార్యసాధక ప్రకృతియు, సర్వభూతముల బాహ్యాంతర సంభూతియునగు అంతర్యామిభగవంతుడు–అను సమగ్రదృష్టి సిద్ధించును. ఏకమాత్రుని ఈ సమగ్రదర్శనము మఱియు సమ్యగ్ జ్ఞానమునందు జ్ఞానయోగము శ్రేష్ఠముగా పూర్ణమైనది (10–8). సర్వకర్మలను కర్మ ప్రభువునకు (5–29) సమర్పించుటచేత కర్మయోగమునకు పరాకాష్ఠ ప్రాప్తించినది; ఏలన ప్రకృతిగత మానవుడు ఇపు డతని ఇచ్ఛాపరికరము మాత్రమే. ప్రేమ మఱియు భక్తియోగము తన విపులతమరూపమున ప్రోక్తమైనది (9–34). భక్తిజ్ఞానకర్మల ప్రగాఢపరిసమాప్తి జీవేశ్వరుల సువిశాల, పరమసంయోగమునకు దారితీయును. ఈ సంయోగమున జ్ఞాన మావిష్కరించిన రహస్యములు బుద్ధికివలెనే హృదయమునకును వాస్తవమగును. ఈ సంయోగమున కర్మయోగమునందలి కఠినమగు ఆత్మ సమర్పణము ఒక సజీవ ఏకతయొక్క సుఖమయ, స్వేచ్ఛామయ, ఆనందపూర్ణ ప్రకటనమగును. ఇట్లు ఆధ్యాత్మికముక్తికి సంపూర్ణసాధనము చెప్పబడినది; దివ్య కర్మయొక్క సంపూర్ణమగు పునాది వేయబడినది.

4. విభూతిస్వరూపము :

దివ్యగురువుచే తన కిట్లు ప్రసాదించబడిన జ్ఞాన మంతయు అర్జును డంగీకరించును. అతని మనస్సు ఇప్పటికప్పుడే సందేహముల నుండియు, జిజ్ఞాసల

నుండియు విముక్తమైనది; ప్రపంచముయొక్క దురవ గాహమగు బాహ్యరూపము నుండి దాని పరమార్థమునకును, మూలమునకును, దాని అంతఃసత్యతలకును దిరిగిన అ౦ని హృదయము ఇప్పటికప్పుడే వ్యథాశోకములనుండి విముక్తమై, దివ్యావిష్కరణముచే లభించిన హర్షముతో స్పృష్టమైనది. తన అంగీకారమును దెలుపుటకు ఏ శబ్దములను బ్రయోగింప నర్జునుడు ప్రేరితుడగునో, అవి మఱియొకసారి బలముగా, పట్టుతో ఈ జ్ఞానము పరమగంభీరము, సర్వసమగ్రము, చరమసంపూర్ణము నని చాటును. అర్జునుడు ముందు తనతో భాషించుచున్న కృష్ణుడు అవతారము, మానవరూపమున భగవంతుడని అంగీకరించును; అతడు పరబ్రహ్మము, విశ్వాతీత సర్వము, స్వతఃసిద్ధతత్త్వము – "పరం బ్రహ్మ, పరంధామ" (10–12) – అభివ్యక్త ప్రపంచమునుండి అంతరాత్మ పైకెగసినపుడు ఈ పరధామమున నివసించగలదు. అర్జును డతని పరమపవిత్రముగా – "పరమం పవిత్రం" – నంగీకరించును; ఈ పవిత్రత నిత్యముక్తసత్త్వముయొక్క స్వభావము; స్థిరప్రశాంతమగు అక్షరాత్మయొక్క నిర్వ్యక్తికతయందు అహంకారమును రూపుమాపుటద్వారా ఈ పవిత్రసత్త్వమును చేరుకొనగలము. పిమ్మట అతడతనిని శాశ్వత దివ్యపురుషునిగా నంగీకరించును – "పురుషం శాశ్వతం దివ్యం" (10–12). తర్వాత అత డతనిని ఆదిదేవునిగా స్తుతించును, అజునిగా ఆరాధించును, సర్వవ్యాపి, సర్వాంతర్వర్తి, స్వయంవిస్తారక అజవిభునిగా ఆరాధించును–"ఆదిదేవం, అజం విభుం" (10–12). "నహితే భగవన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః" – "దేవతలుగాని, దానవులు గాని, హే భగవన్, నీ అభివ్యక్తి నెఱుంగరు (10–14)"; ఏలన అతని నభివ్యక్తముచేయు నేదియు పర్యాప్తము గాదు. ఇట్లు అర్జును డతనిని ఎట్టి వర్ణనకు అందని అద్భుతముగా నంగీకరించును; కాని అతనిని అదే సమయమున సర్వభూతముల ఈశునిగను, వాని సంభూతికి ఏకైక, దివ్య, నిమిత్తకారణముగను, దేవదేవునిగను, విశ్వము నభివ్యక్తము చేసి, దానిని పైనుంచి తన పరమ మఱియు విశ్వప్రకృతియొక్క శక్తిచేత శాసించు విశ్వేశ్వరునిగను అంగీకరించును – "భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే" (10–15). చివరి కతనిని మన లోపలను, చుట్టును సర్వవస్తురూపమున గల వాసుదేవునిగా నంగీకరించును–ఈ వాసుదేవుడు విశ్వవ్యాపి, సర్వాంతర్నివాసి, సర్వఘటకము (all constituting) నగు తన "విభూతి" నామక సంభూతిశక్తుల ప్రభావముచే సర్వము నగును (10–16) – "యాభిర్ విభూతిభిర్ లోకా నిమాం స్త్వం వ్యాప్య తిష్ఠసి."[1]

1. గీత × 12–15

5. శ్రద్ధ – సాక్షాత్కారము :

తన హృదయముయొక్క ఆరాధనతోను, ఇచ్ఛయొక్క అనువర్తనముతోను, బుద్ధియొక్క అవగాహనతోను అర్జునుడా సత్యము నంగీకరించినాడు. ఈ జ్ఞానము తోను, ఈ ఆత్మసమర్పణముతోను భగవదుపకరణముగా వ్యవహరించుట కత డిప్పటికే సిద్ధపడియున్నాడు. కాని గభీరతరమగు ఒక సంతత, ఆధ్యాత్మికసాక్షాత్కార కామన అతని హృదయసంకల్పములలో రేకెత్తినది. ఈ సత్య మెట్టి దనిన, ఇది పరమాత్మకు మాత్రమే తన స్వీయ ఆత్మజ్ఞానమునందు స్పష్టమగును. కావుననే అర్జును డిట్లు ఘోషించును, "నీవు మాత్రమే, ఓ పురుషోత్తమ, నిన్ను నీచేతనే తెలిసికొందువు" – "ఆత్మనా ఆత్మానం వేత్థ" (10–15). ఇది ఆధ్యాత్మిక తాదాత్మ్యముచే ప్రాప్తించు జ్ఞానము; ప్రాకృతమానవుని యొక్క హృదయము, సంకల్పము, బుద్ధియు సహాయము వినా, తమకుదామే దీనిని చేరుకొనజాలవు – ఇవి సత్యముయొక్క అపూర్ణ మానసిక ప్రతిబింబములను మాత్రమే బొందగలవు, మఱియు నీ ప్రతిబింబములు సత్యము నెంత ప్రకటించునో, అంతకు మించి దానిని మఱుగుపఱచును, వికృతపఱచును. ఇది ఒక గుప్తజ్ఞానము; కావున ఎవ రీ సత్యముఖమును దర్శించియున్నారో, దీని వాణిని ఆలకించియున్నారో, దీనితో తమ ఆత్మయందును, అంతరాత్మయందును ఏకమైయున్నారో, అట్టి మహర్షుల నుండి ఈ జ్ఞానమును శ్రవణముచేయవలెను –"ఋషు లందరు, నారదుడు, అసితుడు, దేవలుడు, వ్యాసుడు, మున్నగు దేవర్షులును నీ యీ సత్యమునువచింతురు." (10–13). అథవా మానవు డీ జ్ఞానమును హృదయస్థ భగవంతునుండి వచ్చు ప్రకాశము (revelation) మఱియు స్ఫూర్తి (inspiration) ద్వారా గ్రహించవలెను – ఈ భగవంతుడు మనలో సముజ్జ్వల జ్ఞానదీపమును లేవనెత్తును (10–11). "స్వయం చైవ బ్రవీషి మే" (10–13) – "నీవు స్వయముగా గూడ దీనిని చెప్పుచున్నావు." ఒకసారి ప్రకటింపబడినపుడీ జ్ఞానము మనస్సుయొక్క అనుమతిచేతను, ఇచ్ఛ యొక్క సమ్మతిచేతను, హృదయముయొక్క హర్షము మఱియు వినతిచేతను అంగీకరింపబడవలెను – ఈ మూడును సంపూర్ణ మానసికవిశ్వాసముయొక్క – శ్రద్ధయొక్క – అవయవములు. మఱియు అర్జునుడట్లే అంగీకరించెను, "నీవు చెప్పు దీని నంతను నా మనస్సు సత్యముగా దలంచుచున్నది" (10–14). కాని ఇంకను మన సత్తయొక్క సాక్షాదాత్మయందే ఈ సత్యమును లోతుగా పొందవలసిన

ఆవశ్యకత మిగిలియుండును, మఱియు ఈ సత్యమునకు అత్యంత సన్నిహితమగు అంతరాత్మ కేంద్రమున దీని నిత్య, అవర్ణనీయ, ఆధ్యాత్మికసాక్షాత్కారమును గుఱించిన అంతరాత్మాపేక్షయు మిగిలియుండును - మానసిక సాక్షాత్కారము ఈ సాక్షాత్కారము యొక్క పూర్వరూపము లేక ఛాయామాత్రము, ఈ సాక్షాత్కారము లేనిదే సనాతనునితో సంపూర్ణసంయోగము సాధ్యము గాదు.

6. పాపాత్మునిలో భగవంతు నెట్లు చూడగలము ?

ఇప్పుడా సంతత సాక్షాత్కారానికి మార్గము చూపబడును. స్వయంసిద్ధమగు మహత్తర దివ్యతత్త్వ ముల విషయములో మనస్సునకు కష్టము లేదు; చూడుడు : అది పురుషోత్తమ భావమునకు ఉన్మీలితము కాగలదు, అటులే అక్షరాత్మ అనుభవమునకును, అంతఃస్థిత భగవంతుని సాక్షాద్దర్శనమునకును, సచేతన విశ్వపురుషుని సంపర్కమునకును తన నేత్రము విప్పగలదు. మనస్సులో ప్రకాశమయ భావ మేర్పడినపుడు, మానవుడు వెంటనే మార్గమున అడుగిడగలడు, పిమ్మట సాధారణ మానసబోధముల నతిక్రమించుటకు కొంత కష్టపడినను, చివరకు మన సత్తకును, సర్వసత్తకును వెనుకనుండు ఈ మౌళికసత్యముల స్వానుభవమును బొందును- "ఆత్మనా ఆత్మానం" (10-15). ఈ సత్యములు స్పష్టముగనే దివ్యసత్యములు గనుక, ఒకసారి భావించి నపుడు, మానవుడు వీనిని శీఘ్రముగా సాధించగలడు. ఈ సమున్నత రూపములందు భగవంతుని దర్శించుట కడ్డువచ్చున దేదియు మన మానసిక సంస్కారమునందు లేదు. కాని సృష్టియొక్క బాహ్యసత్యము లందును, ప్రపంచసంభూతియొక్క మాయా వేషములందును భగవంతుని దర్శించుటయందే కష్టము గలదు; ఏలన ఏకతాసాధక భావన కిచ్చటిదంతయు అడ్డు తగులును. ఉదాహరణకు, చరాచరములు, ఉదాత్త నీచములు, సౌమ్యరౌద్రములు, శుభాశుభములు - ఒకే సమయమున భగవంతు నిట్టి ద్వంద్వములందును, ద్వంద్వములుగను ఎట్లు చూడగలము? విశ్వమునందు భగవంతుడు విస్తరించియున్నా డను భావము నంగీకరించి, జ్ఞానతేజమునందును, శక్తి మహత్త్వమునందును, సౌందర్యలావణ్యమునందును, ప్రేమవితరణయందును, ఆత్మవిశాలతయందును మన మతనిని చూచినప్పటికి, ఈ సమున్నతవస్తువుల నంటి పెట్టుకొని, వాని నావరించి, మఱుగుపఱచు వాని వ్యతిరేకవస్తువులందును మన మెట్లు భగవంతుని చూడగలము? మానవమనస్సునకును, ప్రకృతికిని సహజమగు పరిమితు లున్నప్పటికి, భక్తునియందు భగవంతుని జూడగలమేమో కాని, అతనిని ద్వేషించు దుష్టునియం దెట్లు

చూడవచ్చును ? పరతత్త్వముయొక్క పరమపవిత్రతను, ఏకతను అన్వేషించు జ్ఞాని ఈ ద్వంద్వవిభేదములను గాంచి, "ఇది కాదు, ఇది కాదు" - "నేతినేతి" - అని వానిని కఠోరముగా త్రోసిపుచ్చును. పోగా మన మాట: సుముఖముగనో, విముఖముగనో ప్రపంచమునందలి అనేకవస్తువులపట్ల మనము మన అనుమతిని దెలిపినను, విశ్వమున భగవంతు నంగీకరించినను, అధిక సంఖ్యాక వస్తువులను "ఇది కాదు, ఇది కాదు" అని మనము కొట్టివేయుచునే యుండవలదా ? ఇంద్రియవిషయమునందును, బాహ్యరూపమునందును పాదుకొని యున్న మానవమనస్తత్త్వమునకు అన్ని వస్తువుల విషయమున తన బుద్ధి - అనుమతిని, ఇచ్ఛాసమ్మతిని, హృదయ విశ్వాసమును దెలుపుట కష్టమే యగును. అందునిమిత్తము కనీసము కొన్ని ప్రబల సంకేతములు గావలయును, కొన్ని అనుసంధానములు మఱియు సేతువులు, కొన్ని ఆలంబనలు గావలయును.

7. విభూతి యనగ :

వాసుదేవుడే సర్వము - అను జ్ఞానావిష్కరణమును అర్జును డంగీకరించును మఱియు దాని హర్షముచే అతని హృదయము నిండి యున్నది. కారణము, ద్వంద్వమయ ప్రపంచముయొక్క భ్రాంతిజనకసమస్యల నడుమ అతని మనస్సు ఒక జాడకొఱకు, ఒక మార్గదర్శక సత్యమునిమిత్తము ఆరాటపడుచుండెను; అట్టి మనస్సుయొక్క వ్యాకులము మఱియు విభేదములనుండి వాసుదేవజ్ఞానము తన నుద్ధరించుచున్నట్లు అతనికి దెలియవచ్చెను, మఱియు నది అతని శ్రవణమునకు అమృతముగా (10-18) నున్నది. అయినను అర్జునునకు పూర్వోక్త సంకేతములు మఱియు ఆలంబనల ఆవశ్యకత గన్పించుచున్నది. సంపూర్ణ దృఢ సాక్షాత్కారములో నుండు కఠినత నధిగమించుటకవి ఆవశ్యకమని అతని కనుభవ మగుచున్నది; లేనిచో ఈ జ్ఞాన మెట్లు హృదయమునకు, ప్రాణమునకు వాస్తవ మగును? అతడు మార్గదర్శక సంకేతముల నపేక్షించును, తన సంభూతి యొక్క దివ్యశక్తులను అశేషముగా సైతము చెప్పవలసిన దని భగవంతు నర్థించును, తనను (అర్జునుని) భ్రమపెట్టు నెద్దానిని పరిష్కరింపక విడువరా దని యాచించును. "సంభూతియొక్క నీ సర్వోచ్చశక్తియందు," అర్జును డడుగును, "దివ్యమగు నీ ఆత్మాభివ్యక్తులను - ఆత్మవిభూతులను - అశేషముగా వర్ణింపుము - ఏ విభూతుల చేత నీవు లోకములను, లోకులను వ్యాపించుచున్నావో, వానిని వర్ణింపుము (10-16). సర్వత్ర, ప్రతిక్షణము, ఓ యోగీశ్వరా, నిన్ను జింతించుచు నేను ని న్నెట్లు తెలియ గలను, మఱియు నేయే

ప్రముఖ సంభూతులందు నిన్ను చింతించదగును ?" (10-17). అత డింకను ని ట్లర్థించును - ఏ యోగముచేత నీవు సర్వముతో ఏకము గను, సర్వమునందు ఏకముగను ఉన్నావో, ఏ యోగముచేత అన్నియు నీ సత్త యొక్క సంభూతులుగను, నీ ప్రకృతియొక్క వ్యాపక లేక ప్రముఖ లేక ప్రచ్ఛన్న శక్తులుగ నున్నవో, దానిని విస్తారముగా, మఱింత అధికముగా చెప్పుము; అది నా కమృతతుల్యము, ఎంత విన్నను తనివితీరదు (10-18). గీత దేనిని స్వయముగా స్పష్టరూపమున ప్రకటించదో, ఈ అమృత-వచనము గీతయందలి దాని సంకేత మాత్రము; అయితే అది ఉపనిషత్తు లందు తఱచుగా వచ్చును, దానిని తర్వాతి కాలమున వైష్ణవ, శాక్తమతములు తమ ప్రగాఢతర భగవద్దర్శనము నందు పెంపొందించినవి. ఇంతకు నది ఏమిటి ? అది ప్రపంచమునందలి భగవంతునియందు మానవునికి లభించగల హర్షము, సార్వత్రికానందము, దివ్యమాతృ ఖేలనము, భగవల్లీలయొక్క మాధుర్యసౌందర్యములు.

8. రూపము విభూతిసంకేతము :

దివ్యగురువు శిష్యుని ప్రార్థన నంగీకరించును, కాని సంపూర్ణసమాధానము సంభవము కాదని ముందుగనే జ్ఞాపకముచేయును. ఏలన భగవంతు డనంతుడు, అతని అభివ్యక్తి అనంతము. అటులే అతని అభివ్యక్తిరూపములును అసంఖ్యాకములు. ప్రతిరూపము తనలో గుప్తముగా నున్న ఒక దివ్యశక్తికి - విభూతికి-సంకేతము; కావున ప్రతిపరిమితవస్తువు అనంతముయొక్క ఒక ఆవిష్కరణమును తనలో వహించు చున్నది. అటులే, భగవంతుడు పలుకును, నీకు నా విభూతులను చెప్పెదను; కాని ప్రధానవిభూతులను మాత్రమే ఒక సూచనగా, దృష్టాంతరూపమున చెప్పెదను, ఆ దృష్టాంతములందు భగవంతుని శక్తిని ఎక్కువ తేలికగా చూడగలవు - "ప్రాధాన్యతః' (10-19), "ఉద్దేశతః" (10-40). భగవంతుని ఆత్మవిస్తారము యొక్క వివరములకు అంతము లేదను మాట ప్రకరణారంభమునందే కాక, అంతమునందును (10-40) చెప్పి, దానిని అధికముగను, అసందిగ్ధము గను గురువు వక్కాణించును. పిమ్మట తక్కిన అధ్యాయమునం దంతటను విశ్వముయొక్క వస్తువులందును, వ్యక్తులందును గల భగవచ్ఛక్తియొక్క ప్రధానసూచనలు మఱియు ఉత్కృష్టసంకేతముల సంక్షిప్తవర్ణన మనకు లభించును. ఈ వర్ణనయం దేక్రమము పాటించబడ లేదని ముందు మన కనిపించినను, వెదకినచో దీనిలోపల నొక సూత్రము ప్రాపించును, దీనిని బట్టి మనము విభూతిభావముయొక్క అంతరాశయమును, పరిణామములను జేరుకొన గలము. ఈ అధ్యాయనామము విభూతియోగము - ఇది మిక్కిలి ఆవశ్యకయోగము.

ఏలన ఈ యోగముద్వారా శుభాశుభములు, పూర్ణతాపూర్ణతలు, ప్రకాశాంధకారములతో గూడిన తన సమస్తవిస్తారమునందు భగవంతుని విశ్వసంభూతితో మనము నిష్పక్షపాతముగా తాదాత్మ్యము నందవలెను; నిజమే, కాని అదే సమయమున ఆ సంభూతి యందు ఒక ఆరోహణశీల పరిణామశక్తి, వస్తువులయందు దాని ప్రాకట్యముయొక్క ఒక వర్ధమాన ప్రగాఢత, సోపానగతము రహస్యము నగు ఒకానొక వస్తువును గలదని గుర్తించవలెను; గుర్తించి నపు డీ వస్తువు అడుగున గల ఆవరణాత్మక అభాసరూపములనుండి ఉత్తరోత్తరము ఉచ్ఛతరమగు రూపవిశేషములద్వారా విశ్వమయభగవంతుని విశాల ఆదర్శప్రకృతి దిశగా మనలను గొనిపోవును.

9. ఆత్మ ప్రథమవిభూతి :

విభూతులయొక్క ఈ సంక్షిప్తపరిగణనము అభివ్యక్తి యొక్క సమస్తశక్తికి మూలమగు మూలతత్త్వముయొక్క కథనముతో ప్రారంభమగును. ఈ మూలతత్త్వము ప్రతి జీవునియందును, వస్తువునందును గుప్తముగానైనను, కనుగొనగలిగిన విధముగా నివసించు భగవంతుడు; ప్రతివస్తువు మఱియు ప్రాణియొక్క మనస్సు మఱియు హృదయములోపల, ఒక గుహలోవలె, నతడు వాసముచేయును; అతడు ప్రాణి బహిరంతర సంభూతియొక్క, గర్భాలయమున నుండు అంతరతమాత్మ; వర్తమానము, గతము లేక భావి సర్వభూతములకు ఆదియు, మధ్యము, నంతము నగు వా డతడు (10–20). ఏలన ప్రకృతిగతమగు అంతరాత్మను తనకు ప్రతినిధిగా ప్రకృతిలోనికి బంపి, దాని దృష్టికి మఱుగునం దుండు ఈ తేజోమయ అంతర్నివాసియే కాలమునందు మన వ్యక్తిత్వముయొక్కయు, పరిణామమును అనుక్షణము సాధించుచున్నాడు – కాలము మఱియు దేశము మనలోని ఈ భగవంతునియొక్క సంకల్పాత్మక గతియు, విస్తారము నగును. అంతయు స్వదర్శియగు నీ ఆత్మయే, అంతయు స్వప్రతినిధియగు నీ పురుషుడే. సర్వదా చరాచరభూతముల లోపలినుండి ఈ సర్వచేతనుడే (All-conscient) తన అభివ్యక్త ఆత్మను గుణశక్తులయందు వికసింప జేయును; అటులే దానిని విషయరూపములందును, అంతఃకరణములందును వికసింప జేయును, జ్ఞాన వాక్ చింతనలయందును వికసింపజేయును, వృక్షజీవనము, పశు జీవనము మఱియు మానవ, అతిమానవజీవరూపమునను వికసింపజేయును.

10. విశిష్టవిభూతుల సార్థక్యము :

గుణము మఱియు రాశియొక్క విశేషముల చేతగాని, మూల్యముల విభేదము మఱియు ప్రకృతివిరోధములచేత గాని అంధీ భూతము గాని అంతర్నేత్రముతో

మనము వస్తువులను వీక్షింతు మేని, సర్వవస్తువులు నిజానికి ఈ అభివ్యక్తియొక్క శక్తులే, ఈ విశ్వాత్మయొక్క విభూతులే యనియు, మఱేమియు కాజాలవనియు మనము చూచెదము; ఈ మహాయోగియొక్క యోగమే, ఈ అద్భుత ఆత్మస్రష్టయొక్క ఆత్మసృష్టులే యని చూచెదము. విశ్వమునందు తన స్వీయ అసంఖ్యసంభూతులయొక్క అజుడు, సర్వవ్యాపియు నగు ఈశ్వరుడతడు – "అజో విభుః" (10–12); అన్ని వస్తువులు తన ఆత్మప్రకృతియందు అతని శక్తులు మఱియు నిష్పన్నరూపములు, అనగా విభూతులు. అతడు వాని సర్వస్వమునకు మూలము, వాని ఆది (10–20); అతడు తమ నిత్యపరివర్తనశీల అవస్థయందు వాని ఆధారము, వాని మధ్యము; అతడు వాని అంతము గూడను, అనగా ప్రతి సృష్టవస్తువునకు తన సమాప్తి లేక విలయావస్థ యందు దాని పర్యవసానము లేక విఘటనము (విశ్లేషణము) నగును. అతడు తన చేతనయందుండియే వానిని బహిర్గతము గావించి, వానిలో దాగియుండును, అతడు తన చేతనలోనికే వానిని ఉపసంహరించగా అవి అతనిలో కొంత కాలము లేక సర్వకాలము దాగియుండును. మనకు పైకి గన్పించునది ఏకుని ఒక సంభూతిశక్తి మాత్రమే : మన గోచరము మఱియు దృష్టి నుండి అదృశ్యమగునది ఆ ఏకుని అదే సంభూతిశక్తి యొక్క కార్యరూపము. సర్వశ్రేణులు (classes), జాతులు, (genera), ఉపజాతులు (species), వ్యక్తులు అట్టి విభూతులే, అయినను అతడు మనకు తన సంభూతి యందలి శక్తి ద్వారానే కన్పించును గాన, దేనికి ఉత్కృష్టమూల్య ముండునో, లేక ఏది ఉత్కృష్టశక్తితో వ్యవహరించునో, దానియందు అతడు విశేషముగా మనకు గన్పించును (10–41). కావున ప్రతిజాతియందును ఎవరెవరియందు ఆ జాతికి జెందిన ప్రకృతిశక్తి అత్యున్నతము, అతిప్రముఖము, మిక్కిలి ప్రభావోపేతముగా ఆత్మప్రకాశకము నగు తన అభివ్యక్తి నందుకొనునో, వారియం దా భగవంతుని మిక్కిలి ఎక్కువగా మనము చూడగలము. ఒక విశిష్టార్థమున విభూతు లన నివియే. అయినను అత్యున్నత విభూతి సైతము అనంతునియొక్క ఒక మిక్కిలి ఆంశిక ప్రకాశనము మాత్రమే; సంపూర్ణవిశ్వము సైతము అతని మహత్త్వముయొక్క ఒక అంశముచేత మాత్రమే అనుప్రాణితమై యున్నది. అతని జ్యోతియొక్క ఒక కిరణముచేతనే ప్రదీప్తమైయున్నది, అతని ఆనందము మఱియు సౌందర్యముయొక్క ఒక క్షుద్రశీకరముచేతనే వైభవవిలసితమై యున్నవి (10–42). సంక్షేపముగా నిదియే ఈ విభూతిపరిగణనయొక్క సారము, దీనినుండి వెలువడు ఫలితము, దీని అర్థముయొక్క హృదయకేంద్రము.

11. అక్షయకాలము, అనంతదేశము :

భగవంతుడు అక్షయ, అనాది, అనంతకాలము; ఇది సంభూతియొక్క అత్యంత ప్రత్యక్షశక్తి మఱియు సమస్త విశ్వగతియొక్క సారతత్త్వము – "అహం ఏవ అక్షయః కాలః" (10–33). ఆ కాలగతియందు భగవంతుడు సర్వవస్తువులను తమతమ స్థానములందు నియమించి, నిలబెట్టు దివ్యశక్తిగా మన భావన లేక అనుభవమునకు గోచరించును, దీని కతని కర్మలే నిదర్శనము. పోగా తన దిగ్రూపమునందు ఆ భగవంతుడే ప్రతిదిశయందు కోటి శరీరములతో, కోటి మనస్సులతో ప్రతిభూతము నందు వ్యక్తమగుచు గన్పించును; అతని ముఖములను మన మన్ని వైపుల గాంతుము –"ధాతా అహం విశ్వతోముఖం" (10–33). ఏలన ఏకకాలమున ఈ అసంఖ్య భూతములన్నింటి యందును అతని ఆత్మ, బుద్ధి మఱియు శక్తియొక్క రహస్యవిధానము పనిచేయుచుండును; అటులే సృష్టి విషయకమగు అతని దివ్యప్రతిభయు, నిర్మాణ విషయకమగు అతని అద్భుత కౌశలము, సంబంధములు మఱియు ఫలితములయొక్క అతని అనింద్యవ్యవస్థీకరణము పనిచేయుచుండును. మన కతడు విశ్వమునందు విశ్వవ్యాప్త మృత్యుపురుషుడుగను గోచరించును; తన సృష్టిని చివరకు నాశముజేయుటే ఈ పురుషుని పనిగా గన్పించును – "సర్వహరమగు మృత్యువును నేను" (10–34). అయినను భగవంతుని సంభూతి శక్తి తన పనియం దాగిపోదు; ఏలన పునఃసృష్టి శక్తి, వినాశకశక్తివెంట పనిచేయుచునే యుండును – "మఱియు నిక ఉత్పన్నము కాగల సర్వమునకు నేను పుట్టుకను గూడను" (10–34). వస్తువులయందలి దివ్యాత్మ వర్తమానముయొక్క ధారణశక్తి, గతముయొక్క ఉపసంహరణశక్తి, భావియొక్క సృజనశక్తియునై యున్నది.

12. ప్రతిజాతియందు సర్వోత్తమము :

పిమ్మట సర్వజీవసత్త్వములందు, అనగా విశ్వవ్యాపిదేవతలు, అతిమానవ, మానవ, అవమానవ ప్రాణులందు మఱియు నీ సర్వగుణములు, శక్తులు, విషయములందును తన శ్రేణియందు ఏది ప్రముఖము, ప్రధానము, గుణమునందు సర్వోత్తమమో, అది భగవంతుని సంభూతియొక్క ఒక విశిష్టశక్తి యగును. వీనిని భగవంతు డిట్లు పరిగణించును – నేను ఆదిత్యులయందు విష్ణువును (10–21), రుద్రులయందు శివుడను, దేవులయందు ఇంద్రుడను, దైత్యుల యందు ప్రహ్లాదుడను, పురోహితులందు ముఖ్యుడగు బృహస్పతిని, సేనానాయకు లందు యుద్ధదేవతయగు

స్కందుడను, మరుత్తులలో మరీచిని, యక్షరాక్షసులలో ధనాధిపతియగు కుబేరుడను, వసువులలో అగ్నిని, పుట్టించువారిలో మన్మథుడను, దేవర్షులలో నారదుడను, ధర్మపాలకులలో ధర్మాధిపతియగు యమధర్మరాజును, వాయువులలో వాయుదేవతను. పిమ్మట సృష్టి రెండవ కొనకువెళ్లి, భగవంతు డింకను చెప్పును – ప్రకాశములందు, జ్యోతులందును నేను భాసుర సూర్యుడను, నిశానక్షత్రములలో చంద్రుడను, ప్రవాహోదకములలో సాగరమును, శిఖరములలో మేరువను, పర్వతశ్రేణులలో హిమాలయమను, నదులలో గంగను, ఆయుధములలో ఇంద్రుని వజ్రమను. పోగా చిన్న, పెద్ద చెట్లలో నేను రావిచెట్టును, ఏనుగులందు ఐరావతమను, పక్షులయందు గరుడను, పశుగణమునందు కోరికలను బిండు కామధేనువను, మృగములలో సింహమను. ఇంకను నేను ప్రథమమాసమగు మార్గశిరమను; ఋతువులలో మిగుల రమ్యమగు వసంతమను.

13. విద్యావిషయక విభూతులు :

ప్రాణులలో, భగవంతు డర్జునునికి ఇంకను వచించును, నేను చేతనను. దీనిచేతనే అవి తమను, పరిసరములను ఎఱుంగును (10–22). నే నింద్రియములందు మనస్సును, ఈ మనస్సుచేతనే ప్రాణులు విషయ వేదనలను గ్రహించి, విషయములపై ప్రతిక్రియ సల్పును. నేను మనస్సు, శీలము, శరీరము, క్రియలకు సంబంధించిన వాని గుణములను. నేను కీర్తిని, వాక్కును, స్మృతిని, మేధను, ధృతిని, క్షమను (10–34). నేను తేజోవంతుల తేజమను, బలవంతుల బలమను (10–36). నేను నిశ్చయము, దీర్ఘ ప్రయత్నము మఱియు విజయమను, నేను మంచివారి మంచిని, నేను వంచనాశిల్పములో జూదమను (10–36); శాసించువారి శాసకశక్తిని నేను, జయించువారి జైత్రనీతిని నేను; నేను గుహ్యవస్తువుల మౌనమను, జ్ఞానవంతుల జ్ఞానమను (10–38), వాదనిపుణుల తర్కమను (10–32). శబ్దములలో పవిత్రాక్షరమగు ఓం–కారమను, ఛందస్సులలో గాయత్రిని, వేదములలో సామవేదమను. ఎవరు గణింతురో (లెక్కింతురో) మఱియు కొలుతురో, వారికి గణనగురువగు కాలమను నేను (10–30). బహువిధ తత్త్వవిద్యలు, కళలు మఱియు శాస్త్రములందు నే నధ్యాత్మవిద్యను (10–32). మానవ జీవుల సర్వసామర్థ్యములు మఱియు విశ్వము మఱియు దాని సర్వశక్తులను నేను.

14. "ఒక్క అంశముచేత ధరింతును" :

ఎవరియందు నా శక్తులు మానవు లందుకొనగల అత్యున్నతశిఖరముల నందుకొనునో, వారు సదా స్వయముగా నేను, నా విశిష్టవిభూతులు మానవులలో నేను రాజు..ు, నాయకుడను, బలవంతుడను, వీరుడను. యోధులలో నేను రాముడను, వృష్ణులలో కృష్ణుడను, పాండవులలో అర్జునుడను. ప్రకాశపూర్ణ ఋషి నా విభూతి; నేను మహర్షులలో భృగువను. భావప్రకాశముచేత సత్యమును జూచి, శబ్దధ్వనిచేత దానిని వెల్లడించు మహర్షిని, అంతఃప్రేరిత కవి మర్త్యదేహమున ప్రకాశమయమగు నేనే; నేను ఋషి - కవులలో శుక్రాచార్యుడను. మహర్షి, మనీషి, దార్శనికుడు నగువాడు మానవులయందు నాశక్తియే, నా స్వీయ విశాల ప్రజ్ఞయే; ఋషులలో నేను వ్యాసుడను. కాని, అభివ్యక్తి యందు ఎంత తారతమ్య మున్నను, తమతమ రీతిలో, తమతమ ప్రకృతియందు అన్నియు భగవంతుని శక్తులే; చరాచరములం దేదియు నేను లేకుండ లేదు (10-39). నేను సర్వభూతముల బీజమను, మఱియు నవి ఆ బీజముయొక్క శాఖలు, పుష్పములు; ఆత్మరూప బీజమున నేది గలదో, దాని వికాసమును మాత్రమే అవి ప్రకృతియందు సాధింపగలవు. నా దివ్యవిభూతులను గణించ వలనుపడదు; వానికి మితిలేదు. నేను చెప్పిన దంతయు నొక సంక్షిప్త కథనము మాత్రమే, అధిక మేమియు గాదు, మఱియు కొన్ని ప్రముఖసంకేతముల వెలుగును మాత్రమే ప్రసాదించితిని, అనంతసత్యతలకు ఒక గట్టి ద్వారమును మాత్రమే తెఱచితిని (10-40). ప్రపంచమున సుందరము, వైభవోపేతము నగు ఏయే ప్రాణిని నీవు చూతువో, మానవులందును, మానవుని పైనను, దిగువను ఏయే సత్త్వము ప్రబలము, శక్తిశాలియునై మించునో, అది నా సౌందర్యమే, వైభవమే, శక్తియే యని ఎఱుంగుము, మఱియు నది నా సత్తయొక్క ఒక తేజోంశమునుండియు, ప్రముఖశక్తినుండియు పుట్టిన దని గ్రహించుము (10-41). కాని యింత ఎందుకు ? ఒక్క మాటలో, నేనిచ్చట ఈ ప్రపంచమందును, సర్వత్రను ఉన్నాను; నేను సర్వమునందును ఉన్నాను, సర్వమునైయున్నాను: నాకంటె నితర మేమియు లేదు, నన్ను వినా ఏమియు లేదు. నా అమేయశక్తియొక్క ఒక లవము చేతను, నా అగాధసత్తయొక్క ఒక అణుమాత్ర అంశముచేతను నేనీసమస్త విశ్వమును ధరించియున్నాను. ఈ ప్రపంచము లన్నియు 'నే - నున్నాను, I-AM' అను సనాతనతత్త్వముయొక్క రవ్వలు, గుర్తులు, మెఱపులు మాత్రమే.

9. విభూతి సిద్ధాంతము

1. విభూతియోగ మొక సోపానము :

విభూతియోగ మను ఈ అధ్యాయము యొక్క మహత్త్వము ప్రథమదృష్టికి తగులుదానికంటె చాల అధికము; అటులే ప్రపంచమునుండి తప్పించుకొని, ప్రపంచాతీతమగు నిర్గుణతత్త్వములో లీనముకాగోరి, తత్పరమగు శ్లోకములనే పూర్వప్రవణతతో అన్వేషించు కంటికిని దీని మహత్త్వము గన్పించదు. గీతాసందేశము మానవునియందలి భగవంతుని బోధించు సందేశము: ఈ లోని భగవంతుడు. పెరుగుచున్న సంయోగబలముచే నిమ్నప్రకృతియొక్క ఆవరణమునుండి వెలికి వచ్చి, మానవాత్మకు తన విశ్వభావమును ప్రకటించును; మానవునిలోను, సర్వభూతముల లోను నున్న తన్ను ప్రకటించుకొనును. ఈ సంయోగరూపమగు దివ్యయోగమునందు మానవుడు భగవద్దిశగా పెరుగును, భగవంతుడు మానవాత్మయందును, అతని అంతర్దృష్టికిని అభివ్యక్తమగును; పరిచ్ఛిన్నాహంకారమునుండి మన విముక్తియు, ఒక దివ్యమానవతయొక్క ఉచ్చతరప్రకృతిలోనికి మన సముద్ధరణము ఈ సంయోగము యొక్క సంభవనీయ ఫలితము. ఏలన, త్రిగుణముల జటిలజాలము నందు గాక, మానవు డీ అధికతర ఆధ్యాత్మిక ప్రకృతియందు నివసించుచు, భక్తిజ్ఞానకర్మలచేతను, సర్వాత్మసమర్పణము చేతను భగవంతునితో ఏకతను సాధించి, నిక్కముగా నిరపేక్ష విశ్వాతీతభావములోని కెగయగలుగును. అయినను ప్రపంచముపై పనిచేయగలుగును. ఇపు డతడు అజ్ఞానమునందు గాక, పరమునితో వ్యష్టికి గల యథార్థసంబంధము నందు, అహంకారమునిమిత్తము గాక, ప్రపంచమునందలి భగవంతునికొఱకు కర్మనిరతు డగును. ఈ కర్మకు అర్జునుని పిలుచుట మఱియు అతని స్వరూపముగా నున్న సత్తాశక్తులయు, వానిద్వారా పనిచేయు దివ్య సత్తాశక్తులయు, నెఱుక నతనికి గల్గించుట – ఇదియే దేహధారి భగవంతునియొక్క ఆశయము. ఇందునిమిత్తమే దివ్యకృష్ణు డతని సారథి యయ్యెను. ఇందునిమిత్తమే మానవుల హీనతర కర్మ హేతువుల పట్ల మహానిరుత్సాహము మఱియు గభీర అసంతృప్తి అర్జునుని పైకొనెను; వాని స్థానమున విశాలతర ఆధ్యాత్మిక హేతువును ప్రవేశపెట్టుటకే, తనకు నియుక్తమైన కర్మయొక్క పరమముహూర్తమున అర్జునునకు సత్య మావిష్కరించబడెను. విశ్వపురుషదర్శనము మఱియు ప్రపంచకర్మకు

దివ్యాదేశము - ఏతద్రూపమగు పతాకస్థాయికి అర్జునుడు నడుపబడుచుండెను. ఆ స్థాయి దగ్గర పడినది; కాని విభూతియోగముద్వారా తన కివ్వబడిన జ్ఞానము వినా, ఈ స్థాయి తనతో తన పూర్ణార్థమును గొనిరాకపోవును.

2. ప్రపంచముపట్ల ముక్తపురుషుని దృష్టి :

సృష్టిరహస్య మొక అంశమున గీతచే ప్రకటింపబడెను. అంశమునందు మాత్రమే ఏలన, అనంతమగు దాని లోతుల నెవడు పూర్తిగా కనుగొనును ? లేక ఏ శాస్త్రము విశ్వమహిమయొక్క ఆంతర్యము నంతను స్వల్పస్థలమున లేక సంక్షిప్త నిరూపణమున వివరించితి నని చెప్పగలుగును? కాని ఎంతవఱకు గీతాధ్యేయము నిమిత్త మావశ్యకమో, అంతవఱ కది మనముం దుంచబడినది. భగవంతునుండి జగదుత్పత్తి ప్రకారము (9-8), దానిలోపల భగవంతుడును, భగవంతునిలోపల నదియు నుండుట (6-30), మూలమునందు సమస్తవిశ్వముయొక్క ఏకత్వము (10-39), ప్రకృతియందు తమోవృతమైయుండు జీవాత్మకు భగవంతునితో గల సంబంధము (15-7), ఆత్మజ్ఞానమున కది కనువిప్పుట (10-8), అధికతరచేతనలోనికి దాని పునర్జన్మ (10-10), స్వీయ ఆధ్యాత్మిక ఉన్నతులలోనికి దాని ఆరోహణము (2-72) - దీని నంతను గీత మనముం దుంచినది. కాని వెనుకటి అజ్ఞానస్థానమున ఈ నూతన ఆత్మదర్శనము, చేతనయు ప్రాప్తించినపుడు, తన చుట్టును గల ప్రపంచము పట్ల విముక్తమానవుని దృష్టి ఎట్లుండును, దేని కేంద్ర రహస్య మిపుడు తన కవగతమయ్యెనో, ఆ విశ్వాభివ్యక్తిపట్ల అతని వైఖరి ఎట్లుండును? ముందతడు విశ్వైక్యముయొక్క జ్ఞానమును, జ్ఞాననేత్రమును గలిగియుండును, తన చుట్టును గల సర్వము నతడు ఒకే దివ్యపురుషుని యొక్క ఆత్మలు, రూపములు మఱియు శక్తులుగా గాంచును (7-19). ఇకముందు అతని చేతనయొక్క బాహ్యాభ్యంతర వ్యాపారమున కంతటికి ఆ దర్శనమే ఆరంభమగును; అదియే అతని మూలదృష్టియు, తన కర్మల ఆధ్యాత్మికాధారము నగును. అతడు ప్రతిప్రాణియు ఏకునియందే చరించుచు చేష్టించుచున్నదని చూచును, మఱియు నత డా ఏకుని అన్నింటియందు అంతర్నివాసిగను, వారి ఆత్మగను, వానియందలి రహస్యపురుషునిగను గూడ గాంచును; ప్రాణుల చేతన ప్రకృతియం దతని రహస్య సన్నిధి లేనిచో, అవి జీవించనే లేవు; అతని సంకల్పము, శక్తి, ఆదేశము లేక అనుమతి లేనిచో, అవి రవంత కూడ కదలలేవు. అంతే కాదు, స్వయముగా వాని ఆత్మ, మనస్సు, ప్రాణము, శరీరము

సైతము ఈ ఏకాత్మ మఱియు పురుషుని యొక్క శక్తి, సంకల్పము మఱియు ప్రభావము యొక్క పరిణామమే యని అతడు చూచును. అంతయు నతనికి ఒక వైశ్వసత్తయొక్క సంభూతిగ గన్పించును. ప్రాణుల చేతన సర్వథా దాని చేతననుండియే ఉత్పన్నమైన దనియు, వాని శక్తి సంకల్పములు దాని శక్తి సంకల్పములనుండియే గ్రహించబడి, వానిపైననే ఆధారపడుననియు, ఆంశికమగు వాని ప్రకృతివ్యాపారము దాని అధికతర, దివ్యప్రకృతియొక్క ఫలితమే యనియు గాంచును – ఆ వ్యాపారము అప్పటి పరిస్థితిలో భగవంతుని అభివ్యక్తిగా లేక ఆవరణముగా, ఆకారముగా లేక వికారముగా మనస్సునకు గోచరించినను, ఆ చూపు మాఱదు. ఆ చూపు తా నారోహించిన అధికతరచేతనకు మూలాధారము, అది తన నలువైపుల వికసించిన పరమావశ్యక ప్రకాశము, అది పరిపూర్ణ దర్శనప్రకారము, అది తక్కిన వానిని సంభవముచేయు ఏకమాత్ర పరమసత్యము.

3. సాంతముయొక్క ఆధ్యాత్మికమర్మము :

కాని ప్రపంచము భగవంతునియొక్క ఒక ఆంశికాభివ్యక్తియే గాని, తానే స్వయముగా ఆ భగవంతుడు గాదు. ఎట్టి ప్రాకృత అభివ్యక్తినైనను భగవంతు డనంతముగా మించియుండును. "నాస్తి అంతో విస్తరస్యమే" (10–19) – ఇట్లు ప్రపంచరూపముచేత భగవంతుని విస్తారమునకు అంతము లేదు, ఈ ప్రపంచము మన దృష్టి కందనంత విశాలము, సంకీర్ణము, బహువిధము; అయినను భగవంతుడు తన అనంతతచేతనే, అనంతతకు గల అఖండ స్వాతంత్ర్యముచేతనే ఇట్టి ప్రపంచమునకు సైతము ఆవల గూడ నుండును. కావున ముక్తపురుషుడు విశ్వమున కావల నిట్టి శుద్ధభగవంతుని జూచును. విశ్వము నతడు ఆకారాతీతుడగు భగవంతునుండి గ్రహించబడిన ఒక ఆకారముగా జూచును, నిరపేక్ష సత్తయందు సంతతమగు ఒక స్వల్పాంశముగా జూచును. ప్రతిసాపేక్షమును (సాపేక్షవస్తువును), ప్రతిసాంతమును దివ్యనిరపేక్షము మఱియు అనంతముయొక్క ఒక ఆకారముగా నతడు గాంచును, మఱియు సాంతము లన్నింటి కావలను, ప్రతి సాంతముద్వారాను అత డా అనంతమునే చేరుకొనును; ఇంకను ప్రతిదృశ్యమునకు, ప్రాకృతప్రాణికి మఱియు సాపేక్షక్రియకు, అటులే ప్రతిగుణమునకు, ఘటనకు ఆవల దానినే చూచును; ప్రతివస్తువుపైనను, దాని కావలను తన దృష్టిని సారించుచు, ఆవలనున్న భగవంతునియందు దాని ఆధ్యాత్మిక మర్మమును గనుగొనును.

4. బౌద్ధిక భావనము-ఆధ్యాత్మికదర్శనము :

ఈ విషయము లతని మనస్సునకు బౌద్ధిక భావనలుగా నుండవు, లేక ప్రపంచము పట్ల అతని వైఖరి ఒక చింతనావిధానముగనో, ఒక వ్యావహారిక సిద్ధాంతముగనో యుండదు, ఏలన అతని జ్ఞానము భావనాత్మకమే యగుచో, అది ఒక తత్త్వశాస్త్రము, బౌద్ధికరచన యగునే గాని, ఒక ఆధ్యాత్మికజ్ఞానము మఱియు దర్శనము, చేతనయొక్క ఒక ఆధ్యాత్మికావస్థ గాజాలదు. భగవంతుడు మఱియు ప్రపంచముయొక్క ఆధ్యాత్మిక దర్శనము కేవలముగా గాని, ప్రధానముగా గాని, చివరకు ప్రారంభమునందు గాని ఆలోచనాత్మకము గాదు. అది ప్రత్యక్షానుభవము – మనస్సునకు బాహ్యావస్తువులు మఱియు వ్యక్తుల దర్శనము మఱియు అనుభవము వలెనే, అది వాస్తవము, స్పష్టము, సన్నిహితము, సంతతము, కార్యసమర్థము మఱియు ఘనిష్ఠము. భౌతికమనస్సు మాత్రమే భగవంతు డొక కేవలభావన యని తలంచును; కారణము అది శబ్దములు, నామములు, సంకేతములు, కల్పనలచేతనే భగవంతుని తన దృష్టికి చిత్రించుకొనగలదు. ఆత్మ ఆత్మను చూచును; భౌతికచేతన జడద్రవ్యమును చూచినంత ప్రత్యక్షము గాను, ఇంకను ఎక్కువ ప్రత్యక్షముగాను, అంత ఘనిష్ఠము గాను, ఇంకను ఎక్కువ ఘనిష్ఠముగాను, దివ్యీకృతచేతన భగవంతుని చూచును. అది భగవంతుని చూచును, భావించును (feels), చింతించును, ఇంద్రియములతో ననుభవించును. ఏలన ఆధ్యాత్మికచేతనకు సమస్త అభివ్యక్తసత్తయు నొక ఆత్మప్రపంచముగనే కన్పట్టును గాని, జడమయ, ప్రాణమయ, మనోమయ ప్రపంచముగా సైతము గాదు. ఈ యితరప్రపంచము లతని దృష్టికి భగవద్ – రూపము, భగవద్ – శక్తి, భగవద్ – చింతన మాత్రమే. వాసుదేవునియందు నివసించుట మఱియు జీవించుట యన గీతార్థ మిదియే – "మయివర్తతే" (6–31). ఆధ్యాత్మికచేతన తాదాత్మ్యజ్ఞానముచే లభించు సన్నిహితజ్ఞానముచే భగవంతు నెఱుంగును. ఈ జ్ఞానము మానసికబోధము కంటెను, ఇంద్రియానుభవముకంటెను ఎంతో ఎక్కువ వాస్తవికము. ఏ స్వతఃసిద్ధ నిరపేక్షము (Absolute), ప్రపంచము కంతకు వెనుకను, ఆవలను గలదో, దానిని పుట్టించునో మఱియు నతిశయించునో, దాని ఒడుదొడుకులకు సర్వదా వెలుపల విరాజిల్లునో, అట్టి నిరపేక్షమును సైతము ఆధ్యాత్మికచేతన తాదాత్మ్యముచేతనే ఎఱుంగును. ఈ నిరపేక్ష భగవంతుని అక్షరాత్మను – తన అక్షరనిత్యతచేత ప్రపంచ పరివర్తనలను వ్యాపించి, ధరించు అక్షరాత్మను –

గూడ అది తాదాత్మ్యముచేతనే, అనగా నీ అక్షరాత్మతో మనయందలి కాలాతీతసత్త యొక్క ఏకత్వానుభవముచేతనే ఎఱుంగును. ఇంకను అది దివ్యపురుషుని గూడ అదే ప్రకారముగా నెఱుంగును - తనను ఎవడు సర్వులయందును తెలిసికొనునో, తన చేతనలో సర్వులు నయి, వారి తలపులను రూపొందించునో, తన అంతర్వర్తి ఇచ్ఛచేత వారి కర్మలను నియమించునో, అట్టి దివ్యపురుషుని, అది అతీతభగవంతుని, ఆత్మరూపభగవంతుని, పురుష, అంతరాత్మ మఱియు ప్రకృతిరూప భగవంతుని ఘనిష్ఠముగా నెఱుంగును. ఈ బాహ్యప్రకృతిని సైతము అది తాదాత్మ్యము మఱియు ఆత్మానుభవము ద్వారా తెలియును; అయితే ఈ తాదాత్మ్యము వైవిధ్యమునకు, సంబంధములకు నిరాఘాటముగా ప్రవేశమిచ్చును; ఏలన ప్రకృతి బహువిధ ఆత్మసంభూతిని సాధించు భగవంతుని శక్తి - "ఆత్మ-విభూతి" (10-19).

5. భగవంతుని ఆదర్శప్రకృతి :

కాని ఈ ఆధ్యాత్మికచేతన ప్రపంచము నందలి ప్రకృతిని, మానవుని సాధారణ మనస్సు దాని నజ్ఞానమున జూచినట్లు, చూడదు. ఈ ప్రకృతియందలి అజ్ఞానమయ మగున దంతయు - అపూర్ణము, బాధాకరము, నీతిబాహ్యము, జుగుప్సాకరము నగున దంతయు - భగవంతుని ప్రకృతికి కేవలవ్యతిరేకము గాదు; ఏలన దాని మూలము తన వెనుకనున్న ఒకానొక వస్తువులో నున్నది, దేనియందది తన యథార్థసత్తను, పరమనిష్కృతిని బొందగలదో, ఆత్మ యొక్క అట్టి తారకశక్తిలో నున్నది. ఆద్యము, సర్వజనకము నగు నొక పరమ ప్రకృతి గలదు, దీనియందు దివ్యశక్తి మఱియు జీవనసంకల్పము తన స్వీయ పరిపూర్ణగుణమును, విశుద్ధప్రకాశనమును ఉపభోగించును. మనము విశ్వమునందు జూచు సమస్తశక్తుల మూల, శ్రేష్ఠ, పరిపూర్ణశక్తి అక్కడ మనకు బ్రాప్తించును. ఆ పరమప్రకృతియే భగవంతుని ఆదర్శప్రకృతిగా మనకు ప్రత్యక్షమగును - పరిపూర్ణజ్ఞానము, పరిపూర్ణ శక్తి సంకల్పములు, పరిపూర్ణప్రేమహర్షముల ప్రకృతి, మఱియు దాని గుణము మఱియు ఊర్జము (energy) యొక్క ప్రభేదములన్నియు - "అనంతగుణ, అగణనశక్తి" - తన యీ ప్రజ్ఞా సంకల్పానందముల స్వతంత్ర, స్వసూత్రీకరణములు. అచ్చట సమస్తము అనంతతలయొక్క ఒక బహుముఖ, అప్రతిహత ఏకతగా నుండును. ఆదర్శ, దివ్యప్రకృతియందు ప్రతిగుణము, ప్రతి ఊర్జము శుద్ధము, పూర్ణము, స్వస్థము, తన క్రియయందు సమరసము నగును; అచ్చట నేదియు తన స్వీయ ప్రత్యేక,

పరిమిత సార్థక్యమునకు శ్రమించదు, అన్నియు నొక అనిర్వచనీయ ఏకతయందు ప్రవర్తించును. అచ్చట సమస్త ధర్మములు, అనగా సమస్త అస్తిత్వనియమములు ఒకే విముక్త మఱియు నమనీయ (మెత్తని) ధర్మ మగును – ధర్మ మన దివ్యగుణము మఱియు ఊర్జము – "గుణ–కర్మ" (4–13) – యొక్క ఒక విశిష్టక్రియ. అచ్చట సత్తయొక్క ఏకమాత్ర [1] దివ్యశక్తి ఒక అపరిమేయ స్వేచ్ఛతో కర్మచేయును, ఏయొక ప్రత్యేకనియమానికి బద్ధము గాదు, ఏ బంధనవిధానమునకు పరిమితము గాదు, తన స్వీయ అనంతతా ఖేలనమునందు ఉల్లసించును, సదా నిర్దుష్టమగు తన ఆత్మాభివ్యక్తి సత్యమున ఎప్పుడును విచలితముగాదు.

6. అన్ని గుణములు భగవంతుని గుణములే :

కాని మనము నివసించు ప్రపంచమున ఎన్నుకొని, వేఱుచేయు నొక పృథక్కరణతత్త్వము గలదు. దీని ప్రభావమున, ప్రతిశక్తియు, ప్రతిగుణమును తన అధికారముకొఱకే ప్రయత్నించు చున్నట్లు కన్పించును; విధ మేది యైనను, సాధ్యమైనంత స్వీయాభివ్యక్తిని సాధింప బ్రయత్నించును; ఆ ప్రయత్నమునకు సహవర్తి లేక ప్రత్యర్థి శక్తుల ప్రయత్నముతో వీలైనంత ఉత్తమముగానో, సాధ్యమైనంత అధమముగానో సమాధానము కుదుర్చును. ఈ సంఘర్షశీల ప్రపంచప్రకృతియందు నివసించు దివ్యపురుషుడు, భగవంతుడు దానిపై నొక విధమగు సామరస్యమును విధించును – సమస్తశక్తుల క్రియయు దేనిపై నాధారపడునో, ఆ అభ్యంతర, రహస్య ఏకత్వమునకు సహజమగు ధర్మము ననుసరించి ఆ సామరస్యమును విధించును. కాని ఇది యొక సాపేక్ష సామరస్యము; ఇది యొక మూల ఏకతనుండి కాక, మూల విభజననుండియే వచ్చి, విభజన నేర్పిన పాఠములచేతనే మనుచున్నట్లు కన్పించును. అథవా కనీస మి ట్లనిపించును; ఈ ఏకత్వము పాతాళమున నిద్రించుచున్నది, తన ఎఱుక తనకు లేదు, తన మాయా వేషములను తా నెప్పుడు తొలగించదు. మఱియు వాస్తవ మారయ, అపరప్రకృతి యందలి జీవుడు తనలో దానికి మూలమగు దివ్యప్రకృతిని కనుగొనువఱకు, ఈ ఏకత్వము తననుదాను పొందదు. అయినను ప్రపంచమునందు కార్యరతమై, మానవునియందు, పశు వునందు, వృక్షమునందు, జడమునందు వివిధముగా పనిచేయుచున్న గుణములు మఱియు శక్తులు, అవి ఏరూపము ధరించినను, సదా దివ్యగుణములు మఱియు

[1] తపస్సు, చిచ్ఛక్తి. – శ్రీ అ.

శక్తులే. సమస్త ఊర్జములు మఱియు గుణములు భగవంతుని శక్తులే. ప్రతిశక్తియు నచ్చటి దివ్యప్రకృతినుండి వచ్చును, ఇచ్చటి నిమ్నప్రకృతియందు ఆత్మప్రకటనముకై కర్మచేయును, ఇచ్చటి బాధకనియమములకు లోబడియు నిలద్రొక్కుకొని, ప్రకటితమూల్యముల సామర్థ్యమును పెంపొందించు కొనును, మఱియు స్వీయశక్తి ఉన్నతులను ప్రాపించుకొలది, దైవత్వమును ప్రత్యక్షముగా ప్రకటించు స్థితికి వచ్చి, ఆదర్శ, దివ్యప్రకృతియందు తన స్వీయ పూర్ణ స్వరూపము దిశగా పైకెగయును. ఏలన ప్రతి ఊర్జము భగవంతుని సత్తయు, శక్తియునే గాన, ఊర్జముయొక్క విస్తారమును, ఆత్మప్రకటనమును సదా భగవంతుని విస్తారమును, ప్రకటనమునే యగును.

7. విభూతిసిద్ధాంతమునకు పునాది :

ఇట్లు సైతము చెప్పవచ్చును : ఒకానొక తీవ్రతాదశను చేరుకొనినపుడు, మనయందలి ప్రతిశక్తి - జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, ప్రేమశక్తి, ఆనందశక్తి - ఒక విస్ఫోటములో (ప్రేలుడులో) పరిణమించగలదు, ఆ విస్ఫోటము నిమ్నతరవ్యవస్థయొక్క పుటమును పగులగొట్టి, అందలి ఊర్జమును తన పృథక్కర క్రియనుండి విడిపించి, దివ్యసత్తయొక్క అనంతస్వేచ్ఛతో దాని సంయోగమును సాధించును. భగవదున్ముఖమగు ఒక పరమోచ్చ తీవ్రత ఒక పరిపూర్ణ జ్ఞానదృష్టిద్వారా మనస్సును విడిపించును, ఒక పరిపూర్ణ ప్రేమానందము ద్వారా హృదయమును విడిపించును, ఒక పరిపూర్ణ ఇచ్ఛాకేంద్రీకరణముద్వారా సర్వసత్తను విడిపించును. కాని ఈ విమోచకవిస్ఫోటమునకు మూలము మన వర్తమానప్రకృతిపై భగవంతుని సంస్పర్శ యగును; ఈ సంస్పర్శ ప్రకృతిశక్తిని తన సామాన్య, పరిమిత, పృథక్కర క్రియనుండియు, విషయములనుండియు తప్పించి, అనంతము, నిరపేక్షము నగు భగవంతుని దిశగా మఱల్చును. ఇట్లు మఱల్చు దివ్యశక్తియొక్క సక్రియ సర్వవ్యాపిత్వరూపమగు సత్యమే విభూతి సిద్ధాంతమున కాధారము.

8. జీవునికి అహంకారభ్రమ :

అనంతమగు దివ్యశక్తి అంతటనుండి, నిమ్నజగత్తును రహస్యముగా ధరించును. – "పరా ప్రకృతిర్మే యయా ధార్యతే జగత్" (7-5). కాని యోగమాయా కల్పితమైన ఆవరణము (7-25) జ్ఞానప్రకాశము చేత (10-11) భేదించబడువఱకు అది ప్రతిప్రాకృతభూతముయొక్క హృదయమున దాగి (18-61), వెనుకకు తగ్గి నిలుచును.

మానవుని ఆధ్యాత్మికసత్తయగు జీవుడు దివ్యప్రకృతితో నుండును. అత డా ప్రకృతియందు భగవంతునియొక్క ఒక అభివ్యక్తి - "పరా ప్రకృతిర్ జీవభూతా" (7-5), మఱియు నతడు తనయందు భగవంతుని సర్వశక్తులను, గుణములను గుప్తరూపమున గలిగియుండును. కాని మనము నివసించు నీ అపరప్రకృతియందు జీవుడు సంవరణము (selection) మఱియు సొంత నిర్ధారణము (determination) యొక్క సూత్రము ననుసరించును; అనుసరించి ఏయే శక్తిని, గుణమును లేక ఆధ్యాత్మికతత్త్వమును తనతో జన్మలోనికి తెచ్చునో, లేక తన అభివ్యక్తి బీజముగా దానిని ముందుకు పంపునో, అది తన స్వభావము, అనగా స్వ - సంభూతినియమము యొక్క ఒక క్రియాశీల అంశ మగును, మఱియు తన స్వధర్మము, అనగా కర్మనియమమును నిర్ధారణచేయును. మఱియు నదియే సర్వము నగుచో, నెట్టి కలవరము లేక కష్టము నుండదు; అప్పుడు మానవ జీవనము భగవంతుని ఒక ప్రకాశమయప్రకటనయే యగును. కాని మన ప్రపంచ శక్తి అజ్ఞానముయొక్క అహంకారముయొక్క త్రిగుణములయొక్క ఒక ప్రకృతి. ఇది అజ్ఞానప్రకృతి గావున, జీవుడు తనను, వేఱుచేయు అహంకారముగా భావించుకొనును: అతడు తన స్వీయాభివ్యక్తిని పృథక్కర జీవనసంకల్పరూపమున ఆహంకారికముగా సాధించు కొనుచు, ఇతరుల యందలి అట్టి సంకల్పముతో సంఘర్షము లేక సంయోగమున వర్తించును. అతడు ఏకత మఱియు సామరస్యముచేత గాక, సంఘర్షముచేత జగత్తును పొంద ప్రయత్నించును ; అతడు విరోధమునకే ప్రాధాన్య మిచ్చును. ఇది యొక అజ్ఞానప్రకృతి గాన, అతడు తననుదా నెఱుంగడు, తన స్వభావమునెఱుంగడు, కాని దానిని సహజప్రేరణచే ప్రపంచశక్తి నిర్బంధమునకు లోబడి, అనుసరించును, ఈ స్థితియందు అధికాయాసము, అంతఃసంఘర్షము, దారితప్పు పెద్ద ప్రమాదము నుండును. ఇది త్రిగుణప్రకృతి గావున, ఈ అస్తవ్యస్త ప్రయాసమయ ఆత్మాభివ్యక్తి అసమర్థత, అపవర్తనము, లేక పాక్షిక ఆత్మదర్శన రూపమగు అనేక ఆకారములు ధరించును. ఎట్లన తమోగుణమునకు వశమై నపుడు, సత్తాశక్తి ఒక దుర్బలసంకరము నందు, ప్రబల అసమర్థతయందు, అజ్ఞానశక్తుల అంధయాంత్రికతకు ఆకాంక్ష అధీనత యందు పనిచేయును. తర్వాత రజోగుణము ప్రాబల్యము వహించి నపుడు, ఒక సంఘర్ష ముండును, ఒక ప్రయత్న ముండును, శక్తిసామర్థ్యముల ఒక వృద్ధి యుండును; అయితే ఈ వృద్ధియందు బాధాపతనము లుండును అసాధుభావములు, పద్ధతులు, ఆదర్శములవలన దారితప్పుట సంభవించును, విశేషించి అహంకారము

అధికముగా, పర్వత ప్రమాణముగా పెరిగిపోవు ప్రమాద ముండును. చివరకు, సత్త్వగుణము ప్రాబల్యము వహించి నపుడు, పూర్వాధికముగా సమరసక్రియ యుండును, ప్రకృతితో యథోచిత వ్యవహార ముండును; అయితే వైయక్తికప్రకాశము యొక్క పరిమితులు మఱియు మానసిక సంకల్పజ్ఞానముల పరిమితసామర్థ్యము - వీని పరిధిలో మాత్రమే 'యథోచితము,' ఈ చిక్కునుండి తప్పించుకొనుటయే, అజ్ఞానము, అహంకారము మఱియు గుణములపై కెగయుటయే దివ్యపరిపూర్ణతకు ప్రథమ, వాస్తవ సోపానము. అట్టి అతిక్రమణముచేత జీవుడు తన స్వీయ దివ్యప్రకృతిని, తన యథార్థసత్తను కనుగొనును.

9. ఆవృతవిభూతులు, వివృతవిభూతులు :

ఆధ్యాత్మిక చేతనయందలి విముక్త జ్ఞాననేత్రము ప్రపంచము నపేక్షించు నపుడు సంఘర్షశీల నిమ్నప్రకృతిని మాత్రమే చూడదు. ప్రకృతియొక్క బాహ్య ఆభాససత్యమునే మనము చూతు మేని, అది అజ్ఞాననేత్రముయొక్క చూపు గావున, అన్నింటియందు సమముగా నున్న భగవంతుని జూడజాలము - సాత్త్విక, రాజసిక, తామసప్రాణి యందు, మఱియు దానవుని యందు, దేవదానవులందు, పుణ్యాత్మపాపాత్ములందు, పండితపామరులందు సమముగా నున్న భగవంతుని జూడజాలము. కాగా ముక్తదృష్టి ప్రాకృతజీవుని సమస్త గుప్తసత్యముగా ఏకకాలమున మూడు వస్తువులను జూచును. అది మున్ముందు అన్నింటియందును గుప్తముగా నుండి, వికాసార్థము వేచియున్న దివ్యప్రకృతిని జూచును; సర్వవస్తువులయందును ఈమెయే వాస్తవశక్తి యని, నానావిధ గుణము మఱియు శక్తుల బాహ్యక్రియకు మూల్యము కట్టున దీమెయే యని చూచును, మఱియు విముక్తదృష్టి బాహ్యఘటనల అర్థమును అహంకారభాషలో గాక, దివ్య ప్రకృతిప్రకాశమున ఆకళించుకొనును. అందుచేతనే, రెండవదిగా, దేవదానవు లందును, పశుమానవులందును, పండితపామరులందును బాహ్యక్రియ యొక్క భేదములను జూచినను, విముక్తదృష్టి వానిని ఈ పరిస్థితులయందును, ఈ తెరల మఱుగున జరుగు దివ్యగుణము మఱియు శక్తియొక్క క్రియగానే చూచును. అది వేషమును జూచి మోసపోదు, పరంతు ప్రతివేషము వెనుకను భగవంతునే పసికట్టును. ఆ దృష్టి భ్రష్టాచారము లేక అపూర్ణతను గుర్తించును గాని, వానిని భేదించుకొని వెనుకనున్న మూలసత్యమును జూచును, అది ఆ సత్యమును భ్రష్టాచారము మఱియు అపూర్ణతయందు సైతము కనుగొనును; నిజాని కీ అపూర్ణత

ప్రస్తుతము తన స్వరూపముపట్ల గ్రుడ్డిదియై, దానిని కనుగొన ప్రయాసపడుచు, అనంతము, నిరపేక్షము నగు తన స్వరూపము దిశగా పయనించు వస్తువే గదా. విముక్తచక్షువు భ్రష్టాచారము మఱియు అపూర్ణతకు విపరీతప్రాముఖ్య మివ్వదు, అది సర్వమును హృదయమునందు సంపూర్ణ దయాప్రేమలతోను, బుద్ధియందు సంపూర్ణ అవగాహనతోను, ఆత్మయందు సంపూర్ణసమతతోను వీక్షించగలుగును. చివర కీ విముక్తదృష్టి భగవంతుని దిశగా ఉద్యమించుచున్న అస్తిత్వ - సంకల్పము యొక్క శక్తుల ఊర్ధ్వముఖ సంవేగమును గాంచును; అది శక్తి మఱియు గుణముయొక్క సమస్త సమున్నత అభివ్యక్తులను ఆదరించును, ఆహ్వానించును, ప్రోత్సహించును - దేవత్వముయొక్క సముజ్జ్వల తేజములను, నిమ్నప్రకృతినుండి ఉద్ధరింపబడిన అంతరాత్మ, మనస్సు, ప్రాణముల ఆరోహణశీల మహత్త్వములను అది ఆదరించును; అవి అందుకొనుచున్న ప్రకాశమయ ప్రజ్ఞాజ్ఞానములను, మహాశక్తిసామర్థ్యములను, ధైర్యసాహసములను, దయామాధుర్యమును, ప్రేమవైభవమును, ఉత్కృష్టగుణమును, సమ్మోహకసౌందర్యమును విముక్తచక్షువు అభినందించును. ఈ ఆత్మనేత్రము మహావిభూతియందు ఉదయించుచున్న మానవుని దేవత్వమును చూచి, దాని వైశిష్ట్యమును గుర్తించును.

10. శక్తిరూపమున భగవంతుడు :

ఇది శక్తిగా భగవంతుని పరిగణన యగును - తన విశాలతమార్థమున శక్తిగా; శక్తి యన బలశక్తియే గాక, జ్ఞానశక్తి, ఇచ్ఛాశక్తి, ప్రేమశక్తి, కర్మశక్తి, పవిత్రతాశక్తి, మాధురీశక్తి, సౌందర్యశక్తియు నగును. భగవంతుడు సత్తు, చిత్తు, ఆనందము; మఱియు సమస్తము నీ మూలము నుండి వెలికి దూకి, సత్తాశక్తిచేతను, చేతనాశక్తిచేతను, ఆనందశక్తిచేతను తిరిగి తననుదాను కనుగొనును. ఇది దివ్యశక్తియొక్క కర్మలచే నేర్పడిన ప్రపంచము. ఈ శక్తి ఇచ్చట అసంఖ్యావిధము లగు భూతములుగా తనను రూపొందించుకొనును, మఱియు ప్రతిభూతము ఆమె సామర్థ్యవిశేషములగు తన స్వీయ, స్వాభావికశక్తులను గలిగియుండును. హరిణము నందలి శక్తివలె సింహమునందలి శక్తియు, దేవుని యందలి శక్తివలె దానవునియందలి శక్తియు, సచేతనమానవునియందలి శక్తివలె నిశ్చేతన సూర్యునియందలి శక్తియు - ప్రతిశక్తియు ఆరూపముననున్న భగవంతుడే. గుణములు గల్గించిన వికారము వస్తువుయొక్క గౌణరూపమే గాని, నిజానికి ముఖ్య రూపము గాదు; స్వీయాభివ్యక్తిని

సాధించుకొనుచున్న దివ్యశక్తియే ముఖ్యరూపము. మహామనీషి, వీరుడు, మహాగురువు, జ్ఞాని, మహాకళాకారుడు, మహావైజ్ఞానికుడు, తపోమయ ఆత్మదమయిత, వస్తువులు, ఘటనలు, శక్తుల బాహ్యదమయిత – అందరి యందును తన నభివ్యక్తము చేసికొనుచున్న దా భగవంతుడే. పోగా ఉత్తమకావ్యము, పరిపూర్ణ సౌందర్యరూపము, గభీరప్రేమ, ఉదాత్తకర్మ, దివ్యలాభము–ఇట్టి కర్మ స్వయముగా ఆ భగవంతుని కర్మయే.

11. విభూతిదృష్టి వీరపూజ కాదు :

ఈ సత్యమును ప్రాచీన సంస్కృతులన్నియు గుర్తించి, గౌరవించినవి. కాని ఆధునికమనస్సుయొక్క ఒక పార్శ్వమునకు ఈ భావముపట్ల విచిత్రవిముఖత గలదు, అది ఈ భావమునందు కేవలబలము యొక్క పూజనే చూచును; అజ్ఞానమయ లేక ఆత్మభ్రంశక వీరపూజనేచూచును, అథవా ఆసురికాతిమానవుని సిద్ధాంతమునే చూచును. ఏ సత్యము నైన స్వీకరించు నొక అజ్ఞప్రకార మున్నట్లే, ఈ సత్యమును స్వీకరించు నొక అజ్ఞప్రకారమును గలదు; దివ్యమగు ప్రకృతివిధానమునందు దీనికి తన సముచితస్థానమునను, దృక్కోణమునను పెట్టును. సర్వమానవులందును, సర్వజీవులందును గల దివ్యాత్మ పరిగణనపై దీని నాధారపర్చవలెను; పెద్ద మఱియు చిన్న, సుప్రసిద్ధ మఱియు అప్రసిద్ధ అభివ్యక్తిపట్ల సమానహృదయముతో ఈ సత్యము సంగతముగావలెను. అజ్ఞుడు, దీనుడు, దుర్బలుడు, నీచుడు, బహిష్కృతులయందు భగవంతుని చూచి, ప్రేమించవలెను. విభూతియగు వానియందు సైతము గుర్తించి, గౌరవించవలసినది, ఒక సంకేతముగా తప్ప, బాహ్య వ్యక్తిని గాదు, ఆ శక్తిరూపమున తనను ప్రకటించుకొనుచున్న భగవంతుని. కాని అన్నింటియందును భగవంతుడు గల డను సత్యము అభివ్యక్తియందు ఒక ఆరోహణ క్రమము గలదను తథ్యమును నిరాకరించదు; ఈ ఆరోహణక్రమము ననుసరించియే ప్రకృతి తన అంధకారమయ సంకేతములనుండి భగవంతుని ప్రత్యక్షముగా ప్రకటించు దశవఱకు పై కెగయును. ప్రతి మహాపురుషుడును, ప్రతి మహాకార్యమును ఆమె యొక్క ఆత్మాతిక్రమణశక్తికి ఒక చిహ్నము, మఱియు చరమ, పరమ అతిక్రమణమునకు ఒక ఆశాజ్యోతి. పశుమానవులయందు ఒకే "సమబ్రహ్మము" (5–19) ఉన్నప్పటికి, మానవుడు ప్రాకృతాభివ్యక్తియొక్క ఒక శ్రేష్ఠతర సోపానము. కాని మానవుడును తన ఆత్మాతిక్రమణముయొక్క అత్యున్నత శిఖరముల నింకను అందుకొనలేదు, మఱియు న ట్లందుకొను దనుక ఆరోహణసంకల్పమునకు గల మహాశక్తియొక్క ప్రతిసూచనను

ఒక ఆశాకిరణముగా, ఒక సంకేతవిశేషముగా మనము గుర్తించవలెను. కొందరు మహామార్గదర్శకులు అతిమానవత దిశగా వేసిన అడుగులద్వారా తక్కిన మానవులకు దారిచూపుదురు; వారి అడుగుజాడలను మనము కన్నెత్తి చూచి నపుడు, అందరి యందును గల భగవత్తత్త్వముపట్ల మన గౌరవము నది తగ్గించకపోగా, దానిని పెంపొందించి, దాని కొక సంపన్నతరార్థమును సమకూర్చును.

12. సామాన్యమానవుడు - విభూతిమానవుడు :

అర్జునుడు స్వయముగా ఒక విభూతి; అతడు ఆధ్యాత్మిక పరిణామమున ఒక ఎత్తైన మానవుడు, తన సమకాలికు లలో ఒక విశిష్టరూపము, మానవులందరి హృదయస్థనారాయణుని యొక్క ఒక అభీష్ట ఉపకరణము. ఒకచోట దివ్యగురువు అందరియొక్క పరమ, సమ ఆత్మగా భాషించుచు, తనకు ప్రియుడు గాని, ద్వేష్యుడు గాని లేడని ప్రకటించును (9-29); కాని యితరస్థలములందు (4-3. 18-64,65), అర్జునుడు తనకు ప్రియుడు మఱియు భక్తు డనియు, కావున తనచే పరిచాలితుడు మఱియు రక్షితు డనియు, దివ్యదర్శనమునకును, జ్ఞానమునకును ఎన్నిక చేయబడినాడనియు భగవంతుడు చెప్పును. ఇచ్చట విరోధాభాసము మాత్రమే కలదు. విశ్వముయొక్క ఆత్మరూపమున పరమశక్తి (భగవంతుడు) సర్వసముడు, కావున ప్రతివానికి తన ప్రకృతిక్రియల కనురూపము గానే యిచ్చును; కాని మానవజీవునితో పురుషోత్తమునికి ఒక వైయక్తికసంబంధ మును గలదు, దీనినిబట్టి తన దగ్గరకు వచ్చిన మానవునికి తాను విశేషించి దగ్గరగా నుండును (9-29). కురుక్షేత్రమున యుద్ధార్థము గుమిగూడిన ఈ వీరశూరులు, మహారథు లందరు దివ్యసంకల్పమునకు పాత్రములు, మఱియు ప్రతివానిద్వారా భగవంతు డతని ప్రకృతిని బట్టి పనిచేయును. కాని అహంకారముయొక్క తెరవెనకనుండి. కాని అర్జును డొక ఉచ్చస్థానమును చేరుకొనెను, అచ్చట తెరను భేదించి, దేహధారి భగవంతుడు తన విభూతికి తన కార్యశైలి రహస్యమును ప్రకటించవచ్చును. ఇట్టి ప్రకటన ఆవశ్యకము గూడను. ఏలన అర్జును డొక మహా కార్యమున కుపకరణము, ఆ కార్యము చూచుటకు భయంకరమైనను, జాతియాత్ర యందు ఒక పెద్ద ముందంజ యగును, ధర్మరాజ్య స్థాపనకు ఒక నిశ్చాయక చర్య యగును. మానవుని యుగచక్రముల చరిత్ర మానవజాతి ఆత్మయందును, జీవనము నందును భగవదావిష్కరణ దిశగా సాగు ఒక పురోగతియై యున్నది; ఆ చరిత్ర యొక్క ప్రతి

మహాఘటనయు, దశయు భగవంతుని ఒక అభివ్యక్తి. రహస్య సంకల్పముయొక్క ముఖ్యోపకరణము, ప్రముఖ నాయకుడు నగు అర్జునుడు తన పని దివ్యకర్మ యని తెలిసికొని, చేయగల దివ్యమానవుడు గావలెను. అపుడే ఆ కర్మ మానసికముగా సజీవము కాగలదు; తన ఆధ్యాత్మికమహత్త్వమును, తన రహస్యాశయముయొక్క తేజఃశక్తులను బొందగలదు. ఆత్మజ్ఞానము బొంద అర్జునునికి పిలుపు వచ్చినది (4-34); అతడు భగవంతుని విశ్వేశ్వరునిగా చూడవలెను (10-3), సర్వభూతములు మఱియు ఘటనల ఆదిగా చూడవలెను (10-20). అన్నింటిని ప్రకృతియందు భగవంతుని స్వీయప్రకటనముగా జూడవలెను (10-39), అన్నింటియందు భగవంతుని, తన మానవరూపముననను, తన విభూతిరూపముననను (10-37) భగవంతుని జూడవలెను, సత్తయొక్క నిమ్నస్తరములందును, ఉచ్చస్తరములందును శిఖరాగ్రముననను భగవంతుని జూడవలెను, చివరకు మానవుని సైతము ఉచ్చస్తరము లందు విభూతిగను, పరమవిముక్తి మఱియు సంయోగమునందు చరమశిఖరముల కెగబ్రాకుచున్న వానిగను జూడవలెను. ఉత్పత్తి, వినాశముల గావించు కాలమును, తాను వేయు అడుగులయందు భగవంతుని మూర్తిగా జూడవలెను (11-32) - ఈ అడుగులు విశ్వముయొక్క చక్రగతిని నిర్వర్తించును, ఈ చక్రగతియొక్క ఉచ్చస్థానమందు మానవదేహమునందలి దివ్యాంశము భగవంతుని విభూతిగా ప్రపంచమున భగవత్కర్మ చేయుచు, పరమ అతీతత్త్వములను ప్రాపించును. ఈ జ్ఞానము ప్రసాదించబడినది; భగవంతుని కాలరూప మిపుడు ఆవిష్కరింపబడ నున్నది, మఱియు నా రూపముయొక్క శతసహస్రముఖములనుండి తన నియుక్త కర్మను జేయ విముక్తవిభూతికి (అర్జునునకు) ఆదేశము వెలువడును (11-33).

10. విశ్వపురుషదర్శనము

సంహారస్వరూప కాలుడు

1. యోగేశ్వర దర్శన మపేక్షించి :

విశ్వపురుషదర్శనము గీతయందలి మిక్కిలి ప్రసిద్ధము, అత్యంతకావ్యమయము నగు ప్రకరణములలో నొకటి, కాని గీతావిచారణ యందు దీని స్థానము పూర్ణముగా పైకి గానరాదు. స్పష్టముగానే యిది యొక కావ్యమయసంకేతముగా నుద్దేశించబడినది; కావున అది ఎట్లు ప్రవేశపెట్టబడెనో, ఏ ప్రయోజనార్థమో - మనము చూడవలెను, అటులే అది తన మార్మికాంశములందు దేనిని సూచించునో - కనుగొనవలెను; అప్పుడే ఈ ప్రకరణార్థము పట్టువడును. అదృష్టభగవంతునియొక్క సజీవరూపమును, ప్రత్యక్ష మహత్తను, జగత్తును పాలించు సత్తాశక్తులయొక్క సాక్షాన్మూర్తిని అర్జునుడు చూడ బ్రార్థించును. సర్వము భగవంతు నుండియే (11-2), సర్వము భగవంతుడే, సర్వమునందును భగవంతు డప్రకటముగా నివసించును, అయితే ప్రతిపరిమిత రూపము నందును అతడు ప్రకటము కాగలడు; ఇదియే పరమ ఆధ్యాత్మికరహస్యము, దీని నర్జునుడు వినియున్నాడు. భగవంతునుంచి వేఱుగా వస్తువులు తమలోదామే, తమ కొఱకే వర్తించును - అను భ్రమ, అథవా ప్రకృతికి అధీనమగు వస్తువు స్వయం చలితము, స్వయంచాలితము కాగలదు - అను అభిప్రాయము : మానవుని సదా పట్టియుండు ఈ భ్రమాభిప్రాయము లిపుడు అర్జునుని విడిచిపోయినవి - ఇవియే అతని సందేహసమ్మోహములకును, కర్మనిరాకణమునకును ఆదిలో కారణము. భూతముల రాకపోకలయొక్క (11-2) ఆంతర్యము నిపు డతడు గ్రహించి యున్నాడు. భగవంతుని సచేతనాత్మయొక్క అవ్యయమాహాత్మ్యమే (11-2) సర్వదృశ్యముల రహస్య మని అతని కిపుడు తెలియును. సర్వము వస్తువులయందు నివసించు ఈ మహాసనాతనపురుషుని ఒక యోగమే, మఱియు సర్వఘటనలు ఆయోగము (శక్తి) యొక్క ఫలితము మఱియు ప్రకటనము; సమస్తప్రకృతి నిగూఢ భగవంతునిచే నిండియున్నది, మఱియ నతని ప్రసవింప ప్రయాసపడుచున్నది. సాధ్యమగుచో, ఈ దివ్యపురుషుని రూప, శరీరములను అర్జునుడు చూడనుగూడ చూడగోరును (11-3). అర్జును డతని విభూతులను వినియున్నాడు, అతని స్వీయ ప్రకటనము యొక్క సోపానములను, ప్రకారములను వినియున్నాడు (10-5, 6); కాని ఇపు డర్జునుడు (విభూతులను గాక) సాక్షాత్తు తన అవ్యయాత్మనే యోగ

నేత్రమునకు చూపింప యోగేశ్వరుని బ్రార్థించును (10-4). స్పష్టముగానే, ఈ ఆత్మ నిరాకారమగు అక్షరాత్మ గాదు, పరమాత్మ - ఈ పరమాత్మనుండియే సమస్త శక్తియు, క్రియయు వచ్చును, రూపము లితని ముసుగులే, ఇతడే విభూతులయందు తన శక్తి నావిష్కరించును, ఇతడే కర్మప్రభువు, భక్తిజ్ఞానముల ప్రభువు, ప్రకృతి మఱియు సర్వభూతముల ప్రభువు. ఈ మహత్తమ, సర్వతోముఖదర్శనార్థము తనను ప్రార్థింప అర్జునుడు ప్రేరితుడగును; ఏలన అటుల విశ్వమునందు ఆవిష్కృతుడైన పరమ పురుషునుండియే ప్రపంచకర్మ యందు తన పాత్రను నిర్వహింప అర్జును డాదేశమును స్వీకరించవలెను (11-33).

2. కేంద్రమర్మము ఏకత్వము :

నీవు చూడవలసిన విశ్వరూపమును, అవతారము సమాధానించును (11-8), మానవనేత్రము చూడజాలదు - ఏలన అది వస్తువుల బాహ్యరూపములను మాత్రమే చూడగలదు, లేక వానినుండి కొన్ని సంకేతములను నిర్మించుకొని, ప్రతిసంకేతము ద్వారా సనాతన గుహ్యముయొక్క కొన్ని ముఖములను మాత్రమే ఊహించుకొన గలుగును. కాని ఒక దివ్యచక్షువు, ఆంతరతమదృష్టి గలదు (11-8), దీనిచే తన దివ్యయోగయుతుడైన పరమేశ్వరుని జూడవచ్చును, ఆ చక్షువును నీ కిచ్చుచున్నాను. నానావిధములు, నానారూపములు, నానావర్ణములు నగు నా దివ్యరూపములను వందల, వేల సంఖ్యలలో చూచెదవు (11-5)-అని భగవానుడు చెప్పును; ఆదిత్యులు, రుద్రులు, మరుత్తులు, అశ్వినులను చూచెదవు (11-6); ఎవ్వరును జూడని అనేకాద్భుతములను వీక్షించెదవు; నా దేహమునందు సంఘటితము, ఏకీభూతము నగు సమస్తప్రపంచమును నేడు దర్శించెదవు, నీవు చూడగోరు నితరము నంతను చూచెదవు (11-7). ఇంతకు, నిదియే ముఖ్యస్వరము, కేంద్రమర్మము. అది అనేకము నందు ఏకముయొక్క, ఏకమునందు అనేకముయొక్క దర్శనము - మఱియు అనేకము ఏకమే. ఈ దర్శనమే యోగనేత్రమునకు వర్తమానమును విడిపించును, గతమును సమర్థించును, భవిష్యమును వివరించును. ఎట్లన, ఒకసారి దీనిని చూచి, ధరించి నపుడు, ఇది సర్వసందేహములు మఱియు సమ్మోహముల వేళ్లను భగవంతుని భాసురపరశువుతో నఱికివేయును, అటులే సమస్తనిషేధములు మఱియు విరోధములను ధ్వంసమొనరించును. ఇది సమన్వయమును, ఏకతను సాధించు దర్శనము. అంతరాత్మ ఈ దర్శనమునందు విశ్వపురుషునితో ఏకముకాగలిగినచో, ప్రపంచమున భయంకరవస్తువు సైతము మనను భయపెట్టదు - అర్జును డింకను

ఏకత్వము బొందలేదు గాన, విశ్వరూపమును జూచుచు భయపడును. ఏలన అదియు భగవంతుని ఒక రూపముగనే గన్పించును, మరియు దానిని దానినిగా మాత్రమే చూడక, దానిలో నొకసారి ఈ అర్థమును గాంచినపుడు, మనము సమస్తసృష్టిని సర్వాలింగక ంతోషముతోను, మహాధైర్యముతోను స్వీకరించగలము, నియుక్తకార్యము చేయ ధృఢపదములతో ముందుకు పోగలము, సృష్టి కావల పరమసిద్ధిని ఆలోకించగలము. సర్వవస్తువులను అఖండదృష్టిలో చూచు దివ్యజ్ఞానము లోనికి ప్రవేశపెట్టబడిన అంతరాత్మ ప్రపంచము యొక్క నూతనదర్శనమును బొందగలదు; సర్వ-సంబంధసాధకము, సర్వ-ఏకతా సాధకమునగు ఈ దృష్టి ననుసరించి, అది పూర్ణతరావిష్కరణమునుండి పూర్ణతమా విష్కరణమునకు పయనించగలదు.

3. "ఆది లేదు, అంతము లేదు" :

పిమ్మట పరమరూపము దృగ్గోచరము చేయబడును. అది అనంతపురుషుని రూపము, అతని ముఖములు అన్నివైపుల గలవు, అతనిలో సర్వాశ్చర్యములు గలవు (11-11), అతడు తన సత్తయొక్క అనే కాద్భుత విషయములను అనంతముగా జూపును. ఆ విశ్వవిశాలపురుషుడు అనేక నయనములతో జూచును, అసంఖ్య ముఖములతో పలుకును (11-10); ఎత్తిపట్టిన అనేకదివ్యాయుధములతో యుద్ధసన్నద్ధుడు, దివ్యాభరణములతో శోభామయుడు, దివ్యాంబరములతోను, దివ్యసుమములతోను మనోహరుడు, దివ్యగంథములతో సువాసితుడు. వేయి సూర్యులు ఒకేసారి ఉదయించినంత తేజోమయ మతని శరీరము (11-12) : సమస్త ప్రపంచము అనేకముగా విభక్తమయ్యును, ఆ దేవదేవుని శరీరమునందు ఏకీ భూతమై గోచరించును (11-13). అర్జునుని దృష్టి కా భగవంతుడు మహానుభావుడు మఱియు సుందరుడు మఱియు భయంకరుడు, అతడు జీవేశ్వరుడు, అతడు తన మహిమయందును, మహత్త్వమునందును అక్రమము మఱియు సక్రమము, ఘోరము మఱియు అద్భుతము, సౌమ్యము మఱియు ఉగ్రము నగు ఈ ప్రపంచము నభివ్యక్తము చేసినాడు; అట్టి అతనిని గాంచి, విస్మయ భయ హర్షములకు వశుడై, నమస్కరించి, చేతులు జోడించి, అర్జునుడు సంభ్రమవచనములతో ఆ మహారూపము నిట్లు స్తుతించును (11-14) - "నీ శరీరమున, ఓ దేవాధిదేవా, సర్వదేవులను జూచుచున్నాను; భూతసంఘములను, కమలమునం దాసీనుడైన బ్రహ్మదేవుని, ఋషులను, దివ్యనాగులను వీక్షించుచున్నాను (11-15). అసంఖ్య బాహువులను, ఉదరములను, నేత్రములను, ముఖములను జూచుచున్నాను,

ప్రతివైపున నీ అనంత రూపములను జూచుచున్నాను, కాని నీ అంతమును గాని, మధ్యమును గాని, ఆదిని గాని చూచుట లేదు (11-16). నీవు కిరీటధారివి, గదాచక్రధారివి. నీవు దుర్నిరీక్ష్యుడవు; కారణము, నా నలువైపుల తేజోరాశివిగా భాసించుచున్నావు, అగ్నివలె, సూర్యునివలె జ్వలించుచున్నావు. నీ వప్రమేయుడవు (11-17). నీవు తెలియదగిన పరమ అక్షరమవు, నీవు విశ్వమునకు సమున్నతాధారము మఱియు ధామము, నీవు సనాతనధర్మముల అవ్యయరక్షకుడవు, నీవు విశ్వమునందలి సనాతన పురుషుడవు (11-18)".

4. భయంకరపార్శ్వము :

కాని ఈ మహారూపమునందు సంహారకర్త యొక్క ప్రతిమయు గలదు. ఈ అప్రమేయునికి ఆది, మధ్యము, అంతము లేవు, కాని సర్వవస్తువులకు ఇతనియందు ఆది, మధ్య, అంతములు గలవు. విశ్వమును తన అసంఖ్యాబాహువులతో ఆలింగనము చేసికొను నీ భగవంతుడు తన అసంఖ్యహస్తము లతో నాశముచేయును గూడ; ఇతని నేత్రములు చంద్రులు మఱియు సూర్యులు, ఇతని ముఖము జ్వలించుచున్న అగ్ని, ఇతడు తన తేజోజ్వాలలచే విశ్వము నంతను దహించివేయుచున్నాడు (11-19). అతని రూపము ఉగ్రము, అద్భుతము, అది యొక్కటియే సర్వదిశలను, అంతరిక్షమును నింపియున్నది (11-20). సురసంఘములు భయపడుచు, స్తుతించుచు, దానిలో ప్రవేశించుచున్నారు; ఋషులు, సిద్ధులు స్వస్తి చెప్పుచు, దానిని పుష్కలస్తవములతో స్తుతించుచున్నారు (11-21). దేవతలు, దానవులు, యక్షులు దానిని విస్మితచక్షువులతో వీక్షించు చున్నారు (11-22). దాని నేత్రములు అతివిశాలములు, ప్రదీప్తములు (11-24), దాని ముఖములు తెఱచుకొని, మ్రింగనుంకించుచున్నవి, అవి కోఱలతో భీతిగొల్పుచున్నవి, దాని ముఖములు కాలాగ్నిసదృశములు (11-25). ప్రపంచయుద్ధముయొక్క ఉభయపక్షాలలోని రాజులు, నాయకులు, వీరులు కోఱలతో భీషణముగా నున్న ముఖములలోనికి వేగముతో ప్రవేశించుచున్నారు (11-26, 27), మఱియు కొందరు శక్తిరూపదంష్ట్రల మధ్య నలిగి రక్తము స్రవించుచున్న మస్తకములతో కంటి కగపడుచున్నారు. జాతులకు జాతులే వివశవేగముతో, సముద్రములో నదుల రీతిని అగ్నిలో శలభముల మాడ్కిని, ఆ జ్వాలాముఖములలోనికి దూకుచున్నారు (11-28,29). ఆ ప్రజ్వలితముఖములతో భయంకర కాలరూపము నలు దిశలను నాకుచున్నది (11-30); విశ్వ మంతయు అతని ప్రదీప్తతేజములతో నిండి, అతని మహోగ్రప్రభలతో కాలుచున్నది.

ప్రపంచము, దాని జాతులును భయముతో కంపించి, వ్యథాగ్రస్తులగుచున్నారు (11-23) తనను చుట్టియున్న ఈ భయకంపములకు అర్జునుడును గుఱియయ్యెను. ఇట్లు తనయందలి ఆత్మ వ్యథితము, క్షుబ్ధము కాగా, అతనికి శాంతిసుఖములు దూరమయ్యె ను. అపు డా భయంకర భగవంతుని కిట్లు మొరపెట్టుకొనును : "ఈ ఉగ్రరూపము ధరించియున్న నీ వెవరివో తెలుపుము. నీకు నమస్కారము, దేవదేవ! ప్రసన్నుడవు కమ్ము. ఆది నుండియు నున్న నిన్ను తెలియగోరెదను, ఏలన నీ ప్రవృత్తి నా కంతుబట్టుట లేదు" (11-31).

5. భారతీయమత సమగ్రత :

అర్జునుని ఈ చివరి మొఱ ఈ దర్శనమునందలి ద్వివిధ ఉద్దేశ్యమును సూచించును. ఇది పరమ విరాట్పురుషుని రూపము, ఇతడు సనాతన పురాణ పురుషుడు (11-18). సదా సృజించువా డితడే; ఏలన సృష్టి కర్తయగు బ్రహ్మ ఇతని తనువులో జూడబడిన ఒక దేవత మాత్రమే. ఈ లోకమును సదా నిలుపు వాడును ఇతడే; ఏలన ఇతడు శాశ్వతధర్మముల సంరక్షకుడు (11-18). కాని లోకమును సంహరించువాడును ఇతడే (11-32), అయితే ఈ సంహారము పునఃసృష్టి నిమిత్తము; ఈ రూపమునం దితడు కాలస్వరూపుడు, మృత్యుదేవత, సౌమ్య, రౌద్ర నృత్యముచేయు తాండవరుద్రుడు, పుఱ్ఱెల దండను ధరించి, ఖండించబడిన అసురుల రక్తమును పూసికొని, నగ్ననృత్యముచేయుచు, సంగ్రామరంగమున విజృంభించు కరాళకాళియు నగును. అటులే అతడు ఝంఝామారుతము, ప్రళయాగ్ని, భూకంపము, బాధాక్షామ విప్లవ వినాశములు, ప్రళయ సాగరము. ఇపు డీ రౌద్రపార్శ్వమునే అతడు ప్రదర్శించుచున్నాడు. ఈ పార్శ్వము నుండియే మానవ మనస్సు బుద్ధిపూర్వకముగా వెనుదిరిగి, నిప్పుకోడివలె తన తలను దాచుకొనును, తాను భయంకరుని చూడనపుడు, భయంకరుడు తనను చూడ డని పాపము, దాని అభిప్రాయము : దుర్బల మానవహృదయము సుందర సుఖప్రద సత్యములనే కోరును, అవి లేనపుడు శ్రవణప్రియ కథల నపే క్షించును, అది సత్య సమగ్రతను గోరదు; కారణము, స్పష్టము, సుఖదము గానిదియు, దుర్జ్ఞేయము, దుస్సహ మగునదియు అచ్చటెంతో యుండును. అపక్వమతవాది, పైపై ఆశావాది, భావుక ఆదర్శవాది, ఇంద్రియసంవేదనలకు, హృదయావేగము లకు దాసుడైన వాడును విశ్వజీవనముయొక్క కఠోరతరనిర్ణయములనుండియు, ఉగ్రతరరూపములనుండియు మఱలిపోవుటయం దేకీభవింతురు. వీరందరు భారతీయమతమును అజ్ఞముగా

నిందింతురు ; కారణము, తలదాచుకొను ఈ ఆటలో భారతీయమతము పాల్గొనదు, పైగా నది భగవంతుని మధుర సుందరరూపములను వలెనే భయంకరరూపములను గూడ దర్శించి, మనముందుంచినది. ఆ మతము యొక్క సుదీర్ఘ విజ్ఞానము, మఱియు ఆధ్యాత్మికానుభవముయొక్క గభీరతావిశాలతలే ఈ దుర్బలవైముఖ్యములను సమర్థించుటయందు తన కడ్డుతగులును.

6. రౌద్రమువెనుకను భగవంతుని సుందరముఖము :

భగవంతుడు ప్రేమ, శాంతి, నిర్మలనిత్యత యని భారతీయ ఆధ్యాత్మికతకు దెలియును - అతని ఈ దారుణరూపములను మనముం దుంచు గీతయే అతడు ప్రేమికు డనియు (18-65), సర్వభూతసుహృదు డనియు (5-29) చెప్పును. అయితే అతని దివ్య ప్రపంచ శాసనమున కొక కఠోరపార్శ్వమును గలదు - వినాశపార్శ్వము; కాగా దీని నుపేక్షించుట యన దివ్యప్రేమాదుల పూర్ణసత్యతను అందుకొనలేకపోవుటయే యగును, మఱియు నా ప్రేమాదులకు పక్షపాతమును, మిథ్యాత్వమును అంటగట్టుటయే యగును - మిథ్యాత్వ మేలన, ఏ సుఖప్రద, ప్రత్యేక రూపము ప్రేమ కివ్వబడినదో, దానిని మనము నివసించు ప్రపంచప్రకృతి ఋజువుచేయదు. మన శ్రమ సంగ్రామముల నపేక్షించు నీ ప్రపంచము దారుణము, విపత్కరము, వినాశకరము, భక్షణశీలము నగు ప్రపంచము, ఇచ్చటి జీవనము సంశయగ్రస్తము, ఆత్మశరీరము లిచ్చట మహాపాయముల మధ్య చరించును; మనము వేయు ప్రతి అడుగున, మన మిచ్ఛించినను, ఇచ్ఛించకపోయినను, ఏదియో ఒకటి నలిగి నశించును, ఈ ప్రపంచమున ప్రతి జీవనశ్వాస ఒక మరణశ్వాసయు నగును. మన కనర్థముగా లేక భయంకరముగా గన్పించు దాని కంతటికి బాధ్యతను కొందరు అర్ధ - సర్వశక్తి మంతుడగు సైతానుపై నారోపింతురు, లేక దానిని ప్రకృతిలో నొక భాగముగా భగవంతునుంచి వేఱుచేతురు, ఇట్లు ప్రకృతి భగవంతునుండి స్వంతత్రమైనట్లు, ప్రపంచప్రకృతికిని, భగవత్ప్రకృతికిని మధ్య ఒక దాటరాని అఖాతమును కల్పింతురు; అథవా ఆ బాధ్యతను మానవుడు మఱియు నతని పాపములపైకి నెట్టుదురు; అనగా ప్రపంచనిర్మాణమున మానవుని మాటకే ప్రధానస్థాన మున్న దనియో; ఈశ్వరేచ్ఛకు విరుద్ధముగా నతడు దేనినైన సృజించగల డనియో దీని కర్థమగును : - ఇవి యన్నియు మందబుద్ధికి తృప్తి నిచ్చు ఉపాయములు, భారతీయుల మతవిజ్ఞానము వీనియందెపుడును శరణుబొందలేదు. మనము సత్యముఖములోనికి సూటిగా చూచి, మఱేదియు గాక, భగవంతుడే తన సత్తయం

దీ ప్రపంచమును నిర్మించె నని చూడదగును; నిజము కూడ నదియే. తన బిడ్డలను మ్రింగివేయు ప్రకృతి, ప్రాణుల ఆయువులను హరించు కాలము, సార్వత్రికము, అప్రతిహతము నగు మృత్యువు, మఱియు మానవునియందు ప్రకృతియందు గల రౌద్రశక్తుల సంరంభము - ఇవియు తన విశ్వరూపములలో ఒకానొక రూపమున భగవంతుడే యని మనము చూడదగును. ఉదారముగా సృజించు భగవంతుడే, దయతో పాలించు భగవంతుడే దారుణముగా భక్షించు భగవంతుడు గూడ నని చూడదగును. సుఖము, మాధుర్యము, సమ్మోదము నెంతగా నతని స్పర్శయో, బాధ మఱియు నశుభముల ముండ్లపఱుపుపై ననుభవించు యాతనయు అంతగాను అతని స్పర్శయే, సంపూర్ణ సంయోగరూపమగు నేత్రముతో జూచి, మన సత్తయొక్క లోతులలో నీ సత్యము ననుభవించి నపుడే, తన రౌద్రరూపము వెనుక సైతము సర్వానందమయ భగవంతుని ప్రశాంత సుందరవదనమును మనము పూర్ణముగా దర్శించగలము, అటులే మన అపూర్ణతను పరీక్షకు బెట్టు యాతనాస్పర్శ యందును మన అంతరాత్మ సుహృదుడు మఱియు నిర్మాతయొక్క స్పర్శనే చూరగొనగలము. ప్రపంచమునందలి అపస్వర ములు ఈశ్వరుని అపస్వరములే; కావున వాని నామోదించి, వానిద్వారా పురోగమించుటచేతనే అతని పరమసామరస్యము యొక్క అధికతర సుస్వరములను, అతని విశ్వాతీత, విశ్వమయ ఆనందముయొక్క సర్వోచ్ఛశిఖరములను, హర్షపులకిత విశాలతలను చేరుకొనగలము.

7. సమస్యాస్వరూపము :

గీత లేవదీసిన సమస్యయు, చూపిన పరిష్కారమును విశ్వపురుషుని దర్శనము యొక్క ఈ స్వభావము నపేక్షించును. అది ఒక మహాసంగ్రామ సంహారములకు సంబంధించిన సమస్య; ఇది సర్వ-చాలక భగవదిచ్ఛ చేతనే సిద్ధముచేయబడినది, ఈ సంగ్రామమున ప్రధానవీరుని సారథిగా సనాతనావతారమే దిగివచ్చినది. ఈ ప్రధానవీరుడే స్వయముగా విశ్వరూపద్రష్ట; ఇతడు, తన పరిణామ పథమున కడ్డువచ్చు క్రూర, పీడాకరశక్తుల చెండాడవలసిన వీర మానవాత్మ యొక్క ప్రతినిధి, చెండాడి ఉచ్ఛతర ధర్మముతో గూడిన రాజ్యమును స్థాపించి, భోగించవలెను. దేనియందు బంధువులు బంధువులనే ఖడ్గమున కెరజేతురో, జాతులు జాతులే నామావశిష్టము గానున్నవో, సమాజమంతయు సంకరము మఱియు అరాజకముల గర్తములో గూలిపోవుతున్నట్లు కన్పించుచున్నదో, అట్టి మహోపద్రవము యొక్క భయంకర రూపమునకు తల్లడిల్లిన ఆ వీరుడు వెనుకకు తగ్గి, తన దైవ నిర్దిష్టకర్మను నిరాకరించి,

"నన్నీ ఘోరకర్మయం దెందుకు నియోగించుచున్నావు? (3-1) - అని తన దివ్యసఖుని, గురువును నిలబెట్టి అడుగును. కాగా, తాను చేయవలసిన కర్మ ఏది యైనను, దాని బాహ్యస్వభావమునకు వ్యక్తిగతముగా తా నెట్లు అతీతుడు గావలెనో, కార్యనిర్వాహకశక్తియగు ప్రకృతియే కర్మకర్త్రి యనియు, తన ప్రాకృతసత్త ఉపకరణ మాత్రమే యనియు, భగవంతుడు ప్రకృతి మఱియు కర్మల అధీశ్వరు డనియు ఎట్లు చూడవలెనో, చూచి, కోరిక గాని, అహంకారముయొక్క ఎన్నిక గాని లేక ఆ కర్మల నొక యజ్ఞముగా నతని కెట్లు అర్పించవలెనో, అప్పు డర్జునునికి చూపబడెను. ఈ యే వస్తువులను అంటక, వీనికిపై నున్న భగవంతుడు, పైనుండియు, మానవుడు, ప్రకృతి మఱియు వాని క్రియలయందు తననుదా నభివ్యక్తము చేసికొనుచున్నా డనియు, సర్వము ఈ దివ్యాభివ్యక్తియొక్క చక్రగతియే యనియు గూడ అతనికి చూపబడెను. కాని ఇపుడు రూపము ధరించిన ఈ మహాసత్యము ముందు నిలబడి నపుడు, దాని దివ్యవిశాలతయందు బాహ్యయుద్ధముయొక్క భయంకరతను మఱింత ఎక్కువగా అర్జునుడు చూచును, భీతిచెందును, దానిని సహించలేకపోవును. విశ్వపురుషు డిట్లు ప్రకృతి యందు తననుదా నెందుకు అభివ్యక్తముచేసికొనవలెను? - అను సందేహ మతనిలో నుదయించును. సృష్టించుచు, భక్షించుచు నుండు ఈ మర్త్యజ్వాల, ఈ విశ్వవ్యాపి సంఘర్షము, ఈ విపత్కర పరివర్తనములు, ఈ ప్రయాస క్లేశములు, ఈ ప్రాణి వినాశము - దీని కంతకు అర్థ మేమిటి ? కావున నతడు ప్రకటముగా ప్రాచీనప్రశ్న వేయును, సనాతనప్రార్థన చేయును, "ఈ మహోగ్రరూపమున మాముందుకు వచ్చిన నీ వెవడివో తెలుపుము. ఆద్యుడవగు నిన్ను దెలియగోరు చున్నాను; ఏలన నీ యీ ప్రవృత్తిసంకల్ప మేమియో తెలియుటలేదు, ప్రసన్నుడవు కమ్ము (11-3)."

8. అంతిమ కర్మాదేశము :

వినాశమే, భగవంతుడు బదులు పలుకును, నా ప్రవృత్తి వెనుకనున్న సంకల్పము, ఈ సంకల్పముతోనే కురుక్షేత్రమున నిలబడి యున్నాను. ఈ కురుక్షేత్రము ధర్మసాధనక్షేత్రము. కావున మానవకర్మక్షేత్రమున కిదిసంకేత మని చెప్పుకొనవచ్చును - "ధర్మక్షేత్రే కురుక్షేత్రే" (1-1). కాలపురుషుని ప్రక్రియా ఫలితముగా ఈ ప్రపంచవ్యాప్త వినాశము ప్రాప్తించినది. నా కొక దూరదర్శి ప్రయోజనము గలదు, అది నెరవేరి తీరును, ఒకడు పాల్గొనినను, పాల్గొనకపోయి నను, అది ఆగదు, మాఱను గూడ మాఱదు. ఏ కార్య మైనను భువిపై మానవునిచేత ఏమాత్రము

చేయబడక పూర్వమే సనాతనమగు నా సంకల్పనేత్రము దానిని చేసియే యుండును. కాలరూపమున నేను పాత నిర్మాణములను పడగొట్టి, నవ్య, ప్రబల, భవ్యరాజ్యమును నిర్మించవలసియున్నది. పోగా దివ్య శక్తి జ్ఞానముల ఒక మానవోపకరణముగా నీవు, నీ వాపజాలని యీ సంగ్రామమున ధర్మముకొఱకు నడుముకట్టి, ధర్మవిరోధులను చంపి, జయించవలెను. ప్రకృతిలోని మానవాత్మవగు నీకు భోగము సైత ముండును - నాచే నొసంగబడిన ఈ యుద్ధఫలితమగు ధర్మన్యాయరాజ్యము నీ వుపభోగించ వలెను. నీ అంతరాత్మయందు భగవంతునితో నేకమగుట, అతని ఆదేశమును స్వీకరించుట, అతని సంకల్పము నిర్వహించుట, ప్రపంచమున ఒక పరమ ప్రయోజనము సిద్ధించుటను ప్రశాంతముగా గమనించుట - ఇదియే నీకు కృతార్థత గావలెను. "నేను లోకక్షయకరుడగు విజృంభించిన కాలుడను, జాతులను నాశము చేయుటయే ఈ ప్రవృత్తి (workings) యందలిఅట్టి నా సంకల్పము. నీవు లేకపోయినను శత్రుసైన్యమున నిలిచియున్న వా రెవరు బ్రతికి బయటబడరు (11-32). కావున లెమ్ము, యశమును బొందుము, శత్రువులను జయింపుము, సమృద్ధ రాజ్యము ననుభవింపుము. ఇతరులచేత గాక, నాచేతనే వా రిప్పటికే నిహతులైనారు. ఓ సవ్యసాచీ, నీవు నిమిత్తమాత్రము గమ్ము (11-33). నాచేత వధింపబడియే యున్న ద్రోణుడు, భీష్ముడు, కర్ణుడు, జయద్రథుడు మఱియు తక్కిన యోధవీరులను నీవు వధింపుము; బాధపడకుము, కలతజెందకుము, విజృంభించుము, ప్రత్యర్థులను రణమున జయించెదవు (11-34)." ఈ మహా ఘోరకర్మయొక్క ఫలితము ముందే చూడబడి, వాగ్దానముచేయబడినది. అయితే యిది వ్యక్తి వెంటదగిలిన ఫలితముగాదు, ఏలన ఇచ్చట ఫలాసక్తి లేదు; ఇది భగవదిచ్ఛ యొక్క ఫలితము, అతడు అప్పగించిన కర్మను సాధించినపుడు కలుగు యశోవిజయరూపము, భగవంతునిచేత తన విభూతిరూపమున తనకే ఇవ్వబడిన యశము. ఇది ప్రపంచయుద్ధము యొక్క ధర్మపక్షము వహించిన ప్రధానవీరునికి చివరిసారిగా నిచ్చిన అలంఘ్య కర్మాదేశము.

9. పురోగతికి వినాశ మావశ్యకము :

కాలము మఱియు ప్రపంచపురుష రూపమున అభివ్యక్తమైన కాలాతీతుడే ఈ కర్మాదేశము నిచ్చినవాడు. ఏలన "నేను లోకసంహారకుడనగు కాలుడను"-అని భగవంతుడు చెప్పినపుడు, తాను కాలపురుషుడు మాత్రమే యని గాని, కాలస్వరూప మంతయు వినాశమే యని గాని దాని అర్థము కాదు. పరంతు ఈ వినాశము తన

ప్రస్తుత ప్రవృత్తి మాత్రమే. వినాశము సదా సృష్టితో అడుగుకలిపి నడుచును; నాశముచేసి నవీకరించుటచేతనే ప్రాణాధీశ్వరుడు సుదీర్ఘమగు తన ప్రాణరక్షణ కర్మను సాగించును. ఇంకను వినాశము పురోగతికి ప్రథమనియమము. ఆంతరముగా, తన నిమ్న నిర్మాణములను భంగించని మానవుడు ఒక అధికతర జీవనము నందుకొన జాలడు. బాహ్యముగాసైతము, ఏ జాతి లేక సమాజము తన గత జీవనరూపములను నాశమొనర్చి, క్రొత్తవానిని నెలకొల్ప మితిమీఱి జాగుసేయునో, అది స్వయముగా క్రుళ్లి నశించును, మఱియు దాని శిధిలములతో ఇతరజాతులు, సమాజములు నిర్మించబడును. ఉదాహరణకు, పూర్వము భువిపై జీవించిన మహాకాయ జంతువులను సమాప్తము గావించి, మానవుడు భూతలముపై తన కొక స్థానమును సాధించుకొనెను. అటులే దేవతలు అసురులను ఖండించి, విశ్వమున భాగవత ధర్మమును అవిచ్ఛిన్నముగా సాగింతురు. తగిన కాలమునకు పూర్వమే ఎవడీ సంగ్రామ, వినాశ నియమమును దూరము చేయజూచునో, విశ్వపురుషుని అధికతర సంకల్పమునకు విరుద్ధముగా అతని చేష్ట వ్యర్థమే యగును. ఎవ డేని తన నిమ్నతర అంగముల దుర్బలతావశమున దానినుండి విముఖుడగునో, అతడు యదార్థ సుగుణమును గాక, కఠోరతర జీవన సత్యము నెదుర్కొనుటకు వలయు ఆధ్యాత్మిక ధైర్యముయొక్క అభావమునే జూపు చున్నాడు. అర్జును డాదిలో నిటులే చేసెను, కావున అతని వైముఖ్యము క్షుద్రమగు హృదయ దౌర్బల్యము గాను, ఆధ్యాత్మక నిర్వీర్యతగాను నిందించబడెను – "క్లైబ్యం, హృదయ దౌర్బల్యం" (2–3), మానవుడు అధికతరమగు తన అమరత్వనియమమును, కనుగొనుటద్వారానే సంగ్రామనియమము నతిక్రమించ గలడు. ఈ అమరత్వనియమ మెచ్చట సదా వర్తించునో, ఎక్కడ దీని నన్వేషించవలెనో, సత్తయొక్క అట్టి ఉచ్చతర భూమికలయందు దీని నన్వేషించు కొందరు మృత్యువు శాసించు నీ ప్రపంచమును సన్యసింతురు. ఇది ఒక వైయక్తిక పరిష్కారము, దీనివలన మానవజాతియందు గాని, ప్రపంచమునందు గాని ఎట్టి మార్పు రాదు; పైగా ప్రపంచ మా మేరకు కష్టతరమగు తన పరిణామప్రయాణములో తోడ్పడ గల ఆధ్యాత్మికశక్తిని కోల్పోయిన దగును.

10. రుద్రుని ఋణము తప్పదు :

అయినపుడు, కాలపురుషుడు మహా సంగ్రామరూపమున తారసిల్లి నపుడు శ్రేష్ఠమానవుడు, దివ్యకర్త, వైశ్వసంకల్పము యొక్క వివృతవాహిని ఏమి చేయదగును; తన స్వభావవేగముచేతనే, తనలోపలి శక్తిచేతనే అతడు యోధుడుగా ఆయుధము చేపట్టవలదా, మానవుల నాయకుడు మఱియు మార్గదర్శి లేక ప్రోత్సాహకుడు

గావలదా? వెనుతగ్గి, చేతులు ముడుచుకొని, దూరమునుండి యుద్ధమునకు తన విరోధమును దెలుపవలెనా? కాని యిట్టి విరమణము వలన నేమియు కాదు, అది సంహారసంకల్పముయొక్క పరిపూర్తిని ఆపజాలదు, పైగా శూన్యమును గల్పించి, గజిబిజినే అధికముచేయును, "ఋతే-పిత్వా" (11-32) - నీవు విరమించినను, భగవంతుడు ఎలుగెత్తి పలుకును, నా సంహార సంకల్పము సిద్ధించియే తీరును. ఒకవేళ అర్జునుడు విరమించినను, కురుక్షేత్ర యుద్ధమే జరుగకపోయినను, అది రానున్న సంకరమును అవ్యవస్థను, వినాశమును, కేవలము పొడిగించి, మఱింత విషమింపజేయును. ఏలన ఈ సంకరాదులు కాకతాళీయములు గావు, పరంతు నాటబడిన ఒక విత్తనము, కోసికొనక తప్పని ఒక పంట. ఎవరు చిన్న వాయుబీజము నాటుదురో, వారికి పెద్ద ఝుంఝూమారుతసస్యము ప్రాప్తించక తప్పదు. అంతే కాదు, అర్జునుని స్వీయస్వభావమే నిజానికి తాను కోరు వాస్తవవిరమణ కవకాశ మివ్వదు - "ప్రకృతిస్ త్వాం నియోక్ష్యతి" (18-59). భగవానుడు గీతాంతమున అర్జును నిట్లు హెచ్చరించును, "అహంకారావేశమున, నేను యుద్ధము చేయను - అని నీవు తలంచినను, ఆ నీ నిశ్చయము వ్యర్థము: ప్రకృతియే నిన్ను నీ కర్మకు కాడికి ఎద్దునువలె, కట్టగలదు (18-59). స్వీయ ప్రభావజన్యమై స్వీయకర్మచేతనే నీవు బద్ధుడవై, మోహమువలన దేనిని చేయ గోరవో, దానిని వివశముగా చేసితీరెదవు" (18-60). పోగా యుద్ధమునకు మఱియొక రూపము నిచ్చినచో? భౌతిక ఆయుధములను గాక, ఒక విధమగు అంతరాత్మ బలమును, ఆధ్యాత్మిశక్తిని ప్రయోగించినచో ? కాని అదియు యుద్ధక్రియయొక్క రూపాంతరమే యగును; అప్పుడును విధ్వంసము జరిగియే తీరును, మఱియు యుద్ధమున కివ్వవలసిన రూపము మానవేచ్ఛపైన గాక, భగవదిచ్ఛపైననే ఆధారపడును. అంతియే కాదు, వినాశబలము ఈ నూతన ఆధ్యాత్మికశక్తిని భక్షించి, మఱింత బలపడి, మఱింత భయంకరవేగమును బొందవచ్చు, కాళి విజృంభించి, దశదిశలను తన దారుణతర అట్టహాసములతో నింపవచ్చును. మానవహృదయానికి శాంతి యోగ్యత సిద్ధించు దనుక, నెట్టి వాస్తవ శాంతియు సంభవము కాదు; రుద్రునికి ఋణముచెల్లించనంత వఱకు, విష్ణుధర్మము రాజ్యమేలజాలదు. అయినపుడు యుద్ధమునుండి ప్రక్కకు దిరిగి, ఇంకను పరిణతి జెందని మానవజాతికి ప్రేమ మఱియు ఏకతల ధర్మమును బోధింపవలెనా? ఏకతాప్రేమలను బోధించువా రుండవలసినదే, ఏలన అంతిమ మోక్షమున కదే మార్గము. కాని మానవునిలోని కాలపురుషుడు పరిణతిజెందు వఱకు,

బాహ్య ప్రస్తుతసత్యముపై ఆంతర చరమసత్యము ప్రాబల్యము వహించ జాలదు. క్రీస్తు, బుద్ధుడు వచ్చిరి, వెళ్లిరి; కాని ఇంకను రుద్రుడే ప్రపంచమును తన వశమున, తన అరచేతిలో ఆడించుచున్నాడు. ఇట్టి మధ్యసమయములో, అహంకారిక బలము నుండి లాభము పొందు (అసుర) శక్తులచేతను, వారి దాసులచేతను వ్యథితము, పీడితమునగు మానవజాతి తన పురోగతికి చేయు ప్రచండ ప్రయాసమునందు సంగ్రామ వీరుని ఖడ్గము నిమిత్తమును, సంగ్రామప్రవక్త వాణి నిమిత్తమును మొఱ పెట్టుకొనును.

11. నిరహంకార కర్మవిధానము :

నిరహంకారముగాను, దైవవిహిత మని తాను చూచిన మహాయుద్ధమునకు ఒక నిమిత్తము మఱియు ఉపకరణముగాను (11-33), తనయందును, అందరి యందును గల భగవంతుని, ఆధారభూతమగు సంతతస్మృతితోను - "మాం అనుస్మరన్" (8-7) - మఱియు తన ప్రకృతి ప్రభువు తనకు నియమించిన ఇతర విధములందును భగవదిచ్ఛను నిర్వహించుటయే అతనికి నియుక్తమైన ఉత్తమ మార్గము. అతడు వైయక్తికవైరమును, క్రోధమును, ద్వేషమును, ఆహంకారిక కామన మఱియు నావేశమును తనలో వహించడు. అతడు కలహమునకు కాలుదువ్వడు, లేక ప్రచండాసురునికి వలె నతనికి హింసా, వినాశముల పట్ల లాలస యుండదు; కాని లోకసంగ్రహార్థము (3-20) అతడు కర్మ సేయును, కర్మ కావల, తాను దేనికొఱకు పోరాడుచున్నాడో, అట్టి కర్మగమ్యము నతడు చూచును. ఏలన కాలరూప భగవంతుడు సైతము వినాశముకొఱకే వినాశమునకు బూనుకొనడు, ఒక మహత్తర రాజ్యమును, ఒక ప్రగతిశీల అభివ్యక్తిని చక్రగతిరూప ప్రక్రియయందు సాధింపనెంచి, మార్గము నిష్కంటకము గావించుటకే అతడట్లు చేయును - "రాజ్యం సమృద్ధం" (11-33). సంగ్రామ మహత్త్వమును, విజయ వైభవమును-ఆవశ్యకమగుచో, పరాజయవేషమున వచ్చు విజయవైభవమును - అతడు, బాహ్యమనస్సు చూడజాలని గభీరతరార్థమున గ్రహించును, మఱియు తన సమృద్ధరాజ్యభోగమున మానవుని గూడ ముందుకు నడుపును. సంహారకర్త ముఖమును జూచి భీతిల్లక, ఆ ముఖములోపల అవ్యయ సనాతనాత్మను, ఆ ముఖమువెనుక మానవనేత, సర్వభూతసుహృదుడు (5-29) నగు దివ్యసారథి ముఖమును జూచును. ఒకసారి ఈ వికరాళ విశ్వరూపమును జూచి, అర్జునుడు దాని సత్యము నంగీకరించినపుడు, ఈ ధైర్యదాయక సత్యవివరణము నకే తక్కిన అధ్యాయము వినియోగింపబడును; అంతమున ఈ అధ్యాయము సనాతనుని ఒక పరిచితతర ముఖమును, శరీరమును ప్రకటించును (11-50,51).

11. విశ్వరూప దర్శనము

ద్వివిధ రూపము

1. మృత్యు వొక బాహ్యరూపము:

విశ్వరూపముయొక్క భయంకర పార్శ్వమును దర్శించుటచేత గలిగిన కంప మింకను సమయకపూర్వమే, భగవంతుని సమాధానము విని, అర్జునుడు పలికిన ప్రథమవచనములు మృత్యు ముఖము వెనుక నున్న సముద్ధారక, సమాశ్వాసక సత్యతను గొప్పగా ప్రశంసించును. అత డిట్లు చాటును, "ప్రపంచము, ఓ కృష్ణా, నిన్ను కీర్తించుచు హర్షించు చున్నది, అది సముచితమే. రాక్షసులు భయభీతులై చిందరవందరగా పాఱిపోవు చున్నారు; సిద్ధసంఘములు భక్తితో ప్రణమిల్లుచున్నారు (11-36). వారు ఓ మహాత్మా, ఎందుకు నమస్కరించరు? కారణము, నీ వాదిస్రష్టవు, ఆది కర్మకర్తవు, సృష్టికర్తయగు బ్రహ్మకంటెను మహత్తరుడవు. ఓ అనంత, దేవేశ, జగన్నివాస, నీ వక్షరమవు, నీవు సత్తును, అసత్తును, వానికి పరమునుగూడ(11-37). నీవు పురాణపురుషుడవు, ఆదిదేవుడవు, సమస్తమునకు పరమ విశ్రాంతిస్థానమవు; నీవు వేత్తవు, వేద్యుడవు, పరమపదమవు, ఓ అనంతరూప, ఇదియంతయు నీ విస్తారమే (11-38). యముడు, వాయువు, అగ్ని, సోముడు, వరుణుడు, ప్రజాపతి, తాతలకు తాత-అందరు నీవే. వేయి సారులు నీకు నమస్సులు, తిరిగి నమస్సులు, మఱల నమస్సులు (11-39); ముందు, వెనుక, అన్నివైపుల నీకు నమస్సులు, ఏలన అన్నివైపుల వ్యష్టియు, సమష్టియు నీవే. వీర్యమునం దనంతుడవు, విక్రమము నం దమితుడవు నగు నీవు సర్వమును వ్యాపించి, సర్వమునై యున్నావు (11-40)."

2. తెలిసియు తెలియనితనము :

కాని ఈ పరమ, వైశ్వ పురుషుడు ఇచ్చుట అర్జునుని కంటిముందు మానవ ముఖముతోను, మర్త్యశరీరముతోను దివ్య మానవుడుగా, దేహధారిభగవంతుడుగా, అవతారముగా ఇతఃపూర్వము నివసించిన వాడే. అర్జునుడు మానవభావమును మాత్రమే చూచి, భగవంతునితో కేవల మానవప్రాణిగానే వ్యవహరించెను. అతడు భగవంతుడు ధరించిన ముసుగును భేదించి, దేనికి మానవత్వము పాత్రము మఱియు

సంకేతమో, అట్టి దేవత్వమును దర్శించలేదు; కావున ఇపుడు భగవంతుని క్షమాభిక్షను వేడుచున్నాడు : “నా మానవసఖుడవే యని తలంచి, ఓ కృష్ణా, ఓ యాదవా, ఓ సఖా యని పిలుచుచు, నీ మహిమ నెఱుంగక, లేక అజాగ్రత్తవలన, నే నే దారుణ అమర్యాదకు బాల్పడితినో, మఱియు ఆహారవిహారములందు పరిహాసమున కే అగౌరమును జూపితినో, ఓ అప్రమేయ, దానినంతను నీవు క్షమింతువు గాక! (11-41, 42). చరాచర లోకమునకు నీవు పితవు; నీవు గురువులకు గురువువు గనుక, సర్వపూజ్యుడవు; నీతో సముడే లేనపుడు, అధికుడె ట్లుండును? లోకత్రయము నందు నీది సాటిలేని ప్రభావము! (11-43). కావున నమస్కరించి, సాష్టాంగపడి, పూజ్యప్రభూ, నీ ప్రసాదము నర్థించుచున్నాను. ఓ దేవా, తండ్రి పుత్రునివలెను, సఖుడు సఖునివలెను, ప్రియుడు ప్రేయసినివలెను నన్ను మన్నించుము, నా అపరాధమును క్షమింపుము (11-44). ఇతఃపూర్వమెవ్వరు జూడని దానిని జూచి, హర్షపులకితుడనైతిని, కాని నా మనస్సు భయవ్యాకులమైనది. ఓ దేవా, నీ యా ఇతర రూపమును జూపుము. పూర్వమువలెనే కిరీటధారివై, గదాచక్రములను ధరించిన నిన్ను దర్శించగోరుచున్నాను. ఓ సహస్రబాహూ, ఓ విశ్వమూర్తీ, నీ చతుర్భుజరూపమును ధరించుము (11-45, 46).

3. భయమునకు కారణము లేదు :

ఈ భయావహ రూపముల వెనుక నున్న గుప్తసత్యము ప్రోత్సాహక, ఆనందపూర్ణ సత్య మని అర్జునుని ప్రథమ వచనములు సూచించును. భగవంతుని కీర్తనయందును, సాన్నిహిత్యమునందును ప్రపంచ హృదయమునకు హర్షమున గన్పించున దేదియో ఒకటి గలదు. ఆ 'ఒకటి' ఏది యన, కాళియొక్క తామసముఖమునందు నేది మనకు మాతృముఖమును జూపించునో, అట్టి జ్ఞానముయొక్క గంభీరానుభవము-అనుభవముచేత వినాశ మధ్యమునందును సర్వభూతసుహృదునియొక్క రక్షకబాహువులను గనుగొనగలము, అశుభమధ్యమునందును ఒక విశుద్ధ నిర్వికారదయాళుతను, మఱియు మరణ మధ్యమునందును అమరత్వాధీశ్వరుని కనుగొనగలము. పోగా, దివ్యకర్మకు అధీశ్వరుడగు వాని భయముచే రాక్షసశక్తులు వినష్టము, పరాజితము, అభిభూతమునై పాఱిపోవును. అమరేశ్వరుని నామములను దెలిసి, కీర్తించుచు,

అతని సత్తయొక్క సత్యమునందే నివసించు సంపూర్ణ సిద్ధులు–దేవతావిశేషులు–అతని ప్రతిరూపమునకును నమస్కరించి, ఆ రూపము దేనికి ఆలయమో, దేనికి సంకేతమో, దాని నెఱుంగుదురు. నాశనముచేయబడవలసినది తప్ప, అనగా అశుభము, అజ్ఞానము, రాక్షసశక్తులు తప్ప, ఏదియు నిజముగా భయపడ పనిలేదు. ఉగ్రాకార రుద్రుని సర్వగతియు, క్రియయు, సంసిద్ధి, దివ్యప్రకాశము మఱియు పరిపూర్ణత నపేక్షించియే గదా.

4. కాలగతరూపము, కాలాతీతరూపము :

ఏలన ఈ పురుషుడు, ఈ భగవంతుడు తన బాహ్యరూపమునందు మాత్రమే పరిమితరూపములను ధ్వంసము చేయు సంహారకాలుడు : కాని తాను స్వతః అనంతుడు, వైశ్వ దేవతల ఈశుడు, ఇతనియందే ప్రపంచము మఱియు దాని క్రియ భద్రముగా నెలకొనియున్నవి (11–37). అతడు త్రిమూర్తికి పైన, సదా పుట్టించుచుండు ఆదిస్రష్ట. అతడు బ్రహ్మ యనబడు సృష్టిశక్తిరూపమునకంటె నధికుడు (11–37), ఈ బ్రహ్మసృష్టి మాత్రమే స్థితివినాశములకు లోనగు శబలసృష్టి. వాస్తవ దివ్యసృష్టి శాశ్వతము; అది పరిమితవస్తువులలో శాశ్వతముగా అభివ్యక్తమైన అనంతుడు, అది అంతరాత్మల అనంతతయందును, వాని క్రియల అద్భుతమునందును, వాని రూపముల సౌందర్యము నందును సదా దాగుడుమూతలాడుచుండు దివ్యపురుషుడు. అతడు సనాతన అక్షరము (11–37); అతడు సదసత్తులయొక్కయు, అవ్యక్త అభివ్యక్తముల యొక్కయు ద్వివిధరూపము. కాని వీని యన్నింటి కావల నున్న అతని స్వరూపము 'తత్తు', 'పరము'; ఈ పరుడు సర్వ క్షరవస్తువులను ఒకవిధమగు కాలముయొక్క అఖండ నిత్యతయందు ధరించును, ఈ నిత్యతయందు అంతయు వర్తమానమే. అతడు తన అక్షరాత్మను ఒక కాలరహితనిత్యతయందు గలిగియుండును, కాగా కాలమును, సృష్టియు ఈ నిత్యతయొక్క ఒక సంతత విస్తరణశీల రూపమే.

5. సర్వసమన్వయ సత్యము :

అతని ఈ పరభావమే సర్వమును సమన్వయ పఱచు అతని పరమసత్యము. ఈ పరమసత్య మొకపరమాత్మ, ప్రపంచమితని పరప్రకృతియొక్క ఒక ఉత్పత్తి, తదనంతునియొక్క ఒక హీనతర రూపము; అటులే ఈ పరమసత్యము ఏకమాత్ర

పురాణపురుషుడు (11-38), ఇతడే సుదీర్ఘ కాలపరిణామములపై నధ్యక్షత వహించును; మఱియు నది ఆదిదేవుడు, అందరు నీదేవునియొక్క బిడ్డలును, ఆత్మలును; ఇవి తమ సత్తయందు అతని అస్తిత్వము చేతనే ఆధ్యాత్మికముగా ఉచితత్త్వమును బొందును; ఇంకను ఆ సత్య మొక పరమవేత్త (11-38), ఇతడే మానవునియందు, తనయొక్కయు, ప్రపంచముయొక్కయు, భగవంతునియొక్కయు జ్ఞానమును వికసింపజేయును (10-11); చివర కా సత్యము ఏకమాత్ర వేద్యపురుషుడు, ఇతడు స్వయముగా తనను మానవుని హృదయమునకు, మనస్సునకు, ఆత్మకు ఆవిష్కరించు కొనును, అందువలన జ్ఞానముయొక్క ప్రతి నూతనవికాసమును అతనియొక్క ఒక ఆంశికప్రకటనమే యగును; ఇట్లు తుద కతడు సన్నిహితముగా, గభీరముగా, సమగ్రముగా చూడబడును, కనుగొనబడును. అతడింకను ప్రపంచమును పుట్టించి, ధరించి, తనలోనికే స్వీకరించు పరమధామము (11-38). తన సర్వసమర్థశక్తిచేతను, నిరంతర సృష్టివిషయకమగు తన అద్భుత ఆత్మ-పరికల్పన (self-conception), ఊర్జము (energy) మఱియు ఆనందముచేతను తన సత్తయందే అతడీ ప్రపంచమును విస్తరించును (11-38). అంతయు నతని భౌతిక, ఆధ్యాత్మికరూపముల ఆనంత్యమే యగును. చిన్న, పెద్ద దేవత లందరు నతడే (11-39); అతడు సర్వప్రాణులకు తండ్రి (11-43), అందరు అతని పుత్రులు మఱియు ప్రజలు. అతడు బ్రహ్మకు బ్రహ్మ, సజీవభూతముల ఈ విభిన్నజాతులయొక్క ప్రజాపతులకు నెవడు పితయో, అతనికి పిత. ఈ సత్యము మఱలమఱల ఒత్తి చెప్పబడును. "సర్వము" (11-40) నతడే యని మఱల నిచ్చట వక్కాణించబడినది. అతడు అనంత విరాట్పురుషుడు, అతడు ప్రతివ్యక్తియు, ప్రతివస్తువును, మనలో ప్రతివానియందలి ఏకమాత్ర శక్తియు, సత్తయు నతడే, ఈ భూతసమూహములుగా తనను బహిర్గతము గావించుకొను అనంత ఊర్జ మతడే; సర్వకాల ప్రవాహములను, ప్రకృతియందలి పురుషునియొక్క సర్వఘటనలను తన నుండియే నిర్మించు గతి మఱియు క్రియయొక్క అమేయ సంకల్పమును, మహా శక్తియు నతడే యగును.

6. మానవునియందలి దేవత్వము :

ఇట్లు భగవంతుని సర్వత్వమును ఒత్తి చెప్పి, గీతాచర్చ సహజముగనే మానవునియందు గల ఆ మహాదేవుని ఉనికి వైపునకు మఱలును. ఇచ్చట విశ్వరూప

దర్శియొక్క అంతరాత్మ మూడు క్రమగత సూచనలచే ముద్రితమగును. మొదట, ఎవడు క్షణికమానవునివలె భువిపై ఆహారవిహారముల యందు తనతోబాటు సంచరించెనో, తన పరిహాసమునకు, అమర్యాదకు గూడ గుఱియయ్యెనో, యుద్ధము, మంత్రాంగము మఱియు 'మానవ' పుత్రుని ఈ మర్త్యశరీరమునందు సదా యుండియే యున్న ఒక మహత్త్వ మిపు డతని చిత్తములో గ్రుచ్చుకొనును–పరమమర్మము గల ఆ గుప్తమహత్త్వము ఒక దేవత్వము, ఒక అవతారము, ఒక వైశ్వశక్తి, ఒక అఖండ సత్యము, ఒక పరమ అతీతత. దేనియందు మానవునియొక్కయు, అతని జాతి యొక్కయు సర్వమర్మము మూతపడియున్నదో, దేనినుండి సర్వ ప్రపంచ–జీవనము అవర్ణనీయమహత్త్వము గల తన అంతరార్థమును బొందునో, అట్టి రహస్యదేవత్వము పట్ల అత డింతవఱకు అంధుడు. వైయక్తికకాయము నందలి వైశ్వపురుషుని, మానవతారూపము ధరించిన భగవంతుని, ఈ ప్రాకృత సంకేతము (శరీరము) యొక్క అతీత అంతర్నివాసిని ఇపుడు మాత్రమే అతడు దర్శించును. ఈ దృశ్యమాన వస్తువు లన్నిటియొక్క ఈ సువిశాల, అనంత, అప్రమేయ సత్యవస్తువు నత డిపుడు మాత్రమే చూచెను. ప్రతివ్యష్టిరూపమును అతిక్రమించి యున్నను, ప్రతివ్యష్టివస్తువు దేనికి ఒక నివాస గృహమో, ఆ యీ అపార విశ్వరూపము నత డిపుడు మాత్రమే గాంచెను. ఏలన ఈ మహాసత్యము వ్యష్టి సమష్టులయందు సమము, అనంతము, ఏకరూపము. ఇంకను, అతని వెనుకటి గ్రుడ్డితనమును, కేవల బాహ్యమానవుడుగా ఈ భగవంతునిపట్ల అతని వర్తనమును, శారీరక, మానసిక సంబంధములను మాత్రమే తాను చూచుట – ఇది యంతయు అక్క డున్న మహత్త్వము పట్ల తాను చేసిన అపరాధముగా నిపు డతనికి తోచును. ఏలన తాను కృష్ణా, యాదవా, సఖా యని పిలిచినవాడు ఈ అమేయ మహిమయే, ఈ నిరుపమప్రభావమే, ఎవడు అన్నింటియందును ఏకమో, అందరు ఎవనియొక్క ప్రజలో అట్టి ఈ పురుషుడే. "అవజానన్ మానుషీం తను మాశ్రితం" (9–11)–అను రీతిని బాహ్యమానవతను గాక, దానినే అర్జునుడు ఆదరముతో, విధేయతతో, పూజ్యభావముతో చూచియుండవలెను.

7. మానవసంబంధమును సత్యమే :

కాని మానవరూపము మఱియు మానవ సంబంధము సైతము సత్య మనునదియే రెండవ సూచన, ఈ సత్యత విశ్వ రూపయొక్క భయంకరస్వరూపము

ననుగమించి, మన మనస్సునకు దాని తీవ్రతను తగ్గించును. అతీతభావమును, వైశ్వపార్శ్వమును చూడవలసినదే, లేనిచో మానవతా పరిమితులను అతిక్రమించ జాలము. ఆ ఏకతాసాధక ఏకత్వమున అంతయు అంతర్గతము గావలెను. కాని తనమట్టుకుదాను ఆ దర్శనము అతీతాత్మకును, అపరప్రకృతి యందు బద్ధము, పరివృతము నగు ఈ అంతరాత్మకును మధ్య పెద్ద అఖాతమును గల్పించును. తన లఘూకృతము గాని పూర్ణప్రభయందు అనంతుని సన్నిధి వైయక్తిక ప్రాకృతమానవుని అల్పత్వము భరించలేనంత ప్రచండముగా నుండును. కావున తన స్వీయ వైయక్తిక ప్రాకృతసత్తయందే, తనకు సన్నిహితముగా ఈవైశ్వ భగవంతుని జూడగల ఒక అనుసంధానము (link) గావలెను, అనగా భగవంతుడు తన అప్రమేయ వైశ్వశక్తిచేత తనను శాసించుటయే గాక, ఒక ఘనిష్ఠ వైయక్తిక సంబంధముచేత తనకు ఆధారముగా నుండి, తనను ఏకతలోనికి ఉద్ధరించునిమిత్తము అతడు మానవరూపము గూడ ధరించవలెను. అనంతునిముందు ఏ భక్తితో సాంత జీవుడు మ్రొక్కుచున్నాడో, ఆ భక్తి భగవంతుని పితృత్వ, సఖ్య, ప్రియత్వభావము నందు నివసించినపుడు అత్యంత మధురమై, ఘనిష్ఠభక్తిగా గాంభీర్యమును సంతరించుకొని, ఏకతాసత్యములోనికి మాఱజొచ్చును. ఇది సాధ్యమే, ఏలన, భగవంతుడు మానవాత్మయందును, శరీరమునందును నివసించును; మానవమనస్సును, రూపమును దగ్గరకు తీసికొని, వస్త్రములాగున ధరించును. మర్త్యశరీరమునందు ఆత్మ కుండు మానవసంబంధముల నపుడు అతడును ధరించును, మఱియు నీ సంబంధములు భగవంతునియందు తమ పూర్ణతమార్థమును, మహత్తమ రూపమును బొందును. ఇది వైష్ణవభక్తి, దీని బీజము గీతయం దున్నను, ఇది తర్వాతనే అధికతర గంభీరము, ప్రహర్షపూర్ణము, అర్థవంతము నగు విస్తారమను బొందును.

8. మధ్యవర్తి రూపము :

మఱియు నీ రెండవ సూచననుండి వెంటనే మూడవది ఉదయించును. విశ్వాతీతము, విశ్వాత్మకము నగు పురుషుని రూపము బలము సంతరించుకొనిన విముక్తాత్మకు ఒక ప్రబల, ప్రోత్సాహక వస్తువగును. ఒకశక్తిమూల మగును, ఒక సమీకర, సంశోధక, సర్వసమర్థక దర్శనమగును; కాని సామాన్య మానవున కది

దుర్ధరము, భయావహము, సంబంధాయోగ్యము నగును. అది ప్రోత్సాహక సత్య మైనను, అది దృష్ట మైనను, సర్వసంహారక కాల పురుషునియొక్క భయంకర మహాప్రబలరూపము వెనుక దానిని గ్రహించుట కష్టమగును. కాని కాలపురుషుని ఉగ్రరూపమే గాక, దివ్యనారాయణుని అనుగ్రహపూర్ణ మధ్యవర్తి రూపమును గలదు; ఈ నారాయణుడు మానవునికిని, మానవునిలోపలను అతిసన్నిహితముగా నుండును, అతనికి ఉపకారశక్తిరూపమగు నాలుగు చేతులుండును, అతడు జీవనసంగ్రామమునకు, ప్రయాణమునకు దివ్యసారథి; అతడు భగవంతుని, మానవరూపము ధరించిన సంకేతము, సహస్రబాహువులతో గూడిన విరాట్పురుషుడు గాడు. ఈ మధ్యవర్తి రూపమునే మానవుడు సదా తనముందు తన కాధారముగా గలిగియుండవలెను. ఏలన నారాయణుని ఈ ఆకృతియే ధైర్యము నిచ్చు సత్యమునకు సంకేతము. అది ఆధ్యాత్మిక బృహదానందమును సన్నిహితము, ప్రత్యక్షము, సజీవము, గ్రహణ యోగ్యము గావించును; జగద్వ్యాపారము తన బ్రహ్మాండ పరిభ్రమణము మఱియు తిరోగమనపురోగమనముల వెనుక, మానవుని అంతఃపురుషుడు మఱియు మానవుని జీవనమునిమిత్తము, ఈ బృహదానందము నందే పర్యవసించును, అదే దాని అద్భుత శుభాంతము. ఆ జగద్వ్యాపారముయొక్క పర్యవసానము దేహము ధరించిన మానవాత్మకు ఒక సంయోగము, ఒక సాన్నిహిత్యము, జీవేశ్వరుల ఒకే సంతతసఖ్యము నగును; ఈ సఖ్యమునందు మానవుడు ప్రపంచమున భగవంతునికొఱకు జీవించును, భగవంతుడు మానవుని యందు నివసించుచు, అంతుబట్టని ప్రపంచ ప్రక్రియను మానవునియందు తాను సాధించదలంచిన లక్ష్యముల దిశగా నడుపును. మఱియు నీ లక్ష్యముల కావల ఇతోధికముగా అద్భుతమగు ఏకతయు, సనాతనుని చరమరూపాంతరము లందు నివాసము సిద్ధించును.

9. ఆత్మయోగమువలన ఆత్మప్రకటనము :

అర్జునుని ప్రార్థనను మన్నించి, భగవానుడు తన సామాన్య నారాయణ రూపమును "స్వకం రూపం" (11-50) - తిరిగి ధరించును; దయ, ప్రేమ, మధురిమ. సౌందర్యములతో గూడిన ఈ రూపమునే అర్జునుడు గోరెను. కాని ముందు తానిపుడు మఱుగుపఱచనున్న పూర్వ మహారూపము యొక్క అగణ్య

ఆంతర్యమును ప్రవచించును. "ఇపుడు నీవు చూచుచున్న రూపము," భగవానుడు వచించును, "నా పరమాకారము, తేజోమయము, వైశ్వము, ఆద్యము నగు నా రూపము; నీవు తప్ప మానవులందు మఱి యెవ్వరు దీనిని చూచియుండ లేదు. నేను నా ఆత్మయోగముచేత దానిని చూపినాను (11-7). ఏలన అది సాక్షాత్తు నా ఆత్మ మఱియు పురుషభావముయొక్క రూపము, అది విశ్వసత్తయందు స్వయముగా రూపము ధరించిన పరమపురుషుడు. [1]మఱియు నాతో పూర్ణయోగము నందున్న అంతరాత్మ ఎట్టి నాడీకంపనము గాని, మనోవ్యాకులము గాని లేకయే దానిని చూచును; ఏలన అతడు దాని ఆకారమునందు భయంకరము, దుర్భరము నగు దానిని మాత్రమే గాక, సమున్నతము, ధైర్యప్రదము నగు దాని ఆంతర్యమును సైతము దర్శించును. నీవును అటులే భయము, సంభ్రమము, అవయవవిషాదము లేక దానిని వీక్షింపదగును (11-49); కాని నీ నిమ్నప్రకృతి యింకను ఉత్కృష్ట బలము మఱియు ప్రశాంతితో దాని నవలోకింప సిద్ధముగాలేదు గాన, నీనిమిత్తము నా నారాయణాకృతిని తిరిగి ధరింతును; దీనియందు మానవమనస్సు తన మానవ భావమునకు సరిపెట్టబడిన, స్నేహమయ భగవంతుని వ్యష్టిరూప శాంతిని, సాహాయ్యమును, సమ్మోదమును గాంచును. ఆ మహత్తరరూపము" - ఆ రూప మంతర్ధాన మైన పిమ్మట గూడ ఈ మాట తిరిగి చెప్పబడును - "అపరూపమగు అత్యున్నత ఆత్మల నిమిత్తము మాత్రమే. దేవతలు సైతము దీనిని దర్శింప నిత్యము కాంక్షింతురు. వేదము, తపము, దానము, లేక యజ్ఞముచే దానిని బొంద శక్యము గాదు. ఏ భక్తి సర్వభూతములందు నన్ను మాత్రమే చూచునో, పూజించునో, ప్రేమించునో, అట్టి అనన్యభక్తిచేతనే దానిని చూడవచ్చును, ఎఱుంగవచ్చును, దానిలో ప్రవేశించవచ్చును."

10. విశ్వరూపముయొక్క అద్వితీయత :

కాని ఇపుడు, ఈ విశ్వరూపము యొక్క అద్వితీయత దేనియం దున్నది ? మానవజ్ఞానముయొక్క సర్వప్రయాసము, దాని ఆధ్యాత్మికకృషి యొక్క అంతరతమతపస్య సైతము, సాహాయ్యము వినా, ఈ దర్శనము నెందుచేత

[1] కొటేషన్సులోని ఈ వాక్యములు కొన్ని యథాతథముగా మూలమునందులేవు.

అందుకొనజాలకున్నది? ఎందుచేత నన, మానవు డితర సాధనములచేత ఏకమాత్ర అస్తిత్వముయొక్క ఈయా ప్రత్యేకరూపములను తెలిసికొనగలడు గాని, భగవంతుని సర్వపార్శ్వములయొక్క సమన్వయస్థానమగు పరమ ఏకతను తెలియజాలడు - ఈ ఏకతయందు ఏకకాలమున, ఏకదర్శనమున సర్వము అభివ్యక్తమగును, ఆ సర్వము అతిక్రమించబడును మఱియు తన పరిసమాప్తి నందుకొనును. ఏలన ఇచ్చట అతీత, వైశ్వ మఱియు వైయక్తికభగవంతుడు, పురుషప్రకృతులు, సాంతానంతములు, దేశము, కాలము మఱియు కాలాతీతత, సత్తాసంభూతులు, మనము ప్రయాసపూర్వకముగా భగవంతుని గుఱించి తెలిసికొను ప్రతివిషయము-అన్నియు నొక అనిర్వచనీయ ఏకతయందు అద్భుతముగా ప్రకట మగును. ఏది కర్మజ్ఞానముల పూర్ణతకు పరమశిఖరముగా రాజిల్లునో, అట్టి అనన్య భక్తిచేతనే, ప్రేమచేతనే, ఘనిష్ఠ అనన్యతచేతనే ఈ దర్శనము ప్రాప్తించగలదు (11-54). ఆ రూపమును తెలియుట, చూచుట, దానిలో ప్రవేశించుట, పరముని ఆ పరమరూపముతో నేకమగుట అప్పుడు సంభవమగును, మఱియు దీనినే గీత తన యోగపరిసమాప్తి యని ప్రస్తావించును. ఒక పరమచేతన గలదు, దానిద్వారా అతీతపురుషోత్తమునియొక్క మహిమాతిశయములో బ్రవేశించి, అతనియందు అక్షరాత్మను, సర్వ క్షరసంభూతిని ధరించవచ్చును, అనగా సర్వముతో నేకమయ్యు, సర్వమునకు పరమున నుండవచ్చును, ప్రపంచము నతిక్రమించియు విశ్వగత మఱియు విశ్వాతీతభగవంతునియొక్క సమస్తప్రకృతిని ఏకకాలమున ఆలింగనము చేసికొనవచ్చును. తన మనఃశరీరములలో నిబద్ధుడైన పరిచ్ఛిన్న మానవుని కిది నిక్కముగా కష్టమే ; కాని "నా కర్మ చేయువాడవు కమ్ము, నన్ను పరమపురుషుడు మఱియు పరమగమ్యముగా నంగీకరించుము, నా భక్తుడవు కమ్ము, సర్వభూతము లందును సంగరహితుడవు, ద్వేషరహితుడవు గమ్ము; ఏలన అట్టివాడు నన్ను బొందును (11-55)" - అని భగవానుడు ముగించును. వేఱు మాటలలో, నిన్ను ప్రకృతికి పైనుండుట, సర్వప్రాణులతోడను సమైక్యము, వైశ్వభగవంతునితోను, పరమపురుషుని తోను ఏకత, కర్మయందు భగవదిచ్ఛతో ఏకత, ఏకునియందును, సర్వగతభగవంతుని యందును అనన్యప్రేమ - పరిపూర్ణమగు ఆధ్యాత్మిక స్వ - అతిక్రమణమునకును, ఆ అచింత్య పరివర్తనమునకును మార్గ మిదియే.

12. మార్గము మఱియు భక్తుడు

1. జ్ఞానకర్మస్వరూపము :

పదునొకండవ అధ్యాయమున గీతాబోధన యొక్క మూలోద్దేశ్యము సాధించ బడినది, మఱియు నొక మేరకు పరిపూర్ణము గావించ బడినది. ఎవడు లోకములోపల నుండునో, ఎవనియందు లోకవ్యాపార మంతయు ఘటిల్లునో, అట్టి విశ్వపురుషునితో యోగమునం దుండి లోకసంగ్రహార్థము కర్మ సేయుము - అని ఆదేశ మివ్వబడినది, విభూతిచేత (అర్జుననిచేత) ఆమోదింప బడినది గూడ. సాధారణమానవుడుగా తన వెనుకటి స్థితి నుండి, అజ్ఞానగతమగు తన ప్రమాణములు, ప్రేరణలు, దృక్కోణము, ఆహంకారిక చేతనలనుండి, ఒక్క మాటలో ఆధ్యాత్మికసంకట సమయమున తనను భంగపుచ్చిన సర్వమునుండి తప్పించి, శిష్యుడు దూరముగా తీసికొనిపోబడెను. ఏకర్మను తన పూర్వస్థితియందు 'భయంకరపాప' మని చెప్పి తాను నిరాకరించెనో, సరిగా ఆ కర్మనే ఒక నూతన ఆంతరప్రాతిపదికపై అమోదించువఱకు శిష్యుడు తీసికొనిపోబడెను. ఒక సమన్వయ సాధక విశాలతరజ్ఞానము, ఒక దివ్యతరచేతన, ఒక సమున్నత నిర్వ్యక్తికప్రేరణ, ప్రపంచముపై పనిచేయు భగవదిచ్ఛతోను, ఆధ్యాత్మికప్రకృతియొక్క చాలకశక్తితోను ఏకతారూపమగు ఒక ఆధ్యాత్మికప్రమాణము - ఇదియే అజ్ఞానకర్మను రూపాంతరీకరించవలసిన నూతనము, ఆంతరము నగు కర్మస్వరూపము. భగవంతునితో ఏకతను తనలో గలిగియుండి, భగవంతునిద్వారా సర్వ చరాచర వస్తువులతో ఏకతాగమ్యమును చేరుకొను ఒక జ్ఞానము, అటులే అహంకారము లేక, కర్మయొక్క రహస్యనియామకుని ఆదేశము ననుసరించి, అతని ఉపకరణవృత్తిగా పనిచేయు ఒక సంకల్పము, పరమాత్మతో ఘనిష్ఠమైత్రియే ఏకమాత్ర ఆకాంక్షగా గల ఒక దివ్య ప్రేమ, ఈ మూడు పరిపూర్ణితశక్తుల సమైక్యముచేత విశ్వాతీత మఱియు విశ్వగత పురుష ప్రకృతులతోను, సర్వప్రాణులతోను సిద్ధించిన ఒక ఆంతర, సమగ్ర సమైక్యము - ఈ నాలుగును విముక్తమానవుని కార్యకలాపాలకు జూపబడిన దివ్యాధారము. ఏలన ఆ ఆధారమునుండి అంతరాత్మ ఉపకరణాత్మక ప్రకృతిని పనిచేయనిచ్చినను అపాయముండదు; అతడు అహంకారము మఱియు దాని పరిమితులనుండి

ముక్తుడయ్యెను, పాపము, అనర్థము మఱియు తత్పరిణామ భయమునుండి తప్పించబడెను, అహంకార గ్రంథిరూపమగు, బాహ్యప్రకృతితోను, దాని పరిమిత క్రియతోను బంధనమునుండి ఉద్ధరించబడెను. అత డిక సంధ్యాప్రకాశము లేక అంధకారమునందు గాక, పూర్ణ ప్రకాశశక్తియందు కర్మచేయగలడు. శుద్ధపురుషుని స్వాతంత్ర్యమునకు, ప్రకృతి యందలి అంతరాత్మ బంధనమునకు నడుమ ఏ విరోధము చూపబడెనో, ప్రకృతితో పురుషుని ప్రకాశమయ సమన్వయముచేత అది యిపుడు పరిష్కరింపబడెను. అజ్ఞానము నందలి మనస్సునకే ఆ విరోధముండును గాని, స్వీయజ్ఞానమునందలి అంతరాత్మ కది అంతరించును.

2. నిరాకారముక్తి – సమగ్రస్వాతంత్ర్యము :

కాని ఈ మహత్తర ఆధ్యాత్మిక పరివర్తనము యొక్క సంపూర్ణార్థమును ప్రకటించవలె ననిన మఱికొంత చెప్పవలసి యున్నది. పంద్రెండవ అధ్యాయము ఈ అవశిష్టజ్ఞానమువఱకు దారి తీయగా, మిగిలిన ఆఱు అధ్యాయాలు దాని నొక మహామహిత చరమసిద్ధాంతముగా పెంపొందించును. ఇంకను చెప్పవలసిన విషయము ఆధ్యాత్మికవిముక్తిని ప్రతిపాదించు ప్రస్తుత వేదాంతమతమునకును, గీతోపదేశము మానవాత్మకు తెలుచు విశాలతర సమగ్రస్వాతంత్ర్యమునకును గల భేదము నవలంబించి సాగును (12-1), ఇపు డా భేదము మఱల సూటిగా నిర్దేశింపబడును. ప్రస్తుత వేదాంతమార్గము కఠోరము, కేవలము నగు జ్ఞానముద్వారా ముందుకు సాగును. ఆధ్యాత్మికవిముక్తి సాధనముగను, చిత్తమును లయముగావించు దాని సారముగను ఆ జ్ఞానము పరిగణించు యోగము శుద్ధజ్ఞానముయొక్క యోగము; పరిగణించు ఏకత ఒక పరమ అక్షరముతోను, ఒక నిరపేక్ష అనిర్వచనీయముతోను నిశ్చల ఏకత – అనగా అనంతము, శాంతము, అస్పృశ్యము, దూరస్థము మఱియు సంబంధమయమగు ఈ ప్రపంచమున కంతకు ఎంతో పైన నుండు అవ్యక్త బ్రహ్మముతో ఏకత (12-3). పోగా గీత ప్రతిపాదించిన మార్గమునందును జ్ఞానమే ఆవశ్యక ఆధారము, అయితే అది సమగ్ర జ్ఞానము ; నిర్వ్యక్తిక సమగ్రకర్మలు దాని ప్రథమ ఆవశ్యక సాధనము; కాని ముక్తి, ఆధ్యాత్మికసంసిద్ధి మఱియు అమృతానందమును బొందుటకు గభీరము, విశాలము నగు ప్రేమ మఱియు ఆరాధన గీతామార్గమున ప్రబలతమము, సర్వోన్నతమునగు శక్తి యగును–ఈ ప్రేమారాధనలు

ఒక సంబంధమును, ఒక వైయక్తిక ఘనిష్ఠ సాన్నిధ్యమును అపేక్షించును గాన, సంబంధశూన్య అవ్యక్తబ్రహ్మము వానికి సమాధానమివ్వజాలదు. మానవాత్మ ఏ భగవంతునితో ఘనిష్ఠ ఏకతను బొందవలసియున్నదో, అతడు తన సర్వోచ్చపదము నందు నిశ్చయముగా నెట్టి అభివ్యక్తిలోను పట్టని ఒక అతీత అచింత్యమే, పరబ్రహ్మమే; కాని అదే సమయమున అతడు వస్తువుల సజీవ ఆత్మయు నగును. అతడు పరమేశ్వరుడు, కర్మ, ప్రపంచముల నియామకుడు, అతడు ప్రాణియొక్క అంతరాత్మ మనోదేహముల ఆత్మగా నుండియు అదే సమయమున వాని కావలను ఉండును. అతడు పురుషోత్తముడు, పరమేశ్వరుడు మఱియు పరమాత్మ, మఱియు నీ మానవరూపము లన్నింటియందు అతడు అదే ఏకమాత్ర సనాతన భగవంతుడు. ఈ సమగ్ర సమన్వయకర జ్ఞానమునకు మేల్కొని నపుడు, అది అంతరాత్మయొక్క అశేషముక్తికిని, ప్రకృతియొక్క అనూహ్యసిద్ధికిని విశాలకవాట మగును. ఈ సంపూర్ణ భగవంతుని వైపునకే మన కర్మలను, ప్రేమను, జ్ఞానమును మన మొక సంతత, అంతరయజ్ఞముగా మఱల్చవలెను. ఈ భగవంతుడు, పురుషోత్తముడు విశ్వాతీతు డయ్యును, దానిని ధరించు పురుషుడు, అంతర్నివాసి, దాని స్వామి (possessor) – ఈ సత్యము విశ్వరూపమున ప్రత్యక్షముగా, ప్రబలముగా జూపబడెను – విముక్తాత్మ అతని సత్తయొక్క సర్వతత్త్వములు మఱియు శక్తులందు అతని దర్శనమును, జ్ఞానమును ఒకసారి అందుకొనినపుడు, అతని బహుముఖ ఏకతను ఒకసారి గ్రహించి, అనుభవించగలిగినపుడు, అతనిలోనికే ప్రవేశింపవలెను – "జ్ఞాతుం ద్రష్టుం తత్త్వేన ప్రవేష్టుం చ" (11–54).

3. పంచవిధ సమగ్రముక్తి :

గీతామోక్షము ఏకమునందు అంతరాత్మ – వైయక్తికసత్తయొక్క ఆత్మవిస్మృతి లక్షణమగు విలయము గాదు, "సాయుజ్యముక్తి" గాదు; అది ఏకకాలమున సర్వవిధ సంయోగము. దానియందు, పరమపురుషునితో అతని సత్తాసారమందును, చేతనాఘనిష్ఠతయందును, ఆనందతాదాత్మ్యమునందును సంపూర్ణ ఏకీభావము గలదు – ఇది గీతామోక్షములోని ఒక అంశమగు "సాయుజ్యము" – ఏలన గీతాయోగము యొక్క ఒక ప్రయోజనము బ్రహ్మ మగుట – "బ్రహ్మభూతః" (5–24). మఱియు పరముని పరమసత్తయందు అంతరాత్మకు ఒక నిత్య హర్షపూర్ణ నివాసము నుండును

– ఇది "సాలోక్యము" – "నీవు నాయందు నివసింతువు", "నివసిష్యసి మయ్యేవ" (12-8) అని చెప్పబడినది. తర్వాత ఒకసంయోజకసామీప్యము నందు శాశ్వత ప్రేమారాధన యుండును, దివ్యప్రేమికునిచేతను, ముక్తాత్మయొక్క అనంతతలను చుట్టివచ్చు ఏకాత్మచేతను ఆ ముక్తాత్మయొక్క ఆలింగన ముండును – ఇది "సామీప్యము" (6-30). భగవంతుని ప్రకృతితో అంతరాత్మ యొక్కవిముక్త ప్రకృతికి ఒక తాదాత్మ్య ముండును – ఇది "సాదృశ్యముక్తి" ఏలన భగవంతునితో సదృశమగుటయే విముక్తాత్మయొక్క సంసిద్ధి – "మద్భావ మాగతాః" (4-10), మఱియు తన సత్తాధర్మమునందును, తన కర్మ మఱియు ప్రకృతిధర్మమునందును అతనితో ఏకమగుట ఈ సంసిద్ధిలో నొక భాగము – ఇది "సాధర్మ్యముక్తి" "సాధర్మ్యమాగతాః" (14-2). రూఢమగు జ్ఞానయోగము ఏకమాత్ర అనంతసత్తయందు అగాధలయమును లక్షించును – "సాయుజ్యము"; అదియే సంపూర్ణముక్తియని దాని అభిప్రాయము. ఇక భక్తియోగము నిత్యనివాసము లేక సామీప్యమును అధికతరముక్తిగా వీక్షించును – "సాలోక్యము, సామీప్యము." పోగా కర్మయోగము సత్త మఱియు స్వభావముయొక్క శక్తియందు భగవంతునితో ఏకతకు దారితీయును – "సాదృశ్యము." కాని గీత తన సముదార సమగ్రతయందు అన్నింటిని తనలో ధరించి మహత్తమము, సమృద్ధితమము నగు ఒక దివ్య స్వాతంత్ర్యము మఱియు సంసిద్ధిలోనికి వాని నన్నింటిని కరగించిపోయును.

4. ఏది అధికతరయోగము ?

అర్జునుడే ఈ భేదవిషయకప్రశ్న వేయునట్లు చేయబడును. నిర్వ్యక్తిక అక్షరపురుషునికిని, పరమాత్మకును గల విశేషము (distinction) ఇంకను విస్పష్టముగా, సునిశ్చితముగా వర్ణింపబడలేదని మనము గుర్తుంచుకొనవలెను – ఇప్పటి పరమాత్మ ఏకకాలమున నిర్వ్యక్తికసత్తయు, దివ్య పురుషుడు నగుచునే, ఉభయము నెంతో మించియుండును; ఈ విశేషము కృష్ణుడు సదా "అహం, మాం" అని చెప్పుచు వచ్చిన దివ్య "నేను" యందు సూచిత మయినది. గీతాసందేశముయొక్క పూర్ణమర్మమును ఆకళించుకొనుటకు ఈ విశేష మును మనము ముందుగనే ప్రస్తావించుకొనుచు వచ్చితిమి; అట్లు గానిచో మనము తిరిగి వెనుకకు బోవలసియుండును, ఈ మహత్తరసత్యముయొక్క ప్రకాశమున వెనుకటి విషయమును

మఱల చూడవలసివచ్చును. తన పృథగ్వ్యక్తిత్వమును అక్షరాత్మయొక్క ప్రశాంతనిర్వ్యక్తికత యందు లయముజేయ అర్జునుడు ముం దాదేశింప బడెను (4-41) - ఈ ఉపదేశము తన పూర్వభావముల ననుసరించియే యున్నది గాన, అక్కడ కష్టము గన్పించలేదు. కాని అత డిపుడు ఈ మహత్తమ విశ్వాతీత, ఈ విశాలతమ విశ్వాత్మక పురుషుని దివ్యదర్శనము నెదుర్కొనును; జ్ఞానముచేతను, కర్మచేతను, భక్తిచేతను అతనితో ఏకతను అన్వేషింప నాదేశింపబడును (11-55). కావున ఒక సంభవనీయ సందేహమును వారించుకొనుటకు అత డిట్లు ప్రశ్నించును, "ఏ భక్తులు సతతయుక్తులై నిన్ను ఉపాసింతురో, మఱియు నెవరు అవ్యక్త అక్షరము నుపాసింతురో, ఈ ఉభయులలో ఎవరికి అధికతర యోగజ్ఞానము గలదు ?" (12-1). "ఆత్మయందును, పిమ్మట నాయందును" - "ఆత్మని అథోమయి" (4-35) అని పూర్వము చేయబడిన వివేచన నీ ప్రశ్న జ్ఞప్తికి దెచ్చును : "త్వాం" అనియు, "అక్షరం అవ్యక్తం" అనియు (12-1) అర్జునుడు వివేచించును. అతడు తాత్పర్యముగా నిట్లు చెప్పినవా డగును - నీవు సర్వభూతములకు మూలము మఱియు నాదివి, అన్ని వస్తువులయందు అంతర్వర్తి సన్నిధివి, నీ రూపములతో విశ్వమును వ్యాపించు శక్తివి, నీ విభూతులలో నభివ్యక్తమగు పురుషుడవు, నీ మహావిశ్వ-యోగముచేత ప్రపంచమునందును, మా హృదయములందును కర్మప్రభువుగా ఆసీనుడవు. కావున నా సర్వసత్త, చేతన, ఆలోచనలు, భావములు మఱియు క్రియలయందు - "సతత యుక్త" (12-1) - నేను నిన్ను దెలిసి, ఆరాధించి, నీతో యుక్తుడనై యుండదగును. కాని ఈ అక్షరుని మా టేమిటి ? ఇత డెపుడును అభివ్యక్తుడు గాడు, ఎపుడును రూపము ధఱించడు, వెనుకకు తగ్గి, క్రియకు దూరముగా నిలుచును, విశ్వముతో నే సంబంధమును పెట్టుకొనడు, సదా శాంతము, ఏకము, నిర్వ్యక్తికము, నిశ్చలము. ప్రస్తుత భావములను బట్టి ఈ సనాతన అక్షరాత్మయే అధికతర తత్త్వము, కాగా అభివ్యక్తి యందలి భగవంతుడు ఒక హీనతర రూపము: అభివ్యక్తము గాక, అవ్యక్తమే సనాతన తత్త్వము. అయినపుడు అభివ్యక్తిని, అల్పతరవస్తువును ఆశ్రయించుయోగము ఎట్లు అధికతర యోగ - జ్ఞానము గాగలదు ?

5. అదియే పరిపూర్ణయోగము :

దీనికి శ్రీ కృష్ణుడు తెగవేసి, గట్టి జవాబిచ్చును - "ఎవరు తమ మనస్సును నాయందు నిలిపి, నాతో నిత్యయుక్తులై, పరమశ్రద్ధతో నన్ను బొందజూతురో, వారు

పరిపూర్ణముగా యోగయుక్తులని నా అభిప్రాయము." (12-2). ఏది సర్వమునందును భగవంతుని జూచునో, దేని కంటికి వ్యక్తము, అవ్యక్తము - రెండును ఒకే భగవత్తత్త్వమో, అదియే పరమశ్రద్ధ. పోగా నేది ప్రతిక్షణము, ప్రతిక్రియయందు మఱియు సర్వప్రకృతితో భగవంతుని కలిసికొనునో, అదియే పూర్ణసంయోగము. కాని ఎవరు ఒక దుష్కర ఆరోహణము ద్వారా అనిర్దేశ్యము, అవ్యక్తము నగు అక్షరమును మాత్రమే అన్వేషింతురో, వారును- భగవంతుడు తెలుపును - నన్ను చేరుదురు. ఏలన ఎక్కువ దుష్కరము; తక్కువ సంపూర్ణమునగు మార్గము నవలంబించి నప్పటికి, వారి లక్ష్యము తప్పు కాదు. తమకు మిక్కిలి సులభమార్గముగా, అవ్యక్త పరమును జేరుటకు వారు ఇచ్చటి వ్యక్త అక్షరము(అక్షరాత్మ) ద్వారా ఆరోహించ వలసియుండును. అయితే ఈ వ్యక్త అక్షరము సర్వవ్యాపకమగు నా స్వీయ నిర్వ్యక్తికత మఱియు నిశ్చలమౌనమే; అచింత్యము, అచలము, ధ్రువము, సర్వవ్యాపకము నగు నది (12-3) వ్యక్తిత్వ క్రియను ధరించును, కాని దానిలో పాల్గొనదు. అది మనస్సున కెట్టి ఆలంబనము నివ్వదు; ఒక అచల, ఆధ్యాత్మిక నిర్వ్యక్తికత మఱియు నిశ్చలతచేతనే అది పొందబడగలదు, మఱియు దానిని మాత్రమే అనుసంధించువారు మనస్సు మఱియు నింద్రియముల వ్యాపారము నిగ్రహించవలసి మఱియు ఉపసంహరించ వలసి గూడ నుండును (12-4). అయినను తమ బుద్ధిసమతచేతను, సర్వవస్తువుల యందును ఏకాత్మదర్శనముచేతను, శాంతసంకల్పముచే సర్వభూతహితమును గామించుటచేతను, వారును నన్ను సర్వవస్తువులు మఱియు ప్రాణులందు కలిసికొందురు (12-4). ఎవరు తమ సర్వ జీవనప్రకారములందును-"సర్వభావేన" (15-19) భగవంతునితో యుక్తులగుదురో, మఱియు సర్వభూతముల అచింత్య, సజీవమూలములోనికి విశాలముగా, సంపూర్ణముగా ప్రవేశింతురో - "దివ్యం పురుషం అచింత్యరూపం" (8-9,10) - వారితో సమముగా అవ్యక్తోపాసకులును చివరకు- ఆ సనాతనునే కనుగొందురు, అయితే కష్టతర ఆరోహణముద్వారా, ఏలన అవ్యక్తమార్గము తక్కువ సరళము, ఎక్కువ కష్టమయము; అది ఆధ్యాత్మీకృత మానవస్వభావము యొక్క సహజ, పూర్ణగతి గాదు.

6. ఉభయమార్గముల తారతమ్యము :

మఱియు నెక్కువ కష్టమయము గాన, అది శ్రేష్ఠతరము, సఫలతరము నగు ప్రక్రియ యని భావించరాదు. సులభ తరమగు గీతామార్గము ఎక్కువ శీఘ్రముగా,

సహజముగా, సర్వసామాన్యముగా అదే పరిపూర్ణ విముక్తికి నడుపును. ఏలన అది దివ్యపురుషుని ఆమోదించును గాని, తదామోదము దేహగతప్రకృతియొక్క పరిమితులందు మనస్సు మఱియు నింద్రియముల సంగమును సూచించదు. పైగా నది జననమరణముల బాహ్యాబంధనమునుండి శీఘ్రము, అమోఘము నగు ముక్తిని గొనివచ్చును. కాగా కేవల జ్ఞానయోగి తన ప్రకృతి అవసరములతో సలుపు బాధామయ సంఘర్షమును తనపై విధించుకొనును; అత డా అవసరముల శ్రేష్ఠసంతృప్తిని సైతము నిరాకరించును, మఱియు సంబంధముల నపేక్షించు లేక నిషేధాత్మక కేవలబ్రహ్మము నందుకొనజాలని తన అంతరాత్మ యొక్క ఊర్ధ్వప్రవృత్తులను గూడ అతడు ఛేదించివేయును. దీనికి ప్రతిగా, సజీవమగు గీతామార్గము మన సమస్తసత్తయొక్క అత్యంత ప్రగాఢమగు ఊర్ధ్వప్రవృత్తిని గనుగొని, దానిని భగవదభిముఖము గావించి, జ్ఞానమును, ఇచ్ఛను, భావమును, సంసిద్ధిని గోరు సహజప్రవణతను పైకెగురుచున్న విముక్తికి శక్తిశాలి పక్షములుగా (ఱెక్కలుగా) నుపయోగించును. దేహధారులు తన అనిర్దేశ్య ఏకతయందు అవ్యక్త బ్రహ్మమును అందుకొనుట, అసలు సాధ్యమగుచో, అత్యంతకష్టము, ఆ ప్రయత్నమున అడచి వేయబడిన అంగములు క్లేశమును, వ్యథను అనుభవించును – "దుఃఖం అవాప్యతే, క్లేశోఽధికతరస్తేషాం" (12–5). ఆ అనిర్దేశ్య ఏకత, ఎక్కి తనను చేరుకొనిన వారిని స్వీకరించును గాని, వారికి ఎట్టి సంబంధరూప సాహాయ్యమును అందించదు, ఎట్టి పాదావకాశమును చూపదు. సర్వము కఠోరతపస్యచేతను, కఠిన, కేవల స్వప్రయత్నముచేతను సాధించబడవలెను. కాని గీతోక్తప్రకారమున పురుషోత్తముని బొందజూచు వారి కది ఎంత సులభము! అది సర్వమును వాసుదేవునిగనే చూచును గాన, మఱేదియు జూడని అనన్యయోగముతో (12–6) పురుషోత్తముని వారు ధ్యానించునపుడు, అతడు వారిని ప్రతిచోట, ప్రతిక్షణమున అసంఖ్యాక రూపములతోను, ముఖములతోను కన్పించి, కలిసికొనును, లోపల జ్ఞానదీపము నెత్తిపట్టును, దాని సుఖమయ దివ్యప్రభతో సత్త నంతను ముంచెత్తును. ఈ దివ్యప్రభతో వారు ప్రతిరూపము మఱియు ముఖమునందు పరమపురుషుని పసికట్టుదురు, ఏకకాలమున సమస్తప్రకృతినుండియు ప్రకృతిపతిని చేరుకొందురు, సర్వభూతములద్వారా వాని అంతఃపురుషుని చేరుకొందురు, స్వీయవ్యక్తిత్వముద్వారా

సర్వమునగు సర్వాత్మను చేరుకొందురు; ఒక్క పట్టున వారు తెఱచుకొనుచున్న వేయి ద్వారములద్వారా సర్వమునకు ఆదియగు దానిలోనికి పరుగున ప్రవేశింతురు. కఠినము, సంబంధరహితము నగు నిశ్చలత నపేక్షించు ఇతరపద్ధతి సర్వక్రియ నుండియు దూరముగా బోవజూచును, కాని అది దేహధారుల కసాధ్యము (18-11). కాగా నిచ్చట సర్వకర్మలు కర్మల పరమప్రభువునకు సమర్పింపబడును, మఱియు నతడు భక్తుని సమర్పణాసంకల్పమును గ్రహించి, దాని భారమును స్వీకరించి, భక్తునియందలి దివ్యప్రకృతియొక్క కర్మబాధ్యతను తానే వహించును. ఇంకను, చివరకు, మానవుడు మఱియు సర్వభూతముల దివ్యప్రేమికుని భక్తుడు ఉదాత్త ప్రేమావేగమున తన చేతనయొక్క సర్వహృదయమును, తన ఆనందముయొక్క సర్వలాలసను అతని వైపునకు మఱల్చినపుడు, ఆ దివ్యప్రేమికుడు శీఘ్రముగా వచ్చి, మర్త్యప్రకృతియొక్క మృత్యుసాగరమునుండి సనాతనుని భద్రమగు ఒడిలోని కతని నుద్ధరించును (12-7).

7. గీతామార్గములోని మెట్లు :

ఇట్లిది శీఘ్రతమము, విశాలతమము, మహత్తమము నగు మార్గము. నాయందు - మానవాత్మకు భగవంతుడు చెప్పును - నీ మనస్సు నంతను విశ్రమింపజేయుము, నాలో నీ బుద్ధి నంతను నివసింప జేయుము (12-8) : దివ్య ప్రేమ, ఇచ్ఛ మఱియు జ్ఞానముయొక్క అలౌకికతేజమున ఓలలాడించి, ఈ ప్రేమాదిప్రవాహమునకు మూలమగు నాలోనికా మనోబుద్ధులను లేవనెత్తెదను. అపు డీ మర్త్యజీవనమునకు పైన నాయందే నీవు నివసించెదవు, సందేహము వలదు. సనాతన ప్రేమావేగముచేతను, ఇచ్ఛాబలముచేతను, జ్ఞానప్రకాశములచేతను ఉద్ధరింపబడిన అమరజీవుని, పార్థివప్రకృతియొక్క బంధనపాశమిక పట్టజాలదు. సందేహము లేదు, ఈ మార్గమునందును కఠినతలు గలవు; తన ఉగ్ర లేక తామసమగు అధోభారముతో గూడిన అపరప్రకృతి ఆరోహణ గతిని అడ్డగించి పోరాడును, మఱియు ఆరోహణపక్షములను ప్రతిబంధించును, ఊర్ధ్వోల్లాసమును బాధించును. అద్భుతక్షణములందో, ప్రశాంతసమయములందో ముందు కనుగొనబడి నప్పటికి, దివ్యచేతన వెంటనే స్థిరపడదు, లేక పిలిచినపుడు వెంటనే తిరిగిరాదు. వైయక్తికచేతనను భగవంతునియందు స్థిరముగా నిలుపు విషయమున తఱచు అశక్తత అనుభూతమగును. ప్రకాశమునుండి వెలివేయబడిన సుదీర్ఘరాత్రులుండును;

తిరుగుబాటు, సంశయము లేక అపజయముతో నిండిన గంటలు లేక క్షణము లుండును. అయినను యోగము నభ్యసించుచు, అనుభవమును తిరిగి తిరిగి పొందుటచే పరమాత్మ సత్తను అధికాధికముగా ప్రభావితము గావించి, ప్రకృతిని శాశ్వతముగా స్వాధీనము గావించుకొనును (12-9). మనస్సున కుండు బహిర్ముఖ ప్రవృత్తియొక్క బలము మఱియు పట్టుచేత ధ్యానాభ్యాసము సైతము దుష్కరమగుచో, అపు డొక సుకరమార్గము గలదు - సర్వకర్మలను కర్మప్రభువు నిమిత్తము గావించుము (12-10); దీనివలన మనస్సుయొక్క ప్రతి బహిర్ముఖ వృత్తియు సత్త యొక్క ఆంతర ఆధ్యాత్మికసత్యముతో సంబద్ధమగును, మఱియు తన ప్రవృత్తి యందే తన మూలముతో సంయుక్తమగును. అపుడు పురుషోత్తముని సన్నిధి ప్రాకృతమానవుని యందు ప్రబలము కాగా, అతడు దానితో నిండి, స్వయముగా ఒక భగవద్రూపము, ఒక ఆత్మయు నగును; అట్టియెడ సర్వజీవనము భగవంతుని యొక్క ఒక సంతత సంస్మరణ మగును, సంసిద్ధియు పొదలును, పరమసత్తతో మానవాత్మ సంపూర్ణసత్త యొక్క ఏకతయు వృద్ధినందును.

8. కర్మఫలత్యాగము సర్వవిశిష్టము :

కాని భగవంతుని ఈ సంతత స్మరణము మఱియు కర్మలను వానిలోనికి లేవనెత్తుట-పరిమితమనస్సున కిదియు సాధ్యము కానట్లు తోచవచ్చును; కారణము, అది తన విస్మృతిస్వభావమునందు కర్మ మఱియు కర్మప్రయోజనము వైపునకే తిరిగియుండుటచే, లోపలికి జూచుచు, మన ప్రతి కదలికను పరమాత్మ దివ్యవేదికపై సమర్పింప మఱచిపోవును. ఇట్టి తఱి కర్మయందు నిమ్నప్రకృతిని నియమించి, ఫలాపేక్ష లేక కర్మచేయుట ఉపాయము (12-11). సమస్తఫలమును సన్యసించి, కర్మను నియమించు దివ్యశక్తికి దానిని సమర్పింపవలెను, కాని ఫలము లేదని చెప్పి, ఆ శక్తి విధించు కర్మను మానరాదు. ఏలన ఈ పద్ధతి యందు అవరోధము క్రమముగా క్షీణించి, సులభముగా నంతరించును, అపుడు ఈశ్వరుని స్మరించుటకును, దివ్యచేతనయొక్క స్వేచ్ఛయందు తనను స్థాపించు కొనుటకును మనస్సున కవకాశము ప్రాప్తించును. కాగా నిచ్చట గీత, సామర్థ్యముల ఒక ఆరోహణక్రమమును ప్రతిపాదించును మఱియు నీ నిష్కామ కర్మయోగమునకు సర్వశ్రేష్ఠతను కట్టబెట్టును. ఎట్లన, "అభ్యాసము" (12-12)-ఒక పద్ధతి ననుష్ఠించుచు, తిరిగితిరిగి ప్రయత్నముచేయుట, అనుభవము బొందుట - ఒక గొప్ప శక్తిశాలి సాధనము;

కాని దీనికంటెను వస్తువుల వెనుకనున్న సత్యమునకు బుద్ధివిచారణను సఫలముగా మఱల్చుట శ్రేష్ఠము. ఈ బుద్ధి- జ్ఞానముకంటెను పరమసత్యముపై మనస్సుయొక్క ప్రశాంత, సంపూర్ణ ఏకాగ్రత శ్రేష్ఠము, ఏలన అపుడు చేతన దానియందే నివసించు స్థితికి వచ్చి, దానితో సదా నేకముగా నుండును. కాని కర్మఫలమును సమర్పించుట ఇంతకంటెను శక్తిశాలి ఉపాయము, ఏలన అది కలతకు గల కారణముల నన్నింటిని వెంటనే తొలగించి, ఒక ఆంతర స్థిరతను, శాంతిని సహజముగానే గొనివచ్చి, నిలబెట్టును (12-12), మఱియు నీ శాంతిస్థిరతల ఆధారముపై తక్కిన దంతయు శాంతాత్మయొక్క అధికారమున పదిలముగా నుండును. అపుడు చేతన హాయిగా నుండి, తనను సుఖముగా భగవంతునియందు స్థిరపఱచుకొనగలదు, మఱియు నిరుపద్రవముగా సంసిద్ధి కెగయగలదు. అపుడు జ్ఞానము, సంకల్పము మఱియు భక్తి సైతము స్థిరశాంతిరూపమగు ధృఢభూమినుండి తమ శిఖరములను నిత్యతారూప ఆకాశములోనికి లేవనెత్తగలుగును.

9. భక్తుని దివ్యప్రకృతి :

మంచిది, అయితే ఈ మార్గము ననుసరించి, పురుషోత్తముని ఉపాసనకు దిగిన భక్తుని దివ్యప్రకృతి ఎట్లుండును, అతని సత్తా చేతనలయొక్క మహత్తరస్థితి యేమి యగును ? గీత, తాను మున్ముందు గట్టిగా విధించిన సమత, నిష్కామత మఱియు అంతరాత్మస్వతంత్రతలనే వివిధ రూపములలో పలు శ్లోకములందు ఘంటానినాదముగా వచించును. ఇదియే ఆధారముగావలెను - కావుననే ఆరంభమున దానియందంత బలము మోపబడెను (2-45, 47, 48). మఱియు నీ ఆధారముపై, భక్తి, అనగా పురుషోత్తమునియందు ప్రేమారాధనలు, అంతరాత్మవృక్షమును ఒకానొక మహత్తమ, ఉన్నతతమ సంసిద్ధి దిశగా పెంచవలెను; ఆ సంసిద్ధికి ఈ ప్రశాంతసమత విశాలప్రతిష్ఠగా నుండును. మొదట, అహంకార, మమకారరాహిత్యము- "నిర్మమో నిరహంకారః" (12-13). ఎవని మనోహృదయము విశ్వవ్యాప్తమో మఱియు అహంకారపు ఇఱుకు గోడలను పగులగొట్టివేసెనో, అతడు పురుషోత్తమభక్తుడు. ఒక విశ్వప్రేమ అతని హృదయమునందు కాపురముచేయును, ఒక విశ్వకరుణ దానినుండి వెలువడి, భూమిని సముద్రమువలె చుట్టివచ్చును (12-13). అతనికి సర్వభూతములపట్ల మైత్రి, జాలి యుండును, దేనిపట్ల ద్వేష

ముండదు; కారణము, అతడు దేనినైన ఇముడ్చుకొనగల క్షమాసాగరము (12-13). ఒక నిష్కామసంతుష్టి, సుఖదుఃఖము లందు ప్రశాంతసమత, ధృఢసంయమము, యోగి కుండవలసిన ధృఢనిశ్చయము, తన మనోబుద్ధులను సర్వథా తన చేతనా జ్ఞానముల అధీశ్వరునికి సమర్పించివేయు భక్తి ప్రేమలు-ఇవి యన్నియు ఆ భక్తుని సొత్తు (12-14). అథవా భక్తుడు కేవల మిటు లుండవచ్చును: క్షుబ్ధము, వ్యాకులము నగు నిమ్నప్రకృతినుండియు, దాని హర్షము, భయము, ఉద్వేగము మఱియు అసహన రూప తరంగములనుండియు విముక్తిని మాత్రము బొంది, అతడు ఒక శాంతిమూర్తిగా నుండును; అతనిచేత ప్రపంచము వ్యథ చెందదు, అతడు ప్రపంచముచేత వ్యథ చెందడు. అతడు శాంతిమయుడు, అతనితో నందరు శాంతముగా నుందురు (12-15).

10. కర్మపరిత్యాగి గావుననే కర్మదక్షుడు :

లేక, భక్తుడు తన సర్వకామమును, క్రియను తన సత్తాస్వామికి సమర్పించినవాడగును (12-16); అతడు శుద్ధశాంతుడు, ఉదాసీనుడు, అనగా ఎట్టి ఫలితముచేతను, ఘటనచేతను బాధను గాని, వ్యథనుగాని పొందడు; అతడు "సర్వారంభపరిత్యాగీ" (12-16), అనగా ఆంతర లేక బాహ్యకర్మ యొక్క అహంకారికము, వైయక్తికము, మానసికము నగు సర్వారంభమును (ఆరంభించుటను) దూరముగా పరిత్యజించినవాడు; తన నిశ్చయములచేతను, అభిరుచులచేతను, కామములచేతను దారితప్పించక, భగవంతుని యిచ్ఛను, జ్ఞానమును తద్వారా నిరాఘాటముగా ప్రవహింపనిచ్చువా డతడు, మఱియు నందుచేతనే తన ప్రకృతియొక్క సమస్తక్రియయందు శీఘ్రకారి మఱియు సుదక్షుడు; ఏలన పరమసంకల్పముతో ఈ నిర్దుష్ట ఏకత్వము, ఈ స్వచ్ఛ ఉపకరణభావము - ఇదియే కర్మలయందు పరమదక్షతకు ప్రబలనియమము, మఱల, ఎవడు సుఖమును కామించి, దాని స్పర్శకు హర్షించడో, లేక అసుఖమును ద్వేషించి, దాని భారముచేత శోకించడో, అట్టివా డతడు (2-58). అతడు శుభాశుభములకు గల వ్యత్యాసమును పాటింపడు (12-17) (2-50). ఏలన అతని భక్తి వాని రెంటిని తన సనాతన ప్రేమికుడు మఱియు ప్రభువు హస్తములనుండి ప్రాప్తించిన శ్రేయస్కర వస్తువులుగానే భావించి, సమముగా స్వీకరించును (12-17) (2-50). భగవంతుని ప్రియుడగు భక్తుడు విశాలసమతతో నొప్పారు విశిష్టజనుడు, అతడు శత్రు మిత్రులయందు

సముడు, మానావమానములయందు, సుఖదుఃఖములయందు నిందాస్తుతులయందు, ఒక్క మాటలో, సామాన్యప్రకృతిని వేధించు సర్వవిరుద్ధ ప్రభావములందు సముడు (12–18). వ్యక్తి లేక వస్తువుతో గాని, స్థలము లేక గృహముతో గాని అతని కెట్టి సంగము నుండదు (12–19); ఎట్టి పరిసరములతో నైన, మానవులు తనతో నవలంబించు నెట్టి సంబంధముతో నైన, ఎట్టి పదవి లేక భాగ్యముతోనైన అతడు తుష్టిని, సంతృప్తిని బొందును (12–19). అతని మనస్సు సర్వవిషయములందు దృఢముగా నుండును, కారణము, అది సంతతము అత్యున్నతాత్మయందు నెలకొని, తన ప్రేమారాధనల ఏకమాత్రమ విషయమగు భగవంతుని యందే కుదురుకొని యుండును. సమత, నిష్కామత, అహంకారికప్రకృతినుండి స్వతంత్రత – ఇవియే మహావిముక్తికి గీతాశాస్త్ర మపేక్షించు పరిపూర్ణాధారము. సర్వవస్తువులందును ఏకాత్మను దర్శించు నిర్మలజ్ఞానము, ఈ జ్ఞానమునుండి ఫలించు ప్రశాంత, నిరహంకారసమత, ఈ సమతయందు కర్మప్రభువునకు నివేదించబడు నిష్కామకర్మ, చివరకు అంతర్నివాసియగు మహత్తరపురుషుని హస్తములలోనికి చేయబడు, మానవుని సమస్త మానసికప్రకృతియొక్క సమర్పణము – ఈ నాలుగును గీతయొక్క ప్రథమ ఆధారభూత బోధనము మఱియు ఇచ్ఛించవలసిన ప్రధానవస్తువు. మఱియు ఈ సమతయొక్క కిరీటము ప్రేమ; కాగా ఈ ప్రేమజ్ఞానమునందు ప్రతిష్ఠితము, ఉపకరణముల క్రియయందు కృతకృత్యము, సర్వవస్తువులు మఱియు ప్రాణులకు విస్తారితము; విశ్వస్రష్ఠ మఱియు నీశ్వరుడగు దివ్యాత్మలోనికి – "సుహృదం సర్వభూతానాం సర్వలోకమహేశ్వరం" (5–29) – ప్రవహించు ఒక విశాలము, మనోహరము, సర్వసమావేశము నగు దివ్యప్రేమ ఈ ప్రేమ.

11. అమృతధర్మము :

ఇదియే పరమ ఆధ్యాత్మికసంసిద్ధి ప్రాప్తించుటకు ఆధారము, నిబంధనము, సాధనము, మఱియు నిది ఎవ్విధముగా నెవరియందున్నను వారు నాకు ప్రియులు – "భక్తిమాన్ మే ప్రియః" (12–19) – అని భగవంతుడు పలుకును. కాని ఏ మహితాత్ములు నాకు అత్యంత సమీపవర్తులో, నాయందలి ఎవరి ప్రేమ నేనిపుడే చూపిన మార్గము మఱియు ప్రక్రియచేత తతోధికముగా మహత్తమ సంసిద్ధియందు సంపూర్ణము చేయబడినదో, వారు నాకు అత్యంతప్రియులు–"అతీవ మే ప్రియాః"

(12-20). ఈ భక్తులు పురుషోత్తమునే తమ ఏకమాత్ర ఆధ్యాత్మిక లక్ష్యము గావించుకొని, ఈ బోధనయందు వర్ణించబడిన అమరత్వ ప్రాపకధర్మమును పూర్ణశ్రద్ధతో, యథోక్తప్రకారముగా అనుష్ఠించు భక్తపుంగవులు. గీతాపరిభాషయందు ధర్మ మన సత్తను, దాని కర్మలను శాసించు నొక నియమము మఱియు అంతఃప్రకృతి నుండి ప్రభవించుచు, దానిచేతనే నిర్ణయింపబడు ఒక క్రియ - "స్వభావనియతం కర్మ" (18-47). మనఃప్రాణశరీరముల నిమ్న అజ్ఞానప్రకృతియందు పెక్కు ధర్మములు, పెక్కు విధానములు, పెక్కు ప్రమాణములు మఱియు నియమము లుండును, ఏలన మానసిక, ప్రాణిక మఱియు భౌతికప్రకృతియొక్క మాఱుచుండు అవస్థలు మఱియు ప్రకారములు (types) పెక్కు లుండును. కాగా అమృతధర్మము ఏకమాత్రము; అది అత్యున్నత, ఆధ్యాత్మిక దివ్యచేతన మఱియు దాని శక్తులయొక్క ధర్మము, అనగా పరప్రకృతి (7-5) యొక్క ధర్మము. ఆ ధర్మము త్రిగుణాతీతము (7-13. 14-19), మఱియు దాని నందుకొనుటకు ఈ నిమ్నధర్మము లన్నింటిని పరిత్యజించ వలెను - "సర్వధర్మాన్ పరిత్యజ్య" (18-66). వీని యన్నింటిస్థానమున ఏకమాత్రము, విమోచకము, ఏకీకరము నగు, సనాతనుని చేతన మఱియు శక్తి యొక్కటియే మన కర్మయొక్క అనంతమూలము, దాని ఆకారము, నిర్ణాయకము, ఆదర్శము గావలెను. నిమ్నతర వైయక్తిక అహంకారమునుండి బైటబడుట; అవికార్యము, సనాతనము, సర్వవ్యాపకము నగు అక్షరాత్మయొక్క నిర్వ్యక్తికము, సమము నగు శాంతిలో ప్రవేశించుట; ఆ శాంతినుండి సమస్తప్రకృతి మఱియు సత్తయొక్క పరిపూర్ణ ఆత్మసమర్పణద్వారా అక్షరాత్మకంటె నితరము, పరతరము నగు దాని నాకాంక్షించుట - ఇదిగో యిది ఈ యోగముయొక్క ప్రథమావశ్యకత. ఈ ఆకాంక్షాబలముమీద భక్తుడు "అమృతధర్మమున" (12-20) కెగయగలడు. అచ్చట సత్త, చేతన మఱియు దివ్యానందమునందు మహత్తమ ఉత్తమపురుషునితో (15-17) ఏకీభూతుడై, అతని పరమ, క్రియాశీల ప్రకృతిశక్తితో - "స్వా ప్రకృతిః" (4-6) - ఏకీభూతుడై, విముక్త పురుషుడు ఒక అత్యున్నత అమృతత్వము మఱియు నొక పరిపూర్ణస్వాతంత్ర్యముయొక్క సత్యశక్తియందు అనంతముగా తెలిసికొనగలడు, అమేయముగా ప్రేమించగలడు, అస్ఖలితముగా కర్మచేయగలడు. తక్కిన గీత యంతయు ఈ అమృతధర్మముపై పూర్ణతరప్రకాశమును బఱపుటకే వ్రాయబడినది.

రెండవ భాగము

పరమ రహస్యము

(The Supreme Secret)

13. క్షేత్రము, క్షేత్రజ్ఞుడు

1. తృతీయషట్కము సంబంధములను వివరించును :

గీత ఓపరి ఆఱు అధ్యాయములందు, గురు విప్పటికే అర్జునున కనుగ్రహించిన ప్రబోధమును మఱియొక రూపమున ప్రతిపాదించును; అంతరాత్మ నిమ్న ప్రకృతి నుండి దివ్యప్రకృతిలోని కెగయు మార్గమును స్పష్ట, సంపూర్ణజ్ఞానముపై ప్రతిష్ఠించుట కిది ఆవశ్యకము. వస్తుతః అదియు అదే వెనుకటి జ్ఞానము, కాని దానియందు వివరములను, సంబంధములను వ్యక్తముచేసి, వానికి పూర్ణార్థ మివ్వబడును; మఱియు పూర్వము యథాలాపముగా స్మరింపబడిన లేక వేఱొక ప్రయోజనముతో ప్రతిపాదించబడిన తలపులు మఱియు సత్యములు ఇక ముందు తమ పూర్ణార్థముతో ఆవిష్కరించబడును. ఉదాహరణకు, ప్రథమషట్కమున అక్షరాత్మకును, ప్రకృతిగత అంతరాత్మకును గల విభేదమును (2-45) జూపుటకు ఆవశ్యకమగు జ్ఞానమునకు (2-12, 17) పూర్ణ ప్రాధాన్య మీయబడెను. కాని అక్కడ పరమాత్మ మఱియు పరమపురుషుడు అస్పష్టముగా మాత్రమే సూచించబడెను. ప్రపంచమున కర్మసేయుటను సమర్థించుటకు పరమాత్మ గ్రహించబడెను మఱియు సత్తాస్వామిగా వక్కాణించబడెను (5-29); అంతకు మించి దాని స్వరూప మేమియో, ఇతరముతో దాని సంబంధము లెట్టివో సూచించుట గూడ జరుగలేదు. శేషించిన 13-18, అధ్యాయములు, అడచిపెట్టిన ఈ జ్ఞానమును ఒక విస్పష్టప్రకాశమున, ఒక ప్రబల ప్రాధాన్యమున ప్రకటించుటకు వినియోగించబడును. కాగా 7-12 అధ్యాయములలో ఈశ్వరునకును (10-3), పరాపరప్రకృతుల వివేచనకును (7-5), సర్వోత్పాదకము, సర్వాత్మకము (11-38) నగు ప్రకృతియందలి భగవంతునకును, సర్వభూతములలోని ఏకమునకును (11-7) ప్రాముఖ్యమీయబడెను. కాని పరమపురుషునకును మఱియు అక్షరపురుషునకును, జీవునకు మఱియు తన గుణకర్మరూపమున ప్రకృతికిని గల యథాభూతసంబంధముల నిపుడు ఎక్కువ నిర్దిష్టముగా వెలికిదెచ్చు టావశ్యకము. కావున అస్పష్టముగా నుంచబడిన ఈ విషయములను విస్పష్టము చేయగల సమాధానమును రాబట్టు ప్రశ్న అర్జునునిచే వేయించబడును. అతడు పురుష ప్రకృతులను గుఱించి తెలియగోరును (13-1); క్షేత్రక్షేత్రజ్ఞులను గుఱించియు,

జ్ఞానజ్ఞేయములను గుఱించియు ప్రశ్నించును. ఈ ప్రశ్నయందే ఆత్మ మఱియు ప్రపంచముయొక్క సర్వజ్ఞానసారము ఇమిడియున్నది; ఇది అంతరాత్మ తన ప్రకృతికృత అజ్ఞానమును త్రోసిపుచ్చుట కావశ్యకము, మఱియు జ్ఞానముయొక్కయు, జీవనము యొక్కయు, కర్మలయొక్కయు, అటులే ఈ తత్త్వములందలి భగవంతునితో తన సంబంధములయొక్కయు సముచిత ఉపయోగము నాశ్రయించి, అడుగులు వేయుచు, అంతరాత్మ సనాతనపురుషునితో సత్తాసమైక్యములోని కారోహించుటకును ఆవశ్యకము.

2. యజ్ఞకర్మఫలితము :

ఈ విషయములందు గీతాభావముల సారాంశము, దాని విచారణయొక్క చరమవికాసమును మనమునం దుంచుకొని, ఇతఃపూర్వమే ఒక మేరకు విశదీకరించ బడినది; కాని, గీతావిధానము ననుసరించి, దాని ప్రస్తుత తత్పరతాదృక్కోణమునుంచి ఆ భావములను మనము ప్రతిపాదించవచ్చును. గీత ముందు కర్మ కవకాశమిచ్చును; పిమ్మట ఆత్మజ్ఞానముతో భగవదిచ్ఛకు ఉపకరణ ముగా చేయునట్టి ఆ కర్మను బ్రాహ్మస్థితితో పూర్ణసంగతముగాను, భగవదభిముఖ వృత్తిలో నొక అపరిహార్య అంశముగాను ఆమోదించును; చివరకు పరమునికి భక్తితో జేయు నొక అంతర యజ్ఞముగా దానిని లేవనెత్తును - మంచిది, కాని ఈ మార్గము నిమ్నప్రకృతినుండి పరప్రకృతిలోనికి, మర్త్యసత్తనుండి అమరసత్తలోనికి ఎగయుట యను ఆధ్యాత్మిక జీవనముయొక్క మహాలక్ష్యమును సక్రియముగా నెట్లు ప్రభావితముగావించును ? సర్వజీవనము, సర్వకర్మ అంతరాత్మకును, ప్రకృతికిని నడుమ సాగుచుండు నొక ఆదానప్రదానము: దీనియొక్క మూలస్వభావ మేది యగును? తన ఆధ్యాత్మిక పరాకాష్టయందది యే రూపము ధరించును? ఇంకను, తన నిమ్న మఱియు బాహ్యప్రేరణలనుండి విముక్తమై పరమాత్మయొక్క అత్యున్నతస్థితిలోనికిని, దాని గభీరతమ ప్రేరకశక్తిలోనికి వృద్ధిచెందు నంతరాత్మ నా ఆదానప్రదానమే పరిపూర్ణతకు గొనిపోవును? ఇవి యిచ్చట ప్రసక్తమైన ప్రశ్నలు - యితరప్రశ్నలును గలవు గాని, ఆనా డవి అత్యవసరములు గాదు గావున, గీత వానిని లేవనెత్తదు - విశాలదృష్టితో చేయబడిన, వేదాంత, సాంఖ్య, యోగమతముల సమన్వయమునుండి గ్రహించబడిన ఒక పరిష్కారపద్ధతిలో గీత పై ప్రశ్నలకు సమాధాన మిచ్చును - ఈ సమన్వయమే సమస్త గీతావిచారణకు మూలకందము.

3. జీవాత్మయొక్క త్రివిధసత్యము :

ఇచ్చట ప్రకృతియందు తన దేహభావము నెదుర్కొను జీవాత్మ తన స్వీయానుభవమునకు త్రివిధసత్యమగును. మొదట, ప్రకృతి–బాహ్యక్రియలకు అజ్ఞానముచేత అధీనమైనట్లు గన్పించు ఆధ్యాత్మిక సత్త యది, మఱియు తన చలభావమునందు క్షణక్షణము మాఱుచుండు, ప్రకృత్యంశ మగు అహంకార రూపమున అది ప్రకటమగును. తర్వాత అది –జీవాత్మ – ఈ సమస్తక్రియ మఱియు గతినుండి వెనుకకు తగ్గినపుడు, తన ఉచ్ఛతరసత్య మొక సనాతన, నిర్వ్యక్తిక ఆత్మయనియు, అక్షరసత్త యనియు గనుగొనును; ఈ ఆత్మ తన సన్నిధిచేత క్రియను ధరించును, మఱియు అక్షుబ్ధసాక్షిగా దానిని వీక్షించునే గాని, అంతకు మించి ఆ క్రియయందు పాల్గొనదు. మఱియు, చివరకు, జీవుడు తనయీ రెండు విరుద్ధ ఆత్మలకు నావల తన దృష్టిని సారించినపుడు, రెండింటిని మించిన, అనిర్వచనీయ మగు నొక పరమసత్యమును గనుగొనును – దానినుండియే అవి రెండును ప్రభవించును, అది ఆత్మకు పరమాత్మ, మఱియు సర్వప్రకృతికిని, క్రియకును ప్రభువు నగు సనాతనము; మఱియు ప్రభువు మాత్రమే గాక, విశ్వము నందలి తన స్వీయశక్తి యొక్క ఈ సమస్త క్రియాకలాపములకు ఆదియు, నాధ్యాత్మి కాధారమును, రంగస్థలము నగును; మఱియు ఆదియు, ఆధ్యాత్మికగృహమును మాత్రమే గాక, సర్వశక్తులు, వస్తువులు, సత్తలలోపల ఆధ్యాత్మికనివాసియు నగును; మఱియు నివాసి మాత్రమే గాక, మనచే ప్రకృతి యని పిలువబడు, తన సత్తయొక్క ఈ సనాతన ఊర్జముయొక్క వికాసములచేత తానే సర్వ ఊర్జములు (energies), బలములు, వస్తువులు మఱియు సత్తలు నగును. కాగా ఈ ప్రకృతి సైతము రెండు విధములు – ఒకటి జన్యము మఱియు హీనము, రెండవది ఆద్యము మఱియు పరము, విశ్వయంత్రాంగరూపమగు ఒక నిమ్నప్రకృతి గలదు, దీని సంయోగమున ప్రకృతిగత అంతరాత్మ మాయనుండి జనించిన –"త్రైగుణ్యమయీ మాయా" (7–14) – ఒక అజ్ఞానమున నివసించును, దేహయుక్త, మనఃప్రాణనిర్మిత అహంకారముగా తనను భావించుకొనును, ప్రకృతిగుణముల శక్తికి లోబడి పని చేయును; బద్ధము, దుఃఖమయము, వ్యక్తిత్వపరిచ్ఛిన్నముగా తనను గుఱించి తలపోయును, జన్మచక్రమునకు కట్టివేయబడిన ఒక నశ్వరవస్తువుగా, స్వీయప్రకృతికే దాస్యము

చేయు దాసునిగా త న్నెఱుంగును, నిమ్నతరమగు నీ జీవనశక్తికి పైన తన సత్తయొక్క ఉచ్చతరమగు నొక దివ్య ఆధ్యాత్మికశక్తి గలదు, దీనియందు అంతరాత్మ సర్వదా సనాతన భగవంతునియొక్క ఒక సచేతనాంశము, అది ఆనందమయము, స్వతంత్రము, తన సంభూతియొక్క అవరకరూపమున కతీతము, అమరము, అవ్యయము, అది ఒక దైవశక్తి. ఈ ఉచ్చతరప్రకృతి సాహాయ్యమున, ఒక ఆధ్యాత్మిక సమగ్రతయందు ప్రతిష్ఠింపబడిన దివ్యజ్ఞానము, భక్తి మఱియు కర్మలద్వారా సనాతనుని కెగయుట - ఇదియే సంపూర్ణ ఆధ్యాత్మికవిముక్తికి కీలకము. ఇంతమట్టుకు ఇప్పటికే స్పష్టపఱుపబడినది; కాగా ఈ సత్తాపరివర్తనయందు ఏ యితర ఆలోచనలు ఇమిడిఉన్నవో, విశేషించి ఈ యుభయప్రకృతులకు భేదమేమియో మఱియు మన కర్మయు, అంతరాత్మస్థితియు విమోచనచేత నెట్లు ప్రభావితము లగునో, మన మిపుడు చూడదగును. ఇందునిమిత్తము తా నింతదనుక వెనుక భాగమునం దుంచిన ఉన్నతోన్నతజ్ఞానముయొక్క కొన్ని వివరములలోని కిపుడు గీత విశాలముగా ప్రవేశించును. విశేషించి, సత్తాసంభూతుల, పురుషప్రకృతుల సంబంధమును గుఱించియు, త్రిగుణవ్యాపారము, అత్యున్నతవిముక్తి, పరమాత్మకు అంతరాత్మయొక్క సంపూర్ణ ఆత్మసమర్పణములను గుఱించియు గీత వివరించును. ఈ చివరి ఆఱు అధ్యాయములం దంతటను పరమమహత్త్వముతో నొప్పారున దెంతయో గలదు; కాని ఇచ్చట సైతము, గీతయొక్క చరమవచనము (18-65, 66) సర్వోత్తమముగా మనల నాకట్టుకొనును; ఏలన దానియందు గీతాబోధనయొక్క కేంద్రభావమును, మానవాత్మ కది ప్రసాదించిన మహావాక్యమును, తన సర్వోన్నత సందేశమును మనము కనుగొనగలము.

4. క్షేత్రము, క్షేత్రజ్ఞుడు :

ముందుగా, సర్వసృష్టిని, ప్రకృతిమధ్య నిర్మించుచు, కర్మచేయుచు నుండు అంతరాత్మయొక్క క్షేత్రముగా మనము చూడవలెను. గీత ఈ శరీరమునే అంతరాత్మయొక్క క్షేత్ర మని వ్యాఖ్యానించును (13-2), మఱియు నీ శరీరమున దీనిని తెలిసికొనువా డొకడు గలడు, అతడే క్షేత్రజ్ఞుడు, ప్రకృతిజ్ఞాత. అయితే తర్వాత వచ్చు నిర్వచనలములను బట్టి ఒకటి స్పష్టము : క్షేత్ర మన భౌతిక శరీరము మాత్రమే గాదు, ఆ శరీరము ఆధారముగా నుండి ధరించున దంతయు, అనగా

ప్రకృతివ్యాపారము, మనోవృత్తి, విషయి, విషయక్రియ యంతయుగూడ [1] క్షేత్రమే యగును (13-7). ఈ విశాలతరశరీరము సైతము వైయక్తికక్షేత్రము మాత్రమే; అదే క్షేత్రజ్ఞునియొక్క విపులతరము, సర్వాత్మకము నగు నొక ప్రపంచశరీరము, ప్రపంచక్షేత్రమును గలదు. ఏలన ప్రతి దేహధారిజీవియందును ఈ ఒకే క్షేత్రజ్ఞుడు వర్తించును : ప్రతిభూతమును తన ప్రకృతిశక్తియొక్క బాహ్యఫలితమే, తన నివాసము నిమిత్తము అతడు నిర్మించుకొన్న వస్తువే – "ఈశా వాస్యం సర్వం యత్ కించ" (ఈశ ఉప.); ఈ వస్తువు నిజానికి అతని గతిశీలశక్తియొక్క ఒక పృథగ్భూత, దృఢ, వ్యావహారిక కేంద్రము, అతడు తన వికాసమాన సామరస్యములయొక్క ఒక ప్రథమాధారము మఱియు విషయముగా ఈ కేంద్రము నుపయోగించుకొనును. ప్రకృతియం దతడు, ఏరూపమున ప్రపంచము ఒక పరిమితశరీరమునందలి చేతనను ప్రభావితముగావించి, దానియందు ప్రతిఫలించునో, ఆ రూపమున దాని నెఱుంగును; అనగా మన ఏకమాత్ర మనస్సునకు గన్పించు విధముగానే మనకు ప్రపంచమున్నది. అయితే చివరకు, స్వల్పముగా గన్పించు సదేహచైతన్యము సైతము విస్తరించుకొని, విస్తరించుకొని, విశ్వము నంతను తనలో నిముడ్చుకొనగలదు – "ఆత్మని విశ్వదర్శనం" (6-29). కాని భౌతికముగా శరీరము బ్రహ్మాండమునందలి ఒక పిండాండము, మఱియు నీ బ్రహ్మాండము సైతము ఆధ్యాత్మిక క్షేత్రజ్ఞునికి తాను నివసించు ఒక శరీరము మఱియు క్షేత్రము.

5. క్షేత్రశక్తులు, వికారములు :

మన సత్తయొక్క గోచరరూపమగు ఈ క్షేత్రము యొక్క స్వభావమును, స్వరూపమును, ప్రభవమును, వికారములను, శక్తులను గీత ప్రతిపాదించు నపు డీ పై సత్యము మనకు స్పష్ట మగును, అనగా క్షేత్ర మన ప్రకృతి క్రియాకలాప మంతయు నని తెలియవచ్చును. ఆ క్రియా సాకల్యము మనయందలి క్షేత్రజ్ఞాతయగు సదేహపురుషుని క్షేత్రమగును. ఆధ్యాత్మిక దృక్కోణము నుండి ఈ క్షేత్రజ్ఞానము వేదోపనిషదృషుల మంత్రములలో మనకు గానవచ్చును, అటులే దాని తార్కిక, దార్శనిక విశ్లేషణము బ్రహ్మసూత్రములలో మనకు లభించును; అందునిమిత్తము

[1] తైత్తిరీయోపనిషత్తు పంచవిధశరీరము లేక ప్రకృతికోశమును వివరించును – భౌతిక, ప్రాణిక, మానసిక, ఆదర్శరూప, దివ్యశరీరము; దీనిని సంపూర్ణక్షేత్రముగా తీసికొనవచ్చును. – శ్రీ అ.

వానిని జూడు డని చెప్పి, గీత మాత్రము సాంఖ్యపరిభాషలో క్షేత్రమును వ్యావహారిక దృష్టినుంచి సంక్షిప్తముగా ప్రదిపాదించి తృప్తిపడును. మూలమున అవ్యక్తమనబడు అవ్యాకృత (నిర్విశేష) శక్తి గలదు; దానినుంచి బాహ్యద్రవ్యముయొక్క మూలావస్థలగు పంచమహాభూతముల పరిణామము జరుగును; దానినుండియే ఇంద్రియములు, బుద్ధి, మఱియు నహంకారముయొక్క ఆంతరపరిణామము గూడ సిద్ధించును; ఇంకను ఇంద్రియవిషయము లయిదు గలవు, వీనిని, ఇంద్రియములు ప్రపంచమును గుర్తించు ప్రకారభేదము లని చెప్పుట ఎక్కువ సమంజసము – ఇవి ఇంద్రియసంబంధములు; బుద్ధి మఱియు నింద్రియము లతో గూడిన అహంకారము వీనిద్వారా బాహ్యజగత్తుతో సంబంధము గల్పించుకొని వ్యవహరించును : ఇది క్షేత్రముయొక్క నిర్మాణ స్వరూపము (13-6). పిమ్మట, నొక సామాన్యచేతన గలదు, ఇది విశ్వశక్తిని చేతనీకరించి, తన పనులందు దానికి వెలుగు నిచ్చును; ఆ చేతన కొక విశేషసామర్థ్యము – "ధృతి" (13-7) – గలదు, దీనిచేత విశ్వశక్తి విషయముల సంబంధములను పట్టి నిలుపును, మఱియు మన చేతనకు తన విషయములతో గల బాహ్యాభ్యంతర సంబంధములు దీనిచేత నిలిచి, కొనసాగును. ఇవి క్షేత్రముయొక్క ఆవశ్యకశక్తులు; ఇవి యన్నియు ఏకకాలమున మానసిక, ప్రాణిక, భౌతిక ప్రకృతియొక్క సర్వసామాన్య వైశ్వశక్తులు. పోగా సుఖదుఃఖములు, ఇచ్ఛాద్వేషములు క్షేత్రముయొక్క ప్రధాన వికారములు. సుఖదుఃఖములు, పురుషునియొక్క సహజానందమునకు నిమ్నప్రకృతి కల్పించిన ప్రాణిక లేక సాంవేదనిక వికారము లని వేదాంతదృక్కోణమునుంచి మనము చెప్పుకొనవచ్చును. అటులే అదే దృక్కోణమునుంచి చూచిన, ఇచ్ఛాద్వేషములు సుఖదుఃఖముల కనురూపమగు మానసిక వికారము లగును, ప్రకృతిసంస్పర్శలకు పురుషుని సమాధానమును నిర్ణయించు అతని సంకల్పమునకు ఆమె గల్పించిన వికారములగును. ఈ ద్వంద్వములను కూర్చు భావాత్మక, నిషేధాత్మకరూపములందు నిమ్నప్రకృతిలోని అహమాత్మ విశ్వము నుపభోగించును. అసుఖము, ద్వేషము, శోకము, అరుచి, మున్నగు నిషేధాత్మకరూపములు భ్రష్ట, లేక ఉత్తమ పక్షమున, అజ్ఞానకృత విపరీత సమాధానములు (responses). రాగము, సుఖము, హర్షము, అభిరుచి, మున్నగు భావాత్మకరూపములు కుమార్గమున ప్రేరితసమాధానములు లేక ఉత్తమపక్షమున అపర్యాప్తము, మఱియు ఆధ్యాత్మికానుభవము కంటెను హీనము నగు సమాధానములు.

6. జ్ఞేయవస్తువు :

ఈ వస్తువు లన్నియు గలిసి, ప్రాకృతప్రపంచముతో మన వ్యవహారముయొక్క మూలస్వభావము నేర్పఱచును, కాని స్పష్టముగానే అది మన సత్తయొక్క సంపూర్ణవర్ణన గాదు; అది మన ఇప్పటి వాస్తవరూపమే గాని, మన సంభావ్యతల పరమావధి గాదు. దీని కావల తెలియదగినది కొంత గలదు– "జ్ఞేయం" (13–13), మఱియు జ్ఞాత – క్షేత్రజ్ఞుడు – క్షేత్రమునుండి మఱలి ఎపుడు దానిలోని తనను, దాని అభాసముల వెనుకనున్న దాని నంతను తెలియజూచునో, అపుడు వాస్తవజ్ఞానము ప్రారంభమగును – "జ్ఞానం" (13–12) – ఇది జ్ఞాత యొక్కయు, క్షేత్రముయొక్కయు యథార్థజ్ఞానము. ఈ అంతర్ముఖత యొక్కటియే అజ్ఞానమునుండి తప్పించును. ఏలన ఎంతెంత మనము లోనికి బోదుమో, అంతంత వస్తువుల అధికతర, పూర్ణతర సత్యస్వరూపములను గ్రహింతుము, అటులే భగవంతుడు మఱియు ఆత్మయొక్క ప్రపంచము మఱియు దాని గతియొక్క – ఉభయముయొక్క సంపూర్ణసత్యము నాకళించుకొందుము. కావుననే అది ఏకకాలమున క్షేత్రము మఱియు క్షేత్రజ్ఞుల జ్ఞాన మని దివ్యగురువు నిర్దేశించును – "క్షేత్రక్షేత్రజ్ఞయోర్ జ్ఞానం" (13–3), అది సంయుక్తము, ఏకీకృతము సైతము నగు ఆత్మజ్ఞానము మఱియు ప్రపంచజ్ఞానము, ఇట్టి జ్ఞానమే వాస్తవప్రకాశము మఱియు ప్రజ్ఞ యగును. ఏలన పురుషప్రకృతులు రెండును బ్రహ్మమే, కాని ప్రాకృతప్రపంచముయొక్క యథార్థసత్యము పురుషుని సత్యమును బొందిన విముక్త జ్ఞానిచేతనే కనుగొనబడగలదు. ఆత్మ మఱియు ప్రకృతియందలి ఒకే సద్వస్తువగు ఏకబ్రహ్మమే సర్వజ్ఞానమునకు విషయము.

7. జ్ఞాననియమములు :

పిమ్మట గీత మనకు జ్ఞానస్వరూపమును వర్ణించును, కాదు, జ్ఞాననియమము లను, అంతరనుభవము వైపునకు దిరిగిన మానవుని యొక్క లక్షణములు మఱియు సంకేతములను వివరించును. ఈ లక్షణములు సాంప్రదాయికముగా నంగీకరించిన జ్ఞానియొక్క స్వాభావికలక్షణములు – ఉదాహరణకు, బాహ్య, లౌకికవస్తువులయందలి ఆసక్తినుండి అతని ప్రబలవైముఖ్యము, అతని ఆంతర్ముఖ, మననశీల తత్త్వము, అతని ధృఢచిత్తము మఱియు స్థిరసమత, మహత్తమ అంతరతమ సత్యములపైన, వాస్తవ సనాతన వస్తువులపైన అతని బుద్ధియొక్క సమాహిత స్థిరత్వము. ముందుగా మన కొక నైతిక నియమము, ప్రాకృతసత్తయొక్క సాత్త్వికనియంత్రణము గన్పించును.

అతనియందు ప్రాపంచిక గర్వము మఱియు దర్పముయొక్క సంపూర్ణరాహిత్య ముండును, దీనితోబాటు సరళ ఆత్మయు, క్షమాశీల, చిరసహిష్ణు, దయామయ హృదయము నుండును (13-8); ఇంకను మనఃశరీరము శుద్ధత, ఆత్మసంయమము, నిమ్నప్రకృతియొక్క అప్రతిహత శాసనము, గురుదేవునియొక్క హృదయపూర్వకోపాసనము నతని స్వభావమగును - ఈ గురుదేవుడు హృదయస్థ దివ్యగురువు గావచ్చును, దివ్యజ్ఞానము మూర్తీభవించిన మానవగురువు గావచ్చును - ఏలన ఆ దృష్టితోనే మనము మానవగురువును పూజింతుము (13-8). అటుపిమ్మట జ్ఞానియందు పూర్ణ అనాసక్తి మఱియు సమత యొక్క అధికతర ఉదాత్త, విముక్తవైఖరి గన్పించును (13-10), ఇంద్రియవిషయముల పట్ల ప్రాకృత మానవుని కుండు అనురక్తి అతని నుండి దూరమగును, సామాన్య మానవుని క్రూరముగా హింసించు అహంకార శాసనమునుండి అతనికి మౌలిక స్వాతంత్ర్యముండును (13-9). అత డిక కుటుంబమునందు సక్తుడు గాడు, లీనమసలే గాడు. ఈ ప్రాణిక మఱియు పాశవిక వృత్తులకు బదులు, అతని సంకల్పము, ఇంద్రియము, బుద్ధి అసక్తముగా పనిచేయును; సాధారణజీవితమును వేధించు జన్మమృత్యువులు మఱియు జరావ్యాధులందు అతడు నిశితముగా లోపమును దర్శించును; ప్రియాప్రియ ఘటనలపట్ల అతడు నిత్యము సమచిత్తుడు (13-10), ఏలన అతని ఆత్మ అంతఃస్థితము గాన, బాహ్యఘటనల కభేద్యము. ధ్యానపరమైన అతని మనస్సు ఏకాంతము వైపునకు దిరిగి, జనకోలాహలమునకు దూరముగా నివసించును. చివరకు, జీవనమును సార్థకము చేయు ముఖ్యవిషయముల పట్ల అతనిలోపల నొక ప్రబలప్రవణత యుండును, జీవనముయొక్క వాస్తవార్థము మఱియు విశాల తత్త్వములపట్ల దార్శనికదృష్టియు, ఆంతర ఆధ్యాత్మికజ్ఞానము మఱియు ప్రకాశము యొక్క ప్రశాంతసాతత్యము (సంతతము సాగుట), వ్యభిచరించని భక్తియోగము, భగవత్ప్రేమ, విశ్వగతము మఱియు సనాతన మగు భగవత్సన్నిధి పట్ల హృదయము యొక్క గభీర, సంతత ఆరాధనాభావము అతనియందు వెలుగొందును (13-11, 12).

8. బ్రహ్మము అంతయునగు ఏకము :

ఆధ్యాత్మిక జ్ఞాన మపేక్షించు మానసము లక్షించవలసిన ఏకమాత్ర లక్ష్యము పరమసనాతనుడు; ప్రకృతి పొగ మంచుతో కప్పబడిన అంతరాత్మ ఈ సనాతనుని యందు స్థిరపడి నపుడు, అమరత్వము మఱియు నవీతత్వముయొక్క తన సహజ

మూలచేతనను తిరిగిపొంది, అనుభవించును (13-13). క్షణికముపై నిలచుట, దృశ్యమునందు పరిమితమగుట మర్త్యత్వమును అంగీకరించుటయే యగును; ఏది నశ్వరవస్తువులందు ఆంతరము మఱియు నవికార్యమో, అదియే వానియందలి నిత్యసత్యము. ప్రకృతియొక్క ఆభాసరూపములచే పీడింపబడుటకు అంతరాత్మ స్వయముగా నెపు డవకాశ మిచ్చునో, అపు డది తనసుదానే కోల్పోవును మఱియు తన శరీరముల జననమరణముల చక్రమునందు పరిభ్రమించుచుండును. అచ్చట, వ్యక్తిత్వము మఱియు దాని ప్రయోజనముల పరివర్తనలను ఆవేగముతో ననుసరించుచు, నిర్వ్యక్తికము, అజము నగు తన ఆత్మసత్తను అంతరాత్మ లోనికి వెళ్లి, పొందజాలకుండును. అట్లు చేయగలుగుటకు అంతరాత్మ తన స్వరూపమును గనుగొనవలెను, మఱియు నేది జన్మలను ధరించునో, కాని వాని రూపనాశముతో తాను నశించదో, అట్టి తన యథార్థసత్తలోని కుపసంహరించుకొనవలెను. దేనికి జననమరణములు కేవలము బాహ్యఘటనలో, అట్టి నిత్యత్వము ననుభవించుటయే అంతరాత్మయొక్క యథార్థ అమరత్వము మఱియు అతీతత్వము. ఆ పరమనిత్యత్వము లేక నిత్యమే బ్రహ్మము. ఏది అతీతమో మఱియు నేది విశ్వాత్మకమో అది - "తత్తు" - బ్రహ్మము; అది అగ్రభాగమున ప్రకృతిపురుషుల ఖేనలమున కాధారముగా నుండు నట్టియు, వెనుకభాగమున వారి అవ్యయ ఏకత్వమునకు మూలముగా నుండు నట్టియు విముక్తసత్త యగును; అది ఏకకాలమున క్షరము మఱియు నక్షరము, <u>సర్వము</u> నగు <u>ఏకము</u>. తన సర్వోన్నత విశ్వాతీత పదమునందు, బ్రహ్మము ఆది గాని, వికారము గాని లేని ఒక అతీత నిత్యత్వము; అచ్చ టది, బాహ్యప్రపంచము ఏ ప్రాకృతద్వంద్వముల మధ్య తిరుగు చుండునో, అట్టి సదసత్తులు, అనగా స్థాయిత్వక్షణికత్వముల కెంతో పై నుండును (13-13). కాని ఒకసారి ఈ బ్రహ్మపదార్థము మఱియు ప్రకాశమునందు జూడబడినపుడు, ఈ ప్రపంచము సైతము, తాను మనఇంద్రియములకు గన్పించు దానికంటె విభిన్న మగును; అప్పు డిక విశ్వమును మనఃప్రాణద్రవ్యముల ఒక సుడిగుండము గానో, శక్తి మఱియు పదార్థముయొక్క నిర్మాణముల ఒక సంఘాతము గానో కాక, ఈ సనాతనబ్రహ్మముతో అనన్యముగానే చూతుము - "అనాదిమత్" (13-13). ఒక పురుషుడు గలడు, అతడు తనచేతనే విశ్వగతి నంతను పూరించి, దానిని పరివేష్టించియు నుండును - నిజాని కా గతియు నతడే గదా - మఱియు నతడు ప్రతి సాంతవస్తువును అనంతత యను తన దివ్యాంబరముచే నలంకరించును (13-14); అతడు

అశరీరుడు, శతసహస్రశరీరుడు నగు పురుషుడు, అతని బలరూప హస్తములు, వేగరూప పాదములు మనకు ప్రతివైపున నుండును; మన మెటు తిరిగినను, అటువైపున అతని తలలు, కండ్లు మఱియు మొగముల ఆ అనంతరూపములను గాంతుము; అతని శ్రవణము సర్వత్ర కాలాతీతముయొక్క మౌనమును, కాలగత ప్రపంచములయొక్క సంగీతమును ఆలకించును - ఇదిగో, అతడే విశ్వపురుషుడు, అతని కౌగిలిలోనే మనము నివసింతుము.

9. హృదయములోని బ్రహ్మమే క్షేత్రజ్ఞుడు :

ప్రకృతిపురుషుల సంబంధము లన్నియు బ్రహ్మనిత్యతయందు సంభవించు సంఘటనలు; ఈ సంబంధముల ప్రతి బింబకములు, ఘటకములు (అవయవములు) నగు ఇంద్రియములు మఱియు గుణములు పరమాత్మకు సాధనములుగా నుండి, అతని శక్తిక్రియలను అతనికి చేరవేయును. అతడు-బ్రహ్మము-మాత్రము ఇంద్రియ పరిమితుల కావలనుండును, అనగా అన్నింటిని చూచును గాని, బాహ్యచక్షువుతో గాదు; అన్నింటిని వినునుగాని, శారీరికశ్రవణముతో గాదు; అన్నింటిని గమనించును గాని, పరిమితి కారక మనస్సుతో గాదు - మనస్సు ఊహించునదే గాని, ఎఱుంగునది గాదు. అతడు గుణములలోనిముడని నిర్గుణుడైనప్పటికి, వానిని తనలో గలిగియుండి, తనతత్త్వమున వానిని నిర్ణయించి, వాని క్రియ నుపభోగించును (13-15). అతడు దేనియందు సక్తుడు గాకయే, తన విశాల, శాశ్వత స్వతంత్రత యందు తన విశ్వశక్తి యొక్క సర్వక్రియను, గతిని, సందేశమును ధరించును. మనలోపల నున్న దంతయు నతడే, మనకు వెలుపల మన మనుభవించిన దంతయు నతడే (13-16). చరాచరములు, దూరస్థసమీపస్థములు - అంతయు నేకకాలమున నతడే. అతడు మన జ్ఞానమున కందని సూక్ష్మముయొక్క సూక్ష్మత్వము, అటులే మన మనస్సున కందు శక్తి, పదార్థములయొక్క స్థూలరూపము (13-16). అతడు అవిభాజ్యము మఱియు నేకము, కాని రూపములందు తనను విభజించుకొనునట్లు కన్పించును, వేఱువేఱు వస్తువులుగా గోచరించును (13-17). సర్వవస్తువులు అతనిలో నుపసంహరించు కొనగలవు, పరమాత్మలో తమ ఆత్మసత్తయొక్క అవిభాజ్య ఏకతకు తిరిగిరాగలవు. అంతయు నిత్య మతనినుండి జనించును, అతని నిత్యతయందు ధరింపబడును, అతని ఏకతలోనికి నిత్యము గ్రహించబడును (13-17). అతడు జ్యోతులకు జ్యోతి, మన అజ్ఞానాంధకారమున కంతకు నావల నిత్యప్రకాశమానుడు

(13-18). జ్ఞానము నతడే, జ్ఞేయము నతడే. తాను ప్రకృతిక్రియలోనికి బంపిన అంతరాత్మ శక్తి - సంపన్నము కాగా, దాని నిమిత్తము తేజోరూపమున తన నభివ్యక్తముచేసికొనును, ఈ తేజమే ఆధ్యాత్మిక అతిమానస జ్ఞానరూపము ధరించి, ప్రదీప్తమనస్సును ముంచెత్తి, దాని రూపాంతరమును సాధించును. ఈ సనాతనజ్యోతి ప్రతిప్రాణిహృదయమునందును గలదు, అతడే రహస్య "క్షేత్రజ్ఞుడు," అతడే సర్వభూతముల హృదయస్థుడగు ఈశ్వరరూపమున తన సంభూతియొక్క వ్యష్టి, సమష్టిక్షేత్రములపై నధ్యక్షత వహించును (13-18). మానవుడు తన లోపలి ఈ సనాతన మఱియు విశ్వగత భగవంతుని దర్శించి నపుడు, సర్వవస్తువు లందలి అంతరాత్మ పట్ల అతడు సచేతనుడై నపుడు, మఱియు ప్రకృతిగతుడగు పురుషుని కనుగొని నపుడు, విశ్వమంతయు సనాతనబ్రహ్మమునందు పైకి లేచుచున్న ఒక తరంగ మనియు, ఉన్నదంతయు నొకే సత్త యనియు అతని కనుభూతమై నపుడు, అతడు భగవత్ప్రకాశముతో వెలుగొందుచు, ప్రాకృత ప్రపంచముల సంరంభ మధ్యమున ముక్తుడై నిలబడును. భగవంతుని జ్ఞానము మఱియు నీ భగవంతునికి భక్తిసహిత పరిపూర్ణాభిముఖత - ఇదియే ఆధ్యాత్మిక మహావిముక్తికి పరమరహస్యము. విముక్తి, ప్రేమ మఱియు నాధ్యాత్మికజ్ఞానము మనలను మర్త్యప్రకృతినుండి అమృతసత్తలోనికి లేవనెత్తును (13-19).

10. జీవుని జీవన్ముక్తి :

పురుషుడు మఱియు ప్రకృతి సనాతన బ్రహ్మము యొక్క రెండు పార్శ్వములు మాత్రము, ద్వంద్వముగా గన్పించు నీ ద్వంద్వము అతని వైశ్వసత్తయొక్క క్రియల కాధారము. పురుషుడు, ప్రకృతి - ఇరువురు అనాదిసనాతనులు; కాని ప్రకృతి గుణములును, మన అనుభవమునకు ఆమె ధరించు నిమ్నతరరూపములును ఈ రెండు తత్త్వముల పరస్పరవ్యాపారమునందు, తమ ఆదిని గలిగియుండును (13-20). అవి ఆమెనుండియే వచ్చును. ఆమెచేతనే కారణము మఱియు కార్యము, కర్మ మఱియు దాని ఫలితములు, శక్తి మఱియు దాని క్రియల బాహ్యసంబంధమును ధరించును (13-21). అవి సదా మాఱుచుండగా, పురుషుడు మఱియు ప్రకృతి వానితో మాఱుచున్నట్లు కన్పించును, కాని ఈ రెండు శక్తులు సనాతనము మఱియు సదా ఏకరూపము. ప్రకృతి సృజించును మఱియు కర్మచేయును, పురుషుడు ఆమె సృష్టిని, కర్మను అనుభవించును (13-21); కాని ఆమె తన అవరకర్మయం దీ

అనుభవమును సుఖదుఃఖముల క్షుద్ర, మలిన రూపముల లోనికి మార్చును. బలాత్కారముగా అంతరాత్మ, అనగా వైయక్తికపురుషుడు ఆమె గుణకర్మలచేత నాకర్షింపబడును మఱియు నీ ఆకర్షణ అతనిని నానావిధజన్మలలోనికి లాగుకొనిపోవును; వానియం దతడు వైవిధ్యమును, భిన్నభిన్నావస్థలను, శుభాశుభములను అనుభవించును (13-22). కాని ఇది యంతయు పురుషునియొక్క బాహ్యానుభవము మాత్రమే, ఏలన అతడు క్షరప్రకృతితో తాదాత్మ్యముచేత భావనయందుమాత్రమే క్షరుడు. ఆమెయొక్కయు, మనయొక్కయు దేవదేవుడు, పరమాత్మ, పరమపురుషుడు, మహేశ్వరుడు ఈ శరీరమునం దాసీనుడై యున్నాడు; అతడు ఆమె క్రియను నిరీక్షించును - "ఉపద్రష్టా", ఆమె కార్యములను అనుమతించును - "అనుమంతా", ఆమె కర్మనంతను భరించును - "భర్తా", ఆమె బహువిధ సృష్టిని ఆదేశించును - "మహేశ్వరః", తన స్వీయసత్తకు ఆమె కల్పించిన రూపముల ఈ ఖేలనమును తన వైశ్వానందముతో ననుభవించును - "భోక్తా" (11-23). ఇది ఆత్మ-జ్ఞానము, దీనికి మన మనోవృత్తి అలవడి నపుడే, సనాతనునియొక్క సనాతనాంశముగా మనను మనము వాస్తవముగా దెలిసికొనగలము. ఒకసారి సనాతనాంశ మను ఈ జ్ఞానము ప్రతిష్ఠితమై నపుడు, మనలోని అంతరాత్మ ప్రకృతితో తన వ్యాపారమునందు బాహ్యముగా నెట్లు వర్తించినను, అది ఏమి చేయుచున్నట్లు కన్పించినను, లేక వ్యక్తిత్వము మఱియు సక్రియశక్తి మఱియు దేహబద్ధ అహంకారముయొక్క ఈ యా రూపము ధరించుచు అది ఎట్లు కన్పించినను, అది తన స్వరూపమున ముక్తము, ఇక జన్మబద్ధము గాదు; ఏలన అది తన ఆత్మయొక్క నిర్వ్యక్తికతద్వారా సృష్టియొక్క ఆంతర, అజ పురుషునితో నిపు డేకమై యున్నది (13-24). ఆ నిర్వ్యక్తికతయే, విశ్వమునందు గల సర్వముయొక్క అహంకారము లేని పరమ అహం (నేను)తో మన సంయోగ మగును.

11. నశించువానిలో నశించనిది :

ఈ జ్ఞాన మొక అంతరధ్యానముద్వారా ప్రాప్తించును, దానిద్వారా సనాతనాత్మ మన స్వీయసత్తయందే మనకు ప్రత్యక్ష మగును (11-25). లేక ప్రకృతిపురుషుల వివేచనాత్మకమగు సాంఖ్యయోగముద్వారా అది ప్రాప్తించును. లేక అది కర్మయోగము ద్వారా ప్రాప్తించును, ఇచ్చట మన మనస్సును, హృదయమును, సమస్తక్రియాశీల శక్తులను ఈశ్వరునికి తెఱచియుంచుట ద్వారా మన వైయక్తిక సంకల్పము

కరగిపోవును, ఈశ్వరుడే మన సమస్తకర్మను స్వయముగా స్వీకరించును. మనలోపలి ఆత్మప్రేరణచేత, ఈ యా యోగమునకు, అనగా ఏకత్వమునకు గొనిపోవు ఈ యా మార్గమునకు అది యిచ్చు పిలుపుచేత ఆధ్యాత్మిక జ్ఞానము మేల్కొనవచ్చును. అథవా ఇతరులనుంచి సత్యమును గుఱించి శ్రవణము చేయుటచేతను, మనస్సు దేనిని శ్రద్ధతో, దీక్షతో వినునో, దాని భావము లోనికి మనస్సును పోతపోయుటచేతను ఆ జ్ఞానము రావచ్చును (13-26). కాని ఎట్లు వచ్చినప్పటికి, అది మృత్యువు కావల వెలుగొందు అమృతత్త్వమునకు మనల మోసికొని పోవును. మర్త్యప్రకృతితో అంతరాత్మకు గల క్షరవ్యవహారమునకు (13-27) పైన భాసించు మన అత్యున్నతాత్మను జ్ఞానము మనకు జూపును - ఈ ఆత్మ ప్రకృతి వ్యాపారమునకు మహేశ్వరుడు; సర్వవస్తువులు మఱియు ప్రాణులలో ఏకము, సమము; శరీరము ధరించినపు డది పుట్టదు, శరీరములు నశించినపుడు మరణమునకు లోను గాదు (13-28). అదియే, మనలోని సనాతనము మఱియు అమరము నగు దానిని చూచుటయే, వాస్తవదర్శనము. ఈ సమ ఆత్మను అధికాధికముగా దర్శించు కొలది, దాని సమతలోనికి మనము జరుగుదుము; ఈ విశ్వపురుషునిలో అధికాధికముగా నివసించుకొలది, మనమును విశ్వపురుషుల మగుదుము; ఈ నిత్యుని ఎఱుక అధికాధికముగా వృద్ధినందుకొలది, మనమును నిత్యతను ధరించి, శాశ్వతముగా నుందుము. అపు డిక మన మానసిక మఱియు భౌతిక అజ్ఞానము కల్పించు పరిమితి మఱియు దుఃస్థితితో గాక, ఆత్మయొక్క నిత్యముతోనే తాదాత్మ్యము చెందుదుము (13-29). అపుడు, మన కర్మ లన్నియు ప్రకృతియొక్క ఒక పరిణామము మఱియు వ్యాపార మనియు, మన వాస్తవాత్మ కార్యమును నిర్వహించు కర్త గాక, క్రియ యొక్క విముక్తసాక్షి, ఈశ్వరుడు మఱియు అసక్త భోక్తయు నని చూతుము (13-30). పైకి గన్పించు నీ విశ్వగతి యంతయు ఒకే సనాతనపురుషునియందు జరుగు నానావిధ సంభూతి; అతని సత్తయొక్క లోతులలో గల ఆమె భావము యొక్క బీజములనుండి విశ్వశక్తి సమస్తవిశ్వమును విస్తారితము, అభివ్యక్తము, అనావృతము గావించును (13-31). కాని మన ఈ శరీరమున ప్రకృతికర్మలను ఆత్మ గ్రహించి, అనుభవించుచున్నను, దాని మర్త్యతచేత తాను బాధింపబడదు, ఏలన ఆత్మ జననమరణముల కావల అనాది సనాతనము, ప్రకృతియందు తాను స్వీకరించు బహువిధవ్యక్తిత్వములకు అది పరిమితము గాదు; కారణము, అది ఈ

వ్యక్తిత్వము లన్నింటియొక్క పరమాత్మ; గుణముల మార్పులచేత మాఱునట్టిది కాదు, ఏలన ఈ పరమాత్మ తాను గుణములచేత నిర్ణయింపబడదు, కర్మయందును కర్మచేయదు (13–32) – "కర్తారం అపి అకర్తారం" (4–13). కారణము, క్రియా ఫలితము లేమాత్రము స్పృశింపని ఆధ్యాత్మిక స్వాతంత్ర్యమునందు అది ప్రాకృత క్రియను ధరించును; నిజానికి సర్వక్రియల ప్రారంభకము తానే అయినప్పటికి, పరమాత్మ తన ప్రకృతిక్రీడచే ఏమాత్రము మాఱదు, లిప్తము గూడ గాదు (13–32). అంతట వ్యాపించు ఆకాశము తాను ధరించు బహువిధ రూపములచే లిప్తము లేక వికృతము గాక, యథాపూర్వము శుద్ధ, సూక్ష్మ, మూలద్రవ్యముగనే నిలుచునట్లు, ఈ ఆత్మయు సర్వ సంభావ్యవస్తువులను చేసి, వాని రూపము ధరించి నపుడు సైతము, ఆమూలాగ్రము అదే శుద్ధ, నిర్వికార, సూక్ష్మ, అనంతతత్త్వముగా నిలుచును (13–33). అది ఆత్మయొక్క పరమావస్థ – "పరా గతిః" (13–29) –, అది దివ్య సత్త మఱియు ప్రకృతి–"మద్భావః" (14–19)–మఱియు నెవడెవడు ఆధ్యాత్మికజ్ఞానము నధిగమించునో, అతడు సనాతనునియొక్క పరమ అమరత్వము నధిరోహించును.

12. సంపూర్ణసత్యము :

ఈ బ్రహ్మము, అనగా తన స్వీయ ప్రాకృత సంభూతి రూపమగు క్షేత్రముయొక్క సనాతన, ఆధ్యాత్మిక జ్ఞాత; ఈ ప్రకృతి, అనగా ఆ క్షేత్రముగా తనను రూపొందించు కొను అతని శాశ్వతశక్తి; మర్త్య ప్రకృతియందు అంతరాత్మయొక్క ఈ అమరత్వము – ఈ మూడును గలిసి, మన అస్తిత్వముయొక్క సంపూర్ణసత్య మగును (13–35). దాని వైపునకు మఱలినపుడు, మనలోని ఆత్మ, తన కిరణముల పూర్ణప్రభయందు, తన స్వీయసత్యముతో ప్రకృతి యొక్క క్షేత్రము నంతను ప్రకాశితము గావించును (13–34). కాగా నీ జ్ఞాన సూర్యుని ప్రకాశమున మనలో జ్ఞాననేత్రము వికసించును, అపు డిక మనము ఈ అజ్ఞానమునందు గాక, ఆ సత్యమునందే నివసింతుము. అప్పుడు మన ప్రస్తుత మానసిక మఱియు భౌతిక ప్రకృతికి మాత్రమే పరిమితులమై యుండుట అంధకారము వలన గలిగిన భ్రాంతి యని గ్రహింతుము, అందువలన మన నిమ్నప్రకృతి నియమమునుండి, అనగా మనోదేహముల నియమమునుండి విముక్తుల మగుదుము (13–35), అపుడు పరమాత్మయొక్క పరప్రకృతిని ప్రాపింతుము. ఈ భవ్య, పరమోచ్చ పరివర్తనము, మర్త్యప్రకృతిని విసర్జించి, ఒక అమృతభావమును గైకొనుట – ఇదియే చరమ సంభూతి, దివ్యానంత సంభూతి.

14. గుణాతీతత్వము

1. సాధర్మ్య మొక ప్రధానాంశము :

పదుమూఁడవ అధ్యాయమున పురుష ప్రకృతులకు గల విభేదములు, కొలది నిశ్చాయకవిశేషణములచేతను, వాని శక్తి మఱియు వ్యాపారములను వర్ణించు కొలది సంక్షిప్త, కాని అర్థగర్భిత లక్షణముల చేతను త్వరత్వరగా చూపబడినవి; విశేషించి, తన గుణోపభోగముచే ప్రకృతి క్రియకు అధీనమగు దేహగత అంతరాత్మకును, గుణముల నుపభోగించుచున్నను, గుణాతీతము గాన, గుణాధీనముగాని పరమాత్మకును గల విభేదము రేఖామాత్రముగా చూపబడినది; తన సత్తను పాలించు సచేతన ధర్మమునందు, భగవంతునితో ఏకము చేయబడిన విముక్తపురుషుని గుఱించిన గీతాభావ మంతటికి ఈ పై విభేదములే ఆధారము. ఆ విముక్తి, ఆ ఏకత, ఆ దివ్యప్రకృతిధారణము, అనగా "సాధర్మ్యము" (14-2): ఈ మూడును ఆధ్యాత్మిక స్వాతంత్ర్యముయొక్క సాక్షాత్సార మనియు, అమరత్వముయొక్క సంపూర్ణమర్మమనియు గీత ప్రకటించును (14-2). సాధర్మ్యమునకు గీత సమర్పించు నీ పరమప్రాముఖ్యము గీతాబోధనయం దొక ప్రధానాంశము.

2. అమృతత్వవివేచనము :

అమృతత్వ మన దేహ మరణాంతరము వైయక్తికముగా నుండుటయే యని ప్రాచీన ఆధ్యాత్మిక బోధనయం దెక్కడను లేదు: నశించునవి రూపములే గాన, ఈ అర్థమున జీవులందరు అమరులే. విముక్తి నందు కొనని ఆత్మలు సైతము తిరిగితిరిగి యుగములందు జీవించును; సర్వజీవులు అభివ్యక్త ప్రపంచముల లయమునందు బ్రహ్మములో లీనముగనో, రహస్యముగనో యుండి, నూతనయుగారంభమున తిరిగి జన్మించును. ప్రళయము, అనగా ఒక యుగచక్రము యొక్క అంతము, వైశ్వరూపము మఱియు దానియందలి వైయక్తిక రూపముల యొక్క తాత్కాలిక విఘటనము, ఈ విఘటనమొక స్వల్పకాలీన విరామము మాత్రమే, నిశ్చల మధ్యకాలము మాత్రమే; దీనికి పిమ్మట నూతనసృష్టి, పునర్ఘటనము, పునర్నిర్మాణము ఉట్టిపడును, దీనియం దా జీవులు మఱల ఆవిర్భవించి, తమ పురోగమన పూర్వవేగమును పుంజుకొనును, మన భౌతికమరణమును ఒక ప్రళయమే - ఇంచుక పిమ్మట గీత ఈ శబ్దమును ఈ అర్థమున ప్రయోగించును, "ప్రళయం యాతి దేహభృత్" (14-14), అనగా అజ్ఞానవశమున ఏ రూపము మాత్రమే తానని దేహధారి ఆత్మ భ్రమించెనో, ఆ

రూపము తన మూలభూతములలోనికి విడిపోవుటయే ప్రళయము, కాని ఎటుల విశ్వపురుషుడు ఒక విరామకాలమునకు పిమ్మట తన యుగచక్రభ్రమణమును తిరిగి సాగించునో, అటులే అంతరాత్మయు నిలిచియుండి, ఒక అవధి గడచిన పిమ్మట తన జన్మచక్రమును మఱల ప్రారంభించును. కాల చక్రమునందలి యిట్టి అమరత్వము దేహధారి జీవు లన్నింటికి సర్వసామాన్యము.

3. అమృతత్వము జననమరణాతీతత్వము :

గంభీరతర అర్థమున అమృతత్వమన మరణానంతర అవస్థానము, అనవరత పునరావర్తనము గాదు. దేనియందు ఆత్మ జననమరణాతీతముగా తన నెఱుంగునో, తన అభివ్యక్తి స్వభావము చేత పరిమితము గాదో, అనంతము, అవ్యయము, నిర్వికారముగా నిత్యము నగునో, ఆ పరమావస్థయే అమృతత్త్వము-ఎప్పుడును పుట్టదు గాన, ఎప్పుడును మరణించదు. కావున ఆత్మ అమరము. పరమేశ్వరుడు, పరబ్రహ్మము నగు పురుషోత్తముడు ఈ అమృతనిత్యత్వము సర్వదా కలిగియుండును మఱియు శరీరస్వీకరణముచే గాని, వైశ్వరూపములు మఱియు శక్తుల సంతత ధారణముచే గాని ప్రభావితుడు గాడు, కారణము, అతడు సదా ఈ ఆత్మజ్ఞానమున వర్తించును. తన నిత్యత్వమును మార్పు లేని విధముగా నెఱింగియుండుట అతని స్వభావమే యగును. అత డిచ్చట సర్వ శరీరములందు అంతర్నివాసి, అయితే ప్రతిశరీరమునందు అజుడుగా అంతర్నివాసి, అనగా తదభివ్యక్తిచేత తన చేతనయందు పరిమితుడు గాడు, తాను ధరించు భౌతిక ప్రకృతితో తాదాత్మ్యము చెందదు, ఏలన అది తన వైశ్వలీలలో ఒక చిన్న ఘటన మాత్రము. విముక్తి, అమరత్వము పురుషోత్తముని సర్వదా సచేతనమగు [1]నిత్యసత్తయందు నివసించుటయే యగును.

---

[1] అవ్యక్తము, అనిర్దేశ్యము (12-3) నగు బ్రహ్మమునందు వైయక్తిక ఆధ్యాత్మికపురుషుని విలయమే అమరత్వముయొక్క వాస్తవార్థము లేక నియమ మని గీత ఎచ్చటను సూచించదు : దీనిని మనము గమనించదగును. అది యథార్థ యోగ లక్ష్యమును గాదు. పైగా గీత ఈశ్వరునిలోపల అతని పరమపదమునందు నివసించుటయే అమృతత్వ మని తర్వాత వచించును - "మయి నివసిష్యసి" (12-8), "పరమం ధామ" (15-6), మఱియు నిచ్చట దానినే "పరాం సిద్ధిం", "సాధర్మ్యం" అనియు వర్ణించును. అది ఒక పరమసిద్ధి, భగవంతుని సత్త మఱియు ప్రకృతితో సమాన ధర్మతను బొందుట; సృష్టియందు అవస్థితము, దాని విశ్వగతిపట్ల సచేతనము నగుచునే, మునులందరి వలె (14-1), దానికి పై నుండుట. - శ్రీ అ.

కాని ఈ మహత్తర ఆధ్యాత్మిక అమరత్వమును జేరుకొనుటకు దేహధారి అంతరాత్మ నిమ్నప్రకృతిధర్మము ననుసరించి జీవించుట చాలించవలెను; భగవంతుని పరమ అస్తిత్వప్రకారము నది స్వీకరించ వలెను, నిజాని కీ ప్రకారము తన స్వీయ సనాతన సారసత్తర క్క ధర్మమే. కాగా తన రహస్య మూలసత్తయందు వలెనే, తన సంభూతియొక్క ఆధ్యాత్మికపరిణామము నందును భగవంతునితో సాదృశ్యములోనికి పెరుగవలెను.

4. బుద్ధి జ్ఞానము కాదు చేతనావికాసము :

ఈ మహాకార్యమును, అనగా మానవప్రకృతినుండి దివ్యప్రకృతిలోని కారోహించుటను, భగవదున్ముఖమగు జ్ఞానము, సంకల్పము మఱియు భక్తితో గూడిన సాధనచేతనే సాధించగలము. కారణము, భగవంతునిచేత తన సనాతనాంశముగా (15-7), తన అమర ప్రతినిధిగా వైశ్వప్రకృతి క్రియాకలాపములోనికి బంపబడిన అంతరాత్మ ఆ క్రియాకలాప స్వభావముచేతనే తన బాహ్యచేతనయందు ఆ ప్రకృతియొక్క నిబంధనలతోను, ఒక మనఃప్రాణశరీర సంఘాతముతోను తాదాత్మ్యము చెంద అవశముగా బాధింపబడును - "అవశం ప్రకృతేర్ వశాత్" (9-8), మఱియు నీ మనఃప్రాణశరీరములు తమ ఆంతర ఆధ్యాత్మికస్వరూపమును, తమలోని భగవంతుని మఱచియుండును. ఆత్మ జ్ఞానమును, ప్రకృతితో అంతరాత్మకు గల బాహ్యసంబంధములకంటె భిన్నమగు వాస్తవ సంబంధజ్ఞానమును తిరిగి ప్రాపించుట; భగవంతుని, మనలను, ప్రపంచమును ఇక భౌతికానుభవముతో గాక, ఆధ్యాత్మికానుభవముతో నెఱుంగుట: ఇది ఈ సంసిద్ధికి ఒక అపరిహార్య సాధన మగును. ఆత్మజ్ఞానము, ఈశ్వరజ్ఞానము, మఱియు మన ప్రాకృతాస్తిత్వము పట్ల ఆధ్యాత్మికవైఖరి వినా సంసిద్ధి రాజాలదు; కావుననే ప్రాచీనవిద్య 'జ్ఞానముచేతనే మోక్ష' మని నొక్కి చెప్పినది - అయితే ఈ జ్ఞానము వస్తువుల బౌద్ధికగ్రహణము గాదు, పరంతు ఒక అధికతర చేతనలోనికి మనః ప్రధానుడగు మానవుని అభివృద్ధి. అటులే అంతరాత్మవిముక్తి, అంతరాత్మసిద్ధి వినా, అనగా అంతరాత్మ దివ్యప్రకృతిలోనికి పెరుగుట వినా రాజాలదు; ఏలన నిష్పక్షపాతియగు భవగంతుడు కొందరి కా సిద్ధిని తన మనశ్చాపల్యముచేత గాని, స్వచ్ఛంద మగు తన ప్రత్యేక కృపచేత గాని సాధించిపెట్టడు. దివ్యకర్మలకు ముక్తిని సాధించు సామర్థ్యము గలదు; ఏలన మన జీవనముయొక్క ఆంతరప్రభువుతో అధికాధిక ఏకతను సాధించుచు, అవి ఈ

సంసిద్ధికిని, ఆత్మ, ప్రకృతి, మఱియు భగవంతుని యొక్క జ్ఞానమునకును దారితీయగలవు. అటులే దివ్యప్రేమయు కార్యకారి యగును; ఏలన దానిచేత మన ఆరాధనయొక్క ఏకమాత్ర, పరమభాజనమగు పరమునితో సాదృశ్యములోనికి పెరుగుదుము మఱియు నతని ప్రతిప్రేమను ఆహ్వానింతుము, అపు డీ ప్రతిప్రేమ అతని జ్ఞానముతోను, ఉద్ధారకమగు అతని శక్తి మఱియు శుద్ధతతోను మనను ముంచెత్తును. కావున - గీత వచించును - ఇది పరమ ఆధ్యాత్మికానుభవము, దీనిచేత మును లందరు ఆ పరసిద్ధిని ప్రాపించిరి, సత్తాధర్మము (law) నందు పరమునితో సామ్యములోనికి పెరిగిరి, మఱియు అతని నిత్యతలో నివసించుచున్నారు, వీరు సృష్టిసమయమున పుట్టరు, ప్రళయసమయమున ఆ వ్యథ నందరు (14-2). ఇట్లు ఈ సిద్ధి, ఈ సాధర్మ్యము అమృతత్వమునకు మార్గము మఱియు అనివార్య నియమము, ఈ సాధర్మ్యము లేనపుడు, అంతరాత్మ సచేతనముగా సనాతనునియందు నివసింపజాలదు.

5. తండ్రియు, తల్లియు భగవంతుడే :

మానవుని అంతరాత్మ తన సారతత్త్వము నందు భగవంతునితో ఏకము, అతని దివ్యతలో సారభాగము గానిచో, అది భగవంతునితో సాదృశ్యములోని కెప్పటికి పెరుగజాలదు : అది కేవలము మానసిక, ప్రాణిక మఱియు భౌతిక ప్రకృతితో నేర్పడిన ప్రాణియే యగుచో, అది ఎప్పుడును అమరము కాదు, కాజాలదు. సర్వసత్తయు భగవంతుని సత్తయొక్క ఒక అభివ్యక్తి మఱియు మనలోపల నేది గలదో, అది సనాతనాత్మయొక్క ఒక ఆత్మ. నిజమే, మనము నిమ్నతర ప్రకృతిలోనికి వచ్చి, దాని ప్రభావమునకు లోబడియున్నాము, కాని మన మిచ్చటికి పరమ ఆధ్యాత్మిక ప్రకృతినుండి వచ్చి యున్నాము: ఈ నిమ్నతర అపూర్ణస్థితి మన ప్రతీయమాన (కన్పించు) సత్త కాగా, అది మన పారమార్థిక సత్త యగును. సనాతను డీ సమస్త విశ్వమును తన ఆత్మసృష్టిరూపమున వెలువరించును. అతడు ఏకకాలమున విశ్వమునకు తండ్రియు, తల్లియు నగును. అనంత విజ్ఞానముయొక్క సారమగు "మహత్తు" (14-3) అను బ్రహ్మము అతనికి గర్భము, దానియం దతడు ఆత్మ-భావనారూపమగు బీజము వేయును. అతడు అధి-ఆత్మగా, పితగా బీజము వేయును; ప్రకృతి-ఆత్మగా మాతగా అతడే దానిని స్వీకరించును. ఈ మాత, సత్తయొక్క అనంతద్రవ్యము, అతని సచేతనశక్తిచే నిండిన అనంత ఊర్జము,

స్వయముగా పరిమితము గావించు కొను అతని అమేయ భావముతో (విజ్ఞానముతో) గర్భిణి యగును. అతడు తన ఈ మహత్తు (విశాలము) లోనికి స్వీయాత్మయొక్క భావనారూపమగు దివ్యాంకుర మును స్వీకరించి, దానిని మానసిక మఱియు భౌతికరూపములోనికి పెంపొందించును. ఇట్టి సృష్టిక్రియనుండియే మనము చూచున దంతయు నుద్భవించును; కాని యిక్కడ జన్మించున దంతయు అజము మఱియు అనంత మగు ఆదిభావముయొక్క సాంత భావము మఱియు రూపము మాత్రమే (14-4). పరమాత్మ సనాతనము మఱియు తన అభివ్యక్తికంటెను పరము; పోగా ప్రకృతియు పరమాత్మయందు సనాతనమే, అయితే అది యుగముల క్రమగతియందు అంతములేని సృష్టిక్రియచేతను, సమాప్తి నెఱుగని లయక్రియచేతను ముందుకు సాగును; అటులే ప్రకృతియందు ఈ యారూపములను ధరించు పురుషుడును ఆమెవలె సనాతనుడే - "అనాది ఉబా వపి" (13-20). ప్రకృతియందు యుగచక్రమును అనవరతముగా అనుసరించుచున్నపుడు సైతము, పురుషుడు జననమరణ ఘటనలకు అతీతముగా, తా నెక్కడినుండి ఉద్భవించెనో, ఆ సనాతనుని యందే నిలిచియుండును, మఱియు నతడు తన బాహ్యచేతన యందు సైతము అంతర్గతము, శాశ్వతము నగు ఆ అతీతత్వము నెఱింగియుండగలడు.

6. జన్మమరణకారణము తాదాత్మ్యము :

అయితే అంతరాత్మకు జనన మరణములు మఱియు బంధనముయొక్క ఆభాసమును కల్పించున దేది? - అది ఆభాసమాత్రమే యగుట స్పష్టమే గదా. తదాభాసకారణ మొక గౌణక్రియ లేక చేతనావస్థ, తమ పరిమితక్రియలందు ప్రకృతిగుణములతోను, మనఃప్రాణశరీరముల అహం-బద్ధ కర్మగ్రంథితోను అంతరాత్మయొక్క ఆత్మవిస్మృతి పూర్వకమగు తాదాత్మ్యము. ప్రకృతిగుణముల పై కెగయుట, అనగా "త్రైగుణ్యాతీతత" (2-45) ఆవశ్యకము; అది లేనిచో, నిమ్నక్రియయొక్క సంమోహకశక్తినుండి వెలువడి, మన పూర్ణసచేతన సత్తయం దడుగిడజాలము, అటులే ఆత్మయొక్క విముక్తప్రకృతిని, దాని సనాతన అమరత్వమును ధరించజాలము. ఇట్టి సాధర్మ్యస్థితినే గీత యిపుడు వివరించనున్నది. ఒక పూర్వాధ్యాయమునందు (2-45), ఇతః పూర్వమే, గీత దీనిని సూచించి, సంక్షిప్తముగా నైనను నొక్కి చెప్పెను. కాని, గుణములన నేమియో, అవి ఎట్లు అంతరాత్మను బంధించి, ఆధ్యాత్మికస్వతంత్రతకుదూరముచేయునో, మఱియు గుణాతీతత్వ మన నేమియో, గీత ఇపుడు ఎక్కువ కచ్చితముగా చూపవలసియున్నది.

7. గుణాత్మకము - పరిమాణాత్మకము :

ప్రకృతియొక్క క్రియాప్రకారము లన్నియు తమ మూలమునందు గుణాత్మకము, కావుననే వానికి గుణములని పేరు. విశ్వమును గుఱించిన ఎట్టి ఆధ్యాత్మికభావనయం దైనను ఇట్లే కావలయును; ఏలన చైతన్యమును, జడమును కలుపునట్టి మాధ్యమము (medium) అంతరాత్మ-శక్తి గావలెను, మఱియు ప్రారంభకక్రియ మానసికము మఱియు గుణాత్మకము గావలెను, భౌతికము మఱియు పరిణామాత్మకము గాదు; ఏలన విశ్వశక్తియొక్క సమస్తక్రియ యందును, గుణము అభౌతికము మఱియు నధికతర ఆధ్యాత్మికము నగు తత్త్వము, ఆమె గతియొక్క పూర్వరూపము. కాని యిప్పటి భౌతికవిజ్ఞానముయొక్క ప్రాబల్యముచే ప్రకృతిని గుఱించిన మఱియొక దృష్టికి మన మలవడియున్నాము; ఏలన దానియందు మనకు కొట్టవచ్చినట్టు కన్పించు ప్రథమవిషయము ఆమె వ్యాపారమున పరిణామాత్మక పార్శ్వమునకు గల ప్రాముఖ్యము మఱియు రూపముల నిర్మాణమున పరిణామాత్మక సంయోగములు మఱియు విన్యాసములకు (కూర్పులు) ఆమె అధీనత. అయినను, శక్తి స్వతఃసిద్ధ జడతత్త్వముయొక్క ఒక చాలక సామర్థ్యము, లేక జడములోపల పనిచేయు ఒక అంతర్వర్తిసామర్థ్యము - అనుకొనుట సరికాదు, జడద్రవ్యమే శక్తియొక్క ఒక తత్త్వము లేక క్రియ - అను నేటి భౌతిక విజ్ఞాన పరిశోధన విశ్వప్రకృతికి సంబంధించిన ప్రాచీనదృష్టికి కొంతవఱకు మఱల ప్రాణము పోసినది. ప్రాచీన భారతీయమనీషుల విశ్లేషణము ప్రకృతియొక్క పరిణామాత్మకక్రియకు స్థాన మిచ్చినది - "మాత్రా"; కాని, పరిమాణము ప్రకృతి యొక్క బాహ్య, నిర్వాహక క్రియయొక్క ధర్మము కాగా, లోపలి భావాత్మక (ideative) నిర్వాహకశక్తియే ప్రథమ నిర్ధారక (determinant) మనియు, అది వస్తువుల "గుణము" మఱియు "స్వభావమును" బట్టి వానిని గూర్చు ననియు, అదియే వస్తువుల బాహ్య పరిణామాత్మక రచనల కాధార మనియు ప్రాచీనుల విశ్లేషణము తెలుపును. కాని భౌతికప్రపంచముయొక్క అడుగున ఈ సత్యము గోచరము కాదు; కారణము, అక్కడ ఆధారభూతమగు భావాత్మకతత్త్వము, "మహద్ బ్రహ్మము" (14-3), జడద్రవ్యము మఱియు జడశక్తిచేత కప్పబడియుండుట మాత్రమే. కాని భౌతిక ప్రపంచమునందు సైతము, ఒకదానితోనొకటి సర్వథా సమమగు పరమాణువుల విభిన్న సంయోగములు మఱియు పరిమాణములు అద్భుతము, నానావిధము నగు ఫలితముల నిచ్చుచున్నవి ! దేని అభివ్యక్తికి భౌతిక

విన్యాసములు కేవలము అనుకూల సాధనములో, అట్టి వైవిధ్యకారక గుణముయొక్క పటుతరశక్తి లేనిచో, ఫలితవైవిధ్యము నెట్లును వివరించజాలము. లేక, మన మిట్లు సరాసరి చెప్పుదుము – విశ్వశక్తిలోపల ఒక రహస్య భావాత్మక సామర్థ్య ముండవలెను – "విజ్ఞానము", ఇదియే మనకు గన్పించు బాహ్యవిన్యాసముల లెక్కలను స్థిరీకరించి, వాని ఫలితములను నిర్ణయించును, జడబుద్ధి ఈ భావాత్మక విజ్ఞానముయొక్క సాధనము మాత్రమే. విజ్ఞానము ఆత్మయందలి మూలభావము, ఇదియే బాహ్య విన్యాసములను రూపొందించి, సాధనలుగా నుపయోగించుకొనును. పోగా ప్రాణిక, మానసిక సత్తయందు గుణము ప్రధానశక్తిగాను, శక్తిపరిమాణము ఒక గౌణాంశముగాను వెంటనే, స్పష్టముగా గోచరించును. నిజానికి మానసిక ప్రాణిక భౌతిక సత్తలు మూడును గుణపరిమితులకు అధీనము, అవి దాని నిర్ధారణల చేతనే పాలింపబడును; కాని సత్తా స్తరములందు క్రిందికి దిగుకొలది ఈ సత్యము ఎక్కువెక్కువగా మఱుగుపడును. ఒక్క పరమాత్మ మాత్రమే గుణముయొక్క గాని, రాశియొక్కగాని ఎట్టి పరిమితులకు లోబడదు, కారణము, దాని అపరిమేయము, అనిర్ధార్యమునగు అనంతత తన సృష్టి నిమిత్తము తాను వృద్ధిపఱచి, ఉపయోగించుకొను గుణ, పరిమాణములకు అతీతముగా నుండును, మఱియు నది తన భావసత్త – 'మహత్తు', భావబలము–'విజ్ఞానము' యొక్క శక్తిచేత సర్వనియమములను స్థిరీకరించును.

8. ద్వివిధ గుణనిర్వచనము :

కాని ప్రకృతియొక్క గుణాత్మక క్రియ వివరము నందును, వైవిధ్యమునందును అతిగహనము, అనంతము; కావున అది యంతయు గుణముయొక్క మూడు సాధారణప్రకారముల ఆకృతిలో చిత్రించ బడును – "సత్త్వము, రజస్సు, తమస్సు" (14–5); ఈ మూడును అన్యోన్యప్రోతము, దాదాపు అవిచ్ఛేద్యము నయి, సర్వత్ర నుండును. గీతయందీ గుణములు, మానవుని యందు వాని మానసిక క్రియను బట్టి, లేక ఆహారాదులయందు, అవి మానవమానసము లేక ప్రాణముపై బఱపు ప్రభావమును బట్టి మాత్రమే వర్ణింపబడును. ఇంతకంటెను వ్యాపకమైన గుణముల నిర్వచనము నపేక్షింతు మేని, భారతీయ మతముయొక్క ప్రతీకాత్మక (symbolic) భావమునందు దాని మెఱపు బహుశః మనకు ప్రాప్తించ గలదు : ఈ భావము రక్షకుడగు విష్ణువునకు సత్త్వగుణమును, సృష్టికర్తయగు బ్రహ్మకు రజస్సును, సంహారకుడగు రుద్రునికి తమస్సును ఆపాదించును. ఈ భావము వెనుక నున్న

ఉపపత్తిపై దృష్టి సారింతు మేని, ప్రకృతియొక్క ఈ ప్రకారములు లేక గుణములు సమత, ప్రవృత్తి మఱియు జడత యను ఆమెయొక్క మూడు సహవర్తి, అవిచ్ఛేద్య శక్తు లని మనము నిర్వచించవచ్చును. కాని ఈ మూడు శక్తులును విశ్వశక్తియొక్క బాహ్యక్రియకు సంబంధించిన, గుణముల బాహ్యరూపములు మాత్రమే. చేతన మఱియు శక్తి ఏకమాత్రసత్తయొక్క జంట రూపములుగా మనము చూచినపుడు గుణములు వేఱు విధముగా గన్పించును – ఈ చేతనాశక్తులు సత్తామూలమునందు సదా సహవర్తిగా నుండును; అయితే ప్రపంచము యొక్క ప్రారంభావస్థయందు, చేతనాప్రకాశము నిశ్చేతనశక్తియొక్క ఒక వ్యాపక క్రియయందు అంతరించినట్లు గన్పట్టవచ్చును, అటులే ఆధ్యాత్మిక శమముయొక్క వ్యతిరేకధ్రువమునందు, శక్తిక్రియ సాక్షిచేతనయొక్క ఒక నిశ్చలతయందు అంతరించినట్లు దోపవచ్చును. ఈ రెండు అవస్థలును వేఱుపడినట్లు గన్పించు ప్రకృతిపురుషుల అంతిమస్థానములు, కాని ఇందు ప్రతియొకటి తన అంతిమస్థానము నందు తన సనాతనసహచరియగు రెండవ దానిని రద్దుచేయదు, అంత అయితే దానిని తన ప్రత్యేకరూపము యొక్క లోతులలో దాచియుంచును. కావున, నిశ్చేతనముగా గన్పించు శక్తియందు సైతము చేతన సర్వదా యుండును గాన, ఏది త్రిగుణముల బాహ్యతర కార్యనిర్వాహక క్రియకు ప్రాణముపోయునో, అట్టి వాని అనురూప మానసికశక్తిని గనుగొనవలసి యున్నది. తమ మానసిక పార్శ్వమునందు గుణముల నిట్లు నిర్వచింపవచ్చును : తమస్సు ప్రకృతియొక్క నిశ్చేతనరూపమగు శక్తి, రజస్సు కామనావేగములచేత ప్రబుద్ధమైన క్రియాత్మకము, అన్వేషణపరము నగు అజ్ఞానరూపమగు ఆమె శక్తి, సత్త్వము జ్ఞానధారకము, సమన్వయసాధకము నగు ఆమె శక్తి.

9. గుణముల పరస్పరప్రభావము :

ప్రకృతియొక్క గుణాత్మక ప్రకారములు మూడును సమస్త వైశ్వవ్యాపారమునందు విడదీయరాని విధముగా నల్లుకొని యున్నవి. జడతాతత్త్వమగు తమస్సు ఒక నిష్క్రియ జడ నిశ్చేతనము, ఇది సమస్త ఆఘాతములను, సంస్పర్శలను కేవలము సహించును, వానిని జయించు ప్రయత్నము సలుపదు, మఱియు తనకుదా నయితే, శక్తి విఘటనమునకును, పదార్థ విచ్ఛేదమునకును దారితీయును. కాని అది రజస్సుయొక్క చాలకశక్తిచే పరిచాలిత మగును, మఱియు జడముయొక్క నిశ్చేతనమునందు సైతము రక్షకతత్త్వమగు సత్త్వముయొక్క సంపర్కమును, ఆలింగనమును బొందును; ఏలన

సత్త్వ మచ్చట ఉపలబ్ధము గానప్పటికి, లోపల స్వతఃసిద్ధముగా నుండును. భౌతికశక్తి తన ప్రాథమిక క్రియయందు తామసికముగా-జడముగా-గన్పించును; అది నిశ్చేతనము, యాంత్రికము, తన గతియందు విఘటనశీలము ననిపించును. కాని మూక రాజసిక ప్రవృత్తియొక్క ఒక విరాట్ శక్తి దానిని వశముగావించుకొని, దాని విఘటనక్రియ ద్వారానే దానిచే నిర్మాణమును, సృష్టిని పట్టి చేయించును; అటులే నిశ్చేతనముగా గన్పించు దాని బలమునందే గల ఒక సాత్త్విక భావనాత్మకతత్త్వము దానిని వశము గావించుకొని, దానియందలి తమోరజోరూప విరుద్ధప్రవృత్తులపై ఒక సామరస్యమును, రక్షకవ్యవస్థను విధించును. ప్రకృతియందలి రజస్సు జడపదార్థము నందు సృజనాత్మక మగు గతిరూప తత్త్వముగా - ప్రవృత్తిగాగన్పించును; అదే రజస్సు ప్రాణముయొక్క ప్రబలస్వభావము నందు అన్వేషణ, కామన, మఱియు క్రియ యొక్క ఒక సచేతన లేక అర్ధచేతన ఆవేశరూపమున ఎక్కువ స్పష్టముగా గోచరించును; ఏలన తదావేగము సమస్త ప్రాణికసత్తయొక్క స్వభావమే యగును. మఱియు నీ రజోగుణము తనకు దానుగా ఎట్టి నిశ్చితఫలితము లేని ఒక చిరస్థాయి, కాని క్షరము, చంచలము నగు జీవనము, క్రియ మఱియు సృష్టికి దారితీయును. ఈ రజోగుణముయొక్క అజ్ఞక్రియ ఒక వైపున తమోగుణముయొక్క విఘటనశక్తి కృతమగు మృత్యువు, క్షయము మఱియు జడత నెదుర్కొనుచుండగా, రెండవ వైపున సత్త్వశక్తిచే నిది స్థిరీకృతము, సామరస్య పూర్ణము గావించబడును; ఈ సత్త్వశక్తి ప్రాణముయొక్క నిమ్నరూపములందు అవచేతనముగాను, మనస్సు వికసించిన కొలది ఎక్కువెక్కువ సచేతనముగాను, పూర్తిగా వికసించిన మనోమయ పురుషుని పరిణతబుద్ధియొక్క ప్రయత్నమునందు మిక్కిలి సచేతనముగాను వర్తించును. సత్త్వము, అనగా బోధాత్మక జ్ఞానము మఱియు అనురూప సారూప్యీకరణము, మానము మఱియు సంతులనముల రూపమగు తత్త్వము, తనకుదానుగా మాఱని ప్రకాశమయ సామరస్యముల ఒకానొక సమ్మేళనమునకు మాత్రమే దారి తీయును; అట్టి సత్త్వము ఈ ప్రపంచగతులయందు శాశ్వతమగు రాజసిక ప్రవృత్తి చేత చంచలమగు సంఘర్షము మఱియు క్రియలోనికి నెట్టబడును, అటులే జడతా, నిశ్చేతనరూపమగు తామసశక్తులచే పరాభూతము లేక పరివేష్టితము నగును. ప్రకృతియొక్క మూడు గుణాత్మక ప్రకారముల, సంమిశ్రము, పరస్పరవ్యాహతము నగు ఖేలనముచేత శాసితమగు ప్రపంచముయొక్క బాహ్యరూప మిదియే యగును.

10. సత్త్వస్వరూపము, ఫలితము :

విశ్వప్రకృతియొక్క ఈ సామాన్య విశ్లేషణమును, ప్రకృతియందు మానవుని బంధనమునకు మఱియు ఆధ్యాత్మిక స్వాతంత్ర్యప్రాప్తికి సంబంధించినంతవఱకు గీత అతని మానసిక ప్రకృతికి అన్వయించును. సత్త్వము - గీత చెప్పును - తన నిర్మలత్వబలముచేత నది ప్రకృతిలోపల నెట్టి వ్యాధిని, అధిని లేక దుఃఖమును పుట్టనివ్వదు (14-6). గృహద్వారములు సూర్య రశ్మికి తెఱచి నప్పుడు వలె, ఎపుడు సమస్త శరీరద్వారములలోనికి బోధ, జ్ఞానముల ప్రకాశప్రవాహము వచ్చిపడునో, ఎపుడు బుద్ధి సావధానము మఱియు భాసితము, ఇంద్రియములు నిశితము, సమస్త మనోవృత్తి సంతుష్టము మఱియు ప్రకాశపూర్ణము, నాడీసత్త శాంతము, సుఖితము మఱియు ప్రసన్నము - "ప్రసాద" (2-64) - అగునో, అపుడు ప్రకృతియందు సత్త్వగుణము గొప్ప వృద్ధిని, ఉత్కర్షను బొందెనని తెలియదగును (14-11). ఏలన జ్ఞానము, సామరస్యపూర్ణ ఆరామము (ease), సుఖము మఱియు సంతోషము సత్త్వముయొక్క సహజఫలితములు. సాత్త్వికమగు సుఖము, తృప్తిజెందిన బుద్ధిసంకల్పముల ఆంతరప్రసాదము గొనివచ్చు తుష్టి మాత్రమే గాదు; పరంతు జ్ఞానప్రకాశమునందు అంతరాత్మయొక్క స్వ-ప్రాప్తిచే గాని, సాక్షి-ఆత్మకును, పరిసరప్రకృతికిని నడుమ సమ్మతి లేక పర్యాప్త, యథార్థ సమాధానముచే గాని జనించు సమస్త హర్షము మఱియు పరితోషము సాత్త్విక సుఖములోనికే వచ్చును.

11. రజఃస్వరూపము రాగము :

రజస్సు - మఱల గీత చెప్పును - రాగాత్మము, అనగా దాని సారము అనురాగము మఱియు లాలసవలన బుట్టు ఆకర్షణ. అది కామ్యవిషయములందు ఆత్మసంగముయొక్క సంతానము; అప్రాప్త తృప్తి నపేక్షించు ప్రకృతితృష్ణనుండి అది జనించును (14-7). కావున అది అశాంతి, తాపము, కామము, లోభము మఱియు సంరంభముతో నిండియుండును, అది అన్వేషణశీల ప్రేరణల మూర్తీభావము. రజోగుణము వృద్ధిజెంది నపుడిది యంతయు పెచ్చుపెరుగును (14-12). అది కామబలము, అదియే సమస్త సాధారణ వ్యక్తిగత కర్మారంభమునకు ప్రేరణ, అదియే మన ప్రకృతియందలి సంభ్రమము, లాలస మఱియు ప్రచోదనయొక్క సమస్తవృత్తికి మూలము, మఱియు నీ వృత్తియే ప్రవృత్తి వెనుక నున్న శక్తి. ఇట్లు రజస్సు స్పష్టముగానే ప్రకృతిగుణములలో నొకటియగు చాలకశక్తి యగును. దాని

ఫలము కర్మవ్యగ్రత, మఱియు దుఃఖము, బాధ, సర్వవిధశోకము; ఏలన యోగ్య రూపమున విషయప్రాప్తి దీనికి లేదు - దాని కామమే అప్రాప్తిని సూచించును - మఱియు ప్రాప్తవస్తువుయొక్క దాని సుఖము సైతము వ్యథితము, అస్థిరము; కారణము, దీనికి స్పష్టజ్ఞానము లేదు, వస్తువు నెట్లు పొందవలెనో తెలియదు, సామరస్య, సముచితభోగముల రహస్యమును సైత మది కనుగొనజాలదు. జీవితముయొక్క అజ్ఞ, ఆవేగమయ అన్వేషణ మంతయు ప్రకృతియొక్క రజోగుణమునకు జెందును.

12. తమఃస్వరూపము అప్రకాశము, అప్రవృత్తి :

చివరకు, తమస్సు జడతాజ్ఞానములనుండి జనించును (14-8), మఱియు దాని ఫలము సైతము జడతా జ్ఞానములే. తమస్సుయొక్క అంధకారమే జ్ఞానము నావరించి, సమస్త సంకరమును, వ్యామోహమును బుట్టించును. కావున అది సత్త్వమునకు వ్యతిరేకము; ఏలన సత్త్వసారము ప్రకాశము (14-11) కాగా, తమస్సారము అప్రకాశము (14-13). కర్మాసమర్థతను, కర్మాలక్ష్యాన్ని గొని తెచ్చునట్లుగానే, దోషాసమర్థతను అజాగ్రతను, అపార్థాన్ని లేదా అనర్థాన్నీ తమస్సు గొని వచ్చును. అలసత, శిథిలత, నిద్ర ఈ గుణమునకు జెందును. కాన ఇది రజోగుణమునకును వ్యతిరేకము; ఏలన రజోగుణ సారము గతి, ప్రేరణ మఱియు చలత్వము (kinesis), అనగా "ప్రవృత్తి" (14-12) కాగా, తమోగుణసారము జడత్వము, అనగా "అప్రవృత్తి" (14-13). ఇట్లు తమస్సు అజ్ఞానముయొక్క జడత, అకర్మయొక్క జడత - అది ఒక ద్వివిధ అభావము.

13. గుణముల బంధనరూపము :

ఈ మూడు ప్రకృతిగుణములు సర్వ మానవులందును గలవు, సక్రియముగా గలవు (18-40), మఱియు నెవ్వడు - సర్వథా గుణరహితు డని కాని, ఏదియోయొక గుణముక్తు డని కాని చెప్పజాలము. ఇతర గుణములను వర్జించి, ఒకే గుణరూపమున పోయబడినవా డుండడు. సర్వమానవులు తమయందు ఎంతోకొంత కామము మఱియు కర్మప్రవృత్తియొక్క రాజసికప్రేరణ గలిగియుందురు; అటులే ప్రకాశ సంతోషములయొక్కయు, కొంత సంతులనము యొక్కయు, తనతోను, తన పరిసరములు మఱియు విషయములతోను మనస్సు యొక్క కొంత సమాధానము యొక్కయు సాత్త్వికవరమును గలిగియుందురు; అటులే తామసిక అసమర్థత మఱియు అజ్ఞానము లేక నిశ్చేతన అందరిలోను కొంత యుండును. కాని ఈ గుణము

లెవ్వనియందును తమ పరిణామాత్మక క్రియయందు గాని, తమ అంశముల సంయోగమునందు గాని ఒకే రీతి నుండవు. ఏలన అవి పరివర్తనశీలములు మఱియు సదా ఒకదాని స్థాన మొకటి ఆక్రమించుచు, ఘర్షణపడు చుండును. ఇపు డొకటి ముం దుండును, ఇపు డొకటి వృద్ధిజెంది, ప్రాబల్యము వహించును, మఱియు ప్రతిగుణము మనలను తన స్వాభావిక క్రియ మఱియు క్రియాఫలితములకు లోనుగావించును. ఒకానొక గుణముయొక్క సామాన్య మఱియు సాధారణ ఆధిక్యముచేతనే ఇతడు తన ప్రకృతియందు సాత్త్వికుడు, రాజసికుడు లేక తామసికుడు – అని మనము చెప్పగలము; కాని యిది యొక సామాన్య వర్ణనయే గాని, కేవల, నిరపేక్ష వర్ణన కాజాలదు. మూడు గుణములును గలిసి ఒకే త్రివిధ శక్తి యగును, అవి తమ క్రియాప్రతిక్రియలచేత ప్రాకృతమానవుని స్వభావమును, దానిద్వారా అతని బాహ్య వ్యవహారమును నిర్ణయించును. కాని ఈ త్రివిధశక్తి అదే సమయమున త్రివిధ బంధనసూత్రము నగును, "ప్రకృతినుండి జనించిన మూడు గుణములు దేహమునందు అందలి అవ్యయనివాసిని బంధించును." (14-5) - అని గీత వచించును. ఒకానొకార్థమున, గుణముల క్రియ ననుసరించి నపుడు బంధనము తప్పదని, మనము వెంటనే చూడవచ్చును; ఏలన అవి తమ గుణము మఱియు క్రియయొక్క సాంతతచేత పరిమితములు గాన, పరిమితత్వహేతువు లగును. తమస్సు తన రెండు వైపులను ఒక అశక్తతయే గాన, స్పష్టముగనే పరిమితత్వము నందు బంధించును." (14-5) - రాజసిక కామన తన కర్మారంభకరూపమున ఒక ఎక్కువ భావాత్మక (positive) శక్తి యగును, కాని అట్లయినను ఆ కామము, మానవుని పట్టి, పరిమితము, స్వాయత్తము చేసికొనుటచే, సదా బంధనమే కాక తప్పదని బాగుగనే చూడగలము. మంచిది, కాని జ్ఞాన, సుఖముల శక్తియగు సత్త్వ మెట్లు బంధన మగును ? ఎట్లు బంధన మగు ననిన, అది మానసిక ప్రకృతియొక్క ఒక తత్త్వము, కావున అది పరిమిత మఱియు పరిమితికరమగు జ్ఞానతత్త్వము; అటులే ఏ సుఖము సుఖవిషయమును సరిగా ననుసరించుట లేక పొందుటపై నాధారపడునో, అథవా మనోవ్యాపారముయొక్క ప్రత్యేకావస్థలపై నాధారపడునో, సంధ్యా ప్రకాశము మాత్రమే యగు మనఃప్రకాశముపై నాధారపడునో, సత్త్వ మదిగో, అట్టి సుఖతత్త్వము. సాత్త్వికసుఖ మొక అస్థిర తీవ్రత లేక పరిమిత ఆరామము (ease) మాత్రమే యగును. దీనికంటె మిక్కిలి భిన్నమైనది మన అనంత ఆధ్యాత్మిక జ్ఞానము మఱియు మన ఆధ్యాత్మికసత్తయొక్క స్వతంత్ర, స్వతఃసిద్ధ ఆనందము.

14. సంగము బంధనహేతువు :

కాని అపు డీ ప్రశ్న ఉదయించును - మన అంతరాత్మ, ప్రకృతిగతమైనప్పటికి, అనంతము, అవ్యయము గదా ? అయినప్పుడు తననెందుకు ప్రకృతి నిమ్నక్రియకు పరిమితము గావించుకొని, బంధనమునకు లోనగును? మఱియు తనకు మూలమగు పరమాత్మవలె, తన సక్రియపరిణామము యొక్క స్వపరిమితులను అనుభవించు చున్నపుడు సైతము తన (లోపలి) అనంతత యందెందుకు ముక్తము గాదు? గుణము లందు, గుణక్రియాఫలితములందును మన సంగమే దానికి కారణమని గీత వచించును. సత్త్వము సుఖమునందు, రజస్సు కర్మయందు, తమస్సు, జ్ఞానము నావరించి, ప్రమత్తత మఱియు అకర్మయందు సక్తముగావించును (14-9). లేక మఱల, "సత్త్వము జ్ఞానసంగముచేతను, సుఖ సంగముచేతను బంధించును; రజస్సు కర్మసంగముచేత అంతరాత్మను బంధించును; తమస్సు ప్రమత్తత, అలసత మఱియు నిద్రలచేత బంధించును" (14-6, 7, 8). వేఱు మాటలలో, గుణములు మఱియు వాని ఫలితముల భోగమునందు సక్తతచేత, అంతరాత్మ ప్రకృతియందలి ప్రాణమనోదేహముల నిమ్న బాహ్యక్రియయందు తన చేతనను కేంద్రీకరించి, వీని రూపములలో తననుదాను బంధించుకొనును మఱియు వెనుక, పరమాత్మయందలి తన స్వీయ అధికతరచేతనను మఱచిన దగును, విమోచక పురుషుని విముక్త శక్తి మఱియు వ్యాప్తిపట్ల అనభిజ్ఞమగును. స్పష్టము గానే, విముక్తులము మఱియు పూర్ణులము నగుటకు, గుణములనుండి దూరముగాను, పైకిని బోయి, ప్రకృతికి పైన భాసించు విముక్త ఆధ్యాత్మికచేతనయొక్క శక్తిని తిరిగి పొందవలెను.

15. కర్మయందే కర్మాతీతత్వమునకు ఉపాయము :

కాని దీని అర్థము సర్వకర్మ విరామమై నట్లు గన్పించును; కారణము, సమస్త ప్రాకృతక్రియయు గుణములచేతనే చేయబడును. అంతరాత్మ తనకుదానుగా కర్మచేయజాలదు, ప్రకృతి మఱియు నామె గుణములద్వారానే చేయగలుగును. అయినను గీత గుణవిముక్తిని విధించుచునే, కర్మావశ్యకతను గట్టిగా చెప్పును. ఇచ్చటే గీత ఫలత్యాగముపై ఎందుకు పట్టుబట్టునో, దాని మహత్త్వము విదితమగును; ఏలన ఫలకామనయే ఆత్మ బంధనయొక్క అత్యంత ప్రబలకారణము, కావున దానిని త్యజించుటచే ఆత్మ కర్మయందు విముక్తము కాగలదు. తామసికకర్మయొక్క పరిణామము అజ్ఞానము, రాజసికకర్మ యొక్క పరిణామము దుఃఖము (14-16) - ప్రతిక్రియ, ఆశాభంగము, అసంతృప్తి లేక అనిత్యతయొక్క దుఃఖము; కావున

ఇట్టి పరిణామములందు పర్యవసించు తామస, రాజసకర్మల ఫలములయం దాసక్తిలో నెట్టి హితమునుండదు. కాని సముచితముగా చేయబడిన కర్మఫలము సాత్త్వికము మఱియు నిర్మలము (14-6), మఱియు నిట్టి కర్మయొక్క ఆంతర పరిణామము జ్ఞానము మఱియు సుఖము. అయినను ఈ సుఖమయ వస్తువులయందు సంగమును సైతము పూర్తిగా త్యజించవలెను; ప్రథమకారణము, మానసమునం దవి పరిమిత మఱియు పరిమితకర రూపములు, రెండవ కారణము, సత్త్వము సంతతము రజస్తమస్సులచే అనుగతము, ఆక్రాంతమునై యుండుటచే ఏ క్షణమునం దైనను అది వానిచే పరాభూతము కావచ్చును గాన, సత్త్వస్థితి సదా అభద్రము. కాని ఒకడు ఫలాసక్తినుండి సర్వథా విముక్తుడైనను, అసలు కర్మయందే అతనికి సంగ ముండవచ్చును - అది కర్మకొఱకే కర్మయందలి రాజసికబంధము గావచ్చును; ప్రకృతిచోదనకు లొంగిపోవుటచే తామసిక బంధము గావచ్చును; అథవా బాగుగా చేయబడిన (14-16) కర్మయొక్క బాగువలన గలుగు ఆకర్షణచే సాత్త్వికబంధము గావచ్చును. ఈ సాత్త్వికబంధము జ్ఞాని లేక పుణ్య కర్మునియందు బలముగా నుండును. కాగా, దీనిని తరించు ఉపాయము గీతయొక్క మఱియొక ఉపదేశము నందు గలదు - అసలు కర్మలనే కర్మప్రభువునకు ఇచ్చివేసి (3-30), అతని సంకల్పముయొక్క నిష్కామ, సమచిత్త నిమిత్తమాత్రము గమ్ము (11-33) - అని గీత మార్గము చూపును. మన కర్మలయొక్క సమస్త కర్తృశక్తియు, కారణమును ప్రకృతిగుణములే యని కనుట, పిమ్మట గుణములకు పరమున వర్తించు పరమును దెలిసికొని, తదభిముఖ మగుట-ఇదియే నిమ్న ప్రకృతిపై కెగయుమార్గము. ఇట్లు మాత్రమే మనము భగవంతునిగతిని మఱియు స్థితిని బ్రాపింపగలము - "మద్-భావ" (14-19). ఈ ప్రాప్తిచేత జననమరణములకును, వాని అనుషంగికములగు క్షయము, జర, మఱియు దుఃఖములనుండియు విముక్తమైన అంతరాత్మ అమృతత్త్వమును, సనాతనమగు దాని నంతను ఉపభోగించును.

16. గుణాతీతుని వర్ణన :

కాని అట్టి మానవుని లక్షణము లేవియగును? అతని కర్మ ఏది యగును; కర్మయందు సైతము అతడు గుణాతీతు డని ఎట్లు చెప్పబడును ? (14-21) - అని అర్జును డడుగును. దేనిని గుఱించి నేను - శ్రీ కృష్ణుడు చెప్పును - మఱల మఱల చెప్పియున్నానో, ఆ సమతయే అతని లక్షణము. ఆ లక్షణ మేది యన,

ఆంతరముగా నతడు సుఖదుఃఖములను సమముగా చూచును; అతనికి బంగారము, మట్టి, రాయి సమమూల్యములు; అతనికి ప్రియాప్రియములు, నిందాస్తుతులు, మానావమానములు, శత్రు మిత్ర పక్షములు సమవస్తువులు (14–24). అత డొక జ్ఞానమయ, అవిచాల్య, నిర్వికార, ఆంతర శాంతియందు సుప్రతిష్ఠితుడు – ("ధీరః" (14–24). అతడే కర్మను స్వయముగా ప్రారంభించడు, సర్వకర్మలను ప్రకృతి గుణములకే వదిలివేయును (14–25). సత్త్వము, రజస్సు లేక తమస్సు అతనియందు లేవవచ్చును లేక విరమించవచ్చును; లేచి (తమ ఫలితమగు) ప్రకాశమును, కర్మప్రవృత్తిని, లేక అకర్మను మఱియు మనః ప్రాణములను ఆవరించు అంధకారమును గొనిరావచ్చును; కాని అతడు ఇది వచ్చినపుడో, అది పోయినపుడో హర్షించడు, అటులే వాని రాకపోకల పట్ల విముఖుడును గాడు (14–22). ఏలన అత డిపుడు ప్రకృతిగుణములకంటె నితరమగు మఱియొక తత్త్వముయొక్క సచేతనప్రకాశమునం దాసీనుడై యున్నాడు, మఱియు నా మహత్తరచేతన గుణములకు పరము, వాని చలనములకు చలించక, అతనియందు స్థిరముగా నుండును (14–23) – ఉచ్చతర వాతావరణమున కెగసిన వానికి మేఘములకు పై నుండు సూర్యుడు స్థిరముగా గన్పించు నట్లు. అత డా ఎత్తునుంచి, కర్మప్రక్రియలో నున్నవి గుణములే యనియు, వాని కల్లోలము లేక ఉపశమము ప్రకృతివృత్తియే గాని, తాను గాదనియు గాంచును; అతని ఆత్మ అవిచలము మఱియు నతని ఆత్మసత్త అస్థిర వస్తువుల చంచల వికారశీలతయందు పాల్గొనదు (14–23). ఇది బ్రాహ్మస్థితియొక్క నిర్వ్యక్తికత్వము; ఏలన పైన పేర్కొనబడిన ఉచ్చతర తత్త్వము, విశాలము మఱియు నుచ్చపదస్థితమగు నా మహత్తరచేతన – "కూటస్థ" (15–16) – అక్షర బ్రహ్మమే.

17. బ్రహ్మకు సైతము ప్రతిష్ఠ :

కాని యిచ్చట సైతము ఒక ద్వంద్వ స్థితి మిగిలియున్నది, రెండు ప్రతిరూపముల లోనికి సత్తయొక్క విభజన మిగిలి యున్నది; అక్షరాత్మ లేక బ్రహ్మము నందలి ఒక విముక్తపురుషుడు ఒక అవిముక్త క్షరప్రకృతియొక్క క్రియను కేవలము గమనించును – ఈ ద్వంద్వ మక్షరము మఱియు క్షరము. ఇంతకు మించిన అధికతర స్థితి, ఇంతకు మించిన నిరపేక్ష సంసిద్ధికాస్పదమగు తత్త్వము లేదా ? ఈ విభజనయే

శరీరమునందు సంభవమగు అత్యున్నత చేతనయా? క్షరప్రకృతిని, దేహధారణనుండి పుట్టిన గుణములను విడిచిపెట్టి, బ్రహ్మముయొక్క నిర్వ్యక్తికత మఱియు శాశ్వత శాంతిలో నంతర్ధానమగుటయే యోగముయొక్క పరమావధియా? వైయక్తిక పురుషుని యొక్క లయమే పరమముక్తియా? కాదు, తదన్య మేదియో గల దనిపించును; ఏలన గీత అధ్యాయాంతమున, ఈ ఏకమాత్ర అంతిమస్వరమును మఱల నాలపించుచు నిట్లు చెప్పును, "ఎవడు అవ్యభిచారి ప్రేమ భక్తులతో నన్ను సేవించుచు, బొందగోరునో, వాడును గుణములను దాటివెళ్లి, బ్రహ్మ మగుటకు సమర్థుడగును." (14-26). ఇచ్చట "నన్ను" పురుషోత్తముని దెలుపును (15-18), ఈ పురుషోత్తముడు శాంతబ్రహ్మము యొక్కయు, అమృతత్త్వము యొక్కయు, అవ్యయ ఆధ్యాత్మికసత్త యొక్కయు, శాశ్వతధర్మము యొక్కయు, కేవలానందముయొక్కయు ప్రతిష్ఠ యగును (14-27). ఇట్లు, గుణకలహమును అవిచలముగా దర్శించు రూపము గల అక్షరబ్రహ్మము యొక్క శాంతికంటెను అధికమగు ఒక పదము (status) గలదు. బ్రహ్మయొక్క అవికార్యత్వానుభవమునకు బైన ఒక పరమ ఆధ్యాత్మికానుభవము మఱియు ప్రతిష్ఠ గలదు, రాజస కర్మప్రేరణరూప ప్రవృత్తి (14-12) కంటెను అధికమగు నొక శాశ్వత ధర్మము గలదు, రాజసిక దుఃఖముచేత నస్పృష్టము, సాత్త్వికసుఖమునకు పరము నగు నొక నిరపేక్ష ఆనందము గలదు, మఱియు నీ వస్తువు లన్నియు పురుషోత్తముని సత్తాశక్తులయందు నివసించుటచేత విదితము, ప్రాప్తము నగును (14-26). కాని ఈ అధికతరపదము భక్తిచేత ప్రాప్తమగును గాన, దాని తత్త్వమొక దివ్యానందము గావలెను - ఈ ఆనందమునందు [1] నిరతిశయ ప్రేమయొక్కయు, ప్రాప్తిరూప (possessing) ఏకత్వము యొక్కయు సంయోగ మనుభూత మగును మఱియు నీ సంయోగమే భక్తియొక్క పరమశిఖరము. చివరకు, ఆ పరమానందము లోనికి, ఆ అవర్ణనీయ ఏకతలోనికి ఆరోహించుటయే ఆధ్యాత్మిక సంసిద్ధియొక్క పరిసమాప్తియు, అమరత్వసాధకమగు శాశ్వత ధర్మముయొక్క పరిపూర్తియు నగును.

---

[1] "నిరతిశయ ప్రేమాస్పదత్వం ఆనందతత్త్వం" - శ్రీ అ.

15. [2] ముగ్గురు పురుషులు

1. కేంద్రాలోచన :

గీతాసిద్ధాంతము ఎన్ని మార్గముల వెంట నడచినను, ఎన్నెన్ని మలుపులు దిరిగినను, ఆదినుంచి అంతమువఱకు ఒకే కేంద్రాలోచన దిశగా తన గమనమును సాగించును; ఈ గమనమునందది బహువిధ తత్త్వశాస్త్రములను సరిపుచ్చి, వానికి సమాధానమును సాధించును, ఆధ్యాత్మికానుభవముయొక్క సత్యములను జాగ్రత్తగా సమన్వయపఱచును; విడివిడిగానో, అన్యోన్యవ్యావర్తక రూపముననో తీసికొని, అన్వేషించినపుడు ఏ యీ సత్యములు లేక వెలుగులు విరుద్ధము, లేక కనీసము విభిన్నముగా దోచునో, వాని నన్నింటిని ఒకే కేంద్రమునకు గొనివచ్చును. కాగా ఈ కేంద్రాలోచన యేమన, అది ఒక త్రివిధచేతన యొక్క భావము - ఈ చేతన మూడయ్యును ఏకము, మఱియు సత్తయొక్క సమస్త స్తరములందు నుండును.

2. క్షరము, క్షరమునందలి పురుషుడు :

ఈ ప్రపంచమున పనిచేయుచుండు ఒక సచేతనసత్త (spirit) గలదు, అది అసంఖ్యరూపములం దేకమాత్రము. అది జన్మకర్మల వికాసకర్త, ప్రాణముయొక్క చాలకశక్తి, ప్రకృతియొక్క శతసహస్ర క్షరభావము లందలి అంతర్నివాసియు, సంయోజకము నగు చేతన; దేశకాలము లందు గన్పించు ఈ సమస్త సంరంభమునకు సత్యత నిచ్చున దదియే. ప్రపంచము లందలి ఈ అంతరాత్మ సమూహ మంతయు నదియే ? అదియే దేవతలు, మానవులు మఱియు సర్వజీవులు, వస్తువులు మఱియు శక్తులు, గుణములు మఱియు పరిమాణములు, విభూతులు మఱియు సాన్నిధ్యములు (presences). అది సత్తాశక్తి యగు ప్రకృతి, మఱియు నామ భావ రూపాత్మకమగు ఆ ప్రకృతిజన్యవిషయములు, మఱియు ఆ అద్వితీయ స్వయంభూ ఆధ్యాత్మిక సత్తయొక్క అంశములు, జన్మలు, సంభూతులే సర్వభూతములు; అది ఏకము, సనాతనము. కాని మనముందు పనిచేయుచు, ప్రత్యక్షముగా గన్పించునదీ సనాతనములు గాదు, అతని చేతనశక్తియు గాదు, పరంతు అది ఒక ప్రకృతి - ఈ ప్రకృతి తన క్రియలయొక్క అంధావేగమునందు తన లోపలి పురుష నెఱుంగక యుండును. ఆమె కర్మ కొన్ని ప్రాథమిక గుణములు లేక

---

[2] గీత : అధ్యాయము - 15

శక్తితత్త్వములయొక్క ఒక అజ్ఞ సంకుల పరిమితివిధాయక ఖేలనము; వాని ఈ ఖేలనము యాంత్రికము, వాని పరిణామములు స్థిరములు లేక అస్థిరములు, మఱియు నేయే విధమగు అంతరాత్మ ఆమె క్రియయందు పైకి గన్పించునో, అదియు స్వయముగా తన ఆభాసమునందు అజ్ఞము, దుఃఖమయము మఱియు నీ నిమ్నప్రకృతి యొక్క అసంపూర్ణ, అసంతృప్తికర ఖేలనమునకు బద్ధము. ఆమె లోలోపల నుండు మహాశక్తి ఈ విధముగా పైకి గన్పించు అంతరాత్మకంటెను గూడ భిన్నము; అది ఆమె సత్యమునందు గుప్తము, ఆమె ఆభాసములందు ఇంచుక వ్యక్తము నగు క్షరపురుషుడు (15-16), విశ్వాత్మ, వైశ్వవ్యాపారము మఱియు సంభూతియొక్క క్షరతయందలి ఆధ్యాత్మికతత్త్వము. తన వ్యక్తరూపముల వెనుకనున్న ఈ గుప్త సత్యమును మనము చేరుకొనవలెను; ఈ ముసుగుల వెనుకనున్న దివ్యపురుషుని గనుగొని, అంతయు నొకడే - "వాసుదేవ ఇతి సర్వం" (7-19) - వైయక్తికము, విశ్వస్థితము, విశ్వాతీతము నగు నొకడే యని చూడదగును. కాని మనము నిమ్న ప్రకృతిలో కేంద్రీకరించుకొని, జీవించునంత కాలము ఆంతరసత్యముయొక్క తగినంత పూర్ణతతో దీనిని సాధించు టసాధ్యము. ఏలన ఈ నిమ్నవృత్తియందు ప్రకృతి ఒక అజ్ఞానము, ఒక మాయ; ఆమె తన అజ్ఞానముయొక్క పొరలయందు భగవంతుని కాశ్రయ మిచ్చి, అతనిని తన నుండియు, తన బిడ్డలనుండియు దాచి వేయును, సర్వమును సృజించు తన యోగముయొక్క మాయచేతనే భగవంతుడు మఱుగువడి యుండును (7-25), అత డిచ్చట అనిత్యమునందు రూపము ధరించిన నిత్యుడు, తన అభివ్యంజక దృశ్యముచేతనే ఆచ్ఛాదితమైన పరమసత్త. ఒక స్వతంత్ర వస్తువుగా గ్రహించబడిన కేవల క్షరమునందు, అనగా అవిభక్త అక్షరము మఱియు అతీతము నుండి వేఱుచేయబడిన క్షరప్రపంచమునందు జ్ఞానసంపూర్ణత యుండదు, మన సత్తాసంపూర్ణత యుండదు, కావున విముక్తి యుండదు.

3. అక్షరాత్మ, దాని సాధన :

కాని మఱియొక సచేతనసత్త గలదు, దానిని మన మెఱుంగవచ్చును, అది ఈ వస్తువులలో నేదియు గాదు, అది ఆత్మ, ఆత్మమాత్రము. ఈ సత్త సనాతనము, ఎల్లపుడు ఏకరూపము, అభివ్యక్తిచేత మాఱదు, ప్రభావితము గూడ గాదు; ఇది ఏకము, అచలము; ఇది అవిభక్తమగు స్వయంభూసత్త, మఱియు ప్రకృతియందలి వస్తువులు మఱియు శక్తుల విభజనచేత విభక్తమై నట్లు కన్పించను గూడ కన్పించదు,

ఇది ఆమె క్రియయందు అక్రియము, ఆమె చలనము నందు అచలము. అది అన్నింటియొక్క ఏకాత్మ, అయినను తన మీద నాధారపడు నీ వస్తువు లన్నియు అనాత్మయై నట్లు, తన ఫలితములు, శక్తులు మఱియు పరిణామములు గానట్లు, తన కంటియెందు ప్రదర్శింపబడు ఒక నాటక మైనట్లు, అది అవిచలితము, ఉ దాసీనము, అస్పృశ్యముగా నుండును. ఏలన నాటకమును ప్రదర్శించుచు, దాని యందు పాత్రవహించు మనస్సునకంటె, ఆ క్రియను తటస్థముగా తనలో ధరించు ఆత్మ భిన్నము, ఇతరము. ఈ ఆత్మతత్త్వము, దానిని మనము కాలమునందు చూచుచున్నప్పటికి, కాలరహితము; దేశమున వ్యాపించి యున్నట్లు దానిని మనము చూచుచున్నప్పటికి, అది దేశమునందు ఆతతము గాదు. ఎంతెంత వెలినుండి లోనికి ఉపసంహరించు కొందుమో, లేక క్రియ మఱియు గతి వెనుక సనాతనము మఱియు ధ్రువమగు దానికొఱ కెంతెంత వెదుకుదుమో, లేక కాలము మఱియు దాని సృష్టినుండి అస్పష్టమగు దాని దిశగా, దృశ్యమునుండి సత్తాదిశగా, వైయక్తికము నుండి నిర్వ్యక్తికత దిశగా, సంభూతినుండి మాఱని స్వయంభూసత్త దిశగా ఎంతెంత దూరము పోదుమో, అంతంత ఆత్మతత్త్వము నెఱుంగుదుము. ఇది అక్షరపురుషుడు (15-16) - సవికారము నందలి అవికారము, ప్రచలము నందలి అచలము, సవ్యయము నందలి అవ్యయము. అథవా దాని వ్యాపన మొక ఆభాసము మాత్రమే గాన, అక్షరము, అచలము, అవ్యయము నగు దానియందే క్షర సవ్యయ వస్తువుల ప్రచలత్వము ప్రవర్తించు నని చెప్పవలెను.

4. క్షరాక్షరసంబంధము :

సర్వప్రాకృతసత్తగను, సర్వభూతముల సాకల్యముగను దృగ్గోచరమగు క్షరతత్త్వము అచల సనాతన అక్షరతత్త్వమునందు వ్యాపకరూపమున చరించును మఱియు కర్మచేయును. వాయుగుణము సంయోజన వియోజనాత్మకమగు స్పర్శశక్తి; ఈ శక్తితో నిది అగ్ని-తేజోరూప, బాష్పరూప, విద్యుద్రూప అగ్ని-మఱియు దాని క్రిందిభూతముల నిర్మాణశక్తి కాధార మగుచు, నెటుల సూక్ష్మద్రవ్యాత్మకమగు ఆకాశమునం దంతటను చరించునో (9-6), అటులే ఆత్మయొక్క చలశక్తి ఆత్మయొక్క ఆధారభూత స్థిరతయందు పనిసేయును. ఈ అక్షరము బుద్ధికంటెను పైనుండు ఆత్మ - బుద్ధి మన సత్తయందు ప్రకృతియొక్క అత్యున్నత అంతరతత్త్వమగు విమోచక

శక్తి, దీనిద్వారానే మానవుడు సంక్షుబ్ధ మానసికాత్మనుండి ప్రశాంత ఆధ్యాత్మికాత్మకు తిరిగివచ్చి, ఎట్టకేలకు జన్మకర్మ చక్రమునుండి విముక్తు డగును (2-51), ఇట్టి బుద్ధిని సైతము ఆత్మ అతిశయించును. ఈ ఆత్మ తన పరమధామమునందు (8-21), వైశ్వప్రకృతియొక్క మూలమగు 'అవ్యక్తము' కంటెను పైనుండు ఒక 'అవ్యక్తము' (8-20); కావున అంతరాత్మ ఈ అక్షరమున కభిముఖమై నపుడు, ప్రకృతి ప్రపంచములకు దానిపై గల పట్టు సడలిపోవును మఱియు నది జన్మ కావల భాసించు, మార్పులేని సనాతన సత్తయందు ప్రవేశించును. కావున ఇవి రెండును మనము ప్రపంచమునందు జూచు రెండు తత్త్వములు - పురుషులు. ఒకటి తన క్రియయందు ముందునకు నిర్గమించును, రెండవది దాని వెనుక, తన శాశ్వతశాంతి యందు ధృఢముగా నిలిచియుండును - ఈ శాంతి నుండియే కర్మ ప్రభవించును మఱియు సర్వక్రియలు దానిలో తిరిగి విరమించి, దాని కాలరహిత సత్తలో కలిసిపోవును, అనగా 'నిర్వాణము' నందును (2-72) - "ద్వా విమౌ పురుషౌ లోకే క్షరశ్చ అక్షర ఏవచ" (15-16).

5. క్షరాక్షరములు ఒకే వస్తువు :

ఇచ్చట మన బుద్ధిని తికమకపెట్టు సమస్య యేమన, ఈ రెండును పరస్పర విరుద్ధములుగా దోచును, వాని మధ్య ఎట్టి సంధి గాని, సంక్రమణమార్గము గాని కన్పించదు, ఒక దానిని త్రోసివేసిననే తప్ప రెండవ దానిని బొందలే మనిపించును. క్షరము అక్షరమునందు వేఱువడి కర్మ సేయును లేక కనీసము కర్మను ప్రేరేపించును; కాగా అక్షరము స్వ-కేంద్రితమై, తన నిష్క్రియత యందు క్షరమునుండి విడివడి యుండును. కాగా, సాంఖ్యులతో బాటు పురుష ప్రకృతుల మౌళిక సనాతన ద్విత్వమును, కాదు అసలు ఒకవిధమగు పురుషుల సనాతన బహుత్వమునే అంగీకరింతు మేని, అది ప్రథమదృష్టికి ఎక్కువ శ్రేష్ఠముగా, ఎక్కువ యుక్తియుక్తముగా, ఎక్కువ సుబోధముగా గన్పించును. అపుడు తనలోనికే ప్రతిపురుషునియొక్క ఉపసంహరణము, అనగా ప్రకృతినుండియు, కావుననే జీవనసంబంధములందు ఇతరపురుషులనుండియు సర్వథా పరాఙ్ముఖమగుట-సారతత్త్వమునందు స్వయంపర్యాప్తము, అనంతము మఱియు సంపూర్ణము నగును. కాని నిజానికి చరమానుభవ మేమన, ఒకవిధమగు సర్వభూతముల ఏకతానుభవము; ఇది ప్రకృతియొక్క ఒకే శక్తికి సర్వుల అధీనతారూపమగు ఒకే విధమగు అనుభవము

గాదు, ఇది ఆత్మయందు సర్వుల ఏకతానుభవము, సర్వుల ఏకత, ఇది ఈ అనంత వైవిధ్యమునకంతటికి పరమున, సాపేక్షసత్తయొక్క ఈ ప్రతీయమాన పృథగ్భావ మంతటికి వెనుక నుండి సచేతనసత్తయొక్క ఒక విశాల తాదాత్మ్యము. గీత ఈ సర్వోన్నత ఆధ్యాత్మికానుభవమునే తన కాధారము గావించుకొనును. గీత నిజానికి అంతరాత్మల సనాతన బహుత్వము నంగీకరించుచున్నట్లు గన్పించును, అయితే ఈ బహుత్వము వాని సనాతన ఏకత్వమునకు అధీనము మఱియు దానిచే ధారితము; విశ్వము సదా యుండును గాన, అభివ్యక్తి అనంత యుగచక్రములలో కొనసాగును గాన, గీత అంతరాత్మ బహుత్వము నంగీకరించును. మఱియు అనంతుని లోపల వైయక్తిక ఆత్మయొక్క నిరపేక్షలయమును, సంపూర్ణవినాశమును గీత ఎక్కడను వక్కాణించదు, కనీసము సూచించదు గూడ. కాని అదేసమయమున అక్షరాత్మ ఈ అంతరాత్మ లన్నింటికి ఏకాత్మయని గట్టి పట్టుతో గీత వక్కాణించును. కావున ఈ క్షరాక్షరములు రెండును ఒకే సనాతన మఱియు వైశ్వ సత్తయొక్క ఒక్క ద్వివిధస్థితి యని మనకు స్పష్టపడును. ఇది యొక అతి ప్రాచీన సిద్ధాంతము; ఇది ఉపనిషత్తుల యొక్క విశాలతమ దర్శనమున కాధారము. ఉదాహరణకు, ఈశ ఉపనిషత్తు ఇట్లు చెప్పును : బ్రహ్మము చరము మఱియు అచరము - రెండును, అటులే ఏకము మఱియు అనేకము, ఆత్మ మఱియు సర్వభూతములు, జ్ఞానము మఱియు అజ్ఞానము, సనాతన అజాత స్థితి మఱియు భూతముల జన్మావస్థ ; మఱియు ఈ రెండింటిలో ఒకదానియందే రమించుట పాక్షికజ్ఞానముయొక్క అంధకారము లేక అజ్ఞానముయొక్క అంధకార మగు నని చెప్పును. "సమగ్రం మాం" (7-1) - అని గీత విధించు నట్లే, రెండింటిని ఆలింగనము గావించుకొని, పరాత్పరుని సంపూర్ణ రూపమున దెలిసికొనుటయే అమృతత్వము ననుభవించుటకును, సనాతనునియందు నివసించుటకును మార్గ మని ఉపనిషత్తును వక్కాణించును. గీతా బోధనయు, ఉపనిషద్బోధనయొక్క ఈ పార్శ్వమును ఇంతవఱకు ఒకటియే; ఏలన అవి క్షరాక్షర ముల రెండింటిని గుర్తించి, అంగీకరించి నప్పటికి, సత్తయొక్క పర్యవసానముగను, పరమసత్యముగను వాని ఏకత్వమునకు వచ్చిచేరును.

6. ఏకతానుభవము నందలి కష్టము :

ఈ అధికతర జ్ఞానము మఱియు ననుభవము, మన అత్యున్నత దృష్టి నెంత సత్యముగాను, బలముగాను ఆకర్షించినప్పటికి, మిక్కిలి వాస్తవము, అత్యవసరమునగు

ఒక కఠినతను ఇంకను తొలగించ వలసియున్నది, ఆ కఠినత తార్కికము, సాధనాత్మకము నగు ఒక విరోధము, అది ప్రధమదృష్టికి ఆధ్యాత్మికానుభవముయొక్క పరమశిఖరమువఱకు వెంటాడునట్లు గన్పించును. ప్రచలమగు నీ బాహ్యాభ్యంతరానుభవము కంటె సనాతన బ్రహ్మ మన్యము, ప్రచలనమును మించిన అధికతర చేతన గలదు - "న ఇదం యద్ ఉపాసతే" (కేన ఉ.) : కాని అదే సమయమున ఇది యంతయు బ్రహ్మమే, ఇది యంతయు ఆత్మయొక్క సంతత స్వదర్శనమే (self seeing)- "సర్వం ఖలు ఇదం బ్రహ్మ" (నిక్కముగా ఉన్నదంతయు బ్రహ్మమే) (చాం.ఉ.), "అయం ఆత్మా బ్రహ్మ" (ఆత్మ బ్రహ్మము) (మాం.ఉ.). ఇంకను "ఆత్మా అభూత్ సర్వభూతాని" (ఆత్మయే సర్వభూతము లయ్యెను) (ఈ.ఉ.)., మఱియు స్వేతాశ్వతరోపనిషత్తు ఇట్లు వర్ణించును, "నీ వీ బాలుడవు, ఆ బాలికవు మఱియు కఱ్ఱసాయముతో నడుచు నా వృద్ధుడవు." ఇటులే గీతయందు సైతము భగవంతు డిట్లు చెప్పుకొనిపోవును, "నేను కృష్ణుడను, అర్జునుడను, వ్యాసుడను, ఉశనుడను (10-37), మఱియు నేను సింహమును, అశ్వత్థవృక్షమను (10-26), మఱియు నేను చేతనను (10-22), నేను బుద్ధిని (7-10), సర్వగుణములు నేను (7-12), ప్రాణుల ఆత్మను నేనే (10-20)." కాని స్వభావమునం దంత విరుద్ధము మాత్రమే గాక, అనుభవమున ఏకముచేయుట యం దంత కష్టమగు నీ రెండును ఎట్లు ఒకటియే యగును? ఏలన సంభూతియొక్క ప్రచలత్వమునందు నివసించునపుడు కాలాతీత ఆత్మసత్తను గమనించగలమేమో గాని, దాని అమరత్వమున నివసించుట దుస్సాధ్యము. అటులే కాలాతీతసత్తయందు ప్రతిష్ఠితులమైనపుడు, దేశకాల సంబంధములు మననుంచి దూరమగుచు, నొక పీడ కలగా భాసింపసాగును. ఇట్టి యెడ, ప్రథమదృష్టికి, ప్రకృతియందలి పురుషుని చలత్వ మొక భ్రాంతి యనునదే బాగుగా నచ్చునట్టి సిద్ధాంతముగా దోచును - ఈ చలత్వము, మనము దానియందు నివసించు నపుడే వాస్తవము గాని, స్వతః వాస్తవము గాదు; మన మాత్మలో తిరిగి ప్రవేశించి నపుడు, అది మన అదృష్యస్వరూపమునుండి దూరమగును. అదియే ఈ కఠినసమస్యను భేదించు పరిచితవిధానము - "బ్రహ్మ సత్యం జగన్ మిథ్యా"

7. మిథ్యాత్వమే మిథ్య :

అయితే గీత ఈ వివరణమునందు తల దాచుకొనదు; ఏలన దీని కుండవలసిన ప్రబలకఠినతలు దీని కున్నవి, పైగా నిది మిథ్యాత్వమునకు కారణము చెప్పదు,

చెప్పజాలదు; ఇది యంతయు ఒక నిగూఢ మహామాయ యని మాత్రమే ఈ వివరణము వచించును. అయినపుడు మనము గూడ ఇది యంతయు నొక నిగూఢ ద్వివిధసత్యము, క్షరాక్షరములు ఒకదానినొకటి మఱుగు పఱచుకొను నిగూఢసత్యము - మాయ గాదు - అని చెప్పవచ్చును. గీత మాయను ప్రస్తావించును గాని, అది యొక వ్యామోహక ఆంశికచేతన యని మాత్రమే ప్రతిపాదించును (7-13). ఆంశికము గావుననే అది పూర్ణసత్యముయొక్క పట్టును గోల్పోవును, చలప్రకృతియొక్క దృశ్యరూపమున నివసించును, మఱియు తాను దేనియొక్క సక్రియశక్తియో, అట్టి ఆత్మనే దర్శించజాలదు - "మే ప్రకృతిః" (7-5). మన మీ మాయ నతిక్రమించి నపుడు, ప్రపంచ మదృశ్యము కాదు, పరంతు అది తన అర్థరూప హృదయమును మాత్రమే మార్చివేసికొనును. ఆధ్యాత్మిక దర్శనమున ఇది యంతయు భగవంతుని యొక్క ఆత్మ, అంతరాత్మ మఱియు ప్రకృతి యని - సర్వము వాసుదేవు డని - కనుగొందుము. గీత కీ ప్రపంచము సత్యము, ఈశ్వరుని ఒక సృష్టి (11-37), సనాతనునియొక్క ఒక శక్తి (7-6), పరబ్రహ్మమునుండి వచ్చిన ఒక అభివ్యక్తి (13-31), మఱియు త్రివిధమాయారూపమగు నిమ్నప్రకృతి సైతము భగవంతుని పరప్రకృతినుండి ఉత్పన్నమైనదే (7-12). మఱియు నొక ద్వివిధ సత్యము గలదు: ఒకటి నిమ్నతరము, సక్రియము, కాలగతము ; రెండవది ఉచ్చతరము, శాంతము, నిష్క్రియము, సనాతనము; కాగా ఈ అల్పత్వమునుండి ఆ మహత్త్వమునకు, క్రియ నుండి మౌనమునకు బయనించుటే మన ముక్తి యని చెప్పి, ఇట్టి విభేదమునందును తలదాచుకొనజాలము. ఏలన జీవించియుండగనే, ఆత్మయందును, దాని మౌనమునందును మనము సచేతనముగా నుండగలము, మఱియు నుండవలెను, అయినను ప్రాకృతప్రపంచమున శక్తితో వ్యవహరించగలము మఱియు వ్యవహరించవలెను - అని గీత పట్టుబట్టును. ఇచ్చట గీత సాక్షాత్తు భగవంతుని దృష్టాంతమే యిచ్చును - అతడు జన్మవలన గలుగు కర్మావశ్యకతకు బద్ధుడు గాని విముక్తుడు, విశ్వానికి పరుడు, అయినను నిరంతరము కర్మరతుడు - "వర్త ఏవచ కర్మణి" (3-22). కావున భాగవత ప్రకృతియొక్క సాదృశ్యమును సంపూర్ణముగా ధరించుటచేతనే (14-2), ఈ ద్వివిధానుభవముయొక్క ఏకీకరణము సర్వథా సంభవమగును. కాని ఈ ఏకతయొక్క సూత్ర మేది యగును ?

8. పురుషోత్తమునియందు క్షరాక్షరసమన్వయము :

ఈ సూత్రమును గీత పురుషోత్తమునియొక్క తన పరమదర్శనమునందు గనుగొనును, ఏలన ఆ దర్శనము సంపూర్ణ పరమానుభవముయొక్క ఆదర్శము, కృత్స్నవిదుల (3–29) సమగ్రజ్ఞానము. కాగా, అక్షరము విశ్వప్రకృతియొక్క తత్త్వములు మఱియు క్రియ కంటెను పరము (8–20). అది సర్వభూతముల అవికారి ఆత్మ మఱియు నీ అవికారి ఆత్మ పురుషోత్తముడే. తన స్వసత్తయొక్క స్వతంత్రతారూపమున పురుషోత్తము డక్షరుడు, ఈ స్వసత్త ప్రకృతియందలి స్వశక్తి క్రియచేత అప్రభావితము, తన స్వసంభూతియొక్క ప్రేరణచేత అక్షతము, మఱియు తన స్వీయగుణముల ఖేలనము చేత అక్షుబ్ధము. కాని యిది పూర్ణజ్ఞానముయొక్క గొప్ప పార్శ్వ మైనను, ఒక పార్శ్వము మాత్రమే. పురుషోత్తముడు అక్షరు డగుచునే, అక్షరునికంటె నధికుడు; కారణము అక్షరుని నిర్వ్యక్తికతను మించియుండును, అతడు తన సత్తయొక్క పరమ సనాతన స్థితిచేత – "పరమం ధామ" (15–6) – సైతము పరిమితుడు గాడు, అయినను, మనయం దేది అక్షరము, సనాతనమో దానిద్వారానే, దేనినుండి పునర్జన్మ యుండదో అట్టి పరంధామమును ప్రాపింతుము, మఱియు నిదియే ప్రాచీన మును లపేక్షించిన ముక్తి. కాని అక్షరముద్వారా మాత్రమే ముక్తి నన్వేషించినపుడు (12–3), ఈ ప్రయత్నము అనిర్దేశ్యబ్రహ్మయొక్క అన్వేషణ మగును, అయితే యిది శరీరగతులమగు మన ప్రకృతికి కడు కష్టము (12–5). అక్షరము, అనగా మనయందలి శుద్ధ అగోచరాత్మ తన నేతినేతి – ప్రచోదనచే ఏ నిర్దేశ్యమున కెగయునో, అది ఒక పరమావ్యక్తము – "పరో అవ్యక్తః" (8–19), అయితే ఆ పరమ అవ్యక్త అక్షరము గూడ పురుషోత్తముడే (15–17). కావుననే, అనిర్దేశ్యము నుపాసించువారు సైతము "నన్నే", సనాతన భగవంతునే చేరుదు రని గీత వక్కాణించును (12–4). కాని అత డీ పరమ అవ్యక్త అక్షరము కంటెను గూడ అధికుడు, ఎట్టి నేతినేతి – నిషేధాత్మకత బ్రహ్మముకంటెను అధికుడు, ఏలన తన స్వీయ సత్తయందు ఈ సమస్తవిశ్వమును విస్తరించు పరమ పురుషునిగా సైతము అతని నెఱుంగవలసియున్నది. అత డొక పరమ నిగూఢ సర్వము, ఇచ్చటి సమస్త వస్తువులకు మూలమగు నొక అవర్ణనీయ భావాత్మక బ్రహ్మము. అచ్చట మాత్రమే అతడు పురుషోత్తముడు గాడు, ఇచ్చట క్షరమునందు సైతము ప్రభువు, ప్రతివారి హృదయమునందును ఈశ్వరుడు. పోగా, అచ్చట తన పరంధామమునందు –

"పరో అవ్యక్త" మునందు - సైతము అతడు పరమేశ్వరుడు (15-17), అతడు ఏకాకి, సంబంధరహిత అనిర్దేశ్యముగాడు, పరంతు అతడు ఆత్మకును, విశ్వమునకును బీజము, తండ్రి, తల్లి, ప్రథమాధారము, సనాతనస్థానము (9-17, 18) మఱియు సర్వభూతమహేశ్వరుడు, యజ్ఞతపస్యల మహాభోక్త (5-29). అతనిని ఏకకాలమున క్షరమునందును, అక్షరమునందును ఎఱుంగవలెను, అన్నింటి జననమునందు తనను ఆంశికముగా ప్రకటించుకొను నట్టియు, సంతతావతారముగా (18-61) స్వయముగా సైతము ఆవరించు నట్టియు జన్మరహితునిగా (4-6) నెఱుంగవలెను, తన సంపూర్ణత యందు-"సమగ్రం మాం" (7-1) - ఎఱుంగవలెను; అట్టి సమగ్ర జ్ఞానముచేత అంతరాత్మ నిమ్నప్రకృతి యొక్క ఆభాసములనుండి సులభముగా ముక్తమగును (5-3), మఱియు ఒక వ్యాపక ఆకస్మిక అభివృద్ధిచేతను, ఒక విశాల అపరిమేయ ఆరోహణముచేతను దివ్యసత్త మఱియు దివ్యప్రకృతిలో తిరిగి ప్రవేశించును (18-55). ఏలన క్షరసత్యము సైతము ఒక పురుషోత్తమ సత్యమే. పురుషోత్తముడు ప్రతి జీవిహృదయమునందు అవస్థితుడు, మఱియు తన అగణ్య విభూతులయందు అభివ్యక్తుడు. పురుషోత్తముడే కాలగతుడగు విశ్వపురుషుని రూపమున విముక్త మానవాత్మకు దివ్యకర్మ ఆదేశము నిచ్చును (11-33). క్షరాక్షరులిరువురును అతడే, అయినను అత డీ వ్యతిరేక పురుషులలో ప్రతివానికంటెను అధికుడు గాన, వానికంటె నితరుడు. "ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మా ఇత్యుదాహృతః యో లోకత్రయం ఆవిశ్య భిభర్తి అవ్యయ ఈశ్వరః" (15-17), "వీ రిరువురి కంటె అన్యుడు ఉత్తమ పురుషుడు, అతనిని పరమాత్మ యందురు, అతడు లోకత్రయమును ఆవేశించి, ధరించియుండు అవ్యయ ఈశ్వరుడు." ఈ శ్లోకము, పైకి వ్యతిరేకముగా గన్పించు, మన సత్తయొక్క ఈ రెండు రూపముల గీతాసమన్వయమునందు కీలకవాక్యము.

9. అతని పురుషభావము మన ప్రేమరహస్యము :

పురుషోత్తమభావము ఆదినుండియు సిద్ధముచేయబడినది, సూచింపబడినది, ఛాయామాత్రముగా చూపబడినది, సత్యమైనట్లు స్వీకరించబడినది, కాని యిపుడు పదునైదవ అధ్యాయమునందు మాత్రమే అది స్పష్టముగా ప్రతిపాదించబడి, ఒక పేరుద్వారా వేఱుచేయబడినది (15-17). మఱియు క్రిందటి అధ్యాయమున గీత దీని నెట్లు సమీపించి, పెంపొందించునో చూచుట బోధదాయక మగును. దివ్యప్రకృతిలోని కారోహించుటకు వ్యక్తి తన నొక పరిపూర్ణ ఆధ్యాత్మిక సమతయందు

ప్రతిష్ఠించుకొని (14-24, 25), గుణముల నిమ్నప్రకృతినుండి పై కెగయవలెను. ఇట్లు నిమ్నప్రకృతి నతిక్రమించి నిర్వ్యక్తికతయందు, సర్వక్రియకు నతీతమగు అవిచాల్యపరత్వమునందు, గుణపరిమితి సోకని పవిత్రతయందు మనలను మనము ప్రతిష్ఠించుకొందుము (14-23); కాగా ఈ నిర్వ్యక్తికత పురుషోత్తముని అభివ్యక్త ప్రకృతియొక్క ఒక పార్శ్వము, అక్షరాత్మయొక్క నిత్యత మఱియు నేకతారూపమున అతని అభివ్యక్తి. కాని పురుషోత్తమునియొక్క ఒక అవర్ణనీయ నిత్య బహుత్వమును గలదు, అది జీవాభివ్యక్తియొక్క ఆద్యగుహ్యము వెనుకనున్న అత్యున్నత సత్యతమ సత్యము. అనంతుని ఒక సనాతన శక్తి, తన ప్రకృతియొక్క ఆద్యంతములు లేని ఒక క్రియ గలదు, మఱియు నా క్రియయందు నిర్వ్యక్తికముగా దోచుశక్తుల ఖేలనము నుండి జీవవ్యక్తిత్వరూపమగు అద్భుత మావిర్భవించును - "ప్రకృతిర్ జీవభూతా" (7-5). వ్యక్తిత్వము సైతము భగవంతుని ఒక లక్షణము, మఱియు నది అనంతుని యందు తన అత్యున్నత ఆధ్యాత్మిక సత్యమును, అర్థమును బొందును గావున, జీవవ్యక్తిత్వము సంభవమగుచున్నది. అయితే అనంతమునందలి పురుషుడు నిమ్నప్రకృతియొక్క అహంకారిక, భేదజనక, విస్మృతిపూర్ణ వ్యక్తిత్వము గాడు. అతడొక ఉత్కృష్ట, విశ్వమయ, విశ్వాతీత, అమర, దివ్యపురుషుడు. ఆ పరమ పురుషరూప గుహ్యమే భక్తిప్రేమల రహస్యము. మనయందలి సనాతన పురుషుడు. అనగా పరమపురుషాంశ మగు అంతరాత్మ ఆ పరమపురుషునకే తన సర్వస్వమును, తనను గూడ అర్పించి వేసికొనును. ఈ ఆత్మసమర్పణమునందు, మన వ్యక్తిత్వము మఱియు కర్మ అధీశ్వరునిలోనికి భక్తిప్రేమలచే మన వైయక్తికప్రకృతియొక్క సముద్ధరణమునందు జ్ఞానసంపూర్తి సిద్ధించును; అటులే కర్మయజ్ఞమును ప్రేమ సామర్థ్యముచేత తన పరిసమాప్తిని, భగవంతుని అనుమోదనమును బొందును. కావున ఈ ప్రేమ, జ్ఞాన, కర్మలద్వారా మానవుని అంతరాత్మ ద్వివ్యప్రకృతియొక్క ఈ యితర క్రియాశీల రహస్యమునందు, ఈ యితర సమధిక ఘనిష్ఠ పార్శ్వమునందు మిక్కిలి సంపూర్ణముగా తన పరిపూర్తి నందును మఱియు నీ పరిపూర్తిచేత అమృతత్వముయొక్కయు, పరమసుఖముయొక్కయు, శాశ్వతధర్మముయొక్క ప్రతిష్ఠను తనది గావించుకొనును (14-26, 27). మఱియు, ఏకాత్మయందు సమత్వము, ఏకేశ్వరునియొక్క ఆరాధన రూపమగు ఈ రెండు సాధనలను బ్రహ్మపరప్రాప్తికి - "బ్రహ్మభూయాయ" (14-26) రెండు వేఱు మార్గములుగా గీత ముందు ప్రతిపాదించును - ఇందు ఒకటి శమపరమగు సన్యాసము, రెండవది దివ్యప్రేమ మఱియు దివ్యకర్మ రూపము;

ఇక నిప్పుడు గీత ఈ సవ్యక్తిక నిర్వ్యక్తికములను పురుషోత్తమునియందు ఏకము గావించి వాని సంబంధముల నిర్వచింప దొడంగును. ఏలన పాక్షికవాదములను, భేదజనక అతివాదములను దూరము గావించి, జ్ఞానము మఱియు నాధ్యాత్మికానుభవము యొక్క ఈ రెండు పార్శ్వములను మేళవించి, పరమసంసిద్ధికి ఒక అద్వితీయ పూర్ణ మార్గమును రూపొదించుటయే గీతాలక్ష్యము.

10. ప్రపంచవృక్షము బంధనాత్మకము :

గీతముందు, వేదాంతము ననుసరించి, జగత్తును అశ్వత్థ (రావి) వృక్షరూపమున వర్ణించును. ఈ వృక్షమునకు దేశమునందు గాని, కాలమునందు గాని ఆదియు లేదు, అంతమును లేదు (15-3); ఏలన అది నిత్యము, "అవ్యయము" (15-1). దాని నిజరూపము నీ మానవ లోకమున గాంచజాలము, మఱియు దాని కీ స్థూలలోకమున ఎట్టి స్థిర ప్రతిష్ఠయు లేదు (15-3). అది - ప్రపంచము - ఒక అనంతప్రవాహము మఱియు దాని మూలము అనంతునియొక్క పరంధామమునందు గలదు (15-1). దాని హేతువు సహజ సనాతనమగు కర్మప్రవృత్తి, ఇది సర్వసృష్టికి ఆదియగు ఆద్యపురుషునుండి ప్రభవించును - "ఆద్యం పురుషం యతః ప్రవృత్తి ప్రసృతా పురాణీ" (15-4). కాన దాని మూలకందము కాలమున కావల, పైన సనాతనునియందు గలదు; కాని దాని శాఖలు ఇచ్చట క్రింద ప్రసరించును మఱియు దాని కొన్నివేళ్లు ఇచ్చట అధోముఖముగా మానవలోకమున నాటుకొనియున్నవి - ఈ వేళ్ళ రూపము సుదృఢము, సంలగ్నము నగు సంగము మఱియు కామము, కాగా వీని పరిణామము మఱింత కామము, అనంతముగా పొదలుచుండు మఱింత ప్రవృత్తి (15-2). పోగా దాని ఆకులు వేదమంత్రములు మఱియు నా విశ్వవృక్షము నెఱింగినవాడు వేదవిదుడగును (15-1). వేదముయొక్క, లేక కనీసమువేదవాదము యొక్క ఏ నిందాత్మక చర్చ మనకు పూర్వము (చూ. ప్రథమసంపుటము, వ్యాసము-9) తగిలెనో, దాని ఛాయయే ఇక్కడను గోచరించుచున్నది. ఏలన వేదములు మన కిచ్చు జ్ఞానము దేవతలయొక్కయు, ప్రాపంచికతత్త్వములయొక్కయు జ్ఞానము, మఱియు దాని ఫలములు కోరికతో జేసిన యజ్ఞఫలములు, ఇవి భూలోకము, స్వర్గలోకము, అంతరిక్షలోకములకు మాత్రమే చెందిన భోగము మఱియు నైశ్వర్యరూపమగు ఫలములు (2-43). ఈ విశ్వవృక్షముయొక్క కొమ్మలు క్రింద భౌతికలోకమునందు, పైన అధిభౌతికలోకములందును విస్తరించును (15-2);

అవి ప్రకృతిగుణములచేత పెరుగును, ఏలన ఈ కొమ్మలు త్రైగుణ్యమును మాత్రమే వర్ణించు వేదవిషయములు – "త్రైగుణ్యవిషయా వేదాః" (2–45). వేదమంత్రములు ఈ వృక్షముయొక్క ఆకులు కాగా, భోగ్యవిషయములు సంతతము నంకురించుచుండు పల్లవములగును (2–42). కావున మానవుడు, గుణక్రీడ నుపభోగించుచు, కామాసక్తుడై యున్నంత కాలము, జన్మకర్మల ప్రవృత్తివలయములలో చిక్కుకునియుండి, స్వర్గమర్త్య లోకముల నడుమ పరిభ్రమించుచు, తన పరమ ఆధ్యాత్మిక అనంతతలను తిరిగి పొందజాల కుండును. ఋషులు దీనిని గుర్తించిరి. ముక్తిని సాధించుటకు వారు కర్మప్రేరణారూప మగు ప్రవృత్తినుండి విరమించుకొని, నివృత్తిపథము నవలంబించిరి మఱియు నీ మార్గాంతరమున జన్మరాహిత్యమును, సనాతనుని విశ్వాతీతభూమిక యందు అతీతపదమును బొందిరి (15–5). కాని ఇందునిమిత్తము లోతుగా తన్నుకొనిన కామమూలమును ధృఢమగు అసంగశస్త్రముచే ఛేదించి, దేనిని ప్రాపించిన తిరిగి జన్మించవలసిన అగత్యముండదో, అట్టి సర్వోన్నత గమ్యము నన్వేషింపవలెను (15–3, 4). నిమ్నమాయయొక్క సమ్మోహమునుండి విముక్తమగుట, అహంకారమును వర్జించి, సంగ – దోషమును జయించి, కామములను కట్టిపెట్టి, సుఖదుఃఖ ద్వంద్వమును దూరము చేసి, ఒక విశుద్ధ ఆధ్యాత్మికచేతనయందు సదా నిలిచి యుండుట – ఆ పరమ అనంతుని మార్గసోపానములు (15–5). అచ్చట మనము కాలాతీతసత్తను కనుగొందుము, అది సూర్యుడు, చంద్రుడు లేక అగ్నిచేత భాసితము గాదు (15–6), అది స్వయముగా సనాతనపురుషుని సన్నిధియొక్క భాసము. ఆద్యపురుషుని మాత్రమే అన్వేషించుచు, మహాపథమున అతనిని బొందుటకు తదభిముఖ మగుచున్నాను – అని ఒక వైదికశ్లోకము పలుకును (15–4). అది పురుషోత్తమునియొక్క పరమపదము, అతని విశ్వాతీతభావము.

11. జీవుడును సనాతనుడే :

కాని సన్న్యాసపూర్వకమగు నివృత్తిద్వారా దీనిని బాగుగా, శ్రేష్ఠముగా ప్రత్యక్షముగా బొందగల మనిపించును. దాని విహిత మార్గము అక్షరపథ మనిపించును – జీవన కర్మల సంపూర్ణసన్న్యాసము, తపోమయ ఏకాంత వాసము, ధ్యానమయ అకర్మ. ఇచ్చట కర్మాదేశమునకు అవకాశ మెక్కడ, కనీసము ఆహ్వాన (పిలుపు) మెక్కడ, ఆవశ్యకత ఎక్కడ? ఈ అక్షరమార్గానికి లోకసంగ్రహము తోను (3–20), కురుక్షేత్ర హత్యాకాండతోను (1–36) సంబంధ మేమిటి? అటులే కాలపురుని సంహార

సంరంభముతోను, "లెమ్ము, శత్రువులను జయించుము, సమృద్ధరాజ్యము ననుభవింపుము" (11-33) - అని భీషణాదేశము నిచ్చు విరాట్పురుషుని దర్శనముతోను దీని కేమి సంబంధము ? అయితే, మంచిది, ప్రకృతియందలి అంతరాత్మస్వరూపము నీ వెఱుంగుదువా? ఈ పురుషుడు, ఈ క్షరుడు, మన క్షరభావముయొక్క ఈ భోక్త సైతము పురుషోత్తముడే; ఇతడునుఅతని సనాతన బహుత్వమునందు పురుషోత్తముడే - అని గీత సమాధానించును, "నా ఒక సనాతనాంశమే జీవలోకమునందు జీవు డగును " (15-7). "సనాతన" మను నీ విశేషణమునకు ఎంతయో అర్థ గౌరవము, పరిణామ మహత్త్వము గలవు. ఏలన ప్రతి అంతరాత్మయు, ప్రతిజీవుడును ప్రకృతియందు భగవంతుని మిక్కిలి ఆంశికముగానే అభివ్యక్త మొనరించుచున్నను, తన ఆధ్యాత్మిక సత్యతయందు సాక్షాత్తు భగవంతుడే యని ఈ విశేషణమున కర్థము. మఱియు, శబ్దముల కొక అర్థ మస లున్నచో, ప్రతి అంతరాత్మయు, అనేకమునందలి ప్రతివ్యక్తియు అభ్యక్తియందు ఒకే మూలసత్తయొక్క ఒక సనాతన వ్యష్టిరూపము, ఒక సనాతన అజ అమర శక్తి యనియు దాని కర్థ మగును. ఈ అంతరాత్మను మనము జీవు డనుటకు గారణము, సజీవ ప్రాణుల ఈ లోకమున అది సజీవ ప్రాణియై నట్లు గన్పించును, మఱియు మానవునియందలి ఈ అంతరాత్మను మానవ అంతరాత్మగా భాషించుచు, మానవతాపరిభాషలోనే దానిని గుఱించి చింతింతుము. కాని నిజాని కది తన ప్రస్తుతరూపముకంటెను అధికతరము, అది మానవభావమునకు మాత్రమే బద్ధము గాదు : గతమునం దది మానవాభివ్యక్తికంటె స్వల్పతర అభివ్యక్తిగా నుండెను, కాని భవిష్యత్తునందు అది మనోమయ మానవునికంటె నెంతో అధికతర అభివ్యక్తి కాగలదు. మఱియు అజ్ఞానకృత పరిమితి నంతటిని వీడి అది పైకెగసి నపుడు, అంతరాత్మ తన దివ్యప్రకృతిని ధరించును - దాని మానవభావ మీ దివ్యప్రకృతియొక్క ఒక తాత్కాలిక ఆవరణము మాత్రమే; ఆంశికము, అపూర్ణము నగు అర్థముతో గూడిన ఒక అవాంతర వస్తువు మాత్రమే. ఈ వైయక్తికాత్మ ఈ లోకమునకు బైన సనాతనుని యందు ఇపు డున్నది, ఎపుడును ఉండెను; ఏలన అది స్వయముగా సనాతనము (15-7). (ఇపుడు 'సనాతన' శబ్దప్రయోగముయొక్క పరిణామమును జూతము). జీవుని సనాతనతాభావమును పురస్కరించుకొనియే గీత సంపూర్ణ 'లయమును' సూచించు నెట్టి పదమును ప్రయోగించదు, పైగా జీవుని అత్యున్నతావస్థ

పురుషోత్తమునియందు నివసించుటయే యని పలుకును – "నివసిష్యసి మయ్యేవ" (12-8). సర్వభూతముల ఏకాత్మను గురించి ప్రసంగించు నపుడు (5-7, 24), గీత అద్వైత పరిభాషను వాడుచున్నట్లు గన్పించినను, సనాతన వ్యష్టి (individual) యొక్క ఈ స్థాయిసత్యము – "మమైవాంశః సనాతనః" (15-7), అద్వైతమునకు ఒక విశిష్టతను గల్పించును మఱియు గీత విశిష్టాద్వైతమును దాదాపు ఆమోదించినట్లు తోచును – అయినను గీతాదర్శన మదియే యని గాని, గీతామతము తర్వాత వచ్చిన రామానుజమతముతో అభిన్నమని గాని ఒక్కపెట్టున మనము నిర్ణయించరాదు. కాని ఈ మాత్రము స్పష్టము : ఏకమాత్ర భగవదస్తిత్వముయొక్క ఆధ్యాత్మికసత్తయందు మిథ్యామాత్రము గాక, పూర్ణవాస్తవ మగు నొక బహుత్వ తత్త్వము గలదు.

12. మనలోని వెలుగే సూర్యునిలోని వెలుగు :

సనాతన వ్యష్టిపురుషుడు దివ్యపురుషునికంటె నితరుడు గాని, వస్తుతః అతనినుండి ఎవ్విధముగాను వేఱు గాని గాడు. అతడు స్వయముగా నీశ్వరుడే; ఈశ్వరుడే తన ఏకత్వముయొక్క బహుత్వ సామర్థ్యము చేత వ్యష్టిరూపము ధరించి, మనలోని అమృతాత్మగా సర్వదా వర్తించును – నిజానికి సమస్త సృష్టియు ఈ బహుత్వసత్యముయొక్క రూపాంతరము గాదా? శరీరము ధరించినవాడును అతడే, అది మరణించినపుడు వెడలిపోవు వాడును అతడే. అతడు శరీరప్రవేశము చేయునపుడు, విషయభోగము నిమిత్తము ప్రకృతియొక్క అంతరశక్తులగు మనస్సు మఱియు పంచేంద్రియములను, వాయువు పుష్పమునుండి గంధమునువలె, గొనివచ్చి, వానిని వికసింపజేయును (15-8). కాని ప్రకృతియందలి జీవేశ్వరుల తాదాత్మ్యము మన బాహ్యరూపముచేత మననుండి మఱుగుపడి, ఆ ప్రకృతియొక్క ఎడమీయని చంచలవంచనలచేత నష్టమగును. మానవతారూపము లేక ప్రకృతియొక్క తదితర రూపములచే శాసింపబడుటకు స్వయముగా నవకాశమిచ్చువారు దాని నెన్నటికి జూడరు, పరంతు మానవదేహమున నివసించుచున్న భగవంతుని ఉపేక్షింతురు మఱియు తృణీకరింతురు (9-11). అతడు శరీరమున ప్రవేశించునపుడు గాని, దానిని వీడిపోవునపుడు గాని, దాని యందు నిలిచి, గుణాన్వితుడై అనుభవించు నపుడు గాని, వారి అజ్ఞాన మతనిని జూడజాలదు; ఇంద్రియగోచరమగు దానినే చూచును గాని, జ్ఞానచక్షువు మాత్రమే చూడగల మహత్తరసత్యమును జూడజాలదు (15-10). బాహ్యచేతన విధించు పరిమితులను నేర్పుతో తొలగించి, తమయందు

తమ ఆధ్యాత్మికసత్తను నిర్మించుకొననంతవఱకు, అనగా తమ ప్రకృతియందు దానికొక రూపమువంటి రూపమును సృజించుకొన నంతవఱకు, ఎంత ప్రయాసపడినను వారు జీవుని దర్శనమును బొందజాలరు. మానవుడు తనను దెలిసికొనుటకు "కృతాత్ముడు" (15-11) గావలెను, అనగా ఆధ్యాత్మికరూపమున పూర్ణముగా నిర్మింపబడి, ఆధ్యాత్మిక దర్శనమున ప్రబుద్ధుడు గావలెను. ఈ జ్ఞానచక్షువుతో నొప్పారు యోగులు తమ అనంతసత్యతయందు, తమ ఆత్మనిత్యత యందు మనమే అయిన దివ్యపురుషుని జూతురు (15-11). జ్ఞానప్రదీప్తులైన వీరు ఈశ్వరుని తమయందే కాంతురు, మఱియు స్థూల శారీరిక పరిమితినుండియు, మానసిక వ్యక్తిత్వరూపమునుండియు, క్షణిక ప్రాణికనిర్మాణము నుండియు విముక్తు లగుదురు; ఆత్మ మఱియు పురుషరూప సత్యమునందు వీరు అమరులై జీవింతురు. కాని వారు ఈశ్వరుని తమయందే గాక, విశ్వ మంతటను వీక్షింతురు. జగత్తు నంతను వెలిగించు సూర్యుని వెలుగు నందు వారు మనయందు (ను) గల భగవంతుని వెలుగును దర్శింతురు ; అటులే చంద్రునియందును, అగ్నియందును గల ప్రకాశము భగవంతుని ప్రకాశమే (15-12). భూమియొక్క ఈ రూపమున ప్రవేశించిన వాడును, దాని భౌతికశక్తి యొక్క ఆత్మగా నున్నవాడును, తన ఓజస్సుతో ఈ భూతజాలము నంతటిని ధరించుచున్నవాడును భగవంతుడే (15-13). సోమదేవత అయిన భగవంతుడే భూమాతయందలి రసముచే తన నాచ్ఛాదించియున్న మొక్కలను, చెట్లను బోషించును (15-13). సజీవప్రాణుల యొక్క భౌతికశరీరమును ధరించి, తదాహారమును వాని ప్రాణికశక్తిని బోషించు రసముగా మార్చు ప్రాణాగ్ని భగవంతుడే గాని, మఱెవ్వరును గారు (15-14). అతడు ప్రతిప్రాణిహృదయమునందును ప్రతిష్ఠితుడై యున్నాడు; అతనినుండియే స్మృతి, జ్ఞానము, తర్కము వెలువడును. సకలవేదముల చేత నెఱుంగబడువా డతడే, వాని నెఱుంగువాడును అతడే, వేదాంతకర్తయు నతడే (15-15). ఇట్లు భగవంతు దేకకాలమున జడముయొక్క ఆత్మ, ప్రాణముయొక్క ఆత్మ, మనస్సుయొక్క ఆత్మ; మనస్సునకును, దాని పరిమితి హేతుబుద్ధికిని పైన భాసించు అతిమానస తేజముయొక్క అతీతాత్మ.

13. పురుషోత్తముడు క్షరాక్షరములు, రెండును :

ఇట్లు భగవంతుడు తన గుహ్యముయొక్క రూపమగు యుగళ ఆత్మగా, ద్వివిధశక్తిగా అభివ్యక్త మగును - "ద్వా విమౌ పురుషౌ" (15-16); ఈ

సర్వభూతములు నగు, క్షరవస్తువులయందలి క్షరపురుషుని - "క్షరః సర్వాణి భూతాని" (15-16), మఱియు వీనికి పైన, తన అక్షోభ్యనిశ్చలతయందు, సనాతన శాంతిస్థిరతల యందు నిలిచియుండు అక్షరపురుషుని ఏకకాలమున భగవంతుడు ధరించియుండును. మఱియు తమయందలి భగవంతుని శక్తి ప్రభావముచేతనే, ఈ యుభయపురుషులు మానవుని మనోహృదయసంకల్పము లను తనతన వైపునకు బలముగా నాకర్షించుకొందురు, ఈ విరుద్ధ ఆకర్షణలు పరస్పర వినాశమునకు పట్టుబట్టినట్లు గన్పించును. కాని భగవంతుడు కేవలము క్షరుడును గాడు, కేవలము అక్షరుడును గాడు. అతడు అక్షరాత్మకంటె నధికుడు, మఱియు క్షరవస్తువుల క్షరాత్మకంటె మఱింత అధికుడు. అతడు ఏకకాలమున రెండును గాగలుగుచున్నా డనిన, దానికి కారణము, అతడు వానికంటెను "అన్యుడు" (15-17), విశ్వాతీతుడైన పురుషోత్తముడు (15-18); అయినను వేదమునందు ఆత్మజ్ఞానరూపమునను, ప్రపంచమునందు ప్రపంచానుభవరూపమునను వ్యాపించి యున్నవాడు (15-18). మఱియు నెవడేని ఇట్లతనిని పురుషోత్తమునిగా నెఱుంగునో మఱియు దర్శించునో, అత డీ ప్రపంచాభాసముచే గాని, క్షరాక్షరముల విపరీతా కర్షణలచేత గాని ఇక మోహితుడు గాడు (15-19). ఈ క్షరాక్షరములు ముందు అతనియందు ప్రవృత్తి, నివృత్తి రూపముల పరస్పరము తలపడును - ఒకటి విశ్వక్రియ యొక్క సద్భావము, రెండవది ఆత్మయందు దాని అభావము; ఏలన ప్రకృతియొక్క అజ్ఞానమునకే చెందు, లేక అట్లు గన్పించు, క్రియయందు ఆత్మ ఎంతమాత్రము పాల్గొనదు. లేక మఱల దీనికి విపరీతముగా సైతము అవి అతని చేతనను సవాలు చేయును : ఈ సారి ఆత్మయే శుద్ధము, అనిర్ధార్యము, స్థిరము, నిత్యము నగు స్వయంభూసత్తారూపమున సద్భావముగా గన్పించగా, విశ్వమే అభావముగా గన్పించును; ఏలన ఈ విశ్వము పట్టుచిక్కని నిర్ధారణలు మఱియు సంబంధముల తోను, భావములు మఱియు రూపములతోను, సంతత అస్థిర సంభూతితోను, ఇంకను క్రియావికాసములు, జననమరణములు, ఆవిర్భావతిరోభావనల యొక్క సృష్టి, వినాశాత్మక జాలముతోను గూడియుండును. పురుషోత్తమవిదుడు ఈ రెండింటిని ఆలింగనము గావించు కొనుచునే, వానిలో చిక్కక, వాని విరోధము నతిక్రమించును గాన, "సర్వవిదు" డగును (15-19). అతడు ఆత్మ మఱియు వస్తు సమూహము - రెండింటియొక్క సంపూర్ణార్థమును దర్శించును; అతడు భగవంతునియొక్క "సమగ్ర సత్యతను" (7-1) తిరిగి సమకూర్చును; ఎట్లన అతడు క్షరాక్షరములను పురుషోత్తమునియందు

ఏకముచేయును. తన మఱియు సర్వసత్తయొక్క పరమాత్మ గను, తన మఱియు సర్వ శక్తులయొక్క ఈశ్వరుడుగను, ప్రపంచమునందును, దానికి పైనను సన్నిహిత మఱియు సుదూర సనాతనుడుగను, అతడు భగవంతుని ప్రేమించును, పూజించును, ఆశ్రయించును మఱియు నారాధించును (15-19). మఱియు నిది యంతయు నతడు తనయొక్క ఒకానొక పార్శ్వము లేక అంశముచేత గాక, తన సత్తాసంభూతులు, తన ఆత్మప్రకృతుల సర్వ ప్రదీప్త ప్రకారములందును ఆచరించును - "సర్వభావేన" (15-19). తన అక్షోభ్య ఆత్మసత్తయొక్క దివ్య సమతయందు దివ్యుడును, ఇంకను దానియందు సర్వ వస్తువులు మఱియు ప్రాణులతో అనన్యుడు నగు నతడు ఆ నిస్సీమసమతను, ఆ గంభీర అనన్యతను క్రిందికి తన మనస్సు, హృదయము, ప్రాణము మఱియు శరీరములోనికి గొనివచ్చి, దానిపై నొక అవిభాజ్య సమగ్రత యందు దివ్యప్రేమ, దివ్యకర్మ మఱియు దివ్యజ్ఞానముల త్రికమును ప్రతిష్ఠించును. ఇదియే గీతయొక్క మోక్షమార్గము.

14. గీతా -ద్వైతము :

మఱియు చివర కిదియే-ఏకమాత్ర సనాతన సత్తయం దెట్టి విభజనము చేయని యిదియే - వాస్తవాద్వైతము కాదా ? ఈ పరమ అవిభాజక అద్వైతము ఏకాత్మయొక్క సత్యతయందు వలెనే ప్రకృతియొక్క బహుత్వములందు, సర్వపార్శ్వములందు సైతము ఏకమాత్రునే చూచును; అటులే ఆత్మమూలమును, విశ్వసత్యము నగు విశ్వాతీతము యొక్క మహత్తమ సత్యత యందువలెనే విశ్వమందును ఏకమాత్రునే గాంచును - ఈ విశ్వాతీతము వైశ్వసంభూతి యొక్క ఎట్టి విధానము (affirmation) చేత గాని, ఎట్టి వైశ్వ లేక సంపూర్ణ నిషేధము (negation) చేత గాని బద్ధము గాదు. కనీస మిది గీతాద్వైతము. ఇది గుహ్యతమ శాస్త్ర మని పరమగురు వర్జునునికి దెలుపును; ఇది పరమ జ్ఞానము మఱియు విజ్ఞానము, ఇది మనకు సత్తయొక్క అత్యున్నత రహస్యములోని హృదయమును తెఱచును. దీనిని సంపూర్ణముగా నెఱుంగుట, అనగా జ్ఞానము నందును, భావమునందును, శక్తియందును, అనుభవమునందును దీనిని ఆకళించుకొనుట యన రూపాంతరము చెందిన బుద్ధియందు పూర్ణమగుట యగును, హృదయమునందు దివ్యతృప్తి నందుట యగును, అటులే సంకల్పము, క్రియ మఱియు కర్మలయొక్క పరమ ఆశయము మఱియు లక్ష్యమునందు కృతార్థుల మగుట యగును (15-20). అమరుల మగుటకు, అత్యున్నత దివ్యప్రకృతి దిశగా ఉద్గమించుటకు, శాశ్వతధర్మమును ధరించుటకును ఇదియే మార్గము.

16. ఆధ్యాత్మిక కర్మయొక్క సంపూర్ణత

1. మూలసమస్య, గీతాపరిష్కారము :

గీతావిచారణ యిపు డే దశ నందుకొన్నదో, దానియం దిక సమాధానించ వలసిన ప్రశ్న యొకటి మాత్రమే మిగిలి యున్నది – మన ప్రకృతి బద్ధము, అపూర్ణము గదా; అది నిమ్నసత్త నుండి ఉన్నత సత్తలోనికి, తన ప్రస్తుత కర్మనియమమునుండి అమరధర్మములోనికి తన పరిణామమును తత్త్వమునందే గాక, సర్వవ్యాపారము నందును ఎట్లు సాధించవలెను; ఈ కఠినత గీత ప్రతిపాదించిన కొన్ని సిద్ధాంతము లందు గర్భితముగా నున్నది, దీని నిపుడు ఎక్కువగా వెలువరించి, స్పష్టతరరూపమున మన బుద్ధిముం దుంచదగును. ఆ నాటి మనస్సునకు పరిచితమైన మానసికజ్ఞానముపై గీత ముందుకు సాగుచు, కొన్ని విషయములను సత్యమైనట్లు స్వీకరించి, కొన్నింటి నసలు విడిచివేసి, అడుగునకు, అడుగునకు మధ్యగల విచారణను సంక్షిప్తము గావించి, తన పరిష్కారమును చూపగలిగెను; దాని నంతను స్పష్టమగు ప్రకాశమున సునిశ్చితముగా నిరూపించుట ఇపుడు మన కవసరము. గీతోపదేశము ప్రారంభమున మన ప్రాపంచిక కర్మ కొక నూతన మూలమును, నూతన స్తరమును నిర్దేశింప సమకట్టును; ఇదియే దాని ఉపక్రమము మఱియు నిదియే దాని ఉపసంహారమునకు మూలహేతువు. దాని ప్రారంభకోద్దేశ్యము కచ్చితముగా మోక్షమార్గమును ప్రతిపాదించుట గాదు, పరంతు ముఖ్యముగా, మోక్షము దిశగా సాగు అంతరాత్మప్రయత్నముతో కర్మల సుసంగతత్త్వమును నిరూపించుటయే; మఱియు నా మోక్షము సిద్ధించి నపుడు, అవిచ్ఛిన్న ప్రాపంచిక కర్మలతో ఆ ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము యొక్క సుసంగతత్త్వమును ప్రదర్శించుటయే – "ముక్తస్య కర్మ" (4-23). ప్రసంగవశమున మాత్రమే, ఒక సమన్వయాత్మక యోగము, లేక ఆధ్యాత్మికముక్తి మఱియు సంసిద్ధికి ఒక మానసిక విధానము రూపింపబడినది, మఱియు నీ యోగ ప్రామాణ్యమునకు ఆధారభూతమగు కొన్ని దార్శనిక ప్రతిపాదనలు, మన సత్తా ప్రకృతులకు సంబంధించిన కొన్ని సత్యములు ప్రస్తావించ బడినవి. కాని మొదటి తత్పరత చివరివఱకు నిలిచియుండును – హత్యాకాండను ఏవగించుకొని, సామాన్య మానసికప్రమాణములపై కర్మ చేయ నొల్లని అర్జునుడు ఒక నూతన సంతృప్తికర ఆధ్యాత్మిక కర్మప్రమాణమును ఎట్లు కనుగొనవలెను, లేక ఆత్మసత్యమునందు నివసించుచునే, కురుక్షేత్ర సంగ్రామమున తన నియతకర్మ

నెట్లు నిర్వర్తించవలెను? – ఇదే ప్రధాన గీతాతత్పరత. నిర్వ్యక్తిక సర్వాత్మయొక్క నీరవతయందు లోలోపల నిర్మలముగా, నిస్సంగముగా, ప్రశాంతముగా నివసించుచునే, క్రియాశీల ప్రకృతియందు దాని కర్మలను క్రియాశీలముగా నిర్వహించవలెను, మఱియు ని కను విశాలముగా, మన లోపలి సనాతనునితో ఏకమై, అతని ప్రకృతితో నేకముచేయబడిన వైయక్తిక ప్రకృతిద్వారా వ్యక్తమగు అతని సంకల్పమును నిర్వర్తించవలెను – ఇదియే అర్జును డెదుర్కొనిన కఠినసమస్యకు గీతా పరిష్కారము.

2. అర్జునుని సమస్యాస్వరూపము :

ఈ పరిష్కార తాత్పర్యమేమియో, అర్జునుని, కఠినతకును, అస్త్రసన్యాసమునకును మూలమునందు గల సమస్యాదృక్కోణము నుంచియు, విస్పష్ట, సునిశ్చిత శబ్దముల లోను ఇపుడు మన మించుక చూతము. మానవుడుగను, సామాజికజీవిగను అర్జునుని కర్తవ్యము క్షత్రియుని సమున్నత ధర్మమును నిర్వహించుట యగును; లేనిచో, అత్యాచారము, అధర్మము, అన్యాయములయొక్క అరాజకదౌర్జన్యమునందు సామాజిక రూపము దెబ్బతినును, జాతిఆదర్శములు నిర్వీర్య మగును, ధర్మన్యాయముల సామరస్యపూర్ణ వ్యవస్థ అడుగంటును. అయినను కేవల కర్తవ్య – ప్రమాణము ఆ సంగ్రామవీరుని తృప్తిపఱుపజాలదు, ఏలన కురుక్షేత్రముయొక్క దారుణవాస్తవికతయం దా కర్తవ్యము కఠోర సంకుల సందిగ్ధ రూపములం దతనికి ప్రత్యక్షమగును. ఎట్లన తన సామాజిక విధిపాలనమున కర్థము, పాపము, శోకము, క్లేశముల రూపమగు అనంతఫలితమున కనుమతించుటయే యని అతనికి సహసా తట్టెను; సామాజిక భద్రతాన్యాయముల సాంప్రదాయిక సాధనము (యుద్ధము) వానికి బదులు మహాకల్లోలమునే తెచ్చిపెట్ట నున్నట్లు అతనికి గన్పించెను. మనము హక్కులని పిలుచునట్టి న్యాయమగు అధికార, ప్రయోజనముల ప్రమాణ మర్జునునికి సాయపడదు; తనకొఱకును, తన సోదరుల కొఱకును, యుద్ధమునందలి తన పక్షముకొఱకును తాను జయించవలసిన రాజ్యము నిజానికి న్యాయరీత్యా తమదే, మఱియు దాని సంస్థాపనము ఆసురికరాజ్య పరాభవము, న్యాయప్రతిష్ఠాపనమే యగును; కాని ఆ న్యాయము రక్తసిక్తన్యాయము మఱియు ఆ రాజ్యము ఒక మహాపాపముతోను, సమాజమునకు జరిగిన ఒక భీకరహానితోను, జాతికి జరిగిన ఒక వాస్తవాపరాధముతోను కళంకిత రాజ్యము. మఱియు ధర్మప్రమాణము, నైతికధర్మప్రమాణమును అతని కక్కరకు రాదు; ఏలన ఇచ్చట ధర్మముల వ్యాఘాతము

కన్పించును. కావున సమస్యా పరిష్కారమునకు ఒక నూతన, అధికతర, అయినను ఊహించని ప్రమాణ మావశ్యకము, కాని ఆ ప్రమాణమేది ? ఆ నియమ మేది ?

3. యుక్తుడవై కర్మచేయుము :

ఏలన కర్మనుంచి ఉపసంహరించుకొని, ధ్యానపరుల నిష్క్రియతయందు శరణుబొంది, తన అసంతృప్తికర పద్ధతులు మఱియు ప్రేఱణలతో తన దారి తాను చూచుకొనుటకు ప్రపంచమును వదిలివేయుట ఒక సంభవపరిష్కార మగును; దీనిని ఊహించుట సులభము, ఆచరించుట సులభము, కాని పరమగురువు సరిగా నీ పరిష్కారమునే పట్టుబట్టి వారించుచు వచ్చెను. భగవంతుడు ప్రపంచప్రభువు, ఆ ప్రపంచము క్రియాక్షేత్రము, ఆ క్షేత్రమున మానవుడు అహంకారముద్వారా అజ్ఞానమునందు గాని, పరిమిత మానవ బుద్ధియొక్క పాక్షిక ప్రకాశమునందు గాని ఏ కర్మలను జేయునో, లేక అతనియందు ఏ కర్మలు అంతర్దృష్టి మఱియు ప్రేరణతో గూడిన ఒక ఉచ్ఛతర భూమికనుండి ప్రారంభించబడునో, అట్టి మానవకర్మ లన్నింటికి భగవంతుడే ప్రభువు, ఆ ప్రభువు మానవునుండి కర్మ నపేక్షించును. మఱల, యుద్ధకర్మ అనర్థ మని చెప్పి, దానిని మాత్రమే వర్జించుట మఱియొక పరిష్కారము, ఇది దూరదృష్టి లేని నీతిబోధకులకు అందుబాటులోని ఉపాయము, కాని ఈ పలాయనమునకు సైతము గురువు తన అంగీకారమును నిరాకరించును. అర్జునుడు యుద్ధముచేయకపోవుటే ఎక్కువ పాపము (2–33) మఱియు అనర్థమునకు గారణ మగును : దాని అర్థము అధర్మ, అన్యాయముల విజయమగును, భగవంతుని కర్మయందు ఒక ఉపకరణముగా తన పాత్రను నిరాకరించుట యగును. జాతి భవితవ్యమును నిర్ణయించు ఈ ప్రచండ సంకటమునకు గారణము జడశక్తుల అంధగతియు గాదు, మానవ భావములు, ప్రయోజనములు, ఆవేగములు, అహంకారముల కేవలక్రమహీనసంఘర్షమును గాదు, పరంతు ఈ బాహ్యరూపముల వెనుకనున్న భగవదిచ్ఛ. అర్జును డీ సత్యము గుర్తించునట్లు చేయవలెను; తన చిన్న వైయక్తిక కామనలు మఱియు దుర్బల మానవ వైముఖ్యములయొక్క కాక, ఒక విశాలతర ప్రకాశతర శక్తి యొక్క, ఒక మహత్తర సర్వజ్ఞ సంకల్పముయొక్క ఉపకరణరూపమున అతడు నిర్వ్యక్తికముగా నిశ్చలముగా పనిజేయ నేర్చుకొనవలెను. లోపలి మఱియు వెలుపలి భగవంతునితో తన అంతరాత్మయొక్క సమున్నత సంయోగమున – "యుక్త" (3–26) – అనగా తన స్వీయ మూలాత్మతోను, విశ్వము

యొక్క అంతర్యామి ఆత్మతోను ప్రశాంత యోగమున యుక్తుడై అతడు నిర్వ్యక్తికము గాను, సార్వత్రికముగాను కర్మ చేయవలెను.

4. ఆత్మజ్ఞానమునందే విముక్తకర్మ :

కాని మానవుడు అహంకారముచేత, అర్థ – ప్రబుద్ధము, అప్రకాశితము నగు సాత్వికాహంకారముచేత సైతము శాసించ బడునంత కాలము, అత డీ సత్యమును సరిగా చూడజాలడు, ఈ కర్మను సరిగా చేపట్టజాలడు, ఏలన ఈ సత్యము ఆత్మసత్యము మఱియు నీ కర్మ ఆధ్యాత్మిక మూలము నుండి నిర్గమించు కర్మ. బౌద్ధికము గాక, ఆధ్యాత్మికజ్ఞానమే ఈ మార్గమునకు పరమావశ్యకము, దాని కేవల సంభావ్య ప్రకాశము, మాధ్యమము, ప్రోత్సాహమును నగును. కావుననే, హర్షశోకములు, కామపాపములు, కర్మయొక్క బాహ్య ఫలితములను బట్టి కర్మను నడుపగోరు మనఃప్రవృత్తి, ప్రపంచముతో విశ్వపురుషుని వ్యవహారములందు ఘోరముగా గన్పించు దానినుండి మానవపరావర్తనము – అర్జునుని వ్యథితము, వ్యాకులము, విమూఢము గావించు ఈ భావములు మఱియు వేదన లన్నియు ప్రాకృతాజ్ఞానమునకు మన చేతనయొక్క అధీనతనుండి జనించినవే యని మున్ముందు గురువు ఎత్తి చూపును (2–14)–నిమ్న ప్రకృతియొక్క ఈ అజ్ఞాన మయ కర్మవిధానము నందు చిక్కుకొని, అంతరాత్మ తన నొక పృథగహంకారముగ చూచుకొనును (3–27), తనపై వస్తువుల క్రియకు సుఖదుఃఖములు, పుణ్యపాపములు, ధర్మాధర్మములు, శుభాశుభరూప ద్వంద్వప్రతిక్రియతో సమాధానమిచ్చును. ఈ ప్రతిక్రియ లొక విషమ వ్యాకులజాలమును సృజించగా, దానియం దంతరాత్మ తన అజ్ఞానముచేతనే భ్రష్టము, సంమూఢము నగును (7–27); అచ్చటది ఆంశిక, అపూర్ణ పరిష్కారములతో తనను నడుపుకొనవలసియుండును, ఈ పరిష్కారములెటులో సామాన్యజీవితమునకు సరిపోవును గాని, ఒక విశాలతర దర్శనము, ఒక గభీరతర అనుభవముయొక్క పరీక్షకు బెట్టినపుడు తప్పిపోవును. కర్మ మఱియు జీవనముయొక్క వాస్తవార్థమును గ్రహించుటకు ఈ సమస్తాభాసముల నుండి వెనుదగ్గి, ఆత్మసత్యములో ప్రవేశింప వలెను; ముందు ఆత్మజ్ఞానమును స్థిరపఱచుకొన్నప్పుడే, యథార్థ ప్రపంచజ్ఞానము యొక్క ఆధారము ప్రాప్తముకాగలదు.

5. వ్యక్తిత్వము వెనుకనుండు ఆత్మలోనికి :

దీనికి ఆవశ్యకమగు ప్రథమ సాధన యేమన, అంతరాత్మ తన ఱెక్కలనుండి కామమును, ఆవేశమును, వ్యథాకర భావావేగమును దులిపివేసి, మానవమనస్సు

యొక్క విక్షుబ్ధ వికృతికారి వాతావరణము నుండి బైటబడి, నిర్వికారసమతయొక్క ఆకాశములోనికి, నిర్వ్యక్తిక ప్రశాంతియొక్క స్వర్గములోనికి, వస్తువులను నిరహంకారముగా దర్శించి, అనుభవించు స్థితిలోనికి ఎగయవలెను; ఏలన విశద్ధమగు నా ఉచ్చతర వాయువు నందే, మబ్బులు మఱియు తుఫాను లన్నింటినుండి విముక్త మగు భూమికలయందే ఆత్మజ్ఞానము లభించగలదు, మఱియు ప్రపంచనియమము, ప్రకృతిసత్యము ఒక వ్యాపకదృష్టితో, అక్షుబ్ధము, సర్వాలింగకము, సర్వవేధకము నగు ఒక ప్రకాశము నందుచూడబడగలవు. ఈ క్షుద్ర వ్యక్తిత్వమొక నిస్సహాయ. కరణము మాత్రమే, తటస్థము లేక వృథాగా ప్రతిరోధించు ఒక బొమ్మ మాత్రమే, ఒక ప్రకృతినిర్మిత రూపము మాత్రమే, దాని వెనుక నొక నిర్వ్యక్తిక ఆత్మ గలదు, అది అన్నింటి యందును ఏకము, వస్తువులను తెలిసికొనున దదియే; అనగా ఒక సాక్షిచేతన గలదు, అది సమము, నిష్పాక్షికము, ఒక విశ్వవ్యాపి సన్నిధి, అది సృష్టిక్రియ కాధారము, అది వస్తుస్వభావమును బట్టి వాని సంభూతిని నిర్వర్తింప ప్రకృతి ననుమతించును గాని, ప్రకృతి ప్రారంభించు క్రియయందు మునిగి, తన స్వరూపమును గోల్పోదు. అహంకారమునుండియు, వ్యథిత వ్యక్తిత్వమునుండియు ఈ ప్రశాంత, సమ, సనాతన, విశ్వవ్యాపి; నిర్వ్యక్తిక ఆత్మలోని కుపసంహరించుకొనుట యోగము నందుచేయబడు దర్శనయుక్తమగు (seeing) కర్మకు ప్రథమసోపాన మగును, అనగా మన కిపు డెంత అస్పష్టముగా నున్నను, విశ్వమునందు తన నభివ్యక్తము గావించుకొనుచున్న దివ్యపురుషుడు మఱియు నతని అమోఘసంకల్పముతో సచేతన సంయోగమునం దుండి చేయబడు కర్మ కది ప్రథమసోపానము.

6. ఆత్మవిశాలతలో అహంకారలయము :

నిర్వ్యక్తిక విశాలతతో గూడిన ఈ ఆత్మయందు ప్రశాంతముగా సమస్థితులమై నపుడు, అది వ్యాపకము, నిర్మలము, నిశ్చలము, నిర్వ్యక్తికము గావున, మన యితర క్షుద్ర మిథ్యాభూత ఆత్మయగు కర్మచేయు నహంకారము దాని విశాలతయందు అంతరించగా, మనము గాక, ప్రకృతియే కర్మచేయుచున్న దనియు, సర్వకర్మయు ప్రకృతికర్మయే గాని, తదితరము గాదనియు మనము గాంతుము. పోగా మనము ప్రకృతి యని పిలుచు ఈ వస్తువు క్రియాగతమగు సనాతన పురుషునియొక్క కార్యనిర్వాహక శక్తి; ఈ పురుష డీ శక్తిద్వారా ప్రతిజాతియందును, జాతియందలి ప్రతివ్యక్తియందును దాని స్వభావ, స్వధర్మముల ననుసరించి విభిన్న ఆకారములను, రూపములను ధరించును (4-13). ప్రతి ప్రాణియు తన స్వభావమును బట్టి

కర్మచేయునే గాని, తదితర విధముగా చేయజాలదు (5-14). అహంకారము, వైయక్తిక కామసంకల్పములు ఒక విశ్వశక్తి యొక్క సృష్ట - సచేతన రూపములు మఱియు పరిమిత ప్రాకృత క్రియలే గాని, తదధికముగా నేమియు గావు, అయితే ఆ శక్తి స్వయముగా రూపరహితము, అనంతము, రూపములకంటె మిక్కిలి అతీతము; బుద్ధి, ప్రజ్ఞ, మనస్సు, ఇంద్రియము, ప్రాణము మఱియు శరీరము - వీని నన్నింటిని మనము ప్రదర్శించుకొందుము లేక మనవే యని తలపోతుము, కాని యివి యన్నియు ప్రకృతియొక్క ఉపకరణములు మఱియు నిర్మాణములు. కాని నిర్వ్యక్తికాత్మ కర్మ చేయదు, కావున అది ప్రకృతిలో భాగము గాదు, అది కర్మను వెనుకనుండియు, పైనుండియు నిరీక్షించును మాత్రము; కావున స్వరాట్టుగను, విముక్త శాంత జ్ఞాత మఱియు సాక్షిగను నిలిచియుండును. ఈ నిర్వ్యక్తికతయందు నివసించు అంతరాత్మ సైతము కర్మలిప్తము గాదు, మన వైయక్తిక ప్రకృతి కర్మలకు ఉపకరణము మాత్రమే; అపు డంతరాత్మ ఆ కర్మలకు గాని, వాని ఫలితములకు గాని మనలను వేధించు సుఖదుఃఖ, రాగద్వేషాది సహస్ర ద్వంద్వములతో సమాధాన మీయదు. అది సర్వ మానవులను, వస్తువులను, ఘటనలను సమచక్షువుతో చూచును, గుణములు మాత్రమే గుణములపై కర్మచేయుచున్నవని గమనించును (3-28), ప్రకృతి యంత్రాంగ రహస్యము నంతను గాంచును, కాని గుణముల కావల నిరాకులము, విముక్తము స్వస్థమునగు ఒక విశుద్ధ నిరపేక్ష మూలసత్తగా నుండును. ప్రకృతి తన కర్మను నిర్వహించుచుండగా, నిర్వ్యక్తికము, విశ్వగమము నగు ఆత్మ దానిని ధరించునే గాని, స్వయముగా సంవృతము గాదు, సక్తము గాదు, లగ్నము గాదు, క్షుబ్ధము గాదు, సంమూఢము గాదు. ఈ సమ ఆత్మ యందు నివసించగలిగినచో, మనమును శాంతిమయుల మగుదుము. మన ఉపకరణములందు ప్రకృతి తన ప్రేరణమును పొడిగించువఱకు, మన కర్మలుకొన సాగును; కాని ఆధ్యాత్మిక స్వతంత్రత యుండును, ప్రశమ ముండును (13-30).

7. ఇరువురి పురుషుల ఆవశ్యకత :

నిష్క్రియపురుషుడు, సక్రియ-ప్రకృతి-ఈ ద్వంద్వము సైతము మన సత్తయొక్క సర్వభావము గాదు; వాస్తవాని కివి రెండును సత్తావిషయమున చివరి మాట గావు. ఒకవేళ అగుచో, సర్వకర్మలు ఉదాసీనాత్మకు ఒకటే యగును, మఱియు ఈ కర్మ గాని, ఆ కర్మ గాని, కర్మ విరతిగాని గుణముల చంచల వ్యాపారముయొక్క అనియంత్రిత ప్రవృత్తి చేతనే సంభవించును, అథవా ప్రకృతియొక్క ఒకానొక యాంత్రిక

నియామకత్వముచే (determinism) నిర్ణయించబడును - ఉదాహరణకు, దీని ననుసరించి, తన ఉపకరణములందలి రాజసిక ప్రేరణచేత అర్జునుడు యుద్ధము లోనికి నెట్టబడును, లేక తామసిక మాంద్యముచేతనో, సాత్త్విక ఉదాసీనతచేతనో దానినుండి పరాఙ్ముఖు డగును. ఇంకను, (పురుష ప్రకృతులే చరమద్వంద్వ మగుచో), అంతరాత్మ తన నివృత్తియందు నిర్వ్యక్తిక నిశ్చల ఆత్మయందు నివసింప నారంభించి, యిక నేమాత్రము సక్రియ ప్రకృతియందు నివసింపదు గావున, దీని చరమఫలితము నిశ్చలత, అకర్మ, ఉపశమము, జడతయే యగును గాని, గీత విధించు కర్మ గాదు. మఱియు, మూడవ కారణము, ప్రకృతియందును, ఆమె కర్మలయందును తనను సంబద్ధముగావించుకొన నెందు కంతరాత్మ పిలువబడినట్లు? - దీని కీ ద్వంద్వ మెట్టి వాస్తవవివరణము నివ్వదు. ఇచ్చట 'అంతరాత్మ' అనుటకు కారణము, ఇట్లు సంబద్ధము గావించుకొనినది నిత్యనిర్లిప్తము, స్వసంవిదము నగు ఏకాత్మ గాజాలదు, ఈ ఏకాత్మ సదా ఏకరూపము, ఇది ప్రకృతికర్మకు పృథగ్భూతసాక్షి లేక నిష్పాక్షిక ఆధారము నగును. పురుష ప్రకృతుల మధ్య గల ఈ అఖాతమే, పూరింపరాని ఈ శూన్యతయే ఇద్దరు పురుషులను, లేక ఒకే పురుషునియొక్క రెండు అవస్థలను ఊహింప మనలను నిర్బంధించును - ఒకటి, ఏకాత్మయందలి గుప్తావస్థ, ఇది తన స్వయంభూసత్తనుండి సర్వమును నిరీక్షించును, లేక దేనిని నిరీక్షింపదు; రెండవది, ప్రకృతిలోనికి స్వయంప్రక్షిప్తము, ఇది ప్రకృతికర్మకు ఉపయోగపడుచు, ఆమె నిర్మాణములతో తన నేకాకారము గావించుకొనును. కాని పురుషద్వయము యొక్క ద్వైతముచే సంశోధితమైన, ఆత్మ మఱియు ప్రకృతి లేక ఆత్మ మఱియు మాయతో గూడిన ద్వైతము సైతము గీతయొక్క సంపూర్ణ దార్శనికసిద్ధాంతము గాదు. గీత వీని నతిక్రమించి, ఒక ఉచ్చతరపురుషుని, పురుషోత్తముని సర్వాలింగక పరమ ఏకత్వమును చేరుకొనును (15-18).

8. పరమపురుషుడు, పరమాత్మ, పరమేశ్వరుడు :

ఒక పరమగుహ్యము, ఒక పరమోన్నత సత్యము గలదు, అది ఈ రెండు విభిన్న అభివ్యక్తులను - ఆత్మ ప్రకృతులను - ధరించి, సమన్వయపఱచును - అని గీత వక్కాణించును. ఒక ఉత్తమోత్తమ పరమాత్మ గలదు (15-17), అది సవ్యక్తిక ఈశ్వరుడు, నిర్వ్యక్తిక బ్రహ్మము - రెండును, కాని అది రెండింటిలో ప్రతిదానికంటెను ఇతరము, అధికము, మఱియు నీ రెండింటి సముచ్చయముకంటెను ఇతరము, అధికము. ఆ పరమాత్మ పురుషుడు, అనగా మన సత్తయొక్క ఆత్మ మఱియు

అంతరాత్మ, కాని అతడు ప్రకృతి గూడను; ఏలన ప్రకృతి సర్వ–పురుషునియొక్క అనగా కర్మ మఱియు సృష్టి దిశగా స్వయం చలితుడైన సనాతనానంతునియొక్క శక్తియే. పరమ అనిర్వచనీయుడుగా, సర్వ – పురుషుడుగా నతడు తన ప్రకృతిచేత సర్వప్రాణులు నగును (14–3). పరమాత్మ గాను, పరబ్రహ్మముగాను అతడు తన విద్యామాయచేత ఆత్మను, తన అవిద్యా మాయచేత అంతరాత్మను (నిమ్నప్రకృతిని) –విశ్వప్రహేళిక యొక్క ఈ ద్వివిధ సత్యమును అభివ్యక్తము చేయును. పరమేశ్వరుడుగా, తన శక్తియొక్క నియామకుడుగా, అతడు ఈ అగణ్యభూతముల వ్యక్తిత్వమును, సామర్థ్యమును, కర్మలను సృజించును, ప్రేరించును మఱియు పాలించును. పోగా ప్రతి జీవుడును (15–7) ఈ స్వయంభూ ఏకమాత్ర పురుషునియొక్క ఒక ఆంశిక సత్త యగును, ఈ సర్వ – అంతరాత్మయొక్క ఒక సనాతన అంతరాత్మ యగును, ఈ పరమేశ్వరుడు మఱియు నతని వైశ్వప్రకృతి యొక్క ఒక ఆంశిక అభివ్యక్తి యగును. ఇచ్చట సర్వమును ఈ భగవంతుడే, ఈ దేవదేవుడగు వాసుదేవుడే (7–19); ఏలన ప్రకృతిచేతను, ప్రకృతియందలి అంతరాత్మ చేతను అతడే యిది యంతయు నగును, ప్రతివస్తువు అతనినుండియే ప్రభవించి, అతనియందు లేక అతనిచేత జీవించును; అయినను అతడు స్వయముగా ఎట్టి విశాలతమ అభివ్యక్తి కంటెను, ఎట్టి గభీరతమ ఆత్మకంటెను, ఎట్టి విరాడ్రూపము కంటెను ఎంతో అధికుడు (10–42). ఇదియే సృష్టియొక్క సంపూర్ణసత్యము మఱియు నిదియే విశ్వక్రియ యొక్క సమస్తరహస్యము; ఇదియే గీతయొక్క తర్వాతి అధ్యాయములందు స్వయముగా వ్యక్తమగుటను మనము చూచియున్నాము.

9. జ్ఞానకర్మల సమన్వయము :

కాని ఈ అధికతర సత్యము ఆధ్యాత్మిక కర్మయొక్క తత్త్వము నెట్లు మార్చును లేక ప్రభావితముచేయును ? అది దానిని ముందుగా నొక మౌలికవిషయమున మార్చివేయును, అనగా దానివలన ఆత్మ, అంతరాత్మ, ప్రకృతి – వీని సంబంధము యొక్క అర్థ మంతయు మాఱిపోవును, అది యొక నూతనదృష్టికి కనువిప్పును, మిగిలియున్న ఖాళీలను పూరించును, ఒకమహత్తర విస్తారమును సంతరించుకొనును, ఆధ్యాత్మికముగా వాస్తవము, నిర్దోషముగా సమగ్రమునగు నొక సత్యార్థమును స్వీకరించును. అప్పుడు ప్రపంచ మిట్లు గన్పించదు : దాని ఒక పార్శ్వము కేవలము యాంత్రిక గుణాత్మక క్రియ మఱియు ప్రకృతి నిర్ధారణము, రెండవ పార్శ్వము

నిర్వ్యక్తిక ఆత్మయొక్క నిశ్చలత – ఈ ఆత్మకు గుణ ముండదు, స్వ – నిర్ధారణ శక్తి యుండదు, సృజించుటకు సామర్థ్యము గాని, సంకల్పము గాని యుండదు. ఈ అసంతృప్తికర ద్వైతముచే విడువబడిన అఖాతమునకు వంతెన కట్టబడును, జ్ఞానకర్మలకు, ఆత్మప్రకృతులకు ఒక సముద్ధారక ఏకత్వము ప్రకాశితమగును. ఎట్లన, నిశ్చల నిర్వ్యక్తిక ఆత్మ పరమ పురుషునియొక్క ఒక సత్యము – అది భగవంతునియొక్క స్థిరత, సనాతనునియొక్క మౌనము, సర్వేశ్వరునియొక్క స్వతంత్రత, అది ఈ ఈశ్వరుని స్వయంభూ సత్తయొక్క స్థిర అనంత స్వతంత్రత, అది అతని సృష్టిచేత బద్ధము, వ్యథితము లేక ప్రభావితము గాదు, అతని ప్రకృతియొక్క క్రియాప్రతిక్రియలచేత స్పృష్టము గాదు, (13-32). కాగా ఈ సమగ్రసత్యమునందు ప్రకృతియు నొక అనిర్వచనీయ మాయగా, ఒక పృథగ్భూత విపరీత దృశ్యముగా గాక, సనాతనునియొక్క ఒక గతిగానే గన్పించును; ఆమె సమస్తసంరంభము, క్రియాకలాపము, బహుత్వము అక్షరాత్మయొక్క అసక్తప్రశాంతియందు ప్రతిష్ఠితమై చెలంగును. ప్రకృతిప్రభువు అక్షరాత్మగా నుండుచునే, అదే సమయమున విశ్వముయొక్క ఏకము, ననేకము నగు క్షరాత్మయునై యుండి, ఒక ఆంశిక అభివ్యక్తియందు ఈ సర్వశక్తులు మఱియు చేతనలు, దేవతలు, మానవులు, పశువులు మఱియు వస్తువులు నగును. గుణాత్మిక ప్రకృతి ఈ పరప్రకృతియొక్క ఒక నిమ్న స్వయంపరిమితి క్రియ మాత్రము, మానవుని ఆంతరసత్త అతని బాహ్యచేతననుండి గుప్తమై యుండునట్లే, తన బాహ్యక్రియయందు నిమగ్నమై యుండు నిమ్నప్రకృతియొక్క బాహ్యశక్తినుండియు భగవంతుని సత్యము వలెనే ఆత్మసత్యమును మఱుగువడియుండును – ఈ గుప్తవస్తువును కనుగొనుటకు తన నానాప్రయత్నములందు అంతరాత్మ లోనికి దిగి, తన స్వీయ వాస్తవసత్యములను, తన ఎత్తులను, తన లోతులను బొందువఱకు ఈ మఱుగు తొలగిపోదు. కావుననే ఆత్మజ్ఞాన సామర్థ్యము నందుటకు జీవుడు తన క్షుద్ర వైయక్తిక అహంకారిక ఆత్మనుండి వెనుదగ్గి, తన మహా నిర్వ్యక్తిక అక్షరాత్మలో ప్రవేశించవలెను. కాని పరమేశ్వరుడు ఆత్మయందే గాదు, ప్రకృతి యందును గలడు. అతడు ప్రతిప్రాణిహృదయమునందు నుండి, తన సన్నిధిచేత ఈ మహాప్రాకృతిక యంత్రవ్యాపారమును తిరుగవలసిన మలుపులు త్రిప్పును (18-61). అతడు సర్వమునందు గలడు (10-39), సర్వము నతనియందు నివసించును, సర్వము నతడే, ఏలన సర్వము నతని సత్తయొక్క సంభూతియే, అతని విశ్వభావముయొక్క ఒక అంశము లేక రూపము. కాని ఇక్క

డంతయు నొక నిమ్న (ప్రకృతి) క్రియావిధానమునందు ప్రవర్తించును. ఈ విధాన మొక నిగూఢ ఉచ్చతర అధికతర పూర్ణతర భగవత్ప్రకృతినుండి వెలువడును, ఇది భగవంతునియొక్క సనాతన అనంత ప్రకృతి లేక నిరపేక్ష ఆత్మశక్తి – "దేవాత్మశక్తి" (శ్వే.ఉ.). భగవంతునియొక్క ఒక సనాతనాంశము (15–7), సనాతన దివ్యసత్తయొక్క ఒక ఆధ్యాత్మికసత్త యగు, మానవునియందు దాగియున్న సమగ్ర – సచేతన పరిపూర్ణ అంతరాత్మ మనలోపల నతనికి వికసించగలదు, మనల నతనికి వికసింపజేయగలదు; అయితే ఇందునిమిత్తము మన మతని క్రియయొక్కయు, మన అస్తిత్వముయొక్కయు ఈ సత్యమునందు స్థిరముగా నివసించు టవసరము, భగవదన్వేషకుడు ముందు తన అక్షర సనాతన నిర్వ్యక్తిక ఆత్మలోని కుపసంహరించుకొని, అచ్చటినుంచి తానెవరి అంశమో అట్టి భగవంతుని సర్వత్ర చూడవలెను (6–30), అతని సర్వముగా జూడవలెను (7–19), క్షరప్రకృతియొక్క సమస్తము నందును, ఆమెయొక్క ప్రతిభాగము మఱియు ఫలితమునందును మఱియు నామె సమస్తక్రియలందును అతనినిజూచి, అచ్చటను భగవంతునితో తన నేకముచేసికొన వలెను, అచ్చటను ఆయనయందు నివసించవలెను (6–31), అచ్చటను దివ్య ఏకతలో ప్రవేశించవలెను (18–55). ఆ సమగ్రతయందు అతడు తన గభీర అక్షరాత్మయొక్క శాంతి స్వతంత్రతలను, తన దివ్యీకృత ప్రకృతిగత క్షరాత్మయందలి ఉపకరణక్రియ యొక్క ఒక పరమశక్తితో సంయుక్తము గావించును.

10. నిష్కామకర్మ ప్రథమసోపానము :

కాని దీని నెట్లు చేయవలెను? ముందు మన కర్మసంకల్పము నందలి భావము సరిగా నుండవలెను. సాధకుడు తన సర్వక్రియను కర్మప్రభువునకు చేయు నొక యజ్ఞముగా భావించవలెను – ఈ ప్రభువు సనాతన వైశ్వపురుషుడు, తన స్వీయ సర్వోన్నతాత్మ మఱియు నందరి ఆత్మ, అటులే సర్వనివాసి, సర్వభృతుడు, సర్వనియామకుడు నగు విశ్వమునందలి పరమ భగవంతుడు. ప్రకృతిక్రియ యంతయు నట్టి యజ్ఞమే – నిజానికి ముం దీ యజ్ఞము ఆమెయందు చరించుచు, ఆమెను చరింపజేయు దివ్యశక్తుల కర్పింపబడును; కాని ఈ శక్తులు అపరిమేయ ఏకేశ్వరునియొక్క పరిమిత నామరూపములు మాత్రమే. సాధారణముగా మానవుడు తన యజ్ఞమును బాహాటముగానో, ఒక నెపము క్రిందనో తన అహంకారమునకే అర్పించుకొనును; అతని ఆహుతి తన స్వీయేచ్ఛ మఱియు అజ్ఞానముయొక్క ఒక

మిథ్యాక్రియ మాత్రమే. లేక అతడు తన జ్ఞానమును, క్రియను, ఆకాంక్షను, బలపౌరుషములతో జేయు ప్రత్యేకకర్మలను ఆంశిక, నశ్వర, వైయక్తిక ఫలితము లపేక్షించుచు, దేవతల కర్పించును (7-20). దీనికి ప్రతిగా విముక్త జ్ఞాని తన క్రియాకలాపములన్నింటిని, ఫలమునందు గాని, తన నిమ్న కామనల తృప్తిపట్ల గాని ఎట్టి సంగమును లేక, ఏకమాత్ర సనాతన భగవంతునికే అర్పించును (9-15). అతడు తనకొఱకు గాక, భగవంతునికొఱకే కర్మచేయును (4-23); తన దైహిక, ప్రాణిక, మానసిక ప్రయోజనార్థము గాక, లోకసంగ్రహార్థమే, అనగా ప్రపంచాత్మకొఱకే కర్మచేయును (3-25); మఱియు ప్రపంచవ్యాపారమున ఒక ప్రధాన ప్రత్యేక లాభార్జన పరునివలె గాక, భగవంతునియొక్క ఒక ప్రతినిధిగా కర్మ చేయును (12-10). మఱియు, సమతను, సార్వత్రికతను, విశాలనిర్వ్యక్తికతను, అహంకారము యొక్క ప్రతిమాయావేషమునుండియు ఒక విస్పష్టవిముక్తిని ఏ మేరకు మనస్సు పొందునో, ఆ మేరకు తప్ప పైవిధముగా కర్మచేయజాలమని గమనించదగును; ఏలన ఈ సమతాదులు లేకయే, ఇట్లు చేయుచున్నామని చెప్పుకొనుట దంభము లేక భ్రాంతి యగును (16-17). ప్రపంచముయొక్క సమస్తక్రియయు విశ్వేశ్వరుని వ్యాపారము, స్వయంభూపురుషుని ప్రమేయము-అది ఈ పురుషుని నిర్విరామ సృష్టిక్రియ, ప్రగతిశీల సంభూతి, అర్థయుక్త అభివ్యక్తి, ప్రకృతియందు (అతని) సజీవసంకేతము. ఈ ప్రపంచ క్రియయొక్క ఫలములును అతనివే, ఫలితములును అతనివే పూర్వ నిర్ణీతములే, మఱియు మన వైయక్తికకర్మ ఒక స్వల్పాంశము మాత్రమే; దాని నా పురుషుడు శాసించును, లేక అది అహంకారికమై నపుడు కొట్టివేయును. ఏలన మనయందును, అందరియందును నున్న ఈ పురుషుడు అహంకారము నిమిత్తము గాక, ప్రపంచ లక్ష్యము మఱియు హితము నిమిత్తమే వస్తువులను పాలించును. భగవంతుడు మఱియు ప్రపంచము మఱియు సర్వాత్మ నిమిత్తము, విశ్వసంకల్పముయొక్క పరిపూర్తి నిమిత్తమును నిర్వ్యక్తికముగా, నిష్కామముగా, కర్మఫలములయం దాసక్తి లేకుండ కర్మచేయుట - ఇది విముక్తి మఱియు సంసిద్ధి దిశగా వేయు మొదటి అడుగు.

11. విముక్తకర్మ రహస్యము :

కాని ఈ అడుగున కావల మఱియొక మహత్తర గతి గలదు, అది మనలోని భగవంతునకు మన సర్వకర్మల ఆంతర సమర్పణము. ఏలన మన కర్మలను అనంత పరప్రకృతి ప్రేరించుచుండగా, ఆమె లోపలను, పైనను గల ఒక దివ్యేచ్ఛ మనలనుండి కర్మ నపేక్షించును; మన అహంకారము ఆ కర్మ కిచ్చు రూపము మన తామస,

రాజస, సాత్త్విక గుణమువలన నిమ్నప్రకృతి యందు దానికి సంభవించు నొక వికారము. తనను స్వయముగా కర్తయని తలపోయు అహంకారముచేత ఈ వికారము సంభవించును. ఈ కర్మ లక్షణము పరిమిత వైయక్తిక ప్రకృతియొక్క రూపము ధరించగా, అంతరాత్మ దానితోను, దాని పరిమిత ఆకారములతోను బద్ధమై, ఆ కర్మను తనయందలి అనంత శక్తినుండి స్వేచ్ఛగా, శుద్ధముగా ముందుకు సాగనీయదు. మఱియు, నహంకారము కర్మ మఱియు పర్యవసానమునకు కట్టువడును; నేను కర్మను స్వయముగాసంకల్పించి, ఆరంభించుచున్నా నని చెప్పుకొను అహంకారము స్వయముగా దాని పర్యవసాన ప్రతిక్రియల ననుభవింపక తప్పదు. కర్మను, దాని ప్రారంభమును మన జీవనము యొక్క దివ్యప్రభువునకు ముందు నివేదించుటచేతను, చివరకు సంపూర్ణముగా సమర్పించుటచేతను విముక్త పరిపూర్ణ కర్మాచరణము సాధ్యమగును; ఏలన మన యందలి ఒక పరమ సన్నిధి కర్మను తానే అధికాధికముగా స్వీకరించుచున్న దనియు, ఒక ఆంతర శక్తి మఱియు దైవముతో, ప్రగాఢసౌహృదము మఱియు ఘనిష్ఠ ఏకత్వములోనికి అంతరాత్మ లాగబడుచున్న దనియు, క్షుద్రవైయక్తిక అహంకారము యొక్క అజ్ఞానమునుండి కాక, అధికతర ఆత్మనుండి, ఒక సనాతన సత్తయొక్క సర్వజ్ఞ అనంత వైశ్వశక్తినుండి కర్మ ఆరంభమగుచున్నదనియు మన కనుభవము గలుగును. స్వభావము ననుసరించి, కాని సర్వథా ఆ స్వభావమునందలి భగవదిచ్ఛ చేత, కర్మ ఎన్నికచేయబడి, రూపొందించబడును; కావుననే దాని బాహ్యరూప మెట్లున్నను, అది లోపల విముక్తము, పూర్ణము నగును. అది "కర్తవ్యకర్మగా" (3-19) అనంతునియొక్క ఆంతర ఆధ్యాత్మిక ముద్రతో ముద్రితమై వచ్చును, దాని గతియు, ఆ గతియొక్క ప్రతిపదమును సర్వజ్ఞ కర్మనియామకునియొక్క విధానమునందు నిర్ణీతమై యుండును. ముక్త మానవుడు ఉపకరణాత్మకమగు తన వ్యక్తిగత స్వయం నిర్మాణమును, తన ప్రకృతియందలి ప్రత్యేక సంకల్పశక్తులను సాధనము మఱియు నిమిత్తరూపమున కర్మకు సమకూర్చు చున్నప్పుడు సైతము, అతని అంతరాత్మ తన నిర్వ్యక్తికతయందు ముక్తమై యుండును. పోగా ఆ సంకల్పశక్తులు గూడ నిపుడు వేఱుగా, ఆహంకారికముగా అతనివి గావు, పరంతు అతివ్యక్తిక (suprapersonal) భగవంతునియొక్క ఒక శక్తియే; ఏలన ముక్తపురుషుడు భగవంతుని అసంఖ్య వ్యక్తిత్వములలో నొకటి, అతని ఆత్మసత్తయొక్క ఒక సంభూతి, మఱియు దానియందు దాని స్వభావమును బట్టి పనిచేయువాడును భగవంతుడే. ఇదియే ముక్తపురుషుని కర్మయొక్క "ఉత్తమ రహస్యము" (4-) మఱియు పరమగుహ్యము. మానవాత్మ

ఒక దివ్యజ్యోతిలోనికి పెరుగగా, మఱియు దాని ప్రకృతి ఒక అత్యున్నత వైశ్వప్రకృతితో సంయోగము నందగా, తత్ఫలితముగా ఈ ఉత్తమస్థితి సిద్ధించును.

12. సమ్యగ్ జ్ఞాన స్వరూపము :

ఈ పరివర్తనము జ్ఞానముచేత తప్ప సిద్ధించ జాలదు, ఆత్మ, భగవంతుడు మఱియు ప్రపంచములను గుఱించి ఒక సమ్యగ్జ్ఞానము ఆవశ్యకము, అటులే ఆ జ్ఞానము దేని ద్వారము తెఱచునో, ఆ మహత్తరచేతనలోనికి పెరిగి, అందు నివసించుటయు ఆవశ్యకము. ఈ జ్ఞాన స్వరూపము మనకిపుడు తెలియును. ఇది మానవదృష్టికంటెను ఇతరము, విశాలతరము నగు నొక దృష్టిపై, ఒక పరివర్తిత దృష్టి మఱియు అనుభవముపై విశ్రమించియుండును. దీనిచేత వ్యక్తి మున్ముందు అహంభావము మఱియు దాని సంస్పర్శల పరిమితులనుండి ముక్తుడగును; అపుడు సర్వమునందును ఆత్మను, సర్వమును భగవంతునియందును, సర్వభూతములను వాసుదేవుడుగా, అతని తత్త్వముయొక్క పాత్రములుగా స్పృశించును మఱియు ననుభవించును, చివరకు వ్యక్తి తన ఆత్మను గూడ అదే తత్త్వముయొక్క పాత్రములుగా స్పృశించును మఱియు ననుభవించును, చివరకు వ్యక్తి తన ఆత్మను గూడ అదే తత్త్వముయొక్క అర్థయుక్త సత్తగను, ఆత్మ శక్తిగను జూచును. ఈ జ్ఞానము ఇతరుల జీవనఘటన లన్నింటిని ఒకని జీవనఘటనలే యైనట్లు ఒక ఏకీకర ఆధ్యాత్మిక చేతనలో చూచును (6–32); అది భేదమను గోడను లేవనివ్వదు, సర్వభూతములతోను ఒక సార్వత్రిక సానుభూతి యందు నివసించును; ఇట్టి జ్ఞాని ప్రపంచగతియం దున్నంతవఱకు, సర్వభూతహితము నిమిత్తము (3–25, 5–25), భగవంతుని విధానము ననుసరించి – "ధాతా" (9–17), కాలాధీశుడగు పురుషుడు ఆదేశించిన మేరకు (11–33) కర్తవ్యకర్మను చేయుచుండును. ఇట్లే జ్ఞానమున నివసించుచు, కర్మచేయుచు, మానవాత్మ సనాతనునియొక్క సవ్యక్తికతతోను, నిర్వ్యక్తికతతోను యుక్తమగును, తత్ఫలితముగా కాలభూమిక యందు, సరిగా సనాతనునివలె, కర్మ చేయుచునే, సనాతనునియందు నివసించును, మఱియు ప్రకృతియందు చేయబడు కర్మయొక్క రూపాకారము లెట్టి వైనను, ఆ మానవాత్మ స్వతంత్రము, పరిపూర్ణము, ఆనందమయమునై యుండును.

13. ఆనందమునందు జ్ఞానపరిపూర్తి :

విముక్తపురుషునికి సంపూర్ణ, సమగ్ర జ్ఞాన ముండును – "కృత్స్నవిత్" (3–29), మఱియు నతడు మనఃకృతమగు హద్దులను అతిక్రమించి, సర్వకర్మలను జేయును

– కృత్స్నకృత్" (4–18) – తనయందలి దివ్యేచ్ఛయొక్క అనంత శక్తిసామర్థ్యములు మఱియు స్వతంత్రత ననుసరించి సర్వకర్మలను జేయును. మఱియు నతడుసనాతనునితో యోగయుక్తుడు గనుక, తన సనాతన సత్తయొక్క విశుద్ధ ఆధ్యాత్మిక అపరిమేయ ఆనందమును గలిగియుండును. తా నే పరమాత్మయొక్క అంశమో, అతని వైపునకు, తన కర్మనియామకుని వైపునకు, తన ఆత్మప్రకృతుల దివ్యప్రేమికుని వైపునకు అతడు భక్తితో ఉన్ముఖు డగును. అతడు నిర్వికార శాంత సాక్షిమాత్రుడు గాడు; తన జ్ఞాన సంకల్పములనే గాక, భక్తి ప్రేమసంవేగములతో గూడిన తన హృదయమునుగూడ నతడు సనాతనపురుషునిలోని కుద్ధరించును. ఏలన అది లేనిదే, అతని అశేషప్రకృతి పరిపూర్ణము, భగవద్యుక్తము గాదు; అక్షరాత్మ యొక్క శాంత్యావేశము అంతరాత్మ యొక్క ఆనందావేశముతో రూపాంతరము గావలసియున్నది. సవ్యక్తిక జీవునికిని, నిర్వ్యక్తిక బ్రహ్మ లేక ఆత్మకు నావల నతడు విశ్వాతీత పురుషోత్తముని ప్రాపించును: ఈ పురుషోత్తముడు నిర్వ్యక్తికతయందు అక్షరుడు మఱియు సవ్యక్తికతయందు తన నిర్వ్యక్తికతను పూర్ణము గావించుకొనును, మఱియు నీ రెండు విభిన్న ఆకర్షణలద్వారా అతడు మనలను తనదగ్గరకాకర్షించు కొనును. విముక్తసాధకుడు భగవంతునియందు తన అంతరాత్మకుగల ప్రేమహర్షముల ద్వారాను, కర్మల నియామకునిపట్ల తన సంకల్పమునకు గల ఆరాధన ద్వారాను వ్యక్తిత్వసహితముగా ఆ పరమవస్తువున కెగయును; అతని నిర్వ్యక్తిక విశ్వమయ జ్ఞానముయొక్క శాంతి మఱియు విశాలత విశ్వమయ, విశ్వాతీత భగవంతునియొక్క స్వయంసిద్ధ ఘనిష్ఠసత్యతయందు అతనికి గల హర్షముచేత పరిపూర్ణిత మగును. ఈ హర్షము అతని జ్ఞానమునకు మహిమోత్కర్షను గల్పించి, దానిని, పరమసత్తకు తన ఆత్మయందును, అభివ్యక్తియందును గల సనాతనానందముతో సంయుక్తము గావించును. ఈ హర్షము అతని వ్యక్తిత్వమును సైతము దివ్యపురుషుని అతివ్యక్తిత్వము నందు పరిపూర్ణము గావించును, అటులే అతని ప్రాకృతసత్త మఱియు క్రియను సనాతన సౌందర్యముతో, సనాతన సామరస్యముతో, సనాతన ప్రేమానందములతో నేకముచేయును.

14. జీవన్ముక్తియందలి బంధమోక్షములు :

ఈ పరివర్తన కంతటికి అర్థము నిమ్నతర మానవప్రకృతినుండి ఉచ్చతర దివ్యప్రకృతిలోనికి పూర్తిగా పయనించుటయే యగును. అది మన సంపూర్ణసత్తను, లేక కనీసము ఇచ్ఛా జ్ఞాన వేదనలను పుట్టించు మానసికసత్తను ఒక అత్యున్నత

అధ్యాత్మిక చేతనలోనికి, ఒక సంతృప్తికర పూర్ణతమ జీవనశక్తిలోనికి, ఒక గభీరతమ విశాలతమ సత్తానందము లోనికి లేవనెత్తుట యగును. అది మన ప్రస్తుత శారీరిక జీవనమును విడిచిపోయిన పిమ్మట బాగుగా సాధ్యముకావచ్చును, ఈ పార్థివ జీవనమున కావల నొక స్వర్గ లోకమునందు, లేక ఇంకను ఆవల విశ్వాతీత అతిచేతన యందు అది బాగుగా సాధ్యము కావచ్చును; పరమసత్తయొక్క నిస్సంబంధము, అనంతము నగు ఒక శక్తి మఱియు స్థానములోనికి సంక్రమణమువలన అది ఘటించవచ్చును. కాని యిచ్చట శరీరము నందు, ఇచ్చట జీవనమునందు, ఇచ్చట క్రియయందు నున్న కాలమున, ఈ పరివర్తన ఫలితముగా నిమ్నప్రకృతి ఎట్లు మాఱును ? ఏలన ప్రస్తుతము మన కార్యకలాపము లన్నియు తమ దిశలయందును, రూపమునందును, ఈ ప్రకృతిచేతనే నిర్ధారితమగును, మఱియు నిచ్చటీ ప్రకృతి త్రిగుణాత్మిక ప్రకృతి, మఱియు సమస్త ప్రాకృతసత్త యందును, సమస్త ప్రాకృతక్రియయందును ఈ త్రిగుణ ముండును – తమస్సు తన అజ్ఞానజడత్వములతో నుండును, రజస్సు తన గతిక్రియలతోను, ఆవేగ దుఃఖ వ్యతిక్రమములతోను ఉండును, సత్త్వము తన సుఖప్రకాశములతో నుండును – మఱియు ఈ త్రిగుణ బంధన ముండును. మఱియు అంతరాత్మ అక్షరాత్మలో జేరి గుణాతీత మగు ననుకొందము, అయినను అది తన ఉపకరణాత్మక ప్రకృతియందు వాని క్రియ, ఫలితము మఱియు గుణమునుండి ఎట్లు తప్పించుకొనును ? ఏలన జ్ఞానవంతుడు సైతము తన ప్రకృతి ననుసరించియే కర్మచేయవలెను (3-33) – అని గీత చెప్పును. బాహ్యాభివ్యక్తియందు గుణముల ప్రతిక్రియ ననుభవించుచు, సహించుట, కాని వెనుకనున్న సాక్షిరూప చేతనాత్మయందు వానినుండి ముక్తము, అతీతము నగుట –ఇది సరిపోదు. ఏలన ఈ స్థితియందును స్వాధీనత మఱియు పరాధీనతల ద్వైతము మిగిలియే యుండును – ఇది మన లోపలి రూపమునకును, బైటి రూపమునకును; మన ఆత్మకును, మన శక్తికిని; మనకు దెలిసిన మన స్వరూపమునకును, మనము సంకల్పించి చేయు దానికిని పరస్పర విరోధము. ఇచ్చట ముక్తి ఎచ్చ టున్నది ? ఇచ్చట, ఉచ్చతర ఆధ్యాత్మిక ప్రకృతిలోనికి పూర్ణ ఆరోహణము మఱియు పరివర్తనము, శాశ్వతధర్మము (14-27), అనగా దివ్యసత్త యొక్క అనలత విశుద్ధతకును మఱియు శక్తికిని సహజమగు నియమము : ఇది యంతయు నెచ్చ టున్నది ? శరీరములో నుండగా ఈ పరివర్తనము సాధ్యము గానిచో, సర్వప్రకృతిని మార్చజాలము, ఆత్మనుండి ఈ మర్త్య శరీరజీవనము పాము నుండి కుబుసమువలె పడిపోవువఱకు,

ఒక అసమన్విత ద్వైతము నిలిచి యుండక తప్పదు - అని స్పష్టముగా చెప్పు టవసరము. కాని అప్పుడు కర్మసిద్ధాంతము ఉచిత సిద్ధాంతము లేక కనీసము చరమసిద్ధాంతము గాజాలదు : ఒక పరిపూర్ణ శమము లేక కనీసము సాధ్యమైనంత పరిపూర్ణశ ాము, ఒక అధికాధిక కర్మసన్యాసము - ఇంకను ఇదియే సంసిద్ధి అపేక్షించు యథార్థోపదేశముగా గన్పించును; నిజానికి మాయావాదియొక్క వాదమే యిది, సందేహము లేదు, మనము కర్మ భూమికలో నున్నంతవఱకు గీతామార్గము మంచిదే, కాని సర్వకర్మలు ఒక భ్రాంతి, శమమే సర్వోన్నతపథము - అని ఈ మాయావాది చెప్పును. నిష్కామకర్మ మంచిదే, కాని అది సర్వకర్మసన్యాసమునకు, నివృత్తికి, పరిపూర్ణ శమమునకు పూర్వాంగము మాత్రమే.

15. గమ్యము కర్మరాహిత్యము గాదు, దివ్యకర్మ :

ఇదియే మిగిలిన కఠినత, దీనికి సమాధానము చెప్పి, గీత సాధకునకు కర్మసామర్థ్యమును జూపవలెను. లేనిచో, గీత అర్జునున కిట్లు చెప్పవలెను, "తాత్కాలికముగా నిట్లు కర్మచేయుము, కాని పిమ్మట శ్రేష్ఠతరమగు కర్మసన్యాసమార్గము నవలంబింపుము." కాని, దీనికి ప్రతిగా, కర్మసన్యాసము కంటె కామసన్యాసము శ్రేష్ఠ మని గీత చెప్పియున్నది (6-2); పైగా గీత సర్వకర్మాచరణమును పట్టుతో బోధించును - "సర్వాణి కర్మాణి" (3-26), "కృత్స్నకర్మకృత్" (4-18); మఱియు ఆరూఢయోగి ఎట్లు జీవించినను, ఆచరించినను, భగవంతునియందే జీవించును, మఱియు నాచరించు - నని గీత చెప్పినది (6-31). ప్రకృతి సైతము తన గతినియమములందును, కర్మకలాపము లందును దివ్యమైనపుడే, అనగా నిమ్నప్రకృతియొక్క ప్రతిక్రియలచే అక్షోభ్యము, అస్పృశ్యము, అక్షతము, అవ్యథితము, శుద్ధము నగు నొక శక్తి యైనపుడు మాత్రమే గీతావచనము సాధ్యమగును. ఎట్లు మఱియు నే సోపానక్రమమున ఈ అత్యంత దుష్కర పరివర్తనమును సాధింపవలెను ? అంతరాత్మసంసిద్ధియొక్క ఈ చరమరహస్య మేది యగును ? మన మానవ మఱియు పార్థివ ప్రకృతియొక్క రూపాంతరమునకు సూత్ర మేది యగును, ప్రక్రియ యేది యగును ?

17. దేవతలు, అసురులు

1. కర్మయందు జ్ఞాని కూడ బద్ధుడేనా ?

అజ్ఞము, పాశబద్ధమునగు సాధారణ మానవప్రకృతినుండి ఒక దివ్య ఆధ్యాత్మిక సత్తయొక్క క్రియాశీల స్వాతంత్ర్యము లోనికి పరివర్తనము ఆచరణరీత్యా ఎంతో కష్టము ! త్రిగుణముల ప్రతిబద్ధ, సంభ్రాంత క్రియనుండి గుణముల కిక నధీనుడు గాని విముక్తమానవుని క్రియలోనికి సంక్రమణమును వైయక్తికముగా నెట్లు సాధించవలెనో, చూచినపుడు పైకష్టము స్పష్టమగును. ఈ సంక్రమణము మాత్రము తప్పక ఆవశ్యకము; ఏలన అతడు గుణాతీతుడు లేక గుణరహితుడు గావలెనని స్పష్టముగా విధించబడినది - "గుణాతీత" (14-20), "నిస్త్రైగుణ్య" (2-45). రెండవవైపున ఇంత స్పష్టముగాను, బలము గాను, ఇచ్చట భువిపై ప్రతిప్రాకృతసత్త యందును త్రిగుణములు విడదీయరాని విధముగా కలిసి పనిచేయుచుండు నని గీత వక్కాణించును; మఱియు మానవుడు లేక ప్రాణి లేక శక్తి యొక్క క్రియ యంతయు పరస్పరమునందు పనిచేయు ఈ త్రిగుణముల క్రియ మాత్రమే యని, ఈ క్రియయందు ఒకానొక గుణము ప్రాబల్యము (14-10) వహించును, తక్కినవి దానికి హద్దులు కల్పించునని సైతము గీత చెప్పును - "గుణా గుణేషు వర్తంతే" (3-28). అయినపుడు మఱియొక క్రియాశీల గతిశీల ప్రకృతి గాని, ఏ యితర కర్మ గాని ఎట్లుండగలదు ? ఉండదేని, కర్మచేయుట యన ప్రకృతిగుణముల కధీనతయే యగును; ఆమె క్రియయొక్క ఈ అవస్థల నతిక్రమించుట యన ఆత్మయందు మౌనస్థితియే యగును. నిజమే, ఈశ్వరుడు ఆమె సర్వకర్మలకు నియామకుడు, వానిని తన దివ్యేచ్ఛచేత నడుపుచు, నిర్ణయించును; కావున అతడు గుణముల ఈ యంత్రవ్యాపారమున కతీతుడు, ఆమె ప్రకారములచే ప్రభావితుడును, పరిమితుడును గాడు; అయినను అతడు సదా ప్రకృతిగుణములద్వారా పనిచేయును, స్వభావసామర్థ్యముచేతను మఱియు గుణముల మానసిక యంత్రాంగము ద్వారాను రూపము కల్పించును - అని మన కనిపించును. ఇవి ప్రకృతియొక్క మౌలిక ధర్మములు, ఇచ్చట మనయందు రూపముధరించు కార్యనిర్వాహక ప్రకృతి శక్తియొక్క ఆవశ్యక క్రియలు, మఱియు జీవుడు సైతము ఈ ప్రకృతియందే భగవంతుని ఒక అంశము. కావున ముక్తపురుషు డింకను కర్మచేయు నేని, ఇంకను గతిప్రపంచమున

చరించు నేని, ప్రకృతియందును, ఆమె గుణములచేతను, వాని ప్రతిక్రియలకు అధీను డయ్యును చేయునే గాని, శరీర ముండునంతవఱకు, భగవంతునివలె స్వతంత్రుడై చేయడు – (ఇది మాయావాదము). కాని గీతావచనము సరిగా దీనికి వ్యతిరేకము : ముక్తయోగి గుణముల ప్రతిక్రియలకు చలించని అతీతుడగును (14–23), మఱియు నత డేమి చేసినను, ఎట్లు జీవించినను, భగవంతుని యందే చరించును మఱియు చేయును, అనగా అతని స్వేచ్ఛ మఱియు అమరత్వము యొక్క శక్తియందును, పరమసనాతన అనంతునియొక్క ధర్మమునందును చేయును – "సర్వథా వర్తమానోஉపి స యోగీ మయి వర్తతే" (6–31). ఇచ్చ టొక పరస్పర విరోధము, తెగని సమస్య ఉన్నట్లు గన్పించును.

2. వాస్తవ చాలకశక్తి దివ్య ఆధ్యాత్మిక సంకల్పము :

కాని విశ్లేషణాత్మక మనస్సుయొక్క కఠోర తార్కిక వ్యతిరేకములలో చిక్కుకొని నపుడే మన కీ పరస్పర విరోధము గన్పించును గాని, ఆత్మస్వరూపమును, ప్రకృతి యందలి ఆత్మను స్వేచ్ఛగా, నిశితముగా పరికించినపుడు గన్పించదు. ప్రపంచమును కదిలించునది నిజానికి ప్రకృతిగుణములు కాదు – ఇవి నిమ్న పార్శ్వము, మన సాధారణప్రకృతియొక్క యాంత్రికవ్యాపారము మాత్రమే. వాస్తవ చాలకశక్తి ఒక దివ్య ఆధ్యాత్మిక సంకల్పము. ఇది ప్రస్తుతము ఈ హీనతర అవస్థల నుపయోగించు కొనునే గాని, మానవ సంకల్పమువలె, గుణములచేత పరిమితము, శాసితము, యాంత్రీకృతము గాదు. సందేహము లేదు, ఈ గుణములు తమ క్రియయందు అంతగా సార్వత్రికములు గాన, అవి పరమాత్మశక్తిలోపలినుండియే వచ్చుచుండ వలెను; ఆ పరమాత్మ సంకల్ప – బలములోని కొన్ని శక్తులే ఈ ప్రకృతిరూపములకు మూలము గావలెను. ఏలన సాధారణ నిమ్నప్రకృతియందలి ప్రతివస్తువు పురుషోత్తముని సత్తయొక్క ఉచ్చతర ఆధ్యాత్మిక శక్తినుండియే ఉత్పన్న మగును – "మత్తః ప్రవర్తతే" (10–8); అది క్రొత్తగను, ఆధ్యాత్మిక కారణము లేకుండగను రూపము ధరించదు. ఆధ్యాత్మికసత్త యొక్క మూలశక్తియందు ఏదియో యుండి తీరును, దానినుండి ఉత్పన్నములే మన ప్రకృతి యొక్క సాత్త్విక ప్రకాశ సంతోషములు, రాజసిక ప్రవృత్తి, తామసిక మాంద్యము మఱియు నివి దానియొక్క అపూర్ణ లేక అపకృష్టరూపములే. కాని ఏయీ అపూర్ణత మఱియు అపకర్షణములందు మనము

నివసించుచున్నామో, వానికి పైన విశుద్ధ గుణమూలముల నొకసారి మనము చేరుకొని, మూలసత్తయందు నివసింపసాగిన వెంటనే, ఈ గుణవ్యాపార మొక మిక్కిలి విభిన్నరూపము ధరించు నని మనము కనుగొనగలము. సత్త మఱియు క్రియ, అటులే సత్తాక్రియల ప్రకారములు వాని యిప్పటి పరిమిత బాహ్యరూపముల కెంతో పైన సర్వథా విభిన్న వస్తువు లగును.

3. రజస్సు మూలరూపము చిచ్ఛక్తి :

కారణము, విశ్వముయొక్క సంఘట్ట సంఘర్షములతో గూడిన ఈ సంక్షుబ్ధగతి వెనుక నే మున్నది ? మనో భూమికలో మనస్సును స్పృశించి, మానసిక మూల్యములను ధరించుచు, కామము, ప్రయత్నము, ప్రయాసము, భ్రాంతసంకల్పము, శోకము, పాపము, బాధల రూపమగు ప్రతిక్రియలను పుట్టించున దేది ? అది గతిలోనికిదిగిన సత్తయొక్క ఒక సంకల్పము, అది క్రియాపరమైన విశాల భాగవత సంకల్పము, ఈ సంకల్పమును ప్రతిక్రియలు స్పృశింపవు. అది స్వతంత్ర, అనంత, చిన్మయ భగవంతునియొక్క ఒక శక్తి – "తపస్", "చిత్ – శక్తి". సర్వసంపత్తి తనదే గాన, ఈ శక్తికి కామముండదు, మఱియు తన గతియొక్క సహజానంద ముండును. ఎట్టి ఆయాసప్రయాసలకు లోను గాదు గావున, అది తన సాధనములు మఱియు విషయములయొక్క స్వతంత్ర ప్రభుత ననుభవించును; ఎట్టి భ్రాంతసంకల్పముచేతను దారి తప్పదు గాన, అది ఆత్మ మఱియు వస్తువుల జ్ఞానమును సదా ధరించి యుండును, ఈ జ్ఞానమే తన ప్రభుత మఱియు ఆనందములకు మూలము; ఎట్టి శోకము, పాపము లేక వ్యథకు వశముగాదు గాన, దానికి తన సత్తయొక్క హర్షపవిత్రతలు, తన శక్తియొక్క హర్ష పవిత్రతలు పెంపెసగుచుండును. భగవంతుని యందు నివసించు అంతరాత్మ అవిముక్త మానసము యొక్క సాధారణ సంకల్పముచేత గాక, ఈ ఆధ్యాత్మిక సంకల్పముచే కర్మచేయును : ఆ అంతరాత్మయొక్క గతి ప్రవృత్తి ప్రకృతి రజోగుణముచేత గాక, ఈ ఆధ్యాత్మిక బలముచేత ఘటిల్లును; సరిగా దీనికి కారణము, ఇపు డది రజోవికారము ఒక అంశమగు నిమ్నప్రకృతి గతియందు నివసింపక, దివ్యప్రకృతియందలి విశుద్ధ పరిపూర్ణ గతిమర్మమును తిరిగి పొందినది.

4. తమస్సు మూలరూపము శాంతి :

మఱియు తిరిగి, ప్రకృతిజడత వెనుక, అనగా తమస్సు వెనుక నే మున్నది? ఈ తమస్సు, పూర్ణమైనపుడు, ప్రకృతి క్రియను అంధప్రాయమగు యంత్రచాలనముగా

మార్చివేయును; ఈ యాంత్రిక వేగము తాను పరిభ్రమించవలసిన గాడిని తప్ప మఱి దేనిని గమనించదు, చివరకు తన గతినియమములు గూడ తనకు తెలియవు – ఈ తమస్సు అభ్యస్తక్రియయొక్క విరామమును మరణము మఱియు విఘటనము లోనికి మార్చివేయును, ఇంకను మనస్సునం దది అకర్మను, అజ్ఞానమును గలిగించు ఒక శక్తి యగును. ఈ తమస్సొక అప్రకాశము (14-13); ఈ తమస్సు ఆత్మయొక్క శాశ్వతతత్త్వమగు శాంతి మఱియు విశ్రాంతిని వికృతము గావించి, శక్తియొక్క అకర్మలోనికిని, జ్ఞానము యొక్క అకర్మలోనికిని తప్పుగా ననువదించును – అని చెప్పవచ్చును. ఏలన భగవంతు డీ విశ్రాంతిని తాను కర్మచేయుచున్నపుడు సైతము, గోల్పోడు. ఇది శాశ్వత విశ్రాంతి, ఇది అచ్చట తన స్వీయ అనంతతలయందును, ఇచ్చట తన క్రియ మఱియు స్వబోధముయొక్క బాహ్యపరిమితత్వమునందును భగవంతుని సమగ్ర జ్ఞానక్రియను, సృజనాత్మక సంకల్పశక్తిని – రెంటిని ధరించి యుండును. ఇట్లు భగవంతుని శాంతి శక్తివిఘటనమును (disintegration) గాదు, శూన్య జడతయు గాదు. భగవంతుడు కొంతకాలము తెలియుట మఱియు చేయుటను విరమించునపుడు గూడ, తన ఈ శాంతి తాను తెలిసినదానిని, చేసినదానిని ఒక సర్వశక్తి మౌనమునందు ప్రోగుచేసి, సచేతనముగా భద్రపఱచును. సనాతన పురుషునికి నిద్ర లేక విశ్రాంతి అవసర ముండదు; అతడు అలసిపోడు, శిథిలము గాడు; తన క్షీణశక్తులను తిరిగి నవీకరించి, పూరించుట కతనికి విరామావశ్యకత యుండదు, ఏలన అతని శక్తి అక్షయముగా నేకరసము, అశ్రాంతము, అనంతము. భగవంతుడు తన కర్మయందును శాంతుడు మఱియు విశ్రాంతుడు; మఱియు తాను కర్మను విరమించినపుడు, ఆ విరామము నందు తన గతిక్రియయొక్క పూర్ణసామర్థ్యమును సర్వశక్తతలును నిలిచియుండును. విముక్తపురుషుడు ఈ శాంతిలో ప్రవేశించి, ఆత్మయొక్క సనాతన విశ్రాంతిలో భాగస్వామి యగును. విముక్తి – సంతోషము నేమాత్ర మనుభవించిన వాని కైనను, దానిలోపల సనాతన శాంతిశక్తి యుండు నను సత్యము సువిదితమే. మఱియు నా గభీర శాంతి కర్మలోలోపల సైతము మనగలదు, అత్యంతప్రచండ శక్తి విజృంభణము నందును కొనసాగగలదు. ఆలోచనా సంకల్ప గతి క్రియల సవేగప్రవాహము గావచ్చును, ఉద్దామ ప్రేమవేగము గావచ్చును, స్వయంభూ ఆధ్యాత్మిక హర్షావేశము గావచ్చును, మఱియు నీ లోపలి హర్షావేశము వెలుపలి ప్రపంచమునందలి వస్తువులు మఱియు ప్రాణుల ఆధ్యాత్మికోపభోగములోనికి సంక్రమించవచ్చును, ఈ ఉపభోగము సుతీవ్రము,

బలీయము గావచ్చును; అయినను ఈ సమస్త ఆవేగమునకు వెనుకను, లోపలను ఈ శాంతి మఱియు విశ్రాంతి భాసించుచుండును. తన లోతులపట్ల సచేతనము, సదా ఏకరసమునై చెలంగును. విముక్త మానవుని నిర్మలత ఒక అలసత గాదు, అసమర్థత గాదు, నష్టచేతనత గాదు, జడత గాదు; అది అమరశక్తి ప్రపూర్ణము, సర్వకర్మసమర్థము, గాఢతమ హర్షయోగ్యము, గభీరతమ దయాప్రేమలకును, సర్వవిధ తీవ్రతమ ఆనందమునకు ఉన్మీలితము నగును.

5. సత్త్వముయొక్క మూలరూపము జ్యోతి :

మఱియు నటులే గుణమ్ముల మూడింటిలోను మిక్కిలి శుద్ధమగు సత్త్వమునకు సైతము పైన, దాని సమున్నత సుదూర మూలమునందు, స్వతంత్రాత్మయందు స్వతంత్రమగు నొక మహత్తర జ్యోతి మఱియు ఆనందము గలదు. సత్త్వగుణ సామర్థ్యము వలన సరూపీకరణము మఱియు సమీకరణము, సమీచీన జ్ఞానము మఱియు సమీచీన (right) వ్యవహారము, దృఢ సంతులనము (balance), సమీచీన క్రియానియమము, సమీచీన స్వామ్యము ప్రాప్తించును మఱియు నది మనస్సున కెంతో తృప్తిని గలిగించును. ఈ సత్త్వము సాధారణ ప్రకృతియందు సర్వోత్తమ వస్తువు, ఇది స్వతః తన పరిధిలోను, తాను మనగలిగినంతవఱకును ప్రశంసనీయ గుణమే, కాని దీని మనుగడ అనిశ్చితము, దీని రక్షణకు పరిమితి అవసరము, ఇది నియమనిబంధనలపై నాధారపడి మనును. కాని దీని మూలమగు జ్యోతి పరిమితమును గాదు, పరిమితిపై, నియమనిబంధనలపై నాధారపడను పడదు. ఈ జ్యోతి స్వయంసిద్ధము, అవికార్యము, ఇది మన ప్రకృతి అపశ్రుతుల మధ్య ఎటులో మనుచుండు ఈ యా సామరస్యఫలితము గాదు, పరంతు సామరస్యమునకు మూలస్రోతము మఱియు నిది కోరిన సామరస్యమును సృజించగలదు. అది ఒక తేజోమయ, ఆధ్యాత్మిక జ్ఞానశక్తి, తన స్వభావసిద్ధ క్రియయందు ఒక సాక్షా దతి మానస జ్ఞానశక్తి – "జ్యోతి", వికృతము, ఉత్పన్నము నగు మన మానసిక భాసము – "ప్రకాశము" (14-11) – గాదు. అది విశాలతమ స్వయంభూసత్త, సహజసంపన్న ఆత్మజ్ఞానము, ఘనిష్ఠ విశ్వసమ్మిత తాదాత్మ్యము, గభీరతమ ఆత్మవినిమయము – లయొక్క జ్యోతి మఱియు ఆనందము, అంతేగాని, సంపాదనము, సరూపీకరణము (assimilation), పరస్పరసమాధానము మఱియు కష్టసాధ్య సమీకరణము–లయొక్క ప్రకాశము గాదు. ఆ జ్యోతి ఒక ప్రదీప్త ఆధ్యాత్మిక సంకల్పముతో నిండియుండును గాని, దాని జ్ఞానమునకును, కర్మకును మధ్య ఎట్టి అఖాతము లేక వైషమ్యము

నుండదు. అటులే ఆ ఆనందము మన హీనతర మానసిక "సుఖము" (14-6) గాదు, పరంతు అది ఒక ప్రగాఢ, సారభూత, సాంద్ర, స్వయంసిద్ధ ఆనందము; ఈ ఆనందము మనము దేనిని చేతుమో, ఊహింతుమో, సృజింతుమో, దాని కంతకును విస్తరించును, అది ఒక సుస్థిర హర్షపారవశ్యము, ఒక దివ్యానందము. విముక్తపురుషుడు ఎంతెంత సమగ్రముగా భగవంతునితో తనను యుక్తము గావించుకొనునో, అంతంత ప్రగాఢముగా ఈ జ్యోతిరానందములో పాల్గొనును మఱియు నంతంత పరిపూర్ణముగా దానిలోనికి పెరుగును. మఱియు నిమ్నప్రకృతి యొక్క గుణముల నడుమ ఒక అనివార్య అతుల్యత, మానముల ఒక చంచల అస్థిరత, ఆధిపత్యముకొఱకు సంతత సంఘర్షము రేగుచుండగా, ఆధ్యాత్మిక సత్త్వయొక్క జ్యోతిరానందము. అక్షతశాంతి, ప్రవృత్తిసంకల్పము ఒకదానినొకటి బహిష్కరించవు, ఒకదానితోనొకటి పోరుసల్పవు; అవి కేవలము సమతూకమునం దుండుటయే గాక, అందు ప్రతిదియు తక్కిన రెండింటియొక్క ఒక పార్శ్వమగును, మఱియు తమ పూర్ణరూపమున మూడును అవిచ్ఛేద్యము, ఏకము నగును. మన మనస్సు భగవంతుని సమీపించునపుడు, ఒక దానిని విడిచి, మఱియొక దానిలో ప్రవేశించుచున్నట్లు, ఉదాహరణకు, కర్మప్రవృత్తిని విడిచి, శాంతిస్థితి సాధించుచున్నట్లు తోచవచ్చును, కాని దీనికి కారణము మనము ముందు వరణాత్మక (selecting) మనస్తత్వముద్వారా భగవంతుని సమీపించుటయే. పిమ్మట ఆధ్యాత్మిక మనస్సును సైతము దాటి, మనము పై కెగయగలిగి నపుడు, ఈ మూడు దివ్యశక్తులలో ప్రతిదాని లోపలను తక్కినవి గలవని చూచి, ఈ ప్రాథమిక దోషమును [1] సవరించుకొనగలము.

6. సత్త్వము సంక్రమణమునకు చరమసోపానము :

కావున ప్రకృతి గుణముల సాధారణ నిమ్నతర క్రియకు అధీనము గాకయే, కర్మ సంభవమని మనకు తెలినది. ఏ మానసిక ప్రాణిక దైహిక పరిమితియందు

[1] ఈ పై మూడు పేరాలందును గుణములకు మూలమగు, పరప్రకృతియొక్క పరమ ఆధ్యాత్మిక మఱియు అతిమానసిక రూపముల వర్ణన చేయబడినది, దీనిని గీతనుండి స్వీకరించలేదు. ఇది (శ్రీ అరవిందుని) ఆధ్యాత్మికానుభవమునుండియే ప్రవేశపెట్టబడినది. గీత పరప్రకృతికర్మను - "రహస్యం ఉత్తమం" - గుఱించి ఎట్టి వివరముల నివ్వదు. గీత దానిని తన ఆధ్యాత్మికానుభవమునందు కనుగొన, సాధకునికే వదిలివేయును. ఈ రహస్యమునకు ద్వారమగు సాత్త్విక స్వభావమును, కర్మను - దైవసంపత్తిని - మాత్రమే నిర్దేశించును, కాని అదే సమయమున సత్త్వగుణమును సైతము అతిక్రమించవలె నని (14-19) గట్టిగా పట్టుబట్టును - శ్రీ అ.

మనము పోత పోయబడి యున్నామో, దానిపై ఈ గుణక్రియ ఆధారపడును; ఇది శరీరగతమగు మనఃప్రాణములచే మనపై విధించబడిన ఒక వికృతి, ఒక అసమర్థత, ఒక అనుచిత లేక అపకృష్ట మూల్యము. మనము ఆత్మలోనికి పెరిగినపుడు, ఈ అపరధర్మము యొక్క స్థానమున ఆత్మయొక్క అమరధర్మము వచ్చును; అచ్చట ఒక ముక్త అమర కర్మయొక్క, ఒక దివ్య అపరిమిత జ్ఞానముయొక్క, ఒక అతీత శక్తియొక్క, ఒక అగాధ విశ్రాంతియొక్క అనుభవ ముండును. కాని యింకను, ఈ సంక్రమణ మెట్లు ? – అను ప్రశ్న మిగిలియే యున్నది; ఏలన ఒక సంక్రమణము లేక ప్రగతి సోపానము లుండితీరవలెను, కారణము, ఈ ప్రపంచమునందలి భగవంతుని కార్య కలాపమునం దేదియు క్రమము లేక ఆధారము వినా ఆకస్మికముగా చేయబడదు. మన మన్వేషించు వస్తువు మనలోనే యున్నది, కాని ఆచరణయందు మన ప్రకృతి యొక్క నిమ్నరూపములనుండి దాని [2]వికాసమును సాధించవలసియున్నది. కావున గుణక్రియలోపలనే, మన మీ రూపాంతరము సాధించుటకు, ఒక సాధనము, ఒక ఉన్నతమనోపాయము, ఒక ఆధారబిందువు నుండకతప్పదు. గీత దీనిని సత్త్వగుణము యొక్క పూర్ణవికాసము నందు కనుగొనును, ఈ గుణము తన సశక్తి వికాసమునందు ఒక మేరను చేరుకొని, అచ్చట తననే తా నతిక్రమించి, తన మూలమున అంతర్ధానము కాగలదు. దీని కారణము సువిదితమే : సత్త్వము సుఖప్రకాశముల శక్తి గావున, తన పరాకాష్ఠయందు తనకు మూలమగు ఆధ్యాత్మిక జోతిరానందముతో ప్రాయశః మానసిక తాదాత్మ్యమును అందుకొనగలదు. ప్రకృతియందలి సాత్త్వికశక్తి యొక్క చేయూతలేనిదే, తక్కిన రెండు గుణములు ఈ పరివర్తనమును స్వయముగా సాధింపజాలవు – రజస్సు దివ్య క్రియోన్ముఖ సంకల్పములోనికి, తమస్సు దివ్య శాంతి విశ్రాంతులలోనికి, జడతాతత్త్వముయొక్క అజ్ఞానము ప్రకాశమునందును, దాని నిశ్చేష్ట అసమర్థత సర్వశక్త దివ్య విశ్రాంతిసంకల్పముయొక్క ప్రకాశమయబలము నందును అంతరించువఱకు, ఆ జడతత్త్వము సదా శక్తియొక్క అకర్మగా గాని, జ్ఞానముయొక్క అసమర్థతగా గాని నిలిచియుండును. అట్లు అంతరించినపుడే, మనకు

[2] ఆత్మవిజయము, స్వప్రయత్నము మఱియు క్రమపాలనముచే పైకి ఆరోహించు మన ప్రకృతి దృక్కోణమునుంచి చెప్పిన మాట యిది. దివ్యజ్యోతి, సన్నిధి మఱియు శక్తి మనసత్తలోనికి, దానిరూపాంతరము నిమిత్తము, దిగి అధికాధికముగా చేయూత నిచ్చుటయు ఆవశ్యకము. లేనిచో, సరిహద్దునందును, దాని కావలను రూపాంతరము ఘటిల్లజాలదు. కావుననే చరమవృత్తిరూపమున అశేష ఆత్మసమర్పణ యొక్క ఆవశ్యకత గన్పించును. – శ్రీ అ.

పరమశాంతి ప్రాప్తించును. కావున తమస్సు సత్త్వాధిపత్యములోనికి రావలెను. అటులే తనకు యథార్థజ్ఞానము లేనంతవఱకు, రజోరూప తత్త్వమును సదా ఒక వ్యగ్ర, వ్యథిత, సంతప్త లేక సుఖహీన క్రియగానే మిగిలియుండును; దాని స్వాభావిక గతి ఒక అక్రమ మఱియు విపరీత క్రియ యగును - అజ్ఞానముద్వారా విపరీతము. మన సంకల్పము జ్ఞానముచేత తనను శుద్ధముగావించుకొనవలెను; ఇది యుక్తము, జ్ఞానదీప్తము నగు నొక క్రియను అధికాధికముగా అభ్యసింపవలెను, అపుడే అది గతిశీల దివ్యసంకల్పము లోనికి మాఱగలదు. ఇదియు మఱల సత్త్వప్రవేశముయొక్క ఆవశ్యకతను దెల్పును. సత్త్వగుణము పరాపర ప్రకృతుల మధ్య నొక ప్రథమ మధ్యవర్తి యగును. నిక్కముగా నది ఒకానొక స్థానము చేరుకొని స్వయముగా రూపాంతరితము గావలెను, తననుండి తాను తప్పించుకొని, విచ్ఛిన్నమై, తన మూలములో విలీనము గావలెను; దాని నియమాధీన, అన్యలబ్ధ, అన్వేషణాత్మక ప్రకాశము మఱియు జాగ్రత్తగా రచించబడిన క్రియ ఆత్మయొక్క విముక్త స్వయంసిద్ధ క్రియాకలాపములోనికిని, సహజస్ఫూర్త జ్యోతిలోనికిని మాఱవలెను. కాని ఈ లోపున సత్త్వశక్తియొక్క సమున్నత వృద్ధి తామసిక, రాజసిక అనర్హతనుండి చాలవఱకు మనలను తప్పించును; మఱియు మనచే స్వయముగా సాత్త్విక అనర్హతయు, ఒకసారి రజస్తమోభారమునుండి విపరీతముగా లాగబడని స్థితి ప్రాప్తించినపుడు, ఎక్కువ తేలికగా అధిగమించ బడగలదు. ఆధ్యాత్మిక జ్యోతి మఱియు నిర్మలత్వముచే నిండువఱకు సత్త్వవికాసమును సాధించుట ప్రకృతియొక్క సన్నాహక సాధనయొక్క ప్రథమావస్థ యగును.

7. దేవతలు, అసురులు :

అదియే తక్కిన గీతాధ్యాయముల యొక్క ఉద్దేశ్యమని మనము చూడగలము. కాని ఈ ప్రకాశసాధక ప్రక్రియను వివరించక పూర్వము, దాని పీఠికగా దేవాసురులను ద్వివిధ పురుషుల వివేచనచేయును; ఏలన దేవమానవుడే స్వ-పరివర్తనసాధకమగు సాత్త్వికక్రియకు సమర్థుడు గాని, అసుర మానవుడు గాడు. ఈ పీఠికయొక్క ప్రయోజనమేమియో, ఈ వివేచనయొక్క ఆశయమేమియో మన మిపుడు చూతము. సర్వమానవుల సాధారణప్రకృతి ఒకటియే, అది త్రిగుణముల ఒక సమ్మిశ్రము; అయినపుడు, సత్త్వమును పెంపొందించి, దానిని దివ్యపరివర్తన శిఖరముల దిశగా నడుపగల సామర్థ్యమందరియందు నుండునని అనిపించును. అయితే వస్తుతః మన సాధారణప్రవృత్తి మన బుద్ధిని, సంకల్పమును మన రాజసిక లేక తామసిక అహంకారమునకు దాసులను జేయుటకే తోడ్పడును, అనంత కామమునకు

సేవకులను జేయుటకే పనికివచ్చును; కాగా ఈ ప్రవృత్తి మన అపరిణత ఆధ్యాత్మిక సత్తయొక్క ఒక తాత్కాలిక లక్షణము మాత్రమే కాగలదు, మన చేతన ఆధ్యాత్మిక సోపానముల నారోహించినపుడు అది అంతరించి పోవును అని మనమనుకొందుము. కాని వాస్తవముగా మనము చూచునదేమనిన, మానవులు, కనీసము ఒక స్తరముపైకి వెళ్లిన మానవులు, స్థూలముగా రెండు వర్గములలోనికి వచ్చివేతురు - ఒక వర్గము వారిలో సాత్త్విక ప్రకృతియొక్క ప్రబల శక్తి యుండును, కాగా ఈ శక్తి జ్ఞానము, ఆత్మసంయమము, ఉపకారపరత మఱియు సంసిద్ధివైపునకు దిరిగియుండును; పోగా రెండవ వర్గమువారిలో రాజసిక ప్రకృతి యొక్క ప్రబలశక్తి యుండును, కాగా ఈ శక్తి అహంకారిక మహత్త్వము, కామతృప్తి. తమ దృఢ సంకల్పము మఱియు వ్యక్తిత్వముల తర్పణమువైపునకు దిరిగియుండును; ఇక వీరు ఈ తమ వ్యక్తిత్వసంకల్పములను మానవసేవకు లేక భగవంతునిసేవకు గాక, తమ అభిమానము, యశము మఱియు సుఖముకొఱకు ప్రపంచముపై విధింపజూతురు. ఈ రెండు వర్గములు దేవతలు మఱియు దానవుల యొక్క ప్రతినిధులు. భారతీయ మతముల సంకేతశాస్త్రమునందు ఈ దేవాసుర వివేచన మిక్కిలి ప్రాచీనము. ఋగ్వేదముయొక్క ప్రధానభావము దేవతలకును, తమ తమోమయ ప్రత్యర్థులకును మధ్య జరుగు ఒక సంఘర్షము - ఒకరు జ్యోతికి అధిపతులు, అనంతతయొక్క పుత్రులు, ఒకరు అంధకారము మఱియు విభజన యొక్క పుత్రులు : వీరి సంగ్రామములో మానవుడు పాల్గొనును, అది అతని లోపలి జీవనము మఱియు క్రియయందు ప్రతిబింబించును. ఇది జరదుస్తుని (పార్శీ మత మూలపురుషుడు) మతముయొక్క ప్రధానతత్త్వము గూడను. తర్వాతి సాహిత్యము నందు సైతము ఈ భావమునకు ప్రముఖస్థానము గలదు. రామాయణము సైతము తన నైతికాంశమునందు ఒక రూపకమే, మానవరూపము నందలి దేవునికి, దేహధారియగు రాక్షసునికిని మధ్య జరిగిన ఒక భయంకర సంగ్రామమును దెలుపు రూపకమే - ఒకరు సమున్నత సంస్కృతి మఱియు ధర్మమునకు ప్రతినిధి, ఒకరు ఉబ్బిపోయిన అహంకారముయొక్క అతిమాత్ర, అనియంత్రిత శక్తి మఱియు విస్తృత నాగరికతకు ప్రతినిధి. ఇక మహాభారతము - గీత దీని ఒక విభాగమే-మానవ దేవతలకును, అసురులకును అధికార మానవులకు, దేవతల పుత్రులకును నడుమ సాగిన ఒక యావజ్జీవ సంగ్రామమును తన విషయముగా గొనును - ఒకరు ఉన్నత నైతిక ధర్మపు వెలుగుచే పాలింపబడు దేవతల పుత్రులు మఱియు యితరులు తమ మానసిక ప్రాణిక దైహిక

అహంకారమును సేవించుటకే బద్ధకంకణులైన దేహధారి రాక్షసులు, అధికార మానవులు. మన మానసముకంటె ప్రాచీనుల మానసము భౌతిక రూపమువెనుక దాగియున్న వస్తుసత్యమునకు ఎక్కువ తెలచుకొనియుండెను; అది మానవజీవనము వెనుక విశ్వశక్తియొక్క కొన్ని ప్రవృత్తులు లేక అంతస్తులకు ప్రాతినిధ్యము వహించు విశ్వ మహాశక్తులు లేక పురుషులను చూచుచుండెను, దైవ అసుర రాక్షస పైశాచభేదమున ఈ శక్తులు చతుర్విధములు; మఱియు నీ ప్రకృతి రూపములను తమయందు గట్టిగా ప్రతిబింబించిన మానవులు స్వయముగా దేవతలు, అసురులు, రాక్షసులు, పిశాచులు నని గణించబడిరి. కాగా తన ప్రయోజనము నిమిత్తము ఈ వివేచనను గీత స్వీకరించి, ఈ ద్వివిధప్రాణులకును మధ్యగల భేదమును విపులముగా వర్ణించును – "ద్వౌ భూతసర్గౌ" (16–6). అసురము మఱియు రాక్షసము నై, ఈశ్వరజ్ఞానము, విముక్తి మఱియు సంసిద్ధిని అడ్డగించు ప్రకృతిని గీత ఇతఃపూర్వమే ప్రస్తావించినది (7–15, 9–12). ఇపుడు గీత ఈ జ్ఞానాదులకు అభిముఖమగు దైవప్రకృతిని దానినుండి వేఱుపఱచి చూపును.

8. దైవసంపత్తివలన మోక్షము :

నీవు దైవప్రకృతితో బుట్టినవాడవని భగవంతు డర్జునునికి దెలుపును (16–5). కావున యుద్ధము మఱియు సంహారమునకు బూనుకొనుటచేత తాను ఆసురప్రవృత్తికి లొంగిపోగల డను తలంపుతో అర్జునుడు దుఃఖించ బనిలేదు. ఏ కర్మపై సర్వము నాధారపడునో, కాలపురుషుని రూపమున విశ్వేశ్వరుని ఆదేశమును పురస్కరించుకొని, సశరీర భగవంతుడు తనకు సారథి కాగా అర్జును డే యుద్ధము చేయవలసి యున్నదో, అది ధర్మరాజ్యమును, సత్యబుత న్యాయసామ్రాజ్యమును స్థాపింప సమకట్టిన ఒక సంగ్రామము. అర్జునుడు స్వయముగా దేవ–జాతిలో బుట్టినవాడు; అతడు తనలోపలి సాత్త్వికసత్తను పెంపొందించుకొనుచు, వచ్చి చేరుకొనిన ఇప్పటి స్థానమున ఒక సమున్నత పరివర్తనకును, త్రైగుణ్యము నుండి, కావుననే సాత్త్వికప్రకృతినుండి సైతము విముక్తికిని సమర్థుడైయున్నాడు. దేవాసురవిభేదము సర్వమానవజాతికి వ్యాప్తము గాదు, అది కచ్చితముగా వ్యక్తులందరికి వర్తించదు, అటులే జాతియొక్క నైతిక లేక ఆధ్యాత్మిక చరిత్రయొక్క సర్వదశల యందు గాని, వైయక్తిక పరిణామముయొక్క సర్వావస్థల యందు గాని అది సునిశితము మఱియు సునిశ్చితముగా నుండదు. మొత్తములో నెంతో పెద్ద భాగమగు తామసిక మానవుడు ఇచ్చటి వర్ణనను బట్టి ఏ వర్గములోనికిని రాడు; అయితే అతనిలో ఇంచించుక ఉభయాంశములు నుండ

వచ్చును, మఱియు నతడు నిమ్న గుణముల క్రియకే మందమందముగా తోడ్పడును. సామాన్య మానవుడు సాధారణముగా నొక మిశ్రమము; కాని అతనియందు ఏదియోయొక ప్రవృత్తి ఎక్కువ స్ఫుటముగా నుండును, అది అతనిని ప్రధానముగా రాజస – తామసికుని గాని, సాత్త్విక – రాజసికుని గాని చేయదొడంగును, మఱియు నతని నేదియోయొక పర్యవసానమునకు, అనగా దివ్యనిర్మలతకు గాని, అసురవిక్షోభమునకు గాని తయారు చేయుచున్న దని చెప్పవచ్చును. ఏలన గీతయం దిచ్చట ప్రస్తుతవిషయము గుణాత్మక ప్రకృతియొక్క పరిణామమునం దొకానొక పర్యవసానము; ఈ సత్యము గీతావర్ణనను బట్టి మనకు స్పష్టపడును. ఒక వైపున సత్త్వగుణముయొక్క ఆరోహణము, అనగా నిమగ్నదేవునియొక్క ఆరోహణము లేక అభివ్యక్తి యుండవచ్చును; రెండవ వైపున ప్రకృతిగత అంతరాత్మయొక్క రాజసిక ప్రవృత్తి యొక్క ఆరోహణము, అనగా అసురుని సంపూర్ణ జన్మము సంభవించవచ్చును. ఒకటి గీత యిపుడు ఒత్తిచెప్ప నున్న విమోచన వృత్తికి దారితీయును; అది సత్త్వ గుణముయొక్క ఒక సమున్నత ఆత్మాతిక్రమణమును, దివ్యసత్తయొక్క సాదృశ్యము లోనికి ఒక రూపాంతరీకరణమును సాధ్యము చేయును – "విమోక్షాయ" (16–5). రెండవది అందరియందును గల ఈ సామర్థ్యమునుండి మనలను దూరము గావించి, మన అహంకారబంధనమును పర్వతప్రాయము చేయు దిశగా మనలను త్వరపెట్టును. దీని నెఱింగించుటయే ఈ వివేచనలోని మర్మము.

9. సాత్త్విక అభ్యాసములు, గుణములు :

పరాకాష్ఠ నందిన సాత్త్విక అభ్యాసములు మఱియు గుణములు దైవప్రకృతిని వేఱుచేసి చూపును; ఆత్మ సంయమము, యజ్ఞము, ధార్మికాధ్యయనము, శుద్ధతా మఱియు పవిత్రత, నిష్కాపట్యము మఱియు సరళత, సత్యము, శాంతి మఱియు త్యాగము, దయ, లజ్జ, మృదుత, క్షమ, సహిష్ణుత, ధీరత; సమస్త చపలత మఱియు లఘుత మఱియు అస్థిరతలనుండి ఒక గంభీర, మధుర, యదార్థ విముక్తి – ఇవి దైవప్రకృతికి స్వాభావిక గుణములు (16–1, 2, 3). క్రోధము, లోభము, మోసము, ద్రోహము, ఇతరులకు బుద్ధిపూర్వకముగా చేయు హింస, గర్వము, దురహంకారము, విపరీత స్వాభిమానము: వీనికి దైవప్రకృతి నిర్మాణములో స్థానము లేదు. కాని దాని మృదుత, త్యాగము మఱియు ఆత్మసంయములలో ఎట్టి బలహీనతయు నుండదు; దానియందు, ధర్మమునందును అహింసాసత్యముల ననుసరించియు జీవించు అంతరాత్మయొక్క తేజము మఱియు నాత్మబలము, దృఢనిశ్చయము (ధృతి), అభయము

– ఇవి చెలంగుచుండును–"తేజః, అభయం, ధృతిః, అహింసా, సత్యం" (16-1, 2, 3). సమస్త సత్తయు, సమస్త స్వభావము నిచ్చట సమగ్ర – శుద్ధమై యొప్పారును– "సత్త్వసంశుద్ధిః", ఇచ్చట జ్ఞానపిపాసయు, జ్ఞానమునందు ప్రశాంత సుస్థిర ప్రతిష్టయు నుండును. ఇదిగో, ఇది దైవప్రకృతిలో జన్మించిన వాని సమృద్ధ సంపద యగును.

10. ఆసుర సంపత్తి, దాని ఫలితము :

ఆసుర ప్రకృతికి సైతము తన సంపద, తన శక్తిసమృద్ధి గలదు, కాని దీని స్వభావము మిక్కిలి భిన్నము, ప్రబలము మఱియు దుష్టము. ఆసుర మానవులకు ప్రవృత్తి లేక నివృత్తియొక్క యథార్థ జ్ఞాన ముండదు, అనగా నేది చేయవలెనో, ఏది చేయరాదో వారికి తెలియదు (16-7); వారియందు సత్య ముండదు, శుద్ధక్రియ యుండదు, నిష్కామయ ఆచార ముండదు. స్వాభావికముగనే వారు జగత్తునందు స్వతృప్తికి జరుగు విశాలక్రీడనేగాని, మఱి దేనిని చూడరు. వారి జగత్తునకు కామమే కారణము, బీజము, శాసకశక్తి మఱియు నియమము; అది ఆకస్మికముగా పుట్టిన జగత్తు, దానికి సత్సంబంధముగాని, పూర్వకర్మ గాని లేదు, దానికి ఈశ్వరుడు లేడు, అది అసత్యము, సత్యప్రతిష్ఠా శూన్యము (16-8). వారికి దీనిని మించిన ఎట్టి బౌద్ధిక లేక ధార్మిక సిద్ధాంతమున్నను, ఇదియే ఆరచణయందు వారి బుద్ధి సంకల్పముల యథార్థ మతము, వారు సదా కామము మఱియు నహంకారదేవతలనే ఉపాసింతురు. కార్యక్షేత్రమున జీవితముపట్ల నీ దృష్టినే అవలంబించి, దాని అసత్యభావముచేతనే తమ ఆత్మను, బుద్ధిని సర్వనాశము గావించుకొందురు (16-9). ఆసుర మానవుడు ఒక ఉగ్ర ప్రచండ క్రియయొక్క కేంద్రము లేక సాధనమగును, ఒక విధ్వంసక శక్తియగును, హింసాశుభముల ఒక స్రోతోమూల మగును. దంభము, అభిమానము, గర్వమదముతో గూడిన ఈ పథభ్రష్ట జీవులు తమనే వంచించుకొందురు, తమమిథ్యామూర్ఖ లక్ష్యములందు పట్టుతోనుందురు, తమ లాలస విషయమగు అశుచిసంకల్పములను వెంటాడుదురు (16-10). కామోప భోగమే జీవిత సర్వలక్ష్య మని వారు తలపోతురు, పూరించరాని ఈ లక్ష్యము వెంటబడి, మరణపర్యంతము వారు తమను కాల్చివేయు నొక అపరిమిత చింత, ఆలోచన, ప్రయత్నము మఱియు ఆందోళనకు గురియగుదురు (16-11). వంద బంధములచే బద్ధులు, కామక్రోధములచే భక్షితులు, తమ కామభోగార్థము అన్యాయార్జనయందు సదా వ్యగ్రులు నైయుండు వా రిట్లు ఊహించుకొందురు (16-12), "నేడు నే నీ కామ్యమును బొందితిని, రేపు దానిని బొందెదను, నేడు నా కింత విత్తమున్నది, రేపు మఱింత వచ్చును

(16-13). ఈ నా శత్రువును హతమార్చితిని, తక్కిన వారి పని గూడ పట్టించెదను. నేను ప్రభువను, రాజును; నేను సిద్ధుడను, భోగిని, బలవంతుడను, సుఖిని; నేను భాగ్యశాలిని, ప్రపంచ భోగమునందు నా కనన్యాధికారము గలదు (16-14). నేను సంపన్నుడను, నేను ఉత్తమ వంశజుడను; నా వంటివా డెవడున్నాడు; నేను యజ్ఞము చేతును దాన మిత్తును, విషయములను భోగింతును (16-15)." ఇట్లు బహువిధ అహంకారిక భావములచే నాక్రాంతులై, మోహజాలములో బడి, వారు కర్మ చేతురు గాని, తప్పుగా చేతురు; ప్రబలముగా ప్రయత్నింతురు గాని, తమయందలి మఱియు నందరియందలి భగవంతునికొఱకుగాక, తమకొఱకే, కామముకొఱకే, భోగము కొఱకే ప్రయత్నింతురు; అట్టివారు తమ దురితమే కారణమగు అశుచి నరకమున పోయిపడుదురు (16-16). వారు నిజమే, యజ్ఞదానముల నాచరింతురు, కాని దాంభికప్రదర్శనార్థము, మిథ్యాభిమానమునుండి, మఱియు స్తబ్ధబుద్ధిహీన గర్వముతో నాచరింతురు (16-17). తమ బలసామర్థ్యముల అహంకారమునందు, తమ దర్ప క్రోధముల తీవ్రతయందు వారు తమయందును, సర్వులయందును గుప్తముగా నున్న భగవంతుని ద్వేషింతురు, నిరసింతురు, తృణీకరింతురు (16-18). మంచిపట్లను, భగవంతునిపట్లను వారికిట్టి సాభిమాన ద్వేషము మఱియు తిరస్కారము గలవు గాన, వారు క్రూరులు, దుష్టులుగా, వారిని భగవంతుడు నిరంతరము అధికాధిక ఆసురిక జన్మలలోనికి విసిరివేయును. అన్వేషించరు గాన, వారు భగవంతుని గనుగొనరు, మఱియు చివరకు, భగవన్మార్గమునుండి సర్వథా భ్రష్టులై, అంతరాత్మ ప్రకృతియొక్క అధమస్థితిలోనికి మునిగిపోదురు - "అధమాం గతిం" (16-20).

11. పాపాత్మునికి సైతము పరమగతి :

ఈ విస్పష్ట వర్ణన సూచించు వివేచనకు మనము పూర్తివిలువ నిచ్చినప్పటికి, దీనిలో నున్న అర్థముకంటె ఎక్కువ అర్థమును లాగుటకు ప్రయత్నించరాదు. ఈ భౌతిక ప్రపంచమున దేవాసురు లను [1] ద్వివిధ సృష్టులు గలవు (16-6) అని

[1]ద్వివిధ సృష్టుల విభేదముయొక్క పూర్ణసత్యము అధిభౌతిక స్తరములలో మనకు గన్పించును, ఏలన అచ్చటి జీవనము ఆధ్యాత్మిక పరిణామనియమముచే పాలింపబడదు. దేవతల లోకములు గలవు, అసురుల లోకములు గలవు; మన వెనుక నున్న ఈ లోకము లందలి వ్యక్తులు మాఱని నిత్యరూపులు. వీరు విశ్వప్రగతికి ఆవశ్యకమగు భగవల్లీలకు ఆధారముగా నుందురు మఱియు వీరు పృథివీతలముపైనను, ఈ పృథివీస్తరమున మానవుని జీవనస్వభావముల పైనను తమ ప్రభావమును బఱపుదురు. - శ్రీ అ.

చెప్పినపుడు, మానవాత్మలు భగవంతునిచే ఆది నుంచియు ప్రకృతియందు తమతమ ప్రత్యేక అనివార్య జీవనవిధానముతో సృజింపబడిన వని దీని అర్థము గాదు; అటులే ఒక కఠోర ఆధ్యాత్మిక పూర్వనిర్ణీత గమ్యము గల దనియు, ఎవరిని భగవంతుడు ఆదినుంచియు నిరాకరించెనో, వారి నతడు అంధులను గావించి, ఆ నెపముతో శాశ్వత అశుచి నరకములోనికి త్రోసివేయు ననియు దీని అర్థము గాదు. నిజానికి సమస్తాత్మలు - దేవమానవులవలెనే అసుర మానవులును - భగవంతునియొక్క సనాతన అంశములే (15-7), అందరును మోక్షమును ప్రాపించవచ్చును; పరమ పాపి సైతము భగవదభిముఖము కాగలడు (9-30). కాని ప్రకృతియందు అంతరాత్మ పరిణామ మొక సాహసకృత్యము మఱియు స్వభావమును, స్వభావనియత కర్మయు (18-47) దాని ప్రధానశక్తులు. కావున స్వభావాభివ్యక్తియందు, అంతరాత్మయొక్క స్వయంసంభూతియందు ఒక అతిక్రమము, దాని ఖేలనమునందు ఒక వ్యతిక్రమము బయలుదేరి, సత్తానియమమును చెడ్డవైపునకు త్రిప్పినచో, రాజసగుణములకు బట్టముగట్టి, సత్త్వమును తగ్గించివేయు వాని పెంపును సాధించినచో, అపుడు కర్మ మఱియు దాని ఫలితముల ప్రవృత్తి మోక్షసాధన సమర్థమగు సత్త్వాధిక్యమునందు గాక, నిమ్నప్రకృతి - దురాగ్రహముల పరాకాష్ఠ యందే పర్యవసించును. మానవుడు, తా నిట్టి తఱి వెనుతగ్గి, తన భ్రాంతమార్గమును విడిచి వేయనిచో, అతనియందు అసురుడు పూర్తిగా జన్మించును. కాగా మానవుడు సత్య తేజములకు దూరముచేయు ఒక పెద్ద మలుపు దిరుగును, అత డిక తన అధోగతి వేగమును మఱల్చజాలడు, తాను దురుపయుక్తముగావించిన తనయందలి అతిమాత్ర దివ్యశక్తియే దానికి గారణము; కాగా ఆ వేగముచేత నతడు అట్టడుగు నంటును, అపుడు ఈ అధోగతి తన నెక్కడకు దెచ్చెనో, కనువిప్పి కనుగొనును; తన కార్యమును సాధించి, ఆ దురుపయుక్త శక్తి క్షీణించగా, అత డిపుడు అంతరాత్మ ప్రకృతియొక్క నిమ్నతమావస్థలో - నరకములో - నున్నాడు. దీని పాఠమును గ్రహించి, అతడు తిరిగి వెలుగునకు మఱలినపుడే, గీతయొక్క తదితర సత్యము రంగములో ప్రవేశించును; పరమ పాపిష్ఠుడు, అత్యంత మలిన ఘోర దురాచారుడు సైతము భగవంతుని భజించుచు, ననుసరింప బూనుకొనిన వెంటనే, రక్షితు డగును. కారణము, కేవల మా పూనిక చేతనే అతడు సంసిద్ధికిని, విముక్తికిని గొనిపోవు సాత్త్వికమార్గమున శీఘ్రముగా బ్రవేశించును (9-30, 31).

12. పరమసిద్ధికి శాస్త్రము మార్గము :

ఆసురిక ప్రకృతి రాజసిక ప్రకృతియొక్క పరాకాష్ఠ మాత్రమే. అది ప్రకృతిగత అంతరాత్మను దాస్యమునకు, కామ క్రోధలోభముల వశమునకు నడుపును ; రాజసిక అహంకారముయొక్క ఈ మూడు శక్తులును నరకద్వారములు (16-21) - ప్రాకృత జీవుడు తన నిమ్న లేక అంధ ప్రేరణలయొక్క అశుచి, దురితము మఱియు భ్రాంతి యందు రమించునపుడు ఏ నరకములో పడునో, ఆ నరకద్వారములు. ఈ మూడును మఱల నొక మహాంధ కారముయొక్క ద్వారములగును (16-22), అవి మూలాజ్ఞానముయొక్క విలక్షణ శక్తియగు తమస్సులోనికి తెఱచుకొనును ; ఏలన రాజసిక ప్రకృతియొక్క అనియంత్రిత వేగము, క్షీణించినపుడు, మానవుడు అతినికృష్ట తామసిక ఆత్మావస్థ యొక్క దుర్బలత, సంకోచము, అంధకారము, అసామర్థ్యముల లోనికి తిరిగి కుప్పగూలిపోవును. ఈ పతనమునుండి తప్పించుకొనుటకు, మానవుడు ఈ మూడు దుష్టశక్తులనుండి విడుదల బొంది, సత్త్వగుణముయొక్క ప్రకాశమునకు దిరుగవలెను, ప్రమాణమును బట్టి, యథార్థ సంబంధములందు, సత్యధర్మముల పథములో నడువ వలెను; అపుడు అతడు తన ఉచ్ఛతర హితము ననుసరించుచు, అత్యున్నత ఆత్మస్థితిని ప్రాపించును (16-22). కామధర్మము ననుసరించుట మన ప్రకృతియొక్క యథార్థ నియమము గాదు; దాని కర్మలకు ఒక ఉచ్ఛతర, న్యాయతర ప్రమాణమున్నది. కాని దాని రూప మెక్కడ గన్పించును ? మానవజాతి దీనినే సదా అన్వేషించుచు వచ్చినది మఱియు తాను కనుగొనిన దంతయు శాస్త్రమునందు రూపము ధరించియున్నది. అయితే శాస్త్ర మన, జ్ఞానవిజ్ఞానముల నియమము, నైతిక నియమము, ధార్మిక నియమము, శ్రేష్ఠ సామాజిక జీవననియమము, మానవునితోను, భగవంతునితోను, ప్రకృతితోను యథార్థ సంబంధములను దెలుపు నియమము. శాస్త్ర మన, ఆచారముల ఒక రాశి గాదు, ఏలన వీనిలో కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి; తామసిక మానవుని యొక్క యాంత్రికమనస్సు అలవాటుచొప్పున వీని నర్థము దెలియకయే పాటించును. నిజానికి శాస్త్ర మన, అంతర్జ్ఞానము, అనుభవము, వివేకములచే విహితమైన జ్ఞానము మఱియు నుపదేశము, జీవనముయొక్క విజ్ఞానము, కళ మఱియు నీతి, అనగా జాతికి లభించిన శ్రేష్ఠ ప్రమాణములు. ఇట్టి శాస్త్రవిధిని పాటించక, ఏ అర్ధ-ప్రబుద్ధ మానవుడు తన ప్రేరణలు మఱియు కామముల వెంటబడునో, అతడు ప్రీతిని బొందగలడు గాని, సుఖమును బొందజాలడు, ఏలన ఆంతర సుఖము ప్రామాణికజీవనముచేతనే

ప్రాప్తించగలదు (16-23). అతడు సంసిద్ధికి పయనించ జాలడు, పరమ ఆధ్యాత్మిక పదము నందుకొనజాలడు. ప్రేరణ మఱియు కామముల నియమము జంతు ప్రపంచములో ప్రముఖముగా గన్పించును, కాని మానవుని మానవత్వ విశేషము సత్యమును, ఋతమును, జ్ఞానమును, ఒక యుక్త జీవన విధానమును అనుసరించుట చేతనే వృద్ధినందును. తన బుద్ధిచేతను, ప్రాజ్ఞసంకల్పము చేతను తన నిమ్నసత్తను శాసించుకొను నిమిత్తము తాను గుర్తించి, స్థాపించిన ప్రమాణ రూపమగు శాస్త్రమును, కావుననే ముందు పాటించవలెను, తన నడవడికిని, పనులకును, కార్యాకార్య నిర్ణయమునకును అదియే ప్రామాణ్యము గావలెను (16-24). సహజప్రవృత్త కామనాత్మక ప్రకృతి ఆత్మసంయమ అభ్యాసముచేత శిక్షితము, క్షీణము, నిర్దళితము నగువఱకు శాస్త్రవిధానమును శిరసావహించవలెను; అపుడు మానవుడు ముందుగా నెక్కువస్వేచ్ఛతో, ఎక్కువ వివేకముతో తననుదానే నడుపుకొనుటకును, పిమ్మట అత్యున్నత పరమధర్మమును, పరమస్వేచ్ఛను ప్రాపించుటకును సంసిద్ధత నందును.

13. శాస్త్రము - స్వేచ్ఛ :

కారణము, తన సాధారణరూపమున శాస్త్రము పైన ప్రస్తావించిన ఆధ్యాత్మిక ధర్మము గాదు; అయితే అది తన శిఖరాగ్రమున ఆధ్యాత్మిక జీవనముయొక్క ఒక విజ్ఞానము మఱియు శిల్పము, అనగా నొక ఆధ్యాత్మిక శాస్త్ర మగును - గీతయే తన బోధనకు అత్యున్నత గుహ్యతమ శాస్త్రముగా వర్ణించుకొనును (15-20); అట్టి ఆధ్యాత్మిక శాస్త్రము సాత్త్వికప్రకృతి యొక్క స్వొఽతిక్రమణమునకు ఒక నియమమును సూత్రీకరించును,మఱియు ఆధ్యాత్మిక పరివర్తనకు నడిపించు ఒక సాధనను వివరించును. అయినను సర్వ శాస్త్రము ప్రారంభమున కొన్ని సన్నాహక నియమముల-ధర్మముల - ఆధారముపై నిర్మింపబడును; కాన అది ఒక సాధనమే గాని, సాధ్యము గాదు. పరమసాధనము భగవద్భావముయొక్క పరమ స్వాతంత్ర్యము; అంతరాత్మ సర్వధర్మములను పరిత్యజించి (18-66), తన ఏకమాత్ర కర్మనియమమునకు భగవంతుని వైపునకు దిరిగి, భగవదిచ్ఛనుండియే సరాసరి కర్మచేయుచు, భాగవత ప్రకృతియొక్క స్వాతంత్ర్యమునందు - ధర్మమునందు గాక, భగద్భావమునందు - నివసించునపుడు, ఆ పరమస్వాతంత్ర్యము సిద్ధించును. అర్జునునియొక్క తర్వాతి ప్రశ్న గీతాబోధన యొక్క ఈ పరిణామమునకే దారితీయును.

18. [1] గుణములు, శ్రద్ధ, కర్మ

1. శ్రద్ధాస్వరూపము మఱియు ప్రభావము :

కామము ననుసరించి చేయు కర్మకు, శాస్త్రము ననుసరించి చేయు కర్మకు మధ్య గీత విభేదమును జూపినది (16-23). శాస్త్ర మన సర్వసమ్మతమైన జీవనవిద్య మఱియు కళ యని మనము గ్రహించవలెను; అది మానవజాతి సామూహిక జీవనముయొక్క పరిణామము, అనగా దాని సంస్కృతి, మతము, విజ్ఞానము, అది అధికాధికముగా అన్వేషించి కనుగొను శ్రేష్ఠ జీవనప్రమాణము - కాని ఈ మానవజాతి యింకను అజ్ఞానము నందుండి జ్ఞానము దిశగా అర్థప్రకాశమున అడుగులు వేయు జాతి. కాగా, వైయక్తిక కామము ప్రేరించు కర్మ మన ప్రకృతియొక్క అసంస్కృతావస్థకు జెందిన కర్మ మఱియు నది అజ్ఞానముచేత గాని, మిథ్యాజ్ఞానము చేత గాని, మఱియు అనియంత్రిత లేక కునియంత్రిత రాజసిక అహంకారముచేత ప్రేరితమగును. పోగా, శాస్త్రనియతమగు కర్మ బౌద్ధిక, నైతిక, సౌందర్యవిషయక, సాంఘిక మఱియు ధార్మిక సంస్కృతి యొక్క పరిణామము; ఒకానొక యుక్తజీవనము, సామరస్యము, యుక్తక్రమమును సాధించు ప్రయత్నముయొక్క మూర్తీభావమే శాస్త్రము; ఇది స్పష్టముగనే పరిస్థితుల ననుసరించి న్యూనాధికముగా నగ్రగామియగు, మానవునియందలి సాత్త్వికాంశము యొక్క ఒక కృషిఫలితము. ఈ కృషి అతని రాజసిక మఱియు తామసిక అహంకారమునకు పైకిబోయి, దానిని నియమించును లేక దాని అవసర మున్నపుడు, దానిని మార్గమున నడుపును. శాస్త్ర మిట్లు ముందడుగునకు సాధనము గావున, మానవజాతి దానినే తన కర్మప్రమాణము చేసికొనవలెను గాని, తన వైయక్తిక కామముల ప్రేరణకు తలవంచగూడదు. ఇది యొక సార్వత్రిక నియమము మఱియు మానవజాతి ఎక్కడ ఎట్టి స్థిర, వికసిత సమాజవ్యవస్థను సాధించినను, అచ్చట దీనిని సదా అంగీకరించినది. శాస్త్రమునందు వ్యవస్థకు, నియమమునకు సంబంధించిన ఒక భావ ముండును, సంసిద్ధికి సంబంధించిన ఒక ఆదర్శముండును, ఇది కామముల యొక్క మార్గదర్శనమును గాదు, అపక్వప్రేరణలయొక్క ప్రాకృత ప్రచోదనయు గాదు. శాస్త్రరూపమగు నీ అధికతర నియమమును వ్యక్తి సాధారణముగా తనకు వెలుపల, మానవజాతియొక్క

[1] గీత, అధ్యాయము - 17

ప్రాయః రూఢమగు అనుభవము మఱియు జ్ఞానముల పరిణామమునందు కనుగొనును; అతని మనస్సును, అతని సత్తయొక్క ప్రముఖభాగములును దీనికి తమ సమ్మతిని లేక అనుమతి నొసంగును, అప్పు డతడు తన మనః సంకల్ప కర్మలందు ఎనిని నివసించుచు, తనదిగావించుకొన ప్రయత్నించును. కాగా సత్తయొక్క ఈ సమ్మతి, దాని సచేతన అంగీకారము, నమ్మి సాధించగోరు దాని సంకల్పము – ఈ మూడింటికి గలిపి, మనము గీత పెట్టు పేరునే పెట్టుకొనవచ్చును – "శ్రద్ధ" (17–2). ఏ మతము, తత్త్వశాస్త్రము, నైతికనియమము, సామాజికభావము, లేక సాంస్కృతికభావమునందు నాకు శ్రద్ధ యుండునో, ఉంతునో, అది నా ప్రకృతికిని, దాని కర్మలకును ఒక విధానమును జూపును, సాపేక్షన్యాయముయొక్క ఒక భావమును గాని, సాపేక్ష లేక నిరపేక్ష సంసిద్ధియొక్క ఒక భావమును గాని గలిగించును; మఱియు ఏ మేరకు నా శ్రద్ధ శుద్ధము, పూర్ణము నగునో, ఇంకను ఏ మేరకు దాని ననుసరించి జీవింప నా సంకల్పము బలముగా నుండునో, ఆ మేరకు అది చూపు లక్ష్యము కాగలను, ఆ ధర్మము యొక్క ప్రతిరూపములోనికి గాని, ఆ సంసిద్ధియొక్క ఆదర్శములోనికి గాని నన్ను నేను మలచుకొనగలను.

2. ప్రాత శాస్త్రస్థానమున క్రొత్త శాస్త్రము :

కాని మానవునియందు ఒక స్వేచ్ఛతర ప్రవృత్తియు గలదు; అది అతని కామప్రేరణయు గాదు; రూఢము, సురక్షితము నగు శాస్త్రవిధానము నవలంబించ దలంచు సంకల్పమును గాదు. తఱచుగా వ్యక్తియు, తన జీవనముయొక్క ఏ క్షణమునం దైనను సమాజమును శాస్త్రమునుండి విముఖమై, దానిపట్ల తన సహనమును విడనాడి, దానియందలి తన శ్రద్ధా సంకల్పములను గోల్పోవును, మఱియు మఱియొక ప్రమాణమును వెదకసాగును; కారణము, ఈ నూతన ప్రమాణమును యుక్తతర జీవనవిధానముగా నామోదించుటకును, సజీవతర సత్తాసత్యముగా వీక్షించుటకును అది (సమాజము) యిపుడు ఎక్కువ మొగ్గచూపును; సమాజచరిత్రలో దీనిని మనము గాంచగలము. సాంప్రదాయిక శాస్త్రము జీవశక్తిని గోల్పోయి, చిట్టెము గట్టి, రీతులు మఱియు ఆచారముల ఒక రాశిలోనికి దిగినపు, డిట్టి అన్వేషణ సంభవించవచ్చును. లేక, శాస్త్రము అపూర్ణము లేక ఆవశ్యక ప్రగతి కిక నుపయుక్తము గాదని తేలి నపు డిట్లు గావచ్చును; ఒక నూతనసత్యము, ఒక పూర్ణతర జీవనవిధానము ఇపు డనివార్య మయినది. అట్టి విధాన మిపుడు లేనిచో,

జాతిప్రయాసము గాని, జాతి యొక్క ఆశకు, ఆకాంక్షకు మూర్తీభావమగు ఒక ప్రబుద్ధ మహిత వైయక్తిక మానసము గాని దాని నావిష్కరించవలసియున్నది. ఉదాహరణకు, వైదిక ధర్మము ఒక ఆచారమాత్ర మయినపుడు, ఒక బుద్ధుడు తన అష్టాంగమార్గము మఱియు నిర్వాణగమ్యముయొక్క నూతనవిధానముతో రంగము లోనికి వచ్చును; మఱియు నత డా విధానమును తన వైయక్తిక కల్పనగా గాక, ఒక జ్ఞానదీప్త మానసము, ఒక జాగరిత అంతరాత్మ తిరిగి కనుగొనిన, ఆర్యజీవనము యొక్క సత్యవిధానముగా ప్రతిపాదించు ననుట గమనార్హము. కాని క్రియాత్మకముగా దీని అర్థ మేమన, ఒక ఆదర్శభూత, ఒక సనాతన ధర్మమున్నది; మతము, తత్త్వశాస్త్రము, నీతిశాస్త్రము, ఇంకను సత్యము మఱియు సంసిద్ధి నిమిత్తము ఉద్యమించు మానవునియందలి యితరశక్తు లన్నియు బాహ్యాభ్యంతర జీవనముయొక్క విజ్ఞానము మఱియు శిల్పమును వివరించు నూతన వాక్యములలో, అనగా ఒక నూతన శాస్త్రములో ఆ ఆదర్శ ధర్మమునకు రూపమిచ్చుటకు సదా ప్రయత్నించు చున్నవి. క్రీస్తుకు పూర్వము మోజెస్ ఏర్పఱచిన ధార్మిక, నైతిక, సామాజిక సదాచార నియమము సంకుచితము మఱియు అపూర్ణ మనియు, అది యిపుడు ఒక లోకాచారము మాత్రమే యనియు నిశ్చయింపబడును; దాని స్థానమున క్రీస్తు ధర్మము వచ్చును, మఱియు దానిని, ఏకకాలమున నేను నిరాకరించుచున్నాను, పూర్ణము చేయుచున్నా-నని చెప్పుకొనును, అనగా దాని అపూర్ణరూపమును నిరాకరించి, అది లక్షించిన సారతత్త్వమగు దివ్య జీవనవిధానమును ఒక గభీరతర, విశాలతర ప్రకాశము మఱియు శక్తి యందు పూర్ణముచేయును. మఱియు మానవుని అన్వేషణ అక్కడితో నాగదు, అది ఈ సూత్రీకరణములను సైతము విడిచివేసి, తాను నిరాకరించిన ఒక గతసత్యమును తిరిగి చేపట్టును, కాని సదా తదన్వేషణయొక్క ధ్యేయ మొక్కటియే – సంసిద్ధి ధర్మము, యుక్త జీవనవిధానము, మానవుని సంపూర్ణ, సర్వోత్తమ, మూలభూత ఆత్మ మఱియు ప్రకృతియొక్క సాక్షాత్కారము.

3. రాజసిక, సాత్త్విక అతిక్రమణములు :

ప్రస్తుత ధర్మముతో నిక తృప్తిపడని వ్యక్తితో ఈ అన్వేషణ ప్రారంభమగును; తనను మఱియు ప్రపంచమును గుఱించిన తన భావమునకును, విశాలతమ లేక ప్రగాఢతమ అనుభవమునకును ప్రస్తుతధర్మము అనురూపముగా లేదని అతడు కనుగొనును; అందుచేతనే దానిని విశ్వసించి, అనుష్ఠించు సంకల్పము అతనిలో

ముందుకు రాదు. అది తన ఆంతర సత్తావిధానమునకు అనురూపముగా నుండదు, అది తన విషయమున "సత్" (17-26) గాదు. అనగా సత్యవస్తువు, యుక్తధర్మము, ఉత్తమ లేక శ్రేష్ఠ లేక వాస్తవ హితము గాదు, అది తన లేక సర్వసత్తయొక్క సత్యమును గాదు, నియమమును గాదు, శాస్త్రము వ్యక్తికి నిర్వ్యక్తికమగు నొక వస్తువు, కావుననే అది అతని కరణముల యొక్క సంకుచిత వైయక్తిక నియమమును మించిన ప్రమాణ మగును; కాని అది అదే సమయమున సమాజమునకు సవ్యక్తిక మగును, ఏలన అది దాని అనుభవము, సంస్కృతి లేక ప్రకృతియొక్క పరిణామము. ఈ శాస్త్రము తన సమస్త రూపము మఱియు తత్త్వమునందు ఆత్మసంపూర్తికి ఆదర్శవిధానము గాని, మన ప్రకృతిప్రభువు యొక్క సనాతనధర్మము గాని కాదు; అయితే దానియందు ఆ మహత్తర వస్తువుయొక్క సూచనలు, సన్నాహములు, ప్రకాశము నిచ్చు క్షణిక దర్శనములుండవచ్చును. మఱియు వ్యక్తి సమాజదశను దాటియుండవచ్చును, అపు డతడు ఒక మహత్తర సత్యమునకు, ఒక విశాలతరగమనమునకు, ప్రాణేశ్వరుని ఒక గభీరతర ఉద్దేశ్యమునకు యోగ్యుడగును. శాస్త్రమార్గమును విడిచివేయు అతని యందలి ప్రేరణ, నిజమే, సదా ఒక ఉచ్చతర గతి కాకపోవచ్చును; అది ఆహంకారిక లేక రాజసిక ప్రకృతియొక్క తిరుగుబాటు - రూపము ధరించవచ్చును; ఈ ప్రకృతి తన స్వపరిపూర్తి మఱియు స్వదర్శనము అపేక్షించు స్వేచ్ఛకు ప్రతి బంధకముగా దోచు శాస్త్రనియంత్రణ నుండి స్వతంత్రము కాజూచును. ఇట్టి తిరుగుబాటు సైతము శాస్త్రముయొక్క ఒకానొక సంకుచితత్వము లేక అపూర్ణతచేత గాని, ప్రచలిత జీవననియమము కేవలము ఒక ప్రతిబంధక లేక నిర్జీవ లోకాచారము లోనికి దిగజాఱుటచే గాని తఱచు సమర్థనీయమే యగును. మఱియు నది సమర్థనీయమగు మేరకు, దానికి సత్యము ప్రమాణముగా నుండును, దాని మనుగడకు ఒక సాధు సముచిత కారణ ముండును. ఏలన రాజసికాహంకారము మార్గము తప్పినను, దాని విముక్త క్రియ, తనయందు స్వేచ్ఛయు, ప్రాణము నెక్కువగా నుండును గాన, లోకాచారముయొక్క నిర్జీవము, సంకుచితము నగు తామసికానుసరణముకంటెను శ్రేష్ఠము. రాజసిక ప్రకృతి సదా ప్రబలతరము, సదా అధికశక్తి ప్రేరితము మఱియు దానియందు తామసికప్రకృతి యందు కంటె ఎక్కువ సంభవనీయత లుండును. మఱియు ఈ తిరుగుబాటు - ప్రేరణ తన మూలమున సాత్త్వికము గావచ్చును; అది ఒక విశాలతర, మహత్తర ఆదర్శమునకు ఒక మలుపు గావచ్చును, అప్పు

డది ఇప్పటికి చూడబడిన దానికంటె, మన ఆత్మ మఱియు ప్రపంచముయొక్క ఒక సమగ్రతర, సమృద్ధతర సత్యమునకు మనలను ఎక్కువ సన్నిహితముగా గొని పోవును, కావుననే దివ్యస్వాతంత్ర్యముతో నేకమగు పరమధర్మమునకు ఎక్కువ సన్నిహితుల మగుదుము. మఱియు ఫలతః ఈ సాత్త్వికాతిక్రమణము మన సత్త యొక్క ఒక విస్మృతసత్యమును ఆలింగనము గావించుకొనుటో, ఇంకను చూడబడని లేక ఆచరింపబడని ఒక సత్యమునకు చేరుకొనుటో యగును. అది అనియంత్రిత ప్రకృతి యొక్క ఒక విశృంఖల అతిక్రమణము గాదు; దానికి తన ఆధ్యాత్మిక సమర్థన గలదు మఱియు నది మన ఆధ్యాత్మిక ప్రగతి కొక ఆవశ్యకత యగును. మఱియు నొకవేళ శాస్త్రము సామాన్య మానవునికి ఇంకను ఒక సజీవవస్తువు మఱియు నుత్తమ నియమమే యైనను, ఆంతరముగా వికసించిన ఆధ్యాత్మిక అసాధారణ మానవుడు ఆ ప్రమాణబద్ధుడు గాడు. రూఢమగు శాస్త్రరేఖ నతిక్రమించ నతని కాహ్వానము వచ్చును. శాస్త్రము సామాన్య మానవుని సాపేక్ష సిద్ధికి పనికివచ్చు ఒక నియమము కాగా, అసాధారణ పురుషుడు ఎక్కువ నిరపేక్ష సిద్ధికి సాగిపోవలసి యుండును; శాస్త్రము నియత ధర్మముల ఒక విధానము కాగా, అతడు పరమాత్మ స్వాతంత్ర్యమున నివసింప నేర్చుకొనవలసియున్నది.

4. సాత్త్వికశ్రద్ధా ప్రభావము :

కాని కామనిర్దేశము, సామాన్యశాస్త్రము - రెండింటిని విడిచివేసి సాగు కర్మ కిపు డేది సురక్షితాధార మగును ? ఏలన కామ విధానమునకు స్వయముగా నొక ప్రామాణ్య మున్నది; అది పశువునకు లేక బహుశః ఆదిమమానవునికివలె మనకు సురక్షితము లేక సంతృప్తికరము గాకపోయినను, తన పరిధిలో మన ప్రకృతియొక్క ఒక మిక్కిలి సజీవభాగముపై ప్రతిష్ఠితము మఱియు దాని సూచనలచే పరిరక్షితము నైయుండును; అటులే శాస్త్రాదేశము వెనుకను చిరప్రతిష్ఠిత విధానముయొక్క సర్వాధికారము, ప్రాచీన సఫల ప్రమాణములు మఱియు నొక భద్ర గతానుభవము నుండును. కాని ఈ నూతన ప్రస్థానస్వరూపము అజ్ఞాతము లేక అర్థజ్ఞాతములోనికి ఒక ప్రబలప్రవేశము, ఒక నిర్భయవికాసము, ఒక నూతనవిజయము నగును; కాని యిచ్చట అనుసరించవలసిన సూత్ర మేది ? దీని కాధారము కాగల నిర్దేశక ప్రకాశము లేక మన సత్తయందు దీని ప్రబలాధారము నేది యగును ; ఆ సూత్రము, ఆ ఆధారము మానవుని "శ్రద్ధయందు" (17-2), అనగా తాను మఱియు ప్రపంచము

యొక్క సత్యముగా చూచు లేక చింతించు దానిని విశ్వసించి, అనుష్ఠించగోరు సంకల్పము నందు లభించును. వేఱు మాటలలో ఈ ప్రవృత్తియందు మానవుడు తనకుదానే ప్రమాణ మగును, లేక తన సత్యమును, తన జీవనవిధానమును, తన సంసిద్ధి మార్గమును గనుగొనుటకు తనయందలి లేక ప్రపంచమునందలి ఒకానొక ప్రబల అనివార్య వస్తువును ప్రమాణముగా గొనును. ఇచ్చట సర్వమును అతని శ్రద్ధా స్వరూపముపై నాధారపడును, ఆ శ్రద్ధ నతడు దేనివైపునకు మఱల్చునో, ఆ శ్రద్ధచేత నతడు తన వాస్తవాత్మను, సర్వాత్మను ఏ మేరకు చేరుకొనునో దానిపై నాధారపడును. అతడు తామసికుడు, అప్రకాశుడు, ఆవృతుడునగుచో, అతని విశ్వాసము అజ్ఞానమయము, అతని సంకల్పము అకుశలము నగుచో, అత డెట్టి సత్యవస్తువును చేరుకొనక, తిరిగి నిమ్న ప్రకృతిలోనికే పడిపోవును. అటులే అతడు మిథ్యా రాజసిక ప్రకాశములచేత విమోహితుడగుచో, అతని స్వైర సంకల్పముచేతనే మహాపంకము లేక పర్వత ప్రపాతమునకు దారితీయు ఉపమార్గములలోనికి లాగివేయబడును. ఈ రెండు సందర్భములందును అతని ఏకమాత్ర రక్షణావకాశము సత్త్వముయొక్క పునఃప్రాప్తి యందే లభించును; ఏలన ఆ సత్త్వము తన కారణములపై నొక ప్రకాశమయ వ్యవస్థను, విధానమును విధించి, తన స్వైరసంకల్పముయొక్క ప్రచండ భ్రాంతి నుండియు, తన ఆవృతాజ్ఞానముయొక్క మంద భ్రాంతినుండియు నతనిని విడిపించును. అట్లు గాక, అతనికి సాత్త్విక ప్రకృతియు, పురోగతి నిమిత్తము సాత్త్విక శ్రద్ధ మఱియు నిర్దేశమునున్నచో, ఇంకను సిద్ధించని, ఒక ఉచ్ఛతర ఆదర్శ విధానము అతనికి దృగ్గోచర మగును; ఈ విధానము కొన్ని విరళసందర్భములందు, సత్త్వమున కావల, అస్తిత్వము మఱియు జీవనములయొక్క ఒక ఉచ్ఛతమ దివ్య ప్రకాశము మఱియు దివ్యమార్గము దిశగా కనీసము కొంతదూరము గొనిపోవును. ఏలన అతనియందలి సత్త్వప్రకాశము అతనిని తన స్వీయ పరాకాష్ఠకు గొనిపోవునంత బలముగా నున్నచో, అతడా స్థానమునుండి పురోగమించుచు, దివ్యము, అతీతము, నిరపేక్షమునగు దానియొక్క ఒక ప్రథమకిరణములోనికి తన ప్రవేశ ద్వారమును కనుగొన సమర్థుడగును. ఆత్మాన్వేషణయొక్క సర్వప్రయత్నము నందును ఈ సంభావ్యతలు పొడసూపును; ఇవి ఈ ఆధ్యాత్మిక సాహసముయొక్క నిబంధనలు.

5. పురుషుడు శ్రద్ధామయుడు :

ఆధ్యాత్మికోపదేశము మఱియు ఆత్మాను శాసనమునకు సంబంధించిన తన స్వీయమార్గమున గీత ఈ ప్రశ్న నెట్లు పరిష్కరించునో, మన మిపుడు చూడవలసి

యున్నది. ఏలన అర్జునుడు వెనువెంటనే వేసిన ఒక సూచక ప్రశ్నమునుండి పై సమస్య లేక దాని ఒక పార్శ్వము ముందుకు వచ్చును. మానవులు–అర్జును డడుగును – శ్రద్ధతో భగవంతునికి లేక దేవతలకు యజ్ఞము చేయుచు, శాస్త్రవిధిని మాత్రము పరిత్యజింతురేని, అపుడు వారి కీ శ్రద్ధ నిచ్చుచు, వారి నిట్టి కార్యమునకు పురికొల్పు వారి "నిష్ఠ", అనగా ఏకాగ్ర యజన సంకల్ప మేమి యగును? అది సత్త్వమా, రజస్సా, తమస్సా? అనగా నది మన ప్రకృతిగుణములలో దేనికి చెందును? (17–1). గీతాసమాధానము ముం దీసూత్ర మును ప్రతిపాదించును: ప్రకృతియందలి అన్ని వస్తువులవలెనే, మనయందలిశ్రద్ధయు త్రివిధము, అది ప్రకృతియొక్క ప్రధాన గుణమును బట్టి మాఱుచుండును (17–2). ప్రతిమానవుని శ్రద్ధయు అతని సత్తాపదార్థము, అతని సంఘటక (constituting) స్వభావము, అతని నైసర్గిక సత్త్వశక్తి దాని కిచ్చిన రూపమును, వర్ణమును, గుణమును గ్రహించును – "సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా" (17–3). మఱియు దీని తర్వాత వచ్చు ఒక అద్భుతపంక్తియందు – ఈ పురుషుడు, మానవునియందలి ఈ అంతరాత్మ, ఇంచుమించు శ్రద్ధా నిర్మితుడు – అని గీత మనకు చెప్పును – ఇచ్చట శ్రద్ధ యన ఒక విశ్వాసము, ఒక అస్తిత్వ సంకల్పము, అంతరాత్మకు తనయందును, ప్రపంచమునందును ఒక నమ్మకము; మఱియు అతని శ్రద్ధ ఏది యగునో, అతడదియే యగును, అది అతడే యగును – "శ్రద్ధామయోఽయం పురుషో, యో యచ్ఛ్రద్ధః సఏవ సః" (17–3). ఈ అర్థగర్భిత సూక్తిని ఇంచుక నిశితముగా పరిశీలింతు మేని, ఆధునిక ప్రయోగవాదముయొక్క (pragmatism) సిద్ధాంత మంతయు ఈ ఏకమాత్ర పంక్తియొక్క కొలది బలీయ పదములలో నిమిడియున్న దని కనుగొనగలము. ఏలన పురుషుడు శ్రద్ధానిర్మితుడే యగుచో, అపు డతడు దర్శించి, జీవింపగోరు సత్యము అతనికి తన సత్తయొక్క సత్యమే యగును, తాను సృజించుకొనిన, సృజించుకొనుచున్న తనయొక్క సత్యమే యగును, మఱియు నతనికి ఎట్టి ఇతర వాస్తవ సత్యము నుండజాలదు – అని తేలును. ఈ సత్యము అతని ఆంతర మఱియు బాహ్య క్రియకు సంబంధించిన వస్తువు, అతని సంభూతికి, అంతరాత్మ గతిశాస్త్రమునకు సంబంధించిన వస్తువు, అంతే కాని, అతనియందు ఎప్పటికి మాఱని తత్త్వమునకు సంబంధించినది కాదు. అతని ప్రస్తుత రూపమునకు గారణము అతని ప్రకృతియొక్క ఒక గత సంకల్పము కాగా, ఈ రూపమును తెలిసికొని, నమ్మి, బుద్ధియందును, ప్రాణశక్తియందును

తదాకారముగా నుండగోరు ప్రస్తుత సంకల్పముపై ఇప్పటి రూపము నిలబడి, కొనసాగును, మఱియు తన స్వభావమూలమునందు సక్రియముగా నున్న ప్రస్తుత సంకల్పమును, విశ్వాసమును ఏ మలుపు దిరుగునో, అతడు భవిష్యత్తునందు తద్రూపములోనికి పరిణమించును. మనః ప్రాణముల మన స్వీయ కర్మయందు మనము మన స్వీయ జీవనసత్యమును సృజించుకొందుము, అనగా మనమే మన స్వీయ స్వరూపములను నిర్మించుకొందుము; మనమే మన స్వీయ నిర్మాతలము.

6. సంభూతిసత్యము – సత్తాసత్యము :

కాని యిది మిక్కిలి స్పష్టముగా సత్యముయొక్క ఒక పక్షము మాత్రమే మఱియు పాక్షిక ప్రతిపాదన లన్నియు మేధావికి సందేహాస్పదములు. మన స్వీయ వ్యక్తిత్వమేదిగా నున్నదో లేక దేనిని సృజించునో, అది మాత్రమే సత్యము గాదు; అది మన సంభూతిసత్యము మాత్రమే, ఒక విశాలతమ గతియందు ఒక విస్పష్ట బిందువు లేక రేఖ మాత్రమే. మన వ్యక్తిత్వమున కావల, ముందు, ఒక వైశ్వ సత్తయు, ఒక వైశ్వ సంభూతియు గలదు; మన సంభూతి ఈ సంభూతియొక్క ఒక స్వల్పవృత్తి. మఱియు దానికావల సైతము నిత్యసత్త గలదు, దీనినుండియే సమస్త సంభూతియు ప్రవర్తించును (10–8) మఱియు ఈ సంభూతియొక్క శక్యతలు, తత్త్వములు, మూల మఱియు చరమ హేతువులు దీనికే చెందును. అయినను మన మిట్లు చెప్పవచ్చును : సంభూతి యంతయు వైశ్వచేతన యొక్క ఒక చేష్ట మాత్రమే, అది మాయ, సంభూతిసంకల్పముయొక్క ఒక సృష్టి; మఱియు ఏ యితర సద్వస్తువైన యున్నచో, అది చేతన కావలనుండు, నిరాకారము, అవర్ణితము, అవర్ణనీయమునగు ఒక శుద్ధ సనాతన సత్త యగును. ఇదియే వస్తుతః మాయావాది అవలంబించు దృక్కోణము, మఱియు నిదియే ఒక వైపున మాయామయ లేక తాత్కాలికమగు వ్యావహారిక సత్యమునకును, రెండవ వైపున మాయాతీత అద్వితీయ నిర్విశేష బ్రహ్మమునకును మధ్య అతడు చేయు విభేదముయొక్క ఆశయము, కాగా ఆధునిక వ్యావహారిక వాదము సంభూతినే యథార్థ సత్యముగా, కనీసము గుర్తించదగిన ఏకమాత్ర సద్వస్తువుగా తీసికొనును, ఏలన అదియే తెలిసికొని, వ్యవహరించదగిన ఏకమాత్ర సద్వస్తువు. కాని గీతాదృష్టిలో పరబ్రహ్మము పరమ పురుషుడు గూడను (10–12), మఱియు పురుషుడు సదా ఒక సచేతన ఆత్మ యగును; అయితే ఇతని సర్వోన్నత చేతన – దీనినే అతిచేతన యని చెప్పవచ్చును

- అటులే మనము అవచేతన యని పిలుచు ఇతని నిమ్నతమ చేతన - ఈ రెండును మనము దేనిని మాత్రమే చేతన యని పిలుచుట కలవడి యున్నామో, అట్టి మనశ్చేతనకంటె మిక్కిలి భిన్నము. ఆ పరమ అతిచేతనయందు అమృతత్త్వము యొక్క ఒక పరమ సత్యము మఱియు ధర్మము గలదు, ఒక మహత్తమ దివ్యస త్త్వాప్రకారము, అనగా సనాతన అనంతముయొక్క వస్తుప్రకారము గలదు. ఆ సనాతన జీవనవిధము మఱియు దివ్యసత్త్వాప్రకారము పురుషోత్తముని నిత్యతయందు ఉండనే యున్నది, కాని, దాని నిక్కడ మన మిపుడు మన సంభూతియందు సైతము యోగము ద్వారా సృజింప యత్నించుచున్నాము. మన ప్రయత్న మంతయు భగవంతు డగుటకే, అతనివలె నుండుటకే-"మద్భావ" (17-19). ఆ ప్రయత్నము శ్రద్ధపై నాధారపడును. మన సచేతన సత్త్వముయొక్క కర్మచేతను, భగవద్భావసత్యమునందు నమ్మకముచేతను, దానిని జీవించుటకు లేక అదిగా నుండుటకు ఒక ఆంతరతమ సంకల్పముచేతను భగవద్భావము ప్రాప్తమగును. దాని నిక పొంద నున్నాము గాన, అది యిప్పటికే పరమున లేదని అర్థము గాదు. దానిని దర్శించి, దానిలోనికి క్రొత్తగా మనలను సృజించుకొనువఱకు అది మన బాహ్యమనస్సునకు లేనిదే యైనను, అది సనాతనుని యందు ఉండనేయున్నది మఱియు నిప్పటికే అది మన రహస్యాత్మ యందు ఉన్న దని సైతము చెప్పుకొనవచ్చును; ఏలన మనయందు గూడ - మన లోతులయందు - పురుషోత్తముడు సదా ఉండనేయున్నాడు. కాగా భగవద్భావము లోనికి మన సంవర్ధనము, దానిని మనము సృజించుట యన అతనియొక్కయు, దానియొక్కయు మనయం దభివ్యక్తియే యగును. సమస్త సృష్టియు, అది నిజానికి సనాతనపురుషుని సచేతన సత్త్వమునుండి ప్రవర్తించును గాన, అతనియొక్క ఒక అభివ్యక్తియే యగును, మఱియు ప్రవర్తకచేతనయగు చిచ్ఛక్తియందలి ఒక విశ్వాసము, అంగీకారము, అస్తిత్వసంకల్పముచేత ప్రవర్తించును.

7. సర్వసాధనలోను తపో దాన యజ్ఞములు :

కాని మన ప్రస్తుత విషయము దార్శనిక విచారణ గాదు, మన సత్తయందలి ఈ సంకల్పము లేక శ్రద్ధకు, దివ్యప్రకృతి యొక్క సంసిద్ధిలోనికి పెరుగుటకు గల మన సంభావ్యతతో నుండు సంబంధము మన ప్రస్తుత విషయము. ఎట్టి సంసిద్ధి కైనను ఈ శ్రద్ధారూప శక్తియే ఆధారము. మన కోరికల ననుసరించి జీవించుచు, కర్మచేయుచు, తద్రూపమున నుండు నపుడు, అది మన ప్రాణిక మఱియు భౌతిక,

తామసిక మఱియు రాజసిక ప్రకృతికి జెందిన శ్రద్ధయొక్క ఒక పట్టువీడని చర్య యగును. తర్వాత, మనము శాస్త్రము ననుసరించి వర్తింప, జీవింప మఱియు కర్మచేయ ప్రయత్నించు నపుడు, అదియు పట్టు వీడని ఒక శ్రద్ధాచర్యయే యగును, అయితే ఈ శ్రద్ధ – అది గతాను గతిక శ్రద్ధ గాదేని – సాత్త్వికప్రవృత్తికి జెందినదగును, ఏలన ఈ ప్రవృత్తి మన రాజసిక, తామసిక భాగాలపై తన శాసనమును విధింప సదా పరిశ్రమించుచుండును. పోగా ఈ రెండింటిని విడిచి, మనము స్వయముగా గనుగొనిన లేక వైయక్తికముగా నామోదించిన ఒక ఆదర్శమున లేక సత్యముయొక్క ఒక నూతన భావన ననుసరించి జీవింప, కర్మచేయ మఱియు తద్రూపముగా నుండ ప్రయత్నించు నపుడు, అదియు పట్టువీడని ఒక శ్రద్ధాచర్యయే యగును, అయితే ఈ శ్రద్ధ, మన ప్రతి ఆలోచనను, సంకల్పమును, భావమును, కృత్యమును సదా నియమించుచుండు త్రిగుణములలో దేని ప్రభావమునకైనను లోనుగావచ్చును. చివరకు దివ్యప్రకృతి ననుసరించి వర్తింప (to be), జీవింప మఱియు కర్మచేయ ప్రయత్నించు నపుడు, అపుడు సైతము మనము పట్టువీడని ఒక శ్రద్ధాచర్యను బట్టియే సాగవలెను; కాగా ఈ శ్రద్ధ గీతామతమున, తన పరాకాష్ఠవఱకు బ్రాపించి, తన స్వీయ సునిర్దిష్ట పరిమితులను దాటిపోవ నాయత్తమగు సాత్త్విక ప్రకృతికి జెందిన శ్రద్ధ యగును (18–20). కాని ఈ శ్రద్ధ లన్నియు, ప్రతి శ్రద్ధయు ప్రకృతి యొక్క ఒక గతిని లేక అవస్థాంతరమును సూచించును, అన్నియు ఒక ఆంతర లేక బాహ్య లేక ఉభయవిధ క్రియ నపేక్షించును. అయితే ఈ క్రియాలక్షణ మేమి యగును? గీత మన "కర్తవ్య కర్మ" యొక్క మూడు ప్రధాన భాగములను జెప్పును, ఇవి యజ్ఞము, దానము మఱియు తపము (17–27). ఏలన బాహ్యసన్యాసమునకు మఱియు ఆంతరసన్యాసము నకు – "సన్యాసమునకు మఱియు త్యాగమునకు" (18–1) గల భేదమును అర్జునుడు తెలిసికొనగోరి నపుడు, యజ్ఞ దాన తపములను ఎంతమాత్రము పరిత్యజించరాదు, వానిని సర్వథా చేయుచుండదగును, కారణము, అవి మన "కర్తవ్యం కర్మ", అవి ప్రాజ్ఞులను పావనముచేయును – అని కృష్ణుడు పట్టుబట్టును(18–5). వేఱు మాటలలో, ఈ కర్మలు మన సంసిద్ధిసాధనములు. కాని వీనిని అజ్ఞులు అజ్ఞానముతోనో, అపూర్ణ జ్ఞానముతోనో చేసి నపు డా ఫల ముండదు. సర్వ ప్రగతిశీల క్రియను తన మూలమునందు ఈ మూడు అంశముల లోనికి విభజించవచ్చును. ఏలన ప్రకృతి యొక్క సమస్త గతిశీల క్రియయందును

సైతము అది పశువుల వలె నామోదించును (17-10). ఈ త్రిగుణ సూత్రము సర్వానుగతము. గుణములు, రెండవ కొసను, అదే విధముగా, మనస్సు మఱియు ఆత్మకు సంబంధించిన వస్తువులకును, విశేషించి యజ్ఞదాన తపములకును వర్తించును. కాగా గీత ఈ మూడింటిలో ప్రతిదానికిని గుణభేదముచేత మూడు రూపములను వివేచించును, ఈ వివేచనయందు గీత ప్రాచీన భారతీయ ప్రతీక వాదము (symbolism) ననుసరించును. కాని గీత యజ్ఞ భావమున కిచ్చు విశాలార్థమును గమనించి, ఈ ప్రతీకవాదముయొక్క సంకేతముల బాహ్యార్థమును విస్తృతపఱచి, ఒక విముక్తతర మర్మములోనికి వాని ద్వారము నెంతయు తెఱవ వచ్చును. మఱియు వానిని తమస్సునుండి సత్త్వమువఱకు, వ్యతిరేకక్రమమున విచారించుట అనుకూలముగా నుండును; ఏలన మన నిమ్న ప్రకృతిలోపలనుండి వెలువడి, ఒక విశిష్ఠ సాత్త్విక పరిసమాప్తి మఱియు స్వ-అతిక్రమణముద్వారా దివ్యప్రకృతి మఱియు గుణాతీతక్రియలోనికి ఎట్లు ఆరోహహించగలమో మన మిపుడు విచారించుచున్నాము.

9. విధిహీన తామసికయజ్ఞము :

దేనిని మనము విశ్వాసము వినా, అనగా నెట్టి పూర్ణ సచేతన భావము, అంగీకారము మఱియు సంకల్పము వినా ప్రకృతి బలాత్కారముచేత చేయుదుమో, అది తామసిక యజ్ఞము (17-13). చేయక పోవుటచేత సంభవించగల ఒకానొక అధికతర బాధను తప్పించుకొనుటకో, తదితర తామసిక హేతువుచేతనో, తామసిక యజ్ఞము యాంత్రికముగా చేయబడును; జీవన వ్యాపారమే దానిని విధించును గాన, అది స్వయముగా మనచేతికి వచ్చును గాన మఱియు దాని నితరులును చేయుదురు గాన, అది చేయబడును. మనలో నీ తామసిక స్వభావము నిండుగా నున్నచో, అసావధానముగా, నిరుత్సాహముగా, అయుక్తమార్గమున దానిని చేయుట సంభవించగలదు. అది సరియగు శాస్త్రవిధి ననుసరించి నిర్వర్తించబడదు; (దీని విస్తృతార్థము) జీవనముయొక్క కళ మఱియు విజ్ఞానము, అటులే కర్తవ్యకర్మయొక్క యథార్థవిజ్ఞానము నిర్ణయించు సత్యపద్ధతి ననుసరించి అది నిర్వర్తింపబడదు (17-13). ఇట్టి యజ్ఞమున అన్నదాన ముండదు (17-13) – ఆ దానము భారతీయ కర్మకాండమునందు, వాస్తవ యజ్ఞరూపమగు ప్రతిక్రియయందును అంతర్నిహితముగా నుండు సహాయక దానముయొక్క వివిధ రూపములకు ప్రతీక యగును, ఇది యితరులకు చేయబడు అపరిహార్య దానము, ఇతరులకు, ప్రపంచమునకు నివ్వబడు ఫలప్రద సాహాయ్యము; ఇది లేనిచో, మన క్రియ సర్వథా స్వవిషయక మగును,

సైతము అది పశువుల వలె నామోదించును (17-10). ఈ త్రిగుణ సూత్రము సర్వానుగతము. గుణములు, రెండవ కొసను, అదే విధముగా, మనస్సు మఱియు ఆత్మకు సంబంధించిన వస్తువులకును, విశేషించి యజ్ఞదాన తపములకును వర్తించును. కాగా గీత ఈ మూడింటిలో ప్రతిదానికిని గుణభేదముచేత మూడు రూపములను వివేచించును, ఈ వివేచనయందు గీత ప్రాచీన భారతీయ ప్రతీక వాదము (symbolism) ననుసరించును. కాని గీత యజ్ఞ భావమున కిచ్చు విశాలార్థమును గమనించి, ఈ ప్రతీకవాదముయొక్క సంకేతముల బాహ్యార్థమును విస్తృతపఱచి, ఒక విముక్తతర మర్మములోనికి వాని ద్వారము నెంతయు తెఱవ వచ్చును. మఱియు వానిని తమస్సునుండి సత్త్వమువఱకు, వ్యతిరేకక్రమమున విచారించుట అనుకూలముగా నుండును; ఏలన మన నిమ్న ప్రకృతిలోపలనుండి వెలువడి, ఒక విశిష్ఠ సాత్త్విక పరిసమాప్తి మఱియు స్వ-అతిక్రమణముద్వారా దివ్యప్రకృతి మఱియు గుణాతీతక్రియలోనికి ఎట్లు ఆరోహహించగలమో మన మిపుడు విచారించుచున్నాము.

9. విధిహీన తామసికయజ్ఞము :

దేనిని మనము విశ్వాసము వినా, అనగా నెట్టి పూర్ణ సచేతన భావము, అంగీకారము మఱియు సంకల్పము వినా ప్రకృతి బలాత్కారముచేత చేయుదుమో, అది తామసిక యజ్ఞము (17-13). చేయక పోవుటచేత సంభవించగల ఒకానొక అధికతర బాధను తప్పించుకొనుటకో, తదితర తామసిక హేతువుచేతనో, తామసిక యజ్ఞము యాంత్రికముగా చేయబడును; జీవన వ్యాపారమే దానిని విధించును గాన, అది స్వయముగా మనచేతికి వచ్చును గాన మఱియు దాని నితరులును చేయుదురు గాన, అది చేయబడును. మనలో నీ తామసిక స్వభావము నిండుగా నున్నచో, అసావధానముగా, నిరుత్సాహముగా, అయుక్తమార్గమున దానిని చేయుట సంభవించగలదు. అది సరియగు శాస్త్రవిధి ననుసరించి నిర్వర్తించబడదు; (దీని విస్తృతార్థము) జీవనముయొక్క కళ మఱియు విజ్ఞానము, అటులే కర్తవ్యకర్మయొక్క యథార్థవిజ్ఞానము నిర్ణయించు సత్యపద్ధతి ననుసరించి అది నిర్వర్తింపబడదు (17-13). ఇట్టి యజ్ఞమున అన్నదాన ముండదు (17-13) - ఆ దానము భారతీయ కర్మకాండమునందు, వాస్తవ యజ్ఞరూపమగు ప్రతిక్రియయందును అంతర్నిహితముగా నుండు సహాయక దానముయొక్క వివిధ రూపములకు ప్రతీక యగును, ఇది యితరులకు చేయబడు అపరిహార్య దానము, ఇతరులకు, ప్రపంచమునకు నివ్వబడు ఫలప్రద సాహాయ్యము; ఇది లేనిచో, మన క్రియ సర్వథా స్వవిషయక మగును,

మఱియు సంఘీభావ, పరస్పరవినిమయము లను నిర్ణయించు యథార్థ వైశ్యధర్మము యొక్క ఒక ఉల్లంఘన మగును. మఱియు ఆ కర్మ దక్షిణ యివ్వకయే చేయబడును – దక్షిణ యన యజ్ఞక్రియను నడుపు పురోహితుల కిచ్చు దానము లేక ఆత్మదానము; ఈ పురోహితుడు మన కర్మయొక్క బాహ్య నిర్దేశకుడు మఱియు సహాయుడు గాని, మనలోపలి ఆవృత లేక అభివ్యక్త భగవంతుడు గాని కావచ్చును. అటులే తామస యజ్ఞము మంత్రహీనముగా చేయబడును–మంత్ర మన, యజ్ఞముచే మన ముపాసించు దేవతాభిముఖముగా నుద్ధరించ బడిన మన సంకల్పజ్ఞానముల పవిత్రశరీరమగు సమర్పణాత్మక ఆలోచన. తామసిక మానవుడు తన యజ్ఞమును దేవతలకు గాక, స్థూలతర ప్రేతముల కర్పించును (17–4)–ఈ ప్రేతములు తెరవెనుకనుండి అతని కర్మలను భక్షించుచు, అంధకారమును కల్పించి, అతని జీవితమును శాసించును.

10. రాజసిక సాత్త్విక యజ్ఞములు :

రాజసిక మానవుడు తన యజ్ఞమును అపర దేవతలకు గాని, దుష్టశక్తులు, విత్తపాలకులు నగు యక్షులకు గాని, ఆసురిక మఱియు రాక్షసిక బలములకు గాని అర్పించును (17–4). అతని యజ్ఞము బాహ్యముగా శాస్త్రము ననుసరించి చేయబడినను, దాని ఆంతరహేతువు దంభము, గర్వము లేక కర్మఫలముపట్ల ప్రబల కామము, తన కర్మయొక్క ప్రతిఫలము నిమిత్తము గట్టి పట్టు (17–12). కావున ప్రచండము లేక ఆహంకారికమగు వైయక్తిక కామము నుండి గాని, స్వీయ ప్రయోజనార్థము ప్రపంచముపై తనను విధించుకొన జూచు దాంభిక సంకల్పము నుండి గాని ప్రవర్తించు కర్మ యంతయు రాజసికమే యగును – ప్రకాశలాంఛనముల వేషము వేసికొన్నను, బాహ్యానికి యజ్ఞరూపమున నది చేయబడినను, దాని స్వభావము రాజసికమే. పైకి అది భగవంతునికి లేక దేవతలకు అర్పింపబడినను, అది వస్తుతః ఆసురిక క్రియయే యగును. మన కర్మల మూల్యము మన ఆంతరిక అవస్థ, ప్రేరణ మఱియు నిర్దేశమును బట్టియే యుండును గాని, పైకి కన్పించు దిశను బట్టి మాత్రమే యుండదు; ఆ కర్మల ప్రమాణీకరణమునకు మనము పిలుచు భగవన్నామములను బట్టియు నుండదు, చివరకు కర్మాచరణము నందు మనలను సమర్థించుచున్ననట్లు గన్పించు విశుద్ధ బౌద్ధిక విశ్వాసమును బట్టి సైతము నుండదు. ఎక్కడెక్కడ మన కర్మలయందు అహంకారప్రాబల్య ముండునో, అచ్చటవి రాజసిక యజ్ఞమగును. దీనికి ప్రతిగా, యథార్థ సాత్త్విక యజ్ఞము మూడు లక్షణముల చేత గుర్తించబడును,

అవియే దాని స్వరూపమును మౌనముగా చెప్పు ముద్రయగును. ఒకటి, అది ఒక కార్యసాధక సత్యముచేత ప్రేరితమగును, శాస్త్రవిధి ననుసరించి ఆచరింపబడును, అనగా సముచిత సూత్రము ననుసరించి యథాయథ పద్ధతి మఱియు విధి ననుసరించి, మన కర్మయొక్క యథార్థ లయ క్రమము మఱియు నియమము ననుసరించి, వాని సత్యవృత్తి, వాని ధర్మము ననుసరించి ఆచరింపబడును (17-11). దీని అర్థమేమన, బుద్ధియు, ప్రబుద్ధ సంకల్పమును - కర్మసోపానములు మఱియు వాని ప్రయోజనముయొక్క నిర్దేశకములు, నిర్ణాయకములు నగును. రెండవది, సత్యయజ్ఞముగా చేయవలసిన కర్మభావముపై మనస్సును కేంద్రీకరించి, స్థిరపఱచి, సాత్త్వికయజ్ఞము చేయబడును; దీనిని మన జీవనమును శాసించు ఒక దివ్యధర్మము మనపై విధించును, కావుననే అది ఒక సమున్నత ఆంతర బాధ్యత లేక అపరిహార్య సత్యముచేత మఱియు వైయక్తిక ఫలముపట్ల కామము వినా ఆచరింపబడును - కర్మప్రేరణయు, దానియందు ప్రయోగించబడిన శక్తిస్వభావమును ఎంతెంత నిర్వ్యక్తికమో, ఆ కర్మప్రకృతి అంతంత సాత్త్వికము. మఱియు చివరిది, ఈ సాత్త్వికయజ్ఞము అశేషముగా దేవతల కర్పించ బడును (17-4); అది వారికి స్వీకారయోగ్య మగును, వారి ద్వారానే ఈశ్వరుడు జగత్తును శాసించును, కారణము, వారు జగదీశ్వరుని అవరకరూపములు మఱియు వ్యక్తిత్వములు.

11. యజ్ఞాదర్శము, యజ్ఞాతిక్రమణము :

ఇట్లే సాత్త్వికయజ్ఞము యజ్ఞాదర్శమును మిక్కిలి సమీపించును, మఱియు గీత అపేక్షించు చరమ కర్మకు మనలను సరాసరి కొనిపోవును; కాని తదార్శము చరమ, సర్వోన్నత ఆదర్శమును గాదు, ఆ కర్మ యింకను దివ్యప్రకృతియందు నివసించు పరిపూర్ణ మానవుని కర్మయును గాదు. ఏలన అది యొక నియతధర్మముగా నిర్వహింపబడుచున్నది మఱియు నది ఒక యజ్ఞముగానో, సేవగానో దేవతలకు, అనగా మనయందు లేక ప్రపంచము నందు అభివ్యక్తమైన భగవంతునియొక్క ఒక ఆంశిక శక్తికి లేక పార్శ్వమునకు అర్పించబడుచున్నది. నిస్స్వార్థ మతవిశ్వాసముచేతనో, స్వార్థరహితముగా మానవ జాతినిమిత్తమో, ధర్మము లేక సత్యముపట్ల గల నిష్ఠవలన నిర్వ్యక్తికముగానో అనుష్ఠింపబడు కర్మ మన సంసిద్ధి కావశ్యకము. కారణము, అది మన బుద్ధిని, సంకల్పమును, మన ప్రాకృతద్రవ్యమును పావనముచేయును (18-5). కాని మనము అందుకొనవలసిన సాత్త్వికక్రియయొక్క

పరాకాష్ఠ ఈ కర్మకంటెను గూడ విస్తృతతరము, విముక్త తరము నగు కోవకు జెందును; అది తన సమగ్ర సత్తయందలి పరభగవంతుని కర్పింపబడు సమున్నత చరమ యజ్ఞము; పురుషోత్తముని బొందగోరియో, సర్వమునందును వాసుదేవుని దర్శించియో చేయబడు యజ్ఞము; అది లోకహితార్థము, విశ్వమునందలి భగవత్సంకల్ప పరిపూరణార్థము నిర్వ్యక్తికముగా, విశ్వవ్యాపకముగా చేయబడు విశిష్టక్రియ. సత్త్వముయొక్క ఆ పరాకాష్ఠప్రాప్తి స్వాతిక్రమణమునకు, అమరధర్మమునకు (14-27) దారితీయును. ఏలన అపుడు లభించు విముక్తియందు వైయక్తిక క్రియ యేమాత్రము నుండదు, సాత్త్విక ధర్మవిధి యుండదు, శాస్త్ర పరిమితత్వ ముండదు; హీనతర బుద్ధి మఱియు సంకల్పము స్వయముగా అతిక్రాంతము లగును మఱియు నప్పుడవి గాక, ఒక ఉచ్చతర జ్ఞానము కర్మ నాదేశించి నడుపుచు, దాని నప్రతిహతముగా లక్ష్యమునకు గొనిపోవును. ఇచ్చట వైయక్తిక ఫలముయొక్క ప్రశ్నయే యుండదు; ఏలన ఇచ్చట పనిచేయునది మన సంకల్పము గాదు. ఒక పరమ సంకల్పము, దానికి అంతరాత్మ ఒక ఉపకరణమాత్రము. ఇచ్చట స్వార్థపరతయు నుండదు, స్వార్థరాహిత్యము నుండదు; ఏలన భగవంతుని సనాతనాంశమగు జీవుడు తన జీవభావముయొక్క అత్యున్నతాత్మతో యుక్తుడగును మఱియు నతడును, అందరును తదాత్మ మఱియు పురుషునియందు ఏకముగా నుందురు. ఆ స్థితియందు వైయక్తిక క్రియ యుండదు, ఏలన సర్వకర్మలు మన కర్మప్రభువునందు అర్పించబడినవి (3-30) మఱియు దివ్యీకృత ప్రకృతిద్వారా యిపుడు కర్మ చేయున దతడే. ఇపుడు యజ్ఞముసైతము నుండదు - అయినను, యజ్ఞప్రభువు జీవునియందలి తన శక్తి యొక్క కర్మలను తన స్వీయ విశ్వరూపము నందలి తననే అర్పించుకొనుచున్నాడని చెప్పిన చెప్పవచ్చును. ఇది యజ్ఞరూప కర్మ చేత ప్రాప్తించు పరమ స్వాతిక్రమణస్థితి, ఇది దివ్యప్రకృతిలో తన పూర్ణచేతనను ప్రాపించిన అంతరాత్మయొక్క పరిపూర్ణ స్థితి.

12. తామసిక, రాజసిక తపస్య :

ఏ తపస్య ఒక అజ్ఞానావృత మూఢ భావముతో, తన మోహమునందు కఠినము, మూర్ఖము నగు భావముతో ఆచరింప బడునో, ఒక ప్రియ అసత్యమునందు గల అజ్ఞ శ్రద్ధచే సాగించబడునో, అది తామసిక తపస్య (17-19); ఒకానొక సంకుచిత నీచ అహంకారిక ప్రయోజన మపేక్షించి, తనపై ప్రయాసదుఃఖములను విధించు

కొనుచు నిర్వర్తింపబడును, ఎట్టి సత్య లేక ఉదార లక్ష్యముతోను దీనికి సంబంధ ముండదు; అథవా ఇతరుల కపకార మొనరించు సంకల్పమునందు శక్తిని కేంద్రీకరించి చేయబడును. ఇట్టి శక్తి ప్రయోగమును తామసికము గావించున దెట్టి జడతా (inertia) తత్త్వమును గాదు, ఏలన జడత తపస్యకు విజాతీయము; పరంతు అది మనస్సు మఱియు ప్రకృతియం దుండు ఒక అంధకారము, ఆచరణయం దుండు ఒక నీచ సంకుచితత్వము, లేక లక్ష్యము నందు గాని, ప్రేరకభావమునందు గాని యుండు ఒక పాశవిక ప్రవృత్తి లేక కామము. పోగా, పూజా సత్కారముల నిమిత్తము, వ్యక్తిగత గౌరవము, బాహ్యయశము మఱియు మహత్త్వము నిమిత్తము లేక అహంకారిక సంకల్పము మఱియు నభిమానములయొక్క అనేకానేక హేతువులలో నొకదానివలన ప్రారంభించబడునవి రాజసిక తపోవిధానములు (17-18). ఈ తపోవిధానము ప్రత్యేక నశ్వర ప్రయోజనములకు వినియోగింపబడును. దీనివల్ల భగవన్ముఖ సంవృద్ధికిని, సంసిద్ధికిని ఎట్టి లాభము చేకూరదు, ఈ తపమునం దెట్టి, స్థిర సహాయక సూత్రము నుండదు, దీని శక్తి చలము, అధ్రువము నగు సందర్భముతో ముడివడియుండును, స్వయముగా గూడ నది చలము, అధ్రువము (17-18). ఒకవేళ దీనియందు చూచుట కొక ఎక్కువ అభ్యంతరము మఱియు నున్నతము నగు ఉద్దేశ్యము గన్పించినను, దీని విశ్వాస సంకల్పములు ఉచ్ఛతరకోటికి జెందిన వైనను, ఎట్టి దంభము లేక దర్పము లేక ప్రచండ స్వీయేచ్ఛ లేక ప్రబలకామమైనను దీనియందు ప్రవేశించినచో, అపుడు సైతము అది ఒక వివేకహీన, ఒక ఆసురిక, ఒక రాజసిక లేక రాజసిక - తామసిక తపస్యయే యగును (17-5); అటులే అది శాస్త్రవిరుద్ధమగు ఒక ప్రచండ నియమ శూన్య లేక భయంకరక్రియను నడుపునేని, అది జీవన కర్మల యదార్థ నియమమును ప్రతిఘటించుచు, తనకును, ఇతరులకును బాధాకరమగు నేని, ఆత్మ పీడన మార్గమును బట్టి, మానసిక ప్రాణిక దైహిక తత్త్వములను హింసించు నేని, లేక మనలోపల ఆంతర సూక్ష్మశరీరమున ఆసీనుడై యున్న భగవంతుని పీడించు నేని, అపుడు సైతము దానిని రాజసిక తపస్య యనియే ఎఱుంగుము (17-6).

13. సాత్త్విక తపస్య, ఆత్మిక తపస్య :

ఏ తపస్య ఉచ్ఛతమ ప్రబుద్ధ విశ్వాసముతో, హృదయాంతరాళమున అంగీకరించిన ఒక కర్తవ్యముగా చేయబడునో అది సాత్త్విక తపస్య; ఇది ఒకానొక

డిక తపస్య ఆవశ్యకత యుండదు, కారణము, అచ్చటంతయు (మన తపము గాక) సహజ సులభ దివ్య తపమే యగును. అచ్చట నిమ్నతర శక్తి విధానము యొక్క ఎట్టి పృథగాయాసము నుండదు, ఏలన ప్రకృతిశక్తి అచ్చట పురుషోత్తముని యొక్క అతీత సం కల్పమునందు తన మూలమును, ఆధారమును కనుగొనిన దగును. అపుడు, కర్మప్రారంభము ఆ సంకల్పమునకే జెందును గాన, నిమ్నస్తరములందు సైతము ఈ శక్తిక్రియలు ఒక అంతర్జాత పరిపూర్ణ సంకల్పమునుండి ప్రవర్తించును, ఒక అంతర్వర్తి పరిపూర్ణ మార్గనిర్దేశమును బట్టి కొనసాగును. ఇప్పటి ధర్మముల ఎట్టి పరిమితియు నచ్చటుండదు; ఏలన అచ్చటి విముక్త క్రియ రాజసిక, తామసిక ప్రకృతి కెంతో పైన చెలంగుటయే గాక, సాత్త్విక క్రియానియమముయొక్క అతి జాగరూక మఱియు సంకుచిత పరిమితుల కెంతో ఆవల విలసిల్లును.

14. దానము, సృష్టిరహస్యము :

తపస్య వలెనే సమస్త దానమును అజ్ఞ తామసికము, దాంభిక రాజసికము లేక నిస్స్వార్థ జ్ఞానదీప్త సాత్త్వికమునై యుండును. తామసిక దానము దేశకాలపాత్రముల సముచిత చింతన లేకయే, అజ్ఞానముతో చేయబడును; అది ఒక బుద్ధిహీన, అనాలోచిత, నిజానికి ఒక స్వార్థపూర్ణక్రియ యగును, అది ఒక అనుదార నికృష్ట త్యాగము, అది సానుభూతి లేక యథార్థ దానగుణము లేకయే యివ్వబడును, అది గ్రహీత చిత్తమును ఆదరించక చేయబడును గాన, అతడు స్వీకరించినను దాని నేవగించుకొనును (17-22). పోగా, విచారము, వైముఖ్యము లేక బాధతో, లేక ఒక వైయక్తిక మఱియు అహంకారిక ఉద్దేశ్యముతో, లేక ఎచ్చటినుండియైన ఎట్టి ప్రత్యుపకారమునైన ఆశించి, లేక గ్రహీతనుండి తుల్య లేక అధికలాభమును బొందగోరి చేయబడు దానము రాజసికము (17-21). చివరకు యుక్తబుద్ధితోను, యుక్తసంకల్పముతోను, సహానుభూతితోను సముచిత దేశకాలములందు, సముచిత వ్యక్తికి గాని, ఆ దానము నిజముగా నుపయోగపడగల వ్యక్తికిగాని అర్పించబడు దానము సాత్త్విక దాన మగును (17-20). ఇచ్చట, ధర్మము గనుకను, హితకామనచేతను ఈ దాన మాచరింపబడును, దాన గ్రహీత పూర్వము తనకు చేసిన లేక యిక చేయనున్న లాభదృష్ట్యా ఈ దానము చేయబడదు, ఈ దానహేతువు ఎట్టి వైయక్తిక ప్రయోజనము గాదు. ఈ సాత్త్విక దాన ప్రకారము తన పరాకాష్ఠయందు ఇతరులకును, ప్రపంచమునకును, భగవంతునికిని ఒక

అధికాధిక ఆత్మప్రదానప్రక్రియయందు పరిణమించును - "ఆత్మదానం, ఆత్మసమర్పణం". ఇదియే గీత విధించిన కర్మయజ్ఞముయొక్క సమున్నత నివేదనము. మఱియు సత్త్వమును సైతము దాటి దివ్యప్రకృతియందు నెలకొనుట ఆత్మదానము యొక్క ఒక మహత్తమ పరిపూర్ణతయే యగును - ఈ ఆత్మదానము సృష్టి యొక్క విశాలతమ అర్థముపై నాధారపడి చెలంగును. భగవంతుడు తనను, తన శక్తులను అర్పించుకొనుటచేతనే, అతని ఆత్మయు, సత్తయు సర్వభూతములలోనికి విరివిగా ప్రవహించుచుండుటచేతనే ఈ బహువిధ ప్రపంచము జనించి, నిరంతరము నిలచియున్నది. విశ్వ-అస్తిత్వము పరమపురుషుని యజ్ఞ మని వేదము చెప్పును. సంసిద్ధి బొందిన అంతరాత్మయొక్క సర్వక్రియ సైతము అటులే తన మఱియు తన శక్తులయొక్క ఒక సంతత దివ్య ఆత్మదానమే యగును; భగవంతునియందును, అతని ప్రభావ బహిఃప్రవాహములచేత అంతరాత్మ తాను పొందిన జ్ఞానప్రకాశములను, ప్రేమానందములను, సహాయక శక్తిబలములను నలుదిశల ప్రవహింపజేయును, లేక భూతములకు తమ సామర్థ్యమును బట్టి వానిని పంచును. అది మన జీవన ప్రభువునకు అంతరాత్మ చేయు సంపూర్ణ ఆత్మదానము యొక్క సంపూర్ణ ఫలితమగును.

15. ఓం తత్ సత్ :

ప్రథమ దృష్టికి ఏదో రహస్య విద్యగా గన్పించు ప్రసంగముతో గీత ఈ అధ్యాయమును ముగించును. ఓం తత్ సత్ - అను సూత్రము బ్రహ్మయొక్క త్రివిధ నిర్వచన మనియు, వీనిచేతనే పూర్వము బ్రాహ్మణులు, వేదములు మఱియు యజ్ఞములు నిర్మింపబడిన వనియు, వీని మర్మమంతయు ఆ బ్రహ్మయందే గల దనియు గీత వచించును (17-23), తత్ (అది) నిరపేక్షవస్తువును సూచించును. సత్ (ఉనికి) పరమ మఱియు విశ్వమయ సత్తయొక్క సారతత్త్వమును సూచించును. బహిర్ముఖ, అంతర్ముఖ లేక సూక్ష్మ, మఱియు అతిచేతన కారణపురుష భేదముచే త్రివిధమగు బ్రహ్మముయొక్క సంకేతము ఓం. ఓం (అ + ఉ + మ) యొక్క ప్రతి వర్ణమును ఉత్తరోత్తర క్రమమున బ్రహ్మయొక్క ఒకొక అవస్థను సూచించును, మఱియు నీ అక్షరము తన సంపూర్ణరూపమున నిరపేక్షవస్తువున కెగయు చతుర్థావస్థను, తురీయమును, ఆవిష్కరించును. ఓం ప్రారంభకాక్షరము; ఆరంభమున ఆశీస్సుగను, అనుమతిగను దీని నుచ్చరించి, సమస్త యజ్ఞక్రియయు, దానక్రియయు, తపఃక్రియయు నారంభించబడును; మన కర్మ అంతఃసత్తయందు త్రివిధ భగవంతుని

ఒక ప్రకటనము గావలెను, భావము మఱియు ప్రేరణయందు భగవదభిముఖము గావలెను - అను సత్యమును ఓంకారము మనకు గుర్తుచేయును (17-24). అటులే ముముక్షువు లీ క్రియలను ఫలాపేక్ష లేక, తమ ప్రకృతివెనుక నుండు నిరపేక్ష భగవంతునియొక్క భావము, అనుభవము మఱియు ఆనందముల చేతను మాత్రమే ఆచరింతురు (17-25). తమ కర్మలయందలి ఈ విశుద్ధి మఱియు నిర్వ్యక్తికతచేత, ఈ సమున్నత నిష్కామతచేతను, ఈ సువిశాల అహంకారశూన్యత చేతను, ఈ ఆధ్యాత్మిక సమృద్ధి చేతను వీరు ఆ తత్-రూప భగవంతునే అన్వేషింతురు. పోగా, తత్-న కర్థము శుభము మఱియు అస్తిత్వము. ఈ రెండును - శుభతత్త్వమును, అస్తిత్వ తత్త్వమును - సమస్త త్రివిధ క్రియల వెనుకను ఉండితీరవలెను. సమస్త శుభకర్మలు, అవి మన సత్తయొక్క ఉచ్చతర సత్యతకు అంతరాత్మను సిద్ధము చేయును గాన, సత్ - అని పిలువబడును (17-26); అటులే యజ్ఞదానతపములందు దృఢ నిష్ఠయు, యజ్ఞదానతపోనిమిత్తము చేయబడు సర్వ కర్మలును సత్ - అనబడును, ఏలన అవి మన స్వరూపముయొక్క పరమసత్యమునకు ఆధారము నేర్పఱచును (17-27.) మఱియు శ్రద్ధ మన జీవనముయొక్క కేంద్రతత్వము గాన, వీనిలో నేది శ్రద్ధావిరహితముగా చేయబడినను, అది అసత్ (అనృతము) - అనబడును; ఏలన దాని కిహమున గాని, పరమున గాని ఎట్టి అర్థము నుండదు, ఎట్టి సారము నుండదు; ఇహజీవనమున గాని, ఇచ్చటి మర్త్యజీవనానంతరము మన సచేతన స్వరూపముయొక్క మహత్తరలోకములందు గాని నిలిచియుండుటకు లేక సృజించుటకు దానియందెట్టి సత్తగాని, శక్తిగాని యుండదు (17-28). అంతరాత్మ శ్రద్ధ కేవల బౌద్ధిక విశ్వాసము గాదు, పరంతు ఆ విశ్వాసమునకు అనురూపమగు సంకల్ప మగును, చూపును బట్టి ఆచరించుటకు మఱియు వర్తించుటకు యత్నించు శక్తి యగును; ఈ సంకల్పరూపమగు అంతరాత్మ శ్రద్ధయే తన శక్తిచేత మన సంభూతి సంభవతయొక్క మానమును నిర్ణయించును, మఱియు నిట్టి సంకల్పాన్విత శ్రద్ధయే మన సమస్త ఆంతర మఱియు బాహ్య ఆత్మయందును, ప్రకృతియందును, క్రియ యందును ఏది అత్యున్నతము, అతిదివ్యము, అతిసత్యము మఱియు నిత్యమో దాని కభిముఖమై, పరమ సంసిద్ధి నందుకొనుటకు మనలను సమర్థులను గావించును.

19. [1] గుణములు, మనస్సు, కర్మ

1. మానసిక శక్తుల ఆవశ్యకత :

గుణములకును, తన పరాకాష్ఠ నందు కొనిన సాత్త్విక సాధనాసామర్థ్యముచే గుణాతిక్రమణమునకును సంబంధించిన మూలభావముయొక్క ప్రకాశమున, గీత యింకను తన కర్మవిశ్లేషణమును పూర్తి గావించలేదు. శ్రద్ధ అనగా సత్యమును నమ్ముటకు, తద్రూపముగా నుండుటకు, దానిని తెలిసికొనుటకు, అనుజీవించుటకు, అనుష్ఠించుటకు ప్రవర్తించు సంకల్పము; ఆ శ్రద్ధ స్వవికాససాధకమగు కర్మవెనుకను, ముఖ్యముగా కర్మచేత తన పూర్ణ ఆధ్యాత్మిక పరిమాణములోనికి అంతరాత్మయొక్క సంవర్ధనము వెనుకను గల ప్రధానాంశము, ఆవశ్యకశక్తి యగును. కాని కర్మకలాపముయొక్క వేగమును, దిశను, స్వభావమును నిర్ణయించు మానసిక శక్తులు, ఉపకరణములు మఱియు నిబంధనలును గలవు, కావున ఈ మానసిక సాధనయొక్క పూర్ణావగాహనకు ఇవియు ముఖ్యమే. గీత ముందు వీనిని సంక్షేపముగా వేఱుచేసి చూపి, పిమ్మట తన పరమ సిద్ధాంతమును ప్రతిపాదింపబోవును – అదియే గీతోపదేశమునకంతకు శిఖరాగ్రము, ఆధ్యాత్మికముగా సర్వధర్మములను దాటిపోవు, ఒక దివ్యాతిక్రమణరూపమగు పరమ రహస్యము (18–66). ఇపుడు మన మీ గీతా సంక్షిప్త వర్ణన ననుసరించుచు, ప్రధానభావమును పూర్ణముగా గ్రహించుట కవసర మగు మేరకే, దానిని విపులీకరించెదము. ఏలన, ఇవి గౌణవస్తువులే యైనను, ప్రతి దానికి తన స్థానమున, తనప్రయోజ నార్థము పెద్ద ప్రాముఖ్యమే యుండును. గుణముల మూసలో పోయబడిన వాని క్రియను సంక్షిప్త మూలవర్ణననుండి వెలికిదీసి, ప్రకటించ వలసి యున్నది. గుణముల కావల వీనిలో దేని పర్యవసానముయొక్క స్వరూపమైనను సర్వసామాన్య గుణాతీత స్థితియొక్క స్వరూపమునుండి స్వయముగానే స్పష్టపడును.

2. సన్యాసతత్త్వము, త్యాగతత్త్వము :

సన్యాసతత్త్వము, త్యాగతత్త్వము మఱియు వాని విభేదమును గుఱించి అర్జును డడిగిన చివరి ప్రశ్నకు సమాధానముగా పై అంశము ప్రవేశపెట్టబడును (18–1). గీత ఈ విభేదమును మఱలమఱల ప్రస్తావించి, దానిని ఒత్తి చెప్పును; అది సముచితమే నని భారతీయమనస్సుయొక్క తర్వాతి చరిత్రను జూచిన మనకు విదితమగును;

---

[1] గీత : అధ్యాయము 18, శ్లోకాలు 1–39.

ఏలన గీత బోధించిన ఎట్టి కర్మ యైనను ఉత్తమపక్షమున సన్న్యాసముయొక్క పరమ అకర్మకు ఒక పూర్వాంగము మాత్రమే యని దానిని కించపఱచినది, ఆ మనస్సు. సన్న్యాసము లేక త్యాగము యొక్క ప్రసక్తి వచ్చినపుడు, ప్రపంచముయొక్క బాహ్యసన్న్యాసమే దాని కర్థ మని ప్రజలు గ్రహింతురు లేక దానికే ప్రాధాన్య మిత్తురు. కాగా గీత దీనికి శుద్ధ వ్యతిరేకముగా, వాస్తవత్యాగమున కాధారము ప్రపంచము నందలి జీవన కర్మలు గాని, ఆశ్రమానికి పలాయనము గాని గాదని వక్కాణించును. వాస్తవత్యాగము కామ సన్న్యాసముతో గూడిన కర్మ మఱియు నదియే వాస్తవ సన్న్యాసము గూడను.

3. వాస్తవసన్న్యాసము :

సాత్త్విక ఆత్మానుసంధానముయొక్క విమోచక కార్యకలాపము, నిస్సంశయముగా, సన్న్యాసభావముచేత వ్యాప్తము గావలసినదే, ఏలన సన్న్యాస మొక ఆవశ్యక తత్త్వము: కాని ఆ సన్న్యాసమెట్టిది, ఆ భావప్రకార మెట్టిది? సన్న్యాసము ప్రాపంచిక కర్మసన్న్యాసము గాదు, ఎట్టి బాహ్య తపశ్చర్య గాదు, పైకి గన్పించు భోగత్యాగముయొక్క ఆడంబరము గాదు, పరంతు అది ప్రాణికకామము మఱియు అహంకారముయొక్క సన్న్యాసము, త్యాగము (=విడిచి వేయుట), కామాత్మయొక్క పృథగ్భూత వైయక్తికజీవనము, అహమధిష్ఠిత మానసము, మఱియు రాజసిక ప్రాణికప్రకృతియొక్క సన్న్యాసము (=దూరముగా నుంచుట) నగును. యోగశిఖరముల నారోహించుటకు (6-3) ఇదియే యథార్థ నిబంధనము, ఇది యున్నపుడే, నిర్వ్యక్తిక ఆత్మద్వారాగాని, విశ్వమయ వాసుదేవుని ద్వారా గాని, ఆంతరముగా గానిపరమపురుషోత్తమునిలోనికి ఆరోహించ గలము. అప్పటి పరిభాషకు ప్రాధాన్య మిచ్చి చూతు మేని, సన్న్యాస మన కామ్యకర్మల భౌతిక పరివర్జనము (విడిచివేయుట); పోగా త్యాగ మన, ప్రాజ్ఞులు మానసిక, ఆధ్యాత్మిక సన్న్యాసమునకు పెట్టిన పేరు (18-2), అనగా నది మన కర్మఫలమునందు గాని, అసలు కర్మయందు గాని, వైయక్తిక కర్మప్రారంభమునందు గాని, వైయక్తిక రాజసికప్రేరణయందు గాని యుండు ఆసక్తి నంతను త్యజించివేయుట యగును: సన్న్యాసత్యాగముల ఈ గీతావివేచన గమనార్హము (18-2). అట్టి అర్థమున సన్న్యాసము గాక, త్యాగమే శ్రేష్ఠతర మార్గము. మనము వర్జింవలసినది కామ్యకర్మలను గాదు, వానికి ఆ స్వభావమును గల్పించు కామమును. కర్మప్రభువుయొక్క విధానము ననుసరించి కర్మఫలము రావచ్చును, కాని దానినిమిత్తము కర్మచేయుట కొక నిబంధనగా నెట్టి కోరిక యుండరాదు. అథవా కర్మఫలము రానేరాకపోవచ్చును,

అయినను కర్తవ్యకర్మగా, అంతఃస్థప్రభువు మననుంచి అపేక్షించు కర్మగా దానిని చేయవలసినదే. సాఫల్యవైఫల్యము లతని చేతులలో నుండును, తన సర్వజ్ఞ సంకల్పము మఱియు అగమ్యప్రయోజనము ననుసరించి వానిని నిర్ణయించును. కర్మ, సర్వకర్మ చివరకు సన్యస్తము గావలసినదే, అయితే విరమణచేత, నిశ్చేష్టతచేత, జడత్వముచేత భౌతికముగా గాక, ఆధ్యాత్మికముగా మన సత్తయొక్క అధీశ్వరునియందు సన్యస్తము గావలెను-నిజానికి ఎట్టి కర్మ యైనను, అతని శక్తి చేతనే చేయబడగలదు. మనమే కర్తలమను మిథ్యాభావమును సన్యసించవలెను; ఏలన వాస్తవానికి మన వ్యక్తిత్వము మఱియు అహంకారముద్వారా పనిచేయునది విశ్వశక్తియే (3-27). కర్మప్రభువునకును, వాని శక్తికిని సర్వకర్మల ఆధ్యాత్మిక సమర్పణయే గీతాబోధన యందలి వాస్తవ సన్యాసము (3-30).

4. శాస్త్రనియతము, స్వభావనియతము, ఈశ్వరనియతము :

ఏ కర్మలను చేయవలెను ? - అను ప్రశ్న ఇంకను ఉదయించును. చరమ బాహ్యసన్యాసమును సమర్థించువారికి సైతము ఈ కఠిన విషయమున ఏకాభిప్రాయము లేదు. అది అసలు సాధ్యమైనట్లు, మన జీవనమునుండి సర్వకర్మలను ఛేదించివేయవలె నని కొంద రందురు. (18-3). కాని మనము శరీరములోను, సజీవముగాను ఉన్నంతకాల మది సాధ్యము గాదు; మఱియు మన సక్రియసత్తను, సమాధి నవలంబించి, గడ్డ మఱియు రాతియొక్క నిర్జీవ నిశ్చేష్టతకు కుంచించుటయు ముక్తి గాదు. సమాధినీరవతయు ఈ సమస్యను పరిష్కరించదు, ఏలన మఱల శరీరములోనికి ఊపిరి వచ్చిన వెంటనే, సమాధి లబ్ధమగు ముక్తిశిఖరమునుండి టప్పున పడిపోదుము. కాని యథార్థ ముక్తి, అహంకారముయొక్క అంతరసన్యాసము మఱియు పురుషోత్తమునితో సంయోగముచేత లభించిన విముక్తి ఎట్టి అవస్థయం దైనను స్థిరముగా నిలిచి యుండును - ఈ లోకములోపల లేక దీనికి వెలుపల, అథవా సర్వలోకముల లోపల లేక వానికి వెలుపల నది నిలిచియుండును, అది స్వయంస్థితము - "సర్వథా వర్తమానోఽపి" (6-31), అది కర్మ లేక అకర్మపై నాధారపడదు (3-18). అయి నపుడు ఏ కర్మలను చేయవలెను? ఐచ్ఛిక కర్మలలో భిక్షాటనము, ఆహారగ్రహణము, ధ్యానము మఱియు శరీరస్థితికి కేవల మావశ్యకమగు కర్మలను మాత్రమే చేయవచ్చు నని సంపూర్ణ సన్యాసవాది సమాధానించును - గీత దీనిని ప్రస్తావించలేదు, బహుశః ఇది ఆకాలమున అంత ప్రచలితము గాదు. కాని యింతకంటె నుదారము, సమగ్రము నగు సమాధానము, స్పష్టముగా

యజ్ఞదానతపము లను మిక్కిలి సాత్త్వికకర్మలను మూడింటిని కొనసాగించుటయే యగును (18-3). మఱియు నివి నిశ్చయముగా చేయబడవలెను, కారణము, ఇవి మనీషులను పావనముచేయును (18-5) - అని గీత వక్కాణించును. కాని యింకను విశాలముగా, ఈ మూడు కర్మలను తమ విశాలతమార్థమున గ్రహించుచు, చేయవలసిన కర్మ "నియత కర్మ " (18-7), అనగా బాగుగా నియమితమైన కర్మ యని చెప్పవచ్చును - 1. యుక్తజ్ఞానము, యుక్తకర్మ, యుక్తజీవనములయొక్క విజ్ఞానము మఱియు కళారూపమగు శాస్త్రముచే నియమితకర్మ గావచ్చును, లేక అది "స్వభావనియతం కర్మ" (18-47) గావచ్చును, లేక చివరకు అది మనలోపలను, పైనను గల భగవదిచ్ఛచేత నియమితమైన కర్మ గావచ్చును (18-61), ఇదియే సర్వోత్తమము, ఇదియే ముక్తపురుషునియొక్క సత్యము, ఏకమాత్రము నగు కర్మ - "ముక్తస్యకర్మ" (4-23). ఈ కర్మలను సన్యసించుట తగిన చర్య గాదు - అని చివరకు గీత స్పష్టముగా, నిశితముగా విధించును - "నియతస్య తు సన్యాసః కర్మణో నోపపద్యతే" (18-7). ఈ ఉపసంహరణము సత్యవిముక్తిని సాధించగల దని, తెలియక నమ్మి, ఈ కర్మలను సన్యసించుట తామససన్యాస మగును (18-17). కర్మలలోవలెనే కర్మ సన్యాసము నందును గుణములు మనల ననుగమించు నని చూడదగును. "సంగో అకర్మణి" (2-47) - అకర్మయందు గల సంగమువలన చేయు సన్యాసము సైతము తామస మగును. మఱియు, అవి దుఃఖప్రదములు, అనగా శరీరమునకు కష్టము, మనస్సునకు ఖేదము గలిగించును - అని గాని, అంతయు ఒక ఆడంబరము మఱియు నాత్మకు ఒక సంతాపము - అని గాని నియతకర్మలను సన్యసించుట ఒక రాజసిక సన్యాస మగును (18-8), అది సమున్నత ఆధ్యాత్మిక ఫలము నివ్వదు; అదియు యథార్థ "త్యాగము" గాదు. అది బౌద్ధిక నిరాశావాదము లేక ప్రాణిక విషాదముయొక్క ఫలితము, దానికి వేళ్ళు అహంకారము నందుండును. ఈ స్వార్థపర అహంకారముచేత చోదితమైన సన్యాసమునుండి ఎట్టి ముక్తి రాజాలదు.

5. సాత్త్వికసన్యాసము అహంసన్యాసము :

సన్యాసముయొక్క సాత్త్విక తత్త్వము కర్మనుండి నివృత్తి గాదు, ఆ కర్మవెనుక నుండు వైయక్తిక కామము, మఱియు అహంకారమునుండి నివృత్తి యగును. కామనియతమైన కర్మను గాక, యుక్త జీవనమును దెలుపు శాస్త్రనియతమైన కర్మను లేక స్వభావనియతమైన కర్మను, అనగా శ్రద్ధానురూపమైన కర్మను చేయుటే సన్యాస

7

మగును (18-9). అథవా, ఇంకను ఉచ్చతర ఆధ్యాత్మిక భూమికయందు కర్మలు ప్రభుసంకల్పముచేత నియతము లగును, మఱియు యోగయుక్తమైన మనస్సుచేత కర్మతో గాని, కర్మఫలముతో గాని ఎట్టి సంగము లేక చేయబడును (18-9). సమస్త కామముయొక్కయు, సమస్త అహంకారిక సంవరణప్రేరణలయొక్కయు సంపూర్ణసన్యాస ముండవలెను, చివరకు, "కర్మ నాది, నేను చేయుచున్నాను" అని గాని, "కర్మ భగవంతునిది, కాని చేయువాడను నేను" అని సైతముగాని వచించు సంకల్పముయొక్క బహుసూక్ష్మతర అహంకారమును సైతము సంపూర్ణముగా సన్యసించవలెను. ప్రియము, హితము, లాభదాయకము లేక విజయోపేతమగు కర్మతో నెట్టి సంగము నుండరాదు, మఱియు నది ప్రియము గావున, దానిని చేయుటయు తగదు. కాని, అది మన పైనుండియు, లోపలినుండియు ఆదిష్టమైన కర్తవ్యకర్మ యైనపుడు, అట్టి ప్రియమగు కర్మను సైతము చేయవలెను - సమగ్రముగా, స్వార్థరహితముగా, ఆత్మానుమతితో చేయవలెను. అటులే అకుశల కర్మ పట్ల, అనగా అప్రియము, అహితము, లేక అతృప్తి కరమగు కర్మపట్ల గాని, దుఃఖము, దుఃస్థితి, దుష్పరిణామమును గొనిరాగల కర్మపట్ల గాని ఎట్టి ద్వేషము నుండరాదు (18-10); ఏలన అది కర్తవ్యకర్మ యగు నేని, లోతునకు దిగి దాని ఆవశ్యకతను, అర్థమును గ్రహించి, దానిని సైతము సమగ్రముగా, స్వార్థరహితముగా చేపట్టు టవసరము. ప్రాజ్ఞుడు కామాత్మయొక్క వైముఖ్యములను, సంకోచములను పరిత్యజించును, సాధారణ మానవబుద్ధియొక్క సందేహములను పాటించడు; ఏలన కామాత్మయు, సాధారణబుద్ధియు వైయక్తిక, సాంప్రదాయిక లేక పరిమిత ప్రమాణములచేత విషయమును కొల్చును (18-10). అటులే అతడు అదృశ్య పరలోకములందు ఫల మపేక్షించి కర్మ చేపట్టడు, జన్మాంతరములందు పురస్కారమును కర్మనిబంధనము గావించడు - అర్థపక్వ మతనిష్ఠులు దీనికే తపింతురు. ఈ లోకము లేక లోకాంతరము లందు, అటులే ఈ జన్మము లేక జన్మాంతరములందు ఇష్టము, అనిష్టము, మిశ్రమము నను త్రివిధ కర్మఫలము కర్మ మఱియు నహంకారమునకు దాసులగు వారికి మాత్రమే గాని, అది ముక్తాత్మను అంటిపెట్టుకొనదు (18-12), ఆంతర సన్యాసముచేత ఒక అధికతరశక్తికి తన కర్మల నర్పించివేసిన విముక్త కర్మకర్త కర్మవిముక్తు డగును. కర్మ చేయుట మాత్ర మతడు చేయును, ఏలన తక్కువ లేక ఎక్కువ కర్మ, చిన్న లేక పెద్ద కర్మ దేహధారి పురుషునకు అనివార్యము, సహజము మఱియు సముచితము - నిజానికి దివ్య జీవనధర్మమునందు కర్మ ఒక భాగము, అది ఆత్మయొక్క సమున్నత

శక్త్యంశము. సన్యాససారము, అనగా యథార్థ త్యాగము, యథార్థ సన్యాసము సాంప్రదాయిక అకర్మనియమము గాదు; అది నిస్స్వార్థ ఆత్మతోను, నిరహంకార మనస్సుతోను గూడి, అహంకారమునుండి స్వతంత్ర నిర్వ్యక్తిక ఆధ్యాత్మిక ప్రకృతిలోనికి చేయు సంక్రమణము (transition). ఆంతరసన్యాస భావము సాత్త్విక సాధనయొక్క అత్యున్నత పరిసమాప్తియొక్క ప్రథమ మానసిక నిబంధన యగును.

6. కర్మకారణము లైదు :

పిమ్మట గీత సాంఖ్యము ననుసరించి, సర్వకర్మల సిద్ధినిమిత్తము అయిదు కారణములను లేక ఆవశ్యకములను ఉల్లేఖించును. ఇవి యేవి యన, 1.'అధిష్ఠానము' (18-13), అనగా ప్రకృతియందలి ఆత్మకు శరీర ప్రాణమనోరూపమగు ఆధారము లేక నిలచుటకు స్థానము, 2. "కర్త", 3."కరణము", అనగా ప్రకృతియొక్క వివిధ ఉపకరణచర్య, 4. "చేష్టలు", అనగా కర్మశక్తిని సమకూర్చు బహువిధ ప్రయత్నములు, 5. "దైవము" (18-14), అనగా విధి, అనగా మానవ ప్రయత్నము కంటెను, పైకి కన్పించు ప్రకృతియొక్క యంత్రవ్యాపారముకంటెను భిన్నమగు శక్తి లేక శక్తులయొక్క ప్రభావము; ఈ దైవము తక్కిన నాల్గింటివెనుక నిలిచి, కర్మను దిద్దుచు, కర్మను బట్టియు, దాని పరిణామమును బట్టియు దాని ఫలములను విధించును. ఈ అయిదును తమలోదాము సర్వనిమిత్తకారణములను- "కారణాని" (18-13) - సమకూర్చును : మనోవాక్కాయములచేత మానవు డేయే కర్మ చేపట్టునో, దాని రూపమును, ఫలితమును, ఈ కారణములే నిర్ణయించును (18-15).

7. చంపినను చంపనివాడే :

కర్త మన బాహ్య వ్యక్తిగత అహంకార మని సాధారణముగా అనుకొందుము (18-16), కాని అది జ్ఞానమును ప్రాపించని బుద్ధియొక్క మిథ్యాభావము. పైకి మాత్రమే అహంకారము కర్త, నిజానికి అహంకారము మఱియు దాని సంకల్పము ప్రకృతినిర్మాణములు మఱియు నుపకరణములే; అజ్ఞమగు బుద్ధి తప్పుగా వీనితో మన ఆత్మను తాదాత్మ్యము జెందించును; అయితే ఇవి మాత్రమే మానవకర్మకు సైతము నిర్ణాయకములు గావు, అయినపుడు దాని దిశకు, పరిణామమునకు నిర్ణాయకములు గావని చెప్పబనిలేదు. మన మహంకారమునుండి విముక్తుల మైనపుడు, నిర్వ్యక్తికము, సార్వత్రికము నగు మన వాస్తవాత్మ వెనుకనుండి ముందుకు వచ్చి, విశ్వపురుషునితో తనకు గల ఏకతాదర్శనమున, విశ్వప్రకృతియే కర్మకర్త్రి

యనియు, వెనుకనుండు దివ్యసంకల్పము ఆ విశ్వప్రకృతిస్వామి యనియు గాంచును. ఈ జ్ఞానము మనకు లేనంతవఱకే, అహంకారముచేతను, దాని సంకల్పమే కర్తయను భావముచేతను బద్ధులమై, శుభా శుభకర్మలను జేతుము మఱియు మన తామసిక, రాజసిక లేక సాత్త్విక ప్రకృతి యొక్క సంతృప్తిని బొందుదుము. కాని ఒకసారి మన మీ మహత్తర జ్ఞానమున నివసింపసాగినపుడు, కర్మస్వభావము మఱియు పరిణామము ఆత్మస్వాతంత్ర్యమున కెట్టి మార్పును గలిగించవు. ఈ కురుక్షేత్ర మహాసంగ్రామమువలె కర్మ పైకి భయంకరము గావచ్చును; కాని ముక్తపురుషుడు దానిలో పాల్గొనినను మఱియు నత డీ ప్రజలందరను చంపివేసినను, నిజాని కత డెవరిని, చంపనివాడే మఱియు నా కర్మచేత నతడు బద్ధుడు గాడు (18–17). ఏలన ఆ కర్మ లోకేశ్వరుని కర్మ మఱియు నతడు తన గుప్త సర్వశక్తి సంకల్పమునందు ఈ సేనానీకముల నన్నింటిని చంపియే యున్నాడు (11–33). ఇట్టి సంహారకర్మ ఆవశ్యక మయ్యెను, ఏలన దానిచేతనే మానవజాతి మఱియొక సృష్టి మఱియు ధ్యేయము దిశగా నగ్రనరము కాగలదు, అగ్నిలోవలె అధర్మమును, అత్యాచారమును అన్యాయరూపమగు తన గతకర్మను దహించివేయగలదు మఱియు ధర్మరాజ్యమునకు పయనించగలదు. విశ్వపురుషునితో తన ఆత్మయందు ఏకమగు నొక సజీవ ఉ పకరణముగా, ముక్త పురుషుడు తన విహితకర్మ నొనరించును. మఱియు నిది యంతయు జరుగక తప్ప దని గ్రహించి, కర్మయొక్క బాహ్యరూపమున కావల తన దృష్టిని సారించుచు, అతడు తనకొఱకు గాక, భగవంతునికొఱకు, మానవజాతికొఱకు మఱియు మానవ మఱియు [1] విశ్వవ్యవస్థకొఱకు కర్మచేయును; మఱియు వాస్తవాని కతడు స్వయముగా చేయడు, తన కర్మలయందును, వాని పరిణామమునందును పనిచేయుచున్న దివ్యశక్తియొక్క సన్నిధి మఱియు సామర్థ్యము పట్ల అతడు సచేతనుడై యుండును. అధిష్ఠానమగు తన మనఃప్రాణశరీరములందు పరశక్తియే ఏకమాత్ర శక్తిగా 'విధి'విహిత కర్మను చేయుచున్న దని అతనికి దెలియును – అయితే యీ విధి నిజానికి విధి గాదు, అనగా ఒక యాంత్రిక విధానము గాదు, పరంతు అది మానవ కర్మను వెనుకనుండి నడుపు, విచక్షణశీల సర్వదర్శియగు ఈశ్వరసంకల్పము. ఏది గీతోపదేశమునకు మూలమో, అట్టి ఈ "ఘోర కర్మ" (3–1) పైకి "అకుశలముగా"

[1] ఇచ్చట విశ్వవ్యవస్థయొక్క ప్రసక్తి వచ్చుటకు గారణము, మానవ జాతియందు అసురుడు జయించినచో, ఆ మేరకు విశ్వశక్తుల సంతులనమునందు అది అతని జయమే యగును.
– శ్రీ అ.

(18-10), అశుభముగా గన్పించు కర్మ కొక చరమదృష్టాంతము, అయితే దీని ఆభాస రూపమున కావల నొక మహాశుభ మున్నది. దైవనియుక్త మానవునిచేత లోకసంగ్రహార్థము (3-20) ఈ కర్మ నిర్వ్యక్తికముగా చేయబడవలెను; ఇచ్చట వైయక్తిక లక్ష్యము లేక కామ ముండరాదు, ఇది విహితసేవ గదా.

8. త్రివిధజ్ఞానము :

ఇట్లు ముఖ్యాంశము కర్మ యొక్కటి మాత్రమే గాదని మనకు తెల్లమైనది; ఏ జ్ఞానమునందు మనము కర్మ చేతుమో, దానివలన అపారమగు ఆధ్యాత్మిక భేద మేర్పడును. కర్మకు మానసిక ప్రేరణను సమకూర్చు మూడు వస్తువులు గలవు, అవి మన సంకల్పమునందలి జ్ఞానము, జ్ఞేయము మఱియు జ్ఞాత యని గీత వచించును (18-18); మఱియు నా జ్ఞానములోనికి సదా త్రిగుణ క్రియ ప్రవేశించును. జ్ఞానమునందలి ఈ గుణభేదముచేతనే మన దృష్టికి జ్ఞేయ మెంతో భిన్నముగాను, అటులే జ్ఞాత కర్మచేయు భావ మెంతో భిన్నముగాను గన్పించును (18-19). అజ్ఞానమయమగు తామసిక జ్ఞానము ఒక క్షుద్ర మఱియు సంకుచిత, ఒక అలస లేక మూర్ఖమగు దృగ్విధానము; ప్రపంచము లేక చేయబడిన వస్తువు లేక తన కర్మక్షేత్రము లేక కర్మ లేక కర్మనిబంధనలయొక్క వాస్తవిక స్వరూపమును జూచు నేత్రము దాని కుండదు. తామసిక జ్ఞానము వాస్తవ కార్య కారణములను జూడదు, పరంతు ఒక మూర్ఖసంగముతో ఒకే గతి లేక పరిపాటియందు సక్తమగును; అది తన కంటిముందున్న, వైయక్తికకర్మయొక్క ఒక స్వల్పాంశ మును దప్ప మఱి దేనిని జూడదు; నిజానికి తాను చేయు కర్మయే దానికి దెలియదు, అది అంధప్రాయముగా ప్రకృతిప్రేరణను తన కృత్యముద్వారా కొన్ని ఫలములను సాధింపనిచ్చును, ఆ ఫలములను గుఱించిన ఎట్టి భావన, పూర్వదృష్టి లేక సమగ్రావ గాహన దానికుండదు (18-22). పోగా ఏ జ్ఞానము వేఱువేఱు వ్యాపారములు గల వేఱువేఱు వస్తువులందు బహుత్వమును మాత్రమే చూచునో, మఱియు యథార్థమగు ఏకతాసూత్రమును గనుగొనజాల కున్నదో లేక తన సంకల్పమును, క్రియను సరిగా నన్వయించజాలక, తన అహంకారము మఱియు కామముల ప్రవృత్తినే అనుసరించునో, అనగా నానాశాఖలుగా విస్తరించునో (2-41), తన అహంకారిక సంకల్పము ప్రారంభించు క్రియాకలాపమునే సాగనిచ్చునో, అదిగో, అది రాజసజ్ఞానము (18-21). ఈ జ్ఞానము అనేక జ్ఞానాంశముల ఒక అస్తవ్యస్త మిశ్రమము, తఱచు ఇది ఒక అసంగత జ్ఞానము, కాని మనస్సు వీనిని

బలాత్కారముగా కలిపియుంచి, మన జ్ఞానాజ్ఞానముల సంకరములోనుంచి ఒక తాత్కాలిక మార్గము నేర్పఱచును. అథవా ఈ జ్ఞాన మొక చంచల రాజసిక బహువిధ క్రియాకలాపము, దీని కెట్టి దృఢ నియామక సమున్నత ఆదర్శము నుండదు, తన లోపలి సత్య శక్తిప్రకాశములయొక్క ఎట్టి ప్రశాంతధర్మము దీని కుండదు. దీనికి ప్రతిగా, సాత్త్వికజ్ఞానము అస్తిత్వమును సర్వవిభక్తవస్తువులయందును ఏకమాత్ర అవిభాజ్య తత్త్వముగా జూచును, సర్వ సంభూతులయందును ఏకమాత్ర అవ్యయ సత్తను గాంచును (18-20); అది తన కర్మసూత్రమును, ప్రత్యేకకర్మకు సమష్టి ప్రయోజనముతో గల సంబంధమును వశీకరించుకొనును; అది సంపూర్ణ ప్రక్రియ యొక్క ప్రతి అడుగును యథాస్థానమున వేయించును. ఈ జ్ఞానము పరాకాష్ఠను బ్రాపించినపుడు, అది సర్వభూతములలోను గల ఏకమాత్ర ఆత్మయొక్క దర్శన మగును, సర్వకర్మల ఏకమాత్ర అధీశ్వరుని యొక్క దర్శన మగును మఱియు నది విశ్వశక్తులను భగవంతుని ప్రకటనములుగా గాంచును, అటులే స్వయముగా కర్మను మానవునియందును, అతని ప్రాణమునందును, స్వభావమునందును భగవంతుని పరమ సంకల్పజ్ఞానముల క్రియగా దర్శించును. స్వభావమునందును భగవంతుని పరమ సంకల్పజ్ఞానముల క్రియగా దర్శించును. ఇపుడు సంపూర్ణముగా సచేతనము మఱియు ప్రబుద్ధము, ఆధ్యాత్మికముగా ప్రబుద్ధము నైయున్న వైయక్తిక సంకల్పము ఏకునియందు నివసించును మఱియు కర్మచేయును (6-31), అధికాధిక పరిపూర్ణముగా అతని పరమాదేశమునకు విధేయమగును మఱియు మానవదేహము నందలి అతని శక్తిప్రకాశములయొక్క ఒక నిర్దుష్ట ఉపకరణముగా ఎక్కువెక్కువ పెంపు నందును (11-33). పరమ విముక్త క్రియ సాత్త్వికజ్ఞానము యొక్క ఈ పరాకాష్ఠద్వారానే సిద్ధించును.

9. త్రివిధ ఉపకరణము :

కర్త, కరణము మఱియు కార్యము - అను ఇంకను మూడు వస్తువులు గలవు, ఇవియే కర్మను సమకూర్చి, సంభవమొనరించును (18-18). మఱల నిచ్చట సైతము గుణభేదమే వీనిలో ప్రతిదాని స్వభావమును నిర్ణయించును (18-19). సర్వదా ఒక సమంచిత సామరస్యమును, సమంచిత జ్ఞానమును అన్వేషించు సాత్త్విక మనస్సు సాత్త్విక మానవునియొక్క ప్రధానోపకరణము, ఇదియే తక్కిన యంత్రము నంతను నడుపును. మఱియు కామాత్మచేత (2-43) ధరింపబడిన కామమయ సంకల్పము రాజసిక కర్తయొక్క ప్రధానోపకరణ మగును. భౌతిక మనస్సు మఱియు

అసంస్కృత ప్రాణప్రకృతికి జెందిన ఒక అజ్ఞానమయ ప్రవృత్తి లేక ప్రకాశరహిత ప్రేరణ తామసిక కర్తయొక్క ముఖ్యమగు ఉపకరణశక్తి యగును. చివరకు, ముక్త పురుషుని ఉపకరణము అధికతరమగు ఒక ఆధ్యాత్మిక ప్రకాశము మఱియు శక్తి యగును, అది అత్యున్నత సాత్త్విక బుద్ధికంటెను ఎంతో ఉన్నతతరము మఱియు నీ ఉపకరణ మతనిలో ఒక అతిభౌతిక కేంద్రమునుండి వచ్చిన ఒక వ్యాపకశక్తితో పనిచేయును మఱియు తన శక్తి కొక స్వచ్ఛవాహినిగా పరిపూతము, గ్రహణశీలము నగు మనఃప్రాణశరీరముల నుపయోగించును.

10. త్రివిధకర్మ – అతీతకర్మ :

సంభ్రాంతము, విమూఢము, అజ్ఞమునగు మనస్సుచే చేయబడు కర్మ తామసకర్మ. సహజప్రవృత్తులకు, అంధప్రేరణలకు, అజ్ఞభావములకు యాంత్రిక విధేయతతో మానవుడు దీనిని చేయును; తన శక్తి సామర్థ్యములను గాని, అపప్రయుక్తమగు ప్రయత్నమువలన గలుగు క్షయనష్టములను గాని, ప్రేరణ, ప్రయత్నము లేక పరిశ్రమ యొక్క పూర్వాపరములను, సముచిత నియమములను గాని అతడు పరికించడు (18–25). కామవశుడై, ఆశించిన కర్మఫలమును దెచ్చు కర్మపైన మాత్రమే తన దృష్టిని బంధించి, మానవుడు చేయు కర్మ రాజసకర్మ; అథవా ఈ కర్మయందు అతనికి తన స్వీయవ్యక్తిత్వముయొక్క ఆహంకారిక భావ ముండును మఱియు నీ రాజసకర్మ కామ్యవిషయము నిమిత్తము వైయక్తిక సంకల్పముయొక్క బహుళాయాసముతో, చెమటోడ్చి చేయబడును (18–24). పోగా, బుద్ధిజ్ఞానముల స్వచ్ఛప్రకాశమున, న్యాయము లేక ధర్మమునకు సంబంధించిన నిర్వ్యక్తిక భావముతో, లేక ఒక ఆదర్శమును పురస్కరించుకొని, మానవుడు ప్రశాంతముగా చేయు కర్మ సాత్త్వికకర్మ; చేయదగిన కర్మ యనియే అతడు దానిని చేయును గాని, ఇహపరములయందు దానివలన తన కే ఫలము ప్రాప్తించునో యను చింత అతని కుండదు. ఈ కర్మయందు సంగ ముండదు, ప్రోత్సాహ నిరుత్సాహములను బుట్టించు రాగద్వేషము లుండవు; హేతుబుద్ధి మఱియు న్యాయమతియొక్కయు, విశదజ్ఞానము, ప్రబుద్ధసంకల్పము, శుద్ధ నిస్స్వార్థ మానసము మఱియు సమున్నత సంతుష్ట అంతఃపురుషునియొక్కయు సంతృప్తి నిమిత్త మీ కర్మ మాచరింపబడును. సత్త్వము పరాకాష్ఠను బ్రాపించి నపుడీ సాత్త్వికకర్మ రూపాంతరముజెంది, ఒక పరమోన్నత నిర్వ్యక్తిక కర్మ యగును; అపుడిక దానిని మన బుద్ధి గాక, అంతఃస్థపురుషుడే నిర్దేశించి ఆదేశించును, అది స్వభావము యొక్క అత్యున్నతనియమముచే నడుపబడును, అహంకారమునుండియు, దాని

స్వల్ప లేక బహుభారమునుండియు నది ముక్తమగును; అంతే కాదు, సర్వోత్తమాభిప్రాయము, ఉదాత్తతమ కామము, పరిశుద్ధ వైయక్తికసంకల్పము లేక అత్యున్నత మానసికాదర్శము సైతము కల్పించు పరిమితినుండి విముక్తమగును. అక్క డీ ప్రతిబంధము లేవియు నుండవు; వీని స్థానమున ఒక స్వచ్ఛ ఆధ్యాత్మిక ఆత్మజ్ఞానము మఱియు ప్రదీప్తి భాసించును, కర్మ చేయునట్టి ఒక అమోఘశక్తి యొక్క అనివార్య ఘనిష్ఠానుభవము చెలంగును మఱియు ప్రపంచము మఱియు ప్రపంచాధీశ్వరునికొఱకు చేయవలసిన కర్మయొక్క విస్పష్టజ్ఞాన ముదయించును.

11. త్రివిధకర్త – అతీతకర్త :

ఎవడు కర్మయందు తన హృదయము నుంచక, యాంత్రికముగా పనిచేయునో, లేక ఎవడు సామాన్యజనతయొక్క స్థూల ఆలోచనకు తలవంచునో, అనగా సామాన్య పరిపాటి ననుసరించునో లేక ఎవడు ఒక అంధభ్రాంతికి మఱియు పూర్వాగ్రహము (prejudice) నకు అమ్ముడుపోవునో, అతడు తామసిక కర్త. అతడు తన మూఢత యందు పాదుకొనియుండును మఱియు తన అజ్ఞానమయ కర్మాచరణమునందు బుద్ధిహీనముగా గర్వించును; యథార్థ ప్రజ్ఞాస్థానమున అతనియం దొక సంకుచిత వంచనాశిల్పము పనిచేయును ; తా నెవరితో వ్యవహరించునో వారిపట్ల, విశేషించి ప్రాజ్ఞులు మఱియు శ్రేష్ఠులపట్ల అతనియం దొక మూర్ఖ తిరస్కారభావము వర్తించును. ఒక తామసిక అలసత్వము, మాంద్యము, కాలయాపనము, శిథిలత, నిరుత్సాహము లేక అసత్యత అతని కర్మకు లక్షణములు (18–28). తామసిక మనుష్యుడు సాధారణముగా ఆరంభిచుటయందు వెనుకబడును, తన నడకయందు ఆలసించును, కొంచెమునకే క్రుంగిపోవును; తన బలమును, పరిశ్రమను లేక సహనమును తన కర్మ ఇంచుక పరీక్షించు నేని, అతడు దానిని వెంటనే విడిచివేయ సిద్ధపడును. దీనికి ప్రతిగా, రాజసిక కర్త కర్మ యందు ఆత్రముతో నాసక్తు డగును, దాని సత్వరసమాప్తికి నడుముకట్టును, ఫలము, పురస్కారము మఱియు పరిణామముకొఱకు పరితపించును; అతడు హృదయము నందు లుబ్ధుడు, మనస్సునందు అశుచి, తాను అవలంబించు ఉపాయములందు తఱచుగా హింసాత్మకుడు, క్రూరుడు, పశు ప్రాయుడు; తా నెవనిని హింసించునో, ఎంత హింసించునో, అతనికి పట్టదు, అతనికి గావలసినది తన కామనాపూర్తి, తన సంకల్పసంతృప్తి, తన అహంకారాధిక్యము. సాఫల్యమునం దతడు ఉబ్బితబ్బిబ్బగును, వైఫల్యము నందు తీక్ష్ణముగా క్రుంగి కృశించును (18–27). పోగా సాత్త్విక కర్త ఈ సమస్త సంగము, అహంకారము,

ప్రచండబలము లేక దుర్బలతావేశమునుండి సదా ముక్తుడు; అతని బుద్ధిసంకల్పములు సిద్ధియందు పొంగవు, అసిద్ధియందు క్రుంగవు; ఒక దృఢ నిర్వ్యక్తిక నిశ్చయముతో, ఒక ప్రశాంత సమంజస ఉత్సుకతతో, ఒక సమున్నత, విశుద్ధ, నిస్స్వార్థ ఉత్సాహముతో నవి నిండి[illegible]ందును (11-26). చివరకు, సత్త్వముయొక్క చరమస్థానమునందును, దాని కావలను ఈ నిశ్చయము, ఉత్సుకత మఱియు నుత్సాహము ఆధ్యాత్మిక తపస్సు యొక్క స్వాభావిక క్రియావిలాస మగును మఱియు తుట్టతుదకు ఒక సర్వోన్నత ఆత్మబలము, ప్రత్యక్ష భగవచ్ఛక్తి యగును, మానవోపకరణమునందు ఒక భగవదూర్జము (energy) యొక్క ప్రబల సుస్థిర ప్రవృత్తి యగును, దర్శనాత్మకసంకల్పము, విజ్ఞాన మయమనీషయొక్క స్వయం దృఢీకృత పదము లగును మఱియు దానితోబాటు విముక్తప్రకృతియొక్క కర్మయందు స్వతంత్రపురుషునియొక్క విశాలానంద మగును.

12. తామస బుద్ధి మఱియు ధృతి :

ప్రాజ్ఞసంకల్పముతో సన్నద్ధమైన బుద్ధి మానవుని మానసిక సంపద; ఇది ఏ రీతిగా నే పరిమాణమున వర్తించునో, దానిని బట్టియే అతని కర్మ సమంజసము లేక కుటిలము, ఆవృతము లేక భాసురము, సంకుచితము మఱియు క్షుద్రము లేక విశాలము మఱియు విపులము నగును. ఏలన అతని ప్రకృతియొక్క అవగాహనశక్తి యగు బుద్ధియే అతనికి కర్మను ఎన్నిక చేయును, అథవా అతని సంకీర్ణ ప్రవృత్తులు, ప్రేరణలు, భావములు మఱియు కామముల అనేకానేక సూచనలలో నొక దానిపై తన ఆమోదముద్రను వేయును. అదియే అతనికొఱకు యుక్తాయుక్తములను, కార్యాకార్యములను, ధర్మాధర్మములను నిర్ణయించును. పోగా ధృతి, అనగా సంకల్పదృఢత, మానసిక ప్రకృతియొక్క ఒక సంతత శక్తి, ఇదియే కర్మను ధరించి, దానికి సాంద్రతను, దృఢతను గల్పించును. ఈ బుద్ధి మఱియు ధృతియందు సైతము గుణక్రియ గన్పించును, తామసిక బుద్ధి ఒక మిథ్యాభూత, అజ్ఞానమయ, తిమిరావృత సాధనము, ఇది మనలను బంధించి ఒక మలిన భ్రాంత ప్రకాశమున వస్తువులను చూచునట్లు చేయును; వస్తువులు మఱియు మానవుల యథార్థమూల్యములను మూర్ఖముగా నుపేక్షించి, మిథ్యామూల్యములను గ్రహించును. ఈ బుద్ధి వెలుగును చీకటి యనును, చీకటిని వెలుగనును, అధర్మమును ధర్మముగా చేపట్టును, అకార్యము నందు పాదుకొని, దానినే సత్కార్యముగా మనకు ప్రతిపాదించును. దాని అజ్ఞానము అజేయము మఱియు దాని ధృతి తన అజ్ఞానము యొక్క సంతృప్తి మఱియు గర్వమునందలి ధృతి యగును (18-32). ఇది ఈ బుద్ధియొక్క అంధక్రియకు

సంబంధించిన పార్శ్వము; కాని దీనికి జడతా నిర్వీర్యతల బహుభారముతో గూడిన పార్శ్వమును గలదు – నిద్రామాంద్యముల యందు పట్టు, మానసిక పరివర్తన మఱియు ప్రగతిపట్ల వైముఖ్యము, మానసిక భయములు, బాధలు మఱియు విషాదములయందు అభినివేశము : ఇవి ఈ పార్శ్వము నెప్పుడును వెంటాడుచుండును (18–35). పిఱికితనము, మూలుగుట, వంచన, అలసత్వము, ఇంకను మనస్సుద్వారా తన భయములు, సందేహములు, అతిజాగ్రత్తలు మఱియు కర్తవ్యనిరాకరణల సమర్థనము మఱియు మన ఉచ్చతర ప్రకృతియొక్క పిలుపునుండి భ్రంశమును, వైముఖ్యమును – ఇవి తామసిక బుద్ధి మఱియు ధృతియొక్క లక్షణములు, ఇవి తక్కువలో తక్కువ ప్రతిఘటన యుండు మార్గము బట్టును, అల్పతమ కష్టము, ప్రయత్నము, ప్రమాదములతో ఇవి తమ శ్రమఫలమును బొంద జూచును–కాదు, బ్రదికియుండిన బలుసుకూర ఏఱుకొనవచ్చు నని సైతము తలంచును.

13. రాజస బుద్ధి మఱియు ధృతి :

రాజస బుద్ధి, కావలెనని అది తప్పును, చెడును తెలిసియే ఎన్నికచేయ నపుడు, ధర్మాధర్మములను, కార్యాకార్యములను వివేచించగలదు గాని, సరిగా వివేచించదు, వస్తుతః వాని వాస్తవ మానములను విఱిచి, వాని మూల్యములను వికృతపఱచును. కారణము, దాని హేతువు అహంకార హేతువు, దాని సంకల్పము కామసంకల్పము, మఱియు నీ శక్తులు తమ స్వీయ అహంకారిక ప్రయోజనమును సాధించుటకు సత్యధర్మములను తప్పుగా చిత్రించి, వికృతపఱచును (18–31). అహంకార కామముల నుండి విముక్తులమై, సత్యము మఱియు దాని అనుబంధములతోనే పనిపెట్టుకొను ప్రశాంత, శుద్ధ, నిస్స్వార్థ మానసముతో నిబ్బరముగా వీక్షించి నపుడే, వస్తువులను తమ వాస్తవ మూల్యము లందు జూడ మన కవకాశముండును. కాని దీనికి రాజస ధృతి అడ్డువచ్చును; అది లాభసుఖములను, తాను ధర్మ మనుకొను లేక అనుకొనగోరు ధర్మము నార్జించుచు, తన స్వీయ లాలసలు మఱియు కామముల పూరణమునందే తన దృష్టిని లగ్నము గావించును (18–34). అది సదా తన కామములను అధికాధికముగా రంజింపజేయుచు, సమర్థించునట్టి విధముగానే ధర్మమును వ్యాఖ్యానించుట కున్ముఖమగును; ఈ వ్యాఖ్యానము తాను బొందదలంచిన ఫలములను సాధించుటకు మిక్కిలి అనుకూలించు సాధనములను సమంజసము లేక న్యాయసమ్మత మని ప్రకటించును. మానవబుద్ధి మఱియు ధృతియొక్క అనృతము మఱియు అపవర్తనము లందు నాల్గింట మూడు వంతుల కారణ మీ అనుకూల వ్యాఖ్యానమే. ప్రాణికాహంకారము పై గట్టి పట్టు గల రజోగుణమే మహాపాపియు, నిశ్చిత నేతయు నైయున్నది (3–37).

14. సాత్త్విక బుద్ధి, ధృతి మఱియు సత్త్వాతీతత :

ప్రపంచగతి, కర్మ ప్రవృత్తి - ధర్మము మఱియు కర్మనివృత్తి - ధర్మము, కార్యాకార్యములు, ఆత్మకు క్షేమకరము మఱియు విపత్కరము, భయముతో దేనిని వర్జించవలెనో మఱియు సంకల్పముచే దేనిని కౌగలించుకొనవలెనో, మానవాత్మను ఏది బంధించునో మఱియు నేది విడిపించునో-సాత్త్విక బుద్ధి వీని నన్నింటిని యథాస్థానమున, యథారూపమున, యథామానమున దర్శించును (18-30). తన ప్రకాశముయొక్క ఆధిక్యమును బట్టియు, అత్యున్నత ఆత్మ మఱియు పురుషునిదిశగా తన ఆరోహణయందు తాను చేరుకొనిన పరిణామదశను బట్టియు తన సచేతనసంకల్పము యొక్క ధృతి బలముతో సాత్త్విక బుద్ధి వీని నాచరించును లేక పరిహరించును (18-33). సాధారణ బుద్ధి మఱియు మానసికసంకల్పమునకు పరమున ఆకాంక్షమయ బుద్ధి కుదురుకొనినపుడు, పిమ్మట శిఖరోన్ముఖమై నపుడు, ఇంద్రియప్రాణముల స్థిరసంయమమునకు దిగినపుడు మఱియు యోగముద్వారా అత్యున్నత ఆత్మ, విశ్వగత భగవంతుడు, మఱియు విశ్వాతీత పురుషునితో యుక్తమై నపుడు, దాని సమున్నత ధృతిదృఢతచే సాత్త్విక బుద్ధియొక్క పరాకాష్ఠ ప్రాప్తించును. సత్త్వముద్వారా ఈ సత్త్వపరాకాష్ఠను చేరుకొనిన మానవుడు అచ్చట గుణముల నతిక్రమించగలడు, మనోబుద్ధులవలన గలుగు పరిమితులకు బైకి పోగలడు మఱియు సత్త్వము స్వయముగా సత్త్వాతీతములో నంతరించపోగలదు. అచ్చట అంతరాత్మ తేజోమందిరమున ప్రతిష్ఠితమగును, ఆత్మ, పురుషుడు మఱియు భగవంతునితో సాయుజ్యమున పట్టాభిషిక్తమగును. ఈ సాయుజ్యశిఖరమున, దివ్యక్రియయొక్క విముక్త స్వయంప్రవృత్తి యందు మన అంగములందలి ప్రకృతియొక్క పరిచాలనమును పరమునికి వదలివేయవచ్చును; ఏలన అచ్చట పరముని ప్రకాశమయ సంసిద్ధి మఱియు శక్తిని మలిన లేక వికృత పఱచు నెట్టి అనుచిత లేక సంకీర్ణక్రియ నుండదు, ఎట్టి భ్రాంత లేక నిర్వీర్య తత్త్వము నుండదు. అపుడీ నిమ్న నిబంధనలు, నియమములు మఱియు ధర్మములకు మనపై గల పట్టు అంతమొందును; అపుడు విముక్త పురుషుని యందు అనంతుడే కర్మచేయును, అపుడిక విముక్త సత్తయొక్క సత్యము మఱియు సారళ్యము తప్ప ఎట్టి ధర్మము నుండదు, ఎట్టి కర్మయు నుండదు, ఎట్టి కర్మబంధనము నుండదు.

15. సుఖప్రస్తావన, తామససుఖము :

సామరస్యము మఱియు క్రమము, ప్రశాంత సుఖము, ఒక స్థిర ప్రసన్న సంతుష్టి మఱియు నొక ఆంతర ఆరామము మఱియు శాంతి : ఇవి సాత్త్విక మానసము

మఱియు స్వభావముయొక్క విలక్షణ గుణములు. నిజానికి, ప్రత్యక్షముగానో, పరోక్షముగానో మానవ ప్రకృతి సాధింప గోరు ఏకైకవస్తువు సుఖము – సుఖము గాని, సుఖాభాసము గాని, మనఃసంకల్పములు లేక ప్రాణశరీరముల ఒక ప్రీతి, ఒక భోగము, ఒక తృప్తి గాని అది కావచ్చును. పోగా బాధ ఒక అనుభవము; విశ్వప్రకృతి యొక్క ఒక అపరిహార్య ఘటనగా, తప్పని సందర్భమున మన ప్రకృతి దానిని అనిచ్ఛాపూర్వకముగా స్వీకరించవలసి వచ్చును; లేక మన లక్ష్యమునకు ఒక సాధనగా ఇచ్ఛాపూర్వకముగనే స్వీకరించును. అంతే గాని, బాధకొఱకే బాధ నెవ్వడు గోరుకొనడు – ఆc, వికృతచిత్తుడు గోరుకొనవచ్చును లేక అది గొనివచ్చు ఒక ప్రచండ ప్రీతికొరకో, అది పుట్టించు ఒక తీవ్ర బలమునిమిత్తమో ఉత్సాహావేశముతో దానిని వరించవచ్చును. కాని మన ప్రకృతి యందు ప్రాబల్యము వహించు గుణమును బట్టి, సుఖము లేక భోగము వివిధముగా నుండును. ఎట్లన, తామసిక మనస్సు తన అలసత మఱియు జడతయందు, తన నిశ్చేతనత మఱియు నిద్రయందు, తన అంధత మఱియు భ్రాంతియందు మంచి సుఖము నందగలదు. తన మూర్ఖత మఱియు నజ్ఞానము నందు, గుహలోని తన మందప్రకాశములందు, తన జడ సంతుష్టియందు, తన క్షుద్ర సుఖములందు మఱియు తన అసభ్యభోగములందు రమించగల ప్రత్యేకాధికారము ప్రకృతి దానికి కట్ట బెట్టినది. ఈ రతికి మూలమును, పరిణామమును మోహమే యగును (18–39); అయినను గుహానివాసికి (తామసిక మానవునికి) తన మోహము లందు, అది ఏమాత్రమును ప్రశస్తము గాకున్నను, తగినంత జడసుఖమును ప్రకృతి యొసంగును. తమస్సు మఱియు నజ్ఞానమునందును ఒక తామసిక సుఖ ముండును గదా.

16. రాజస, సాత్త్విక సుఖములు :

రాజసిక మానవుని మనస్సు మఱింత తీక్ష్ణము, మాదకము (intoxicating) నగు సుఖపానము జేయును; ఇంద్రియములు మఱియు శరీరము, ఇంద్రియాసక్తము లేక ప్రచండ – గతిమయమగు సంకల్పము మఱియు బుద్ధియొక్క ఏ తీవ్ర చంచల సక్రియ సుఖము గలదో, అదియే అతనికి జీవిత సమస్తసుఖము మఱియు జన్మధారణకు పరమార్థము. ఈ సుఖము ప్రథమ స్పర్శయందు పెదవికి అమృతముగా నుండును గాని, గిన్నె అడుగున ఒక గుప్త విషముండును, మఱియు నీ సుఖము వెనుక నిరాశ, అతితృప్తి, ఆయాసము, విద్రోహము, విరాగము, పాపము, దుఃఖము, నష్టము మఱియు నశ్వరతలయొక్క చేదు అనుభవము నకు వచ్చును (18–38). మఱియు నట్లు రాక తప్పదు, ఏలన జీవితమునుండి మన అంతరాత్మ యథార్థముగా కోరునది సుఖముల ఈ బాహ్య రూపమును గాదు; రూపము యొక్క నశ్వరత కీవలను,

ఆవలను చిరస్థాయి, తృప్తిప్రదము, స్వయంపర్యాప్తము నగు ఒక వస్తువు గలదు. కావున సాత్త్విక ప్రకృతి ఉన్నతమనస్సు మఱియు నంతరాత్మకు తృప్తి నిచ్చు దీనినే అన్వేషించును; ఒకసారి అన్వేషణా విషయమగు నీ బృహద్వస్తువు ప్రాప్తించు నేని, అంతరాత్మయొక్క ఒక స్వచ్ఛ శుద్ధ సుఖము, ఒక పూర్ణతాస్థితి, ఒక సుస్థిర ఆరామము మఱియు శాంతి ప్రస్ఫుటమగును. ఈ సుఖము బాహ్యవస్తువుల పైన గాక, కేవలము మనపైననే మఱియు మనలోపల గల సర్వశ్రేష్ఠము, అంతరతమము నగు దాని ప్రఫుల్లనముపైననే ఆధారపడును (18-37). కాని ఆదియం దిది మన సామాన్య సంపత్తిగా నుండదు; అది ఆత్మ సంయమముచే, అంతరాత్మపరిశ్రమచే, సమున్నత కఠోర ప్రయత్నముచే జయించ బడవలెను. ఆదిలో ఇట్టి ప్రయత్నమున కర్థ మేమన, అభ్యస్తసుఖముయొక్క అధికాంశ హాని, ఎంతో దుఃఖము మఱియు సంఘర్షము, మన ప్రకృతిమథనము నుండి ఉద్భవించిన ఒక హాలాహలము, శక్తుల బాధాకర సంఘట్టనము, పరివర్తన కిష్టపడని ప్రాణవృత్తులయొక్క ప్రతిరోధము మఱియు విద్రోహము; కాని తుదకు ఈ చేదు అంతరించి, దాని స్థానమున అమరత్వముయొక్క అమృత ముదయించును. మఱియు మనము ఉచ్చతర ఆధ్యాత్మిక ప్రకృతికి ఆరోహించు కొలది దుఃఖాంతమునకు వత్తుము, బాధాసంతాపముల అనాయాస మరణము సిద్ధించును. ఇది నిరతిశయ సుఖము; సాత్త్విక సాధనయొక్క చరమ బిందువు లేక రేఖయందు ఇది మన పై వర్షింపసాగును.

17. సాత్త్వికసుఖము - ఆధ్యాత్మికానందము :

ఘనమైనను, ఇంకను అవసరమే యగు సాత్త్విక సుఖమును, మానసిక జ్ఞానము, సదాచారము మఱియు శాంతివలన గలుగు సుఖములను దాటి, ఎపుడు మనము ఆత్మయొక్క నిత్యనిశ్చలతను, దివ్యసాయుజ్యముయొక్క ఆధ్యాత్మిక హర్షోత్కర్షమును బొందుదుమో, అపుడు సాత్త్విక ప్రకృతి తననుదాను అతిక్రమించుట సిద్ధించును. ఆ ఆధ్యాత్మిక హర్ష మిక సాత్త్విక సుఖముగా నుండక, పరిపూర్ణ ఆనంద మగును. ఏ రహస్య హర్షమునుండి అన్ని వస్తువులు జనించుచున్నవో, దేనిచేత అన్నియు జీవించుచున్నవో, తమ ఆధ్యాత్మిక శిఖరాగ్రమున దేనిలోనికన్నియు నారోహించగలవో, ఆ రహస్య హర్షమే ఆనందము (తై.ఉ.). అహంకారము మఱియు దాని కామనలనుండి విముక్తుడైన ముక్తపురుషుడు చివరి కెపుడు తన అత్యున్న తాత్మతో ఏకముగను, సర్వభూతములతో ఏకముగను, ఆధ్యాత్మ సత్తయొక్క ఒక నిరపేక్ష ఆనందమునందు భగవంతునితో ఏకముగను నివసించునో, అపు డా పరిపూర్ణానందము మనది కాగలదు (క.ఉ.)

౨౦. [1] స్వభావము, స్వధర్మము

1. దివ్యప్రకృతియందలి పరివర్తితరూపములు :

ఇట్లు త్రిగుణాత్మికయగు ఈ నిమ్నప్రకృతినుండి త్రిగుణాతీతయగు దివ్య పరప్రకృతిలోనికి అంతరాత్మ యొక్క విమోచక వికాసముచేతనే మనము ఉత్తమరీతిని ఆధ్యాత్మిక సంసిద్ధిని, స్వాతంత్ర్యమును బొందగలము. మఱల నీ వికాసము సర్వశ్రేష్ఠ సత్త్వగుణము యొక్క పూర్వ వికాసము చేత సాధ్యమగును; సత్త్వప్రాబల్యము తన పరాకాష్ఠను జేరుకొని, అచ్చట తనకుదానే అతిక్రమించును – తన పరిమితత్వములను దాటి, సచేతన సత్తయొక్క ఒక పరమ స్వతంత్రతలోనికి, ఒక నిర్ద్వంద్వ ప్రకాశము లోనికి, ఒక ప్రశాంత శక్తిలోనికి ప్రవేశించును; ఇచ్చట పరస్పరవిరుద్ధ గుణములచే దేని నిర్ణయము జరుగదు, అత్యున్నత మానసిక భావన ననుసరించి మనలను నూతనముగా రూపొందించు ఏ అత్యున్నత మానసిక భావన ననుసరించి మనలను నూతనముగా రూపొందించు ఏ అత్యున్నత శ్రద్ధ మఱియు లక్ష్యము గలదో, అది ఈ పరప్రకృతి – సంక్రమణముచేత మన స్వీయ వాస్తవ సత్తయొక్క ఒక అంతర్దర్శనములోనికి, ఒక ఆధ్యాత్మిక స్వరూపజ్ఞానము లోనికి రూపాంతరము జెందును. అటులే ధర్మముయొక్క ఉచ్చతమ ఆదర్శము లేక ప్రమాణము, మన ప్రాకృత జీవనముయొక్క సముచిత నియమానుసరణమును ఒక విముక్త సునిశ్చిత స్వయంభూ సంసిద్ధిలోనికి రూపాంతరము జెందును; ఇట్టి సంసిద్ధియందు ప్రమాణములపై నాధారపడుట అతిక్రమించబడును, అమర ఆత్మ మఱియు పురుషునియొక్క స్వయంప్రవృత్త ధర్మము ఉపకరణములు మఱియు అంగములయొక్క నిమ్నతర నియమమును కొట్టివేయును. ఇంకను సాత్త్విక మానసము మఱియు సంకల్పము అభేదసత్తయొక్క ఆధ్యాత్మిక జ్ఞానము మఱియు క్రియాశీల శక్తిలోనికి మాఱును, ఈ అభేదసత్తయందు సమస్త ప్రకృతియు తన మాఱువేషమును విసర్జించి, తన లోపలి భగవంతునియొక్క ఒక విముక్త స్వరూప ప్రకటన మగును. సాత్త్విక కర్త తన మూలముతో సంపర్కము గలిగి, పురుషోత్తమునితో సంయుక్తుడగు జీవు డగును; అతడిక వైయక్తిక కర్మకర్త గాడు, పరంతు విశ్వాతీత, విశ్వగత పురుషుని కర్మలకు ఒక ఆధ్యాత్మిక వాహిని. అతని ప్రకృతిగత సత్త రూపాంతరితము, ప్రదీప్తము

---

[1] గీత : అధ్యాయము 18, శ్లోకములు 40–48.

నయి, ఒక వైశ్వ నిర్వ్యక్తిక క్రియయొక్క ఉపకరణముగా, దివ్య ధనుర్ధరునియొక్క ధనువుగా నిలిచియుండును (18-78). ఏది సాత్త్విక క్రియగా నుండెనో, ఇపు డది పరిపూర్ణ ప్రకృతియొక్క స్వతంత్ర కార్యకలాపమగును; దీనియం దెట్టి వైయక్తిక పరిమితత్త్వము నుండదు, ఈయూ గుణమునందెట్టి సక్తియు నుండదు, పుణ్యపాపముల, స్వపరభావముల ఎట్టి బంధనము నుండదు. లేక ఒక పరమ ఆధ్యాత్మిక స్వయంనిర్ధారణ తప్ప, ఇతర నిర్ధారణ మేమియు నుండదు. భగవదనుసంధానము మఱియు ఆధ్యాత్మిక జ్ఞానముచే ఏకమాత్ర దివ్య కర్త హస్తములలోని కుద్ధరించబడిన కర్మలయొక్క పర్యవసాన మిదియే.

2. సామాన్యధర్మము – వైయక్తికనియమము :

కాని ప్రాచీన భారతీయ సంస్కృతియందు మిక్కిలి ప్రాధాన్యము వహించిన ఒక ప్రాసంగిక ప్రశ్న మింకను మిగిలి యున్నది; ఆ ప్రాచీన దృష్టిని విడనాడినను, దానికి సర్వసాధారణముగా సైతము అనల్ప మహత్త్వము గలదు. గీత ఇప్పటికే దీనిని గుఱించి ఒకటి రెండు మాటలు చెప్పినది (3-35, 4-13), కాని దాని యథాస్థాన మిపుడు వచ్చినది. సాధారణ భూమికయందు కర్మయంతయు గుణములచేత నిర్ణయింపబడును (3-27); మఱియు కర్తవ్య కర్మ యజ్ఞ దాన తపముల త్రివిధరూపము ధరించును, కాగా వీనిలో ప్రతికర్మయు మఱల ఏదియోయొక గుణస్వభావము ధరించును, కావున ఈ యజ్ఞదాన తపములను, అవి ఎగయగలిగినంత, అత్యున్నత సాత్త్విక శిఖరమునకు ఉద్ధరించుచు మనము పురోగమించవలెను మఱియు ఆ శిఖరమును సైతము దాటి, ఎచ్చట సర్వకర్మలు ఒక విముక్త ఆత్మదానము, దివ్య తపస్సుయొక్క ఒక శక్తి, ఆధ్యాత్మిక జీవనముయొక్క ఒక నిత్యసంస్కారము నగునో, అట్టి విశాలతలో ప్రవేశింప వలెను. కాని ఇది యొక సాధారణ ధర్మము మఱియు నీ విచారణలన్నియు సాధారణ సూత్రముల ప్రతిపాదనమే గాన, అవి సర్వక్రియలకు, సర్వమానవులకు ఒకే రీతిగా మాత్రమే వర్తించును. అందరును తుట్టతుదకు ఆధ్యాత్మిక వికాసముద్వారా ఈ ప్రబల సాధనను, ఈ మహాసంసిద్ధిని, ఈ అత్యున్నత ఆధ్యాత్మిక స్థితిని అందుకొన గలరు. కాని మనఃకర్మల సాధారణ నియమము సర్వమానవులకు ఏకమే యైనను, ఒక శాశ్వత వైవిధ్యధర్మము సైతము గలదని మనము చూడగలము, అనగా ప్రతివ్యక్తి మానవ తత్త్వము, మనస్సు, సంకల్పము, జీవనము ననుసరించియే గాక, తన

స్వీయ ప్రకృతి ననుసరించియు కర్మ చేయును; ప్రతిమానవుడు తనస్వీయ పరిస్థితులు, సామర్థ్యములు, ప్రవణత, స్వభావము, శక్తులకు గల నియమమును బట్టి విభిన్న కార్యములను నిర్వహించును లేక ఒక విభిన్న మార్గము ననుసరించును. కాగా ఆధ్యాత్మిక సాధనయందు ఈ వైవిధ్యమునకు, ఈ వైయక్తిక ప్రకృతినియమమునకు ఎట్టి స్థానమీయవలెను ?

3. స్వభావనియత స్వధర్మము :

గీత దీనిని కొంత ఒత్తి చెప్పినది. దాని కొక పెద్ద ప్రాథమిక ప్రాముఖ్యమును సైతము నిచ్చినది. గీత ఆదియందే ఏది క్షత్రియుని ప్రకృతి, నియమము మఱియు వృత్తియో, అదియే అర్జునుని "స్వధర్మ" (2-31) మని చెప్పినది; ముందుకు సాగి, ఒకడు తన స్వీయ ప్రకృతి, నియమము మఱియు వృత్తినే పాటించి, అనుష్ఠించవలె నని ప్రబలశబ్దములతో గీత విధించినది (3-35) - అది దోషయుక్తమైనను, బాగుగా అనుష్ఠింపబడిన పరధర్మము కంటె శ్రేష్ఠము. తన స్వీయ ప్రకృతిధర్మమునందు మరణము పరధర్మమువలన గలుగు విజయము కంటెను శ్రేయస్కరము. మఱియొకరి ప్రకృతిధర్మము ననుసరించుట అంతరాత్మకు అపాయకరము (3-35); వేఱు మాటలలో దాని పరిణామము యొక్క సహజగతికి విరుద్ధము, అది యాంత్రికముగా విధించిన దగును, కావుననే అన్యము, కృతకము మఱియు ఆత్మదిశగా నభివృద్ధిపట్ల నిష్ఫలము నగును. ఏది సత్తలోపలినుండి వెడలివచ్చునో, అదియే యుక్త, ఆరోగ్యకర వస్తువు, సత్యక్రియ యగును గాని, జీవితనిర్బంధములచేత లేక మానసిక భ్రాంతిచేత విధింపబడినది గాదు. ఈ స్వధర్మమునందు నాలుగు సామాన్య విభాగములు గలవు, వీనిని ప్రాచీన భారతీయ సామాజిక సంస్కృతి చతుర్వర్ణముల ధర్మములుగా బాహ్యరూపమున సూత్రీకరించి పెట్టినది - "చాతుర్వర్ణ్యం" (4-13). ఈ సూత్రీకరణము ఒక దివ్య నియమమున కనురూప మని గీత వచించును, "గుణములు మఱియు కర్మల కనురూపముగా నాచేతనే చాతుర్వర్ణ్యము సృజింపబడెను" (4-13) - సృష్టిప్రభువు ఆదియందే దీనిని సృజించిపెట్టెను. వేఱు మాటలలో సక్రియప్రకృతి యందు నాలుగు విశిష్టశ్రేణులు లేక ప్రకృతిగత జీవునికి నాలుగు ప్రాథమిక రూపములు అనగా స్వభావములు (8-3) గలవు మఱియు ప్రతి మానవజీవుని కర్మయు, వృత్తియు అతని స్వభావమున కనువుగా నుండును. ఈ కర్మవిభజన మిపుడు చివరి సారిగా, కచ్చితముగా చేయబడును. బ్రాహ్మణులు, క్షత్రియులు,

వైశ్యులు మఱియు శూద్రుల కర్మలు తమతమ అంతరప్రకృతినుండి, ఆధ్యాత్మిక స్వభావమునుండి జనించిన గుణములను బట్టి విభజింపబడినవి (18-41) - అని గీత చెప్పును. శమము, ఆత్మ సంయమము, తపస్య, శౌచము, సహిష్ణుత, నిష్కాపట్యము, ఆధ్యాత్మిక సత్యము నంగీకరించుట - ఇవి తన స్వభావమునుండి జనించిన బ్రాహ్మణుని కర్మలు (18-42). శౌర్యము, ప్రతాపము, దృఢనిశ్చయము, దక్షత, యుద్ధమున వెన్ను చూపకుండుట, దానము, శాసకుడు మఱియు నాయకునియొక్క స్వభావము - ఇవి క్షత్రియుని సహజ కర్మలు (18-43). వ్యవసాయము, గోపాలనము, వర్తకము, హస్తకళలు - ఇవి వైశ్యుని స్వాభావిక కర్మలు. సేవారూపమగు కర్మ యంతయు శూద్రుని సహజ వృత్తిలోనికి వచ్చును (18-44). తన స్వీయ కర్మయందు నిరతుడై యుండు మానవుడు, గీత యింకను చెప్పును, సంసిద్ధిని సంపాదించును (18-45); అయితే కేవల కర్మచేతనే గాదు, అతడు తన కర్మను యథార్థ జ్ఞానముతోను, యోగ్య లక్ష్యముతోను చేయుచో, సృష్టిపురుషునికి ఒక పూజగా దానిని చేయగలుగుచో, కర్మకు ప్రేరణయంతయు ఎవనినుండివచ్చునో, అట్టి జగదీశ్వరునికి హృదయపూర్వకముగా దానిని నివేదించగలుగుచో, అదిగో, అట్టి కర్మచేత సంసిద్ధిని బొందును (18-46). సమస్త శ్రమయు, సమస్త క్రియ మఱియు కార్యమును, అది ఎట్టి దైనను, ఇట్టి నివేదనచేత పవిత్రముచేయబడగలదు, అపు డా కర్మనివేదన మన లోపలను, వెలుపలను గల భగవంతుని కొక ఆత్మనివేదనలోనికి మాఱగలదు, ఇట్లు అది స్వయముగా ఆధ్యాత్మిక సంసిద్ధికి ఒక సాధనమగును. కాని సహజముగా తనది గాని ఒక కర్మ బాగుగా చేయబడవచ్చును, ఒక బాహ్య మఱియు నిర్జీవ ప్రమాణమును బట్టి చూచినపుడు, అది శ్రేష్ఠతరముగా గన్పించవచ్చును లేక అధికతర విజయమునకు నడుపవచ్చును; అయినను అంతర్వికాసముయొక్క ఒక సాధనగా అది హీనతర కర్మమే యగును ; దాని ఉద్దేశ్యము బాహ్యము, దాని ప్రేరణము నిర్జీవము నగుటయే ఇందుకు సరిగా కారణము. మఱియొక దృక్కోణమునుంచి సదోషముగా గన్పించినను, స్వభావసిద్ధ కర్మమే శ్రేష్ఠతరము. కర్మను యథార్థ భావమునందును, తన స్వభావ నియమము ననుసరించియు చేయువాడు పాపము లేక కళంకమును బొందదు (18-47). గుణభూమికయందు సర్వక్రియయు దోషయుక్తమే, సమస్త మానవ కర్మ దోషము, లోపము లేక పరిమితత్వమున కధీనమై యుండును; కాని అది మన సముచిత

కర్మను, స్వాభావిక కార్యమును విడనాడుటకు గారణము కారాదు (18-48). కర్మ యథారీతిని నియమించబడిన కర్మ గావలెను - "నియతం కర్మ" (18-23), కాని అది స్వాభావికముగా తనది గావలెను, లోపలినుంచి వికసితము గావలెను, తన సత్తాసత్యముతో సుసంగతము గావలెను, తన స్వభావము చేత నియమము గావలెను - "స్వభావనియతం కర్మ" (18-47).

4. అనువంశికవృత్తిని గీత విధించదు :

ఇచ్చట గీతాభిప్రాయము సరిగా నేమిటి ? ముందు దాని బాహ్యార్థమును చేపట్టి, గీత ప్రతిపాదించు సిద్ధాంతమును ఆ నాటి మఱియు నా జాతిభావముల వలన కలిగిన వర్ణమును పరికింతము - సాంస్కృతిక పరిసరము గల్గించిన వర్ణమును, దాని ప్రాచీన అభిప్రాయమును పరికింతము. ఈ శ్లోకములను మఱియు నీ విషయముపై గీతయొక్క పూర్వ వచనములను (2-31, 3-35) చూపి, కొందరు వర్ణవ్యవస్థపై ఇప్పుడు చెలరేగుచున్న వాదవివాదములందు ఇప్పటి వర్ణపద్ధతిని సమర్థించుచుండగా, మఱికొందరు వానినే చూపి, వర్ణవ్యవస్థయొక్క అనువంశిక ఆధారమును కొట్టివేయుచున్నారు. కాని ఈ గీతా శ్లోకములకు ఇప్పటి వర్ణవ్యవస్థతో నెట్టి సంబంధము లేదు, ఏలన చాతుర్వర్ణ్యము, అనగా ఆర్యసమాజమునందలి సునిర్దిష్టమగు నాలుగు వర్గములయొక్క ప్రాచీన సాంఘిక ఆదర్శమునుండి ఇప్పటి వర్ణవ్యవస్థ ఒక మిక్కిలి విభిన్న వస్తువు, ఇది గీతావర్ణనకు ఎవ్విధముగాను సరిపోదు. ఎట్లన వ్యవసాయము, గోపాలనము సర్వవిధ వర్తకము గీతను బట్టి వైశ్యుని కర్మ కాగా, ఇప్పటి వ్యవస్థలో వర్తకము మఱియు గోపాలనముతో ప్రమేయము గల కర్మకారులు, చిన్న వృత్తులవారిలో అధిక సంఖ్యాకులు శూద్రులుగా వర్గీకరించబడి యున్నారు - ఒకొకప్పుడు వారిని వర్ణబాహ్యు లగు పంచము లనుటయు గలదు. మఱియు కొన్ని అపవాదములతో, ఇపుడు వర్తకమును మాత్రమే చేయు ఒక వర్గ మున్నది, కాని వారిని అన్నిచోటుల వైశ్యులని పిలుచుట లేదు. నేడు బ్రాహ్మణులనుండి శూద్రులవఱకు సర్వవర్గములకు వ్యవసాయము, ప్రజాశాసనము, సేవాకర్మ వృత్తులుగా నుండుట గన్పించును. వృత్తియొక్క ఆర్థికవిభజనలే యిప్పటి వ్యవస్థయందు సరిచేయుటకు వీలులేని రీతిగా సంకరమై పోగా, గుణమును బట్టి కర్మ-అను సూత్రమునకు ఆ మాత్రము స్థానము గూడ మిగుల లేదు. ఇపుడు సర్వము నొక కఠోర ఆచారము, దీనికి వైయక్తిక స్వభావము యొక్క ఆవశ్యకతతో నెట్టి సంబంధము

నుండదు. పోగా వర్ణవ్యవస్థను సమర్థించువారి వాదముయొక్క మతపార్శ్వమునకు తిరిగి నప్పటికి, వారి విపరీత భావమును గీతావచనములకు మన మెంతమాత్రము అంటగట్టజాలము - తన వ్యక్తి గత ప్రవణతను, సామర్థ్యములను పాటించక, మానవుడు తన తల్లిదండ్రుల లేక పూర్వుల వృత్తి ననుసరించుటయే అతని స్వభావధర్మ మని గీత ఎచ్చటను చెప్పదు, అనగా పాలవాని కొడుకు పాలవాడే, డాక్టరు పుత్రుడు డాక్టరే, చర్మకారుని సంతతి యుగాంతమువఱకు చర్మకారులే గావలె నని గీత చెప్పదు; ఇంకను, అట్లు చేయుటచేత, అనగా తన స్వీయ ప్రేరణను, గుణములను లక్షించక, మఱి యొకని స్వభావధర్మమును ఇట్లు వివేకరహితముగా, యాంత్రికముగా కొనసాగించుటచే మానవుడు తన స్వీయ పూర్ణతను అప్రయత్నముగనే పెంపొందించుకొనుచు, ఆధ్యాత్మిక స్వతంత్రతకు చేరుకొను నని గీత అసలే వచించదు. తన ఆదర్శశుద్ధత యందు వర్తించుచుండిన లేక వర్తించుచుండినట్లు తలంచబడిన చతుర్వర్ణముల ప్రాచీన వ్యవస్థనే గీతావచనములు నిర్దేశించును మఱియు గీత ఉద్దేశించిన వ్యవస్థనే మనము విచారించదగును - ఆచరణయందు అంతంతమాత్రముగా అనుష్ఠింపబడిన ఒక (అప్రాప్త) ఆదర్శమే గాని, ఇది మఱేదియు గాదని వాదించువారును గలరు. కనుక వర్ణవిషయమునను, దాని యథార్థ బాహ్యరూపమును గుఱించియు పెద్ద కఠినత ఎదురగును.

5. వర్ణవ్యవస్థయొక్క త్రివిధరూపము :

చతుర్వర్ణముల ప్రాచీనవ్యవస్థకు మూడు రూపములుండెను ; అది ఒక సాంఘిక మఱియు ఆర్థిక, ఒక సాంస్కృతిక మఱియు నొక ఆధ్యాత్మిక రూపమును ధరించెను. ఆర్థిక పార్శ్వమునందు అది సమాజములోని మానవులకు నాలుగు వృత్తులను గుర్తించెను - ధార్మిక మఱియు బౌద్ధిక, రాజకీయ, ఆర్థిక మఱియు సేవాత్మక వృత్తులు. వీనిని బట్టి కర్మలు నాల్గు విధములు - 1. పౌరోహిత్యము, సాహిత్యము, విద్య మఱియు జ్ఞానకర్మ, 2. ప్రభుత, రాజనీతి, పాలనము మఱియు యుద్ధకర్మ, 3. ఉత్పత్తి, ధనార్జనము మఱియు వినిమయకర్మ, 4. కూలి మఱియు సేవాకర్మ. ఈ నాలుగు వృత్తులను నాలుగు సునిర్దిష్ట వర్గముల మధ్య విభజించి, ఆ విభజనపై సమాజవ్యవస్థ నంతను గట్టిగా స్థాపింప ప్రయత్నము చేయబడెను. ఈ వ్యవస్థ భారతదేశముయొక్క విలక్షణ వస్తువు గాదు, పరంతు తదితర ప్రాచీన లేక మధ్యయుగీన సమాజములందు గూడ, అది కొన్ని మార్పులతో ఒక సాంఘిక

వికాసదశయొక్క ప్రధాన రూపుగా నుండెను. ఈ నాలుగు వృత్తులు సర్వ సామాన్య సమాజముల జీవనమునందు ఇంకను అనుస్యూతముగా నున్నవి, కాని ఆ విస్పష్ట విభజన మాత్రమే ఇప్పు డెచ్చటను లేదు. ప్రాత పద్ధతి సర్వత్ర భగ్నమై, ఒక ఎక్కువ ద్రవరూప విధానమునకు, లేక, భారతమునందు వలె, ఒక అస్తవ్యస్త జటిల సాంఘిక కఠోరత మఱియు ఆర్థిక స్తబ్ధతకు స్థాన మిచ్చినది మఱియు నీ అస్తవ్యస్తత వర్ణసంకరములోనికి దిగజాఱుచున్నది. ఈ ఆర్థిక కర్మవిభజన ప్రక్కన ఒక సాంస్కృతిక భావ ముండెను; ఇది ప్రతివర్ణమునకును దాని మతాచారమును, మర్యాదాధర్మమును, నైతికనియమమును, అనురూప విద్య మఱియు శిక్షణను, శీలవిశేషమును, కుటుంబాదర్శమును, క్రమ శిక్షణను నిర్ణయించుచుండెను. అయితే జీవనతథ్యములు సర్వదా ఈ భావము ననుగమించ లేదు, ఏలన మానసిక ఆదర్శమునకును, ప్రాణిక మఱియు శారీరిక అనుష్ఠానమునకును మధ్య ఎల్లపుడు కొంత వ్యవధాన ముండును; కాని ఈ భావము ననుగమించుటకు ఒక సంతత శ్రమశీల ప్రయత్నము చేయబడు చుండెను. ఈ ప్రయత్నముమఱియునది సాంఘిక మానవుని గతశిక్షణయందు సృజించిన సాంస్కృతికాదర్శము మఱియు వాతావరణముయొక్క ప్రాముఖ్యము నెంత చెప్పినను తక్కువే యగును; కాని వర్తమానమున దానికి ఒక చారిత్రక, ఒక భూతకాలిక మఱియుపరిణామాత్మక ప్రాముఖ్యము తప్ప మఱేమియు మిగుల లేదు. చివరకు, ఈ వ్యవస్థ ఎచ్చటెచ్చట నుండినను, దాని కొక న్యూనాధిక మతసమర్థన లభించెను (ప్రాచ్యదేశములం దెక్కువ, యూరోపునందు కడు స్వల్పము) మఱియు నిండియాలో దాని కొక గంభీరతర ఆధ్యాత్మిక ఉపయోగము మఱియు పరమార్థము కనుగొన బడెను. ఆ ఆధ్యాత్మిక పరమార్థమే గీతాబోధనయొక్క వాస్తవ సారము.

6. వర్ణవ్యవస్థ సనాతన, సార్వత్రికము గాదు :

గీతాకాలము నాటికే ఈ వ్యవస్థ యుండెను మఱియు దాని ఆదర్శము భారతీయ మనస్సు నాకట్టుకొని యుండెను. కాగా గీత ఆ ఆదర్శము మఱియు వ్యవస్థ, దానికి గల ధార్మిక పరిగణన – రెండింటిని ఆమోదించెను, "గుణవిభాగము మఱియు కర్మవిభాగమును బట్టి నేనే చాతుర్వర్ణ్యమును సృజించితిని" (4–13) – అని శ్రీకృష్ణుడు చెప్పును. కేవలము ఈ వాక్యబలమును బట్టి, ఈ వ్యవస్థ ఒక సనాతన మఱియు సార్వత్రిక సాంఘిక వర్గీకరణ మని గీత భావించి నట్లు నిర్ణయించజాలము. ఇతర ప్రాచీన శాస్త్రము లట్లు భావించలేదు; పైగా ఆదియందు అది ఉండను లేదు,

తర్వాతి కాలమున అది రూపుమాసియు బోవును. అయినను ప్రతిసమాజముయొక్క మానసిక మఱియు ఆర్థిక అవసరములందు సాంఘిక మానవుని ఈ చతుర్విధ కర్మప్రాయఃఅంతర్వర్తిగా నుండును; అందుచేత సమష్టి మఱియు వ్యష్టి మానవజీవనమునందు తననుదాను ప్రకటించుకొనె భగవంతుని సృష్టియే చాతుర్వర్ణ్యము - అని పై గీతావాక్యమును మనము వ్యాఖ్యానించుకొనవచ్చును. ఈ గీతా పంక్తి (4-13) నిజానికి వైదిక పురుష సూక్తమునందలి (ఋ.వే.10-90) సుప్రసిద్ధ సంకేతము యొక్క (బ్రాహ్మణో-స్య ముఖ మాసీత్....) ఒక బౌద్ధిక ప్రతిపాదనము. కాని అప్పుడు ఈ చతుర్విధ కర్మల అనుష్ఠానమునకు ఏది ఆధారము మఱియు రూపము గావలెను ? ప్రాచీన కాలమున అనువంశికతయే కర్మవిభజనకు క్రమముగా వ్యావహారికాధార మయ్యెను. సందేహము లేదు, ఆదియందు మానవుని సాంఘిక వృత్తి మఱియు గౌరవము పరిసరము, సందర్భము, జన్మ మఱియు సామర్థ్యముచేత నిర్ణయింపబడుచుండెను; నిజానికి ఎక్కువ స్వతంత్రము, తక్కువ వ్యవస్థితము నగు సమాజములందు ఇప్పటికిని అటులే జరుగుచున్నది. కాని కఠోర వర్గీకరణము గట్టి పడిన కొలది, వ్యవహారమునం దతని స్థానము ప్రధానముగానో, కేవలముగానో జన్మచేతనే నియతము గాజొచ్చెను మఱియు తర్వాతి కులవ్యవస్థయందు జన్మయే ప్రతిష్ఠను నిర్ణయించు ఏకమాత్ర నియమముగా రూపొందెను. ఉదాహరణకు, ఒక బ్రాహ్మణపుత్రునికి బ్రాహ్మణ గుణములు లేక శీలము ఏమాత్రము లేకపోవచ్చును; ఎట్టి బౌద్ధిక శిక్షణ గాని, ఆధ్యాత్మి కానుభవము గాని, ధార్మిక యోగ్యత లేక జ్ఞానము గాని లేకపోవచ్చును; అటులే తన వర్ణముయొక్కసముచితకర్మతో అతని కెట్టి సంబంధము, అతని కర్మయం దెట్టి బ్రాహ్మణత్వము, అతని ప్రకృతియం దెట్టి బ్రాహ్మణత్వము లేకపోవచ్చును, అయినను ప్రతిష్ఠయం దతడు బ్రాహ్మణుడే.

7. కర్మ స్వభావజము, స్వభావనియతము :

ఇది యొక అనివార్య పరిణామము, ఏలన బాహ్య చిహ్నములు మాత్రమే నిర్ణయించుటకు సులభము మఱియు అనుకూలము; కావున అధికాధికముగా యంత్రీకృతము, జటిలము, సాంప్రదాయికము నగు ఒక సాంఘిక వ్యవస్థయందు జన్మయే వర్ణనిర్ణయమునకు మిక్కిలి అనుకూలముగా నుండెను. ఒక వ్యక్తియందు వంశమును బట్టి ఉండవలసిన గుణములకును, వాస్తవ సహజాత స్వభావ సామర్థ్యములకును మధ్య నుండగల అసమతను కొంతకాలము విద్యాశిక్షణలచేత

సరిపుచ్చిరి లేక తగ్గించిరి; కాని చివరి కీ ప్రయత్నము అసాధ్యముకాగా, అనువంశిక సంప్రదాయమే అప్రతిహత నియమ మయ్యెను. ప్రాచీన స్మృతికర్తలు (law-givers) అనువంశిక ఆచారమునకు స్థాన మిచ్చుచునే, గుణము, స్వభావము మఱియు సామర్థ్యములను వర్ణనిర్ణయమునకు పటిష్ఠ వాస్త వాధారముగా నొక్కిచెప్పిరి; ఏలన అది లే నపుడు అనువంశిక సాంఘిక ప్రతిపత్తి తన యథార్థ ఆశయమును గోల్పోయి, ఆధ్యాత్మికతాగంధము లేని అనృత మగును. గీత సైతము, ఇతరత్ర వలెనే ఇచ్చటను, ఆంతరాశయమునే తన విచారణ కాధారము గావించుకొనును. నిజమే, గీత ఒక చోట జన్మతో వచ్చిన కర్మను చెప్పును - "సహజం కర్మ" (18-48); కాని ఇది స్వయముగా అనువంశి కాధారమును సూచించదు. కారణము, గీత ఆమోదించిన భారతీయ పునర్జన్మ సిద్ధాంతము ననుసరించి, మానవుని జన్మతో వచ్చిన సహజ ప్రకృతి మఱియు జీవన గతి వస్తుతః తన గత జన్మలచేత నిర్ణయించబడును; అవి తన గత కర్మలచేతను, మానసిక మఱియు ఆధ్యాత్మిక వికాసముచేతను ఇప్పటికే సాధించబడిన ఆత్మవికాస మగును మఱియు నవి అతని వంశము, మాతాపితలు, శారీరిక జన్మలయొక్క స్థూల కారణముపైన మాత్రమే ఆధారపడవు; ఈ స్థూల కారణ మొక గౌణ ప్రభావము, బహుశః ఒక కార్యసాధక చిహ్నము కాగలదు గాని, ప్రధాన తత్త్వము మాత్రము గాజాలదు. సహజ - శబ్దమున కర్థము మనతో జనించినది, ఏది నైసర్గికమో, అంతర్జాతమో, స్వభావసిద్ధమో అది. ఈ సహజ శబ్దమునకు ఇతర శ్లోకాలలో సమానార్థకము "స్వభావజము" (18-42, 43, 44, 60). ఒకని కర్మ లేక వృత్తి అతని గుణములచేత నిర్ణీత మగును (4-13, 18-60). అనగా గుణము కర్మను నిర్ణయించును; అది స్వభావమునుండి జనించిన కర్మ- "స్వభావజం కర్మ" మఱియు స్వభావముచేత నియమించబడు కర్మ - "స్వభావనియతం కర్మ" (18-47). కర్మయందును, వృత్తియందును, క్రియయందును తనను ప్రకటించుకొను ఆంతర గుణము మఱియు స్వభావముపై ఏ అవధారణ (emphasis) గలదో, అదియే కర్మకు సంబంధించిన గీతాభావముయొక్క సంపూర్ణాశయము.

8. ఆర్యుల చాతుర్వర్ణ్యము - గీతాచాతుర్వర్ణ్యము :

గీత వెలుపలిరూపమును గాక, లోపలి సత్యమునే ఒత్తి చెప్పును ; ఈ అవధారణనుండియే స్వధర్మానుష్ఠానము నకు గీత నిర్దేశించు ఆధ్యాత్మి కార్థము

మఱియు ప్రభావము ఉత్పన్నమగును. ఈ ప్రకరణమునకు నిజముగా ముఖ్యమగు ఆశయ మిదియే. బాహ్య సామాజిక వ్యవస్థతో ఈ ప్రకరణమునకు గల గోరంత సంబంధమును కొండంత చేతురు, ఈ వ్యవస్థను వ్యవస్థకొఱకే గీత పోషించుచున్నట్లు లేక ఒక ధార్మిక – దార్శనిక సిద్ధాంతముతో దానిని సమర్థించుచున్నట్లు చెప్పుదురు. నిజానికి గీత బాహ్య నియమమును మిక్కిలి తక్కువ, ఆంతరధర్మమును మిక్కిలి ఎక్కువ ఒత్తి చెప్పును – ఈ ఆంతరధర్మమును నియతముగా ననుష్ఠించుటకే వర్ణవ్యవస్థ ప్రయత్నించెను. మఱియు ఈ ధర్మము యొక్క సామాజిక మఱియు ఆర్థిక లేక తదితర సాంఘిక మఱియు సాంస్కృతిక ప్రాముఖ్యమునందు గాక, దాని వైయక్తిక మఱియు నాధ్యాత్మిక మూల్యమునందే గీత ఈ ప్రకరణమున తన దృష్టిని నిలిపియుంచును. గీత వైదిక యజ్ఞసిద్ధాంతము నంగీకరించెను, కాని దాని విలువల నన్నింటిని మార్చివేయు నట్లు, దాని కొక గంభీర పరివర్తనమును (మలుపును), ఒక ఆంతర, మానసిక మఱియు సార్వత్రికార్థమును, ఒక ఆధ్యాత్మికాశయము మఱియు దిశావిశేషమును గల్పించెను. అపుడు వెంటనే ఈ సిద్ధాంతము వెనుక నున్న భావము తన విలువలను మార్చుకొని, ఒక శాశ్వత సజీవ సత్య మగును – ఈ సత్యము ఒక ప్రత్యేక సామాజిక రూపము మఱియు వ్యవస్థ యొక్క నశ్వరత్వముతో ముడివడియుండదు. ఇపుడు నిరాకరించబడిన లేక కరగి పోవుచున్న ఆర్యుల సాంఘిక వ్యవస్థయొక్క ప్రామాణికతను నిరూపించుట గీతా ఉద్దేశ్యము గాదు – అదియే అంతయు నగుచో, స్వభావ స్వధర్మముల గీతాసిద్ధాంతము నకు ఎట్టి శాశ్వత సత్యము లేక మూల్యము నుండదు – పరంతు మానవుని ఆంతర సత్తతో అతని బాహ్య జీవనమునకు గల సంబంధమును, అతని అంతరాత్మ మఱియు ఆంతర ప్రకృతిధర్మమునుండి అతని కర్మవికాసమును చూపుటయే గీతోద్దేశ్యము.

9. శమము కర్మ యగునా ? :

మఱియు గీత నిజానికి తన ఉద్దేశ్యమును స్వయముగనే ఎట్లు స్పష్టపఱచునో మనము చూడవచ్చును : గీత బ్రాహ్మణ క్షత్రియుల కర్మను బాహ్యవృత్తియొక్క పరిభాషయందు వర్ణించదు, అనగా విద్య, పౌరోహిత్యము మఱియు సాహిత్యము లేక శాసనము, యుద్ధము మఱియు రాజనీతి యని చెప్పదు, పరంతు పూర్తిగా ఆంతర స్వభావముయొక్క పరిభాషలోనే నిర్వచించును. ఈ పరిభాష మన చెవికి

ఇంచుక విచిత్రముగా తట్టును. శమము, దమము, తపస్య, శౌచము సహిష్ణుత, ఆర్జవము, జ్ఞానము, ఆధ్యాత్మిక సత్యముయొక్క ఆమోదము మఱియు అనుష్ఠానము (18-42) - ఇవి సాధారణముగా మానవునియొక్క కర్మ లేక వృత్తి యని వర్ణించబడవు. అయినను గీత సరిగా దీనినే ఉద్దేశించును మఱియు వచించును - ఈ వస్తువులు, వాని వివర్ధనము, వ్యవహారమునందు వాని ప్రకటనము, సాత్త్విక ప్రకృతియొక్క ధర్మమునకు బాహ్యరూపము గల్పించుట : ఇవియే బ్రాహ్మణుని వాస్తవ కర్మ. కాగా విద్య, పౌరోహిత్యము, తదితర బాహ్యకర్మలు ఈ వాస్తవ కర్మయొక్క మిక్కిలి ఉపయుక్త క్షేత్రము మాత్రమే యగును, ఈ ఆంతర వికాసముయొక్క ఒక అనుకూల సాధనము మాత్రమే యగును, దాని యొక్క సముచిత స్వీయ ప్రకటన మగును, సుస్థిరాదర్శమునందును, బాహ్యీకృత దృఢస్వభావమునందును తనను ప్రతిష్ఠించుకొను మార్గ మగును. యుద్ధము, పాలనము, రాజనీతి, నేతృత్వము మఱియు శాసనము అటులే క్షత్రియునికొఱకు ఒక క్షేత్రము మఱియు సాధన మగును; కాని అతని వాస్తవ కర్మ రాజోచిత లేక వీరోచితమగు సక్రియ యోద్ధృధర్మము యొక్క వికాస మగును, ఆచరణయందు దాని ప్రకటన మగును, రూపములోనికిని, క్రియాశీల గతిక్రమములోనికిని దానిని పోత పోయు శక్తి యగును. అయితే వైశ్యుని మఱియు శూద్రుని కర్మ బాహ్య వృత్తికి సంబంధించిన పరిభాషలోనే చెప్పబడినది, మఱియు ఈ మార్పునకు కొంత అర్థ ముండవచ్చును. ఏలన ఉత్పాదనము మఱియు ధనార్జనమునకు ప్రేరితమైన లేక శ్రమ మఱియు సేవాపరిధిలో బంధింపబడిన స్వభావము, అనగా వ్యాపార మఱియు దాస్య మనోవృత్తులు సామాన్యముగా బహిః ప్రవృత్తములు, అవి తమ కర్మయొక్క శీల నిర్మాణశక్తియందు కంటె దాని బాహ్యమూల్యములయందే ఎక్కువ చిక్కుకొని యుండును, మఱియు నీ ప్రవృత్తి స్వభావముయొక్క సాత్త్విక లేక ఆధ్యాత్మిక క్రియకు అంత అనుకూలము గాదు. ఈ కారణముచేతనే ఒక వ్యాపారిక మఱియు పారిశ్రామికయుగము, లేక కర్మ మఱియు శ్రమభావముతో వ్యగ్రమైన ఒక సమాజము ఆధ్యాత్మిక జీవనమున కంటె భౌతికమునకే ఎక్కువ అనుకూలమగు వాతావరణమును తన చుట్టును సృజించుకొనును, ఇది ఊర్ధ్వగామి మనస్సు మఱియు అంతరాత్మ యొక్క సంసిద్ధికి గాక, ప్రాణిక నైపుణ్యమునకే ఎక్కువ తగియుండును. అయినను ఇవ్విధమగు

స్వభావము మఱియు దాని వృత్తులు సైతము తమ ఆంతర తాత్పర్యమును, ఆధ్యాత్మిక మూల్యమును గలిగి యున్నవి, అందుచేత సంసిద్ధి కొక సాధనము మఱియు శక్తిగా వానిని రూపొందించవచ్చును. ఇతరత్రా చెప్పబడినట్లు (9-33, 32) ఆధ్యాత్మికత, నైతిక పవిత్రత మఱియు జ్ఞాన - ఆదర్శము గల బ్రాహ్మణుడు మఱియు ఉదాత్తత, వీరత మఱియు ఉన్నత శీలము గల క్షత్రియుడు మాత్రమే గాక, ధనపరాయణుడగు వైశ్యుడు, శ్రమనిబద్ధుడగు శూద్రుడు, సంకుచిత పరిచ్ఛిన్న పరాధీన జీవనము గల స్త్రీ, చివరకు పాపగర్భమునందు జనించిన వర్ణబాహ్యులు - "పాపయోనయః" (9-32) : వీ రందరు సైతము అత్యున్నత ఆంతర మహత్త్వము మఱియు ఆధ్యాత్మిక స్వాతంత్ర్యము దిశగా, సంసిద్ధి దిశగా, మానవ సత్తయందు గల దివ్యాంశముయొక్క విముక్తి మఱియు పరిపూర్తి దిశగా ఈ మార్గమున వెంటనే ఎగయగలరు.

10. స్వభావము - మూడు ప్రతిజ్ఞలు :

ప్రథమ దృష్టికే మనకు మూడు ప్రతిజ్ఞలు (propositions) తోచును మఱియు నివి గీత ఈప్రకరణము చెప్పు సమస్తము నందును అంతర్గతములని తలంచవచ్చును. 1, సమస్త క్రియయు లోపలినుండి నిర్ణయించబడవలెను, ఏలన ప్రతిమానవునియందు తన స్వీయ వస్తు వొకటి గలదు, తన ప్రకృతియొక్క ఒక విలక్షణ తత్త్వము మఱియు అంతర్జాత శక్తి గలదు (15-7). అది అతని పురుష తత్త్వముయొక్క కార్యసాధక శక్తి, అది ప్రకృతిగత మగు తన అంతరాత్మయొక్క సక్రియరూపమును సృజించును మఱియు దానిని క్రియద్వారా ప్రకటించుట మఱియు పూర్ణముగావించుట, సామర్థ్యమునందును, ప్రవర్తనయందును, జీవనమునందును ప్రబలము గావించుటయే అతని కర్మయగును; ఆ లోపలి తత్త్వమే అతని ఆంతర మఱియు బాహ్య జీవనముయొక్క యథార్థ మార్గమును సూచించును మఱియు నతని అధికతర వికాసమునకు ప్రారంభ బిందు వగును. 2, స్థూలముగా ప్రకృతికి నాలుగు మూలరసములు గలవు, ఈ ప్రతిరూపమునకు దాని స్వాభావిక వృత్తి యుండును, కర్మశీలములకు సంబంధించిన దాని ఆదర్శ నియమ ముండును మఱియు దాని సముచిత పరిధిని నిర్ణయించ గలుగును (18-41), 3, చివరకు, మానవు డే కర్మ చేసినను, దానిని తన సత్తాధర్మమును, తన ప్రకృతిసత్యమును అనుసరించి చేయు నేని, దానిని భగవంతుని వైపునకు త్రిప్పి, ఆధ్యాత్మిక విముక్తి మఱియు సంసిద్ధికి

ఒక పటిష్ఠ సాధనము గావించుకొన గలడు (18-45). వీనిలో మొదటి మఱియు మూడవ ప్రతిజ్ఞలు స్పష్టమగు నొక సత్యము మఱియు న్యాయముయొక్క సూచనలు. మానవుని వైయక్తిక మఱియు సామాజిక జీవనముయొక్క సామాన్య ప్రకారము నిక్కముగా ఈ సూత్రములకు ఒక వ్యాఘాతముగా గన్పించును; ఏలన నిశ్చయముగా బాహ్య ఆవశ్యకత, నియమము మఱియు ధర్మముయొక్క ఒక భీషణ భారము మనము వహింతుము, మఱియు స్వీయాభి వ్యక్తినిమిత్తము, మనలోని సత్యపురుషునియొక్క వాస్తవ అంతరాత్మయొక్క మఱియు జీవితమునందు మన ఆంతరతమ విలక్షణ ప్రకృతిధర్మముయొక్క వికాసమునిమిత్తము మన కే అవసరము గలదో, దానితో పదపదమునందు పరిసర ప్రభావములు జోక్యము కల్పించుకొనును, దానిని అడ్డగించును, దారి తప్పించును, దానికి గల అవకాశమును, క్షేత్రమును మృగ్య మొనరించును. జీవితము, ప్రభుత్వము, సమాజము, కుటుంబము - సర్వవిధ పరిసర శక్తులు మన స్వభావముపై తమ కాడిని మోపుటకు, తమ గాడిలోనికి మనలను లాగుటకును, తమ స్థూలప్రయోజన మును, స్థూల తాత్కాలిక ఆనుకూల్యమును మనపై విధించుటకును కుట్ర పన్నినట్లు గన్పించును. ఇట్లు మనము యంత్రభాగముల మగుదుము; వాస్త వార్థమున "పురుషులు" మఱియు "మనుష్యులు"గా జీవించ మన కవకాశ మివ్వబడదు, అనగా మన సత్తయొక్క అత్యున్నత స్వీయ సంసిద్ధిని సాధించుటకును, దానిని జాతిసేవ కొక సాధనము చేసికొనుటకును సామర్థ్యము గల అంతరాత్మలు, మనస్సులు మఱియు ఆత్మయొక్క విముక్త పుత్రులముగా జీవించజాలము. కావున మనము పరిస్థితుల పుత్రులమే గాని, స్వీయ నిర్మాతలము గాము - అనిపించును. అయినను ఎంతెంత మనము జ్ఞానమునందు పురోగమింతుమో, గీతానియమముయొక్క సత్యము అంతంతగా గోచరించితీరును. బాలుని విద్య, అతనిలో నేది శ్రేష్ఠాంశమో, మిక్కిలి శక్తివంతమో, మిక్కిలి ఆంతరము మఱియు సజీవమో, దాని ఆవిష్కరణము గావలెను. మానవుని కర్మ మఱియు వృద్ధి అతని స్వభావగత గుణము మఱియు శక్తిరూపము ధరించవలెను. అతడు నూతన వస్తువుల నార్జించవలసినదే, కాని తన స్వీయ వికసిత మూలరూపము మఱియు అంతర్జాత శక్తియొక్క ఆధారముపైననే వానిని శ్రేష్ఠముగా, పటిష్ఠముగా నార్జించగలడు. అటులే మానవుని వృత్తియు నతని సహజ ప్రవృత్తి, సంపత్తి మఱియు

సామర్థ్యములచేత నిర్ణయింపబడదగును. ఈ రీతిని స్వతంత్రముగా వికాసము నందుచుండు వ్యక్తి ఒక సజీవ ఆత్మ మఱియు మానసముగా భాసించును మఱియు జాతిని సేవించుట కతనికి ఎంతో ఎక్కువ శక్తి యుండును. ఈ గీతానియమము వ్యష్టిమానవుని పట్లనే గాక, సమాజము మఱియు జాతి, సముదాయాత్మ, సమష్టి మానవుని పట్ల సైతము సత్య మని ఇపుడు మనము స్పష్టముగా జూడగలము. అయితే చతుర్వర్ణములు, వాని వృత్తులకు సంబంధించిన రెండవ ప్రతిజ్ఞ ఎక్కువ వివాదాస్పదము. అది జీవన జటిలతను, మానవ ప్రకృతి యొక్క సమనశీలతను (plasticity) తగినంతగా పరిగణించదు, అది అతిసరళము మఱియు నతినిశ్చితము; మఱియు చాతుర్వర్ణ్యసిద్ధాంతము, దాని అంతర్గత యోగ్యత లెట్టివైనను, దాని బాహ్య ప్రయోగము యాంత్రిక నియమముయొక్క క్రూర కాఠిన్యమునకే దారితీయును మఱియు నట్టి కాఠిన్యము సరిగా స్వభావగతమగు స్వధర్మమునకే సర్వవిధ వ్యాఘాత మగును. కాని ఈ సిద్ధాంతముయొక్క లోతులలో దీనికి తక్కువ వివాదాస్పదమగు మూల్యము నిచ్చు ఒక గభీరతరార్థము గలదు. ఒకవేళ దీనిని మనమునిరాకరించినను, మూడవ సూత్రము తన విశాలార్థమున నిలిచియే యుండును : జీవితమునందు ఒకని కర్మ మఱియు వృత్తి ఎట్టి దైనను, అది లోపలినుంచి నిర్ణయింపబడు నేని లేక తన ప్రకృతియొక్క స్వీయప్రకటనముగా దానిని చేసికొన నతని కవకాశ మీయ బడునేని, అతడు దానిని తన అభివృద్ధికి, అధికతర ఆంతరసంసిద్ధికి ఒక సాధనముగా మలచుకొనగలడు. మఱియు తన స్వభావసిద్ధ వృత్తి ఎట్టి దైనను, అతడు దానిని సరియగు భావమున ఆచరించునేని, ఆదర్శ మానసముతో దానిని ప్రదీప్తము గావించునేని, లోపలి భగవంతుని ఉపయోగార్థము తన వృత్తికర్మను మరల్చు నేని, అటులే విశ్వమునందు అభివ్యక్తమగు విశ్వపురుషుని దానితో సేవించునేని లేక మానవజాతియందలి భగవంతుని ప్రయోజనార్థము దాని నొక సచేతన ఉపకరణ క్రియ గావించునేని, పరమ ఆధ్యాత్మిక సంసిద్ధి మఱియు స్వాతంత్ర్యమునకు అతడు దాని నొక సాధనముగా రూపాంతరము జెందించు కొనగలడు.

11. సంసిద్ధశక్తి లోపలనే గలదు :

కాని యివ్విషయమున గీతాబోధనకు ఇంతకంటెను గంభీరతరార్థము గలదు – సాధారణముగా చేయబడు నట్లు, అర్థమున స్వయంపూర్ణమగు ఒక వియుక్త ఉ

దాహరణగా దానిని తీసికొనక, గీత ఆద్యంతము, విశేషించి చివరి పండ్రెండు అధ్యాయములలోను ఏమి చెప్పుచు వచ్చినదో, దాని అంతటితో బాటు తీసికొనినచో – మనము చేయదగిన దిదియే – అపు డా గంభీరతరార్థము స్పష్టపడును. జీవితము మఱియు కర్మవిషయమున గీతాసిద్ధాంత మేమన, సర్వము దివ్యసత్తనుండి, విశ్వాతీత విశ్వగత పరమ పురుషునుండి ప్రభవించును (10–8). అంతయు వాసుదేవునియొక్క (7–19) ప్రచ్ఛన్న అభివ్యక్తియే – "యతః ప్రవృత్తిర్ భూతానాం యేన సర్వ మిదం తతం" (18–46). కాగా, హృదయములోను, జగత్తులోపలను గల అమృతపురుషుని ఆవిష్కరించుట, జగదాత్మతో ఏకతయందు నివసించుట, చేతన, జ్ఞానము, సంకల్పము, ప్రేమ మఱియు ఆధ్యాత్మికానందమునందు పరమపురుషునితో ఏకతలోని కెగయుట, మన వ్యక్తిగత మఱియు ప్రకృతిగత సత్త అపూర్ణత మఱియు అజ్ఞానమునుండి విముక్తమై, దివ్యశక్తికి ఒక సచేతన ఉపకరణము చేయబడిన స్థితిలో అత్యున్నత ఆధ్యాత్మిక ప్రకృతియందు జీవించుట – ఇదిగో, యిది మానవజాతికి సాధ్యమగు సంసిద్ధి మఱియు అమరత్వ స్వాతంత్ర్యమునకు పరమ నిబంధనము. కాని యిది ఎట్లు సంభవమగును ? ఏలన మన మిపుడు ప్రాకృతాజ్ఞానములో మునిగియున్నాము, అంతరాత్మ అహంకార కారాగారమున బంధింపబడియున్నది, పరిస్థితులు మనలను ఓడించి, ఆక్రమించి, మర్దించి, మనకు ప్రాకృతరూప మిచ్చినవి, ప్రకృతి యాంత్రిక విధానమున కిపుడు అధీనులము మఱియు మన స్వీయ రహస్య ఆధ్యాత్మిక శక్తియొక్క వాస్తవికాలంబనము నఱికివేయబడినది. ఈ ప్రశ్నకు సమాధాన మేమన, ఈ ప్రాకృత క్రియ యంతయు, ఇపు డది ఒక విరుద్ధ వ్యాపారమునం దెంతగా ఆవృతమై యున్నను, తన స్వీయ వికసనశీల విముక్తి మఱియు సంసిద్ధిసూత్రమును తనలోనే గలిగియున్నది. ఒక దేవాధిదేవుడు ప్రతివాని హృదయమున ఆసీనుడై యున్నాడు మఱియు ప్రకృతి యొక్క ఈ నిగూఢ చర్యను నడుపుచున్నాడు (18–61). ఈ విశ్వపురుషుడు, సర్వముతానే యైన ఈ ఏకుడు, యంత్రము నెక్కిన వారివలె మనలను జగచ్చక్రమున మాయాప్రభావముచే త్రిప్పుచు, కుండను కుమ్మరివలె, బట్టను నేతగాని వలె, ఒకానొక సునిపుణ యాంత్రిక సూత్రముచే మనకు తెలియకయే మనలను మలచుచున్నట్లు పొడకట్టినను, అతడు నిజానికి మన స్వీయ మహత్తమ ఆత్మయే మఱియు నిజానికతడు తన సర్వజ్ఞ

సర్వశక్తతయందు మనకు సంబంధించిన మూలభావమును, మన అంతరాత్మ సత్యమును బట్టియే మన కధికాధికముగా రూపమును దిద్దుచున్నాడు; ఇ ట్టీ అంతరాత్మ సత్యము మనలో వృద్ధి నందుచు, జన్మజన్మలయందు నూతన, పర్యాప్తతర రూపములను బొందుచున్నది, అనగా నది పశురూపమును వీడి మానవరూపమును, దీనిని వీడి దివ్యరూపమును బొందును; మనకుకనువిప్పు కలిగినకొలది ఈ సత్యమును కనుగొందుము. అహంకారముయొక్క ఈ యాంత్రికవిధానము, త్రిగుణముల ఈ జటిలత, మనఃప్రాణ శరీరములు, ఆలోచనా భావ కామనలు, ఆకాంక్షా ప్రయాస ప్రయత్నముల యొక్క ఈ సంకులత్వము ; సుఖదుఃఖములు, పుణ్యాపాపములు, జయాపజయములు, ఆత్మ మఱియు పరిసరము, నేను మఱియు నితరుల ఈ పరస్పర సంబద్ధ సంఘర్షము - ఇవి యన్నియు నాలోని ఉచ్ఛతర ఆధ్యాత్మిక శక్తి ధరించిన బాహ్య అపూర్ణ రూపము మాత్రమే; ఈ శక్తి తన వివిధావస్థలద్వారా దివ్యసత్యతయొక్క ఉత్తరోత్తర స్వీయాభివ్యక్తి దిశగానే సాగుచున్నదని మఱియు నీ దివ్యసత్యతయు, దాని మహత్త్వమును నే నిప్పటికే గుప్తముగా నా ఆత్మయందు అయియున్నాను మఱియు ముందు ప్రకటముగా నా ప్రకృతియందును కాగలను. ఇట్లు ఈ శక్తిక్రియ తన విజయ సూత్రమును, అనగా తన స్వభావ, స్వధర్మసూత్రమును తనలోపలనే కలిగియున్నది.

12. స్వభావనిర్వచనము, వివరణము :

జీవుడు విశ్వాత్మను ప్రకటించుట యందు పురుషోత్తముని ఒక అంశము (15-7). ప్రకృతియం దతడు ఆ పురుషోత్త ముని శక్తియొక్క ఒక ప్రతినిధి కాగా, తన వ్యక్తిత్వమునం దత డా శక్తియే యగును; తన వైయక్తిక సత్తయం దతడు విశ్వాత్మయొక్క శక్యతలను (Potentialities) వెలికి దెచ్చును. ఈ. జీవుడు స్వతః ఆత్మయే గాని, జడ అహంకారము గాడు; అహంకారము యొక్క రూపము గాక, దాని ఆత్మయే మన సత్యత యగును, మన అంతరాత్మ తత్త్వ మగును. మన మేదిగా నున్నామో, ఏది కాగలమో, దాని వాస్తవ బలము (force) అచ్చట, ఉ చ్ఛతర ఆధ్యాత్మిక శక్తియం దున్నది. కాగా గుణముల యాంత్రిక మాయ (7-14) దాని క్రియలయొక్క ఆంతరతమ మూలభూత సత్యము గాదు; అది యిప్పటి ఒక కార్యనిర్వాహక ఊర్జము (energy) మాత్రమే, నిమ్న సౌకర్యము యొక్క ఒక పరికరము

మాత్రమే, బహిర్ముఖ వ్యాయామము మఱియు అభ్యాసము యొక్క ఒక పథకము మాత్రమే. విశ్వమునం దీ బహువిధ వ్యక్తిత్వరూపము ధరించిన ఆధ్యాత్మిక ప్రకృతి – "పరా ప్రకృతిర్ జీవభూతా" (7-5) – మన స్వభావముయొక్క మూలద్రవ్యము: తక్కినదంతయు ఒక అత్యున్నత గుప్త ఆత్మక్రియ నుండి ఉత్పన్నమైన ఒక నిమ్న వికారము, ఒక బాహ్య నిర్మాణము. మఱియు ప్రకృతియందలి మనలో ప్రతియొకడు తన స్వీయ సంభూతియొక్క ఒక తత్త్వము మఱియు సంకల్పమును గలిగియున్నాడు; ప్రతి అంతరాత్మయు ఆత్మచేతనయొక్క ఒక శక్తి, ఈ శక్తి తనలో భగవంతుడు నిక్షేపించిన ఒక భావమునకు రూపకల్పన గావించును మఱియు దాని ననుసరించి తన క్రియ మఱియు వికాసము, తన అధికాధిక స్వరూప దర్శనమును, తన సంతత పరివర్తనశీల స్వీయప్రకటనమును, పైకి అనిశ్చితముగా గన్పించినను, లోపల సునిశ్చితమగు పూర్ణతాదిశగా తన అభివృద్ధిని తీర్చిదిద్దుకొనును. ఇదిగో, ఈ భావమే మన స్వభావము (18-47). అనగా మన స్వీయ వాస్తవ ప్రకృతి; అదియే మన సత్తాసత్యము, ఈ సత్యమిపుడు (పశుజన్మను దాటిన మానవజన్మ యందు) మాత్రమే మన నానావిధ సంభూతియందు ఒక సంతత ఆంశిక అభివ్యక్తిని పొందుచున్నది. ఈ స్వభావముచే నిర్ణీతమైన కర్మధర్మమే స్వరూపనిర్మాణమునకును, వృత్తికిని, క్రియకును సముచిత ధర్మ మగును, మన స్వధర్మ మగును.

13. శాశ్వతధర్మము, తాత్కాలిక ధర్మములు :

ఈ సూత్రము సృష్టియం దంతటను గన్పించును ; సర్వత్ర ఒకేశక్తి, ఒకే సర్వసామాన్య వైశ్వప్రకృతి కర్మ చేయుచున్నది, కాని ప్రతిస్తరము, రూపము, ఊర్జము, జాతి, ఉపజాతి, వైయక్తిక ప్రాణియందును ఆమె ఒక ప్రధాన భావమును మఱియు సంతత సంకీర్ణ పరివర్తన శీలమగు కొన్ని గౌణ భావములు మఱియు సూత్రములను అనుసరించును, ఈ ప్రధాన మఱియు గౌణ భావములే ప్రతిదానియొక్క శాశ్వత ధర్మము మఱియు గౌణధర్మములకు ఆధారమగును. ఇవి సంభూతియందు దాని సత్తయొక్క ధర్మమును నిర్ణయించును, దాని జన్మ, స్థితి మఱియు పరివర్తనయొక్క రేఖను నిర్ణయించును, దాని స్థిర మఱియు వికసనశీల ఆత్మప్రకటనము మఱియు ఆత్మదర్శనముయొక్క మార్గములను నిర్ణయించును, విశ్వమునందు ఆత్మయొక్క తక్కిన అభివ్యక్తి యంతటితోను దాని సంబంధములయొక్క నియమములను నిర్ణయించును. తన సత్తాధర్మమును, అనగా స్వధర్మము ననుసరించుట, తన సత్తయందలి

భావమును, అనగా స్వభావమును పెంపొందించుట తన భద్రతాస్థానమును, తన సముచిత మార్గము మఱియు పద్ధతియు నగును (3-35). అది అంతరాత్మను ఎట్టి యిప్పటి బాహ్యనిర్మాణమునకు బంధించి యుంచదు, పైగా తన స్వీయ ధర్మము మఱియు తత్త్వముతో నూతనానుభవములను సారూప్యమొందించుకొనుచు, నిశ్చయముగా తన సమృద్ధిని సాధించుకొనును మరియు నట్లు మిక్కిలి ఏపుగా పెరిగి, యథాసమయమున ఇప్పటి రూపమును భేదించి, దాని కావల నొక ఉచ్చతర ఆత్మాభివ్యక్తి ప్రక్రియ నందుకొనును. తన స్వీయ ధర్మము మఱియు తత్త్వమును రక్షించుకొనలేకపోవుట, పరిస్థితి తన కనుకూలము మఱియు తన ప్రకృతికి ఉపయుక్తము కాగల రీతిగా, తనను పరిస్థితి కనుకూలము గావించుకొనుట యందు అసఫలమగుట యన తనను దాను గోల్పోవుట యగును. తన ఆత్మయొక్క అధికారమును నష్టపోవుట యగును, తన ఆత్మ మార్గమునుండి భ్రష్టమగుట యగును, అది 'వినష్టి' యగును, అనృతము, మరణము క్షయము మఱియు విలయముయొక్క వేదన యగును మఱియు తఱచుగా గ్రహణము మఱియు అంతర్ధానమునకు పిమ్మట తిరిగి ఆత్మను బొందవలసిన ఆవశ్యకతవలన గలుగు వ్యథ యగును - ఇది యంతయు మన వాస్తవ ప్రగతిని కుంఠితముగావించు అసన్మార్గము గల్పించు వ్యర్థ చక్రము మాత్రమే! ఈ స్వధర్మము ఈయా రూపమున సర్వప్రకృతియందును గన్పించును; ఇది భౌతికవిజ్ఞానము మన కావిష్కరించిన సర్వసామాన్యతా-నియమము మఱియు వైవిధ్య-నియమము యొక్క సర్వ క్రియకు నాధారము ఇదే ధర్మము మానవ జీవుని జీవనమునందు - అనేక మానవ దేహములలో అతని అనేక జీవనములందు - వర్తించును. అయితే అది యిక్కడ ఒక బాహ్య క్రీడను, ఆంతర సత్యమును గనుగొని, ఆత్మమూల్యములతో మన కర్మ నంతను ఉద్భాసితము గావించినపుడే, బాహ్య క్రీడ తన పూర్ణ వాస్త వార్థమును ప్రకటించుకొనగలదు. ఈ వాంఛనీయ మహారూపాంతరమును, మనము ఆత్మజ్ఞానము నందు ఎంతెంత పురోగమింతుమో, అంతంత వడిగా, బలముగా సాధించుకొనగలము.

14. స్వభావముయొక్క ఆధ్యాత్మికార్థము :

మఱియు, అత్యున్నత ఆధ్యాత్మిక ప్రకృతియందు స్వభావమున కొక అర్థము గల దనియు, గుణాత్మక నిమ్న ప్రకృతి యందు దాని కొక మిక్కిలి విభిన్న రూపము మఱియు తాత్పర్యము గల దనియు మనము ముందుగా చూడదగును. ఇచ్చటను

అది పనిచేయును గాని, తనపై దనకు పూర్తివశ ముండదు; ఒక అర్థప్రకాశము లేక అప్రకాశమునందు తన స్వీయ యథార్థ ధర్మమును వెదకుచున్నట్లు గన్పించును; అనేక నిమ్న రూపములు, అనేక మిథ్యారూపములు, అనంతమగు లోపములు, అపచారములు, ఆత్మహాని మఱియు ఆత్మలాభములు, ప్రమాణము మఱియు నియమముల అన్వేషణలద్వారా అది ముందుకు సాగును; అట్లు చివర కది తననుదానే కనుగొని, సంసిద్ధిని బొందును. ఇచ్చట మన ప్రకృతి జ్ఞానాజ్ఞానముల, సత్యానృతముల, జయాపజయముల, యుక్తాయుక్తముల, హానిలాభముల, పాపపుణ్యముల ఒక సంమిశ్ర వస్త్రముగా నుండును. వీని యన్నింటిద్వారా ఆత్మప్రకటనము, మఱియు నాత్మప్రాప్తికొఱకు జూచుచున్న తత్త్వము సదా ఈ స్వభావమే – "స్వభావస్తు ప్రవర్తతే" – ఈ సత్యము మనకు సార్వత్రిక ఉదారతను, సమతను నేర్పవలెను, ఏలన మన మందరము ఇట్టి ఒకే విధమగు భ్రాంతి మఱియుసంఘర్షమునకు అధీనులమై యున్నాము. అయితే ఈ క్రియలు అంతరాత్మకు గాక, ప్రకృతికే చెందును. పురుషోత్తము డీ అజ్ఞానములోపల బద్ధుడు గాడు; అతడు దానిని పైనుంచి నియమించుచు, దాని వికారములద్వారా అంతరాత్మను ముందుకు నడుపును. పోగా, శుద్ధ అక్షర ఆత్మ ఈ క్రియలచే స్పృశింపబడదు; అది తన అస్పృశ్య సనాతనతచే ఈ క్షరప్రకృతిని ఆమె మార్పు యందు సాక్షిగా దర్శించుచు, ధరించియుండును. పిమ్మట, వ్యక్తియొక్క వాస్తవ అంతరాత్మ, అనగా మనయందలి కేంద్రసత్త వీనికంటెను మహత్తరము, కాని ప్రకృతియందు తన బాహ్య వికాసము నిమిత్తము వాని నామోదించును. మఱియు మన మెప్పుడు ఈ వాస్తవ అంతరాత్మను (15–7,10), మనలను ధరించియుండు నీ అక్షర సర్వగత ఆత్మను (12–3) ప్రకృతిక్రియ కంతకును అధ్యక్షత వహించి, దానికి మార్గము నిర్దేశించుచు, మనలోపల హృదయస్థుడై యుండు ఈశ్వరుని (18–61) – పురుషోత్తముని – అధిగమింతుమో, అపుడు మన జీవనధర్మముయొక్క సమస్త ఆధ్యాత్మి కార్థమును కనుగొనినవార మగుదుము. ఏలన మన కపుడు సర్వ భూతములందును 'అనంతగుణ' రూపమున తనను సర్వదా అభివ్యక్తము గావించు కొనుచుండు జగదీశ్వరుని ఎఱుక మన కుండును. అపుడు మనము భగవంతునియొక్క చతుర్విధ సన్నిధిపట్ల అభిజ్ఞుల మగుదుము – 1. ఆత్మజ్ఞానము మఱియు ప్రపంచ జ్ఞానముయొక్క (కేంద్రమగు) ఒక సమష్టి–ఆత్మ, 2. తన శక్తులను అన్వేషించి, ఉ

పయోగించునట్టి బలము మఱియు శక్తి యొక్క ఒక సమష్టి-ఆత్మ, 3. అన్యోన్యత మఱియు సృష్టి మఱియు ప్రాణిప్రాణికిని మధ్యగల సంబంధ వినిమయములయొక్క ఒక సమష్టి-ఆత్మ, 4. విశ్వమునందు శ్రమించుచు, ప్రతిదానియందును అందరిని సేవించుచు, ప్రతిదాని శ్రమను తక్కిన అన్నింటి సేవలోనికి మార్చునట్టి ఒక [1]సమష్టి ఆత్మ. మనయందలి భగవంతుని వైయక్తిక శక్తియు మనకు దెలియవచ్చును; ఈ శక్తి పై నాలుగు శక్తులను సరాసరి ఉపయోగించును, స్వీయాభివ్యక్తి యొక్క మన ప్రకారమును నిర్దేశించును, మన దివ్య కర్మ మఱియు కార్యమును నిర్ణయించును మఱియు దాని యంతటిద్వారాను మనలను వైవిధ్యమునందలి తన సర్వసామాన్యతా భావమునకు లేవనెత్తును; చివరి కిట్లు దీనిచే మన మతనితోను, విశ్వమునందలి తన సర్వభావముతోను ఆధ్యాత్మిక ఏకత నధిగమింతుము.

15. బాహ్య చాతుర్వర్ణ్యము గుణగతము :

మానవుల చతుర్వర్ణముల యొక్క బాహ్య భావము దివ్య క్రియకు సంబంధించిన ఈ సత్యముయొక్క బాహ్య తర కర్మవిధానమునకు మాత్రమే వర్తించును; త్రిగుణముల యందలి దివ్యక్రియకు మాత్రమే అది పరిమితము. ఇచ్చటి జన్మమున మానవులు స్థూలముగా నాలుగు శ్రేణులలోనికి వచ్చివేతు రనుమాట నిజమే - 1. జ్ఞానప్రధాన మానవుడు, 2. శక్తి ప్రధాన మానవుడు, 3. ఉత్పాదనశీల ప్రాణిక మానవుడు, 4. స్థూల శ్రమ మఱియు సేవాత్మక మానవుడు. అయితే యివి మూలభూత విభాగములు గావు, పరంతు మానవభావమునందు స్వీయ వికాసముయొక్క దశలు మాత్రమే. మానవ జీవి అజ్ఞానజడతల పెద్ద బరువుతో తన యాత్ర ప్రారంభించును. అతని ప్రథ మావస్థ ఒక స్థూల శ్రమావస్థ; అది అతని పాశవిక (animal) అలసత్వముపై శరీరావసరముల చేతను, ప్రాణప్రేరణచేతను, ప్రకృతినియతిచేతను విధించబడును మఱియు, కొంతవఱకు వ్యక్తి - అవసరములు తీరిన పిమ్మట, ఒక విధమగు ప్రత్యక్ష లేక పరోక్ష సాంఘిక బలాత్కారముచేతను విధించబడును; మఱియు నిట్టి తమస్సుచే నింకను శాసించబడు మానవులు శూద్రులు (18-44), సమాజముయొక్క శ్రామికులు; వారు దానికి తమ శ్రమను మాత్ర మిత్తురు గాని, ఎక్కువ పరిణతి జెందిన వారివలె దాని బహువిధ జీవనవిలాసమునకు మఱేమియు నర్పింపజాలరు. తర్వాత, తీవ్రక్రియచే మానవుడు తనయందు రజోగుణమును పెంపొందించును,

[1] ఈ నాలుగు మహేశ్వరి, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతులను సూచించును.

అపుడు ద్వితీయ శ్రేణి మానవుడు పరిణమించును; ఇతడుఉపయుక్త సృష్టి, ఉత్పత్తి, సంగ్రహము, ఉపార్జనము, ధారణము మఱియు భోగము నిమిత్తము ఒక సంతత సహజ ప్రేరణచే చోదితుడగును, ఇతడే మధ్యగతుడగు ఆర్థిక మఱియు ప్రాణిక మానవుడు, వైశ్యుడు (18-44). పిమ్మట, మన ఒకే సామాన్య ప్రకృతియొక్క రాజసిక లేక గతిమయ గుణముయొక్క ఒక ఉచ్చతర పదమునందు మనకు క్రియాపర మానవుడు గన్పించును (14-12); ఇతనికి ప్రబలతర సంకల్ప ముండును, సాహసతర లాలస లుండును, కర్మ ప్రవృత్తియు, యుద్ధప్రవృత్తియు, తన సంకల్పమును విధించు ప్రవృత్తియు నుండును; తన ప్రబలతమ రూపమునం దతనికి నేతృత్వము, శాసనము పాలనము నెరపజూచు ప్రవృత్తియు, జనతాసముదాయములను తన కక్ష్యలో నీడ్చు కొనిపోవు ప్రవృత్తియు నుండును : ఇతడే క్షత్రియుడు (18-43) - యోధుడు, నాయకుడు, శాసకుడు, యువరాజు, రాజు. చివరకు, ఎచ్చట సాత్త్విక మానసము ఆధిపత్యము వహించునో, అచ్చట మనకు బ్రాహ్మణుడు దర్శన మిచ్చును, ఇతడు జ్ఞానపరాయణుడు (18-42), ఇతడు విచారణను, మననమును, సత్యాన్వేషణమును, ఒక బౌద్ధిక లేక అత్యున్నత స్థానమునందు ఒక ఆధ్యాత్మిక నియమమును జీవితము లోనికి గొనివచ్చును మఱియు దానిచేత జీవితమునకు సంబంధించిన తన భావనను, విధానమును విభాసితము గావించును.

16. క్రమారోహణము - సహసారోహణము :

మానవ ప్రకృతియందు ఈ నాలుగు వ్యక్తిత్వములును సదా ఎంతోకొంత యుండును - వికసితము లేక అవికసితముగనో, విశాలము లేక సంకుచితముగనో, అడగద్రొక్కబడి లేక పైకి లేచుచునో యుండును, కాని పెక్కుమందియందు వీనిలో నొకటి ప్రాబల్యము వహింపసాగి, ప్రకృతియందలి క్రియ నంతను తానే ఆక్రమించుచున్న ట్లుండును. మఱియు నెట్టి సమాజమునం దైనను, ఈ చతుర్వర్గము లుండక తప్పదు - ఉదాహరణకు, ఆధునిక యుగము సాధింప యత్నించి నట్లు, మనము కేవలము ఉత్పాదకము మఱియు వ్యాపారికము నగు సమాజమును సృష్టించగలిగి నప్పటికి లేక ఒక అడుగు ముందుకు వేసి, ఆధునిక మానసము నాకర్షించు నట్టియు, ఇపుడు యూరోపులో ఒక ప్రాంతమున ప్రయోగమునం దున్నట్టియు ఒక శూద్ర సమాజమును, శ్రామికవర్గమును నిర్మించగలిగి నప్పటికి, చతుర్వర్గము లుండక తప్పదు. ఏలన అప్పుడును ధర్మమును, సత్యమును, సర్వకర్మయొక్క మార్గదర్శక సూత్రమును అన్వేషింప ప్రేరితులగు మేధావు లుందురు;

అటులే సాహసము, యుద్ధము, నేతృత్వము మఱియు ఆధిపత్యము నపేక్షించు తమ స్వభావ సంతృప్తికి ఈ ఉత్పాదక క్రియాకలాపము నంతను ఒక నెపము గావించుకొను పరిశ్రమల అధ్యక్షులు మఱియు నాయకులు నుందురు; ఇంకను కేవలము ఉత్పాదకులు మఱియు ధనోపార్జనపరులు నగు విస్పష్ట అధికసంఖ్యాక మానవులు నుందురు, చివరకు ఇంచుక పరిశ్రమతోను, దాని ప్రతిఫలముతోను తృప్తి వహించు సాధారణ కార్మికులు నుందురు. కాని యివి యన్నియు బాహ్య విషయములు, మఱియు నివియే సర్వస్వ మగుచో, చాతుర్వర్ణ్యముపై నాధారపడిన అర్థవ్యవస్థకు ఎట్టి ఆధ్యాత్మిక మర్మము నుండదు. లేక, అపుడపుడు భారతదేశమున తలంచబడి నట్లు, మన జన్మలయందు ఈ వికాసదశలద్వారా మనము పురోగమించ వలసి యుండును - అని దీని అధికాధిక అర్థము గావచ్చును; ఏలన మన మవశ్యముగా తామసికము, రాజసిక తామసికము, రాజసికము లేక రాజసిక - సాత్త్వికముద్వారా సాత్త్వికప్రకృతికి ఉత్తరోత్తరము ఉద్గమించుచు, ఒక ఆంతర బ్రాహ్మణత్వములోని కారోహించి, అచ్చట నిలద్రొక్కుకొని, పిమ్మట తదాధారమునుండి గుణవిముక్తికి యత్నించవలెను. కాని అట్టి సందర్భమున, శూద్రుడు లేక చండాలుడు సైతము (9-32) తన జీవనమును భగవదభిముఖము గావించి (9-30), సూటిగా ఆధ్యాత్మిక స్వేచ్ఛ మఱియు సంసిద్ధిపదము నారోహించగలడు (9-31) - అను ప్రతిజ్ఞకు (9-31) ఎట్టి సహేతుక స్థానము నుండకపోవును.

17. ఆంతర స్వధర్మము స్వతంత్రము :

మూలసత్య మీ బాహ్య వస్తువు గాదు, పరంతు అది గతిలోనికి దిగిన అంతఃసత్తయొక్క బలము, ఆధ్యాత్మిక ప్రకృతియొక్క చతుర్విధ సక్రియ శక్తికి సంబంధించిన సత్యము. ప్రతి జీవునికి తన ఆధ్యాత్మిక ప్రకృతియం దీ నాలుగు పార్శ్వములు నుండును - 1. అతడు ఒక వైపున జ్ఞానాత్మకుడు, 2. ఒక వైపున శక్తి మఱియు బలాత్మకుడు, 3. ఒక వైపున అన్యోన్యత మఱియు ఆదాన ప్రదానాత్మకుడు, 4. ఒక వైపున కర్మ మఱియు సేవాత్మకుడు. అయితే, కర్మ మఱియు అభివ్యంజక భావమునందు ఏదియో యొక్క పార్శ్వము ప్రాధాన్యము వహించి, అంతరాత్మకు దాని సదేహ ప్రకృతితో గల వ్యాపారమునకు తన రంగును బూయును; అది ఇతర శక్తులకు నాయకత్వము వహించి, వానిని తన ప్రధాన కర్మవిధానము, ప్రవృత్తి మఱియు అనుభవమున కుపయోగించుకొనును. ఇట్టియెడ స్వభావము, సాంఘిక వృత్తివిభజనయందువలె అసంస్కృతముగను, కఠోరముగను

గాక, ఈ విధానధర్మము ననుసరించును మఱియు నట్లు దానిని వికసింపజేయుచు, తోడ్తోడ తక్కిన మూడు శక్తులను వికసింపజేయును. ఉదాహరణకు, కర్మ మఱియు సేవాప్రేరణను సరిగా అనుష్ఠించి నపుడు, అది జ్ఞానమును వికసింపజేయును, శక్తిని వృద్ధిజేయును, అన్యోన్యతయొక్క ఘనిష్ఠత లేకతుల్యతకు మఱియు సంబంధముయొక్క కౌశలము మఱియు క్రమమునకు శిక్షణ యిచ్చి పెంపొందించును. ఈ చతుర్విధ దివ్యప్రకృతియొక్క ప్రతిముఖమును తన స్వీయ ప్రధాన తత్త్వముయొక్క విస్తరణముద్వారాను, తక్కిన మూడింటియొక్క సంవర్ధనముచేతను ఒక సమగ్ర సంసిద్ధిదిశగా సాగిపోవును. ఈ వికాసము త్రిగుణ ధర్మమున కధీనమై వర్తించును. ఎట్లన జ్ఞానాత్మధర్మమును సైతము ఒక తామసిక మఱియు రాజసిక మార్గమున అనుసరించుట సంభవ మగును, అటులే శక్తి ధర్మమును ఒక మూఢ తామసిక మఱియు ఉచ్ఛ సాత్త్విక మార్గమున అనుసరించుట సంభవమగును, ఇంకను కర్మ మఱియు సేవాధర్మమును ఒక ప్రబల రాజసిక లేక సుందర ఉదాత్త సాత్త్విక మార్గమున అనుసరించుట సంభవమగును. కాగా, ఆంతరిక వైయక్తిక స్వధర్మమునకు మఱియు నది జీవనపథములందు మనచే జేయించు కర్మలకు సంబంధించిన సాత్త్వికవిధానమును జేరుకొనుట మన సంసిద్ధికి ప్రారంభక నిబంధన మగును. మఱియు నీ ఆంతర స్వధర్మము ఎట్టి బాహ్య సాంఘిక లేక తదితర కర్మ, జీవిక లేక వృత్తిరూపమునకు బద్ధమై యుండదు. ఉదాహరణకు, కర్మాత్మకమగు స్వధర్మము జ్ఞానానుసంధాన జీవనమును గాని, పోరాటము మఱియు అధికార జీవనమును గాని, అన్యోన్యత, ఉత్పాదనము మఱియు వినిమయ జీవనమును గాని శ్రమించుచు, సేవింపగోరు తన దివ్యప్రేరణను తృప్తిపఱచుట కొక సాధనము గావించుకొనగలదు.

18. చతుర్విధ ధర్మాతిక్రమణము :

మఱియు చివరకు, ఈ చతుర్విధ కర్మకలాపముయొక్క దివ్యతమ రూపమును, మిక్కిలి క్రియాశీల అంతరాత్మశక్తిని చేరుకొని నపు, డది అత్యున్నత ఆధ్యాత్మిక సంసిద్ధికి ఒక విశాల కవాటమగును. స్వధర్మక్రియ నంతను ఆంతర భగవంతుని యొక్క, విశ్వమయ పురుషునియొక్క, అతీత పురుషోత్తమునియొక్క ఒక పూజలోనికి మార్తు మేని, మఱియు, తుట్ట తుదకు, అతని హస్తములోనికి సమస్త క్రియను సమర్పింతు మేని – "మయి సన్యస్య కర్మాణి" (3-30) – మన మట్లు

చేరుకొనగలము. పిమ్మట మన మెటుల త్రిగుణపరిమితులను దాటి పోదుమో, అటులే చతుర్విధ ధర్మముయొక్క విభాగము లను దాటిపోదుము, మఱియు సర్వ విభేదక ధర్మముల పరిమితులను అతిక్రమింతుము - "సర్వ ధర్మాన్ పరిత్యజ్య" (18-66). ఎటు లన విశ్వపురుషుడు వ్యక్తిని విశ్వ స్వభావము లోనికి తీసికొని, మన యందలి చతుర్విధమగు ప్రకృత్యాత్మను పూర్ణము, ఏకీకృతము గావించును మఱియు జీవునియందు భగవత్సంకల్పము మఱియు భగవత్ప్రకృతియొక్క నిష్పన్న శక్తి ననుసరించి స్వయంనిర్ణీతమగు దాని కర్మలను జేయును.

19. స్వకర్మచేత అర్చించి నపుడు :

స్వకర్మచేత భగవంతు నర్చింపుమని గీత ఆదేశించును - "స్వ-కర్మణా" (18-46) ; మన నివేదన సత్త మఱియు ప్రకృతి యొక్క మన స్వధర్మముచేత నిర్ణయింపబడిన కర్మ గావలెను. ఏలన భగవంతుని నుండియే సమస్త సృష్టిగతియు, సమస్త కర్మప్రేరణయు ఉత్పన్నమగుచున్నది మఱియు నతనినుండియే ఈ సమస్త విశ్వము విస్తారితమై యున్నది (18-46) మఱియు లోకసంగ్రహార్థము (3-20) అతడు సర్వక్రియకు అధ్యక్షత వహించి, దానిని స్వభావముద్వారా రూపొందించును (18-61). మన బాహ్య మఱియు ఆంతర క్రియలచేత నతనిని పూజించుట, మన జీవనము నంతను పరమపురుషుని కొక కర్మ యజ్ఞము గావించుట యన సమస్త సంకల్పము మఱియు సత్త మఱియు ప్రకృతి యందు అతనితో ఏకమగుటకు మనల నాయత్తము గావించుకొనుటయే యగును. మన కర్మ మనలోపలి సత్యము ననుసరించి సాగవలెను, అది బాహ్య మఱియు కృతక ప్రమాణములతో రాజీపడరాదు (18-47): అది అంతరాత్మ మఱియు దాని సహజ శక్తులయొక్క ఒక సజీవ సత్య ప్రకటనము గావలెను. ఏలన ఇప్పటి ప్రకృతియందు ఈ అంతరాత్మయొక్క సజీవ ఆంతరతమ సత్యము ననుష్ఠింతు మేని, అది ఇపుడు మన చేతన కందని పరమ ప్రకృతియందు అదే అంతరాత్మ యొక్క అమర సత్యము నందుకొనుటకు సాయపడును. అచ్చట మనము భగవంతునితోను, మన ముఖ్యాత్మతోను, సర్వభూతములతోను ఏకతయందు నివసించగలము మఱియు, అచ్చట పరిపూర్ణతనంది, అమర ధర్మముయొక్క (14-27) స్వాతంత్ర్యము నందు భగవంతుని క్రియకు ఒక నిర్దుష్ట ఉపకరణము కాగలము.

21. [1] పరమరహస్యము దిశగా

1. గీతామహావాక్యముయొక్క అపూర్వత :

దివ్యగురువు తాను చెప్ప వలసిన తక్కిన దంతయు పూర్తిచేసియున్నాడు, వానికి ఆధారభూత సూచనలు మఱియు ఆంతరభిప్రాయములను నిరూపించి యున్నాడు, ఆ సందేశముపై లేవగల ప్రధాన సంశయములు మఱియు ప్రశ్నములను విశదీకరించియున్నాడు; కాగా, తన ఏకమాత్ర చరమవాక్యమును, తన సందేశము యొక్క మూల హృదయమును, తన బోధనయొక్క సాక్షాత్సారమును నిర్ణాయక శబ్దములతో గూడిన ఒక హృదయ స్పర్శి సూత్రమున ప్రకటించుట యొకటియే ఆయన కిపుడు మిగిలి యున్నది. మఱియు ఈ నిర్ణాయక చరమ మఱియు పరమ వచనము ఈ విషయముపై నితఃపూర్వమే చెప్పబడిన దానియొక్క సారము మాత్రమే గాదని మనము కనుగొందుము. అటులే అది ఆవశ్యక సాధన యొక్కయు, ఆ సాధనాయత్నము మఱియు తపమువలన గలుగనున్న అధికతర ఆధ్యాత్మిక చేతన యొక్కయు ఒక సంక్షిప్తవర్ణన మాత్రమే గాదు; అది జోరుగా ఇంకను ముందునకు ప్రసరించును, ప్రతి ఎల్లను, నియమమును, ప్రతి విధిని, సూత్రమును భంగించి, అనంతమగు గర్భితార్థముతో గూడిన ఒక సువిశాల అపరిమేయ ఆధ్యాత్మిక సత్యములోనికి విచ్చుకొనును. మఱియు నిది గీతాబోధనా స్వభావము యొక్క గభీరతకు, విశాల వ్యాప్తికి, మహత్తకు ఒక చిహ్నము. ఒక సాధారణ ధార్మిక బోధన లేక దార్శనిక సిద్ధాంతము సత్యముయొక్క కొన్ని విశాల మఱియు సవీర్య పార్శ్వములను చిక్కబట్టి, వానిని ఉపయోగార్హమగు ఆదేశము మఱియు నుపదేశము, విధానము మఱియు అభ్యాసములలోనికి మార్చి, మానవుని ఆంతర జీవనము నందును, అతని క్రియయొక్క నియమము మఱియు రూపములందును అతనికి మార్గదర్శి యగుచు, దానితో బాగుగా తృప్తిజెందును; అది అంతకు మించి ముందుకు పోదు, తన స్వీయ పద్ధతియొక్క వలయముబైటికి ద్వారములు తెఱవదు, ఒకానొక విశాలతమ స్వతంత్రతలోని, అనిరుద్ధ విస్తారములోనికి మనలను నడుపదు, ఇట్టి పరిమితత్వము ఉపయుక్తము మఱియు కొంతదనుక నిక్కముగా ఆవశ్యకము. ఏలన తన మనస్సు మఱియు సంకల్పముచేత సీమాబద్ధుడైన మానవుని చింతన మఱియు

[1] గీత : అధ్యాయము 18, శ్లోకములు 49-56.

క్రియకు అనుకూలమగు ఒక ధర్మము మఱియు నియమము, ఒక సునిశ్చిత పద్ధతి, ఒక విస్పష్ట అభ్యాసముయొక్క ఆవశ్యకత గలదు; అతడు పరిమిత దిక్చక్రములను, సురక్షిత విశ్రాంతిస్థానములను జేరుకొనుటకు బాగుగా నలిగిన ఒకేయొక సునిశ్చిత మార్గము నపేక్షించును (3-2). బలవంతులగు కొద్దిమంది మాత్రమే స్వతంత్రత ద్వారా అధికతర స్వతంత్రతకు సాగిపోగలరు. వీరి విషయములో సైతము చివరకు, ఏ రూపములు మఱియు విధానములందు మనస్సు తన స్వస్థతను బొంది, పరిమిత సుఖము నాస్వాదించునో వానినుండి సైతము వెలువడుటకు అంతరాత్మకు ఒక నిర్గమనద్వార ముండవలెను. ఆరోహణయొక్క మెట్ల వరుసయందలి పై మెట్టు దగ్గర సైతము ఆగక, ఆత్మయొక్క విశాలతయందు అడ్డమాకలు లేక స్వేచ్ఛగా విహరించుట యను విముక్తి మన సంసిద్ధికి చాల ముఖ్యము. ఆత్మయొక్క పరమస్వేచ్ఛ మన పూర్ణ స్థితి యగును. మఱియు గీత మనలను దాని కిట్లు గొనిపోవును : అది ఒక దృఢ మఱియు నిశ్చిత కాని ఒక సువిశాల ఆరోహణ పథమును, ఒక మహాధర్మమును (18-47) ప్రతిపాదించును, మఱియు పిమ్మట ప్రతిపాదింపబడిన సర్వమునకు వెలికి గొనిపోయి, సర్వధర్మములకు నావల (18-66), అనంతముగా వ్యాపించియున్న విశాలతలోనికి మనలను ప్రవేశపెట్టి, అచ్చట ఆశాజ్యోతిని ఆవిష్కరించును, అపుడు ఒక పూర్ణ ఆధ్యాత్మిక స్వతంత్రతయందు ప్రతిష్ఠితమైన ఒక పూర్ణ సంసిద్ధియొక్క రహస్యము లోనికి బోనిచ్చును, ఆ రహస్యమే "గుహ్యతమం" (18-64), గీత పేరుపెట్టి పిలిచిన "పరమ వచనముయొక్క" (18-64) సారసంగ్రహము, అదియే గూఢతత్త్వము, అదియే అంతరతమ జ్ఞానము.

2. జీవన సమస్యకు రెండు పరిష్కారములు :

పరమ వచనమునకు ముందు గీత తన సందేశ స్వరూపమును పునః ప్రతిపాదించును. అది కేవలము పదునైదు శ్లోకముల స్థలములో రేఖారూపము మఱియు సారము నంతను క్రోడీకరించును, ఈ పంక్తులయందు చిక్కని భావప్రకటనమును, గర్భితార్థమును గలవు, ఇవి విషయసారము నే మాత్రము విడువవు, ఇవి మిక్కిలి యథార్థము (precise), విస్పష్టము నగు పదములలో పొందుపఱుపబడినవి. కావున ఈ శ్లోకములను జాగ్రత్తగా పరిశీలించవలెను, ఇంతదనుక చెప్పబడిన దాని యంతటి ప్రకాశమున వానిని లోతుగా చదువవలెను; ఏలన తన బోధనయొక్క కేంద్ర భావముగా దేనిని గీత స్వయముగా దలంచుచున్నదో,

దానిని వేఱుచేయుటే స్పష్టముగా నిచ్చటి ఉద్దేశ్యము. పుస్తకము నందలి విచారణయొక్క మూలస్థానమునుండి, అనగా మానవకర్మ ప్రహేళిక (చిక్కుప్రశ్న) నుండి, ప్రపంచమున లౌకిక కర్మలను చేయుచుండియు నదే కాలమున ఆత్మ పరమాత్మల యందు నివసించుట యను దుస్తరముగా గన్పించు కఠినత నుండి ఇచ్చటి ప్రతిపాదనయు ప్రారంభ మగును. జీవనము మఱియు కర్మ యొక భ్రమ లేక అవి సత్తయొక్క ఒక నిమ్నతర వ్యాపారము, కనుక ప్రపంచజాలము నుండి వెలువడి ఆధ్యాత్మిక సత్తయొక్క సత్యములో ప్రవేశించిన తోడనే వానిని త్యజించవలెను; ఇంతకు మించిన పరిష్కారము సాధ్యము గాదని సమస్యను విడిచి వేయుటే మిక్కిలి సులభ మార్గము. అస లది ఒక పరిష్కారమే అయితే అది సన్యాసపరిష్కారము; ఎటు లైనను, ప్రహేళననుండి వెలువడుటకు మాత్రమే అది ఒక నిశ్చాయకము, శక్తివంతము నగు మార్గము – అత్యున్నతము, మిక్కిలి ధ్యాన పరము నగు విధమునకు జెందిన ప్రాచీన భారత విచారధార విశాలము, విముక్తము నగు తన ప్రథమ సమన్వయమునుండి దిగిపోవ నారంభించిన వెంటనే, అధికాధికముగా ఈ మార్గము నందే ముందుకు సాగినది. తంత్రశాస్త్రము మఱియు కొన్ని భాగములందు తర్వాతి మతములవలె గీత ప్రాచీన సంతులనమును (balance) పరిరక్షింప బ్రయత్నించును: అది మూల సమన్వయముయొక్క సారతత్త్వమును, ఆధారమును భద్రముగా నుంచును, కాని ఒక వర్ధమాన ఆధ్యాత్మి కానుభవముయొక్క ప్రకాశమునందు దాని రూపమును మార్చి, నూతనము గావించును. అత్యున్నత ఆత్మ మఱియు పరమాత్మలయందు ఆంతరజీవనముతో మానవుని సంపూర్ణ సక్రియ జీవనమును సమన్వయము చేయు కఠిన సమస్యను గీత దాటవేయదు; దేనిని వాస్తవ పరిష్కార మని తాను భావించునో, గీత దానిని ప్రతిపాదించును. తాను ఉద్దేశించిన ప్రయోజనమునకు తపోమయ జీవనసన్యాసము పటుతర సాధనమే, గీత దీనిని కా దనదు; కాని సన్యాసము సమస్యాగ్రంథిని విడదీయుటకు బదులు ఛేదించి వేయును, కావున గీత ఆ మార్గమును హీనముగాను, తన మార్గమును శ్రేష్ఠముగాను భావించును (5–2). ఈ రెండు మార్గములును నిమ్నతర అజ్ఞానమయ సామాన్య మానవ ప్రకృతినుండి ఉద్ధరించి మనలను విశుద్ధ ఆధ్యాత్మిక చేతన దిశగా నడుపును, మఱియు నింతవఱకు రెండును అవలంబనీయములే మఱియు సారతః ఒకటే సైతము నని తలంచవలెను; కాని ఎక్కడ ఒకటి ఆగిపోయి, (ముందుకు పోజాలక) వెనుకకు దిరుగునో, అచ్చట రెండవది సుదృఢ సూక్ష్మతతోను, సమున్నత

సాహసముతోను పురోగమించి, అవిజ్ఞాత దృశ్యములపై ఒక ద్వారమును తెఱచును, మానవుని భగవంతునియందు పూర్ణము చేయును, మఱియు మూల సత్తయందు అంతరాత్మకును, ప్రకృతికిని ఏకతను, సమన్వయమును సాధించును.

3. ఆంతర నైష్కర్మ్యము ముక్తిమూలము :

కావున ఇచ్చటి మొదటి అయిదు శ్లోకములందు ఆంతరసన్న్యాస, బాహ్యసన్న్యాస మార్గములు రెండింటికి అనువర్తించగల భాషను గీత ప్రయోగించును; అయినను ఈ ప్రయోగరీతి ఎట్టి దనిన, అందలి కొన్ని సామాన్య పదములకు ఇంచుక గభీరతర, ఆంతరతర అర్థము నిత్తు మేని, గీత అభిమానించు పద్ధతియొక్క భావము మఱియు చింతన మనకు స్పష్టపడును. మానవ కర్మను బాధించు కఠినత ఏది యన, మానవుని అంతరాత్మ మఱియు ప్రకృతి బహుప్రకార బంధనమునకు దైవనియతిచేతనే అధీనమై యున్నట్లు గన్పించును – అజ్ఞాన కారాగారము , అహంకార పాశము, ఆవేశముల జాలము, ప్రతిక్షణము జీవనముయొక్క ఆఘాతపూర్వక ఆగ్రహము; ఇది యంతయు నిష్ప్రకాశము, పరిమితము నగు ఒక చక్రమునందు వ్యర్థముగా పరిభ్రమించుటయే. ఇట్టి క్రియావలయమునకు గట్టుబడిన అంతరాత్మకు విశ్రాంతి గాని, ఆత్మజ్ఞాన ప్రకాశము గాని యుండదు. కావున అది ఆత్మను, జీవిత మూల్యమును, సృష్టి రహస్యమును గనుగొనజాలదు. నిజమే, తన సక్రియ వ్యక్తిత్వమునుండియు, సశక్త ప్రకృతినుండియు తన సత్తయొక్క సంకేతములు కొన్ని అంతరాత్మకు లభించును, కాని అది నిర్మించుకొను సంసిద్ధి ప్రమాణములు మిక్కిలి తాత్కాలికము, ప్రతిబద్ధము, సాపేక్షము గాన, అవి తన గూఢసమస్యకు సంతృప్తికర కీలకము గాజాలవు. తన సక్రియ ప్రకృతియొక్క ఊపిరిసలుప నివ్వని పిలుపునందు లీనమై, దానిచేత నిరంతరము బలాత్కారముగా బహిర్ముఖము చేయబడి నపుడు, అంతరాత్మ తన వాస్తవాత్మను ఆధ్యాత్మిక జీవనమును తిరిగి ఎట్లు పొందగలదు ? ఇట్టి యెడ, అంతరాత్మ మున్ముందు ఈ తల్లీనతను సన్న్యసించవలెను, బాహ్య వస్తువుల బహిర్ముఖ నిర్బంధమునకు చెవియొగ్గక, సక్రియ ప్రకృతినుండి శాంతాత్మను వేఱుచేయవలెను – అని సన్న్యాస, గీతా మార్గములు రెండును అంగీకరించును; అపు డంతరాత్మ అచలాత్మతోను, దాని మౌనమునందలి జీవనముతోను తాదాత్మ్యము జెందవలెను. అది ఒక ఆంతర నిష్క్రియతను జేరుకొనవలెను – "నైష్కర్మ్యం" (18–49). కావుననే ఈ విమోచక ఆంతర నిష్క్రియతను యోగముయొక్క ప్రథమ లక్ష్యముగా, దానియందలి ప్రథమ ఆవశ్యక సిద్ధిగా ఇక్కడ గీత మనముం దుంచును : "సర్వ

విషయములందును సంగవిహీనమగు బుద్ధిని, స్వయంజితము, కామనాశూన్యము నగు అంతరాత్మను గలిగియుండు మానవుడు సన్యాసముచేత నైష్కర్మ్యరూపమగు పరమసిద్ధిని బొందును" (18-49).

4. క్షరాక్షరవివేచనము :

సన్యాసము, స్వయంవిజిత శాంతి, ఆధ్యాత్మిక నిష్క్రియత మఱియు కామనావిముక్తియొక్క ఆదర్శము ప్రాచీన విజ్ఞాన మంతటికి సర్వసామాన్యమే గీత దీని మానసి కాధారమును నిరతిశయ సంపూర్ణత మఱియు విస్పష్టతతో మన కిచ్చును. మనలోపల రెండు ప్రకృతులు మఱియు రెండుగ దోచు ఆత్మలు నుండును: ఇది ఆత్మజ్ఞానము నన్వేషించు సాధకు లందరికి సామాన్యాను భవము మఱియు నీ అనుభవము ప్రాచీన విజ్ఞానమున కాధారము. తమోవృతమగు మానసిక, ప్రాణిక మఱియు శారీరిక ప్రకృతియొక్క నిమ్నతర ఆత్మ గలదు, ఇది తన చేతనామధ్యము నందు సైతము, విశేషించి భౌతిక ద్రవ్యరూపమగు తన ఆధారమునందు అజ్ఞానము మఱియు జడతకు అధీనమై యుండును; ఇది ప్రాణశక్తి చేత నిక్కముగా చలము మఱియు సజీవమే కాని, తన క్రియయందు దానికి ఆత్మస్వామ్యము (self-possession) మఱియు నాత్మ జ్ఞానము నుండవు; అది మనోభూమికయందు కొంత జ్ఞానము మఱియు సామరస్యముల నందుకొనును గాని, కఠినప్రయాసముతోను, తన అశక్తతలతో నిరంతర సంఘర్షముచేతను మాత్రమే అట్లు చేయును. ఇది గాక, మన ఆధ్యాత్మిక సత్త యొక్క ఉచ్చతర ఆత్మ మఱియు ప్రకృతి గలవు, ఇవి స్వయంప్రాప్తము మఱియు స్వయంప్రకాశమే గాని, మన సామాన్య మనోవృత్తియందు మన అనుభవమున కందవు. అపుడపుడు మనలోని ఈ అధికతర వస్తువుయొక్క మెఱుపులు మనకు గన్పించును గాని, మనము సచేతనముగా దానియం దుండము, దాని ప్రకాశము, శాంతి మఱియు నిస్సీమ వైభవమునందు నివసింపము. మిక్కిలి విభిన్నమగు ఈ రెండు వస్తువులలో మొదటిది గీత చెప్పు త్రిగుణాత్మిక ప్రకృతి (7-14). అది అహంభావమునందు కేంద్రితమై తనను దాను జూచుకొనును, అహంకారమునుండి పుట్టిన కామమే దాని క్రియాతత్త్వము, మఱియు మనస్సు, ఇంద్రియములు. అటులే ప్రాణకామనయొక్క విషయములతోటి సంగమే అహంకార గ్రంథి యనబడును. వీని యన్నింటియొక్క అనివార్య సంతత ఫలితమే బంధనము, ఒక నిమ్నతర నియంత్రణకు నిగూఢ అధీనత, ఆత్మవశిత్వరాహిత్యము, ఆత్మజ్ఞాన

రాహిత్యము (14-9, 7-13). పోగా రెండవ మహత్తర శక్తి మఱియు సన్నిధిని గుఱించి మనకు తెలియవచ్చున దేమన, అది అహంకార నిబద్ధము గాని శుద్ధ మూలతత్త్వము యొక్క ప్రకృతి మఱియు సత్త యగును, దీనినే భారతీయ తత్త్వశాస్త్రమున ఆత్మ మఱియు నిర్గుణ బ్రహ్మ మని పిలుతురు. దాని మూలతత్త్వము లన్నింటియందును ఏకము మఱియు అనన్యమగు ఒక అనంత నిర్వ్యక్తిక అస్తిత్వము: మఱియు నీ నిర్వ్యక్తిక బ్రహ్మము అహంకార రహితము, పరిచ్ఛేదకగుణ రహితము, కామన, ఆవశ్యకత లేక ప్రేరణా రహితము గాన, అది అచలము మఱియు అవికార్యము (2-25); సర్వదా ఏకరూపమగు నది విశ్వక్రియను నిరీక్షించుచు ధరించునేగాని, దానిలో పాల్గొనదు, దానిని ఉపక్రమించను గూడ ఉపక్రమించదు. అంతరాత్మ తనను దాను సక్రియ ప్రకృతిలోనికి త్రోసివేసికొని నపుడు, గీతయొక్క క్షర పురుషు డగును, ఇతడు చల లేక సవికార పురుషుడు; అదే అంతరాత్మ శుద్ధ శాంత ఆత్మ లోనికిని, మూల సత్తలోనికిని ఉపసంహరించుకొని నపుడు గీతయొక్క అక్షర పురుషు డగును, ఇతడు అచల లేక నిర్వికార పురుషుడు.

5. ఆవశ్యకము ఆంతర సన్యాసము :

కావున సక్రియ ప్రకృతియొక్క ఘనిష్ఠ బంధనమునుండి తప్పించుకొని, ఆధ్యాత్మిక స్వతంత్రతను తిరిగి అందుకొనుటకు స్పష్టముగా సూటి, సరళతమ మార్గము : అజ్ఞానమునకు జెందిన క్రియా కలాపముతో సంబంధముగల దాని నంతను అశేషముగా త్రోసివేయవలెను మఱియు అంతరాత్మను ఒక విశుద్ధ ఆధ్యాత్మిక సత్తలోనికి మార్చవలెను. ఇదియే బ్రహ్మ మగుట - "బ్రహ్మ భూయః" (18-53). దీని అర్థము నిమ్నతర మానసిక, ప్రాణిక, భౌతిక భావమును పరిత్యజించి, విశుద్ధ ఆధ్యాత్మిక సత్తను గ్రహించుటయే యగును. దీనికి సర్వోత్తమ సాధనము మన ప్రస్తుత సర్వాగ్ర తత్త్వమగు బుద్ధి, అనగా ప్రజ్ఞ మఱియు సంకల్పము, అది నిమ్న జీవనముయొక్క వస్తువులనుండి, ముందుగా, ముఖ్యముగా శక్తిశాలియగు కామనాగ్రంథినుండి, మన - ఇంద్రియములు వెంటాడు విషయములతో మన సంగమునుండి విముఖము గావలెను. సాధకుడు సర్వవస్తువు లందు అసక్తమగు బుద్ధిగావలెను - "అసక్తబుద్ధిః సర్వత్ర" (18-49). అపుడు తన నిశ్శబ్దమునందు నెలకొనియుండు అంతరాత్మనుండి కామ మంతయు కరగిపోవును; ఇపు డది సర్వస్పృహలనుండియు విముక్తము - "విగత స్పృహః" (18-49). ఈ స్థితి నిమ్నతర

ఆత్మయొక్క వశ్యతను, ఉచ్చతర ఆత్మయొక్క స్వామ్యమును తనతో గొనివచ్చును లేదా సంభవము గావించును - ఈ స్వామ్యము సంపూర్ణ స్వవశిత్వము (self - mastery) పై నాధారపడి యుండగా, ఈ స్వవశిత్వము సక్రియప్రకృతిపై మౌలిక విజయము మఱియు ఆధిపత్యము ద్వారా స్థిరపడును - "జితాత్మా" (18-49). మఱియు దీని యంతటికిని అర్థము వస్తుకామనయొక్క అశేష ఆంతర "సన్యాసమే" (18-49) యగును. సన్యాసమే సంసిద్ధికి మార్గము మఱియు నిట్లు సర్వమును ఆంతరముగా సన్యసించిన వానిని గీత యథార్థ సన్యాసిగా ఉగ్గడించును (6-1). కాని ఈ పదము సాధారణముగా బాహ్య సన్యాసమును సైతము లేక కేవలము దానినే సూచించును, కావున బాహ్యమునుండి ఆంతర సన్యాసమును వివేచించుటకు దివ్యగురువు 'త్యాగ' శబ్దమును ప్రయోగించి (18-2), ఈ త్యాగము సన్యాసముకంటె శ్రేష్ఠమనును (5-2). సన్యాసమార్గము సక్రియ ప్రకృతినుండి తాను చేయు పరావర్తము నందు చాల ఎక్కువ దూరము బోవును. అది సన్యాసముకొఱకే సన్యాసమునందు అనురక్త మగును మఱియు జీవన, కర్మల బాహ్యత్యాగముపై, అంతరాత్మ మఱియు ప్రకృతుల సంపూర్ణ శమముపై పట్టుబట్టును. మనము శరీరమున నివసించుచున్నంత కాలము అది సంభవము·గా దని గీత ఎదురు చెప్పును (18-11). సంభవ మైనంతవఱకు అట్లు చేయవచ్చును గాని, కఠోరముగా నట్లు కర్మలను తగ్గించుటకు ఆవశ్యకము గాదు : అది వాస్తవముగా, కనీసము సాధారణముగా వాంఛనీయమును గాదు. కావలసిన ఏకమాత్ర వస్తువు ఒక సంపూర్ణ ఆంతర నిష్క్రియత మాత్రమే, ఇదియే గీతానైష్కర్మ్యముయొక్క ఆశయము (sense).

6. బ్రహ్మభావమునుండి భగవద్భావమునకు :

మన లక్ష్యము విశుద్ధాత్మ అయినపుడు మఱియు నది "అకర్తగా" (13-30) వర్ణింపబడి నపుడు, బాహ్య కర్మను మాత్ర మెందుకు మిగల్చవలెను, సక్రియ తత్త్వముపట్ల మెత్తదన మెందుకు? అని అడుగుదు మేని, సమాధాన మేమన, ఆ నైష్కర్మ్యమును, ప్రకృతినుండి ఆత్మవియోగమును మన ఆధ్యాత్మిక ముక్తియొక్క సంపూర్ణ సత్యము గావు. ఆత్మ మఱియు ప్రకృతి తుద కొకే వస్తువు; సమగ్ర మఱియు పరిపూర్ణ ఆధ్యాత్మికత ఆత్మ మఱియు ప్రకృతియందు నుండు సర్వ భగవంతునితో మనల నేకము జేయును. నిజానికి ఈ బ్రహ్మ మగుట, శాశ్వత శాంతిరూపమగు ఆత్మలోనికి గ్రహించబడుట - "బ్రహ్మభూయము" (18-53) : ఇది మన సంపూర్ణ

లక్ష్యము గాదు, ఇది తనకంటెను మహత్తరము మఱియు నద్భుతతరము నగు ఒక దివ్యపరిణామమునకు – "మద్భావమునకు" (13–19, 4–19) ఆవశ్యక అపార ఆధారము మాత్రమే. మఱియు నట్టి సర్వోత్తమ ఆధ్యాత్మిక సంసిద్ధి నధిగ మించుటకు మనము నిక్కముగా ఆత్మయందు అచలముగను, మన సర్వావయవము లందు శాంతముగను నుండవలసినదే, కాని అదే సమయమున శక్తియందు, ప్రకృతి యందు, అనగా ఆధ్యాత్మిక సత్తయొక్క సత్య సమున్నత బలమునందు కర్మ చేయవలెను గూడ. (3–25). మఱియు రెండు వ్యతిరేకములు ఏకకాలమున ఎట్లు వర్తించగలవు? – అని మనము ప్రశ్నింతు మేని, సంపూర్ణ ఆధ్యాత్మిక సత్తయొక్క స్వభావమే అది–యని దానికి జవాబు; అది సర్వదా అనంతునియొక్క ఈ ద్వివిధ సంతులితస్థితిని గలిగియుండును. నిర్వ్యక్తికము, ఆత్మతత్త్వములోనికి ఉపసంహృతము గావలెను. నిర్వ్యక్తికాత్మ సర్వ కర్మను తాను గాక, ప్రకృతియే చేయుచున్నట్లు జూచును (3–28); అది గుణములు మఱియు శక్తులచేత చేయబడు సర్వ క్రియను ఒక నిర్లిప్త సమత్త్వముతో తిలకించును : ఇట్టి ఆత్మయందు నిర్వ్యక్తికము చేయ బడిన అంతరాత్మ సర్వకర్మలను అటులే తాను గాక, ప్రకృతిగుణములేచేయుచున్న వని చూడవలెను; అది సర్వ వస్తువులందును – "సర్వత్ర" (6–29) – సమముగా నుండవలెను. కాని అదే సమయమున మన మిచ్చట నాగిపోరాదు, తుద కింకను ముందుకు వెళ్లి, ఆంతర అచలత్వ మఱియు మౌన ధర్మమునే గాక, మన కర్మలయందొక ఆధ్యాత్మిక నియమమును, దిశను కనుగొనవలెను; అందునిమిత్తము మన బుద్ధి, సంకల్పములపై యజ్ఞభావమును విధింపు డని గీత మన కుపదేశించును, మన కర్మ యంతయు ఆంతరముగా మాఱి, ప్రకృతి ఎవనియొక్క స్వీయశక్తియో – "స్వా–ప్రకృతిః" (4–6) – అట్టి ప్రకృతి ప్రభువునకు, పరమపురుషునికి జేయబడు ఒక నివేదనారూపము ధరించవలెను. ఇంకను ముందుకు బోయి, సర్వమును చివరి కతని చేతులలోనికే సన్యసించవలెను (3–30), కర్మయొక్క సమస్త వైయక్తిక ప్రేరణను – "సర్వారంభములను" (12–16) – పరిత్యజించవలెను, అతని కర్మలు మఱియు ప్రయోజనము నిమిత్తమే మన ప్రకృతిగత ఆత్మలను మనము ధరించవలెను. ఈ విషయములు ఇతఃపూర్వమే వివరముగా వ్యాఖ్యానింపబడినవి గాన, ఇచ్చట గీత సన్యాస, నైష్కర్మ్య పదములయొక్క విశేషార్థమును మఱల వ్యాఖ్యానించక, వానిని యథాతథముగా వాడును.

7. ఏకతకొఱకు నిర్వ్యక్తిక బ్రహ్మము :

శుద్ధ నిర్వ్యక్తిక ఆత్మయందు నివసించుటకు ఒకవిధమగు సంపూర్ణ ఆంతర శమము సా న మని ఒకసారి అంగీకరించి నపుడు, అది ఆ నివాసము నెట్లు సాధించు నను ప్రశ్న వెంటనే ఉదయించును. "ఈ (నైష్కర్మ్య) సిద్ధిని బొందిన వాడు బ్రహ్మము నెట్లు బొందునో, చెప్పెదను, వినుము – ఇదియే జ్ఞానముయొక్క పరమ నిష్ఠ." (18–50). ఇచ్చట ఉద్దేశించిన జ్ఞానము సాంఖ్యయోగము – గీత ఆమోదించిన శుద్ధ జ్ఞానయోగము, "జ్ఞానయోగేన సాంఖ్యానాం" '3–3) ; అయితే కర్మయోగమును – "కర్మయోగేన యోగినాం" – గూడ తనలో నిముడ్చుకొను తన స్వీయయోగముతో చేతులు కలిపిన మేరకే గీత ఆ జ్ఞానయోగము నామోదించును. కాని ప్రస్తుతానికి కర్మప్రసక్తి యంతయు వెనుకకు నెట్టబడెను. కారణము, ముస్ముందు, ఇచ్చట బ్రహ్మ మన నీరవ, నిర్వ్యక్తిక, నిర్వికార బ్రహ్మ మనియే అర్థము. నిజానికి ఉపనిషత్తులు, గీత – రెండింటికిని ఏది ఉన్నదో మఱియు జీవించుచున్నదో, కదలుచున్నదో, అది అంతయు బ్రహ్మమే. అది కేవలము నిర్వ్యక్తిక అనంతము గాని, "అచింత్య, అవ్యవహార్య" (మాం. ఉ.) పరతత్త్వము గాని కాదు. ఇది యంతయు బ్రహ్మమే – (ఛాం. ఉ.) అని ఉపనిషత్తు చెప్పును, అటులే ఇది యంతయు వాసుదేవుడే – అని గీత చెప్పును (7–19). చరము లేక అచరము – అంతయు పరబ్రహ్మమే, అతని హస్తములు, పాదములు, నేత్రములు, తలలు మఱియు ముఖములు మన కన్నివైపులను గలవు (13–14). అయినను ఈ 'సర్వ'మునకు రెండు పార్శ్వములు గలవు – 1. జగత్తును ధరించియుండు అతని అక్షర, అనాది ఆత్మ, 2. వెలుపల విశ్వగతియందు చరించుచుండు సక్రియశక్తి మయమగు నతని ఆత్మ. అక్షరాత్మయొక్క నిర్వ్యక్తికతయందు మనము మన పరిచ్ఛిన్న అహంకారరూప వ్యక్తిత్వమును గోల్పోయి నపుడే, శాంత, విముక్త ఏకతను మనము చేరుకొనగలము మఱియు నీ ఏకతచేత తన విశ్వగతియందు భగవంతుని విశ్వశక్తితో మనము వాస్తవ ఐక్యమును బొందగలము. నిర్వ్యక్తికత పరిచ్ఛేదము మఱియు విభజనయొక్క ఒక నిరాకరణము గావున, నిర్వ్యక్తికతా – ఉపాసన వాస్తవ సత్తా స్థితికి ఒక నిబంధనము, వాస్తవ జ్ఞానప్రాప్తికి ఒక ఆవశ్యక పూర్వాంగము, కావున వాస్తవ కర్మకు ఒక ప్రథమావసరము. మన పరిమిత అహంకార – వ్యక్తిత్వమునందు మన పట్టును విడువ మేని, స్పష్టముగానే మనము సర్వముతో ఏకాత్మకులము గాజాలము, అటులే విశ్వపురుషుడు

మఱియు నతని అపార స్వయంజ్ఞానముతో, అతని బహుముఖ సంకల్పము మఱియు బహువిస్తృత ప్రపంచప్రయోజనముతో నేకము గాజాలము; ఏలన అది ఇతరులనుండి మనలను వేఱుచేయును మఱియు మన దృష్టియందును, మన కర్మసంకల్పము నందును మనలను బద్ధులను మఱియు స్వకేంద్రితులను గావించును. వ్యక్తిత్వ కారాగారమున బద్ధుల మైనపుడు, సానుభూతి చేత గాని, ఇతరుల దృక్కోణ భావ సంకల్పములతో కొంత సరిపెట్టుకొనుటచేత గాని ఒక పరిమిత సమైక్యమును మాత్రము బొందగలము. సర్వముతోను, భగవంతునితోను, విశ్వమునందుగల అతని సంకల్పముతోను ఏకమగుటకు, మనము ముందుగా నిర్వ్యక్తికులము గావలెను, అహంకారమునుండియు, దాని ఆదేశమునుండియు, అది మనలను, ప్రపంచమును, ఇతరులను జూచు విధానము నుండియు ముక్తులము గావలెను. మఱియు మన సత్తయందు వ్యక్తిత్వముకంటెను, అహంకారము కంటెను మఱియొకటి, సర్వభూతములందును ఏకమగు ఒక నిర్వ్యక్తి కాత్మ (6–29) లేనిచో, మనము నిర్వ్యక్తికులము గాజాలము. కావున అహంకార మును జాఱవిడిచి, నిర్వ్యక్తి కాత్మగా నుండుట, ఈ నిర్వ్యక్తిక బ్రహ్మ మగుట ఈ యోగముయొక్క ప్రథమ గతి యగును.

8. అక్షర బ్రహ్మకు మార్గము :

అయితే దీనికి విధాన మేమిటి ? మున్ముందు శుద్ధముచేయబడిన బుద్ధి మనలోని శుద్ధ ఆధ్యాత్మిక తత్త్వముతో యుక్తము గావలెను – "బుద్ధ్యా విశుద్ధయా యుక్తః" (18–51). బహిర్ముఖ మఱియు అధోముఖ దృష్టినుండి ఇట్లు బుద్ధి అంతర్ముఖ మఱియు ఊర్ధ్వముఖ దృష్టికి మఱ లుటయే జ్ఞానయోగ సారము. ఈ విశుద్ధ బుద్ధి సత్త నంతను నియమించవలెను – "ఆత్మానం నియమ్య" (18–51); అది నిమ్న ప్రకృతియొక్క బహిర్గామి కామములతో సంగమునుండి దృఢ సంకల్పము చేత – "ధృత్యా" – మనలను వెనుకకు లాగివేయవలెను – తన ఏకాగ్రతయం దీ సంకల్పము సర్వథా శుద్ధ సత్తకు అభిముఖముగా నడుచును. పోగా ఇంద్రియములు తమ విషయములను త్యజించ వలెను మఱియు నీ విషయములు తనలో ప్రేరేపించు రాగద్వేషములను మనస్సు విదలించివేయవలెను, ఏలన నిర్వ్యక్తి కాత్మకు ఎట్టి రాగద్వేషములు నుండవు, ఇవి వస్తుస్పర్శలకు మన వ్యక్తిత్వముయొక్క ప్రాణిక ప్రతిక్రియలు; మఱియు ఈ స్పర్శలకు మన ఇంద్రియములనుండి వచ్చు అనురూప ప్రత్యుత్తరము ఆ రాగ ద్వేషములకు ఆలంబనము మఱియు నాధారము నగును.

మనస్సు, వాక్కు మఱియు శరీరములపై సైతము సంపూర్ణ సంయమమును సాధించవలెను (18-52), అటులే ఆకలి, శీతోష్ణములు, స్థూల సుఖదుఃఖములనటు సైతము వశ్యముగావించుకొనవలెను; మన సమస్త సత్తయు ఉదాసీనమై, ఈ విషయములకు చలించక, బాహ్య స్పర్శలు మఱియు నవి పుట్టించు ఆంతర ప్రతిక్రియలు మఱియు ప్రత్యుత్తరముల పట్ల సమముగా నుండవలెను. ఇది మిక్కిలి సూటి మఱియు శక్తిశాలి విధానము, యోగము యొక్క ప్రత్యక్ష మఱియు నిశిత ప్రకారము. కామ, సంగముల విరతి - "వైరాగ్యం" - పరమావశ్యకము; నిర్వ్యక్తిక ఏకాంతమును దృఢముగా సేవించ వలెను, సాధకుడు ధ్యానముద్వారా ఆంతరతమ ఆత్మతో సంతతయోగమునం దుండవలెను. అయినను ఈ కఠోర సాధనయొక్క ఉద్దేశ్యము ఒకానొక పరమ అహంమయ ఏకాంతమున స్వార్థకేంద్రితులమై యుండుట గాదు - కొందరు మునులు, మనీషులు ప్రపంచకర్మయందు గల కష్టమునకు జడిసి, అట్లు చేతురు, అహంకారము నంతను తుడిచివేయుటే ఇచ్చటి ఉద్దేశ్యము. మున్ముందు సాధకుడు రాజసిక అహంకారమును, అహంకారిక బల, సంరంభములను, దర్పమును, కామమును, క్రోధమును, యాజమాన్య భావము మఱియు ప్రేరణను, అంతర్వేగముల చోదనను, ప్రబలమగు ప్రాణతృష్ణలను సమూలముగా వర్జించ వలెను. కాని తర్వాత సర్వవిధ అహంకారమును, అత్యంత సాత్త్వికాహంకారమును సైతము, పరిత్యజించవలెను. ఏలన చివరకు అంతరాత్మను, మనస్సును, ప్రాణమును, బంధనకరమగు సర్వ అహంమమతలనుండి విడిపించుటయే లక్ష్యము - "నిర్మమః" (18-53). అహంకారము మఱియు దాని సర్వవిధ అభ్యర్థనల వినాశమే ఇచ్చట మనముం దుంచబడిన సాధనావిధానము. ఏలన తాను చలించకుండ విశ్వమును ధరించి యుండు శుద్ధ నిర్వ్యక్తి కాత్మకు ఎట్టి అహంకారము లేదు, మఱియు నది వస్తువు లేక వ్యక్తిపై నెట్టి అభ్యర్థన చేయదు; అది శాంతము మఱియు తేజోమయరూపమున ఉదాసీనము మఱియు నది ఆత్మజ్ఞాన, ప్రపంచ జ్ఞానములకు సహజమగు ఒక సమ, నిష్పక్షపాతనేత్రముతో వస్తువులు మఱియు వ్యక్తులను నీరవముగా నిరీక్షించును. కావున స్పష్టముగానే లోని అంతరాత్మ దానితో సదృశము లేక సమానమగు నిర్వ్యక్తికతయందు ఆంతరముగా నివసించి నపుడు, అది వస్తువుల ముట్టడినుండి విముక్తమై, అక్షర బ్రహ్మతో ఏకతాప్రాప్తికి ఉత్తమప్రకారమున యోగ్యమగును.

9. సన్యాసము × త్యాగము :

గీత విధించిన విధమున నిర్వ్యక్తికతయొక్క ఈ ప్రథమ సాధన, నిజమే, తనతో ఒకానొక పూర్ణతమ ఆంతర నిష్క్రియతను గొనివచ్చును మఱియు తన ఆంతరతమ భాగములందును, అభ్యాస సూత్రములందును సన్యాసవిధానముతో సమముగా నుండును. అయినను ఒక దశకు చేరుకొనిన పిమ్మట, సక్రియ ప్రకృతి మఱియు బాహ్య ప్రపంచ మపేక్షించు కర్మనుండి దానియొక్క ఉపసంహరణ ప్రవృత్తి నిరోధించబడును మఱియు దాని ఆంతర నిష్క్రియత కర్మనిరాకరణము మఱియు భౌతిక ఉపసంహరణములోనికి దిగిపోకుండ ఒక పరిమితి విధించబడును. అనగా, ఇంద్రియములచేత తమ విషయ సన్యాసము - "విషయాం స్త్యక్త్వా" (18-51) - త్యాగరూపముగా నుండవలెను (18-2); అది విషయములందు సమస్త ఇంద్రియాసక్తి - "రసము" (2-59) యొక్క పరిత్యాగముగా నుండవలెనే గాని, ఇంద్రియముల స్వభావసిద్ధ ఆవశ్యక కర్మకలాపము యొక్క నిరాకరణముగా నుండరాదు, మనుష్యుడు పరిసర వస్తువుల మధ్య "చరించవలెను" (2-71) మఱియు ఇంద్రియక్షేత్రము నందలి విషయముల పైన ఇంద్రియములయొక్క ఒక శుద్ధ, సత్య మఱియు ప్రగాఢ, ఒక సరళ మఱియు కేవల వ్యాపారముతో కర్మ చేయవలెను - "కేవలై రింద్రియైః చరన్" (5-11); దీనివలన దివ్య కర్మ చేయు పురుషుని కది తోడ్పడును; అంతే గాని మానవుడు కామసంపూర్తికి కర్మ చేయ గూడదు. వైరాగ్య ముండవలెను, కాని దాని అర్థము జీవితము పట్ల జుగుప్స గాని, ప్రపంచకర్మ పట్ల అరుచి గాని కారాదు, అది "రాగము" మఱియు దాని వ్యతిరేక మగు "ద్వేషము" - యొక్క సన్యాసము మాత్రమే గావలెను. సర్వవిధ, సమస్త మానసిక మఱియు ప్రాణిక అరుచినుండి, అటులే సమస్త మానసిక మఱియు ప్రాణిక రుచినుండి ఉపసంహరించుకొనవలెను. ఇచ్చట గీతా ఉద్దేశ్యము కర్మనిర్వాణము (వినాశము) గాదు, అది పరిపూర్ణ సామర్థ్యప్రద సమతయే; ఈ సమతయందు అంతరాత్మ వస్తువుల పూర్ణ, సమగ్ర దివ్యదర్శనమునకును, ప్రకృతి యందు సమగ్ర దివ్యకర్మకును ఒక అబాధ, అపరిమిత ఆమోదము నీయగలుగును. సంతతమగు ధ్యానావలంబనము -"ధ్యానయోగపరో నిత్యం" (18-51)- అంతరాత్మకు తన శక్త్యాత్మను, తన మౌనాత్మను దర్శించుటకు ఒక గట్టి సాధన మగును. అయినను కేవల ధ్యానమయ జీవితము నిమిత్తము క్రియాత్మక జీవితమునకు స్వస్తి చెప్పగూడదు; పరమ పురుషుని కొక యజ్ఞముగా సదా కర్మ చేయబడవలెను. సన్యాస మార్గము నందలి నివృత్తిక్రియ

సనాతన బ్రహ్మమందు వ్యక్తియొక్క విలీనమునకు, అంతర్ధానమునకు దారిచేయును మఱియు ప్రపంచగతమగు కర్మ మఱియు జీవన సన్యాసము ఆ ప్రక్రియయందు ఒక ఆవశ్యక సోపానము. కాని గీతయొక్క త్యాగ మార్గమునందు అదే నివృత్తి క్రియ మన సమస్త జీవనమును, సత్తను, మఱియు సర్వ కర్మను భగవంతుని ప్రశాంత, అపరిమేయ సత్త, చేతన మఱియు సంకల్పముతో ఒక సమగ్ర ఏకతలోనికి త్రిప్పుటకు మాత్రమే ఒక సన్నాహ మగును, మఱియు నది నిమ్నతర అహంకారము నుండి పరమ ఆధ్యాత్మిక ప్రకృతి–"పరా ప్రకృతిః" (7–5)–యొక్క అవర్ణనీయ సంసిద్ధిదిశగా అంతరాత్మయొక్క సమగ్ర ఊర్ధ్వగతికి శ్రీకారమును, సంభవ సాధనయు నగును.

10. సృష్టిరహస్యము మఱియు గుహ్యము :

గీతా విచారణయొక్క అసందిగ్ధ నూతన మార్గము తర్వాతి రెండు శ్లోకములలో సూచితమగును, వీనిలో మొదటి దానియందలి అనుక్రమము అర్థవంతము, "ఎప్పుడు ఒకడు బ్రహ్మ మగునో, ఎపు డతడు శోకింపడో లేక కామించడో, ఎపు డతడు సర్వభూతముల పట్ల సమముగా నుండునో, అపు డతడు నాయందు పరమ ప్రేమను, భక్తిని బొందును".(18–54). కాని సంకుచిత జ్ఞానమార్గమునందు భక్తి, సగుణ భగవంతునియందు భక్తి, ఒక అపర ప్రారంభక సాధన మాత్రమే కాగలదు; పర్యవసానము, పరాకాష్ఠ నిర్గుణ బ్రహ్మముతో లభించు ఒక నిర్విశేష ఏకతయందు వ్యక్తిత్వముయొక్క అంతర్ధానమే యగును, ఏలన నిర్గుణ బ్రహ్మమునందు భక్తికి తావే లేదు : కారణ మచ్చట భక్తుడు గాని, భజనీయుడు గాని యుండడు; అచ్చట తక్కిన - దంతయు ఆత్మతో జీవునియొక్క నీరవ నిశ్చల తాదాత్మ్యమునందు నశించిపోవును. ఇచ్చట గీత మనకు నిర్వ్యక్తిక బ్రహ్మముకంటెను గూడ ఉచ్ఛతరమగు ఒక వస్తువు నిచ్చును - ఇచ్చట పరమేశ్వరుడగు పరమాత్మ గలదు, ఇచ్చట పరమ పురుషుడును, అతని పరమ ప్రకృతియు గలదు, ఇచ్చట సవ్యక్తిక, నిర్వ్యక్తికములకు పరమునం దుండి, తన సనాతన శిఖరములందు వానిని సమన్వయపఱచు పురుషోత్తముడు గలడు. ఇచ్చట సైతము అహంకారిక వ్యక్తిత్వము నిర్వ్యక్తిక బ్రహ్మముయొక్క నీరవత (మౌనము) నందు అంతరించిపోవును గాని, వెనుక నుండు ఈ నీరవతతో బాటుగ నిర్వ్యక్తికము కంటెను మహత్తరమగు ఒక పరమాత్మ వస్తువుయొక్క క్రియ నిలిచియుండును. ఇప్పు డిక అహంకారము మఱియు గుణములయొక్క గ్రుడ్డి మఱియు కుంటి క్రియ యుండదు, పరంతు దాని స్థానమున ఒక అనంత, ఆధ్యాత్మిక బలము, ఒక విముక్త, అపరిమేయ శక్తియొక్క వ్యాపక,

స్వయం నిర్ధారక గతి రాజిల్లును. సమస్త ప్రకృతియు ఏకమాత్ర భగవంతునియొక్క శక్తి యగును మఱియు సమస్త క్రియ ఒక వాహిని మఱియు నుపకరణరూపమగు వ్యక్తిద్వారా జరుగు అతని క్రియయే యగును. అహంకార స్థానమున యథార్థ ఆధ్యాత్మిక వ్యక్తి సచేతన మఱియు అభివ్యక్త రూపమున ముందుకు వచ్చును; ఈ వ్యక్తి తన వాస్తవ ప్రకృతియొక్క స్వతంత్రతయందు తన సమున్నత పదవియొక్క శక్తియందు, భగవంతునితో తనకు గల సనాతన సంబంధముయొక్క మహత్వ, వైభవములందు ప్రకటమగును; ఈ వ్యక్తి పరమేశ్వరునియొక్క ఒక అక్షయ అంశము, పరప్రకృతియొక్క ఒక అవినాశి శక్తి - "మమైవ అంశః సనాతనః" (15-7). "పరా ప్రకృతి ర్జీవభూతా" (7-5). అపుడు మానవుని అంతరాత్మ ఒక పరమ ఆధ్యాత్మిక నిర్వ్యక్తికతయందు పురుషోత్తమునితో తన ఏకత ననుభవించును మఱియు తన విశ్వీకృత వ్యక్తిత్వమునందు తాను భగవంతుని యొక్క ఒక అభివ్యక్త శక్తి యని కనుగొనును. దాని జ్ఞానము అతని జ్ఞానము యొక్క ఒక వెలుగగును; దాని సంకల్పము అతని సంకల్పముయొక్క ఒక శక్తి యగును; విశ్వము నందలి సర్వముతో దాని సమైక్యము అతని సనాతన ఏకత యొక్క ఒక లీల యగును. ఇది యొక ద్వివిధ సాక్షాత్కారము, ఇది అభివ్యక్తి సత్తకు గల ఒక అనిర్వచనీయ సత్యముయొక్క ఉభయ పార్శ్వముల సమ్మిలనము, వీనిలో నే పార్శ్వమునుండి యైనను మానవుడు భగవంతుని అనంత సత్తను సమీపించి, దానిలో ప్రవేశించగలడు : ఇట్టి సాక్షాత్కారము నందు మానవుడు నివసించవలెను, కర్మ చేయవలెను, అనుభవములను బొందవలెను మఱియు సర్వముతో తన సంబంధములను, అటులే తన అంతరాత్మయొక్క బాహ్యాంతర వ్యాపారములను నిర్ణయించుకొనవలెను, అథవా తన ఉచ్ఛతమ ఆత్మయొక్క మహత్తమ శక్తిచేత అవి అతనికొఱకు నిర్ణయింపబడు నట్లు వర్తించవలెను. మఱియు నట్టి ఏకీకర సాక్షాత్కారమునందు ఆరాధన, ప్రేమ మఱియు భక్తి ఇంకను సంభవమగుటయే గాక, అవి సర్వోన్నతానుభవముయొక్క ఒక విస్తృత, ఒక అనివార్య మఱియు నొక మకుటాయమాన భాగమగును. ఏకము నిత్యము అనేక మగును, అనేకము తమ బాహ్య విభజనయందు సైతము నిత్యము ఏకము గనే యుండును, మనయందు సృష్టియొక్క ఈ రహస్యమును, గుహ్యమును ప్రదర్శించు పురుషోత్తముడు తన అనేకతచేత విచ్ఛిన్నుడును గాడు, తన ఏకతా పరిధియందు బద్ధుడును గాడు - ఇదిగో, ఇదియే సమగ్రజ్ఞానము, ఇదియే సమన్వయ సాధ కానుభవము, ఇదియే జ్ఞానికి విముక్త కర్మ సామర్థ్యము నిచ్చును - "ముక్తస్య కర్మ" (4-23).

11. భక్తిచేత సమగ్రజ్ఞానము :

ఒక పరమ భక్తిచేత ఈ జ్ఞానము లభించు నని గీత వచించును. ఒక అతిమానస మఱియు సమున్నతాధ్యాత్మిక వస్తుదర్శనము చేత మనస్సు తననుదాను అతిక్రమించి నపుడు మఱియు హృదయము సైతము జ్ఞానముతో శ్రుతి గలిపి, భక్తి ప్రేమల మన అజ్ఞానమయ మానసిక రూపము లను దాటి, ఒక ప్రశాంత, గంభీర, ప్రకాశమయ ప్రేమకును, భగవంతునియందు ఒక పరమ ఆహ్లాదమునకును, మఱియు నొక అపరిమేయ ఆరాధన, అవిచల హర్షాతిరేకము, ఆధ్యాత్మికానందమునకును ఎగసి నపుడు - అపుడు సమగ్ర జ్ఞానము ప్రాప్తించును. అంతరాత్మ తన పృథక్కర వ్యక్తిత్వమునకు నీళ్లు వదిలి, నిర్వ్యక్తిక బ్రహ్మ మైనపుడు, అపుడే అది యదార్థ పురుషునియందు నివసించగలదు మఱియు పురుషోత్తముని యందు పరమ జ్ఞానోద్భాసక భక్తిని బొంది, తన గంభీర భక్తి, అనగా హృదయజ్ఞానము చేత అతనిని సర్వథా తెలియగలుగును - "భక్త్యా మాం అభిజానాతి" (18-55), హృదయముయొక్క అగాధ దర్శనము మనస్సుయొక్క అత్యున్న తానుభవమున, పూర్ణమొనరించి నపుడు సిద్ధించునదే ఈ సమగ్ర జ్ఞానము - "సమగ్రం మాం జ్ఞాత్వా" (7-1). "నే నెవడినో, ఎంతటి వాడనో మఱియు నా సత్తయొక్క సమస్త సత్యతయందును, సర్వ తత్త్వములందును అతడు నన్ను క్రమముగా నెఱుంగును." - "యావాన్ యశ్చాస్మి తత్త్వతః" (18-55). ఈ సమగ్ర జ్ఞానము వ్యక్తియందు ఉపస్థితుడై యుండు భగవంతుని జ్ఞానము; ఇది మానవుని హృదయ గుహలో గుప్తముగా నుండు ఈశ్వరుని సంపూర్ణానుభవము : ఈ యీశ్వరుడే యిపుడు అతని సత్తయొక్క పరమ ఆత్మగను, అతని సమస్త ప్రదీప్త చేతనయొక్క దివ్య సూర్యుడుగను, అతని సమస్త కర్మలయొక్క స్వామి మఱియు శక్తిగను, అతని అంతరాత్మయొక్క సమస్త ప్రేమానందముల మూలస్రోతముగను, తన పూజారాధనల పాత్రమగు ప్రియుడు మఱియు ప్రేమికుడుగను ప్రకటమగును. ఈ సమగ్ర జ్ఞానము విశ్వమునందు వ్యాపించి యుండు భగవంతుని యొక్కయు జ్ఞాన మగును, అటులే ఎవనినుండి సర్వము ప్రభవించునో, ఎవనియందు సర్వము నివసించునో మఱియు తన అస్తిత్వమును గలిగియుండునో, అట్టి సనాతనునియొక్కయు, విశ్వముయొక్క ఆత్మ మఱియు చేతన సత్తయొక్కయు, ఈ సర్వము నైన వాసు దేవునియొక్కయు (7-19), ప్రకృతి కర్మలను అధిశాసించు జగదీశ్వరునియొక్కయు జ్ఞాన మగును. ఈ పురుషుని సత్తయొక్క రూపము మనోవిచారణకు చిక్కదు గాని, దాని మౌనమునకు

అగోచరము గాదు. అది కేవల ఆత్మరూపముననను, పరబ్రహ్మరూపముననను, పరమపురుషుని రూపముననను, పరమేశ్వరుని రూపముననను అతని సంపూర్ణ సజీవ అనుభవము: ఏలన ఆ కేవలము (Absolute) పైకి సంబంధరహితముగా, అవ్యవహార్యముగా గన్పించినను, అదే సమయమున మఱియు తన సర్వోన్నత పదమునందు సైతము, అదియే విశ్వక్రియను ప్రారంభించు మూలపురుషుడు(10-8), మఱియు నీ సర్వభూతముల మహేశ్వరుడు (5-29). విముక్త మానవుని అంతరాత్మ ఈ సమన్వయ జ్ఞానముచేత, నిట్లు పురుషోత్తమునిలో ప్రవేశించి, విశ్వాతీత భగవంతునియొక్క వ్యక్తి నిష్ఠ భగవంతునియొక్క, విశ్వగత భగవంతునియొక్క ఒక పరిపూర్ణ సమకాలీన హర్షవిశేషమువలన ఆ పురుషోత్తముని లోతులలోనికి చొచ్చుకొని పోవును-"మాం విశతే తదనంతరం" (18-55). అతడు తన ఆత్మజ్ఞానము నందును, ఆత్మానుభవమునందును పురుషోత్తమునితో ఏకమగును, తన సత్తయందును, చేతనయందును, సంకల్పమునందును మఱియు ప్రపంచ జ్ఞానము నందును, ప్రపంచప్రేరణయందును అతనితో ఏకమగును, అటులే విశ్వమునందును, విశ్వమునందలి సకల భూతములతో అతని ఏకతయందును అతనితో ఏకమగును, చివరకు వ్యక్తికి, విశ్వమునకు నావల సనాత నానంతునియొక్క అతీతావస్థయందు అతనితో ఏకమగును - "శాశ్వతం పద మవ్యయం" (18-56). ఇది పరమ జ్ఞానము యొక్క హృదయ మగు పరమభక్తి యొక్క పరాకాష్ఠ.

12. కర్మచేత అమరత్వము :

మఱియు నిపు డొక సత్యము స్పష్ట పడును : సంతతము, నిర్విరామము నగు కర్మ జీవనముయొక్క క్రియాకలాపము లందలి ఏ భాగమును తగ్గించక లేక పరిత్యజించక చేయబడు సర్వవిధ కర్మలు సర్వోన్నత ఆధ్యాత్మి కానుభవముతో సుసంగత మగుటయే గాక, భక్తి లేక జ్ఞానము నకు ఏమాత్రము తీసిపోని ఒక శక్తిశాలి సాధన యగును. ఇవ్విషయమున గీతా వాక్యమును మించిన నిశ్చిత వాక్యమేదియు నుండజాలదు. "మఱియు నాయందు స్థితుడై సదా సర్వకర్మలను చేయుటచేతను గూడ అతడు నా ప్రసాదమువలన శాశ్వత అవ్యయ పదము నందును," (18-56). ఈ విమోచనశీల క్రియ మన యందును, విశ్వము నందును గల భగవంతునితో మన సంకల్పము మఱియు మన ప్రకృతియొక్క సమస్త సక్రియ భాగముల ప్రగాఢ సంయోగమునందు చేయబడు కర్మల స్వభావముతో నొప్పారును.

అది మున్ముందు ఇంకను మన ఆత్మయే కర్త యను భావముతో ఒక యజ్ఞముగా జేయబడును. పిమ్మట నది ఆ భావము వినా, మఱియు ప్రకృతియే కేవల కర్త్రి యను జ్ఞానముతో చేయబడును (3-27). చివర కది ప్రకృతి భగవంతుని యొక్క ఒక పరమ శక్తి యను జ్ఞానమున చేయబడును, అనగా మన సర్వకర్మలు అతనియందే సన్యసించబడును (3-30) మఱియు నతనికే సమర్పించబడును; అపుడు వ్యక్తి ఒక వాహిని మఱియు ఉపకరణముగనే యుండును (11-33). అప్పుడు మన కర్మలు సరాసరి మనలోని ఆత్మనుండియు, భగవంతు నుండియు ప్రవర్తించును, అవిభాజ్య విశ్వక్రియయొక్క ఒక అంగమగును, మన చేత గాక, ఒక వ్యాపక అతీత శక్తిచేత నారంభించబడి, నిర్వర్తింపబడును. అపుడు మనముచేయున దంతయు అందరి హృదయములందును ఆసీనుడై యున్న ఈశ్వరుని కొఱకు, అనగా వ్యక్తియందలి భగవంతుని కొఱకు మఱియు మనయందలి అతని సంకల్ప పరిపూర్తి నిమిత్తము చేయబడును; అటులే ప్రపంచమునందలి భగవంతుని కొఱకు, సర్వభూతముల హితము కొఱకు, ప్రపంచ క్రియ మఱియు ప్రపంచలక్ష్యమును సాధించుటకు చేయబడును, లేక ఒక్క మాటలో, పురుషోత్తముని కొఱకు చేయబడును మఱియు నది నిజముగా తన విశ్వశక్తిద్వారా అతనిచేతనే చేయబడును. ఈ దివ్యకర్మలు, వాని రూపము మఱియు బాహ్య స్వభావ మెటు లున్నను, మనలను బంధించ జాలవు, పైగా గుణమయమగు నిమ్నప్రకృతినుండి పరమ, దివ్య, ఆధ్యాత్మిక ప్రకృతి యొక్క సంసిద్ధిలోని కెగయుటకు ఒక శక్తిశాలి ఉపాయమగును. ఇట్లు ఈ మిశ్రిత మఱియు పరిమిత ధర్మములనుండి తప్పించుకొని, మన మమృత ధర్మములో నడుగిడుదుము; మన సమస్త చేతన మఱియు కర్మయందు పురుషోత్తమునితో మనను మన మేకము గావించుకొని నపుడు, ఈ అమృత ధర్మము స్వయముగా మనకు ప్రకటమగును. ఇచ్చట మనము సాధించు నీ ఏకత అచ్చట కాలమున కావల వెలుగొందు అమృతత్వములోని కెగయు శక్తిని తనతో గొనివచ్చును. అచ్చట మనము అతని నిత్య పరాత్పర పదవియందు నివసించెదము.

13. భావము, మార్గము, గమ్యము :

ఇ ట్లీ ఎనిమిది శ్లోకములు (18-49,....56), ఇప్పటికే దివ్య గురు వొసంగిన జ్ఞానప్రకాశమున చదువబడి నపుడు, సంపూర్ణ గీతాయోగముయొక్క సమస్త మూలభావమును, సమగ్ర కేంద్ర విధానమును, సకల సారతత్త్వమును సంక్షిప్తముగా నైనను, సమగ్రముగా సూచించును.

౨౨. పరమ రహస్యము

1. గీతాయోగ హృదయము :

ఇట్లు దివ్యగురువు శిష్యునకు అతని కర్మ మఱియు యుద్ధ రంగమునందు జ్ఞానము మఱియు యోగముయొక్క సారమును ప్రకటించి, దాని నిపుడు అతని కర్మకు అనువర్తింపజేయ ముందుకు సాగును, అయితే ఆ ప్రకారము అందరి కర్మకును అనువర్తించును. ఏలన ఇచ్చట మాటలు ఒక అసాధారణ దృష్టాంతమునకు సంబంధించి, కురుక్షేత్ర మహాసంగ్రామ నాయకునికి చెప్పబడి నప్పటికి, వాని లోపల మిక్కిలి వ్యాపకార్థము గలదు, సాధారణ మనోభూమికను దాటి, పైకివెళ్ళి, పరమ ఆధ్యాత్మిక చేతనయందు నివసింపను, కర్మచేయను ఎవరు సిద్ధముగా నుందురో, వారి కందరకు అవి యొక సార్వత్రిక నియమము నిచ్చును. అహంకారము మఱియు వైయక్తిక మనస్సుయొక్క ఆవరణమును భేదించి, వెలువడి, సర్వమును ఆత్మ మఱియు ఆధ్యాత్మిక సత్తయొక్క విశాలత యందు దర్శించుట; భగవంతుని అతని సమగ్ర సత్యమునందును, అతని సర్వ రూపములందును ఎఱింగి, భజించుట (6–31); ప్రకృతి మఱియు జగత్సత్త యొక్క పరాత్పరాత్మకు తనను పూర్తిగ సమర్పించుకొనుట (6–47); భగవచ్చేతనను ఆవేశించి, దానిచేత ఆవేశింపబడుట; ప్రేమ, ఆనందము, సంకల్పము మఱియు జ్ఞానముల విశ్వవ్యాపక రూపము నందు ఏకమాత్రునితో ఏకముగా నుండుట (6–31); అతనియందు సర్వభూతములతో ఏకముగా నుండుట (11–7); దేనియందు సర్వము భగవంతుడనియే అనుభూత మగునో, అట్టి ప్రపంచము యొక్క దివ్యాధారము నందును, విముక్త పురుషునియొక్క దివ్య స్థితియందును కర్మల నొక యజ్ఞముగను, ఆరాధనగను జేయుట (4–23) – ఇదియే గీతాయోగము యొక్క అభిప్రాయము. అది మన బాహ్య సత్తనుండి పరమ ఆధ్యాత్మిక మఱియు వాస్తవ సత్యములోనికి చేయు ఒక సంక్రమణము. మఱియు పృథక్కర చేతన యొక్క అనేకానేక పరిమితులను విడిచివేసి, ఆవేశ, అశాంతి, అజ్ఞానములతో మనోసంగమును, అటులే అల్పతర ప్రకాశ జ్ఞానములను, పుణ్యపాపములను, నిమ్న ప్రకృతియొక్క ద్వంద్వమయ ధర్మము మఱియు ప్రమాణమును పరిత్యజించుటచేత ఆ సంక్రమణము సాధ్యమగును. కావుననే దివ్య గురు విట్లు బోధించును – "సర్వాత్మనా నాకు నిన్ను సమర్పించు

కొనుచు, నీ సచేతన మానసమునందు నీ సర్వ కర్మలను నాయందు సన్యసించుచు, బుద్ధియోగము నాశ్రయించి, హృదయము నందును, చేతనయందును సదా నాతో ఏకముగా నుండుము (18-57). సర్వదా ఇట్లు నీ వుందు వేని, అపుడు నా అనుగ్రహమువలన సర్వ కఠిన, సంకటగ్రస్త మార్గములద్వారా సురక్షితముగా ముందుకు బోదువు; కాని అహంకారమువలన నా మాట విన వేని, నశించిపోదువు (18-58). 'నేను యుద్ధము చేయను' అని అహంకారము నాశ్రయించి నీవు తలంతు వేని, ఈ నీ నిశ్చయము వ్యర్థము; నీ ప్రకృతియే నీచేత కర్మ చేయించును (18-59). మోహమువలన దేనిని నీవు చేయగోరవో, నీ స్వభావజన్యమైన స్వీయకర్మచేత బద్ధుడవై దానిని నీవు వివశముగా చేసితీరెదవు (18-60). ఈశ్వరుడు సర్వభూత హృదయములందు అవస్థితుడై యుండి, ఓ అర్జునా, యంత్రము నెక్కియున్న వాని నన్నింటిని (సర్వభూతములను) తన మాయచేత నిరంతరము త్రిప్పు చుండును (18-61). సర్వభావముచేతను అర్జునా, ఆయనయందే శరణు బొందుము, అపు డాయన ప్రసాదముచేత పరమ శాంతిని, శాశ్వత పదమును బొందెదవు (18-62)."

2. భగవంతుడు వ్యక్తిత్వసహితుడు :

ఈ పంక్తులలో యోగముయొక్క ఆంతరతమ హృదయము నిక్షిప్తమై యున్నది మఱియు నివి దాని అనుభవ శిఖరమునకు గొనిపోవును; కావున తమ ఆంతరతమ తత్త్వమునందును, తదనుభవ శిఖరముయొక్క పరమ విశాలతయందును వాని అర్థమును మనము గ్రహించ వలెను. ఈ వచనములు భగవంతునికి, మానవునకు మధ్య సంభవముకాగల అత్యంతసంపూర్ణ, ఘనిష్ఠ మఱియు సజీవ సంబంధమును ప్రకటించును. ఏ విశ్వాతీత మఱియు విశ్వగత భగవంతునుండి మానవుడు జనించునో మఱియు నెవని యందు నివసించునో, అతనిపట్ల వాని అనన్య ఆరాధన నుండియు, తన సమస్త సత్తయొక్క ఊర్ధ్వముఖ సమర్పణనుండియు, నిఃశేష పరిపూర్ణ ఆత్మనివేదన నుండియు నుత్పన్నమగు భక్తిమయ భావనయొక్క ప్రగాఢ శక్తిచేత ఈ వచనములు స్పందించుచున్నవి. భక్తికిని, భగవత్ప్రేమకును, పరమపురుషుని ఆరాధనకును గీత సమున్నత సుస్థిర స్థానము నిచ్చును; ఇవియే సర్వోచ్ఛ కర్మయొక్క ఆంతరతమ ప్రాణము మఱియు ప్రేరణ, సర్వోచ్ఛ జ్ఞానము యొక్క శిఖరము మఱియు హృదయము. కావున ఇచ్చటి ఈ ప్రబల భావన ఆ భక్త్యాదులకు అనురూపముగనే యున్నది. ఈ శ్లోకములందు ప్రయుక్తములైన పదములును, వానియందు

స్పందించుచున్న ఆధ్యాత్మిక భావము (emotion) భగవత్స్వరూపముయొక్క వైయక్తిక సత్యము మఱియు సన్నిధికి ప్రగాఢ ప్రాముఖ్యము, పరమ మహత్త్వము నిచ్చుచున్నట్లు తోచును. ఈ భగవంతుడు దార్శనికుని నిరాకార కేవలము కానేకాదు, ఏ సంబంధప ౦ను సహించని ఉదాసీన నిర్వ్యక్తిక సన్నిధి గాని, అనిర్వచనీయ మౌనము గాని కానేకాదు, ఏలన మన సంసిద్ధియొక్క నిబంధన మఱియు నియమరూపమున ఇతనికి మన సర్వ కర్మలను సమర్పించగలుగుచున్నాము, మన చేతన సత్తయొక్క సర్వ భాగములందును ఇతనితో ఘనిష్ఠ ఏకతను విధించగలుగుచున్నాము మఱియు నితడు తన సాహాయ్యమును, రక్షణను, ముక్తిప్రదానమును మనకు వాగ్దానము చేయుచున్నాడు. ఈ భగవంతుడు మన కర్మల నియామకుడు, మన అంతరాత్మయొక్క సుహృదుడు మఱియు ప్రేమికుడు, మన ప్రాణమునకు అంతరంగ ప్రాణము, మన సమస్త సవ్యక్తిక మఱియు నిర్వ్యక్తిక ఆత్మ మఱియు ప్రకృతియొక్క అంతర్వాసి మఱియు అధివాసి ప్రభువు; ఇతడు మాత్రమే మన కీ అంతరంగ ప్రోత్సాహక సందేశము నీయగలడు. అయినను ఇది సాత్త్విక లేక తదితర అహంకారిక మానసమునందు నివసించుచుండు మానవునకును, దేవునియొక్క ఒకానొక వైయక్తిక రూపము మఱియు పార్శ్వమగు "ఇష్టదేవతకును" మధ్య మతములు నెలకొల్పు సామాన్య సంబంధము గాదు; ఏలన ఈ ఇష్టదేవత ఆ మానసముచే రచింపబడును, అథవా దాని పరిమిత ఆదర్శమును, ఆకాంక్షను లేక కామమును తృప్తిపఱచుటకు దాని ముందుంచబడును. అది సామాన్య మానసిక మానవుని ధార్మిక భక్తియొక్క సాధరణాభిప్రాయము మఱియు వాస్తవ లక్షణము; కాని ఇచ్చటి భక్తి ఒకానొక విశాలతర వస్తువు, అది మనస్సును, దాని పరిమితులను, దాని ధర్మములను దాటి పరగును. ఇచ్చట తనను సమర్పించుకొనునది మనస్సునకంటె గంభీరతరమగు నొక వస్తువు, ఆ సమర్పణను స్వీకరించునది ఇష్టదేవతకంటె మహత్తరమగు నొక వస్తువు.

3. నిషేధరూపుడు గాడు, పరిపూర్తిరూపుడు :

ఇచ్చట తనను సమర్పించు కొనునది జీవుడు; ఈ జీవుడు మూల అంతరాత్మ, మానవునియొక్క ఆద్య, కేంద్ర, ఆధ్యాత్మిక సత్త, వైయక్తిక పురుషుడు. ఇతడు పరిమితికారక, అజ్ఞానమయ అహంభావమునుండి విముక్తుడు, ఇతడు తనను ఒక పృథక్కర వ్యక్తిత్వముగా గాక, భగవంతునియొక్క ఒక "సనాతన అంశముగను" (15-7), శక్తిగను, అంతరాత్మ - భావముగను దెలిసికొనును, ఇతడు అజ్ఞానము

వెడలిపోవుటచేత విముక్తుడు మఱియు ఉద్ధృతుడు మఱియు సనాతనుని ప్రకృతియే యగు తన స్వీయ సత్య మఱియు పరమ ప్రకృతియొక్క విముక్తి స్వాతంత్ర్యములందు సుప్రతిష్ఠితుడు. మన జీవనమునకు మూలము, ఆధారము మఱియు నియామక ఆత్మ మఱియు శక్తితో ఆనంద సాయుజ్యముల పూర్ణ, వాస్తవ సంబంధములో ప్రవేశించునది మనయందలి ఈ కేంద్ర ఆధ్యాత్మిక సత్తయే. పోగా, మన సమర్పణను స్వీకరించు వాడు ఎట్టి పరిమిత దేవతయు గాక, స్వయముగా పురుషోత్తముడు, ఏకమాత్ర సనాతన భగవంతుడు, సమస్త జగత్తు మఱియు సమస్త ప్రకృతియొక్క ఏకమాత్ర పరమ ఆత్మ, సృష్టియొక్క ఆద్య, సర్వాతీత, దివ్యపురుషుడు. మన విముక్త జ్ఞానముయొక్క అనుభవమునకు అతడు ముందుగా ఒక అక్షర నిర్వ్యక్తిక ఆత్మసత్తగా గోచరించును, అదియే అతని సన్నిధియొక్క ప్రథమ చిహ్నము, అతని ద్రవ్యముయొక్క ప్రథమ స్పర్శ మఱియు ముద్రణము. కాగా ఒక విశ్వగత, విశ్వాతీత అనంత పురుషుడు కేవల మతని సత్తయొక్క గుహ్యా గుప్త రహస్య మగును; ఇతనిని మానసిక రూపమున చింతించజాలము – "అచింత్య రూప" (8-9), కాని ఎపుడు మన చేతనాశక్తులగు భావము, సంకల్పము మఱియు జ్ఞానము తమనుండియు, తమ అంధ, క్షుద్ర రూపములనుండియు వెలువడి, ఒక జ్యోతిర్మయ ఆధ్యాత్మిక, ఒక అపరిమేయ అతిమానస ఆనందము, శక్తి మఱియు విజ్ఞానము (gnosis) లోనికి ఉద్ధరింపబడునో, అపు డా పురుషుడు వానికి మిక్కిలి సన్నిహితముగా నుండును, ప్రత్యక్షముగా నుండును. అటు అనిర్వచనీయ బ్రహ్మ మయ్యును, ఇటు సుహృదుడు, ఈశ్వరుడు (5-29), ఉద్భాసకుడు, ప్రేమికుడు నగు ఆ పురుషుడే ఈ పూర్ణతమ భక్తి మఱియు శరణాగతికి, ఘనిష్ఠతమ ఆంతర సంభూతి మఱియు సమర్పణకు అనన్య పాత్రము. ఈ సాయుజ్యము (union), ఈ సంబంధము పరిమితికర మనస్సుయొక్క రూపములనుండియు, నియమములనుండియు పైకి ఉద్ధరించబడిన ఒక అపూర్వ వస్తువు, దానిని ఈ నిమ్న ధర్మము లేవియు స్పృశింపజాలవు (18-66) ; అది మన ఆత్మయొక్కయు, మూల సత్తయొక్కయు సత్యము. అయినను, అథవా అందుచేతనే – ఆ సాయుజ్యము మన ఆత్మ మఱియు సత్తయొక్క సత్యమగుటచేతనే, దేనినుండి సర్వము వెలువడి, దేని జన్యములు మఱియు సూచనల రూపమున సర్వము వర్తించుచు, దేనిని జేర ప్రయాసపడుచున్నదో, ఆ పరమాత్మతో ఆత్మయొక్క ఏకతాసత్య మగుటచేతనే – ఆ సాయుజ్యము ఒక నిషేధము

గాక, ఒక పరిపూర్తి యగును, అనగా మనః ప్రాణములు తమ లోపల, తమ ఇంకను అసంసిద్ధ అర్థము గానున్న దేనిని సూచించు చున్నవో మఱియు ధరించుచున్నవో, దాని అంతటి పరిపూర్తి యగును. కావున మన నిర్వాణము (ఆఱిపోవు) ఇచ్చుటి మన సమస్త సత్తయొక్క బహిష్కరణము మఱియు నిషేధరూప వినాశము గారాదు, అది అజ్ఞానము మఱియు అహంకారము యొక్క బహిష్కరణము మఱియు వినాశము గావలెను; తత్ఫలితమగు మన జ్ఞానము, సంకల్పము మఱియు హృదయాకాంక్షయొక్క అనిర్వచనీయ పరిపూర్తి గావలెను; భగవంతునియందు, సనాతనునియందు ఒక ఉన్నత (uplifted), అపరిమిత నివాసము గావలెను – "నివసిష్యసి మయ్యేవ" (12–8); మన సమస్త చేతనయొక్క రూపాంతరము మఱియు నొక మహత్తర ఆంతర ధామమునకు ఆగమనము గావలెను; అట్టి నిర్వాణముచేతనే ఈ పరమ సంసిద్ధియు, ఆధ్యాత్మిక విముక్తియు ప్రాప్తించును.

4. అహంకారిక జీవితము – ఆధ్యాత్మిక జీవితము :

ఆధ్యాత్మిక సమస్య యొక్క కఠినత యంతయు, సాధారణ మనస్సునకు దేని యథార్థ గ్రహణము మిక్కిలి కఠినమో, అట్టి సంక్రమణ స్వభావ మంతయు ఒక ప్రధాన భేదముతో ముడివడియుండును – అది నిమ్న ప్రకృతియందు అహంకారముయొక్క అజ్ఞాన మయ జీవితమునకును, తన స్వీయ సత్య ఆధ్యాత్మిక ప్రకృతియందు ముక్త జీవుని యొక్క విశాల ప్రకాశమయ జీవితమునకును గల భేదము. ఇందలి మొదటి దాని సన్యాసము సంపూర్ణము, రెండవ దానిలోనికి సంక్రమణము (transition) అశేషము గావలెను. గీత యిచ్చు టీ విభేదమును సర్వ సంభవ బలముతోను వివరించును. ఒక వైపున చేతనయొక్క ఈ క్షుద్ర సంక్షుబ్ధ దంభపూర్ణ అహంకారికావస్థ గలదు – "అహం కృత భావ" (18–17). ఇది యీ తుచ్ఛ నిస్సహాయ పృథక్కర వ్యక్తిత్వము యొక్క దుర్బలతాపాదక సంకుచితత్త్వము; దీని దృక్కోణమునుండియే మనము సాధారణముగా ఆలోచింతుము మఱియు కర్మచేతుము, వస్తు సంస్పర్శలను బొందుచు, వానికి సమాధాన మిత్తుము. రెండవ వైపున అమరమగు పూర్ణత, ఆనందము మఱియు జ్ఞానముయొక్క ఆధ్యాత్మిక మహావిస్తారములు గలవు; దివ్య పురుషునితో సంయోగముద్వారా మన కీ విస్తారములలోనికి ప్రవేశము లభించును; అపుడు మనము సనాతన జ్యోతిలో అతనియొక్క ఒక అభివ్యక్తి మఱియు ప్రకటనముగనే యుందుము గాని,

అహం-ప్రకృతియొక్క అంధకారములో అతని యొక్క ఒక మాఱు వేషముగా నుండము. ఈ సంయోగముయొక్క సంపూర్ణతయే "సతతం మచ్చిత్తః" (18-57) - అను గీతావచనముచేత సూచింపబడినది. అహంకారిక జీవనమున కాధారము పైకి కన్పించు మానసిక, ప్రాణిక, శారీరిక జగత్సత్యము యొక్క ఒక నిర్మాణము, అటులే వైయక్తిక జీవునికి, ప్రకృతికి మధ్య గల వ్యావహారిక సంబంధముల ఒక సంధిస్థానము (nexus), ఒక బౌద్ధిక, భావిక మఱియు సాంవేదనిక (sensational) వస్తువ్యాఖ్యానము - ఈ అనుకూల వ్యాఖ్యానముద్వారా మనలోని క్షుద్రము, పరిమితము నగు 'నేను' విశ్వముయొక్క విస్తృత క్రియామధ్యమున తన పరిచ్ఛిన్న, పృథగ్భూత వ్యక్తిత్వముయొక్క భావములను, కామములను రక్షించుకొనును మఱియు తృప్తిపఱచుకొనును. వేనిచేత వస్తువుల పట్ల మన దృక్కోణమును, జ్ఞానమును, క్రియను నిర్ణయించుకొందుమో, అట్టి మన సర్వ ధర్మములను, మన సాధారణ సర్వ ప్రమాణములును ఈ సంకుచిత, పరిమిత ఆధారము పైననే ప్రవర్తించును, మఱియు అహం - కేంద్రము చుట్టును చేయు విశాలతమ పరిభ్రమణములందు సైతము ఈ ధర్మానుష్ఠానము మనలను ఈ స్వల్ప వలయము యొక్క వెలుపలికి గొనిపోజాలదు. ఇది యొక విషవలయము, దీని యందు జీవుడు ఒక సంతుష్ట లేక సంఘర్షశీల బందిగా నుండును, ప్రకృతియొక్క మిశ్రిత బలాత్కారములకు శాశ్వతముగా అధీనుడై యుండును.

5. గుణధర్మములు, వాని అపూర్ణత :

ఏలన పురుషు డీ వలయమునందు తననుదాను కప్పివేసికొనును, అజ్ఞానమున తన దివ్య మఱియు అమర సత్తను ఆవరించివేయును మఱియు నొక ఆగ్రహపూర్ణ పరిచ్ఛేదక ప్రకృతిధర్మమునకు అధీను డగును. ఈ ధర్మము త్రిగుణముల బలాత్కార నియమము. ఇది యొక త్రివిధ సోపానము, ఇది దివ్య తేజము దిశగా పైకి పడుచు - లేచుచు సాగును గాని, దానిని చేరజాలదు. దీని అట్టడుగు మెట్టు జడతా - ధర్మము : తామసిక మానవుడు ఒక గతానుగతిక యాంత్రిక క్రియయందు తన భౌతిక మఱియు అర్థ ప్రబుద్ధ ప్రాణిక మఱియు ఇంద్రియాత్మక ప్రకృతియొక్క నిర్దేశములను, ప్రేరణలను సంకల్పచక్రమును మొద్దుగా అనుసరించును. పోగా, మధ్యసోపానమున ఒక ప్రవృత్తిమయ ధర్మము తలయెత్తును; ప్రాణప్రధాన, శక్తిశాలి, క్రియాశీల రాజసిక మానవుడు తన ప్రపంచము మఱియు పరిసరముపైన తన

ఋచ్ఛను విధింప యత్నించును. కాని ఈ ప్రయత్నమున తన విక్షుబ్ధ ఆవేశములు, కామములు మఱియు అహంకారచర్యల వ్రణకారక భారమును, క్రూర శాసనమును మాత్రమే పెంపొందించును, అటులే తన అశాంత స్వేచ్ఛాప్రవృత్తియొక్క బరువునకు, తన రాజసిక ప్రకృతియొక్క ఆధిపత్యమునకు మాత్రమే బలము చేకూర్చును. అగ్రసోపానమున ఒక సామరస్యపూర్ణ, నియామక ధర్మము జీవనముపై తన ఒత్తిడిని బఱచును; సాత్త్విక మానవుడు తర్కప్రధాన జ్ఞానము, ప్రబుద్ధ ఉపయోగము లేక యాంత్రిక సదాచారమునకు సంబంధించిన తన పరిమిత, వైయక్తిక ప్రమాణములను నిర్మించుకొని, అనుష్ఠింప బ్రయత్నించును; అటులే అతడు తన మతములు, దర్శనశాస్త్రములు మఱియు నైతిక సూత్రములను, మానసిక ప్రణాళికలు మఱియు నిర్మాణములను, ఇంకను భావము మఱియు వర్తనకు సంబంధించిన నిరూఢ మార్గములను ఏర్పఱచు కొనును గాని, అవి సమగ్ర జీవితార్థముతో సంగతము గావు గావున, విశాలతర విశ్వప్రయోజనముయొక్క గతిప్రవాహమున అది నిరంతరము గతించిపోవును. సాత్త్విక మానవుని ధర్మము గుణవలయమునందు సర్వోన్నతమే కాని, అదియు నొక పరిమిత దృష్టియే మఱియు నొక హ్రస్వ ప్రమాణమే. దాని అపూర్ణ సూచనలు ఒక క్షుద్ర, సాపేక్ష సిద్ధికి మాత్రమే నడుపును; వివేకయుత వైయక్తిక అహంకారమున కది తాత్కాలికముగా తృప్తి నిచ్చినను, ఆత్మయొక్క సమగ్ర సత్యముపైన గాని, ప్రకృతియొక్క సమగ్ర సత్యముపైన గాని ప్రతిష్ఠితము గాదు.

6. ధార్మిక దంభమునకు గారణము :

నిజానికి వాస్తవ మానవజీవితము ఏ సమయమునందును వీనిలో నే యొకటి మాత్రమే గాదు – అది ప్రకృతి యొక్క ప్రథమ స్థూల ధర్మముయొక్క యాంత్రిక, పరిపాటి నిర్వహణమును గాదు, గతి ప్రధాన క్రియాత్మయొక్క సంఘర్షమును గాదు, సచేతన ప్రకాశము, బుద్ధి, అటులే శుభము మఱియు జ్ఞానముయొక్క విజయోపేత ఆవిర్భావమును గాదు. ఈ ధర్మము లన్నింటియొక్క సంమిశ్రమే మనకు గన్పించును, ఈ సంమిశ్రమునుండి బుద్ధి ఎక్కువ తక్కువ అయిచ్ఛికముగా నొక ధర్మము నేర్పఱచి, దానిని యావచ్ఛక్తి సాధింప బూనుకొనును, కాని వాస్తవమున విశ్వప్రకృతియొక్క ఇతర బలాత్కారక వస్తువులతో రాజీపడి మాత్రమే కొంత సాధించగలుగును. మన ప్రబుద్ధ సంకల్పము మఱియు బుద్ధియొక్క సాత్త్వి కాదర్శములు స్వతః రాజీలు (comprises) మాత్రమే, ఉత్తమ పక్షమున ప్రగతిశీలమగు రాజీలు, ఇవి ఒక సంతత

అపూర్ణత మఱియు పరివర్తన ప్రవాహమునకు లోనై యుండును; లేక అవి రాజీలు కాక, పూర్ణాదర్శములే యగు నేని, ఆచరణయందు చాలవఱకు నుపేక్షింపబడుచు, పూర్ణత యొ్క్క ఆదర్శములుగానే లక్షించబడును, లేక ఒక ఆంశిక ప్రభావముగనే అవి ఆచరణయందు ఫలించును. మఱియు ఒకొకప్పుడు ఆ సాత్త్వికాదర్శములను పూర్తిగా సాధించితి మని మన మూహింతు మేని, దానికి కారణము, మనలోని ఇతర శక్తులు మఱియు ప్రేరణల అవచేతన లేక అర్ధచేతన మిశ్రమును గణించకపోవుటయే; నిజ మారయ ఈ మిశ్రమే ప్రాయః మన కర్మయందు మన ఆదర్శములతో సమము లేక అధిక మగు వాస్తవ శక్తియగును. ఆ స్వ-అజ్ఞానమే మానవులు తాము ధీమంతులమని, ధర్మవంతులమని గొప్పచెప్పుకొనుటకు మూల కారణము; మానవుని సాధుస్వభావము యొక్క తెల్లని, నిష్కలంక బాహ్యరూపము వెనుక అది ఒక నల్లని ప్రచ్ఛన్నరేఖగా నుండును మఱియు నదియే జ్ఞానము మఱియు సదాచారముయొక్క మిథ్యాభిమానమును సంభవ మొనరించును. ఉత్తమ మానవ జ్ఞానము సైతము ఒక అర్ధజ్ఞానము మాత్రమే మఱియు ఉచ్ఛతమ మానవ గుణము సైతము ఒక మిశ్ర వస్తువు మాత్రమే మఱియు నాదర్శమునందు మిక్కిలి నిరపేక్ష మైనను, ఆచరణయందు ఎంతో సాపేక్షము, సర్వసామాన్య జీవనధర్మముగా సాత్త్వికాదర్శములు ఆచరణయందు నిలువజాలవు; వైయక్తిక ఆకాంక్షను, వర్తనను మెఱుగుపఱచి, ఉద్ధరించుటకు ఒక శక్తిగా అవి ఆవశ్యక మైనను, వానిపట్ల గల నిష్ఠ జీవితమును సంస్కరించునే గాని, మార్చజాలదు, మఱియు వాని పరిపూర్ణ సిద్ధి భవిష్యత్తునకు సంబంధించిన స్వప్నమునందో, మన పార్థివ జీవనముయొక్క మిశ్ర స్వభావము లేని ఒక స్వర్గమునందో మాత్రమే ఛాయగా గోచరించును. అది అట్లు గాక తప్పదు, ఏలన ఈ ప్రకృతి గాని, మానవ ప్రకృతి గాని కేవల సత్త్వ పదార్థముతో చేయబడిన ఏకమాత్ర సమరస వస్తువు కాదు, కాజాలదు.

7. సన్యాసముకంటె బలవత్తరానుభవము :

మన సంభవతలయొక్క ఈ పరిమితి నుండి, ధర్మములయొక్క ఈ అస్తవ్యస్త మిశ్రమునుండి తప్పించుకొనుటకు ప్రథమ ద్వారము నిర్వ్యక్తికతాదిశగా సాగు ఒక సమున్నత ప్రవణత యందు మనకు గన్పించుచు, ఒకానొక విశాల, విశ్వవ్యాపక, ప్రశాంత, విముక్త, సరళ మఱియు శుద్ధ వస్తువులోనికి సాగు నివృత్తియందు గన్పించును - ఈ వస్తు విపుడు పరిమితకారక అహంకారమనస్సుచేత

మఱుగుచేయబడి యున్నది. ఇచ్చటి కష్ట మేమన, మన సత్తయొక్క ప్రశాంత నీరవ క్షణములందు ఈ నిర్వ్యక్తికతలోని కొక ప్రత్యక్ష ముక్తిని మన మనుభవింపగలము గాని, నిర్వ్యక్తిక క్రియాకలాపమును సాధించుట ఎట్లును అంత సులభము గాదు. మనము మన సాధారణ మానసమునందు ఇంచుక యైనను ఎంత కాలము నివసింతుమో, అంతవఱకు ఆ మానసమునకు సహజము, అనివార్యము నగు మన వ్యక్తిత్వముయొక్క ధర్మము చేతను, మన ప్రాణిక ప్రకృతియొక్క ప్రేరణచేతను, అహంకారముయొక్క వర్ణముచేతను నిర్వ్యక్తిక సత్యము లేక నిర్వ్యక్తిక సంకల్పముయొక్క అను సంధానము కలుషిత మగుచుండును. నిర్వ్యక్తిక సత్యముయొక్క అనుసంధానము ఈ ప్రభావములచేత మనము పసికట్టని ఒక ముసుగులోనికి మార్చివేయబడగా, బౌద్ధి కాభిరుచులు దానిలోపల తలదాచుకొనును మఱియు దానికి పరిమితికారి మానసికాభినివేశము ఆసరా యగును. పోగా నిస్వార్థ నిర్వ్యక్తిక కర్మానుసంధానము మన సవ్యక్తిక సంకల్పముయొక్క స్వార్థపూర్ణ సంవరణములకును, అంధ స్వచ్ఛంద ఆగ్రహము (persistence) లకును ఒక అధికతర ప్రమాణముగను, బాహ్యసమున్నత అనుమతిగను మార్చివేయబడును. రెండవవైపున పూర్ణనిర్వ్యక్తికత అంతగాను పూర్ణ నిష్క్రియతను విధించుచున్నట్లు గన్పించును, మఱియు అహంకారము మఱియు త్రిగుణముల యంత్రాంగమునకు సర్వ క్రియయు కట్టబడి యున్నదనియు, కావున ఈ వలయమునుండి వెలువడుటకు జీవన, కర్మలనుండి వెనుదగ్గుటయే ఏకమాత్ర మార్గమగు ననియు దీని అర్థ మగును. కాని ఈ నిర్వ్యక్తిక నీరవతయే ఇవ్విషయమున జ్ఞానముయొక్క చరమ వచనము గాదు, ఏలన మన ప్రయత్నసాధ్యమగు ఆత్మసాక్షాత్కారమునకు ఇది యొక్కటియే మార్గము మఱియు గమ్యము గాదు, సమస్త మార్గమును, చరమ గమ్యమును అసలే గాదు. ఇంతకంటెను ప్రబలతరము, పూర్ణతరము, దృఢతరము నగు ఒక ఆధ్యాత్మి కానుభవము గలదు; దీనియందు మన అహంకారిక వ్యక్తిత్వముయొక్క పరిధియు, మన మనఃపరిమితులయొక్క చక్రమును ఒక మహత్తమ ఆత్మ మఱియు సత్తయొక్క నిరావరణ అనంతతయందు అదృశ్యమగును; అయినను జీవన, కర్మ లింకను ఆమోదయోగ్యములుగను, సుసంభవములుగను నిలిచియుండటయే గాక, పైకిని, వెలికిని విస్తరించుచు, తమ విశాలతను ఆధ్యాత్మిక సంపూర్ణతను చేరుకొనును మఱియు నొక గొప్ప ఊర్ధ్వముఖ మార్మికార్థమును సంతరించుకొనును.

8. నిర్వ్యక్తికతకును, కర్మకును సమన్వయము :

శుద్ధ నిర్వ్యక్తికతకును, మన ప్రకృతియొక్క శక్తిమయ సంభవతలకును మధ్య గల అఖాతముపై వారధి నిర్మించు ఉద్యమములందు వివిధ స్తరములు గలవు. మహాయన బౌద్ధమతము యొక్క సిద్ధాంతము మఱియు అనుష్ఠానము ఈ కఠిన సమన్వయమును రెండు మార్గములద్వారా చేరుకొనును - 1. ఒక గభీర నిష్కామత, మఱియు మానసిక మఱియు ప్రాణిక సంగము మఱియు సంస్కారమునుండి ఒక విశాల విలీనకారి విముక్తి యొక్క అనుభవముద్వారా, 2. ఇక విధాయక (Positive) పార్శ్వమునందు ఒక విశ్వవిశాల పరహితనిష్ఠ, ప్రపంచము మఱియు సర్వజీవుల పట్ల ఒక అగాధ కరుణారసముద్వారా; ఈ కరుణయే సమున్నత నిర్వాణస్థితియందు జీవనము మఱియు కర్మపై ఒక వెల్లువవలె ప్రవహించెను. ఆ సమన్వయమే అంతగాను మఱియొక ఆధ్యాత్మి కానుభవముయొక్క ఆశయముగానుండెను, తదనుభవము ప్రపంచలక్ష్యముపట్ల ఎక్కువ సచేతనము, ఎక్కువ గంభీరము, ఉపకారపరము, కర్మపక్షమున సమృద్ధముగా సమగ్రము, అది గీతాతత్త్వమునకు సమీపతర సోపానము: ఈ అనుభవము మనకు (చైనాయందు వెలసిన) తావోమతస్థుల వచనములందు గన్పించును, అథవా ఆ వచనముల వెనుక స్ఫురించును. వారి మూలవస్తువు ఒక నిర్వ్యక్తిక అనిర్వచనీయ సనాతనుడుగా మనకు దోచును, అతడు ఏకకాలమున విశ్వముయొక్క మూలసత్త మఱియు ఏకమాత్ర ప్రాణము : అది సర్వవస్తువులను ధరించుచు, వానియందు సమముగా ప్రవహించును - "సమం బ్రహ్మ" (5-19). అది మనము చూచు సర్వముకంటెను భిన్నము గనుక, 'అసత్తు'; అయినను అది ఈసర్వభూతముల సమష్టి గనుక, 'ఏకము'. ఈ అనంతునిపై నురుగువలె అంధమగు వ్యక్తిత్వ మేర్పడును, ఇదియే రాగద్వేషము, ప్రియాప్రియములు, నిరూఢ మానసిక విభేదములతోగూడిన చంచ లాహంకారము, ఇది శక్తిశాలి ప్రతిరూపమై సదసత్తులు రెండును అగుఏకమాత్ర సద్వస్తువు, 'తావోను' మనకు మఱుగుపఱచును, వికృతపఱచును. కావున వ్యక్తిత్వము, మఱియు దాని క్షుద్ర నిర్మాణగత రూపములను అగ్రాహ్యమగు విశ్వవ్యాప్త మఱియు సనాతన సన్నిధియందు గోల్పోవుటచేతనే మనము తావోను స్పృశించగలము మఱియు నొకసారి యిది ప్రాప్తించి నపుడు, మనము దానియందు ఒక వాస్తవ జీవితమును జీవించుచు, మఱియొక మహత్తర చేతనను గలిగియుందుము, మఱియు దీనిచేత మన మన్ని వస్తువులలోను ప్రవేశింతుము మఱియు సర్వ సనాతన ప్రభావములు

మనలో ప్రవేశింప యోగ్యుల మగుదుము. గీతయందు వలెనే యిచ్చటను సనాతనునికి సంపూర్ణ ఉన్మీలనము మఱియు ఆత్మసమర్పణమే సర్వోన్నత మార్గముగా గన్పించును. తావో మతావలంబి ఇట్లు వచించును, "నీ శరీరము నీది గాదు, అది భగవంతుని ప్రతినిధియగు ప్రతిరూపము: నీ ప్రాణము నీది గాదు, అది భగవంతుని ప్రతినిధియగు సామరస్యము : నీవ్యక్తిత్వము నీది గాదు, అది భగవంతుని ప్రతినిధియగు నమ్యతాగుణము." మఱియు నిచ్చట సైతము ఒక విశాల సంసిద్ధియు, విముక్త క్రియయు అంతరాత్మ సమర్పణయొక్క శక్తిశాలి ఫలితమగును. అహంమయ వ్యక్తిత్వముయొక్క కర్మలు విశ్వప్రకృతియొక్క సమష్టి ప్రవృత్తికి విరుద్ధమగు భేదమూలక ధావన మగును. ఈ మిథ్యాధావనము (పరుగు) నకు బదులు విశ్వగత మఱియు సనాతన శక్తియొక్క హస్తములందు సమర్పించుకొనిన ఒక జ్ఞానమయ, ప్రశాంత నిష్క్రియతను స్థాపించవలెను, ఈ నిష్క్రియత అనంత క్రియకు మనలను అనువిధేయము గావించును; అపుడు మనము దాని సత్యముతో సమస్వరము, అనంతుని రూపవిధాయక శ్వాసకు నమనీయము నై యుందుము. ఈ సమస్వరత గల మానవుడు లోపల నిశ్చలము, మౌనవిలీనము నై యుండవచ్చును, కాని అతని ముఖ్యాత్మ తన మాఱు వేషముల నుండి విడివడి కన్పించగా, దివ్య ప్రభావము అతనియందు పనిచేయుచుండును మఱియు నతడు ప్రశాంతియందును, ఆంతర అకర్మయందును – "నైష్కర్మము" (18–42) – నెలకొని యుండియు, ఒక అప్రతిహత శక్తితో కార్య మాచరించును, అసంఖ్యాక వస్తువులు మఱియు జీవులు కదలిక నొంది, అతని ప్రభావముక్రింద సమకూడుదురు. ఆత్మయొక్క నిర్వ్యక్తిక శక్తి ఇపు డిక అహంకారముచేత వికృతము గాని అతని కర్మలను చేపట్టును మఱియు ప్రపంచమును, దాని జనులను ఒక త్రాటిపై నడుపుటకు – "లోకసంగ్ర హార్థాయ" (3–20) – ఈశ్వరాధికారముతో అతనిద్వారా కార్య మాచరించును.

9. బౌద్ధముపై గీతాధిక్యము :

ఈ అనుభవములకును, గీతచేత దృఢముగా బోధింపబడిన ప్రథమ నిర్వ్యక్తిక కర్మకును గల భేదము నామమాత్రము. కామము, సంగము మఱియు అహంకారము యొక్క సన్యాసమును, నిమ్నప్రకృతియొక్క అతిక్రమణమును, మన వ్యక్తిత్వము మఱియు దాని క్షుద్ర నిర్మాణములయొక్క భంజనమును గీతసైతము మనకు విధించును. ఇంకను, ఆత్మ మఱియు బ్రహ్మము నందు నివసించుటను, ఆత్మ

మఱియు బ్రహ్మమునందు సర్వమును, సర్వమందును ఆత్మ మఱియు బ్రహ్మమును (6-29), మఱియు సర్వమును ఆత్మ మఱియు బ్రహ్మముగను (2-17) జూచుటను గీతయు మనకు విధించును. మీ ప్రాకృత వ్యక్తిత్వమును దాని కర్మలను ఆత్మలోనికి, అనగా సనాతన బ్రహ్మములోనికి సన్యసింపుడని 'తావో' మనీషివలె గీతయు మనకు చెప్పును - "ఆత్మని సన్యస్య, బ్రహ్మణి" (5-10). మఱియు నిట్టి సమానతకు గారణమేమన, ఇది సర్వమతము లందు మానవునికి సంభవముకాగల ఒక సర్వోన్నత, సర్వవిముక్త అనుభవవిశేషము, దీనియందు శాంతిమయ ఆంతర విశాలత మఱియు నీరవత ఒక శక్తిమయ బాహ్య సక్రియ జీవనముతో సమన్వయము బొందియుండును; ఇవి రెండును ఏకమాత్ర అమర శక్తి మఱియు నేకమాత్ర సనాతన సత్తయొక్క నిర్వ్యక్తికమగు అనంత సత్యత మఱియు అపార క్రియయందు సరసను వర్తించును, అథవా రెండును కలిసిపోవును. కాని గీత (అదనముగా) ఈ స్థితి నంతను మార్చివేయు, అపార అర్థగర్భితమగు ఒక పదమును జోడించును - "ఆత్మని అథోమయి" (4-35). ఇచ్చట గీత, సర్వవస్తువులను ఆత్మయందును, పిమ్మట "నాయందును" అనగా ఈశ్వరుని యందును జూడవలెనని మనలను గోరును, అటులే సర్వ కర్మలను ఆత్మ లేక బ్రహ్మములోనికి, పిమ్మట పరమ పురుషుడు, అనగా పురుషోత్తమునిలోనికి సన్యసించవలె నని ఆదేశించును. ఇచ్చట ఆధ్యాత్మి కానుభవముయొక్క ఇంకను మహత్తరము, గంభీరతరము నగు సంమిశ్రము గలదు, మానవ జీవనమునకు గల అర్థముయొక్క ఒక విపులతర పరివర్తనము గలదు, సాగరమునకు నది తిరిగివచ్చు నప్పటి ఒక గుహ్యతర, ప్రగాఢతర హృదయావేగము గలదు, సనాతన కర్మకర్త యొక్క హస్తములలోనికి వైయక్తిక కర్మ మఱియు వైశ్వ క్రియయొక్క పునః సమర్పణము గలదు. శుద్ధ నిర్వ్యక్తికతయందు పట్టు బట్టుదు మేని, అది మనకొక కఠినతను, అపూర్ణతను దెచ్చిపెట్టును - అది మన ఆంతర పురుషుని, ఆధ్యాత్మిక వ్యక్తిని, మన ఆంతరతమ సత్తయొక్క స్థాయి మహత్తును అనంతములో నేర్పడిన ఒక అస్థాయి, భ్రాంతిజనక, సవికార నిర్మాణములోనికి మార్చివేయును. ఇచ్చట అనంత మొక్కటియే యుండును మఱియు నది ఒక క్షణిక ఖేలనార్థము తప్ప, సజీవ ప్రాణియొక్క అంతరాత్మపై నెట్టి వాస్తవ దృష్టిని బఱపదు. ప్రతిక్షణము భిన్నరూపము ధరించునట్టి శరీరమువలె తదంతరాత్మయు అనంతమునం దేర్పడిన ఒక క్షణిక దృశ్యముకంటె నధికమగు మఱేదియు గానిచో, మానవునియందలి అంతరాత్మకును, సనాతనునికి మధ్య ఎట్టి వాస్తవ శాశ్వత సంబంధము నుండజాలదు.

10. అహంకారిక జీవుడు - ఆధ్యాత్మిక జీవుడు :

నిజమే, అహంకారమును, దాని పరిమిత వ్యక్తిత్వమును ప్రకృతియొక్క అట్టి ఒక తాత్కాలిక సవికార రచనయే, కావున దానిని భగ్నముగావించి, సర్వముతోను, అనంతముతోను మనము మన ఏకత ననుభవించవలసినదే. కాని అహంకారము వాస్తవ పురుషుడు గాదు; అది లీనముగావించబడినపుడు, ఇంకను ఆధ్యాత్మిక వ్యక్తి మిగిలియుండును, సనాతన జీవుడు నిలిచియుండును. అహంకల్పిత పరిమితి అదృశ్యము కాగా, అంత రాత్మ ఏకునితో గభీర ఏకతయందు నివసించును మఱియు సర్వ వస్తువులతోను తన వైశ్వ ఐక్యము ననుభవించును. అయినను ఈ విశాలతను, ఏకతను అనుభవించున దింకను మన అంతరాత్మయే. విశ్వ క్రియ అన్నింటియందును గల ఏక మఱియు అభిన్న శక్తియొక్క ఒక క్రియగా స్ఫురించి నపుడు సైతము, అది ఈశ్వరుడు చేయు ఒక ఆరంభము మఱియు వ్యాపారముగా అనుభూత మైనపుడు సైతము, అది మానవుల భిన్నభిన్న అంతరాత్మలందు - "అంశః సనాతనః" (15-7) - భిన్నభిన్న రూపములను ధరించును, మఱియు వాని ప్రకృతియందు ఒక భిన్న దిశగా సాగును. ఆధ్యాత్మిక జ్ఞానముయొక్క ప్రకాశము, బహువిధమగు విశ్వశక్తి, సత్తయొక్క సనాత నానందము మన లోపలను, చుట్టును దూకుచు ప్రవహించును, మనలోపల కేంద్రీకరించుకొని, ప్రతి అంతరాత్మనుండియు, సజీవ ఆధ్యాత్మిక చేతనయొక్క ఒక కేంద్రమునుండివలె, వెలువడి, పరిసర ప్రపంచముపై ప్రవహించును - అట్టి ప్రతి కేంద్రముయొక్క పరిధి అనంతమున గలిసిపోవును. అంతియే గాదు, ప్రతి ఆధ్యాత్మిక వ్యక్తియు దివ్యసృష్టియొక్క ఒక చిన్న విశ్వముగా నిలిచి యుండును, ఇది భగవంతుని స్వీయాభివ్యక్తియొక్క సమగ్ర అనంతవిశ్వమునుండి ఏకకాలమున స్వతంత్ర మయ్యును, అవిచ్ఛేద్యము. పరాత్పరుని ఒక అంశమును, సృజనశీలుడు నగు, నీ జీవుడు తన చుట్టును తన స్వీయ ప్రపంచమును సృజించు కొనుచునే, దేనియందు సర్వులు నుందురో, అట్టి తన విశ్వచేతనను గూడ ధరించి యుండును. కాగా, ఇది యొక భ్రమ, జీవుడు విశ్వాతీత బ్రహ్మములోనికి ఉపసంహరించుకొని నపుడు ఇది నశించక తప్పదు అని ఆక్షేపము దెల్పుచో, చివరి కీ విషయమున ఎట్టి సునిశ్చిత నిశ్చయము లేదని సమాధానము. ఏలన ఏ అంతరాత్మ బ్రహ్మములోనికి ఉపసంహరించుకొనక పూర్వము భగవంతుని కర్మ మఱియు అభివ్యక్తికి ఒక సజీవ ఆధ్యాత్మిక కేంద్రముగా నుండెనో, అదియే ఇపు డింకను ఉపసంహరణప్రాప్తమగు

విముక్తికి భోక్తగా నున్నది; అనగా వ్యక్తిత్వముయొక్క భ్రాంతిమయ ఆవరణను అనంతములో విచ్ఛిన్నముగావించుకొను అహంకారముకంటెను అధిక మగునది యొకటి గలదు. మన అస్తిత్వమునకు సంబంధించిన ఈ రహస్యము మనము ఏకమాత్రునియొక్క ఒక తాత్కాలిక నామ రూపము మాత్రమే గాదని తెలుపును మఱియు మనము ఏకమాత్రునియొక్క ఒక అంశమగు అంతరాత్మ మఱియు చేతన యని బోధించును. అహంకారము అజ్ఞానమునందు దేనియొక్క కేవలము ఒక భ్రాంతికర చ్ఛాయ మఱియు ప్రక్షేపమో (projection), ఆ మన ఆధ్యాత్మిక వ్యక్తిత్వము అజ్ఞానమున కావల నిలిచియుండు ఒకసత్యమును గలిగియున్నది లేక అదియే ఆ సత్యము. పురుషోత్తముని పరమ ప్రకృతియందు శాశ్వతముగా నివసించు నొకానొక వస్తువు మనలో గలదు – "నివసిష్యసి మయి" (12–8). ఇదిగో, ఇదియే గీతాబోధన యొక్క గంభీర సమగ్రత : అహంకారనిర్వాణముచేత దేనియందు మనము ప్రవేశింతుమో, అట్టి విశ్వీకృత నిర్వ్యక్తికతయొక్క సత్యమును – "బ్రహ్మనిర్వాణమును" (2–72) – గీత అంగీకరించును. కారణము, అదిలేనిదే నిక్కముగా నెట్టి మోక్షము, కనీసమెట్టి పరిపూర్ణ విముక్తి నుండజాలదు. దాని నంగీకరించుచునే, గీత పరమోన్నతానుభవముయొక్క ఒక అంశముగా మన వ్యక్తిత్వముయొక్క స్థాయి ఆధ్యాత్మిక సత్యమును గూడ నంగీకరించును. ఈ ప్రాకృత పురుషుడు గాక, మనలోని ఆ దివ్య కేంద్ర పురుషుడే సనాతన జీవుడు (15–7). ఈశ్వరుడే, సర్వ వస్తువులు నగు వాసుదేవుడే (7–19) నిమ్న ప్రకృతియొక్క ఉపభోగార్థము మన మనః ప్రాణ శరీరములను స్వీకరించును; కాగా పర ప్రకృతి, అనగా పరమ పురుషునియొక్క ఆద్య ఆధ్యాత్మిక ప్రకృతి, విశ్వమును సంఘటితముగా ధరించుచు, దానిలో జీవరూపమున ఆవిర్భవించును. ఇట్లు జీవు డన పురుషోత్తముని ఆద్య దివ్య ఆధ్యాత్మిక సత్తయొక్క ఒక అంశము, సజీవ సనాతనునియొక్క ఒక సజీవ శక్తి. అతడు నిమ్న ప్రకృతియొక్క ఒక అస్థాయి రూపము మాత్రమే గాడు, పరంతు సర్వోన్నతునిపరప్రకృతియం దేర్పడిన అతని ఒక సనాతనాంశము, దివ్యసత్తయొక్క ఒక సనాతన చిన్మయ కిరణము; కావున పరప్రకృతి ఎంత శాశ్వతమో, అంత శాశ్వతుడు. కావున మన విముక్త చేతనయొక్క సర్వోన్నత సంసిద్ధి మఱియు పదము యొక్క ఒక పార్శ్వము పరమ ఆధ్యాత్మిక ప్రకృతియందు జీవుడు తన యథార్థ స్థానమును చేరుకొనుటయు, అక్కడ పరమ పురుషుని మహిమయందు నివసించుటయు, సనాతన ఆధ్యాత్మిక ఏకతయొక్క ఆనందము ననుభవించుటయు నగును.

11. ఉత్తమ రహస్యము :

మన సత్తయొక్క ఈ రహస్యము పురుషోత్తముని సత్తయొక్క ఒక సదృశ పరమ రహస్యమును అవశ్యముగా సూచించును - "రహస్యం ఉత్తమం" (4-3). నిరపేక్ష బ్రహ్మముయొక్క కేవల నిర్వ్యక్తికతయే పరమ రహస్యము గాదు. పోగా ఒక పరమ పురుషుడు గలడు మఱియు పైకి అట్లు గన్పించు ఒక వ్యాపక నిర్వ్యక్తిక సత్త గలదు: వీని ఏకతయే మహాశ్చర్యమగు ఉత్తమ రహస్యము - సర్వవస్తువులయొక్క ఒక అతీత అక్షరాత్మ గలదు (15-16) మఱియు సర్వత్ర పనిచేయుచు, ఒక అనంత మఱియు బహురూప వ్యక్తిత్వముగా నిచ్చట సృష్టియొక్క అసలు మూలమునందే తనను దాను అభివ్యక్తము చేసికొనుచున్న ఒక దివ్య పురుషుడు గలడు; కాగా ఈ ఆత్మయు, పురుషుడును మన చరమ, ఆంతరతమ, గభీరతమ అనుభవమునకు ఒకే అపరిమేయ సత్స్వరూప ప్రకటమగును, ఇతడు మనలను అంగీకరించి తన దగ్గరకు తీసికొనును - నిరాకార సత్తయొక్క ఒకానొక శూన్యము లోనికి గాదు - అత్యంత ప్రత్యక్షముగా, గంభీరముగా, అద్భుతముగా తన పూర్ణ స్వరూపము లోనికి తీసికొనును మఱియు తన మఱియు మన సచేత నాస్తిత్వముయొక్క సర్వ ప్రకారము లందును తీసికొనును. ఈ ఉచ్చతమానుభవమును, ఈ విశాలతమ దర్శన ప్రకారమును మన ప్రకృతిభాగములగు జ్ఞానము, సంకల్పము మఱియు హృదయగత ప్రేమారాధనలకు ఒక గంభీర, మర్మస్పర్శి, అనంత అర్థమహత్త్వమును తెలుచును; కాని ఈ అర్థమహత్త్వము, మనము నిర్వ్యక్తికమును మాత్రమే ఒత్తి చెప్పుదు మేని, నశించును, కనీసము సన్నగిలును. ఏలన ఆ ఒత్తిడి మన గభీరతమ ప్రకృతియొక్క ఒక భాగమగు వృత్తులు మఱియు శక్తులయొక్కయు, మన ఆత్మానుభవముయొక్క ఆంతరతమ ప్రధాన తంతువులతో సంబద్ధమగు ప్రగాఢతలు మఱియు ప్రకాశత్వముల యొక్కయు ప్రగాఢతమ పరిపూర్తిని అడచివేయును లేక అల్పిష్ఠముగావించును లేక వానికి అవకాశ మివ్వదు. మనకు సహాయపడగలిగి నది జ్ఞాన తీవ్రత యొక్కటియే గాదు, జ్ఞానముచేత ఉద్భాసితము, ఉన్నీతము నైన హృదయ ప్రేమకును, ఆకాంక్షకును అవకాశము, అపారావకాశము గలదు; ఈ భక్తిసంపన్న జ్ఞానము ఎక్కువ గుహ్యముగా స్పష్టము, ఎక్కువ విశాలము మఱియు ప్రశాంతముగా ఆవేగమయము నగు జ్ఞాన మగును. మన హృదయ చేతన, మన శ్చేతన, సర్వ-చేతనలయొక్క-"సతతం మచ్చిత్తః" (18-57) - సంతత ఏకీభూత సాన్నిహిత్యముచేతనే సనాతనునితో మన ఏకతయొక్క విశాలతమ, గభీరతమ, పూర్ణతమ అనుభవమును బొందుదుము.

ఏది విశ్వమయతయొక్క మధ్యను సైతము, విశ్వాతీతత యొక్క శిఖరమున సైతము గభీరముగా వైయక్తికమో, సర్వసత్తయందును ఆ సమీపతమ ఏకత ఇచ్చట మానవాత్మపై విధించబడినది, ఇదియే పరముని జేరుటకు పథము మఱియు నొక ఆధ్యాత్మ సత్తగా తనకు గల తన ప్రకృతిచేత నిర్దిష్టమైన సంసిద్ధిని, దివ్యచేతనను బొందుటకు తనకు మార్గము. బుద్ధి మఱియు సంకల్పము సమస్త సత్తను, తన సర్వ భాగములందును ఈశ్వరుడు, అనగా ఆ సమస్త సత్తయొక్క దివ్యాత్మ మఱియు ప్రభువు దిశగా త్రిప్పవలెను - "బుద్ధియోగం ఉపాశ్రిత్య" (18-57). ఇంకను హృదయము అతనితో ఏకత మఱియు సర్వ ప్రాణులయందును గల అతనిపట్ల ప్రేమవలన గలుగు ఆనందమునందు తన యితర భావావేగము నంతను లీనము గావించవలెను. పోగా ఇంద్రియములు - ఆధ్యాత్మము చేయబడిన ఇంద్రియములు - సర్వత్ర అతనినే చూడవలెను, వినవలెను, స్పృశింప వలెను. ప్రాణము సర్వథా జీవునియం దున్న అతని ప్రాణము గావలెను. చివరకు సర్వ క్రియలు అతని ఏకైక శక్తినుండియే, మన సంకల్పము, జ్ఞానము; కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియము, పంచప్రాణములు మఱియు శరీరమునందు పనిచేయు నతని ఏకైక ప్రేరణనుండియే ప్రవర్తించవలెను. ఈ మార్గము లోతుగా నైర్వ్యక్తికము, కారణము, ఇచ్చట విశ్వీకృతమై, విశ్వాతీతత నాశ్రయించిన అంతరాత్మకొఱకు భేదమును కల్పించు అహంకారము రద్దుచేయబడినది. అయినను అది ఘనిష్ఠముగా వైయక్తికము, ఏలన అది ఒక అతీత భావావేగమున కెగసి, అచ్చట అంతర్నివాసము మఱియు ఏకతయందు రాజిల్లును (12-8). ఒక నిర్విశేష నిర్మాణము అహంకార నాశమునకు సంబంధించిన మానసిక తర్కముయొక్క ఒక కఠోరావశ్యకత గావచ్చును గాని, అది పరమ రహస్యముయొక్క చరమ వచనము గాదు-"రహస్యం ఉత్తమం" (4-3).

12. దారుణ ఆధ్యాత్మిక ఫలితములు :

తన దైవనియుక్తమైన కర్మయందు అర్జునుడు కొనసాగ నిరాకరించుటకు మూలము అతనిలోపలి అహంభావమే (18-58). సాత్త్విక, రాజసిక, తామసి కాహంకారముయొక్క భావములు మఱియు ప్రేరణలు, పాపము మఱియు దాని వ్యక్తిగత పరిణామములనుండి ప్రాణిక ప్రకృతి యొక్క భయము, వైయక్తిక దుఃఖము మఱియు కష్టమునుండి హృదయముయొక్క పరావర్తనము, ధర్మము మఱియు పుణ్యమునకు సంబంధించి ఆత్మవంచక సత్యా భాస కారణములచే తమోవృత

బుద్ధి అహంకార ప్రేరణలను కప్పిపుచ్చు, భగవంతుని కర్మప్రకారములు మానవుని కర్మప్రకారములకంటె భిన్నముగా గన్పించుచు, అతని స్నాయవిక (nervous), భావిక అంగములు మఱియు బుద్ధిపైన దారుణ, అప్రియ వస్తువులను విధించుటచే అతని ప్రకారములనుండి మన ప్రకృతియొక్క అజ్ఞానమయ సంకోచము - వీని అన్నింటియొక్క ఒక సంమిశ్రము, కలవరము మఱియు విషమ భ్రాంతి అర్జునుని నిరాకరణము వెనుక పనిచేసిన వస్తువులు. ఈ నిరాకరణ పరిణామములు పూర్వముకంటెను కోటిరెట్లు దారుణముగా నుండును, ఏలన అతని కిపుడు ఒక అధికతర కర్మప్రకారము మఱియు తత్త్వము ప్రకటింపబడినవి, కనుక తన అహంకారమునందలి పట్టు విడువక, తన నిష్ఫల, అసంభవ నిరాకరణమును పోషింపజూచుచో నే మగును? అది ఒక నిష్ఫల నిశ్చయము మాత్రమే, వ్యర్థ పరావర్తనము మాత్రమే, ఏలన అది ఒక తాత్కాలిక ప్రబలవైఫల్యమునుండి పుట్టినది, అది అతని ఆంతరతమ స్వభావముయొక్క శక్తితత్త్వమునుండి ఒక తీవ్ర కాని క్షణిక విచలనమే గాని, అతని ప్రకృతియొక్క యథార్థ సంకల్పము మఱియు ప్రకారము గాదు. ఇపు డొకవేళ అతడు తన ఆయుధములను విసర్జించివేసినను, తాను లేకయే యుద్ధము మఱియు సంహారము సాగుచున్నదని కాంచి నపుడు, తన ప్రకృతిబలాత్కారముచేతనే అతడు తిరిగి వానిని చేపట్టును (18-59), తన యుద్ధవిరమణము తన ఆశయముయొక్క ఒక పరాజయమే ననియు, దేనిని సాధింప నతడుజన్మించెనో అట్టి ధ్యేయము దాని నాయకుని అనుపస్థితి లేక నిష్క్రియతచేత దుర్బలము, అస్తవ్యస్తము నై, స్వార్థపరాయణ అధర్మము మఱియు అన్యాయముయొక్క సమర్థకుల వక్రము, అనీతిపరము నగు బలముచే పరాజితము, పీడితము నగు ననియు చూచినపుడు, తిరిగి ఆయుధములను చేపట్టితీరును. కాని ఇట్లు తిరిగి చేపట్టుటయందు ఎట్టి ఆధ్యాత్మిక మూల్యము నుండదు. ఏలన అహంకారిక మనస్సుయొక్క భావములు మఱియు భావనల సంక్షోభము అతని నిరాకరణమును ప్రేరించి నటులే, అదే మనస్సు యొక్క స్వాభావిక భావములు మఱియు భావనల పునరుద్ధరణద్వారా పనిచేయుచు, అతని ప్రకృతియే అతని నిరాకరణమును మఱల రద్దుచేయ నతని వివశుని గావించును. కాని ఈ రెండింటిలో నేది యైనను, ఇచ్చటి సంతత అహంకారాధీనత కర్థము ఒక నికృష్టతర, విపత్కర ఆధ్యాత్మిక నిరాకరణమే, వినాశమే యగును (18-58); ఏలన నిమ్న ప్రకృతియొక్క అజ్ఞానము నందు అత డే సత్తాసత్యము ననుసరించెనో, దానికంటెను ఒక మహత్తర సత్యమునుండి ఇది

యొక నిశ్చిత పతన మగును. ఒక ఉచ్చతర చేతనను, ఒక నూతన ఆత్మసాక్షాత్కారమునకు అతనికి ప్రవేశమీయబడెను, ఆహంకారిక క్రియాస్థానమున ఒక దివ్య క్రియయొక్క సంభవత అతనికి జూపబడెను; కేవలము బౌద్ధికము, భావికము, ఇంద్రియాత్మకము, ప్రాణికము నగు జీవితమునకు బదులు ఒక దివ్య, ఆధ్యాత్మిక జీవితద్వారములు అతనికి తెఱవ బడెను. ఇక నొక ప్రబల, అంధ యంత్రముగా నుండక, భగవంతునియొక్క ఒక సచేత నాంతరాత్మగాను, ఒక జ్ఞానదీప్త శక్తి మఱియు పాత్రముగా నుండ నతనికి పిలుపు వచ్చెను.

13. ఆత్మవంతునకే ప్రకృతిప్రభుత :

ఏలన మనలోపల ఈ సంభవత గలదు: మన మానవ ఉచ్చతమ స్థితియందు సైతము ఇట్టి పర్యవసానము మఱియు అతిక్రమణమునకు ద్వారము తెఱచుకొని యున్నది. మానవుని సాధారణ మనస్సు మఱియు ప్రాణము తనలోదాగియున్న ఒకానొక వస్తువుయొక్క ఒక అర్ధ–ప్రబుద్ధము, ప్రాయః ఒక అజ్ఞానమయ వికాసము మఱియు అపూర్ణ అభివ్యక్తియు నైయున్నది. అచ్చట తనకు మఱుగున, తన చేతనకు వెనుక, తన క్రియాకలాపముయొక్క తమోమయ ఆవరణము చాటున నిశ్చేష్టీకృతమగు నొక దేవత గలదు – నిజాని కా క్రియాకలాపము పూర్తిగా తనది గాదు మఱియు దాని రహస్యము నింకను అతడు స్వాయత్తము గావించుకొన లేదు. మానవుడు తననుదా నీ ప్రపంచమున ఒక చింతనాశీల, సంకల్పనాశీల, భావనాశీల, క్రియాశీల వ్యక్తిరూపమున గనుగొనును, మఱియు తా నొక చింతనా, సంకల్పనా, భావనా, క్రియా స్వాతంత్ర్యము గల ఒక పృథగ్భూత, స్వతఃసిద్ధ ప్రాణి యని తన సహజ జ్ఞానవశమున తలపోయును లేక బుద్ధిజ్ఞానముచేత భావించును లేక కనీస మట్లు తన జీవితమును నిర్వహించును. అతడు తన పాపము, ప్రమాదము మఱియు దుఃఖముయొక్క భారము వహించును, అటులే తన జ్ఞానము మఱియు పుణ్యముయొక్క కర్తృత్వము మఱియు ప్రాశస్త్య మును తన కాపాదించుకొనును; తన సాత్త్విక, రాజసిక లేక తామసిక అహం కారమును తృప్తిపఱచుకొను అధికారము తనకు గలదని భావించును, తన భాగ్యమును తానే నిర్మించుకొనుటకు, తన ఉపయోగార్థము ప్రపంచమును మార్చివేయుటకు తనకు శక్తి గలదని అహంకరించును. ఇదిగో, అతనికి తనను గుఱించి గల ఈ భావముద్వారానే, ప్రకృతి అతనియందు పనిచేయును, కాని ఈ పనిద్వారా తనలోపల గల మహత్తర పురుషుని సంకల్పమునే

అనుక్షణము ఆమె పూజించు చుండును. అహంద్పష్టికి సంబంధించిన మానవుని ఈ భ్రాంతి, తన అధికాంశభ్రాంతుల వలెనే, ఒకానొక సత్యముయొక్క వక్రీకరణము, ఈ వక్రీకరణము భ్రాంతిమయ, అయినను ప్రయోజనాత్మక మూల్యముల ఒక సంపూర్ణ ప ్ృతినే సృజించును. ఏది తన అంతఃపురుషుని పట్ల సత్యమో, దాని నతడు తన అహం వ్యక్తిత్వమున కాపాదించును. మఱియు దాని కొక మిథ్యాప్రయోగమును, మిథ్యా రూపమును, అజ్ఞానమయ పరిణామములను గల్పించును. అజ్ఞానము అతని ఉపరితల చేతనయొక్క మౌలిక అపూర్ణతయందు గలదు, ఈ అపూర్ణతచేత నతడు ప్రకృతికి అనుకూల సాధనమగు తన బాహ్య యాంత్రికభాగముతోను, ప్రకృతి వ్యాపారములను తనలో ప్రతిబింబింపజేయుచు, తాను వానిలో ప్రతిబింబించు మేరకు అంతరాత్మతోను తాదాత్మ్యము జెందును. అతడు లోపలి మహత్తర అధ్యాత్మసత్తను పసికట్టడు, నిజాని కీ సత్తయే అతని సమస్త మనస్సు, ప్రాణము, సృష్టి మఱియు క్రియను ఇంకను నెర వేరని ఒక ఆశను, ఒక గుప్త మర్మమును ప్రదానము చేయు వస్తువు. ఇచ్చట నొక విశ్వప్రకృతి జగదీశ్వరుడగు పరమపురుషుని ఆదేశమును బాలించుచు, ప్రతిజీవిని రూపొందించును, దాని స్వభావమును బట్టి దాని కర్మను నిర్ణయించును; అటులే మానవుని సైతము రూపొందించును, మఱియు నతని జాతి ప్రకృతియొక్క సామాన్య ధర్మము, అనగా ప్రాణశరీరములందు అబద్ధము, అజ్ఞానగ్రస్తము నగు మనోమయ జీవుని ధర్మమును బట్టి అతని కర్మను నిర్ణయించును, అటులే ప్రతిమానవుని రూపొందించును మఱియు నతని ప్రత్యేక ప్రకారము బట్టియు, అతని స్వీయ మూల స్వభావమునందు వచ్చిన మార్పులను బట్టియు అతని వైయక్తిక క్రియను నిర్ణయించును. ఈ విశ్వప్రకృతియే శరీరముయొక్క యాంత్రిక వ్యాపారమునకును, ప్రాణిక మఱియు స్నాయవిక (నరముల) క్రియలకును రూపము దిద్ది, నడుపుచుండును; ఈ రెండు స్తరములయందును ఆమెకు మన అధీనత సుస్పష్టమే. మఱియు నిప్పటి దశలో ఏమంత తక్కువ యాంత్రికము గాని మన ఇంద్రియ - మనస్సు, సంకల్పము మఱియు బుద్ధియొక్క క్రియను సైతము ఆమెయే రూపొందించి, నడుపును. అంతర మిదియే : పశువునందలి మనోవ్యాపారము యంత్రము వలె పూర్తిగా ప్రకృతికి విధేయమై నడువగా, మానవుడు ఒక సచేతన వికాసమునకు మూర్తరూప మగును, ఆ వికాసమునందు అంతరాత్మ ఎక్కువ చుఱుకుగా పాల్గొనును మఱియు నిందువలన తన కొక స్వాతంత్ర్యమును, తన ఉపకరణభూత ప్రకృతిపై

నొక ప్రభుతయు గల వను అభిప్రాయము నతని బాహ్య మనస్సునకు గలుగును - ఈ అభిప్రాయ మతనికి ఉపయుక్తము, అపరిహార్యము నగును గాని, ప్రాయః పెడదారి బట్టించునది గూడ నగును. కారణము, అది తన బంధనయొక్క కఠోర సత్యము పట్ల అతనిని గ్రుడ్డి వానిని గావించును మఱియు స్వాతంత్ర్యముయొక్క ఈ మిథ్యాభావము ఒక వాస్తవ స్వేచ్ఛను, ప్రభుతను గనుగొనుటయం దడ్డుపడును. మానవుడు తన లోపలి దేవత్వమును గుర్తించి, అహంకారము కంటెను అన్యమగు తన స్వీయ వాస్త వాత్మను, వాస్తవ సత్తను సచేతనముగా బొంద నంతవఱకు - "ఆత్మవాన్" (2-45) - తన ప్రకృతిపై నతని స్వేచ్ఛాప్రభుతలు ప్రాయః వాస్తవము సైతముగా వనిన, అవి సంపూర్ణము గాజాల వని చెప్పనేల? మనః ప్రాణ శరీరము లందా దేవత్వమునే ప్రకృతి వ్యక్తముచేయ ప్రయాసపడుచున్నది; ఆ దేవత్వమే మన లోపలి అంతరాత్మ గమ్యమును, పరిణామమును రూపొందించుచున్నది; ఆ దేవత్వమే ఈయా సత్తాధర్మమును, కర్మ ధర్మమును - "స్వభావమును" (18-47) -ఆమెపై విధించుచున్నది. కావున అతడు వాస్తవముగా నాత్మవంతుడైనపుడే, అతని ప్రకృతి భగవంతునియొక్క ఒక సచేతన కరణము మఱియు ప్రకాశమయ శక్తి గాగలదు.

14. సర్వోన్నత ధర్మము, మహత్తమ యోగము :

కారణము, మన సత్తయొక్క ఆంతరతమ ఆత్మలోనికి మనము ప్రవేశించి నపుడు, మనలోను, సర్వములోను ఒకే ఆత్మ మఱియు భగవంతుడు గలడని తెలియవచ్చును, అతనినే సర్వ ప్రకృతి సేవించును మఱియు వ్యక్తము జేయును; కాగా మనము స్వయముగా ఈ ఆత్మయొక్క ఒక ఆత్మయు, ఈ పురుషునియొక్క ఒక పురుషుడము, మన శరీరము అతని ప్రతినిధిభూత ఆకారము, మన జీవనము అతని జీవనలయయొక్క ఒక గమనము, మన మనస్సు అతని చేతనయొక్క ఒక కోశము, మన ఇంద్రియములు అతని కరణములు, మన భావములు మఱియు సంవేదనలు అతని సత్తానందముయొక్క అన్వేషణలు, మన కర్మలు అతని ప్రయోజనమునకు ఒక సాధనము, మన మజ్ఞానమునం దున్నపుడు మన స్వాతంత్ర్యము అతని అమర స్వాతంత్ర్యముయొక్క ఒక ఛాయ, సూచన లేక మెఱపు, కాని మన మతనిని, మనలను ఎఱింగి నపుడు, అది దానియొక్క ఒక దీర్ఘీకరణము మఱియు కార్య సాధక వాహిని యగును. మన ప్రభుతలు అతని కర్మగత శక్తియొక్క ఒక ప్రతిబింబము, మన శ్రేష్ఠ జ్ఞానము అతని జ్ఞానముయొక్క ఒక ఆంశిక ప్రకాశము,

మన ఆత్మయొక్క సర్వోన్నత, అత్యంత ప్రభావోపేత సంకల్పము జగదీశ్వరుడు, జగదాత్మయు నగు ఈ సర్వభూతస్థ ఆత్మయొక్క ఒక ప్రక్షేపము మఱియు ప్రతినిధి. ప్రతిప్రాణి హృదయమునందును ఆసీనుడై యున్న ఈ అధీశ్వరుడు మన సమస్త బాహ్యాభ్యం ప్ర క్రియయందును మనలను నిమ్న ప్రకృతియొక్క మాయా చక్రము నందు, రంగుల రాట్నము నందువలె, త్రిప్పుచుండును (18-61). మఱియు అజ్ఞానమున తెలియక కాని, జ్ఞానమున తెలిసి కాని, మనయందును, ప్రపంచమునందును అవస్థితుడై యున్న అతని నిమిత్తమే మనము జీవించుచున్నాము. సచేతనముగను, సమగ్రముగను ఈ జ్ఞానమునందును, సత్యమునందును నివసించుట యన అహంకారమునుండి తప్పించుకొని, మాయావరణమును భేదించి, నిర్గమించుటయే యగును. ఏతదితర ఉచ్చతమ ధర్మము లన్నియు ఈ దివ్యధర్మమునకు ఒక సన్నాహము మాత్రమే (18-66), అయితే సర్వ యోగము ఒక సాధనము మాత్రమే; దానిచేత మన సత్తయొక్క పరమేశ్వరుడు, పరమ పురుషుడు, పరమాత్మునితో మొదట ఒక విధమగు సంయోగమునకు, చివరకు సంపూర్ణ ప్రకాశము ప్రాప్తించి నపుడు, ఒక సమగ్ర సాయుజ్యమునకు వచ్చివేతుము. మహత్తమ యోగమన, మన ప్రకృతియొక్క సమస్త సమ్మోహములు మఱియు కఠినతల నుండి విడివడుటకుగాను, సమస్త విశ్వప్రకృతియొక్క ఈ ప్రభువును శరణు బొందుటయే, మన సమస్త సత్తతో నతని కభిముఖ మగుటయే - ప్రాణశరీరముల తోను, ఇంద్రియమనోబుద్ధి హృదయముల తోను, సంపూర్ణముగా తదర్పితమగు మన జ్ఞాన సంకల్పక్రియలతోను - "సర్వభావేన" (18-62)-మఱియు మన సచేత నాత్మయొక్కయు, ఉపకరణభూత ప్రకృతియొక్కయు సర్వప్రకారములందును అతని కభిముఖ మగుటయే. మఱియు సర్వవేళలయందును, సంపూర్ణముగను ఇట్లు చేయగలిగి నపుడు, దివ్య జ్యోతియు, ప్రేమయు, శక్తియు మనల నావహించి, ఆత్మ మఱియు నుపకరణములు - రెండింటిని పూరించి, మన అంతరాత్మను, జీవనమును ఆవరించుకొనియుండు సందేహములు మఱియు కష్టములు, సంభ్రమములు మఱియు అపాయముల నడుమనుంచి సురక్షితముగా నడుపుచు, ఒక పరమ శాంతికిని, మన అమర మఱియు శాశ్వత స్థానమునకును గొనిపోవును - "పరాం శాంతిం, స్థానం శాశ్వతం" (18-62).

15. అంతిమ మహావాక్యము :

ఏలన ఇతఃపూర్వము గుహ్యమగు సత్యములను (2-47,...) ఆధ్యాత్మిక జ్ఞానముయొక్క రూపాంతరకారి ప్రకాశమున మానవ మానసమునకు ఆవిష్కరించి, ఇది (18-53,....62) ఒక గుహ్యతర సత్య మని ఇక్కడ ప్రతిపాదించి, గీత ఇపుడు అకస్మాత్తుగా ఇంకను తాను ప్రవచించవలసిన ఒక 'పరమ వచనము' (18-64) గలదనియు, 'సర్వగుహ్యతమ' (18-64) సత్యము గల దనియు ఉద్ఘాటించును. ఈ రహస్యాతిరహస్యమును అతని పరమ హితముగా అర్జునునకు దివ్యగురు వనుగ్రహించును; ఏలన అర్జునుడు తనకు 'ఇష్టము', ప్రియము నగు నొక విశిష్టాత్మ (18-64). మఱియు ఉపనిషత్తు (కఠ ఉప. 2-23) పూర్వమే ప్రవచించి యున్నట్లు, పరమాత్మ తన స్వరూపము యొక్క - "తనుం స్వాం" - ప్రకటనకు వరించియున్న అట్టి విరళ విశిష్ట ఆత్మయే ఈ గుహ్యతమ దీక్ష కర్హమగును; కారణము, అతడే తన సమస్త సత్తయందును తనలోని పరమాత్మకు యథార్థముగా ప్రతిస్పందించుటకును, అతనిని సజీవానుభవము గావించుకొనుటకును తన హృదయ మనో ప్రాణములందు అతనికి తగినంత సన్నిహితముగా నుండును. సర్వోన్నత గుహ్యమును ప్రకటించు నట్టి గీతయొక్క చరమ సమాపక పరమ వచనము రెండు సంక్షిప్త సుస్పష్ట సరళ శ్లోకములందు వచింపబడును మఱియు నివి ఇక నెట్టి వ్యాఖ్య గాని, విస్తరణ గాని లేక, మనసులోనికి ఇంకి, అంతరాత్మ అనుభవము నందు తమ సంపూర్ణార్థమును స్వయముగా ఆవిష్కరించు నిమిత్తము యథాతథముగా విడిచివేయబడును. ఏలన ఈ శ్లోకశబ్దములు స్వయముగా పైకి ఎంత స్వల్ప, సరళముగా గన్పించినను, అవి అనంత అర్థగౌరవముతో గర్భితమై యున్నవి, మఱియు నా అనంతార్థమును సంతతము విస్తరించు ఆంతరనుభవము మాత్రమే వ్యక్తము చేయగలదు. మఱియు నీ శబ్దము లుచ్చరించబడు నపుడు, శిష్యుని అంతరాత్మ వీనికొఱకే అనుక్షణము ఆయత్తముచేయబడుచు వచ్చిన దనియు, తక్కిన దంతయు ఒక జ్ఞానోద్భాసక, శక్తిప్రదాయక శిక్షణ మఱియు సిద్ధాంతము మాత్రమే యనియు మన కనిపించును. ఈ రహస్యాతిరహస్యము, ఈశ్వరునియొక్క ఈ పరమ సరళతమ సందేశము ఇట్లు నడుచును - "నాయందు మనసును గీలించినవాడవు గమ్ము, నాయం దను రక్తుడవు, భక్తుడవు గమ్ము, నాకు యజ్ఞము చేయువాడవు గమ్ము, నాకు నమస్కరింపుము; (అపుడు) నీవు తప్పక నన్ను బొందెదవు; నీవు నా ప్రియుడవు గనుక, నేను నీ కిట్టి

ప్రతిజ్ఞావాగ్దానములను జేయుచున్నాను (18-65). సర్వధర్మములను పరిత్యజించి, నాయందే శరణు బొందుము. సర్వపాపము మఱియు నశుభమునుండి నిన్ను ముక్తుని చేసెదను, శోకింపకుము (18-66)."

16. ధర్మములనుండి ధర్మాతీతత్త్వమునకు :

మహత్తరము, సునిర్మితము నగు ఒక యోగవిధానము (3-19....), అటులే విశాలము, సునిర్దిష్టము నగు నొక దార్శనిక మతము; మఱియు స్వభావము (8-3, 18-42), అటులే స్వధర్మము (3-35); ఇంకను జీవనమునకు సంబంధించిన సాత్త్విక ధర్మము తననుదాను అతిక్రమించుచు పై కెగయుటద్వారా ఏది సర్వథా విశాలము మఱియు సాత్త్విక గుణమునకు సైతము ఎంతో పైన భాసించునో, అట్టి అజరామర అస్తిత్వము యొక్క ఒక విముక్త ఆధ్యాత్మిక ధర్మములోనికి గొనిపోవు సాత్త్విక ధర్మము; అటులే పరిపూర్ణతా ప్రాప్తికి ఆవశ్యకమగు అనేకానేక నియమములు, ఉపాయములు, విధులు మఱియు నిబంధనలు - వీని నన్నింటిని సర్వత్ర గీత ప్రతిపాదించుచు వచ్చి, ఇపుడు అట్టి తన స్వీయ నిర్మాణమునే భేదించి, వెలువడి, మానవాత్మ నిట్లు ఉద్బోధించుచున్నట్లు గన్పించును, "సర్వధర్మములను పరిత్యజించుము, భగవంతునికి మాత్రమే, నీపైనను, చుట్టును, లోపలను గల పరమపురుషునకు మాత్రమే నిన్ను నీ వర్పించుకొనుము (18-66) - అదియే నీకు కావలసిన దంతయు, అదియే సత్యతమ, మహత్తమ మార్గము, అదియే వాస్తవ విమోచనము." దివ్య సారథి మఱియు కురుక్షేత్ర ఉపదేష్ట రూపమున జగదీశ్వరుడు, భగవంతుడు, ఆత్మయు నగు పరమపురుషునికి సంబంధించిన మహాసత్యములను, జటిల ప్రపంచముయొక్క స్వభావమును, అంతఃపురుషునితో మానవుని మనః ప్రాణ హృదయేంద్రియముల సంబంధమును (7-5) ఆవిష్కరించియున్నాడు; అటులే తన స్వీయ ఆధ్యాత్మిక స్వయంశిక్షణ మఱియు ప్రయత్నముద్వారా ఏ విజయశీల సాధనముల నవలంబించి, మానవుడు తన మర్త్యత్వమునుండి అమరత్వములోనికిని ఎగయ గలడో ఆ సాధనములను దెలిపి యున్నాడు. ఇక నిపుడు మానవుని యందును, సర్వవస్తువుల యందును నిలిచి యుండు అంతఃపురుషుడు మఱియు భగవంతుని రూపమున ఆ జగదీశ్వరుడే ఇట్లు పలుకును, "ఈ వైయక్తిక ప్రయత్నము మఱియు స్వయంశిక్షణ - ఇది యంతయు చివరి దశలో నీ కావశ్యకము గాదు; నీవు నాకు సంపూర్ణ సమర్పణ చేసికొనగలుగుదు వేని, నీలోపలను, సర్వవస్తువుల

లోపలను గల పరమపురుషుడు మఱియు భగవంతుని యందు మాత్రమే ఆధారపడి, కేవల మాతని మార్గదర్శనమందే నమ్మక ముంతు వేని, నియమము ధర్మముల ననుసరించుట, అవి కల్పించు పరిమితత్వము – దీని నంతను ఒక ప్రతిబంధక భారముగా దలంచి నీవు త్రోసివేయ గలుగుదువు. (కనుక) నీ మనస్సు నంతను నా కభిముఖము గావించి, దానిని నాయొక్కయు, నా సన్నిధియొక్కయు చింతనతో నింపివేయుము. నీ హృదయము నంతను నా కభిముఖము గావించి, నీ ప్రతి కర్మను నాకు చేయబడు ఒక యజ్ఞము, ఒక నైవేద్యముగా నొనరింపుము. అట్లొన రించి, నీ అంతరాత్మను, ప్రాణమును, క్రియను నా ఇచ్ఛానుసారము నడుప నాకు వదలివేయుము; నీ మనోహృదయముల తోను, జీవనకర్మలతోను నేను వ్యవహరించు తీరును జూచి, నీవు దుఃఖించకుము లేదా తికమకపడకుము, అథవా ఆ తీరు తన పరిమిత సంకల్పము మఱియు మేధను నడుపుటకు మానవుడు తనపై విధించుకొనిన నియమములు మఱియు ధర్మములను అనుసరించకపోవుటచే వ్యథచెందకుము (18–66). నా కార్య విధానములు పరిపూర్ణ ప్రజ్ఞాశక్తిప్రేమలతో గూడిన విధానములు; అవి అన్ని విషయముల నెఱింగి, ఒక సర్వాంగపూర్ణ చరమ ఫలితము నుద్దేశించి, వాని వాని గతులను తదనుకూలముగా మేళవించును; ఏలన ఆ ఫలితము ఒక సమగ్ర సిద్ధియొక్క అనేకానేక సూత్రములను శోధించి, అల్లుటయే యగును. లోపలను, వెలుపలను నున్న జగదీశ్వరునిగా నన్ను ప్రకటించుకొని, నే నిచ్చట నీతో నీ యుద్ధరథమున నున్నాను మఱియు సర్వ దుఃఖము మఱియు అశు భముద్వారానే, వాని కావల భాసించు నాకడకే నిన్ను నడుపుకొనిపోవుదును – అను నిర్ద్వంద్వ ఆశ్వాసనమును (హామీని) అమోఘ ప్రతిజ్ఞను మఱియొక సారి చేయుచున్నాను. ఎట్టి కష్టములు మఱియు కలవరములు ఉప్పతిల్లినను, విశ్వసత్త యందు ఒక సంపూర్ణ దివ్య జీవనమునకును, విశ్వాతీత సత్తయందు ఒక అజరామర అస్తిత్వమునకును నేను నిన్ను నడుపుచున్నానని నిశ్చయముతో నుండుము."

17. ఆధ్యాత్మికపురుషుడు 'గుహ్యము' :

సమస్త గంభీర ఆధ్యాత్మిక జ్ఞానము మనకొక 'గుహ్యమును' ఆవిష్కరించును; అదియే వివిధ బోధనల యందు ప్రతిబింబించుచు, అంతరాత్మ అనుభవమునందు ప్రామాణ్యమును బొందును. కాగా గీతాశాస్త్రమున కీ గుహ్యము మనలో నేది దాగి యున్నదో, మనస్సు మఱియు బాహ్య ప్రకృతి దేనియొక్క అభివ్యక్తులు లేక

ఆకారములో, అట్టి ఆధ్యాత్మిక పురుషు డగును. గీతాగుహ్యము పురుషప్రకృతుల మధ్య గల నిత్యసంబంధరూప రహస్యము; ఎవడు సర్వసృష్టి కధీశ్వరుడో, ఎవడు దాని రూపములందును, గతులందును ఆవృతుడై యుండునో, అట్టి అంతఃస్థ భగవద్రూపమగు రహస్యము. ఈ పురుషాదులు వేదాంత, సాంఖ్య, యోగములచే అనేక విధముల బోధింపబడి, గీత యొక్క పూర్వాధ్యాయము లందు సమన్వయీకృతములగు సత్యములు – వానిలో పైకి ఎన్ని విభేదములు గన్పించినను, అవి అన్నియు ఒకే సత్యము మఱియు యోగ విధానము లన్నియు ఆధ్యాత్మిక స్వయంసాధనయొక్క వివిధ సాధనములు (means) – వీనిచేత చంచల మానసము, అంధప్రాణము నిశ్చలము చేయబడి, బహుముఖమగు ఏకసత్యమునకు అభిముఖము చేయబడును; అపుడు ఆత్మ మఱియు భగవద్రూపమగు రహస్య సత్యము మనకు తగినంత వాస్తవము మఱియు సన్నిహితము కాగా, ఇక నేమాత్రము మానసిక అజ్ఞానముచేత బలాత్కరింపబడక, ఆ సత్యమునందు మనము సచేతనముగా నివసింతుము, అథవా సనాతనునియందు మన పృథగాత్మలను కోల్పోదుము.

18. పురుష ప్రపంచముల సమన్వయము 'గుహ్యతరము' :

పై గుహ్యముకంటెను రహస్యమగు 'గుహ్యతరమును' గీత ఆవిష్కరించును; ఇది దివ్య పురుషోత్తముని యొక్క గంభీర సమన్వయసాధక సత్యము, ఇది పురుషోత్తముడు ఏకకాలమున ఆత్మయు, పురుషుడు నని చెప్పును, అనగా పరబ్రహ్మయు, ఏకమాత్ర సన్నిహిత రహస్యమయ, అనిర్వచనీయ భగవంతుడు నని చెప్పును. ఈ సత్యము అంతిమ జ్ఞానమునిమిత్తము బుద్ధికి విశాలతరము, ఎక్కువ లోతుగా అవగాహనాత్మ కము నగు ఒక పునాది నేర్పఱచును, మఱియు ఆధ్యాత్మిక పరప్రకృతి (7–5) మఱియు జీవుని పైన (15–7) ఆధారపడి యుండును – ఈ జీవుడు ఆ సనాతన ప్రకృతి యందును, ఈ అభివ్యక్త ప్రకృతియందును భగవంతునియొక్క ఒక అంశ (15–7) మగుచునే, భగవంతుని స్వయంభూ సత్తయందు అతనితో ఏకాత్మకము, ఏకమూలము నగును. ఈ గభీరతర జ్ఞానము పరమునకు, ఇహమునకు మధ్య ఆధ్యాత్మికానుభవము ప్రారంభములో చూచు ప్రాథమిక విభేదమున కందదు. ఏలన లోకముల కావల నున్న అతీతుడు (15–18) అదే సమయమున సర్వలోకములందలి సర్వ వస్తువులు నగు వాసుదేవుడు గూడను (7–19); అతడు ప్రతిప్రాణి హృదయము నందు నిలిచి యున్న ఈశ్వరుడు (18–61)

మఱియు సర్వభూతముల ఆత్మ (10-20) మఱియు తన ప్రకృతియందు తాను వెలవరించిన ప్రతివస్తువుయొక్క మూలమును, దివ్యార్థమును అతడు తన విభూతులయందు అభివ్యక్తమై యుండును, అతడే కాల పురుషుడై జగత్కార్యమును నిర్బంధముగా జేయించును, అతడే సర్వజ్ఞానమునకు సూర్యుడు, అతడే అంతరాత్మయొక్క ప్రేమికుడు మఱియు ప్రియతముడు, అతడే సర్వ కర్మలు మఱియు యజ్ఞముల అధీశ్వరుడు (5-29). ఈ గభీరతర సత్యతర, గుహ్యతర రహస్యమునకు, చేయు ఆంతరతమ ఉన్మీలనముయొక్క ఫలితమే సమగ్ర జ్ఞానము సమగ్ర కర్మ మఱియు సమగ్ర భక్తియొక్క గీతాయోగము. ఈ యోగము ఏకకాలమున ఆధ్యాత్మిక విశ్వమయతయొక్కయు, ఒక విముక్త, పరిపూర్ణిత ఆధ్యాత్మిక వ్యక్తిత్వముయొక్కయు సమగ్రానుభవము, భగవంతునితో సంపూర్ణసాయుజ్యముయొక్క సమగ్రానుభవము, చివరకు అంతరాత్మ అమరత్వము యొక్క ఆధారము (12-8), అటులే ప్రపంచము మఱియు శరీరమునందు మన విముక్తి కర్మయొక్క ఆశ్రయము మఱియు శక్తియగు భగవంతునియందు ఒక సంపూర్ణ నివాసము (6-31).

19. పరముని ధర్మాతీతత్వము 'గుహ్యతమము' :

ఇక నిపుడు సర్వోత్తమ రహస్యము - "గుహ్యతమము" (18-64)-వచ్చును. అది యేమన, ఆత్మ మఱియు భగవంతుడు సర్వధర్మమునుండి ముక్తము, స్వతంత్రము నగు ఒక అనంతము. అతడు ప్రపంచమును కొన్ని స్థిర నియమముల ననుసరించి నిర్వహించుచున్నను, మఱియు నతడు మానవుని తన జ్ఞానాజ్ఞానములు, పుణ్యపాపములు, యుక్తాయుక్తములు, రాగద్వేష ఉదాసీనతలు, సుఖదుఃఖముల ద్వారాను మఱియు ఈ ద్వంద్వముల నిరాకరణమునకు సంబంధించిన ధర్మములద్వారాను నడుపు చున్నను, అటులే తన శారీరిక మఱియు ప్రాణిక, బౌద్ధిక, భావిక, నైతిక మఱియు ఆధ్యాత్మిక రూపములు నియమములు మఱియు ప్రమాణములను బట్టి ముందుకు గొనిపోవుచున్నను, అతడు (భగవంతుడు) వీని కన్నింటికి పైన నుండును. కావున మనము సైతము ధర్మము లపై నాధారపడుటకు స్వస్తిచెప్పి, ఈ విముక్త మఱియు సనాతన పరమాత్మకు ఆత్మసమర్పణము చేసికొనగలుగుదు మేని మఱియు, అతనికి పూర్ణముగను, కేవలముగను ఉన్మీలితులమై యుండుటకు మాత్రమే జాగ్రత్త వహించుచు, మనలోని భగవంతునియొక్క జ్యోతి, శక్తి, ఆనందములయందు నమ్మక ముంచగలుగుదుమేని, ఇంకను భయపడక,

శోకించక, అతని మార్గదర్శనమును మాత్రమే స్వీకరించ గలుగుదుమేని, అపుడు అది సత్యతమ, మహత్తమ ముక్తి యగును మఱియు నది మన సత్త మఱియు ప్రకృతియొక్క పరమ, అనివార్య సంసిద్ధిని గొనివచ్చును. ఇది భగవానునియొక్క ఎన్నుకొనబడిన పుత్రులకు చూపబడిన పథము-ఎవరు ఆయనకు మిక్కిలి అంతరంగికులో, మఱియు, ప్రకృతియొక్క ఉచ్చతమ శక్తి మఱియు క్రియ యందు ప్రకృతికి స్వచ్ఛందముగా తమ సమ్మతి నిచ్చుచు, ఆమెతో సుసంగతులై యుండుచు, ఆయనతో ఏకతాలాభమునకే గాక, ఆయన వలెనే అంతరాత్మ చేతన యందు విశ్వమయముగను, ఆత్మచేతనయందు విశ్వాతీతముగను ఉండుటకు మిక్కిలి సమర్థులో, కావుననే ఎవరియందు ఆయన అత్యంత ప్రీతుడో, అదిగో, అట్టివారికి చూపబడిన పథము.

20. యోగేశ్వరుడే మన యోగము చేయును :

ఏలన మన ఆధ్యాత్మిక వికాసమున ఒక సమయము వచ్చును, అపుడు మన ప్రయత్నము మఱియు కర్మ యంతయు మన లోపలను, చుట్టును గల ఒక అధికతర భగవత్‌సన్నిధియొక్క నీరవ మఱియు గుప్త నిర్బంధమునకు మన మానసిక మఱియు ప్రాణిక ప్రతిక్రియలు మాత్రమే యని మనకు దెలియవచ్చును. మన యోగమంతయు, ఆకాంక్ష యంతయు, ప్రయాస మంతయు పై నిర్బంధముయొక్క అపూర్ణ లేక సంకుచిత రూపములు; కారణము, మనసుయొక్క సంస్కారములచేతను, కోరికలచేతను, పూర్వనిర్ణయముల చేతను, పక్షపాతములచేతను, విశాలతర సత్యమునకు అది చేయు అపానువాదములు లేక అర్థానువాదములచేతను అవి వికృతములు లేక కనీసము పరిమితము లగును - అని మనకు గట్టి నిశ్చయ మేర్పడును. మన భావములు, అనుభవములు మఱియు ప్రయత్నములు కొన్ని మహత్తమ వస్తువులయొక్క మానసిక ప్రతిబింబములు మాత్రమే - ఒక పరమ మఱియు చరమ బలము మఱియు ప్రజ్ఞయొక్క హస్తములలో మనలను మనము ఉపకరణరూపమున నిష్క్రియముగా నర్పించుకొందు మేని, ఈ మహత్తమ వస్తువులు మనలోని ఆ భగవత్సన్నిధి రూప శక్తిచేతనే ఎక్కువ పూర్ణముగా, ప్రత్యక్షముగా, స్వేచ్ఛగా, విశాలముగా, విశ్వగత మఱియు సనాతన సంకల్పముతో ఎక్కువ సామరస్యయుక్తముగా చేయబడును. కాగా ఆ శక్తియు మనకంటె వేఱు గాదు; అది ఇతరు లందరి ఆత్మతోను ఏకమగు మన స్వీయ ఆత్మయే మఱియు నదే

సమయమున అది అతీత పరమాత్మయు, అంతర్యామి పురుషుడు నగును. మన సత్తయు, కర్మయు ఈ మహత్తమ సత్తలోనికి స్వీకరించబడి నపుడు, ఇపుడు మనకు గన్పించు నట్లు, మనసు గల్పించు పార్థక్యమున ఇకముందు అవి కేవలము మనవియే నని తోచవు. అపుడు మన కర్మ ఒక అనంతతయొక్కయు, ఒక అంతరంగ, అనిర్వచనీయ సన్నిధి యొక్కయు విశాల వ్యాపారముగా నుండును; ఈ ప్రకటనము పూర్ణరూపమున జరుగు నిమిత్తము, మన సమర్పణలో మినహాయింపు లుండరా దని గీత సూచించును (18-62, 65); మన యోగము, మన జీవనము, మన అంతఃసత్తయొక్క అవస్థ ఈ ధర్మముపట్లనో, ఆ ధర్మముపట్లనో, ఏ ధర్మము పట్లనో మన మనస్సునకు గల పట్టుచేతను గాక, ఈ సజీవ అనంతునిచేతనే స్వేచ్ఛగా నిర్ణయింప బడవలెను. అపుడు దివ్య యోగేశ్వరుడు – "యోగేశ్వరః కృష్ణః" (18-78) – స్వయముగా మన యోగమును తాను చేపట్టి, మన అత్యంత సంభవ సంసిద్ధికి మనలను లేవనెత్తును – ఇది బాహ్య లేక మానసిక ప్రమాణము లేక పరిమితికర నియమము నాశ్రయించిన సిద్ధి గాక, మనస్సు తర్కించజాలని ఒక విశాల, సమగ్ర సంసిద్ధి యగును. అది సర్వదర్శియగు దివ్యప్రజ్ఞచేత పెంపొందించబడిన సంసిద్ధి యగును; ఈ ప్రజ్ఞ ముందు నిక్కముగా మన మానవ స్వభావముయొక్క సమగ్ర సత్యము ననుసరించియు, కాని తర్వాత అది దేనిలోనికి ఉన్మీలిత మగునో, అట్టి ఒక అధికతర వస్తువుయొక్క సమగ్ర సత్యము ననుసరించియు సంసిద్ధిని బెంపొందించును – ఈ అధికతర వస్తువు ఒక అపరిమేయ, అవినాశి, విముక్త మఱియు సర్వపరివర్తన సాధక సత్తా మఱియు శక్తి, ఒక దివ్య మఱియు అనంత ప్రకృతియొక్క ప్రకాశము మఱియు ప్రభావైభవము.

21. "సర్వధర్మాన్ పరిత్యజ్య" :

సర్వము ఆ పరివర్తనద్రవ్యముగా సమర్పించబడ వలెను. అపుడు ఒక సర్వజ్ఞ చేతన మన జ్ఞానాజ్ఞానములను, మన సత్యానృతములను చేపట్టి, వాని అపూర్ణతారూపములను పరిత్యజించి–"సర్వధర్మాన్ పరిత్యజ్య" (18-66) – సర్వమును తన అనంత ప్రకాశములోనికి రూపాంతర మొందించును. అటులే ఒక సర్వసమర్థ దివ్యశక్తి మన పుణ్యాపాపములను, మన న్యాయాన్యాయములను చేపట్టి, వాని జటిల రూపములను పరిత్యజించి – "సర్వధర్మాన్ పరిత్యజ్య" – సర్వమును తన అతీత శుద్ధతలోనికిని, విశ్వజనీన హితము లోనికిని, అమోఘ

శక్తిలోనికి రూపాంతర మొందించును. మఱియు నొక అనిర్వచనీయ ఆనందము మన క్షుద్ర హర్షశోకములను, ప్రయాసమయ సుఖదుఃఖములను చేపట్టి, వాని విరోధవైషమ్యములను, వాని అపూర్ణ క్రమములను పరిత్యజించి – “సర్వధర్మాన్ పరిత్యజ్య” – సర్వమును తన విశ్వాతీత, విశ్వగత, అనూహ్యా ఆహ్లాదములోనికి రూపాంతర మొందించును. అన్ని యోగములు చేయగలిగిన దంతయు చేయబడును, అధికము గూడ చేయబడును; కాని ఏ మానవ గురువు, సాధువు లేక జ్ఞాని మన కివ్వగలిగిన దానికంటె నొక అధికతర దృష్టితో గూడిన విధముగాను, ఒక అధికతర ప్రజ్ఞ మఱియు సత్యముతోను అది చేయబడును. ఈ పరమ యోగము మన నే ఆంతర, ఆధ్యాత్మిక స్థితికి గొనిపోవునో, అది యిచ్చటి సమస్తముకంటెను పై నుండును, అయినను అది ఈ మఱియు నితర లోకములందు గల సర్వ వస్తువులను తనలో నిముడ్చుకొనును, కాని వాని పరిమితత్వము గాని, బంధనము గాని లేక – “సర్వధర్మాన్ పరిత్యజ్య” – అన్నింటిని ఆధ్యాత్మికముగా రూపాంతర మొందించి యిముడ్చుకొనును. భగవంతుని యొక్క అనంత సత్త, చేతన మఱియు ఆనందము తన ప్రశాంత నీరవతయందును, ప్రకాశమయ, నిస్సీమ వ్యాపారమునందును ఆ స్థితియందు నిలిచియుంటయే గాక, దాని సారభూత, ప్రాథమిక, విశ్వగత పదార్థము (stuff), ఆకృతి మఱియు స్వభావమే యగును. ఇట్లు అనంతతయొక్క అట్టి ఆకృతి యందు వ్యక్తము చేయబడిన భగవంతుడు పూర్వమువలె యోగమాయాసమావృతుడు (7–25) గాక, ప్రత్యక్షముగా నివసించును, మఱియు నెపుడెపుడు, ఎటులెటుల తాను సంకల్పించునో, అటులే మనయందు అనంతునియొక్క ఆకారములను, మఱియు తన స్వయంసాధక సంకల్పము మఱియు అమర ఆనందము ననుసరించి జ్ఞానము, చింతన, ప్రేమ, ఆధ్యాత్మిక హర్షము, శక్తి మఱియు క్రియయొక్క వినిర్మల రూపములను నిర్మించును. అయినను విముక్త జీవుడు మఱియు అవికృత ప్రకృతిపై నెట్టి బంధనకారక ప్రభావము నుండదు, ఈ యా నిమ్నతర ధర్మములోనికి తప్పించు కొనలేని విధముగా నెట్టి ఘనీభవించుటయు జరుగదు. ఏలన సర్వ కర్మయు నొక దివ్యస్వేచ్ఛయందు–“సర్వధర్మాన్ పరిత్యజ్య”–దివ్యసత్తయొక్క శక్తిచే నిర్వహించబడును. పరమాత్మయందు– “పరంధామ” (10–12) – ఒక అచ్యుత నివాసము ఈ ఆధ్యాత్మిక స్థితియొక్క ఆధారమును, హామీయు నగును. విశ్వ పురుషునితోను, సర్వప్రాణులతోను ఒక అంతరంగ బోధపూర్ణ ఏకత–ఇది భేదకారి మనస్సుయొక్క అశుభ, దుఃఖముల

నుండి విముక్తము, కాని యథార్థ విభేదములను వివేకముతో నిరీక్షించును-ఆధ్యాత్మిక స్థితియొక్క నియామక శక్తి యగును. ఇంకను భగవంతునితోను, అతని సమస్త సృష్టితోను ఇచ్చట సనాతన జీవుని యొక్క (15-7) ఏకత మఱియు సామరస్యము మఱియు ఆనందము ఈ సమగ్ర విముక్తియొక్క భవ్య ఫల మగును. మన మానవ జీవితమును వేధించు అసాధ్య సమస్యలు-అర్జునుని సమస్య వీని కొక తీవ్రదృష్టాంతము - అజ్ఞానమునందలి మన పృథక్కర వ్యక్తిత్వముచేత కల్పితములే. ఈ యోగము మానవాత్మను భగవంతునితోను, ప్రపంచగతితోను సరియగు సంబంధమున స్థాపించును మఱియు మన కర్మను భగవంతుని కర్మచేయును, ఆ కర్మను రూపొందించు జ్ఞానమును, సాధించు సంకల్పమును భగవంతుని జ్ఞానసంకల్పములు గావించును, అటులే మన జీవనమును భగవంతుని ఒక స్వయమభివ్యక్తియొక్క సామరస్యవిలాసము గావించును గావున, ఈ యోగము కల్పిత మానవ సమస్యల అశేష అంతర్ధానమునకు రాజమార్గమగును.

22. మోహనాశము, స్మృతిలాభము :

సమస్త యోగము ప్రకటింపబడినది, గీతా మహావాక్యము ప్రోక్తమైనది, మఱియు భగవంతునిచేత ఎన్నుకొనబడిన మానవాత్మ, అర్జునుడు మరియొక సారి, ఇపుడిక తన అహంకారిక మనస్సునందు గాక, ఈ మహత్తమ ఆత్మజ్ఞానమునందు, దివ్యకర్మకు అభిముఖుడైనాడు. విభూతి యగు నర్జునుడు మానవ జీవితమున దివ్యజీవనమునకు సిద్ధముగా నున్నాడు, అతని సచేతన ఆత్మ ముక్త జీవునియొక్క కర్మకు - "ముక్తస్య కర్మ" (4-23) - సిద్ధముగా నున్నది. మనస్సుయొక్క మోహము నష్టమైనది (18-73); మన జీవితము యొక్క భ్రాంతిజనక ఆడంబరములు మఱియు ఆకారములచేత ఇంత దనుక ఆవృతమైయున్న తన ఆత్మయొక్కయు, తన సత్యముయొక్కయు స్మృతి అంతరాత్మకిపుడు తిరిగి ప్రాప్తించి, అతని నిత్యసామాన్య చేతన అయినది (18-73); ఇట్లు సమస్త సంశయము మఱియు మోహము దూరము కాగా, అది భగవ దాదేశమును బాలింప నిపుడు ప్రవృత్తము గాగలదు, మఱియు మన సత్తాస్వామిచేత - కాలమునందును, విశ్వమునందును స్వయమభివ్యక్త మగు విశ్వపురుషుడు మఱియు పరమేశ్వరుని చేత - భగవంతునికొఱకును, విశ్వముకొఱకును తన భాగముగా నప్పగించబడిన ఎట్టి కర్మ నైనను ఇపు డంతరాత్మ నిష్ఠతో నిర్వహించగలరు.

23. గీతార్థసారము

1. గీతాతత్త్వము సదా సజీవము :

గీతాగ్రంథము వ్రాసిన పిమ్మట ఎంతో, ఎంతో కాలము గడచిపోయినది, ఆ కాలమునందు ఆలోచనానుభవములలో పెద్ద పెద్ద మార్పులు వచ్చినవి; అయినపుడు గీతాసందేశ మేమి యగును, ఇప్పటి మానవ మానసమునకు దాని క్రియాత్మక మూల్యము, దాని ఆధ్యాత్మికోపయోగ మే మాత్ర ముండును ? మానవ మానసము సర్వదా ముందుకు సాగును, తన దృక్కోణమును మార్చుకొనును, తన ఆలోచనా విషయమును విస్తృతపఱచుకొనును, మఱియు ఈ మార్పుల ఫలితముగా గత ఆలోచనారీతులు అంతరించిపోవును, లేక వానిని కొనసాగింతు మేని, వానిని విస్తృతపఱచుటయు, శోధించుటయు, అప్రకాశముగనో, ప్రకాశముగనో వాని మూల్యమును మార్చివేయుటయు జరుగును. ఒక ప్రాచీన సిద్ధాంతము ఏ మేరకు ఇట్టి మార్పున కవకాశ మిచ్చునో, ఆ మేరకు దాని సజీవత కొన సాగును; ఏలన, ఆ సిద్ధాంతముయొక్క ఆలోచనాబాహ్యరూపము లెంత పరిమితము లైనను, లేక ఇపుడు వ్యవహారములో లేకున్నను, ఆ సిద్ధాంత నిర్మాణమునకు ఆధారభూతమైన సారతత్త్వము (substance) యొక్క సత్యము, సజీవ దర్శనానుభవముల సత్యము ఇంకను అక్షతముగా నుండి, ఒక శాశ్వత ప్రామాణికతను, మార్మికార్థమును నిలుపుకొనినదనియే తదవకాశమున కర్థమగును. గీత అసాధారణరీతిలో చిరకాలము నుండి సజీవముగా సాగుచున్న గ్రంథరాజము. దానిని ఎప్పటికప్పుడు అనుభవమున పునర్నవీకరించుకొనవచ్చును. కావున మహాభారతమున అది మొదట దర్శన మిచ్చినపుడు, లేక దానిలోనికి చొప్పించబడి నపుడు వలెనే, ఇపుడును అది అంత నవ్యము గాను, తన సారతత్త్వమునందు అంత నూతనముగాను ఒప్పారును. గీత భారతదేశమున ఇప్పటికిని ధార్మిక చింతనను అత్యంతప్రామాణికముగా శాసించు మహాశాస్త్రములలో నొకటిగా ఆదరింపబడుచున్నది మఱియు విభిన్న ధార్మిక విశ్వాసములు, అభిప్రాయములు గల దాదాపు అందరు దాని బోధనను శిరసా వహించుచున్నారు, కనీసము దానికి అత్యుత్తమ మూల్యము నిచ్చుచున్నారు. దాని ప్రభావము దార్శనికము (philosophic) మఱియు విద్యావిషయకము మాత్రమే గాదు, అది సన్నిహితము మఱియు సజీవము. ఇంకను దాని భావములు ఒక జాతి మఱియు నొక సంస్కృతియొక్క పునరుజ్జీవనము నందును, పునర్నవీకరణము

నందును ఒక ప్రబల నిర్మాణకారి శక్తిగా వాస్తవరీతిని పనిజేయుచున్నవి. ఆధ్యాత్మిక జీవనముకొఱకు మనకు గావలసిన ఆధ్యాత్మిక సత్య మంతయు గీతలోనే లభించును - అని ఇటీవల ఒక మహావ్యక్తి చెప్పను గూడ చెప్పెను. అయితే ఈ వచనముయొక్క అక్షరార్థమునే ఒత్తి చెప్పుదుమేని, అది గీతకు సంబంధించిన అంధవిశ్వాసమును ప్రోత్సహించుటయే యగును. ఏలన ఆత్మసత్యము అనంతము, దాని నట్లు సీమితము చేయజాలము. అయినప్పటికి ప్రధాన సూత్రములలో అధికాంశము గీతలో గల వనియు, ఆధ్యాత్మిక అనుభవము మఱియు ఆవిష్కరణముయొక్క నిన్న మొన్నటి పరిణామముల తర్వాత సైతము ఒక విశాల అనుప్రేరణ మఱియు మార్గదర్శనము నిమిత్తము మనము గీతవైపుకు తిరుగవచ్చుననియు చెప్పవచ్చును. భారతమునకు వెలుపల సైతము ప్రపంచ మహాశాస్త్రములలో నొకటిగా గీత కొనియాడబడు చున్నది - అయితే యూరోపునందు దాని నిగూఢ ఆధ్యాత్మిక సాధనకంటెను దాని తాత్త్విక భాగమే బాగుగా గ్రహించబడినది. మంచిది, కాని గీతావిచారణకును, సత్యమునకును ఈ ప్రాణశక్తి నిచ్చుచున్న వస్తు వేది ?

2. సమన్వయమే గీతాప్రాణశక్తి :

గీతా విచారణ మఱియు యోగము యొక్క ప్రధాన లక్ష్య మేమన, ఆంతర ఆధ్యాత్మిక సత్యముయొక్క అత్యంత పూర్ణ మఱియు సమగ్ర సాక్షాత్కారమునకును, మానవుని జీవనము మఱియు కర్మయొక్క బాహ్య వాస్తవికతలకును మధ్య సమన్వయమును, చివరకు ఒక విధమగు ఐక్యమును సైతము అది సాధింప బ్రయత్నించును; నిజానికి ఆ భావముతోనే గీత ఉపక్రమించును, ప్రవర్తించును మఱియు ఉపసంహరించును. అనేకులు ఈ రెండింటికి ఒక రాజీ చేయుదురు; కాని అది ఒక అంతిమ, సంతృప్తికర పరిష్కార మెన్నటికిని గాజాలదు. ఆధ్యాత్మికతకు నైతికరూప మిచ్చుటయు సాధారణమే మఱియు ఒక ప్రవర్తనా సూత్రముగా దానికి విలువ గలదు; కాని అది ఒక మానసిక పరిష్కారము మాత్రమే, సంపూర్ణ జీవనసత్యముతో సంపూర్ణ ఆత్మ సత్యముయొక్క ఒక సంపూర్ణ క్రియాత్మక సమన్వయముతో అది సరిగాదు, మఱియు నది ఎన్ని సమస్యలను పరిష్కరించునో, మఱల అన్ని సమస్యలను లేవ నెత్తును. నిజానికి గీతా ప్రారంభబిందువే వీనిలో నొక సమస్య, గీత ఒక నైతిక సమస్యతో ప్రారంభించును, ఈ సమస్య భిన్న ధర్మముల సంఘర్షముచేత తలయెత్తును; ఈ సంఘర్షముయొక్క ఒక పక్షమున కర్మప్రధాన మానవుని ధర్మము గలదు - ఇత డొక రాజపుత్రుడు, యోధుడు, నాయకుడు,

భౌతిక భూమికయందు, వాస్తవిక జీవన భూమికయందు సంభవించిన ఒక మహాసంకటముయొక్క ఒక సంగ్రామము యొక్క సమర్థకుడు; అది ధర్మము మఱియు న్యాయముయొక్క శక్తులకును, అధర్మము మఱియు అన్యాయముయొక్క శక్తులకును జరిగిన సంఘర్షము; ఒక భయంకర భౌతిక సంగ్రామము మఱియు ఘోర సంహారము ద్వారా యైనను అర్జునుడు ఎదిరించి, యుద్ధము సల్పి, ఒక నూతన శకమును, సత్య ధర్మ న్యాయముల రాజ్యమును స్థాపించి తీరవలెను - అని జాతిభవితవ్యము (destiny) అతని కిచ్చు ఆదేశము ఈ సంఘర్షమునకు ఒక పక్షము కాగా, రెండవ పక్షము నైతిక బుద్ధి యయ్యెను : ఈ బుద్ధి యుద్ధసాధనమును, యుద్ధకర్మను ఒక పాపముగా ఖండించును, వైయక్తిక క్లేశము, సామాజిక కలహము మఱియు అశాంతి కల్లోల రూపమగు మూల్యమును చెల్లింప భయపడి వెనుదీయును, మఱియు హింసా యుద్ధములనుండి చేయు విరమణమే ఏకమాత్ర మార్గమనియు, ఏకమాత్ర యోగ్య నైతిక భావ మనియు దలంచును. ఆధ్యాత్మిక గంధముతో గూడిన నీతిశాస్త్రము అహింసయే ఆధ్యాత్మిక జీవనముయొక్క పరమ ధర్మ మని పట్టుబట్టును. ఒకవేళ యుద్ధము చేయక తప్పనిచో, ఆధ్యాత్మిక భూమికయందే ఆ యుద్ధమును జేయవలెను, అనగా అస్త్రశక్తితో గాక, ఆత్మశక్తితో శత్రువును ప్రతిఘటించవలెను, పోగా బాహ్య భూమికయం దిట్టి ప్రతిఘటన ఫలించక, అన్యాయశక్తియే జయించి నప్పటికి, వ్యక్తి తన నీతిని రక్షించుకొని, తన దృష్టాంతముచే ఉత్త మాదర్శమును నిల బెట్టినవా డగును. ఈ నైతికాదర్శమున కావల, ఆధ్యాత్మికముగా మఱికొంత లోతునకు బోయిన సన్న్యాసప్రవృత్తి వచ్చును, అది సామాజిక విధికిని, శుద్ధ నైతి కాదర్శమునకును మధ్య రేగు సంఘర్షమును దాటిపోయి, జీవనమునుండియు దాని సర్వ లక్ష్యముల మఱియు కర్మప్రమాణముల నుండియు వెనుదిరిగి, మఱి యొక స్వర్గావస్థనో, విశ్వాతీతావస్థనో లక్షించును, అట్టి అవస్థయందే మానవుని జనన జీవన మరణముల యొక్క వ్యాకుల ఆడంబరము మఱియు భ్రాంతికి ఆవల విశుద్ధ ఆధ్యాత్మిక అస్తిత్వము సంభవ మని సన్న్యాసి తలపోయును. గీత ఈ మూడింటిలో తన స్థానమునుండి దేనిని త్రోసివేయదు-ఏలన అది సాంఘిక విధియొక్క అనుష్ఠానమును, సార్వజనీన కర్మలో పాల్గొనవలసిన మానవునికి ధర్మానుసరణమును ఒత్తి చెప్పును (2-47), అటులే ఉత్తమ ఆధ్యాత్మిక - నైతిక ఆదర్శములో అంతర్భాగముగా అహింసను ఆమోదించును (10-5), చివరకు ఆధ్యాత్మిక విముక్తికి ఒక మార్గముగా తపోమయ సన్న్యాసమును (18-52) గూడ గుర్తించును. అయినను గీత ఈ పరస్పర విరుద్ధ

స్థితు లన్నింటిని దాటి, సాహసముతో ముందుకు బోవును; సర్వజీవనము ఏకమాత్ర దివ్యపురుషునియొక్క ఒక అర్థయుక్త అభివ్యక్తియే యని చెప్పి, దానిని ఆత్మకు సమర్థించి చూపును, మఱియు అనంతునితో సాయుజ్యమున, అత్యున్న తాత్మతో సమస్వరముగాను, పరిపూర్ణ భగవంతునియొక్క ప్రకటనాత్మకముగాను జీవించు సంపూర్ణ ఆధ్యాత్మిక జీవితముతో సంపూర్ణ మానవ కర్మయొక్క అవిరోధమును, సుసంగతత్వమును గీత వక్కాణించి చెప్పును.

3. సత్త ఏకవిధము గాదు :

మన సత్తయొక్క సంకీర్ణత (complexity) నుండియు, దాని మూల తత్త్వము యొక్క అస్పష్టతనుండియు, దాని ధ్యేయమును, ప్రక్రియలను నిర్ణయించి, శాసించు ఆంతరతమ శక్తియొక్క గుహ్యత్వమునుండియు మానవ జీవితముయొక్క సమస్య లన్నియు ఉత్పన్నమగును. మన సత్త ఒకవేళ ఏకవిధమే యైనచో, అనగా కేవలము భౌతిక – ప్రాణికము గాని, కేవలము మానసికము గాని, కేవలము ఆధ్యాత్మికము గాని యైనచో, లేదా వీనిలో నొకదానిలో తక్కినవి అంతర్భూతముగా నైనను యుండినచో, లేదా మన అవచేతన లేక అతిచేతన భాగములలో సర్వథా సుప్తముగా నైనను యుండినచో, అపుడు మనకు భ్రమ కలిగించునదేదియు నుండదు; ఏలన అపుడు భౌతిక – ప్రాణిక నియమము అనివార్యమగును; అథవా మానసిక నియమము తన స్వీయ శుద్ధ అబాధిత తత్త్వమునకు విశదముగా నుండును; అథవా ఆధ్యాత్మిక నియమము ఆత్మకు స్వత్వఃసిద్ధము, స్వయంపర్యాప్తము నగును. ఉదాహరణకు, పశువులకెట్టి సమస్యలు తెలియవు; అటులే ఒక శుద్ధ మనోమయ లోకమున నివసించు మానసిక దేవత ఏ సమస్యకు నవకాశ మివ్వదు, అథవా తన సమస్యల నన్నింటిని ఒక విశుద్ధ మానసిక నియమము ననుసరించి గాని, ఒక హేతుప్రధాన సామరస్య మిచ్చు తృప్తినిబట్టి గాని పరిష్కరించుకొనును; పోగా అమిశ్రితాత్మ సమస్యలకు పైన, అనంతమునందు స్వయంసంతుష్టమై యుండును. కాని మానవ సత్త ఒక త్రివిధ జాలము, అది ఏకకాలమున మిక్కిలి గుహ్యముగా శారీరిక – ప్రాణికము, మానసికము మఱియు నాధ్యాత్మికము; మఱియు నీ మూడింటియొక్క యథార్థ సంబంధము లేవియో అతనికి దెలియవు, తన జీవితముయొక్క వాస్తవ సత్యత ఏదియో అతనికి దెలియదు, తన భవితవ్య మెటు లాగుచున్నదో తెలియదు, తన సంసిద్ధి ధామ మెచ్చటున్నదో తెలియదు !

4. శరీరావసరములు తీర్చక తప్పదు :

ద్రవ్యము మఱియు ప్రాణము మానవుని వాస్తవి కాధారము; దానినుండియే అతడు తన యాత్ర నారంభించును, దానిమీదనే అతడు నిలబడును మఱియు భువిపై, శ ము న అతడసలు వర్తింపగోరు నేని, దాని ఆవశ్యకతను, నియమమును అతడు పూరించక తప్పదు. భౌతిక మఱియు ప్రాణిక నియమ మన, పశ్చాజీవన (survival, తర్వాత జీవించుట) విధానము, సంఘర్ష విధానము, కామనా మఱియు కామనా ప్రాప్తి విధానము, స్వాధికార స్థాపనా విధానము మఱియు శరీర, ప్రాణ, అహంకార తర్పణవిధానము. మానవుని ఉచ్ఛతర శక్తులకు సాధ్యమగు ప్రపంచము నందలి బౌద్ధిక తర్క మంతయు, నైతిక ఆదర్శ వాదము మఱియు ఆధ్యాత్మిక నిరపేక్షతావాద (absolutism) మంతయు మన ప్రాణిక – భౌతిక అధారముయొక్క సత్యతను, ఆవశ్యకతను తుడిచివేయజాలవు, లేక మానవ జాతి ప్రకృతియొక్క అనివార్య నిర్బంధమునకు లోబడి, తదాధారము యొక్క లక్ష్యములను, ఆవశ్యకతల పరితృప్తిని అనుసరించుటను ఆపజాలవు, లేక మానవజాతి దాని ముఖ్య సమస్యలను మానవ భవితవ్యము, మానవ హితము మఱియు ప్రయత్నములలో ఒక గురుతర, న్యాయసమ్మత భాగ మొనరించుకొనుటను వారించజాలవు. ఆధ్యాత్మిక లేక ఆదర్శపరాయణ పరిష్కారములు సర్వమును పరిష్కరించును గాని, మన వాస్తవిక మానవ జీవనముయొక్క కఠోర సమస్యలను మాత్రము పరిష్కరించ జాల వని గ్రహించి, వానియందు తృప్తి నందక, మానవ బుద్ధి సైతము వానినుండి విముఖమై, ప్రాణిక మఱియు భౌతిక జీవనమును మాత్రమే ఆమోదించి, దాని అత్యంత సంభవ సామర్థ్యమును, క్షేమమును, సువ్యవస్థిత తృప్తిని హేతుబద్ధముగానో, సహజజ్ఞాన ప్రేరణచేతనో సాధింప గడంగును. హేతుశక్తి సంపన్న ప్రాణిక మఱియు శారీరిక సిద్ధికి సహజమగు జీవనసంకల్పము లేక అధికారప్రాప్తి సంకల్పముయొక్క సిద్ధాంతము మానవ జాతికి పరిగణిత ధర్మ మగును మఱియు తక్కిన దంతయు ఒక దాంభిక అసత్య మనియో, ఒక గౌణ వస్తువు, ఒక స్వల్పతర, సాపేక్ష పరిణామముయొక్క ఒక అముఖ్య ఫలిత మనియో తలంచబడును.

5. మనస్సు ఎక్కువ ఆంతరంగికము :

అయినను శరీరప్రాణములు, వాని కెంత పట్టు మఱియు ప్రాముఖ్య మున్నను, మానవుని సర్వసత్తయు గావు; మఱియు మనస్సు ప్రాణశరీరముల ఒక ఉపకరణము

మాత్రమే, అపుడపుడు తన సేవకు ప్రతిఫలముగా కొన్ని శుద్ధ మానసిక భోగముల అవకాశము దాని కివ్వబడును - అను మాటను సైతము అతడు పూర్తిగ నంగీకరించ జాలడు, అటులే మనస్సు ప్రాణి కావేగముయొక్క ఒక విస్తరణము మఱియు వికాసము, భౌతిక జీవనముయొక్క తృప్తి నాశ్రయించి యుండు నొక ఆదర్శవిలాస మనియు అతడు తలంచజాలడు. శరీర ప్రాణములకంటె నెంతో ఎక్కువ అంతరంగికముగా మనస్సు మానవుడై యున్నది మఱియు నది పెంపొందిన కొలది శరీరప్రాణములనే తన విశిష్ట పరితృప్తుల కొఱకును, తన స్వరూపసాక్షాత్కారము కొఱకును ఒక ఉపకరణము గావించుకొన దీక్షవహించును-ఈ ఉపకరణము ఆవశ్యకమేయైనను ఒక అనల్ప అవరోధము గూడను, లేనిచో (ఘర్షణ) సమస్యయే యుండదు. మానవ మనస్సు ఒక ప్రాణిక మఱియు భౌతిక ప్రజ్ఞ మాత్రమేగాదు, పరంతు (but) ఒక బౌద్ధిక, సౌందర్యమీమాంసక, నైతిక, ఆంతరాత్మిక, క్రియాశీల ప్రజ్ఞయు నగును, మఱియు తన ప్రవృత్తులయొక్క ప్రతిక్షేత్రమునందు వానియొక్క ఒక ఆదర్శరూపమును సాధింప ప్రయాసపడును, అదియే దాని ఉచ్ఛతమ, ప్రబలతమ స్వభావము; అయితే చక్రముగా నున్న ప్రాణము, ఆ రూపమును పూర్తిగా పట్టుకొని, మూర్తిమంతము గావించి, ఇచ్చట సర్వథా వాస్తవము చేయ నవకాశ మీయదు. మన ఆకాంక్షయొక్క ఆ మానసిక ఆదర్శ రూపము ఆంశికముగానే పట్టు వడిన ఒక ప్రకాశమయ లేక ప్రబల ఆదర్శముగనే నిలిచిపోవును; అయితే మనస్సు దానిని లోలోపల చక్కగా ప్రత్యక్షము గావించు కొనగలదు, లోలోపల తన ప్రయత్నమును శాసించు నట్లు చేసికొనగలదు, మఱియు ఆంశికముగా దానిని సాధించను గూడ సాధించగలదు, కాని జీవిత వాస్తవముల నన్నింటిని నిర్బంధించి ఆ ఆదర్శ రూపమున ఇముడ్చజాలదు. ఇట్లు బౌద్ధిక సత్యము మఱియు యుక్తికి సంబంధించిన ఒక ఆదర్శరూపము, ఒక అనివార్య విధానము గలదు, దీనిని మన బౌద్ధిక సత్త అన్వేషించును; అటులే ధర్మము మఱియు ప్రవర్తనకు సంబంధించిన ఒక ఆదర్శరూపము, ఒక అనివార్య విధానము గలదు, దీనిని మన సదసద్వివేక శక్తి (conscience) అన్వేషించును; ఇంకను ప్రేమ, సానుభూతి, కరుణ, ఏకతలకు సంబంధించిన ఒక ఆదర్శ రూపము, ఒక అనివార్య విధానము గలదు, దీనిని మన భావిక మఱియు ఆంతరాత్మిక ప్రకృతి లాలసతో అభిలషించును; తర్వాత హర్షము మఱియు సౌందర్యమునకు సంబంధించి ఒక ఆదర్శ రూపము, ఒక

అనివార్య విధానము గలదు, దీనికి మన సౌందర్య గ్రాహి సత్త పరితపించును; చివరకు లోలోపలి ఆత్మస్వామ్యము మఱియు జీవన సంయమమునకు సంబంధించిన ఒక ఆదర్శ రూపము, ఒక అనివార్య విధానము గలదు, దీనికొఱకు క్రియాశీల సంకల్పవ ప్రయాసపడును – ఇవి యన్నియు మనలో కలిసి యున్నవి మఱియు ప్రాణిక – దైహిక మనసు ఏప్రాప్తి మఱియు సుఖము, అటులే ఏ సురక్షిత దైహిక జీవనముపై పట్టుబట్టునో, వానికి సంబంధించిన ఆదర్శరూపము మఱియు అనివార్య విధానముతో తలపడును. మఱియు మానవ మనస్సు అన్నింటిమాట నటుంచి, వీనిలోనే యొక దానిని పూర్తిగా సాధించలేదు గావున, ప్రతి విభాగమునందు అనేక ప్రమాణములను, ధర్మములను నెలకొల్పును – సత్యము మఱియు యుక్తిని నిర్ణయించు ప్రమాణములు; ధర్మము మఱియు వర్తనమును; హర్షము మఱియు సౌందర్యమును; ప్రేమ, సానుభూతి మఱియు ఏకతను; ఆత్మస్వామ్యము మఱియు సంయమమును; సర్వరక్షణము, సంపత్తి, ప్రాణిక సామర్థ్యము మఱియు సుఖమును నిర్ణయించు ప్రమాణములు – మఱియు నా ప్రమాణములను జీవనముపై విధింప యత్నించును. ఆ భాసుర పరమ ఆదర్శములు ఎంతోపైన, మన శక్తికి అందని తావున వర్తించును మఱియు అసాధారణ వ్యక్తులు తమ యావచ్ఛక్తితో వానిని ఎక్కువెక్కువగా సమీపింతురు; కాగా సాధారణులు తక్కువ శోభాయమాన ఆదర్శము నొక దానిని, ఒకానొక సుప్రతిష్ఠిత, సుసాధ్య, సాపేక్షప్రమాణము ననుసరింతురు లేక అట్లు చెప్పుకొందురు. మొత్తముమీద మానవ జీవితము ఆదర్శముచేత ఆకర్షింపబడినను, (ఆచరణలో) దానిని పరిత్యజించును; తనదే యగు ఒక అస్పష్ట అనంతసత్తయొక్క బలమునందు అది ప్రచలితమగు నెట్టి మానసిక మఱియు నైతిక వ్యవస్థ నైనను ప్రతిఘటించి క్షీణింప జేయును అథవా భగ్నముచేయును. మఱియు నిట్లు గాక తప్పదు, కారణము, మనఃప్రాణములు రెండును ఒకదానిపై నొకటి పనిసేయు తత్త్వములే యైనను, అవి మిక్కిలి భిన్నములు మఱియు పృథగ్భూతములు లేక ప్రాణముయొక్క సంపూర్ణసత్యతాసూత్రము మనస్సునకు చిక్కలేదు. ఆ సూత్రమును ఒకానొక అధికతర వస్తువునందు, మానవజీవుని మానసికతా, నైతికతలకు పైన ఒకానొక అజ్ఞాత వస్తువునందు వెదకవలెను.

6. మతములు సైతము మార్చలేకపోయినవి :

మనస్సునకు స్వయముగా ఈ విధమగు ఒకానొక అతీత తత్త్వముయొక్క అస్పష్ట జ్ఞానము గలదు మఱియు తన ఆదర్శరూపముల అనుసంధానమునందు

అది వానిని తఱచుగా స్పృశించుట జరుగును. తనకు దగ్గరగను, లోపలను, ఆంతరతమముగ నుండియు నేది తనకంటె అమేయముగా నధికతరము, తననుండి అపూర్వముగా దూరగతము (13-16), తనకు పరమున అవస్థితమునగు ఒక స్థితిని, ఒక శక్తిని, ఒక సన్నిధిని మనస్సు క్షణకాలము దర్శించును; తనకంటెను ఎక్కువ సారభూతము, తన ఆదర్శములకంటె నెక్కువ నిరపేక్షము, ఘనిష్ఠము, అనంతము, ఏకము నగు ఒకానొక వస్తువుయొక్క ఆంతర్దర్శనము దానికి లభించుచుండును మఱియు నా వస్తువునే మనము భగవంతుడు, ఆత్మ లేక బ్రహ్మ యని పిలుతుము. ఇంతకు మనస్సు దీనినే పూర్తిగా తెలిసి కొనుటకును, ప్రవేశించుటకును, స్పృశించుటకును, చేజిక్కించుకొనుటకును ప్రయత్నించును, దానినే సమీపించగోరును లేక నదియే కాగోరును, దానితో నొక విధమగు ఐక్యమును బొందజూచును లేక ఆ 'ఆశ్చర్యముతో' (2-29) సంపూర్ణ తాదాత్మ్యమున తనను గోల్పోవ జూచును. కాని కఠినత ఏమన తన శుద్ధ తత్త్వమున ఈ బ్రహ్మము జీవి వాస్తవికతలనుండి మానసిక ఆదర్శములకంటెను గూడ ఎక్కువ దూరముగా నున్నట్లు తోచును; తన స్వీయ పరిభాషలోనికి - జీవన, కర్మల పరిభాష మాట నటుంచుడు - మనస్సు అనువదించజాలని వస్తు విది. కావుననే కఠోర నిరపేక్ష బ్రహ్మవాదులు మానసిక సత్తను నిరాకరింతురు మఱియు భౌతిక సత్తను గర్హింతురు, మఱియు నొక విశుద్ధ ఆధ్యాత్మిక సత్తనిమిత్తము అఱ్ఱులు చాతురు; చాచి, మనఃప్రాణముల యందు మనకు గల సత్త నంతను లయము - "నిర్వాణము" - జెందించి, ఆ మూల్యముతో ఆధ్యాత్మిక అస్తిత్వమును కొనుక్కొందురు. ఈ కఠోర బ్రహ్మవాదులకు (నిర్వాణము గాక) తక్కిన ఆధ్యాత్మిక ప్రయత్న మంతయు ఒక మానసిక సన్నాహము లేక సమాధానము (compromise), అనగా సాధ్యమైనంత మనఃప్రాణముల ఆధ్యాత్మికీకరణము మాత్రమే. మానవుని ప్రాణమయ సత్తయొక్క అధికారములచేతను, అతని జీవన, వర్తన, కర్మలచేతను లేవదీయబడిన సమస్యయే నిరంతరము అతని మనోవ్యాపారమును పట్టువిడువక బాధించు కఠినత; కావున ఈ సన్నాహక ప్రయత్నము ఆంతరాత్మిక మనస్సుయొక్క ఆధారముపై నైతిక మనస్సుయొక్క ఆధ్యాత్మికీకరణ దిశగానే ముఖ్యముగా సాగును; ఇట్లు ప్రాప్తించిన ఆధ్యాత్మిక శక్తి మఱియు శుద్ధతవలన నైతిక మనస్సు నడవడికి సంబంధించిన తన సత్య ధర్మముల ఆదర్శమును, ఆంతరాత్మిక మనస్సు ప్రేమ, సానుభూతి మఱియు ఏకతకు సంబంధించిన తన ఆదర్శమును జీవనముపై అధికతర ప్రామాణ్యముతో

ప్రయోగించగలుగును. ఈ ఆధ్యాత్మికీకరణముచేత, ఆత్మయొక్క నిరపేక్ష ఏకతకును, సర్వప్రాణులయొక్క మౌళిక ఏకతకును సంబంధించిన ఆధారభూత సత్యమునకు బుద్ధి మఱియు సంకల్పము ఇచ్చు సమ్మతివలన పై ఆదర్శములు ఒక అత్యున్నత అభివ్యక్తిని బొందుటకు సాయము లభించును, వానికి విశాలతమ, ప్రకాశమయ ఆధారము ప్రదత్తమగును. మానవుని సాధారణ మనస్సు యొక్క అభ్యర్థనలతో ఏదోవిధముగా ముడిపెట్టబడి నట్టియు, ఉపయుక్తమగు సామాజిక కర్తవ్యమును, సామాజిక ప్రవర్తనయొక్క ప్రచలిత నియమావళిని అంగీకరింప సుముఖముచేయబడి నట్టియు, పూజ, సంస్కారము మఱియు మూర్తి ప్రతిష్ఠచేత ఆకర్షణీయముచేయబడి నట్టియు ఇవ్విధమగు, ఆధ్యాత్మికతయే ప్రపంచ మహామతములయొక్క బాహ్యతత్త్వము. ఈ మతములు కొన్ని వైయక్తిక విజయములు సాధించును–ఒక ఉచ్చతర జ్యోతియొక్క ఒకానొక కిరణమును గొని వచ్చును, విశాలతరమగు ఒక ఆధ్యాత్మిక లేక అర్ధ – ఆధ్యాత్మిక విధానము యొక్క ఒకానొక ఛాయను జీవనముపై విధించును, కాని పరిపూర్ణ విజయమును సాధించజాలక, చివరకు ప్రత్యక్షముగా ఒక రాజీలోనికి దిగును మఱియు ఆ రాజీక్రియచేతనే జీవనరంగమున పరాజిత మగును. ఇట్లు జీవన సమస్యలు నిలిచి యుండుటయే గాక, అత్యుగ్రరూపమున విజృంభించును గూడ – దారుణ కురుక్షేత్ర సమస్య అట్లు విజృంభించినదే. ఆదర్శములను సాధింప జూచు బుద్ధియు, నైతిక మానసమును ఈ సమస్యలను సదా తొలగింప నాశించును – తమ స్వీయ ఆకాంక్ష నుండి జనించిన ఒక సుఖమయ ఉపాయము నావిష్కరించి, తమ స్వీయ ప్రబల నిర్బంధముచే దానిని శక్తియుక్తము గావించి, అది జీవితముయొక్క ఈ అధోముఖ, అమంగళ రూపమును రూపుమాపగలదని ఆశించును; కాని ఆ రూపము రూపు మాయక, నిలిచియే యుండును ! రెండవ వైపున ఆధ్యాత్మికీకృతమగు బుద్ధి మతము యొక్క వాణిద్వారా భవిష్యత్తున విజయశీలియగు ఒకానొక రామరాజ్య మేర్పడునని గట్టిగా వాగ్దానము చేయును, కాని ఈలోపల పార్థివ నిర్వీర్యతను గుఱించి తనకు చాలవఱకు నమ్మకము కలుగగా, ఆత్మ భువిపై బలాత్కారముగా ప్రవేశించిన పరదేశీయు డని నిర్ణయించుకొని, ఇట్లు ప్రకటించును : తుట్టతుదకు ఇచ్చట దైహిక వ్యష్టిజీవనమునందు గాని, మర్త్య మానవుని సమష్టి జీవనమునందు గాని కాక, ఒకానొక అజరామర పరతత్త్వమునందు విలసిల్లు స్వర్గము లేక నిర్వాణము నందు మాత్రమే మనము యథార్థ ఆధ్యాత్మిక అస్తిత్వమును (జీవనమును) కనుగొనగలము.

7. గీతచే జీవనసమస్యా పరిష్కారము :

ఇదిగో, ఇచ్చటనే గీత ప్రవేశించి, బ్రహ్మయొక్కయు, ఆత్మయొక్కయు, ఈశ్వరునియొక్కయు, ప్రపంచ ప్రకృతులయొక్కయు సత్యమును పునఃప్రతిపాదించును. ఉపనిషత్తులనుండి సేకరించి, తర్వాతి విజ్ఞానము పెంపొందించిన సత్యమును గీత విస్తృతపఱచి, దానికి నూతనాకృతి కల్పించి, జీవనము మఱియు కర్మల అసాధ్యసమస్యను పరిష్కరింప దాని పరిష్కారశక్తిని ప్రయోగించు ప్రయత్నమున సునిశ్చిత పదములతో ముందుకు బోవ సాహసించును. అయితే గీత చూపిన పరిష్కారము, ఆధునిక మనస్సున కా సమస్య ఏ రూపమున ప్రత్యక్షమగునో, ఆ రూపమున గల దాని చిక్కు నంతను విడదీయదు; గీతలో ఆ పరిష్కారము ప్రాచీన మనస్తత్త్వాని కనుకూలముగా ప్రతిపాదింపబడెను, సమష్టి ప్రగతిని గోరు ఇప్పటి మానవ మానసముయొక్క గట్టి పట్టున కది మార్గము జూపదు, అటులే తుట్టతుదకు ఒక అధికతర బౌద్ధిక మఱియు నైతికాదర్శమునకును, సంభవమగుచో, ఒక క్రియాశీల ఆధ్యాత్మి కాదర్శమునకును సైతము రూపమివ్వగల సమష్టి జీవనము నిమిత్తము ఇప్పటి మనస్సు చేయు ఆక్రోశమునకు గీత జవాబివ్వదు. దాని ఆహ్వానము సంపూర్ణ ఆధ్యాత్మిక జీవనమునకు సామర్థ్యము సంపాదించిన వ్యక్తికి మాత్రమే; తక్కిన జాతి కంతకు గీత ఒక క్రమగత ప్రగతిని విధించును, తక్కిన వారు నిష్ఠతో తమ స్వభావ ధర్మము (18-47) ననుసరించుచు, వివేకపూర్వకముగా ఉన్నతిని సాధించవలెను, ఆ సాధనలోనికి వారు ఎక్కువెక్కువగా వివేచనను, నైతిక లక్ష్యమును, చివరకు ఆధ్యాత్మిక ప్రవృత్తిని (turn) ప్రవేశపెట్టవలెను. గీతాసందేశము ఇతర (సాంఘిక, నైతిక, తాపసిక) పరిష్కారములనుగూడ ప్రస్తావించునుగాని, వానిని గీత అంశికముగా ఆమోదించినపుడు సైతము, వాని కావలనున్న ఒక ఉచ్చతర, సమగ్రతర సత్యము దిశగా వానికి దారి జూపుటకే వాని నామోదించును-ఆ సత్యమున ప్రవేశింప నింత వఱకు కొద్దిమంది వ్యక్తులు మాత్రమే తమ యోగ్యతను నిరూపించుకొని యున్నారు.

8. ప్రాణిక మనస్సునకు గీతాసందేశము :

ప్రాణిక మఱియు దైహిక జీవనము వెంటదగులు మనస్సునకు గీతాసందేశ మేమన, సమస్త జీవనము నిక్కముగా వ్యక్తియందు విశ్వశక్తియొక్క (7-6) ఒక అభివ్యక్తియే, ఆత్మనుండి వచ్చిన ఒక జన్యమే (2-17, 13-31), భగవంతునియొక్క ఒక కిరణమే (15-7); అయినను అది వాస్తవమున మాయావేషమున

మఱుగుపడియున్న (7-14) ఆత్మ మఱియు భగవంతునియొక్క ఆవృతరూపము మాత్రమే; కాగా అట్టి నిమ్నతర జీవనమును నిమ్నతర జీవనము నిమిత్తమే వెంటాడుట యన పతనకారక పథమున పాదుకొని పోవుటయే, మన ప్రకృతియొక్క తమోమయ అజ్ఞానమునకు పట్టముగట్టుటయే యగును గాని, జీవనముయొక్క యథార్థ సత్యమును, సంపూర్ణ ధర్మమును కనుగొనుట ఎంతమాత్రము గాదు. జీవన-సంకల్పము, అధికార-సంకల్పము యొక్కయు, కామనాతృప్తియొక్కయు, కేవల శక్తి బలముల ప్రకీర్తనముయొక్కయు, అహంకారము మఱియు దానియొక్క స్వైర ఆర్జన ప్రవృత్తియొక్కయు, అవిశ్రాంత స్వార్థ పరాయణ బుద్ధియొక్కయు నే సిద్ధాంతము గలదో, అది అసురుని సిద్ధాంతము మఱియు నది యొక ఘోర వినాశమునకును, అధఃపాతమునకును మాత్రమే దారితీయగలదు. ప్రాణప్రధాన మఱియు నుదరపరాయణ మానవుడు తనను శాసించుటకు ఒక ధార్మిక, సామాజిక మఱియు నాదర్శపరాయణ ధర్మము నంగీకరించవలెను; ఆ ధర్మముచేత నతడు కొన్ని సముచిత నియమములకు లోబడి తన కామనను, ప్రయోజనమును సాధించుకొనుచునే, తన నిమ్నతర వ్యక్తిత్వమునకు శిక్షణ గఱపి, దానిని వశము గావించుకొన గలడు మఱియు వ్యక్తిగతము, సామాజికము - ఉభయవిధమగు జీవనముయొక్క ఒక ఉచ్చతర నియమముతో సావధానముగా దానికి శ్రుతికలుప గలడు.

9. బౌద్ధిక మనస్సునకు గీతాసందేశము :

ఏ మనస్సు బౌద్ధిక, నైతిక మఱియు సామాజిక ప్రమాణములను అనుసరించుట యందు లగ్నమై యుండునో, ఏ మనస్సు ప్రతిష్ఠిత ధర్మములను, నైతిక నియమమును, సాంఘిక విధి మఱియు వృత్తిని గాని, విముక్త ప్రజ్ఞ చూపు పరిష్కారములను గాని పాలించుటద్వారా విముక్తిని బొందవలె నని పట్టు బట్టునో, ఆ మనస్సునకు గీతాసందేశ మేమన, నిక్కముగా నది యొక మిక్కిలి ఆవశ్యక దశయే; ధర్మమును తప్పక పాలించవలసినదే, కారణము, సరిగా పాలించినపు డది అంతరాత్మ ప్రాబల్యమును పెంచి, ఆధ్యాత్మిక జీవనమునకు సన్నాహము గావించి, సాయపడగలదు, కాని అట్లయినను ఈ ధర్మపాలనమే జీవితముయొక్క సంపూర్ణ, చరమ సత్యము గాదు. మానవుని అంతరాత్మ ఇంకను ముందుకు వెళ్ళి, మానవుని ఆధ్యాత్మిక మఱియు అజరామర ప్రకృతియొక్క ఇంకను ఎక్కువ నిరపేక్షమగు ఒకానొక ధర్మమును చేరుకొనవలెను. మఱియు నట్లు చేరుకొనగలుగుటకు, మనము నిమ్నతర

మానసిక తత్త్వముల అజ్ఞాన మయ రచనలను, అహంకారిక వ్యక్తిత్వముయొక్క అనృతత్త్వమును అడచివేసి, వదిలించుకొనవలెను; ప్రజ్ఞా, సంకల్పములను క్రియను నిర్వ్యక్తికము చేయవలెను; అన్నింటియందును గల ఏకాత్మయొక్క తాదాత్మ్యమున నివసించవలెను; మఱియు అహం - మూసలను భేదించి వెలువడి, నిర్వ్యక్తికాత్మలో ప్రవేశించవలెను. మనస్సు త్రివిధ నిమ్నప్రకృతియొక్క ప్రతిబంధక నిర్బంధమునకు లోబడి వర్తించుచు, తామసిక, రాజసిక, లేక ఉన్నత స్థానమున సాత్త్విక గుణముల ననుసరించి, తన ప్రమాణములను నెలకొల్పుకొనును; కాని అంతరాత్మ భవితవ్య మొక దివ్య సంసిద్ధి మఱియు విమోక్షము, మఱియు దానికి మన అత్యున్న తాత్మయొక్క స్వతంత్రతయే ఆధారము కాగలదు, మఱియు ఆత్మయొక్క విశాల నిర్వ్యక్తికత మఱియు విశ్వమయత ద్వారా మనస్సును అతిక్రమించి, సర్వధర్మములకు పరమున (7-13) విరాజిల్లు అపరిమేయ భగవంతుడు మఱియు పరమోన్నత అనంతుని యొక్క సమగ్ర జ్యోతియందు ప్రవేశించి నపుడే ఆ సంసిద్ధి రూపొందగలదు.

10. సన్యాసపరాయణ మనస్సునకు గీతా సందేశము :

ఎవరు అనంతుని యొక్క అక్షరతత్త్వ - ఉపాసకులో, ఎవరు నిర్వ్యక్తికతను చరమావధివఱకు గొనిపోవుదురో, ఎవరు జీవనము మఱియు కర్మయొక్క నిర్వాణము నిమిత్తము ఇతరమును సహించలేని ఆవేగమును లోపల పోషించుకొందురో మఱియు నెవరు అనిర్వచనీయ బ్రహ్మముయొక్క విశుద్ధ మౌనమునందు వైయక్తిక సత్త నంతను ప్రయాసపూర్వకముగా లయముజేయుటయే తమ పరమ లక్ష్యము మఱియు నాదర్శముగా గల్గి యుందురో, అట్టివారికి గీతా సందేశ మేమన, నిజమే, పయనించి అనంతునిలో ప్రవేశించుట కిది యొక మార్గమే (12-4), కాని మిక్కిలి కఠినమార్గము; (12-5) ఉపదేశము లేక దృష్టాంతముద్వారా నిష్క్రియతా - ఆదర్శమును ప్రపంచముముం దుంచుట మిక్కిలి అపాయకరము (3-24); ఇది ఉత్కృష్ట మార్గమే యైనను, మానవునకు ఉత్తమ మార్గము మాత్రము గాదు మఱియు ఈ జ్ఞానము సత్యమే యైనను, సమగ్రము మాత్రము గాదు. పరమ పురుషుడు, సర్వ-చేతన ఆత్మ, పరమేశ్వరుడు, అనంతుడు దూరస్థము, అనిర్వచనీయము నగు ఒక ఆధ్యాత్మిక సత్త మాత్రమే గాడు; అతడు విశ్వమునందు గుప్తముగా నుండియు, తోడ్తోడ మానవుడు మఱియు దేవతల ద్వారాను, సర్వభూతముల ద్వారాను, ఉన్న సర్వము నందును ప్రకటమగుచున్నాడు. మఱియు నేదియో నిర్వికార మౌనమునందు మాత్రమే

గాక, ప్రపంచమునందును, దాని జీవులయందును మఱియు సమస్త సత్తయందును, సమస్త ప్రకృతియందును అతనిని కనుగొనుటచేతనే, అటులే బుద్ధి సంకల్ప హృదయ ప్రాణముల క్రియాకలాపము లన్నింటిని అతనితో అత్యున్నత సంయోగములోనికే గాక, అతిసమగ్ర సంయోగములోనికిని లేవనెత్తుటచేతనే మానవుడు ఆత్మ మఱియు భగవంతునికి సంబంధించిన తన ఆంతర ప్రహేళికను (riddle), తన సక్రియ మానవ జీవనమునకు సంబంధించిన బాహ్య సమస్యను పరిష్కరించుకొనగలడు. ఈ సంయోగమువలన భగవత్సదృశుడుగా చేయబడి, భగవంతు డగుచు, ప్రేమ జ్ఞానములకు తీసిపోని కర్మద్వారా ఒక పరమ ఆధ్యాత్మిక చేతనయొక్క అనంత ప్రాణము నతడు ఉపభోగించగలడు. ఇపుడు అమరుడు, ముక్తుడు నగు నతడు ఆ పరమోచ్ఛ స్థానమునుండి తన మానవ కర్మను సాగించగలడు మఱియు దానిని ఒక పరమ మఱియు సర్వ-సమగ్ర దివ్య కర్మకలాపము లోనికి రూపాంతరము జెందించ గలడు - అదియే నిక్కముగా ఇచ్చట జరుగు సమస్త కర్మలు, జీవనము, యజ్ఞము మఱియు ప్రపంచ ప్రయాసముయొక్క చరమ ఫలము మఱియు పరమ అర్థము.

11. సామూహిక సిద్ధికి సైతము గీతాయోగము :

ఈ సర్వోన్నత సందేశము మున్ముందుగా ఎవరికి దీని ననుసరించ శక్తి గలదో, వారికి ఉద్దేశింపబడినది - వీరు శ్రేష్ఠమానవులు, మహితాత్ములు, ఈశ్వర-జ్ఞానులు, ఈశ్వర-కర్ములు, ఈశ్వర-భక్తులు; వీరు భగవంతునియందు, భగవంతునికొఱకు నివసించగలరు మఱియు ప్రపంచమున సంతోషముగా అతనికొఱకు తమ కర్మ నిర్వహించగలరు మఱియు ఆ కర్మ మానవ మానసముయొక్క సంక్షుబ్ధ అంధకారమునకును, అహంకారముయొక్క మిథ్యాపరిమితులకును పైన చెలగు దివ్యకర్మ. అదే సమయమున మఱల గీత ఇట్లు ప్రకటించును: తమ కా సంకల్ప మున్నచో అధమాధములు, పాపిష్ఠ మానవులు సైతము (9-32) ఈ యోగమార్గమున ప్రవేశించ గలరు - ఇచ్చట మనకు ఒక విశాలతర ప్రతిజ్ఞయొక్క ఆశాకిరణము గన్పించును, సిద్ధికి సామూహిక రూప మివ్వగోరు మన ఆశాభావమునకు సైతము దీనిని విస్తరింప జేసికొనవచ్చును. ఏలన వ్యక్తులకు ఆశ యున్నచో, జాతికి మాత్రము ఎందు కుండ గూడదు? మఱియు యథార్థ ఆత్మసమర్పణయు, అంతర్నివాసి భగవంతుని యందు ఏకాంత (absolute), నిరహంకార విశ్వాసమును ఉన్నచో, ఈ మార్గము నందు విజయము నిశ్చితము. కావలసినది నిర్ణాయకమగు మలుపు;

అంతఃపురుషుని యందు ఒక సుస్థిర విశ్వాస ముండవలెను; భగవంతునిలో నివసించుటకును, ఆత్మయందు అతనితో ఏకముగా నుండుటకును మఱియు ప్రకృతియందు - ఇచ్చట సైతము మన మతని సత్తయొక్క ఒక సనాతనాంశమే (15-7) - అతని మహత్తర ఆధ్యాత్మిక ప్రకృతితో నేకముగా వర్తించుటకును (14-2) ఒక దృఢ, హృదయపూర్వక సంకల్ప ముండవలెను, మన సర్వాంగములందును భగవదావిష్టులము, భగవత్ సదృశులము గావలెను (14-2).

12. కావలసిన సజీవ సాధనాంశము :

గీత తన సిద్ధాంతముయొక్క క్రమగత ప్రతిపాదనయందు ప్రకృతి నిర్ణాయకత్వము (3-33), విశ్వరూప అభివ్యక్తి యొక్క మార్మికార్థము (5-29), విముక్త ఆత్మయొక్క అంతిమ స్థితి (12-8) - ఇత్యాది అనేక సమస్యలనులేవనెత్తును మఱియు ఈ సమస్యలు అనంత, అనిర్ణాయక వాదవివాదానికి విషయములు. గీతయొక్క సారతత్త్వమును పరీక్షించి, విస్పష్టముగా ప్రతిపాదించుటయు, మానవజాతియొక్క చిరస్థాయి ఆధ్యాత్మిక విజ్ఞానమునకు దాని అనుదానమును మఱియు సజీవ సాధనారూపమగు దాని హృదయమును వెలికిదీసి చూపుటయు ఈ వ్యాసపరంపరయొక్క ఉద్దేశ్యము; కావున ఈ చర్చలలోనికి లోతుగా దిగుట మన కావశ్యకము గాదు; అటులే దాని దృక్కోణము లేక నిర్ణయములతో మన మెక్కడ ఏకీభవించకపోవచ్చునో, ఎచ్చట మనమిచ్చు సమ్మతిలో ఎట్టి మినహాయింపులు చేయవచ్చునో, లేక తర్వాత తర్వాత లభించిన అనుభవబలముతో దాని దార్శనిక బోధనను గాని, దాని యోగసాధనను గాని మన మెక్కడ దాటి పోవచ్చునో, దానినంతను విచారించ నవసరము లేదు. నిత్యాన్వేషకుడు, నిత్యావిష్కారకుడు నయిన మానవునికి గీత ఇప్పటికిని గొనివచ్చు సజీవ సందేశముయొక్క సూత్రీకరణముతో ఈ గ్రంథమును ముగించిన సరిపోవును; ఏలన ఆ సందేశ మతనిని తన ప్రస్తుత భ్రమణములద్వారాను, తన ఆత్మయొక్క జ్యోతిర్మయ శిఖరములకు తన జీవితముయొక్క సంభవనీయ దుష్కర ఆరోహణద్వారాను తన గమ్యమునకు నడుపగలదు.

24. గీతాసందేశము

1. జీవనసమస్యకు ఏకైక పరిష్కారము :

గీతాసందేశమును దివ్యగురు వచనములలో సంగ్రహముగా నిట్లు చెప్పుకొన వచ్చును : "ఏది సమస్త జీవనము మఱియు అస్తిత్వములయొక్క రహస్యమో, అదియే కర్మరహస్యము గూడను (10-8). అస్తిత్వము - జగ దస్తిత్వము - దేనియందు అంతరాత్మ ఒక క్షణము గాని, కొన్ని యుగములు గాని తగుల్కొని యున్నదో (14-5) అట్టి ఒక ప్రకృతి యంత్రాంగము, ఒక నియమచక్రము మాత్రమే గాదు; పరంతు అది ఆత్మయొక్క ఒక సంతత అభివ్యక్తి (2-17). మఱియు జీవనము - జీవించుట - జీవనముకొఱకే గాదు, పరంతు భగవంతుని కొఱకు (8-4), మఱియు మానవుని జీవదాత్మ భగవంతుని ఒక సనాతనాంశము (15-7). పోగా కర్మ ఆత్మదర్శనముకొఱకు, ఆత్మ పరిపూర్తి కొఱకు, ఆత్మపరిపాకము కొఱకు గాని, నేడు లేక రేపు ప్రాప్తించు దాని స్వీయ, బాహ్య, గోచర ఫలములనిమిత్తమే గాదు (2-51), సర్వ వస్తువులకు ఒక ఆంతర ధర్మము మఱియు అర్థము నుండును; అవి ఆత్మయొక్క అభివ్యక్త ప్రకృతిని వలెనే దాని పరమ ప్రకృతి నాశ్రయించి యుండును; కర్మసత్యము దానియందు నిహితమై యుండును (18-61) మఱియు నది మనస్సు మఱియు దాని క్రియయొక్క బాహ్యాకారములందు అనుషంగికముగాను, అపూర్ణముగాను మాత్రమే తెలుపబడును మఱియు దాని కజ్ఞానము మాఱు వేషము కల్పించును. కావున నీ స్వీయ ఉచ్ఛతమ మఱియు ఆంతరతమ సత్తను గనుగొని, దానియందు నివసించుటయే, మఱియు నెట్టి బాహ్య ప్రమాణము మఱియు ధర్మము ననుసరించకపోవుటయే పరమ, దోషరహిత, వ్యాపకతమ కర్మధర్మ మగును. అంతదనుక సమస్త జీవనము మఱియు కర్మ ఒక అపూర్ణత, ఒక కష్టము, ఒక సంఘర్షము, ఒక సమస్య గాక తప్పదు. నీ సత్య ఆత్మను గనుగొని, దాని యథార్థ సత్యము మఱియు దాని వాస్తవిక వస్తుస్వరూపము ననుసరించి జీవించి నపుడే, ఆ సమస్యను ఆంతిమరూపమున పరిష్కరించగలవు, ఆ కష్టము మఱియు సంఘర్షమును తరించగలవు మఱియు మన కర్మలు నూతనోపలబ్ధమైన ఆత్మ మఱియు ఆత్మసత్త యొక్క భద్రతయందు దివ్యప్రామాణ్యముగల కర్మలలోనికి మాఱగలవు. కావున నీ ఆత్మ నెఱుంగుము; నీ ఆత్మ భగవంతు డనియు, అందరి ఆత్మ యనియు నెఱుంగుము;

నీ జీవాత్మను భగవంతుని ఒక అంశముగా నెఱుంగుము. ఇక నీకు తెలిసిన దానియందు నివసింపుము; నీ ఆత్మయందు నివసింపుము, నీ పరమ ఆధ్యాత్మిక ప్రకృతియందు నివసింపుము, భగవంతునితో యోగయుక్తుడవు, భగవత్సదృశుడవు గమ్ము. ఎవడు నీయందు పరమోన్నతుడు మఱియు నేకమాత్రుడో, అటులే జగత్తునందు ఎవడు పరమోన్నతుడు మఱియు నేకమాత్రుడో, ముందు అతనికి నీ కర్మల నన్నింటిని ఒక యజ్ఞముగా నివేదింపుము; తుదకు ప్రపంచమున తన స్వీయ సంకల్పమును, కర్మను పరమ మఱియు వైశ్వ పురుషుడు నీ ద్వారా నిర్వహించుకొనుటకు నీ సత్త నంతను, నీవు చేయు దాని నంతను అతని హస్తములలోని కర్పించివేయుము. ఇదిగో, ఇదియే నేను నీముందుంచునట్టి పరిష్కారము మఱియు చివరకు మఱియొక పరిష్కారమే లేదని నీవు కనుగొనెదవు. (3-30, 31, 32).

2. "పురుషుడు శ్రద్ధామయుడు" :

సమస్త భారతీయ శాస్త్రము వలెనే గీతయు ఏ మూలభూత విరోధము నాశ్రయించి తన ఉపదేశము జేయునో, దాని నిచ్చట ప్రతిపాదించుట ఆవశ్యకము. ఈ యథార్థ ఆత్మయొక్క దర్శనమును, మన లోపలను, సర్వములోపలను వర్తించుచున్న భగవంతుని జ్ఞానమును ఒక సామాన్య సులభ వస్తువు గాదు; మఱియు నొకవేళ నది మనస్సుచే చూడబడినను, దానిని మన చేతనయొక్క ద్రవ్యము (stuff) గాను, మన కర్మయొక్క సంపూర్ణ నిబంధనము గాను మార్చుటయు సులభము గాదు. సమస్త క్రియయు మన సత్తయొక్క కార్య సాధక అవస్థచేత నిర్ణయింపబడును మఱియు నీ కార్యసాధక అవస్థ సంతత ఆత్మ దర్శియగు సంకల్పము చేతను, సక్రియ చేతనచేతను, తన కాధారమగు గతిమయ (kinetic) వృత్తిచేతను నిర్ణయించ బడును. మన స్వరూపమును, ప్రపంచముతో మన సంబంధముల అర్థమును మన సంపూర్ణ సక్రియ ప్రకృతిలో నెట్లు చూచుచున్నామో మఱియు నమ్ముచున్నామో, అదియే, అనగా మన విశ్వాసమే, మన శ్రద్ధయే (17-3) మన స్వరూపరూపమును నిర్మించును. కాని మానవచేతన ద్వివిధము మఱియు నది సత్తయొక్క ద్వివిధ సత్యమును బోలియుండును; ఏలన ఆంతర వస్తుతయొక్క సత్యము, బాహ్య రూపముయొక్క సత్యము - రెండు సత్యములు గలవు. మానవుడు బాహ్యరూపమున నివసించు నపుడు మానవ అజ్ఞానమున వాసము చేయు మనస్సుగను, ఆంతర వస్తుత (reality) యందు నివసించు నపుడు దివ్య జ్ఞానమున ప్రతిష్ఠితమగు అంతరాత్మగను వర్తించును.

3. మానసిక జీవుడు ప్రకృత్యధీనుడు :

తన బాహ్య రూపమున జగత్ సత్యము, మనము దేనిని ప్రకృతి యని పిలుతుమో, కేవలము నదియే యగును. ఆ ప్రకృతి యొక శక్తి; అదియే సత్తయొక్క సమస్త నియమముగను, యంత్ర వ్యవస్థగను పని చేయును; అదియే మనస్సు మఱియు ఇంద్రియముల విషయమగు ప్రపంచమును సృజించును; మఱియు నదియే జీవునకును, అతడు నివసించు బాహ్య ప్రపంచమునకును సంబంధమును గల్పించు సాధనముగా మన ఇంద్రియములను గూడ సృజించును. ఈ బాహ్యరూపమున మానవుడు తన అంతరాత్మ, తన మనస్సు, తన ప్రాణము, తన శరీరములందు ప్రకృతిమయ ఒక ప్రాణిగా గోచరించును, అతడు ఇతరులనుండి తన శరీర, ప్రాణ, మనస్సులయొక్కయు, విశేషించి తన అహంబుద్ధియొక్కయు పార్థక్యముచేత వేఱుచేయబడును - ఈ సమస్త ప్రబల పార్థక్యము మఱియు విభేదమును గాంచు తన చేతనను దృఢపఱచి, కేంద్రభూతము గావించుకొను నిమిత్తము తన కీ అహంబుద్ధిరూపమగు సూక్ష్మ యంత్రాంగము కల్పించబడును . అతనియందలి సమస్తము, అనగా నతని ప్రాణశరీరముల క్రియవలెనే అతని మానసికాత్మయు, దాని క్రియయు గూడ అతని <u>ప్రకృతి</u> నియమము చేతనే నిర్ణయించ బడును, దానిని దాటిపోజాలదు, అన్యథా పనిచేయజాలదు - అను నది మిక్కిలి స్పష్టమే. నిజమే, అతడు తన స్వీయేచ్ఛకు, తన అహంకారేచ్ఛకు ఒక స్వేచ్ఛ గలదని తలంచును; కాని నిజాని కది లేనట్లే, ఏలన అతని అహంకారము ఒక బోధము (sense) మాత్రమే, అది ప్రకృతి అతనికి కల్పించిన రూపముతో, అతని పరివర్తనశీల మనఃప్రాణశరీరములతో నతడు తాదాత్మ్యము జెంద నిర్బంధించును, అంతే. అతని అహంకారము స్వయముగా ఆమె క్రియలయొక్క ఒక ఉత్పత్తియే, మఱియు అతని అహంకారముయొక్క స్వభావమును బట్టియే దాని సంకల్పముయొక్క స్వభావ ముండును మఱియు నట్టి సంకల్పమును బట్టియే అతడు కర్మ చేసితీరును గాని, అన్యథా చేయజాలడు.

4. "ప్రకృతినుంచి పుట్టిన వాడను" :

కావున నిదియే మానవునికి తనను గుఱించి గల చేతన, ఇదియే తన స్వీయసత్తయందు విశ్వాసము - నేను ప్రకృతినుంచి పుట్టిన ఒక ప్రాణిని, వేఱుపడి యుండు ఒక అహంకారమను, ప్రకృతి గీచిన గిఱిలో, నా జీవితమునందు ఆమెకు

గల ఆశయముతో, లేక ఆమె విధించిన నియమముతో సుసంగతమగు కొన్ని సంబంధములను మాత్రమే ఇతరులతోను, ప్రపంచముతోను నేను ఏర్పరచుకొందును, అట్టి స్వీయ వికాసమును మాత్రమే సాధించుకొందును, మనస్సుయొక్క అట్టి సంకల్పమును, కామమును, భావమును మాత్రమే తృప్తిపఱచుకొందును - అని మానవుని విశ్వాసము.

5. నేను ఆత్మ నను రెండవ విశ్వాసము :

కాని మానవుని చేతనలో ఈ కఠోర సూత్రమునందు ఇముడని మఱియొక అంశ మున్నది; జీవితముయొక్క ఇతరము, ఆంతరమునగు మఱియొక సద్వస్తువు నందు అతనికి నమ్మకము గలదు, అది అంతరాత్మ వికసించిన కొలది వృద్ధి నందును. ఈ సద్వస్తువునందు జీవితసత్య మిక ప్రకృతి గాక, ఆత్మ మఱియు సత్త యగును, అది ప్రకృతి గాక పురుషుడగును. ప్రకృతి ఈ పురుషుని శక్తి మాత్రమే. అన్నింటి యందును ఏకమాత్ర మగు సత్త, ఆత్మ, పురుషుడు ఈ విశ్వమునకు అధీశ్వరుడు, విశ్వము అతని ఒక ఆంశిక అభివ్యక్తి మాత్రమే (10-42). ఆ ఆత్మయే ప్రకృతి మఱియు నామె కర్మయొక్క భర్త యగును, అనుమంత యగును (13-23), అట్టి ఆత్మచేతనే ప్రకృతినియమము అనివార్యము మఱియు ప్రకృతిశక్తియు, దాని విధానములును క్రియాన్వితములు నగును. ఆమె లోని ఈ ఆత్మయే జ్ఞాత (క్షేత్రజ్ఞుడు) (13-2); కాగా ఈ జ్ఞాతయే ఆమెకు ప్రకాశమిచ్చి, మనయందు ఆమెను సచేతనము గావించును; అంతర్యామియు, అతిచేతనము నగు అతని సంకల్పమే ఆమె క్రియా కలాపము నంతను ప్రేరించి, నడుపును. ఆ భగవంతుని యొక్క ఒక అంశమే యగు మానవునియందలి అంతరాత్మ ఆయన ప్రకృతినే పంచుకొనును. పోగా, మన ప్రకృతి మన అంతరాత్మయొక్క అభివ్యక్తి మాత్రము, దాని (అంతరాత్మ) అనుమతి చేతనే వర్తించును మఱియు దాని నిగూఢ ఆత్మజ్ఞానమునకును, దాని ఆత్మ చేతస్సునకును, తన చలనములు, రూపములు మఱియు మార్పులందు దాని జీవన సంకల్పమునకును రూపము కల్పించును.

6. రెండవ విశ్వాసమున నూతన జీవితము :

మనయొక్క వాస్తవ అంతరాత్మయు, ఆత్మయు మన బుద్ధికి మఱుగు నందుండును; ఆంతర వస్తువులను గుఱించిన దాని అజ్ఞానమును, దాని

మిథ్యాతాదాత్మ్యమును, మనఃప్రాణశరీరముల బాహ్య యాంత్రికతయందు దాని విలీనతయు అందుకు గారణము. కాని మానవుని సక్రియ ఆత్మ ఒకసారి ప్రాకృత ఉపకరణములతో తనకు గల ఈ తాదాత్మ్యము నుండి వెనుదగ్గి, అంతర వాస్తవము (reality)ను గాంచుచు, దానికి సంబంధించిన సంపూర్ణ విశ్వాసమునందు నివసింప గల్గుచో, అపుడు సర్వము నూతన రూపము ధరించును – జీవనము మఱియు అస్తిత్వము నూతన రూపము ధరించును, కర్మ ఒక విభిన్న అర్థమును, స్వభావమును సంతరించుకొనును. అప్పుడిక మన సత్త ప్రకృతి నిర్మాణ మగు క్షుద్రాహంకారముగా నుండక, ఒక దివ్య, అజరామర, ఆధ్యాత్మిక శక్తియొక్క మహత్త యగును; మన చేతన ఈ పరిచ్ఛిన్న, సంఘర్ష శీల మానసిక మఱియు ప్రాణిక జీవియొక్క చేతనగా నుండక, ఒక అనంత, దివ్య, ఆధ్యాత్మిక చేతన యగును; మన సంకల్పము మఱియు కర్మ ఈ సీమిత వ్యక్తి త్వము మఱియు దానియొక్క అహంకారమునకు జెందినవిగా నుండక, ఒక దివ్య, ఆధ్యాత్మిక సంకల్పము మఱియు కర్మ యగును – మానవ రూపముద్వారా స్వేచ్ఛగా వర్తించు విశ్వమయుడు, పరమపురుషుడు, సర్వాత్మ మఱియు పరమాత్మయొక్క సంకల్పము మఱియు శక్తి యగును.

7. విశిష్టులకే దివ్యజీవ నాహ్వానము :

"ఇదియే మహాపరివర్తనము మఱియు రూపాంతరము," అని చెప్పి, మానవునియందలి భగవంతుడు, అవతార పురుషు డగు దివ్యగురువుయొక్క సందేశము ముందుకు నడుచును – "ఇందు నిమిత్తమే నేను విశిష్టులను పిలుచుచున్నాను, పోతే ఎవరు ప్రకృతినిర్మిత కరణముల అజ్ఞానము నుండి మఱలించి, తమ ఇచ్ఛను అంతరాత్మయొక్క గభీరతమ అనుభవ మునకును, లోపలి ఆత్మ మఱియు సత్తను గుఱించిన వాని జ్ఞానమునకును, భగవంతునితో దాని సంపర్కమునకును, పురుషోత్తమునిలో ప్రవేశింప దానికి గల శక్తికిని త్రిప్పుదురో, అదిగో వారు విశిష్టులు, ఈ విశ్వాసమును, ఈ మహత్తర నియమమును ఆమోదించువా రందరును విశిష్టులే, 'ఇష్టులే' (18-54). ఏ మానవ బుద్ధి తన అజ్ఞానమునుండి జనించిన అస్పష్ట రూపములందును, అర్థప్రకాశము లందును, మానవుని మానసిక, స్నాయవిక (nervous) మఱియు దైహిక విభాగముల అస్పష్టతర అభ్యాసములందును సక్తమై యుండునో, అట్టి బుద్ధి కీ ఆమోదము మిక్కిలి కఠినమే; కాని ఒక్కసారి ఆమోదింపబడు నేని, అది యొక సునిశ్చిత, సముద్ధారక మహామార్గ

మగును, కారణము, అది మానవ సత్తయొక్క యథార్థ సత్యముతో ఏకము మఱియు అభిన్నము, మఱియు నది అతని ఆంతరతమ మఱియు పరమ ప్రకృతియొక్క యథాభూత వ్యాపారము.

8. భేదజ్ఞానమునుండి ఏకతాజ్ఞానమునకు :

(దివ్యగురువు తన సందేశ మును కొనసాగించును) "కాని ఇదియొక చాల పెద్ద మార్పు, ఒక అతిమహా పరివర్తనము: నీ సమస్త సత్తాప్రకృతులను పూర్తిగా మఱలించి, మార్చివేయనిదే, దాని సాధించ జాలవు. అందునిమిత్తము సర్వోన్నతునికి, దేనికిని గాక సర్వోన్నతునికి మాత్రమే, నీ ఆత్మ, నీ ప్రకృతి, మఱియు నీ జీవితముల యొక్క సంపూర్ణ నివేదన మావశ్యక మగును; కారణము, ఆ పరమునికొఱకే నీవు సర్వమును ధరించవలెను, దేని నైనను, అది భగవంతునియం దున్న రూపమున దప్ప, భగవంతుని ఒక రూపముగా దప్ప, భగవంతునికొఱకు దప్ప, నీవు ఆమోదించ గూడదు. అటులే ఒక నూతన సత్యమునకు ప్రవేశ మిచ్చు టావశ్యక మగును, అనగా తాను మఱియు పరులు, విశ్వము మఱియు భగవంతుడు, అంతరాత్మ మఱియు ప్రకృతులను గుఱించిన ఒక నూతన జ్ఞానము దిశగా, ఒక ఏకతా జ్ఞానము దిశగా, వాసుదేవః సర్వ-మను జ్ఞానము దిశగా నీ మనస్సుయొక్క సంపూర్ణ పరివర్తన మావశ్యక మగును. ఈ జ్ఞానము మొదట బుద్ధియొక్క ఒక ఆమోదముగా నుండును గాని, చివరి కది ఒక అంతర్దర్శన మగును, ఒక చేతన యగును, అంతరాత్మయొక్క ఒక శాశ్వత స్థితియు, దాని క్రియాధారము నగును.

9. పరివర్తనకు పూర్ణయోగావశ్యకత :

"ఈ నూతన జ్ఞానమును, అంతర్దర్శనమును, చేతనను తన క్రియాహేతువు, ఏకమాత్ర క్రియాహేతువు గావించు కొనునట్టి సంకల్పమును ఆవశ్యకమగును. మఱియు నది అనిష్టము, పరిమితము నగు ఒకానొక క్రియాహేతువు మాత్రమే గాక, ఏ కొలది ఆవశ్యక ప్రకృతి కృత్యములకో, సాంప్రదాయిక సిద్ధికి సహాయకముగా దోచునట్టి, ఒక మత ప్రవృత్తికి ఉచితమగునట్టి ఏ కొలది వస్తువులకో, లేక ఒక వైయక్తిక విముక్తికో సంబంధించిన క్రియాహేతువు మాత్రమే గాక, సమమగు ఆత్మచే (2-48) చేపట్టబడి, భగవంతునికొఱకును (11-55), సర్వభూతహితార్థమును (3-20) చేయబడు సర్వమానవ క్రియకును హేతువు గావలెను. ఇంకను పరమ

పురుషుని గోరు ఒక అనన్య ఆకాంక్షయందును, దివ్యపురుషుని పట్ల ఒక అనన్య ప్రేమయందును, ఒక అనన్య భగవదారాధనయందును హృదయమును పైకెత్తుటయు ఆవశ్యకమగును. మఱియునిట్లు ప్రశాంతము, ప్రకాశపూర్ణము చేయబడిన హృదయము సర్వభూతముల యందును గల భగవంతుని ఆలింగనము గావించు కొనుటకు (6-31), దాని విశాలీకరణమును ఆవశ్యక మగును. చివరకు తా నిపుడున్న రూపమున మానవుని కే అభ్యాసగత మఱియు సాధారణ ప్రకృతి గలదో, అది ఒక పరమ మఱియు దివ్య అధ్యాత్మికప్రకృతిలోనికి మాఱవలెను. ఒక్క మాటలో నేది ఏకకాలమున ఒక పూర్ణ జ్ఞానయోగము, ఒక పూర్ణ సంకల్ప మఱియు దాని కర్మయోగము, ఒక పూర్ణ ప్రేమ, ఆరాధనా మఱియు భక్తియోగము మఱియు సంపూర్ణ సత్త, దాని సర్వవిభాగములు, శక్తులు, స్థితులు మఱియు గతులయొక్క ఒక పూర్ణ ఆధ్యాత్మిక సిద్ధియోగము – ఇవి యన్నియు నగునో అట్టి సమగ్ర యోగము ఆవశ్యక మగును.

10. గీతయందలి జ్ఞానస్వరూపము :

"అయితే బుద్ధి అంగీకరించవలసిన, అంతరాత్మ విశ్వాసము ధరించవలసిన, మనో హృదయ ప్రాణములకు వాస్తవము, సజీవము జేయబడవలసిన ఈ జ్ఞాన మేది యగును? అది తమ ఏకతయందును, సమగ్రతయందును పరమాత్మ మఱియు పరమసత్తయొక్క జ్ఞానమగును. ఏ ఏకమాత్రుడు నిత్యుడో, తన సవ్యక్తిక మఱియు నిర్వ్యక్తిక భూమికల కావల నెంతో పైనుండునో, అయినను ఎవనినుండియే ఇది యంతయు ప్రభవించునో, మఱియు నే ఏకుని ఇది యంతయు నానావిధ ప్రకృతియందును, ఆమెయొక్క అసంఖ్యాక రూపములందును అభివ్యక్తము చేయునో, అట్టి ఏకుని జ్ఞాన మది. తర్వాత ఆ ఏకునియొక్క ఏ నిర్వ్యక్తిక, సనాతన, అక్షరపురుషరూపము గలదో (15-16), దాని జ్ఞాన మది, ఈ అక్షరపురుషుడు మనము ఆత్మ (6-29) యని పిలుచునట్టి శాంత, అనంత వస్తువు, ఇది సమము మఱియు ఏకరసము (same); ఈ సమస్త సంతత పరివర్తనమునందును, వ్యష్టిభూత వ్యక్తిత్వములు, అంతరాత్మ శక్తులు, ప్రకృతి శక్తులు మఱియు నీ క్షణభంగుర, బాహ్య జగత్తుయొక్క రూపములు, శక్తులు మఱియు పర్యవసానముల గాఢ సంకులమునందును ఈ ఆత్మ చలించదు, మాఱదు, మాఱిపోదు. చివరకు ఆ

ఏకునియొక్కయే, అదే సమయమున ప్రకృతియందు క్షణక్షణము మారుచున్నట్లు గన్పించు ఏ క్షరపురుషుడు మఱియు శక్తిరూపము (15-16) గలదో, దానియొక్క జ్ఞాన మది; ఈ క్షర పురుషుడు అంతర్నివాసిగా నుండి, ప్రతిరూపమునకు సరిపడునట్లు తన రూపమును మార్చుకొనును మఱియు తన శక్తియొక్క ప్రతి అంతస్తునకును, ప్రతి అంశమునకును, ప్రతి క్రియకును అనురూపముగా తనను దిద్దుకొనును; ఈ పురుషుడు ఈ సమస్తముకంటెను సదా అనంతగుణంబు లధికుడయ్యును, ఈ సమస్తము నగుచు, చరాచరములందును, విషయి విషయములందును, అంతరాత్మ మఱియు మనఃప్రాణ ద్రవ్యములందును, ప్రతి సత్తయందును, ప్రతి శక్తియందును, ప్రతి జీవియందును నివసించును.

11. సర్వసమగ్ర ఏకత్వము :

"సత్యముయొక్క ఈయా పార్శ్వమునే అభిమానింతు వేని, నీ వీ యోగసాధన చేయలేవు. నీవు అన్వేషించవలసిన భగవానుడు, నీవు కనుగొనవలసిన సర్వాత్మ, నీ అంతరాత్మ ఎవని సనాతనాంశమో (15-7), ఆ పరమ పురుషుడు ఏకకాలమున ఈ మూడు (క్షర అక్షర ఉత్తములు) నైయున్నది. ఒక పరమ ఏకతయందు వానిని నీ వేకకాలమున తెలియవలెను, ఏక కాలమున ఆ మూడింటిలోనికి నీవు ప్రవేశించవలెను, మఱియు సర్వ స్థితుల యందును, సర్వవస్తువులయందును ఆ ఏకునే దర్శించవలెను. అతడు ప్రకృతి యందు నివసించు క్షరపురుషుడు మాత్రమే యగుచో, అపు డొక శాశ్వత, విశ్వ మయ సంభూతి (ప్రవాహము) మాత్రమే యుండును. నీ విశ్వాసమును, జ్ఞానమును ఆ పార్శ్వమునకే పరిమితము గావింతు వేని, నీ వ్యక్తిత్వమును, క్షణక్షణము మాఱుచుండు దాని రూపములను ఎప్పుడును దాటి పోజాలవు; ఆ పునాదిపై నీవు సర్వథా ప్రకృతి భ్రమణములందు చిక్కుకొని యుందువు. కాని నీవు కాలమునందలి అంతరాత్మ – క్షణముల పరంపర మాత్రమే గావు. నీలో నీ వ్యక్తిత్వప్రవాహమునకు ఆధారముగా నుండుఒక నిర్వ్యక్తిక ఆత్మగలదు, అది భగవంతుని వ్యాపక, నిర్వ్యక్తిక తత్త్వముతో ఏకము, అభిన్నము. మఱియు నీ నిర్వ్యక్తికతా సవ్యక్తికతల కావల అగణ్యుడవై, ఇచ్చటి నీ సత్తయొక్క ఈ రెండు నిత్య ధ్రువములపై నాధిపత్యము వహించుచు, సనాతన పరాత్పర సత్తయందు నీవు సనాతనుడువు, పరాత్పరుడవు నై చెలంగుదువు.

12. నిర్గుణాత్మ యొక్కటియే యున్నచో :

"మఱల ఒక సనాతన నిర్గుణాత్మ యొక్కటియే సత్య మగుచో, అపుడు ప్రపంచమును, నీ అంతరాత్మయు ఎట్టి వాస్తవాధారము లేని భ్రాంతిరూపము లగును; కారణము, నిర్గుణాత్మ కర్మను జేయదు, సృష్టిని జేయదు. నీ విశ్వాసమును, జ్ఞానమును ఒక్క యీ ఏకాకి పార్శ్వమునకే పరిమితము గావింతు వేని, జీవనము మఱియు కర్మల సన్యాసమే నీకు ఏకైక తరుణోపాయ మగును. కాని ప్రపంచమునందలి భగవంతుడును, ప్రపంచమునందలి నీవును వాస్తవ సత్యములు; ప్రపంచమును, నీవును పరమపురుషుని యొక్క సత్య, ప్రవర్తమాన శక్తులు మఱియు నభివ్యక్తులు కావున జీవన, కర్మ లను ఆమోదించవలెనే గాని, నిరాకరించరాదు. నిర్గుణాత్మ యందును, శుద్ధ సత్తయందును భగవంతునితో ఏకుడ వగు నీవు, ఆధ్యాత్మిక వ్యక్తిత్వమునందు భగవత్ ప్రకృతియొక్క ఒక సనాత నాంశమగు నీవు, తన స్వీయ మూలమగు అనంతునిపట్ల ఆ వ్యక్తిత్వమునకు గల భక్తిప్రేమలచేత అతని వైపునకు దిరిగి, నీ బాహ్య సత్తను భగవంతునియొక్క ఒక కర్మసాధనము, ఒక వాహిని, ఒక శక్తిని జేయుము; నిజానికి అందుకే అది ఉద్దేశింపబడినది. తన యథార్థ రూపమున అది ఎల్లపుడును అట్టి సాధనమే, కాని ప్రస్తుతము అది అచేతనముగను, అపూర్ణము గను, నిమ్నప్రకృతిద్వారా మాత్రమే అట్టి సాధనము; ప్రస్తుత మది నీ అహంకారముచేత తన భగవద్రూపముయొక్క వికృతీకరణమునకు గుఱియైనది. కావున దాని నిపుడు సచేతనముగను, పరిపూర్ణముగను, అహంకారకృతమగు ఎట్టి వక్రీకరణము వినా, తన పరమ ఆధ్యాత్మిక ప్రకృతియందు భగవంతునియొక్క ఒక శక్తి యగునట్లును, అతని సంకల్పము మఱియు కర్మలయొక్క ఒక వాహనమగునట్లును జేయుము. ఈ ప్రకారముగ ఆ నీవు నీ స్వీయ సత్తయొక్క సమగ్ర సత్యమునందు నివసించెదవు, సమగ్ర భగత్సాయుజ్యమును, అనగా సంపూర్ణ, లోప రహిత యోగమును బొందెదవు.

13. పరాత్పరుడు పురుషోత్తముడు :

"కాగా పరమోచ్చ దేవుని పురుషోత్తము డందురు: అతడు సర్వాభివ్యక్తికిని ఆవల వర్తించు సనాతనుడు, కాలము గాని, దేశము గాని, నిమిత్తము (causality) గాని, తన అసంఖ్యాక గుణములు మఱియు లక్షణములలో నేది యైనను గాని కల్పించు సర్వ పరిమితికిని ఆవల విలసిల్లు అనంతుడు. కాని తన పరమ సనాతన రూపమున అతనికి నిచ్చట జరుగు దేనితోను సంబంధ ముండదనియు, ప్రపంచము

మఱియు ప్రకృతినుండి అతడు విచ్ఛిన్ను డనియు, ఈ సర్వభూతములనుండి విడివడి యుండు ననియు దీని అర్థము కాదు. అతడు (ఏకకాలమున) అనిర్వచనీయ పరబ్రహ్మము, అతడు నిర్వ్యక్తిక ఆత్మతత్త్వము, అతడు ఈ సర్వ సవ్యక్తిక సత్తలును. ఇచ్చటి సత్తయు, ప్రాణ ద్రవ్యములును, అంతరాత్మ ప్రకృతులును, ప్రకృతి కర్మలును అతని అనంత, సనాతన సత్తయొక్క విభిన్న రూపములు మఱియు వ్యాపారములే. అతడే అతీత పరబ్రహ్మము, సర్వము అతని నుండియే అభివ్యక్తిలోనికి వచ్చును, సర్వము అతని రూపములు మఱియు స్వీయశక్తులే. ఏకమాత్ర ఆత్మరూపమున అతడు అచ్చట సర్వవ్యాపకుడు మఱియు మానవుని యందును, పశువునందును, అటులే వస్తువు నందును, విషయమునందును, ప్రతి ప్రకృతిశక్తియందును సమముగను, నిర్వ్యక్తికముగను ఉండును. అతడు పరమ అంతరాత్మ మఱియు అంతరాత్మ లన్నియు ఈ ఏకమాత్ర అంతరాత్మయొక్క అశ్రాంత జ్వాలలు. సర్వజీవులు తమ ఆధ్యాత్మిక వ్యక్తిత్వమునందు ఏకమాత్ర పురుషుడగు నతనియొక్క అవినాశి అంశములు (15-7). అతడే అభివ్యక్త జగత్తున కంతటికి శాశ్వత నియామకుడు, లోకములు మఱియు వాని యందలి ప్రాణులకు అధీశ్వరుడు (5-29). అతడు సర్వక్రియల యొక్కయు సర్వశక్త ప్రవర్తకుడు, తన కర్మలచేత బద్ధుడు గానివాడు, మఱియు సర్వక్రియ మఱియు ప్రయత్నము మఱియు యజ్ఞము అతనికే చేరును (9-24). అతడు అన్నింటియందును గలడు, అతనియందు అన్నియు గలవు (6-30); అతడే అన్నియు అయ్యెను, అయినప్పటికి గూడ అతడు సర్వమునకు పై నుండును, తన సృష్టికి పరిమితుడు గాడు (10-42). అతడు పరాత్పర భగవంతుడు (8-20); అతడే అవతారరూపమున అవతరించును; అతడు విభూతులయందు (10-20,....) తన శక్తిచేత అభివ్యక్తు డగును; అతడే అతడే ప్రతి మానవ జీవునియందు గుప్తముగా నుండు ఈశ్వరుడు (18-61). మానవులు పూజించు దేవత లందరు ఆ ఏకమాత్ర దివ్య భావముయొక్క కేవలము వ్యక్తిత్వములు, రూపములు, నామములు మఱియు మానసిక తనువులు.

14. తన అభివ్యక్తి నిమిత్తము తన సృష్టి :

"పురుషోత్తముడు తన ఆధ్యాత్మిక సారతత్త్వమునుండియు, తన స్వీయ అనంత సత్తయందును ఈ ప్రపంచమును సృజించి, అందు నానావిధముగా తన నభివ్యక్తము గావించుకొనియున్నాడు. సర్వ వస్తువులు అతని శక్తులు మఱియు ఆకృతులు మఱియు

నతడు స్వయముగా అనంతుడు గాన, అతని శక్తులకును, ఆకృతులకును అంతము లేదు (10-19). ఒక సర్వవ్యాపక, సర్వభృత్ (13-15), నిర్వ్యక్తిక, స్వయంభూ సత్తారూపమున అతడు దేశకాలగతమగు ఈ సమస్త అనంత అభివ్యక్తిని ప్రవేశించి, ధరించును - సమముగా ధరించును, ఎట్టి పక్షపాతము, అభిరుచి, లేక ఎవనితో గాని, దేనితో గాని, ఎట్టి సంఘటనతో గాని ఎట్టి సంగము వినా ధరించును. ఈ శుద్ధ, సమ ఆత్మ కర్మ చేయదు గాని, అన్నింటి క్రియ నంతను సమముగా, నిష్పక్షపాతముగా ధరించును. అయినను మఱల ఆ పురుషోత్తముడే, కాని తన విశ్వపురుష మఱియు కాలపురుష రూపమున, ప్రపంచ క్రియనంతను సంకల్పించి, నిర్ణయించి నడుపును - తన నానా విధ సృజనశక్తిద్వారా నడుపును, కాలపురుషుని ఈ శక్తినే మనము ప్రకృతి యందుము. జగత్తులను సృజించి, పాలించి, సంహరించు వాడతడే. మఱియు నతడే ప్రతిప్రాణి హృదయమునందు గూడ ఆసీనుడై యుండును మఱియు విశ్వము నందలి తన విశ్వమయ సన్నిధినుండి వలెనే, వ్యక్తియందలి ఒక గుప్త సత్తగా హృదయమునుండి ప్రకృతిబలము ద్వారా తన రహస్యసత్యముయొక్క ఒకానొక రేఖను ప్రారంభించి, అభివ్యక్తము చేయును - ప్రకృతియొక్క గుణమునందు దానిని ప్రారంభించును, ప్రకృతియొక్క నిర్వాహక శక్తియందు దానిని అభివ్యక్తము చేయును మఱియు నటులే ప్రతి ప్రాణిని దాని జాతి ననుసరించి రూపొందించుచు, సర్వ క్రియను ప్రారంభించి, ధరించి యుండును. పురుషోత్తమునియం దుండి ప్రారంభించు ఈ అతీత ప్రథమారంభణమును, వస్తువులయందును, ప్రాణులయందును జరుగు అతని సంతత విశ్వగతాభివ్యక్తియును, వ్యక్తిగతాభివ్యక్తియును - ఈ త్రివిధత్వమే ప్రపంచ స్వభావముయొక్క జటిలతకు గారణము.

15. మూడును శాశ్వత సత్యములే :

"ఈ మూడును పరమ పురుషుడు, భగవంతునియొక్క నిత్య, శాశ్య తావస్థలు : 1, అతని ఈ ఏకమాత్ర సనాతన, అక్షర స్వయంసిద్ధ సత్త, అది ఎప్పుడు, శాశ్వతముగా నుండును, అది సర్వ, సత్తా మయ (existent) వస్తువులకు మూలము మఱియు ఆధారము. 2, ప్రకృతి గతమగు అతని క్షరపురుష తత్త్వము (15-16), ఇదియు నెల్లపుడు, శాశ్వతముగా నుండును, ఈ క్షరపురుషుడు ప్రకృతిచేత నీ సర్వ భూతముల రూపమున వ్యక్తముచేయబడును. 3, అతని సర్వాతీత దివ్యభావము,

ఇదియు సర్వదా, శాశ్వతముగా నుండునదే. ఈ దివ్యపురుషుడు ఏకకాలమున తదితరమగు ఆ ఉభయపురుషులును కాగలడు - విశుద్ధ, ప్రశాంతపురుషుడును గాగలడు, సృష్టి చక్రములందు సక్రియ అంతరాత్మ మఱియు జీవనమును గాగలడు; ఏలన ఈ రెండింటిని విడిగా తీసికొన్నను, కలిపి తీసికొన్నను, వానికంటె నతడు అన్యుడు మఱియు నధికుడు. మనయందలి జీవుడు ఈ పురుషోత్తమునినుండి వెలువడిన ఒక పురుషుడే, అతనియొక్క ఒక సచేతన శక్తియే. అతడే తన గభీరతమ ఆత్మయందు అంతస్థ భగవంతుని (immanent Divine) సమస్తమును వహించును మఱియు ప్రకృతిగతుడై విశ్వరూప భగవంతుని యందు (universal Divine) వసించును-ఈ విశ్వరూప భగవంతుడు ఒక తాత్కాలిక సృష్టి మాత్రమే గాక, సనాతన ఆత్మయందును, సనాతన అనంతునియందును (4-35) కర్మచేయుచు, చరించుచు నుండు ఒక సనాతన విశ్వాంతరాత్మ.

16. క్షరావస్థయందు నివసించి నపుడు :

"మనలోని సచేతన జీవాత్మ పరమ పురుషునియొక్క ఈ మూడు అవస్థలలో దేని నైనను స్వీకరించ గలడు. మానవుడు ప్రకృతియొక్క క్షరభావమునందు, క్షరభావమునందు మాత్రమే నివసించ గలడు. అపు డతడు తన వాస్తవాత్మ నెఱుంగక, తనలోని భగవంతు నెఱుంగక, ప్రకృతిని మాత్రమే ఎఱుంగును : అత డామెను యాంత్రికమగు కార్యనిర్వాహక మఱియు సృజనాత్మక శక్తిగా దర్శించి, తనను, ఇతరులను ఆమె సృష్టిగా జూచు కొనును - తాను, ఇతరులు ఆమె సృష్టిలోని అహం - వ్యక్తులు, పృథగ్భూత సత్తలు. ఇట్లు ఉపరితలమున మాత్రమే అత డిపుడు నివసించును మఱియు నట్లు నివసించుచు, తన బాహ్యచేతన నతిక్రమించి, తన లోపలి సత్యమును తెలియనంత కాలము, అతని ఆలోచన మఱియు విజ్ఞాన (science) మంతయు తెరలపైనను, ఉపరితలముల పైనను వచ్చి పడు లోని ప్రకాశముయొక్క బాహ్యచ్ఛాయ మాత్రమే కాగలదు. ఇట్టి అజ్ఞానము సంభవము మాత్రమే గాక, అతనిపై విహితము (imposed) గూడను; ఏలన లోని ఈశ్వరుడు తన స్వీయ శక్తియొక్క ఆవరణ చేతనే మఱుగుపడియుండును (7-25). ఆ ఈశ్వరునియొక్క అధికతర సత్యము మన దృష్టి కగుపించదు; కారణము అతడు తన ఒక ఆంశిక ఆవిర్భావమునందు తాను సృజించిన వస్తువులతోను, తన ప్రతిమలతోను పూర్ణముగా తనను తాదాత్మ్యము జెందించుకొనును మఱియు తాను

సృజించిన మనస్సును తన స్వీయ ప్రకృతియొక్క వంచనశీల క్రియలయందు పూర్ణముగా లీన మొందించును. మఱియు నట్టి అజ్ఞానము సంభవమగుటకు మఱియొక కారణ మేమనగా, ఏ వాస్తవ, సనాతన, ఆధ్యాత్మిక ప్రకృతి వస్తువుల స్వరూపముయొక్క గంభీర రహస్యమో, అది ఆ వస్తువుల బాహ్య రూపమునందు (ఇంకను) అభివ్యక్తము గాలేదు (15-16). బహిర్ముఖులమై నపుడు మన మే ప్రకృతికిని జూతుమో, ఏ ప్రకృతి ఇంద్రియ మనః శరీరములందు పనిచేయునో, అది ఒక నిమ్న సామర్థ్యము, ఒక వికృతి, అది ఒక ఐంద్రజాలికుడు, అది పరమాత్మకు ఆకారములను గల్పించి, ఆ ఆకారములలో అతనిని మఱుగుపఱచును; సత్యమునకు మాయావేషము వేసి, మానవు లా వేషమునే చూచునట్లు చేయును; ఆ నిమ్న సామర్థ్యముయొక్క పరిధిలో భగవదభివ్యక్తియొక్క గౌణ, హీన మూల్యముల రాశియే యుండును గాని, పూర్ణ శక్తి, మహిమ, ప్రహర్షము మఱియు మధురిమలయొక్క దివ్య సముదాయ ముండదు. మనయందలి ఈ ప్రకృతి అహంకారముయొక్క ఒక మాయ, ద్వంద్వముల ఒక గ్రంథి, అజ్ఞానముచేతను, త్రిగుణములచేతను గల్పించ బడిన ఒక జాలము. కాగా ఎంతదనుక మానవుని అంతరాత్మ మనఃప్రాణదేహముల బాహ్య సత్యమునందే గాని, అతని ఆత్మ మఱియు మూల సత్తయందు నివసించదో, అంతదనుక తమ వాస్తవరూపమున భగవంతుని, తనను, ప్రపంచమును మానవుడు గనజాలడు, ఈ మాయను అతిక్రమించజాలడు, కావున ఆ మాయయొక్క అంశముల తోను, రూపములతో తాను చేయగలిగినది చేయుచు, తృప్తిపడక తప్పదు.

17. అక్షరావస్థయందు నివసించినపుడు :

"తన ప్రకృతియొక్క ఏ నిమ్న వృత్తియందు దా నిపుడు నివసించుచున్నాడో, దానినుండి ఉపసంహరించుకొని, అంధకారమే యగు తన ఇప్పటి ప్రకాశమునుండి మేల్కను నేని, మానవుడు సనాతనము, అక్షరము నగు స్వయంభూ ఆత్మసత్తయొక్క ప్రకాశమయ సత్యము నందు నివసించుట సంభవమే. అప్పు డిక నతడు తన వ్యక్తిత్వముయొక్క ఇఱుకు కారాగారమునందు బద్ధుడై యుండడు. కొంచెము నిమిత్తము, ఏది ఆలోచించుచు, కర్మచేయుచు, వేదనబొందుచు, ప్రయాసపడునో మఱియు శ్రమజేయునో, అట్టి చిన్న నేనుగా తన్ను జూచుకొనడు. అతడు విశద్ధాత్మ యొక్క వ్యాపక, విముక్త నిర్వ్యక్తికత యందు లీనమగును; అతడు బ్రహ్మ మగును; అన్నింటియందలి ఏకాత్మతో నేకముగా తన నెఱుంగును. అతని కిక

అహంకారబోధమే యుండదు. అత డిక ద్వంద్వములచేత వ్యథితుడు గాడు, దుఃఖముయొక్క సంతాపమును గాని, హర్షము యొక్క కల్లోలమును గాని అనుభవించ..., కామమునకు చలించడు, పాపముచేత పరితప్తుడు గాని (4-36) పుణ్యముచేత పరిమితుడు గాని కాడు. అథవా వీని ఛాయలు నిలిచియుండు నేని, తన గుణములయందు పనిచేయుచున్న (3-28) ప్రకృతిరూపములు గానే వానిని చూచును, మఱియు నెఱుంగును గాని, తా నిపుడు దేనియందు నివసించుచున్నాడో, అట్టి తన స్వీయ సత్యముయొక్క రూపములుగా గాదు. ప్రకృతియే కర్మచేయుచు (13-30), తన యంత్రప్రాయ ఆకృతులను రూపొందించును: కాని శుద్ధ ఆత్మ సదా నిశ్చలము, నిష్క్రియము, విముక్తము. శాంతము, ప్రకృతిక్రియలచేత అస్పృష్టము నగు ఆత్మ ఒక పూర్ణ సమతతో ఆ క్రియలను నిరీక్షించును మఱియు తనను వానికంటె భిన్నముగా నెఱుంగును. అయినను ఈ ఆధ్యాత్మి కావస్థ తనతో నొక నిశ్చల శాంతిని మఱియు విముక్తినే గొనివచ్చును గాని, సక్రియ దివ్యతను గాదు, సమగ్ర సిద్ధిని గాదు. అది యొక మహాసోపానమే గాని, సమగ్ర భగవద్ - జ్ఞానమును, సమగ్ర ఆత్మ జ్ఞానమును గాదు.

18. సమగ్ర భగవంతునియందు నివసించి నపుడు :

“పరమ మఱియు సమగ్ర భగవంతునియందు నివసించి నపుడు మాత్రమే పూర్ణ పరిపూర్ణత సిద్ధించ గలదు. అపుడు మానవుని అంతరాత్మ, అది దేనియొక్క అంశమో, అట్టి భగవత్స్వరూపముతో యుక్తమగును; అపుడది ఆత్మయందును, సత్తయందును సర్వభూతములతో నేకముగా నుండును, భగవంతుడు మఱియు ప్రకృతి - రెండింటి యందును సర్వభూతములతో నేకముగా నుండును; అపుడది విముక్తము మాత్రమే గాక, సంపూర్ణమునయి, పరమానందములో మునిగితేలుచు, చరమ సంసిద్ధికి సిద్ధ పడును (18-53). ఇంకను మానవుడు ఆత్మను, సర్వవస్తువులను శాంతముగా ధరించుచున్న ఒక సనాతన, నిర్వికార సత్తగా జూచును; కాని అత డిక ప్రకృతిని, గుణముల యాంత్రికత ననుసరించి వస్తువుల రూపొందించు ఒక యాంత్రిక శక్తిగా మాత్రమే గాక, అభివ్యక్తియందు ఆత్మ సత్తయొక్క ఒక శక్తిగను, భగవంతుని యొక్క ఒక బలము (force) గను జూచును. నిమ్న ప్రకృతి ఆత్మ క్రియయొక్క ఆంతరతమ సత్యము గాదని అతడు చూచును; భగవంతునియొక్క ఒక సర్వోన్నత ఆధ్యాత్మిక ప్రకృతి నతడు దెలియవచ్చును, ఈ

ప్రకృతిలోపలనే మనః ప్రాణ శరీరములం దిపుడు అపూర్ణముగా రూపొందియున్న సర్వమునకు మూలమును, ఇంకను వ్యక్తముగావలసిన వాని అధికతర సత్యమును గలవని అతడు గుర్తించును. నిమ్నతర మానసిక ప్రకృతినుండి పరమ ఆధ్యాత్మిక ప్రకృతిలోనికి ఉద్గమించి, అచ్చటతడు సమస్తాహంకారము నుండియు బైటబడును. అపు డతడు, "నే నొక ఆధ్యాత్మిక పురుషుడను, నా మూలసత్తయందు సర్వ భూతములతో ఏకుడను, మఱియు నా సక్రియ ప్రకృతియందు ఏకమాత్ర భగవత్ ప్రకృతియొక్క ఒక శక్తిని మఱియు అతీత అనంతునియొక్క సనాతనాంశమగు ఒక అంతరాత్మను." – అని తన నెఱుంగును. అతడు సర్వమును భగవంతునియందును, సర్వమునందును భగవంతుని గాంచును; మఱియు నతడు సర్వవస్తువులను వాసుదేవునిగా జూచును (7-19). హర్షశోకములను గల్గించు ద్వంద్వముల నుండియు, ప్రియాప్రియముల నుండియు ఆశ మఱియు ఆశాభంగములనుండియు, పుణ్యపాపములనుండియు ఇపు డతడు ముక్తుడు. ఇకనుంచి సర్వమును అతని జ్ఞానమయ దృష్టికిని, అనుభవమునకును భగవంతునియొక్క ఇచ్ఛయు, ఇచ్ఛాక్రియయు నగును. అత డొక అంతరాత్మ గను, వైశ్వచేతన మఱియు శక్తియొక్క ఒక అంశముగను జీవించును మఱియు కర్మచేయును; అతడు లోకోత్తర దివ్యాహ్లాదముతో, ఆధ్యాత్మికానందముతో నిండి యుండును. అతని క్రియ దివ్య క్రియ యగును మఱియు నతని ప్రతిపత్తి (స్థానము) సర్వోన్నత ఆధ్యాత్మిక ప్రతిపత్తి యగును.

19. బుద్ధియోగము ప్రథమసోపానము :

"ఎవరు తమ లోపలి దివ్యవాణి నాలకించగలరో, ఎవ రీ విశ్వాసమును, జ్ఞానమును ధరింప సమర్థులో, ఇదిగో, నేను వారిముందుంచు పరిష్కారమిదియే, మోక్ష మిదియే, సంసిద్ధి యిదియే. కాని ఈ సర్వోత్కృష్ట స్థితి కారోహించదలంచిన, ప్రథమావశ్యకతగా, ఆద్య మౌళిక సోపానముగా నిమ్న ప్రకృతికి జెందిన దాని యంతటినుండియు నీవు విముఖుడవు గావలెను (2-45), సంకల్పము మఱియు బుద్ధియొక్క ఏకాగ్రతద్వారా ఏది ఆ సంకల్పముకంటెను గాని, బుద్ధికంటెను గాని ఉచ్చతరమో, ఏది మనో హృదయములు మఱియు నింద్రియశరీరములు కంటెను ఉచ్చతరమో, దానియందు నిన్ను నీవు స్థాపించుకొనవలెను (3-43, 2-53). మఱియు మున్ముందు నీవు, ఏది నిర్వ్యక్తికమో మఱియు సర్వ ప్రాణులయందును ఏకమాత్రమో, అట్టి నీ స్వీయ నిత్య, అక్షరాత్మ వైపునకు దిరుగవలెను, ఎంత కాలము

నీవు అహంకారము నందును, మానసిక వ్యక్తిత్వమునందును నివసింతువో, అంత కాలము సదా ఒకే గాడిలో అనంతముగా పరిభ్రమింతువే గాని, దానివలన ఎట్టి పరిణామము నుండదు. కావున హృదయము మఱియు దాని కామనలు, ఇంకను ఇంద్రియములు మఱియు వాని ఆకర్షణల కావల నీ సంకల్పమును లోనికి త్రిప్పుము; అటులే ఆ సంకల్పమును మనస్సు మఱియు దాని సాహచర్యములు, సంగములు మఱియు దాని పరిచ్ఛిన్న అభిలాషలు, ఆలోచనలు, ఆవేగముల కావల పైకి నుద్ధరింపుము. ఏది సనాతనము, నిత్య-నిర్వికారము, ప్రశాంతము మఱియు నిరాకులమో, ఏది సర్వ వస్తువులు, వ్యక్తులు మఱియు ఘటనల పట్ల సమము మఱియు నిష్పక్షపాతమో, అటులే ఏది కర్మచేత ప్రభావితము గాదో, ప్రకృతి గల్పించు రూపములచేత పరివర్తితము గాదో, అట్టి నీలోపలి ఒకానొక వస్తువును జేరుకొనుము. చేరుకొని, అదిగా నుండుము. సనాత నాత్మగా నుండుము, బ్రహ్మగా నుండుము (2-72). ఒక శాశ్వత ఆధ్యాత్మి కానుభవముచేత నీ వది కాగల వేని, నీ కొక సునిశ్చితాధారము లభించును. దాని యందు స్థితుడవై నీ మనఃసృష్ట పరిమితులనుండి బైటబడుదువు, శాంతి మఱియు జ్ఞానమునుండి ఎట్టి చ్యుతిభయము నెఱుంగని భద్రత నందెదవు, అహంకారమునుండి సర్వథా ముక్తుడ వగుదువు.

20. కామము జ్ఞానశత్రువు :

"ఎంతదనుక అహంకారమును గాని, దానికి సంబంధించిన దేని నైనను గాని పాలించి పోషింతువో, దాని కంటిపట్టుకొని యుందువో, అంతదనుక నీవు నీ సత్త నిట్లు నిర్వ్యక్తికము చేయుట సాధ్యము గాదు. కామము మఱియు దానినుండి ఉద్భవించు క్రోధము (3-37) - ఇవియే అహంకారముయొక్క ప్రధాన లక్షణము మఱియు సుదృఢ గ్రంథి. నేను, నాది - యను సదా నీచే అనిపించునది కామమే మఱియు నది దృఢనివిష్టమగు ఆ నేను-ద్వారా తృప్తి మఱియు నతృప్తులకు, ఇష్టానిష్టములకు, ఆశానిరాశలకు, హర్షశోకములకును నిన్ను అధీనముచేయును; నీ క్షుద్రమగు రాగద్వేషములకు, క్రోధావేశములకును అధీనముచేయును; సాఫల్యము మఱియు ప్రియవస్తువులయందు నీ సంగమునకు, వైఫల్యము మఱియు అప్రియ వస్తువులు గొనివచ్చు శోకసంతాపములందు నీ సంగమునకును నిన్ను అధీనముచేయును. కామము సదా మనస్సును వ్యాకులపఱచును, ఇచ్ఛను

పరిమితము చేయును, వస్తువులను అహం-కోణమునుండి వంకరగా జూపించును, జ్ఞానమును స్ఫురించనీయక మఱుగుపఱచును. కామము మఱియు దాని అభి-రుచులును, ప్రవేగములును పాపము మఱియు పొరపాటుయొక్క ప్రథమ, ప్రబల మూలకారణము. నీవు కామమును బోషించు నంత కాలము, ఎట్టి నిశ్చిత, నిష్కళంక స్వష్ఠత గాని, ఎట్టి సుస్థిర ప్రకాశము గాని, ఎట్టి ప్రశాంత, విశుద్ధ జ్ఞానము గాని యుండజాలదు; ఎట్టి యథార్థ సత్తావస్థయు నుండజాలదు. కారణము, కామము సత్తయొక్క ఒక వికృతావస్థ; యథార్థ ఆలోచన, క్రియ మఱియు భావనలకు ఎట్టి గట్టి పునాదియు నుండజాలదు. ఏ రంగులో కామమును మన నిచ్చినను, అది ప్రాజ్ఞవర్యులకు సైతము సంతత భయకారణమగును మఱియు మనస్సును, తాను ఆర్జించిన ఎంతో దృఢము, భద్రము నగు ఆధారమునుండి సైతము, వంచనతో గాని, ప్రసభముగా గాని, (2-60) నెట్టివేయగలదు. ఇట్లు కామము ఆధ్యాత్మిక సిద్ధికి ప్రధాన శత్రువు.

21. కామమునుండి వేఱుపడుము :

"కావున కామమును వధించుము (3-41); పదార్థముల బాహ్యరూపముల పరిగ్రహము (possession) నందును, ఉపభోగమునందును సంగమును దూరముచేసికొనుము (4-21). బాహ్య స్పర్శలు మఱియు అభ్యర్థనల రూపమునను, మనస్సు మఱియు ఇంద్రియముల విషయ రూపమునను ఏది నీకడకు వచ్చునో, దానియంతటినుంచి నిన్ను నీవు వేఱుపఱచు కొనుము (3-28). కామాది వికారముల వేగమును సహించి, నిరాకరించ నేర్చుకొనుము (2-14, 15), మఱియు నవి నీ బాహ్యాంగములయందు చెలరేగుచున్న సమయమునందు సైతము నీ లోపలి ఆత్మయందు పదిలముగా నుండుటను అలవరచు కొనుము; అట్లు చేసిన చివరి కవి నీ ప్రకృతియందలి ఏ భాగమును కదిలించలేని స్థితి వచ్చును (2-70). అటులే హర్షశోకముల బలవదాక్రమణలను, మందతమ సకపట స్పర్శలను సైతము సహించి, వెడలగొట్టుము. ఇష్టానిష్టములను దూరము చేయుము, రుచిని, అరుచిని మట్టుబెట్టుము, సంకోచ జుగుప్సలను పాఱదోలుము. వీని పట్లను, నీ ప్రకృతియందలి సమస్త కామనావిషయముల పట్లను శాంత ఉదాసీనతను పెంపొంద నిమ్ము (14-23). నిర్వ్యక్తి కాత్మయొక్క నీరవ, ప్రశాంత దృష్టితో వాని నవలోకించుము.

22. సాక్షిత్వ ఫలితము పరమ సమత :

"దీని ఫలితము ఒక సర్వ సమత మఱియు చలించని శాంతిశక్తి యగును, ఈ సమతాశాంతులనే విశ్వాత్మ తన సృష్టిసమ్ముఖమున ధరించియుండును, వానితోనే ప్రకృతియొక్క బహువిధ క్రియాకలాపమును సదా సంబాళించును. సమదృష్టితో జూడుము; సాఫల్య వైఫల్యములను, సమ్మా నావమానములను, మానవుల ఆదర ప్రేమలను మఱియు వారి తిరస్కార ద్వేష, హింసనములను, ఇంకను ఇతరులకు సంతోషకారణము లేక శోకకారణము నగు ప్రతిఘటనను – ఒక్క మాటలో నీకు ప్రాప్తించు సర్వమును సమచిత్తముతో (13–10), సమ హృదయముతో స్వీకరించుము. సజ్జన దుర్జనులను, ప్రాజ్ఞ పామరులను, బ్రాహ్మణ ఛండాలురను, మానవోత్తముని మఱియు క్షుద్ర కీటకమును సమదృష్టితో జూడుము (6–9). సుహృదుడు మఱియు మిత్రుడు, మధ్యస్థుడు మఱియు ఉదాసీనుడు, విరోధి మఱియు శత్రువు, ప్రేమి మఱియు ద్వేషి–ఇట్లు మానవులు నీతో నే సంబంధములు గలిగి యున్ననను, నీవు మాత్రము వారిని సమభావముతో కలిసికనుము. ఇవి అహంకారమును స్పృశించు సంబంధములు కాగా, నీ వా అహంకారమునుండి ముక్తుడవు గమ్ము : ఇది నీకు నా ఉపదేశము. ఇవి సవ్యక్తిక సంబంధములు మఱియు నీ వందరిని నిర్వ్యక్తిక సత్తయొక్క గభీరదృష్టితో నిరీక్షించవలెను. ఇవి కాలగత మఱియు వ్యక్తిగత విభేదములు, నీవు వీనిని గుర్తించదగును గాని, వానిచేత ప్రభావితుడవు గాగూడదు; ఏలన నీ వీ విభేదములయందు నెలకొనక, ఏది అన్నింటియందును సమమౌ, అన్నియు నగు ఏకాత్మయో, దానియందు నెలకొనవలెను, ప్రతిప్రాణియందలి భగవంతునియందును, ఏకమాత్ర ప్రకృతిక్రియయందును నెలకొనవలెను – మానవులు, వస్తువులు, శక్తులు మఱియు ఘటనలందును, జగత్ప్రయాసముయొక్క సమస్త ప్రయత్నము మఱియు ఫలితము మఱియు సర్వవిధ పరిణామము నందును సమమగు భగవదిచ్ఛయొక్క వ్యక్త రూపమే ప్రకృతిక్రియ గనుక.

23. ఆత్మయందు నిష్క్రియత, అంగములందు సక్రియత :

"నీయం దింకను కర్మ జరుగును, కారణము, ప్రకృతి సదా కర్మరతము : కాని నీ ఆత్మ మాత్రము కర్మకర్త గాదని నీ వెఱింగి, అనుభవించవలెను. ప్రకృతి

క్రియాకలాపమును, ఆమె గుణముల ఖేలనమును, ఆమె విధానముల ఇంద్రజాలమును కేవలము చూచుచుండుము, చలించక చూచుచుండుము. నీలో ఈ ప్రకృతిక్రియను నిరీక్షించుము; నీ నలువైపుల దృష్టి సారించి, ఆ ప్రకృతిక్రియనే అందరిలోను జూడుము. తర్వాత, నీయొక్కయు, వారియొక్కయు కర్మఫలితము గూడ నీవు లేక వారు కోరిన లేక ఉద్దేశించినది గాక, నీది గాని, వారిది గాని కాక, ఇచ్చట విశ్వప్రకృతియందు ఇచ్ఛించి, కర్మచేయునట్టి ఒకానొక మహత్తర శక్తిచేత అప్రతిహతముగా పూర్వమే నిర్ణీత మనియు నీవు గుర్తించుము. చివరకు నీ కర్మల యందలి ఇచ్ఛ సైతము నీది గాక, ప్రకృతిదే యని పరికించుము. అది నీయందలి అహంభావముయొక్క ఇచ్ఛ మఱియు నది నీ స్వభావరచనయందలి ప్రధాన గుణముచేత నిర్ణీతమగును, కాగా ఆ ప్రధానగుణము ప్రకృతి నీయందు గతమున వికసింపజేసినది గాని, ఇపుడు చేయుచున్నది గాని కావచ్చును. ఆ యిచ్ఛ నీ ప్రాకృత్య వ్యక్తిత్వముయొక్క ఖేలనముపై నాధారపడును మఱియు ప్రకృతి నిర్మాణమగు ఆ వ్యక్తిత్వము నీయందలి సత్యపురుషుడు గాదు. ఆ బాహ్య నిర్మాణమునుండి నీ లోపలి నిష్క్రియాత్మ లోనికి జరుగుము. అపుడు సత్యపురుషుడ వగు నీవు నిష్క్రియుడవు, కాని ప్రకృతి తన గుణముల ననుసరించి తన కర్మలను సదా సాగించుచునే యుండునని నీవు చూచెదవు. ఈ ఆంతర నిష్క్రియత మఱియు నీరవతయందు నిన్ను నీవు స్థాపించుకొనుము : కర్తగా నిక నిన్ను నీవు చూచుకొనకుము. గుణముల విక్షుబ్ధ క్రియనుండి విముక్తుడవై, గుణఖేలనమునకు బైన, నీలోనే నీవంతఃస్థితుడవై యుండుము. నిర్వ్యక్తిక సత్తయొక్క విశుద్ధియందు భద్రముగా వాసముచేయుచు, నీ అంగములం దింకను నిలిచియుండు మర్త్యతరంగములచే వ్యథితుడవు గాక విలసిల్లుము.

24. ఆత్మస్థితివలన మహావిముక్తి :

"నీ విట్లు చేయగల వేని, ఒక మహావిముక్తి లోనికి, ఒక విశాల స్వాతంత్ర్యములోనికి, ఒక గభీర శాంతిలోనికి ఉద్ధరింపబడి నట్లు నిన్ను నీవు గనుగొందువు. అపుడు భగవంతుని ఎఱుకయు నీకు గలుగును మఱియు నీ వమరుడ వగుదువు, అనాది స్వయంభూ సత్త నీది యగును, మనః ప్రాణ శరీరములపై నాధారపడవు, నీ ఆధ్యాత్మిక సత్తపట్ల నీకు నిశ్చయ మేర్పడును, ప్రకృతి ప్రతిక్రియలు

నిన్ను స్పృశింపవు, చివరకు ప్రకోపము మఱియు పాపము, అటులే కష్టము మఱియు శోకములచేత కళంకితుడవు గావు. అపుడు నీ సంతోషముకొఱకు నీవు ఎట్టి మర్త్య లేక బాహ్య లేక లౌకిక వస్తువు మీద నాధారపడవు, దానిని కోరవు (3–18), పరంతు ప్రశాంత మఱియు సనాతన ఆత్మసత్త యొక్క స్వయంపర్యాప్త ఆనందము విడదీయరాని విధముగా నీదియగును. అపు డిక నీవు మానసిక ప్రాణిగా నుండుటను విరమించి, అపరిమేయ ఆత్మవు, బ్రహ్మవునై యుండెదవు. మఱియు నీ మనస్సునుండి సమస్త ఆలోచనాబీజమును, సమస్త కామనామూలమును పెఱికివేసి, శరీరజన్మకు సంబంధించిన మనస్చిత్రమును చెఱిపి వేసి, అంతకాలమున (8–10) శుద్ధ బ్రహ్మమునందు ఆ మనస్సు నేకాగ్రపఱచియు, ఆ అనంత, నిరపేక్ష బ్రహ్మములోనికి నీ చేతన నంతను ఒక మహాసంక్రమణము ద్వారా పంపించియు శాంతాత్మయొక్క అనాది సత్తలో నీవు లీనము కాగలవు (2–72).

25. విముక్తికి పిమ్మట విముక్తకర్మ :

"అయినను ఇదియే యోగము యొక్క సమగ్ర సత్యము గాదు మఱియు ఈ పర్యవసానమును, ప్రస్థాన మార్గమును – అవి ఒక మహాపర్యవసానమును, ఒక మహామార్గము నయినప్పటికి – నేను నీకు ప్రస్తావించు లక్ష్యము మాత్రము గాదు. ఏలన నేను నీలోని సనాతన కర్మిని (worker) మఱియు నీనుండి కర్మల నపేక్షించు చున్నాను (18–61, 4–15). ఏ ప్రకృతిక్రియ నుండి నీ ఆత్మయందు నీవు పూర్తిగా వేఱుపడి, ఉదాసీనుడవు, దూరస్థుడవు నయి ఉందువో, ఆ యాంత్రిక క్రియకు నీనుండి ఒక నిష్క్రియ (passive) అనుమతిని గాదు నే నపేక్షించునది, పరంతు భగవంతునికి ఒక ఇచ్ఛా పూర్వక, జ్ఞానయుక్త ఉపకరణరూపమున నీచే జేయబడు సర్వాంగీణ మఱియు దివ్య కర్మనే, నీయందును, ఇతరులయందును గల భగవంతునికొఱకును (6–31), లోకసంగ్రహార్థమును (3–25) చేయబడు దివ్యకర్మనే నీనుండి నే నపేక్షించు చున్నాను. నిజమే, పరమ, ఆధ్యాత్మిక ప్రకృతియందలి సిద్ధికి ఒక సాధనగా (3–19) ఈ కర్మను ముమ్మందు నీముందుంచి నప్పటికి, తర్వాత ఆ సిద్ధిలో నొక భాగముగా గూడ దానిని నీకు విధించుచున్నాను (3–25); కర్మ భగవంతుని గుఱించిన సమగ్ర జ్ఞానముయొక్కయు, అతని అధికతర గుహ్య సత్యము యొక్కయు (15–17), భగవంతునియందు సంపూర్ణ నివాసముయొక్కయు (12–8) ఒక అంగము; సిద్ధి మఱియు విముక్తి లభించిన పిమ్మట సైతము కర్మను

చేయగలడు మఱియు చేయవలెను (3-20). నేను నీనుండి జీవన్ముక్తుని క్రియను (4-23), సిద్ధమానవుని కర్మను (4-41) అపేక్షించుచున్నాను. ఇంతకుముందు వర్ణించబడిన యోగమునకు మఱికొంత కలుపవలసియున్నది - ఏలన అది జ్ఞాన ప్రధానమగు ప్రథమయోగము మాత్రమే. భగవదనుభవముయొక్క ప్రకాశమునందు జేయబడు ఒక కర్మయోగమును గలదు (3-25, 6-31); కర్మను జ్ఞానముతో ఏకాత్మకము చేయగలము (4-33). ఏలన పూర్ణ ఆత్మదర్శనమునందును, పూర్ణ భగవద్దర్శనమునందును జేయబడు కర్మలు, ప్రపంచమునందు భగవంతుని, ప్రపంచమును భగవంతునియందు జూచుచు జేయు కర్మలు జ్ఞానముయొక్క ఒక వృత్తియే, ప్రకాశముయొక్క ఒక వృత్తియే యగును, ఆధ్యాత్మిక సంసిద్ధికి ఒక అపరిహార్య సాధనమును (3-20), దానియొక్క అంతరంగ భాగమును (4-24) అగును.

26. సక్రియ పురుషునిగా భగవద్దర్శనము :

"ఏ పరమ పురుషుని శుద్ధ, నీరవ ఆత్మరూపమున మనము కలిసికొనవచ్చునో, అతని నొక విశాల సక్రియ పురుషరూపమున సైతము కలిసికొనగలము; అతడే సర్వ కర్మల నారంభించును (10-8), అతడే లోకేశ్వరుడు, అతడే మానవుని యజ్ఞ తపః కర్మల నియామకుడు (5-29) - అని తెలియగలము. కావున, ఈ జ్ఞానమును సైతము మన మిపుడు ఉన్నత నిర్వ్యక్తిక తానుభవమునకు కలుపవలెను. పైకి స్వయముగనే సాగుచున్నట్లు గన్పించు ఈ యాంత్రిక ప్రకృతివ్యాపారమునందు ఒక అంతర్వాసి దివ్య సంకల్పము దాగియున్నది (17-6), అదియే దానిని నిర్బంధించి నడుపుచు, దాని లక్ష్యముల రూపమును నిర్ణయించును. కాని నీ వ్యక్తిత్వముయొక్క ఇఱుకు గదిలో మూయ బడియు, అహంకారము మఱియు దాని కామముల దృక్కోణముచేత అంధీభూతుడవు, శృంఖలాబద్ధుడవు నయి యున్నంత కాలము ఆ దివ్య సంకల్పము నీకు తోచదు, నీకు తెలియదు (3-27). ఏలన జ్ఞానముచేత నీకు నిర్వ్యక్తికత ప్రాప్తించి నపుడే, అన్ని వస్తువులను ఆత్మ మఱియు భగవంతునియందును, అటులే ఆత్మను మఱియు భవంతుని అన్ని వస్తువులయందును చూడదగు విశాలత నీకు అబ్బినపుడే, నీ వా సంకల్పమునకు పూర్తిగా ప్రతిస్పందించ గలవు. ఇచ్చట సర్వమును పరమ పురుషుని శక్తిచేతనే సంభవించును; వస్తువుల యందు భగవంతునియొక్క అంతఃస్థితిచేతనే మఱియు ప్రతిప్రాణి హృదయమునందు

అతని సన్నిధిచేతనే అన్నియు తమ పనులను జేయును. జగత్స్రష్ట తన సృష్టిచేత పరిమితుడు గాడు (9-5); కర్మప్రభువు తన కర్మలచేత బద్ధుడు గాడు (4-13); భగవదిచ్ఛ తన శ్రమయందును, దాని ఫలితము లందును సక్తము గాదు : ఏలన అది సర్వ శక్తము, సర్వవంతము (all-possessing) మఱియు సర్వానందమయము. కాని అట్లయినను ఈశ్వరుడు తన అతీతావస్థనుండి తన సృష్టిపై, క్రిందికి దృష్టి సారించును; అత డవతారరూపమున దిగివచ్చును (4-6); అత డిచ్చట నీయం దున్నాడు; అత డన్ని వస్తువులను లోపలినుంచి తమ ప్రకృతి ననుసరించి శాసించును. మఱియు నీవును అతనియం దుండి కర్మ చేయవలెను - పరిమితిచేత గాని, సంగముచేత గాని, బంధనముచేత గాని స్పృశించ బడని దివ్య ప్రకృతియొక్క విధానమును మఱియు క్రమము ననుసరించి కర్మ చేయవలెను. అందరి పరమ కల్యాణమునకు (5-25) కర్మ చేయుము, ప్రపంచ యాత్రను కాపాడుటకు కర్మ చేయుము, లోకసంగ్రహార్థము (3-20) కర్మచేయుము. నేను నీనుండి అపేక్షించు కర్మ - అది ముక్తయోగియొక్క కర్మ (4-23); అది భగవంతుడు ధరించి యుండు ఒక విముక్తశక్తియొక్క సహజసిద్ధ బహిఃప్రవాహము, అది సమచిత్తతతో గూడిన ఒక క్రియావిలాసము, అది ఒక నిస్స్వార్థ, నిష్కామ శ్రమపూరము.

27. కర్మయోగ ప్రథమసూత్రము :

"ఈ విముక్త, ఈ సమ, ఈ దివ్య కర్మయోగమునందు ప్రథమ సోపాన మేమన, ఫలము మఱియు ప్రతిఫలమునందు ఆసక్తికి స్వస్తి చెప్పి, కర్తవ్య కర్మకొఱకే కర్తవ్యకర్మను జేయ నీవు పాటుపడ వలెను (3-19). ఏలన ఫలములు నీకు గాక, లోకేశ్వరునికే చెందు నని అంతరాంతరములో నీ కనుభవ ముండవలెను. ఎవడు జగద్వ్యాపారమునందు తన నభివ్యక్తము చేసికొనుచు, కృతకృత్యుడగుచున్నాడో, అట్టి పరమ పురుషునికి నీ శ్రమను నివేదించి, వానికే దాని ఫలితములను వదలివేయుము (9-28). నీ కర్మపర్యవసానము అతని ఇచ్ఛచేత మాత్రమే నిర్ణయింపబడును మఱియు నది శుభమైనను, అశుభమైనను, జయమైనను, అపజయమైనను, తన ప్రపంచప్రయోజనమున కది యొక సాయముగానే మార్చబడును (11-33). కావున వైయక్తిక సంకల్పము యొక్కయు, సంపూర్ణ ఉపకరణాత్మక ప్రకృతియొక్కయు సర్వథా నిష్కామ, నిస్స్వార్థ క్రియవిధానము కర్మయోగముయొక్క ప్రథమ సూత్ర మగును. అందుచేత నెట్టి ఫలమును

అపేక్షింపకుము, నీ కెట్టి ఫలిత మివ్వబడినను స్వీకరింపుము; సమత తోను, ప్రశాంత ప్రసన్నతతోను స్వీకరింపుము : గెలిచినను, ఓడినను, సంపన్నుడ వైనను, విపన్నుడ వైనను, నిత్రమగు దివ్యకర్మపథమున నిర్భీకముగా, వ్యథ జెందక, సందేహించక ముందుః సాగుము.

28. ఆంతర సంకల్ప సన్యాసము రెండవ మెట్టు :

"ఇది కర్మపథమున మొదటి మెట్టు మాత్రమే. ఏలన ఫలములయందు మాత్రమేగాక, నీ శ్రమయందును నీవు అనాసక్తుడవు గావలెను (3-25). నీ కర్మలు నీవి - యని తలంచుటను కట్టి పెట్టుము; నీవు నీ కర్మఫలములను పరిత్యజించిన యట్లే, కర్మను సైతము కర్మ మఱియు యజ్ఞముల ఈశ్వరునికి అర్పించివేయుము (3-30). నీ కర్మలను నిర్ణయించునది నీ ప్రకృతియే యని గుర్తించుము; నీ ప్రకృతియే నీ స్వభావముయొక్క సాక్షాద్గతిని శాసించును (18-59) మఱియు విశ్వప్రకృతియొక్క కార్యనిర్వాహక శక్తి అనుసరించు మార్గమున నీలోని పురుషునియొక్క అభివ్యక్తిపరమగు మలుపును, వికాసమును నిశ్చయించును. భగవన్మార్గము ననుసరించుటయందు నీ మనోగతిని భ్రమకు లోనుగావించు నెట్టి స్వేచ్ఛకు నిక తావివ్వకుము (18-55). నీ స్వభావము నకు అనురూపమగు కర్మను చేపట్టుము (18-47). మహత్తమము, మిక్కిలి అసాధారణము నగు ప్రయత్నమునుండి అత్యల్ప నిత్యకృత్యమువఱకు నీవు చేయు దాని నంతను - నీ మనస్సు యొక్క ప్రతిక్రియను, నీ హృదయముయొక్క ప్రతిక్రియను, నీ దేహముయొక్క ప్రతిక్రియను, ఆంతర మఱియు బాహ్యమగు ప్రతి ప్రవృత్తిని (turn), ప్రతి ఆలోచనను, సంకల్పమును, భావమును, చివరకు ప్రతి అడుగును, విరామమును, ప్రతిచలనమును - సర్వమును యజ్ఞతపస్యుల మహేశ్వరునికి (5-29) ఒక యజ్ఞరూపమున జేయుము.

29. ఆంతర కర్మసన్యాసము చివరి మెట్టు :

"నీవు పరమ సనాతనుని యొక్క ఒకసనాత నాంశ (15-7) మనియు, అతడు లేనిచో, నీ ప్రకృతిశక్తులకు ఉనికియే యుండ దనియు, అవి అతని ఒక ఆంశిక స్వీయాభివ్యక్తియే గాని ఇతర మేమియు గాదనియు తర్వాత తెలిసికొనుము. భగవంతుడగు అనంతుడే నీ ప్రకృతి యందు అధికాధికముగా పూర్ణరూపము

ధరించుచున్నాడు. పరమేశ్వరుని శక్తియే, అతని పరమోచ్చ సంభూతిశక్తియే నీ స్వభావమును రూపొందించుచు, దానియందు రూపొందుచున్నది. కావున నేను కర్త - ననే బుద్ధి సర్వథా విడిచివేయుము; సనాతను డొక్కడే కర్మకర్త యని దర్శించుము (13-31). నీయందలి ప్రాకృత పురుషుని అతనికి ఒక నిమిత్తము (11-33), ఒక ఉపకరణము, ఒక శక్తివాహిని, ఒక అభివ్యక్తిసాధనము గానిమ్ము. నీ యిచ్ఛను అతని కర్పించివేసి, అతని సనాత నేచ్ఛతో ఏకము గావించుము. నీ ఆత్మ మఱియు ఆధ్యాత్మిక పురుషుని నీరవ స్థితి యందు నీ సర్వకర్మలను నీ ప్రకృతియొక్క పరమ ప్రభువునకు సమర్పించుము (3-30). నీలో అహంభావము గాని, మానసిక స్వత్వము గాని, ప్రాణిక కోలాహలము గాని యున్నంత కాలము ఈ సమర్పణ యథార్థముగా లేక పూర్ణముగా సాధ్యము కాదు. ఏలన ఒక కర్మ ఏమాత్రము అహంనిమిత్తము చేయబడినను లేక అహంయొక్క కామన మఱియు సంకల్పముతో దూషితమైనను, అది పూర్ణ యజ్ఞము కాజాలదు. అటులే మనలో నెచ్చట నేనను అసమత గాని, అజ్ఞానకృత రాగ ద్వేషముల ముద్ర గాని యున్నంత కాలము ఈ మహత్ కార్యము బాగుగాను, యథార్థముగాను చేయబడజాలదు. కాని సమస్త కర్మలు, ఫలితములు, వస్తువులు మఱియు వ్యక్తుల పట్ల ఎప్పు డొక పరిపూర్ణ సమత నిలిచియుండునో, కామము లేక అహంకారమునకు గాక, పరమ పురుషునికే సమర్పణ చేయబడియుండునో, అపుడు నీ పరివర్తిత ప్రకృతియొక్క పవిత్రత మఱియు భద్రతయందు భగవదిచ్ఛ సర్వ కర్మలను ఎట్టి పొరపాటు గాని, విచలనము (deflection) గాని లేక నిర్ణయించగలుగును, అటులే భగవచ్ఛక్తి వానిని ఎట్టి నిమ్న హస్తక్షేపము (జోక్యము) గాని, బాధక ప్రతిక్రియ గాని లేక స్వేచ్ఛగా నిర్వహించగలుగును. తన నిష్కళంక పరమాధికారమునందు భగవదిచ్ఛ నీద్వారా నీ ప్రతికర్మను రూపొందించుట కవకాశ మిచ్చుటే యోగయుక్తుడవై (2-48) కర్మ చేయుటచేత - కర్మయోగముచేత - నీకు ప్రాప్తించు సిద్ధియొక్క పరాకాష్ఠ యగును. అది జరిగినపుడు, పురుషోత్తమునితో నొక సంపూర్ణ, నిత్య సాయుజ్యము నందు నీ ప్రకృతి తన విశ్వాంతర్గత మార్గము ననుసరించును, పరమ పురుషుని అభివ్యక్తము చేయును, పరమేశ్వరాజ్ఞను పాలించును.

30. కర్మమార్గము శ్రేష్ఠతరము :

"దివ్య కర్మల ఈ మార్గము జీనవము మఱియు కర్మల బాహ్య సన్యాసము కంటెను ఎంతో ప్రశస్యతర ముక్తియు, ఎంతో పూర్ణతర మార్గము మఱియు పరిష్కారః ను అగును (5-2). బాహ్య సన్యాసము సంపూర్ణముగా సంభవమును గాదు (18-11) మఱియు సంభవమైనంతలో సైతము, అది ఆత్మయొక్క స్వాతంత్ర్యమునకు ఆవశ్యకమును గాదు; మఱియు నది ఒక విపత్కర దృష్టాంతము, కారణము, దాని ప్రభావము సామాన్యమానవులను తప్పుదారి బట్టించును (3-26). ఏలన శ్రేష్ఠులు, మహాత్ములు స్థాపించిన ప్రమాణమునే తక్కిన జాతి యంతయు అనుసరించ ప్రయత్నించును. అందుచేత, క్రియ దేహధారి జీవుని యొక్క ప్రకృతియే గావునను (3-5) మఱియు కర్మలు సనాతన కర్మయగు ఈశ్వరునియొక్క సంకల్పమే గావునను, మహాపురుషులు, మహామనీషులు ఈ కర్మదృష్టాంతమును స్థాపించవలెను (3-26). వారు ఎట్టి మినహాయింపు లేక ప్రపంచ కర్మల నన్నింటిని జేయుచు ప్రపంచ-కర్ములు గావలెను, - వారు స్వతంత్రులు, ప్రసన్నులు మఱియు నిష్కాములు నగు భగవత్ - కర్ములు గావలెను, విముక్తమగు అంతరాత్మలును, ప్రకృతులును గావలెను.

31. ఆనందము కలిసి నపుడే పూర్ణ సంసిద్ధి :

"జ్ఞానవిషయక మనస్సును, క్రియావిషయక సంకల్పమును - ఇవియే సర్వము గావు; నీలో ఆనందము నపేక్షించు హృదయమును గలదు. ఈ భాగమునందును, అనగా హృదయముయొక్క శక్తి మఱియు దీప్తియందును, దాని ఆనందాపేక్ష ననుసరించి, అంతరాత్మ తృప్తి నిమిత్తము నీ ప్రకృతిని భగవంతునితో అనన్యమగు సచేతన ఆనందానుభవమునకు మఱల్చుము, పిమ్మట రూపాంతరము జెందించుము మఱియు దానిలోని కుద్ధరించుము. నిజమే, నిర్వ్యక్తి కాత్మయొక్క జ్ఞానము తన స్వీయానందమును గొనివచ్చును; నిర్వ్యక్తికతకు సైతము ఒక ఆనంద మున్నది, అది శుద్ధ సత్తయొక్క కేవలానందము, ఆనంద కైవల్యము. కాని సమగ్ర జ్ఞానము ఒక అధికతర త్రివిధ ఆనందమును, సమ్మోదమును గొనివచ్చును. ఎట్లన, అది అతీతానందముయొక్క కవాటములను తెఱచును; అది విశ్వగత నిర్వ్యక్తికతయొక్క ఒక నిస్సీమానందము లోనికి మనకు విడుదల గన్పించును; అది ఈ సమస్త అసంఖ్యాక అభివ్యక్తియందు గల హర్షాతిరేకమును సైతము కనుగొనును : ఏలన

ప్రకృతిస్థ సనాతన పురుషునియందు సైతము ఒక ఆనందము గలదు (6-31). ఈ ఆనందము జీవలోకమునం దిచ్చట భగవంతునియొక్క ఒక అంశమైన (15-7) జీవునియందు ఒక హర్షాతిరేక రూపము ధరించును, ఇది జీవుని మూలమగు భగవంతునియందును, అతని సర్వోన్న తాత్మయందును, అతని ప్రాణేశ్వరుని యందును ప్రతిష్ఠితమై యుండును. భగవంతుని లోనికి ప్రవహించు పూర్ణప్రేమయు, ఉపాసనయు ప్రపంచము పట్లను, దాని సమస్త రూపములు, శక్తులు మఱియు ప్రాణుల పట్లను పెంపెసగు విస్తృత ప్రేమకు విస్తరించును. ఎట్లన, సర్వమునందును భగవంతుడు చూడబడును, పొందబడును, ఆరాధించబడును, సేవించబడును లేక ఏకతయందు తదనుభవము లభించును (6-31). జ్ఞానము మఱియు కర్మలకు సనాతన త్రివిధ ఆనందరూపమగు నీ పరమ కిరీటమును దొడగుము; ఈ ప్రేమకు ప్రవేశ మిమ్ము, ఈ ఆరాధనను నేర్చుకొనుము: దానిని (భక్తిని) కర్మజ్ఞానములతో ఏకాత్మకము గావించుము. ఇదియే పరిపూర్ణ పరిపూర్ణత యొక్క (సంసిద్ధియొక్క) శిఖరాగ్రము.

32. పూర్ణప్రేమ పూర్ణజ్ఞాన కీలకము :

"ఈ ప్రేమయోగము ఆధ్యాత్మిక మహత్త, ఏకత మఱియు స్వాతంత్ర్యము కొఱకు నీ కొక సర్వోన్నత గుప్తశక్తి నిచ్చును. కాని అది భగవజ్ జ్ఞానముతో అనన్య మగు ప్రేమ గావలెను. 1. దుఃఖమునందు ఓదార్పు, సాయము మఱియు విముక్తికొఱకు భగవంతు నన్వేషించు నొక భక్తి గలదు (7-16): 2, భగవంతుని వరములకొఱకును, అతని సాహాయ్య సంరక్షణల నిమిత్తమును, తన కోర్కెలను పిదుకు కామధేనువుగాను భగవంతు నన్వేషించు నొక భక్తి గలదు: 3. ఇంకను అజ్ఞానమునందుండి, ప్రకాశ జ్ఞానముల నిమిత్తము భగవంతునివైపునకు దిరుగు భక్తియు గలదు. మఱియు నీ మూడు రూపములకు పరిమితమై యున్నంత కాలము ఉచ్చతమ, ఉదారతమ భవదభిముఖ వృత్తియందు సైతము త్రిగుణముల ఒకానొక క్రియ నిలిచియుండ వచ్చును. కాని ఈశ్వరప్రేమి ఈశ్వరజ్ఞాని గూడ అయినపుడు, ఆ ప్రేమి తన ప్రియునితో ఏకాత్మకు డగును (7-18); ఏలన అట్టి ప్రేమి దేవదేవున కిష్టుడు (18-54), పరమాత్మచేత వరింపబడినవాడు (కఠ ఉప.). కావున నీయం దీ భగవన్మగ్నప్రేమను పెంపొందించుకొనుము; ఆధ్యాత్మికీకృతము, తన నిమ్న ప్రకృతి యొక్క పరిమితులనుండి పైకి ఉద్ధృతము నగు హృదయము భగవంతుని

అమేయ సత్తయొక్క నిగూఢ రహస్యములను మిక్కిలి ఆంతరంగికముగా (intimately) నీకు ప్రకటించును; నీలోనికి అతని దివ్యశక్తి సంపూర్ణస్పర్శను, ప్రవాహమును, మహిమను గొనివచ్చును; మఱియు నొక శాశ్వత హర్షాతిరేకముయొక్క పరమ గుహ్యముల ద్వారమును నీకు తెఱచును. పూర్ణ ప్రేమయే ఇట్లు పూర్ణ జ్ఞానమునకు కీలకము (18-55).

33. ప్రేమ కర్మ జ్ఞానముల కిరీటము :

"ఈ సమగ్ర భగవత్ప్రేమ నీయందును, సర్వభూతములయందును గల భగవంతునికొఱకు ఒక సమగ్ర కర్మను గూడ అపేక్షించును. పాపము లేక పుణ్యమగు ఒకానొక కామమునకో, నిమ్నము లేక ఉచ్చమగు ఒకానొక ప్రాణిక ప్రేరణకో, సామాన్యము లేక ఉదాత్తమగు ఒకానొక మానసికాభిరుచికో విధేయుడై గాని, ఒకానొక మిశ్ర మానసిక మఱియు ప్రాణిక హేతువుచేత గాని సాధారణ మానవుడు కర్మకు బూనుకొనును. కాని ఓ అర్జునా, నీచేత చేయబడు కర్మ స్వతంత్రము, నిష్కామము గావలెను; నిష్కామముగా జేయబడిన కర్మ ఎట్టి ప్రతిక్రియను సృజించదు, ఎట్టి బంధమును విధించదు (4-20, 22). ఒక పూర్ణ సమతయందును (2-48), ఒక అవిచల స్థిరత మఱియు శాంతియందును (5-12) చేయబడు కర్మ మున్ముందు ఒక ఆధ్యాత్మిక బాధ్యతయొక్క - "కర్తవ్య కర్మయొక్క" (3-19) - సూక్ష్మ భారరూపము ధరించును, కారణము, దానిలో దివ్యావేశ ముండదు; పిమ్మట ఆ కర్మ దివ్య యజ్ఞముయొక్క ఉన్నత రూపము ధరించును (4-25); తన ఉత్తమ రూపమున అది భగవంతునితో సక్రియ ఏకతకు సాధకుని శాంత, ప్రసన్న అంగీకారముయొక్క ఒక ప్రకటనము కాగలదు. కాని ప్రేమయందలి ఏకత ఇంకను ఎంతో ఎక్కువ సాధించును: అది ప్రథమ నిర్వికార శాంతిస్థానమున ఒక ప్రబల, గంభీర హర్షోల్లాసమును ప్రతిష్ఠించును, ఈ హర్షోల్లాసము అహంకారిక కామముయొక్క క్షుద్రావేశము గాక, అనంతానందము యొక్క మహాసాగర మగును. ప్రేమయందలి ఏకత నీ కర్మలలోనికి ప్రియతమ భగవత్సన్నిధియొక్క హృదయస్పర్శ అనుభూతిని, విశుద్ధ దివ్యావేశమును గొని వచ్చును; నీయందును, సర్వభూతములయందును అవస్థితుడై యున్న భగవంతుని కొఱకు జేయు కర్మయొక్క అవిచ్ఛిన్నానందము నీ సొత్తగును. ఇట్లు ప్రేమ కర్మమకుటమును, జ్ఞానమకుటమును అగును.

34. ప్రేమ సమగ్ర సాయుజ్య సాధనము :

"జ్ఞానాత్మక మైన ఈ ప్రేమ, నీ కర్మయొక్క గంభీర హృదయము కాగల ఈ ప్రేమ అశేష నివేదనకును, సంపూర్ణ సంసిద్ధికిని నీ అత్యంత ప్రభావశాలి శక్తి యగును (11-54). భగవంతుని సర్వసత్తతో వైయక్తిక సత్తయొక్క సమగ్ర సాయుజ్యము పరిపూర్ణ ఆధ్యాత్మిక జీవనమునకు వలయు నిబంధనమగును (condition) (18-55). కావున సర్వాత్మనా భగవదభిముఖుడవు గమ్ము; జ్ఞాన ప్రేమ కర్మలచేత నీ ప్రకృతి నంతను అతనితో ఏకముచేయుము. సర్వథా అతని వైపునకు దిరుగుము మఱియు నీ మనస్సును, నీ హృదయమును, నీ యిచ్ఛను నీ సమస్త చేతనను, చివరకు నీ ఇంద్రియములను, తనువును సైతము నిస్సంకోచముగా అతని హస్తములలోని కర్పించివేయుము. అర్పించి, నీ చేతనను అతని దివ్యచేతన యొక్క ఒక నిర్దోష ఆకృతిలోనికి రూపొందించ నిమ్ము. అటులే నీ హృదయమును భగవంతునియొక్క స్వచ్ఛ లేక సముజ్జ్వల హృదయము గానిమ్ము, నీ యిచ్ఛ అతని యిచ్ఛయొక్క ఒక నిర్దోష క్రియ గానిమ్ము. చివరకు నీ యింద్రియములును, శరీరమును సైతము భగవంతుని ఉల్లాసమయ ఇంద్రియవృత్తి మఱియు శరీరము గానిమ్ము. నీ సమస్త సత్తాప్రకృతులతో అతనిని ఆరాధించుము, అతనికి యజ్ఞము చేయుము; ప్రతి చింతనయందును, భావమునందును, ప్రతి ప్రేరణయందును, చేష్టయందును అతనిని స్మరింపుము. ఈ చింతనాదు లన్నియు సర్వథా అతనివే యగువఱకును, మఱియు నీ ఆధ్యాత్మిక సత్తయొక్క పవిత్ర గర్భాలయమునందు వలెనే నీ సర్వ సామాన్య, బాహ్యాతిబాహ్య వృత్తులయందు సైతము అతని సంతత, పరివర్తనసాధక సన్నిధి ప్రతిష్ఠితమగు వఱకును నీ విట్లు దీక్షవహించుము.

35. పరివర్తనకు సర్వసమర్పణ :

"ఈ త్రివిధ మార్గము సాధనముగా నీవు నీ నిమ్న ప్రకృతినుండి పైకెగసి, నీ పరమ ఆధ్యాత్మిక ప్రకృతిలో ప్రవేశించ గలవు. అది గుప్తముగా నున్న అతిచేతన (super conscient) ప్రకృతి; సర్వోచ్ఛ అనంత భగవంతునియొక్క ఒక అంశమును, అతనితో సత్తాధర్మము (law of being) నందు ఘనిష్ఠముగా ఏకమును అగు జీవుడు (15-7) ఆ ప్రకృతిలో ప్రవేశించి, తన పరమ సత్యమున నివసించునే గాని, ఇక బాహ్యీకృత మాయయందు గాదు. కాగా, ఈ సంసిద్ధిని, ఈ ఏకతను తన స్వీయ సహజ స్థితియందు, అనగా ఒక పరమ విశ్వాతీత భావమునందు దూరముగా

నుండి చవిచూడవచ్చును; కాని ఇచ్చట గూడ – మానవ శరీరమునందును, భౌతిక ప్రపంచమునందు గూడ – నీవు దానిని సాధించవచ్చును, మఱియు సాధించవలెను. ఈ లక్ష్యసిద్ధికి, లోపలి నిర్గుణాత్మయందు ప్రశాంత, నిష్క్రియముగా, గుణవిముక్తముగా - నుండి, బాహ్య అవయవము లందు గుణముల యాంత్రిక వ్యాపారమును నిర్లిప్తముగా గమనించుచు, ఉదాసీనముగా అనుమతించి నంతమాత్రమున – అది చాలదు. ఏలన నిష్క్రియాత్మ వలెనే సక్రియ ప్రకృతియు భగవంతున కర్పించబడి (18–62), భగవంతుడు గావలసి యున్నది. నీ సత్త యంతయు పురుషోత్తమునితో ఏక సత్తాధర్మము లోనికి – "సాధర్మ్యములోనికి" (14–2) – పెరుగవలెను; సర్వము, అర్జునా, నా సచేతన ఆధ్యాత్మిక సంభూతిలోనికి – "మద్భావములోనికి" (14–19) – రూపాంత రితము గావలెను. ఇందునిమిత్తము సంపూర్ణ సమర్పణ మావశ్యకము. నీ ప్రకృతి యొక్క నానావిధమగు సమస్త మార్గములందును, సమస్త సజీవ ప్రకారములందును నాయందు శరణుబొందుము; ఏలన అట్టి శరణాగతి యొక్కటియే ఈ మహా పరివర్తనమును, పరమసంసిద్ధిని సాధించును (18–62).

36. కర్మసమస్య ఉండనే యుండదు :

"ఈ సమున్నత యోగపరిణామము కర్మసమస్యను ఒకే సారి పరిష్కరించి వేయును, కాదు, దానిని పూర్తిగా తుడిచి వేయును, దాని మూలోచ్ఛేదము చేయును. మానవ కర్మ కష్టములతోను, కలవరముల తోను నిండియుండును, అది గహనము, సంకులము నగు నొక అరణ్యము వంటిది; ఈ కర్మారణ్యము ద్వారా కాక, ఈ కర్మారణ్యములోనికి ఎక్కువ తక్కువ అస్పష్టముగా కొన్ని దారులు చేయబడినవి, అంతే; కాని ఈ కష్టతయు, సంకులతయు మానవు డిపుడు తన మానసిక, ప్రాణిక మఱియు భౌతిక ప్రకృతియొక్క అజ్ఞానము నందు నివసించుచున్నాడను ఒకే వాస్తవమునుండి ఉత్పన్నమగుచున్నవి. ఆ ప్రకృతిగుణము లతనిచేత బలాత్కారముగా పనిచేయించును (3–5), అయినను చేయవలసిన బాధ్యత నాకు గలదని తన సంకల్పమున అతడు పీడితు డగును; ఏలన తా నొక అంతరాత్మ ననియు, ఇపు డట్లు సుతరాము గాకపోయినను, లేక స్వల్పముగా మాత్రమే యైనను, అంతరాత్మగా తా నొకనాడు తన ప్రకృతికి స్వామి మఱియు శాసకుడు గావలసి యున్నదనియు అతనిలో నెక్కడో స్ఫురించుచుండును. తన జీవననియమము లన్నియు, తన ధర్మము లన్నియు ఇప్పటి పరిస్థితులలో అపూర్ణము, తాత్కాలికము మఱియు ఉ

త్తమపక్షమున ఆంశికముగా మాత్రమే ఉచితము లేక సత్యము గాక తప్పదు. ఎప్పుడతడు తనను తెలిసికొనునో, తన నివాసభూమియగు ప్రపంచ వాస్తవ ప్రకృతిని దెలిసికొనునో, మఱియు, నన్నింటిని మించి, తా నెవనినుండి వచ్చునో, ఎవని యందును, ఎవనిచేతను మనునో, ఆ పరమ సనాతనుని దెలిసికొనునో, అదిగో, అప్పు డతని అపూర్ణతలన్నియు నంతమొందును (9–1). అత డొకసారి సత్యచేతనను, సత్యజ్ఞానమును అందుకొను నేని, అతని కిక నెట్టి సమస్యయు నుండదు; ఏలన అపుడతడు తన లోపలినుండియే (గుణముల బలాత్కారముచేత గాక) స్వేచ్ఛగా కర్మచేయును మఱియు తన సత్తయొక్కయు, తన ఉచ్ఛతమ ప్రకృతియొక్కయు సత్యము ననుసరించి సహజసిద్ధముగా నివసించును. చివరకు, ఈ జ్ఞానము యొక్క పూర్ణరూపమునందు, దాని పరమ శిఖరము నందు కర్మచేయునది తాను గాక భగవంతుడే యగును, సనాతనుడు మఱియు ననంతుడు నగు ఏకేశ్వరుడే తనయందును, తనద్వారాను, తన (ఇప్పటి) విముక్త ప్రజ్ఞయందును, శక్తియందును, పూర్ణతయందును కర్మచేయును.

37. ప్రాకృత మానవుడు – గుణధర్మములు :

"మానవుడు తన ప్రాకృత సత్తయందు ప్రకృత్యధీనుడగు ఒక సాత్త్విక, రాజసిక మఱియు తామసిక ప్రాణి యగును. ఆమె గుణములలో నేది అతనియందు ప్రాబల్యము వహించునో, అతడు దాని ననుసరించియే తన జీవన, కర్మల నియమము నేర్పఱచుకొనును మఱియు నవలంబించును. అతని తామసిక, దైహిక, ఇంద్రియాత్మక మనస్సు జడతా, భయ, అజ్ఞానములకు అధీనమై యుండి, కొంతవఱకు తన పరిసరముయొక్క నిర్బంధమును, కొంతవఱకు తన కామములయొక్క ఆకస్మిక ఆవేగములను అనుసరించును, లేదేని తామసిక, ఆచారబద్ధ బుద్ధియొక్క పరిపాటి – క్రియయందు తలదాచుకొనును. పోగా, కామాత్మకమగు రాజసిక మనస్సు, తాను దేనియందు నివసించునో, ఆ ప్రపంచముతోనే పోరుసల్పును మఱియు సదా క్రొత్తక్రొత్త వస్తువులను బొంద బ్రయత్నించును, అటులే శాసించుటకును, యుద్ధముచేసి జయించుటకును, నిర్మాణ వినాశములందును, సంచయచేష్టయందును వ్యగ్రమై యుండును. జయాపజయము లకు, హర్షశోకములకు, ఉల్లాసవిషాదములకు మధ్య విధూతమగుచు, అది సదా ముందడుగు వేయును. కాని ఇంతకును, అది ఏ ధర్మము ననుసరించి నట్లు గన్పించినను, వస్తుతః నిమ్నమగు కామాత్మ మఱియు

నహంకారముయొక్క నియమమును మాత్రమే, చంచల, అశ్రాంత, స్వభక్షక మఱియు సర్వభక్షకమగు, ఆసురిక మఱియు రాక్షసిక మనస్సు యొక్క నియమమును మాత్రమే అనుసరించును. చివరకు సాత్త్విక బుద్ధి కొంతవఱకీ స్థితిని అధిగమించును మఱియు కామాహంకారముల నియమము కంటెను శ్రేష్ఠ తరమగు నియమము నొక దానిని అనుసరించుటయొక్క ఆవశ్యకతను గాంచును; కావున నొక సామాజిక, ఒక నైతిక, ఒక ధార్మిక నియమమును - ఒక ధర్మమును, ఒక శాస్త్రమును - ఏర్పఱచి, దానిని తనపైననే విధించుకొనును. మనస్సు మఱియు సంకల్పమునకు దారి జూప ఒక ఆదర్శమును లేక వ్యావహారిక నియమమును ఏర్పఱచి, దానిని జీవన, వర్తనము లందు సాధ్యమైనంత చిత్తశుద్ధితో పాటించుట - ఇది మానవుని సాధారణ మానస మెంత పైకి పోగలదో, అంతటి ఉచ్చస్థితి ఈ సాత్త్విక మనస్సు పెంపొంది, తన శిఖ రాగ్రము నందుకొనవలెను; అక్కడది అహంకార ప్రేరణతో గూడిన మిశ్రమమును సర్వథా పరిత్యజించ సమర్థమగును మఱియు నట్లు పరిత్యజించి, నిర్వ్యక్తికమగు నొక సామాజిక, నైతిక లేక మతనిర్దిష్ట ఆదర్శముగా, చేయుట సముచితము గావుననే నిస్స్వార్థముగా చేయబడదగిన వస్తువుగా - "కర్తవ్యకర్మగా" (3-19) - ధర్మముకొఱకే ధర్మము నాచరించును (17-11).

38. స్వధర్మ నిర్వచనము :

"కాని, ఈ సమస్త ప్రకృతి క్రియయొక్క వాస్తవ సత్య మేమన, అది అల్పాంశమునందు బాహ్య మానసికము, అధికాంశము నందు ఆంతర అంతరాత్మికము. అనగా, మానవుడు భౌతిక మఱియు మానసిక ప్రకృతి యందు మునిగియున్న ఒక దేహధారి అంతరాత్మ, మఱియు నత డా ప్రకృతి యందు తన వికాసము నిమిత్తము ఒక ప్రగతిశీల నియమము ననుసరించును మఱియు ఈ నియమము తన సత్తయొక్క ఒక ఆంతర ధర్మముచేత నిర్ధారితమగును; తన అంతరాత్మయొక్క ఆకృతియే తన మనఃప్రాణముల ఆకృతిని, అనగా తన "స్వభావమును" (8-3) నిర్మించును. ప్రతి మానవునకు ఒక "స్వధర్మ" (3-35) ముండును, అది తన అంతఃసత్తను బాలించు నియమము, దానినే అతడు గమనించి, కనిపట్టి, అనుష్ఠించవలెను. తన ఆంతర ప్రకృతిచేత నిర్ణీతమైన కర్మయే మానవుని వాస్తవ స్వధర్మము, దాని ననుష్ఠించుటయే అతని యథార్థ వికాసనియమము; దానిని విడిచి పెడ దారి పట్టుట యన సంకరమును, ప్రతిరోధమును (retardation),

భ్రాంతనిర్ణయమును గొనితెచ్చుకొనుటయే. తన స్వధర్మమును కనిపట్టి అనుష్ఠించుటకు మానవున కేది సాయపడునో, అట్టి సామాజిక, నైతిక, మతవిహిత లేక తదితర నియమము మఱియు నాదర్శమే అతనికి సర్వదా సర్వశ్రేష్ఠము.

39. ఆత్మజ్ఞానము × గుణగతాజ్ఞానము :

"కాని తన ఉత్తమావస్థయందు సైతము ఈ స్వధర్మక్రియ యంతయు గూడ మనస్సుయొక్కయు, గుణఖేలనము యొక్కయు అజ్ఞానమునకు అధీనమై యుండును. మానవుని అంతరాత్మ తన స్వరూపమును (ఆత్మను) కనుగొని నపుడే, గుణభూమికను దాటి, గుణముల అజ్ఞాన, సంకరములను తన చేతననుండి తుడిచివేయగలుగును. నిజమే, నిన్ను నీవు కనుగొని, నీ ఆత్మయందు నివసింప సాగినపుడు సైతము, నీ ప్రకృతి ఇంకను తన ప్రాత గాడులయందే నడుచుచు, కొంత కాలము తన నిమ్న రీతుల ననుసరించియే పని చేయుచుండును; అయితే ఆ పని నిపుడు నీవు పరిపూర్ణ ఆత్మజ్ఞానముతో వెనుక నుండి గమనించుచు, దానిని నీ ప్రాణేశ్వరునికి ఒక యజ్ఞముగా నర్పించగలవు. కావున నీ స్వధర్మ-నియమము ననుసరించుచు, నీ స్వధర్మ-నియతమగు కర్మ నాచరింపుము- ఆ కర్మ ఏది యైనను గావచ్చును (18-47). అహంకారముయొక్క సర్వ ప్రేరణను ఆవలకు నెట్టివేయుము, నీ బాహ్యేచ్ఛయొక్క సర్వారంభణమును త్రోసివేయుము, కామముయొక్క సర్వశాసనమును కాల దన్నుము-నీ సత్తయొక్క సర్వ-ప్రకారములను సర్వేశ్వరునికి సర్వథా సమర్పించగలుగువఱకు నట్లు చేయుము (18-65).

40. "సర్వ ధర్మాన్ పరిత్యజ్య" :

"మఱియు నీ వీ సమర్పణ నొక సారి మనస్ఫూర్తిగా చేయగలుగుదు వేని, అదిగో, అది నీలోపలి పరమేశ్వరుని హస్తముల లోనికి అశేషముగా నీ సర్వకర్మల ఆరంభణమును (initiation) సన్యసించుటకు (3-30) దగిన పరమముహూర్త మగును. అపుడు ఆచారవ్యవహారములకు సంబంధించిన సర్వ నియమముల నుండియు, "సర్వ ధర్మములనుండియు" (18-66) విముక్తిని బొందెదవు. నీలోని దివ్య శక్తియు, దివ్య సన్నిధియు పాప, అశుభములనుండి నిన్ను విడిపించి (18-66), పుణ్యపాపములకు సంబంధించిన మానవ ప్రమాణముల కంటెను ఎంతో పైకి లేవనెత్తును. ఆ ఎత్తున నీవు ఆధ్యాత్మిక సత్త మఱియు దైవ ప్రకృతియొక్క నిరపేక్ష మఱియు స్వతఃసిద్ధ ఋతము (right, ధర్మము) మఱియు శుద్ధతయందు నివసింతువు

మఱియు కర్మచేతువు. అచ్చట నీవు గాక, దివ్య పురుషుడే తన స్వీయ సంకల్పమును, కర్మలను నీద్వారా నిర్వహించు కొనును – నీ నిమ్న అహంకారిక సుఖము మఱియు కామనాపూర్తికొఱకు గాక, జగత్ప్రయోజనము నిమిత్తమును, నీ దివ్య శ్రేయము నిమిత్తమును, సర్వుల ప్రకట లేక ప్రచ్ఛన్న హితము నిమిత్తమును (3–24) నిర్వహించును. ప్రకాశమున ఓలలాడుచు, ప్రపంచము నందును, కాలపురుషుని కర్మలయందును నీవు భగవంతుని రూపమును దర్శింతువు, అతని ఉద్దేశ్యమును గ్రహింతువు, అతని ఆదేశమును ఆలకింతువు. నీ ప్రకృతి ఒక ఉపకరణరూపమున, ఇది ఎట్టి దైనను, అతని ఇచ్ఛనే తనది గావించుకొని, ప్రశ్నించక అనుష్ఠించును; ఏలన నీ పైనుంచియు, లోపలి నుంచియు ఎట్లు నీ కర్మల ఆరంభణము వచ్చునో, అట్లే ఆ ప్రతి ఆరంభణముతోను భగవంతుని ప్రజ్ఞకును, దాని మర్మమునకును సంబంధించిన ఒక అనివార్య జ్ఞానమును, ఒక ప్రదీప్త సమ్మతియు నీలోనుండి ఉ ద్భవించును. ఇట్లు యుద్ధమతనిది యగును, విజయ మేతనిది యగును, సామ్రాజ్యమతనిది యగును (11–33).

41. జననమరణములు పీడించని సంసిద్ధి :

"ప్రపంచమునందును, శరీరము నందును ఇది నీ సిద్ధి యగును మఱియు నశ్వర జన్మతోగూడిన ఈ లోకముల కావల, పరమ సనాతన అతిచేతన నీది యగును మఱియు నీవు పరమాత్మ యొక్క పరమోన్నత పదమునందు శాశ్వతముగా నివసించెదవు (18–62). ఈ జీవత్ సిద్ధిని బొందిన నిన్ను పునర్జన్మయు, మృత్యుభయమును వేధించవు (14–2); ఏలన ఇచ్చట దైహిక జీవనమునందే నీవు భగవత్స్వరూపమును ప్రకటించినవాడ వగుదువు, మఱియు నీ అంతరాత్మ, అది మనఃశరీరములలోనికి దిగి యున్నప్పటికి, పరమాత్మయొక్క సువిశాల సనాతనతయందు నివసించుచున్నదియే యగును.

42. నీ యోగమును భగవంతుడే చేపట్టును :

"కావున నిదియే నీ పరమ సాధన యగును : నీ సమస్త ఆత్మ మఱియు ప్రకృతియొక్క ఈ సంపూర్ణ సమర్పణము, నీ సర్వోన్న తాత్మయే యగు భగవంతుని యందు సర్వ ధర్మముల పరిత్యాగము (18–66) మఱియు పరమ ఆధ్యాత్మిక

ప్రకృతిని బొంద నీ సర్వాంగముల ఈ ఆత్యంతికాకాంక్ష. మార్గారంభమునందు గాని, తర్వాత చాల కాలమునకు గాని, ఒకసారి ఈ సమర్పణాది త్రయమును నీవు సాధింతువేని, ఇక బాహ్య ప్రకృతి యందు నీ వేదియై యున్నను, లేక ఉండినను, నీ మార్గము నిశ్చితము, నీ సిద్ధి అనివార్యము. ఏలన అపుడు నీలోని పరమ పురుషుడు నీ యోగమును తానే చేపట్టి, నీ స్వభావానుకూల మార్గముల వెంట దానిని తన పరమ పరిపూర్తిపర్యంతము గొనిపోవును (12-7). అట్టి పరిపూర్తి పిమ్మట నీ జీవనమార్గ మెట్టి దైనను, నీ కర్మప్రకార మెట్టి దైనను, భగవంతునియందే నీవు సచేతనముగా నివసించుచు, కర్మచేయుచు, చరించుచు, నుండెదవు (6-31) మఱియు భగవచ్ఛక్తి ఆంతర మఱియు బాహ్యమగు నీ ప్రతి గతియందును నీద్వారా పనిచేయును (11-33). ఇది ఉత్తమ రహస్యమును, గుహ్యతమమును (18-54) గాన, ఇదియే పరమ యోగము మఱియు అట్లయ్యును, అందరిచేతను అధికాధికముగా సాధించబడగల ఒక ఆంతర సాధనావిధానము (9-32). ఇదియే నీ వాస్తవ, నీ ఆధ్యాత్మిక సత్తయొక్క అత్యంత గంభీర, అత్యంత ఘనిష్ఠ (intimate) సత్యము."

సంపూర్ణము

శ్రీ కృష్ణార్పణ మస్తు

ఓం తత్ సత్



దివ్యజీవన ప్రవర్తకుడు

కర్మ బంధించును, కనుక కర్మసమస్యకు పరిష్కారము కర్మసన్యాసము - అని మాయావాదము నిర్ణయించును ! కాని కర్మలోని దోషమును (గీత : 18-48) గాక, కర్మనే కొట్టివేయు - రోగమును గాక, రోగికే స్వస్తిచెప్పు - ఈ పరిష్కారము నిజముగా ఒక పరిష్కారమేనా ? కాదు. పైగా తమస్సును పెంచి, భారతజాతి యొక్క అధోగతికి కారణమైన సన్యాస మెట్లు సమస్యాపరిష్కార మగును ? అయితే ఇవ్విషయమున గీత యేమి చెప్పును ?

"యోగస్థః కురు కర్మాణి" (గీత : 2-48), అనగా నీవు ఈశ్వరునితో సంయోగమునందుండి కర్మసేయుము, అపుడు నిన్ను కర్మ బంధించదు; ఏలన సర్వాతీతుడగు నీశ్వరునికి క్షరాక్షరములు, కర్మాకర్మలు రెండును రెండు పార్శ్వములు, అనగా నపుడు ఆంతరమున అకర్మను - "నైష్కర్మ్యము" - ననుభవించుచునే, బాహ్యమున కర్మచేయ గలిగెదవు. అంతే కాదు, ఇట్టి దివ్య కర్మ అపరప్రకృతిని సైతము దివ్యీకరించి దానిని దివ్యజీవనమున కర్త్రమగు ఉపకరణము గావించును - అని శ్రీ అరవిందుడు గీతాయోగము నందలి దివ్య మర్మమును వెలికిదీయును. ఇట్లీ మహాయోగి మనకు దివ్యజీవన ప్రవర్తకుడు.

ఈ దివ్యజీవనము నందు త్యాగభోగములు రెండును ఉండును, ఆత్మద్రవ్యముల సామరస్య ముండును. కావున అట్టి జీవనమే భారతాత్మను మహోన్నత శిఖరములకు తిరిగి లేవనెత్తును.

గీతా వ్యాసములు — వెల : రూ. **400/-**